అనుభవ
పశువైద్యచింతామణి

గ్రంథకర్త

"అభినవ సహదేవ"

యేజళ్ల శ్రీరాములు చౌదరి

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2023

ANUBHAVA PASUVAIDYA CHINTHAMANI

By
EJALLA SRIRAMULU CHOWDARY

T.T.D. Religious Publications Series No.1455
© All Rights Reserved

First Edition : 2023

Copies : 100

Published by
Sri A.V. Dharma Reddy, IDES,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507.

D.T.P:
Publications Division,
T.T.D, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

ముందుమాట

ప్రాచీన భారతదేశము వ్యవసాయమునకు, పశుపోషణకు ప్రఖ్యాతి చెందినది. వేదంలోనే పశువులకు, పశుపోషణకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చి గోమాతను దైవంగా భావించి పూజించాలని పేర్కొనబడింది.

'శన్నో అస్తు ద్విపదే శం చతుష్పదే' మానవులు, పశువులు శాంతితో వర్ధిల్లాలని ఋగ్వేదం చెబుతున్నది. 'పశూన్ పాహి గాం మా హింసీః' పశువులను రక్షించు, హింసించకు అని యజుర్వేదం పేర్కొంటున్నది. 'గోష్ఠ ఇహ పోషయిష్ణవి' గోశాల మనకు పోషణ నిచ్చుగాక అని అథర్వవేదం పేర్కొంది. అటువంటి పశుసంపదను పోషించాలంటే పశువైద్యం తప్పనిసరి. సరియైన పోషణ లేకపోతే పశువృద్ధి జరుగదు.

పూర్వకాలం ప్రతి ఇల్లు గోశాలతో కళకళలాడేది. పాడి పశువులకు ప్రాధాన్యత నిచ్చేవారు. రామాయణ, మహాభారతాల కాలంలో గోపూజలు, గోపోషణలు విరివిగా జరిగేవి. మహాభారతంలో విరాటరాజుగారి గోసంపదను ఉత్తరదక్షిణ గోగ్రహణాల ద్వారా రక్షించి అర్జునుడు కౌరవులపై ధర్మజయకేతనాన్ని ఎగురవేశాడు. విజయనగర చక్రవర్తులు కూడా గోరక్షణశాలలు, పశువైద్యశాలలు విరివిగా స్థాపించారు.

కలియుగంలో శ్రీనివాసుడు తొట్టతొలిగా వెంకటాద్రిపై కాలుమోపి వల్మీకంలో సేదతీరుతుండగా బ్రహ్మరుద్రులు గో, గోవత్స రూపంలో వచ్చి స్వామివారికి క్షీర సమర్పణ చేశారు. అది గమనించి గోపాలకుడు గోవుపై దాడిచేయబోగా గోవును రక్షిస్తూ శ్రీనివాసుడు ఆ ప్రహారాన్ని తాను స్వీకరించి గాయపడ్డాడు. ఈ విధంగా శ్రీనివాసుడు గో సంరక్షణ బాధ్యతను తాను స్వయంగా ఆచరించి మన అందరికి ఉద్బోధిస్తున్నాడు.

సనాతన హైందవ సంప్రదాయం ప్రకారం గో సంతతిలో ఒకటైన వృషభాన్ని ధర్మదేవతగా ఆరాధిస్తారు. వృషభజాతికి కూటస్థుడైన నందీశ్వరుడిని పరమశివుని వాహనంగా పూజిస్తారు. తిరుమల శ్రీవారి ఉత్సవాలు, ఊరేగింపులలో ఏనుగులు, గుర్రాలతో పాటు వృషభాలు కూడా పాల్గొనడం ఆనవాయతీ. తిరుమల తిరుపతి దేవస్థానములు గో సంరక్షణలో భాగంగా 'గుడికో గోమాత' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆలయానికి ఒక దేశవాళీ గోవును గో పూజ నిమిత్తం సమర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'గోవిందునికి గో నవనీత సేవ' అనే కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతినిత్యము ఆవు పెరుగును చిలికి నవనీతాన్ని తీసి శ్రీవారికి నివేదన చేస్తున్నది. గత కొంతకాలంగా ఎటువంటి రసాయనాలు లేని, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయానికి రైతులను ప్రోత్సహిస్తూ, తద్వారా ఉత్పత్తి చేసిన ధాన్యం తోనే తి.తి.దేవస్థానములు 'గోవిందునికి గో ఆధారిత ప్రసాద నివేదన'లను సమర్పిస్తున్నది.

పసిపిల్లల నుండి వయోవృద్ధుల వరకు దేశవాళీ గోక్షీరమే బలవర్ధకమైన ఆహారం. అటువంటి పాలను సమృద్ధిగా యివ్వాలంటే పశుసంరక్షణ, పశుపోషణ ఇతోధికంగా జరగాలి. వ్యవసాయాభివృద్ధికి కూడా పశువులే అత్యవసరం. వాటి నుండి వచ్చే ఎరువుద్వారా పంటపొలాలు వృద్ధి చెందుతాయి. అందువలన పశుసంపదను ఆరోగ్యవంతంగా చూసుకోవాలంటే పశువైద్య సహకారమెంతైనా అవసరం.

ఈ ఉద్దేశ్యంతోనే శ్రీ యేజళ్ళ శ్రీరాములు చౌదరిగారు తమ పాతిక సంవత్సరముల అనుభవాన్ని, అమూల్య విజ్ఞానాన్ని జోడించి 'అనుభవ పశువైద్యచింతామణి' అనే గ్రంథాన్ని రచించి పశుసంరక్షణ, పశువైద్యం ఆంధ్రదేశమంతా వ్యాపింపచేయుటలో కృతకృత్యులయ్యారు. ప్రాచీన కాలంలోని పశురక్షణ, పశుశాలల శుభ్రత, వాటి గ్రాసాలు, పశుజాతులు, పరీక్షలు, వాటి రోగలక్షణాలు, మందులను తయారు చేయుట, అంటురోగాలు, జీర్ణరోగాలు, వాత రోగాలు, మంత్రతంత్రాలు, పాడిపరిశ్రమ, శస్త్రవైద్యము, చికిత్సలు గురించి ఈ గ్రంథంలో సమగ్రంగా చర్చించడం జరిగింది. ఈ గ్రంథం రైతులపాలిట భగవద్గీతలాంటిది. దీనిని చదివి తమ పశుసంపదను, వ్యవసాయాభివృద్ధిని చేసుకోవచ్చు. దీనిని సమగ్రంగా చదివి సమస్త ప్రయోజనాలను పొందవచ్చు. ఇది ప్రతి రైతు ఇంట ఉండవలసిన గ్రంథం. యువకులు కూడా ప్రత్యేక శిక్షణను పొంది గ్రామాలలో పశువైద్యచింతామణి ప్రాముఖ్యతను ప్రచారం చేసి గ్రామాభివృద్ధికి తోడ్పడగలరు.

రైతు శ్రేయస్సే తమ శ్రేయస్సుగా భావించి దేశభక్తితో ఈ గ్రంథాన్ని రచించిన శ్రీ యేజళ్ళ శ్రీరాములు చౌదరిగారిని అభినందిస్తూ, ఆ దేవదేవుని అనుగ్రహ పాత్రులు కావాలని ఆశిస్తూ–

సదా శ్రీవారి సేవలో....

శ్రీ కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

పరిచయ వాక్యములు

ప్రాచీనకాలమునుండియు భారతదేశము వ్యవసాయమునకు – పశుపోషణమునకు ప్రపంచ–మందంతటను ప్రఖ్యాతిని గాంచినది. వేదకాలమునుండియు భారతీయులు పశుపాలన– పోషణములందత్యంత శ్రద్ధాభక్తుల బ్రదర్శించి గోవును మాతగను–దైవముగను భావించి–పూజించిరి. భారతీయులు భగవంతుడుగనే భావించి పూజించు శివుడు పశుపతి, కృష్ణుడు గోపాలుడు –

ఆర్యులు శాంతి ప్రియులు, మానవులకేగాక – పశువులకు–సర్వజీవులకు శాంతినే ఆశించిరి.

'శన్నో ద్విపదీ; శం చతుష్పదే' (ఋగ్వేదము) నరులకు–చతుష్పాదులకు శాంతి వర్ధిల్లుగాక!

స్వస్తిమాత్ర ఉతపిత్రే, నేవ, అస్తు స్వస్తి గోభ్యః । జగతే పురుషేభ్యః ॥ (అథర్వవేదము) మానవులకు, గోవులకు స్వస్తి గలుగుగాక!

ప్రతి గృహమునను గోశాలలు శుభ్రముగనుండి వర్ధిల్లుగాక!

మయా గావః గోపతినో స చ ధ్వమయం వో, గోష్ఠ ఇహ పోషయిష్ణుః ॥ (అథర్వవేదము) నాతో గోవులు సంచరించుగాక! గోశాల మనలను పోషించుగాక.

పయఃపశూనాం రసమోషధినామ్ యూయం గావో మేథయధా చంద్రం గృహం కృణుధ ॥ (అథర్వవేదము) పశువుల పాలను, ఓషధుల రసమును గ్రోలవలెను.

పశూన్ పాహి; గాం మా హింసీః ॥ (యజుర్వేదము) పశువుల రక్షింపుము. గోవుల హింసింపకుము. ఇట్లు వేదములు సదా పశుపాలన–పోషణ–రక్షణముల గూర్చి బలుకుచున్నవి.

రామాయణ కాలమున పశుపోషణము పశురక్షణశాలలు విరివిగ గలవు. గోవును పూజించుచుండెడి వారు. భారతకాలమునను గోపూజ పోషణ విరివిగ గలదనుటకు విరాటరాజు గోవులను కౌరవులు ద్రోలికొని పోవుట, తిరిగి వాటిని జయించి తేబడు ఉత్తర–దక్షిణ గోగ్రహణములే ప్రబల నిదర్శనములు.

బుద్ధుని కాలమున అహింస ప్రధానలక్ష్యము. అశోకుడు గోరక్షణశాలలు పశువైద్యశాలలు దేశమున నలుమూలల ప్రబలముగ స్థాపించెను.

నేటికిని–భారతీయులకు గోమాత పూజనీయముగనున్నను దురదృష్టవశమున చిరకాలము పరులకు దాస్యము గావింపవలసిన దుస్థితియందు మంచిపశుజాతుల ప్రబలించుట గాని, వాని పోషణ గాని సన్నగిల్లినది.

ప్రజల దారిద్ర్యఫలితముగ–పశువులకు మంచిమేత–ఆహారము లభింపక అవి దుర్బలములై క్షీణింపసాగెను.

ప్రాచీనకాలము నుండియు భారత ఋషులు–శాస్త్రవేత్తలు–అనుభవజ్ఞులగు వ్యవసాయములు పాలు సమగ్రాహారమనియు, అది దేహమునకు పుష్టిని–ఆరోగ్యమును జేగూర్చుననియు నిర్ణయించి–విరివిగ ఆబాలగోపాలము సదా పాలను గ్రోలుచుండెడివారు. మరియు–గోవులు పాలు నధికముగ నొసగవలెనని–వానికి పుష్టిగల ఆహారపదార్థముల విరివిగ నొసగుటమాత్రమే చాలదనియు – వానినెంత శ్రద్ధాభక్తులతో దయతో జూచిన నంత నెక్కువగ పాలనొసగుననియు నిర్ణయించి – గోవును మాతగా భావించి పూజించుచుండెడివారు. నవీన పాశ్చాత్య నాగరికతావేశపూరితులు యిది మూఢనమ్మకమనియు అంధ–విశ్వాసమనియు భావించి హేళనచేయు సమయమున అమెరికా శాస్త్రవేత్తలు గోవుల నెంతదయతో జూచిన నంత నెక్కువపాల నొసగునని శాస్త్రసమ్మతముగ – అనుభవ పూరితముగ నిర్ణయించి – ప్రకటించి – అట్టివారల నోరులు గట్టిగ మూయించిరి.

కాబట్టి పశుపోషణము – మన నిత్యజీవితావసరమగు ఆహారమునకు పాలు, పెరుగు, వెన్న మున్నగువానిని విపులముగ నొసగుటయేగాక – సేద్యమునకు – విపులపంటల బండించుటకు చక్కని వలయు ఎరువుల నొసగుచున్నవి.

ప్రస్తుతము భారతి – ఆహారకొరతచే ఆకటి బాధతో నలమటించుచున్నది. సర్వదేశములను భిక్షమెత్తు–చున్నది. కోట్లకొలది ధనమును వ్యయపఱచి – పుచ్చిపోయినవో – పనికిమాలినవో ఆహారపదార్థముల క్రయ మొనర్చుచున్నది.

ఇట్టి సమయమున 'ఆహారపదార్థములను విరివిగ బండించు'డను కేకల సముదాయము వినుచున్నాము. కాని మనకు విపులాహారమున కాలవాలములగు – ఆహారపదార్థముల నెక్కువగ బండించుటకు ప్రధానములగు నెఱువుల నొనగూర్చునవగు పశువుల పోషణయందు మనము సర్వవిధముల శ్రద్ధాభక్తులతో–ఉత్సాహమును ప్రబలించుటత్యవసరముగాదా!

ఇట్టి ఉన్నతలక్ష్యమును సదా లక్ష్యమునందిడుకొని – ఉత్కృష్ట దేశభక్తితో – పవిత్ర దయార్ద్ర హృదయముతో భారతీయుల ఆహారకొరతను దీర్చుటకోయన – ఆర్థిక సంపత్తిని ప్రబలించుటకోయన – శ్రీ యేజళ్ళ శ్రీరాములుచౌదరిగారు సుమారు గత పాతిక వత్సరముల నుండియు తమ అమూల్య విజ్ఞానమును–శాస్త్రసమ్మత విద్యార్జనమును అనుభవముతో జోడించి – పశురక్షణమున – పశువైద్యమున –

ఆంధ్రదేశము నందంతటను కృషిని గావించి చాలవరకు సఫలులైరని నుడువుటలో నతిశయోక్తి లేదు. యువకులను – ముఖ్యముగ వ్యవసాయ కుటుంబములకు జెందిన యువకులను నొకచో జేర్చి – మంచి – బలిష్ఠములను ఉత్తమజాతి పశుసంతతుల ప్రబలించుటకు వానికి వలయు పోషణ విధానముల – చికిత్సల – సరళముగ – సులభముగ వీరికి శిక్షణము నొసగి – మారుమూల లందలి కుగ్రామములందునను పశువైద్యవ్యాప్తిని – పశుపాలన విశిష్టతను ప్రబలించుటకు నిరంతరకృషిని గావించిరి. తత్ఫలితముగ ఆంధ్రదేశమున – ఆయుర్వేదపశుచికిత్సాలయములు – పశుసంరక్షణములు ప్రబలవ్యాప్తములై ప్రజాదరణమును బడిసినవి.

సరళవిధానమున – ప్రతివారికి సులభగ్రాహ్యములగు తమ శాస్త్రసమ్మతానుభవములను వారిచే రచియింపబడిన 'అనుభవ పశువైద్యచింతామణి' యందు గాంతుము.

ఇట్టి ఉత్కృష్టగ్రంథమును వ్యవసాయకులకు అత్యవసరమగు సద్గ్రంథమును, గ్రామప్రజలు – యింటింట నిడికొని – తమ పశువులకు రోగ నిరోధ – విధానముల – చికిత్సలు గావించుకొను సదవకాశమును గలిగించుకొందురని ఆశించుచున్నాను. శ్రీ శ్రీరాములుగారి నిరంతర పరిశోధనా పరిశీలనల కృషిఫలితము ఆంధ్రావని అభిమానమును – ఆదరణమును సదా బడయుగాక! వీరు గావించుచున్న రైతులోక కృషి – సేవ సదా మన హృదయములందు వికసించి – తాండవమాడుగాక!

తెనాలి,
7-8-52.

కల్లూరి చంద్రమౌళి

విజ్ఞప్తి



గ్రంథకర్త
అభినవ సహదేవ

ఈ పశువైద్య చింతామణి చేస్తున్న సేవ, ఆంధ్రదేశంలోని ప్రతిరైతుకీ తెలిసేవుంది. దీని ఉపయోగాన్ని గురించి వేరే నేను చెప్పడం అనవసరం. రైతుచరిత్రలో ప్రత్యేక నూతనాధ్యాయాన్ని తెరిచి, పశుసంజీవినిగా ప్రసిద్ధికెక్కిన యీ గ్రంథాన్ని మరింత అభివృద్ధి పరిచి, తిరిగి ప్రచురించాను.

బాపట్ల వ్యవసాయ కళాశాలవారూ, మద్రాసు పశువైద్యకళాశాలవారూ ఆంధ్ర, మద్రాస్ యూనివర్సిటీలవారు, పంచాయతీ బోర్డులు, కో-ఆపరేటివ్ సొసైటీలు, పంచాయతీ గ్రంథాలయాలు మొదలైన ప్రముఖ సంస్థలు, అనేకమంది భూస్వాములు ఈ ''చింతామణి''ని దెప్పించుకొని, ఈ ఇరవై అయిదు సంవత్సరాలనుంచీ పశుసేవ చేస్తున్నారు. ఏ యింట గోమాలక్ష్మి వుంటుందో, ఆ యింట యీ "చింతామణి" ఉండి తీరాలి. గ్రామాభ్యుదయ డిపార్టుమెంటుకి సంబంధించిన గ్రామసేవకులకోసం, మద్రాస్ మాజీప్రధాని రామస్వామి రెడ్డియారుగారు కొన్నివందల గ్రంథాలు తీసికొన్నారు. దీనినిబట్టి పశుసేవకి ఈ గ్రంథం ఎట్లా ఉపయోగిస్తుందో ప్రభుత్వమే గుర్తించిందని తెలియడంలేదూ. త్వరలో దీనిని ఆంగ్లభాషలో వెలువరిస్తున్నాను.

ఈ "చింతామణి"లోని విషయాలను చదివి అనుభవాన్ని గడించిన మీదట మా ఆంధ్ర జాతీయ పశువైద్య కళాశాల ప్రాథమిక పశువైద్య ట్రైనింగులో అనేక మంది రైతులు పాల్గొని - ప్రాక్టికల్‌గాను థియరిటికల్ గాను పశువిజ్ఞానాన్ని సంపాదించుకుంటున్నారు.

ఇప్పుడు ప్రచురించిన ఈ చింతామణి, అందరికీ సులభముగా అర్థమయే భాషలో ప్రకటించబడింది. అధునాతన పద్ధతులతో - ప్రకృతి జంతు ఆంగ్లేయ హోమియో చిట్కా మంత్ర తంత్ర విద్యుచ్ఛక్తి చికిత్సలు, మొదలైనవెన్నో నూతన విషయాలతో ప్రకటింపబడింది.

మా యీ ఉద్యమమును ప్రోత్సహించి చేయూతనిచ్చిన మద్రాసు ప్రభుత్వ మాజీస్థానిక స్వపరిపాలన శాఖామాత్యులు గౌరవనీయ శ్రీ కల్లూరి చంద్రమౌళిగారికి మా కృతజ్ఞతాపూర్వక వందనాలు.

ఈ పుస్తకమును శ్రద్ధతో సకాలమునకు నాకు ముద్రించి యిచ్చిన ఆంధ్రరత్న ప్రెస్ ప్రొప్రయిటరు శ్రీ గ్రంధి లక్ష్మయ్య గుప్తగారు ఎంతో అభినందనీయులు.

ఈ గ్రంథానికి కావలసిన విషయాలు తీసికొన్న గ్రంథకర్తలకు పత్రికాధిపతులకు, విజ్ఞులకు మా కృతజ్ఞతాభివందనములు.

ఇట్లు
గ్రంథకర్త
10-8-52

విషయసూచిక

మొదటి భాగము **1-11**

ప్రాచీన పశు సంరక్షణ

వేదవాక్యాలు

అశోక చక్రవర్తి పశుసంరక్షణ

కృష్ణదేవరాయల పశుసంరక్షణ

సిక్కుల పశుసంరక్షణ

పశువులను బాధపెట్టుట

పూర్వీకుల పశుధర్మసూత్రాలు

పశువధలు - చర్మాల ఎగుమతులు

రెండవ భాగము **12-19**

గోవే గృహలక్ష్మి

వెన్న, నెయ్యి ఉత్పత్తులు

వ్యవసాయానికి ట్రాక్టర్లు

నీళ్ళుతోడే సాధనాలు

పశు సంఖ్య

పశువుల వలన వచ్చు ఆదాయాలు

మూడవ భాగము **20-24**

గోసంరక్షణ సంఘాలు

పశుశాలలు - వాటి శుభ్రత

కాలములను బట్టి ఆహారాలు

నాల్గవ భాగము **25-40**

పశుగ్రాసము

రోజువారి మేపులు

కూరలు - కాడ జాతులు

ద్వాదశ లవణాలు

కాల్షియం, సల్ఫర్

అయోడిన్ - మాంగనీస్

ఐరన్ - క్లోరిన్

సిలికన్ - భాస్వరం

తామ్రము - ఫ్లోరిన్

సోడియం - పొటాషియం

విటమినులు-ప్రాణాణువులు

అరణ్యాలు

వీటి మేత వివరాలు

అధికాహారోత్పత్తి - ఎరువులు

అయిదవ భాగము **41-63**

(పశు జాతులు)

అమృతమహల్ జాతి

మైసూరు జాతి

దద్ధోదనా జాతి

ఒంగోలు జాతి

కపిలియన్ జాతి

తంజావూరు జాతి

కంగాయం జాతి

మధుర జాతి

గుంసూరు జాతి

బ్రాహ్మణ జాతి
సింధు జాతి
నాగపూరు జాతి
పంజాబు జాతి
తార్‌పార్కర్ జాతి
గిరి జాతి
భగ్నారి జాతి
హళ్ళీకర్ జాతి
బర్గూర్ జాతి
ద్యోనీ జాతి
ధన్నీ జాతి
ఆలంబాడి జాతి
కిల్లారి జాతి
కృష్ణావేలి జాతి
హరియానా జాతి
షహివాల్ జాతి
విదేశాల జాతులు
గేదెలు – దున్నలు
ఆరవ భాగము **64-77**
(పశు పరీక్ష)
పశువుల వయస్సు కనుగొనుట
మంచి వృషభ లక్షణాలు
మంచి గోవు లక్షణాలు
మంచి గేదె, దున్న లక్షణాలు
మంచి గోవు లక్షణాలు
ముహూర్తచక్రాలు
ఆక్షేపణ లక్షణాలు
కొమ్ముల శుభాశుభ లక్షణాలు
రంగుల శుభాశుభ లక్షణాలు
సుళ్ళ పరీక్ష
శుభమును కలిగించేవి
అశుభమును కలిగించేవి
ఏడవ భాగము **78-111**
(ద్రవ్య జ్ఞానము)
మందు మొక్కల గుణాలు
పెద్ద వృక్షాల ఫలితాలు
అన్నిరకముల ఆయుర్వేద ఓషధులు
వర్ణనలు – మోతాదులు
ఎనిమిదవ భాగము **112-121**
ఆంగ్లేయ పశువైద్య గుణాలు
అన్ని రకాల మందులు – మోతాదులు
తొమ్మిదవ భాగము **122-139**
(పశు శారీరక శాస్త్రము)
పశు దేహ నిర్మాణము
లోపల వెలుపల నుండు అవయవాల వర్ణన
కండర మండలము
రక్తప్రసరణ మండలము
శ్వాస మండలము
జీర్ణ మండలము
జీర్ణ రసాలు

పదియవ భాగము **140-148**

పశురోగ విజ్ఞానము

పురాతన భారతీయ పశువిజ్ఞానము

ప్రాచీన రోగ విజ్ఞాన సూత్రాలు

రోగ నిదానాలు

ఆరోగ్య అనారోగ్య లక్షణాలు

ఉష్ణ పరీక్ష

ముఖ, నేత్ర, నాలుక, మల, మూత్ర పరీక్షలు

పదునొకండవ భాగము **149-156**

(భేజష కల్పము)

ఔషధాలు త్రాగించే విధానాలు

వయస్సును బట్టి మోతాదులు

ఔషధాలను కలిపే విధానాలు

ఔషధాలను చేయుట

కొలతలు – మానాలు

వేడికాపులు – నస్యాలు

పాలు – అంజనాలు

చూర్ణాలు – మాత్రలు

పండ్రెండవ భాగము **157-160**

పశువులను పడగొట్టే సూత్రాలు

పదమూడవ భాగము **161-163**

ఎనీమా చేసే పద్ధతులు

పదునాల్గవ భాగము **164-167**

రాక్షస వైద్యము

పదునైదవ భాగము **168-169**

సూచీ విధానము

పదునారవ భాగము **170-207**

అంటురోగాలు

వాత, పిత్త, కఫాల వర్ణన

ఆకుపచ్చరంగులేకపోతే అన్నీ సున్నే?

అంటురోగాల వ్యాపకము

సూక్ష్మజీవులు

పెద్ద రోగము

దొమ్మలు

గాలికుంటు

గురక

జెబ్బవాపులు

కురమ

మశూచి

పదునేడవ భాగము **208-222**

(జీర్ణరోగాలు)

అజీర్తి – కడుపు నొప్పి

కడుపుబ్బు – మలబద్ధకము

విరేచనాలు – రక్త విరేచనాలు

పాండురోగం – గుండెనంజు

గర్భశూల – రక్తశూల

మలమూత్ర బంధరోగము

జలగల రోగము

రొమ్ముపట్టు

పదునెనిమిదవ భాగము **223-232**
(వాత రోగాలు)
శుద్ధ వాతము
ఎండు వాతము
శిరో వాతము
గర్భ వాతము
నక్క వాతము
ధనుర్వాతము
పందొమ్మిదవ భాగము **233-246**
(నేత్ర చికిత్స)
జంతుజాలం – వింత నేత్రాలు
కంటి భాగాల వర్ణన
కంటి రోగాలు – చికిత్సలు
ఇరువదియవ భాగము **247-257**
(శ్వాస, కాస రోగాలు)
క్షయ – న్యూమోనియా
ఊర్ధ్వశ్వాస రోగము
దగ్గు – రొంప
ఉబ్బసము – కసిమిరి
ముకుబంతి – ముక్కుపీనస
ఇరువది ఒకటవ భాగము **258-266**
(శిరో రోగాలు)
పిచ్చి – మూర్ఛ
చనుకుదురు
కొమ్ముడొల్లలు
ఎండదెబ్బ – నాలుక పూత
కుందేటి వెఱ్ఱి
నాలుక నేర్లు
అర్లు పెరుగుట
ఇరువది రెండవ భాగము **267-273**
(మూత్రరోగాలు)
మూత్రలక్షణాలు
రక్తమూత్రము
శిలామేహ వాతము
అతిమూత్రము
వీర్యనష్టము
నీరు చురుకు
ఇరువది మూడవ భాగము **274-291**
(విష తంత్రము)
త్రాచుపాముల వర్ణన
శత్రువులు చేయు ప్రయోగాలు
ఉంగిడి – చికిత్స
విషజంతువు – కరచుట
పాముకాటు – చికిత్సలు
ఇరువది నాల్గవ భాగము **292-300**
(మంత్ర తంత్రాలు)
పశువులకు మళయాళ మంత్రాలు
సింహళదేశ మంత్రాలు
ఆఫ్రికా దేశపు మంత్రాలు
డక్కన్‌లో మంత్రాలు
దక్షిణ ఇండియా మంత్రాలు

అరణ్యాలలోనుండు ఆటవికుల చిట్కాలు
దయ్యాల చేతబడులు
దొమ్మకు మంత్రం
ఆవిరికి మంత్రం
రకరకాల రోగాలకు మంత్రాలు
ఇరువది ఐదవ భాగము 301-329
(ప్రసవ తంత్రము)
పశుగర్భ నిర్మాణము – వర్ణన
ప్రసవకాల పట్టిక
పిండోత్పత్తి దశలు
చూడిలో వచ్చు రోగాలు
పిండము అడ్డము తిరుగుట
కవల దూడలు
రెండు తలల దూడ
మావి–మేయికి చికిత్సలు
ఈనిన తరువాత వచ్చే రోగాలు
చికిత్సలు
ఇరువది ఆఱవ భాగము 330-347
(వత్సభృత్యము)
దూడల పోషణ
దూడల ఆహార పానీయాలు
దూడలకు పాలుకుడిపే పద్ధతులు
దూడల రోగాలు – చికిత్సలు
ఇరువది ఏడవ భాగము 348-396
పాడి పరిశ్రమ
విదేశాలలో పాడి పరిశ్రమ
విదేశ పాడి పశువుల వర్ణన
బ్రిటీష్ పశుసంపద
బ్రిటీష్ పాల పరిశ్రమ
అమెరికా పాల పరిశ్రమ
పూకా పద్ధతి
పాడిపశువులను పరీక్షించే సూత్రాలు
పాడిపశువుల మేతలు – దాణాలు
పొదుగు వర్ణన
క్షీరనాళాల వర్ణన
పాల గుణాల వర్ణనలు
పాడి పశువుల రోగాలు – చికిత్సలు
ఇరువది ఎనిమిదవ భాగము 397-408
(శస్త్ర వైద్యము)
గాయాలలో రకాలు
గాయాల వర్ణన – చికిత్స
కట్లుకట్టుట – కుట్టుట
ఇరువది తొమ్మిదవ భాగము 409-415
ఎముకలు విరుగుట – తొలగుట
కట్లు – చికిత్సలు
ముప్పదవ భాగము 416-423
ఎముకలు గూళ్ళనుండి జారుట
జెబ్బ జారుట
కాలు రెల్లపోవుట
బెణుకులు
ఎలెక్ట్రిక్‌తో నొప్పులు పోగొట్టుట
మోర్లు దిగుట

ముప్పది ఒకటవ భాగము **424-431**
కుంటుట, బెణుకుట
ముప్పది రెండవ భాగము **432-438**
అన్ని రకముల మాదలు – చికిత్సలు
ముప్పది మూడవ భాగము **439-442**
అన్ని రకముల వాపులు – చికిత్సలు
ముప్పది నాల్గవ భాగము **443-445**
బుడ్డకొట్టుట
బుడ్డనొక్కుట
ముప్పది అయిదవ భాగము **446-451**
గొంతురోగాలు – చికిత్సలు
నాలుక రోగాలు – చికిత్సలు
చెవి రోగాలు – చికిత్సలు
దంత రోగాలు – చికిత్సలు
ముప్పది ఆఱవ భాగము **452-458**
చర్మరోగాలు – చికిత్సలు
ముప్పది ఏడవ భాగము **459-467**
ప్రకృతి జంతు చికిత్స
సూర్యకిరణాల చికిత్స
జంతువుల ఉపవాసాలు
బలము కలిగించే అపక్వాహారాలు
ఒంట్రుమట్టితో పశు చికిత్సలు
ముప్పది ఎనిమిదవ భాగము **468-475**
అన్ని రకముల రోగాలకు ఆంగ్లేయ చికిత్సలు
ముప్పది తొమ్మిదవ భాగము **476-485**
హోమియో పశు చికిత్స
హోమియో ముఖ్య విషయాలు
మందుల వాడుక
ఎక్కువ తక్కువ పొటెన్సీలు
అన్ని రకాల పశు రోగాలకు
నలుబదవ భాగము **486-508**
చిట్కా చికిత్సలు

పరిచయం

రైతు-పశువైద్యశాస్త్రము

రైతు గుమ్మంలోకి పశుశాస్త్రజ్ఞానాన్ని అందించాలి:

మనదేశంలోవున్న రైతులకు పశుశాస్త్రజ్ఞానాన్ని గురించి ఇంతవరకు తెలియదు. మా అనుభవ పశువైద్య చింతామణి అన్ని గ్రామాలకు అందించిన తరువాతనే పశుపోషణం, పశుచికిత్స కొంతవరకు అర్థమైంది. ఈ పశువిజ్ఞానవ్యాప్తికి 'గోసేవ' పత్రిక గావిస్తున్న సేవను గురించి రైతుల ద్వారా చాలా ఉపయోగకరముగా వుందని తెలియజేయుచున్నందుకు కొంత సంతుష్టిగాయుంది. ఏయే ప్రభుత్వశాఖల్లో ఏయే ఉద్యోగస్థులు ఏయే పనులు చూస్తుంటారో, ఏ విషయాలను గూర్చి ఎవర్ని సలహాకోసం అడగాలో కూడా రైతులలో కొందరకు తెలియదంటే ఆశ్చర్యములేదు. అది వారి లోటు కాదు. వారి దృక్పథం తమ నిత్యగృహకృషి గ్రామసమస్యలను దాటి పైకివెళ్ళడంలేదంటే విద్యలోపంవల్లనే అనవలసియుంది. కాని మన రైతులకు వారికృషిలో వంశపారంపర్యము సంక్రమిస్తున్న గొప్ప అనుభవజ్ఞానం ఉంది. అయితే యీరోజుల్లో అదొక్కటే చాలదు. పశుశాస్త్రజ్ఞానాన్నీ, అనుభవజ్ఞానాన్నీ సమన్వయంచేసి ముందుకు సాగాలి. అదిగాక ప్రక్కజిల్లాల్లోను, రాష్ట్రాలలోను, దేశాలలోను జరిగే చర్యలు, మన యింట్లో మనం కూర్చున్నా, మన పొలంలో మనం పనిచేస్తున్నా మన పశువులకు మనం వైద్యంచేసుకున్నా అవి మనన్ని తాకుతూనే వుంటాయి. ఇది మనం రోజూ ప్రత్యక్షంగా అనుభవిస్తూనేయున్నాము.

ఎక్కడో జరిగే యుద్ధాలు, ఎక్కడో వచ్చిన గాలివానలు, ఎక్కడోజరిగిన వ్యవసాయసరుకులు, పశువుల అమ్మకాలు, పశువుల రోగాలు మనల్ని చుట్టుముట్టుతున్నాయి. అందుచేత మనరైతులు కొంత శ్రద్ధతీసుకొని ఒకగ్రామ పశువైద్యసంఘముగా చేరి పశువైద్యగ్రంథాలు, మందులు, గోసేవవంటి పత్రికలు వగైరా తెప్పించుకొని చూడడం, వినడం, విన్నవి చర్చించుకొని తమతోబాటు తమ గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ఉపకరించే విషయాలు, కార్యకలాపాలు నిర్ణయించి సాగించడం, తమ పిల్లలైనా తగినంత విద్యావంతులయ్యేటట్టు శ్రద్ధవహించి బడులకు పంపడం, దానితోబాటు తమ వృత్తులను గూడా వారికి నేర్పించడం మున్నగు విషయాలెన్నో గమనించవలసినవియున్నవి.

గ్రామాలకు మరలి పశువైద్యం చేయండి:

విధానాలు:

మనభారతదేశము గ్రామాల మయమని ప్రసిద్ధి, నేడు నగరాల సౌభాగ్యముకొరకవి నాశనము లగుచున్నవి. మన దేశానికి రాజకీయంగా స్వాతంత్ర్యము వచ్చింది కాని భావదాస్యము పోలేదు. మన

నాయకులకు నిజమైన దేశాభిమానము ఇంకా కుదరలేదు. వారి దృష్టి యింకను విదేశీ పశువుల మందులమీదనే ప్రసరించుతున్నది. గ్రామమునకొక నాటుపశువైద్యుడు వంతున యిప్పటికిని ప్రతి గ్రామములో నున్నారు. ఇంకను మా పశువైద్యగ్రంథమాల 'అనుభవ పశువైద్య చింతామణి,' 'సహదేవఫార్మసీ వారి' పశువుల మందులు, 'గోసేవ పత్రిక', మా ఆంధ్రజాతీయ పశువైద్యకళాశాలలోతర్ఫీదైన పశువైద్యుల ద్వారా నేటికి గ్రామానికి ఇద్దరు ముగ్గురు పశువులకు సేవ చేసేవారున్నారనుటకు సందియము లేదు. కాని గవర్నమెంటువారి ఆదరణలేకపోయినప్పటికి మాప్రజల సహకారముతో మా సంస్థలు నడుస్తున్నవి.

గవర్నమెంటువారి ఇంగ్లీషుపశువైద్యం వేరు, ఆయుర్వేద పశువైద్యము వేరు అనేమాట మనదేశంలో పుట్టింది గాని మరొకదేశంలో ఎచ్చటా లేదు. పశువులకు రోగాలను రాకుండాజేసి, వచ్చినరోగాలను కుదిర్చే శాస్త్రము ఏదో అదే వైద్యశాస్త్రము. అదే ఆయుర్వేదము. రోగపశువులకు ఏ వైద్యుడైతే బాధలు నివారిస్తాడో ఆ వైద్యుడే శ్రేష్ఠుడు. వ్యవసాయములో ఇంగ్లీషువ్యవసాయము, తెలుగువ్యవసాయము అని రెండు వ్యవసాయాలున్నాయా? వ్యవసాయపద్ధతులలో కీళ్ళు, మేళ్ళు ఉండవచ్చు. మనదేశంలోకూడా పంట బాగాపండుతుందని క్రొత్తక్రొత్త ఎరువులను వేసేవారిని చూస్తున్నాము. ఎక్కడ ప్రయోజనముందో అచ్చటికే రైతులు ఆకర్షింపబడతారు. మెట్టనీరంతా పల్లానికి చేరేటట్టు, ఆయుర్వేదపశువైద్యముచేత కుదరని పశువులకు కొందరు రైతులు ఆంగ్లేయపశువైద్యమును చేయించుతారు. గొప్పగొప్ప ఆంగ్లేయ పశువైద్యులు కూడా వారి పశువులకో, తదితరపశువులకో జబ్బుచేసినపుడు ఆయుర్వేద పశువైద్య ప్రముఖుల దగ్గరకు సలహా కొరకు వస్తారు. మీకు తెలుసో తెలియదో. ఆయుర్వేదపశువైద్యులుకూడా ఇంగ్లీషుపశువైద్యులను సలహాలడుగుతారు. మోటారు ట్రాక్టర్లతో దున్ని గుట్టలు, తుప్పలు తెగగొట్టి నేల బాగుచేసినట్లు, శస్త్రవైద్యులు కొత్త కొత్త ఆయుధాలతో చాలా నిపుణతతో పనిచేస్తారు. అంతమాత్రాన వైద్యశాస్త్రాలు రెండున్నాయి అన్నమాట సత్యముకాదు. ఏది ఆరోగ్యమును, ఆయువును వృద్ధిచేస్తుందో అదంతా ఆయుర్వేదమే.

ఈమధ్య ఇండియాగవర్నమెంటువారు మనదేశమందలి వైద్యసమస్యను గూర్చి సలహాయిచ్చు నిమిత్తమై 'చోప్రాకమిటీ' అను కమిటీని నిర్ణయించారు. ఆ కమిటీవారు రెండు సంవత్సరముల పాటు దేశసంచారము చేసి మనదేశమందలి వైద్యపు పరిస్థితులను కనిపెట్టి ఆయుర్వేదము మిక్కిలి శాస్త్రీయమైన పద్ధతియనియు, ఆంగ్లేయవైద్యులు ఆయుర్వేద వైద్యమునుండి తెలిసికొనవలసిన విషయాలు చాలా కలవనియు, ఆయుర్వేదవైద్యులుకూడ ఆంగ్లేయవైద్యమునుండి తెలిసికొనవలసిన, నవీన పద్ధతులు చాలా కలవనియు, ప్రపంచమునందు వైద్యశాస్త్రముయొక్క అభివృద్ధినిమిత్తమై రెండుశాస్త్రాల సమన్వయము అనవసరమనియు చెప్పుచూ కొన్నిముఖ్యవిషయాలను గవర్నమెంటువారికి సిఫార్సుచేశారు. ఇంకను ఆయుర్వేద పశువైద్య ఓషధులను, శాస్త్రాలను పరిశోధించుటకు గవర్నమెంటువారు ఉద్యోగులను నియమించారు. కొంతమంది

ఆరితేరిన గవర్నమెంటు పశువైద్య ఉద్యోగులుకూడా ఇంగ్లీషువైద్యమునకంటె ఆయుర్వేదములోనే మంచి విషయాలున్నాయి కాబట్టి అందరు అనుభవంలోపెట్టాలని సలహాలిస్తున్నారు. పైనచెప్పబడిన చోప్రాకమిటీవారి సూత్రాలను అమలులోపెట్టితే ఆయుర్వేద పశువైద్యాన్నికూడా అమలులో పెట్టగలరని నా నమ్మిక. సేవావిధానాలలో పాతపద్ధతులతోపాటు నవీనపద్ధతులు కల్పించుట మనపని. కేవలము మందుల మీద ఆధారపడిన ప్రయోజనములేదు. పశువులకు రోగాలు రాకుండానే చూడాలి. మన మద్రాసు గవర్నమెంటు వారు పశువైద్యానికి సంవత్సరానికి ఏబది లక్షలు ఖర్చు పెట్టుతున్నప్పటికీ గ్రామాలలోవుండే ప్రజలకెంత మాత్రము ఉపయోగపడుటలేదు. కనీసము ప్రతి ఫిర్కాకొక పశువైద్యశాలైన కావాలి. దీనికంతా ఆర్థికంగా మనము గవర్నమెంటుపై ఆధారపడిన ప్రయోజనం లేదు. అందుచేతనే మేము తెనాలిలో పశువైద్య తరగతులనేర్పాటుచేసి ప్రతిసంవత్సరము కనీసము వందమందికైన తర్ఫీదుయిచ్చి ప్రాథమిక పశుచికిత్సకొరకు గ్రామాలకు పంపదలచి గతసంవత్సరమునుంచి వైద్యులను కొంతమందిని తయారుచేసి పంపినాము. ఎప్పుడో గవర్నమెంటు తగిన సహాయంచేస్తుందని కనిపెట్టుకొని కూర్చొనక మా పని మేము చేస్తున్నాము. మా ఫార్మసీమందులను గ్రంథాలను గవర్నమెంటు రికగ్నయిజు చేసింది.

ఆయుర్వేద పశువైద్యము మన అమూల్యసంపద. అన్ని మెరుగులుపెట్టి ప్రపంచమంతటా ప్రకాశించునట్లు చేయుట మన ధర్మము. కాని ఆయుర్వేద పశువైద్యులు, వైద్యవిషయాలు తెలిసిన రైతులు అనవసరంగా విదేశమందులకు పరుగులెడతారు. ప్రతి గ్రామములోను పశువైద్యశాలను పెట్టాలంటే గవర్నమెంటు తగిన ప్రోత్సాహమీయలేదు. గ్రామస్థులే ఈపనికి పూనుకొని గాంధీగారి సిద్ధాంతరీతిగా ధాన్యమో డబ్బో యిచ్చి పోషించుట మంచిది. ప్రతిగ్రామములోనుండే రైతులు బస్తీలలోనుండే పశువైద్యశాలలకు తమ పశువులకు యింజెక్షన్ యిస్తే తగ్గుతుందని తోలుకొచ్చేవారచ్చటచ్చట వున్నారు. అసలే మందులు అక్కరలేకుండా వైద్యముచేసే పద్ధతులున్నాయి. కొండ తలక్రింద పెట్టుకొని, రాళ్ళకు వెదుకుతున్నట్లు ఎచ్చట రోగముందో అచ్చట మందుకూడ యున్నదని నమ్మండి. వంటాముదము, తెగడ, రేలగుజ్జు, కరక్కాయ మున్నగునవి విరేచనాలకు మంచిమందులే. అడ్డసరపాకు దగ్గులకు, కసిమిరికి వావిలాకు, దుష్టపాకు వాతానికి, శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు అన్నిరోగాలకు పనికివస్తుంటే విదేశమందులు దేనికి? కాబట్టి ప్రతిరైతు మన గ్రామాలలో, మనదొడ్లలో, మనఅరణ్యాలలో, కొండలలో వుండే మూలికలనే వాడి మన వైద్యాన్ని అమలులోకి తేవాలని నా మనవి.

అప్పటి ఇప్పటి వైద్యపద్ధతుల్లో మార్పులు

మనకట్టులో, మనబొట్టులో, మనజుట్టులో, మనభాషలో, మన నమ్మకాలలో, మననాగరికతలో అప్పటి సాంఘిక, వైజ్ఞానిక వాతావరణం ఎలా ప్రతిఫలిస్తుందో, మన పశువైద్యవిధానంలోకూడా అదే

పరిమితితోకూడిన శాస్త్రజ్ఞానం ప్రతిఫలిస్తుంది. ఒక రోగనిదానం చూడండి. అంటే ఒకరోగాన్ని కనిపెట్టే విధానం, వారి భౌతికదృష్టికి కనిపించినంతవరకు, అనుభవజ్ఞానంమీద సంపాదించిన దూరదృష్టికి లేక అంతరదృష్టికి కనిపించినంతవరకు చాలా ముందడుగువేశారు. రోగలక్షణాలు ఎన్నో వర్ణించారు. కఫ పిత్త వాతాలను భాగించి ఈ మూడిటి మీద రోగలక్షణాలను నిర్ణయించారు. కఫం అంటే శ్లేష్మం, శ్వాసకోశంద్వారా వచ్చేది, అంటే ముక్కుదగ్గరనుండి ఊపిరితిత్తులవరకున్న భాగమన్నమాట. పిత్తమంటే "బైల్" అంటే లివరుప్రాంతానికి సంబంధించినంతవరకు దీనిసంబంధముంటుంది. వాతమంటే కడుపు, పేగులు మొదలైన అవయవములకు సంబంధించినంతవరకు యుంటుంది. ఈరీతిగా త్రిదోషములమీద రోగనిర్ణయం చేశారు. కఫం తెగగొట్టటానికి ఆయుర్వేదములో మంచి మందులున్నాయి. నల్లేరు మున్నగు వాటిని అప్పుడే ఆధునిక వైద్యులంతా ఉపయోగిస్తున్నారు. మనం వెల్లుల్లి బాగా వాడతాం, దగ్గుగావున్న వెల్లుల్లిని మందులలోకలిపి పశువులకు వాడతాం. ఈరీతిగా శాస్త్రీయంగా పరిశ్రమచేయడానికి చాలా అవకాశంవుంది. కాని మాకు తగినంత ప్రోత్సాహంలేక ఆపవలసివచ్చింది.

ఈ పరిస్థితులలో పాతమందులు కావా? కొత్తమందులు కావా? పాతవిధానం మంచిదా? కొత్తవిధానం మంచిదా? అంటే పాతపద్ధతి చెడ్డది కాదు. ఆ కాలంలో నాగరికతకు మధ్య, శాస్త్రజ్ఞానం మధ్యవారు తమ బుద్ధికుశలతతో, అనుభవజ్ఞానంతో రోగాలను గుర్తించేవారు. అంటురోగాలుగాని, ఏయితర తెలియని రోగాలుగాని అర్థంకానప్పుడు పశువైద్యులు రక్తపరీక్షచేసి తేలుస్తారు. ఈరీతిగా అనేకరోగములకు కారణాలను అనుభవంవల్లనే కాకుండా, పరిశోధనవల్ల ఎన్నో కొత్తసంగతులు తెలిసికొంటాము.

ఇప్పుడువచ్చిన విటమిన్లు, టాబిలేట్సు, ఇంజక్షన్సు వగైరాలన్నీ అనేక జంతువులకు అనేకరకములైన ఆహారాలను తినిపించి వాటిఫలితముగా ఆ జంతువులలో వచ్చేమార్పులను గుర్తించి యీ పదార్థాలు మన పశువులకు చాలాముఖ్యమని నిర్ధారణచేశారు. శాస్త్రజ్ఞులు శరీరాన్ని ఆపాదమస్తకంకోసి మామూలుదేహం ఎలావుండేది, రోగాలలో ఎలావుండేది, ఏ ఒక రోగంవల్ల చనిపోయినదాని ప్రతిఒక్కఅవయవము ఎలావుండేది, స్థూలదృష్టికి, సూక్ష్మదృష్టికి రెంటికి కనిపించినంతవరకు మార్పులను వివరించారు. ఏఒక్కమార్పు ఏవిధముగా రోగపశువు సజీవియైవుండగా కనిపెట్టవలసినది పరీక్షలుచేసి చికిత్సచేయు పశువైద్యులు విపులముగా వర్ణించారు.

పూర్వపు శస్త్రపరిశోధన

శస్త్రచికిత్సకు పూర్వము ఆయుర్వేద వైద్యులు చనిపోయిన మానవదేహాలను చెరువులలో నానబెట్టి ముందు పైచర్మాన్ని, మరికొన్ని దినాలకు రక్తమాంస కండరాలను, నరాలను, తదుపరి లోపల అవయవాలను,

ఇంకను కొన్నినాళ్ళకు అస్థిపంజరాన్ని కత్తివేయకుండా తమ శిష్యులకు పరిశోధనలద్వారా తెలిపెడివారట, చచ్చినపశువులను మాదిగవాండ్రతో కోయించి అవయవాలన్ని పరీక్షించుట ఆకాలంలోనే గాకుండా యిప్పుడు కూడా జరుగుతున్నది. మనదేశంలో శస్త్రచికిత్స లేకపోలేదు. సుశ్రుతుడు, పశుపాలకాప్యుడు పెద్దశస్త్రవైద్యులు. చాలా పెద్దపెద్ద ఆపరేషన్లు చేసినట్లు ప్రతీతి. కాని క్రమేపి యీనైపుణ్యం నశించింది. కొంతమంది వ్రణవైద్యులుగా, మరికొంతమంది ఎముకలు విరిగితే సరిజేయు వైద్యులుగా తయారైనారు. ఏదో ఆకుఅలము వేసి కట్టుతూ కొంత ఉపశాంతిచేసేవారు. కాని అందుకు వచ్చే వికారాలకు గాని, ప్రమాదాలకు గాని వారేమిబాధ్యులుగా వుండేవారు కారు. ఈ వైద్యం చాలాభాగం మంగళ్లు, కుమ్మరులు మొదలగు యితర జాతులలో వంశపారంపర్యంగా వచ్చేది. మందువైద్యంకూడా యీ కులస్థులు చేసేవారు. పూజారులు కొంతమంది బ్రాహ్మణులు యీమందువైద్యంమాత్రం చేసేవారు. వారికి పూజాపునస్కారాలు వుండడంచేత ఆరోజుల ననుసరించియుండు ఆచారముల ప్రకారమున్ను వారుకూడా కొంతనిష్టగా వుంటేగాని మందులు పనిచేయవని నియమబద్ధులుగా వుండేవారు. ముట్టువారిని, పురిటివారిని తాకేవారు కారు. తాకితే వెంటనే స్నానంచేసి, జంధ్యాలుమార్చి సంధ్యావందనం చేస్తేనేగాని పచ్చిగంగైనా తాకేవారు కారు. ఈరీతిగా శస్త్రచికిత్స కులీనమైపోయింది. అందుచేత మరీ వెనకబడిపోయింది. సరియైనజ్ఞానం లేకపోవడంచేత పురిటియింట్లోకి వెన్నెమ్మ వస్తుందని తలపులన్నీ బిగించి ఒక చిన్నదీపం పెట్టుకొని "బ్రాహ్మడి కూతురు మాదిగాడిపెళ్లాం" అంటూ వెన్నెమ్మకథలు చెప్పుకుంటూ కూర్చుండేవారట. ఈరీతిగా ఆయుర్వేదంలో చెప్పారని కాదు. శాస్త్రీయమైన పరిజ్ఞానము లేకపోవుటవలన మానవులకు, పశువులకు యీపరిస్థితికి కారణమని ప్రత్యేకంగా వేరే చెప్పనక్కరలేదు.

రైతులకు సలహా

మనది బీదదేశం. దానికి తగినట్లుగ చీటికి మాటికి యుద్ధాల వలన నైసర్గిక ప్రతికూలత వలన కరువు కాటకాలు నాట్యమాడుతూ ఉండటం వల్ల మనకు మరింత బీదతనం ఏర్పడింది. దానివలన జననష్టం పశునష్టం కలిగింది. అయినప్పటికి వున్న పశుసంపదనైనా వృద్ధిచేసికొనుట మన విధి.


మనము మనంతట యేపని చేసుకోలేము. దానికి ఒక అండ కావలసి వుంది. రైతుకు వ్యవసాయం ముఖ్యము. అది చేయాలంటే పశుసంపద ఉండాలి. ఇవి ఆరోగ్యంగా వుంటే రైతుకు కావలసిందేముంది? ఒక రైతుకేంటి? సామాన్యప్రజానీకానికి మాత్రం పశువు వ్యవసాయంలో అమూల్యసేవ చేస్తుంది. ప్రజానీకానికీ తోడ్పడుతోంది. అటువంటి పశువుల ఆరోగ్యవిషయంలో శ్రద్ధచూపటం మన విధికాదా? అట్లుకానిచో పశువుకన్న హీనమన్న తప్పేమన్నా వుందా?

'దూరపుకొండలు నునుపు' అన్నారు మన పూర్వీకులు. ప్రాచీనమైన మన ఆర్యసాంప్రదాయాలను తుడిచిపెట్టి యిప్పుడు నవనాగరిక వైద్యం అనుసరించటంలో ఏ మహాత్మ్యం ఉన్నదో బోధపడుట లేదు. పూర్వకాలంలో పశువులకు రోగాలు రాలేదా? అప్పటివారు శస్త్రచికిత్సలు, ఎనిమాలు మొదలైన ఆంగ్లేయవైద్య సంపత్తితోనే వాటిని నివారించుకొన్నారా? లేదు. వనములలో అరణ్యములలో లభ్యమయ్యే ఆకులతోను, వనమూలికలతోను, తదితరమైన దినుసులతోను, గోసాయి చిట్కాలతోను రోగాలను నివారించుకున్నారు. అవి యిప్పుడూ వున్నాయి. ఆంగ్లవైద్యం రోగాన్ని తాత్కాలికంగా ఉపశమింపచేస్తుంది. కాని పూర్తిగా అంకురాన్ని మాత్రం తీసివేయలేదుగదా. అదిగాక దానితో వైద్యం నడపాలంటే ద్రవ్యం కావాలి. పైపెచ్చు వ్యయప్రయాసలు జాస్తి. కనుక ఎక్కువ శ్రమలేకుండా ద్రవ్యంతో నిమిత్తంలేకుండా మన పరిసరాల్లో లభ్యమయ్యే ప్రకృతి సిద్ధమైన ఔషధములను మనం ఉపయోగపరచుకొని తద్వారా పశుసంపదను వృద్ధిపరచవలసిందని కోరుచున్నాను.

* * *

ప్రథమ భాగము

ప్రాచీన పశుసంరక్షణ



పవిత్రమైన భారతదేశం ప్రతి విషయంలోను ప్రతికిచెడ్డదేశం. అదృష్టరేఖలు అంతరించినా, భాగ్యరేఖలు బండబారినా, పూర్వపుచరిత్ర, పూర్వపుటౌన్నత్యం స్మరించినపుడు ఉత్తేజం, ఉత్సాహం కలుగుతుంది. దేశంలో పాడీపంటా అభివృద్ధికావాలంటే గోమాత బాగుండాలి. అందుకనే మన పూర్వులు గోవు పవిత్ర–మైనదనీ, పూజనీయమైనదనీ అన్నారు. హిందువులు, బౌద్ధులు, జైనులు, మహమ్మదీయులు గోవును, ఆబోతును పరమభక్తితో ఆరాధించెడివారు. సాలగ్రామము, తులసీవనము, అగ్ని, గోవు పూర్వాచార–పరాయణులకు పరమ పూజనీయములు. ఉదయమున నిదురలేవగనే, గోవును చూచినపిదప గోప్రదక్షిణ మొనరించుట ప్రబలమగు సదాచారంగా వుంది. పుణ్యస్త్రీలు గోవును మహాలక్ష్మియని పసుపు కుంకుమలతో, పుష్పదామాదులతో నలంకరించి ప్రత్యేకదినాలలో ఆరాధించెడివారు. భక్తులు భక్తిపూరితులై స్వయంగా లేతపచ్చికల గ్రహించి శ్రద్ధతో గోవులను, గోవత్సములను చేతులారా మేపెడివారు. అందుచేత తమకు తరుణోపాయము కలుగుతుందని నిక్కువముగా నమ్మెడివారు.

హిందూ, బౌద్ధ, జైన, మహమ్మదీయ రాజ్యాంగాలలోని గోకీర్తి, గోసంతతి క్షీణించుట యీకాలంలోనేనా, లేక యిదివరలో కూడా యిట్లాగే వుందా? అను ఈ ప్రశ్నకు జవాబు ప్రాచీనగ్రంథాల ద్వారా ఇప్పటి ఇంగ్లీషు తదితర లేఖలద్వారా యివ్వబడింది. మహమ్మదీయ యుగారంభమువరకు గోవుకు ఎంతో గౌరవముండేది. హిందువులకు వేదాలంటే దైవీకములేగాని మానవకృతులు గావు. వేదాలలో గోవుల యొక్కయు, వృషభములయొక్కయు ఉపయోగాలనుగూర్చి పొగడ్తలతో మంత్రములు చెప్పబడినాయి.

వేదవాక్యాలు

"ఆవు నాకు తల్లి – ఆబోతు నాకు తండ్రి" ఈ రెండు నాకు యిహపరములై సుఖమును కలుగజేయుగాక! వివిధరంగుల గోవులు మా గృహమునకు వచ్చి అన్నివిధాల మాకు కల్యాణము చేకూర్చుగాక! మా



గోశాలలు సుఖముగా నుండుగాక! ఆవులు అసంఖ్యాకములైన దూడలను కంటూ మా యజ్ఞములకు పాలిచ్చునుగాక.

"గోవులారా! మీరు బలహీనులను, రోగులను బలవంతులుగా చేయండి. కురూపులను రూపవంతులు గాను, చెడునడత గలవారిని మంచి నడత గలవారినిగాను చేయండి. గొప్పయాగాదులలో ప్రజలు మీకు ఆహారాలుపెట్టి పూజిస్తారు.

మహాభారతమును పంచమవేదమంటారు. గోవే ఎల్లసంపదలకు మూలము. గోవులలో ఏ పాపం లేదు. గోవు అమృతమును ధరించి భరించి ప్రవహింపజేస్తుంది. అది అమృతమునకు సంగ్రహస్థానము. కనుకనే అందరు గోవును పూజించెదరు.

గోవు జీవించినపుడు పాలు పెరుగు నేతులనిస్తుంది. గోమలమూత్రములు ఉపయోగపడును. చనిపోయినచో చర్మము, ఎముకలు, కొమ్ములు ఉపయోగపడుతాయి.

గోవు అన్నిటికి మాత! జీవులనన్నిటిని సుఖపెట్టుతుంది. మానవులు తమ అభివృద్ధికోరితే ప్రతినిత్యము గోవుకు ప్రదక్షిణం చేయాలి. సదా సేవచేయాలి. గోవు అన్ని మంచిపనులకు గనివంటిది.

గోవులే జీవులన్నిటికి ఆధారము. అవి మనకు అమూల్యమైన గనులు. ఇదివరకు జీవించిన, యికమీద జీవించు జీవులన్నిటికి గోవే ఆధారము. గోవే ఐశ్వర్యమునకు మూలము.

ఎవడు గోవును, దానిశరీరముతో చేసిన వస్తువులను అమ్ముటకు హింసించునో, నిరంకుశుడై ఎవడు దానిని తినునో, ధనలోభముచే ఎవడు దీనిని ఆమోదించునో – గోవును వధించువాడు, తినువాడు, ఆమోదించువాడు – వీరందరు గోవు శరీరంలో ఎన్ని రోమములుండునో అన్ని సంవత్సరములు నరకమున-నుంటారు.

గోవులు పాలతోను, నేతితోను ప్రజలకు ప్రాణదానము చేస్తున్నాయి. వీటి సంతతియగు వృషభములు వ్యవసాయపు పనులన్నియు చేస్తాయి. పలువిధములగు ధాన్యాలను, తినుపదార్థాలను పండించుతాయి. ఇవి ఆకలిదప్పులతోనున్నను మన పనులను చక్కపెడుతాయి.

గోవులను రక్షించిన మహాపురుషుల పేర్లను హిందువులు గోత్రాలుగా వాడుతున్నారు. గోవుతో సంబంధించియే ఆర్యశబ్దము పుట్టింది. హిందువులలో అధికసంఖ్యాకులు గోవుయొక్క శరీరము దేవతల నివాస స్థానముగను, వృషభంయొక్క శృంగాలపై భూమి నిలిచియున్నదనియు నమ్ముతారు. గోవుద్వారా మృతసంజీవిని అనే ఔషధం లభిస్తుందని బుద్ధదేవుడు చెప్పాడు. దేవతలు, పితరులు, ఇంద్రుడు, అసురులు, గోవు యొక్క ఆపదలనుచూచి అలమటించేవారు. మొదట గోవులకు కోరిక, ఆకలి, ముసలితనం యీ మూడే రోగాలుండేవి. పశువధ మొదలుపెట్టినప్పటినుంచి 96 రోగాలు ఉత్పన్నమయ్యేనట.

అర్జునుడు గోవులను రక్షించడానికి పండ్రెండు సంవత్సరాలు అరణ్యాలలో కష్టపడ్డాడు. విరాటుడు, నందుడు లక్షలకొలది గోవులను పోషించేవారట. ఆకాలంలో గొప్ప గొప్ప మహారాజులుకూడా గోసంరక్షణ, గో రోగనివారణలు చేసేవారు. సహదేవుడు మారువేషంతోనున్నపుడు విరాటునితో యిట్లనియె. "రాజా! ఆబోతులకుండవలసిన లక్షణాలు, పశుచికిత్స నెరుగుదును" అని చెప్పగా సంతసించెనట. జమదగ్ని మహర్షి సహస్రార్జున మహారాజునకు గోవును ఈయనందున ప్రాణమును అర్పించెనట.

వసిష్ఠుడు అనేక కష్టముల పాలయినప్పటికి విశ్వామిత్రునకు గోవును ఈయనేలేదట. దిలీపమహారాజు గోసేవకై రాజ్యమును, తనప్రాణమునుకూడా లెక్కచేయనేలేదట. సాక్షాద్భగవదవతారమనియు, పురాణపురుషుడనియు, గోరక్షకుడనియు, గీతాచార్యుడనియు, పరమభక్తితో నారాధింపబడుతున్న శ్రీకృష్ణ భగవానుడు పశువులకాపరియట, సత్యరక్షణకొరకే అవతరించెనట. ఇంద్రుని గర్వాన్ని అణచి, గోవర్ధన పర్వతాన్ని ఎత్తివైచి గో మాహాత్మ్యాన్ని ఎల్లరకు తెలిపెనట. కృష్ణుని బాల్యంలో గోవుల్నిమేపే సమయంలో, తాను ముందుగా ఎండలోనికేగి తనకాళ్ళు కాలుచున్నవో లేవో, పరీక్షించి, తరువాత తనగోవుల్ని బయటకు పంపేవాడట. ఆతని వేణునాదంతో గీతామృతాన్ని చవిచూస్తూ గోవులు ఆనందించేవట. లేగలు పాలుత్రాగుట మరచేవట. ఇంకను మాధవుని స్వరూపాన్ని తిలకిస్తూ పారవశ్యత చెందేవట. గోవులే గోపాలునికి ప్రాణతుల్యం. గోవులమధ్యనే గోపాలుడుండేవాడట. వాటి వెన్న పెరుగులనే దొంగతనంగా, అతి ఆప్యాయంగా తింటూ ఉండేవాడట.

బుద్ధభగవానునికాలములో, చంద్రగుప్తుని అశోకునికాలంలో గోవులు, గోచికిత్సాలయాలు, గోసంరక్షణ ఎక్కువగానుండేవట. బుద్ధుని శిష్యుడు ధనంజయుడు తనకుమార్తెకు కొన్నిలక్షల గోవులను భరణముగా యిచ్చెనట. శ్రీమహావీరుని పదిమందిశిష్యులలో రాజగ్రహీశతకునకున్ను, వారణాసిలోని చూలనీపితకున్ను, ఎనుబదివేల గోవులును, చంపాకామదేవునకు, వారణాసిసుదివకు, కాంపిల్యవణకుండునకు, మాలికీ ఆల్పియామాలశతకునకు అరువదివేల గోవులును వాణియాఆనందకు శ్రావస్తేనందినీపితకు, శాలినీపితకు నలుబదివేల గోవులును ఉండెడివట. ఇంకను సిక్కులు, జైనులు, మహమ్మదీయులుకూడ గోసంరక్షణ విషయమై చాలా పాటుబడినటుల పురాణాలు, చరిత్రలు తెలుపుతున్నాయి.

మహమ్మదీయుల కాలంలోకూడా గోస్థితి బాగానేయుండెను. 1297 అల్లాఉద్దీన్‌ఖిల్జీకాలంలో పరిపాలనబాగుండలేదని చెప్పినను రూపాయకు ఒకమణుగు 18 సేర్ల వెన్న అమ్మెడిదట. అధికంగా గోవులున్నందువల్ల మహమ్మదీయులకాలంలో పాలు, వెన్న, నెయ్యి అధికంగా దొరికేదట. ఇందువలన మహమ్మదీయయుగాంతమునకూడా ఒకరూపాయకు 45 సేర్ల పాలు, రూపాయకు 10 1/2 సేర్ల మంచినెయ్యి దొరకుచుండుటచే ప్రతి బీదవాడు కూడా తమ మాంసాహారాలలో, పల్వాలలో నెయ్యి వాడుతుండేవారట. ఇప్పటివలె ఆకాలంలో గోహత్యచే వ్యాపారాలు జరగలేదు. మహమ్మదీయసుల్తానుల కాలంలో నేటికంటె సంఖ్యలోను జాతిలోను గోసంతతి చాలాబాగుండెడిదని "ఇతిహాసం" ఋజువుచేసింది. ఇంకను అక్బరు, మొగల్ పాదుషా, జహంగీర్, షా ఆలం, టిప్పుసుల్తాన్ గోసేవకై పాటుబడ్డారు.

భారతయుద్ధం జరిగిన తరువాత అయిదారువందల సంవత్సరాల నాటికి రమారమి క్రీ.పూ. 500 సంవత్సరాల ప్రాంతమున ఉత్తరహిందూస్థానమునందు పదహారు స్వతంత్రరాష్ట్రాలున్నాయని తెలుస్తుంది. కురుపాంచాలములు వీనిలో చేరినా క్రీ.పూ. 600 సంవత్సరాల నాటికే వీని ప్రాముఖ్యం తగ్గిపోయింది. వీనిస్థానంలో కోసల, కాంచి, కౌశాంబి, అవంతి, మగధ మొదలయిన రాజ్యాలు బాగా ప్రఖ్యాతిగయుండేవి. బుద్ధుడు తనమతమును బోధించుటకు ఆరంభించినపుడు మగధరాజ్యం గొప్పదశలోనుండెను. ఆ రాజ్యాన్ని బింబిసారుడను రాజు పరిపాలిస్తుండేవాడు. అతడు బుద్ధుని రప్పించి అందరికి మతబోధ చేయించాడు.

"అహింసా పరమో ధర్మః" అను మహావాక్యమే ముఖ్యసిద్ధాంతంగా గల బౌద్ధ జైనమతాలు గుర్తించినట్లు మానవ పశుజీవితముల పవిత్రతను మరియేయితర మతం గుర్తించలేదు. యజ్ఞములు బలులు మొదలయిన కాండలేవియు ఈ మతమందులేవు. పశుబలికన్న ఆత్మబలియే సర్వోత్కృష్టమని బుద్ధుడు చాటాడు. బుద్ధుని కాలంలో పశువు లత్యధికంగ వృద్ధినొందినాయి. బౌద్ధమత ప్రచారంవలన పశుమేధాలడుగంటినాయి. జైన మతాతిశయమువల్ల, అశోక సామ్రాట్టుయొక్క ప్రేరణవల్ల జీవదయాళుత్వం అభివృద్ధిచెంది మానవ వైద్యశాలలతోపాటు పశువైద్యశాలలు గోసంరక్షణ సంఘాలను నెలకొల్పి చక్కని దేశీయ చికిత్సలను బుద్ధుడు తన శిష్యులతో దగ్గరయుండి చెప్పేవాడట.

అశోకచక్రవర్తి పశు సంరక్షణ

హిందూమతం ఒకశాఖగా వున్నపుడు బౌద్ధమతాన్ని గొప్ప మతంగా అభివృద్ధిజేసింది అశోక చక్రవర్తియే. లోకప్రఖ్యాతిజెందిన ఇండియా చక్రవర్తులలో అశోక మహారాజే మొదటివాడు. బౌద్ధనీతులను ఆ యా దేశభాషలలో రాతిస్తంభాలపైన చెక్కించి స్తంభాలను వివిధ ప్రాంతాలందు నాటించాడు. వీటినే అశోక శిలాశాసనాలంటారు. ఈయన కాలంలో పశువులను కాలనిర్ణయం ప్రకారం మేపుటలో జాగ్రత్త గలిగియుండెను. గుఱ్ఱములు, ఏనుగులు, చేపలు, ఆటపక్షులు ప్రతి జీవజంతువుకు పశువైద్యులుండేవారట. అశ్వదళాధికారి మున్నగు ప్రతివారు ఈ చక్రవర్తి కాలంలోగొప్ప పదవిని, గౌరవాన్ని గలిగియుండేవారు. ఈతని కాలంలో ఎద్దులకు బుడ్డలు కొట్టుట మాన్పించెనట. పశుజాతులకు వివిధరకముల పేర్లుబెట్టి

వృద్ధిలోనికి తీసికొచ్చెనట. ఋతువుల ననుసరించి అరణ్యముల భాగించి పశువులను మేపుచుండుట, మజ్జిగను కుక్కలకు పందులకు పోయించుచుండుట, చోరులచే నపహరింపబడిన పశువులను తీసుకొచ్చినవారిని సత్కరించుట, పశువులకు చికిత్సచేయించుట మొదలయిన కార్యములెన్నో గలవు. రాజు తన పశుసిబ్బందికి వేరువేరు పచ్చిక బీళ్ళనేర్పాటు గావించేవాడు. ఏనుగులకొకబీడు, గుఱ్ఱములకొక బీడు, ఎద్దులకొకబీడు, లొట్టిపిట్టలకొకబీడు, ఈరీతిగా జంతుజాతిని ప్రత్యేక స్థలమందు నియమించి మంచిపోషణ జరుగునట్లు అజమాయిషీ తీసికొనేవాడు. పశువధ చేయరాదనీ, ప్రతి పక్షమున మొదటి 8, 14, 15 వ దినములలో, పండుగలలో, ఉపవాస దినములలో, ఎద్దులకు గొఱ్ఱెలకు బుడ్డకొట్టరాదని ఆజ్ఞాపించేవాడట. అశోకుని మరణమునకు, హర్షవర్ధనుని పరిపాలనకు మధ్యకాలంలో యీ యుద్యమ విషయంలో తగినంత శ్రద్ధ తీసుకొన్నట్టు కనబడదు.

కాశ్మీరదేశమున ఆరవ శతాబ్దమున గోపాదిత్యుడును, తొమ్మిదవ శతాబ్దమున అనంతవర్మయు, గుజరాతుదేశమున పండ్రెండవ శతాబ్దమున కుమారపాలుడును ఈ పశు సంరక్షణవిషయమై చాలా శ్రద్ధతీసికొనిరట. ఛత్రపతి శివాజీ కాలమున మరల ఈ యుద్యమము మంచి యున్నతస్థితియందున్నట్టు "శివదిగ్విజయ" మను గ్రంథం తెలుపుతూంది. ఇంకను చంద్రగుప్తుని కాలంలో గూడా పశుసంరక్షణ బాగా యుండేదని తెలుస్తుంది.

కృష్ణదేవరాయల పశు సంరక్షణ

బళ్ళారి జిల్లాలో తుంగభద్రా నదీతీరమున హంపి యను నొక పట్టణముగలదు. 1509-1530 సంవత్సరాల మధ్య కృష్ణదేవరాయలు విజయనగరమును పాలించాడు. విజయనగర చక్రవర్తులలో మిగుల యుత్తముడు. అనేకరాజ్యాలు జయించాడు. అనేక గ్రంథాలు రచించాడు. దేవరాయల ఆస్థానమున అల్లసాని పెద్దన్న మనుచరిత్రను, నందితిమ్మన పారిజాతాపహరణమును, తెనాలి రామకృష్ణుడు పాండురంగ విజయమును వ్రాసినట్లు తెలుస్తుంది. నేను తదితర మిత్రులతోకలసి శిథిలమైన నగరాన్నంతను చూచాము. శిథిలమైన గుఱ్ఱపు బేలాలు, పాలనింపు రాతిబొట్లు, ఇంక యెన్నో చిత్రవిచిత్రమయిన మందిరాలు వున్నాయి. ఈయన కాలంలో ప్రతిరోజు నాలుగువేల వృషభములు ప్రత్యేకముగ పోషింపబడుచుండేవట. పెద్దపెద్ద తొట్లలో పాలుపోసి లేగలకు, ఏనుగు పిల్లలకు, గుఱ్ఱపు పిల్లలకు త్రాగించేవారట. ఋషిమూలికాపర్వతము దగ్గరనున్న చక్కని ఓషధులతో జంతుచికిత్స వైద్యులతో చేయించేవాడట.

సిక్కుల పశు సంరక్షణ

గోసంరక్షణ విషయమై హిందువులకున్న యభిప్రాయమునే సిక్కులుగూడా బలపరుస్తున్నారు. గోవుయొక్క పవిత్రతను గురించి సిక్కు మతగ్రంథమగు "గ్రాందిసాహెబ్" నందు యేమీ చెప్పలేదు. వీరికి గోవునందుకల పూజ్యభావం హిందువులనుంచి వచ్చిందేగాని వేరేకాదు. గోవిషయమై వీరి యభిప్రాయాలు "గ్రాందిసాహెబ్" లో కొన్ని కథలనుబట్టి సిక్కుసాంప్రదాయాలనుబట్టికూడ తెలిసికోవచ్చు. గో పవిత్రత

విషయంలో హిందువులకంటె సిక్కులకు మూఢ విశ్వాసంగలదు. గోవధకు విధింపబడవలసినశిక్ష మరణదండనకన్న యేమాత్రం తక్కువగానుండకూడదని వారి నిశ్చితాభిప్రాయం. మహమ్మదీయులకు సిక్కులకు వచ్చు ఘోరకలహాలకు గల కారణం సిక్కులకున్న పట్టుదలయే. ఈ పట్టుదలవల్లనే వీరు మహమ్మదీయులతో పోరాడి అల్పసంఖ్యాకులతో ఓడిపోయి తమ సామ్రాజ్యాన్ని కోల్పోయారు. సిక్కులకున్న గోసంరక్షణ పట్టుదల, గోపోషణ ఏమతములవారికి లేదనియే చెప్పవచ్చు.

పశుసంరక్షణ విషయమై హిందూమతానికత్యంత సన్నిహిత సంబంధంగల పార్సీమతంవారి మతగ్రంథము "జెండుఅవేష్టల్" లో బోధింపబడిన కర్మకాండలు చాలవరకు వైదిక కర్మకాండలను పోలియున్నవి. పార్సీ మతప్రవక్తయగు జరాతుస్త్రుడు పశువధ మహాపాతకమని బోధించాడు. పార్సీ మతస్థులు గోవుకన్నను వృషభమే ఎక్కువ పవిత్రమైందిగా నెంచుతారు. మానవసృష్టికి మూలము పురుషుడని క్రైస్తవ మతస్థులు తలచునట్లు పశుసృష్టికి మూలం వృషభమే మొదటిదని పార్సీవారి నమ్మకం. వృషభ వీర్యమువలన దంపతులు వానివలన 280 విధములగు తదితర జంతువులు పుట్టినట్లు వారిశాస్త్రమందున్నది. హిందువులకు గో మూత్రం ఎంత శుద్ధమైందో పార్సీలకు వృషభమూత్రం అంతకన్న పవిత్రవంతమైంది. శరీర సంబంధమగు అంతశుద్ధిగాని బాహ్యశుద్ధిగాని వృషభమూత్రంవల్ల చేయవచ్చు. మానవశవమునుగాని జంతుశవమును గాని తాకినవారు వృషభమూత్రంచే పారిశుద్ధ్యమునొందుదురు.

ప్రసవించిన స్త్రీలు మొట్టమొదట బూడిదకలిపిన వృషభ మూత్రం 3, 6, 9 చుక్కలను త్రాగుదురు. తరువాత ఆ యువతి గుఱ్ఱము ఆవు మేకల పాలను నీరుకలపని ద్రాక్షరసమును మూడు దినములవరకు తీసుకోవలెను. మూడు దినముల పర్యంతము ఆమె తనబట్టలను, నవరంధ్రములను, దేహమును, నోటిని వృషభమూత్రముతో కడుగుకోవలెను. ప్రాణములేని శిశువుపుట్టిన స్త్రీలకై, ఈ పద్ధతి మొదట నేర్పరుపబడినను నేడు ప్రసవించిన ప్రతి పార్సీయువతి ఈ రీతిగా దేహపారిశుద్ధ్యము నొందుట యాచారమైపోయిందని "కౌప్రొటెక్షన్" అను ఆంగ్ల గ్రంథం తెలుపుతోంది.

అమెరికా సంయుక్త రాష్ట్రములందు ముస్సోరి రాజ్యం కలదు. అందు టీచర్సు కాలేజి అను పేరుగల ఒక కృషిక విద్యాలయం కలదు. దాని ప్రధానాధికారి "మిష్టర్ జాన్ హెచ్ గ్రెహర్సు" అనునతడు వ్యవసాయ సంబంధమగు గ్రంథములనేకములు వ్రాశాడు. అందొక గ్రంథము "టాయిల్ స్టాల్స్‌ను, ఫార్మే కానిక్సున్ను" ఈ గ్రంథాలయొక్క ఆరవ అధ్యాయమందు పశుజాతిలో ఉపయోగాన్ని గురించి, వాటి మహాత్మ్యాన్నిగురించి గొప్ప వర్ణనలు చేశాడు. సి.డబ్లియు.బర్కెట్ తన "సాయిల్" అను గ్రంథంలో పశువులగూర్చి చక్కగా వర్ణించాడు. అమెరికా యూరపు విద్వాంసులు ఏబది సంవత్సరాలకు పూర్వం తెలిసికొన్న విషయాలు భారతదేశ మహర్షులు అనేకవేల సంవత్సరాలకు పూర్వమే తెలుసుకొన్నారు. ఈ విద్వాంసులు పశుపోషణ గో మహాత్మ్యాన్ని తెలుసుకొన్నప్పటినుండి వారు గోజాతిని ఇంకను జాగ్రత్తగా పోషిస్తున్నారు. ఇప్పుడు అచ్చట గోవులు నివసించుటకుగాను రాత్రింబవళ్ళు చాలినంత నిర్మలవాయువు, పండుకొనుటకు, తిరుగుటకు పరిశుభ్రమగు స్థలం, నిద్రించుటకు మెత్తనిగడ్డి పాన్పులు లభించునట్టి ఏర్పాటులతో పశుశాలలు

నిర్మింపబడుతున్నాయి. అర్జెంటైనాలో పశువులు విశేషంగా పోషింపబడుతున్నాయి. ఆస్ట్రేలియా గ్రేట్ బ్రిటనులలో మేలైన జాతులు పెంచబడుతున్నాయి. ఆ దేశమందలి వ్యవసాయాని- కుపయోగింప బడకుండనుండు పశువులను మాంసాహార సంపాదనకు, పరిశ్రమాభివృద్ధికి ఆధారభూతాలుగా ఉన్నాయి.

ఆంగ్లేయులకు గొడ్డుమాంసమంటే ప్రీతి. కావుననే హిందూ దేశములో గోవధ ముసల్మానులకంటె అతివిశేషంగా ఆంగ్లాధికారుల కొరకు చేయబడుచున్నదని గాంధి, మాలవ్య, దయానంద ప్రభృతులు సెలవిచ్చారు. నెపోలియన్ ఒక సందర్భంలో సైనికులు గోగర్భంపైననే నడుస్తుంటారని చెప్పాడు. అనగా గోమాంస భక్షణమునకే వారు యువ్విళ్లూరుదురని భావం. ఆంగ్లేయులు గోవృషభాల అనేకరీతుల పోషించి క్రొవ్వెక్కునట్లు చేశారు. ఇటీవల వరకు వేలకొలది ఎడ్లు దూడలు ప్రస్తుత యుద్ధమిలటరీవారికొరకు వధింపబడినాయి. అందువల్ల వాటి విలువపెరిగింది. రైతులా పశువులవిలువ తెలిసికొని చాలా జాగ్రత్తతో చూస్తున్నారు. పాశ్చాత్య లీ పశుమాంసంతో అనేక పిండివంటకాలు తయారుచేస్తారు.

క్రీస్తు శకారంభమునకు పూర్వమే సిరియా మున్నగు ప్రాంతములందు ఆర్యావర్తమందు పశుజాతి కాననయ్యెనని ఆరిస్టాకు మహానీయుడు వ్రాశాడు. హైందవులకు, గ్రీకులకు, రోమనులకు, ఐగుప్తీయులకు, హెబ్రూలకు పశువులు వెండి బంగారాలకంటె విశేషప్రియతరములుగా నుండుట నిజం. అవియే వారి కల్పతరువులు, కామధేనువులు. హెసాయిడ్ అను నొక ప్రాచీన గ్రీకు కవీశ్వరుడు తన గ్రంథమునందు "బండ్లులాగుటకు పొలములు దున్నుటకు తొమ్మిదేండ్లు నిండిన కోడెను కట్టుట యుక్తం. కారణమేమన వీని కావయస్సు వచ్చునప్పటికి వాటి చిన్నతనపు చేష్టలు పొగరుబోతుతనము తగ్గి, అవి చెప్పినట్లు వింటాయి. లేకున్న కాడిని బండిని తునకలు తునకలుగా విరుగకొడతాయి" అని వ్రాశాడు. హిందువుల హెబ్రూల గ్రంథాలలో పశుపోషణావిధానాన్ని గూర్చి అనేక ప్రమాణాలున్నాయి. ఇప్పటికిని ఇండియాలోవలె ఫ్రాన్సు, జర్మనీ, రష్యా, బల్గేరియా, రుమేనియా ప్రాంతాలందు పొలంపనులు చక్కబెట్టుటకు పశువులే చాలవరకు ఉపయోగపడుతున్నాయి.

పశువులను బాధపెట్టుట

ఎన్ని పడరానిపాట్లు పడుతున్నా తమ బాధలను చెప్పుకోటానికి పశువులకు నోరులేదు. అట్టి మూగజంతువులను సదా ప్రేమించాలి. ఈ విషయంలో బౌద్ధ, జైనమతాదర్శా లనుసరణీయాలు. కృషికులు పశువులను బాధపెట్టుట తప్పనిసరియైనను ఆ బాధలు సాధ్యమైనంత తక్కువగా వుండాలి. ఇంగ్లాండు మొదలైన దేశాలలో పశువుల నెగుమతిచేయు విషయములో వానినిపెట్టు బాధలపరిమితములు. శక్తిలేక కదలని జంతువుల చెవులలో నూనెను పోయుట, చెవులలో గడ్డిక్రుక్కి నిప్పు అంటించుట, తోకలు విరగదీయుట మొదలైన అనేక ఘోరకృత్యాలు చేస్తారు. పశువధవలన ప్రత్యక్షంగా గాకపోయినా పరోక్షంగా వచ్చు నష్టము లనేకములు. కటికవృత్తి ఎక్కువగాయున్నచోట్లలో నేరాలెక్కువగా జరుగుచుండుట అందరికి తెలిసినవిషయమే. లండనుకు తూర్పుభాగంలో వందలకొలది కటిక దుకాణాలున్నాయి. ఆ పశువధ చేయునపుడు వాని వేడిరక్తమునకై అనేకమంది బాలురు చెంబులు పుచ్చుకొని వెళ్తారు. అచటివారీవిధంగా

చిన్నతనం నుండి క్రూరదృశ్యాలు చూచుట కలవాటుపడినందున వారిలో చాలామంది కఠినాత్ములు క్రూరాత్ములు తయారగుతున్నారు. అచట జరుగు నేరాలకు క్రూరకృత్యాలకు హద్దులేదట. సంయుక్త రాష్ట్రాలలో జరుగుతున్న హత్యానేరాలు చాలావరకు కటికవృత్తి యందున్న వారి చేతనే చేయబడుతున్నాయి.

టాల్స్టాయికవి వర్ణన

ఈ కవి వ్రాసిన ఒక గ్రంథంలో ఈ దిగువరీతిగా వర్ణించాడు. ఈ భయానకదృశ్య వర్ణనలు ప్రతివారును చదువదగినవే. "అది జూన్ మాసము. ఆ రోజు ట్రీనిటీ పండుగకు ముందు శుక్రవారం కటిక దుకాణముల బజారంతయు జనసమూహముతో క్రిక్కిరిసియుండెను. ఎద్దులు ఆవులు ఆవుదూడలు బండ్లకు కట్టివేయబడియుండెను. గుఱ్ఱపు బండ్లనుండి అనేక ఆవుదూడలు దుకాణములోనికి దింపబడు–చుండెను. కొన్ని బండ్లు దుకాణములనుండి పశుశవములను మోయుచుండెను.

నేలబడియున్న ద్వారమున కెదురుగా దుకాణములలోనికి ఇద్దరు మనుష్యులు ఒక బలిసిన ఎద్దును బలవంతముగా లాగుకొనిపోయిరి. లోపలికి వెళ్ళినతోడనే ఒక కటికవాడు తన బలముకొలది ఆ యెద్దు అఱ్ఱుపై ఒక్కదెబ్బవైచెను. వెంటనే అది భూమిపైబడి తన నాలుగుకాళ్ళతోను వెనుకభాగముతోను విలవిల కొట్టుకొనసాగెను. తక్షణమే మరియొక కటికవాడు దాని కొమ్ములు పట్టుకొని తలను బొక్కబోర్లగా త్రిప్పెను. ఇంతలో ఇంకొకడు తన కత్తితో దాని గొంతుకను పరపరకోసెను. రక్తసిక్తములగు బట్టలు ధరించిన ఒక కుర్రవాడు ఆ యెద్దు కుత్తుకనుండి ప్రవహించుచున్న రక్తమునొక పళ్ళెములోనికి పట్టెను. ఆ పళ్ళెమునిండుట తోడనే దానిని ఆ బాలుడు అల్యూమినమ్ ఫ్యాక్టరీకి తీసుకొనివెళ్ళెను. ఇటులనే మరొక పళ్ళెమునిండెను. కాని ఇంకను ఆ యెద్దు పొట్టవెనుకకాళ్ళు కొట్టుకొనుచునేయుండెను. రక్తము ప్రవహించుట ఆగిపోయినతోడనే కటిక వాడొకడు దాని తలపైకెత్తి చర్మము వొలిచెను. తెలుపు నరములతోనున్న ఆ యెరుపుదేహము చూచుటకు వికృతముగా నుండెను. ఇంకను ఆ యెద్దు కొట్టుకొనుచునేయుండెను. ఈ రీతిగా నొకదానితరువాత నొకటిని చంపుచునేయుండిరి. ఇట్టిఘోరకృత్యము కన్నులార జూచిన ఏ మానవుని గుండెలు సమసిపోవు!"

పూర్వీకుల పశు ధర్మసూత్రాలు

ఈ దిగువరీతిగా ప్రాచీనకాలంలో పశుసంబంధమైన ధర్మసూత్రాలు సేద్యమును గూర్చిన విషయాలు తెలియపరచారు. ఈ సూత్రాలన్నీ సంస్కృత శ్లోకములనుండి తీసికొనబడినాయి.

ఎనిమిది వృషభాలతో దున్నుట ధర్మమగు వ్యవసాయము. ఆరు వృషభాలతో దున్నుట బ్రతుకుదెరువు. నాలుగు వృషభాలతో దున్నుట పాపహేతువు. రెండెద్దులతో దున్నుట పాపమని, బ్రహ్మహత్యాతుల్యమని పరాశరస్మృతి తెలుపుతూవుంది.

ఆ హుంకారముచేతనే ఎద్దులను తోలాలి. ఆకులుగల కొమ్మలతో కొట్టాలిగాని కర్రతోగాని, బెత్తంతోగాని త్రాడుతోగాని కొట్టరాదు.

ఆకలిగా, బడలికగా, వికలేంద్రియంగా వుండిన యెద్దుతో పనిచేయించరాదు. తృప్తిగా మేతవేసి నీరుత్రాగించాలి. ఉదయంనుంచి మధ్యాహ్నంవరకు రెండు యామములు మాత్రమే అరకగట్టాలి. మధ్యాహ్నం, సాయంకాలం విశ్రాంతి ఈయాలి. ఇందుకు వ్యతిరేకంగా నడచిన నరకమును పొందుతాడు.

ఏ దుర్మార్గుడు ఎద్దును రక్తమువచ్చునటుల కొట్టునో ఆ పాపికి భ్రూణహత్యాదోషము కలుగుతుంది. ఆకలిగొన్నది, దప్పిగొన్నది, ఆయాసపడుచున్నది, అవయవహీనమైనది, రోగముగలది, పుంసత్వము లేనిది అగు ఎద్దులను అరకకు కట్టరాదు.

దృఢమైన అవయవములు కలిగి, రోగములేక తృప్తినొంది బాధపెట్టబడక, పుంసత్వము లేనిదానిని అర్ధదినము దున్ని విడచిపెట్టాలి.

పగలంతయు పశువులన్నియు కాపరుల స్వాధీనములో వుంచి మేపుతారు. కాబట్టి వాని మంచిచెడ్డలు కాపరులే చూడాలి. సాయంకాలం కాపరులు పశువులను తోలుకొనివచ్చి తమ యజమాని గృహమందు కట్టివెళ్ళిన తరువాత యజమానులదే బాధ్యత.

కాపరికి కూలి ఈయనిచో యజమానికి పదియావుల పాలను పిండి యిచ్చి, ఒక ఆవుపాలను మాత్రమే కాపరితీసుకోవాలి.

కంటికి కనుపడనిది, పురుగులచే కుక్కలచే తినబడినది, పల్లపు గుంటలలోపడి చచ్చినది, కాపరిలేనిది, పారిపోయినదియగు పశువును కాపరియే ఆ నష్టాన్ని భరించాలి.

దొంగలు దొమ్మీచేసి పశువులను అపహరించిరేని, ఆ విషయాన్ని వెంటనే యజమానికి దగ్గరలో నున్నపుడు చెప్పినచో కాపరి అచ్చుకోవలసిన బాధ్యతలేదు.

తుంటరివి, ఆకలిరోగం గలవి, కొమ్ములు లేనివి, గ్రుడ్డివి, గిట్టలు లేనివి, తోకలేనివియగు వృషభాలతో కట్టినబండ్ల ప్రయాణం కూడదు.

ఈని పది దినాలు కూడ గడవని గోవులకు, చక్రము, శూలము అచ్చు వేసిన ఎద్దులను, హరిహరాదు–లగు దేవతలకై అచ్చువేసిన ఎద్దులను, కాపరులతోనున్నను లేకున్నను పొలములలోని సస్యాలను తినుచున్నను దండింపరాదు.

మార్గగ్రామ సమీపేతర ప్రదేశమందలి పొలాలలో గోవులు మేసినచో రూపాయి పావలా జరిమానా విధించాలి. తదుపరి గోవులు తిన్నమేత ఫలితాన్ని కాపరిగాని, యజమానిగాని, పొలంగల యజమానికి ఈయాలి.

నీరు త్రాగుచున్నగోవును, పాలు కుడుచుచున్న దూడను నివారింపరాదు. పాలు తీయునప్పుడు మాత్రం నివారింపవచ్చును. ఇతరుల దూడలు పాలు కుడుచునప్పుడు యజమానులకు చెప్పరాదు. ఈ రీతిగా పూర్వపు ఋషీశ్వరులు ఎన్నో ధర్మచట్టాలు నియమించారు.

పశువధలు – చర్మాల ఎగుమతులు

కండలుకరిగి, అఱ్ఱులుఅరిగి, నోటివెంట నురుగులుపడేవరకు మెడమీదికాడి విడవకుండా అర్రులు మంటలెత్తేవరకు భూమిదున్నాలి. ములుకోల ములుపోట్లతో పిరుదులు చిల్లులుపడేవరకు మోటతోలి తోటలను పెంచాలి. ఎన్నిరైళ్ళున్నా, ఎన్ని మోటార్లున్నా రవాణాకు ఎద్దులబండి, దున్నపోతులబండి అగత్యం ఉండనే ఉంది. ముఖ్యంగా దారి డొంకలులేని పల్లెప్రాంతాలలో ఈ అవసరం అనివార్యం. గొంతులో కొన ఊపిరి వున్నంత వరకు కష్టపడి బరువులు మోసి, భూమిని దున్ని, బక్కచిక్కి ప్రాణం వదలిన తరువాత కూడా, తమ యజమానిని మరచిపోని కృతజ్ఞత పశువులకున్నది. ఎండిపోయిన ఎముకలగూడువల్లను నామమాత్రంగా కప్పిన తోలువల్లనూ కూడా ఆదాయంవస్తుంది. పశువుయొక్క ప్రాశస్త్యాన్ని అవసరాన్ని వర్ణించలేం. పురాణాల్లో పూజాద్రవ్యమని వుంది. ఈనాడు రైతాంగానికి నిత్యవసరమైంది. అలాంటి పశుజాతిని కొందరు దుర్మార్గులు, ద్రోహులు తమ స్వలాభంకోసమై కడుపుకక్కుర్తికై వధించుకుతింటున్నారు. నిలువునా హత్యచేస్తున్నారు.

తమకు పూజనీయమైన గోవులను హింసించుతూవుంటే, నిలువునా హత్యచేస్తుంటే, చూచి సహించలేక అనేకచోట్ల హిందువులు పరప్రభుత్వానికి ఎదురుతిరిగారు. గోవధ నిలుపుచేయుటకు పోరాడారు. రాను రాను యీపశువధశాలలు మరింత అధికసంఖ్యాకంగా పెరిగిపోయాయి. పట్నాల్లో, పల్లెల్లో కసాయిదుకాణాలు వెలిసాయి. ప్రతిదినం వందలు వేలుగా పశువులు వధింపబడుతున్నాయి. రైతుకు పనికివచ్చేవి, లేక పనికి రానివనే విచక్షణలేకుండగనే వధించబడుతున్నాయి. మంచినెత్తురు కండరాలతోగూడిన మాంసంవుంటుందనే ఆశతో వయస్సులోనున్న పశువులే ఎక్కువగా చంపబడుతున్నాయి. ఇప్పుడుకొంచెం పెద్దదిగావుండే ప్రతిగ్రామంలోను ఒక కసాయిదుకాణం యేర్పడివుండటంవలన రైతుల బాధలధికమయ్యాయి. కఠిన హృదయులు, దుర్మార్గులగు కొందరు రాత్రివేళల దొంగతనంగా రైతుల సావిళ్ళ నుండి గొడ్లను తోలుకపోయి అమ్ముకోవడంతో రైతులకు కష్టమెక్కువైంది. కసాయి దుకాణాలు ఎక్కడికక్కడనే సమీపంలో వుండడంవలన దొంగలపని మరీ తేలికగావుంది. చీకటిపడగానే దొంగతనంగా తోలుకెళ్లడం, కసాయివానికి విక్రయించడం అతడు దాన్ని వెంటనే వధించడం పనులన్నీ తెల్లవారేసరికి పూర్తి అయిపోతున్నాయి. వేసవికాలంలో పశువుల్ని పొలాల్లో కట్టివేసే సమయంలో యీదొంగతనాలు మరింత ఎక్కుగా జరుగుతాయి. అప్పుడు రైతులపని మరీకష్టంగా వుంటుంది. రైతులెంతో బాధపడుతారు.

భారతప్రభుత్వపు సంవత్సర రిపోర్టుల వల్ల ప్రతిసంవత్సరం 2 కోట్ల 10 వేల గోవులచర్మాలు అన్నిరకాల వస్తువులకు తయారగుచున్నవనీ, అందులో 52 లక్షల 70 వేలు కసాయి భవనాలలో తయారగుచున్నవనియు తెలుపబడింది. ఇవి ప్రభుత్వపు అంకెలు. లైసెన్సులేకుండా యిండ్లలో చంపబడు గోవులసంఖ్య చేర్చబడలేదు. ఇవేగాకుండా 57 లక్షల 10 వేల గేదెల చర్మాలు తయారగుచున్నాయి. వీటిలో 13 లక్షల 30 వేలు కసాయిఖానాలలో తయారవుతాయి. మొత్తం 2,57,20,000 చర్మాలు తయారగుచున్నాయని ప్రభుత్వపు అంకెలు. వీటి ధర ఆరుకోట్లరూపాయలట.

మనదేశమునకు ఈచర్మములన్నియు అవసరంలేదు. 1,03,44,000 చర్మాలను విదేశాలకు పంపి 4 కోట్ల 25 లక్షల రూపాయలు సంపాదించుచున్నారు. ఒకకోటి 60 లక్షల రూపాయల చర్మమును మనము ఉపయోగిస్తున్నాము.

చర్మమేగాక గోవుల ఎముకలు, క్రొవ్వు, మాంసం, నెత్తురు, కొమ్ములు, గిట్టలు కూడ విదేశములు కోరుతున్నాయి. ఎముకలు, గిట్టలు, కొమ్ములు బహుశా ఎరువుగా మార్చబడుతున్నాయి. చంపబడిన గోవు యొక్క యితరభాగాలతో సరేస్, క్వినైన్ మున్నగు మందుబిళ్ళలు చేదులేకుండాచేయుటకు ఉపయోగ-పడుతున్నాయి. జలటిం, పెప్సిన్, పన్నీరు మున్నగునవి తయారుచేయుటకు, చక్కెరను శుభ్రపరచుటకు, పర్షియా సిరా చేయుటకు పై వస్తువులు ఉపయోగపడుతున్నాయి. మైనపువత్తులు, గుడ్డలకు గంజిపెట్టుటకు లక్షలకొలది మణుగుల కొవ్వుకావలసి వస్తూవుంది. నెత్తురుతో తడిపినపిండినే కాఫీతోటలలో ఎరువుగా వుపయోగిస్తారు.

మేకలకు గొర్రెలకు గర్భస్రావంచేసి ఆ పిండాలయొక్క చర్మాలతో వ్యాపారంచేస్తున్నారు. ఇదేవిధంగా చూడి ఆవులను చంపి ఆ దూడల చర్మాలను విదేశాలకు పంపుతున్నారు. పైగా ఈ చర్మాలకు గిరాకీ ఎక్కువట.

* * *

రెండవ భాగము

గోవే గృహలక్ష్మి

ఈనాటికికూడా గోమాతను పూజించే ఆచారం సజీవంగా అమలులోవుంది. కదురాడినా కవ్వమాడినా కరువుండదని సామెత. నేటికీ బంధువులురాగానే పాడివుందమ్మా అని పరామర్శచేయడం పరిపాటి. మొట్టమొదటి ప్రశ్నే అది. కవ్వముత్రిప్పి మజ్జిగ చిలికేపని లేకుంటే మన యిల్లాలికి చెయ్యి విరిగినట్లుంటుంది. ఆవుకు కోడెదూడపుడితే, తనకు కొడుకు పుట్టినంత సంతోషం రైతుకు. మన హైందవ సాంప్రదాయంలో కుమార్తె పెండ్లిచేసి అత్తవారింటికి పంపేసమయాన, ఆవును దూడను బహూకరించే ఆచారముంది. పూర్వం ఎక్కువగా నివాసగృహంకెదురుగానే పశుశాలలుండేవి. ప్రకృతిలోని ఆహారాలన్నిటిలోను సంపూర్ణమైన ఆహారము పాలే. ఎన్నికూరలున్నా నేతిచుక్కవాసన లేకపోతే నోటికి రుచించదు. ఎంతతృప్తిగా భుజించినా చివరకు పెరుగుతోనో, మజ్జిగతోనే ఒక ముద్దతినకపోతే తిన్నట్లుండదు. బలహీనతవల్లనో, బడాయివల్లనో, పసిపాపలకు పాలు ఈయకపోతే, జిలిబిలి చిరునగవులతోను, చిలిపిచేష్టలతోను చిదిమినపాల్గారు పాలబుగ్గలతోనుండరు. ప్రజలలో పెక్కుమంది శాకాహారులే. అందువల్ల పాలు మరింత అవసరమే కాదు అనివార్యంకూడాను. కాని మనకింత పశుసంపద వున్నాకూడా మనిషికి సగటు పాలు లెక్కిస్తే చాలతక్కువే.

ఈ దేశపు జనాభానుబట్టి పశుసంఖ్య పాశ్చాత్యదేశాలలోకంటె చాలా హెచ్చుగనున్నను, సగటున ఒక్కొక్క వ్యక్తికి రోజునకు 7 ఔన్సుల పాలకంటె మించి లభింపకున్నాయి. గోవు దినమునకు సగటున 1-3 పౌనుల పాలను, గేదె 3-4 పౌనుల పాలను మాత్రమే ఉత్పత్తిచేస్తున్నాయి. న్యూజిలాండులో మనిషికి సగటున 5-6 ఔన్సులు ఆస్ట్రేలియాలో 4-5 ఔన్సులుయుంటే మనదేశంలో 7 ఔన్సులుమాత్రమే. ఆధునిక శాస్త్ర సిద్ధాంతాల ప్రకారం, రోజుకు కనీసం 18 ఔన్సుల పాలయినా వుండాలి. ఈ కనీసమైన పాలు మనకు దొరకాలంటే, నేడున్న వుత్పత్తిని రెండింతలైనా చెయ్యాలి. సగటున మనదేశపు ఆవు 760 పౌనుల పాలిస్తుంటే, డెన్మార్కుదేశపు ఆవు సగటున 7 వేలపౌనుల పాలిస్తున్నవి. ప్రభుత్వం పూనుకొని పాలవుత్పత్తి అధికంచేసి, ఆరోగ్యకరమగు పాలు అందరికి అందేటట్లు చేయాలి.

వెన్న నెయ్యి ఉత్పత్తులు

పాలు, వెన్న, నెయ్యి, మజ్జిగ మానవులకు ముఖ్యమైన పరిపూర్ణమైన ఆహారం. మాంసమును ప్రధానంగా భుజించు దేశాలకు కూడా పాలు అత్యంత అవసరము. మాంసమును భుజించని వారి శరీరారోగ్యముల కాపాడుటకు పాలేకదా ఆధారము. పాడి పశువులసంఖ్య తక్కువగానున్న దేశాలలో పాలు తగినన్ని దొరకనందున, శరీరబలం తగ్గి పలురకముల రోగాలు మానవులను పీడించి క్షయ, కలరా మొదలగువ్యాధుల కలుగజేస్తున్నాయి. జ్వరాలచే ప్రతిసంవత్సరం లక్షలాదిజనులు మరణిస్తున్నారు. పాలుదొరకనందున మనదేశంలో యెక్కువ ఇందుకు కారణం తగిన పాలు, వెన్న, నెయ్యి దొరకకపోవడమే. మనదేశంలో పాలు, నెయ్యి దొరుకుచున్నపుడు మానవుల ఆయువు ఎక్కువగాయుండేది.

ప్రతిగ్రామంలో వృద్ధులెక్కువగా యుండేవారు. నూరు సంవత్సరాల క్రిందట మనదేశంలో ఆయుఃప్రమాణం 40 సంవత్సరాలుండేవి. ఈరోజు 23 సంవత్సరాలే. ఇంగ్లండులో 53 సంవత్సరాలు, జపానులో 44 సంవత్సరాలు. ఈరోజు మనదేశంలో ఏ ప్రాంతాలలో పాలు, నెయ్యి బాగాదొరకుచున్నవో, అచటి ప్రజల ఆయువు, బలము, ఆరోగ్యము ఎక్కువగాయున్నాయి.

సింధు, పంజాబు, రాజపుటానా, మధ్యభారతం, కతియవాడ, గుజరాతు, సంయుక్తప్రాంతాలలో దేశజనాభాలో నూటికి 42 వంతులున్నారు. అయితే దేశముయొక్క పాడిలో నూటికి 74 వంతు ఈ ప్రాంతాలలోనే. కనుక ఈ ప్రాంతపు ప్రజలు ఎక్కువ బలవంతులుగానున్నారు. బొంబాయి మధ్యదేశం, హైదరాబాదు, మద్రాసు, మైసూరు దక్షిణభారతంలో దేశజనాభాలో ప్రజలు నూటికి 37 వంతులున్నారు.

పాడి నూటికి 17 వంతులు మాత్రం వుంది. బెంగాలు, అస్సాంలలో జనసంఖ్య నూటికి 18 మందికి పాడి నూటికి ఆరు వంతులుమాత్రం వుంది.

ఇంగ్లాండులో వెన్న ఏ రీతిగా ప్రతివంటకు ఉపయోగిస్తారో, మన దేశంలో నేతిని మన వేపుళ్ళకూరలు, చిరుతిళ్ళు వగైరాలకు కూడా ఆ రీతిగానే ఉపయోగిస్తారు. ఆవునెయ్యి ఔషధాలకు వాడుతారు. గుళ్లోపూజకు దీపాలు పెడతారు. మరొక ఉపయోగం ఏమిటనగా ముక్కుపొడుము చేయడంలో నూటికి తొంబదిపాళ్ళు, వెన్న నెయ్యితయారౌతూంది. కొంతమంది వెన్నకొని నెయ్యి కాచుకుంటారు. మొత్తం నెయ్యిలో నూటికి 75 పాళ్లు యింటిలోవాడుకకు, చిరుతిండ్లకు 20 పాళ్లు, ఔషధాలకు 4 1/4 పాళ్లు మిగిలిన అరపాలు గుళ్ళలోకి, ముక్కుపొడుము తయారుచేయడానికిని అంచనావేయబడింది. ఇంగ్లండులో మనిషికి సాలీనా 25 పౌనుల వెన్న వాడుతుంటే, మన నేతివాడుక 14–10 పౌనులు మాత్రమే. గ్రామాలలోవాడేది 8, 10 పౌనులే. పట్టణంలోని ప్రజలు పల్లెగ్రామాలలోకంటె ఎక్కువ వాడుతారు. తెలుగువారు అరవవారికంటె రెట్టింపునెయ్యివాడుతారు. మద్రాసుపట్టణము సాలీనా 14,248 మణుగులనేతిని దిగుబడి చేసుకుంటుంది. నెయ్యి దక్షిణాదినుంచి, వెన్న గుంటూరు, గుడివాడ, రేపల్లెలనుంచి వస్తుంది. దేశమంతటా అగ్రకులస్థులే ఎక్కువ నెయ్యివాడేది. సాధారణప్రజలకు, కూలినాలిజనానికి నెయ్యి దొరకదు.

మన హిందువుల గృహాలలోనే నేయి తయారౌతుంది. మన దేశంలో తయారయ్యే నెయ్యి (7 లక్షల మణుగుల వనస్పతి కలుపుకోని) సాలీనా 200 మణుగులుంటుంది. దానివిలువ 100 కోట్లరూపాయలు, మన రాష్ట్రం ఉత్పత్తి 8,88,450 మణుగులు. ఖరీదు 3 కోట్ల 50 లక్షల రూపాయలు. గేదెనెయ్యి మూడు భాగాలుంటే, ఆవునెయ్యి ఒక పాలుంటుంది. గుంటూరు, నెల్లూరు, కృష్ణ, కర్నూలు, కడపజిల్లాల ఉత్పత్తి, మొత్తం రాష్ట్రం ఉత్పత్తిలో నూటికి 38 పాళ్లుంటుంది. వీటిలో గుంటూరుది హెచ్చు 12 1/2 పాళ్లుంటుంది.

గేదెలు విస్తారంగా అక్టోబరు, మార్చినెలలలో ఈనుతాయి గనుక డిశంబరు, మార్చినెలలలో నేయి ఉత్పత్తి ఎక్కువ.

మద్రాసు రాష్ట్రానికి ఏటేటా 2,798 మణుగుల వెన్న 395 మణుగుల నెయ్యి బొంబాయి, మైసూరు, రాజపుటానాలనుంచి దిగుమతి అవుతుంది. ఎగుమతి అయ్యే నెయ్యి 1,13,262 మణుగులుంటుంది. విస్తారంగా బెంగాలు, బీహారు, ఒరిస్సా, మైసూరులకు వెళుతుంది. అన్ని జిల్లాలకంటె గుంటూరు ఎగుమతి 88 వేల మణుగులు. సిలోను, మలయా ప్రాంతాలకు కొద్దిగా ఎగుమతివుండేది. యుద్ధానికిపూర్వం వెన్న, నెయ్యి ధరలు తక్కువే. వనస్పతి వగయిరాలు కలపడం మరొక కారణం.

నేతిలో కలగలుపున్నంతగా మరే సరుకులోనూ వుండదు. ఇదివరలో జంతువుల క్రొవ్వు కలిపితే కాచినప్పుడు వాసనవలన సులభంగా తెలిసిపోయేది. ఇప్పుడు వనస్పతి వచ్చింది. రసాయనిక పరీక్ష వలన గాని కలగలుపు తెలియకుండావుంది. అందుచేత అంతా షాహుకార్ల దయతో వుంది. ఒకసారి బళ్లారిలో నలుగురు షాహుకార్ల సరుకు 206 డబ్బాల పరీక్షచేస్తే నూటికి 90 పాళ్లు విదేశక్రొవ్వు అని తేలింది. మునిసిపాలిటీలలోకూడ నూటికి 48 పాళ్లు కల్తీనెయ్యి, దేశంమొత్తంమీద నూటికి 80 పాళ్లు కల్తీనెయ్యి! దీనికి ప్రాయశ్చిత్తం జరిమానాలేగాని ప్రస్తుతం పరీక్షింపబడే నమూనాలు చాలా తక్కువ.

వనస్పతితో చేయబడిన నెయ్యి, పాలపొడిడబ్బాలు, పాలనుండి వెన్నను వేరుచేయగా మిగిలిన పాలవలెనుండు ద్రవపదార్థముయొక్క ప్రచారంవలన గోవుల అవసరం తగ్గింది. వనస్పతినెయ్యి అసలు నేతితో కలుపుటవలన అసలు నెయ్యికి పాలకు స్థానంలేకుండాపోతూవుంది. గోవులను పెంచుట లాభదాయకం కాదని కొందరభిప్రాయపడుతున్నారు. డాల్డా మొదలగు వనస్పతి ప్రచారంవలన అసలు నెయ్యి బజారునుంచి అదృశ్యమైతే, నాగలిని, బండ్లను లాగుటకు ఎద్దులులేకుండా మన వ్యవసాయానికే మోసం రానున్నది. మంచి మంచి జాతిపశువులు నాశనం చేయబడుతున్నాయి. గొడ్డుబోతు ఆవులను, బలహీనంతో గర్భంధరించలేకపోయిన కసాయివానిచేతిలోనికి పోతూవున్నవి. ఎనిమిది, పది సంవత్సరాలు ఉపయోగపడాల్సిన గోవులు రెండుసంవత్సరాలే జీవించుతున్నవి. రెండుదూడలను పెట్టితే ఒకదూడ కసాయికి పోతుంది. ఈ మహాఘోరాన్ని మన ప్రభుత్వం చట్టాలతో ఆపినప్పుడే మన పశుసంపద బాగుపడుతుంది.

వ్యవసాయానికి ట్రాక్టర్లు

ట్రాక్టర్లను యంత్రసహాయముతో వ్యవసాయం చేయటం వలన రైతునకు కష్టం, ఖర్చులు తగ్గుటేగాక పని త్వరగా తేలుతుంది. కాని అందువలన భూమి ఇప్పటికన్న సారవంతమౌతుందన్న మాట పొరపాటు. దున్నబడకుండా నున్న భూమినికూడా దున్ని విత్తనాలు చల్లుటకు యంత్రపరికరాలు సహాయమున లాభంకలదు. అందువలన వ్యవసాయం లేని కారణాన బీళ్లయి బిరుసెక్కిన భూములుకూడా పంటల నీయగలవు. ఎక్కువభూమి యంత్రసహాయంతో సాగుచేయునపుడు, కర్షకుడు తనకున్న కొద్దిభూమిపై తీసుకుంటున్న శ్రద్ధ కవకాశం వుండదు. యంత్ర సహాయంతో నడుపబడు వ్యవసాయంవలన భూమి వట్టిపోవచ్చుననే అభిప్రాయం ప్రొఫెసర్ ఆల్బర్టు ఐన్‌స్టీన్ అను విజ్ఞానవేత్త బలపరిచాడు.

యంత్రాలను కొనడానికి పెద్ద పెట్టుబడులుండాలి. ఆ యంత్రాల శక్తికి తగినంత భూమియుండాలి. అప్పుడే యంత్రం వ్యవసాయానికి లాభకారి అవుతుంది. కాని వడ్లుపండించే వరిపొలాల వ్యవసాయానికి ట్రాక్టర్లు ఉపయోగించవు. యంత్రసహాయమున వ్యవసాయపు ఖర్చులు చాలా తగ్గుతాయని కొందరు భావిస్తుంటే కొందరు గ్రామాలలోనున్న కూలిజనానికి నిరుద్యోగసమస్య ప్రాప్తిస్తుందని భయపడుతున్నారు. విదేశాలలో పెద్దపెద్ద యంత్రాలవలన పరిశ్రమల నభివృద్ధిపరచి, ప్రజల ఆర్థికస్థితిని పెంపొందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాని మనం ఈ విషయాన్ని బాగా పరిశీలించిన తరువాతనే దీనిని స్వీకరించాలి. ఇది జయప్రదంగా జరగాలంటే అనేక విషయాలు అనుకూలం కావాలి, ప్రకృతి తోడ్పడాలి, పెద్ద పెట్టుబడి కావాలి, కూలిజనం సహకరించాలి.

బ్రిటన్‌లో ఆర్థికవిప్లవమప్పుడు పెట్టుబడికి కావలసినంత ధనం వుంది. అమెరికాలో కూలిజనం తక్కువ కావడంవలన, అచ్చట యంత్రం సహాయంతో వ్యవసాయానికి ఉపయోగకారి అయింది. అమెరికా వారు కూలిని తగ్గించి పంటలనభివృద్ధిలోకి తెచ్చారు. కాని కూలిజనం నోటిదగ్గర తిండిపోగొట్టే యంత్రాల వలన పల్లెటూళ్లలో నిరుద్యోగసమస్య ప్రబలమౌతుంది. కూలిజనం సమృద్ధిగానున్న మనదేశంలో యంత్ర పరికరాలతో వ్యవసాయానికి పెట్టుబడికి కావలసినంత ధనం లేనందున అమెరికా, బ్రిటనుల మార్గం మనకు ఆచరణీయం కాదని తోస్తుంది.

సంయుక్త పరగణాలలో 45,000 ఎకరాల బీడు పొలమును ట్రాక్టర్లతో వ్యవసాయానికి వచ్చేట్టు ఆరు మాసాలలో చేయడం జరిగింది. ఈ పద్ధతే మానవుల సహాయంతో కొన్ని సంవత్సరాలు పట్టేది. మధ్యయూనియన్‌లో 1,50,000 ఎకరాలభూమిని సాగుక్రిందకు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఇది ట్రాక్టర్లతో మాత్రమే సాధ్యమవుతుంది. దక్షిణదేశంలో కొన్ని అడవుల్నికూడా ట్రాక్టర్ల నుపయోగించి వ్యవసాయానికుపయోగించేలాగున చేయవచ్చు. తిరువాన్కూరు సంస్థానంలో నీళ్ళు నిలువ యుండే భూములకు యంత్రసహాయం లభించి అందులోని నీళ్ళుతోడి బైటికి పంపబడి, ఆ పొలాలు వరిపంటలకు ఉపయోగపడుతున్నవి. మొనలోతునీటిలో పూర్వము యీ భూములు ఎద్దులవలన సాగుచేయ బడేవి. ఇప్పుడా యవసరమేమియు లేదు.

అమెరికా, రష్యాలవలె పంటలు పండించాలంటే మన దేశంలో ఇప్పుడు ప్రారంభింపబడిన ఎస్టిమేటు ఫారములు అభివృద్ధికావాలి. వ్యవసాయం ఆహారమొసగే పరిశ్రమ కావడంవల్ల, ప్రతిదేశంలో దేశనాయకులు, శాస్త్రనిపుణులు తమ దృష్టిని వ్యవసాయాభివృద్ధిపై నుంచుతున్నారు. మన దేశంలో వ్యవసాయవృద్ధి కావాలంటే, ఇప్పుడున్న సాంఘిక ఆర్థిక పరిస్థితుల్ని ప్రభుత్వ శాసనాలద్వారా మార్పించాలి. అప్పుడు మనంకూడ విదేశాలవలె వ్యవసాయాభివృద్ధికి మార్గాలను చేపట్టి ఇంకా ఎక్కువపంటలు పండించే మహదవకాశం మనకు లభిస్తుంది.

నీళ్ళు తోడే సాధనాలు

పండ్రెండు అడుగులలోతునుంచి నీరుతోడుటకు ఉపయోగపడుతున్న పనిముట్లలో "మోట" ప్రాచీనమైనది. దీనిని నడుపుటకు అలవాటయిన ఒకటి రెండు జతల పశువులు, సమర్థతగల నేర్పరులగు రైతులు యిద్దరు కావాలి. బొక్కెనత్రాడు తెగుచుండుటవలనగాని, తోడేమనిషి పశువులయొక్క నడకలోగల లోపములబట్టిగాని ప్రమాదాలు వస్తూ వుంటాయి. మోటకట్టిన పశువులు, రెండుమూడు సంవత్సరాల అనంతరం బలహీనమై పాడయిపోతాయి. కూలి పశుబలం చాలని యీరోజుల్లో, కనపడని ఖర్చు శ్రమ ప్రమాదంతోకూడిన యీ పనిముట్లు వాడేటట్లుగాలేవు. మోటకు వలయు సామగ్రికూడ దొరకుట కష్టంగా వుంది.

ప్రస్తుతం వాడుకలోనున్న నీరు తోడుసాధనాలలో గూడ, కారెము – రెండు అడుగులలోతునుండియూ, నత్తగుల్ల పంపులు నాలుగు అడుగులలోతును తడియు నీరు లాగుటకు ఉపయోగిస్తున్నారు. కాని, వీని నడుపుటకు దినానికి యిద్దరు మనుష్యులవసరం. విశేషంగా నీరురాదు. అలవాటులేనివారు, దార్ఢ్యంలేనివారు, యివి నడుపుటకష్టం. పది పన్నెండు అడుగులనుండి నీరుఎత్తుటకు ఏతముగాని, తిరుగుడుమోటగాని, ఉపయోగపడుతూవుంది. ఈ పద్ధతికూడ కూలీలయొక్క శక్తి, నేర్పరితనం, ప్రయాసంకోరునేగాని, ఒక మోటకుమించిన నీటిని లాగలేవు. ఇక చేదలమోట యనునది ఇప్పుడిప్పుడే రైతులచే ఆకర్షింపబడుచున్నది. ఇది నలభై, నలుబదిఅయిదు అడుగుల లోతునుండికూడ నీరు తోడుటలో బహు అనుకూలమైన పనిముట్టుగా కనబడుతోంది. ఈ యంత్రమును అమర్చిననాడే తప్ప, ఇది మరల యే యితరఖర్చులను సాధారణంగా కోరదు. ఏ మిల్లునుండియైనా వూరకే విడిచిపెట్టే మిగిలిన ఆయిల్‌తో నెలలూ సంవత్సరాలూ గడుపవచ్చు. రైతుకు చేతగాకున్న గ్రామకమ్మరి చేతగాని మరమ్మతులుండవు. నమ్మకంగా, తేలికగా ప్రమాదరహితంగా మూడునాలుగు మోటల పరిమాణంగల నీటిని ఏకప్రవాహంగా నడుపకలదు. ఈ యంత్రాలవలన ఆర్థికలాభాలు కలగడమేగాకుండ, పశువులకు, రైతులకు మేలుకలుగుతుంది. కాని తక్కువ భూములమీద ఆర్జించేవారికన్న, ఎక్కువ భూములుగల భూస్వాములకు ఇట్టివి అత్యవసరం.

కాని మోటతోలే ఎద్దులకు సాధారణంగా మెడపైనుండే చర్మం పగిలి దానిలోనికి ఏదైన మురికిపదార్థం పోవుటవల్లగాని, ఒక గంటువల్లగాని, మరొకవిధమైన దెబ్బవలనగాని పుండ్లు ప్రారంభమౌతాయి. అందుచేత మోటతోలే కాడిబరువును సమతూకంగా అంతటా సర్ది ఉంచాలి. మెరకపల్లాలు లేకుండా మోటతోలేగోయి చదునుగానుంచి జాగ్రత్తగా తోలాలి. మోటతోలే ఎద్దులకు వేళల ప్రకారం తగినంత మేత దాణాలు పెట్టాలి.

మన జీవితాంశములో పశువులకు ప్రత్యేకస్థలముంది. మనలో చాలామంది మత్స్యమాంసాదులను తిననివారుండడముచేతనేమి, పుట్టిన పాప మొదలు పండు వృద్ధులవరకు ఆరోగ్యముగా నుండవలెనన్న సులభముగా జీర్ణమగు సంపూర్ణాహారము కొరకేమి, మనకు కావలసినవి ముఖ్యముగా పాలు. మనదేశ

ప్రజలు ముప్పాతికభాగము వ్యవసాయముమీదనే ఆధారపడియుండుటవలన పొలముపనులన్నిటికి తప్పకుండ పశువులు కావలసివున్నవి. అందువలన హిందువుని ఇంటాబయట కూడ పశువుతో సంబంధం యేర్పడియున్నది.

1941 సంవత్సరం జనాభాప్రకారము మనదేశంలో 20 కోట్ల 82 లక్షల పశువులున్నాయి.
వాటిలో ఆడపశువులు 7 కోట్ల 44 లక్షలు.
మగపశువులు 6 కోట్ల 85 లక్షలు.
మూడు సంవత్సరముల వయస్సుగలవి 6 కోట్ల 82 లక్షలు.
పాలు ఈయని పశువులు 50 లక్షలు.
వట్టిపోయినవి 3 కోట్ల 54 లక్షలు.
మిగిలిన పాడిపశువులు 3 1/2 కోట్లు.

ఇంతేగాక ఆవులు, గేదెలు కలసి సంవత్సరమునకు 6 కోట్లమణుగుల పాలను యిస్తున్నాయి. ఒక్కొక్కమనిషికి అరపౌనుపాలు, అరపౌనువెన్న, నెయ్యి, పెరుగు వగైరాలుగా సరిపోవునట్లు చేయాలంటే యిప్పటి పాలసంపదను కనీసం మూడురెట్లు హెచ్చుచేయాలి. లేగదూడలకు గూడ పాలుకావాలంటే సంవత్సరమునకు 21 కోట్లరెట్లు మణుగులపాలు కావాలి.

పట్టణములలోను, కార్మికసంస్థలవంటి ప్రత్యేక స్థలములలోను పాలకు, పల్లెలలో పాలకు పొలము పనులకుకూడ ఒత్తిడి కల్గుచున్నది. ఎక్కువ పాలనిచ్చు ప్రత్యేకజాతి పశువులనుగాని పొలముపనికి పనికివచ్చు ఇతరజాతులనుగాని ప్రత్యేకంగా పెంచదగిన అవస్థ మనదేశంలో ఇప్పుడులేదు. ఇకముందు వచ్చునట్లు కనపడదు. అందుచేత మన స్థితిగతులను చూచుకొని అభివృద్ధి పరచవలసిన పశువులలో పాడికి, పంటకు రెండింటికి సమానశక్తితో ప్రయోజనముగానుండు ఉభయప్రావీణ్యంగల పశుజాతులు కావాలి. మన పశువులను అభివృద్ధిపరచాలంటే ముఖ్యంగా మూడు పద్ధతులపైన పనిముట్లు నడుపవలసియున్నది.

మొదటిది మన అవసరములకు, పరిస్థితులకు తగిన పశుజాతి. (దీనితోకూడినది ఆ ప్రత్యేకజాతి పోషణ) రెండవది పశువుమేత. మూడవది పశువుల ఆరోగ్యము (రోగనివారణ మున్నగునవి.)

మనదేశంలో యున్న జాతులలో కొన్ని పాడికి పేరుగాంచినాయి. మరికొన్ని బండ్లులాగుటకు, బలమగు పనులు చేయుటకు, కొన్ని పొలముపనులకు పేరుగాంచినాయి. పొలంసాగు, పాడిపశువు, పంటయొక్క పరస్పరక్షేమాన్ని కోరుతూ ఒకదానితో నొకటి ముందడుగువేయు కార్యకలాపమే మిశ్రమసేద్యం లోని మూలసూత్రమైయుంది. అందుచేత మన పశుసంపద అభివృద్ధి చెందాలంటే మన ప్రణాళికలన్నీ "ఎక్కువ పాలు, వన్నె కెక్కినజాతి పెంపకము, సరియైన ఆహారముతో పశుపోషణ" అను మూడుకాళ్ళగల ముక్కాలిపీటపై సాగాలి. అప్పుడే మనకు మూడు మూర్తులా పశుసంపద హితోధికమవుతుంది.

మనదేశము పాలతోను తేనెతోను పొంగిపొరలుతుండేదని ప్రతీతి. పురాణములలో పాలసంద్రమే యున్నదని సూచన. ఒక కుటుంబము ఒక గ్రామము లేక దేశముయొక్క సంపద గోసంపదపైననే లెక్కించబడి యుండేది. ఆ యాచారమునుబట్టి యిప్పటికిని పశువులకు "సొమ్ము"లని వాడుతారు. ఇపుడు అవన్నీ కలలో కథలుగా కన్పట్టుతున్నాయి. ఈ దురవస్థకు కారణాలను అర్థంచేసుకొని "మిశ్రమ సేద్యం" మూలమంత్రంతో పాడికి పంటకు ఉపయోగపడు ఉభయప్రావీణ్యంగల పశుజాతులను పెంచి దేశసౌభాగ్యాన్ని పునరుక్తంచేసి పోయినసొమ్మును తిరిగి పొందాలి.

భారతదేశంలోని పశుగణాభివృద్ధికి, పాడిపరిశ్రమాభివృద్ధికి సాధనోపాయాలను సూచించుటకై ఒక కమిటీని ఈ మధ్యకాలంలో నియమించారు. కమిటీ అధ్యక్షులు శ్రీ డా॥ నార్మన్ సి. రైట్‌గారు నవంబరునుంచి మార్చివరకు దేశంలో పర్యటనమొనర్చి ఈ రీతిగా తెలిపారు. సంవత్సరాదాయం పశువుల మూలంగా సుమారు 1900 కోట్ల రూపాయలని తేల్చారు.

పాలు, పెరుగు మొదలగువాని వలన	810	కోట్లరూపాయలు
వ్యవసాయపు పనుల వలన	612	"
ఎరువుల వలన	270	"
వ్యవసాయేతరపనుల వలన	161	"
తోళ్ళు చర్మం ఉన్ని మాంసం వలన	45	"

మద్రాసురాష్ట్రంలో పశుగణము వలన వచ్చు ఆర్థికం

వ్యవసాయం వలన	30	కోట్లరూపాయలు
ఎరువుల వలన	57	"
పాలు, పెరుగు, నెయ్యి మూలాన	58	"
రోడ్డు, ట్రాన్సుపోర్టు మూలాన	10	"

ఇంతియేగాక ఎముకలు, చర్మాలు, కొమ్ములు, గోరోజనం వగైరా అమ్ముట వలన కొన్ని కోట్లు వస్తున్నాయి.

వ్యవసాయ విషయంలో దేశంమొత్తంమీద అగ్రస్థానం వహించిన దేశం ఉత్తరప్రదేశమనవచ్చును. ఈ దేశంలో వ్యవసాయానికి పనికివచ్చే ఎద్దులు, దున్నలువగైరా పశుసంపద ఈ ప్రదేశంలోవుంది. ఇంకను ఈ రాష్ట్రంలో గొఱ్ఱెలను మేపుట, ఉన్నిని ఉత్పత్తిచేయడం ఎక్కువ. గుఱ్ఱాలు, పొట్టి గుఱ్ఱాలుకూడ ఇక్కడ ఎక్కువగా వున్నాయి. అన్ని దేశాలకంటె అస్సాంలో గాడిదలు తక్కువగా ఉన్నాయి. ఉత్తరప్రదేశంలో గాడిదలు అధికంగా వున్నాయి. బర్రెలుకూడ ఈదేశంలో ఎక్కువగావున్నాయి. బీహారు రాష్ట్రంలో గుఱ్ఱాలు ఎక్కువగా వున్నాయి. ఈ రాష్ట్రంవారు విదేశాలనుంచి కొన్ని లక్షల ఖరీదుచేసే గుఱ్ఱాలను తెప్పించుతారు. ఒంటెల, మేకల విషయంలో రాజస్థానంలో, పందుల విషయంలో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానం వహించాయి.

ప్రపంచంమొత్తంమీద పశువుల సంఖ్య రష్యామినహా 1,73,800 పశుసంపద విషయంలో అమెరికా 1,77,11,000 ప్రపంచం మొత్తంమీద ఈ దేశం ద్వితీయస్థానం ఆక్రమించింది. చైనాదేశం మూడవది (13,40,86,000) ఆస్ట్రేలియా నాల్గవది (11,87,64,000).

మనభారతదేశంలో మాత్రమున్న పశువుల సంఖ్య 25,62,65,000 మాత్రమే. మనదేశంలో జనాభా ప్రకారం తలకు సగటున 0.74 వంతున పశువులున్నాయి. ప్రపంచపు సరాసరిసంఖ్య 0.82. ఈవిషయంలో న్యూజిలాండు (21.05) ప్రపంచంలోకెల్లా అగ్రస్థానం వహించింది. రెండవది ఆస్ట్రేలియా (15.56) చెప్పవచ్చు.

ఆబోతుల విషయంలో చెన్న రాష్ట్రం అగ్రస్థానం వహించింది. 93.278 న్నీ బొంబాయి రాష్ట్రం (72.90) రెండవదిగా వహించింది. ఆవుల విషయంలోగూడా ఉత్తరప్రదేశ్ (23,62,833) అగ్రస్థానం వహించింది. రెండవది మరల చెన్న రాష్ట్రం (18,81,210) మూడవది బీహారు (15,36,822).

మొత్తంమీద పశుసంపదలో దేశంలోకెల్లా ఉత్తరప్రదేశ్ (2,16,96,045) మొదటిదిగానూ, చెన్న రాష్ట్రం (1,65,63,020) రెండవదిగానూ అగ్రస్థానాలు వహించినాయి. ఇంకను పనిచేసే ఎద్దుల విషయంలో మదరాసురాష్ట్రము (10,14,161) ప్రథమమున్ను, రెండవది ఉత్తరప్రదేశ్ (8,33,107) యున్ను, బర్రెల విషయంలో ఉత్తరప్రదేశ్ (87.92.131) మొదటిదిన్నీ, రెండవది చెన్నరాష్ట్రము (63,30,015) న్ను ప్రసిద్ధికెక్కినాయి. పై లెక్కలు 1949–1950 లో ఇండియాగవర్నమెంటు ప్రకటించిన లెక్కలనుబట్టి తీసికోవడ మైనది.

* * *

మూడవ భాగము

గోసంరక్షణ సంఘాలు

అనాథగోవులకు, వట్టిబోయిన పశువులకు ఈ సంఘాలను రక్షకస్థానాలంటారు. గోశాలలన్న, పశుశాలలన్న కేవలం పశువుల సంపన్నగృహాలు. ఈ సంస్థలు రెండు భారతసాంస్కృతిక జీవనజ్యోతులు. రెండు శతాబ్దాలక్రితం భారతీయులు కనివిని యెరుగనట్టి గోవధలు ఈనాడు సహజాలైనాయి. దీనికి కారణం ఆర్థికదుస్థితి, అన్యమత సంపర్కాలు, గోకళేబరాలు, తద్వారా ఉత్పత్తియగు సరకుల వ్యాపారం. ఈనాడు గోదధి, గోక్షీర, ఆజ్యవ్యాపారాదులు జోరుగా సాగుతున్నాయి. అవివేకంగా జరుగుతున్న వధస్థానాల నుండి రక్షించడానికి యౌవనమనక ముదిమిని పాటింపక జీవితాంతంవరకు మానవసేవయొనర్చి కృశించి దీనావస్థయందున్న గోవులకు పోషణకల్పించడానికి భూతదయాపూరితాలైన గోశాలలు, గోసంరక్షణ సంఘాలవంటి మహాసంస్థలు నెలకొల్పబడినాయి. ప్రస్తుతం మనదేశంలో 60 లక్షలరూప్యముల సాలుసరి వ్యయప్రయాసల ఫలితంగా 6 లక్షల గోమాతలు మూడువేల గోశాలలలో తలదాచుకొంటున్నాయి. వీటిలో 50 చెన్నరాష్ట్రంలోను, 20 ఒరిస్సాలోను, 15 హైదరాబాదురాష్ట్రంలోను 20 మైసూరుసంస్థానంలోను పోషింపబడుతున్నాయి. అనగా నూటికి 95 ఆర్యసాంప్రదాయపరులు గల దక్షిణాపథం, నూటికి మూడు గోసంరక్షణాలయాలు నిర్మించుకొన్నది. ఇట్టి సంస్థలలో పెరుగుతున్న గోవులందు 20 వంతులు జవసత్వములుగల క్షీరదాతలుగా అంచనావేయబడినాయి. ఇంకను 20 వంతులు సంతానోత్పత్తికి తయారవుతున్నాయి. మరియొక 20 వంతులు ముదుసలివై కాళ్లుజాచుకొంటున్నాయి. ఈరీతిగా ఆరులక్షల గోవులలో ఒక లక్ష 20 వేల క్షీరోదారకాలుగను, మరియొక లక్షాఇరువదివేలు సంతానోత్పత్తిప్రదాలుగను, మిగిలిన మూడులక్షల అరువదివేలు ప్రయోజనరహితాలుగను వున్నాయి. గోసంరక్షణాలయాలను సక్రమంగా నడిపిన లక్షమణుగుల పాలు అధికోత్పత్తి చేయవచ్చునని అంచనావేయబడింది. ప్రతిసంవత్సరం 25 వేల కోడెదూడలు గోశాలలందు ఉత్పత్తియై పశుజాతి నభివృద్ధిపరచుటకు గ్రామసీమలయందు గోశాలల నేర్పరచిన ఎంతయో ఉపయోగకరంగా వుంటాయి. ఇంతేగాక ప్రతిసంవత్సరం 25 వేల వృషభాలను వ్యవసాయానికి తయారుచేయుటకు 50 వేల గోవులను ఉత్పత్తిచేయుటకు గోశాలల నేర్పరచవచ్చు. ఈ గోశాలలలో ఇంకను పట్టణాలలో వట్టిబోయి బజారులలో తిరిగే గోవులనుకూడ జాగ్రత్తగా పెంచి ఆరోగ్యవంతమైనవిగా చేయవచ్చు.

గోసంరక్షణ సంఘాలు పట్టణాలలో వుండుటవలన అందుండే పశుపోషణ, ఖర్చు ఎక్కువగుతున్నది. ఇంకను లెక్కకుమించిన గోవులను శాలలయందుండుటచే ఆహార, శయ్యాది వసతులు తక్కువై వాటి కడుపునిండా ఆహారం దొరకుటలేదు. దేశానికుపయోగపడు గోవులను వాటితో కలిపియుంచుటవలన సరియగుపోషణలేక నిరుపయోగమౌతున్నాయి. భూవసతి, తగినంత బీడుభూమిలేకపోవుటవలన పశువులు విశ్రాంతిగ తిరుగుటకు వీలులేకుండా వుంది. కొన్ని సంఘాలకు ధనం లేకపోవుట, మరికొన్ని సంఘాలు

ధర్మచందాలు ప్రోగుచేసి సరియగు అజమాయిషీ పుచ్చుకొనకపోవుటవలన ఈ గోసంరక్షణ సంఘాలు వృద్ధిలోనికి రావటంలేదు. ఈ సంఘాలలోవుండే కొందరు నౌకర్లు, గుమాస్తాలు కూడ వాటి పాలను త్రాగుతూ వాటి మలమూత్రాదులనమ్ముకొని జమాఖర్చులు తమ సంఘాధ్యక్షులకు తెలుపక దిగమింగేవారు కూడా ఉన్నారనటంలో సందేహంలేదు. గోమాహాత్మ్యం తెలిసిన మనుష్యులు ఈ నీచకార్యాలకు తోడ్పడరు. అందుచేత గోసంరక్షణసంఘా లేర్పరచే పుణ్యాత్ములు ఏ పూటకాపూట అజమాయిషీ తీసికొని గోసేవ చేయుదురుగాక.

పశుశాలలు వాటి శుభ్రత

రైతుకు పశువులే ధనం, అవి అతనికి బిడ్డల్తో సమానం. వాటి క్షేమమే తనక్షేమంగా చూచుకుంటాడు. అనుభవంగల రైతు పశుపోషణలో జాగ్రత్త వహిస్తాడు. పశువులు నివసించే శాలలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా వుంచుతాడు. పశువులుండే పాకలు గాలికి పడిపోయేవిగా నుండరాదు. పాకలు వేయుటవలన అగ్నిభయానికి కూడా తావుగలదు. వేసవిలో ఎన్నోగ్రామాలలో ఇట్టి శాలలు తగులపడి పశువులు మరణించే వార్తలు వింటున్నాము. మనము నివసించే గృహములెంత దిట్టంగా, పరిశుభ్రంగా వుంటాయో, అట్లే పశుశాలలు గూడా వుండాలి. పశువుల కొట్టాలు పేడ, మూత్రాలతో కంపుకొడుతూ, అపరిశుభ్రంగానుండిన పశువులకే గాక, పరిసరముల నివసించే వారికిగూడా వ్యాధులు సంప్రాప్తిస్తాయి. అందుచే పశుశాలలు మట్టివిగా గాక విదేశాలలోవలె గచ్చుచేయించుట, వాటిని ప్రతిపూట సున్నపునీటితోగాని, తదితర లోషన్సుతో గాని కడిగి శుభ్రంచేయించుట మంచిది. అటుల శుభ్రం చేయుటవలన పశువులకు గోమారులు, బుడ్డపుంజులు, దోమలు, ఈగలబాధ తప్పిపోతుంది.

పశువులు నివసించే చావడి విశాలంగా వుండాలి. అందులోకి గాలి, వెలుతురు వచ్చే అవకాశం ఎక్కువగా వుండాలి. అంతేగాని అది చీకటికొట్టుగా నుండకూడదు. మనుష్యులకువలెనే పశువులకుకూడా గాలి ఎండా అవసరమని ప్రతిరైతు గుర్తించాలి. అడవులలోయుండే పశువులు చావడులలోనుండే పశువుల కంటె ఆరోగ్యవంతంగా ఉంటాయంటే అందుకు కారణము స్వచ్ఛమైన గాలి, తగినంత ఎండా లభిస్తుంది. స్వభావసిద్ధమగు పచ్చికసవు సమృద్ధిగా వుంటుంది. ఆకలి కలిగినపుడల్లా మేయడానికి వాటికి అనువుగా వుంటుంది. ఎండబాధ తట్టుకోవడానికి అవి అరణ్యాలలో పెద్దపెద్ద చెట్లనీడల విశ్రాంతి తీసికొంటాయి.

అరణ్యాలలో పశువులు మనుష్యులచే పెంచబడకపోయినా అవి ఆరోగ్యంగా వుంటుంటే, సర్వవిషయాలు తెలిసికొనశక్తిగల మానవుడు పశువుల్ని కొట్టాలలో కట్టివుంచినప్పటికి అంతకంటే బాగా పెంచుటకవకాశాలున్నాయి.

చావడులలో పశువుల్ని ఒకదానినొకటి దూరదూరంగాకట్టి వాటి జీర్ణశక్తిని కనిపెట్టి అందుకనుగుణంగా బలవర్ధకమైన ఆహారాలు మేపుతుండాలి. కొట్టములలో పశువులు మేతమేయుటకు ఒకగాడిని కట్టించి అందు పచ్చియెండుమేతలు వేయుచుండిన ఆ మేతను పశువులు తిన్నంత తిని మిగిలినది త్రొక్కి అందులోనే

మలమూత్రాదులు విడచి వృధాగా పాడుచేయవు. పాలిచ్చే ఆడపశువులు పచ్చిమేతలుమేసే పాలుసమృద్ధిగా నిస్తాయి. ఆకారణాన పిల్లిపెసర తదితర మేతలు వాటికి తగిన పరిమాణంలో వేయాలిగాని అధికంగా మేపితే వాతంచేసి రోగగ్రస్తమౌతాయి.

భూస్వాములు పశువుల పోషణకు పాలేళ్లను నియమిస్తారు. జీతానికి పనిచేసేవారు పశువులు తనవి కావని వాటిపట్ల నిర్దాక్షిణ్యత చూపకూడదు. అతను పశుపోషణలో అనుభవంకలవాడై యుండాలి. అనుభవం కలవాడైతే నోరులేనిపశువు ఆరోగ్యంగా వున్నదీ లేనిదీ వెంటనే తెలుసుకోగలుగుతాడు.

పశువులచేత చాకిరి చేయించకుండా సరదాకోసం తెగబలవడం కోసం మేపడం భావ్యంకాదు. అట్టి పశువులకు పరిశ్రమలేక తిన్న ఆహారం సరిగాజీర్ణమై పుష్టినీయదు. పశువులుకూడా మంచి అలవాట్లు నేర్పితే అవి వాటికలవాటు పడతాయి. పశువుల నన్నింటినీ శ్రద్ధతో మేపుతూ వాటిచేత తగినంత పరిశ్రమ చేయిస్తుండాలి.

పశుశాల నివేశస్థలం చెమ్మగానుండరాదు. చావడి మాగాని పొలములకు, స్మశానాలకు దూరంగా వుంచాలి. పశుశాల పైకప్పు దిట్టంగావుండి వర్షం కురవకుండా వుండాలి. శాలలోతగినంత వెలుతురు గాలి లేనియెడల చెమ్మగానుండి పశువు లనారోగ్యముగా నుంటాయి. మట్టిలోని చెమ్మవలనను, పైకప్పునుంచి వర్షపునీరు కారుటవలనను, శాలకు సమీపమున చెట్లుండుటవల్లను చెమ్మగా వుంటుంది. శాలయొక్క గోడపునాదులు సరిగానుండక గాలి వర్షాలతో శాలలుకూలి పశువులు మరణిస్తాయి. అందుచే శాలపునాదులు గట్టిగానుండాలి. నేల గట్టిదికానప్పుడు కాంక్రీటుచేసి గోడలుకట్టాలి.

శాలయొక్క గోడలు గట్టిగా మ్రోగిస్తే లోహపుధ్వనివచ్చే రాతితోకట్టించాలి. మందను చాలని గోడలుగల శాలలలో శీతాకాలం చలియు, వేసవికాలంలో వేడియు అధికంగానుంటాయి. శాలలకు కిటికీలుఉండాలి, నాలుగువైపులా ద్వారములుండాలి. వేసవికాలంలో కిటికీలు తెరచియుంచాలి. శీతాకాలం, వర్షాకాలంలో ఉత్తరపుదిక్కున కిటికీలు తెరువరాదు. పశువులకొట్టం భూమిమట్టంనుంచి పదిఅడుగులు ఎత్తుతక్కువగా నుండరాదు. ద్వారంవైపు ఎనిమిది అడుగులెత్తు మధ్యభాగం పండ్రెండు అడుగుల ఎత్తుండాలి.

పశుశాలలో రక్షరేకులు

56	66	3	7
6	3	63	62
66	60	8	1
4	5	61	64

పైఅంకెలను బూర్జపుపట్ట పొరమీదగాని, కాగితముమీదగాని వ్రాసి పసుపు కుంకుమ అంటించి పశుశాల తలుపులకుగాని, గోడలకుగాని అంటించిన ఎట్టి గ్రహదోషాలు, అంటురోగాలు సంభవించవు.

శాలకు ఏడెనిమిదిరెట్ల విస్తీర్ణంగల విశాలమగు స్థలం, ముందుభాగాన వుండాలి. శాలను మూడు భాగాలుగా విభజించాలి, ఈ మూడు భాగాలు దక్షిణవైపు తెరచి యుంచాలి. అందు చిన్నచిన్న కిటికీలు వుంచాలి. ఆ కిటికీలు భూమికి అయిదారడుగుల ఎత్తుండాలి. శాల 16 అడుగుల వెడల్పుండి ఉత్తరపు గోడనుంచి పశువులు నిలుచుండుటకు 10 అడుగుల స్థలం వుండాలి. శాలయొక్క ఏటవాలు ఉత్తరదక్షిణాలుగా వుండాలి. శాలయొక్క వెలుపలిభాగం 8 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పు 2 అడుగుల లోతు గొయ్యియున్న, మలమూత్రములన్నియు అందులోకివస్తాయి. పశువులు శాలలో నిలుచుండుటకు పరుండుటకు పది అడుగుల పొడవు 8 అడుగుల వెడల్పున్న విశ్రాంతిగా తిరుగుతాయి. శీతాకాలంలో అనగా అక్టోబరు 15 వ తేదీనుంచి మార్చి 1 వ తేదీవరకు పశువులకు యెక్కువ ఆహారం, వెచ్చదనమూ అవసరం. వాటి నీ కాలంలో 12 గంటలనుంచి 2 గంటలవరకు ఆరుబైటనుంచుట మంచిది. ఈ కాలంలో పాడిపశువులకు పసిదూడలకు రోగాలు రాగలవు. ఇంకను పాడిపశువులు చలికి తక్కువపాలు యిస్తాయి. అందుచేత పశువులకు పుష్టికరమయిన ఆహారం యివ్వాలి.

మార్చి 1 నుంచి జూలై 1 వరకు వేసవికావడంవల్ల పశువులు కూడా నీరధికంగా త్రాగుతాయి. అది కనిపెట్టి పశుపోషకులు వాటికి తగినన్నిసార్లు నీరుపెట్టుతూ వుండాలి. శీతాకాలంలోకంటే వేసవిలో పశువుల్ని జాగ్రత్తతో మేపాలి. ఎండవేళలప్పుడు, వడగాలిలో వాటిని ఆరుబైట కట్టరాదు. వేసవిలో పచ్చిగడ్డిదొరకదు కాబట్టి ఎండుగడ్డి జనపకట్టెయే ఆహారమునకాధారం. వేసవిలో వాటికి దాణాదినుసులు, పప్పు ధాన్యాలు పెట్టుట మంచిది.

జూన్ 15 నుంచి అక్టోబరు 15 వ తేదీవరకు వర్షాకాలం గాన పశువుల్ని ఆరుబైట కట్టరాదు. అధికంగా వర్షంలో తడవనీయకూడదు. పశువులు చూడిగానున్న వాటిని పోషించడంలో రైతులు శ్రద్ధవహించి మేపాలి. మనదేశంలో ఆహారస్వయంసమృద్ధికావాలంటే పశుసంపద వృద్ధిచేసికోవాలి. మన పశుసంపద వృద్ధికావడానికి పశువుల్ని పోషించడంలో శ్రద్ధవహించాలి. పశుసంపద వృద్ధియైతే వ్యవసాయం సులభసాధ్యమౌతుంది.

పశువులకు పెట్టు ఆహారపదార్థాలలో జీర్ణముకాగల మాంసకర, ఉష్ణకర పదార్థాలెంతయున్నవో కనుగొనాలి. పశువులకు పెట్టు ఆహారం శీతోష్ణపరిస్థితుల గమనించి ఏయే ఆహారం దానిశరీరాని కారోగ్యకరమో తెలిసికొని మేపాలి. అన్నికాలములందును ఆహారాన్ని సమానంగా యిస్తుండాలిగాని, విశేషంగాదొరకని వేసవికాలమందు తగ్గించుటవలన పశువు ఆరోగ్యం చెడుతుంది. ఏ మేతయినను సులభంగా జీర్ణమగునదిగా వుండాలి. నిస్సారమైనట్టి బూజుపట్టినట్టి తుక్కు ముక్కగడ్డి మేపరాదు. వేసవికాలంలో తగినంత పచ్చిమేత లభ్యంగాక అవి క్షుద్బాధకోర్వలేక విషవంతములైన ఆకులుమున్నగునవి కనపడినవెల్ల అవి మేయుచుండుటవలన రోగాలు కలుగుతాయి. పశువుల వయస్సు, అవి చేయుచున్న శరీరపరిశ్రమ కనిపెట్టి ఆహారపానీయాలు యివ్వాలి. ఏ పరిశ్రమలులేక చావడులలోకట్టివేసి బలకరములగు మేతలు మేపినందువలన ప్రయోజనమేమి యుండక లంబోదరమేర్పడి పనియందు బద్ధకమేర్పడుతుంది.

పశువుల జీర్ణశక్తిని అభివృద్ధి పరచుటకు పెట్టుపదార్థాలను ప్రతిరోజు మేతతోపాటు పెట్టాలి. మంచిశరీర దార్ఢ్యంగల పశువునకు అర పౌనువరకు చమురుపదార్థాలు పెట్టవచ్చు. ప్రతిదినం పశువుతినే ఆహారమునకు నాలుగురెట్లు నీరుత్రాగించాలి. అప్పుడప్పుడు ఆహారంతో వేయించిన మెంతిపిండి ఉప్పుకలిపి పెట్టడం మంచిది. పశువులకు వేరుశనగ, కంది, పెసర, ఉలవ, గోరుచిక్కుడు, మినుము, అలచంద మున్నగు కాయధాన్యాల పొట్టు చెత్తలలో మాంసకరపదార్థములుండుట వలన అవి బలకరపదార్థాలు. పాలసమృద్ధికి ఏ ఆహారాలు పెట్టాలని రైతులు తరచుగా అడుగుతుంటారు. అవి రాగి, సజ్జలు, జొన్న, మొక్కజొన్న, కొర్ర, వరిగ, ఆరిక మొదలగు కంకిధాన్యాలు గడ్డిగాని, చొప్పగాని బలకరములు. శనగపొట్టు, రేగుపొట్టునకున్నంత బలము వులవపొట్టుకు లేదు. వరాగడ్డికంటె గోధుమగడ్డి బలకరమైంది. శనగలు వడ్లకంటె ఎక్కువ బలమిస్తాయి. కాయధాన్యాల కంటె తెలికపిండి కొబ్బరిపిండి బలకరములు. పశువులు కల్మషోదకాన్ని త్రాగుటవలన పలువిధరోగాల పాలవుతాయి. మానవులకు వలె పశువులు ప్రతిదినం నీరుత్రాగుట అవసరమని గుర్తించి అవసరమున్నన్ని పర్యాయాలు నీటిని త్రాగించాలి.

పశువుతినే ఆహారంసరిగా జీర్ణమగుటకు దానిచే పరిశ్రమచేయించుచుండాలి. ఎద్దులను, దున్నలను ఎల్లప్పుడు సోమరితనంగానుంచి మేపరాదు. పనికలవాటుపడక అవి వగర్చుచుండును. పశువులకు తగినంత శ్రమలేనిచో వాటికి బద్ధకమేర్పడి ఆసామికి నిరుపయోగమౌతాయి. పశువుల బేరములవలన జీవించు వ్యాపారులు బక్కచిక్కిన పశువులను తక్కువధరలకు తీసికొనివెళ్ళి వాటికి బలకరపదార్థాలు మేపి, ఏ పని చేయించకుండా బైటకుతోలితే, దృష్టిదోషం తగులుతుందన్న మూఢనమ్మకంతో కొట్టాలలోనే కట్టి– యుంచుతారు. కర్షకులు అటువంటి పశువుల్ని చూచి, అవి బలంగానుండుట గాంచి, అవి తమపనికి బాగా ఉపయోగిస్తాయనే ఆశతో పెద్దఖరీదిచ్చికొని తోలుకుపోతారు. వాటిని బండికట్టగనే అవి పరిశ్రమల– కలవాటుపడని సోమర జాతులుకావడంవల్ల బండిలాగుటకు నాగలికట్టితే దున్నుటకశక్తమై రొప్పుతాయి. ఈ రొప్పునే వగర్పు వాతమంటారు. అందుచేత రైతులు పశువుల్ని కొనేటప్పుడు అవి పరిశ్రమ చేసేవో, కావో తెలిసికొని కొనాలి.

కష్టపడి పనిచేసిన పశువునకు విశ్రాంతి ముఖ్యం. విశ్రాంతివలన అలసటతగ్గి మరల పనిచేయుటకు వలయు దార్ఢ్యమును గైకొనును. బండ్ల బాడుగలు తోలువారు పశువులపై దయాదాక్షిణ్యాదులు లేక వాటి వాటి శక్తులకు మించిన దూరప్రదేశాలకు విశ్రాంతినీయక, సరిగా మేత పెట్టక తోలుకుపోతుంటారు. అందువలన వాటి ఆరోగ్యం త్వరలోచెడి దురాశాపరులైనవారికి ధనలాభానికి బదులు నష్టమే కలుగుతుంది.

* * *

నాల్గవ భాగము

పశుగ్రాసము

పశువుల అభివృద్ధిముఖ్యంగా అవి తినే ఆహారాన్ని బట్టి వుంటుంది. పశువులకు పచ్చిమేత, ఎండుమేత, దాణాలు అవసరం. మనదేశంలోనున్న పశువులకు మనకున్న పశుగ్రాసం చాలదు. కరువుకమీషన్ రిపోర్టు ననుసరించి అవసరమైన పశుగ్రాసమీవిధంగా లభిస్తూంది.

మేతలు

కావలసినది	22,50,00,000 టన్నులు
ఉత్పత్తి	12,50,00,000 టన్నులు
తక్కువగానున్నవి	20,00,00,000 ఉలవలు, తెలికపిండి మొ॥
కావలసినవి	1,30,00,000
ఉత్పత్తి	40,00,000
తక్కువగానున్నవి	60,00,000

కాబట్టి 50 కోట్ల టన్నుల మేత, 60 లక్షల టన్నుల దాణా మనదేశంలో తక్కువగా కనబడుతోంది.

పైఅంచనాలు దేశంమొత్తంమీద అమలుపరచినా, మరొకవిషయం వుంది. వర్షాలు ఎక్కువగా పడుతూన్న ప్రాంతాలలో, పశుగ్రాసం తక్కువగా వుంది. సంవత్సరానికి 30 అంగుళాలకంటె తక్కువ వర్షంపడే కడప, బళ్ళారి, అనంతపురం జిల్లాలలో చొప్పగడ్డి వగైరాలు అవసరమయ్యేదానికంటె కొంచెంఎక్కువగాను, దాణా పంటలుమాత్రం సగానికి తక్కువగాను ఉండి, ఈ ప్రాంతపు పశుపోషణ తృప్తికరంగానే వుంది. ఈ కూటంలో నెల్లూరు పడమటిభాగం, గుంటూరుజిల్లా దక్షిణభాగం ఒంగోలు చుట్టుపట్ల కలుస్తుందనుకోవచ్చు. తూర్పుకనుమల చిన్నచిన్న గుట్టలచుట్టూ ఎర్రనేలలు, నల్లనేలలు ఒకదానినొకటిచేరి ఉన్నాయి. నిస్సారమైన భూములు, గుట్టల గుట్టల మధ్య నీరు వర్షాకాలంలో చేరి నిలువయుండే గుంటలు, జక్కెరలు ఉన్నచోట ప్రశస్తంగా ఏర్పడియున్నాయి. తుమ్మచెట్లు బీళ్లలోఉన్నాయి. ఈ చెట్లు భూమిభాగంలోఉన్న తేమనుకూడ తీసికొని బ్రతుకుతాయి. దాని ఆకులు పూర్తిగా సూర్యరశ్మిని కప్పివేయకుండా క్రిందనెదిగే గడ్డికి ఎండ, గాలి, నీరు ఇవ్వడానికి అవకాశమిస్తుంది. ఒక పర్యాయం కొంతవర్షానికి మొలచి, తర్వాత చచ్చిపోయి గడ్డి గాదలుచీకుడంతా, ఆనెలలోనే కలసిపోయి అంతకంతకు క్రమంగా ఫలవంతమైన బీళ్లవ్వడానికి దోహదమిస్తున్నాయి. పశువులు తుమ్మకాయలను ప్రీతిగా తింటాయి. క్రిందనున్న పచ్చికను మేస్తాయి. ఆహారం విహారం రెండు కలశాయి, ఇంటికి రాగానే జొన్న, జనుము, చొప్ప, తవుడు, ప్రత్తిగింజలు, నూనెపిండ్లో ఏదోఒకటి సిద్ధంగా రైతులుంచుతారు. ఆ వాతావరణానికి

వ్యవసాయానికి తగిన దృఢకాయం పుష్టి అయిన గ్రాసం రైతుల ఆవరణ అన్నీ కలియడంవల్ల ఈ ప్రాంతాలలో పశుసంపద తృప్తిగాఉంటుంది. ఇల్లాంటిచోట్లలోకూడా ఇప్పుడు అనేక కారణాలవల్ల పశుగ్రాసం చాలక కరువుపరిస్థితులు విషమిస్తున్నాయని తెలుస్తూవుంది.

పశువులకు సరిపడే గ్రాసంలో, గడ్డి, చొప్ప వగైరాలు మూడువంతులున్నూ, దాణా ఆహారం నాల్గో వంతున్నూ ఉన్నట్లు అంచనా. పశుగ్రాసం సరిపడాలంటే, ఇప్పుడున్న పచ్చికవిస్తీర్ణం ఆరురెట్లు అధికం చేయాలి. అధికం చేయడానికి ఈ క్రిందివిషయాలు అమలుపరచాలి.

మనదేశంనుంచి విదేశాలకు ఎగుమతిచేసే నిమిత్తం ఇప్పుడు పండిస్తున్న తేయాకు, ప్రత్తి, పొగాకు, చెరుకు, పసుపు మున్నగు వస్తువులను కావలసినంతవరకే పండించాలి.

సామాన్యంగా పై పంటలు మంచిభూములందే పండింపబడుచున్నవి. కాని ఆయాభూములందు ఆహారధాన్యాదులు పండించినచో, మన దేశమునందు ఆహారకొరత తీరుతుంది. పశుగ్రాసంకూడ కావలసినంత దొరుకుతుంది. వ్యవసాయానికి పనికిరాని భూములను బాగుచేసి పశుగ్రాసాన్ని పండించాలి.

నదులు, వాగులు, నూతులులేని ప్రదేశాలకు నీటివసతులేర్పరచాలి. పశుగ్రాసం పండించుటకు ప్రోత్సహించడానికి పన్నులందు, నీటితీరువలందు కొంత తగ్గించాలి. గవర్నమెంటు అడవులలో పశువులు మేయుటకు పచ్చిగడ్డికోసం నిలువ చేయుటకు ఏర్పాట్లుచేయాలి. నువ్వులు, కొబ్బరి మున్నగునవి వెలుపలికి ఎగుమతి చేయకుండా తగిన ప్రతిబంధకాలు చేయాలి. గడ్డిని పిండిగా తయారుచేయు యంత్రాలను, పశువుల పేడను వంటచెరుకుగా నుపయోగించుట పూర్తిగా నిషేధించాలి. తెలికపిండి, ఉలవలు మున్నగువాటిలో మట్టి, సున్నం, ఇసుక కలుపకుండా చేయించాలి. పశుగ్రాసంలేని ప్రాంతాలకు పశుగ్రాసాన్ని పంపుటలో రైల్వేవారు కొంత సాయపడాలి. పశుగ్రాసం కేవలం పశువులకు మాత్రమే ఉపయోగించాలి కాని బట్టల మిల్లులకు, సీసాలు తయారుచేసే మిల్లుల పనులకుపయోగించరాదు. ఈ రీతిగా గవర్నమెంటు వారు తగినంత శ్రద్ధ తీసికొనినపుడే మన పశుసంపద బాగుపడుతుంది.

రోజువారి మేపులు

పశువులకు పచ్చిమేతను వెయ్యడంలో కొన్ని నియమాలను పాటించవలసివుంటుంది. ఆయారకాల పశువులకు ఆయా పరిమాణాల్లో పచ్చిమేత మేపాలి.

ఏడునుంచి తొమ్మిదినెలల వయసు దూడలకు 5 పౌనులు, 10 మొదలు 12 నెలల వయస్సువాటికి 10 పౌనులు, నడివయస్సువాటికి 10 పౌనులు, పాడియావులకు ఉదయ సాయంకాలములందు 50 పౌనులు, ఎద్దులకు 25 పౌనులు మేతలు మేపాలి. ఎట్టిపరిస్థితులలోను ఇంతకంటె మేపరాదు. ఈనడానికి సిద్ధంగావున్న పాడిపశువులకు పచ్చిమేత వేయరాదు. పనిచేసే ఎద్దులకు పూర్తిగా పచ్చిమేత వేయాలి. పశుశాలల్లో కట్టివేసే పశువులకు ఇతర మేతలతోపాటు పచ్చిగడ్డి వేయుటవసరం. పశువులు తిరిగేవైతే బయళ్ళలో మేపాలి.

పునాస పైరులలో అనగా ముదురు జొన్నలతోకలిపి అలచందను పెడతారు. ఇది జొన్నచొప్పతోపాటు కాడ ముదరకమునుపే కోసివేయుట పశువులకు బలవర్ధకాలు. కాడ ముదిరినతరువాత పశువులు ఎంతమాత్రం తినవు. మొక్కజొన్నను కండెలు ముదరకమునుపే కోసి పశువులకు వేసిన మంచి సత్తువ కలిగిస్తుంది. కండె ముదిరింతర్వాత చొప్ప పశువులకు పనికిరాదు. వూచబియ్యం పాలుగానున్నపుడే కోసివేయాలి. ఈ మేత బలకరంగాను, పుష్టిగాను ఉంటుంది. ఈ మేతను తగినంత మేపాలిగాని, ఎక్కువగా మేపిన వాతరోగం కలుగుతుంది. పుష్యమాసంలో వేసిన పిల్లిపెసర బలం కలిగిస్తుంది. ఈ మేత తాత్కాలిక బలమేగాని, కండపుష్టినీయదు. ఎక్కువగామేపే పశువులు పలువిధరోగాలకు గురియవుతాయి. తెలికపిండి చూడిపశువులకు పెట్టరాదు. వేరుశనగ పిండి తగినంత పెట్టాలిగాని అవి తిన్నంతపెట్టిన, తప్పక అజీర్ణరోగాలు పుడతాయి. ఈరీతిగా రైతులయొక్క అనుభవాలతో తమ పశువులకు ఆహారదాణాలు ఈయాలి.

ఎద్దులు బాగా బలంగాఉండడానికీ, పెరగడానికి ప్రొటీన్లు అవసరం. మనదేశంలోని ఎద్దులకు రోజునకు నూరుగ్రాముల ప్రొటీనులు చాలు. ఇతర దేశాలోని పశువులకు 300 వరకు కావలసివస్తుంది.

కాయధాన్యాలలో ప్రొటీన్లు చాలాతక్కువ. ఈ ప్రొటీన్లు ఎన్నో రకాల పదార్థాలనుండి లభిస్తున్నా, మామూలురైతు తన ఎద్దులను మంచిస్థితిలో నుంచుకోలేకపోతున్నాడు. మంచి బలకరమైన ఆహారపదార్థాల ధర విపరీతంగా పెరిగిపోవడమే ఇందుకు కారణం. పరిస్థితి చక్కజేయాలంటే చౌకబారు మార్గాలలో ఆహారపదార్థాలను సేకరించటం అత్యవసరం.

తిరువాన్మూరు సంస్థానంలోనూ, కృష్ణగిరితాలూకా (సేలంజిల్లా)లోను, ఉత్తరార్కాటుజిల్లా తిరువత్తూరు తాలూకాలోను చింతపిక్కలు పశువులకు ఆహారంగా ఉపయోగించబడుతున్నాయి. ఈ పిక్కల విషయమై రైతుల కంతగా తెలియదు. కృష్ణగిరితాలూకాలో మామూలు చింతపిక్కలనుంచి ఆహారంగా తయారుచేసే యంత్రాగారమొకటి ఉంది. చింతపిక్కలను వేయించే పెనం, ఇంచుమించు బెల్లం తయారుచేయుటకు వినియోగించే పెనంవంటిది. చింతపిక్కలను పశువులకు వేసేముందు, వాటిని వేయించి, పైతొక్క తీసివేసి, దంచి అటు తరువాత నీటిలో నానవేసిన, పిక్కలలోనుండే హానికరమైన పదార్థం నశించిపోతుంది. నూటికి 16.12 పాళ్ళు ప్రొటీన్లు ఉంటాయి. మనం పశువులకు వేసే మేతలో దాదాపు పాతికభాగం ప్రొటీన్ పదార్థానికి బదులుగా ఈ చింతపిక్కలను ఉపయోగించవచ్చు.

కసిందచెట్టుకాయలుకూడ పశువులకు ప్రశస్తమైన ఆహారమే! ఇందులో ప్రొటీన్లు 100 కి 14.86 ఖనిజసంబంధమైన పదార్థాలు ఉన్నాయి.

పొగాకు విత్తులచెక్క నిర్భయంగా పశువులకు వెయ్యవచ్చు. వ్యవసాయశాఖవారు దీనిని పశువుల కుపయోగించి పరిశోధనచేశారు. దీనిలో నూటికి 30, 35 పాళ్ళు ప్రొటీన్లున్నాయి. మనం మామూలుగా ఉపయోగించే గానుగచెక్క, వేరుశనగచెక్కకు బదులుగా దీన్ని ఉపయోగించవచ్చు. చేపలపొడి, బెల్లంకూడా పశువులకు పెట్టవచ్చు. బెల్లంలోమాత్రం ప్రొటీన్లు లేవు. చిలగడదుంప ఆకులు, తీగెలు పశువులకు మేతగా

ఉపయోగింపవచ్చు. వీనిలో నూటికి 2.58 పాళ్లు ప్రొటీన్లు ఉంటాయి. మూడుపౌనుల ప్రత్తిగింజల్లోగాని, ఒకపౌను వేరుశనగ చెక్కలోగాని, ప్రొటీన్లు ఏమాత్రం ఉంటాయో 20 పౌనుల తీగల్లో అన్నిప్రొటీన్లు ఉంటాయి.

తెలికపిండి అన్నిరకముల పశువులకు మంచి ఆహారమైఉంది. ఈ పిండిలోకూడ మంచివిటమినులు గలవు. వేరుశనగపిండి కూడ బలకరమైనదే. కొబ్బరిపిండికూడ పశువులపాలను వృద్ధిచేయును. మొత్తంమీద ఈ పిండిపదార్థాలను వాడే విధం తెలియక రైతులు నష్టపడుచున్నారు.

కూర, కాడ జాతులు

తోటకూర: వీటిలో ఎరుపురంగుకూడ వుంటాయి. దీనినే ఎరుపుతోటకూరయందురు. ఈచెట్లు నాలుగైదు అడుగుల ఎత్తువరకు పెరుగును. ముండ్లతోటకూరకూడ తోటకూరవలెనేయుండి చిన్నచిన్న గుబురు మొక్కలుగావుంటాయి. ఆకులవద్ద ముండ్లుంటాయి. పాడి పశువులకు పెట్టిన పాలుబాగాయిస్తాయి. ఆకును వుడకబెట్టి తినిపించవచ్చు. కొయ్యతోటకూర, చిలకతోటకూరకూడా పశువులకు బలము కలిగిస్తాయి.

బచ్చలికాడ పశువులకుపెడితే సత్తువనిస్తుంది. పొన్నగంటికూరలో నరములకు సత్తువయిచ్చు గుణం కలదు. బొబ్బర లేక, అలచందకాడ, పెసర, పిల్లిపెసర, మినప, ఉలవ, జొన్న, గంటె, వరిగ, తుమ్మకాయలు పశువులకు నిత్యాహారాలలో పనికివచ్చే మేతలు. ఈ మేతలను రోజువారీగా మేపుచు, వాతము కడుపుకుట్టు కలుగకుండా వుండే వస్తువులను యిస్తుండాలి. కొలజగల్జేరు, తదితర పాలకాడలు కూడ పశువులకు మంచి ఆహారము కనుక తగినంతగా మేపాలి.

బంజరునేలలో, బీడుభూములలో వర్షాధారంతో పెంచబడుటకు దేశవాళీ మంచిగడ్డి జాతులు ఈక్రింద తెలుపబడినాయి.

నేంద్రగడ్డి, చెంగలిగడ్డి, బారుచెంగలిగడ్డి, మొలవగడ్డి, నానాబాలుగడ్డి, ఊబగడ్డి, విలమతీగగడ్డి, "శంకరస్‌సిలియారిన్‌గడ్డి, వీటన్నిటిలోను శంకరస్‌సిలియారిన్‌గడ్డి సున్నమెక్కువగాగల భూములందే పెరుగుతుంది. చెంగలిగడ్డి, బారుచెంగలిగడ్డి ఒంగోలు జాతి పశువులు బాగాతింటాయి. కొండభూములందు తిరిగే పశువులకు నేంద్రగడ్డి మంచిది.

ఇంకను క్రొత్తగావచ్చిన గడ్డిజాతులలో "తిన్‌నేపియర్‌గడ్డి" బఫెలోగడ్డి, ఎలిఫెంటుగడ్డి, కొల్లుకొట్టయి గడ్డి, ఉప్పుగడ్డి, గినియాగడ్డి, జలగడ్డి కొలకట్టగడ్డి, ఆస్ట్రేలియాగడ్డి, గినిగడ్డి, తొండంగిచిప్పర మున్నగు జాతులెన్నో గలవు.

వీటిలో మురుగునీటి ఆధారంతో గెనిగడ్డి, ఎలిఫెంటుగడ్డి బాగుగా పెరుగుతాయి. చెంగలిగడ్డికి రేగడినేల పెట్టిందిపేరు. కొల్లుకొట్టయిగడ్డి ఎక్కువ నీరులేకుండానే పెరుగుతుంది. ఉప్పుగడ్డి చవుడున్న భూములలో పెరుగుతుంది. వరిగడ్డి పశువులకు మంచి ఆహారము. ఈ గడ్డి ఉపయోగమును గూర్చి రైతులకు బాగా తెలుసు.

పుత్సంగలి: ఈ గడ్డి చెట్లక్రింద డొంకలమీద పెరుగుతుంది. నేలమీద ప్రాకుతుంది. ఆకులు గరుకుగా నుంటాయి. మేకలు, గొఱ్ఱెలు, కొండపశువులు మేస్తాయి.

కావురుగడ్డి: మాగానిపొలాలలో, తదితరస్థలాలలో ఈ గడ్డి బాగాపెరుగుతుంది. పశువులు బాగా తింటాయి.

గొడ్డుతుంగ, తెగడతుంగజాతులు కొంచెము వగరుగ రుచిగనుండుటవల్ల పశువులుతింటాయి. తొండంగి, గరికచిప్పరలు సారవంతములగు భూములలో మొలుస్తాయి. మంచిబలము కలిగిస్తాయి. రోగ పశువులకు పథ్యంగాపెడతారు. తగినంతగా మేపాలి లేనిచో వాతము, కీళ్ళపట్లు కలుగుతాయి. చెంగలిగడ్డికూడ పశువులకు మంచిది. బాగా యిష్టంతోతింటాయి. దర్భ, గునుకు, కొండజెట్టిగడ్డి, శంఖిణి, పూతిక గెలగడ్డి ఉడుతతోక మున్నగు గడ్డిజాతులు గలవు. ఇవన్నియు పశువులకు ఆహారంగా ఉపయోగపడుతాయి.

ద్వాదశలవణాలు:

వీటినే ఖనిజలవణాలంటారు. విటమినుల వలె ఆహారపదార్థాలలోని సేంద్రియలోహాలుకూడా శరీరారోగ్యానికి అత్యవసరం. పశువుయొక్క ఆహారాన్నిబట్టే శరీరఆరోగ్యానికి ఖనిజలవణాల పటుత్వముబట్టి మారుతూవుంటాయి.చూడిపశువుల లోపలిపిండమును ఎముకలను గట్టిపరచుటకు కాల్షియం, ఫాస్పేటు కావాలి. హృదయకోశం ఊపిరితిత్తులద్వారా బొగ్గుపులుసుగాలిని బయటకు పంపుటకు ఇంకను తిన్న మేతజీర్ణం కావడానికికూడా ఈ లవణాలు శరీరానికి అత్యవసరం.

1. కాల్షియం

పశువుశరీరంలో ముఖ్యమైంది కాల్షియం ఒకటి. కాల్షియం అనగా సున్నం. ఇది ఎముకలకు, దంతాలకు అవసరం. ఇంకను కండరాలను ముడుచుకొనుటకు, శరీరపనులు నిర్వహించుటకు, నరాలు చురుకుదనము కలుగుటకు ఈ లవణం అవసరం. ఈ లవణం పెద్దపశువులకు, చిన్నపశువులకు, చూడి పశువులకు, పాడిపశువులకు అత్యవసరం. దూడలు పుట్టింతరువాత ఎముకలు మెత్తబడి సాగుతూంటాయి. తల్లిపాలనుంచి కాల్షియం గ్రహించి ఎముకలు గట్టిపడతాయి. దంతాలు మొలుస్తాయి. చూడిపశువులకు ఈ లవణం లేకపోతే దూడెముకలు పెరుగక సన్నకాళ్లు, సన్నమెడ, అంగవైకల్యాలు గలిగి వికృతాకారం ఏర్పడుతుంది.

ఈ లవణం లేకపోవుటవలన పశువు ఎక్కువగా ఆయాసపడుట, అప్పుడప్పుడు కాళ్లు ఎగలాగుట, శరీరంపై గ్రంథులు పుట్టుట, చర్మం పొలుసురేగుట, బిరుసెక్కుట, కసిమిరి తగులుట, కొమ్ములచివర భాగమందు పూతపూయుట, మెత్తగాళ్లుపడుట, నరములు బలహీనతజెందుట మున్నగు రోగాలు కలుగుతాయి.

2. అయోడిన్

శరీరఅవయవాలకు చురుకుదనం గలిగించుటకు అయోడిన్ అతిముఖ్యం. పశువుమెడయందుండే థయిరాడ్ అనే కోశంలో ఈ అయోడిన్ భద్రపరచబడియుంటుంది. పశువుతిను ఆహారమునుండి ఈ లవణం తీసికొని రక్తానికి అందీయబడుతుంది. రక్తం తగినంత వడిగా వ్యాపించుటకు, చర్మం మృదువుగా వుండుటకు, వీర్యవృద్ధికి ఈ అయోడిన్ అవసరమైయుంది. ఇది మంచివేడిమిని కలిగిస్తుంది. గాలిలోమాత్రం త్వరగా కర్పూరంలాగా హరించిపోతుంది. అందుచేత మన ఉష్ణదేశ పొలాలలో పండే పంటలో ఈ లవణం తక్కువగా వుందని శాస్త్రజ్ఞులు నిర్ణయించారు. పశువుమేతమేయునపుడు క్రక్కుట, నోరువాసనయుండుటకూడ ఈ లవణంలేకపోతే రావచ్చు. నోటినుంచి జిగురుపదార్థము ఊరుట, ఊపిరివాపులు, గంగడోలుక్రిందవాపు, చర్మరోగాలుకలుగుట, తూలుట మున్నగు లక్షణాలు ఈ లవణం లేకపోతే కలుగుతాయి.

3. ఇనుము

పశువులకు ఈ లవణం ప్రధానమైంది. రక్తానికి ఎరుపురంగు రావాలన్నా, ప్రాణవాయువును పీల్చాలన్నా, రక్తంలోను, శరీరంలోనున్న జీవాణువులన్నియు పెరగాలన్నా, నేత్రాలు తేజస్సుగా వుండాలన్నా ఈ లవణం చాలా అవసరం.

రేచీకటి, నీరుచురుకు, పాండురోగము, ఎండువాతము, చర్మరోగాలు, గుండెవగర్పు మొదలైన రోగాలు ఈ లవణంలేకపోతే కలుగుతాయి.

4. సల్ఫర్

దీనినే గంధకమంటారు. అన్నిజంతువుల వెంట్రుకలలో, గోళ్ళలో, డెక్కలలో ఇది కలదు. శరీరంలో వేడిమి చురుకుదనము కలిగియుండుటకు తప్పక ఈ గంధకము కావాలి. ఇది లేనియెడల కండ్లుజబ్బులు, కోపము, తాపము, చిర్రుబుస్సు, మెడజబ్బులు కలుగుతాయి.

5. మ్యాంగనీస్

ఈ లవణంకూడా రక్తకణాల ఉత్పతికి తోడ్పడుతుంది. ఇది తక్కువైన చెవిరోగాలు, మందమతి, నరాల బలహీనత, పక్షవాతం, పొట్టలో గాలిచేరు కలుగుతాయి.

6. క్లోరిన్

శరీరంలోపేరుకునే దుష్టపదార్థాలను తీసివేసే గుణము దీనిలో వుంది. అవయవాల సంధులకు మంచిశక్తినిచ్చే గుణము కలదు. ఈ లవణంలేకపోతే కీళ్ళనొప్పులు, కీళ్ళవాపులు, మూత్రరోగాలు, దంతచిగుళ్ళ వాపులు వగైరా కలుగుతాయి.

7. సిలికన్

ఈ లవణం పొటాషియంతో కలిసియుంటుంది. మూత్రంతో వీర్యం పడుట, దగ్గు, కంతులు, వ్రణాలు, నాడి నీరసంగా నుండుట ఈ లవణంలేనిచో కలుగుతాయి.

8. రాగి

ఈ లవణంలేకపోతే చర్మరోగాలు తప్పక కలుగుతాయి.

9. ఫ్లోరిన్

ఈ లవణం తక్కువైతే దంతాలు, కొమ్ములు, గిట్టలు బలహీనతనొందుట, గర్భకోశంలో పుండ్లు పుట్టుట, ముక్కుపీనస ముకుబంతి, కండ్లు పుసులుకట్టుట జరుగుతాయి.

10. సోడియం

ఈ లవణం పశువుశరీరమంతలో వుంది. గుండెసరిగా పనిచేయుటకు ఈ లవణం తోడ్పడుతుంది. జీర్ణకోశంలోని జఠరరసం పనిచేయుటకు, రక్తభాగాలను పెంపొందించుటకు ఈ లవణం కావాలి. ఇది లేనియెడల అన్నిరకముల వాతాలు, దొమ్మలు, అంటురోగాలు కలుగుతాయి.

11. పొటాషియం

కండరాలకు బలమునిచ్చే లవణం పొటాషియమని గుర్తించుకొనాలి. ఇది లేనియెడల కండరముల బలముతగ్గుట, అవయవములు పుష్టిలేకుండుట, ఎప్పుడు శరీరము నిక్కాకగానుండుట, నల్లకప్పువేయుట, తరచు అంటువ్యాధులు కలుగుట జరుగుతాయి.

12. భాస్వరము

పశువుల శరీరభాగాలన్నిటిలోను ఈ లవణము వుంది. ఇదిలేని యెడల ఈడ్పు, మూర్ఛ, హిస్టీరియా, కుందేటివెర్రి మున్నగు రోగాలు పుట్టుతాయి.

విటమినులు – ప్రాణాణువులు

పశువుల ఆరోగ్యపోషకములగు పదార్థములుగల ఆహారాలు ఏ, బి, బి1, బి2, బి3, బి4, సి, డి, ఇ, కె; అని శాస్త్రవేత్తలు విభజించారు. ఈ విటమినులు లోటువల్ల కల్గే రోగాలు ఈ క్రిందివిధముగా వుంటాయి.

ఏ విటమినుల లోపంవల్ల: కంటివ్యాధులు (అనగా రేచీకటి, మసకలు, పొరలు, మొదలగునవి) శిలామేహవాతము, మూత్రకృచ్ఛము, మూత్రాశ్మరి, నరముల బలహీనత, ఊపిరితిత్తుల జబ్బు, జలుబు, సూతికావాతము, గర్భములోపిండము ఎదగకుండుట మొదలుగాగల జబ్బులు కలుగుతాయి.

బి విటమిను లోపంవల్ల: జీర్ణకోశముచెడుట, గుండెదడ, ఆయాసము, తిమ్మిర్లు, నంజు, అతివిరోచనములు, విరోచన బంధము లేక గట్టిచితపలువేయుట, అరుచి, చర్మవ్యాధులు, పశువులు తమపేడను తామే భుజించుట, తమ ఉచ్చ (నీరుడు)ను తామే త్రాగుట మొదలుగా గల వికృతలక్షణము లగపడతాయి.

బి1 విటమిను లోపంవల్ల: లేగదూడలు తల్లిపాలు త్రాపుచున్నప్పుడు కడుపుబ్బరము, ఊడు, పెంటికలువేయుట, తెల్లగాపారుట, కడుపునొప్పి, గర్భవాతము వగైరా రోగములవల్ల దూడకు ప్రాణహాని కల్గవచ్చును. అందువల్ల పశువు చూలితోనున్నప్పుడే ఈ విటమినును చాలినంతగా తినిపించాలి.

బి2 విటమిను లోపంవల్ల: ముఖ్యముగా నేత్రరోగములు (ఎరుపులు, మంటలు, దురదలు, నీళ్లుకారుట, ఎండలోచూడలేక పోవుట) చర్మం ఎర్రబారుట, చర్మం పొలుసుకట్టుట మొదలుగునవి కల్గుతాయి.

బి3, బి4 ఈ విటమినులు రెండున్నూ గుణములు దాదాపు యేక రకాలుగా నుంటాయి. వాటి లోపంవల్ల:

ఏనుగగజ్జి, నంజువాపులు, కల్లవాపులు వస్తాయి.

సి విటమిను లోపంవల్ల: దంతపటుత్వముతగ్గుట, చిగుళ్ళవాపు, చిగుళ్ళనుండి రక్తముకారుట, పిప్పిపండ్లు, కీళ్ళనొప్పులు, ముక్కునుండి రక్తస్రావము, ఎముకల పటుత్వముతగ్గుట, నోరు దుర్వాసన, చర్మరోగములు, ప్రేవులలో పుండ్లు వగైరాలు కలుగుతాయి.

డి విటమిను లోపంవల్ల: ఎముకలు మెత్తబడుట, దంతముల పింగాణిపోవుట, ఈడ్పురోగము, సూతికారోగము, పిండముయొక్క అంగవైకల్యము, శిలామేహవాతము, మరుగుజ్జుతనము మొదలగు రోగములు కల్గుతాయి.

ఇ మిటమిను లోపంవల్ల: చూలి ఈదుకొనిపోవుట, ఆహారము జీర్ణము కాకపోవుట, పాలు తగ్గిపోవుట, నపుంసకత్వము, వయసువచ్చిననూ పశువుకు కట్టునిలవకపోవుట మొదలగు వ్యాధులు సంభవిస్తాయి.

కె విటమిను లోపంవల్ల: జఠరరసము తగినంత ఊరకుండుట, ఆహారము జీర్ణముకాకపోవుట, పచ్చకామిలారోగము, నాసికాగుధాంగములనుండి రక్తస్రావము కలుగుతుంది.

ఈ క్రింది ఆహారములనుండి పై విటమినులోపమును భర్తీచేసుకొనవచ్చును.

ఏ విటమిను ఉండు పదార్థములు: ఆకుపచ్చని ఆకులో పచ్చిగడ్డిలోనున్నూ విరివిగా వుంటుంది.

వృక్షసంబంధమైన ఆహారములలోకూడా ఉండును. లేతమొక్కలలో ఇంకా విరివిగా వుంటాయి.

ధాన్యములు పచ్చజొన్నలు, గోధుమలు, శనగలు, చోళ్లు, రాగులు, మినుములు, పెసలు, మొక్కజొన్నలు, ప్రత్తిగింజలు, బియ్యపుతవుడు, గోధుమతవుడు. దుంపలు చిలగడదుంపలు, క్యారెట్ దుంపలు, పైవాటిల్లో, ఏ విటమిను ఉంది.

బి విటమిను ఉండు పదార్థములు: కందులు, శనగలు, మినుములు, పెసలు, మొక్కజొన్నలు, నీరుల్లి, బచ్చలిఆకు, వేరుశనగపప్పు, పిట్టుఅరటి, కొత్తిమేర, కరివేపాకు, బెండకాయలు, ద్రాక్ష, చిలగడ దుంపలు.

బి1 విటమిను ఉండు పదార్థములు: ధాన్యాదులలోను, గింజలలోనున్ను, లేతపచ్చని ఆకులలోను బి1 విటమిను ఉంది.

బి2 విటమినులు ఉండు పదార్థములు: బి1 మాదిరిగనే యిదికూడా ధాన్యాదులలోను పచ్చి లేత ఆకులలోను ఉంది.

బి3, బి4 విటమినులు ఉన్న పదార్థములు: ఇది ఎక్కువగా నారింజ, నిమ్మ, దబ్బ, ద్రాక్ష, కమలా మొదలగు పండ్లరసంలో ఉంది.

సి విటమిను ఉన్న పదార్థములు: నారింజ, ఉసిరికాయ, నిమ్మ, బొప్పాయి, మామిడి, దోస, అనాస, చింతపండు, పుచ్చకాయ, గుమ్మడి, నీరుల్లి, రాచఉసిరి మొదలగు వాటిలోవుంది. ఈ విటమిను తక్కువ లక్షణములు కనుపించినవెంటనే పశువుకు ఎండుగడ్డి, తెలికిచెక్క వగైరాలు తగ్గించి సాధ్యమైనవరకు పచ్చగడ్డిని వాడాలి.

డి విటమిను ఉన్న పదార్థములు: ముఖ్యముగా ఇది సూర్యకిరణములలో వుంది. కాబట్టి పశువులను ఉదయం 7 గం. నుండి 11 గం. వరకు సాయంత్రం 3 గం. నుండి 6 గం. వరకు ఎండలో వుంచినట్లైతే ఈ విటమిను కొరతఉండదు. కాడ్ లివర్ ఆయిల్, లేతపచ్చనిఆకులు, కాయలు వీటిలో ఈ విటమిన్ డి వుంది.

ఇ విటమిను ఉన్న పదార్థములు: చమురు పదార్థములలోనున్నూ, పండినపండ్లలోనున్నూ మొలకకట్టిన ధాన్యాదులలో మిక్కుటముగా వుంది.

కె విటమిను ఉన్న పదార్థములు: ఆకులు, కాయలలో ఉన్నది. ఈ విటమిను ఎక్కువగా తవుడులో వుంది.

పశువులకు విటమినులు

పశుశాస్త్రజ్ఞులు మానవుడు తినే ఆహారములో విటమినులు ఉండి తీరవలెనని సిద్ధాంతముచేసి యున్నారు. పశువుల మేతలలో ఇవి వలదాయను ప్రశ్న వెనువెంటనే జనించింది. ఇతర విటమినుల యావశ్యకమంతగా ఉన్నట్టు నిర్ధారణ కాలేదుకాని 'ఏ' విటమిను 'డీ' విటమిను మాత్రము పశుగ్రాసములో ఉండితీరాలని చెప్పుతున్నారు.

విటమిను 'డీ' అనేది శరీరముపైన సూర్యరశ్మిపడడముచేత చర్మమునందు ఉద్భవిస్తుంది. మన దేశములో సూర్యరశ్మికి కరువులేదు. సంవత్సరము పొడుగునా దీనిని మనము మన పశువులు కొల్లలుగా అనుభవించగలుగుతాము. ఆహారములో ఇది చేర్చినామా లేదాయని ఎక్కువ పరిశీలింప పనిలేదు.

విటమిను 'ఏ' కథ ఇటువంటిది కాదు. ఇది కాడ్‌లివర్ ఆయిల్ వగైరా జంతుసంబంధమగు నూనెలలో ఎక్కువగా కలదు. కార్జనమునందును ఇతరావయవములందును ఇది నిలువయుంటుంది. వృక్షజాతిలోనైనా ప్రత్యేకముగా ఈ విటమిను ఉండదు. వానిలో 'కారోటీను' అను రంగుపదార్థమొకటి వుంది. దానిని జంతువులు ఆహారించినప్పుడు జంతువుల దేహములో ఇది విటమిను 'ఏ' గా మారుతుంది. వెన్న,

గాజరుగడ్డలు వగైరాలలో కనిపించే పసుపురంగు ఈ 'కారోటీను' జన్యము. గడ్డి గాద తిని బ్రతికే పశువులకు ఈ కారోటీను తన్మూలముగా విటమిను 'ఏ' ఎందులోదొరుకుతుందని పరిశీలించినారు. ల్యూసెరున్ (మసాలాగడ్డి) బార్సీము, క్లోవరు వగైరాలలో పుష్కలంగా వున్నదని నిర్ణయించారు.

పచ్చిస్థితిలో మొక్కజొన్న, ఓట్సు, చొప్ప వగైరాలలో ఇంతకంటె కొంచెము తక్కువగా ఉంటుంది 'కారోటీను'. జొన్న సజ్జ వగైరాలు, గానుగపిండి వగైరాలలో ఏమీ ఉండదన్నమాటే. పసుపుపచ్చ మొక్కజొన్న జాతిలో కావలసినంత 'కారోటీ' నున్నది. మళ్ళీ తెల్లజాతిలోనున్న పచ్చటి లేతగడ్డిలో అంతటా 'కారోటీను' ఉంది. కాని దీనిని ఎండవేయడముతో సూర్యరశ్మిలో ఇది ఎగిరిపోతుంది. వరిగడ్డి ఇతరపొట్లలో ఈ 'కారోటీను' లేదు. అందుచేత పచ్చగడ్డి దొరకని కాలములో గాటికి కట్టివేసి ఏ ఎండుగడ్డిపోచలో తినిపించే తల్లిపశువులకు పుట్టేదూడలు అభివృద్ధి బాగా కావు.

విటమిను 'ఏ' తక్కువైతేనో?

విటమిను 'ఏ' దేహంలోని పొరలనన్నిటిని ఆరోగ్యంగా ఉంచి రోగకారక క్రిములకు ప్రవేశము లేకుండా చేయడమునకై యేర్పడింది. ఇది తక్కువైతే ఈ పొరలు బలహీనమై క్రిములు దేహంపై దండయాత్ర వెడలడానికి తావవుతుంది. అందుచేత విటమిను 'ఏ' తక్కువైన ఆహారముతినే జంతువులు 'న్యుమోనియా'కు లోబడి మరణించడము కలదు.

ఇంకొక కొరత దీని లోపం చేత కలుగుతుంది. కన్నులు బలహీనమవుతాయి. రేచీకటి కలుగుతుంది. ఇది పంజాబులో హెచ్చట. ఈ కొరత చాలా ఎక్కువైతే గ్రుడ్డితనముకూడా రావచ్చును. చూలుతో ఉండే జంతువులు విటమిను 'ఏ' తక్కువైన తిండి తింటే పనికిమాలిన దూడల పెడతాయి. అవి సజీవంలో ఉండవు. ఉన్నా పూర్తిగా గుడ్డివి కావచ్చు. దుర్బలదృష్టికావడం సత్యం. చూలుతో ఉన్నప్పుడు, పాలిచ్చేటప్పుడు జంతువుల పాలన అవసరాలు మూడురెట్లనుంచి అయిదురెట్ల వరకూ పెరుగుతాయి.

కలిగే బెడదలు నివారించవలసి ఉంటే పచ్చిగడ్డి మేపవలె లేదా ఆహారములో కాడ్‌లివర్ ఆయిల్ కలిపి ఇయ్యాలి. ఇందులో విటమిను 'ఏ' దండిగా వుంది.

జంతువులకు కావలసినదేమి?

చూలిలేక పాలియ్యక ఉండే సాదాగోవుకు దినానికి 14 మిల్లిగ్రాములు (సుమారు 1/5 గురిగింజయెత్తు) కారోటీను కావాలి. లెక్కవేసి చూస్తే ప్రతిదినము ఆ జంతువుతినే శుష్కవస్తువులో ఇది పదిలక్షలలో ఒక్కభాగ మవుతుంది. ఇంత కొద్దిపాటి పరిమితికలదైనా ఇది ఆహారములో ఉండి తీరాలి. లేకపోతే జంతువు నష్టపడవలసిందే. ఈమాత్రం కారోటీను తద్వారా విటమిను 'ఏ' 1/2 రతి లేతపచ్చిగడ్డిలోను సరఫరా అవుతుంది. 1/4 రుకు మసాలాగడ్డి బెరుసీము గడ్డిలోను సరఫరా అవుతుంది. 2 అవన్సుల కాడ్‌లివర్ ఆయిలులో ఉంటుంది. వట్టి వగుడుగా ఉండే ఎండుగడ్డి 100 రతులు 150 రతులలోగాని జంతువుకు

కావలసిన ఈ అణుమాత్రమయిన కారోటీను దొరకదు. ఇటీవల పరిశీలనలో వేడిగాలిలో ఆరగించి ఉంచిన గడ్డిలోను లేదా బెల్లపుమడ్డి వగైరాలతో సైలేవచేసిన మేతలోను కారోటీను పరిపూర్ణంగా నిలవయయినట్లు తేలింది.

ఈ కారోటీనుగాని విటమినుగాని కావలసిన దానికంటే ఆహారములో ఎక్కువవుంటే దేహము దానిని కార్జములోను ఇతరత్రను సంరక్షించి ఉంచికొని అది కొరవడినప్పుడు సరఫరా చేసుకొంటుంది. పాలిచ్చే పశువులకెక్కువ 'ఏ' విటమినుఉన్న ఆహారము పెట్టితే అది వాటిపాలు, వెన్నలలో కనిపిస్తుంది. కారోటీను కొద్దిగానో తక్కువగానో ఆహారించే గోవుపాలలో గాని వెన్నలోగాని విటమిను 'ఏ' ఉండనే ఉండదు. కారోటీను ఎక్కువ ఆహారించే ఆవుపాలు 'ఏ' విటమినుకు మంచి సాధనంగా ఏర్పడుతుంది.

శిశువులకు, పెరిగే పిల్లలకు విటమిను 'ఏ' గల గోక్షీరమే ముఖ్యాధారము కాబట్టి ఈవిషయము జనారోగ్య పరామర్శ కలవారందరు చాల గమనింపదగింది. పచ్చిగడ్డి దొరకక గాటిపట్టున ఎండుకర్రలు నమిలే గోవులపాలు 'ఏ' విటమినులో చాలా కొరవడడముచేత బిడ్డల ఆరోగ్యము చెడుతున్నందున అన్ని దేశాలవారును కారోటీను బాగా నిలవ అయ్యే పద్ధతిలో గడ్డిని సంరక్షించే విధానాలాలోచించుచున్నారు. ఆ విధంగా పాలగుణం చెడకుండా సంరక్షింప చూస్తున్నారు. కాని ఈ దిగువ విటమినులనుకూడా చదవండి.

ఏ విటమిన్: చేపకాలేయంనుండి తీసిన చముర్లయందు, పచ్చని ఆకుకూరలందు, గరిక, చిప్పర, గడ్డిజాతులందు, ఏ విటమిన్ ఎక్కువగా వుంటుంది. శరీరవృద్ధికి, ఆరోగ్యంగా వుంటానికి ఏ విటమిన్ అవసరం. ముఖ్యంగా నేత్రాలు, చర్మం సరియగు స్థితిలోనుంటానికి ఈ విటమిన్ కావాలి.

బి1 విటమిన్: పప్పుదినుసులలో దాణాదినుసులలోను గోధుమ, తవుడు పదార్థాలలోను ఈ విటమిన్ వుంటుంది. పాండురోగం, నంజురోగాలను రానీయకుండ కాపాడుతుంది.

బి2 విటమిన్: చేపలలోను, గ్రుడ్లలోను, పాలలోను ఈ విటమిన్ ఉంటుంది. కంటిరోగాలకు, అన్ని రకముల పుండ్లకు ఇది పనిచేస్తుంది.

సి విటమిన్: మొలకధాన్యాలలోను, కూరగాయలలోను, పెద్ద ఉసిరిక లోను ఈ విటమిన్ ఉంటుంది.

డి విటమిన్: ఈ విటమిన్ తక్కువైతే ఎముకలకు సంబంధించిన రోగాలు వస్తాయి. సూర్యరశ్మి సోకుటచేతకూడ ఇది చర్మంలో ఉత్పత్తి అవుతుంది. చమురుపదార్థాలలోను, పాలలోను ఇది ఎక్కువగా ఉంటుంది.

అరణ్యాలు

మనభారతదేశం విస్తీర్ణం 6,25,000 చదరపుమైళ్ళు. దానిలో 15,500 చదరపుమైళ్ళు అరణ్యాలతో నిండివుంది. అరణ్యాలతోనిండిన విస్తీర్ణతచూస్తే మనం కలపకుగాని, అరణ్యాలలోనుండు ఇతర మూలికలకు

గాని యితరులపై ఆధారపడ నవసరంలేదు. మన చెన్న రాజధాని మొత్తంవిస్తీర్ణం 1,25,163 చదరపుమైళ్ళు. అందులో 15,330 చదరపుమైళ్ళు విస్తీర్ణతగల అడవులున్నాయి. 3,174 చదరపుమైళ్ళ విస్తీర్ణతగల పంచాయతీ అడవులు 304 చదరపుమైళ్ళ రక్షణ అడవులు గలవు. అంటే మనరాజధానిలో 15 భాగాలు అడవులతో నిండియున్నదన్నమాట.

కాని, కొన్నిసంవత్సరాలక్రితం, కొండలపై అడవులు దట్టంగా నున్నపుడు, ఇప్పుడు ప్రవహించు పెద్దనదులన్నియు ఇప్పటికన్న ఎక్కువ ఎత్తుతోను ఎల్లపుడు ఒకేమాదిరిగా ప్రవహించుచుండేవి. హానికరమగు వరదలుకూడా వచ్చేవి కావు. ఇప్పుడు కొండలమీద చాలభాగం అడవులు లేకపోవుటచేత, మనకు ఎక్కువ అపాయాలు కలుగుతున్నాయి. ఎక్కువ వరదలు వచ్చుటవలన, నదులు మామూలుగా ప్రవహించు మార్గాలను మార్చి ఒడ్డులను నిలువునా కోయుట, చాలాపెద్దపెద్దగండ్లుపడుట మొదలగునవి జరుగుతున్నాయి. ఇంకా మరికొన్ని నదులు సంవత్సరంలోనే ఎండిపోవుటకూడా జరుగుతున్నవి. వర్షము వచ్చినప్పుడు నీరు ఒక్కసారే దుడుకుగా ప్రవహించి దానితో మన్ను, ఇసుక మొదలగునవి ప్రవాహంతో కొట్టుకొచ్చి, భూములను వ్యవసాయానికి పనికిరాకుండా జేస్తున్నవి. ఇంతేగాక, ఆనకట్టలదగ్గర నీరు నిలుచుచోట్ల పూడికచేసి పైరులకు, విద్యుచ్ఛక్తికి ఆటంకాలు కలిగిస్తున్నాయి. నీలగిరికొండలమీద చెట్లను నరికి దున్ని పైరులను వేసే ప్రదేశాలలో గడచిన అయిదు సంవత్సరాలలో మూడు అంగుళాల సారవంతమైన భూమి క్రిందకు కొట్టుకొనిపోయింది. అంటే 500 టన్నుల సారవంతమగు మట్టిపోయిందన్నమాట. ఈ పోయినమన్ను తిరిగి మామూలుగా రావాలన్న 450 సంవత్సరాలు పడుతుంది. ఈ రీతిగా అరణ్యాలన్నీ నశించిన, ఎన్నో విధాలుగా మనకు నష్టం కలుగుతూవుంది. వ్యవసాయమునకు కావలసిన పనిముట్లు, ఎరువు, ఆకులు, మందుమొక్కలు, పశువులగడ్డి, మంచి గంధపుచెట్లు, కలప సరియైనవి దొరకక ఇబ్బందిపడుతున్నారు. కాబట్టి అరణ్యాలను పెంపొందించే సూత్రాలను ప్రజలు, గవర్నమెంటు అమలులోపెట్టాలి.

బీటిమేత

మేతలన్నిటిలో బీటిమేతయే శ్రేష్ఠమైనది. వ్యవసాయదారులు పశువులయభివృద్ధిని గణింపక పొలాలన్నీ వ్యవసాయముచేయుచు బీడుగా విడిచిపెట్టుటలేదు. కాని బీటిమేతంటే పశువులకు ఎంతో ప్రీతి, ఈ మేతతినిన పశువులు మిగుల బలకరముగానుండి వ్యాధులుకూడా రాజాలవు. మనమెంత తదితర మేతలు మేపినను పశువులకు బీటిమేతయన ఎంతో సంతోషం. బీళ్లలో అనేకరకాల గడ్డిజాతులు వివిధ రకాల ఆకులు, లతలు మున్నగునవి యెన్నో వుండుటవలన ఎంతసేపూ బీటిమేతకొరకు నిరీక్షించుచుంటాయి. ఇంకను బీళ్ళలోనున్న సున్నంవంటి పదార్థాలను గడ్డిజాతులు తీసికొంటాయి.

బీళ్లవిషయంలో కొన్నిసలహాలు

పశువులు బీళ్ళలోగడ్డి మేసేటప్పుడు బాగా ఎదిగిన మేతనే తింటాయి. గొఱ్ఱెలు, మేకలు మాత్రం పొట్టిగానుండే మేతను తింటాయి. లేతపచ్చికను మేపకపోతే, పాలిచ్చే ఆవులు, గేదెలు, దూడలు సరిగా

పెరగవు. ముదిరిన పచ్చిగడ్డి మాత్రం, ఆబోతులు, ఎద్దులు తింటాయి. పాలుపితికే సమయంలోకూడా, పాడిపశువులకు ముదిరిన పచ్చిగడ్డివేయరాదు. అట్లా కొంతకాలం మేపితే జీర్ణశక్తి పాడవుతుంది.

పచ్చికబీళ్లు తడితడిగా నున్నపుడు బీటిలోకి పశువుల్ని పోనీయరాదు. ఇలాతోలితే, ఎదిగేపచ్చికను పశువులు త్రొక్కితే గడ్డిఎదగదు. గడ్డిబాగా ఎదిగున్నకాలంలో పశువులను తోలినా వాటిని ఎక్కువసేపు మేపరాదు. పచ్చిక ఎదిగే కాలంలో, బీటిలో పేడను జల్లిన నాసిరకంగడ్డి ఎదగదు. గడ్డిబాగా ఎదిగినతరువాత పశువుల్ని తోలాలి. లేక ఆ గడ్డిని కోసి మేపాలి. బీటిలోని గడ్డి నెన్నడూ కోయకపోతే, గడ్డిబాగాఎదుగుతుంది. కొంతకాలం గడ్డిఎదగనిచ్చినపిదప పశువుల్ని కొంతకాలం మేపిన తర్వాత, బీటికి విశ్రాంతి ఈయాలి. పచ్చికబీటిలోనికి పశువులను తోలి గొర్రెలనుకూడా తోలడంవలన పచ్చికబీడు బలంగావుంటుంది, కానిముందు పశువులుమేయగా మిగిలియుండే మేతకే గొర్రెలను తోలడం మంచిది. వర్షాకాలంలో బీళ్ళలో పశువులుమేసే, కొన్నిటికి వగర్పు అను వ్యాధిరావచ్చు. అందుచేత గడ్డికి కొరతవచ్చినపుడుమాత్రమే, పశువుల్ని బీళ్ళకు తోలాలి.

బీళ్ళలో రోగాలుకలిగించే విషపదార్థాలు లేకుండా చేయాలి. చిన్న పశువులు ఏ వ్యాధికైనా త్వరగా గురియౌతాయి. పిచ్చిమొక్కలను ఎదగనీయరాదు. పిచ్చిమొక్కలు పశువులకు తింటానికి రుచిగావుండవు. బీళ్లలో మేసే పశువులకు మామూలుగా నీరు పెట్టడం మరచిపోతారు. అవి నీరుత్రాగాలంటే చుట్టుప్రక్కల మురికిగుంటలలో నీరుత్రాగుతాయి. పశువులు వాటిమూత్రాన్ని కూడ వాటిలోనే విడుస్తాయి. నీటిని రోగభూయిష్టం చేస్తాయి. వాటినే మరల త్రాగుతుంటాయి. కాబట్టి నీటితొట్టెలనుగాని, శుభ్రమైన చెరువునుగాని, ఏర్పాటుచేయుట మంచిది. ఆ నీరు గొర్రెలు పందులు త్రాగకుండా చేయాలి. లేకపోతే వాటికి క్షయ, గాలికుంటు, దొమ్మ మున్నగు రోగాలు వస్తాయి.

అధికాహారోత్పత్తి – ఎరువులు

మనదేశములో ఆహారకొరతను, ఆర్థికదుస్థితిని తొలగజేయుటకు ఆహారపంటలలో స్వయంసమృద్ధి చెందవలసియుంది. రైతుల సహకారంతో ఈ పని జరగాలి. పంటలదిగుబడి యీక్రిందనుదహరించిన పద్ధతుల నవలంబించిన, అధికంగా చేయవచ్చు. మంచిరకముల వంగడముల నుపయోగించుట, సరియైన పద్ధతులపై ఎరువులను జాగ్రత్తపరచి, వాటిని క్రమపద్ధతులపై నుపయోగించుట, చక్కని కృషిచేయుట, చీడపురుగులు, తెగుళ్లను నివారించుట, వీటిలో సరియగు ఎరువుల నుపయోగించుటచే పంటదిగుబడి నూటికి పదినుంచి, నలుబదిపాళ్లవరకు అధికంగా చేయవచ్చు.

ప్రపంచములో అన్నిదేశములకంటెను పశుసంపద మనదేశములో నధికంగా కలదు. కాని వాటివల్ల వచ్చు ఎరువును జాగ్రత్తపరచుటయందు రైతులు శ్రద్ధవహించుట లేదు. కొందరు ఈ ఎరువును భూమిపై గుట్టలుగావేసి, వర్షమునకు తడిసి ఎండకు ఎండేటట్లు వదలివేస్తారు. కొందరు గుండ్రంగాను నలుచదరంగాను ఉండు చిన్నగోతులను త్రవ్వి ఎరువులను వేస్తారు. ఈ గోతులుపూడగానే మరల వాటిపైనే మరల

ఎరువును పోగుగా వేస్తారు. ఈ రీతిగా చేయుటవలన ఎరువునుండి పంటకుకావలసిన నత్రజని అమ్మోనియా రూపమున గాలి లోనికి పోవుచున్నది. ఇంతేగాక మొక్కలకు పనికివచ్చు తదితర లవణాలు వర్షపునీటితో కరిగి క్రిందికి పోవుచున్నవి. వారు వేసిన ఎరువుకు సరితూగునంతటి పంటరాకున్నది. అదియునుగాక పైనున్న ఎరువు సరిగా క్రుళ్లకపోవుటచే చిదపలు చిదపలుగా నగుట వలన కొంతభాగము పనికిరాకుండ పోతూ వుంది. పశువుల ఎరువునే క్రమమగుపద్ధతిలో జాగ్రత్తపరచి, పంటల కుపయోగించిన అధికాహారోత్పత్తికి సహాయపడిన వారగుతారు.

25 అడుగుల పొడవు, 3 1/2 అడుగుల వెడల్పు, 3 అడుగుల లోతుగల గోతులను తీయాలి. వీటి ప్రక్కలనుకూడా ఏటవాలుగా త్రవ్వాలి. గోతియొక్క ప్రక్కలు ఏటవాలుగా త్రవ్వాలి. గోతియొక్కలోపల కొల్తలు 23 అడుగుల పొడవు 2 1/2 అడుగుల వెడల్పు ఉండాలి. మరియు లోపల గోతిలోని మట్టంకూడ ఒకప్రక్క ఎత్తుగాను రానురాను ఏటవాలుగాను యుండాలి. ఈవిధంగా త్రవ్వినగోతిలో పడినీరు, ఎరువును పాడుచేయకుండా ఒకప్రక్కకు పోతుంది. తరువాత ఈ నీటిని తీసివేయుటగాని, ఎండకు ఎండునట్లుగా గాని చెయ్యాలి. ఈవిధముగా తయారుచేసిన ఎరువు, మూత్రంతో తడిసినగడ్డి వగైరాలను, తమ యిష్టమువచ్చిన రీతిగా పారవేయరాదు. మెరకగాయున్నప్రక్కనుండి పూర్తిచేయుట మొదలుపెట్టాలి. మెరకవైపున గజము దూరాన గోతిలో ఒక వెదురుతడికను గాని, దడిని గాని అడ్డముగాపెట్టి, ఆ అరను పూర్తిచేయుట ప్రారంభించాలి. ఏరోజు తయారైన పేడను, గడ్డి వగైరాలను, ఆ రోజే అరలోవేసి కొంచెము సర్దుబాటుచేయాలి. దానిపైన పొడిమన్నును అరఅంగుళము దళసరిగా కప్పాలి. ఈరీతిగా పైభాగము వచ్చువరకు వేసి పైన 1 ½ లేక 2 అడుగుల ఎత్తువరకు కూడ ఎరువును వేయాలి. తరువాత వెంటనే ఈ 3 అంగుళముల దళసరిగా మట్టిని దట్టముగా కప్పాలి. అడ్డముగాకట్టిన తడికెను తీసి మరొక అరను తయారుచేసుకోవాలి. ఈరీతిగా అరలు అరలుగా పశువుల ఎరువును జాగ్రత్తగా చేసుకోవాలి. గొయ్యిపై వర్షపునీరు నిలువయుండకుండునట్లు పైభాగమున గోపురము ఆకారముగా మట్టికప్పాలి. ఈ రీతిగా చేయుటవలన ఈ దిగువ లాభాలు కలుగుతాయి.

ఎరువువేసి కప్పినతరువాత కొన్నిరోజులకు క్రుళ్లుట ప్రారంభిస్తుంది. ఎండకు ఎండదు. అందుచేత పూర్తిగా క్రుళ్ళి ఆ ఎరువు ఉపయోగపడుతుంది. నాలుగు మాసాలలోనే ఎరువు తయారవుతుంది. అందుచేత మధ్యకాలంలో కూరగాయలు, తదితరపంటలకు ఎరువుకావలసిన, తయారైన గోతిలోని అరనుండి ఉపయోగించుకొనవచ్చును.

లోపలిభాగము ఏటవాలుగా యుంచుటచే, ఎరువుపైబడిన నీరు నిలువకుండ కొట్టుకొనిపోతుంది. అందుచే వర్షపునీటిలో ఎక్కువగా లవణాలు కరగి, భూమిలోనికి యింకిపోక విలువగల ఎరువు తయారవుతుంది. మట్టిని ప్రతిరోజు కప్పుటచే లోపలి తేమపైకిపోకుండాను, అమ్మోనియా రూపంగా నత్రజని నష్టపడకుండాను సహాయపడుతుంది. మట్టి కప్పుటవలన ఈగలు మున్నగునవి పుట్టవు. పశువులకు,

మనుష్యులకు వాటిబాధ ఉండదు. ఒక సంవత్సరములో ఒక జతపశువులనుండి సుమారు పదిటన్నుల ఎరువును తయారుచేసుకోవచ్చు. మామూలుగా రైతులు చేయుచుండే పద్ధతి ప్రకారం 6 లేక 7 టన్నులకు మించి ఎరువు తయారవదు. ఈ పద్ధతి నవలంబించిన అధికాహారోత్పత్తికి తోడ్పడగలిగిన వారగుతారు.

మనదేశములోని పంటభూములకు నత్రజనికొరత ఎక్కువగా ఉంది. ముఖ్యంగా అవసరమైన ఈ నత్రజని సంబంధమైన ఎరువులకు, భారతదేశం దిగుమతులపై ఆధారపడవలసి వచ్చింది. అన్నిరకాల పైరులకు అంచనావేసి చూచేయెడల సంవత్సరానికి 20 లక్షల టన్నుల నత్రజని ఎరువు కావాల్సివుంటుంది. నత్రజనిని ఎగుమతిచేసే దేశాలు: చైనా, కెనడా, ఇంగ్లండు, నార్వే, బెల్జియంలు. ఈ అయిదు దేశాలనుండి వచ్చే ఎగుమతులు సుమారు నూరుదేశాల అవసరాలను తీర్చాలి. మామూలు ఎరువులు రసాయనిక ఎరువులు అని రెండువిధాలు. మామూలు ఎరువులలో మరల అయిదు రకాలున్నాయి. మందఎరువు అనగా పొలంమీద మందనుకట్టి తద్వారా సాధించిన ఎరువును మందఎరువంటారు. ఇంకా పెంటఎరువులు, పచ్చిఎరువులు, పిండిఎరువులు, ఎముకలఎరువులు అనికూడా వున్నాయి.

మామూలు ఎరువులలో నత్రజని ఉంది. ఈ నత్రజనే కాకుండా హుమాస్ అను పదార్థంకూడా ఉంది. భూమియొక్క సారాలను నిలబెట్టడంలో యీ హుమాస్ ఎక్కువగా పనిచేస్తుంది. పచ్చిఎరువులలోను, పెంటలోను, ఆవుపేడలోను ఈ హుమాస్ ఎక్కువగా లభిస్తుంది.

మనదేశంలో సంవత్సరానికి 8 లక్షల టన్నుల ఆవుపేడ ఉత్పత్తి అవుతుంది. ఈ ఎనిమిది లక్షల టన్నులలో సంవత్సరానికి మూడు లక్షలకు పైగా మాత్రమే ఎరువుగా వాడబడుతుంది.

పట్టణాలలోని చెత్తనుండి గొడ్లదగ్గరనున్న చెత్తనుండి నైట్‌సాయల్ నుండి ఈ పెంటతయారౌతుంది. నైట్‌సాయల్‌నుండి పెంటను తయారుచేయుటకు మనదేశములో నాలుగువేల మునిసిపాల్టీలలోనూ ఆరువందల మున్సిపాల్టీలుమాత్రమే పెంటఎరువును తయారుచేయడానికి కృషిచేస్తున్నాయి, ఈ సంస్థల కృషివల్ల, సంవత్సరమొత్తంమీద ఆరు లక్షలటన్నులు తయారుచేయబడుచున్నదని అంచనావేయబడినట్లు తెలుస్తుంది. ఇందులో అధికభాగం కూరగాయలు పైరులకు ఉపయోగపడుతున్నది. కొంతభాగం ధాన్య సంబంధమైన వాటికి, మరికొన్ని పైరులకు ఉపయోగింపబడుతున్నది. ఈ ఎరువులవల్ల భూమికి కావలసినంత హుమాస్ లభిస్తుంది. ఏడువేల గ్రామాలలో సంవత్సరానికి 10 లక్షల టన్నుల పెంట ఉత్పత్తి చేయబడుతున్నదని అంచనా వేయబడింది.

పచ్చిఎరువులుమాత్రం తగినంత నీటిసప్లయిగల మదరాసు, బెంగాలురాష్ట్రములలో బాగా ఉపయోగించబడుతున్నాయి.

పిండి ఎరువులలో నత్రజని చాలా తక్కువగావుంటుంది. ఈ ఎరువులు సంవత్సరానికి 20 లక్షల 50 వేల టన్నులుమాత్రమే ఉత్పత్తి చేయబడుతున్నాయి.

యుద్ధానికి ముందురోజులలో మాత్రం భారతదేశం సగటున రెండు లక్షల టన్నుల ఎముకలను ఎగుమతిచేసేది. రేవు పట్టణాలవద్ద ఈ ఎముకలు పొడిగా చేయబడి ఓడలపైన విదేశాలకు పంపబడుతుండేవి. ఈ రీతిగా పొడిచేసేటప్పుడు ఎరువు ఉత్పత్తిఅవుతుంది. ఈ ఎగుమతి సంవత్సరానికి 40 వేల టన్నులవరకు దిగిపోతుంది. అందువలన ఎరువులకుగాను ఉపయోగించబడే దానిలో చాలాభాగం తగ్గిపోయింది.

రసాయనిక ఎరువులలో మూడు రకాలున్నాయి. ఒకటి నత్రజని ఎరువులు, రెండు ఫాస్ఫేటుఎరువులు, మూడు ఈ రెండురకాలు కలసిన మిశ్రమఎరువులు. నత్రజనిసంబంధమైన ఎరువులలో మనదేశానికి ఉపయోగింపబడువానిలో అమ్మోనియా గంధకితము. ఇది అన్ని వరిపైరులకు తదితరపైరులకు ఉపయోగిస్తుంది. అమ్మోనియా నత్రిత మనునది మెట్టమాగాని పైరులకు ఉపయోగపడుతుంది. కాని, మొత్తంమీద ఈ రసాయనిక ఎరువులువచ్చినాక కూరగాయలలోని రుచిపోయింది. మామూలు గొడ్లఎరువులు వేసి పెంచినపుడు కాయలలో రుచి రసాయనిక ఎరువులలో లేకపోగా, కొన్ని వ్యాధులకుకూడ మానవులు గురియగుచున్నారు. ప్రతిదానికి సూపరు వాడుటవల్ల ఎంతోనష్టము ప్రజలకు పశువులకు కలుగుతున్నది.

* * *

అయిదవ భాగము

పశుజాతులు

అమృతమహల్ జాతి

మైసూరులోనున్న జాతులన్నిటిలోను ఈ జాతియే ప్రసిద్ధికెక్కింది. ఈ జాతిని మూడు భాగాలుగా విభజింపవచ్చు. హల్లికర్, హగల్వాపి, చిత్రాలదొర్గులనేవి. ఆయాజిల్లాలనుండి వచ్చినవి గాన ఆయాపేర్లు వచ్చినాయి. మనదేశంలో ఈ జాతిని యెచ్చటవున్నా వెంటనే గుర్తింపవచ్చు. ప్రస్తుతము ఉన్న అమృతమహల్ జాతి కలగలుపుగా వుంది.

పూర్వము హళ్ళికార్సు అను ఒకగొల్లజాతి ఉత్తరదిక్కునుండి దక్షిణభాగానికి వచ్చి చిత్రాదుర్గులోను, తూంకూరులోను తమజాతివారితో నివాసమేర్పరచుకొన్నారు. ఈ జాతివారి పశువులనే అమృతమహల్ జాతియంటారు.

ఓడ్వయరుప్రభువు – హైదరాలీ

పూర్వం తత్ప్రదేశప్రభువులలో నొకడగు దేవరాజ ఒడయార్ అను ప్రభువు పశువులయందుండు ఆసక్తిచే ప్రత్యేకంగా వానికొక పశువులకొట్టం నిర్మించాడు. ఇంకను వాని యభివృద్ధిని గూర్చి మిగుల జాగ్రత్తతో నుండేవాడు. వాని పాలు మున్నగునవి గృహనిర్వాహకులు ఉపయోగించుకొనుచుండేవారు. ఈ పశువులను పెంచుటకూడ రాజకీయాలలో నొక ముఖ్యసమస్యయుండేది. మొట్టమొదట పశువులకు ముద్రవేయుట ప్రారంభించింది ఈ ప్రభువే. ఈ రాజు ప్రత్యేకంగా బ్లాకులు చెక్కించి ముద్రించేవాడట.

మైసూరురాజ్యం బలవంతముగ హైదరాలీ వశపరచుకొన్నపుడు ఆ ప్రభుత్వంయొక్క శ్రేష్ఠమైన పశుసంతతిని గూడ గైకొన్నాడు. అట్లు గైకొన్న పశువులలో ముఖ్యమైనవి చిత్రాలదుర్గులోని పాలెగారనునవి. హైదరాలీరాజ్యసంబంధ విషయాలలో యుద్ధసమయాలందు తమ పశువులనుగూడ ఉపయోగించేవాడు. తన రాజ్యంలో 60 వేల ఎద్దులను తయారుచేయించాడు. కాని ఈ ప్రభువు పశువులయందంత శ్రద్ధవహింప లేదు. కుమారుడు టిప్పుసుల్తానుమాత్రం ఈ జాతిని తనకున్న పశువులతో చేర్చి తన తండ్రికన్న మిగుల జాగ్రత్తతో కాపాడేవాడు.

టిప్పుసుల్తాను

చిక్కదేవ ఓడ్వయరు ప్రభువు అమృతమహల్ జాతి పశువుకు పెట్టిన "భిన్నిచావది" అను పేరుకు బదులుగా టిప్పుసుల్తాను "అమృత" అను పేరుగా మార్చాడు. టిప్పుసుల్తాను, ఈ పశుసంతతినిగూర్చి మిగుల జాగ్రత్త తీసికొని ఒక ప్రత్యేకసంస్థగా నేర్పరచాడు. బ్రిటీషువారు మైసూరునకు ముఖ్యపట్టణమగు శ్రీరంగపట్టణాన్ని వశపరచుకొన్న తరువాతకూడ తద్విధముగ అతిజాగ్రత్తతో రక్షించిరి. అమీన్‌దారులు,

ఉద్యోగస్తులు, చిన్నకోడెల నభివృద్ధికి దెచ్చుట జాగ్రత్తగా పెంచుట వారియొక్క విధిగానుండేది. ఆ కోడెదూడలు ప్రభుత్వ శాసన ప్రకారం ఎట్టి పంటలోనైనను స్వేచ్ఛగా విహరించుటకు స్వతంత్రమీయబడింది.

వృషభములు మూడుభాగములుగ విభజింపబడ్డాయి

1. దుక్కిటెద్దులు
2. యుద్ధసమయాలందు తుపాకులు మరఫిరంగులు మోయు ఎద్దులు
3. విలాసార్థమై యుంచబడిన యెద్దులు.

ప్రతి సంవత్సరం పశుసంతతినిగూర్చి సంవత్సరపు లెక్కలు రాజకీయంగా ప్రకటింపబడుతుండేవి. టిప్పుసుల్తాను ప్రభువైయున్న కాలమున తాను స్వయంగ పశువులను ఆయాలెక్కలను పరీక్షించి పశు సంతానము నభివృద్ధిపరచాడు. ఈ రీతిగా చిక్కదేవరాజు ఓడ్వయర్ ప్రభుత్వంలో ఉన్నతదశకు వచ్చిన పశువులే ఈ అమృతమహల్ జాతియైయున్నాయి. ఇట్టి సుప్రసిద్ధజాతి పశువుల సహాయమువలననే హైదరాలీ బ్రిటీష్ ప్రభుత్వముమీదికి యుద్ధానికి పోవుసమయాన నూరుమైళ్ళ దూరమునకు రెండు దినములలో తన యుద్ధసామాగ్రినంత గొనిపోయాడట. హైదరాలీ పశువుల సహాయంచేతనే తాను ఓడిపోయినపుడెల్ల శత్రుముఖమునుండి తన యుద్ధసామగ్రిని అతి త్వరితంగ శత్రువులకందకుండ తొలగించేవాడు. ఇట్టి పశుసంతతిని బ్రిటీషుప్రభువులు హైదరాలీ తనయుడగు టిప్పుసుల్తానునోడించి తాము వశపరచుకొన్నపుడు వానియొక్క ప్రసిద్ధిని గొప్పతనాన్ని గూర్చి ఆశ్చర్యమొందారు.

కెప్టెన్ డేవిడ్సన్

బ్రిటీష్ సేనానియగు కెప్టెన్ డేవిడ్సన్ ఈ జాతిపశువులను గూర్చి క్రిందివిధంగా పొగిడాడు.

బొంబాయిసేనల ననుసరించి ఆఫ్ఘన్‌స్థానమునకు బోయినపుడు మైసూరుసేనతో బోయిన 230 మైసూరెద్దులతో సమానముగ యుద్ధసామగ్రిని ఈడ్చుకొని పోగలిగిన ఎద్దులు ఏ సేనవెంటనూ లేవు. అట్లున్న సాటిరావు. ఈ సేనలు ఆఫ్ఘన్‌స్థానంనుండి మరల తిరిగివచ్చుచున్నపుడు బొంబాయిపార్కులోవిడిచిన సమయంలో ఆ ప్రదేశం ఆ పరిసరప్రాంతాలు గూడ ప్రఖ్యాతివహించిన యీ యెద్దులనుచూచుటకు వచ్చిన జనులతో క్రిక్కిరిసిపోయెను. ఈ ఎద్దులు విశ్రాంతిలేక 16 గంటలు వరుసగా మెడమీద కాడితీయకుండ బరువులాగాయి. బెంగాలుసేనలో ఉన్నటువంటి, ప్రభుత్వ సొత్తయినటువంటి ఎద్దులు చాలా వున్నప్పటికి మైసూరెద్దులంత అందమైనవి బలమైనవి ఓర్పుగలిగినవిగా లేవు.

విల్లింగ్డన్ ప్రభువు, మైసూరుకమీషనర్

కొన్నికొన్ని యితర దిగ్విజయాలు ప్రత్యేకంగా అమృతమహల్ జాతి సహాయమువలననే కలిగినాయి. అయిపురంలో జరిగిన ద్వీపకల్ప యుద్ధసమయమందు ఇంగ్లీషుసేనానియగు విల్లింగ్డన్ ప్రభువు యీక్రింది విధంగా చెప్పాడు:

"సమయంలో నాకు అమృతమహల్ పశువుల సహాయమున్న ఎంత బాగుండును" యని పశ్చాత్తాప పడ్డాడు.

మైసూరుకమీషనర్ 1808 వ సం॥లో ఈ రీతిగా చెప్పాడు:

అమృతమహల్ జాతి పశువులు మిక్కిలి చురుకుదనం బలం కలిగి సేనలకన్న అతిత్వరితంగా నడువ శక్తి గలిగియుండేవి. అరేబియా గుర్రాలు తదితరజాతి గుర్రాలకంటె ఎంతఘనత వహించాయో, అట్లే అమృతమహల్ పశువులుకూడ అన్నిజాతులకంటె అగ్రస్థానం వహించినాయి. మైసూరు ముఖ్యపట్టణ–మగు శ్రీరంగపట్టణం బ్రిటీషుప్రభుత్వ వశమైనపుడు వారాసంతతిని వశపరచుకొన్నారనీ, పిమ్మట తమకు కావలసినపుడు కొన్ని ఎద్దులను సహాయంచేయు షరతుమీద ఆ పశువులను మైసూరు మహారాజునకు వశపరచారు. టిప్పుసుల్తాను బ్రిటీష్‌ప్రభువుల వశమైనప్పటికంటె ఆ పశుసంతతిని ప్రత్యేక జాగ్రత్తతో చూచి యుద్ధసమయాన వాని సహాయంమీద కొంత ఆధారపడేవారు. తరువాత బ్రిటీష్ అధికారమందున్నపుడు పశువుల యభివృద్ధికై నియమింపబడిన ఉద్యోగులు వానినంత జాగ్రత్తగా చూడనందున ప్రాముఖ్యత తగ్గిపోయింది. తత్కారణంగా ఆంగ్లేయప్రభుత్వపు ఆశలన్నియు నిరాశలయ్యాయి. ఆ కారణంవలన ఈ జాతి పశువులు రానురాను క్షీణదశనొందుచు పదమూడు సంవత్సరాలకు వాటియొక్క ప్రాముఖ్యత పూర్తిగా నశించింది.

మైసూరుప్రభుత్వము

ఈ జాతి పశువులు 1813 వ సం॥లో మైసూరు ప్రభుత్వంవారు బీళ్లతోసహా మదరాసు సేనయొక్క భోజన సామాగ్రిని జాగ్రత్తపెట్టే ఉద్యోగస్థుడగు కెప్టెన్ హార్వేగారి వశమొనర్చారు. అప్పుడా సముదాయం పది సంవత్సరములలోనే మిగుల జాగ్రత్తతీసికొనుటవలన రెట్టింపుపశువులాయెను. 1840 వ సంవత్సరంలో మైసూరుమహారాజు పశువులగుంపులను వానికిజెందిన బీళ్ళను బ్రిటీష్‌ప్రభుత్వానికి జెందిన అదే జాతి పశు సముదాయాన్ని కలిపి మైసూరు కమీషనర్ వారి స్వాధీనంచేశాడు. 1860 వ సంవత్సరంలో మైసూరు ప్రభుత్వప్రతినిధి యాజ్ఞవలన ఆ పశువుయందు అజాగ్రత్తప్రబలుట మీదుమిక్కిలి వానిని అమ్మివేయుటయు గూడజరిగింది. తరువాత వారికే ఆ పనిచేయుట తప్పుగా కనపడింది. వానిని అమ్ముటవలన ఫలితం ప్రజాస్వామ్యమునకు ప్రభుత్వానికిగూడ మిక్కిలి నష్టంకలిగింది. తరువాత మైసూరుమహారాజు సహాయంచేత పశుసంతానాభివృద్ధిని గూర్చి మిక్కిలి జాగ్రత్తపడ్డాడు. మరల కొంతధనం వెచ్చించి అమృతమహల్‌జాతి ఎద్దులను, ఆవులను మైసూరుదేశమంతయు విసుగు విరామములేక వెదకి వానిలో శ్రేష్ఠమైనవానినిమాత్రం తీసికొని ఆ జాతిని పెంపొందింప మొదలుపెట్టాడు.

మద్రాసు ప్రభుత్వము

అదే సమయాన మద్రాసు ప్రభుత్వంకూడ కన్నుతెరచి కొంతధనము వెచ్చించి మంచి సాంప్రదాయం గల 4000 ఆవులను 100 శ్రేష్ఠమైన కోడెలను 1870 వ సం॥లో కొన్నది. 1833 వ సం॥లో బ్రిటీష్

ప్రభుత్వం ఈ పశువులన్నిటిని మైసూరుమహారాజునకు 2 లక్షల 25 వేలరూపాయలకమ్మింది. మైసూరు మహారాజు వానియందుప్రీతిచే అదేసమయముగనెంచి, వానికి వలసినంత వెచ్చించి, తగిన శ్రద్ధనుజూపి వానియభివృద్ధికి మిక్కిలిపాటుపడ్డాడు. తుదకీజాతిని పూర్వజాతి పశువులస్థితికికూడ తేగలిగాడు. పశుశాలలను గూర్చి పశువులనన్నింటిని గూర్చి కొన్నిపుస్తకములలో విపులంగా వ్రాయబడింది. వానికిగూడ జననమరణములు అతిజాగ్రత్తగా వ్రాయబడిన ప్రతినెల రిపోర్టును ప్రకటించేవారు. పశువుల మేపువారి అజాగ్రత్త వారి దొంగలెక్కలు జాగ్రత్తగా పరిశీలించుచుండేవాడు. మద్రాసు ప్రభుత్వమునకు ప్రతిసంవత్సరం ఈ జాతినుండి మైసూరు ప్రభుత్వమువారు 200 ఎద్దులను మాత్రమిచ్చేవారు. ఇతరులెవరైనా ఆ జాతిపశువులు కావలెనని కోరేయెడల మైసూరు, బెంగుళూరు ప్రభుత్వసేనాధికారుల అనుమతితో బడసేవారు. ఒక్కోపశువు ఖరీదు నూరురూపాయలుండేది. మైసూరుప్రభుత్వమువారు దేశములో ఆర్థిక క్లిష్ట పరిస్థితులు సంభవించి–నపుడు తమ పశువులనమ్మిన ఆరు సంవత్సరాల తరువాత మైసూరుమహారాజు మరల వానియభివృద్ధికి గడంగెను. కొంతమంది ప్రత్యేకోద్యోగులు మైసూరుదేశమంతయు తిరిగి ప్రత్యేకముగ అమృతమహల్ జాతికి చెందిన ఆవులను, ఎద్దులను కొనుటకు నియమింపబడ్డారు. కాని వారు అట్లుగాక ఆ జాతిలోనే కొన్నిరకములగు హళ్ళీకర్, చిత్రాలదుర్గ, హగల్‌పడి మొదలగు అన్నిరకపు పశువులను కలుపుకొనుటవలన మంచిజాతి పశువులు దొరకుట కష్టమైంది.

అమృతమహల్ జాతి

ఈ జాతిపశువులు కొత్తమనుష్యులను చూచినయెడల కోపించి మీదకు దూకుతాయి. వానిని సాధుత్వం లోనికి దెచ్చుటకు కొన్నిమాసాలు పడుతుంది. వానిని మచ్చికచేసికోటానికి కొన్నిదినాలవరకు ఆహారము పెట్టక పోయినయెడల అతిబలహీనస్థితికివచ్చి చెప్పినట్లు వింటాయి. వానిచే యెల్లప్పుడును మంచిబరువులను లాగించుచు బాగాపనిచేయించుచుండిననే గాని అవి అంకెకు రావు. ఆవులుకూడ ఎద్దులంత ప్రశస్తమైనవి కావు. కారణము ఏమన అవి అంతగా పాలిచ్చేవికావు. అవి యిచ్చుపాలు వానిదూడలకే చాలుతాయి. కాని గృహకృత్యములకెంత మాత్రము పనికిరావు. మంచిఆవులు పూటకు శేరుపాలు యిస్తాయి. ఈ పాలుమాత్రం అతిశ్రేష్ఠంగాను, తీపిగ ఉంటాయి. మైసూరుజిల్లాలోనున్న ఈ జాతిపశువులు తొలికాన్పు ఆరు సంవత్సరాల వయస్సున యీనుతాయి. దూడలకు పగటివేళ స్వేచ్ఛగా వాని తల్లులదగ్గరనే వదలిపెట్టి రాత్రిపూటమాత్రం ప్రత్యేకంగాఉంచి కాపాడుతారు. వానికి మూడు మాసాలు వచ్చినతరువాత మిక్కిలి జాగ్రత్తగా పెంచుతూ మంచిమంచి బీళ్ళలోనికి వదలిపెడతారు.

అమృతమహల్‌జాతి

తల: పొడవుగానుండి శరీరానికి అందం యిచ్చుచుండును. రోషవంతాలై పౌరుషంగా, నలుపుగా, చిన్నవిగా, ఉబికియుండు కన్నులుగలిగి చెవులు నిక్కబొడుచుకొని; కొమ్ములు పలుచగ, అందముగ, పొడవుగ; మూపురము బలముగ, అందముగ, పొడవుగ, మంచిఆకారముగ; గంగడోలు పలుచగ పొట్టిగనుండి

వెడల్పురొమ్ము బలంగల భుజాలు, బలంగ గుండ్రంగా ఉండు ప్రక్కటెముకలు; తోక మందంలేక, పొట్టిగ, సన్నగ కాళ్ళు చక్కగానమరి బలంగలవై యినుపముక్కలా యనునట్లును, కాళ్ళలోని ఎముకలు మందంగాను, చీలమండకు వెనుకభాగాన వెండ్రుకలుండెడు ఉబ్బెత్తుభాగం పొట్టిగాను, చిన్నవిగ, మందంగనుండు డెక్కలును, కొమ్ములు, డెక్కెలు, మూతిభాగాల చర్మం నలుపుగాను; చర్మం పలుచగా ఒకవిధమగు పట్టువలె, పొట్టిగ, మృదువుగనుండు బొచ్చుగలిగి పశువు అన్నివిధాల ఆరోగ్యకరంగ, మంచిగుణంకలదిగా ఉంటుంది.

మైసూరుజాతి

ఈ జాతికిని, ఒంగోలుజాతికిని దగ్గరపోలిక యుంటుంది. మైసూరుజాతిని ప్రతి పల్లెటూరు రైతులును సర్దాకొరకు పనులకొరకు తెప్పించుకుంటారు. ఈ పశువులను చూచుటకు అన్నిదేశాలనుండి ప్రతిసంవత్సరం జరుగు మైసూరు మహారాజావారి దసరాయుత్సవాలకు పోతుంటారు. ఈ పశువులు చిన్నవిగ పలువిధ రంగులతోడను ఉంటాయి. వ్యవసాయదారులు ఈ పశువులమీదనే ఆధారపడియుంటారు.

మైసూరుజాతిని "నాతుదాన" యని ఆయా ప్రాంతాలవారు పిలుస్తారు. రెండవ జాతిని "దద్ధోదనా" యని యంటారు. అనగా పెద్ద పశువని అర్థము. కాని ఇవి అంతఎక్కువగా దొరకవు. అట్లు దొరికినా యెక్కువ ఖరీదుండును. "దద్ధోదనా" "నాతుదాన" యనునవి మైసూరుపదాలు. దద్ధోదనా పశువు అమృతమహల్, హళ్ళీకర్, చిత్రాలదుర్గు, అనుంబాడి, మహాదేవరచెత్త అను ఇతర పశుజాతుల వలె వుంటాయి.

ఈ పశువులు ధనికులవద్ద పెద్దరైతులవద్ద కనబడుతాయి. కొంతమంది రైతులు ఈ పశువర్తకం మీదనే జీవిస్తారు. చాలామంది రైతులు ఆవులమందలను పశుసంతతి కొరకు కొండమీదకు, తదితర ప్రాంతాలకు తోలుకొనిపోయి మేపుతారు. ఒకసంవత్సర ప్రాయపు దూడలను రైతులు ఆ మందలనుండి విడదీసి రెండు మూడు సంవత్సరాల వరకు మేపి మంచిలాభాలకమ్ముతారు. దద్ధోదనా అను జాతి ఎద్దులలో శ్రేష్ఠమైనవానిని కొన్నిటిని తీసికొని తమయింటివద్దనే యుంచి బాగుగ మేపుతారు. ఇంకను పంటలమీదకు, బీడుభూములలోనికి, గోవులమందలోనికి తోలి జాగ్రత్తగా మేపి ఆబోతులుగా తయారుచేసి వానిని మిక్కిలి పవిత్రవంతముగా చూస్తారు.

దద్ధోదనా జాతి

ఈ జాతి దూడలను బాల్యమందే రైతులు తదితర పశువులనుండి విడదీసి అమ్ముతారు. ఇవి మంచి బలంగలిగి బుద్ధికలవిగ వుంటాయి. ఈ జాతి ఆబోతుల నంత బలియునట్లుగా మేపరు. గ్రామములలోనే అన్ని పశువులను ఆబోతులనుకలిపి మేతకు తోలుటచేత కల్తీసంతతి కలుగుతుంది. ఒక్కొక్కప్పుడు రెండు మూడు గ్రామాలవారు చందాలు వసూలుచేసి చిన్నదిగను, మంచిలక్షణాలు గలదిగ నుండు కోడెదూడను కొంటారు. అది గ్రామధనమై గ్రామస్థులందరకు చెందినదై యుంటుంది. దీనిని పంటపొలము లన్నిటికి వదలిపెడతారు. ఆ పశువు స్వేచ్ఛగామేసి బాగుగా బలిసినతరువాత ఆవులమీదకు

వదలిపెడతారు. దద్దోదనా సంతతి ఆవుల ఇంటివద్దనేయుంచి మేపుతారు. వారికి మంచి ఆబోతులను సమకూర్చి మంచి సంతతులు కలుగునట్లు చేస్తారు. ఆబోతునకు వృద్ధాప్యం రాగానే దానిస్థానంలో మరియొక మంచిదూడను ఆబోతుగాజేసి విడుస్తారు.

మైసూరుజాతిఎద్లు

అమృతమహల్‌జాతి మైసూరుదేశంలోనిదే యగుటవలన మనదేశమందంతట ప్రసిద్ధికెక్కినవి. అన్ని జిల్లాలవారు ఇప్పుడిప్పుడే ధనవంతులలో కొందరు స్వారిచేయించుటకు, సర్దాకొరకు తీసికొనివస్తున్నారు. ఇవి దూరప్రయాణానికి పనికివస్తాయి. దుక్కికి అంత మంచివి గావు. విశేషంగా బరువులు లాగలేవు. గాలికుంటు తగిలినప్పుడు జాగ్రత్తగా కాపాడాలి.

లక్షణాలు

కన్నులు : సాధుత్వంగా, స్పష్టంగా రెప్పవెండ్రుకలు నలుపురంగుగా
చెవులు : పొట్టిగా వెడల్పుగా నుండి నిక్కబొడుచుకొనియు,
మూతి : పొట్టిగా, అందంగాను,
గంగడోలు: విజృంభించియు,
మూపురం : పెద్దదిగాను,
కొమ్ములు : పెద్దవిగా, నునుపుగాను,
కాళ్ళు : సమచతురంలోను, కాళ్ళఎముకలు బల్లపరుపుగా బలిష్ఠంగాను,
శరీరం : వెనుకభాగం వంగియుండి విశాలంగాను,
రంగు : తెలుపుగ లేక గోధుమరంగుగను, తల కాళ్ళు మెడ భాగాలు ఎక్కువరంగు గలిగియు ఉంటాయి.

ఒంగోలుజాతి

ఈ జాతి పశువులు కూడ ఇండియాలోనేగాక పరదేశములలోగూడ ప్రఖ్యాతి చెందినాయి. మొదట నెల్లూరుజిల్లాలోని ఉత్తరభాగపు తాలూకాలలోనే ఈ పశువులెక్కుగా ఉండేవి. రైతులెక్కువగా ఈ పశు సంతానాభివృద్ధికై తమకాలమును వ్యయపరచుచుండేవారు.

కారుమంచి, నిడమానూరు, పొందూరు, జయవరం, టంగుటూరు, కరవది మున్నగు గ్రామాలలో మిక్కిలి మంచి పశువులు దొరుకుతాయి. మరియు వెలుపలపదను, నెన్నూరుపాడు మూసి తీరమందున్న పల్లెటూళ్ళలోను, కందుకూరు తాలూకాలోగూడ నీజాతిలో ప్రసిద్ధమయిన పశువులు దొరుకుతాయి. దగ్గర మాగాణిప్రదేశాలలోవున్న నెల్లూరు దక్షిణభాగంలో పశువులు బహుతక్కువజాతివి. అంతేగాక ఆ యా ప్రదేశాలవారు పైప్రదేశాలవారివలె గాక పశువుల యందు అంత జాగ్రత్తవహింపక వానికి సరియగు పోషణ కూడ చేయరు.

ఎద్దులు బరువులు లాగుట

ఒంగోలుజాతి ఎద్దులు మైసూరుజాతి యంత అందముగా వుండకపోయినను, అంతవేగంగ నడువకపోయినా ఎక్కువబరువులు లాగుటలో నెమ్మదిగా లాగినప్పటికి అన్నిజాతిపశువులను మించి అగ్రస్థానం వహించాయి. వానిని ప్రత్యేకంగ బరువులు లాగుటకే ఉపయోగిస్తారు. చెన్నపట్టణంలో అయిదు టన్నుల వరకు బరువుగల సామానులను ఇవి లాగుట చూస్తాం. ప్రశస్తమయిన పశుసంతతి ఇచ్చట కలుగుటకు కారణం అచటనుండు బీళ్లే అయివున్నవి.

1857 వ సంవత్సరం ముందుకూడ వీనిమీద పన్నువేశారు. నెల్లూరులోమాత్రం వేయలేదు. సాగుచేయబడు భూములలో నూటికి 80 వ వంతు ఇతరభూమిని ప్రత్యేకంగా బీళ్ళకు వదలిపెట్టేవారు. ఆ బీళ్ళలో ప్రతిగ్రామస్థుడు పెంచుటకు హక్కువుండేది. 1858 వ సంవత్సరంవరకు పశుసంతానాభివృద్ధికి ఉత్సాహమొసంగుటకు సాంవత్సరిక పశుప్రదర్శనలు జరుగుచుండేవి. అవి 1871 వరకుగూడ జరుగుచునే వచ్చినవి. ఈ 12 సంవత్సరములలోను 18 వేల రూపాయలు పశుప్రదర్శనలలో బహుమానాలుగ పంచిపెట్టబడ్డాయి.

లక్షణాలు

తల : అంత పెద్దదిగను, ఎక్కువ బరువుగను యుండక దాదాపు శరీరానికి తగిన పరిమితిగను,

ముఖము : ఒక మాదిరి పొడవుగను,

మూతి : బాగుగ బలిసి వెడల్పుగల ముక్కురంధ్రాలు కలిగియు,

నొసలు : బాగుగా వెడల్పుగాను,

కన్నులు : కోడిగ్రుడ్డు ఆకారంగలిగిన విశాలమైన కన్నులలో నలుపుగ్రుడ్డుకలిగియు, కంటిచుట్టు అరఅంగుళం వెడల్పున నలుపురంగు గల చర్మమును,

చెవులు : సామాన్య పొడవుగను,

కొమ్ములు : పొట్టిగ ఉండి వెనుకకుగాని ముందుకుగాని తిరిగియు ఆవులలో కొమ్ములు పలుచగనుండి పొడవుగను,

మెడ : చిన్నదిగ, లావుగ, మందంగా,

మూపురం : మంచికండరంగలిగి నలుపుగను

శరీరం : పెద్దదిగ, లావుగ, పొడవుగ మిక్కిలి శ్రేష్ఠమయిన పశువుల టంగువారు మూపురానికి వెనుకభాగానికి 84 అంగుళాలును, క్రిందినుండి ఎత్తు మూపురానికి వెనుకభాగాన 36 అంగుళాలును,

గంగడోలు: కండరాలతో నుండి, ముడుతలుపడి బొడ్డువరకు వ్యాపించియుండును,

ఎదుర్రొమ్ము: లోతుగ, వెడల్పుగను రెండు ముంగాళ్ళమధ్య లోతుగను ప్రక్కటెముకలు పొడుగుగ లోతుగనుండి రెండువైపుల సమానమయిన ఎముకలుగలిగియును,

వెన్ను : సామాన్యమయిన పొడవుగలిగి అందంగాను వెన్నుభాగం వంగియును,

తోక : అడుగుభాగాన సన్నంగా నుండక మందంగాను పొడవుగ అందంగ జాలరుతో అలంకరింపబడి చివర కుచ్చువలెను తోకయొక్క చివర మడిమలకు తగులుతును.

గుదము : తోకయొక్క వెనుకభాగం వెడల్పుగాను,

తొడలు : కండరాలుగలిగి బాగుగా వృద్ధిజెంది లోతుగాను,

కాళ్ళు : కొద్ది వంకరగానుండి బలంగాను బలమైన పొడుగాటి భుజాలుకలిగి బలముగలిగి మొద్దుగను,

పాదాలు : పొడవుగావుండి ఒకమాదిరి మృదువుగనుండి చీలియు

ఎత్తు : చాలా ఎత్తుగను మంచివయస్సు వచ్చినపుడు 56 మొదలు 62 అంగుళాలు ఎత్తువరకును.

రంగు : తెలుపు లేక బూడిదరంగుగాని లేక నలుపు తెలుపుగాగాని మూపురం తెలుపుగనుండి మెడమీద అచ్చటచ్చట నలుపు లేక బూడిద వర్ణపు మచ్చలును, మూతి నలుపుగాను, మోకాళ్ళమీద, శీలమండలకు కొద్దిగ పైభాగాన వెనుక కాళ్ళమీద అచ్చటచ్చట నల్లనిమచ్చలుంటాయి.

కపిలియన్ జాతి

కంభంలోని కపిలియన్సుజాతి మనుష్యులు ఒకజాతి పశువులను పెంచుతారు. కపిలియన్సు పెంచుటచేతనే ఈ జాతి కీపేరువచ్చింది. ఈ జాతి కన్నడజాతివారి సంతతి యగుటచేత ఇప్పటికి కన్నడభాష లోనే మాట్లాడుతారు. అవి చిన్నవిగాను, చురుకుగను ఉండి, మిక్కిలి ఓర్పుతో బండ్లు లాగుతాయి.

ఆవులనుండి పాలుతీయరు. వానిసంతానాభివృద్ధికై పెంచుతారు. ఈ జాతిపశువేదైన చచ్చిన దానిని పాతివేస్తారేగాని మాదిగవాని చర్మము నొలుచు కత్తికి గురి కానీయరు. ఆ పశుసమూహంతో నున్న పెద్ద పశువును పశురాజం లేక పల్లడుపశువు అని పిలుస్తారు. అది చనిపోయినపుడు మరియొకదానిని గొప్ప ఉత్సవంతో ఆ పదవికి నెలకొల్పుతారు. ఆ యుత్సవ సమయంలో ఆ పశుజాతి సమూహమంతయు ఒకచోట కల్పించబడియుంటుంది. చెరుకుగడ మోపులను వానిముందుంచి వాటిచుట్టును మూగియుండిన ఆ జాతి మనుష్యులు ఆ పశుసముదాయంలో నేది ముందుగ ముట్టునో యని చూస్తారు. అట్లు మొదట సాహసించి ఆ చెరుకుగడలను తిను దూడను ఆ పశుసమూహానికి రాజుగాజేసి దానికి కుంకుమపెట్టి పూలదండలతో నలంకరించుతారు. దీనినే నందగోపాలస్వామి యంటారు.

నంద గోపాలస్వామి

ఈ నందగోపాలస్వామి యను రాజునకు ఒక నౌకరుని ప్రత్యేకంగా నుంచుతారు. ఆ నౌకరునకు కొంత పొలం ఈనాంగా యిస్తారు. అతనికి ఆ పశువురాజుగా చేయకముందు జరుగు ఉత్సవంలో అచ్చటివారందరును మిక్కిలి భక్తితోవేయు నగలు, రాగిడబ్బులు మున్నగు కానుకలన్నియు అతడే గ్రహిస్తాడు. ఈ పశురాజులు అనేకమైన అత్యాశ్చర్యమైన పనులుచేస్తాయి. అవి చేసే పనులనుగూర్చి ఇప్పటికిని అనేకమం దనేకరకాల కథలు చెప్పుకొంటారు.

తంజావూరుజాతి

ఈ జాతి పశువులు చెన్నరాజధానిలో నున్న అన్నిపశువుల కంటె మిక్కిలి వ్యత్యాసంగ నుంటాయి. కారణమేమంటే వాని కొమ్ములను కోసివేసినందున బ్రిటీష్‌జాతి పశువులవలెనే యుంటాయి. తంజావూరు గృహాలలో ప్రత్యేకంగ మేపబడిన ఆవుల సంతతి యగు దూడలను వాని యజమానులే వానికి ఆరు మాసాల ప్రాయం వచ్చినపుడు కొమ్ములు కోస్తారు. కోసివేయటానికి ఈ క్రింది పద్ధతి ననుసరిస్తారు.

కొన్నిటికి తోకవెంట్రుకలను తీసి వాటిని చెరుకురసంతో గాని లేక పంచదారతోగాని కలిపి కొమ్ములపైన పూతపెట్టుతారు. అంతట యినుపకడ్డిని కాల్చి కొమ్ము పూర్తిగ కాలిపోవువరకు ఆ కడ్డీతో చుట్టును గీస్తారు. కొమ్ము పూర్తిగ నశించేవరకు రెండు మూడు వారాలు పడుతుంది. ఒకసారి కాల్చిన తరువాత మరల వానిజన్మలో కొమ్ము లెంతమాత్రం పెరగవు. తరువాత వాని చెవులను రెండంగుళాలు కత్తిరిస్తారు. అట్లు కొమ్ములను కాల్చనియెడల అవి మిక్కిలి పొగరుబోతులై మనుష్యులమీదకు వస్తాయని ఆ పని చేస్తారు. అలా చేయుటవలన వాని సహజాకారంనందు పెద్దమార్పుకలిగి అవియొక క్రొత్తరకపు పశువులోయన్నట్లు కనపడతాయి. ఆ కొమ్ముల విషయంలోతప్ప తక్కిన అన్ని విషయాలు ఈ తంజావూరు పశువులు కంగాయం జాతిని పోలియుంటాయి.

లక్షణాలు

తల పొట్టిగ నొసలు వంగియుండును. కన్నులు విశాలముగాను, చెవులు కత్తిరించియు కొమ్ములుండవు. మెడ పొట్టిగ మందముగను వీపు ఎత్తుపల్లాలులేక సరిసమానముగాను, వీపువైపుకు పోనుపోను ఎత్తుగాను, తోక పొడవుగానుండి కొన్ని సమయములందు నేలను తాకుచు, కాళ్ళు పొట్టిగ బలముగను పాదాలు చిన్నవిగ అందంగ గట్టిగను, శరీరం దట్టంగ, రొమ్మెముకలు దట్టముగను, మూపురం ఒకమాదిరి యభివృద్ధి జెందియును, గంగడోలు పలుచగానుండి రొమ్మెముకవరకు వ్యాపించియు, ఎత్తు మూపురమువెనుక 41 నుండి 48 అంగుళాలుంటాయి.

కంగాయం జాతి

ఈ జాతినే కోయంబత్తూరు జాతియంటారు. ఈ జాతి కంగనాడు కాంగు, మరియు కంగాయం అని పిలువబడుతుంది. ఈపేరు కంగాయం తాలూకానుండి వచ్చింది. ఈ పశుసంతతి కోయంబత్తూరు

దక్షిణ భాగంలో యెక్కువగా వుంటుంది. ఇందులో పెద్ద చిన్నయని రెండు రకములు గలవు. చిన్నజాతి కంగాయంలోను, ధరపురంలోను, ఉదమల్‌పేట, పొల్లాకి, పల్లడం, మరియు ఎరోడా తాలూకాలలో యెక్కువగా దొరుకుతాయి.

కంగాయంజాతి పశువులు శ్రేష్ఠమైనవి. ఆయా ప్రదేశవాసులు వానిని తమ భాగ్యముగ జూచు-కొందురు. ఆ ప్రదేశమునం దచ్చటచ్చట ఒక్కొక్కరు 500 నుంచి 1000 పశువుల వరకు కలిగియుంటారు. సామాన్యంగా ప్రతిరైతు 10 నుంచి 20 వరకు పశువులను అమ్మకానికై తనయొద్ద ఉంచుకొంటాడు. ఈపశువులు సంతలోనేగాక తదితర జిల్లాలనుండి బేరగాండ్రువచ్చి వానిని ఖరీదుకు తీసుకుపోతారు. ఇవి దక్షిణహిందూ దేశానికి, సిలోనుకు ఎక్కువగా ఎగుమతి చేయబడుతాయి. ఇవి బలిష్ఠములైన చురుకయిన పశువులు. వీనిని పెంచుటకు చాల తక్కువ వ్యయమవుతుంది. ఆవులుమాత్రం పాలనిస్తాయి.

లక్షణాలు

తలపొట్టిగ, నొసలు విశాలంగ, కన్నులు ప్రకాశవంతంగ, నలుపుగ, చెవులు పొట్టిగ నిక్కబొడుచుకొని, కొమ్ములు పొట్టిగ, గట్టిగ, వెడల్పుగనుండి మొనలుతేలి ఇంకను పెద్దజాతిలో కొమ్ములు బాగుగ పొడవుగ, మెడ పొట్టిగ, లావుగ, మందంగ, మూపురము బాగుగ కండ గలిగి పెరుగునదిగ, గంగడోలు మందంగనుండి రొమ్ముకవరకు వ్యాపించి సన్నగ పొట్టనంటువరకు వ్రేలాడుతు, శరీరము దట్టముగనుండి మంచి ఎముకలు గలిగియు, వీపు పొట్టిగ, వెడల్పుగ, ఎత్తుపల్లాలులేక సాఫీగా, తోక పొడవుగ కుచ్చు వెంట్రుకలు గలిగి పెద్దదిగను అప్పుడప్పుడు నేలకు తాకుచును, కాళ్ళు పొట్టిగ బలంగలిగి, మంచి ఎముకలు గలిగి పాదాలు చిన్నవిగ, పొట్టివిగ, గట్టిగ. రంగు ఎద్దులు బూడిద రంగుగ దట్టమైన బూడిదరంగు తలమీద, మెడమీద, మూపురం మీదను, ఆవులలో చాలాభాగం తెలుపుగను, నాలుగు మోకాళ్ళమీద బూడిదరంగు మచ్చలును, ఎత్తు మూపురం వెనుకభాగమునుండి కొలిచినయెడల 44 లేక 48 అంగుళాలవరకు వుంటాయి.

మధురజాతి

ఈ జాతినే పులికోలం లేక జెల్లీకట్, కిల్‌కడ్ కిల్‌కట్ యంటారు. ఈ జాతి పశువులు చాలా చిన్నవి. మధురజిల్లాలో యెక్కువగ నున్నవి. కంభం ప్రాంతములందుగూడ నివి చాలా కనిపిస్తాయి.

లక్షణాలు

తల : ముఖము సామాన్యపొడవుగా అందంగ నునుపుగను,
నొసలు : విశాలంగను,
కొమ్ములు : పంగటించుకొని వెనుకభాగానికి వంకరలుతిరిగి సన్నని మొనలు దేరియును,
చెవులు : నిక్కబొడుచుకొని పొట్టిగ, నిడుపుగను,

మెడ : లావుగ పొట్టిగను,

మూపురము: పెరుగునదిగాను,

శరీరము : బలంగలిగి మంచి ప్రక్కటెముకలతో కూడియు

వీపు : విశాలంగ పొట్టిగ నుండి నడుము భాగమునకు రొమ్ము భాగానికి మధ్య ఎత్తుగను తోక పొడవుగ, వెండ్రుకల కుచ్చు గలదిగను,

గంగడోలు: సన్నగ పలుచగ నుండి రొమ్ముభాగంవరకే వ్రేలాడుచు,

కాళ్ళు : బలంగ పొట్టిగ ఒకదానితో నొకటి కొట్టుకొనకుండ విడిగను,

రంగు : సామాన్యంగా బూడిదరంగుగ లేక తెలుపుగ యుంటుంది.

గుంసూరు జాతి

గంజాంజిల్లాకు ఉత్తరభాగమందు మాత్రం ఈ జాతి పశువులు కనబడతాయి. ఇవి మిక్కిలి చురుకుదనం గలిగి పనిచేస్తాయి. బండ్లు లాగుట కెక్కువగా ఉపయోగపడతాయి.

లక్షణాలు

తల : చిన్నదిగా, చదునుగల ముఖంగలిగియు,


నొసలు : వెడల్పుగ, నేత్రాలు విశాలంగను,

కొమ్ములు : లోపలికిగాని, ముందుకుగాని వంగియు,


మూపురము: బాగుగా పెరిగియు,

శరీరము : చతురంగా, దట్టంగా, మంచి రొమ్ముమకగలిగి, మంచి బలమైన నడుముగలిగియు,


గంగడోలు: పలుచగా రొమ్ముమకవరకు వ్యాపించి యుంటుంది.




కిల్లారిజాతి ఆబోతు



హళ్ళికర్ జాతి



వ్యవసాయ ట్రాక్టరు



ధన్నిజాతి ఆబోతు

బ్రాహ్మణ జాతి

స్థితిపరులందరు తమతమ బంధువులు చనిపోయినపుడు ఆ గ్రామంలో మంచి తెలుపురంగుగల కోడెదూడను వెదకి దానిని ఈశ్వరార్పణం చేసి తదుపరి దూడను స్వేచ్ఛగా నెటువంటి పొలంలోనైనా మేయుటకు అచ్చుపోసి ఆబోతులుగ విడచుచుండునట్లు ఏర్పాటుచేస్తారు. కాని క్రమ క్రమంగ దానియందుండు భక్తితగ్గి వీలైనంత తక్కువధరలో దొరకు నెట్టికోడెనైనను తీసుకువచ్చి అలా ఆబోతులుగా చేయ ప్రారంభించారు. ఈ ఆచార మిప్పటికిని వుంది. దీనిని బ్రాహ్మణజాతి కోడెయంటారు.

అచ్చుపోసి విడువబడు ఆబోతు సకల సల్లక్షణములు గలిగి ఉత్తమోత్తమమైన వృషభమై యుండాలి. దీనినిగూర్చిన శాస్త్రసాంప్రదాయాలు భారతాది గ్రంథాలయందును, సమస్త ధర్మశాస్త్రాలయందును, ఉండుటచేత, గ్రామంలో చదువుకొన్న పురోహితుని అడిగిన అతను దానిని పుస్తకాలనుండి చెపుతాడు.

సింధుజాతి

ఈ జాతిపశువులు సింధుదేశంలోని కరాచి హైదరాబాదు పట్టణాలందును సింధునది లోయలోను విస్తారంగా కన్పడతాయి. ఇండియాలోని పశుజాతులలో నిదిమిక్కిలి స్వచ్ఛమైనట్టియు ప్రత్యేకలక్షణాలు గలిగినట్టియు జాతులలో నొకటి.

సింధుదేశమున ఈ జాతి పశువులు పాడికేగాక పాటునకు కూడ అనుకూలిస్తాయి. ఎద్దులు తదితరజాతు లంత చురుకైనవి గాకపోయినను నిలకడగా పనిచేస్తాయి.

లక్షణాలు

తల : కురుచగను, నొసలు వెడల్పుగను, ఉన్నతములుగ
చెవులు : పెద్దవిగనుండి కొంచెం వాలియు
కన్నులు : పరిశుభ్రంగ, ఎడంగ
కొమ్ములు : సామాన్య కురచగ లావుగ
శరీరము : వెడల్పుగ మందంగ కురుచకాళ్ళపై నమర్పబడి
గంగడోలు: బొడ్డును వ్రేలాడుతు రొమ్ము వెడల్పుగలవిగ
మూపురము: మధ్య పరిమాణం గలవిగ
తోక : పొడవుగ నల్లని కుచ్చుగలిగి అందం గలవిగ
పొదుగు : కొంచెము కండగలిగి వ్రేలాడేవిగా
చన్నులు : పెద్దవిగనుండి సమముగలవిగ
ఎముకలు : బలముగ చర్మం పలుచగ మృదువుగ
తూకము : ఆవులు ఎద్దులుకూడ మధ్యపరిమాణంగలిగి
ఆకారము : కుదిమట్టమైన ఆకారమును అందమును గలిగియుండాలి

నాగపూరుజాతి

ఈ జాతి ఢిల్లీప్రాంతంనుంచి తేబడినాయి. నాగపూరు ఉత్తర హిందూస్థానమం దక్కడక్కడ గూడ గలవు. చూపులకు బలహీనంగా వుంటాయి. గుట్టమంతవడిగా పరుగెత్తగలవు. ఈ జాతి ఆవులు చాల మచ్చిక గలవిగా వుంటాయి. వీని రెండు కొమ్ములమధ్య ఉబ్బెత్తుగ వుంటుంది. మూపురము ఎత్తుగా అందంగా వుంటుంది. ఇవి 66 అంగుళాల యెత్తువరకు పెరుగుతాయి.

పంజాబుజాతి

వీనినే షహివల్ జాతి లేక మాంటొగోమెరిజాతి యంటారు. ఇవి పంజాబులో పుట్టి అమృతసర్, లైలాపూర్, లాహోర్, కానెవల్ మధ్యలోను పెంచబడుతున్నాయి. ఈ జాతి పశువులు హిందూదేశంలో నున్న జాతులకంటె చాల వన్నెకెక్కినాయి.

ఈ జాతి ఆవులు బాగుగా పాలిస్తాయి. ఒక్కొక్క ఈతకు 7,10,16 వేల పౌనుల పాలిచ్చేవి. ఒక్కొక్క ఈతకు 270 పౌ॥ల వరకు సరాసరిలెక్క చూడగా పాలిచ్చెడి మంచిఆవు 45,000 పౌనులని తేలింది. గిత్తలను రెండున్నర లేక మూడు సంవత్సరాల మధ్య పనులు చేయించేవారు. ఆవు నాలుగు సంవత్సరాలలో నిచ్చెడి పాలు మంచివని చెప్పుతారు.

లక్షణాలు

తల : కురుచగ, నొసలు వెడల్పుగ ఉన్నతమయిందిగా
కన్నులు : శుభ్రంగ, ఎడముగ

మూతి : వెడల్పుగ చెవులు పెద్దవిగనుండి కొంచెం వ్రాలియుండి

మెడ : పొట్టిగ

కొమ్ములు : సామాన్య కురచగ, మందంగ

శరీరము : చిన్నదిగ, వెడల్పుగ, మందంగ,

గంగడోలు: కండరాలుగలిగి మడతలు మడతలుగా నుండి బొడ్డును వ్రేలాడుచు,

మూపురం : మధ్యపరిమాణంగ

తోక : పొడవుగనుండి వెంట్రుకల కుచ్చు నేలకు తాకునట్లు అందముగ

పొదుగు : కొంచెం కండగలిగి వ్రేలాడుచు ఎముకలు బలంగలవిగ నుండును. చన్నులు పెద్దవిగ సమానంగ,

కాళ్ళు : పొట్టిగ, బలం గలవిగ పాదాలు చిన్నవిగ,

రంగు : ఎరుపు, లేక నలుపు ఎరుపు కలసినవిగా వుంటుంది.

ఆవులపొదుగు, చనుమొనలు ఆవులు వయస్సులో పెద్దవైనకొలది పొదుగు ఊగులాడుతూ వుంటాయి.

తార్‌పార్కర్ జాతి

ఇవి సింధుప్రాంతములందున్నాయి. షహివల్‌జాతితో కొంచెము పోలియున్నా సింధుజాతికన్న కొంచెము పెద్దవిగనుంటాయి. ఈ జాతి మిగుల సాధువైంది. బూడిద, తెలుపురంగు కలిగి 750 నుంచి 950 పౌనుల తూకముగలిగి యుంటాయి. ఎద్దులతో రెండున్నర సంవత్సరాల వయస్సు వచ్చినది లగాయితు పనిచేయిస్తారు. ఒక్క ఈతకు 260 నుంచి 350 పౌనుల పాలవరకు యిస్తాయి. ఈతకు మధ్య 100 దినాలు వట్టిపోతాయి.

లక్షణాలు

తల : పొట్టిగ ముఖం నిడుపుగ,

చెవులు : నిడుపుగ,

కొమ్ములు : పొట్టివిగ దృఢంగ,

వీపు : తిన్నగా వెడల్పుగా,

పిరుదులు : ఏటవాలుగ తోక నేలను ఆనుకొని అందమగు కుచ్చు గలిగి,

పొదుగు : చక్కని పాలనరాలుగలిగి చన్నులు సరియగుస్థానంలో నమరియుంటాయి.

గిరిజాతి

ఈ జాతినే గిరిజాతి లేక కతియవార్‌జాతి అనియంటారు. ఈ జాతి పశువులు రాజపుటానాలో పశ్చిమభాగాన, బొంబాయి రాజధానిలో ఉత్తరప్రాంతాన, పంజాబునకు దక్షిణభాగంలోవున్నాయి. ఈ ప్రాంతాలందు పచ్చికబయళ్ళు ఎక్కువగాఉన్నవి. ఈజాతి మిగుల పౌరుషం గలది. క్రూరమృగాల చేష్టలు గలిగియుండుటచేత రైతులు వీనిని తమ యిండ్లదగ్గరనుంచి చాలా జాగ్రత్తగా మేపుతారు. మంచి ఆబోతుతో

సంపర్కముచేయించినచో ఆవులు మంచిసంతతిగలిగి పాలెక్కువ యిస్తాయి. ఈ జాతిలో నాలుగైదు ఆబోతులుచేరి భయంకరములగు సింహాలనుకూడ చంపుతాయి. పూర్వం ఈ జాతి ఆబోతులు యుద్ధము లందుపయోగింపబడేవి.

లక్షణాలు

చెవులు మిగుల పొడవుగనుండి వంగియుంటాయి. ముఖము నిద్రమత్తుతోనున్నట్లగపడుతుంది. కన్నుల దిగువభాగంనుంచి ముఖం ఉండవలసిన దానికన్న సన్నగ శుభ్రంగ వుంటుంది. తలముడుతలు పడి చివర ఆకువలె వ్రేలాడుతు లోపలిభాగం పైకి కనబడుతుంది.

వెన్ను : బలిష్ఠంగాను, సూటిగను వృద్ధాప్యం వచ్చిన పశువుల వీపుమాదిరిగా వంగివుంటుంది.

తోక : పొడవుగావుండి కుచ్చు దాదాపు నేలను తాకుతు కొరడావలె వుంటుంది.

స్వచ్ఛమగు జాతి పశువులకు శరీరమంతయు ఎరుపురంగుగలిగి యుంటుంది. ఇంకను రంగులలో మచ్చలుకూడ ఉంటాయి.

మెడ : సామాన్యమయిన పొడవుగలిగి సన్నంగా ఉంటుంది.

మూపురం : పెద్దదిగా

గంగడోలు: ఎక్కువగా విస్తరించి సామాన్య పొడవుగలిగి,

కొమ్ములు : స్థూలమైన నొసలుగలిగి వెనుక, బయటకు పొడుచుకొనివచ్చి తదుపరి పైకిపోయి లోపలికి వంకరగ తిరిగి చివరకొన ప్రదేశాలు వెనుకకు తిరిగియుంటాయి.

భగ్నారిజాతి

ఈ జాతి పుట్టుకస్థానము బెలూచిస్థానంలోని జకోబాబాద్‌కు ఉత్తరముగా భాగ్‌లోని సింధురాష్ట్ర పరిసరాలలోను అని తెలుస్తుంది. ఈజాతి ఆవులు పాడికి పెట్టినపేరు.

లక్షణాలు

తల : ముఖము సామాన్యవెడల్పుగ,

మెడ : నిడుపుగ కురుచగ, మొనలుదేరిన చెవులు బలిష్ఠముగ ఏటవాలుగ నుండు పృష్ఠములు, నిడుపుగ నుండు వీపు కలిగియుంటుంది.

శరీరపురంగు: తెలుపుగ లేక బూడిదరంగుగ నుండి మెడ మూపురం భుజాలయందు ముదిరినరంగు దాదాపు నలుపురంగుగ వుంటుంది.

హల్లీకర్ జాతి

ఈ జాతిపశువులు ముఖ్యంగా మైసూరులోని తుంకూరు హస్సాన్ మైసూరుజిల్లాలోను పెంచబడు-తున్నది. ఈ జాతిలో అనేక రకాలు గలవు. వీనిలో కొంచెము మార్పుగల రకపు పశువులు మైసూరు రాజ్యమంతలోను ప్రక్కరాష్ట్రంలోను, ఇంకకొన్ని ప్రదేశములందును దొరకుతాయి. ఇతరజాతులకు వీనికి కొమ్ములే పూర్తిగుర్తు. ఉన్నతమగు నొసలే ఉన్నతమగు లక్షణము.

లక్షణాలు

తల : మంచి ఆకారంగా పొడవుగా,

నొసలు : మధ్యభాగాన నాగటిచాలుమాదిరిగ నుండి దాని కిరుప్రక్కల ఉబికి,

చెవులు : పొడవుగ నిక్కబొడుచుకొని

కన్నులు : విశాలంగ, మృదువుగ,

మెడ : పొట్టిగ, మందంగ,

శరీరము : లోతుగ, ప్రక్కటెముకలు దట్టంగ, బలమైన భుజాలు గలిగి,

తోక : పొడవుగ, చివర కుచ్చుగ,

కాళ్లు : పొట్టిగ, మంచి బలముగ,

పాదములు: గట్టిగ, పెద్దవిగ,

చర్మము : నలుపుగ లేక గోధుమరంగుగా వుంటుంది.

బర్గూర్ జాతి

ఈ జాతి పశువులు మద్రాసురాష్ట్రంలోని కోయంబత్తూరు జిల్లాలోని బర్గూరు కొండలలో విస్తారంగ నున్నవి. మైసూరుజాతిని పోలియుంటాయి. ఇవి మూర్ఖజాతియగుటవలన తర్ఫీదుచేయుట చాలకష్టము. ధైర్యములోను, శక్తిలోను, సాహసించుటలోను, వేగంలోను, ఉత్కృష్టమైన జాతి. ఈ జాతి పశువులు ఎరుపుగను, ఎరుపులో తెలుపుగను, తెలుపులో ఎరుపురంగుగను, తెలుపులో బూడిదరంగుగను ఉంటాయి. ఆవులు పాలనంతగా నీయవు.

లక్షణాలు

తల : అందంగ, పొడవుగ ముట్టెవరకు వ్యాపించి,

నొసలు : ఉబికి,

కన్నులు : చూచుటకు భయంకరంగా,

చెవులు : ఒకమాదిరి పొడవుగనుండి నిక్కబొడుచుకొని,

మెడ : పలుచగా మృదువుగా,

గంగడోలు: పలుచగా చిన్నదిగా,

శరీరము : వంగి రొమ్ముకలు దట్టంగా,

పాదాలు : దట్టంగ చిన్నవిగ,

రంగు : తెలుపు, బూడిదరంగుగగాని, ఎరుపు తెలుపు మచ్చలుగాగాని యుంటుంది.

ద్యోనిజాతి

నైజాంరాజ్యపు పశ్చిమాన పశ్చిమోత్తరాన ఈ జాతి పశువులు విరివిగా నున్నవి. బొంబాయిరాష్ట్రంలోని ధన్నీజాతిని పోలియుంటాయి. ఎద్దులకు వ్యవసాయంలో ఎక్కువ నేర్పరితనం గలదు. సాధారణంగా ఈ జాతి కథియవార్‌లో నున్న గిరిజాతిని కొంతవరకు పోలియుంటాయి. నైజాందేశపు ఆవులవలె ఈ జాతి ఆవులు పేరుగాంచినాయి.

ధన్నీజాతి

ఈ జాతి పశ్చిమోత్తరరాష్ట్రంలో అట్టక్, పంజాబులో జహిలమ్, రావల్పిండి ప్రదేశాలలో పెంచబడు-తున్నవి. చురుకులోను, దున్నుటలోను ఎక్కువ ప్రాముఖ్యం వహించినవి. ఈ పశువులు వర్షాలు విస్తారంగా లేని ప్రదేశాలందు పెంచబడుటవలన ధాన్యపుపైరు కంపతోగాని, వీనికి ప్రత్యేకముగ వేయబడిన పైరుతోగాని మేపుతారు. ఆవులుమాత్రం పాడికి పనికిరావు.

లక్షణాలు

తల : సామాన్యంగా నొసలు అందంగ పశువులు మేయునప్పుడు దానికొమ్ములు మూపురందగ్గర వరకు మెడను తాకుతాయి.

చెవులు : పొట్టిగా సున్నితంగా

గంగడోలు: పలుచగా వెన్ను పొడవుగా

డెక్కలు : పలుచగా, చిన్నవిగా

తోక : నల్లనికుచ్చుతో గుది కాళ్ళవరకు వ్రేలాడుతు

రంగు : ముఖంనందు గంగడోలుపైన శరీరంయొక్క క్రిందిభాగాన లేతబూడిదరంగు మచ్చలుంటాయి.

అలంబాడిజాతి

మైసూరుస్టేటునకు దగ్గరగానున్న మదరాసురాష్ట్రంలోని ఉత్తర కోయంబత్తూరు జిల్లాలోను, ఉత్తర సేలంజిల్లాలోను కనుపించుతాయి. ఇవి బండిలాగుటకు మోటుపని చేయుటకు ప్రసిద్ధికెక్కినవి. ఇవి లాగుడున కుపయోగించుజాతి. ఈ జాతి ఆవులుమాత్రం పాలనంతగా ఈయవు.

లక్షణాలు

తల : సామాన్యపొడవుగా కొమ్ములు చిన్నవిగాను.

చెవులు : చిన్నవిగ

మూపురం : ఎద్దునకు తగినంత పెద్దదిగా లేని మూపురము

చర్మం : వదులుగా నుండక బిగువుగా

రంగు : తెలుపు శరీరముపై నల్లని మచ్చలుగాని, ఎరుపు మచ్చలుగాని, ఈ మచ్చలు కొన్ని పశువుల యందు శరీరమంత సమానంగాగాని కొన్ని పశువుల శరీరమంతయు నల్లటి మచ్చలుంటాయి.

కిల్లారిజాతి

బొంబాయిరాష్ట్రపు దక్షిణభాగంలోనున్న షోలాపూర్, సతారా జిల్లాలలో పెంచబడు కిల్లారిజాతి పశువులు ప్రసిద్ధిజెందినాయి. అమృతమహల్ జాతినుండి ఉద్భవించినను వానియంత దట్టముగాగాని, చురుకుగాగాని, గుణములోగాని, మంచి ఎద్దులతో తులతూగగలవిగా ఉండవు. ఉత్తర దేశమందలి బూడిద, తెలుపు పశువుల నెత్తురుకూడ వీనియందుంది. ఇవి కష్టపడి పనిచేస్తాయి.

లక్షణాలు

తల: మైసూరు ఎద్దులవలె దట్టమగు తలయుండునుగాని అంత ప్రాముఖ్యంగ నుండదు. నొసలు సన్నంగ, గంగడోలు: విస్తరించి, తోక: గుదికాలునకు కొంచెం క్రిందవరకువచ్చి నల్లనికుచ్చుతో వ్రేలాడుతూ వుంటుంది.

కృష్ణావేలీ జాతి


కృష్ణానదీతీర ప్రదేశాన బొంబాయిరాష్ట్ర దక్షిణ ప్రాంతాలందు హైదరాబాదు స్టేటుయందు నల్లరేగడ భూములలోను ఈ జాతి పశువులుంటాయి.

లక్షణాలు


శరీరం: పొడవుగా, లావుగా, వెడల్పు బలముగల రొమ్ము యుండును. మెడ: కురచగా, బలంగా, కాళ్ళు: పొడవుగా, తల: ఉండవలసినదానికంటె చిన్నదిగా నొసలు సామాన్యంగా, కొమ్ములు: బయటవైపునకు వంకర తిరిగి చిన్నవిగా, మూపురం: బాగుగా విస్తరించి ఎదురుగా, చెవులు: మొనలుదేరిన చిన్న చెవులుగా నుండి ఎక్కువగా వంగి, తోక: గుది కాలునకు, నేలకు సగముదూరమువచ్చు నలుపురంగు గల కుచ్చు వెండ్రుకలతో సామాన్యం పొడవుగ వుంటుంది.

హరియానాజాతి


ఢిల్లీరాష్ట్రంలోను, పంజాబురాష్ట్రంలోని రోహతక్, హిస్సార్, గుర్గాన్ జిల్లాలలోను ఈ జాతి పశువులెక్కువగా ఉన్నాయి. కలకత్తా తదితర పట్టణాలకు హరియానా జాతి పశువులను పాడికొరకు ఎగుమతి



అమృతమహల్ జాతి ఆబోతు



శింధుజాతి ఆబోతు



చేస్తున్నారు. ఆల్ వార్, భరతపూరు ప్రదేశాలలో ఈ జాతిని ఎక్కువగా ప్రేమించుదురు. త్వరగా దుక్కి దున్నుటకు, రోడ్లమీద బండ్లులాగుటకు ఈ జాతి ఎద్దులు చాలా మంచివి. పాడికిమాత్రం చాలామంచివి.

షహీవాల్‌జాతి

ఈ జాతి పంజాబు రాష్ట్రం సాగులోకి తీసుకురాక పూర్వం దక్షిణాన మధ్యభాగంలోనున్న మెట్టభూముల లోను, అడవులలోను, నదిగట్లమీదను తిరుగుతూ మేస్తూవుండేవి. ఈ జాతి పశువులకు, ఉత్తర పడమర ప్రదేశములలో వుండే భగ్నారీస్, హరియాన, నాకోరిస్, ధన్నిసు జాతులను, రకంలో కొద్దితేడా కన్పించుతూ వుంటుంది.

ఈ జాతి సామాన్యంగ కొంచెం ఎరుపుతోకూడిన కపిలవర్ణంగలదిగా, కొద్ది తెలుపుగ, కొన్ని పశువులకు, గోధుమవర్ణంగా కొన్నింటికి చాలాభాగాలలో తెలుపుగా వుంటాయి. అవి మామూలుగా పొడుగుగ కాలు కురచగా మందంగా వుండి పాలుయిచ్చుటలో చాలామంచివి. వీటి చర్మము చాలా అందంగా వుంటుంది.

ఈ జాతి పాలుఇచ్చుటలో ప్రసిద్ధి చెందుటవలన యివి ఇతరప్రదేశాలకు పట్టణాలకు ఎక్కువగా ఎగుమతి చేయబడినవి. ఈ జాతి ఎద్దులు నెమ్మదిగా చేసేపనికి మాత్రమే ఉపయోగం. బండి లాగుటలో మామూలుగా అంత మంచివి కావు.

అవి వెడల్పాంటి తల, లావుగాను కురచగ కొమ్ములు, బరువైన శరీరము అందమైన చర్మం కలిగియుంటాయి. మగవాటికి లావైన మూపురం గంగడోలు పెద్దదిగ తోక భూమిమీద ఆనుకునేటట్టుగ బారుగ వుంటుంది. ఆవులకు విశాలమైన పొదుగు యుంటుంది.

విదేశాలలో పశుజాతులు

విదేశాలలోని పశువులు మనకంత లాభకరంగా కన్పట్టవు. ఆ దేశాలలో వుండే శీతోష్ణస్థితినిబట్టి అచ్చట పెరిగినంత సులభముగా మన దేశంలో పెంపొందవు. ఆ జాతులలో పాడిపశువులు బాగా పాలిస్తాయి. మగపశువులను గొఱ్ఱెలవలె కోసుకొని తింటారు. మనదేశపు పశువులను వారు రప్పించుకొని జాతులను సంక్రమము చేయుటవలన మనజాతిలో మంచిపశువులు కూడా తక్కువైపోయినాయి.

ముఖ్యమైన విదేశజాతులు

గెరన్సీజాతి, షార్టుహారన్‌జాతి, బూత్‌షార్టుహారన్‌జాతి, హియర్‌ఫోర్డుజాతి, ఎబర్డీన్ ఏంస్సజాతి, డెవాస్‌జాతి, బ్రిటిష్‌హాల్‌స్టీన్‌జాతి, కెర్రీజాతి, డెకస్టర్‌జాతి, డార్జిలింగుజాతి, సుస్సెస్‌జాతి, గేలోజాతి, రెడ్‌పోల్‌జాతి, లాంగ్‌హారన్‌జాతి మున్నగునవి ముఖ్యమైనవి.

దున్నలు – గేదెల జాతులు

ఈ జాతులు మనదేశమున కుత్తరభాగాన ఉన్నాయి. హిమాలయ పర్వత ప్రాంతములందును, అయోధ్య నుంచి బూటాను వరకును, వంగదేశంనుంచి పశ్చిమతీరాన నుండు తిరుహోట్ వరకున్న దేశంలోను, బ్రహ్మపుత్రానది వ్యాపించినంతవరకుండు దేశంలోను, బర్మాలోను మిక్కుటంగ ఉన్నాయి. గేదెలు ఎక్కువగా పాలిచ్చుటవలన ప్రతి పల్లెటూరులోను ఉన్నాయి. దున్నలు బరువుగల బండ్లులాగుటకును, భూములు దున్నుటకును వినియోగపడుతున్నాయి. తెలుపు పశువులవలె నివి ఎండ తీక్ష్ణమును భరింపజాలవు. గేదెలు శరదృతువునందు పొర్లి వేసవికాలం సమీపించు సమయంలో ఈనుతాయి. పచ్చికపడిన గేదెలు మూడు సంవత్సరాలు వచ్చినతరువాత దూడలను పెడతాయి. గేదె సాధారణంగా ఎనిమిదేసి దూడలవరకు పెడుతుంది, సాంప్రదాయాన్నిబట్టి కొన్ని గేదెలు ప్రతిసంవత్సరం ఈనుతాయి. తవుడు చిట్టు మొదలయిన బలకరమగు వాతపదార్థాలు ఎక్కువగ పెట్టుటవలన ఈని త్వరలో వట్టిపోతాయి. ఎద్దులతోపాటు దున్నలున్న పాటునకు పనికివస్తాయి. వీటికి లావుగ పొడవుగనుండు కొమ్ములుకలిగి వంకర తిరిగి అయిదారడుగుల పొడవు గలిగియుంటాయి. రంగు సామాన్యనలుపుగ లేక నలుపురంగుగాను వెంట్రుకలు తక్కువగ వుంటాయి. పల్లపుభూముల సాగున్న చోట వీనియొక్క యుపయోగ మెక్కువగా వుంటుంది. ఇవి నెమ్మదిగా నడచినను పొలాలను దున్నుటలోను, చెరకుతోటలు దున్నుటలోను, తదితరపనులు చేయుటలోను మిక్కిలి ప్రసిద్ధి జెందినాయి.

తోడాదున్నలు

నీలగిరికొండలకు పోవువారికందరికి ఈ దున్నలను గురించి తెలిసియే యుంటుంది. అచ్చటనుండు ప్రతి తోడావానికి ఒకమంద వుంటుంది. సామాన్యముగ నితరచోట్ల నుండువానికిని వీనికిని చాల వ్యత్యాస ముంది. ఈ దున్నలు తలవంచుకొని నడుస్తాయి. అవి అట్లునడచునపుడు చూచిన యెడల భయంకరమైన కుక్కలవలె కనబడుతాయి. మెదడుభాగమందును, మెడభాగమందును, మూపురం వెన్నుభాగాలందును వెంట్రుకలు దట్టముగవుంటాయి. వానిని మనము అజాగ్రత్తగా సమీపించిన యెడల అపాయము కలుగ-చేస్తాయి.

అవి క్రొత్తమనుష్యులను చూడగనే తలపైకెత్తి కొంతదూరం వెనుకకు పరుగిడి మరలనిలబడి తాను చూచిన మనుష్యులవంక భయంకరంగ జూచుచు తలనుపైకెత్తుచు వెళ్ళిపోయి ఇంక కొన్నిదున్నలను ప్రోగుచేసికొని ఆ మనిషిని పొడుచుటకై దండెత్తివస్తాయి. కొన్ని సమయములందు ఆ సమూహమంతయు ఒక్కసారి మహోగ్రతజెంది తలలు క్రిందకువంచి అవి దేనిని చూచి కోపముగనుండునో దానిమీదకు దుమికి చంపివేస్తాయి. ఈ రీతిగనే పెద్దపులి మున్నగు భయంకరమృగాలు సముద్రతీరములందున్నప్పుడు ఈ దున్నలగుంపులు వానిమీదబడి చీల్చివేస్తాయి.

తోడాలుచేయు విచిత్రములు

తోడాలు వివాహములు నిశ్చయించుకొనినపుడు దున్నలను ఒకరికొకరు మార్చుకొంటారు. అదియే వారి ప్రమాణము. మరల వివాహము జరుగునపుడు మరొకసారి యట్లే మార్చుకొంటారు. చచ్చిన మనిషిని స్మశానానికి తీసికొనిపోవునపుడు కొన్నిదున్నలనుకూడ తీసికొని వెళ్ళుతారు. చచ్చినవానియందు ఆ పరిసర గ్రామాలవారు గౌరవము జూపుతారు. దానిమెడలో నొక బొలుగు కట్టియుంటుంది. స్మశానమునకు వెళ్ళినతరువాత "మీరు వెళ్ళుడు, వెళ్ళుడు" అను పదముతో దున్నలను గోతిదగ్గరకు తోలినపుడు అచట నేడ్చువారందరును క్రిందనుండు దుమ్మును కొంచెము కొంచెము తీసికొని దున్నలమీద జల్లుదురు. తదుపరి దున్నలనన్నింటిని చంపుటకేమైన అభ్యంతరం వుందాయని ఆ శవము నడుగుతారు.

చనిపోయిన వారందరికి సంవత్సరీకము చేస్తారు. సంవత్సరీక మొదటి దినమున బలియొసంగుటకు నిర్ణయింపబడిన దున్నలను రెంటిని మూడింటిని బలియిస్తారు. రెండవ దినమున పెట్టెతో కప్పబడిన శవవాహనమును బయటకుతీస్తారు. పశుశాలయొక్క ద్వారముబయట నొక పెద్దగొయ్యి త్రవ్వినతరువాత అచ్చటనున్న పౌరోహితుడు పూజావిధులు గావిస్తాడు. తరువాత పూజారి పూలదండలతో అచ్చటకు తేబడిన దున్నల దగ్గరకు వచ్చి వానిమీద విసరుతాడు. అప్పటికే యువకులచేత నానావిధకష్టములు పెట్టబడియున్న దున్నలు మార్గము కనబడక గల్లంతుచేస్తాయి. కాని వెంటనే బలియిచ్చి పశువుల మొండెములను శవవాహనమువద్దకు ఈడ్చుకొనివచ్చి దానిప్రక్కనుంచి అందరు ఏడుస్తారు. తరువాత జరుగు పని అతి భయంకరంగాను క్రూరంగా వుంటుంది.

* * *

ఆరవ భాగము

పశుపరీక్ష

పశువుల వయస్సు కనుగొనుట

ఎద్దులకు అయిదవ సంవత్సరం వరకు లేతవయస్సు, తరువాత 16 వ యేడువరకు నడివయస్సు, ఆ తరువాత ముసలితనం వస్తుందని పూర్వశాస్త్రాలు తెలుపుతున్నాయి. ఈ కాలంలో సాధారణంగా మూడవ యేటనే పనిలో ప్రవేశపెడతారు. పండ్రెండు, పదునైదు సంవత్సరాలు పనిచేస్తాయి. తర్వాత ముసలిదాని క్రిందే లెక్కవేస్తున్నాం. అయితే అప్పటికీ, యిప్పటికీ పనిలో తేడా కనపడదు.

పశువుల వయస్సులోకూడా ఆనాటికి ఈనాటికి విధానంలో ఒక్కటే కనపడుతూంది. పశువుపుట్టిన ఒకటిన్నర సంవత్సరము లేక రెండు సంవత్సరాలదాక కొమ్ములు త్వరత్వరగా పెరుగుతాయి. మూడు సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికి కొమ్ముమొదలునందు, చారవంటి ఒకగుండ్రని వలయమేర్పడుతుంది. అప్పటినుండి ప్రతిసంవత్సరం ఒక్కొక వలయం ఏర్పడుతుంది. ఆ వలయాలు ఎద్దులకంటె ఆవుల కొమ్ముల మీద, బర్రెల కొమ్ములమీద చక్కగా కన్పడతాయి. కొమ్ములచుట్టుయున్న వలయముల సంఖ్య రెండేసివంతున కలిపినయెడల దాని వయస్సు తెలిసికోవచ్చు, కొమ్ములచుట్టు నాలుగు వలయాలుండి వాటికి రెండు వలయాలు కలిపిన ఆరు అవుతాయి. అప్పుడు పశువువయస్సు, ఆరు సంవత్సరాలని తెలిసికోవాలి. ఈరీతిగా వయస్సు తెలిసికోవాలంటే రెండేసివంతున హెచ్చించుకుంటూ రావాలి. కొందరు బేరగాండ్రు వయస్సు తెలుస్తుందనే భయంతో కొమ్ములను చిత్రికపట్టిస్తారు.

పశువులకు పైదవుడను 12 పళ్లు, క్రిందిదవుడను 20 పళ్లున్ను మొత్తం 32 పళ్లు ఉంటాయి. పైదవడ పళ్ళవరసలో క్రింది 8 పళ్ళకు సరిపోవునంతభాగం గట్టిమాంసపు దిమ్మెమాత్రముంటుంది. గడ్డిని కొరికేటప్పుడు ఆ దిమ్మెకు అదిమిపెట్టి, క్రింది ఎనిమిదిపళ్ళతో నొక్కిపట్టి లాగుతుంది. దూడపుట్టినపుడే చిగుళ్ళనుంచి కొంచెం కొంచెం పాలపళ్లు కనబడతాయి. నెలరోజులయ్యేసరికి 8 పాలపళ్లువస్తాయి. కాని కొంతకాలానికి యివి రాలిపోయి, అసలు పళ్లువస్తాయి.

దూడపుట్టినపుడు లోదౌడయందు రెండు పాలపళ్లుంటాయి. రెండవ వారానికి 4 పళ్ళు, మూడవ వారానికి 6 పళ్లు ఇట్లొకనెలలో 8 పళ్లువచ్చి ఆరు మాసాలవరకు శుభ్రంగా సమానంగావుంటాయి. తర్వాత క్రమేపి రంగుమారి, అరుగుట మొదలుపెడతాయి. 8వ నెలలో మొదటనున్న పాలపండ్లు అరుగుతాయి. సంవత్సరానికి 4 న్ను, 15 నెలలకు 6 న్ను, రెండు సంవత్సరాలకు 8 న్ని అరిగిపోతాయి. మరల మధ్యనున్న రెండు పాలపండ్లూడి, కొత్తగా వచ్చినట్లుగా తెలిసికోవాలి. మూడు సంవత్సరాలకు 4 పళ్లును, నాలుగు సంవత్సరాలకు 6 పళ్లున్ను, అయిదు సంవత్సరాలకు 8 పళ్లు కొత్తగావస్తాయి. మరల పళ్లూడుటకు ప్రారంభిస్తాయి.

మంచివృషభ లక్షణాలు

తల: పెద్దదిగా, చెవులు: మృదువుగానుండి నిక్కబొడుచుకొని, కన్నులు: అంత పెద్దవిగా గాక అంతచిన్నవిగా గాక మధ్యరకంగా వుండి లేడికన్నులవలె రెండు కన్నుల మధ్యభాగము విశాలముగానుండి క్రమక్రమంగా ముక్కురంధ్రాలవరకు కొనతేరియుండాలి. కనుగ్రుడ్లు లోతుగాగాని మిడిగ్రుడ్లుగాగాని యుండక సాధుత్వము చురుకుదనము గలిగి చకచకలాడుతుండాలి.

ముక్కురంధ్రాలు: పెద్దవిగానుండి తెరచుకొని యుండాలి. దౌడలు: ఎరుపురంగు గలిగియుండి దృఢముగాను ఉండాలి.

కొమ్ములు: సన్నగా దృఢముగా, మూపురము: పెద్దదిగానుండి పురుష చిహ్నము కలిగించునదిగాను, మధ్య పీపావలె గుండ్రముగాను, మెడ: బలముగలిగి తలవంచినపుడు కాలువవలెనుండి పొట్టిగ లావుగ దృఢముగాఉండాలి. వక్షస్థలము: విశాలముగాను, నాలుక: సన్నగా కాంతిగాను, చర్మము: నునుపుగా మూపురము మొదలు తోకముడివరకు మిట్టపల్లములు లేక సమానముగాను, కాళ్లు: నాలుగు కురచగానుండి, గట్టి ఎముకలుగలిగి, తొడలు బలముగలిగి, డెక్కలు కఠినముగ నలుపుగ గుండ్రముగ విడివిడిగాను, తోక: భూమిపైకి వ్రేలాడునదిగాను, గంగడోలు: చిన్నదిగాను, రంగు: తెలుపుగానుండి మూపురము కొంచెము నలుపు రంగుగా ఉండాలి.

మంచికోడె లక్షణాలు

మెడ: కురచగా బలముగాను, ముక్కురంధ్రాలు: కాంతిగాను, కన్నులు: విశాలముగాను, నొసలు: వెడల్పుగ, చర్మము: కుత్తుక క్రిందనుండి క్రిందిపొట్టవరకు గంగడోలు వదులుగా ఉండాలి.

మంచిగేదె కుండవలసిన లక్షణాలు

తల: చిన్నదిగా నునుపుగాను; నొసలు: విశాలముగాను; కన్నులు: చిన్నవిగా సొగసుగాను; వెన్ను: లోతుగాను; కాళ్లు: వెనుక కాళ్ళకంటె ముందుకాళ్లుపొట్టిగాను; కడుపు: లోతుగా విశాలముగాను; తోక: సన్నముగా వెంట్రుకలు నలుపుగా బిరుసుగా నిక్కబొడుచుకొని ఉండాలి. స్తనములు: సమానమగు దూరములో నుండి, పాలనరములు స్పష్టముగా కనపడాలి. కొమ్ములు: పశువు నిలుచున్నపుడు మనము దానిమీద నీరుపోసినయెడల దాని ముందుకాళ్ళ డెక్కలమీద ఆ నీరు పడకుండ అడ్డమువచ్చునంతవరకు వంకరతిరిగి శరీరము నానుకొని ఉండాలి.

తోకక్రింద గుదస్థానముపైన గుండ్రని కణతులవలె కనిపించిన గేదెను వివిధరంగులతోకూడియుండు పొదుగుగల గేదెను భుజము పైభాగమున గుంటగానున్న గేదెను కొనుట మహాదోషము.

మంచిదున్నల కుండవలసిన లక్షణాలు

తల: పొడవుగ బరువుగాను; మూపురము: చిన్నదిగానుండి వక్షస్థలము విశాలముగాను; కాళ్లు: పొట్టిగ, బలముగలవిగ లావుగాను; శరీరము: పొడవుగ మిక్కిలి బలము కలిగివుండాలి. కొమ్ములు:

నిలుచున్నపుడు మనము దానిమీద నీరుపోసినయెడల దాని ముందు కాళ్ళు డెక్కలమీద ఆ నీరు పడకుండ అడ్డమువచ్చునంతవరకు వంకర తిరిగి శరీరము నానుకొని వుండాలి. మంచిదున్నలను కొనునప్పుడు కొమ్ములను చూచికొనాలి. కొమ్ముల అందమే శుభలక్షణమని గ్రహించాలి. కొమ్ములు రెండును సమానమైన పొడవుగలవై వెనుకకు వంగి వానియొక్క రెండు మొనలు ఒకదానినొకటి ఎదురుగానున్న యెడల మంచి లక్షణమందురు. నాలుక బయటపెట్టి త్రిప్పుదానిని పాము నాలుకంటారు. గాన కొనకూడదు.

పశువును కొని ఇంటికి తీసికొనివచ్చు చక్రము

తిథి	వారము	నక్షత్రములు
పాడ్యమి	–	–
విదియ	సోమ	స్వాతి
తదియ	బుధ	–
పంచమి	–	పునర్వసు
షష్టి	బుధ	–
సప్తమి	గురు	శ్రవణము
దశమి	శుక్ర	ధనిష్ఠ
ఏకాదశి	–	–
ద్వాదశి	శని	–
చతుర్దశి	–	శతభిషము

పశువులను యాత్రలకు తీసికొని పోవునపుడు ముహూర్తచక్రము

తిథి	వారము	నక్షత్రములు
పాడ్యమి	సోమవారము	పూర్వాభాద్ర 3వ పాదం
విదియ	మంగళవారము	జ్యేష్ఠ, ధనిష్ఠ
తదియ	–	–
పంచమి	బుధవారము	మృగశిర, రేవతి
సప్తమి	గురువారము	అశ్వని, విశాఖ
దశమి	శుక్రవారము	ఆశ్లేష
ఏకాదశి	శనివారము	–

గోక్రయవిక్రయ ముహూర్తచక్రము

ఈ దిగువ చక్రములోనున్న తిథులు, నక్షత్రాల ప్రకారం క్రయవిక్రయాలు జరుపుట మంచిది.

తిథి	వారము	నక్షత్రములు	
పాడ్యమి	సోమ	హస్త	అశ్వని
విదియ	మంగళ	పుష్యమి	పునర్వసు
తదియ	బుధ	రేవతి	కృత్తిక
చవితి	గురు	జ్యేష్ఠ	మృగశిర
పంచమి	శుక్ర	శతభిషం	ధనిష్ఠ

మంచిగోవు లక్షణాలు

తల: అంత పెద్దదిగ, అంతచిన్నదిగ వుండరాదు. నొసలు: విశాలంగాను; కన్నులు: సొగసుగా మిగుల చిన్నవిగా గాని, చాలపెద్దవిగా గాని యుండక సామాన్యంగా వుండాలి. గుంటలుపడక చక్కగా కనపడుతు శాంతిసూచకాలయిన కళలు గలిగియుండాలి. మెడ: పొట్టిగ లావుగాను; ముక్కురంధ్రాలు: కోసుగా పొడవుగాను; కొమ్ములు: వెనుకకు తిరిగిగాని ముందుకు పొడుచుకువచ్చి గాని ఉండాలి. కాళ్లు: పొట్టిగ వంకరలేకుండ ముంగాళ్లు వెడల్పుగ కండబట్టి; తోక: సన్నముగా పొడవుగా నేలకు తగులునట్లుండి చివర చక్కని పెద్దకుంచవలె కుచ్చుండాలి. వీపు: మూపురముప్రక్క కొంచెము పల్లంగా ఉండాలి. వీపు చదునుగాను, వెంట్రుకలు: సన్నగా మెత్తగా నిగనిగలాడుతుండాలి, శరీరము: పొడవుగా తోకవైపు శరీరము మూపురానికి సమానమైన ఎత్తుగా, తొంటి: విశాలముగాను; తొడలు: ఒకదానికొకటి యొరసికొని పోయినట్లుండక విడిగ ఉండాలి.

పొదుగు: పెద్దదియై ముందునుండి వెనుకవైపునకు చాలావరకు వ్యాపించి పెద్దసంచివలె ఉండాలి. పాలు తీసినతరువాత పొదుగు పూర్తిగా మడతలు పడాలి. కండపొదుగులు అంత మంచివి కావు. చూచుటకు అవి అందముగా నుండును, గాని పాలనంతగా ఈయజాలవు.

స్తనములు: నాలుగు సమానమగు దూరములోనుండి ముందువైపు స్తనములు వెనుక వానికంటె నించుక పొట్టిగ ఉండాలి. మూడు, ఒకటి, చన్నులు గల పశువులంత శ్రేష్టమైనవి గావు. కొరివి చన్నులుగల వానిని కొనరాదు.

పశువులను సంతలకు, యాత్రలకు తీసికొనిపోవుటకు ముహూర్తచక్రం

ఈ దిగువ చక్రములోనున్న తిథులు, నక్షత్రాల ప్రకారం క్రయవిక్రయాలు జరుపుట మంచిది.

తిథి	వారము	నక్షత్రములు
పాడ్యమి	–	అశ్వని, భరణి, కృత్తిక
విదియ	సోమవారము	మృగశిర, ఆరుద్ర, పునర్వసు
తదియ	–	–
పంచమి	మంగళవారము	పుష్యమి, ఆశ్లేష, మఖ
షష్టి	బుధవారము	–
సప్తమి	గురువారము	పూర్వాభాద్ర, హస్త 3వ పాదం
దశమి	శుక్రవారము	–
ఏకాదశి	–	జ్యేష్ఠ, అనూరాధ
ద్వాదశి	శనివారము	–
త్రయోదశి	–	మృగశిర, శతభిషం, రేవతి


ఆక్షేపణగల లక్షణాలు


ముఖమును నాగలివలె వంచుకొనియుండు పశువును కొనరాదు. అది పాటుపడక యజమానికి నష్టం కలిగిస్తుంది. పశువు నిలబడి కాళ్లు ఎత్తి ఎత్తి ముందువెనుకలకు ఊగుచుండునది యింటనున్న మహాదోషము. పశుశాలకు కీడు. పశువు నిలబడి ఎడమ, కుడిప్రక్కలకు తలను ఆడిస్తు ఊగుతుంది. ఈ రీతిగా ఏ ప్రక్కకు ఊపినను యజమానికి నష్టమే గాకుండ పశుపీడయుండునని హరీతమహర్షి తెలుపుతున్నాడు. దీనినే ఆసుపోయుట అంటారు. తోకక్రింద గుదస్థానానికి దగ్గరగా రెండు వైపుల మాంసము అధికముగ కూడుకొనియుండు గ్రంధులవలె కనుపించేదానిని కొనరాదు. ఇట్టిది యజమాని సుఖసంపదల నశింపజేస్తుంది. పశువు అంగిలి నలుపుగనున్న యెడల మహాదోషము. అట్టిదానిని యింటనుంచరాదు. అంగిలి ఎరుపుగానుండి ప్రక్కల నలుపురంగుగానున్న ఆక్షేపణ లేదు. అంగిటి మధ్యగా నలుపుగానున్నను మహాదోషము. పశువునోటినుండి ఎల్లపుడు నాలుకబైటికి పోనిచ్చుచు లాగుకొనుచు ఆడించేది అశుభాన్ని కలుగజేస్తుంది. అదీగాక యజమాని ఎంత సిరిసంపదలతో తులదూగునో అంత దరిద్రుడవుతాడు. సమస్త సుఖాలను పోగొడుతుంది. ఏదయిన ధ్వనివిన్నా వాద్యములు విన్నా నీలిరంగుగొడుగు చూచినా బెదిరే ఎద్దును శత్రువులు కూడ కొనరాదు. ఇట్టిది యజమానికి సుఖమీయకపోగా కష్టముల కలుగజేస్తుంది. లేడికడుపువంటి కడుపుగలది ఎక్కువగా పాటుపడుతుంది. కాని బలముగా వుండదు. కొంగకాళ్లవలెనుండు పశువు వికృతాకారముగ బలహీనంగా వుండి మందంగా నడుస్తుంది. కాళ్ళు పొడవుగ వంకరగల ఎద్దు బారుగానుండి పనిచేయజాలదు. కనుక కొనరాదు. వ్రేలాడు వృషణములు గలది నడచునపుడు వృషణములు

కొట్టుకొనుటచే బలహీనంగా వుంటుంది గాన కొనరాదు. గేదెలమీద ఎక్కుటకు బలము రాదు. ఆవులవంక చూడనైన చూడదు. మనస్సు స్థిమితముండదు. పని సరిగా చేయదు. ఇట్టిదానిని దొడ్డిలో నుంచరాదు. ఏ వృషభము యొక్క ముఖము వెడల్పుగనుండునో అట్టిది పొడుచునని గ్రహించాలి. గుళ్ళపు రొమ్ముగల వృషభం అందహీనంగ కొంచెము బలహీనంగ వుండి తంతుంది. పశువు వెన్నుపూసలు వంగినయెడల సత్తువలేనిదై పనిలో మందకొడిగ ఉంటుంది. కాళ్ళు ఈడ్చునది నడకసాగక మిగుల మందముగా పోతుంది. ఏ పశువు చెవులు మిక్కిలి పెద్దవిగా నుండునో అట్టిది సోమరిగ తక్కువ నడకగలదిగ వుండి పనిచేయజాలదు. తోకవెండ్రుకల కుచ్చు అధికముగనుండి చిన్న చెవులుగల పశువు సిరిసంపదలు కలుగజేస్తుంది. ఎద్దునకు పిల్లగిట్టలు నడచునపుడు కాలికి కొట్టుకుంటుంది. గిట్టల రాపిడివలన రక్తము కారుతుంటుంది. ఇట్టిదానిని ఎవరు కొనరాదు. అన్ని అవయవములు శరీరము గట్టిగానుండి పొడవు తక్కువగానుండు పశువు మిక్కిలి బలముగలదై సమస్తమగు పనిపాటలయందు పేరొందుతుంది. ఏ పశువుయొక్క నొసలు వెడల్పుగ పుష్టిగా నుండునో అట్టి పశువు రూపము బలముగలదిగా నుండి మహావేగముగా పోతుంది. లేడికన్నులుగల పశువు మంచిది కాదు. గచ్చకాయ, గోరోచనము, పొగగలిసినట్టి రంగులుగల కన్నులు అశుభమును కలుగజేస్తుంది. ఒక కన్ను గచ్చకాయరంగు మరొకకన్ను శ్యామ లేక గోరోచనపు రంగుగ నున్నయెడల ఆక్షేపణ. ధనధాన్యముల నశింపజేస్తుంది. పువ్వువేసిన కాయకాసిన కన్నులు గ్రుడ్డుకారిన కన్నులు గలవి జయముగా నుండవు. మెల్లకన్నులు గలదానిని విడచిపెట్టాలి. కనుగొలుకులు తెలుపు నలుపు రంగుగానున్న మహాదోషము. కనురెప్పలు నలుపు తెలుపురంగు కలసియున్న ఎద్దు అపకారియని తెలిసికోవాలి. ఏనుగు కన్నులవంటి కన్నులు (సూక్ష్మమగు కన్నులు) గలది పొడచును. దీని నేత్రములు కొంచెము ఎరుపుగానున్న మహాక్రోధము, చురుకుగలదిగా వుంటుంది. ఈ లక్షణములుగలవి శుభము అశుభముల గూడ గలుగ జేస్తుంటవి. గిట్టలు వ్యాపించినకొలది పంగగిట్టలుగా నుండును. ఇట్టిది నడక మందముగానుండి కుంటుతుంది. ఆక్షేపణయే. గిట్టలు వెడల్పుగనుండి వంకరలు తిరిగి యుండినయెడల శక్తిలేనిదిగ వుంటుంది. పలుచని గిట్టలు గలది బలములేనిదిగా నుండి ఎండలో ఇసుకమీద నడువజాలదు. అరిగిన గిట్టలుగల పశువు పనిచేయలేదు. పశువు నడచునపుడు ముందుఅడుగున కంటె వెనుకఅడుగు ముందునకు వేయుచు నడచుచుండినయెడల ఆ ఎద్దు చాలమంచిది. చీలిపోయిన గిట్టలుగలది పైకిలేచిన గిట్టలుగలది మంచిది. సగము గిట్టలుగల ఎద్దు సరిగా నడువజాలదు. గిట్టలనుగుచ్చి నడుచునది అంత మంచిదికాదు. కలిసిపోయిన గిట్టలుగలది పనిచేయజాలదు.

కొమ్ముల శుభాశుభలక్షణాలు

కిరీటమువలె కొంచెము వెనుకకు వంగిన కొమ్ములుగల ఎద్దు అతివేగంగా నడుస్తుంది. సూదికొమ్ములు గలది శక్తిగలదిగా బాగుగా పోట్లాడునదిగ ఉంటుంది. కత్తెరకొమ్ములు, లావుకొమ్ములు, గిన్నెకొమ్ములు, కురచగా పక్కకువాలిన కొమ్ములు, తెలుపురంగు కొమ్ములు, నలుపురంగు కొమ్ములు, నీలిరంగు కొమ్ములు, రాగిరంగు కొమ్ములు, శ్యామలరంగు కొమ్ములు, ఒంటెమచ్చ కొమ్ములు, వెనుకకు వంగిన కొమ్ములు, గొట్టె


కిరీటపు కొమ్ములు
పొడుగు నిలువుకొమ్ములు
పొట్టేలు కొమ్ములు
మెంటి కొమ్ములు
స్వర్గపాతాళములు
ఒక కొమ్ము విరుగుట
ఒక కొమ్ము గలది
పగిలిన కొమ్ములు
బోడి తల
వెడల్పు కొమ్ములు (ప్రక్కలు నిద్రించుట)
65


తలపూపుట
లావుమెడ
అంగిలినలుపు
పెద్దమూపురము
నాలుక బైటకు లాగుట
తక్కువపెదవి
వెడల్పుముఖము
పంపుముఖము
పెద్దచెవులు
పంగతల
65

కొమ్ములు, ముఖమువైపునకు వంగియుండు కొమ్ములు, లేడికొమ్ములు, ముందునకు వంగియుండు కొమ్ములు, మొదటిలో 25 అంగుళముల పొడవుగల కొమ్ములుగల ఎద్దులు యజమానులకు శుభఫలముల నిస్తవి. పెద్దవిగ పొడవుగ నిలువుగనుండు కొమ్ములుగల వృషభమునకు త్వరలో వృద్ధాప్యమువచ్చి చూచుటకు అందవిహీనముగ వుంటుంది. ఒక కొమ్ము ఆకాశమువైపునకు రెండవ కొమ్ము ముందుముఖమువైపునకు యుండు దానిని మెంటికొమ్ములందురు. దీనిని కొనరాదు. యజమాని సుఖసంపదల నశింపజేస్తుంది. ఒకకొమ్ము స్వర్గమువైపునకు రెండవ కొమ్ము పాతాళమువైపునకు అనగా పైకిక్రిందికి జూచుచున్న కొమ్ములు గల ఎద్దులు అశుభములను గలిగిస్తాయి. ఏ రైతు తన ఇంట నుంచుకొనునో ఆ రైతునకు దుఃఖము కలుగజేయుటయేగాక సకల ధనములు చోరులు అపహరిస్తారు. ముందుకు వంగినకొమ్ములు గలది పనికిమాలినదగును. త్వరలో ముసలిదగును. దీనిపండ్లు గిట్టలుకూడ త్వరగా అరిగిపోతాయి. ఇది అశుభమును కలిగిస్తుంది. ఒకకొమ్ము విరిగిన ఎద్దు మధ్యమం. ఒకకొమ్ము పుట్టి రెండవ కొమ్ము పుట్టకపోయిన ఆ ఎద్దు అశుభము కలుగజేస్తుంది. కొమ్ములు పుట్టక బోడిగానుండి ఆ ఎద్దు అంగహీనము గలది గాన కొనరాదు. కొమ్ములపైన పంగతలగానున్న ఎద్దును కొనరాదు. మహాదోషము. పగిలిన కొమ్ములు గలవి వ్యాధులు పుట్టునుగాన చికిత్స చేయాలి. ఎద్దుగాని బర్రెగాని రాత్రింబవళ్ళు కొమ్ములను గుంజలకు మేకులకు కొట్టునది అశుభము. దూరంగా కొట్టాలి. కొమ్ముల చివర తెలుపురంగుగలది కీడు కలుగజేస్తుంది. పెద్దకొమ్ములు గలది ఒకటి వెనుక మరొకటి ముందునకు వంగి ఎడమచెవిమీదకు వ్రాలిన కొమ్ములు గలది, పొట్టేలు కొమ్ములు గలది, ఒంటికొమ్ము గలది, ముఖముమీద మధ్యగానుండు కొమ్ములుగలది, మూపురముమీదకు వాలిన కొమ్ములు గలది, పగిలిన కొమ్ములు గలది, వంకరకొమ్ములు గలది, పక్షులు నిద్రించుటకు వీలుగా నుండు కొమ్ములు గలది ఆయా యజమానులకు పలువిధరీతులుగా నష్ట కష్టములు కలుగజేస్తుందని ఒక సంస్కృత పశుశాస్త్రము తెలుపుచున్నది గాన తెలియపరచడమైనది.

రంగుల శుభాశుభ లక్షణాలు

ఏ వృషభమైనను ఒకకాలు తెలుపు దేహమంతయు తదితర రంగులతో కలిసియున్న యజమానికి శుభము కలుగజేస్తుంది. ఎక్కువ తెలుపుగానుండక మిశ్రమ వర్ణముగానున్నను ప్రశస్తమైనదిగా తలంచాలి. కలువరంగు గలది, తెలుపురంగు గలది, నువ్వులు బియ్యము కలిసిన రంగువలె మిశ్రమంగా వుండేది తన యజమాని మందను వృద్ధిచేసి లక్ష్మీసంపన్నునిగా జేస్తుంది. సగభాగము నీలిరంగు సగభాగము తెలుపురంగు గల ఎద్దు తనకుండు దోషములన్నియు నశించి సకల శుభములను కలుగజేస్తుంది. అన్ని అవయవముల మీదను తెలుపురంగున్న పశువు శుభము కలిగిస్తుంది. శరీరమంత తెలుపుగనుండి పసుపురంగుగల వెంట్రుకలు కొన్నియున్నయెడల అట్టి పశువు దున్ననపుడు మాత్రం మందమతిగ వుంటుంది. తోకక్రింద గుదస్థానము వరకు నీలిరంగువలె నున్నయెడల శుభముల నిస్తుంది. నేత్రాలకు నాలుగుప్రక్కల కాటుకరంగు వెంట్రుకలున్న పశువు బలంగలదిగా వుంటుంది. కాటుకరంగు, నీలిరంగు కలిగి సూక్ష్మరోగాలు గల ఎద్దు బలమధికముగలదిగా వుంటుంది. ఏడు కురచలు, ఏడు అవయవములలో నలుపురంగున్న ఎద్దు

జయము గలిగిస్తుంది. పసుపుపచ్చరంగు వెంట్రుకలుగల ఎద్దు చురుకుదనము గలిగిస్తుంది. నొసలునుంచి ముక్కు రంధ్రముల వరకు ఒక విధమగు ఆయుధమువలె గీతగా రంగున్న యెడల మంచిది. శరీరమంతా తెలుపుగానుండి తోకమాత్రము నలుపురంగుగా నున్నయెడల అధికంగా పాటుబడుతుంది. శరీరమంతా ఒకరంగుగలిగి తోకమాత్రం ఎరుపు రంగుగా నున్నను మంచిదియే. సగం ఎరుపు సగం తెలుపు కలిసిన రంగుల ఎద్దు శుభాన్ని కలుగజేస్తుంది.

శరీరమంతా తెలుపుగ నలుపుగ మచ్చలున్న ఎద్దుకూడ మంచిదియే. వీపు, మెడ, తోక నలుపురంగుగా నున్న వృషభము చురుకుగా నడుస్తుంది, అలసటయుండదు. తెలుపు, నలుపురంగుగల ఎద్దు మధ్యమముగా నుండును. ఎక్కువ ఎరుపు, ఎక్కువ తెలుపు రంగుగలది సోమరితనంగా వుంటుంది. చిలుక కంఠమునందున్న మాదిరిగా తోకవెంట్రుకలు రెండు వరుసలున్న ఎద్దును కొనుట మహాదోషము. కుష్టురంగు పువ్వులు గలది, గజ్జిబట్టగలది చురుకుగనో మందముగనో వుంటుంది. శరీరమంతా పంచ రంగులున్న ఎద్దు మధ్యమం. గొఱ్ఱెరంగు గలది అశుభము. కాకిరంగు గలది దోషము. పువ్వులవలె మచ్చలుగలది మంచిది. శరీరమంత బంగారురంగు గలిగి పాలవలె తెలుపుమచ్చలున్న ఎద్దు చాలా మంచిది. కోతిమైలది మధ్యమము. కఱ్ఱిబట్టది, పాలబట్టది, గజ్జిబట్టది, ఎరుపుబట్టది శుభముల కలుగజేయునని వృషకల్పద్రుమము తెలుపుచున్నది.

సుళ్లపరీక్ష


రానురాను సుళ్ళను గూర్చి రైతులలో చాలామందికి నమ్మకము తగ్గింది. కాని ప్రాచీన పశువైద్య సిద్ధాంతముల ననుసరించి సుళ్ళను పరీక్షించి తీసుకొనుటయే మంచిది. ఈ దిగువ సూచించు సుళ్ళను శాస్త్రానుసారముగా తెలిపితిని గాన ఇష్టమున్నవారు అమలులో పెట్టుట మంచిది. అనవసరపు తర్కములు చేయక మీకెంతవరకు నమ్మకము గలదో అంతవరకే ఆచరణలోపెట్టమని నా అభిప్రాయము.

శుభమును కలిగించే సుళ్లు

దీనినే బ్రహ్మసుడి, స్థానపు సుడి, బొట్టుసుడి, తావుసుడియని ఆయా దేశాలననుసరించి రైతులు పిలుస్తారు. పశువు కొమ్ములకు నాలుగైదు అంగుళాల దిగువ ముఖమందు ఈ సుడి యుంటుంది. ఈ సుడి లేకుండా తదితర సుళ్లున్నను అంతమంచిది కాదు. ఈ సుడిలేకుండనున్న ఎద్దు ముఖము చూచినను వితంతువుముఖము చూచినను ఒకటేనని మనపెద్దలు చెపుతారు. కాని ఈ సుడియున్న ఎద్దు తన యజమానికి సర్వసంపదల సమకూరుస్తుంది.

ధాన్యపు సుడి


దీనినే విష్ణుసుడి, రాజుసుడి యంటారు. పశువు మూపురము వెనుకభాగానకు కొంచెం దూరంలో (అనగా 12, 14 అంగుళాలలోపల) వెన్నెముకభాగం తొలగకముందు చూపులో ఈ సుడియుండాలి.




గంతకట్టు అనగా గంగిరెద్దువాళ్లు గాని, కొండప్రాంతాలవారు గాని ఎద్దులమీద రెండు వైపుల రెండు గంతలువేసి వారికి కావలసిన సామానువగైరా తీసికొని పోతారు. ఆ గంతలకు వెలుపలభాగాన, వెన్నెముకకు ఒకప్రక్కన ఈ సుడియున్న మధ్యరకమని గ్రహించాలి.

ఆసనపు సుడి


దీనినే మహేశ్వరసుడి లేక పేడసుడి లేక లద్దెసుడి యంటారు. వృషభంయొక్క ఆసనపు అడ్డఎముక నుంచి నాలుగైదు అంగుళాల దిగువగా ఈ సుడి వుంటుంది. ఈ సుడికి యిరుప్రక్కల రెండు చిన్నసుళ్లు




శుభాన్ని కలిగించే సుళ్ళు



అనుభాన్ని కలిగించే సుఖ్భ



బంగోలు జాతి ఆవు



షహపల్ జాతి ఆవు

కొన్నిటికి వుంటాయి. వీటినే నూగుసుళ్లంటారు. ఇవికూడా మంచివే. ఆసనపు సుడియున్న ఎద్దు తన యజమానుని నదివలె పొంగిస్తుంది.

మూపురసుడి

దీనినే లక్ష్మిసుడి యంటారు. ఈ సుడి మూపురానికి ముందుభాగాన గాని, వెనుకభాగాన గాని, మూపురం పైన గాని వెనుక గాని ఉంటుంది. ఆ సుడిమీదబడిన వర్షపునీరు అర్రుమీదనుంచి గిట్టమీదవరకు జారునట్లు కనుపించిన మిగుల శుభము. అట్టి పశువు దున్నినను, భూమిత్రొక్కినను బంగారం పండించవచ్చునంటారు. లక్ష్మీదేవిమహిమ మీకెల్లరకు తెలిసినవిషయమే.

కవ్వపు సుడి

వృషభంయొక్క రొమ్ముభాగానికి దగ్గరగా గంగడోలుకు రెండువైపుల కవ్వపు ఆకారంగా సన్నచారగా వుంటాయి. కుడివైపుననున్న సుడి మంచిదని ఎడమవైపుననున్న మంచిది కాదని చెపుతారు. కాని కుడివైపున సుడియున్న పశువులను ఒంగోలు ప్రాంతాలవారు ప్రశస్తమైనదిగా నెంచుతారు.

నగరాసుడి

వీటినే గంతసుళ్ళంటారు. పశువు బరిఎముకకుపైగా (గంతలోపల) వెన్నుపూసకు రెండు వైపుల రెండు సుళ్లున్నయెడల నగరాసుళ్ళంటారు. ఇవి ఆక్షేపణ లేదు. ఆసనం మధ్యభాగాన కాళ్లు చంకలలో సుడులున్న మంచిది. కాని చంకలలోనుండే సుడులలో కుడివైపున వుండే సుడి మంచిది.

భాషికపుసుడి

పశువునొసటి భాగమందు స్థానపు సుడి పైన గాని ప్రక్కను గాని క్రింద గాని నెమిలికన్నులవలె ఒకదానిపై నొకటి దొంతరగా నిలువుగా వుంటుంది. దీనినే భాషికపు సుడి యంటారు. ఇట్టివి పెండ్లికానివారు కొనరాదంటారు. వివాహమైనవారు కొంటే సర్వసంపదల సమకూరుస్తుంది.

కనుబొమ్మ సుళ్లు

కనుబొమ్మల రెంటిమీదను సుళ్లుంటే జయము కలిగిస్తుంది. కుడి కనుబొమ్మమీదనుంటే మంచిది. ఎడమకనుబొమ్మమీదవుంటే అంత మంచిది కాదు.

చెవుల సుళ్లు

రెండు చెవులమీద సుళ్లున్న మంచిదే కాని ఎడమచెవిమీదవున్న ఆక్షేపణ.

ముచ్చనగుంట సుడి

రెండు కొమ్ములకు మధ్యనయున్న ముచ్చనగుంటలో సుడియున్న మంచిది.

తెంపులేని రోమముల కూడిక

తోకమట్టనుంచి మధ్య భాగానికి గాని చివరవరకు గాని తెంపులేకుండా జడలాగా రోమాలుగల పశువు యజమానికి జయం కలిగిస్తుంది. ముందుండే రెండుకాళ్ల లోపలిభాగాల సుళ్లున్నను, బొడ్డుభాగమున సుడియున్నను మంచిది. పైనచెప్పిన సుళ్లలో ఎడమభాగాన నున్నవన్నీ యజమానుని ఎడంచేస్తుందని పెద్దలు చెపుతారు.

ఆక్షేపణల సుడులు - తొండపరిసుడులు

వీటినే తొండపరిసుళ్లంటారు. తోకమట్ట పైభాగమున గాని, క్రిందిభాగమున గాని, రెండు ప్రక్కల గాని సుళ్లుంటాయి. పైభాగమున వుంటే తొండసుడియనియు, క్రిందిభాగాన యుంటే పరికసుడియని యంటారు. మొత్తముమీద యివన్నియు ఆక్షేపణయే.

సంకెళ్ల సుళ్లు

ఈ సుళ్లు ముందరికాళ్ల మీద గాని, కాళ్లకు వెనుకమోకాలు మడతనుంచి పిల్లగిట్టలు దాటకుండా గాని, మోకాళ్లపైభాగాన 8 నుంచి 10 అంగుళాల వరకు గాని వెంట్రుకలతో కలసియుండు సుళ్లుంటాయి. యజమానుని నష్టపరుస్తుంది.

ముక్కంటి సుడి

ఈ సుడి నొసటిభాగాన మూడు కోణాలుగా వుంటుంది. దీనినే శివునియొక్క మూడవ నేత్రమంటారు. ఇట్టి సుడిగల ఎద్దుగల యజమానికి అన్ని కష్టాలే.

గాడి సుళ్లు

మెడప్రక్కన సుడివుంటే పట్టెడసుడియంటారు. గంగడోలునకు క్రిందిభాగమున భూమికి ఆనే గంగడోలు చర్మమున సుడియుంటే గాడిసుడి అనియంటారు. కొమ్మునకు ఒకవైపున వెంట్రుకలతోగూడిన ఒక సుడియున్న కవ్వపుసుళ్ళలో ఒకరకపు సుడి అంటారు. ఇవన్నియు ఆక్షేపణ.

కత్తెర సుళ్లు

పశువు ఆసనమునుంచి వృషణాలవరకు పొడవుగ ఈనె ఆకారంగా వుంటుంది. ఈ యీనె అటుయిటు తొలగకుండావుంటే మంచిది. ఈ యీనెకు రెండు వైపుల రెండు సుళ్ళుండి రెంటి యొక్క చూపు ఈనెకు అడ్డమువస్తే కత్తెరసుళ్ళంటారు. ఇవికూడా ఆక్షేపణయే.

ఎదరాల సుళ్లు

ఎదరాలకు రెండు వైపుల సుళ్లుంటే మంచిది. ఎడమవైపున వుంటే ఆక్షేపణ.

గూటపు సుళ్లు

పశువు ఆసనమునకు రెండువైపులనుండే మొరడుల వెలుపల భాగమున ఈ సుళ్లుంటాయి. కొన్నిటికి ఒకవైపుననే యుంటాయి. ఆక్షేపణ.

తదితర రకాల సుళ్లు

పశువు వెన్నుభాగమున రెండు వెంట్రుకల వరుసయున్న అశుభము. మొండితోకది, బారుతోకది అంత మంచిది కాదు. తలనుంచి మెడ వరకు రెండు పాములవలె నలుపుగానున్న అశుభము. ఏడు పండ్లు గలది ఆక్షేపణ. ఎద్దుపిఱ్ఱయొక్క పైభాగమున పాము పడగవలె సుడియున్న ఆక్షేపణయే. దీనిని నాగుసుడి యంటారు. పశువుతోకమట్టక్రింద పేడవచ్చు మార్గమున రెండువైపుల పాము పడగవలె సుడియుండిన దోషము. ఒకే సుడి రెండుగా ఒక దానిపైనొకటి నొసటి భాగముననున్న జంటసుడి యంటారు. ఒంటివట్టది జయంకాదు. వెన్నుభాగమునకు రెండువైపుల డొక్కస్థానంపైన కురచగానుండు ఎముకలమీద సుడులున్న ఆక్షేపణయే. పశువుకడపటిబరిఎముకనుంచి మూడవ నడుముపూస ఎముక దాటకుండ వెన్నుభాగమునకు ప్రక్కగా గాని, మీదుగా గాని చీపురుకట్ట ఆకారముగా సుడియున్న పొరక సుడియని పేరు. ఇదికూడ ఆక్షేపణయే. పశువు కడపటి బరిఎముకదాటి వెన్నుపూసకు రెండువైపులనుండు సుళ్ళకు పాడెసుళ్ళందురు. ఈ పశువుగల యజమానికి త్వరలో పాడెగట్టునంత ప్రమాదము వస్తుంది. వెన్ను- భాగమునకు రెండువైపుల డొక్కస్థానమునకు పైన కురచగానుండు ఎముకలమీద సుడులున్న ఆక్షేపణయే. వెంట్రుకల వరుస ఒకటి మెదడుభాగమునుంచి వెనుక వెన్నుమీదకు తిరుగక యుంటుంది. దీనినే వరుస సుడియంటారు. ధననష్టము కలిగిస్తుంది. దేహమంతయు ఒక రంగుగలిగి యితర రంగులుగల మచ్చ ఎచ్చటనైనను యుండిన యెడల దానిని అగ్నిమచ్చ లేక ఒంటిమచ్చ యందురు. ఇట్టిది అశుభం. ఆ రంగుగల మరియొక మచ్చయున్న యెడల ఆక్షేపణలేదు. మరియొకమచ్చ లేనప్పటికి ఆ రంగుగల ఒక వెంట్రుకల వరుసయున్నను ఆక్షేపణ లేదు. పశువు శరీరానికి రెండువైపుల ఇరువదియారు ప్రక్కటెముక- లుంటాయి. వాటిలో మొండిఎముక కనిపించిన మహాదోషము. కొన్ని పశువులకు కడపటి బరిఎముక, దానిముందర బరిఎముకతో కలియక ప్రత్యేకంగా నుండును. దీనినే మోటుబరియంటారు. ఆక్షేపణయే.

* * *

ఏడవ భాగము

ద్రవ్యజ్ఞానము

మందుమొక్కలు

ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని మొక్కలపై మానవుడు జీవిస్తున్నాడు. ఇతర అవసరాలకు ఉపయోగపడే ఎన్నోమొక్కలను తెలిసికొనగలిగాడు. మన భారతదేశంలోని వృక్షసంపద జగద్విదితం. ఉత్తరభాగాన, దక్షిణాన గల పర్వతశిఖరాలలో శీతలదేశాలైన, యూరపుదేశాలలో పెరిగే కొన్ని విలువగు చెట్లుచేమలకు మనదేశంలో తావు కనబడుతూవుంది.

ఇప్పుడు అమలులో నుండే సీమనాటువైద్యం రాకముందు, మనదేశమంతటా రెండు వైద్యసిద్ధాంతా–లుండేవి. మొదటిది ఆయుర్వేదం, రెండవది యూనాని. ఈ రెండు వైద్యాలలోను మూలికలవల్లనే ఔషధ సేవ జరుగుతూవుంది. ఆంగ్లేయ వైద్యంలో వాళ్ల ఔషధాలపట్టికను చూస్తే, వాటిలో సగం మనదేశంలో పుట్టినవే. అంతేగాకుండ మిగతా సగంకూడా, కొంచెం శ్రమపడితే మనదేశంలోనే పండించగలం. వాటిలో కొన్నిటిని మనదొడ్లలోనే పెంపొందించగలం. మనచుట్టు ప్రక్కల మానవులకు, పశువులకు పనికివచ్చే విలువగల మందుమొక్కలు కనబడుతునేయుంటాయి. కాని వీటిపేర్లను, ఔషధలక్షణాలను, వస్తుగుణాలను వివరంగా తెలిసికోలేక పోతున్నాము. గవర్నమెంటువారుకూడ ఆంగ్లేయ వైద్యంకంటె, ఆయుర్వేదవైద్యాన్నే అభివృద్ధిలోకి తీసికొని వచ్చినపుడు, మనం, మన జంతువులు బాగుపడగలం.

మందుమొక్కల గుణాలు – మోతాదులు

మన గ్రామాలలోనుండే రైతులు, నాటుపశువైద్యులు మా పశువైద్యగ్రంథమాల, అనుభవపశువైద్య చింతామణి వగైరా పశువైద్య గ్రంథాలు చదివి ఆచరణలోపెట్టిన తర్వాతనే, వారికి వస్తుగుణాలు, మోతాదులు, రోగనిదానాదులన్నియు అర్థమైనాయి. యీ గ్రంథాలు, మా ఫార్మసి మందులు, మా కళాశాల విద్యార్థులు రాకపూర్వం పశువైద్యం చాలా అధోగతిలోవుండేది. ఆంధ్రదేశంలోనున్న, ఏ గ్రామానికైనా వెళ్లి మీరేవిధంగా పశువైద్యం చేస్తున్నారని ఆ రైతులను అడిగిన, తెనాలి పశువైద్య కళాశాలవారి గ్రంథాల ఆధారంచేత పశువైద్యం చేయుచున్నామని నూటికి ముప్పాతికమంది చెప్పగలరు. ముఖ్యంగా రైతులుపయోగించే ఓషధులను గూర్చి ఈ దిగువ తెలుపుచున్నాను. ఇంకను వివరంగా తెలిసికోగలవారు అనుభవ పశువైద్య చింతామణి చూడండి. రోగగుణాలు తెలిసికొని తదితరమందులతో ఈ దిగువచెప్పే మూలికలు వాడాలి. కొన్ని ప్రత్యేకంగా రైతు అనుభవంమీద వాడుకోవచ్చు.

పెద్దవృక్షాల ఫలితాలు

సముద్రప్రాంతాలలో యిసుకనేలలు, డెల్టా ప్రాంతాలలో మట్టినేలలు, కొండప్రాంతాల ఎరుపు గరపనేలలు ఉన్నాయి. ఇసుక భూముల్లో సరుగుడు, జీడిమామిడి, కొండప్రాంతాలలో కుంకుడు, జీడిమామిడి,

డెల్టా ప్రాంతాలలో కాలవకట్టలమీద ఖాళీస్థలాలలో, చివరకు ఖాళీగావుండే ప్రతి దొడ్లోను, పోరంబోకులలోను ఆయా ప్రాంతాలలో పెరిగే చెట్లను వేయుట మంచిది. చెట్లనునాటిన తరువాత ఎదగడానికి నీరుకావాలి. ఎరువు కావాలి, రక్షణకు కంచె కావాలి, రక్షించే దాత కావాలి, పశువులు మేకలు పిల్లలు పాడుచేయకుండా కాపాడుట ముఖ్యావసరం. రైతులు ముఖ్యంగా పచ్చిరొట్ట ఎరువునకు ఉపయోగించే చెట్లు, పొలంగట్లమీద, దొడ్లలోనుండే ఖాళీ స్థలాలలోను పెంచే చెట్లనుంచి పచ్చిరొట్ట ఎరువు ఎవరికివారే స్వయంపోషకం చేసుకొనినప్పుడే రైతులకు మంచి ఉపయోగం.

చెట్లకు పురుగుగాని, తదితరజాతి గొంగళిపురుగు వుంటే పురుగులుగాని పడితే తగిన చికిత్సలు చేయాలి. అప్పుడప్పుడు పురుగులను చంపే మందులను ఉపయోగించాలి.

నల్లతుమ్మ

బండికి, నాగలికి తుమ్మకర్ర పెట్టిందిపేరు. తుమ్మచెట్టు, తుమ్మ కలప మంచి వుపయోగము. ప్రతిసంవత్సరం నల్లతుమ్మచెట్ల గింజలను తీసి పేడతోకలిపి నిలువయుంచి జూలైలో నాటితే మొక్కలు పెరుగుతాయి. ఈ మొక్కలను వర్షాలు తక్కువగానుండే బీదనేలలందును, నల్లరేగడి భూములలోను నాటితే చక్కగా పెరుగుతాయి. ఈ చెక్క బెరడు తోళ్ల పరిశ్రమకు, పశువులకిచ్చు మందులలోను వాడతారు. వీటి కాయలు పశువులకు, మేకలకు మేపితే మంచి బలము కలుగుతుంది.

తెల్లతుమ్మ

సమముగానుండే ప్రదేశాలలో ఏ కాలంలోనైనా సరే ఈ విత్తనాలను నాటితే చక్కగా మొలుస్తాయి. ఈ చెట్టు బెరడునుంచి నారతీస్తారు. కాయలు పశువులకు మంచిమేతగా ఉపయోగపడుతుంది.

దిరిసెన

ఈ చెట్టుగింజలు ఏ నేలలోనైన, ఏ కాలములోనైనా మొలుస్తాయి. దీనిచెక్క, ఆకు,పశువుల రోగాలకు పనికివస్తుంది. పచ్చిరొట్టకు, వంటచెరకునకు, కలపకు, నీడకు ఈచెట్లు మంచి ఉపయోగము.

జమ్మి

ఏ నెలలోనైనా ఈ గింజలువేస్తే మొలుస్తాయి. పశుగ్రాసమునకు అనగా ఆకులు, చిగుళ్లు, పండ్లు, కాయలు వగైరా పశువులకు ఉపయోగపడతాయి.

వేప

ఎప్పుడు పచ్చగావుండే చెట్లలో యిదొకటి. చక్కని కలపనిస్తుంది. ఎరువుకూడా లభిస్తుంది. ఈ చెట్టుగింజలను ఏ నేలలోనైనా నాటిన పెరుగుతాయి. ఈ చెట్టు ఆరోగ్యానికి కలపకు మంచి ఉపయోగము. ఈ గింజల నూనె, జిగురు, ఆకు పశువైద్యానికి మంచి ఉపయోగము.

అరటి

అరటిగింజలను సూటిగా నాటితే ఫిబ్రవరి, మార్చి నెలలో మంచి కాయలు కాస్తవి. అరటిచెట్టు సమూలమంతా పశుగ్రాసమునకు ఉపయోగపడుతుంది.

తాడి

మెట్టప్రాంతాలలో గాని, చెరువుకట్టలమీద గాని తాడిటెంకెలను నాటితే రెండు మూడు మాసాలలో మొక్కలకు వస్తాయి. ఈ చెట్టు ప్రతిభాగం మంచి ఉపయోగము.

మోదుగ

ఈ చెట్లు కొండలదగ్గరను, అరణ్యాలలోను ఎక్కువగా పెరుగుతాయి. ఈ గింజలను ఏడు గజాల దూరాన వరుసలలో వరుస మధ్యను వుండేటట్లు నాటితే మంచిది. ఈ చెట్టుపువ్వు, పట్ట పశువులకు మంచి దివ్యౌషధము. ఇంకను ఆకులు విస్తళ్లకు, కలప వంటకు, ఆకులు ఎరువుకు ఉపయోగపడుతుంది.

జిల్లేడు

ఈ చెట్లను నరికి పొలాలలోవేస్తే పచ్చిరొట్టగా తయారవుతుంది. దీని సమూలమంతా పశువుల రోగాలకు ఉపయోగపడుతుంది.

కరివేప

గింజలను వర్షారంభంలో నాటవచ్చును. ఆకులు గొఱ్ఱెలు మేకలు తింటాయి. పండ్లను ఆకును మనుష్యులు తింటారు. చూడిపశువులు ఈనినవెంటనే ఈ ఆకునుపెట్టితే మైలపడిపోతుంది.

నిద్రగన్నేరు

అన్నిరకాల నేలలోను, ఎర్రకొండ ప్రాంతాలలోను, రాళ్లసందులలోకూడ ఈ మొక్కలు పెరుగుతాయి. మే నెలలో నారుపోస్తారు. సంవత్సరం వయస్సుగల మొక్కలు నాటాలి. నీరు అంతగా అవసరంలేదు. ఈ చెట్టు పశువులకు గ్రాసంగా బాగుగా ఉపయోగపడుతుంది. దీని కట్టె, ఆకులు, కాయలు పశువులకు మంచిప్రీతి.

బాడిద

లోయలలోనైన, మరెచ్చటనైనా ఈచెట్లు సులభంగా పెరుగుతాయి. కొమ్మమొక్కలుగాని విత్తులుగాని నాలుగు లేక ఆరు అడుగుల దూరాన నాటితే చక్కగా పెరుగుతాయి. నాలుగు సంవత్సరాల వయస్సుగల చెట్ల ఆకులను పచ్చిరొట్టగా ఉపయోగించవచ్చును. ఆకులు పశువులుకూడ తింటాయి. ఈ చెట్లను పండ్లతోటల చుట్టూ వేస్తారు.

నేరేడు

అన్ని నేలలలోను నారుగావేసిన మొక్కలను నాటితే పెరుగుతాయి. పండ్లు బెరడు ఔషధములలోను, తోళ్లపరిశ్రమకు వాడుతారు. నల్లనేరేడుపండ్లను తింటారు.

వెలగ

నలుబది నుంచి ఏబది అడుగుల దూరాన ఒకటి వంతున మట్టినేలలో నాటాలి. ఫిబ్రవరి మే నెలల మధ్య పూత పూస్తుంది. అక్టోబరు నెలలో పండ్లు దొరకుతాయి. పండ్లలోని గుజ్జు మంచి ఉపయోగము.

మఱ్ఱి

అన్నిభూములలోను, కొండదిగువ నేలలలోను గింజలు, కొమ్మలు వేస్తే పెరుగుతాయి. నీడనిచ్చే చెట్టేకాకుండా దీని పట్ట, వేరు, చిగుళ్లు మంచిఉపయోగము. రోడ్లప్రక్కలను చెట్లనీడలకు ఎక్కువగా నాటుతారు.

రావి

అన్నిచోట్ల గింజలను కొమ్మలను పాతి పెట్టిన మొలుస్తుంది. మేకలు వీటి ఆకులను తింటాయి. పవిత్రమైన వృక్షం. దీని చెక్కరసం పాడిపశువుల రోగాలకు ఉపయోగపడుతుంది. దీని కొమ్మలనుంచి నారతీసి మోకులు అల్లుతారు.

జాన

ఇవి రేగడి నేలలలో వర్షాలు ఎక్కువగా కురిసే ప్రాంతాలలో నారు పోసి మొక్కలునాటితే పెరుగుతాయి. పశువులకు ఈ చెట్ల ఆకులతోనుండే కొమ్మలను మేపుతారు.

పెద్దజాన

జూన్ నెలలో విత్తనాలు తీసి మార్చి, ఏప్రియల్ నెలలలో నాటితే మొక్కలు పెరుగుతాయి. సంవత్సరానికి మూడువందల పౌనుల పచ్చిరొట్టను సంపాదించవచ్చు. ఈ మొక్కలు పశువులకు, వంటచెరుకునకు ఉపయోగిస్తారు.

మామిడి

సముద్రమట్టానికి మూడువేల అడుగుల ఎత్తువరకు గల ప్రదేశాలలో అంటుమొక్కలను, టెంకెలను పాతి పెంచవచ్చును. కలప, పండ్లు మంచి ఉపయోగమే కాకుండ చెట్లుకూడ పవిత్రమైనవి.

తురకవేప

సామాన్య భూములలోకూడ గింజలు కొమ్మలువేస్తే పెరుగుతాయి. కలపకు, వైద్యానికి పనికి వస్తుంది.

పొగడ

ఎక్కువ వర్షాలుపడే స్థలంలో ఇవి బ్రతకవు. పాముకాటునకు తదితర ఔషధాలకు దీని బెరడు ఉపయోగపడుతుంది.

మునగ

కొండలమీద నుండే చలికి ఈ చెట్లు తట్టుకోలేవు. దీని గింజలనుండి చమురుతీస్తారు. దీని ఆకు చెక్క పశువైద్యానికి పనికివస్తుంది.

గానుగ

ఈ చెట్లు రెండువేల అడుగుల ఎత్తుగల ప్రదేశాలలో ఎక్కువగా పెరుగుతాయి. పచ్చిరొట్టకు, పశుగ్రాసానికి, కలపకు ఉపయోగపడుతుంది.

పెద్దఉసిరి

ప్రతి సంవత్సరం నవంబరునుండి ఫిబ్రవరివరకు కాయలు కాస్తవి. కాయలు, పండ్లు, బెరడు, ఆకులు మందులకు ఉపయోగపడతాయి.

రేల

ఎత్తయిన ప్రదేశాలలో ఈ చెట్లు పెరుగుతాయి. పచ్చిఎరువు, బెరడు ఆకులు చిగుళ్లు వైద్యానికి ఉపయోగపడుతుంది.

చింత

చింతపండు, చింతచిగురు కూరలలో ఉపయోగిస్తారు. చింతకలప, చింతఆకులు పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడుతుంది. చింతగింజలను పశువులు, పందులు తింటాయి.

గంగరావి

కొమ్మలను పాతితే మొలుస్తాయి. ఈ కొమ్మలు మూడు నాలుగు అంగుళాల పొడవుగలవి పాతాలి. ఈ మొక్కల ఆకులు మేకలు తింటాయి. చక్కని నీడ యిస్తుంది. ఈ చెట్లకాయలను గిల్లితే పసుపుపచ్చని ద్రవం వస్తుంది. గాయాలకు, పుండ్లకును వాడతారు.

ఓషధులను గ్రహించదగిన ఋతువులు

మార్గశిర పుష్యమాసములందు వచ్చు శరదృతువునందు ఓషధులు సరియైన రసములు కలిగియుంటాయి. కనుక సర్వరోగ నివారణార్థము ఈ ఋతువునందే ఓషధులను సంగ్రహించుట మంచిది. జ్యేష్ఠాషాఢ మాసములందు వచ్చు గ్రీష్మఋతువునందు రూక్ష స్వభావముచేత రసహీనములై యుంటాయి. వర్షాకాలము

నందు అధికరసము కలిగియుండును గాన అంత గుణవంతములు కావు. విరేచనములకిచ్చు ఓషధులు తీక్ష్ణములై యుండవలెను గనుక వానిని గ్రీష్మకాలమునందే సంపాదించాలి.

ఓషధులను గ్రహించకూడని స్థలములు

పుట్టలు, చెడుస్థలములు, జలముతో నిండియుండు ప్రదేశాలు, స్మశానాలు, చవిటినేలలు, మార్గమధ్యము, దుష్టజంతువులుండు స్థలాలు, కాలినచోటులు, అతిమంచుగల స్థలాలు, ఇటువంటి స్థలాలందుండు ఓషధులను గ్రహించరాదు. ఇవి మంచిగుణములు ఈయకపోవుటయే గాక చెడుగుణాల నిస్తాయి.

స్వరసము

పచ్చిద్రవ్యములను సమకూర్చి పురుగులు, మన్ను వగైరాలు లేకుండగ బాగుచేసి తెచ్చినవెంటనే నీరు కలుపకుండా త్రొక్కి వస్త్రములో వడియగట్టిన రసము స్వరసము అనబడుతుంది. ఎండిన యోషధుల చూర్ణమును గ్రహించి యందు రెండింతలు నీరుపోసి రాత్రింబవళ్లు మరునాడు ఆ ఉదయమును వడియగట్టుట మరియొక విధమగు అంగరసమనబడుతుంది. పచ్చివనమూలికలు దొరకనియెడల యెండిన వానిని దెచ్చి వానికి ఎనిమిదిరెట్లు నీరుపోసి చతుర్థాంశగ కాచాలి. ఇట్లు కాచబడిన రసము శృతమన– బడుతుంది.

కల్కము

పచ్చిద్రవ్యమైన యెడల నీరు కలుపకయు, లేక ఎండుద్రవ్యమైన యెడల తగినన్ని నీళ్ళుపోసియు మెత్తగా ముద్దగా నూరబడునది కల్కము అనబడుతుంది.

క్వాథము

రోగముల ననుసరించి ద్రవ్యముల నన్నిటిని లెక్క ప్రకారము వేసి నలగగొట్టి కుండలోవేసి యందు తగినంత నీరుపోసి అగ్నితోకాచి దానిని వడియగట్టి కొంచెం వేడిగనున్నపుడే రోగపశువునకిచ్చుదానికి క్వాథము లేక కషాయము అంటారు. కషాయమును కుండలోనే కాచాలి. అటుల కాచిన యెడల పైన మూత వేయరాదు. మూయబడిన కుండయొక్క క్రిందిభాగమునుండి ఆవిరినీరు పడుటవలన కషాయము చెడిపోతుంది. ఆయారోగములను బట్టి కషాయములలో తదితర ఓషధులు కలుపవలసి వచ్చినప్పుడు జాగ్రత్తగా త్రాసుతో తూచి వాడాలి.

హిమము

రెండు భాగముల ఔషధ ద్రవ్యాలను నలుగగొట్టి చక్కగా ఒక కుండలోవేసి ఎనిమిది భాగముల నీరుపోసి చక్కగా పిసికి ఒకరాత్రి నిలువయుంచి మరునాడు ఆ నీటిని వడియగట్టుటయే హిమములే శీతకషాయము అని పిలువబడుతుంది.

పాంటము

ద్రవ్యమును వేడినీటిలో వేసి పిసికి వడియగట్టగా వచ్చు కషాయమును పాంటము అంటారు.

సారాంశములు

త్రిఫలములు: కరక్కాయ, తాడికాయ, ఉసిరికాయ.

త్రికటుకములు: శొంఠి, పిప్పళ్లు, మిరియాలు.

పంచ లవణములు: సైంధవలవణము, సౌవర్చలవణము, బిడాలవణము, సముద్రలవణము, కాచలవణము.

పంచ కోలములు: శొంఠి, పిప్పళ్లు, మోడి, చవ్యము, చిత్రమూలము.

పంచాంగములు: చెట్టుయొక్క చెక్క, ఆకు, వేరు, పండ్లు, పూలు.

పంచ గవ్యములు: గోమయము, గోమూత్రము, గోదధి, గోక్షీరము, గోఘృతము.

భాగపంచకము: మేకపాలు, పెరుగు, మూత్రము, పురీషము, నెయ్యి.

పంచ మూత్రములు: ఆవు, గొఱ్ఱె, బఱ్ఱె, మేక, గాడిద మూత్రములు.

షడూషణములు: పిప్పళ్లు, మోడి, చవ్యము, చిత్రమూలము, శొంఠి, మిరియాలు.

సప్తోపవిషమములు: జిల్లేడుపాలు, జెముడుపాలు, పొత్తిదుంప, గన్నేరు, గురిగింజ, నల్లమందు, ఉమ్మెత్త.

పంచ వల్కములు: మఱ్ఱి, రావి, జువ్వి, అత్తి, మామిడి వీని పట్టలు.

పంచ పల్లవములు: మఱ్ఱి, రావి, జువ్వి, మేడి, నేరేడు వీని చిగుళ్లు.

మహారసములు: అభ్రకము, వైక్రాంతము, మౌక్షికము, విమలము, శిలాజిత్తు, మైలుతుత్తము, చపలము, కఫరి.

మహావిషములు: వత్సనాభి – హరిద్రము, సక్తుకము, ప్రదీపనము, సౌరాష్ట్రికము, శృంగకము, కాలకూటము, హాలాహలము, బహ్మపుత్రము.

శిరీషపంచకము: దిరిశిన చెట్టుఆకులు, పట్ట, పుష్పములు, పండ్లు, వేరు.

క్షీరాష్టకములు: మనిషి, ఆవు, మేక, ఎనుము, గొఱ్ఱె, ఒంటె, ఏనుగు, గుఱ్ఱము, వీని పాలు.

ఓషధులు (అడ్డసరము)

దీని రెమ్మలు ఒకదాని ప్రక్కనొకటి మొలచి పొదలవలె పెరుగుతుంది. దీని కొమ్మలు లేతగ నున్నపుడు ఆకుపచ్చగ, ముదిరినపుడు తెలుపుగ ఉంటాయి. దీని ఆకులు మామిడాకులవలె పొడవుగ వుండి పెళుసుగ

నుండవు. పండుటాకులు పసుపుపచ్చగా వుంటాయి. మాఘ ఫాల్గుణ మాసాలలో నిది పూతపూస్తుంది. అప్పుడు కొమ్మలచివర జూలువలె చిన్న చిన్న కోటియాకులు పుట్టి వానిలో తెల్లని చిన్న పూవులు పూస్తాయి. కాయలు కాయదు. దీని వేరు, ఆకులు, పువ్వులు ఔషధాలలో వాడుతారు. ఆయుర్వేద పశువైద్యులు దీని ఆకులను చెక్కను వాతరోగములకు వాడుతారు. ఆకురసము విరేచనముల కట్టిస్తాయి. వాతములన్నింటిని పోగొట్టుతాయి. పశువులకు కలుగు శ్వాససంబంధమగు రోగాలకు చెక్కరసము, ఆకురసము బాగుగా పనిచేస్తుంది. ముద్దవాతము వచ్చినపుడు రెండు గుప్పెళ్లు ఆకులు వుండగచేసి దానిలో ఒకతులం ఇంగువ, రెండు తులములు ఉప్పు కలిపి పెట్టిన తగ్గుతుంది. ఆకురసము తేనెతో కలిపి దగ్గులకు వగర్పునకు అప్పుడప్పుడు నాలుకకు నాకించిన తగ్గుతుంది. దీని ఆకుపసరు చలువచేస్తుంది. దీని ఆకులు చెక్కను కషాయంగా కాచి పశువులకు వచ్చు కల్లవాపులు, వాతనొప్పులు, దెబ్బలకు వాడిన బాగుగా పనిచేస్తుంది.

మోతాదు: ఆకులు సవాసేరు వరకు.

అవిసె

ఇది ప్రసిద్ధమైన పెద్దచెట్టు. దీని పువ్వులు పెద్దవిగానుండి ఎరుపురంగుగ గాని, తెలుపురంగుగ గాని ఉంటాయి. కొందరు ఆకులను పువ్వులను వాడుతారు. దీని చెక్క ఆకురసము చేదుగనుంటుంది. వేడినిస్తుంది. పైత్యపు దద్దురునకు ఆకుపసరు, పసుపు శరీరమున కంతటికి రెండు మూడు పర్యాయములు పట్టించిన యెడల బాగుగా పనిచేస్తుంది. ఇంకను వాతనొప్పులకు, ఉబ్బురోగమునకు కూడ ఈ పసరును శరీరమునకు పూయవచ్చు. నేత్రరోగములకు ఆకుపసరుతో మిరియాలుగాని, శొంఠిగాని గంధముతీసి కలిపి వాడిన బాగుగా పనిచేస్తుంది. చర్మరోగములకు ఆకుపసరులో తగినంత ముద్దకర్పూరము కలిపివాడిన పనిచేస్తుంది. అవిసె నూనె, గింజలుకూడ పనిచేస్తాయి.

అల్లము

ఇది పసుపు మొదలైన మొక్కలజాతిలో చేరింది. అల్లమునుండియే శొంఠిని తయారుచేస్తారు. మనకు చైనా, జపానుదేశములనుండికూడ వస్తున్నది. అల్లము కారముగా, పుల్లగా వుంటుంది, వేడి జేస్తుంది. జీర్ణ శ్వాస సంబంధమగు రోగముల కన్నిటికి బాగా పనిజేస్తుంది. కడుపులోని వాయువును హరింపజేస్తుంది. అజీర్తి, దగ్గు, వగర్పు మున్నగు రోగములలో మంచి బెల్లము అల్లము సమానభాగములు తీసికొని నారింజ-కాయంత ప్రతిపూట పెట్టుచుండినయెడల బాగా పనిజేస్తుంది.

మోతాదు: 1 తు మొదలు సేరువరకు.

అరటి

వీనిలో అనేకరకములున్నాయి. వీని దుంప, వేళ్ళు, పొత్తి, ఆకులు మున్నగువాని రసము స్వాదుగ వెగటుగనుండి చలువజేస్తుంది. దుంపరసము రక్తసంబంధమగు రోగాలకు బాగా పనిజేస్తుంది. వ్రేళ్లరసము

విషములను విరుస్తుంది. ఆకురసము, దుంపరసము నేత్రవ్యాధులకు పనిజేస్తుంది. ఆకుల చూర్ణము వెన్నతో కలిపి అర్రువాపులకు, చర్మవ్యాధులకు ఉపయోగించిన బాగా పనిజేస్తుంది. అరటిపండ్లను మలబద్ధకముగా నుండు దూడలకు, ఎండురోగం గల పశువులకు బాగా పనిజేస్తుంది. దుంపరసము విరేచనముల కట్టిస్తుంది. అరటిపువ్వుల రసములో కవిరి కలిపియిచ్చిన పారుడురోగము కట్టుకొంటుంది. ఆకురసమును నేత్రరోగాలకు వాడవచ్చును.

మోతాదు : దుంపరసము అర్ధశేరు వరకు

అతిమధురము

ఈ మొక్కలు పెషావరు, అరేబియా, సింధుప్రాంతాలందు పెరుగుతాయి. ఇవి ఆరడగుల ఎత్తువరకు పెరుగుతాయి. ఆకు గుండ్రముగ, చిన్నదిగ, ములగఆకంత పరిమాణంగ వుంటుంది. చెట్టంతయు నారగా వుంటుంది. సన్నని గుత్తులుగా పూలుపూస్తాయి. పువ్వులకు వాసనయుండదు. ఆకును నలిపిన వెగటువాసనగా వుంటుంది. సన్యాసులు దీని ఆకును తిని యోగసిద్ధి నొందుతారు. వేరురసము చలువజేస్తుంది. నేత్రరోగములకు, చర్మవ్యాధులకు బాగుగా పనిజేస్తుంది. యష్టిమధుకమును దగ్గులకు, వగర్పునకు వాడవచ్చును. దీని బెరడు ముందు చేదుగనుండి తదుపరి తీపిగ వుంటుంది. బెరడు పొడితో తగినంత బెల్లముకలిపి దగ్గులకు నాకించవచ్చును.

మోతాదు : 4 తులముల వరకు

అక్కలకఱ్ఱ

ఇది గుల్ముగ పెరుగుతుంది. చామంతి ఆకువంటి ఆకులను, బోడతరపు పువ్వువంటి కాయలను కాస్తుంది. కాయ అంతయు పసుపుపచ్చగను, పైన ఎరుపురంగుగల బెరడును యుంటుంది. దీని వేరునే అక్కలకఱ్ఱ యంటారు. ఆకుకూడ వేరువలెనే నమలినయెడల చిమచిమలాడుతుంది. వగరుగ కారముగవుండి వేడిజేస్తుంది. నరసంబంధమగు రోగాలకు ఈ రసం బాగా పనిజేస్తుంది. వాతరోగాలను పోగొట్టుతుంది. గట్టికంతులకు గండఫెరోజాలో ఈ అక్కలకఱ్ఱ పొడిపి కలిపి పట్టీవేసిన త్వరలో పక్వమునకు వస్తుంది. నేత్రరోగములకు దీనిని తదితర ఔషధములతో కలిపి వాడవచ్చును. జోరీగలు, కందిరీగలు పశువు శరీరాన్ని కరచి దద్దురుపుట్టిన యెడల నామసుద్దతో ఈ అక్కలకఱ్ఱ గంధముతీసి కలిపిరాచిన తగ్గుతుంది.

మోతాదు : 4 తులముల వరకు

అత్తి

ఇది పెద్దవృక్షము. ఆకులు గుండ్రముగ, కొంచెముకోలగ మందముగ గరగరలాడుతాయి. చెట్టునుండి పాలుకారుతాయి. కాయలు గుండ్రముగ తీయగ వుంటాయి. వీటినే అత్తిపండ్లందురు. ఇవి పూవులు పూయకుండానే కాయలు కాస్తాయి. చెక్కరసము వెగటుగ తీపిగ వుంటుంది. వాతరోగాలకు చెక్కరసము

బాగుగా పనిజేస్తుంది. చెక్కపొడి కంతులకు, చర్మరోగములకు వేపనూనెలో కలిపి రాచిన పనిజేస్తుంది. అత్తిపండ్లను పిసికి మొండికంతులపైన వేసినయెడల పక్వమునకు వస్తాయి.

మోతాదు : చెక్కరసము సేరువరకు.

అతివస

ఈ అతివస తెలుపు, నలుపు, ఎరుపు అని మూడు విధాలుగా వుంటుంది. గుణము మాత్రము సమముగా వుంటుంది. అతివస కొంచెము చిరుచేదుగ, కారముగ వుంటుంది. దీని గంధము కళ్ళవాపులకు పనిజేస్తుంది. దూడలకు కలుగు పాలదొమ్మలో దీనిని వాడవచ్చును.

మోతాదు : 4 తులముల వరకు

ఆముదపుచెట్టు

ఈ చెట్టు చాల ప్రసిద్ధమైంది. ఇది చిట్టాముదము, పెద్దాముదము అని రెండు జాతులు. చిట్టాముదమునకు కాయలు, ఆకులు చిన్నవిగాను, పెద్దాముదమునకు పెద్దవిగాను వుంటాయి. గుణము సమానమే, కాని చిట్టాముదము చాల మంచిది. వీని పూవులలో ఎఱుపు, తెలుపు రకములు గలవు. ఆకులు వగరుగ చేదుగ, రుచిగ వుంటాయి. తలమాదకు శిరోవాతములకు ఆకులను వేసి కట్టిన బాగా పనిచేస్తుంది. శిలామేహవాతమునకు ఆకురసము వాడవచ్చు. ఆముదపువేరు వాతరోగాలకు ఉపయోగించవచ్చు. ఆముదపు గింజలు విరేచనము గావిస్తాయి. మామూలుగా పెట్టు దాణాదినుసులు మొదలగు బలవర్ధకౌషధములలో ఆముదపు పప్పును వేసి పెట్టుచుండినయెడల వాతరోగాలు, నేత్రరోగములు సంభవింపవు. ఆముదము విరేచనమును గలిగిస్తుంది.

మోతాదు : ఆముదము సేరువరకు

ఆవాలు

ఆవాలలో ఎరుపు తెలుపు నలుపు రంగులు గలవు. ఇంచుమించుగ మూడును సమానగుణములు గలిగియుంటాయి. తెల్లావాలను ఔషధములలో వాడుతారు. వేడి చేస్తుంది. వాతరోగాలలో విరివిగా వాడవచ్చు. వీనిని తరుచుగా జబ్బుపడిన భాగమునకు పట్లు వేస్తారు. వీనిని పట్టువేయునపుడు వేడినీటితో కలిపి పట్టువేయాలి. వాచియుండు ప్రదేశముపైన ఈ పిండితో పట్టువేసిన తగ్గుతుంది. పశువునకు న్యూమోనియా మున్నగు వ్యాధులు కలిగినపుడు ప్రక్కలమీదను, కడుపునొప్పికి పొట్టమీదను, గుండె, పేగులు వాచినపుడు ఆ యా ప్రదేశముల మీదను పట్టువేయాలి. ఇంకను వీటిని బలవర్ధకౌషధములలో కలిపి వాడవచ్చును. చురుకుగా పనిచేస్తుంది.

మోతాదు : 2 తులముల నుంచి 6 తులముల వరకు

ఆరుదొండ

ఇది తీగ, కోలగ పండిన ఎరుపుగలిగి కాయలు చేదుగ వుంటాయి. ఈ ఆకుపసరు వేడిచేస్తుంది. దీర్ఘవాతములలో వాడవచ్చు ఈ దొండచిగుళ్ళలో తగినన్ని మిరియాలు, జాజికాయ కలిపిపెట్టిన అతిమూత్రము తగ్గుతుంది. వాపులకు దీని పసరును వాడవచ్చు.

మోతాదు : ఆకుపసరు సేరు.

ఆకుజెముడు

జెముడు చెట్లలో ఆకుజెముడు, పుల్లజెముడు, పలకలజెముడు మున్నగు అనేక రకాలున్నాయి. అన్నిటికి పాలు పూర్తిగానుంటాయి. ఆకుజెముడుకు సన్నని కాడలును అరుదుగా చిన్ని ఆకులను యుండును. వేడి చేస్తుంది. కఫమును పోగొట్టుతుంది. విరేచనము గలిగిస్తుంది. పశువులకు శ్వాసరోగములందును, సంధిపుట్టినపుడును దాని కాడలు దోరగా వేయించి రసముతీసి తగినంతగా త్రాగించిన యెడల శ్వాస కట్టుతుంది. ఇంకను ఈ కాడరసములో వేపనూనె కలిపి అర్రువాపులకు, కల్లవాపులకు ఉపయోగించవచ్చు.

మోతాదు : పసరు అర్ధసేరు వరకు

ఇంగువ

ఇవి 3, 4 అడుగుల ఎత్తువరకు పెరుగుతుంది. ఈ మొక్కలలో చాల రకములు గలవు. చెట్టువ్రేళ్ళను నరకుటవలన నేర్పడెడి జిగురు నిలువయుంచుట వలన నలుపురంగుగ అవుతుంది. దీనినే ఇంగువయందురు. కొందరు వర్తకులు దీనిపైన రంగుపూస్తారు. ఇది కారువాసనగ, వెగటుగ, కారముగ వుంటుంది. మిక్కిలి వేడిజేసి ఆర్చుతుంది. శ్వాస నణచును. విరేచనము గావిస్తుంది. పశువులకు కలుగు జీర్ణవాత శ్వాసరోగములకు బాగుగా పని చేస్తుంది. ఈనిన వెంటనే 4 తులముల ఇంగువను సేరుపాలలో కలిపివాడిన, వేడిజేసిన వాతమును హరిస్తుంది. ఇంగువను సారాయిలో గాని, స్పిరిట్‌లో గాని కలిపి పుండ్లకు రాచిన నెమ్మదిస్తుంది. దీర్ఘకడుపుబ్బులకు కర్పూరతైలంలో గాని, అవిసెనూనెలో గాని ఇంగువను కలిపి త్రాగించిన తగ్గుతుంది.

మోతాదు : 6 తులముల వరకు

ఇందుపగింజలు

ఈ చెట్లు ముసిడిచెట్టుకంటె పెద్దవి. ఇవి కొండలమీద బాగుగా పెరుగుతుంది. పండ్లను తిందురు. గింజలు జిగటగనుండును. గింజల నరగదీసి మడ్డినీటిలో కలిపినయెడల స్వచ్ఛమైన నీరు పైకితేలుతుంది. ఇంకను ఈ గింజలను మసిచేసి పంచదారలో కలిపి పశువులకు కలుగు నేత్రరోగముల కుపయోగించవచ్చు.

ఉత్తరేణి

వీనిలో నలుపు, తెలుగు, ఎరుపు అనే మూడు రకములుంటాయి. ఉత్తరేణి ఆకులు నూరి విరిగిన భాగములకు కట్టుకట్టిన ఎముకలు త్వరలో కట్టుకొంటాయి. ఈ ఆకుపసరు కారముగ, చేదుగా వుంటుంది. జొన్నకలిలో ఆకుపసరు కలిపి త్రాగించిన మూత్రరోగములు, వాతరోగములు తగ్గుతాయి. ఆకు నూరి రసముతీసి విషపురుగుల కాట్లకు ఉపయోగించవచ్చును. చర్మవ్యాధులకు కూడ పసరు బాగుగా పనిజేయును. ఉత్తరేణిని భస్మము చేసి తదితర మందులలో కలిపి చర్మవ్యాధులకు, జీర్ణరోగములకు వాడిన తగ్గుతాయి.

మోతాదు : పసరు సేరువరకు

ఉమ్మెత్త

పువ్వులు, ఆకులు పెద్దవిగానుండి కాయలమీద ముండ్లుంటాయి. కొన్ని జాతులకు ముండ్లుండవు. నల్ల ఉమ్మెత్త చాల శ్రేష్ఠమైంది. తెలుపు, నలుపు, పసుపు పూవులు గల చెట్లుండును. పచ్చపువ్వులది దొరకుట కష్టం. తక్కినవి దొరుకుతాయి. ఆకురసము వేడిజేస్తుంది. అర్రువాపులకు, బెణుకులకు ఈ ఆకుపసరులో తగినంత వెన్న కలిపి మర్దన చేసిన తగ్గుతుంది. పశువులకు కలుగు వాతరోగములకు ఆకుపసరు బాగుగా పని చేస్తుంది. నల్ల ఉమ్మెత్త ఆకుపసరు విషపురుగుల కాట్లకు పని చేస్తుంది. నుసిమిరికి ఈ ఆకుపసరుతో తగినంత గంధకము కలిపి రాసిన మాడిపోతుంది. కుందేటివెట్టి అను వ్యాధికి నల్లఉమ్మెత్తాకు పసరులో తగినంత ఉప్పు కలిపి యిచ్చిన తగ్గుతుంది. ఈ ఆకుపసరును ఎక్కువగా వాడరాదు. దీనిలో విషవస్తువు లెక్కువగా వుంటాయి. పసుపు పువ్వుల ఉమ్మెత్తను భూతవైద్యులెక్కువగా వాడుతారు.

ఉసరిక

దీని ఆకులు, పువ్వులు, కాయలు ఔషధముల యందు ఉపయోగపడుతుంది. దీని చెక్క కాయల రసము వగరుగా, పులుపుగా వుంటుంది. రసము చలువ చేస్తుంది. పశువులకు కలుగు రక్తవాత రోగముల కన్నిటికి తదితర మందులతో కలిపి వాడిన బాగుగా పనిచేయును. పశువులకు కలుగు దొమ్మలకు త్రిఫలములు అనగా కరక్కాయ, తాడికాయ, ఉసిరకపప్పుతో కలినీరు కలిపి రెండు, మూడు మోతాదులిచ్చిన తగ్గుతుంది. ఇంకను ఉసరికపప్పు కషాయము ప్రత్యేకముగా విరేచనములు కట్టించుటకు ఈయవచ్చు.

మోతాదు : 10 తులముల వరకు

ఊడుగ

ఇది సాధారణమైన చెట్టు, దీని ఆకులు సన్నముగా రెండు, మూడు అంగుళముల పొడవు నుండి తెలుపురంగు గల పూవులు పూస్తాయి. దీని కాయలు పచ్చిగనున్నపుడు నలుపుగను పండినపుడు ఎరుపుగను ఈతకాయంత ఆకారము గలిగివుంటాయి. దీని చెక్కరసము చేదుగనుండి వేడిజేస్తుంది. విషపురుగుల కాట్లకు బాగుగా పనిచేయును. పశువులకు కలుగు కడుపునొప్పి, కామెర్లు, చర్మరోగములకు ఈ చెక్కరసమును వాడవచ్చు.

మోతాదు : చెక్కరసము ముప్పాతిక సేరువరకు

ఏనుగ పల్లేరు

ఇది చిన్న చెట్టు. వర్షాకాలమునందు బాగుగా మొలచి వేసవియందు మాడిపోతుంది. దీని పువ్వులు నూవుపువ్వుల ఆకారము గలిగి పసుపుపచ్చగ వుంటాయి. కాయలు గచ్చకాయలంత పరిమాణము గలిగి ప్రక్కలయందు నాలుగు ముండ్లుంటాయి. దీనినే ఏనుగపల్లేరని, పెద్దపల్లేరని వాడుతారు. ఇందు చిన్నపల్లేరొకటి కలదు. ఇది నేలన ప్రాకుతుంది. ఆకులు చింతాకువలె వుంటాయి. దీని పువ్వులు చిన్నవిగా, ఎరుపుగా కాయలకు నాలుగు జంటముండ్లుంటాయి. గొల్లలు వీని ఆకులను పెరుగులో నీరుపోసి వేస్తారు. వెంటనే పెరుగు గట్టిపడుతుంది. దీని ఆకు, కాయ, రసము చలువ చేస్తుంది. దీని ఆకుపసరులో బియ్యపునీరు కలిపి యిచ్చిన కురమయను రోగము శాంతిస్తుంది. పల్లేరుకాయలను మాడ్చి పొడిచేసి తులం సూరేకారంలో కలిపి సేరు కలినీరుతో యిచ్చిన నీరుచురుకు, శిలామేహవాతము తగ్గుతాయి. ఆరంభంలోనే చేయాలి. శుక్లనష్టమునకు పసరు పని చేస్తుంది. పల్లేరు వేళ్ళరసము కూడ మూత్రరోగములకు పని చేస్తుంది. ఆకురసములో తగినంత నూనెకలిపి వాతనొప్పులకు మర్దన చేసిన తగ్గుతాయి.

మోతాదు : ఆకురసము సేరు

కరక్కాయ

ఈ చెట్టు పెద్దవృక్షము. ఆకులు మందముగా పెళుసుగా వుంటాయి. విజయ, రోహిణి, పూతన, అమృత, అభయ, జీవంతి, చేతకి అని కరక్కాయలు ఏడు విధములుగా వుంటాయి. విజయ కరక్కాయ సొరకాయ వలె గుండ్రముగా, రోహిణి కరక్కాయ గుండ్రముగా, పూతన కరక్కాయ చిన్నదిగా, అమృతకరక్కాయకు బీజము చిన్నదిగను కండమిక్కిలి మందముగా, అభయకు అయిదు రేఖలు వుంటాయి. జీవంతి బంగారురంగు కలిగి యుంటుంది. చేతకికి మూడు రేఖలుంటాయి. విజయ సర్వరోగములందును, రోహిణి ప్రణవరోపణమునందును, పూతన లేపనవిధియందును అమృత శోధనమునందును, అభయ నేత్రరోగములందును, జీవంతి సర్వరోగములందును, చేతకి చూర్ణయోగములందును వాడదగి యుంటుంది. చేతకియను కరక్కాయ తెలుపు, నలుపు భేదముచేత రెండు రకాలుంటాయి. తెల్లచేతకి కరక్కాయ ఆరు అంగుళముల పొడవుగలదిగను, నల్లచేతకి కరక్కాయ ఒక అంగుళము పొడవుగ వుంటుంది. పై భేదములలో కొన్ని స్పర్శమాత్రమునను, కొన్ని దృష్టిమాత్రమునను, కొన్ని వాసనచూచినంతనే, కొన్ని తినినను విరేచనము కలిగిస్తుంది. అన్నిటిలో విజయ కరక్కాయ మిగుల శ్రేష్ఠమైంది.

కరక్కాయ కండయందు మధురరసము, స్నాయువులయందు ఆమ్లరసము, తాడిమయందు చేదు, చర్మమునందు కారము, గింజయందు వగరు యిట్లు అయిదు రుచులు కరక్కాయయందున్నవి. కరక్కాయ వగరుగా వుంటుంది. చలువ చేస్తుంది. వాత, జీర్ణ, శ్వాసరోగముల కన్నిటికి ఈ కరక్కాయ పొడి బాగుగా పని చేస్తుంది. కరక్కాయ పొడి, కవిరిపొడి కొబ్బరినూనెలో కలిపి గాయములకు, పుండ్లకు వాడిన తగ్గుతాయి.

మోతాదు : పొడి 8 తులముల వరకు

కలబంద

కలబంద యనునది యొక గుల్మము. సుందరమైన మట్టలును, మట్టలలో మదపు వాసనగల గుజ్జును ఉంటుంది. కాయ, ఆకు, వెన్ను మొదలగునవి లేవు. సర్వాంగసారమైన మూలిక. వైద్యమునందు మట్టలనే ఎక్కువగా వాడుతారు. మట్టలరసం జిగటగా తీగలు సాగుతుంది, చలువచేసి విరేచనము గావిస్తుంది. బలవర్ధకౌషధములలో మట్టలనుంచి తయారగు ముసాంబరమను పొడిని కలిపి వాడిన పని చేస్తుంది. మట్టలరసంలో పటిక, గంధము, సమాన భాగములుగ కలిపి చర్మరోగములకు, నలిగిన గాయములకు వేసిన తగ్గుతుంది.

మోతాదు : ముసాంబరము 6 తులముల వరకు

కవిరి

ఇది చంద్రచెట్టు నుండి తయారు చేయబడు వస్తువు. దీనినే కైరసారము, కాచు అందురు. వెగటుగ, వగరుగా వుంటుంది. చలువ చేస్తుంది. విరేచనములు కట్టిస్తుంది. చర్మరోగములకు, నోటిపూతకు దీనిని తదితర మందులలో కలిపి ఇచ్చిన తగ్గుతుంది.

మోతాదు : 5 తులముల వరకు

కటుకరోహిణి

ఇది తెలుపు, నలుపు రెండు రకములు. ఆకులు చేదుగా వుంటాయి. ఎక్కువ మోతాదుల నీయరాదు. నల్లదానికంటె తెల్లకటుకరోహిణి చురుకుగా పని చేస్తుంది. వేపచెక్క పొడి, యష్టిమధుకము, కటుకరోహిణి నీరుకలిపి కాచిన కషాయము బలవర్ధకౌషధముగా రక్తసంబంధమగు రోగములయందు వాడవచ్చును. కటుకరోహిణిని బలవర్ధకౌషధములలో కలిపి వాడవచ్చును.

మోతాదు : 4 తులముల వరకు

కరివేప

ఈ చెక్క వేరు చేదు, కారముగానుండును. ఆకు సువాసనగా వుంటుంది. ఆకురసము చలువ చేస్తుంది. విరేచనముల కట్టిస్తుంది. గొడ్డుబోతుతనము గల పశువులకు ప్రతిదినము నాలుగు గుప్పెళ్ళవంతున ఉండచేసి వారము దినములు పెట్టిన చూలు నిలుస్తుంది. ఇంకను క్రిమిరోగములకు, వాతరోగములకు వాడవచ్చు.

కసివెంద

ఇది చిన్న చెట్టు. భూమిపై ముప్పావు గజమువరకు పెరుగును. చెట్టంతయు వెగటు వాసనగా వుంటుంది. దీని కాయలు పెసరకాయలవలె వుంటాయి. పసుపుపచ్చని పూవులు పూస్తుంది. ఆకులు కొంచెము కోలగ మొనదేలక గుండ్రముగా వుంటాయి. ఆకు రసము చేదుగనుండి వేడిజేస్తుంది. వెన్నతో

ఆకుపసరు కలిపి అర్రువాపులకు పక్షవాతములకు ఉపయోగించవచ్చు. ఇంకను పసరు నేత్రరోగములకు చర్మరోగములకు బాగుగా పని చేస్తుంది.

కురాసానివాము

ఇది జీర్ణసంబంధమగు రోగములకు బాగుగా పని చేస్తుంది. ఈ మొక్కలు గుబురుగా పెరుగుతాయి. వాములో మత్తును గలిగించు గుణము కలదు. గర్భవాతమునకు, దగ్గునకు, కడుపునొప్పికి, తదితర శూలలకు కారపు పాలలో కలిపి త్రాగించిన బాగుగా పని చేస్తుంది. ఈ గింజల రసముతీసి కండ్లకు అంజనము వేసిన శిరోభారము తగ్గుతుంది.

మోతాదు : 10 తులముల వరకు

కుప్పింట

ఇది మూర్కొండాకు చెట్టు జాతిలోనిది. దీని ఆకులు కొంచెము కోలగా ఉంటాయి. ప్రతి దొడ్డిలోను ఈ మొక్కలు మొలుస్తాయి. ఆకురసము ఘాటుగా ఉంటుంది. చర్మవ్యాధులకు బాగుగా పని చేస్తుంది. మూర్కొండాకు గుణములే దీనికిని గలవు. శ్వాసరోగములలో ఈ పసరును ముక్కురంధ్రములలో పోసిన బాగుగా పని చేస్తుంది. ఆకురసములో సున్నము కలిపి గజ్జి, నుసిమిరికి వాడవచ్చును.


కుంకుడు


ఇది పెద్ద వృక్షము. ఆకు కొంచెము కోలగా, గుండ్రముగా వుంటుంది. కాయలు చిన్నవిగా, పూవులు తెల్లగా, గుత్తులుగా వుంటాయి. కాయలను నీళ్ళతో నూరిన నురుగువస్తుంది. కాయలు చేదుగా వుంటాయి. వేడిజేస్తుంది. చర్మరోగములలోను, పేను, మిన్నల్లులు కుట్టినపుడును ఈ కాయల నురుగుతో శుభ్రము చేయుట మంచిది. పశువుల తోకలకు గలుగు నుసిమిరి, గురుజు మున్నగు వ్యాధులకు ఈ నురుగును పట్టించవచ్చును. దొమ్మలకు ఈ నురుగును త్రాగించిన తగ్గుతాయి.

కానుగ

ఈ చెట్టుయొక్క ఆకురసము వెగటుగా చేదుగా వుంటుంది. ఈ చెట్టుయొక్క సర్వాంగములు వెగటువాసనగా వుంటాయి. వేసవికాలమందు చిగురుపట్టి పూచును. పూత తెలుపు నలుపురంగుగా వుంటుంది. కాయలు కొంచెము వంకరగను, బల్లపరుపుగా వుంటాయి. ఆకురసము చర్మరోగములకు బాగుగా పని చేస్తుంది. పురుగులు పడిన పుండ్లకు తదితర గాయములకు ఈ గింజలనుండి తయారు చేయబడిన నూనెను వాడిన చక్కగ మానుతుంది. దీని ఆకులు నూరి పురుగులు పడిన పుండ్లకు కట్టిన పురుగులు చస్తాయి. చెక్కరసము వాతరోగములకు యిచ్చిన తగ్గుతుంది. గానుగగింజలను పెరుగుతో నూరి పురుగులు పడిన పుండ్లకు కట్టిన మానును.

మోతాదు : చెక్కరసము అర్ధసేరు వరకు


నునాముఖి
మంచిగంధము
పిప్పలీగె
పొగడ
గసగసాలు
క్వినా
అవ
పసుపు
మునగ


స్థానప్రసుడి
ధాన్యప్రసుడి
ఆసనప్రసుడి
కవ్వప్రసుళ్లు
మూపురప్రసుడి
నగారాసుళ్లు
గాలుసుకట్టుసుడి
లక్ష్మీసుడి
భాషికప్రసుడి
ఆసనప్రసుడి

కాకర

ఇది తీగజాతిలోనిది. దీనిలో అనేక జాతులు గలవు. దీని ఆకులు చిల్లలు గలిగి సుమారు మూడంగుళముల వెడల్పుగ, పువ్వులు పసుపుపచ్చగ పెద్ద కాకరకాయలు గొగ్గులు కలిగి, పొడవుగ, పొట్టి కాకరకాయలు గుండ్రముగ మిగుల చేదుగ వుంటాయి. ఆకురసము చేదుగనుండి వేడిజేస్తుంది. విషజంతువుల కాట్లకు, నేత్రరోగములకు, చర్మవ్యాధులకు పని చేస్తుంది. వాతరోగములకు పసరును తదితర మందులలో కలిపి వాడవచ్చును.

మోతాదు : పసరు అర్ధసేరు వరకు

కందదుంప

గ్రామములోను, పొలములందును వేసి పండించు ఊరకందగూడ అడవి కందయొక్క గుణములను కలిగివుంటుంది. అడవికందకున్నంత దురద దీనికుండదు. అంత చురుకుగా పని చేయదు. మావివేయని పశువులకు ఈ దుంపను పులిచల్లతో గాని, కలినీటితో గాని కలిపి నూరి త్రాగించిన వెంటనే పడుతుంది.

మోతాదు : 6 తులముల వరకు

గంజాయి

దీనినే జ్ఞానపత్రి యందురు. ఈ చెట్టు రెండు గజముల ఎత్తులోపుగా పెరుగుతుంది. పూవులు గుత్తులుగా పూస్తాయి. లేత మొక్కలను ఎలుకలు తింటాయి. ఈ మొక్కల నుండి ఒక విధమైన నారయు, గింజలనుండి నూనెయు తయారుచేస్తారు. ఇది మత్తును కలిగిస్తుంది. పెద్దరోగము, పారుడు, రక్తవిరేచనములు మున్నగు రోగములలో దీనిని వాడిన బాగుగా పని చేస్తుంది. చెవిమాదకు గంజాయి ఆకును నూరి రసముతీసి పోసిన తగ్గుతుంది.

మోతాదు : 4 తులముల వరకు

గచ్చ

ఈ చెట్టంతయు చిన్న చిన్న ముండ్లతో నిండియుంటుంది. ఆకులు దిరిసెన ఆకులవలె ఉంటాయి. కాని అంతకన్న చిన్నవి. కాయలోని గింజ నునుపుగా గట్టి పెంకుగలిగి ఉంటుంది. గచ్చగింజలలో విషరూపమైన పప్పుంటుంది. గచ్చపప్పు చేదుగా, వగరుగా, కారముగా ఉంటుంది. శ్వాసరోగములలో ఈ పప్పు బాగా పని చేస్తుంది. దీని ఆకును శేరువాపునకు, దూడల జంటబొడ్డునకు తదితర కల్లవాపులకు ఆముదముతో వేయించి కట్టిన బాగా పని చేస్తుంది.

మోతాదు : గచ్చపప్పు 6 తులముల వరకు

గుంటకలగర

నీటిప్రదేశములందు విశేషముగా మొలచు చిన్నమొక్క. ఇది నలుపు, పసుపు, తెలుపు పూలభేదము కలిగియుంటుంది. ఇది సర్వాంగసారమైన మూలిక. ఆకురసము చేదుగా వుంటుంది. శరీరమందలి చెడునీటిని లాగుతుంది. నేత్రరోగములకు, శిరోరోగములకు పని చేస్తుంది. చర్మరోగములకు తదితర మందులలో కలిపి వాడవచ్చును. ఆకునూరి మలిమిడికి మిరియాలపొడితో కలిపికట్టిన తగ్గుతుంది.

మోతాదు : అర్ధసేరు వరకు

గోగు

దీనిలో దేశవాళి గోగు, పుల్లగోగు, ధనాసరిగోగు, యెర్రగోగు మున్నగు రకములు కలవు. మెట్టచేలలో పెరిగిన పుల్లగోంగూర శ్రేష్ఠమైనది. సన్నని కాడవలె పొడవుగా మొలుస్తుంది. ఆకులు, పూవులు పుల్లగా వుంటాయి. పాలుకుడుచు దూడలకు అప్పుడప్పుడు గోంగూర పెట్టుట మంచిది. విరేచనము గావించును. వాపులకు, పంపరకు, బొడ్డుపుండ్లకు గోంగూర ఉడికించి గాని, ఆముదముతో వేయించి గాని కట్టిన పని చేస్తుంది.

గాడిదగడప

ఇదియొక తీగ. ఆకు గరుకుగా వుంటుంది. అడవులయందును, కంచెల యందును విశేషముగా పెరుగుతుంది. దీని వేరు, కాడ, ఆకు చాల చేదుగా వుంటుంది. పసరు అతివేడి జేస్తుంది. పశువులకు కలుగు వాతరోగములకు, సమస్త వాపులకు బాగా పని చేస్తుంది. చర్మరోగములకు ఆకుపసరులో హారతికర్పూరము కలిపి నాలుగైదు పూతలు పెట్టిన తగ్గుతుంది. దూడలకు ఎలుకపాములు, నుసిపురుగులు పడినపుడు ఈ ఆకుపసరు పెట్టిన విరేచనమవుతుంది. విషపురుగుల కాట్లకు ఈ పసరు త్రాగించిన బాగుగా పని చేస్తుంది.

మోతాదు : పసరు అర్ధసేరు వరకు

గుగ్గిలము

గుగ్గిలపు చెట్టుయొక్క బంకకు గుగ్గిలమనిపేరు. గుగ్గిలము ముక్కలు ముక్కలుగా పచ్చగా ఎరుపురంగుగా వుంటుంది. పరిమళము గలది. దీని పొగ దేవతారాధనయందు ప్రశస్తముగా ఉపయోగిస్తారు. రసవీర్యాదుల యందు మహిసాక్షికి సమముగా వుంటుంది. గుగ్గిలము మెత్తగను, జిగురుగను ఉంటుంది. శ్రేష్ఠమైన గుగ్గిలము నిప్పులో వేసిన మండుతుంది. ఎండలో నుంచిన కరుగుతుంది. గోరువెచ్చని నీటిలో వేసిన ద్రవమగుటయేగాక పాలవలె తెల్లగానవుతుంది. గుగ్గిలము యొక్క సారము మూడు నెలలకు తగ్గిపోతుంది. గుగ్గిలము మలమూత్రముల వెడలిస్తుంది. గడ్డలను కంతులను కరిగిస్తుంది. నీటితో నూరి పట్టువేసిన

వాతనొప్పులు తగ్గుతుంది. దీనిని పొగవేసి ధూమపానము చేయించిన శిరోరోగములు తగ్గుతాయి. చర్మవ్యాధులన్నిటికి తదితర మందులలో కలిపివాడిన పని చేస్తుంది. బలవర్ధకౌషధములలో కలిపి వాడవచ్చును. పండ్లపొడిలో దీనిని వేసి వాడవచ్చును.

మోతాదు : 5 తులముల వరకు

చింత

చింతచెట్టు పెద్దవృక్షము ప్రసిద్ధమైనది. దీని లేతఆకులు, కాయలు, పండ్లు పుల్లగా వుంటాయి. వేడిజేస్తుంది. చింతాకుపసరులో ఉప్పు, ఆముదపు పప్పు కలిపి చర్మరోగములకు వాడవచ్చును. ఆకుత్రొక్కి ఆముదముతో వేయించి బెణుకులకు మలిమిడికి వాడవచ్చును. చింతగింజలను రుబ్బి విరిగిన ఎముకలకు గుడ్డతో కట్టు కట్టవచ్చును. చింతచెక్కను మసిచేసి ఆముదములో గాని, వేపనూనెలో గాని కలిపి చెల్ది, గజ్జి, నుసిమిరికి వాడిన తగ్గుతుంది. చింతపండు చలువ చేస్తుంది. పశువులకు కలుగు జీర్ణ వాత, రక్తరోగములలో చక్కగా పని చేస్తుంది. విషములకు విరుగుడు పెట్టవచ్చును. పైత్యపు దద్దురునకు చేదుజీలకఱ్ఱతో ఈ పులుసు కలిపి మర్దన చేయవచ్చును. మలబద్ధకముగా నున్నప్పుడు చింతపండు పులుసుతో ఉప్పు కలిపి పెట్టిన పారుతుంది. ఉంగిడికి పులుసు పని చేస్తుంది.

మోతాదు : చింతపండు అర్ధసేరు నవటాకు వరకు

చిత్రమూలము

దీనికి గుండ్రని ఆకులుంటాయి. దీని వేరు చితుకగొట్టిన యెడల పసుపుపచ్చగా వుంటుంది. తెలుపు, ఎరుపు, నలుపు పువ్వుల భేదముచే వుంటుంది. ఎరుపు, నలుపు చిత్రమూలములు రెండు ఒకే గుణము కలిగివుంటాయి. నలుపు చిత్రమూలమును ఆవులకు వాసనజూపినను లేక పాలలో వేసినను పాలు నల్లబడుతాయి. మలిమిడికి, బెణుకులకు చిత్రమూలముతో ఆముదము కలిపి వేసిన, పుండుపడి తగ్గుతుంది. దీని రసము పొక్కుతుంది కాబట్టి తదితర మందులతో కలిపి లోపలికి ఈయాలి. దీర్ఘ జీర్ణ రోగములకు దీని రసముతో తదితర మందులు కలిపి యిచ్చిన తగ్గుతుంది. దీనిని బలవర్ధకౌషధములలో కలిపి ఈయవచ్చును.

మోతాదు : చిత్రమూలము 3 తులముల వరకు

చేదుబీర

మంచిబీరవలె నుండి రసము చేదుగా, వెగటుగా వుంటుంది. నరములకు సత్తువ కలుగజేస్తుంది. తల తిరుగుట, ధనుర్వాతము, దొమ్మ మొదలగు వ్యాధులకు ఈ పసరు పెట్టిన బాగా పని చేస్తుంది.

మోతాదు : పసరు అర్ధసేరు వరకు.

చేదుపొట్ల

తీగ ప్రాకును. ఆకులు పొట్ల ఆకులవలె నుండక చిగుళ్లు వేస్తాయి. కాయలు గుండ్రముగ చిన్నవిగ వుండి, పండిన వెనుక ఎరుపుగా వుంటాయి. కాయపైన తెలుపు చారలుంటాయి. ఆకురసము వగరుగా, చేదుగా వుంటుంది. రక్తసంబంధమగు రోగములకు ఆకుపసరు బాగా పని చేస్తుంది. చర్మవ్యాధులకు పసరును వాడవచ్చును. క్రిమిరోగములకు దీని పసరుతో కలినీరు కలిపి ఈయవచ్చును.

మోతాదు : పసరు అర్ధశేరు వరకు

చేకొణిత

దీనినే సేగుర్తాకు అంటారు. ఇది పొలముల యందును, దొడ్లలోను పెరుగు లతలు. దీని ఆకులు కందిచెట్టు ఆకులవలె ఉంటాయి. వాతరోగములకు బాగా పని చేస్తుంది. జొన్నకలితో ఈ ఆకుపసరు కలిపి పక్షము దినములు పెట్టిన వాతము హరిస్తుంది.

మోతాదు : ఆకు వీశెనుంచి అర్ధమణుగు వరకు

జీలకఱ్ఱ

ఇది చిన్న మొక్క. దీని కొనలయందు గుత్తులు గుత్తులుగా పూయు పువ్వుగుత్తులలో గింజలేర్పడుతాయి. దీనినే తెల్లజీలకర్ర అంటారు. మామూలుగా గృహములందు వాడు జీలకర్ర యిదియే. దీని రసము పుల్లగా స్వాదుగా వుండి, వేడిజేస్తుంది. జఠరదీప్తి, రక్త, జీర్ణ, వాతరోగముల కన్నిటికి అమోఘముగా పని చేస్తుంది.

మోతాదు : 10 తులముల వరకు

జీడిగింజలు

ఇది పెద్ద వృక్షము. కొంచెము పొడవుగా, వెడల్పుగా ఆకులుండును. నలుపుగింజలు, గుండ్రని పండ్లు, తెలుపు గల మాను కలిగియుంటుంది.

జీడిగింజలను నలుగగొట్టునప్పుడు జాగ్రత్తగా కొట్టాలి. గింజలలో నుండు పొగ మనుష్యులకు సరిపడనిచో శరీరమంతయు వాస్తుంది. జీడిగింజలు వెగటుగా, చేదుగా, చమురు గలిగి యుంటాయి. పశువుల వాతరోగాలకు ప్రతిదినము నాలుగైదు తీసికొని తిను ఆహారములో కలిపి పెట్టిన నెమ్మదిస్తాయి. పాడిపశువులకు పాలశేర్లు నాలుక సెలయగునప్పుడు ఈ గింజలను పులిచల్లలో నానబెట్టి త్రాగించిన తగ్గుతాయి. కాలుగొఱ్ఱు, తదితర మొండిగాయాలకు జీడిని కాల్చి అంటించిన తగ్గుతుంది.

జిల్లేడు

దీనిలో తెలుపు, నలుపు రంగుల పూలచెట్లుంటాయి. జిల్లేడు చిన్నచెట్టు. దీని కాయలు వంకరగా, ఆకుపచ్చగా వుంటాయి. ఎండిన తరువాత కాయలో నుండి స్వచ్ఛమైన మృదువైన దూది వెడలును. చెట్టునెక్కడ గిల్లినను పాలుగారును. పాలకు మదపువాసన వుంటుంది. తెల్లజిల్లేడుపూవులు శివునికి

ప్రీతికరములని పూజ చేస్తారు. ఆకులు మందముగా కొంచెము కోలగను, చెట్టంతటను సన్నని తెల్లని నూగుంటుంది. ఇది ప్రసిద్ధమైన చెట్టు. రెండుజిల్లేళ్ళునూ సమాన ప్రభావము గలవి గాని తెల్లజిల్లేడు మిగుల శ్రేష్ఠము.

ఆకులు, వ్రేళ్ళు, పూవులు, పాలు సైతం వెగటుగా నుండి చాలా వేడిజేస్తుంది. జిల్లేడాకుల రసము వాపులకు శ్వాసరోగములకు చెవిరోగములకు పని చేస్తుంది. జిల్లేడుపాలు నేత్రరోగములకు, చర్మరోగములకు, ఆకుపసరు విషపురుగుల కాట్లకు పని చేస్తుంది.

తుమ్మ

ఇదియొక పెద్ద చెట్టు. కొమ్మలకు సన్నని ముండ్లుంటాయి. పసుపుపచ్చగ గుండ్రముగా నుండు చిన్నపువ్వులు పూస్తుంది. పూవునకు అరంగుళము పొడవు గల సన్నని తొడిమ, నలుపుగా, మందముగానుండు మ్రానుపై పట్టయు, తెలుపు, నలుపురంగులు గల జిగురును, సన్నని పొడవుగా, పలుచగానుండు కాయలును, జమ్మి ఆకులవలె చిన్నవిగను ఉంటాయి. ఇందు తెల్లతుమ్మ, నల్లతుమ్మ, కస్తూరితుమ్మ అని మూడురకములు గలవు. తెల్లతుమ్మమాను అంతయు తెలుపుగా బూడిదరంగుగా వుంటుంది. పూవులు కూడా తెలుపుగా వుంటాయి. కస్తూరితుమ్మ సాధారణమైన చెట్టు. ఇంచుమించు తెల్లతుమ్మవలె వుంటుంది. దీనికాయ మిక్కిలి పొట్టిది. నల్లతుమ్మచెక్క వగరుగా, వెగటుగా వుంటుంది. ఈ చెక్కరసము పారుడు నోటి గాలిపుండ్లకు, చిన్నదూడలకు కలుగు చర్మవ్యాధులకు పని చేస్తుంది. పాలసేర్లు, గర్భవాతమునకు, పశువు ఈనిన తరువాత సేరు తుమ్మాకుపసరులో అర్ధసేరు పాలు, రెండు తులముల ఇంగువ కలిపి త్రాగించిన తగ్గుతుంది. తుమ్మచెక్క పొడిచేసి రసికారుపుండ్లకు తదితర గాయములకు వేసిన బాగుగా పని చేస్తుంది. తుమ్మచెక్క కషాయము నోటిపూతకు పని చేస్తుంది. తుమ్మకాయలను పశువులకు పెట్టిన మిగుల బలము గలుగును.

మోతాదు : చెక్కరసము అర్ధసేరు వరకు

తురకవేప

దీని ఆకులు వేపాకులకంటె పెద్దవిగా నుండి ఆకురసము చేదుగా ఉంటుంది. దీని వేరు గింజలను మందులలో వాడుతారు. దీని చెక్కరసము చేదుగానుండి ఆకురసము విషమును విరుస్తుంది. మలమూత్రముల జారీచేస్తుంది. చర్మ వాతరోగములకు బాగా పనిచేస్తుంది. నీటిలో తురకవేపాకు వేసి కాచి గోరువెచ్చగానుండు నీటిని పశువులకు కలుగు వాతనొప్పులు, దెబ్బలు, వాపులు మున్నగువానికి దినమునకు నాలుగైదుసార్లు కట్టినయెడల బాగా పనిచేస్తుంది. ఆకుపసరులో ముద్దకర్పూరం కలిపి చెల్దికి, గజ్జికి రాచిన తగ్గుతుంది. దూడలకు మిన్నల్లులు పట్టినపుడు ఈ ఆకుపసరులో మంచినూనె కలిపి దూడకు రాసిన అవి చచ్చిపోతాయి.

మోతాదు : ఆకురసము ముప్పాతిక సేరు వరకు

తులసి

తులసి గుండ్రముగ కొంచెము కోలగ మృదువైన ఆకులు గలిగి కృష్ణతులసియని లక్ష్మీతులసియని రెండు రకాలు. కృష్ణతులసి ఆకులు నలుపుగను, లక్ష్మీతులసి ఆకులు పచ్చగనుండి వీని శిఖలందు వెన్నుబుట్టుతుంది. అందు సన్నని పువ్వులును, నలుపుగనుండు చిన్నగింజలును ఉంటాయి. తులసి మంచి సువాసన గలది. గృహస్థులు పరమపూజ్యముగానెంచి గృహములందు వేసి పూజించుతారు.

తులసి కారముగా, వగరుగానుండి వేడిచేస్తుంది. శ్వాస రక్తరోగములకు బాగా వాడవచ్చును. ఆకుపసరును మొగబంతి పీనసరోగములకు ముక్కురంధ్రములలో వేయవచ్చును. చర్మరోగములలో పసరుతో గంధకము, హారతికర్పూరము కలిపివాడిన తగ్గుతుంది. ఆకునూరి దానిలో తగినంత కరిధూపము కలిపి పురుగులు పడిన పుండ్లకు వేసిన పురుగులు చస్తాయి.

మోతాదు : ఆకుపసరు పావుసేరు వరకు

తమలపాకులు

తమలపాకు తీగ సన్నముగా వుంటుంది. దీనికి చెమ్మయు, చల్లదనము ఉండాలి. తీగనరికి పాతిన బ్రతుకుతుంది. ఆకులలో మూడు, నాలుగు రకములు గలవు. దీని ఆకురసము కారముగా నుండి విరేచనము గావిస్తుంది. వాతరోగములలోను, కడుపునొప్పి రొంప, దగ్గు మున్నగు రోగములలోను ఆకుపసరు బాగా పని చేస్తుంది.

మోతాదు : ఆకులు 100 వరకు

తంగేడు

గుబురుగా పెరిగి పసుపుపచ్చని పూలు పూస్తుంది. కాయ వంకరగా బద్దవలె వుంటుంది. ఆకు చింతాకుకన్నా రెడ్డింపు పెద్దదిగా వుంటుంది. చెక్కరసము వగరుగా వుంటుంది. ఆకురసము చెక్కరసము విరేచనములు కట్టించుటకు పని చేస్తుంది. దూడలు పాలెక్కువగా త్రాగి పారుకొనిన యెడల తంగేడు చిగుళ్ళను పెరుగులో కలిపిపెట్టిన తగ్గుతుంది. పెద్ద రోగములో పారుదెక్కువగా నున్నయెడల ఆకు చిగుళ్ళను నూరి కలినీటిలో గాని, పెరుగులో గాని నాలుగైదుసార్లు పెట్టిన యెడల తగ్గుతుంది.

మోతాదు : ఆకుపసరు అర్ధసేరు వరకు

తిప్పతీగె

ఇది ఒకవిధమైన తీగ. డొంకలమీదను, కంచెలమీదను ప్రాకుతుంది. దీని ఆకులు యించుమించుగా తమలపాకులను పోలివుంటాయి. ఈ తీగ కణుపులలో రెండువైపుల చిగురుపట్టి పెద్దతీగగా పెరుగుతుంది. దీనికి చిన్న చిన్న తెల్లని పూవులును, బచ్చలకాయలవంటి కాయలును ఉంటాయి. పండ్లు నలుపురంగుగా

వుంటాయి. రామరావణయుద్ధంలో మృతులైన కపీశ్వరులను బ్రతికించుటకై దేవతలు వారి శరీరమున చల్లిన అమృతబిందువులు పడినచోట ఈ తీగ మొలచినవని యందురు. వేపచెట్ల మీదకు ప్రాకుతీగలు మంచివందురు. ఈ తీగనుండి సత్తు తయారు చేస్తారు. తీగరసము వేడిజేస్తుంది. కారముగా, వగరుగా, చేదుగా వుంటుంది. ఈ తీగను పలుపుగాచుట్టి కురమతగిలిన పశువుమెడలో వేసిన రోగము తగ్గుతుంది. ఇంకను వాతరోగములకు ఆకురసము గాయములకు, చర్మవ్యాధులకు, నరములు తెగినప్పుడు వాడిన పని చేస్తుంది.

మోతాదు : తీగరసము సేరువరకు

తవాక్షరి

వెదురుబొంగులను చీల్చినపుడు తెలుపురంగు గల పలుకు కొన్నిటిలో బయలుదేరుతుంది. దీనినే తవాక్షరి అంటారు. వెగటుగా, వగరుగా వుంటుంది. మూత్రరోగములలో దీనిని వాడవచ్చును. విరేచనములను కట్టిస్తుంది. శుక్లనష్టము కలిగినపుడు మంచిగంధముతో దీనిని యిచ్చిన తగ్గుతుంది.

మోతాదు : 4 తులముల వరకు

త్రిఫలములు

కరక్కాయ, తాడికాయ, ఉసిరికాయ అనువాటిని త్రిఫలములంటారు. మూడుపాళ్ళు కరక్కాయలు, ఎనిమిదిపాళ్ళు తాడికాయలు, పన్నెండుపాళ్ళు ఉసిరికాయలు కలిపిన చూర్ణము సమస్త రక్తజీర్ణవాత నేత్రరోగములకు బాగుగా పనిచేస్తాయి. శిరోరోగములు దొమ్మలను రూపుమాపుతుంది.

త్రికటుకములు

శొంఠి పిప్పళ్ళు మిరియాలు అనువాటిని త్రికటుకములందురు. ఇవి శ్వాస, పీనస రోగములకును, రక్తజీర్ణ వాతరోగములకు బాగుగా పని చేస్తుంది. త్రికటుకములను మెత్తగా నూరి వస్త్రఘాళితముబట్టి వెన్నలో గాని, తేనెలో గాని కలిపి నేత్రరోగములకు పెట్టిన బాగుగా పని చేస్తుంది. త్రికటుకములు జీర్ణశక్తిని గలిగించును. వేడిజేస్తుంది.

తేనె

తేనెలో నాలుగు రకములు గలవు. భ్రామరము, పైత్తికము, క్షౌద్రము, మాక్షికము అని నాలుగు విధములు. భ్రామరము తెలుపుగా నెయ్యిరంగు గలదిగా, క్షౌద్రము కపిలరంగుగా, మాక్షికము తైలవర్ణముగా వుంటుంది. భ్రామరము తియ్యగా వుండును. పైత్తికమను తేనె త్రిదోషముల ప్రకోపింపజేస్తుంది. క్షౌద్రమను తేనె గురుత్వము కలదిగా నుండి శ్లేష్మమును పెంచుతుంది. శ్రేష్ఠమైంది. మాక్షికమను తేనె రూక్షగుణము స్వల్పమగు గురుత్వము గలిగి మధురముగా వుంటుంది. వాతమును పెంచుతుంది. వ్రణచికిత్సయందు ఉత్తమముగా ఉంటుంది. క్రొత్త తేనె అల్పగుణములను, బహుదోషములను గలిగియుంటుంది. కాచి

వడియగట్టిన తేనె త్రిదోషహరమగును. పచ్చితేనె పులుపుగా, త్రిదోషకారిగను ఉంటుంది. విషపుష్పముల నుండిగూడ తేనెను తేనెటీగలు చేర్చుతాయి. గాన తేనెను ఉష్ణముగా నుండునపుడు కాని, ఉష్ణముగా నుండు పదార్థములలో కలిపి గాని వాడరాదు. అట్లు చేసినచో విషసమముగా నుండును. గాన లేహ్యములందును, బలవర్ధకౌషధములలోను వాడవలసినపుడు చల్లార్చి వాడాలి.

ధనియాలు

చిల్లులు చిల్లులు గల మృదువైన ఆకులును, గుత్తులు గుత్తులుగా తెలుపుగా, చిన్నవిగానుండు పువ్వులును ఉంటాయి. గింజలు గుండ్రముగా, పరిమళముగా, పచ్చిగానున్నపుడు ఆకుపచ్చరంగు, ఎండినపిదప గోధుమ వర్ణము గలవిగా ఉంటాయి. ధనియపు మొక్కలకు కొత్తిమీర మొక్కలని పేరు. సోంపుగింజవలెనే ఇవియును పని చేస్తుంది. పశువులకు కలుగు అజీర్తి, కడుపునొప్పి మొదలగు జీర్ణరోగములకును, బలవర్ధకౌషధములలో, వాయువును పోగొట్టు ఔషధములలో కలిపి వాడుతారు. ఇవి తీపిగా, వగరుగా ఉంటాయి. ధనియాల రసములో రేవలచిన్నిరసము కలిపి యిచ్చిన నీరు చురుకు తగ్గుతుంది.

మోతాదు : ధనియాలు అర్ధసేరు వరకు

దానిమ్మ

తియ్యదానిమ్మ, పులుపు తీపు కలిసిన దానిమ్మ, పులుపు దానిమ్మ అని మూడు రకములున్నాయి. దీని మ్రానుచక్క, ఆరు మొగ్గపువ్వు లేతచిగుళ్ళు తొక్క వీని రసము వగరుగా వుంటాయి. పారుడు రక్తవిరేచనములలో ఈ చెక్క రసముగాని, లేత ఆకులను గాని పెరుగుతో కలిపి మూడు, నాలుగు పర్యాయములు పశువుకు పెట్టిన తగ్గుతుంది. ఈనిన తరువాత మానమువెంట దుర్వాసన గల మట్టుపడుచుండిన యెడల ఈ చెక్క రసముతో కడిగిన వాసన తగ్గుతుంది. ఇంకను ఈ చెక్కపొడి పుండు గార పట్టుటకు ఉపయోగించవచ్చును.

దిరిసెన

ఇది పెద్ద వృక్షము. దీని కొమ్మలు పెళుసైనవి. ఈ చెట్టు శాఖోపశాఖలుగా పెరుగుటచే పందిరివలె ఛాయాప్రధానముగా కూడ ఉపయోగపడును. కాయలు పలుచగా బద్దలవలె పొడవుగా పూవులు కేసరములవలె వుంటాయి. కాని అంతకంటె కొంచెము పెద్దవి. పూవులకు పరిమళముంటుంది. ఆకు మునగాకు వలె వుంటుంది. కాని అంతకంటె కొంచెము పెద్దది. కాయలు 4 నుంచి 9 అంగుళముల వరకు పొడవుంటాయి. ఒక్కొక్క కాయలో పది గింజలకంటె ఎక్కువయుండవు. దీనిచెక్క ఆకురసము వెగటుగావుండి వేడిజేస్తుంది. దీని వేరులను ఆకుల రసమును వాతరోగములలో ఉపయోగించు మందులలో కలిపి వాడుతారు. దిరిసెనాకు పసరు, నరమూత్రము, పసుపు, నల్లేరు కలిగి గుండెవగర్పు దగ్గులకు పెట్టిన తగ్గుతుంది. తెలియని రోగాలకు ఈ ఆకుపసరు, పసుపు కలిపి పెట్టిన తగ్గుతుంది. ఈ ఆకుపసరు రక్తసంబంధమగు రోగముల కన్నిటికి బాగా పని చేస్తుంది.

మోతాదు : ఆకు చెక్కరసము సేరువరకు

దూసరి

ఇది ప్రాకే తీగ. ఆకులు కొంచెము కోలగా, చిన్నవిగా మిక్కిలి ముదురు ఆకుపచ్చరంగుగా వుంటాయి. దీని కాయ చిన్నది. పచ్చిగా ఉన్నపుడు ఆకుపచ్చరంగుగాను పండిన తర్వాత నలుపురంగుగా వుంటాయి. దీని కాయ, ఆకురసము చలువ చేస్తుంది. విరేచనము కలిగిస్తుంది. మూత్రమును వెడలిస్తుంది. దూసరితీగెను త్రాడుగాచుట్టి పశువులకు కురమరోగము వచ్చినప్పుడు మెడలో వేసిన తగ్గుతుంది. పశువులకు వచ్చు మూత్రరోగములలో ఈ ఆకు బాగా పని చేస్తుంది.

మోతాదు : ఆకురసం సేరువరకు

దుష్టపుచెట్టు

ఇది ప్రాకే తీగ. ఆకుగిల్లిన అమితముగా పాలుగారుతాయి. ఆకులు గుండ్రముగా కొనదేలి యుంటాయి. పూవులు గుత్తులుగా తెలుపుగా, అందముగా వుంటాయి. ఇది మిక్కిలి వేడిజేస్తుంది. విరేచనము గావిస్తుంది. దొమ్మలు కురమ మొదలగు రక్తసంబంధమగు వ్యాధులకు బాగా పని చేస్తుంది. ఈ తీగను పలుపుగా చుట్టి చలికురమ తగిలినదాని మెడలో వేసిన తీగ ఘాటునకు తీవ్ర జ్వరము తగ్గుతుంది.

మోతాదు : పసరు అర్ధసేరు వరకు

దొండ

దొండ తీగగా బ్రాకుతుంది. చేదుదొండ, తీయదొండ యని రెండు విధములు. ఇంకను కాకిదొండ, మురుదొండ, నాగదొండ అను రకములుంటాయి. తియ్యదొండ దొడ్లలోవేసి పెంచబడుతుంది. చేదుదొండ అరణ్యములలో స్వయముగా మొలుస్తుంది. దొండతీగ నరికి పాతిన బ్రతుకుతుంది. దొండకాయలు కొంచెము కోలగా, గుండ్రముగా, సన్నగా వుంటాయి. పచ్చికాయలు ఆకు పచ్చగను, పండినపుడు పగడము వంటి చక్కని ఎరుపు రంగును కలిగియుంటాయి. దొండాకు మూడు అంచులు కలదై మృదువుగా వుంటుంది. తీయదొండ కాయలను కూరవండుకొని తింటారు. ఆకురసము వేడిజేస్తుంది. ఆకుపసరును అర్రువాపులకు వెన్నలో కలిపి రాసిన బాగా పని చేస్తుంది. శిరోవాతములకు ఆకుపసరును చెవులలో పోసిన తగ్గుతుంది. చర్మరోగములకు ఆ పసరుతో ముద్దకర్పూరము కలిపి రాసిన తగ్గుతుంది. తీయదొండాకు రసమును రక్తసంబంధమగు రోగములకు త్రాగించిన పని చేస్తుంది.

మోతాదు : పసరు సేరున్నర వరకు

నల్లేరు

డొంకల మీదను, చెట్లమీదను ప్రాకుతీగ. నాలుగైదు అంగుళముల కొక కణుపును, కణుపు వద్ద ఆకులును ఉండి కాడ పలకలుగా వుంటుంది. ఇందు రెండు మూడు నాలుగు పలకలు గల కాడలుంటాయి.

మూడు పలకల నల్లేరు కొన్ని భస్మములు చేయుటకు వాదవిద్యయందుపయోగించుటకు పనికి వస్తుంది. నల్లేరు కాయలు పచ్చివి ఆకుపచ్చగ, పండినవి నల్లగ గుండ్రముగా, చిన్నవిగా కరివేపాకు పండ్లంత యుంటాయి. కాడలు మాత్రమే ఔషధమునకు వాడుతారు. దీనిరసము శరీరమునకు తగిలిన దురదపుట్టి దద్దురులేస్తుంది.

ఆకులు, కాడలు దురద గలిగియుంటాయి. వేడిచేస్తుంది. పశువులకు కలుగు ఉంగిడి, విషపురుగుల కాట్లు, నల్లతెగులు, ఎడతెగని పారుడు మున్నగు రోగములకు పని చేస్తుంది.

మోతాదు : నల్లేరు రసము అర్ధసేరు వరకు

నల్లజీలకఱ్ఱ

ఈ మొక్కలు విస్తారముగా పంజాబు దేశమునందు పెరుగుతాయి. వీని ఆకులు చీలియుండి పువ్వులు గుత్తులు గుత్తులుగా వుంటాయి. ఇవి నలుపుగా పురమిరలాడుతూ చేతితో నలిపి వాసనజూచిన ఘాటు గల సువాసన వస్తుంది. ఇవి కారముగానుండును. జీర్ణరోగములకు ఇది బాగా పని చేస్తుంది. కడుపుబ్బు అజీర్తి మలబద్ధకములకు దీనిని ఉపయోగించవచ్చును.

మోతాదు : 10 తులముల వరకు

నల్లమందు

ఇది గసగసాల మొక్కల కాయలనుండి తయారు చేయబడుతుంది. నల్లమందులో జారణము, మారణము, ధారణము, సారణము అని నాల్గువిధములు. జారణము తెలుపుగా, మారణము నలుపుగా, ధారణము చప్పగా, సారణము చిత్రవర్ణముగా ఉంటుంది.

నల్లమందు చేదుగానుండి మత్తును కలుగజేస్తుంది. మలమూత్రములను బంధిస్తుంది. రక్తమును విరుస్తుంది. పశువులకు కలుగు అతిసారము, రక్తాతిసారము, కడుపునొప్పి మొదలగు జీర్ణసంబంధమగు రోగములకు పని చేస్తుంది. ఎండువాతము గల పశువులకు అర్ధసేరు ఆవుపాలలో ఒక అర తులముగాని పావుతులము గాని నల్లమందు కలిపి త్రాగించిన తగ్గుతుంది.

మోతాదు : తులము వరకు

నల్లవుప్పి

దీని వేరు ఆకుల రసము చేదుగా నుండును. ఉప్పిచెక్కరసము వాతరోగములకు బాగా పని చేస్తుంది.

నీరుల్లి

ఇదియొక దుంపజాతి, ఎరుపుగ, తెలుపుగ వుంటాయి. ఈ దుంపనుండి సన్నముగా అర్ధగజము నుంచి గజము పొడవు గల ఆకుపచ్చని కాడలు పుట్టుతాయి. కాడల చివర తెలుపురంగు గల పూవులు

పూస్తుంది. ఉల్లిరసము వెగటుగా ఉంటుంది. చలువచేసి ఆర్చుతుంది. రక్తశుద్ధి చేస్తుంది. నరములకు సత్తువనిస్తుంది. వాత, శ్వాస నేత్రరోగముల కన్నింటికి ఇది ఉపయోగకరమైంది.

మోతాదు : నీరుల్లి సవాసేరు వరకు

నేరేడు

నేరేడుచెట్లలో నేరేడు, అల్లనేరేడు, జిన్ని, నేల నేరేడు, కాకి నేరేడు అని అయిదు రకములు గలవు. నేరేడు పెద్దవృక్షము. ఆకులు కోలగా, పెళుసుగా, పచ్చికాయలు ఆకుపచ్చగా, దోరకాయ కొంచెము మెరుపుగా, బాగా పండినది నలుపుగా వుంటుంది. చెక్కరసము వగరుగా వుండి, రక్తమూత్రము, విరేచనముల కట్టిస్తుంది. చెక్కపొడి రసికారుపుండ్లకు పని చేస్తుంది.

మోతాదు : చెక్కరసము అర్ధసేరు వరకు

నేలవేము

మిరప మొక్కలవలె గుబురుగా పెరిగి ప్రతి భాగము చేదుగా వుంటుంది. సమూలము వేడి చేస్తుంది. రక్తజీర్ణవాత విషరోగములన్నిటికి ఈ సమూలమంతయు పని చేస్తుంది. బలవర్ధకౌషధములలో దీనిని కలిపి వాడుతారు.

మోతాదు : పొడి 4 తులముల వరకు

నువ్వులు

నువ్వులు కారముగా, వగరుగా, చేదుగానుండి బలము గలిగించి వేడి చేస్తాయి. నల్లనువ్వులు మంచివి. మావిపడని పశువులకు అర్ధసేరు త్రొక్కి వేడినీటిలో కలిపి త్రాగించిన పనిజేస్తుంది. నువ్వులపిండిని వెన్నలో కలిపి పైత్యపు దద్దురునకు రాసిన పని చేస్తుంది. నువ్వులు కల్లుబెల్లము కలిపి త్రొక్కి దుక్కిటెద్దులకు పెట్టిన బాగా బలుస్తాయి.

పంచలవణములు

సైంధవ లవణము, సౌవర్చ లవణము, బిడా లవణము, కాచ లవణము, సముద్ర లవణము అను అయిదు వస్తువులు కలిపి పంచ లవణములనబడుతాయి. ఇవి ఉప్పగా, రుచిగా నుండును. శరీరమును పోషించుతాయి. రుచిని పుట్టిస్తుంది. మలమును వెడలిస్తుంది. వాతజీర్ణ రోగములకు బాగా పనిచేస్తుంది. ఆకలిని పుట్టిస్తుంది. బలవర్ధకౌషధములలో కలిపి వాడవచ్చును.

పటిక

సౌరాష్ట్రదేశపు గనులలో పుట్టు ఒకవిధమైన మన్ను. గుడ్డలకు రంగు వేయుటకు, లోహములను స్వచ్ఛముగా ద్రవింపజేయుటకు ఉపయోగింతురు. ఇందు పటిక, పుల్లిక అను రెండు రకములు గలవు.

పటిక కొంచెము పచ్చగను, బరువుగను, నునుపుగను వుంటుంది. పటిక తేలికగా, తెలుపుగా, పుల్లగా, నునుపుగా వుంటుంది. ప్రస్తుతము తెలుపుగా రాళ్ళవలె నుండు పటిక మనకు దొరుకుతున్నది.

ఇది వగరు, కారము, పులుపు రసములు కలిగియుండి వేడిజేస్తుంది. రక్తమునాపుతుంది. విరేచనములను కట్టిస్తుంది. నోటిగాళ్ళకు పటికనీటిని అప్పుడప్పుడు కడుగుచుండిన గార పట్టుతుంది. కంటిరోగములకు ఈ పటిక నీటిచుక్కలు వాడిన పని చేస్తుంది. నోరు దుర్వాసనగా నున్నప్పుడు ఈ పొడితో కడిగిన రుచిని పుట్టిస్తుంది. నోరు పొక్కినపుడు పూతకు ఈ నీరు బాగా పని చేస్తుంది.

పసుపు

దుంప ప్రధానముగా గల మొక్క. ఆకులు పొడవుగా, కొనదేలియుంటాయి. ఆకులకు గూడ పసుపు వాసన గలదు. గెలవేసి పూవులు పూస్తుంది. ఇందు అనేకరకములు గలవు. ఇది వెగటుగా, చేదుగా వుంటుంది. ఉద్రేకకారియు, బలకారియునగు వస్తువు. వేడిజేసి ఆర్చుతుంది. జీర్ణశక్తిని గలిగిస్తుంది. బలవర్ధకౌషధములలో కలిపి వాడవచ్చును. చర్మవ్యాధులకు, నేత్రరోగములకు దీనిని వాడవచ్చును.

మోతాదు : 4 తులముల వరకు

పుగాకు

పుగచెట్లను శీతాకాలములో పెంచుతారు. మూడు మాసములకు తయారవుతాయి. ఆకు సన్నముగా, పొడవుగా పొడవైన వెన్ను వేస్తుంది. గింజలు మిక్కిలి సన్నముగా గసగసాలవలె వుంటాయి. ఆకులు మిక్కిలి తీక్షణమైనవి. పొగాకు అనియు దీనిని వాడుతారు. పుగాకు చేదు, కారముగానుండి వేడిని కలుగజేస్తుంది. దీనిలో "నికోటిన్" అను విషపదార్థముంటుంది. పొగాకుతోటలో సామాన్యముగా పాము వెళ్ళదు. ఇది విషపదార్థము. చర్మవ్యాధులకు, నేత్రవ్యాధులకు, గాయములు, వ్రణములు మొదలగువానికి ఆకురసము, ఆకుపొడి పని చేస్తుంది.

పిప్పళ్లు

పిప్పలితీగ మలయాళము మున్నగు చల్లని దేశములందు పుట్టుతుంది. ఆకులు ముదురు తమలపాకు ఆకారముగా వుంటాయి. తీగ ప్రాకుతుంది. పిప్పళ్ళు చమురు గలిగి యుంటాయి. వేడిజేస్తుంది. రక్త, వాత, శ్వాస, నేత్రరోగములకన్నిటికి ఇవి బాగా పని చేస్తాయి.

మోతాదు : 6 తులముల వరకు

పెన్నేరు

ఆకులు గుండ్రముగా, మృదువుగా వుంటాయి. ఇది వేరు ప్రధానముగా గల మూలిక. దీని పండ్లు ఎరుపుగా, గుండ్రముగా, పగడమువలె, పండ్లలోని గింజలు మిక్కిలి సన్నముగా, తెలుపుగా వుంటాయి.

దీని దుంప సువాసనగా ఉండి చలువచేస్తుంది. వాతము హరిస్తుంది. దుంపరసము వెగటుగా నుండి దేహములోని మలమును వెడలిస్తుంది. దగ్గు, వాతము చర్మవ్యాధులకు దూడల అజీర్తికి దుంపరసము బాగా పని చేస్తుంది.

మోతాదు : పొడి 10 తులముల వరకు

ప్రత్తి

పశువులు పారుకొనినపుడు రక్తవిరేచనములకు ఆకుపసరు గాని, ఆకుతొక్కి గాని మజ్జిగలో గాని, పెరుగులో గాని, కలినీరులో గాని కలిపి రెండు మూడు మోతాదులిచ్చిన తగ్గుతుంది. కాయలరసము పాలలో కలిపి దగ్గులకు వాడిన తగ్గిస్తుంది.

మోతాదు : ఆకుపసరు ముప్పాతిక సేరువరకు

బ్రహ్మదండి

దీనినే పిచ్చిసొన చెట్లనియు, నులిపుచ్చ యనియు, బలురక్కిస చెట్టనియు అంటారు. ఇది పసుపుపచ్చని పువ్వులు పూచెడి చెట్టు. ఏటేట మొలుస్తుంది. దీని గింజలనుండి చమురు తీస్తారు. ఈ కొమ్మల నుండి వచ్చు సొన దీర్ఘతలమాదలకు పని చేస్తుంది. ఇంకను బ్రహ్మదండి సమూలమును దంచి రసము తీసి చర్మవ్యాధులకుపయోగించిన బాగా పని చేస్తుంది. ఇంకను ఈ పసరు విషపురుగుల కాట్లకు పని చేస్తుంది. ఆకులు ఉడికించి కట్టిన కాళ్ళవాపులు తగ్గుతాయి. వేళ్ళరసము నెరిడెకు పని చేస్తుంది.

బాడిద

ఇది పెద్ద చెట్టు ప్రూను తెలుపుగా వుంటుంది. తెలుపు, ఎరుపు పూవుల భేదములు గలవు. తెలుపుది మంచిది. చెక్క ఆకురసము వెగటుగా, కారముగా వుంటుంది. వాతరోగములకు, చర్మరోగములకు, కర్ణరోగములకు రసము పని చేస్తుంది.

మిరప

దీని పువ్వులు చిన్నవిగా, తెలుపుగా వుంటాయి. పచ్చిమిరపకాయలు ఆకుపచ్చగా, పండినవి ఎరుపుగా వుంటాయి. ఇందులో పొట్టిమిరప, దేశివాళీ మిరప, సీమమిరప మొదలగు అనేక రకములున్నాయి. ఎండుమిర్చి వేడిజేస్తుంది. సేరునీటిలో మూడు గుప్పెళ్ళ ఎండుమిరపకాయలను వేసి ఉడికించి చేతితో పిసికి వడపోసిన కారపుపాలంటారు. ఈ పాలను రక్తవాత జీర్ణరోగములలో వాడిన బాగా పని చేస్తుంది. కడుపునొప్పి, దొమ్మ, కురమ ఇంక తెలియని రోగములకు ఈ పాలు వాడిన పని చేస్తుంది.

మోతాదు : 15 తులముల వరకు

మెంతులు

ఇదియొక చిన్న మొక్క, ఆకులు చిన్నవిగా, కొంచెము గుండ్రముగా నుండి చేదుగానుంటాయి. మెంతులు వేడిజేసి ఆర్చుతాయి. పశువులకు, దూడలకు అజీర్తి విరేచనములు కడుపుబ్బు మున్నగు వ్యాధులకు పెరుగులో కలిపి పెట్టిన శాంతించుతుంది.

మోతాదు : 10 తులముల వరకు

మిరియాలు

తెల్లమిరియాలు, నల్లమిరియాలు అని రెండు రకములు. మిరియపు తీగలు మలయాళ దేశమునందు తిరువాన్కూరు తోటలయందు వేసి పెంచుతారు. తీగెను ముక్కలుగా నరికి పాతిపెట్టుతారు. ఇవి మూడు సంవత్సరములకు పెద్దవై పంటకు వస్తుంది. మిరియపు తీగెల వెన్నునందు మిరియములేర్పడుతాయి. పండుమిరియములెర్రగానుండి ఎండించిన పిదప నలుపుగా వుంటాయి. మిరియాలను నానబెట్టి పై పొట్టుతీసినవి తెల్లమిరియాలని పొట్టుతీయనివి నల్లమిరియాలని చెప్పుతారు. తెల్లమిరియాలు కనపడవు. మిరియాలు వేడిచేస్తాయి. ఇవి అన్ని రోగములలో అమోఘముగా పని చేస్తాయి. రక్త, శ్వాస, జీర్ణనేత్ర, వాతరోగములలో ఉపయోగించే మందులలో కలిపి వాడుతారు.

మోతాదు : 8 తులముల వరకు

మోదుగ

ఇది పెద్ద వృక్షము. ఆకులు గుండ్రముగా ఒక తొడిమకు మూడు ఆకులు విడివిడిగా వుంటాయి. లేత ఆకులు ఎరుపుగాను, ముదిరిన ఆకులు పచ్చగా, కాయలు పొడవుగా కాయలోని గింజలు బద్దలవలె గుండ్రముగా ఉంటాయి. గింజలపై పొట్టు ఎరుపుగా వుంటుంది. మోదుగపువ్వు పసుపు పచ్చగా వుంటుంది. తెలుపు, పసుపు, ఎరుపు, నలుపు రకముల పూలరకములున్నాయి.

మోదుగపువ్వు వెగటుగా, కారముగానుండి చలువ చేస్తుంది. రక్త, జీర్ణ, వాతములకు ఈ పువ్వును జొన్నకలితో గాని, బియ్యపు కలితో గాని కలిపిపెట్టిన తగ్గుతుంది.

మోతాదు : పువ్వు 10 తులముల వరకు

ముషిణి

దీనినే విషముష్టి, రణముష్టి అంటారు. ఆకులు గుండ్రముగా, కాయలు నిమ్మకాయంత పరిమాణము గలిగి వుంటాయి. పండినపుడు దీని పండ్లు ఎరుపుగా, అందముగా నుండి దీనిలోని గింజలు గుండ్రముగా బద్దలవలె వుంటాయి. ముషిణిగింజలు మహాచేదుగా నుంటాయి. ఈ గింజల నుండి చమురు తీస్తారు. ఈ గింజల పొడి విరేచనముల గావిస్తుంది. బలవర్ధకౌషధములలో ఈ గింజల పొడి కలిపి వాడుతారు.

రక్తమూత్రము, మలబద్ధకము, పక్షవాతము మున్నగు రోగములకు ఈ గింజల పొడిని తదితర మందులలో కలిపి వాడిన బాగా పని చేస్తుంది.

మోతాదు : పొడి 4 తులముల వరకు

మునగ

ఇది సాధారణమైన వృక్షము. ఎరుపు, తెలుపు పూవులు పూస్తాయి. ఇదిగాక నల్లపువ్వుల మునగ కూడా గలదు. ఇది అరుదుగా దొరుకుతుంది. ఈ గింజల నుండి పరిశుభ్రమైన నూనె తీస్తారు. దీని చెక్కరసము వేడిజేస్తుంది. దొమ్మ, నాలిదొమ్మ, గురక మున్నగు వ్యాధులకు బాగా పని చేస్తుంది. ఆకును ఆముదముతో ఉడికించి బొడ్డువాపులకు, బెణుకులకు కట్టిన తగ్గును. పువ్వులరసము తేనెతో కలిపి కంటిపువ్వులకు, రేజీకటికి పెట్టిన తగ్గతుంది.

మూర్కొండ

ఆకుయొక్క గుండ్రతనము, కోలదనము భేదముచేత రెండు విధములు. గుండ్ర ఆకులది మూర్కొండ అనియు, కోల ఆకులది కుప్పింట అనియు వాడుతారు. ఆకురసము వేడిజేస్తుంది. పురుగులు పడిన పుండ్లకు ఈ ఆకును వాడిన పురుగులు చస్తాయి. పీనస మొగబంతి మున్నగువాటికి ఈ పసరును 10 చుక్కలు పోసిన వెంటనే తుమ్ముతాయి.

మోతాదు : పసరు 4 తులముల వరకు

రావి

ఇది పెద్ద వృక్షము. మిగుల ప్రసిద్ధమైనది. చెక్కరసము వగరుగా నుండి చలువ చేస్తుంది. చెక్కపొడి పుండ్లకు పని చేస్తుంది. మసిబొగ్గులో చెక్కపొడి కలిపి రసికారు పుండ్లకు పట్టించిన మానుతుంది. చెక్కను నీటిలో నానవేసి గాని, కాచిగాని నోటిపూతలకు పుక్కిలింపు చేయించవచ్చును. రోగపశువులకు కాచి చల్లార్చి ఈ వగరునీటిని పథ్యముగా పెట్టవచ్చును. పక్షవాతము గల పశువునకును, నోటినుండి వదరు కక్కులకును చెక్కరసముతో ఆవుపాలు కలిపి పెట్టిన తగ్గుతుంది.

మోతాదు : చెక్కపొడి 10 తులముల వరకు

రేవల్చిన్ని

ఈ మొక్కలు హిమాలయ ప్రాంతములందు ఎక్కువగా పెరుగుతున్నవి. ఈ మొక్క వేరును కోసి పై చర్మమును వలచి ఎండబెట్టుతారు. ఇది పసుపుపచ్చగా వుంటుంది. రసము చలువజేస్తుంది. వంటినీరు దీస్తుంది. విరేచనము గావిస్తుంది. మలబద్ధకమును పోగొట్టుతుంది. మజ్జిగలో రేవల్చిన్ని కలిపి వాడిన మూత్రరోగములు పోతాయి.

మోతాదు : రసము సేరు వరకు

వస

ఈ మొక్కల ఆకుల నుండి తైలమును తీస్తారు. దుంప మదపు వాసన గలిగియుంటుంది. శొంఠివంటిది. వేడిజేస్తుంది. శిరోవాతములకు ఆవుపాలలో వస కలిపి త్రాగించిన పని చేస్తుంది. వసపొడి పురుగులను చంపుతుంది. ఘాటయిన వాసన కొట్టుతుంది. ఆకలిని పుట్టిస్తుంది.

మోతాదు : వసపొడి 4 తులముల వరకు

వాము

వాముచెట్టు చౌడుగల పొలములలో నేలమీద ప్రాకెడు చిన్న చెట్లు, కొన్నిచోట్ల జానెడుత్తు వరకు పెరుగుతాయి. దీనిశిఖరములందు గుత్తులుగుత్తులుగా పూవులు పూచి క్రమముగా పూవులలో గింజలేర్పడతాయి. వాము జీర్ణకారియగు వస్తువు. జీర్ణరోగముల కన్నిటికి బాగా పని చేస్తుంది. బలవర్ధకౌషధములలో కలిపి దీనిని వాడతారు.

మోతాదు : వాము 15 తులముల వరకు

వాయింట

ఇది చిన్న మొక్క, గజము ఎత్తులోపు పెరుగుతుంది. చెట్టునకంతకు ఒకవిధమగు వెగటువాసన, తెల్లని పూవులు, సన్నగా పొడవుగా నుండు కాయలును, కాయలలో నల్లని చిన్న గింజలు ఉంటాయి. ఇందు వాయింట, కుక్కవాయింట యని రెండుజాతులుంటాయి. ఆకులు గుండ్రముగా చిన్నవిగా వుంటాయి. ఆకుపసరు వేడిజేస్తుంది. చర్మరోగములకు, కర్ణరోగములకు బాగా పని చేస్తుంది.

వావిలి

ఇది పెద్దవృక్షము. మారేడాకులవలె దీనియాకులు మూడు చిల్లలుగా వుంటాయి. తెల్లవావిలి ఊదారంగుగా వుంటుంది. ఈ చెట్టుక్రింద నుండు మట్టికూడ నలుపుగా వుంటుంది. దీనికర్రతో అన్నము వండునపుడు, కలియబెట్టిన అన్నమంతయు నలుపుగా వుంటుంది. దీనిపూవులు గుత్తులు కోలగా వుంటాయి. ఆకుపసరు వేడిజేస్తుంది. వాతరోగములలో అమోఘముగా పని చేస్తుంది. పశువునకు వెన్నెముకకు వెనుక మొత్తలకు దెబ్బలు తగిలినపుడు, పుట్టమన్నుతో వావిలాకు ఉడికించి గోరువెచ్చనిది రెండు, మూడు పర్యాయములు కట్టిన తగ్గుతుంది.

మోతాదు : పసరు అర్ధసేరు వరకు

వేప

ఇదియును పెద్దదియగు ప్రసిద్ధమైన వృక్షము. ఆకు, చెక్క, కాయ, పువ్వు మున్నగునవి వైద్యమునకు ఉపయోగపడుతాయి. దీని మూలమందలి ఏ భాగము చూచినను మిక్కిలి చేదుగా వుంటుంది. ఈ చెట్టునందు గాలిని శుభ్రము చేయు మంచిగుణము కలదు. చెక్కపొడి పుండ్లకు పని చేస్తుంది. వేపఆకు పసరులో

తగినంత మంచినూనె కలిపి గోమారులున్న పశువుల శరీరమునకు రాసి ఒక అరగంట ఎండలో కట్టిన అన్నియు రాలిపోతాయి. చర్మవ్యాధులకు, గాయములకు చెక్కరసము బాగా పని చేస్తుంది. పాముకాటునకు వేపచిగుళ్ళ రసము పశువు ముక్కురంధ్రములలో పిండిన తుమ్ములు వస్తాయి.

మోతాదు : చెక్కపొడి 3 తులముల వరకు

వెల్లుల్లి

వెల్లుల్లి ఘాటువాసనగా వుంటుంది. ఆకులు సన్నముగా, పొడవుగా వుంటాయి. పులుపు అను రసము ఒకటితప్ప తక్కిన రసములన్నియు కలవు. గనుక దీనికి రసోనయని పేరు. తెలుపుగా నుండును గనుక వెల్లుల్లి అంటారు. వెల్లుల్లి దుంపయందు కారము, ఆకులయందు చేదు, కాడయందు వగరు, కాడచివర ఉప్పు, బీజములందు తీపి రుచులుంటాయి. వెల్లుల్లి నీరుల్లివలెనే యుండి వేడిజేస్తుంది. వెల్లుల్లిరసము ప్రేగులోని క్రిములను చంపుతుంది. దీనియందు క్రుళ్ళజేయుగుణము కలదు. వాత, రక్త, జీర్ణ, చర్మ, నేత్రరోగముల కన్నిటికి బాగా పని చేస్తుంది.

మోతాదు : 10 తులముల వరకు

వెదురు

ఆకులు సన్నముగా, పొడవుగా వుండి పూవులు తెల్లగా వుంటాయి. వెదుళ్ళ మధ్యనుండి బియ్యము వంటి ఒక పదార్థము ఒక్కొక్కప్పుడు వస్తుంది. వెదురు చేదుగా, పులుపుగా, వగరుగా వుంటుంది. ఆకులో కోతకోయు స్వభావము గలదు. ఆకురసము కారముగా, చేదుగా వుంటుంది. కసిమిరి, మొగబంతి, తెలియని రోగములు, నల్లకప్పు మున్నగు వ్యాధులకు బాగా పని చేస్తుంది. లేతయాకులలో కొద్దిగా మిరియాలు, ఉప్పు చేర్చి తినిపించిన పశువులకు కలుగు విరేచనముల కట్టిస్తుంది.

మోతాదు : ఆకులు 3 తులముల వరకు

వెట్టిపుచ్చ

ఇది పుచ్చతీగవలె వుంటుంది. దీనికాయలు దబ్బకాయలంత యుంటాయి. తీగంతయు అమితమైన చేదుండును. కాయలు గుండ్రముగా ఆకులపై తెలుపు జీరలు ఉండి చేదుగా వుంటాయి. చర్మరోగములు నసింపజేస్తుంది. కాయలను వాతరోగములకు వాడుతారు.

వాకుడు

దీనినే చిన్న ములకయందురు. నేలమీద ప్రాకును. ముండ్లుంటాయి. ముండ్లు పసుపుపచ్చ వన్నె కలిగి తెలుపుగా వుంటాయి. నేలములక కాయలవలెనె కాయలు కాస్తాయి. ఊదా తెలుపురంగుల పూవులు పూస్తుంది. తెలుపు పూవులది మంచిది. దీని ఆకులు వంగ ఆకులవలె వుంటాయి. కాని వాటికన్న చిన్నవి.

కాయలు చిన్నవిగా, గుండ్రముగా పండినపుడు పసుపుపచ్చగా వుంటాయి. ఆకుపసరు వెగటుగా కారముగా నుండి కాకజేస్తుంది. కొమ్ము డొల్లలకు నాసికా రోగములకు శిరోరోగములకు పని చేస్తుంది. కొందరు వైద్యులు పశువునకు కలుగు పుండులో పురుగులు పడినయెడల ఈ చెట్లలో ఒకదానిని తీసి వేస్తారు.

సీతాఫలము

ఇది సాధారణమైన చెట్టు. దీని ఆకులు కోలగా, బలమైన పసుపువన్నె గలిగి మృదువుగా వుంటాయి. దీనిలోని గింజలు నలుపురంగుగా పండ్ల పైభాగమున బుడుపులు కలిగియుంటుంది. గుజ్జు తెలుపుగా మధురముగా వుంటుంది. ఆకును తేళ్ళుగల రంధ్రములో పెట్టిన తేళ్ళు బైటికివస్తాయి. ఆకురసము పురుగులు పడిన పుండ్లలో వేసిన పురుగులు చస్తాయి.

శొంఠి

అల్లమును సున్నపునీళ్ళతో ఉడకబెట్టి ఎండించిన శొంఠియగుతుంది. అన్ని మందులకన్న యోగ్యమైనది గాన మహౌషధమనియు విశ్వభేషజమనియు నందురు. కారము గలది కనుక కట్రుగంధియనియు, కఫమును హరించునదిగాన కఫాదిక యనియు, శరీరము నార్చునదిగాన శోషణమనయు, దీనికి పేర్లు గలిగెను. శొంఠి వేడిజేస్తుంది. కారముగా వుంటుంది. వాతజీర్ణ రోగములకు అమోఘముగా పనిజేస్తుంది.

మోతాదు : 10 తులముల వరకు

సోంపు

జీలకర్రవలె నుండును గాని అంతకన్న పెద్దవి. వడ్లగింజలో నాల్గవవంతు యుండి సువాసనగా వుంటుంది. నమిలిన తీపిగానుండును. జీర్ణశక్తిని కలుగజేస్తుంది. రక్తవాత జీర్ణరోగముల కన్నిటికి యిది బాగా పని చేస్తుంది.

మోతాదు : 10 తులముల వరకు

హంసపాది

పొలములో భూమినంటుకొని ప్రాకు ఒక జాతిమొక్క. ఆకులు పక్షియొక్క అడుగువలె గొగ్గులు గలిగి చిన్నదిగా యుండుటచే దీనికి హంసపాది యని పేరువచ్చినది. నూతులు, చెరువులు మొదలగు ప్రాంతము లందు ఎక్కువగా మొలుస్తాయి. ఆకుపసరు చేదుగా, స్వాదుగా వుంటుంది. చర్మవ్యాధులకు పని చేస్తుంది. సాలెపురుగుల విషములకు కూడ పసరును వాడవచ్చును.

* * *

ఎనిమిదవ భాగము


ఆంగ్లేయ పశువైద్య వస్తుగుణ దీపిక

ప్రతి రైతు ఇంగ్లీషు మందులను గూర్చి తెలిసికొనుటకు ఆసక్తితోనున్నాడు. పశువులకు కూడ ఇంగ్లీషు మందులున్నవాయని ఆశ్చర్యపడే వారున్నారు. అందుచేత రైతులు, గ్రామములలో పశువైద్యము చేయు నాటువైద్యులు కూడ తప్పక ఈ వస్తుగుణ దీపికలోని సారాంశములను గ్రహించుదురు గాక. మీకు తెలిసినంతవరకే ఇంగ్లీషు మందులు వాడాలి గాని తెలియకపోయినచో వాడుట మహాదోషము. మీరంతా ఇంగ్లీషు మందులను పశువులకు వాడమని నా ఉద్దేశ్యము కాదు. ఆయుర్వేద పశువైద్య మూలికలకు ఇంగ్లీషువైద్య మందులకు వ్యత్యాస మెంతయున్నదో గ్రహించగలందులకు ఈ గ్రంథములో తెలుపవలసి వచ్చినది. ఇంగ్లీషు వెటరినరీవారు చేసే వైద్యము, వారి బెట్టుగుట్టులు కూడ గ్రహించుట మంచిదని నా అభిప్రాయము. ప్రతి రైతుకూడ ఈ రెండు వైద్యముల గుట్టుగ్రహించి ఏది చవుకగా నుండిన దానినే ఆచరణలో పెట్టుదురు గాక.

అమ్మోనియం క్లోరీడ్

ఇది తెలుపురంగు నుండి వెగటుగా వుంటుంది. సారాయిలోను వేడినీటిలోను కరుగుతుంది. ఇది కాలేయ సంబంధమగు రోగములకు, రొంప, అజీర్తి, కామెర్లు, లివర్, రాట్, మున్నగు రోగములలో వాడుతారు. సాధారణముగా దీనిని నేలవేముతోను, నూరేకారముతోను, కలిపి వాడుతారు. పైకి చల్లగా నుండు లోషనుగా పొటాష్ నైట్రేట్‌తో గాని, సోడియం క్లోరైడ్‌తో గాని కలిపి వాడుతారు.

మోతాదు : పశువులకు ½ ఔన్సు నుండి 1 ఔన్సు వరకు మాత్రమే



అమ్మోనియం కార్బనేట్

అమ్మోనియం కార్బనేట్

ఇది ముక్కలుగా నుండి ఘాటుగా, తెలుపురంగుగా వుంటుంది. విరేచనము గావించును. పొట్టలోని గాలిని తీసివేయును. ఇంకను విషజ్వరములకు, కీటకముల కాట్లకు, దగ్గునకు, రొంపకు, కడుపునొప్పికి, నెమరుపొట్ట ఆజీర్ణ ఆహారముతో దట్టమైయున్నపుడు పెద్దప్రేగులో మలము చిక్కుకొనిపోయినపుడు దీనిని వాడవచ్చును.

మోతాదు : ½ ఔన్సు నుంచి 1 ఔన్సు వరకు

అయోడిన్

ఇది నలుపురంగుగా తళతళ మెరుయుచు పొరలుపొరలుగా వుంటుంది. ఇది విషపదార్థము. క్రుళ్ళకుండ జేయును. తత్వమును బాగుచేయును. దీర్ఘవాతములకు, అతిమూత్రమునకు, వాపులకు, బెణుకులకు, చర్మవ్యాధులకు పని చేస్తుంది. లోనికి ఈయవలసి వచ్చినపుడు జాగ్రత్తగా తదితర మందులతో కలిపి ఈయాలి. వ్యాసులైన్‌తో గాని, క్రొవ్వుతో గాని దీనిని కలిపి వాపులకు బెణుకులకు వాడవచ్చును.

మోతాదు : 10 నుంచి 20 గ్రెయినుల వరకు

అయిడోఫారం

ఇది పసుపుపచ్చగా స్ఫటికవలె మెరుస్తుంది. దీనిలో బలమగు క్రిమిసంహారక శక్తిగలదు. గాయములకు, చీముపట్టిన పుండ్లకు, కాలిన బొబ్బలకు, చర్మవ్యాదులకు బాగా పని చేస్తుంది. ఆరుభాగముల బోరిక్ ఆసిడ్‌తో ఒక భాగము అయిడోఫారం కలిపి వాడిన పుండ్లకు, గాయములకు బాగా పని చేస్తుంది. వ్యాసులైన్‌లో ఈ పొడిని కలిపి క్రుళ్ళకుండాజేయుటకు మురికి గాయములకు పట్టించవచ్చును.

మోతాదు : 1 నుంచి పది గ్రెయినుల వరకు

ఆర్సెనియస్ ఆసిడ్

దీనినే ఉల్లిపాషాణమందురు. ఇది మిగుల విషవస్తువు. తత్వమును బాగు చేయుటకు బలవర్ధ కౌషధములలో కలిపి వాడుటకు ఉపయోగపడుతుంది. చర్ముపైన రాసిన పొక్కుతుంది. చర్మరోగములకు కూడ వాడవచ్చును. కాని జాగ్రత్తగా వాడాలి.

మోతాదు : 2 నుంచి 8 గ్రెయినుల వరకు

ఆసిడ్ బోరిక్

దీనినే బోరిక్యామ్లమందురు. దీనిలో వెలిగారము గలుస్తుంది. స్వచ్ఛమగు తెలుపురంగుగా వుంటుంది. మంటలేనిమందు. ప్రతి డాక్టరు దీనినెక్కువగా వాడును. ఈ పొడి సూక్ష్మజీవులను వెంటనే చంపలేదు గాని వాటి వృద్ధిని మాత్రము ఆపుతుంది. దీనిని లోపలికిచ్చిన మూత్రవ్యాధులు తగ్గుతాయి. ఇంకను చర్మవ్యాధులకు, నోటిపుండ్లకు బాగా పని చేస్తుంది. తగినంత వ్యాసులైనులో గాని, క్రొవ్వులో గాని,

వెన్నలో గాని మైలతుత్తము 1/8 భాగము గంధకము, అరభాగము బోరిక్ ఆసిడ్ రెండు భాగములు కలిపి అర్రువాపులకు, బెణుకులకు తదితర వాపులకు అప్పుడప్పుడు రాసి మర్దన చేసిన తగ్గును. ఈ పొడిలో చీముపట్టకుండనుండు గుణము కలదు. ఒక ఔన్సు డిస్టిల్డువాటరులో 30 గ్రెయినులు బోరిక్ ఆసిడ్‌ను కలిపి కంటి ఎరుపులకు, కండ్ల పుసులకు వాడవచ్చును. గొంతులో పుండు ఏర్పడినపుడు గ్లిజరిన్‌లో ఈ పొడిని కలిపి రాయవచ్చును. ఈ ఆసిడ్‌ను లోపలికిచ్చిన 12 గంటల లోపలనే అందు సగభాగము మూత్రము ద్వారా పడిపోతుంది.

కాల్షియం క్లోరైడ్

ఇది సున్నము నుంచి తయారగుతుంది. గాలి తగిలిన ద్రవరూపముగా అవుతుంది. తెలుపురంగు గల గడ్డలుగా నుంటుంది. దీనిని చర్మవ్యాధులకు, రసిగారు పుండ్లకు వాడుతారు. మావిని త్రోసివేసి వెటరినరీ డాక్టర్లు ఈ మందును తదితర మందులతో కలిపి ఇంజక్షను యిస్తారు. ఇంకను గాలి కుంటుమీద వచ్చు కసిమిరికి కూడ పని చేస్తుంది.

మోతాదు : 1 నుంచి 2½ డ్రాములు

క్రిసాల్

ఇది కొంచెము నలుపురంగుగా, వాసనగా వుంటుంది. పశువు మందమతిగా ఉన్నపుడు, పారుడెక్కువగా ఉన్నపుడు గంజితోకలిపి పెట్టిన తగ్గుతుంది. శస్త్రసంబంధమగు లోషనుగా వాడవచ్చును.

మోతాదు : ½ నుంచి 2 డ్రాములు

జెంటెయిన్

ఇది ఒక చెట్టు వేళ్ళతో తయారగు పొడి. చేదు రుచి గలిగి బలవర్ధకౌషధముగా పని చేయును. ఇంగ్లీషు వైద్యములో ఈ పొడిని ఎక్కువగా వాడుతారు. కార్జముపై చురుకుదనము పుట్టిస్తుంది.

మోతాదు : 2 నుంచి 6 డ్రాములు

జింకు క్లోరైడ్

ఈ లవణము తెలుపుగా వుంటుంది. రక్తనాళములను ముడుచుకొనునట్లు చేయును. దుర్గంధ గాయములను, కన్ను శస్త్రము చేసిన తరువాతను, మాదలకు, డెక్క గాయములకు లోషనుగా చేసి వాడిన బాగా పని చేయును.

మోతాదు : 1 నుంచి 3 గ్రెయినుల వరకు

జింకు సల్ఫస్

దీనినికూడ బలవర్ధకౌషధములలోను, అతిసారమునకు, కంటివాపులకు, ఆవిరికి, దుర్గంధపుండ్లకు వాడవచ్చును.

మోతాదు : 2 నుంచి 6 డ్రాములు

టర్పెంటైన్

దీనిని కర్పూరము నుండి తయారు చేస్తారు. ఇది స్వచ్ఛముగా, నిర్మలముగా నుండి చురుకుదనము కలిగించును. నొప్పిని, వాయువును పోగొట్టుతుంది. క్రుళ్ళకుండజేయును. పై భాగమందు వాడిన మంటగా వుంటుంది. న్యూమోనియా కసిమిరి, మొగబంతి, పీనస మున్నగు రోగములలో దీనిని ఆవిరి రూపముగా చేసి వాడిన తగ్గుతుంది. చర్మముపై నుండు పురుగులను లోపలనుండు ఎలికపాములను చంపుతుంది. అన్నిరకముల బెణుకులకు, నొప్పులకు పని చేయును.

మోతాదు : 1 నుంచి 1 1/2 ఔన్సుల వరకు

టానికు ఆసిడ్

ఈ చూర్ణము కొంచెము బూడిదరంగుగా వుంటుంది. మాచికాయ నుంచి తయారగుతుంది. ఒగరు గల వాసనగా వుంటుంది. గాలిక్ ఆసిడ్, టానిక్ ఆసిడ్ ఒకే పదార్థం నుండి తయారు చేయబడును గాని గాలిక్ ఆసిడ్‌ను లోపలికి ఇస్తారు. టానిక్ ఆసిడ్‌ను వాపుదలనొందిన భాగములకు ఉపయోగించుతారు. గొంతులోను, పంటిచిగుళ్ళ యందును వాపుదలనొందిన భాగములకు గ్లిసరినులో తగినంత కలిపి రాసిన తగ్గుతుంది.

మోతాదు : 20 నుంచి 60 గ్రైనులు

అంటిమోనియం టార్టారం

ఈ పొడి తెలుపుగా నుండును. దీనిని పెద్ద పెద్ద మోతాదులిచ్చిన విషముగా వర్తించును. ముక్కు పీనసకు ఈ మందు రక్తములోనికి మూడు నాలుగు ఇంజెక్షన్లు యిచ్చిన తగ్గుతుంది. కాని జాగ్రత్తగా అనుభవము గల వైద్యునిచే యిప్పించాలి. ఇంకను జ్వరములకు, జలుబులకు, వాపులకు, చర్మముపైన కలుగు మంటలకు పని చేస్తుంది.

మోతాదు : 1 నుంచి 6 గ్రైనులు

ఎక్ట్రాక్టమ్ బెల్డోనా

ఒక చెట్టుయొక్క లేత ఆకుల నుండి లేత కొమ్మలనుండి వచ్చు రసముతో తయారగుతుంది. నలుపురంగుగా, మెత్తగా, వెగటు వాసనగా వుంటుంది. విషజ్వరము, గురక, కుత్తుకవాపు, జలుబు, నరముల సంబంధమగు రోగములకు యిచ్చిన బాధను తగ్గిస్తుంది.

మోతాదు : 1 నుంచి 2 డ్రాములు

ఎక్ట్రాక్టమ్ కెన్నబిస్ ఇండికా

గంజాయిపొడితో తయారగుతుంది. చురుకుదనము కలిగిస్తుంది. నొప్పిని తగ్గించి మత్తును కలుగజేస్తుంది. ధనుర్వాతము, నరముల బలహీనత, వాతము, కడుపునొప్పి మున్నగు వాటికి పని చేస్తుంది.

మోతాదు : 2 నుంచి 4 డ్రాములు

క్లోరల్ హైడ్రెస్

ఇది నిర్వర్ణముగా స్ఫటికముగా వుంటుంది. దీనిలో కూడా మత్తును కలుగజేయు గుణము కలదు. నల్లమందువలెనే పని చేస్తుంది. నీటిలో గాని, జావలో గాని కలుస్తుంది. కడుపుబ్బునకు, కడుపునొప్పికి, పశువు లోపల పిండము చెడినపుడు తీసి వేసిన తరువాత దీనిని గంజితో కలిపి ఈయవచ్చును. ఇంకను వాతలు వేయునపుడు శస్త్రము చేయుటకు ముందు మత్తుమందుగా వాడవచ్చును.

మోతాదు : ½ నుంచి 1½ ఔన్సుల వరకు

క్రియోసోట్

ఇది కొంచెము బూడిదరంగుగా నుండి ఒకవిధమగు వాసన కలిగియుంటుంది. పైన రాసిన పొక్కు గుణము కలదు. దుర్వాసనను పోగొట్టుతుంది. క్రుళ్ళకుండాజేస్తుంది. చీడపారు తగిలినపుడు వెటరినరీ డాక్టర్లు దీనిని జావలో కలిపి యిప్పిస్తారు. వ్యాసులైనులో కలిపి చర్మరోగములకు వాడిన పని చేస్తుంది.

మోతాదు : 1 నుంచి 1½ డ్రాము

కార్బాలిక్ ఆసిడ్

ఇది స్వచ్ఛముగా, గడ్డలుగా నుండి కరిగిన తరువాత బూడిదరంగుగా వుంటుంది. ఇది విషవస్తువు. వగరుగా సోకుడు పరిహారముగా వుంటుంది. దీనిలో క్రుళ్ళకుండనుండు శక్తిగలదు. చర్మమునకు తగిలిన పొక్కును బండబారుతుంది. చర్మరోగములకు, గాయములకు ఒకపాలు కార్బాలిక్ ఆసిడ్, నూనె 15 భాగములు కలిపి వాడిన పని చేస్తుంది. ఇంతియేగాక దొమ్మ, గురక, జెబ్బవాపులకు ఒక డ్రాము తీసికొని సేరుగంజిలో గాని, జావలో గాని ఆరంభములో ఇచ్చిన తగ్గుతుంది. తగినంత వ్యాసులైనులో ఈ మందును కలిపి చర్మరోగములకు వాడిన పని చేస్తుంది.

మోతాదు : ½ నుంచి 1 డ్రాము వరకు


లెడ్ అసిటేట్

ఇది తెలుపుగా నుండి రక్తస్రావమును అణస్తుంది. దీనిని లోషనుగా చేసి గారపట్టుటకు, చల్లదనమునకు, నలుగుడు గాయములకు, వాపులకు, బెణుకులకు, కొమ్ములు విరిగినపుడు మంటను తగ్గించుటకు వాడవచ్చును. ఈ లోషనునే వైట్‌లోషన్ అందురు. దీనిలో 3/4వ వంతు జింకు సల్ఫేటు ఒక భాగము లెడ్ అసిటేట్‌ను కలిపిన తయారగును.

మోతాదు : ½ నుంచి 2 డ్రాముల వరకు

లిక్కర్ అమ్మోనియా ఫార్టస్

ఇది స్వచ్ఛంగా, ద్రవరూపంగా ఉంటుంది. వాసన చూచిన ప్రమాదము కలుగుతుంది. కర్పూర తైలములో దీనిని కొద్దిగా కలిపి బెణుకులకు, వాపులకు వాడిన పని చేస్తుంది. దీర్ఘ కడుపుబ్బులకు తదితర మందులతో కలిపి యిచ్చిన తగ్గుతుంది.



లిక్కర్ ఆర్సెనికాలెస్

మోతాదు : 1 నుంచి 3 డ్రాములు

లిక్కర్ ఆర్సెనికాలెస్

ఈ అరఖును కసిమిరి, వగర్పు మున్నగు శ్వాసరోగములకు వాడవచ్చును.

మోతాదు : ½ నుంచి 1 ఔన్సు వరకు

సోడా బైకార్బనేట్

దీనినే సోడా ఉప్పు అందురు. తెలుపుగా చిరుచేదుగా వుంటుంది. కడుపునొప్పి కడుపుబ్బు శూలలు మున్నగు జీర్ణవాతరోగములలో బాగా పని చేస్తుంది. బలవర్ధకౌషధములలో కలుపవచ్చును. కాలినస్థలము లందు ఈ పొడిని అద్దిన బాగా పని చేస్తుంది. విషపురుగుల కాట్లకు ఈ పొడిని పట్టించిన పని చేస్తుంది.

మోతాదు : 1 నుంచి 3 ఔన్సుల వరకు

సోడా సాలిసైలసు

పొడి తెలుపుగా, మెత్తగా ఉంటుంది. ఇది వాతరోగములకు, కీళ్ళనొప్పులకు, జ్వరములకు పని చేస్తుంది. వెటర్నరీవారు ఈ మందునే వాతనొప్పులకు చర్మము క్రిందకు ఇంజక్షన్‌కు వాడతారు.

మోతాదు : ½ నుంచి 1 ఔన్సు వరకు

సోడా సల్ఫేసు

ఇది తెలుపుగా మెరయును. పేగులయందలి గ్రంధులకు చురుకుదనము పుట్టించి విరేచనము గావించును. విరేచనమగుటకు, తత్వమును బాగుపరచుటకు వాడవచ్చును.

మోతాదు : ½ నుంచి 1 ఔన్సు వరకు

స్పిరిట్ ఈథర్ నైట్రసు

ఇది ఘాటుగావుండి పొక్కుతుంది. ఇది జ్వరములకు, క్రుళ్ళకుండా చేయుటకు, మూత్రము జారీయగుటకు, వాయువును హరింపజేయుటకు, చురుకుదనము కలిగించుటకు శిలామేహ వాతమునకు ఈ మందును నీటిలో కలిపి వాడాలి.

మోతాదు : ½ నుంచి 1 ఔన్సు వరకు

స్పిరిట్స్ అమ్మోనియా ఆరోమాటికను

ఇది శరీరములోని పులుపును తగ్గించి జీర్ణశక్తి కలుగజేస్తుంది. ఆకలిని పుట్టిస్తుంది. కడుపునొప్పి, కడుపుబ్బరము మున్నగువాటికి బాగా పని చేస్తుంది.

మోతాదు : 1 నుంచి 2 ఔన్సుల వరకు

సిల్వర్ నైట్రేట్

ఇది తెలుపుగా, గడ్డలుగా వుంటాయి. దీనిని లోషనుగాజేసి వ్రణములకు, కంటి తెలుపులకు, కంటి పొరలకు వాడవచ్చును. కొయ్యగండలు పెరిగినపుడు ఈ మందును రుద్దిన తగ్గుతుంది.

మోతాదు : 1 నుంచి 3 గ్రెయినుల వరకు

సల్ఫర్ సబ్లిమటం

దీనినే గంధకమంటారు. ఇది తత్వమును చక్కబరచి విరేచనము గావిస్తుంది. క్రిమిని హరిస్తుంది. చర్మరోగములలో పైకి, లోపలికి వాడవచ్చును.

మోతాదు : 1 నుంచి 2 ఔన్సులు

హైడ్రాజరీ అయోడైడుర బ్రం

ఈ పొడి ఎరుపుగా వుంటుంది. ప్రతి డాక్టరు వాడును. 4 భాగముల వ్యాసులైనులో 1 భాగము మందును కలిపి గూటిగడ్డలకు, పంపరకు, అర్రువాపులకు, గట్టికంతులకు వాడిన పొక్కి పని చేయును. ఒకే పర్యాయము రాసి వరుసగా నాలుగైదురోజులు వెన్నపైన రాయాలి.

మోతాదు : 1 నుంచి 6 గ్రైనులు

ఫినైయిల్

నలుపుగా చేదువాసనగా వుంటుంది. పురుగులు పడిన పుండ్లకు దీనిని దూదితో ముంచి పెట్టిన పురుగులు చస్తాయి. పుండ్లకు పట్టించిన పుండు పెద్దదగుతుంది. దుర్వాసనగా వుండునపుడు దీనిని లోషనుగా చేసి వాడవచ్చును.

టింక్చరు అయోడిన్

ఇది తేలిక ఎరుపురంగుగా ఉంటుంది. దీనిలో మిక్కిలి తీవ్రమగు శక్తిగలదు. నిముషములో సూక్ష్మజీవులను చంపుతుంది. ఇది పుండునకు తగిలిన మంటగలుగుతుంది. గాయములు తగిలిన వెంటనే వాడరాదు. అట్లువాడిన చాలా మంటగా వుంటుంది. మందగుదికి దీనినే నరమునకు యింజెక్షను యిస్తారు. అయోడిన్ పావు అవున్సు, పొటాషియం అయోడిన్ ఔన్సు, స్పిరిట్ 20 ఔన్సులు కలిపిన టింక్చర్ అయోడిన్ అగుతుంది.

మోతాదు : 1 నుంచి 3 డ్రాములు

టింక్చర్ జింజిబ్రస్

ఇది శొంఠితో తయారవుతుంది. మన దేశములో పండిన ఓషధులను విదేశములకు తీసుకొనివెళ్ళి పరిశోధించి వివిధరకముల టింక్చర్సును తయారు చేసి పంపుచున్నారు. దీనిని నీటిలో కలిపిన పాలవలెనవుతుంది. దీనిని వాతజీర్ణరోగములలో వాడిన బాగుగా పని చేస్తుంది.

మోతాదు : 2 నుంచి 4 ఔన్సుల వరకు

టింక్చర్ ఓపియం

దీనినే నల్లమందు ద్రావకమంటారు. ఇది నలుపు, ఎరుపు, బూడిద వర్ణములు గలిగిన ద్రవపదార్థముగా ఉంటుంది. మత్తును కలుగజేస్తుంది. నిద్రను పట్టిస్తుంది. నొప్పిని తగ్గిస్తుంది. విరేచనములు, రక్తవిరేచనములకు బాగా పని చేస్తుంది.

మోతాదు : ½ నుంచి 1 ఔన్సు వరకు

టింక్చర్ అసఫటేడా

దీనినే ఇంగువ ద్రావకమంటారు. నీటిలో కలిపిన పాలవులెనవుతుంది. పాడిపశువులకు తవుడు విస్తారముగా పెట్టుటచేత జీర్ణము కానప్పుడు ఒక ఔన్సు మందును సేరునీటిలో కలిపి యిచ్చిన తగ్గుతుంది.

మోతాదు : 1 నుంచి 2 ఔన్సుల వరకు

టింక్చర్ కార్డిమం

దీనిని ఏలకులతో తయారుజేస్తారు. ఈ అరఖు ఆకలిని పుట్టించును. చిన్నదూడలు తెలుపుగా పారునపుడు దీనిని ఇంగువతో కలిపి యిచ్చిన పని చేస్తుంది.

మోతాదు : 1 నుంచి 4 ఔన్సుల వరకు

టింక్చర్ చైరేటా

దీనిని నేలవేముతో తయారు చేస్తారు. చేదుగా వుంటుంది. బలవర్ధకౌషధములలోను, జ్వరములకు వాడవచ్చును.

మోతాదు : 1 నుంచి 2 ఔన్సుల వరకు

టింక్చర్ జెంటైన్

దీనిని బలవర్ధకౌషధములలోను, వాత, జీర్ణరోగములలోను వాడుతారు.

మోతాదు : 1 నుంచి 2 ఔన్సులు

టింక్చరు నక్సువామికా

విషముష్టి గింజలతో తయారవుతుంది. బలవర్దకౌషధములలోను, పక్షవాత, అజీర్తి మలబద్ధకము మున్నగువాటికి వాడవచ్చును.

మోతాదు : 1 నుంచి 2 ఔన్సులు

పొటాషియం పర్మాంగనేట్

ఇది నేరేడు పండు రంగు గలిగి పలుకులుగా వుంటుంది. దీనికి అధికమగు క్రిమిసంహారక శక్తిగలదు. అందుచేతనే పశువులకు కలుగు గురక, దొమ్మ, పెద్దరోగము మున్నగు అంటురోగములకు నీటిలో కలిపి లోపలికి యిచ్చుదురు. ఈ పొడిని నీటిలో కలిపినపుడు చంద్రకాంత వంటి ఎరుపు రంగుగల ద్రవమేర్పడుతుంది. ఈ ద్రావకము క్రుళ్ళుచుండు పదార్థములతో చేరినపుడు ప్రాణవాయువు వెలువడి అది ఆ పదార్థముతో కూడి వానిని శుద్ధి చేస్తుంది. నూరు భాగముల నీటిలో ఒక భాగము పొడిని కలిపి శస్త్రచికిత్స చేసినపుడు తదితర పుండ్లను కడుగుటకు లోషనుగా ఉపయోగపడుతుంది. శస్త్ర పనిముట్లను ఈ లోషనులో వేసిన నల్లబడుతాయి.

మోతాదు : 2 నుంచి 4 డ్రాముల వరకు (1 డ్రాము= 1/8 ఔన్సు)

పొటాష్ క్లోరస్

ఇది నిర్వర్ణమగు పలుకులుగా ఉంటుంది. పటికవలెనే యిదియును పని చేస్తుంది. నీటిలో చక్కగా కలుస్తుంది. నోటినుంచి నీరు కారునపుడు, దీర్ఘ పడిశమునకు, అర్శ కత్తిరించిన తరువాత బాధగా ఉన్నప్పుడు, నోరు పూచినపుడు, నాలుక వాచినపుడు ఈ మందును లోనికి బైటకు వాడవచ్చును. రెండువేళల బెల్లముతోగాని, తేనెతో గాని కలిపి ఈయవచ్చు/పూయవచ్చు.

మోతాదు : ½ నుంచి 1 ఔన్సు వరకు

పొటాష్ బైకార్బనేటు

ఇది తెలుపుగానుండి నీటిలో కలియును. ఔషధముల కన్నిటికి యుండెడి గుణములు ఈ లవణముందొక్కదానికే గలదు. ఇది వాతమునకు, తత్వమును బాగు చేయుటకు, వాపులకు, క్రుళ్ళిన స్థలములకు పని చేయును.

మోతాదు : ½ నుంచి 1 ఔన్సు వరకు

పొటాష్ నైట్రెస్

సూరేకారము నుంచి తయారవుతుంది. తెలుపుగా నుండి మెరయును. మంచి చురుకుగల పదార్థము. రుచికి కారముగా చిరుచేదుగా వుంటుంది. తత్వమును బాగుపరచును. జ్వరమును తగ్గించును. గంజిలో గాని, జావలో గాని ఈ పొడిని కలిపి దాహముగా నీయవచ్చును. మూత్రరోగములలో బాగా పని చేయును. వేసవికాలములో వేడిజేసినపుడు, శిలామేహవాతములకు, శేరుమాదకు, మేయిదిగినపుడు, చూడి పశువుల మీదకు, ఆబోతు ఎక్కగా మానము వాచినపుడు సూరేకారము పని చేయును.

మోతాదు : 4 నుంచి 10 డ్రాముల వరకు

ఫార్మలిక్

ఇది ద్రావకముగా వుంటుంది. విషవస్తువు. బెల్లపునీటిలో కొన్ని చుక్కలు కలిపి కడుపునొప్పి, కడుపుబ్బులకు ఈయవచ్చును. కొమ్ములు విరిగినప్పుడు లోషనుగా చేసి కట్టుకట్టిన మానుతుంది.

మోతాదు : 1 నుంచి 2 డ్రాముల వరకు

మెగ్నీషియం సల్ఫేట్

ఇది తెలుపుగా వుంటుంది. విరేచనము గావించును. తత్వమునందు మార్పు గలిగించును. దీనిని లోషనుగా జేసి కీళ్ళవాపులకు, బెణుకులకు వాడవచ్చును. కడుపులోపల గాలి జేరినచో శొంఠిపొడితో వేడినీరు కలిపి ఈయాలి.

మోతాదు : ½ నుంచి 1 పౌను వరకు


* * *

తొమ్మిదవ భాగము

శారీరశాస్త్రము

ఉద్దేశ్యము

పశువు శరీరమును వర్ణించి వివిధ భాగాలను సమగ్రముగా తెలియజెప్పి ఆయా భాగాలలో నుండే ప్రయోజనాలను గూర్చి ఎరుక చేయుటయే శారీరశాస్త్రము యొక్క కర్తవ్యము. ఆకారమును వర్ణించుట



Anatomy యనియు, వాటి ఉపయోగాలు, ప్రయోజనాలను తెలియజేయునది శరీరశాస్త్రము (Physiology) అనియు అంటారు.

పశువు శరీరము

పశువు శరీరమును రెండు విధాలుగా విభజించవచ్చును. 1. అస్థిపంజరము 2. మాంసయుత శరీరము. అస్థిపంజరమును నాలుగు భాగాలుగా విభజించవచ్చును. 1. తల 2. వెన్నుభాగము 3. నడుము 4. పృష్ఠ భాగము, తోక.

పశువు శరీరములోని మండలములు

మానవ శరీరము వలెనే పశువు శరీరము గూడ వివిధ మండలములుగా విభజింపబడియున్నవి. 1. అస్థిపంజరము 2. కండర మండలము 3.రక్తప్రసరణ మండలము 4. నాడీమండలము 5.జీర్ణ మండలము 6. శ్వాసమండలము.

ఈ మండలములన్నిటిని శరీర భాగములుగా ఏర్పరచి, ఏ మండలమునకామండలము ప్రత్యేకత కలిగి, ఒక దానితో మరియొకటి సహకరించుతూ ఏకత్వము కలిగి శరీర మొప్పారుతున్నది.

అస్థిపంజరము

చతుష్పాద జంతువుల యొక్క అస్థిపంజరము రెండుభాగాలుగా విభజించవచ్చును. ప్రక్క ఎముకలు, వెన్నెముకలతో శరీరమును నిలబెట్టుతున్నది. ఈ ఎముకలన్నియు కార్టిలేజివంటి మెత్తని పదార్థముతో బిగించబడియుండును. ఎముకలన్నిటియందును పైభాగమందు దంతమువలె తెలుపుగానుండు పొరయొకటి కప్పబడియుంటుంది. దీనినే గట్టిపొరయందురు. దీనిలోపల స్పంజివంటి మెత్తని పదార్థముంటుంది. దీనినే మూలుగయంటారు. ఇది గుల్ల ఎముకలలో కడ్డీవలె యుంటుంది.

తలయందుండే ఎముకలు

లలాటాస్థి 2, సీమంతాస్థులు 2, శిరపృష్టాస్థి 1, కర్ణాస్థి 1, జల్లెడ ఎముక 1, స్ఫినాయిడ్ 1, పుట్టెమధ 1, (2) ముఖమునందు ఎముకలు 18, (3) వెన్నెముకయందుండు ఎముకలు మెడపూసలు 7, వీపుపూసలు 13, నడ్డిపూసలు 5, తొంటిపూసలు 6, లోకపూసలు 18 లేక 20, భుజపుటెముకలు 2, పై చెయ్యి ఎముకలు 2, ముంజేయి ఎముకలు 2, అంసఫలకము దీనినే భుజపుకీలంటారు. ఇది కండరాలను కాపాడుతుంది.

వెన్నుపూస

ఈ పూస బాడి ఆకారముగా వుంటుంది. ఇది వెన్నుపూస యొక్క అడుగుభాగమున వుంటుంది. వెన్నుపూస రెండుపూసలతో అమర్చబడి యుండి మధ్య కాలువవలె అమర్చబడియుండుటచే వెన్నెముక యగుచున్నది. వెన్నుపూసలు ఒకదానినొకటి కలసియున్నపుడు మధ్యను దిండ్లవంటి మెత్తని ఎముక పదార్థము అమర్చబడియుంటుంది. అందుచేతనే వెన్నెముకను వంచుటకు వీలగుతున్నది.

రొమ్ము ఎముక

ఇది బల్లపరుపుగానుండి రొమ్మును చదరముగా చేస్తున్నది. ఈ ఎముక అడుగుభాగమున వెడల్పుగాను, బల్లపరుపుగాను ఉంటుంది. ఇట్లుండుటవలన రొమ్మునకు ఆకారము గలిగిస్తున్నది.

ప్రక్క ఎముకలు

ఇవి హృదయకుహరములోనున్న ముఖ్య అంగములను కాపాడుతున్నవి. ఈ హృదయ కుహరపు వెనుకభాగమునందు వెన్నెముక వలన, క్రింది భాగమునందు రొమ్మెముకవలన, ప్రక్కలందు ప్రక్క ఎముకల వలన బిడాయించియుంది. ఈ ప్రక్క ఎముకలు వంకరటింకరగా వుంటాయి. ఇవి హృదయకుహరపు గోడలనుంచి వంకరగా తిరిగి పంజరమువలె వుంటుంది. ఇవి గట్టిగా వెడల్పుగా మిక్కిలి కఠినముగను వుంటాయి. జంతువుల యందు 13 జతల ప్రక్క ఎముకలుంటాయి. ఇవి హృదయ కుహరపు రెండు ప్రక్కలవుంటాయి. ఇంక నివి వీపు ఎముకకు ఆనుకొనియుంటాయి. క్రిందిభాగమందు కడ్డీలవలెనుండు

ఉపాస్థులచేత పెంపొందించుతుంది. మొదటి 8 జతల ప్రక్క ఎముకలు కీళ్ళచే వాటియొక్క మొనలవద్ద అతుకబడియుంటాయి. మిగిలిన జతలు రొమ్ముకకు అతుకుకొనియుండవు.

కూపము

దీనినే తొంటి ఎముకల అస్తిపంజరమంటారు. ఈ అస్తిపంజరము నుండి మలాశయము మూత్రాశయము పోతుంది. ఇది ఒక దానితోనొకటి సంబంధించని ఎముకలతో అడుగునను ప్రక్కలను తొంటి ఎముకలపై ప్రక్కల నమర్చబడియుంది. ఇంకను పశువు శరీరములోనుండు ప్రాణాధారమగు అవయవములు ఈ వస్తికమునందమర్పబడియుంది. దండ ఎముక, మోకాలు ఎముక, కూర్పారాస్థి, మణికట్ట, కరంగుళ్యాస్థులు, కాలి ఎముకలు ముందుకాలికి 15, వెనుకకాలికి 15 ఎముకలు వుంటాయి. తొంటి ఎముక, ఊర్ధ్వాస్థి, పటాలాస్థి ఈరీతిగా పశువు అస్తిపంజరములో అనేక రకాల ఎముకలు వుంటాయి.

కండరమండలము

మేలిముసుగుగా ఒప్పుచున్న పశుశరీరము, పై చర్మము తీసివేసిన, ఎర్రనిమాంసపు ముద్ద కన్పించును. దీనినే కండరము అందురు. ఈ కండరములు, శరీరము యొక్క ప్రదేశముబట్టి, ఎక్కువతక్కువలుగా, పరిమాణము కలిగియున్నవి. ఇవి 700 పైగా యున్నవి.

ప్రతికీలుదగ్గర మెత్తని పదార్థముండును. కీలు కదలినప్పుడు, ఆకండ, లావు అగుచూ సాగుచూ గట్టిపడుచూ, ఆయా స్థితినిబట్టి మార్పుచెందుతూ వుంటుంది. ఈ కండరములు, మాంసముతో చేయబడి, కంటికి కనుపించని దారముతో కట్టలుగా, కట్టబడి, వానిపై పల్చని పొరగా కప్పబడియున్నవి. ఇట్టి త్రాళ్లు కండరములకు రెండువైపులా ఉండి, పొడవుగా పోయి, బలమగుతాడుగా ఏర్పడుచున్నవి. దీనినే స్నాయువులంటారు. ఇవియే ఎముకలకు కట్టబడి యుంటాయి.

ప్రతి కండరములోను, ఒకనాడి కొన్ని రక్తనాళములు పోవును.


కండరముల రంగు ఎరుపుగా ఉండును. చుట్టుప్రక్కల రక్తనాళములుండుటవలన ఈ రంగు వచ్చినది.


కండరముల చలనము

ఈ కండరములు, ఎముకలు వంగుటకు, సాగదీయుటకు, నిలబడునట్లు చేయుటకు సహాయపడు-చున్నవి. బరువులు మోయుటకు, అనేక కండరములు ఒకటిగా చేరి బలిష్టమై చలనము కలిగియుంటాయి.

పశువు శరీరములో మెడ ముందునకు వంగవలెననిన ముందు భాగములోని కండరములు ముడుచుకొనును. అట్లే తలపై కెత్తవలెననిన మెడవెనుక భాగములోని కండరములు ముడుచుకొంటాయి.

అట్లే పాదములు, పిక్కలు, తొడమీద కండరములు చలనము పొందుతుంటాయి.


" అస్థిపంజరము"


గేదెపై ఎద్దు ఎక్కుట
కాళ్లుతిప్పుట
కాళ్లుఎత్తుట
కొంగకాళ్లు
వంకరకాళ్లు
త్రైలాసువృషణములు
గిట్టలుకొట్టుకొనుట
గిట్టలు.వెడల్పువంకర
పంగ గిట్టలు
గ్రందులు.పుట్టుట
GS

కండరాలలో రకములు

కండరాలు పొట్టిగాను, పొడవుగాను, గుండ్రముగాను, దళసరిగాను యుంటాయి. కండరాలు రెండురకాలు.

స్వేచ్ఛగా ఉండేవి

ఇవి అస్థిపంజరమునంటియుండి మెదడు ఆజ్ఞకు లోబడియుంటాయి.

స్వేచ్ఛగా లేనివి

ఇవి ఊపిరితిత్తులు, గుండెకాయ, జీర్ణాశయము, ప్రేగులు మున్నగునవి.

పశువు నిద్రపోవునపుడు మేలుకొనునప్పుడు యీ కండరాలు వాటంతటవే పని చేస్తాయి.

సాధారణముగా, కదలుచుండు అవయవములకు, బలిష్టమైన కండరములు కలిగియున్నవి. కనుకనే, కాళ్లలోని ఎముకలకు, బలము కల కండరాలు కలవు.

తలలోను, ముఖములోను పల్చని కండరాలు కలవు. ఇట్లుండుట వలన, కన్నులు, నోరు కదల్చుటకు తోడ్పడుతాయి.

వీపు, నడ్డిపూస, వెన్ను పైభాగమునకు పెద్ద కండరాలు కలవు. ప్రక్కటెముకలకు పల్చని కండరములు గలవు.

కండరముల అభివృద్ధి

సాధారణముగా పని చేయు కండరములకు, ఎక్కువ రక్తప్రసారము కలిగి, కండరాలు పెరుగుతాయి. విశ్రాంతి కలిగిన కండరాలకు, తక్కువ వృద్ధియుంటుంది. ఇవి మెత్తగా, చిన్నవిగా నుండి, కాంతి కలవిగా వుండవు.

పని చేయు కండరములు, బలిష్టమై, దృఢమై యుండాలి.

కావున ప్రతి కండరమునకు తగినంత పరిశ్రమ ఇయ్యనిదే, అవి వాని స్వభావ జనక, పనులు చేయలేవు.

ఎముకలు ఎదుగుట

ఎముకలు ఎదుగుటకు ముఖ్యము రక్తము. ప్రతి ఎముకకు, పైన తెల్లని నారగలిగిన పొరయుండును. రక్తనాళములు ఎముకలలో ప్రవేశించక పూర్వము, యీ పొరలో ఉండును. ఈ పొర లేనిచో ఎముకలు ఎదుగలేవు.

రక్తప్రసరణ మండలము

ఇంటికి పైకప్పులాగ చర్మం పశుశరీరాన్ని కప్పుతూ లోపలి అవయవాల్ని కాపాడి రక్షిస్తుంది. శరీరంపై చర్మాన్ని కొంతవరకు కోస్తే క్రొవ్వు, కండ బయలుపడతాయి. ఇంక లోపలికి కోస్తే నరాలు, రక్తనాళాలు తీసివేస్తే మిగిలేవి ఎముకలే. ఆ ఎముకల సంపుటాన్ని అస్తిపంజరమంటారు. అస్తిపంజరాన్ని చూస్తే భయాన్ని పురికొల్పుతూ ఉంటుంది. అస్తిపంజరానికొక సౌందర్యం గాని, స్ఫురద్రూపం గాని ఉండదు. చర్మం, కండరాలు, నరాలు, రక్తనాళములతో కప్పబడి ఉండి జీవంతో ఉన్నప్పుడే దానికొక సౌందర్యం ఉంటుంది. రక్తనాళాలలో రక్తం బాగా ప్రవహిస్తున్నపుడే జీవముందని తెలుస్తుంది. అప్పుడే శరీరానికొక అందం ఉండి ముఖంలో కళ, కళ్లల్లో తేజస్సు ఒలుకుతూ ఉంటాయి. జీవించియున్న ప్రతి పశువు శరీరంలోను ప్రవహిస్తున్న రక్తమే జీవరసం కాబట్టి పశుశరీరంలో జీవకళ ఉండడానికి రక్తమే ప్రధానం.

నీటి ప్రవాహము వలెనే మనుష్య, పశుశరీరములలో, రక్తప్రవాహము మిక్కిలి ముఖ్యము. ఇది ద్రవముగా వుంటుంది. నీటికంటె బరువు. రక్తమునందు నీరు, ఖనిజములు, బొగ్గుసంబంధమైన పదార్థములు వున్నవి. ఇట్టి రక్తమునందు రెండురకముల కణములుంటాయి 1) ఎర్రని కణములు 2) తెల్ల కణములు.

ఎర్రకణములు

రక్తమునందు ఒకవిధమైన పలుచని పదార్థము వుంది. దీనిని "ప్లాస్మా" అని పిలుస్తారు. ఈ "ప్లాస్మా"లో కణములుంటాయి. ఎఱ్ఱకణములు గుండ్రముగాను, చదునుగాను, మధ్యభాగము పలుచగాను, చుట్టూ దళసరిగాను ఉంటుంది. ఈ కణములలో ఇనుము అను లోహము వుంటుంది. పశువు గాలి పీల్చినపుడు ప్రాణవాయువులోనికి పోయి రక్తప్రసరణమును శుభ్రము చేస్తుంది. రక్తకణములు ప్రవాహములో దొర్లుచూ రక్తమును శుభ్రము చేస్తాయి. ఇవి రక్తములో 50 లక్షల వరకు ఉంటాయి.

తెల్లకణములు

ఇవి ఎర్రకణములకంటె పెద్దవి. అవి సజీవములుగా వున్నంత వరకూ వాటి ఆకారమును మార్చుకొంటాయి. ఈ కణములలో "హెమోగ్లోబిన్" అను పసుపుపచ్చని పదార్థము వుంటుంది. ఇది ప్రాణవాయువును పీల్చుకొని లోపలి టిస్యూలకిస్తుంది. ఈ కణములు వైద్యుని వలె శరీరములోని రక్తమును కాపాడుతాయి. ఇవి రక్తములోని చెడుపదార్థము నడ్డగించి నిర్మూలిస్తాయి. గాయములు తగిలినప్పుడు నెత్తురు కారునపుడు యీ కణములు రక్తమును నిరోధించి పుండ్లను మాన్పుతాయి.

శరీరములో విషపదార్థము లెక్కువగా ఉన్న తెల్లకణముల బలము తగ్గును. ఇవి రక్తములో నూటికి 2 నుంచి 10 వరకు ఉంటాయి.

ధమనులు – సిరలు

ధమనులు, దృఢమైన, రబ్బరువలె సాగునట్టి, మెత్తని గోడలు కలిగియుంటాయి. ఇవి ఎల్లప్పుడు రక్తముతో నిండి, ఉబికియుంటాయి. ఇవి హృదయము నుండి, హృదయ చలనము వలన, రక్తమును శరీరములో అన్ని భాగములకు తీసుకొనిపోతాయి.

సిరలు, రక్తమును, టిస్యూల నుండి హృదయమునకు తీసుకునిపోతాయి. ఒకే మార్గమున, ధమనులు, సిరలలోని రక్తమును, చిన్నకాల్వల ద్వారా హృదయమునకు తీసుకొని పోవుటకు వీలుగలిగియున్నవి. వీటిని కేశనాళికలు అంటారు. కేశనాళికలు గోడలు మిక్కిలి మృదువుగా ఉంటాయి. ఇట్టి కొన్ని కేశనాళికలు ఒక టిస్యూగా ఏర్పడుతాయి. ఇట్టి కేశనాళికల ద్వారా, ప్రాణవాయువుచే జీర్ణించిన పదార్థము రక్తము నుంచి, టిస్యూలకు పంపబడుతుంది.

ధమనులు, సిరలలోని రక్తము

ధమనులలో మంచి రక్తము ప్రవహించును. సిరలలో చెడురక్తము ప్రవహించును. రక్తనాళములలోని పదార్థము, రెండురకములు.

శ్వాసకోశ సంబంధమైన పదార్థము.


క్రమమైన ప్రవాహము. మొదటి దానిలోని రక్తము హృదయము నుండి ఊపిరితిత్తులకు, మరల వెనుకకు ప్రవహించుతుంది.


శ్వాసకోశసంబంధమైన ప్రవాహములో ప్రథమమున కుడిజఠరికలోనికి తర్వాత ఊపిరితిత్తులలోనికి పోవును. ఈ ప్రవాహమును పుపుససిరలు యొక్క (Pulmonary glands) శక్తిచే ఒకచోట కూర్చబడి అచటనుంచి కర్ణికలోనికి పోతుంది. అచటనుంచి ఎడమజఠరికలోనికి తర్వాత బృహద్ధనులోనికి (Ayorta) పోతుంది. అనగా మొదట క్రమప్రవాహములోనికి, తర్వాత, శరీరములోని టిస్యూలకు, అచటినుంచి క్రమముగా సిరలలోనికి, తదుపరి కుడికర్ణిక లోనికి తిరిగివస్తుంది. అచటినుంచి కుడికర్ణిక లోనికి, తరువాత కుడిజఠరిక లోనికి, తుదకు పుపుసధమని (Pulmonary gland) లోని రక్తము ప్రవహించబడుచున్నది.

రక్తప్రసరణము

శ్వాససంబంధమైన ధమని చెడురక్తము కలిగియుంటుంది. రక్తమును శుభ్రపరచుటకు, యీ ధమని కుడిజఠరికలో నుంచి రక్తమును ఊపిరితిత్తులలోనికి తీసుకుపోతుంది. ఇట్టి రక్తము హృదయము దాటగనే రెండు భాగములుగా విభజింపబడును. 1. కుడి ఊపిరితిత్తులలోనికి 2. ఎడమ ఊపిరితిత్తులలోనికి పోతుంది.

ఇటులపోయిన రక్తము, రక్తనాళములుగా విభజింపబడి, కేశనాళికల వరకు చివరకు వాయుగోళము వరకు పోతుంది. అప్పుడు వాయువుతో సంబంధించుతుంది. అచ్చటనే, ఊపిరితిత్తులు, ప్రాణవాయువును,


రక్తప్రసరణము


హృదయము
మూత్రపిండములు

తీసుకుని, చెమ్మను, బొగ్గుపులుసు గాలిని, కేశనాళికల వద్దకు పోవును, ఇచట రక్తము పరిశుభ్రము చేయబడి సిరలగుండా, శ్వాసకోశము వద్దకు పోతుంది. తదుపరి, పరిశుద్ధ రక్తము, ఎడమ కర్ణికలోనికి, అచటనుంచి, బృహద్ధములోనికి, అచటినుంచి, అన్ని టిస్యూలకు పోతుంది. ఈ బృహద్ధము యొక్క పెద్ద రక్తనాళము. ఇది ఎడమజఠరిక నుంచి పరిశుభ్రమైన రక్తము శరీరమునకంతకు వ్యాపింపజేస్తుంది.

హృదయము చేయు పని

హృదయము, గోపుర ఆకారముగా ఉండి దీనిచుట్టూ ఒక కోశము (Pericardium) ఆవరించి తోలుసంచి వలె ఉంటుంది. ఇది గుండెను, యితర కోశములతో తగులనీయక సంరక్షించుతుంది. గుండె, శ్వాసకోశముల మధ్యను, రొమ్ము ఎముక క్రిందిభాగమున వుంటుంది. మొనతేలిన భాగము క్రిందికి ఉండి, వెడల్పు భాగము మీదికి వ్రేలాడుతుంది.

హృదయము నాలుగు గదులుగా విభజింపబడియున్నది. ఇది కుడి, ఎడమ, జఠరికలు; కుడి ఎడమ కర్ణికలు యొక్క పైభాగమున క్రిందిభాగమున ఉన్నవి. హృదయ చలనము వలన (beat) అనగా మూయుట, తెరచుట వలన గుండెవద్దనున్న రక్తము అన్ని భాగములకు పోతుంది. గుండె మూయునప్పుడు, రక్తము జఠరికలోనుంచి ధమనులలోనికి పోతాయి. తెరచినప్పుడు రక్తము సిరలలోనుంచి ధమనులలోనికి పోతుంది. హృదయము బరువు 4 పౌనుల నుంచి 5½ పౌన్లు వరకూ ఉంటుంది.

నాడియొక్క ప్రయోజనము

వైద్యులు మనుష్యుని నాడి పరీక్షించినటులనే పశువును కూడ పరీక్ష చేయవచ్చును. ఆరోగ్యము తెలుసుకొనుటకు పశువుతోక మట్టక్రిందనూ దౌడవద్దనూ, చేతితో పట్టిచూడాలి. ధమనులు ఉబుకుట వల్లనూ, తిరిగి యధాస్థితి పొందుటవల్లనూ ఒక విధమైన ధ్వని కలుగుతుంది. ఇదియే నాడీచలనము.

రక్తప్రసరణము వల్ల ప్రయోజనములు

శరీరములోని కల్మష పదార్థములు త్వరగా విసర్జింపబడుతాయి.

అధిక క్రొవ్వుపదార్థములు కరుగుతాయి.

కండరములకు పోషణ జరిగి అవి బలము కలిగియుంటాయి.

శరీరావయవములు, అన్నియూ, మంచిరక్తముచే నింపబడి, వాటి వాటి పనులు చేయుటకు శక్తివంతములైయుంటాయి.

నాడీమండలము

సన్నని నూలు దారమును పోలిన కట్టలుగా ఉన్న నరములేనాడి. ఈ దారములు చమురుతోనిండి యుంటాయి. ఇట్టిదారములు యొక చర్మవిశేషముచే సంధింపబడినాయి. వీనిని స్పర్శనాడులు, జ్ఞాననాడులు, చలననాడులు, మిశ్రమనాడులు అనురకములుగా వ్యవహరింపబడుచున్నవి. వీనికి స్వతంత్రముగా వ్యవహరించు శక్తిలేదు.

ఇంద్రియము నుండి, మెదడునకు ఎల్లపుడు వార్తాప్రతినిధులుగా ఉన్న నాడులు కొన్ని, ఇవి స్పర్శ, రస, శబ్ద, రూప, గంధములు, వీని స్వభావములు మెదడునకు తీసుకొనిపోతాయి. ఇవి జ్ఞాననాడులు, ఇవి జ్ఞానమును కల్గిస్తాయి. వీనిని ఆంగ్లమున Sensory nerves అని పేరు. పని పాటల విషయములో, కండరమండలమునకు ఆజ్ఞలను తీసుకొనిపోవుచు, చలనము కలుగచేయు నాడులు.

చలననాడులు

ఒక్కొక్కచోట జ్ఞాననాడులు చలననాడులలో, కలయిక కలిగి మిశ్రమనాడులేర్పడుతాయి. ఇవి శరీరములో చాలా గలవు. వీనికి (mixed-nerves) మిశ్రమనాడులని పేరు.

మెదడు

పశువు మెదడు, ముడుతలుపడి ఉంటుంది. ఈ కారణము వలన, రక్తవాహికల నుండి ఎక్కువ రక్తము ప్రవహించుతుంది. అందువలన, పోషణ పదార్థము ఎక్కువగా మెదడు సంపాదించుతుంది.

మెదడులో ఒకవిధమైన రసముంటుంది. దీనివలన దెబ్బతగిలినపుడు అంత నొప్పి కలుగదు. మెదడు బరువు 16 నుంచి 17 ఔన్సుల వరకు వుంటుంది.

పెద్దమెదడు

పశువు తలలోని కపాలమునందు, ఈ పెద్దమెదడు ఎక్కువ స్థలము నాక్రమించును. ఆలోచన, జ్ఞాపకశక్తికి ఇది ప్రధాన హేతువు. ఇది, యింద్రియ జ్ఞానమునకు ఆధారము. ఇది లేనియెడల జంతువు, చూడలేదు, వినలేదు. రుచి తెలియదు. కండరచలనమునకు హేతువు.

చిన్నమెదడు

ఇది పెద్దమెదడు కంటె చిన్నది. హెచ్చుచలనమునకు మూలము (పరుగెత్తుట, నడచుట) ఇది చెడిన, పక్షవాతము వస్తుంది.

మజ్జాముఖము

ఇది వెన్నుపాము యొక్క లావుగల మొదలు. దీనికి అపాయము కలిగిన వెంటనే మరణము సంభవిస్తుంది. ఊపిరితిత్తులు, హృదయము, కండరములు, దీని ఆజ్ఞలకు లోబడి పని చేస్తాయి.

వెన్నుపాము

దీనిపొడవు 65 లేక 67 అగుళము పొడవును, 16 లేక 17 ఔన్సుల బరువుంటుంది. ఇది ఇచ్ఛాశక్తికి మూలాధారము, మెదడునకు పోవు వార్తలు, దీనిగుండా పోతాయి.

మూత్రపిండములు

వీనినిండా ఎక్కువ రక్తనాళములు వుంటాయి. ఎరుపువర్ణము కలిగియుంటవి. వెన్ను ఎముకకు ఇరుప్రక్కల, తొంటి ఎముకలకు నడుమగా ఒక్కొక్కటి కలవు. పిండములోపలి భాగము పల్లముగాను,

బయట ఉబ్బుగాను ఉంటుంది. పల్లపు భాగమునుండి, మూత్రనాళము అను గొట్టముండును. ఇందుండి, మూత్రము తయారవుతుంది.

రక్తములో నుంచి రెండు గొట్టములద్వారా ఉచ్చబుడ్డలోనికి పంపుట వీనియొక్క కార్యము. మూత్రకోశములో ఈ గొట్టముల ద్వారా మూత్రము చుక్కలు చుక్కలుగాపడుతుంది.

మూత్రపిండములు రక్తమును శుభ్రము చేస్తాయి. రక్తములోని, చమటరూపమున, వేసవి కాలములోను, పశువు కష్టించినపుడు, చెమట రూపమున వచ్చునట్లు చేస్తుంది. బరువు 20 లేక 25 ఔన్సులు పొడుగు కుడిపిండము 4 అంగుళములునూ, వెడల్పు 3 అంగుళములున్ను వుంటుంది.

ఎడమ పిండము

ఒకటి రెండు అం॥ పొడుగు.

వృషణముల బరువు

10 లేక 12 ఔన్సులు. వృషణనరములు, 10 అం॥ పొడుగుండును.

మూత్రకోశము


ఇది పురుషనాళము దగ్గర, ఆసనము వద్ద ఉంటుంది. మూత్రముతో నిండియుండిన ఇది ఉబ్బియుంటుంది. లేనియెడల తగ్గియుంటుంది. కోశము వంపుగా వుంటుంది. అందువల్ల కడ్డీవేసి మూత్రము తీసివేయుటకు వీలులేదు. శస్త్రము చేయవలసి వచ్చిన వంపుదగ్గర చేయవలెను. మూత్రకోశము పొడవు 3 అడుగులు.


శ్వాసమండలము

స్వరూపము

గాలి ప్రవేశించుటకు వీలులేని పెట్టెవలె ఉన్న హృదయకుహరంలో ఈ శ్వాస అడుగున అమర్చబడి వుంది. దీనిచుట్టును, వెనుకభాగమున వెన్నెముకయు, ప్రక్కలయందు ప్రక్కటెముకలును, ముందుభాగమున రొమ్ము ఎముకయు ఆవరించియుంది. ఈ లోపలి ప్రదేశములో హృదయము ఉన్న ప్రదేశము పోను తక్కినచోటు, ఊపిరితిత్తులు ఆక్రమించియున్నవి. ఈ తిత్తులు కుడి ఎడమవైపుల ఉన్నవి. వీటియొక్క శ్వాసగొట్టము లేక పీకె ఈ తిత్తులను రెండుగా విభజించుతున్నది. ఇవి చీలుచోట ద్రవహితమైన పొరచే కప్పబడియుంటుంది. దీని అడుగుపొర ఊపిరితిత్తులనంటియుంటుంది.

ఊపిరితిత్తులు కమ్మరివాని కొలిమితిత్తులవలె వుంటాయి. ఈ తిత్తులలో, రక్తకేశనాళికలు, గాలిగొట్టము, రబ్బరువంటి మాంసపదార్థము ఉంటాయి. ఊపిరితిత్తులు, ప్రాణవాయువును పీల్చుతాయి. చెడుగాలిని విడిచిపెట్టును. తిత్తులబరువు 7½ పౌనులు వుండును.


ముఖనరములు


" కండరములు "

శ్వాసనాళము

గాలిగొట్టము పశుశరీరములో రెండుగా చీలియుండును. వాయునాళములు, శాఖలుగా చీలి వాయువుకొరకు ఎదురుచూస్తుంటాయి. వాయునాళములో ప్రవేశించిన గాలి, వీటిని క్రమేపీ నిండించును. ఇది పశుశరీరములో గొంతువద్ద బయలుదేరి ఊపిరితిత్తుల వద్ద చీలుతుంది. దీని పొడవు 20 అం॥, ½ అంగుళము మందము; 2 అంగుళములు వెడల్పు ఉండును.

శ్వాసపద్ధతి

ఆరోగ్యముగా నుండు పశువునకు నిమిషమునకు 15 మొదలు 18 వరకు శ్వాస ఆడుతుంది. ఒకసారి వాయువులోనికి పోయి మరల బయటికి వచ్చుటను శ్వాసక్రియ అని అంటారు.

శ్వాస, పశువు యొక్క ముక్కులనుండి కొంతయు, నోటివెంట కొంతయు లోపలికి పోయి, బయటకు వస్తుంది. ఇట్లు లోనికిపోయిన శ్వాస దేహమంతట వ్యాపించి, నలుపువర్ణముగా మారియున్న అశుద్ధరక్తమును, ఎరుపుగా మార్చుతుంది. ఇటుల రక్తము శుభ్రము కాగానే, విసర్జన వస్తువులు, ఆవిరి రూపమున బయటకు వస్తాయి.

ఉచ్ఛ్వాసము

గాలిలోనికి పీల్చుట, బయటకు వదలి పెట్టుటను శ్వాసక్రియ అందురు. లోనికి పీల్చుట (ఉచ్ఛ్వాసము) వలన గాలి, ప్రక్కటెముకలు ఉబ్బునట్లు చేయును. పిమ్మట ముడుచుకొనును. ఈ రీతిగా హృదయకుహరము పెద్దదగును. అంతట వాయువు గొట్టములగుండా పోయి, ఊపిరితిత్తుల నింపుతుంది.


నిశ్వాసము

గాలిని బయటకు విడుచుట నిశ్వాసము. దీనివలన హృదయకుహరము యొక్క గోడలు, ఊపిరితిత్తులు ముడుచుకొంటాయి. పైనున్న కండరములు యధాస్థితిలో ఉంటాయి. ప్రక్కటెముకలు క్రిందికి దిగి ఉబ్బు తగ్గుతుంది.

జీర్ణమండలము

జీర్ణకోశము

ఏ శక్తివలన శరీర పుష్టి కలుగుచున్నదో, ఎట్టి పుష్టి శరీరములో టిస్యూల నిర్మాణమునకు తోడ్పడుచున్నదో, అట్టిశక్తి పశువు దినదినమూ తిను ఆహారము నుండి వచ్చుచున్నది. తినిన ఆహారము శక్తిగా మారుటకు, శరీర నిర్మాణమునకు తోడ్పడుటకు పూర్వము జీర్ణకోశము లోనికి విడువబడిన ఆహారము, కొన్ని మార్పుల ద్వారా, కొన్ని కోశముల గుండా, జీర్ణింపబడి రక్తప్రసరణ మండలము ద్వారా ఆహారములోని శక్తిలోనికి తీసుకొని, విసర్జన పదార్థము బయటకు త్రోసివేయబడుతుంది.



జీర్ణించబడిన పదార్థము ఏయే పద్ధతుల ద్వారా అటుల జీర్ణమగుచున్నదో విచారింతము. పశు-జీర్ణకోశము నాలుగు భాగములుగా విభజింపవచ్చును. ఆహారము ఏయే మార్గముల గుండా పోవుచున్నదో అట్టిమార్గములకు వాటిపేర్లు నిర్ణయించబడినవి. 1) పెద్దపొట్ట 2) కాసులపొట్ట 3) అరలపొట్ట 4) నాలుగవ పొట్ట.

పెద్దపొట్ట

ఇది అన్నిటికంటె పెద్దది. తిను ఆహారము యీ తిత్తిలోనికి చేరును. ఇందు ఒకవిధమైన పొరకలదు. ఈ పొట్టలో 50 గాలనుల వరకు ద్రవపదార్థాలు పట్టుతాయి. ఈ పొట్ట వస్తికమునకు వెనుకగా, 7, 8, ప్రక్కటెముకల మధ్యగా ఉంది. దీనిలోపలి కండరములు తేమగా వుంటాయి. ఇందు జీర్ణరసము తయారవుతుంది. బొగ్గుసంబంధమైన పదార్థములు యిందులో కలవు. ఇది ఆహార పదార్థములు నిలువయుండు చోటని గ్రహించాలి.

కాసులపొట్ట

దీనిలోపలి భాగము కాసులు కాసులుగా నుండును. పశువు నెమరువేయుటకు సరిపడు నీరు రసము యిందులో చేరుతాయి. ఇది పెద్దపొట్ట కన్న మందము. పెద్దపొట్టలోని మేత యిందులోనికి వచ్చి ఉండలు ఉండలుగానవుతుంది. ఈ ఉండలను చక్కగా నోటిలోనికి తెచ్చుకుంటుంది. దీనినే నెమరువేయుట అంటారు. జీర్ణముగాని పదార్థములు, రాళ్లు, ఇనుప ముక్కలు యిందులో చేరును. ఇది అర్ధచంద్రాకారముగా నుండి పెద్దపొట్ట ముందు భాగమున ఉండును. ఈ కోశము అన్ని భాగములకంటె చిన్నది.

అరలపొట్ట

పశువుచే నెమరు వేయబడిన ఆహారము యీ పొట్టలో చేరుతుంది. ఇచట జీర్ణమగును. ఇది కాగితమువలె పొరలు పొరలుగా ఉంటుంది. ఇది కార్జమునకు కుడిప్రక్కన 7 నుంచి 11 వరకున్న

ఎముకల మధ్యవుంటుంది. కాసులపొట్టకన్న కొంచెము పెద్దది. ఇచటవచ్చు ఆహారపదార్థమంతయూ ఆవిరియైపోతుంది.

నాలుగవ పొట్ట

జీర్ణమైన మేత యీ పొట్టలోనికి చేరుతుంది. ఇచట జఠరరసము ఉత్పన్నమై పుల్లగా వుంటుంది. ద్రవపదార్థము ఈ పొట్టలో చేరుతుంది.

ఇది 7 నుంచి 12 ప్రక్క ఎముకల మధ్య వుంటుంది. ఈ పొట్టచివర ప్రేగులు ఆరంభమవుతాయి.

గ్రంథులు

పశువు మేతను నోటిలోనికి తెచ్చుకొని నమలునప్పుడు, ఉమ్మి ఊరుచుండును. గ్రంథులు మూడురకములు 1) బాతుకలమువలె, సన్నముగా, లోతుగా ఉండునవి. 2) సన్నని మూతికలిగి, గుండ్రని అంచులవలె వుండునవి. 3) పాముచుట్టలవలె చుట్టుకొని ఉండును. గ్రంథులు చేయు పనినిబట్టి అవి రెండు రకములుగా విభజింపవచ్చును. 1) స్వీకారగ్రంథులు. ఇవి శరీరమునకు కావలసిన పదార్థములు తయారు చేసుకొంటాయి. 2) వెలికి త్రోయుగ్రంథులు. శరీరమునకు అక్కరలేని పదార్థమును బయటకు త్రోసివేస్తాయి.

పేరాటిడ్ గ్రంథులు

ఈ గ్రంథులు, పశువు అరచునప్పుడు, చెమ్మగిలి కావలసిన వరకు తేమనిస్తాయి. ఇవి, చెవులకు దగ్గరగా, క్రింది దవుడ క్రిందికి పైకి ఆడునట్టిచోట వున్నవి.

సబ్‌లింగ్వల్ గ్రంథి


ఈ రెండు గ్రంథులు నాలుకకు క్రిందిభాగమున వుండేయీనెకు రెండువైపుల ఉంటాయి. ఇవి ఉమ్మినీటిని తడిచేస్తాయి. నమలిన ఆహారము జిగురుగా కట్టిస్తాయి. ఆహారములోని పిండిపదార్థములు చక్కెరగా మార్చుతాయి. ఈ గ్రంథులు, రక్తము నుంచి ఉమ్మిని తయారు చేస్తాయి. నాలుకను తడి చేస్తాయి.

సప్తపథము

ఈ ప్రదేశములోనికి ఏడుదారులు ఉన్నవి. అందువలన దీనికి సప్తపథమని పేరువచ్చినది. ఇది గళ్లసంచివలె ఉంటుంది.

ఆహారనాళము

ఇది గొంతులోగుండా పోతుంది. ఇది గొట్టమువలె నుండి మడతలు పడుతుంది. ఉమ్మినీటి గ్రంథులు, కాలేయము, వృక్వకము దీనినంటియున్నవి. ఈ నాళము పశువు తిను ఆహారము జీర్ణమగుటకు తగిన రసము పుట్టించుతుంది. దీనినంటి, నోరు, పొట్ట, సప్తపథము ఉన్నది. దీనిగుండా మేత నీరు లోనికి పోవును. పశువు పొడవు 1 గజము అయిన, ఆహారనాళము పొడవు 20 గజములు ఉండును. దీనికి స్పర్శజ్ఞాన మెక్కువగా వుంది.



ప్రేవులు

పశుశాస్త్రజ్ఞులు, జంతువు దేహమెంత పొడవుండునో, దానికి 20 మొదలు 25 రెట్లు పొడవుగల ప్రేగు, పశుకంఠము నుంచి, ముడ్డివరకు వుండునని తెలుపుతున్నారు. పేగులోపల పొర తడిచర్మముతోను, పై పొర కండరముతోను చేయబడియున్నది. ప్రేగులు పాములవలె చుట్టలుచుట్టలుగా ఉంటాయి.

పెద్దప్రేగు

ఇది వలయాకారముగా నుండును. జీర్ణమైన పదార్థములో మిగిలినట్టియు, ఉపయోగమైనట్టియు ఎక్కువ నీటిని యీ ప్రేగు గ్రహిస్తుంది. ఇది లావుగానుండి తడిజిగురు పదార్థముతో కూడుకొని యుంటుంది. ఇది పశువు బయటికి వేయు పేడని సులభముగా త్రోయును. ప్రేగు పొడవు 35 అడుగులు.

చిన్నప్రేగులు

ఇవి పాముచుట్టవలె ఉంటాయి. వీటిలో కూడా పొరలుంటాయి. వీనిలో గ్రంథులుండి, ద్రవము స్రవిస్తుంది. వీని పొడుగు 130 నుంచి 150 అడుగులు. వీని మధ్యకొలత రెండు అంగుళములు.

కార్జము

ఇది పశువు కుడిడొక్కలో తెల్లగా ఉంటుంది. దీనిపైన కఠినమగు పొరక్రమ్ముకొని యుంటుంది. దీనియందు పైత్యరసము తయారవుతుంది. పైత్యరసము ఆకుపచ్చగా ఉండును. విషపదార్థములు పశువు మ్రింగినపుడు కాలేయము అట్టి పదార్థము రక్తములో చేరకుండా చేసి రక్షించుతుంది. విషము విరచును. దీని బరువు 12 పౌన్లు.

పైత్యపుతిత్తి

పైత్యరసము నిలువ చేయు స్థలము. ఇది 5 లేక 6 అంగుళముల పొడవుంటుంది. కార్జములోని పైత్యతిత్తులు రక్తకేశనాళికలలో వానికి కావలసిన పదార్థము తీసుకుని, పైత్యరసము తయారుచేసి యీ తిత్తిలోనికి పంపుతుంది.

ప్లీహము

ఇది కాలేయముకంటె పల్చగా, నునుపుగా ఉంటుంది. గొట్టములు లేని గ్రంథులలో ఇదియే పెద్దది. బిగువగు పొరచే దీని పైభాగము కప్పబడింది.

ఇది డొక్కలో ఎడమభాగమున ఉండి మెత్తగా ఉంటుంది. పశువు మేత మేసిన తర్వాత పెద్దదగును. జీర్ణమైన పిదప చిన్నదగును. దీనిలో నారవంటి పదార్థము వ్యాపించియుండును. గొట్టములోపల గుంజువంటి పదార్థము ఉన్నది. ఇది శరీరము రోగగ్రస్తమైనప్పుడు దేహమునకు ఆపాయము రాకుండా కాపాడుతుంది. దీనిబరువు 2 పౌనులు. 20 అం॥లు పొడవు, 6 అం॥లు వెడల్పు, ఒక అంగుళము మందము.

కీళ్ళు

పశువు యొక్క అస్థిపంజరమంతయు చిన్న చిన్న ఎముకలతో గూర్పబడియున్నందున ఇష్టము వచ్చినట్లు శరీరభాగములు వంగుటకు వీలగుతున్నవి. ఒక ఎముక మరియొక ఎముకతో కలిసియుండు చోటునకు కీలు అని పేరు. ఈ కీళ్ళలో కొన్ని కదలును, మరికొన్ని కదలకయే యుండును. కీళ్ళు సులువుగా చలించునపుడల్ల చమురును స్రవింపజేయునట్టి చమురుతిత్తులు కీళ్ళనడుమవుంటాయి. కొన్ని ఎముకలు స్థిరముగా నుండక చలనమునకు అనుకూలపడతాయి. వీటిని కదిలెడు కీళ్ళు అంటారు. వీటిలోనే జారెడు కీళ్ళు అనునవి యుంటాయి. ఇవి మణికట్టునందును, చీలమండలయందును యుండును. ఇంకను మడతబందుకీళ్ళు వుంటాయి. దవుడకీలు, ముంజేతికీలు, మోకాలు కీలు, వేళ్ళకీళ్ళు చీలమండల కీలు కూడ మడబందు కీళ్ళంటారు.

సంధి బంధనములు

రెండు ఎముకలు కలియుచోట అవి కట్టబడియుండని యెడల వాని స్థానములందుండక అవి జారిపోతాయి. కాబట్టి కీళ్ళుండెడిస్థానములందు ఎముకలను త్రాళ్ళతో కట్టబడియుంటాయి. వీటినే సంధి బంధనములందురు. ఇవి తెలుపుగల నారతో చేయబడి చాలా గట్టిగా వుంటాయి. వాటికి రబ్బరుగా సాగెడు శక్తియుండుట వలన ఎముకలు కదలునపుడు అవి కూడ కదలుచు ఇతర అవయవములకు దెబ్బతగలకుండా కాపాడుతాయి.

టిస్యూలు

పశువు శరీరములోనుండు వివిధ భాగములన్నియు పని చేయుటకు తగినట్లుగా నుండుటకు ఈ టిస్యూలు కూడ కండరములందును, నాడులయందును, ఉపాస్థియందును చర్మమందును యుంటాయి. ఈ టిస్యూలను సూక్ష్మదర్శనీయంత్రములో చూచిన ప్రాణము గల కణములను తెలిసికొనవచ్చును. ఇట్టి కణములు ఒకటి గాని, అనేకము గాని వరసలుగా నుండి దారమువలెనేర్పడుతాయి. వీనికే ఒకవిధమగు నారయందురు. ఇట్టి నారవంటి పోగులు అల్లుకొని కణముల నంటుకొని తగినపని చేస్తుంది. ఇట్టి కణముల సమూహమునకు ఇంగ్లీషులో టిష్యులంటారు.

శరీరములోని జీర్ణరసాలు – చక్కెర పదార్థములు

ఇవి ఆహారములో తక్కువగానున్నచో రక్తవృద్ధి, శ్వాస, జీర్ణశక్తి మున్నగునవి సరిగా పని చేయజాలవు. ఇంకను పిండిపదార్థములుగా మారినవెంటనే రక్తములో ప్రవేశించుచున్నవి. పశువు నెమరువేసిన మేత అరల పొట్టలోజేరి నారవంటి పదార్థముగానై అరలమధ్య జేరియుంటుంది. మృదువైనది నీటిలో కలిపి నాలుగవపొట్టలోనికి జేరుతుంది.

క్షారరసము

పైన చెప్పబడిన నాలుగవ తిత్తిలోనుత్పత్తియగు క్షారరసము యొక్క సహాయము చేత ఉమ్మి నీటివలన జీర్ణింపగా మిగిలిన పిండిపదార్థములు, మాంసకృత్తులును జీర్ణము కాని క్రొవ్వు పదార్థములును నాలుగవ తిత్తిలో నుండి ఈ కోశము చివరయందుండు కంఠద్వారము గుండా మొదటి భాగములోనికి ప్రవేశిస్తాయి.

పైత్యరసము

ఇది కార్జములో పుడుతుంది. కార్జము రక్తము నుండి కొన్ని పదార్థములను తీసికొని వానిని పైత్యరసముగా మార్చుచున్నది. ఈ రసమును కొవ్వుపదార్థములను జీర్ణము చేయుటలో మధురరసమునకు సహాయపడి విరేచనము కూడ చేయించును.

మధురరసము

ఇది పిత్తాశయము నుండి బయలుదేరు పైత్యరసము. మధురవాహిక అనెడి అవయవము చేత ఉత్పత్తి చేయబడిన మధురరసము రెండు గొట్టముల గుండా మొదటి దానిలోనికి జేరి అచ్చటజేరియుండు మాంసకృత్తులు పిండి లవణపదార్థములు రక్తములో జేరుచున్నవి. మిగిలిన పదార్థములు ప్రేగులగుండా జారిపోవుచు అందుండెడి మంచి పదార్థములను రక్తములోనికి తీసికొనిపోవుచు మిగిలిన పదార్థములను విడుచుచుండును.

జీర్ణరసము

ఇది ఆహారకోశములోని జఠరరసగ్రంథుల వలన మారుచు మాంసకృత్తులను కరిగించి గంజివంటి పదార్థముగా మారుతుంది.

ఆంత్రరసము

ప్రేవులయందుండు తడి చర్మమునందు కొన్ని గ్రంథులుండును. ఆ గ్రంథులు ఆంత్ర రసమును ఒక పదార్థమును తయారుజేయును. ఈ పనితో జీర్ణము ముగియును. అన్ని పదార్థములను కరుగజేస్తాయి.

* * *

పదియవ భాగము

పశురోగ విజ్ఞానము

పురాతన భారతీయ పశువిజ్ఞానము

పురాతనకాలమున భారతీయుల వ్యవసాయపద్ధతులు, పశువిజ్ఞానము, పశుగణమునందు వారికున్న భక్తిశ్రద్ధలు పరిశీలించిన నేటి కర్షకులకన్న నాటిప్రజలు ఎంతేని విజ్ఞులై విజ్ఞానులై, ధర్మపరులై యుండినట్లు తెలియుచున్నది. వ్యవసాయాభివృద్ధికి గాను నదులకు ఆనకట్టలు కట్టుటగూడ వారికి తెలిసినటుల తెలియుచున్నది. నూతులు, దిగుడుబావులు, పుష్కరిణులు, పెద్ద చెరువులు త్రవ్వుటయందు ఒకదానికంటె వేరొకటి రెండుమూడేసి రెట్లు పెద్దవిగా నుండునట్లు త్రవ్వాలి. రాష్ట్రమునందు విస్తారము జలముండునటుల ఏ రీతిగానైన నదులకు ఆనకట్టలు కట్టాలి. అంతేగాక నీటిని విడిచిపెట్టుట యంటే ఒక చక్కనికళయని కూడ "శుక్రనీతి" యందు తెలుపబడింది. నీటిపారుదల (ఇరిగేషన్) పద్ధతివంటి పద్ధతులు ఎంతో వివరముగా "శివానందలహరి" తెలుపుచున్నది. ఓ విశ్వేశ్వరుడా! బుద్ధియను యంత్రముచేత, వాక్కను ఘటముచేత, కవితయను పెద్దకాలువలు చిన్న కాలువలచేత తీసికొని రాబడిన సదాశివుని దివ్యామృతముచే హృదయములను దమ్మునేలలలో పూడ్చబడిన భక్తియను వరి పండింపబడుతున్నది. కనుక సేవకుడగు నాకు దుర్భిక్ష నుండి భీతి పోయినదని భావము. ఇందువలన వ్యవసాయ పద్ధతులందు మన పూర్వీకుల అనుభవము తెలియుచున్నది.

పదియవ శతాబ్దమువాడైన ఆంధ్రరాజు కలికాలచోళుడు కావేరినదికి ఆనకట్టను కట్టించినటుల తిక్కనసోమయాజి తన నిర్వచనోత్తర రామాయణమునందు చక్కగా వర్ణించెను. ఇంకను మానవులకు, పశువులకు సంబంధించిన విషయాలెన్నో ఆయుర్వేదములో చెప్పబడ్డాయి. ఆయుర్వేదములో పశువైద్య విషయాలు, జంతువుల అస్థిపంజరము, దాని లక్షణాలు, రోగాలు, చికిత్సలు ఎన్నో తెలుపబడ్డాయి. ఆర్యులు మన దేశమునకు వచ్చిన తరువాత పశుశస్త్ర చికిత్స విరివిగా చేసినట్లు తెలియుచున్నది. యుద్ధాలలో గుఱ్ఱాలకు, ఏనుగులకు, పశువులకు, సైనికులకు అస్త్రశస్త్రముల వలన కలిగిన గాయాలకు కట్లు, కుట్లు, చికిత్సలు చేసినట్లు గ్రంథాలద్వారా తెలియుచున్నది. ఋగ్వేద యజుర్వేదములు వారి వారి పశువులకు సీసము, సూదంటురాయి, రక్షరేకులు, తాయత్తులు, మంత్రాలు, యంత్రాలు రోగనివారణ కొరకు ఉపయోగింపబడేవని తెలుపుచున్నవి. ఆ కాలములోకూడ తిప్పతీగె, వజ్రవల్లి, బోడతరము, చిత్రమూలము, తెలికపిండి గాడిదగడప మున్నగు ఓషధులను పశువుల కాపరులు ఉపయోగించేవారట. అధర్వణవేదములో క్రిమిరోగాలను గూర్చి సవిస్తరంగా తెలుపబడింది. కండ్లు, ముక్కులు, దంతాలు, ప్రేగులు మున్నగువాటిలో క్రిములుచేరి వింతరోగాలు పుట్టిస్తాయని, జంతువులకు మామూలుగా సోకు కటురక్ష, విశ్వరూప, సంగమార్జన, మశూచి మొదలగు క్రిములు మూత్రకోశములో వుంటాయని, వీటికి తగిన చికిత్స చేయకపోతే పలువిధరోగాలు కలుగుతాయని తెలుపబడింది. ఇంతేగాక గోమారులు, జోరీగలు, దోమలు, ఈగలు

లేకుండ పశువుల శాలలలో ధూపాలువేయుట, పశువులకు కలిగే బెణుకులు, వాపులు మున్నగు వాటికి ఎన్నిరకాల చికిత్సలో పూర్వగ్రంథాలలో తెలుపబడ్డాయి.

13వ శతాబ్దములో హంసదేవుడు (జైనమతస్థుడు) మృగపక్షి శాస్త్రమను గ్రంథమును జినపురపాలకు డగు సేదదేవుని ఆజ్ఞానుసారంగా ప్రకటించెనట. 8వ శతాబ్దంలో సింధురాష్ట్రమును ఆర్యులు జయించినపుడు హిందూవైద్య పశువిజ్ఞానము మనదేశములోనేగాక తదితర దేశాలలో కూడా వ్యాపించెనట.

ప్రాచీన రోగవిజ్ఞాన సూత్రాలు

మంచి కులమునందు పుట్టి స్వచ్ఛమగు శాస్త్రజ్ఞానము, అన్ని కర్మలయందు అనుభవజ్ఞానము, సమర్థ, శుచిత్వము, హస్తవాసి, అన్ని పరికరములను సంపాదించినవారు, అన్ని ఇంద్రియములతో నున్నవారు, ప్రకృతుల నెరింగినవారు, వెంటనే ప్రతిక్రియ చేయగలవారు రోగముల నశింపజేసి ప్రాణముల నిచ్చువారుగా నుంటారు.

పై లక్షణములకు విపరీతమగు లక్షణములు కలవారు రోగములను వృద్ధిచేయుచు ప్రాణములను హరింపజేస్తారు. అట్టివారు లోకమును వంచించుటకు వైద్యవేషమును ధరించి రాక్షసభూతులై ద్రోహమును కలిగించుచు ధర్మమును విడచి రాజులయొక్క అజాగ్రత్తవలన దేశములందు తిరుగుతూవుంటారు.

పిట్టలను పట్టువారు అడవియందు వలవేసి పిట్టలకొరకెట్లు నిరీక్షించుచుందురో అటులనే వైద్యవేషమును ధరించినవారు రోగుల నిమిత్తము నిరీక్షిస్తుంటారు.

శాస్త్రము, కర్మదర్శనము చికిత్స, కాలము పరిమాణము వీని సంబంధమగు జ్ఞానము లేనివారు మృత్యువునకు అనుచరులై లోకమున తిరుగుతుంటారు. కాబట్టి వీరిని విడిచిపెట్టాలి.

జీవనము నిమిత్తము వైద్యవేషముతో కూడినవారు మిక్కిలి మూర్ఖులనగు వైద్యులు వాయుభక్షణము చేసిన సర్పములతో సమానముగ నుందురుగాన అట్టివారిని విడిచిపెట్టాలి.

అంధుడు దృష్టి లేకపోవుటవలన చేతులతో తడుముచు భయపడుచు ఏరీతిగా తిరుగుచుండునో, వాన గాలిచే కొట్టబడినపుడు ఏ రీతిగా సంచరించునో ఆ రీతిగనే తెలియని వైద్యుడుగూడ సంచరిస్తాడు.

సమస్త భూతములయందు మైత్రి కలిగియుండుట, బాధపడుచున్నవారియందు కరుణగలిగియుండుట, శక్యమైన వ్యాధిని చికిత్సించుటకు ప్రయత్నించుట, మరణమునొందుటకు సిద్ధముగనున్న దానిని చికిత్స చేయక, నుపేక్షించుట అని వైద్యవృత్తి నాలుగువిధములుగా నుంటుంది.

శాస్త్రము నభ్యసించుట, అర్థము తెలుసుకొనుట, లక్షణములను తెలిసికొనుట, కర్మలను చూచుట స్వయముగా నాచరించుట ఈ నాలుగింటితో కూడిన వైద్యుడు ప్రాణభాస్కరుడని (పోవుచున్న ప్రాణములను నిలుపునని) చెప్పబడుతాడు.

రోగి మొదలుకొని ఎల్లరకు ధనము యొక్క అవుసరము గలదు. ధనము పెట్టి కొననిదే ఔషధము దొరకదు. అందువలన ధనముకూడ చికిత్సాంగమవుతోంది.

వ్యాధిపుట్టిన వెంటనే చికిత్స చేయాలి. వ్యాధి అతిస్వల్పముగా నున్నదని అశ్రద్ధచేయరాదు. స్వల్పముగానున్నప్పటికి అగ్ని, శత్రు, విషములతో సమానమైనదగుటచేత వికృతిని కలుగజేస్తుంది. కనుక వ్యాధి పుట్టిన వెంటనే చికిత్స చేయాలి.

వైద్యుడు ముందుగా రోగపశువును పరీక్షించాలి. తరువాత ఆ రోగమునకు తగిన ఔషధమును విచారించాలి. ఇట్లు విచారించిన తరువాత మంచిరోగజ్ఞానము గలవాడై ఏయే రోగములకెట్టి చికిత్సాపద్ధతుల నవలంభించవలెనో, ఎట్టి ఔషధము నీయవలెనో బాగుగా విచారించి చికిత్స చేయాలి.

ఎవడు రోగము యొక్క నిదానము తెలియక చికిత్స ప్రారంభించునో, ఔషధోపవిధానము తెలిసినవాడైనప్పటికి అతనికి చికిత్సయందు అయితే ఆగుటయో, లేనిచో లేకపోవుటయో కలుగుతుంది.

మరియు ఎవడు ఔషధమును చేయుట మాత్రమే తెలిసికొని, వ్యాధిని తెలిసికొనక వైద్యము చేయునో అట్టివాడు రాజుచే వధింపబడుట కర్హుడవుతాడు.

ఎవడు రోగాలలో విశేషజ్ఞానము గలవాడో, సమస్తమైన ఔషధోపయోగములు తెలిసినవాడో, దేశము యొక్క, కాలము యొక్క విభాగముల నెరిగినవాడో అట్టివాడు చేయు చికిత్స సంపూర్తిగా సిద్ధిస్తుంది.

వైద్యుడు రోగములను మొదటినుంచి చివరివరకు తెలిసికొనుటకు ప్రయత్నించాలి. అటుతరువాత ఔషధోపయోగ విధానము తెలిసికొని చికిత్స చేయాలి. రోగము యొక్క పేరు తెలిసికొనవలెనని హెచ్చుకాలముంచరాదు.

అసాధ్యములైన వ్యాధులకు ఏ వైద్యులు చికిత్స చేస్తారో వారే వైద్యశ్రేష్ఠులు. అందువలన వైద్యులు వ్యాధులయొక్క సాధ్యాసాధ్యత్వములను అతికష్టముగ పరిశ్రమ చేసి తెలిసికోవాలి.

పూర్వకాలమున గోసాయిలు ఆకు అలములు తినుచు విరాగులై సంచరించేవారు. వారు సాధారణముగ తమ సహజ వృత్తులతో జీవించుతూ వైద్యము చేయుట ఒక గౌరవముగ నెంచుచుండేవారు. వారికి వైద్యశాస్త్రాభ్యాసము ప్రధానవృత్తి కాకపోవుట చేత దానియందు వారికి అభిరుచి తరతరముల నుండి తగ్గుచూ వచ్చింది.

తెలియని పశువైద్యులనేకులున్నారు గాని వీరు మోటువైద్య మెక్కువగా చేస్తారు. మనదేశములో నచ్చటచ్చట మిక్కిలి అనుభవము గల పశువైద్యులున్నారు గాని వారు తదితరులకు మాత్రము చెప్పరు. ఏ పశువుకైన వ్యాధి సంభవించినప్పుడు తాము స్వయముగా యెవరికి తెలియకుండ ఏ యాకుపసరునో తెచ్చి పోస్తారు. ఈరీతిగా తనగుట్టును బయటపెట్టక వైద్యమును వృద్ధిలోనికి రాకుండ నాశనము చేస్తున్నారు. మనకు అనుభవ పశువైద్యశాస్త్రము సరియైనది లేకపోవుట వలననే సరియగు చికిత్సలు దొరకుటలేదు.

నాకు ఇరువది అయిదు సంవత్సరముల నుంచి ఈ వైద్యములో ప్రవేశముంది. ఈ వైద్యపరిశోధన కొరకు కొన్ని వేల రూపాయలు ఖర్చుపెట్టి, ఎన్నో గ్రంథములు పరిశోధించి తంటాలు పడుచున్నప్పటికిని ఇంకా చాల అనుభవము కావలెనేమోయని అప్పుడప్పుడు సందేహపడుట తటస్థించుచున్నది. కాబట్టి శాస్త్రజ్ఞానము కలిగి అనుభవముతో చికిత్సలు చేయువాడే వైద్యుడనిపించుకోగలడు.

రైతులు తమ పశువులకు జబ్బు రాగానే వెంటనే పోవాలని గ్రామములోనున్న పూర్వవైద్యులను రప్పిస్తారు. కాని ఈ వైద్యులలో కొంతమంది అతిగర్వముగా నుంటారు. వారి యింటిచుట్టు తిరిగినప్పటికి ఒక్కొక్క సమయములో రమ్మన్నా రారు. అప్పుడు రైతులు నిరుత్సాహము జెందుతారు. ఒకవేళ ఆ వైద్యుడు వచ్చినను అమితబెట్టుగా నుండి తానే గొప్ప సహాదేవుడన్నట్లు నటిస్తాడు. ఇట్టివారితో వైద్యము చేయించరాదు.

ఏ వైద్యునితో మీ పశువులకు చికిత్స చేయించుదురో అతనితోనే చికిత్స ఆఖరువరకు చేయించాలి గాని మరొకరితో చేయించరాదు. ఇట్లు చేయించుట వలన ఉభయభ్రష్టత్వము గలుగుతుందని నమ్మాలి.

పశువునకేరోగమైన సోకినయెడల ఆ రోగమునకు నిదానముగా, జాగ్రత్తగా పరిశీలించి చికిత్స చేయాలి. పశువులు నోరులేని జంతువులు గాన బాగుగా వానిని పరీక్షించి తగిన సదుపాయములు చేయాలి. కొందరు వైద్యులు దొమ్మకు కురమయని, కురమకు దొమ్మయని చెప్పి చేతగాని చికిత్సలు చేస్తారు. కాబట్టి భూతదయాపరులగు పశువైద్యులు తగినంత శాస్త్రజ్ఞానము గలిగి చాల అనుభవముతో చికిత్స చేయాలి. వైద్యమంతా తనకే తెలియునను గర్వముతో తెలిసి తెలియని మందుల పోసి చంపరాదు. అట్లు చంపిన తనకేగాక తన కుటుంబమునకు కూడ మహాపాతకము చుట్టుకొంటుందని గ్రహించాలి.

మన దేశములో కాలపరిస్థితుల ననుసరించి రోగములుగూడ పలు విధములుగా మారుచున్నవనుటలో నతిశయోక్తి లేదు. నేను ఎంతోమంది విద్యార్థులకు నేర్పితిని. ఎన్నో పశువులకు చికిత్సలు చేసితిని గాని నిరంతరము వైద్యములో మార్పులు చెందుతూనేయున్నవి. మనము చేయుచున్న పశువైద్య పద్ధతి మరియొక నూతనరూపముగా కొన్నాళ్లకు రావచ్చును.

ఆయుర్వేదౌషధములలో మిక్కిలి పరమోత్కృష్టమగు వస్తువులనేకములున్నవి. మిక్కిలి ప్రయోజనకరమగు వస్తువులు హిమాలయ ప్రాంతములందు దొరకుతాయి. పూర్వము నుండియు ఆయుర్వేదౌషధములే మిక్కిలి ప్రసిద్ధిగాంచినవి. కాని వాటి మహిమ గ్రహించి ఆచరణయందు పెట్టు పశువైద్యులు చాలా తక్కువగా వున్నారు.

ఎటువంటి బీదరైతైనను తన పశువున కేదైన రోగము సంభవించినపుడు కొంత పైకము తీసికొనివెళ్ళి వస్తువులను తీసికొని రావలసిన గతిపట్టింది. పూర్వ మెచ్చటజూచినను వనమూలికలు దొరికేవి. ఏ వ్యాధి కేచికిత్స చేయవలెనో ఆ వస్తువులను సంపాదించి చికిత్సలు చేసేవారు. ఆకుపసరులలో గూడ ఆంగ్లేయ ఔషధములకంటె మంచిగుణములున్నాయి. మనదేశములో వుత్పత్తియగు నేలవేము, శొంఠి, విషముష్టి

వగైరా ఓషధులను విదేశములకు తీసికొని వెళ్ళి ఆల్కహాలులో కలిపి శుద్ధిచేసి టపాలలో పంపుటవలన చూపులకు అందముగా నుండుటచేత ఆ మందుల గిరాకి చెప్పనక్కరలేదు. ఆంగ్లేయ పశువైద్యులను ఆయుర్వేద సలహాలనడిగిన మాకంతగా తెలియవంటారు. కాబట్టి ప్రతి వైద్యుడు ఆంగ్లాయుర్వేదౌషధముల గుణములు రెండింటిని తప్పక గ్రహించాలి.

రోగనిదానము


రోగనిర్ణయమునకిదియొక ముఖ్యసాధనము. ముఖ్యముగా రోగపశువు ప్రస్తుతము అనుభవించుచున్న బాధలు, రాత్రింబవళ్ళు ఏవేళల యందు బాధ అధికమగునో, రోగపశువునకు చలనము వలన గాని, ఉష్ణశీతలముల కారణముల వలనగాని, మరియేయితర కారణముల వలన గాని అధికమగుట, ఉపశమనము కలుగుచుండునో ముఖ్యముగా కనుగొనవలసిన అంశములైయున్నాయి. ఇదివరలో పొందిన బాధలును, అస్వస్థత యెంత కాలమునుంచి యున్నదియు, ప్రారంభములో నేవిధముగా గలిగి, ఏరీతిగా అప్పటికి మారియున్నది, సవిస్తరముగా దెలసికోవాలి.

పశువును పరీక్షించిన వెంటనే వైద్యుడు పశువు యొక్క యజమానుని గాని, పశువులకాపరిని గాని ఆ రోగకారణములను గూర్చి తెలుసుకోవాలి. ఒక్కొక్కప్పుడు కొన్ని కొన్ని విషయములలో కొందరికి అనుభవము లేకపోవుటచేత సరియగు చరిత్ర కూడ తెలిసికొనుట దుర్లభము. అంతేగాక పశువుల కాపరి అజాగ్రత్త వలన పశువులకు వ్యాధి కలుగుతుంది. కాబట్టి ఆ కాపరిచెప్పు అన్ని విషయాలను పూర్తిగా నమ్మక వానిని బాగా నొక్కించి అడగాలి. తుదకు అతనిని భయపెట్టియైనను నిజమైన కారణములను తెలుసుకోవాలి.

ఉష్ణమును పరీక్షించుట

పశువు యొక్క శీతోష్ణపరిమాణం కనుగొనవలెనన్న థర్మామీటరును దానియొక్క మలాశయములో పెట్టి ఆ థర్మామీటరు యొక్క మంచిచెడ్డలను అరనిమిషము నుండి మూడు నిమిషముల వరకు వుంచినయెడల జ్వరమెంతయున్నది తెలుస్తుంది. థర్మామీటరు యొక్క పాదరసముండు చోటు (గుబ్బ) పశువు యొక్క పేగులకు సంబంధించిన పొరలనంటుకొను వరకు జాగ్రత్తగా వెళ్ళునటుల తోయాలి. అంతవరకు పోనీయని యెడల సీతోష్ణపరిమాణము తెలియదు.

ఆ థర్మామీటరుపైన కచ్చితమైన కొలతలును వీలగునట్లు అంకెల వరుస 98 నుంచి 110 వరకు విస్తరించి పది భాగములుగా విభజింపబడియుంటుంది. ప్రతి రైతు దగ్గర థర్మామీటరుండుటవసరము. రోగపశువు యొక్క శరీరోష్ణమును థర్మామీటరుతో దినమునకు రెండు మూడు పర్యాయములు కొలవాలి. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంకాలము 5 గంటల నుంచి 7½ గంటలవరకు కొలుచుట మంచిది. అవుసరమును బట్టి మధ్యకాలములో కూడ కొలవచ్చును. చెవి దగ్గరగాని, ఎదరాలలో



గాని, ఆసనములో గాని, కాలికి గంగడోలునకు మధ్యగాని జ్వరము యొక్క పాదరసభాగమును 4 లేక 5 నిమిషములుంచి కొలవాలి. ఆసనములోకంటె తదితర భాగములందు పెట్టి చూచినపుడు ఉష్ణము ఒక డిగ్రీ తక్కువగా వుంటుంది. కనుక తదితర భాగములందు పెట్టిచూచినపు డొకడిగ్రీ అదనముగా కలుపుకొని లెక్కచూడాలి. జ్వరము కొలుచునపుడు రెండు మూడు నిమిషములుంచి చూడాలి.

ఆరోగ్యస్థితిలో పశువు శరీరము యొక్క వేడిమి 102 డిగ్రీలుంటుంది. అంతకు అధికముగనున్నను, తక్కువగనున్నను అనారోగ్యమని తెలుసుకోవాలి. పశువునకు సామాన్య జ్వరమున్నచో సామాన్య ఉష్ణము 100 డిగ్రీలకు పైగా పాదరసము ప్రవహిస్తుంది. సామాన్య గుర్తునకు అనగా 101 డిగ్రీలకు తక్కువగా పాదరసము దిగినయెడల పశువు నిస్త్రాణస్థితిలోను, వాతములో వున్నదనియు తెలిసికోవాలి.

107, 108 పైనయున్నచో దారుణమైన వేడియని గ్రహించాలి. 104 నుంచి 105 వరకు దీర్ఘకాలము నిలబడియున్నచో ప్రమాదము రానైయున్నదనియు, 102 నుంచి 104 వరకున్న సామాన్య జ్వరమనియు భావించాలి. 95 డిగ్రీలవరకున్న అధిక అపాయమని అంత్యదశయని తెలిసికోవాలి. పశువు యొక్క ఉష్ణము కొలిచిన తరువాత థర్మామీటరు క్రిందివైపునకు జాడించి దానిలోని పాదరసమును సామాన్యపు గుర్తుకంటె క్రిందికిదింపి వేడినీటితోగాని, తదితర ద్రావకములలో గాని కడగాలి.

నాడి, శ్వాస, ఉష్ణము, తెలుపు పట్టిక

జంతువు	నాడి నిమిషమునకు	శ్వాస	టెంపరేచరు
గుఱ్ఱము	... 35-45	... 10-12	... 100-102
ఎద్దు	... 50-60	... 12-16	... 101-101½

దున్న	... 45-50	... 20-25	... 100-101
గొఱ్ఱె	... 70-80	... 30-40	... 102-104
మేక	... 60-70	... 25-30	... 101-103
కుక్క	... 70-95	... 15-25	... 101-105
దూడ	... 65 వరకు	... 12-16	... 102-104
కోడి	... 65 వరకు	... 8-12	... 102-103

ఆరోగ్య లక్షణాలు

పశువులు సుఖస్థితియందుండునపుడు గుంపులో కలిసి మెలసి తిరుగునపుడు మేతమేయుచు కాలమెరిగి నెమరువేస్తాయి. చెవులు మాటిమాటికి ఆడించుచు నిక్కబొడుచుచు ఆనందముతో వుంటాయి. ముక్కుమూతి కాంతిగనుండి చెమ్మగలిగియుంటాయి. కన్నులు నిర్మలముగ కాంతిగవుంటాయి. చర్మము మృదువుగా నుండి వెంట్రుకలు చర్మము మీద వ్రాలియుంటుంది. పశువు ఒకదాని నొకటి నాకికొంటాయి. మూత్రము ధారాళముగా నొప్పిలేకుండపోస్తుంది. యజమానియందు ఉత్సాహముగా నున్నానని ఒక విధమగు ప్రేమదృష్టిని చూపిస్తుంది. ఏ అవయవము నందును వాపుగాని, కుంటుగాని లేకుండావుంటుంది. పశువునకు ఆకలి కలుగుట, సరిగా పీల్చుట, బాగుగా పేడవేయుట మొదలగునవి సక్రమముగా జరుగుచున్న యెడల ఆరోగ్యముగానున్నదని గ్రహించాలి.

అనారోగ్య లక్షణాలు

కొమ్ములు వెచ్చగా మూతిని చెమ్మలేక, మూత్రము వసువు రంగువలె కొంచెము కొంచెము పోయుచు పేడగట్టిగా వేసి, మేతమాని మిక్కిలి దాహముగొని, మందవిడిచి దూరముగాపోయి నల్లకప్పు వేసి యుండినయెడల అనారోగ్యముగా నున్నదని గ్రహించాలి. ఇంకను శరీరము వెచ్చగ, పొడిగానుండుట, ఆకలి మందగించుట, మలబద్ధకము, నిస్సత్తువ మొదలగు లక్షణములు కూడ కలిగియుంటాయి.

ముఖపరీక్ష

ముఖలక్షణాలనుబట్టి శరీరమందలి రుగ్మతలను దెలిసికొనవచ్చు. శ్వాససంబంధమగు వ్యాధులయందు ముఖము ముడుచుకొని ఆందోళనలను జేస్తుంది.

రక్తసంబంధమగు రోగములందు పెదవులు, ముఖము, వెలవెలబారుతాయి.

వాతసంబంధమగు రోగములందు ముఖము కాంతిహీనముగా నునిడి మంచిలక్షణములే కలిగియుండి శరీరము మెరుపుగా వుంటుంది.

మూత్రసంబంధమగు రోగములందు ముఖము కాంతిహీనముగా వుంటుంది.

మెదడు సంబంధమగు రోగములందు భయంకర రూపముగానుండి నేత్రములలో దోషముంటుంది.

నేత్రపరీక్ష

పశువు నేత్రములు ఎరుపురంగుగా నుండి పుసులు కట్టుచుండిన యెడల కాకరోగమనియు, నేత్రములు పసుపురంగుగనున్న కామిల రోగమనియు కన్నులు వాచి నీరుకారుచున్న వాతరోగమనియు గ్రహించాలి.

నాలుక పరీక్ష

పశువు రోగనిదానమందు నాలుక పరీక్షయవసరము. పశువు నాలుకను లాగి బాగా చాపునట్లు చేయాలి. మంచి వెలుతురునకు తీసికొనివచ్చి వైద్యుడు ఎదురుగా నిలబడి నాలుక పైభాగమంతయును జాగ్రత్తగా పరీక్షించాలి. సామాన్యముగా పశువులలో కొన్ని నోరు తెరవనీయక నానాచిక్కులు పెట్టుతాయి. అట్టి సమయాలలో జాగ్రత్తగా కట్టివేసి బలవంతముగా లాగి పరీక్షించాలి. నాలుకయొక్క ఆకారము, సైజు, ప్రక్కభాగములు ఎట్లున్నది తెలిసికొనవలెను. నాలుక మందముగానున్నదో, పలుచగానున్నదో, వ్రేలాడుచున్నదో కనుగొనాలి. నాలుకయొక్క పైభాగము మెత్తగా, కాంతిగానున్నదా? లేక ఎండియున్నదా? పాచిపట్టి వాసన వేయుచున్నదా? రంగు ఏరీతిగానున్నది పరీక్షించాలి. దీనినిబట్టి ముఖపరీక్ష, దంతపరీక్ష చేయాలి.

రక్తసంబంధమగు రోగాలలో నాలుక ఎరుపురంగుగా నుండి పలుచబారి బాధగా వుంటుంది. వాతరోగాలలో నాలుక మొద్దుగా తెలుపుగా ఒకవిధమగు వాసనగా వుంటుంది. ఇట్టిసమయములలో దంతముల చుట్టూ పాచియుంటుంది. అంగిటి ముండ్లు పెరుగుతాయి. జీర్ణరోగములందు నాలుకపాచి తెలుపుగా, కొంచెము వాసనగా, మెత్తగా వుంటుంది. మలబద్ధకముగానున్నపుడు నాలుకమీద పాచికట్టుతుంది.

మలపరీక్ష

పశువు శరీరములో ఆహారము జీర్ణమునొంది సారరూపముగా, కిట్టరూపముగా ప్రేగులలో నున్నపుడు సారభాగము రసాయనములు మున్నగు నాళములద్వారా హృదయమునకు తీసికొని పోబడుతాయి. మిగిలిన కిట్టభాగము ద్రవ్యశూన్యమై గట్టిపడి పేడరూపముగా బయటకు వస్తుంది. ఇట్లు సక్రమముగా రాకపోయిన పశువు పలువిధ రోగముల పాలవుతుంది.

ప్రతిదినము ఎన్నిసార్లు పశువు పేడ వేయుచున్నది, పేడరంగు, వాసన ఎట్లున్నది కనుగొనాలి. పేడ చల్లగా, దుర్గంధముగా, జిగటగానున్న వాతరోగమనియు గట్టిగా, వేడిగా, మెరుపుగా వంటలు వంటలుగా నున్న కాకరోగమనియు, మిక్కిలి పలుచగా, తోకకు గూడ పేడనంటుకొని కొంచెము దుర్వాసనగా నున్న జలుపు రోగమనియు గ్రహించాలి.

మూత్రపరీక్ష

సామాన్య మూత్రస్వభావము లేక ఎరుపురంగు గాని నీలిరంగు గాని, ఒక్కొక్కపుడు ముదురు ఎరుపు రంగుగా గాని యుంటుంది. నలుపురంగుగానున్నచో వ్యాధి ఎక్కువగానున్నదనియు, పలుచగా నుండి కొంచెము తెలుపుగాను వాతరోగమనియు, పసుపుపచ్చగానుండి ఎక్కువ వేడిగానున్న జ్వరమున్నదనియు, మాంసము కడిగిన నీరువలెనున్న మూత్రము వెంటరక్తము పోవుచున్నదనియు గ్రహించాలి. మూత్రము పోయునపుడు భూమిమీద నురుగు బాగుగా కట్టుతుంది. ఏ వ్యాధియులేని పశువు మూత్రము తెలుపురంగుగా నుండి అంత వేడియుండదని గ్రహించాలి.

* * *

పదునొకండవ భాగము

భేషజకల్పము


ఔషధాలు త్రాగించే విధానాలు

ఔషధములు త్రాగించునపుడు పశువు యొక్క తలను ఎత్తి పట్టుకొని నోరుతెరచి ఒక్కొక్క గొట్టమువంతున గాని అరగొట్టము వంతున గాని త్రాగించాలి. మందులు పోయునపుడు జాగ్రత్తగా పశువు నోరుతెరచి నాలుక నొక్కిపెట్టియుక్తిగా పోయాలి. పశువు యొక్క తలను, మందుపోయుటకు వీలుగా నుండునట్లు ఎత్తిపట్టి పశువు అటునిటు తూలకుండునట్లు చూచి మందుత్రాగించాలి. కొన్ని పశువులు అల్లరి చేయుచు, అరుచుచు క్రిందపడుతాయి. అట్లు పడుటవలన పశువునకు అపాయము కలుగుటయేగాక ఆహారనాళమునకు దవుడలకు దెబ్బలు తగులుతాయి. దగ్గునట్లు పశువు కనబడునేని పట్టువిడచి దగ్గనిచ్చిన తరువాత మందునోటిలో పోయాలి. వ్యాధిగల పశువునకు ఒకేసారి ఆహారమంతయు పెట్టరాదు. కొంచెము కొంచెముగా పెట్టాలి. ద్రవరూపములోనున్న మందు సీసాలను చేతితో కుదిపి త్రాగించాలి. పాత్ర అడుగుభాగమున మడ్డియున్నచో వానిలో కొంచెము నీరుపోసి త్రాగించవచ్చును. దీర్ఘవ్యాధులకు తప్ప ఆకస్మికగా వ్యాధులకు ఎక్కువగా మందులను వాడరాదు. అట్లువాడిన యెడల పశువునకు ప్రాణాపాయము కలుగుతుంది. పశువు మిక్కిలి బలహీనముగానున్న యెడల ఆహారము తినుటకు దానిని లేవదీయరాదు. అది లేవలేదను ఉద్దేశ్యముతో శరీరముపై దెబ్బలుకొట్టరాదు. త్రాళ్ళతో నటునిటు లాగరాదు. బలవంతముగా నటునిటు త్రోయరాదు. పరుండనిచ్చియే నెమ్మదిగా ఆహారము పెట్టాలి. అన్ని వ్యాధులయందును ముఖ్యముగా తీవ్రదశయందున్నపుడు కఠిన పదార్థములను మాత్రము వాడరాదు.

ఇంతియేగాకుండ మందులు శరీరములోనికి పోయి త్వరగా జీర్ణము కావలెననిన ద్రవరూపమగు మందులను పోయాలి. మందు వృధాపోకుండునట్లు చేయుటకు నెమ్మది నెమ్మదిగా కొంచెము కొంచెముగా వెదురు గొట్టాలతో పట్టాలి.

వయస్సును బట్టి మోతాదులు

కొందరు వైద్యులు మందులను సుమారుగా తూచకుండగానే వాడుతారు. ఇది చాల పొరపాటు. మోతాదు ఎక్కువపడవచ్చు లేక తక్కువపడవచ్చు. కాబట్టి తగు జాగ్రత్త వహించి సరిగా తూచి మోతాదులను వాడుటమంచిది. పెద్ద పశువులకంటె చిన్నపశువుల విషయమై చాల జాగ్రత్త వహించి సరిగా తూచి మోతాదులను వాడుటమంచిది. పెద్ద పసువులకంటె చిన్నపశువుల విషయమై చాల జాగ్రత్తగా వాడాలి. విషపు మందులను మాత్రము అది జాగ్రత్తగా వాడాలి. బలము గల పశువులకు మోతాదు నెక్కువ-నీయుటవసరము.




మనుష్యులకు వాడు మోతాదులకంటె పశువులకిచ్చునవి ఎక్కువ మనము నోటిద్వారా పోసినమందు ఒక మార్గము నుంచి మరియొక మార్గమునకు పోవుచు చాల ఆలస్యముగా నాల్గవపొట్టలోనికి చేరుతుంది. కాబట్టి ఆ విధముగా వాడబడు మందులు చాల ఆలస్యముగా పని చేయును. అదియుగాక ఈ మందు నాలుగవతిత్తి లోనికిపోయి పని చేయునప్పటికి ఆ ప్రాంతములందుండు జీర్ణముకాని పదార్థమంతయు ఆ మందు చేయబోవు పనిని అడ్డగించుతుంది. అందుచేతగూడ నోటిద్వారా వాడినమందులు వ్యాధిని చాల ఆలస్యముగా శాంతింపజేస్తాయి.

పశువులయందు మానవులకంటె చురుకుదనము తక్కువగనుండునుగాన పెద్ద పెద్ద మోతాదులుగా విరేచనముల మందుల నీయాలి. అట్లు యిచ్చినయెడల అవి మందమతిగా నుండుటచేత భరించుకొన కలుగుతాయి. మోతాదుల హెచ్చుతగ్గులనుబట్టి మందులు పని చేయును. భేది ఉప్పు కొంచెము కొంచెముగా యిచ్చినయెడల విరేచనము సరిగా కాదు. ఈయవలసిన మోతాదుకంటె తక్కువ యిచ్చిన యెడల వాటివలన నేమియు ఫలితము కనబడదు. అప్పుడు వైద్యుడు గ్రహించి మరల మందుయిచ్చునపుడైనను తగిన మోతాదు నిచ్చునెడల ఫలితము కలుగుతుంది.

ఔషధాలను కలిపే విధానాలు

ఔషధాలను ఉపయోగించునపుడు జాగ్రత్తగా పరిశీలించి సరియైన మోతాదు తీసుకొని కలిపి పశువునకీయాలి. లేనియెడల నష్టము హానియు కలుగుతుంది. రోగనిర్ణయము స్పష్టముగా గ్రహించిన తరువాత ఆ చికిత్స చేయవలసిన విధానము బాగా అర్థమైనయెడల ఎక్కువ మందులను కలుపవలసిన అవసరముండదు. ఒక్కొక్కపుడు వైద్యుడు తాను అనేక మందులను కలిపి యిచ్చినచో వ్యాధి కుదురునని తలంచి అట్లు కలిపియిస్తాడు. కాని దానివలన లాభము కలుగకపోవుటయేగాక నష్టము కలుగుటయో హాని కలుగుటయో సంభవిస్తుంది. కాన మందులను ఇచ్చుటయందు అనుభవముండి మందులను కలుపుటకు కొంతవరకైనను జ్ఞానము కలిగియుండాలి.



ఘనపదార్థాలను వాడుట

మందులను ఉపయోగించు విషయములలో బాగా తెలిసికొని అనుభవము కూడ కొంతవరకు సంపాదించియుండాలి. ద్రవపదార్థములు గాక ఘనపదార్థములు వాడునపుడు మాత్రలరూపముగా వాడుటమంచిది. ఆరంభములో మందు వాడుటకు పూర్వము పశువు లోపలి భాగముననున్న ఎక్కువ పదార్థమంతయు వెడలగొట్టి తరువాత మందును వాడాలి.

ఔషధాలను చేయుట

వ్యాధికి తగినమందును తయారుచేసి అవసరమగు నెడల కొన్ని వనమూలికలను దానితో కలిపి ఒకే మందుగా చేయడానికి ఔషధము అని పేరు. ఇది అనుభవము మీదనే చేయాలి. వైద్యుడు మందులను చేయుటలో కూడా జాగ్రత్త వహించి యుండవలెను గాని మీదుమిక్కిలి వాటి నుపయోగించునపుడు అతిజాగ్రత్తతోనుండాలి ఔషధములు చేయుటలో పూర్వపద్ధతికి ఇప్పటిపద్ధతికి చాల వ్యత్యాసముంది. పూర్వమువలె యేమూలికల నుండియో లేక యేఇతర పదార్థముల నుండియో మనము స్వయముగా మందును తయారు చేసికొన నవసరము లేదు. రసాయన శాస్త్రజ్ఞులే మనకు మందులలో నుండు మురికిని తీసివేసి వాటిని సరియగు స్థితికి తెచ్చి పెట్టుచున్నారు. కాని పశువైద్యులు అవసరమునకు ముందు ఒక్కసారిగా మందులను తయారు చేసికోవచ్చును. అట్లు చేసినయెడల ఆకస్మికముగా వచ్చు వ్యాధులకు కాలయాపన చేయక త్వరత్వరగా చేయుటకు వీలుగనుండును. ఆకుపసరులను ఒక పూటకంటె నిలువయుంచరాదు. అట్లుంచిన యెడల పశువులకు మరియొక క్రొత్తవ్యాధి కలుగవచ్చును. నూతనముగా తెనాలి సహదేవ పశువైద్య ఫార్మశీవారు ఔషధములను తయారు చేస్తున్నారు. మద్రాసు గవర్నమెంటు వారు కూడ గ్రామపంచాయితీలకు రికగ్నయిజు చేశారు.

లేపనములు

ఔషధములను కలిపి వ్యాధిగల ప్రదేశములందు ఉపయోగించు దానికి లేపనము అందురు. కొన్ని మందులను ఆముదముతో కాని, వ్యాసులైనుతో కాని, వెన్నతో కాని కలిపి పశువుయొక్క అస్వస్థ భాగమునకు

ఇంకునటుల రుద్దాలి. ఇంకను వాపులను తగ్గించుటకు కూడ ఈ లేపనము బాగా పని చేస్తుంది. లేపనము రోగముల నశింపజేస్తుంది. ఎక్కువగా లేపనము చేసినచో శరీరకాంతి చెడిపోతుంది.

క్షారకర్మ

పుండును గావించు మందులను రాచుటకే క్షారకర్మ లేక పొక్కు మందులు వేయుట అంటారు. కంతులను కోయుటకంటె క్షారౌషధములను వాడుటే ప్రాశస్త్యముగా నెంచుతారు. జిల్లేడు, చిత్రమూలము, ఆవాలు మున్నగువానిని ఉపయోగించుతారు. ఇంతియేగాకుండా ఉత్తరేణి దంటుమసి, వరిగడ్డిమసి మున్నగువాటిని క్షారౌషధములుగా తయారు చేసి వాడవచ్చును.


లేహ్యములను జేయుటకు ఔషధ చూర్ణము, బెల్లము, ద్రవము, తేనె, ఇతర ద్రవ్యములు కావలసియుండును. ఇంకను ఇందులో వేయబడు చూర్ణములు అన్నియు వస్త్రగాళితములుగానే యుండవలెను.

లేహ్యాలు

లేహ్యములను తయారు చేయుటకు జిగురు వచ్చునట్లు తయారు చేయబడిన పాకమవసరము. లేహ్యములను చేయుటయందు గాని, ఏ యితర ఔషధములను చేయుటయందు గాని పని చేయు వైద్యుడు పనివారలను ఏవిధమైన చర్మరోగములు లేనివారుగాను, చేతులు పరిశుభ్రముగా కడుగుకొనిన వారుగాను చూచి నియమించాలి.

తూనికలు, కొలతలు

ఔషధములు తూచుటయందు బహు ఖచ్చితముగా ఉండాలి. పశువులకు రెండునుంచి 6 ఔన్సులకంటె నెక్కువగా తూచుట ఎన్నడును సామాన్యముగా తటస్థించదు. కొన్ని విషయములలో డ్రామువరకు మాత్రము తూచుటయు మరికొన్ని విషయములలో గ్రెయిను వరకు మాత్రము తూచుటయు తటస్థించుచున్నది. ఈ తూనికకొరకై ప్రత్యేక త్రాసులుండాలి.



ఔషధములు కొలుచుట తేలికయైన పనియే కాని తక్కిన వాటివలె దీనియందును జాగ్రత్త అలవాటు వుండాలి. ఈ కొలతలు గుర్తుపెట్టబడిన గాజుగ్లాసులు అమ్మబడుతాయి. ఆ గ్లాసుల కిరువైపుల కొన్ని గుర్తులు వేసియుంటాయి. కొలత గ్లాసును ఎడమచేతి యొక్క బొటనవ్రేలునకును, పిమ్మట రెండు వేళ్ళకును మధ్యగా పట్టుకొని కంటితో సమానమైన ఎత్తునకు తీసికొని రావాలి. ఏ సీసాలోనుండి మందును పోయవలెనో ఆ సీసాను కుడిచేతితో పట్టుకొని దానియొక్క మూతను ఎడమచేతి చిన్నవ్రేలుతో పట్టుకొనియుండాలి. ఈ మూత నీ ప్రకారము పట్టుకొనుటకై కొంతవరకు అలవాటు కావాలి. కాబట్టి అట్లు చేయుటలో జారవిడిచి దానిని పగులగొట్టు అపాయము నుండి తొలగుటకు గాను కొలచునపుడు దానిని విడిగా ఉంచుట ఉత్తమము.

1

30 చిన్నముల ఎత్తు	– 1 తులము
3 తులములు	– 1 ఫలము
8 ఫలములు	– 1 సేరు
12 తులములు	– 1 అర్ధసేరు
5 సేర్లు	– 1 వీసె

2

5 తులములు ఎత్తు	– 1 గిద్ద
2 గిద్దలు	– 1 అరసోల
2 అరసోలలు	– 1 సోల
2 సోలలు	– 1 తవ్వ
2 తవ్వలు	– 1 మానిక
2 మానికలు	– 1 అడ్డ
2 అడ్డలు	– 1 కుంచము

3

60 చుక్కలు	– 1 డ్రాము
8 డ్రాములు	– 1 ఔన్సు
20 ఔన్సులు	– 1 పైంటు
24 ఔన్సులు	– క్వార్డు
8 పైంటు	– 1 గాలను

4

2 వడ్లగింజల ఎత్తు	– 1 గ్రెయిను
20 గ్రెయినులు	– 1 స్క్రూపిలు
3 స్క్రూపిల్సు	– 1 డ్రాము
8 డ్రాములు	– 1 ఔన్సు
12 ఔన్సులు	– 1 పౌను
2½ ఔన్సులు	– 1 తులము
180 గ్రెయిన్సు	– 1 తులము
5 తులములు	– 1 చటాకు
16 చటాకులు	– 1 సేరు

షర్బతులను వాడుట

చిన్న దూడలకు చేదు వస్తువులు, ఘాటువస్తువులు కలిపి వాడవలసి వచ్చినప్పుడు కొన్ని షరబతుల వంటి తీపి పదార్థములు కలిపియిచ్చిన యెడల అది ప్రీతితో త్రాగుతుంది. వెగటు వస్తువులు వాడవలసి వచ్చినపుడు పాలు మున్నగువానిలో కలిపి త్రాగించాలి. సీసాలలో పోసియుండు మందులు ఒక్కొక్కపుడు

అడుగున పేరుకొని యుండును గాని మందును వాడునపుడు సీసాను బాగుగా కదల్చి పేరుకొనిన దానిని బాగా కరుగజేసిన తరువాత వాడాలి. అట్లు చేయనియెడల సరియైన మందు అంతయు అడుగున పేరుకొని పైనయుండు మందు సారహీనముగా వుంటుంది.

నస్యములు

ఔషధములను ముక్కు రంధ్రములలో పిండుట, ముక్కు రంధ్రములతో పీల్పించుట అనుదానికి నస్యకర్మ అందురు. మొగబంతి, పీనస, రొంప మున్నగు రోగములకు త్రిఫలచూర్ణముతో పీల్పించి తుమ్ములు వచ్చునట్లు చేయాలి. ఇంకను శిరోవాతము, మూర్ఛ, ఘ్రాణేంద్రియ శక్తి నశించుట, ఊర్ధ్వశ్వాసరోగము మున్నగువాటికి నస్యకర్మ చేయించాలి. ముక్కులలో కురుపులు, ముక్కుమాద, ముక్కుపీనస మున్నగు వ్యాధులలో ఆకుపసరులు, కారము గల ద్రవపదార్థములు పిండవచ్చును. నస్యములు చేయించు విషయములలో రోగనిదానము గ్రహించి అవసరానవసరములను బట్టి ఉపయోగించాలి. ఫార్మసీవారి రామాయిల్ మంచిది.

ధూపములు

పొగను ముక్కు రంధ్రముల గుండా నోటిగుండా పీల్పించుదానికి ధూపమంటారు. రొంప, ఊర్ధ్వశ్వాసరోగము, న్యూమోనియా, క్షయ, ఉబ్బసము, ముక్కుల నుండి నీరుగారుట, ముక్కురంధ్రములలో దుర్గంధము, దవుడలు బిగబట్టుట, మెడనరములు బిగబట్టుట, దంతములు దుర్బలములుగా నుండుట తుమ్ములు, కునికిపాట్లు, శిరోరోగములు మున్నగువానికి ధూమపానము చేయించుట మంచిది. ఒక్కొక్కసారి మూడు నాలుగు పర్యాయములు పీల్పించాలి. సాంబ్రాణి, కర్పూరతైలము, యూకలిప్టస్ ఆయిల్, ముద్దకర్పూరము, వసపొడి మున్నగునవి, పొగకు వాడాలి.

హృదయము, మెడభాగము శిరస్సు భాగము ధూపమునకు యోగ్యములు. అధికముగా గాని అకాలమునందు గాని ధూమము చేయించినచో నేత్రరోగములు మెదటిరోగములు సంభవిస్తాయి. పశువునకు విరేచనములకు మందిచ్చినపుడు, ఎనిమా చేసినపుడు, విషసంబంధమైన పదార్థమును తినినప్పుడు, చూడిగా నుండు పశువులకు ఆకలి దప్పిగానున్నపుడు, కంతులు గాయములు, శస్త్రము మున్నగువానియందు, ధూమపానము చేయరాదు. శిరస్సునందును, ముక్కు రంధ్రములందును, నేత్రములందును, దోషము యున్నచో ముక్కురంధ్రముల గుండను, కంఠము నాశ్రయించి యున్నచో, నోటిగుండను ధూపము పట్టించాలి.

అంజనములు

కన్నులలో కలికము వేయుట, కాటుకవలె మందును కండ్లలో పెట్టుట మున్నగువాటికి అంజనము అందురు. పశునేత్రాంజనము నేత్రములకు హితకరమైనదిగాన ప్రతిదినమును నేత్రములయందుపయో-గించాలి. నేత్రములందలి దుష్టజలము స్రవించిపోవుటకు వారము లేక పక్షదినములకు ఒకసారి నేత్రముల-యందుపయోగించాలి, గాన మందమతి శిరోభారము మున్నగు వ్యాధులకు అంజనము వేయుట మంచిది.

గండూషము

కషాయములు మున్నగు ద్రవపదార్థములను నోటికి, నాలుక భాగమునకు పుక్కిలింపు చేయుటకు గండూషము అంటారు. నోటిలో కురుపులు లేచినపుడు, విషవస్తువులు తినినచో పొక్కినపుడు, కఫరోగముల యందు, నోరు దుర్గంధముగా నున్నపుడు పటిక, మాచికాయ, తుమ్మచెక్క, నేరేడుచెక్క మున్నగు కషాయములను వాడవచ్చును. ఇట్లు వాడినయెడల దవుడలకు బలము కలుగును. జిహ్వేంద్రియము రసములను బాగా తెలిసికొంటుంది. ఆహారనాళము ఎండదు. పెదవులు పగులవు. దంతములు క్షీణింపవు.

శిరోమర్దన

పశువు రెండు కొమ్ముల మధ్యను, భాషికపు సుడివద్దను, ముచ్చిలిగుంట వద్దను తైలము పూసి చేతితో మర్దన చేయుటయే శిరోమర్దన అంటారు. శిరస్సునందు తైలము పూసినచో పుట్టెముకలకు అధికమైన బలము కలుగుతుంది. నేత్రములకు చలువ చేయును. పుసులు తగ్గును. నల్లపశువులకు చమురుపూయుట వలన తోలు, శరీరము గట్టిపడి మంచి చర్మము కలదిగా వుంటుంది. మరియు వాతము వలన బాధపొందదు. కష్టములను వ్యాయామమును సహించును. అన్ని పశువులకు వాతము వలన వేడిమి వలన నేత్రములకు జబ్బు చేసినపుడు చిట్టాముదము గోరువెచ్చగా కాచి మెదడునకు మర్దన చేయుట మంచిది.

వేడికాపులు తీయుట

పశువులకు దెబ్బలు తగిలినపుడు, బెణికినపుడు, వాపులకు, వాత నొప్పులకు, నరముల సంబంధమైన రోగములకు, శరీరములోనుండు స్వేదమును (చెమట) తీయుటకు, వేడికాపులు తీయుట మంచిది.

ఇసుకను లేక తవుడును కాచి గోనిపట్టాలో గాని, ముతకగుడ్డలో గాని వేసి కాపులు తీయవచ్చును. ఎక్కువ వేడిగానుండునట్లు కాచక సమానవేడిలోనున్నపుడే కాపులు తీయాలి. ఇంకను నూనెను కాచి నిమ్మకాయతో కాపులు తీయవచ్చును. నీటిలో తురకవేపాకు, గాడిదగడ పాకువేసి సలసల కాగనిచ్చి గోరువెచ్చని నీటితో వాతరోగములకు శరీరమంతటికి దినమునకు రెండు మూడు పర్యాయములు పట్టించవచ్చును. ఎక్కువగా వేడికాపులు తీయరాదు. అట్లు తీసినచో శరీరములోనుండు భాగములు కములుతాయి. అవుసరమున్నపుడు తైలములు రాచికూడ వేడికాపులు తీయవచ్చును. ఇసుక, ఉప్పు, తవుడు కాపులు శిరోభాగములకు తీయరాదు.

చూర్ణములు

కొన్ని మందులను చూర్ణములరూపమున పశువులకీయవలసి యుండును. చూర్ణములందుప-యోగింపబడు మూలికలన్నియు సాధ్యమైనంత వరకు క్రొత్తవిగను, పుచ్చనివిగను, తమ స్వరూపస్వభావములు కలవిగను ఉండాలి. ఆయా చూర్ణములకు చెప్పబడిన వస్తువులను భాగముల ప్రకారము ప్రత్యేకముగా తూచి ఏకముగా కలిపి రోటియందు దంచి వెడల్పు మూతిగల పాత్రకు వస్త్రమును గట్టి దానిద్వారా

పాత్రలోనికి పడునట్లు చూర్ణద్రవ్యములపై నాలుగువ్రేళ్ళతో సరిగానొక్కి త్రిప్పుచూ వస్త్రగాళితము చేయాలి. వస్త్రముపైన మిగిలిన మొరుమును మరలదంచి మరల ఆ విధముగానే వస్త్రగాళితము చేయవచ్చును.

చూర్ణము మెత్తగానున్న కొలది శ్రేష్ఠముగా వుంటుంది. కాబట్టి వీలునుబట్టి దళసరిబట్టయందే వస్త్రగాళితము చేయాలి. మిరియాలు, పిప్పళ్లు మొదగు కొన్ని వస్తువులు పూర్తిగా చూర్ణముగాక మిగులును కాన ఆయా భాగముల ప్రకారము తూచి ఏకముచేసి తరువాత చూర్ణము చేసినచో భాగములయందు వ్యత్యాసము వచ్చును. అందువలన వస్తువులను ప్రత్యేకముగా చూర్ణముచేసి భాగముల ప్రకారము కలుపుట మంచిది.

చూర్ణ ద్రవ్యములయందు పెద్దవిగా నుండు వానిని ప్రత్యేకముగా నరికి చిన్నవిగా చేయాలి. వేళ్లు, పట్టలు, తిప్పతీగె మొదలగు పచ్చి ద్రవ్యములను ఎండించియే చేయాలి. బెల్లము, ఎండుకొబ్బరి మున్నగు వాటిని మెత్తగా దంచి చూర్ణముచేసి కలపాలి.

మాత్రలు

మాత్రలను చేయుటయందు మ్రింగుటకు వీలగు పరిమాణము గలిగియుండాలి. పదార్థములు గలియునటుల జిగురు, బెల్లము, ఆముదము మొదలగు వస్తువులు ఉపయోగించాలి, నిమ్మ, నారింజ, వెలగకాయలంత మాత్రలను ఉపయోగించునపుడు పశువులకు కోపము తెప్పింపకుండా దాని నాలుకను పట్టుకోవాలి. అప్పుడు కుడిచేతి మూడువ్రేళ్ళతోను మాత్రను గట్టిగా పట్టుకొని తన చేతిని అంగటివరకు పోనిచ్చి ఆ మాత్రను విడచి నెమ్మదిగా చేతిని లాగుకొని, నాలుక విడచిపెట్టాలి. మాత్ర లోపలికి పోయినది లేనిది చూచి దాని తలను వదలిపెట్టవచ్చును. కొన్ని కొన్ని వ్యాధులలో మాత్రను లోపలికి పోవునట్లు చేయుటకు కొంచెము నీరు గొంతుకలో పోయవచ్చును.

మనము మాత్ర వేయుటకు చేతిని లోపలికి పోనిచ్చునపుడు మన చేతిని కొరకనీయకుండా దాని నోటిలో ఏదైన గుండ్రని పదార్థము (కఱ్ఱవంటిది) పెట్టాలి. అట్లు పెట్టినచో పదార్థము నోటిలోపల కొంత భాగము చుట్టుకొనిపోవును గాని అంతకంటే ప్రమాదము జరుగదు. మాత్రను నోటిలో చితుకనీయకుండా జాగ్రత్తగా అంగటిలో వేయాలి. కాని అది నోటిలోనే చితికినయెడల పశువు దానిని మ్రింగదు. ఇకముందు కూడ అట్టి మందులను వాడినయెడల అది మ్రింగక దగ్గి అరుస్తుంది. అట్టి వేళలయందు ఆ మాత్రలను తడిపి నీటిమూలమున గాని, ఆహారమూలమున గాని పశువునకు ఈయవలెను.

* * *


పండ్రెండవ భాగము

పశువులను పడగొట్టుట

గ్రామాదులలో నుండు రైతులు తమ పశువులకు వ్యాధులు వచ్చినప్పుడు గాని, తదితర కారణముల వలన గాని పశువులను పడగొట్టవలసియుండును. పడగొట్టుటలో అనేక సులభమార్గములు గలవు. పశువులు నోరులేని జంతువులుగాన జాగ్రత్తగా త్రాళ్లుగట్టి నెమ్మదిగా పడవేయాలి. మానవులయినచో వారంతట వారే ఏమందైనను త్రాగుదురు. పశువులు అటుత్రాగక గంతులు వేస్తాయి. మరికొన్ని పొడుస్తాయి. మరికొన్ని కరుస్తాయి, తన్నుతాయి. కాబట్టి ఎంత చిన్న పశువునైనను నలుగురైదుగురు పట్టుకొని సూత్రముతో పడవేయాలి.


పడగొట్టుటలో గమనించవలసిన సూత్రాలు

వైద్యుడు దూరముగానుండాలి. రైతుతోనే సాధ్యమైనంతవరకు పడగొట్టించాలి. అంతకు వీలులేనిచో పడగొట్టు సూత్రములను చెప్పి చేయించాలి. వైద్యుడు మిగుల బలిష్ఠముగా నుండి పిరికితనము లేక ఆ పశువుయొక్క గుణములను గ్రహించి తానే స్వయముగా పడగొట్టవచ్చును. పడగొట్టిన తరువాత కాళ్ళను కట్టవలసి వచ్చినపుడు మిక్కిలి జాగ్రత్తగా కట్టాలి. పశువు నిలబడునపుడు గాని పడుకొనినపుడు గాని వెనుక కాళ్ళదగ్గర నిలుచుండరాదు. అట్టి సమయములందు పశువు చాల కోపముగా వుంటుంది. ఆ పశువు కోపము పట్టజాలక వెనుక కాళ్ళతో తన్నుటకు ప్రయత్నిస్తుంది. అజాగ్రత్తగా నున్నయెడల అది




మనుష్యుని ముఖము మీదగాని, పొట్టలోగాని మూత్రకోశములో గాని తన్నుతుంది. కాబట్టి వైద్యుడు గాని తదితరులు గాని దగ్గరకు పోకుండా వెనుక కాళ్ళను నెమ్మదిగా త్రాడుతో లాగుకొని నాలుగు కాళ్ళు కట్టాలి. అట్లు కట్టునపుడు పశువు తన కాళ్ళతో కట్టుమనిషి చేతులను నొక్కును. లేక తలవంచి కట్టునపుడు తలమీద కూడ తన్నవచ్చును.

పశువును పడవేసిన తరువాత కాళ్ళను కట్టకపూర్వమే పడదని కొంచెముసేపున్న తరువాత వెంటనే లేచి తలతో దాపునవున్న మనుష్యులను విసరుతుంది. అట్టి సమయములందు అపాయకరములైన దెబ్బలు తగులుతాయి. పశువు పడినవెంటనే తోకను లోతొడగుండా తీసికొని పట్టుకోవాలి. దీనినే మడితోకయందురు. పశువును పడవేసిన తరువాత తలను నొక్కిపట్టునపుడు చెవులను బాగుగా తనిఖీ చేయాలి. తలక్రింద చెవి పడినలిగినపుడు చెవి భాగమందలి నరములన్నియు నలుగుతాయి. అందువలన కాలు రెల్లపోతుంది. అందుచేతనే మనపెద్దలు పశువు పడగానే చెవి చూడమంటారు.




ఒక సన్నని, మెత్తని త్రాడుగాని, మోకుగాని తీసికొని ఒక చివర కొమ్ములనుగాని తలకు తగిలించు సికమారుకు గాని, మెడకు పెట్టు పలుపునకు గాని తగిలించి మూపురము పైనుంచి ముందర కాళ్ళ క్రిందనుంచి పైకి చివరకొన లాగి వెన్నెముక మీదుగా మొరడు దగ్గరనుంచి వెనుక కాళ్ళమీదుగా వృషణముల



దగ్గరగా త్రాటిని ఉచ్చువేసి ఇద్దరు మనుష్యులు లాగిపట్టిన వెంటనే పడుతుంది. అట్టి సమయములందు జాగ్రత్తగా అది పడిపోవునపుడు మనుష్యులు ఆనుకొని దెబ్బ తగులకుండా నెమ్మదిగా పరుండబెట్టాలి. లేనిచో జబ్బగాని ప్రక్క ఎముకలుగాని విరుగవచ్చును. ఇట్టి ప్రమాదములు జరుగుతుంటాయి.

పశువును సరిగా నిలబెట్టి ముందు త్రాడుగట్టి చేతితో పట్టుకొని యుండుటగాని లేక గుంజకుగాని స్తంభమునకు గాని గట్టియుంచాలి. తదుపరి యిదివరకు మాదిరిగానే రెండు భాగములందును ఉచ్చులు వేయగా మిగిలిన త్రాటిని పడిపోవు భాగపుకాలి పిల్లడెక్కకు ఉచ్చువేసి నెమ్మదిగా చేతితో లాగుచుండిన యెడల పడిపోతుంది. ఈ సూత్రము చాలా తేలికగా వుంటుంది.



పశువును పడగొట్టకుండా 3 గజముల బారు గజము వెడల్పు గల స్తంభములో 10 లేక 8 కఱ్ఱలు రెండువైపుల రెండు బలమైనవి పాతాలి. పశువు యొక్క తలభాగమున ముందుపాతి మొదటి స్తంభమునకు కట్టి కఱ్ఱలమధ్యగా నుంచి అటునిటు కదలకుండా వెనుక కాళ్ళను పగ్గముతో వెనుకగుంజకు కట్టి తగిన చికిత్స చేయాలి. ఇంకను పసువు కఱ్ఱల మధ్యనుండి కూడా గల్లంతు చేసినయెడల మరొక మోకుగాని మెత్తని త్రాడుగాని ఎద్దుచుట్టూ గట్టిగా త్రిప్పిచుట్టి చికిత్స చేయవచ్చును. ఇంకను తలభాగమును ముందుపాతిన మొదటి స్తంభమునకు కట్టి కఱ్ఱలమధ్యగా నుంచి అటునిటు కదలకుండా వెనుకకాళ్ళను పగ్గముతో వెనుక గుంజకుకట్టి తగిన చికిత్స చేయాలి. ఇంకను పశువు కఱ్ఱలమధ్య నుండియు కూడ గల్లంతు చేసినయెడల మరొక మోకుగాని మెత్తని త్రాడుగాని ఎద్దుచుట్టూ గట్టిగా త్రిప్పిచుట్టి చికిత్స చేయవచ్చును. ఇంకను కఱ్ఱలు అటునిటు కదలుననియు, పశువు బయటకు పోవుననియు ఉద్దేశ్యమున్న యెడల కఱ్ఱలకు అడ్డముగా 2 లేక 3 చోట్ల బలమగు గట్టిబద్దలు కట్టవచ్చును. ఈ కఱ్ఱలు నునుపుగను బుడుపులు లేకుండగాను ఉండాలి. కఱ్ఱలకు తారుపూయుట మంచిది పశువులను పడగొట్టు సూత్రములు రైతులలో చాలమందికి తెలియును. అయినప్పటికి ప్రాథమిక పశుచికిత్స చేయువారికి అవుసరమని తెలిపితిమి.

గేదెలను దూడలను పడగొట్టుట

ఇదివరకు చెప్పిన జంతువులను పడగొట్టుటకంటె గేదెలకు దున్నలను పడగొట్టుట చాలాకష్టము. ఈ జాతివి మహాక్రూరస్వభావము గలవి. అందుచేత ముందుకాళ్లకు, వెనుకకాళ్లకు బంధములు వేసి ఒక సన్నని, మెత్తని త్రాడుతీసుకొని రెండువైపుల రెండు కొనలుంచి నెమ్మదిగా యిద్దరు మనుష్యులు లాగాలి. అట్లు లాగుటవలన పశువు క్రమేపి ఒరిగ పడిపోతుంది. ఈ పద్ధతి వలన పశువునకు అపాయము కలుగదు. పడిపోవుననగా యిద్దరు మనుష్యులు పడిపోయే భాగమును ఆనుకొని పరుండబెట్టాలి. తదుపరి తలను నొక్కి పెట్టాలి. గేదెగాని, దున్నగాని చాల పొగరుగా నుండి అంకెకు రానప్పుడు మొగత్రాడు గాని, సికమారు గాని వేసి నొక్కిపట్టాలి. వాటి కొమ్ములు సూదులుగా నుండుటవలన ఒకవిధమగు గోరోచన ముండుటవలన మిక్కిలి పొగరు గలవై మనుష్యులను కూడా చంపుతాయి. బంధములు విడిచినపుడు మనుష్యుల మీదపడి పొడుస్తాయి. జాగ్రత్తగా ఆలోచించి పడగొట్టాలి.


ఎంతో ప్రమాదము వచ్చినపుడు ఆవులను, గేదెలను పడవేయవలెను గాని మాటిమాటికి పడవేయుట చాల ప్రమాదము. ఎందుచేతనన వాని ఆహారకోశములు నిండుగానుండును. రక్తమెల్లప్పుడు పాలుగా మారుతుంది. పొదుగు ఎల్లప్పుడు కుదురుగా నుండాలి. నోరు ఎల్లప్పుడు ఆడించుచుండాలి. కనుక ఇటువంటి సుకుమార జంతువులను మాటిమాటికి పడవేయరాదు. పడవేసినను ఎక్కువకాలముంచరాదు. పశువునకు కుడితిపెట్టిగాని కడుపునిండా నీరు త్రాగినపుడు గాని పాలు తీయకుండా నున్నపుడు గాని పశువును పడవేయరాదు. దూడను కూడా సాధ్యమైనంత వరకు కాళ్ళను కట్టకుండానే కాళ్ళు నొక్కిపట్టి చికిత్స చేయాలి. ఎందుచేతనన వీటి కాళ్ళు చాలా సున్నితముగా వుంటాయి. బిగించి కట్టినచో తిమ్మిరి ఎక్కుటయో, నరములు తెగుటయో, ఎముకలు విరుగుటయో జరుగును. పైనచెప్పిన జంతువులను పడవేసిన తరువాత తోకను మాత్రము కాళ్ళమధ్యగా తీసి డొక్కమీదుగా ఆనించి పట్టుకోవాలి. ఇట్లు చేసినచో పశువు కదలజాలదు. దీనినే మడితోకయందురు.

* * *

పదమూడవ భాగము

ఎనీమా చేసే పద్ధతులు

ఎనీమా చేయుటలో వివిధ రకములు గలవు. సామాన్యముగా మందుల నిచ్చియే విరేచనముల గావింపవచ్చును గాని, శీతలము జేసిగాని, అతివేడిజేసి గాని, రక్తసంబంధమగు వ్యాధుల వలన గాని పాడిపశువులకు దాణావస్తువులు విస్తారముగా మేపినపుడు బలహీనత వలన మలము లోపల నుండి



బయటకు రాక బాధపడుచున్నపుడు గాని శీతాకాలములో దూడలు పాలు త్రాగుటలో ఎక్కువ తక్కువల బట్టిగాని మలము పిట్టము గడుతుంది. పెద్దరోగములో 107 డిగ్రీల జ్వరమున్నపుడు మలము పోగొట్టుటకు ఎనీమా చేయవచ్చును. ఏయే వ్యాధులలో ఎనీమా చేయవలెనో వైద్యుడు జాగ్రత్తగా ఆలోచించి చేయాలి.

సామాన్యముగా ఎద్దు, ఆబోతు, దున్న, గేదె మొదలగు జంతువులకు ఎనీమా చేయునపుడు నాలుగు దుక్కిటికాళ్ళను తీసికొని రెంటికి రెంటికి లంకెవేసి ముందరి భాగమందు రెండు కాడులను, వెనుక డొక్కల భాగమందు, రెండు కాడులను క్రిందగా పోనిచ్చి గట్టిగా నొక్కమని చెప్పి తలకు త్రాడువేసి గుంజకు కట్టి సరియగు పొజిషన్‌లో నుంచి ఎనీమా చేయాలి. కొన్ని పశువులను జాగ్రత్తగా పడగొట్టి ఎనీమా చేయాలి.

ఎనీమా చేయుటకు నియమాలు

1. ఎనీమా చేయునపుడు రోగపశువు ఉండవలసిన పద్ధతి.
2. ఎనీమా చేయు నీటియొక్క స్వభావము.
3. ఆ నీటియొక్క ఉష్ణధర్మము.

4. ఎంత నీరు వాడవలసినది ఒకేసారి పేగులో ఉండవలసిన నీటి పరిమాణము.

5. ఆ నీటిని ఎంత ఒత్తిడితో ఎక్కించవలసినది.

6. ఎనీమా ఎంతవేడిగా చేయవలసినది.

7. లోనికి నీరు ఎక్కించేటప్పుడు ఆసనమును నొక్కుచున్నదా? లేదా?

8. లోనికి ఎక్కించిన తరువాత నీరు ఎంతసేపు ఉంచవలెను.

నీటియొక్క ఉష్ణము


నీటివేడి హెచ్చుగా నుండరాదు. మిక్కిలి చల్లని నీటిని వాడరాదు. మామూలు శీతోష్ణములోనే యుండాలి. ప్రేగులయందు ఆమ్లము, శ్లేష్మము, గాలి ఎక్కువగా నున్నపుడు వేడినీటినే వాడాలి. అప్పుడైనను ఆ నీటిని ప్రేగులలో నిలువయుంచుటకు యెట్టిబాధయు నుండరాదు. జ్వరములలోను గర్భవాతములోను కొంచెము గోరువెచ్చని నీటినే వాడాలి. చూడివశువులకు ఎనీమా చేయునపుడు వాటి ఉదరములు సున్నితముగా నిండుగా ఉంటాయి గాన ఎనీమా చేసిన నీరు ఎక్కువకాలము నిలువదు. కాబట్టి చూడిపశువులకు ఎనీమా చేయుటకు గోరువెచ్చని నీటినే వాడాలి. మిగుల చన్నీటిని వాడరాదు. రైతులలో చాలామంది పశువులకు ఎనీమా చేయుటనిన ఆశ్చర్యముతో చూస్తారు. కొందరు ఎనీమా చేసిన నీరు లోపలనే యుండునని భయపడతారు. వైద్యుడు అనుభవముతో ఎనీమా చేయును. కాబట్టి రైతులు భయపడనవసరము లేదు.

ఎనీమా చేసే పద్ధతులు

పశువులకు 4 పైంటులు గాని 6 పైంటులు గాని 8 పైంటులు గాని (పైంటు అనగా అర్ధసేరు నీరు) నీరుపట్టు ఎనీమా డబ్బా ఉపయోగించాలి. చిన్న పశువులకు 2 లేక 4 పైంటుల డబ్బాలు ఉపయోగించాలి. ఈ డబ్బాలకు రెండు గజముల రబ్బరుగొట్టము తగిలించాలి. పశువును నిలబెట్టి గాని పరుండబెట్టిగా డబ్బానిండా నీరుపోసి మనుష్యుని ఎత్తుగా పట్టుకొనమని చెప్పి పశువుకంటె గజము ఎత్తు మట్టములో నుంచి ట్యూబును ఆసనములోనికి నెమ్మదిగా ఎక్కించాలి. ఎక్కించిన తరువాత పశువు ముక్కుతుంది. అట్లు ముక్కుటవలన రబ్బరుగొట్టము లోపలికిపోక బయటనే వుంటుంది. అట్టి సమయములందు మనము ఆ చివర రబ్బరును చేతివ్రేలిచే నెమ్మదిగా ఆసనము లోనికి పోనిచ్చి చక్కలిగింత పెట్టి మలప్రేగు వరకు పోనిచ్చి గొట్టమును తేలికగా నొక్కాలి. అప్పుడు నీరు లోపలి ప్రేగులన్నిటికి చిమ్ముతుంది. ఆ ప్రేగు నిండిన తర్వాత బయటకు వెడలగ్రక్కును. అప్పుడు ట్యూబును తీసివేసి దూరముగా నుండి మలము ఎంతపడుచున్నది ఏ రంగుగానున్నది దానిలో జీర్ణముకాని గింజలు పురుగులు గాని, జిగురుగాని, రక్తముగాని ఉన్నదేమో పరీక్షించాలి. ఇంకను మలినమున్నదని అనుమానమున్నపుడు మరల నీరెక్కించాలి. ఈ రీతిగా మలినము పోవువరకు రెండు మూడుసార్లు చేయాలి. ఎనీమా చేయునపుడు బట్టమీద పడకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. ఎప్పటికప్పుడే సబ్బునీటితో చేతులను శుభ్రము చేసికొనుచుండాలి. రబ్బరుట్యూబులో పేడ ఇరుకుకొనినచో కడిగి మరల ఎక్కించాలి.

వేడినీటితో ఎనీమా చేయుట

రైతుల ఆతురతనుబట్టి పశువుల బాధను బట్టి వేళకు సరియైన వేడినీరు దొరకకపోవుట వలన ఎనీమా చేయుటలో లోటుండవచ్చును. చన్నీళ్ళచే మాత్రము ఎనీమా చేయరాదు. ఇట్లు చేయుటవలన ప్రేగునకు చురుకుదనము లేక శీతలముగా వుంటుంది కాబట్టి అంత వేడినీరు గాకుండా గోరువెచ్చని నీటితో ఎనీమా చేయాలి.



సబ్బునీటితో ఎనీమా చేయుట

సన్‌లైట్ సోపుతో గాని బోరాక్సులైట్ సోపుతో గాని అత్తరులు కలువని మెత్తనిసోపుతో గాని ఎనీమా చేయవచ్చును. 100 భాగముల నీటిలో 10 భాగముల సబ్బును కలిపి ఎనీమా చేయవచ్చును. మిక్కిలి మలబద్ధకముగా నుండి పేడ దుర్వాసన వేయునపుడు గోరుచిచ్చని నీటితో సబ్బు కలిపి ఎనీమా చేయుట మంచిది.

తైలములతో ఎనీమా చేయుట

పశువునకు 107 డిగ్రీల జ్వరముండి ముడ్డితీపుండి బాధపడుచున్నపుడు 50 భాగముల నీటిలో 5 భాగముల గ్లిజరిన్ గాని, కాస్టర్ ఆయిల్ లేక చిట్లాముదము గాని కలిపి నెమ్మదిగా ఆసనములోనికి ఎక్కించుచు మలము కరుగనిచో తీసివేయుచు ఈ నీటిని ఎక్కించాలి. లోపలనున్న చెడుపదార్థమునంతను కదిపి బయటికి త్రోసివేస్తుంది. శీతాకాలములో దూడలు పాలు ఎక్కువ తక్కువలను బట్టి మలబద్ధకము కలిగి పేడ వేయుటకు బాధపడతాయి. ఇంకను మలముపడుటకు గోంగూర గొలిమిడాకు గాడిదగడప ఆముదము వగైరా పోస్తారు. అట్లు పోయుట వలన అతివేడిజేసి మలము పిట్టముగట్టి రక్తములో జీర్ణించి మెడవిరుగ దీసుకొని చనిపోతాయి. అట్టి సమయములో ఈ ఎనీమా చేయుట మంచిది.

మలమును చేతితో తీయుట

నీటితో ఎనీమా చేయుటకు వీలులేనప్పుడు, పశువు రోగముచే బలహీనత జెంది లోపల వేడిలేనపుడు నీటిని ఎక్కించకుండా ఆముదమును గాని గ్లిజరిన్‌ను గాని చేతికి రాచుకొని ఆ మలమును నెమ్మదిగా తీయుట మంచిది.

* * *

పదునాల్గవ భాగము

రాక్షస వైద్యము

వాతలు వేయుట

మన దేశములో అనేకులు తమ పశువులకు ఏ వ్యాధి వచ్చినను ఆరంభములోనే వాతలు (రక్షలు) వేయు ఆచారము కలదు. వ్యాధులు లేకుండగనే వరహాకాల్పులు పిఠాపురం కాల్పులని కాల్చుతారు. ఇట్లు కాల్చుట చాలా పొరపాటు. వాతలు వేయుట మహాపాతకము. పశువు చచ్చినను, బ్రతికినను వాతలు వేయరాదని చెప్పుతారు. ఇట్లు వాదించుటకూడ తప్పనియే నా ఉద్దేశ్యము. మానవ వైద్యములో ఇంగ్లీషు పశువైద్యములో కూడ కొన్ని వ్యాధులకు తప్పక వాతలు వేయవలెననియున్నది. వైద్యములో అనుభవములేని వారు తర్కించినను లాభము లేదు. పశువునకు గురక, దొమ్మ, కుందేటివెఱ్ఱి మున్నగు రోగములలో ఆయా రోగలక్షణములను బట్టి వాతలు వేసినచో మందులకంటె నెక్కువ పనిని చేస్తుంది. కొన్ని రోగములలో ఎన్ని చికిత్సలు చేసినను లాభము కన్పట్టనప్పుడు వాతల వలన తగ్గుటు కూడ గలదు.


సామాన్యముగా పశువులకు సంభవించు రోగములలో చాలావరకు ఏ చికిత్సయు లేకుండగనే తగ్గిపోతుంది. ఇటువంటి వ్యాధులకు కూడ వాతలు వేస్తారు. రోగనిదానము గ్రహించక వాతలు వేయరాదు. ఈ చికిత్సయందు రెండు విధానములు గలవు. అందులోనొకటి పశువునకే కీలునకైనను, కన్నులకైనను నొప్పి చేసినపుడు ఆ స్థలములందె కాల్చుట, రెండవది పశువు ఏదోయొక రోగమును పొందినపుడు గాని లేక ఏ కారణము చేతనైన కృశించినప్పుడు గాని దాని తత్వమును బాగుచేయు ఉద్దేశ్యముతో శరీరమంతయు కాల్చుతారు. ఈరీతిగా కాల్చుట చాలా పొరబాటు.

వాతలను గూర్చిన వివరములు

ఈ గ్రంథములో రైతులకు విపులముగా దెలియులాగున ఆయా రోగముల వాతలను గూర్చి తెలిపితిని. వాతలు వేయుటలో అనేకమంది అనేక రకములుగా వేయుదురు. "కీలెరిగి వాతపెట్టుమని" పెద్దలు చెప్పుదురు. కొందరు వారి యిష్టప్రకారము ఎచ్చట వాపున్న అచ్చటనే కాల్చుట గూడ జరుగుతుంది. మరికొందరు జబ్బురాగానే కాల్చుతారు. అట్లుకాక మా అనుభవ చికిత్సలు చేసి, ప్రాచీన గ్రంథములు పరిశీలించి ఈ గ్రంథములో తెలిపితిమి. పశువు శరీరములోనుండు రక్తనాళములు, నరములు మున్నగునవి పరీక్షించి వాతలు పెట్టవలెను కాని అనవసరముగా పెట్టిన ఆ పశువా బాధపడుటయేకాక తదితర జబ్బులు కూడా రావచ్చును.

వాతలు వేయు పద్ధతులు

వాతలు వేయుటకు ముందు సమానమగు స్థలము చూడాలి. అచ్చటనే 10 గజముల దూరములో పిడకలతో కాని బొగ్గులతో కాని దాలివేసి ఆ దాలిలో వాతలువేయు పనిముట్లకు నిప్పు అంటించాలి. ఆ




నిప్పునకు దగ్గరగా తదితర పశువులు గాని గడ్డి మొదలగునవి గాని యుంచరాదు. కాల్చునపుడు ఒకవిధమగు దుర్వాసన వేయును. ఆ వాసనను పీల్చరాదు. పనిముట్లు ఎఱ్ఱగా కాలిన తరువాత గోనెగుడ్డతో పనిముట్లను పట్టుకొని గుర్తులు పెట్టినచోట కాల్చాలి.

పశువులకు వాతలు పెట్టుటకు పూర్వము పేడచే గాని, సిరాతో గాని ఈ గ్రంథములో చెప్పినరీతిగా గీతలు గీసి వాతలుపెట్టాలి. పనిముట్లు సరిగా కాల్చకుండా వాతలు వేసినప్పుడు అవి బాగా కాలినవో లేవో చూడాలి. అట్లు కాలనియెడల వాటిని తీసి మరల బాగా కాలినవాటిని తీసికొని రావాలి. పశువు కదుపుబ్బినదా, దగ్గుచున్నదా, ముక్కుచున్నదా మొదలగునవి గ్రహించాలి.

వాతలు వేసే పనిముట్లు

ఆయా అవయవ భాగములను పరీక్షించి ఏ యే పనిముట్లతో ఏ భాగమునందు వాత వేయవలెనో గ్రహించాలి. వాతలు వేయునప్పుడు తరచుగా కొడవళ్ళు గడ్డపారలు, చువ్వలు వాడతారు. ప్రత్యేకముగా వాతలు వేయుటకు పనిముట్లు చేయించుకొని యుంచుట మంచిది. ఉక్కుతో చేసిన పనిముట్లు మంచివి. పనిముట్లు పదును లేనివిగాను కోణములు లేనివి గాను సమానమగు బరువు గలిగినవిగా నుండుట మంచిది.

వ్యాధితోనున్న పశువునకు అగ్నిని చూపించరాదు. అట్లు చూపించిన యెడల దానికొకవిధమగు భయము, కంపర కలిగి సరిగా పండుకొనజాలక గంతులు వేస్తుంది. ఈ గంతులు వేయుటవలన ఇంకను రోగమెక్కువౌతుంది.



కాబట్టి తటాలున తీసికొని పశువును నెమ్మదిగా పడగొట్టి కాళ్ళు గట్టి ఎఱ్ఱగా కాలిన పనిముట్లచే వాతలు వేసిన పశువునకేమియు అపాయము రాదు. వ్యాధి ముదిరిన తరువాత కాల్చిన పశువు చనిపోతుంది.

వాతలు వేయు మనిషి తదితరులతో మాట్లాడక పనిముట్ల పిడులు గోనెగుడ్డతో పుచ్చుకొని వాతలు వేయాలి. కాల్చిన చోటనే కాల్చక ఎక్కువసేపు పరుండబెట్టక పశువుయొక్క మంచిచెడ్డలు అనగా వాతలు వేయునపుడు పశువు ఏమి చేయుచున్నది తెలిసికొనుచు కాల్చాలి. దానిదగ్గర ప్రత్యేకమొకరిద్దరు మనుష్యుల నుంచి పనిముట్లు బాగా కాలుచున్నది లేనిది తనిఖీ చేయుచుండాలి. వాతలు వేయు మనిషి కట్టుపంచెలు గట్టిగా కట్టుకొని చెంగులను తొడవరకు దోపాలి. చొక్కా తొడుగుకొనరాదు. కాలుచున్న పనిముట్టు పశువు దగ్గరకు తెచ్చునపుడెవరిని ఆయా భాగములందుండక దూరముగా నుంచాలి. వాతలు వేసిన పనిముట్లను పని అయిన తరువాత బురదలోనైనా, పేడలోనైనా గ్రుచ్చాలి.

వాతలు వేసే రోగాలు

చర్మము మాంసము సిరలు, స్నాయువులు సంధులు వీటియందు వాతముండి మిక్కిలి తీవ్రమగు బాధ కలుగజేయునపుడును, వ్రణము ఎత్తుగా నుండి కఠినముగా తిమ్మిరిగానుండు మాంసము కలదిగా నుండునపుడును, కణుతులు, బెణుకులు, చర్మము కొమ్ములు తిరుగుట మొదలగు వాటిలో సిరలు తెగినపుడు రక్తనాళములు తెగి రక్తమెక్కువగా కారునపుడు, అగ్నికర్మ అనగా రాక్షసవైద్యము చేయాలి. వైద్యుడు గ్రంధి మున్నగు వ్రణముల పొట్టి పొడవు మున్నగు ఆకారములను పరీక్షించి చుక్కలుగాని నిలుపు అడ్డగీతలుగా గాని కాల్చాలి. రోగపశువు యొక్క మర్మములు, బలము, బలహీనత, వ్యాధి, ఋతువు బాగా పరిశోధించి వాతలు వేయాలి.

శరీరపు సహజరంగు మారి ఎక్కువగా కాల్చబడి బొబ్బలుపుట్టకున్న యెడల దానిని ఫ్లుష్టమందురు. తీవ్రమగు బొబ్బలులేచి పీకుచున్నట్లు బాధ, మంట, పోటు, ఎరుపు, వాపు గలిగి చాలాకాలమునకు గాని తగ్గనియెడల దుంగ్ధమనబడును. పండిన తాటిపండురంగు గలిగి మిక్కిలి ఎత్తులోతు గలుగక చర్మము మాంసము సిరలు స్నాయువులు సంధ్యస్థిదాహ లక్షణములతోగూడి యుండినది సమానముగా కాల్చబడినదని

తెలిసికోవాలి. మాంసము వ్రేలాడుట, శరీరము సడలుట, సిరలు, స్నాయువులు, సంధులు, అస్థులు మున్నగు భాగములు బాధ కలుగుటయు చెడిపోవుటయు అధికజ్వరము ఎక్కువమంట, ఎక్కువ దాహము మున్నగు ప్రమాదములు సంభవిస్తాయి. ఈ లక్షణములు ఎక్కువగా కాల్చుట వలన కలుగుతాయి. ఇట్టిస్థితిలో గాయము త్వరగా మానదు. మానినప్పటికి సరియగు రంగురాదు.

ముంతకాల్పులు

కొందరు పశువైద్యులగు లంబాడీలు తమ మందలోనున్న పశువులకు ముంతకాల్పులు వేస్తారు. పశువున కేరోగమువచ్చినను కాళ్ళనొప్పులకు, బెణుకులకు తదితర వాపులకు ముంతకాల్పులు కాల్చుతారు. ముంతకాల్పులనగా చిన్నమూతిగల మట్టి పిడతనుగాని ఇసుక పిడతను గాని తెచ్చి మూతిభాగము అగ్నిలోపెట్టి తీసివెంటనే ఆ భాగముతో గుండ్రముగా వాతలు వేస్తారు. ఈరీతిగా ఆయా భాగములకు తగిన పిడతలు తీసికొని కాల్చుతారు. ఈ పద్ధతి అవుసరమైన రోగములకు అవలంబింపవచ్చును.

వాతలు మానుటకు మందులు


వాతలు వేసిన పుండ్లమీద ఈగలు వ్రాలకుండ వేపనూనె రాయాలి. అప్పుడప్పుడు ఆముదమును రాయాలి. పుండ్లకు నీరుగాని తేమగాని సోకనీయరాదు. కాకులు పొడవకుండా కాపాడాలి. నీలిమందు కొబ్బరినూనెలో కలిపి అప్పుడప్పుడు రాయాలి. లేక వెన్నెలో పటికపొడిని గాని, కవిరిపొడిని గాని కలిపి రాయాలి. లేక ఫార్మసీ వారి వెటరినరీ ప్లాష్టర్‌ను వాడుడు.

* * *

పదునైదవ భాగము

సూచీముఖ ప్రయోగము

ఇంజెక్షన్ అను పదము సామాన్యముగా ఏ భాషలో చేరినదో బోధపడుట లేదు గాని దేశమంతట సర్వసామాన్యముగా ఈ పదము వాడుకయైనది. (ఇక్= లోనికి, జెక్షన్= జొనుపుట) శరీరము లోనికి సాధనముచే ఔషధము గాని మరి యే యితర పదార్థము గాని ప్రవేశింపజేయు విధానమునకు ఇంజెక్షన్



యని వాడుతున్నారు. ఈ మాటకు సరియైన పదము గానరాదు. ఆయుర్వేదములో సూచీముఖ ప్రయోగమని వృద్ధవైద్యులు తెలుపుతున్నారు. శరీర భాగములోనికి అనగా ఏ యితర పనిముట్టు (పిచికారి) ద్వారాగాని చర్మము లోనికి లేక మాంసములోనికి రక్తనాళములలోనికి ఔషధమును పంపుటను ఇంజెక్షన్ యందురు. ఈ ఇంజెక్షన్సులో రెండు రకములు గలవు. (1) చర్మమాంస నరములగుండా రక్తములోనికి ఔషధమును ప్రయోగించుట. (2) ఆసనము ద్వారా లేక మర్మస్థానము (యోనిగర్భాశయ మూత్రద్వారముల) ద్వారా ఔషధములు ప్రయోగించుట. ఈ రెండు విధముల ప్రయోగములకు ఇంజెక్షన్ యని వాడవచ్చును. ప్రస్తుతము వైద్యులు ఆసన మర్మావయవముల గుండా ప్రవేశపెట్టు సాధనమునకు ఎనీమా (వస్తికర్మ) యని వాడుతున్నారు. ఈ ఇంజెక్షన్ అనుమాట ఏ భాషలోనిదైనను తరచుగా వైద్యశాస్త్రమున ఉపయోగింపబడు పదముగాన దీనినే ఇంజెక్షన్ యనియు ఆయుర్వేదమున సూచీవ్యధనయని పిలుస్తారు.

ఆయుర్వేద పద్ధతి – ఇంజెక్షన్

పూర్వకాలమున చేయబడు ఇంజెక్షన్సు (సూచీవ్యధ) మరొక పద్ధతిగా నుండేది. అనగా కొంచెము మోటుపద్ధతిగా నుండేది. ప్రస్తుత కాలములో ప్రభుత్వము వారామోదించి ప్రతి సంవత్సరము పుట్టిన చంటిబిడ్డలకు వేయుచున్న టీకాలను (సూచీవ్యధనము) ప్రత్యక్షముగా అందరు జూచుచునేయున్నారు. కొన్ని వందల సంవత్సరములకు పూర్వము ఆయుర్వేద ప్రభృతులు కనిపెట్టిన మార్గములనే నేటికిని ప్రాక్ ప్రతీచీ వైద్య సాంప్రదాయముల రెండు తెగలకున్ను మార్గదర్శకములే అయియున్నవి.

ఆంగ్లేయ పశువైద్యులు (వెటరినరీ డాక్టర్సు) యిప్పటికి ఈ పద్ధతి ప్రకారము పశువులకు కూడ టీకాలు వేయుచున్నారు. ఇంకను మానవులకు ప్రాచీనకాలము నుండి పచ్చబొట్టను సూచీవ్యధ యిప్పటికిని అమలులో వుంది. ప్రాచీనులు అనేక పరిశోధనలచే రోగములు గుర్తించుటయు, ఆయా రోగముల నన్నిటికి ఉపయుక్తమగు ద్రవ్యములు, ప్రయోగవిధానములు, ప్రయోగించు పనిముట్లు (యంత్రశస్త్రములు) మొదలగు మార్గములన్నియు శిలాశాసనములవలె యనేక గ్రంథములు వ్రాసి యిప్పటికిని మృతజీవులై యున్నారు.

మనుష్యులకును, జంతువులకును వ్యాపించు సకల రోగములకు ప్రాధాన్యముగా త్రిదోషములు (వాత, పిత్త, కఫ) ప్రధానములై ఆహార విహార భేదములచేతను, శరీరము ప్రకృతి భేదముల చేతను వేరు వేరు లక్షణములతోను వేరు వేరు నామములతోను చికిత్సింపబడుతున్నది. ప్రాచీనాయుర్వేద చికిత్సావిధానము లన్నియు మనుష్యులకు వలెనే జంతువులకు ఉపయోగబడతాయి. ఇప్పుడిప్పుడే పశువులకు కూడ ఆయుర్వేద ఇంజెక్షన్స్ వాడుటకు పరిశోధనలు తెనాలి పశువైద్య కళాశాలవారు సల్పుతున్నారు. ఈ కారణముచేతనే ఆంగ్లేయ వైద్యులు కొన్ని జంతువుల నుండి తయారుచేసిన మాంసరసము రక్తము చీము మొదలగు పదార్థములు మనుష్యులు టీకాలరూపమునను, ఇంజెక్షన్ రూపమునను నోటిద్వారా ప్రయోగిస్తున్నారు.

పూర్వము అపరధన్వంతరియగు చరకాచార్యులు రోగములందు ఉపయుక్తౌషధమును రక్తమునందు ప్రవేశింపజేసిన యెడల జీవించునని చెప్పియున్నారు. ఆ రీతిగనే పూర్వపు శాసనమే నేటికిని ఆచరణీయమై ఆంగ్లాయుర్వేదీయులకు ప్రధానకర్తవ్యమైయున్నది. ఆంగ్లేయులు ప్రస్తుతము చేయుచున్న ఇంజెక్షన్సుకు పూర్వము టీకాలను చర్మము గీచి అచ్చటి రక్తమందు ఔషధద్రవ్యములను ప్రయోగించుచు క్రమముగా పరిశోధనలచే ఆయుర్వేదీయ సూచీముఖశస్త్రమును పనిముట్టు (సిరంజి) తో పశువులకును యితర జంతువులకును మనుష్యులకు ఇంజెక్షన్సు (సూచీముఖప్రయోగము) చేసిరి, ప్రాచీన చరకాదులు చెప్పియున్నట్లుగానే ఔషధములను రక్తమునందు ప్రవేశపెట్టుట కనుకూలించునట్లుగా ద్రవరూపముగా మార్చి నవీనులు వాడుతున్నారు. ప్రస్తుతము వాడుచున్న ఇంజెక్షన్సు విధానములో ఉపయోగించు సీరములు గూడా ద్రవరూపముగానే తయారు చేస్తున్నారు. అట్టి సీరములు పశువుల కత్యంతోపయోగమగు నటుల ఫ్రెంచిరసాయన శాస్త్రజ్ఞులగు ప్యాష్టియరుదొర, చింబరులాండు దొర, రౌక్సుదొర యను వీరమువ్వురు కొన్ని జంతువుల నుండి పరిశోధనలు చేసి సీరములను కనిపెట్టియున్నారు. ఇట్టి రసములు పశువు రక్తమునందు ప్రవేశింపగానే శరీరమంతయు వ్యాపించి త్వరలో గుణమిస్తుంది. నాళములోనికి ఎక్కించిన త్వరగా పని చేస్తుంది. సిరలలో కెక్కించిన అంతకంటే ఆలస్యముగాను కండరములలోని కెక్కించిన కొంత ఆలస్యముగా చర్మములోనికెక్కించిన మరికొంత ఆలస్యముగా చర్మములోని కెక్కించిన మరికొంత ఆలస్యముగా వ్యాపించుతుంది. కాబట్టి ప్రాచీన సిద్ధాంతముల ననుసరించియే నేటికిని ఆయుర్వేద పశువైద్యులు వెటరినరీ వారిచ్చు ఇంజెక్షన్సుకు మారుగా జెముడుపాలు మంచినూనె కలిపి పశువులకు వచ్చు చీడసార్లు, దొమ్మ గుఱక మున్నగు అసాధ్య రోగములకు తగుపాటి వెదురు గొట్టముతో ఆయా రోగనిరోధక స్థలములందు టీకాలు వేయుట యిప్పటికిని అందరికి విశదమైయుంది. ఇట్లే యింకను అనేకవిధములుగా ఆయుర్వేద తంత్రకారులు ఇంజెక్షన్ ప్రయోగములు వ్రాసినారు.

కాబట్టి ఆంగ్లాయుర్వేద పద్ధతులు రెంటికిని ఎంతమాత్రము భేదము కాన్పించదు. కాని ఆంగ్లవైద్యమందు వాడు మందులు మాత్రము కొంచెము భేదముగా కన్పించుతాయి. అయినను ఆ మందులన్నియు మన భారతదేశమందు ఉత్పత్తియగు మూలికలవలననే తయారు చేయబడుచు ప్రభుత్వాదరణము చేత ఎక్కువ ప్రాముఖ్యత వహించుచున్నవి. ఈ విషయమై తగిన ప్రయత్నములు జరుగుచున్నాయి.

* * *

పదునాఱవ భాగము

అంటువ్యాధులు

వాత, పిత్త, కఫాలు

సూర్యుడు, చంద్రుడు, వాయుదేవుడు ఈ ముగ్గురివలన వాత, పిత్తకఫాలు కలుగుతూ వుంటాయి. వీటినే త్రిధాతువులంటారు. సూర్యుడు వేడిమిని, చంద్రుడు చల్లదనాన్ని, వాయువు చలనాన్ని కల్గించుతాయి.

వాతము

ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసాలు జరగాలంటే, జీర్ణమండలము పని చేయాలంటే, రక్తాభివృద్ధి కావాలంటే, అవయవాలన్నీ కదలాలంటే వాయువు అవుసరము. వాయువంటే గాలికాదు. గాలిని కూడా స్పర్శకు తెచ్చే తత్వమేదైతేవుందో దానిని వాతమని ఆయుర్వేదము తెలుపుతూవుంది. పశుశరీరములో వుండే నాడులద్వారా ఈ పని జరుగుతూ వుంది. నాడులలో హెచ్చుతగ్గులు లేకుండా సరిగా పని జరుగుతూ వుంటే చక్కగా పని జరిగిపోతుంది. శరీరభాగాలలో నాడులలో హెచ్చుతగ్గులుంటే తప్పక వాతము వచ్చిందన్నమాటే. ఒక్కొక్కపుడు వాతము పశుశరీరమంతటా వ్యాపించితే ముందునాడులలో బాధ ఎక్కువగా వుంటుంది. సాధారణముగా శిశువులకు వాతము చేసిందంటారు. పశువులకు కూడ మానవునకువలె వాతము వలన వచ్చే రోగాలెన్నో యున్నాయి. వాతమధికంగా వుంటే శరీరములో నొప్పులు, పోట్లు కలుగుతాయి. అచ్చటచ్చట వాపులు జనించి తిమ్ములుగానుంటాయి. మలబద్ధకముంటుంది. శరీర మెరుపుగా వుంటుంది. కాళ్లు, కీళ్లుపట్లు పట్టుతాయి. ఇంకా ఎన్నోరకాల లక్షణాలు ఈ వాతరోగాల వలన కలుగుతాయి.

పిత్తము

పిత్తమంటే సూర్యుడు. అగ్నిసంబంధమైనది. పశువు శరీరములో వేడి అవుసరము. తిన్న ఆహారం జీర్ణం కావాలంటే దేహములో వుండే మలిన పదార్థాలను బయటకు పోగొట్టాలంటే, దేహానికి చురుకుదనం, ఉత్సాహం కావాలంటే ఈ పిత్తమత్యంత అవసరం. శరీరములో వుండే అన్ని అవయవాలు పని చేస్తూవుంటే పిత్తం సరిగా పని చేయుచున్నదని గ్రహించాలి. శరీర భాగాలలో జబ్బులు కలుగుతాయి. అంటురోగాలు, జ్వరాలు, తదితర రోగాలు కలుగుతాయి.

శ్లేష్మము

శ్లేష్మమనగా ముక్కులలో వుండే చీమిడివంటి పదార్థము. అది శరీరములో వుంటే యంత్రాలు కదలునపుడు అతివేడి ఎక్కకుండా, అరిగిపోకుండా యీ శ్లేష్మమువంటి జిగురుపదార్థము కాపాడుతుంది. యంత్రాలకు గ్రీజువంటి పదార్థమును ఏ రీతిగా వాడుతామో ఆలాగే పశువు దేహంలో వుండే అవయవాలకు ఈ శ్లేష్మము పని చేస్తుంది. ఈ శ్లేష్మములో జలధాతువు ముఖ్యముగా వుండుట వలన జారుదల కల్గించే

జిగురుపదార్థము కొద్దిగా వుంటుంది. ఈ జిగురు పదార్థము అన్ని అవయవాలలో పరిమితిగా నున్నపుడే ఆ పశువు ఆరోగ్యముగా వుంటుంది. వాతముతోపాటు శ్లేష్మము కూడా కలిసివుంటుంది. శ్వాసరోగాలు కలుగుతాయి.

ఆకుపచ్చ రంగు లేకపోతే అన్ని జంతువుల పనీ సున్నే!

ఈ సృష్టిలో ఆకులే కనుక లేకపోవడం తటస్థిస్తే అన్ని జీవరాసుల పని'నున్న' అయిందన్నమాటే. మనమే కాదు, యావత్తు జంతుకోటి కూడా అంతరించిపోవలసిందే. ప్రపంచంలో ఏ జంతువూ తనంతటతాను ఆహారం సృష్టి చేసుకోగలిగింది లేదు. వరిమొక్క సాయం లేకుండా ధాన్యం మనం చేసుకోగలమా? కందిచెట్టు కనికరించబట్టి కాని కందిపప్పేమిటో మనకు తెలిసివుండేదేనా? పాదులు పండించి పెట్టకుండా పల్లెత్తు కూర మనంతటమనం చేసుకోగలమా? ఇలాగే అన్నీని. మన బతుక్కాధారమైన ఆహార పదార్థాలన్నీ తప్పనిసరిగా వృక్షవర్గం మనకు సృష్టించి పెట్టవలసినదే కాని, మనంతట మనం ఏమాత్రం చేసుకోలేం.

మనమంటే పంటలమీద ఆధారపడి ఉన్నాం గాని మాంసాదులు తినే మిగిలిన జంతుగణం మాటకూడా అల్లాగేనని చెప్పడం ఎందుకంటారేమో? మాంసాహారులైన జంతువులైనా సరే, మాడి చావవలసిందే, వృక్షవర్గం యొక్క ప్రాపులేకపోతేను. మాంసం మాత్రం ఏమిటి ఎలాగొచ్చింది? – గడ్డీగాదమూ కాకపోతే. మాంసం తినడమంటే చివరకు శాకాహారులైన జంతువులను తినడం తప్పమరేమిటి? కొంచెం ఆలోచిస్తే అర్థమవుతుంది. నిజంగా ఈ సృష్టిలో జంతుకోటికంతకీ మూలాధారం వృక్షవర్గమన్న విషయం. మొక్కా, చెట్టువుండబట్టే పిట్ట, పశువు, మనం బ్రతుకుతున్నాం. అయితే ఆ వృక్షవర్గం వేటిమీద ఆధారపడుతుంది అని అడుగుతారేమో. అవి మనలాగ పరాన్నభుక్కులు గావు; స్వతంత్ర జీవులు. వాటంతటవే ఆహారం సృష్టి చేసుకొంటాయి. వాటికి ఇంకొకరి ప్రాపు అవసరం లేదు. మన్నూ నీరూ గాలీ ఉంటే చాలు అవి ఆహారం సృష్టి చేసుకోగలుగుతాయి. ఒక్క తమ పొట్టకేకాదు. భూమిమీద నివసిస్తూ ఉన్న జంతుకోటికంతకీ సృష్టించి పెడుతున్నాయి. వాటి పుణ్యమా అని ఈ ఆహారసృష్టి ఆకుల్లో జరుగుతుంది. ఆ ఆకుమాత్రం ఎలా చేస్తుంది? దాంట్లోనున్న ఆకుపచ్చరంగే అంతా చేస్తుంది.

ఆకుల్లో జరిగే సృష్టి

ఆకుల్లో జరిగే ఈ ఆహారసృష్టి నిజంగాసృష్టే; ఖనిజ పదార్థాలు సేంద్రియ పదార్థాలుగా మారే కర్మాగారం ఆకు అంటేను, ఆకుచేసే అద్భుత కార్యమేమిటంటే మనకెందుకూ పనికిరానివీ, ఏ విధంగానూ ఆహారంగా ఉపయోగించుకోడానికి అనువుకానివీ అయిన పదార్థాల్ని అటుమార్చి ఇటుమార్చి, ప్రాణపోషక మైన ఆహార పదార్థాలుగా తయారు చేసిపెడుతుంది. ఇంకా మర్మం విడిచి చెప్పాలంటే – మన్నూ, నీరూ, గాలి, ఈ మూడును ఆకులో జరిగే ఆహారసృష్టి పరిశ్రమ కవసరమైన ముడిదినుసులు. మన్నులోవుండే ఉప్పులలోని నత్రజని, నీటిలోని ఉదజని, గాలిలోని బొగ్గుపులుసు గాలి, ఇవీ ముందుగా ఆహారసృష్టి

ఆకుకు అందుబాటు కావలసిన ముడిపదార్థాలు. తర్వాత భాస్వరం, పొటాషు, సున్నం, మగ్నం, గంధకం, ఇనుము వగైరా కొన్ని ఖనిజాలు కావాలి. వీటిలో ఏ ఒకటి దానంతటది జంతుకోటికి ఆహారంగా ఎంతమాత్రం పనికిరాదు. ఆకులు వీటిని గ్రహించి, పరస్పరంగా కలిపి (సంయోగం పొందేటట్టు చేసి,) బియ్యం పప్పూ పంచదార మొదలైన సేంద్రియ పదార్థాలుగా తయారుచేసి, ప్రాణికోటికి ప్రసాదిస్తున్నాయి. ఇది అద్భుతమైన సృష్టి వైచిత్ర్యం అంటే అతిశయోక్తి ఏముంది గనుక, పైరుమొక్కలు, (చేలోవేసిన) పేడ ముట్టుకుంటే బెల్లం అవుతుందన్నమాట. బెల్లమంటే బొగ్గు, ఉదజని, ప్రాణవాయువు కలిపి ఏర్పడ్డది. చమురు పదార్థాలు, మాంసకృత్తులు, పిండిపదార్థాలు వగైరా ఆహారవస్తువులు ఇలా మొక్కలు తయారుచేసి యిచ్చినవే.

ఆకుపచ్చరంగు

ఆకు అనే కర్మాగారంలో ఈ పని జరుగుతూ వుంది. దీనిరహస్యం ఆకుపచ్చరంగు (క్లోరాఫిల్) లో ఉంది. (స్వతహాగా పచ్చగా ఉండని ఆకులు గల వనస్పతులు కొన్ని ఉన్నాయి. ఇవి ఇతర చెట్లమీద పరాన్న భుక్కుల్లాగ బ్రతుకుతుంటాయి). ఆకుపచ్చరంగుకు యీ సామర్థ్యం ఎక్కడనుంచి వచ్చింది? సూర్యకాంతిలోనున్న శక్తిని, అది సంగ్రహించ గలగడంవల్ల వచ్చింది. సృష్టిలో ఏ పని జరగాలన్నా, ఏదోరూపంగా కొంత 'శక్తి' అవసరం. ప్రకృతిలో ఐదురకాల శక్తులు (వెలుగు, వేడి, శబ్దం, సూదంటురాయి, ఆకర్షణశక్తి, విద్యుచ్ఛక్తి) ఉన్నాయి. ఈ అన్ని శక్తులకీ మూలం సూర్యుడు. ఈ భూమిమీద ఏమూల, ఏ కాలంలో, ఏ క్రియలో, వ్యక్తమైన శక్తి అయినప్పటికీ, అది అంతా ఆరంభంలో, సూర్యగర్భంలో ఉత్పన్నమైందని స్పష్టమవుతుంది. చిత్రవిచిత్రంగా జీవలక్షణాలు వికసించడానికి కారణమైన శక్తీ, అనంతకోటి జీవాల పోషణకు కావలసిన ఆహారాది పదార్థ ఉత్పత్తికి అవసరమైన శక్తి, మానవుని బుద్ధి విశేషం వల్ల కల్పింపబడిన సకలవిధ సౌకర్యప్రద యంత్రాలను నడపడానికి కావలసిన ఉష్ణవిద్యుదాదిశక్తీ, ఈ మొదలైన సర్వవిధ శక్తులకూ మూలం సూర్యునిలోని నిరంతరం ద్రవ్యవినాశజనితమైన అపారశక్తే ఆదికారణం. జీవజంతువుల శరీరాల్ని నడిపేది ఆహారంలో శక్తి; ఆ శక్తి ఆకులోని పచ్చరంగు సంగ్రహించి, ఆహారద్రవ్యాలు సృష్టించి పెడుతూ వుండడం మూలంగా, మనకు లభ్యమౌతూ వుంది.

బొగ్గు ఎందుకు?

ఆహార పదార్థాలన్నింటిలోనూ సామాన్యంగా వుండే మూలపదార్థం బొగ్గు (Carbon). అసలు పదార్థాలనేవి అన్నీ (బొగ్గు పైన చెప్పిన యితర పదార్థాలు కలిసి) ఏర్పడ్డ యౌగికాలు (Compounds) అని చెప్పవచ్చు. బొగ్గు అంటే మనకందరికీ తెలిసిందే కర్ర కాలిస్తే బొగ్గు వస్తుంది. మెరసిపోతూ మనల్ని మురిపించే వజ్రాలన్నీ శుద్ధ మసిబొగ్గేనని గ్రహించాలి. చెప్పేగాదు, మన శరీరమూ బొగ్గుమయమే. 150 పౌనులు తూగే మానవశరీరంలో పాతిక పౌనులు బొగ్గే. ఈ జీవరాసి, ఆ చెట్టులేదు, జీవం వున్న ప్రతి మొక్కా జీవికూడా బొగ్గువల్ల ఏర్పడ్డదే. అతివిచిత్రమైన ఈ బొగ్గుధాతువు జీవసృష్టికంతకీ కీలకం. అందుకే ఉన్న 92 రకాల ధాతువుల్లో బొగ్గుకు గొప్ప విశిష్టత ఉంది. బొగ్గుతో ఏర్పడ్డ సేంద్రియ పదార్థాలే

ఆహారవస్తువులై జీవజంతువులకు పోషకమవుతున్నాయి. అయినా శుద్ధ మసిబొగ్గు శుద్ధదండుగ. చవిచూడడానికైనా పనికిరాదు. కాని అది లేకపోతే ఏ ప్రాణికి జీవయాత్ర నడువదు. ఆకులోని పచ్చరంగు పుణ్యంగట్టుకొని ఈ అవస్థ తప్పించింది; శుష్కమైన, నిస్సారమైన, ఆమూలద్రవ్యాన్ని ఆశ్చర్యకరంగా రసవంతమై నోరూరే చక్కెరాది ఆహారద్రవ్యాలుగా మార్చేసి మనకు ఇంత ప్రసాదం ప్రసాదిస్తూ ఉంది. ఈ రసోత్పాకమైన మార్పుకు ప్రాణం, 'సూర్యరశ్మి'. దాన్ని సంగ్రహించి అద్భుతసృష్టి క్రియను సాధించే కర్మాగారం ఆకు. దీనికి కీలకం. 'ఆకులోని ఆకుపచ్చరంగు' (క్లోరోఫిల్).

కణాలు

దీని మర్మం కొంత కనిపెడదాం. పచ్చాకుని జాగ్రత్తగా పరిశీలిస్తే అది 'ఈనెల వల' అని తెలుస్తుంది. ఆకుపచ్చగానున్నా, దాంట్లో ఎన్నో అంతస్థుల కణాలు (cells) ఉన్నాయి. ఆకుకు పైనా కిందా పల్చటిపొరలున్నాయి, పై పొరా అడుగుపొరా ఒకేమాదిరిగా ఉండవు. పచ్చగా వుండే పై పొరలో అన్ని మూలలకీ వ్యాపించిన ఈనెలు అమరిఉంటాయి. ఈ ఈనెలు ఆకుని విస్తరించేటట్టు చేయడమే కాకుండా, చెట్టు–భూమిలోనుంచి వేళ్ళద్వారా పీల్చుకొనే నీరూ వగైరా పదార్థాల్ని ఆకు అంతటా అందుబాటయ్యేటట్టు చేస్తుంటాయి. చిన్న చిన్న మొక్కలు మొదలు, బహ్మాండమైన పెద్ద పెద్ద చెట్లవరకూ అన్నింటిలోనూ, భూమిలో నుంచి వీల్చుకొన్న నీరు, ఆకుకి అందుబాటు అవుతుండాలి. ఆకును నూరురెట్లు పెద్దదిగా కనపడేటట్టు చేసే భూతద్దంలో చూస్తే లోపలి భాగాలు స్పష్టంగా కనబడతాయి. ఆకు అనే ఆ కట్టడం లక్షలకొద్దీ గదుల వరసలచేత కట్టబడి ఉండడం తెలుస్తుంది. దీనికి ఇటికలు జీవంతోనున్న కణాలు (cells).

ఆ కణాలలోని జీవపదార్థాన్నే 'ప్రోటోప్లాసం' అంటారు. సకల మార్పులకీ, ప్రాణలక్షణాలు ప్రకటితం కావడానికీ, ఆ పోటోప్లాసమే మూలపదార్థం – జీవపదార్థమున్నూ.

ఆకును అడ్డంగా రెండు పొరలు తెగేటట్టుగా కోసి భూతద్దంతో పరిశీలిస్తే అడుగువైపుని కణాల మధ్య మధ్య ఖాళీ స్థలాలుంటాయి. కొన్ని కొన్నిచోట్ల ఇవి విస్తరించి ఉంటాయి. వీటిపైన ఒక వరస, కణాలు ఒకదానికొకటి చేరివుంటాయి. వాటిపైన ఇంకొక వరసవుంది. ఈ పైవరస ఆకుకీ పైకప్పు అన్నమాట. అడుగు భాగానికి పైకప్పు మధ్యగా, నల్లగా, పొడుగ్గా కనపడే ఆ భాగం ఈనభాగం అని గ్రహించాలి. నీరువంటి పదార్థం ప్రవహించే కాలవవలే ఈనెలు అడుగున భూమినుంచి వేళ్ళద్వారా పీల్చుకొన్న నీరు ఆకులో ఇక్కడికి చేరుతుంది. నీళ్ళంటే వట్టినీళ్ళుగాదు. భూమిలో ఎన్నో ఉప్పులుంటాయని అవి కరిగివున్న నీరు వేళ్లు పీల్చుకుంటాయని విన్నారు గదా. ఆకుకి నీళ్లు కావాలి; అందులోని ఉప్పులూ కావాలి. నీరనేది ఉదజని, ప్రాణవాయువు అన్న రెండు గాలులవల్ల ఏర్పడతాయి. ఆహార నిర్మాణం నిమిత్తం ఆరుకు కావలసినది ఈ రెండు గాలులూ, బొగ్గూనూ. ఈ మూడింటినీ పరస్పరంగా సంయోగం పొందేటట్టు చేసి ఆహారసృష్టి చేస్తుంది ఆకు. ఇందుకు అది తీసుకొన్న పదార్థాన్ని ముందుగా విభజించి, వాటితత్వాల్ని వేరుచేస్తుంది. అందుకు కొంతశక్తి ప్రయోగించాలి. ఆకులోని జీవకణాలు, ఈ కార్యంకోసం,

సూర్యకాంతిలోనున్న శక్తిని గ్రహించి, ప్రయోగిస్తాయి. గ్రహించే కీలకం క్లోరోఫిల్ అన్న ఆకుపచ్చరంగు. ఆవిధంగా ఆహారసృష్టిక్రియ, సూర్యరస్మిలోనే కాని చీకటిలో జరగదు. రాత్రివేళ ఈ కార్యం నిలిచిపోతుంది. చెట్టుకి ఎన్ని లక్షలు ఆకులున్నా అందులో ప్రతీదానికి సూర్యరశ్మి లభించేటట్టుగా ఉండాలి. ఏ చెట్టును చూడండి దాని ఆకులన్నీ అందుకు అనుకూలంగా ఉండే విధంలోనే కొమ్మలమీద ఏర్పాటై ఉంటాయి. ప్రతీ ఆకుకీ ప్రొద్దు కన్పడాలన్న నిత్యనియమం ఒకటున్నదన్నమాట! భూమిలోంచి పీల్చుకొనే ఆ నీళ్లన్నీ ఆహారసృష్టికి అవసరం కాదు. అవసరంలేని నీరు ఆకుల్లోంచి విడిచేస్తాయి. ఆకు పలచగా ఉండడం ఈ పనికి మంచివీలు.

ఆకుకి ఇంక ముఖ్యంగా కావలసిందేమిటంటే బొగ్గు. ఇది గాలిలో అతిస్వల్ప ప్రమాణంలోవున్న బొగ్గుపులుసు గాలిలోంచి తీసుకుంటుందని బొగ్గుపులుసు గాలంటే బొగ్గు ప్రాణవాయువు కలసి ఏర్పడినది. దీన్ని విడగొట్టి కావలసిన బొగ్గు తీసుకొని, తనకు అక్కరలేని ప్రాణవాయువును విడిచేస్తుంది ఆకు. అందుచేత ఆలాగ ఆహారం తయారు చేయడానికి ఆకు తీసుకొనేది బొగ్గు, విడిచేది ప్రాణవాయవు. జీవకోటికంతకి జీవితక్రియ నడవాలంటే, ప్రాణవాయువును లోపలికి పీల్చుకోవడం అత్యంత అవసరం. ప్రతీ ప్రాణి ప్రాణవాయువును పీల్చుకొని, బొగ్గుపులుసు గాలిని విడిచిపెడుతుంది. ఇదే ప్రతిజీవి ఊపిరిపీల్చేటప్పుడు విడిచేటప్పుడు జరిగే పని. ఈ పని వృక్షజాతిలోనూ ప్రతిక్షణం జరుగుతూనే ఉంటుంది. సూర్యరశ్మితో ప్రమేయమున్నదల్లా ఆకులో తిరిగే ఆహారపదార్థాల తయారులోనే. ఆ సందర్భంలో ఆకు విడిచిపెట్టే ప్రాణవాయువు జీవకోటికంతటికి ఉపయోగిస్తుంది. ప్రాణులు అనుక్షణమూ విసర్జిస్తుండే బొగ్గుపులుసు గాలి (ఆహారం సృష్టించే) ఆకులు గ్రహించుకొంటాయి. సృష్టిలో ఈ రెండు పనులు జరక్కపోతే వాతావరణం అంతా బొగ్గుపులుసు గాలితో నిండిపోయి ప్రాణాంతకమవుతుందని కూడా విన్నారు.

130 లక్షల రంధ్రాలు

ఆహారసృష్టికి అవసరమైన ఈ పనులన్నీ జరగటానికి వీలుగా ఉండేటట్టు నిర్మితమైంది ఆకు అనే ప్రయోగశాల. ఆకు అడుగువైపు చూడండి సూక్ష్మద్వారాలు (ముక్కులు అనుకుంటా) ఇవి అనేకం ఉంటాయి. పైకప్పున కూడా కొద్దిగా ఉంటాయి. ఈ ద్వారానికి ఇరుప్రక్కలా రక్షకకణాలున్నాయి. రక్షకకణాలు తలుపులు మాదిరిగా అవసరాన్నిబట్టి ద్వారాన్ని మూస్తూ తెరుస్తూ వుంటాయి. ఈ రంధ్రాలద్వారా ఆహారపదార్థాల తయారుకు అవసరమైన గాలి నీరు సరఫరా అవుతుంది. ఈ రంధ్రాలు బహుసూక్ష్మంగా వుంటాయి. ఒక్కొక్కటి అంగుళములో వెయ్యోవంతు వుంటుంది. అయితే లక్షలకొద్దీ వుంటాయి. ఒక ఆకులో 130 లక్షల రంధ్రాలవరకు కూడా వుండవచ్చు. ఈ రంధ్రాలగుండా ప్రతిక్షణం నీరు ఆవిరిగా బయటకు వదులుతూవుంటాయి. ఆకులు, ఇలా ఆవిరి కావడంలో అవసరాన్నిబట్టి ఎక్కువతక్కువలుగా చేసుకోగల ఉపాయం వుంది ఆకుకి. ఆ రంధ్రానికి ఇరుపక్కలా ఉన్న రక్షకకణాలు ఉబ్బితే ఆ రంధ్రం సన్నగిల్లడం, అవి వడిలిపోయి కాస్త ముడుచుకుపోతే రంధ్రం పెద్దది కావడం జరుగుతుంది.


ఈ ఉపాయం ఏర్పాట్లు మూలంగా తగుమాత్రంగానే నీరును విడవడం, నిల్పుకోవడం చేసుకొంటుంది ఆకు.

ఆకు ప్రకృతిలోకంతకీ ప్రాముఖ్యమైన ఒక కర్మాగారం. జీవకోటికి కావలసిన ఆహారమంతా అందులో సృష్టి అవుతుంది. ఆకు కణాలలోవున్న పచ్చని రేణువులు ఆ కర్మాగారంలో పనిచేసే కార్మికజనం. అవి అతిసూక్ష్మం కావడంచేత మనకళ్ళకు కనబడవు. వందరెట్లు పెద్దవిగా కనపరిచే సూక్ష్మదర్శినితో చూచినా సూదిమొనకంటే పెద్దవిగా కనపడవు. సూర్యరశ్మిలోని శక్తిని సంగ్రహించి ఆహారం తయారుచేసే (క్లోరోఫిలు) పచ్చటి పదార్థం చాలా తమాషయైనది.

భూమినుంచి నీరు, గాలిలోనుంచి బొగ్గుపులుసుగాలి, ఆకులోకి చేరడంతోనే అవి విడిపోయి, మళ్ళీ వీలైనపాళ్ళలో కలుసుకోవడం తేలికైన పనిగాదు. వాటిలోని బొగ్గు ఉదజని ప్రాణవాయవు ముందుగా కలుసుకొని (సంయోగం చెంది), 'కార్బోహైడ్రేట్సు' అనే చక్కెరవంటి పదార్థాలు ఏర్పడడానికి మూలమైన పదార్థం ఒకటి ఏర్పడడం ముందుగా జరుగుతుంది. అది క్రమంగా చక్కర, పిండిపదార్థం, చమురు పదార్థం, మాంసకృత్తులు మొదలైన పదార్థాలుగా మారుతుంది. ఆ తరువాత ఇంకా అవసరమైన ఇతర పదార్థాలుగా పరివర్తనజెందుతుంది. ఇలా తయారైన ఆహార పదార్థాలను దుంప, ఆకు, గింజ, పండు వగైరాల్లో దాచివుంచుతాయి చెట్లు. వీటిని తిని జీవజంతువులన్నీ బ్రతకాలి. అందుకే (మొక్కలు, ఆకులు) ఆకుపచ్చరంగు లేకపోతే అందరిపనీ సున్నా! అన్నది ఇప్పుడర్థమైందా? సృష్టిలోనూ, వ్యవసాయంలోనూ ఇలాంటి రహస్యాలు, చిదంబర రహస్యాలు యిమిడివున్నాయని "విజ్ఞానం" తెలుపుతున్నది.

అంటురోగాల వ్యాపకము

ఒక ప్రాంతంనుండి మరియొక ప్రాంతమునకు అంటువ్యాధులు వ్యాపించుటకు ఇట్టి ప్రాంతములందు కలుగు మనుష్య సంచారము, జంతుసంచారమును కారణములు, పశువులు మేతకొరకు దూర దేశమునకు పోవుట, చచ్చిన జంతువుల మాంసమును మాదిగవాండ్రు వేరొక ప్రదేశమునకు తీసికొనిపోవుట, కాకులు,



కుక్కలు అంటుజాడ్యము గల జంతువుల మాంసమును ఎత్తుకొని అక్కడక్కడ పారవేయుట, అంటువ్యాధులు గల పశువులను సంతలకు తీసికొనిపోవుట, చచ్చిన పశువులను పాతిపెట్టక నదులలో పారవేయుట మున్నగు కారణములవలన అంటువ్యాధులు వ్యాపించుతాయి.

సూక్ష్మజీవులకు కారణము ఈగలే

కొన్ని ఈగలు కరచి రక్తమును పీల్చుతాయి. ఇవి నీటిలో ఎక్కువగా వుంటాయి. మరికొన్ని ఈగలు కరవకుండగనే ఆ జంతువుల శరీరముమీది పుండ్లరసిని గాని లేక క్రుళ్ళుపదార్థములను గాని ఆహారముగా తీసుకొంటాయి. ఇవి ఎరువులో క్రుళ్లిన మాంసపదార్థాలలోనూ లేక జీవించియున్న జంతువుల మాంసకండరములలోనూ ఉత్పత్తియగుతాయి. ఈగలు వాటి కాట్లు దురదను పుట్టించుటయే గాక దొమ్మ, పెద్దపాండు మున్నగు అంటువ్యాధులు కలిగిస్తాయి. ఈగలు నొప్పి కలుగజేయు కాట్లను వేస్తాయి. అందువలన గాయముల నుంచి రక్తము కారుతుంది. అందుచే ఇంకా ఎక్కువ ఈగలుజేరి రక్తమును నష్టపరచుతాయి. కాబట్టి ఈగలను చంపు సూత్రము కనిపెట్టాలి.

ఈగలను నిర్మూలించే పద్ధతులు

1. ఈగలు మృతజీవాలయొక్క పొట్టప్రేగులు, కళేబరముల మీద ఉద్భవించకుండా అట్టి పదార్థములను పాతివేయాలి.

2. ఈగలు అందు పెంపొందకుండా కుళ్లు ఎరువులను చేరనియ్య వద్దు. ఇట్టి ఎరువులను ఏరోజుది ఆరోజు వెంటనే పొలములలో పల్చగా విరజిమ్మవచ్చును. అందుచేత ఈగలు అందుపై చెమ్మలేనందున ఉద్భవించజాలవు. ఈ ఎరువును గుంటలలో పోగుచేసేయెడల దాని నెరలలో ఈగలు పెంపొందకుండా దానిని గట్టిగా అదిమివేయాలి. ఈ ఎరువుమీద ఒక వరుస మట్టి, ఈగలు వాలకుండా జల్లవలెను. బాగా అదిమివేసిన ఎరువు కుళ్లిపోయినపుడు వచ్చే వేడిఆవిరికి ఈగలు పెంపొందజాలవు.

3. ఈగలను వలవేసి పట్టుకొని చంపాలి. ఈ పనికొరకు అనేకరకముల వలలుకలవు. వాటిని కొద్ది ఖరీదుతో చేసికొనవచ్చు.

4. ఈగలను రానీయకుండ చేసే కొన్ని మందులు గొర్రెల శరీరము మీద మరి ఇతర జంతువుల మీద పూసిన ఈగలను రానియ్యకుండా చేయును. వేపనూనె, హారతి కర్పూరము కలిపిన నూనె, తారు కలిపిన నూనె మొదలైనవి ఈగలు రాకుండా తరుచు పూయవచ్చును. ఒక భాగము పాషాణమునకు 40 భాగముల నీళ్ళచొప్పున కలిపిన లోషనులో గొర్రెలను ముంచుట చాలమంచిది. అట్లు తయారు చేయుటకు అనుకూలముగా, పొడిగా మందులు బజారులో దొరకును. వానిని ఎట్లు ఉపయోగింపవలెనో వానిపైనే వ్రాసియుండును.

సూక్ష్మజీవుల జాతులు

సూక్ష్మజీవులలో కొన్ని రకములు వాయుప్రసారము గల స్థలములందే జీవింపగలవు. కొన్ని గాలిలేని స్థలములందే జీవించుతాయి. కొన్ని ప్రాణములు గల భాగములనే తిని బ్రతుకుతాయి. కొన్ని క్రుళ్ళిన నిర్జీవ పదార్థములనే తింటాయి.

చీమును కలిగించు సూక్ష్మజీవులు
క్షయను కలిగించు సూక్ష్మజీవులు
దొమ్మ కలిగించు సూక్ష్మజీవులు
పెద్దరోగమును కలిగించు సూక్ష్మజీవులు
ధనుర్వాతమును కలిగించు సూక్ష్మజీవులు.

ఇవి తమ కనుకూలమగు పరిస్థితులు కలుగువరకును నిద్రావస్థలో నుండి, పరిస్థితులనుకూలించిన వెంటనే విజృంభించి రోగమును వ్యాపింపజేస్తాయి. సూక్ష్మజీవి సామాన్యమగు కంటికి కనబడక పెక్కు రెట్లు పెద్దదిగా గోచరింపజేయు సూక్ష్మదర్శిని లేక భూతదర్పణము సహాయమున మాత్రమే కనబడుతాయి. వీని శరీరపరిమాణము అంగుళములో 1/5570, 1/450 భాగము మాత్రమునుండును. ఇవి వాతావరణమునందును, నీటియందును, ఆహార పదార్థములందును, నేలపై పొరలలోనుండు మట్టియందును జీవించుచుండును. పశువు శరీరముపైనను, జీర్ణకోశమందును కూడ సూక్ష్మజీవులుంటాయి. ఒక్కొక్క జాతి సూక్ష్మజీవికి ఒక్కొక్క గుణముకలదు. కొన్ని దుర్వాయువులను కలిగించుతాయి. కొన్ని దుర్వాయువులను క్రుళ్ళునట్టు చేస్తాయి. కొన్ని త్రుళ్లిన పదార్థములు తిని వానిని శుభ్రపరుచుతాయి. కొన్ని శరీరమునందు వ్యాపించుచు రోగమును కలిగిస్తాయి. కొన్ని తాము కదలకుండా తమ విషమును శరీరమున వ్యాపించుటకు విడుస్తాయి. మరికొన్ని పాలు, పెరుగు, సారాయి మొదలగునవి పులియజేసాయి.


అంటువ్యాధు లెంతకాల ముండునది తెలియజేయు పట్టిక

వ్యాధి పేరు	అంతర్గత కాలము	వ్యాధి నిర్ధారణయగు దినము	పశువును బహిష్కరించ వలసిన కాలము
పెద్దరోగము	2 దినములు మొదలు 8, 14 వరకు	జ్వరము వచ్చిన తరువాత మేత మేయువరకు	పారుడు సాంతముగా కట్టిన వారము దినముల వరకు
దొమ్మ	2 మొదలు 3 దినములు	నోటివెంట చొంగపడుట	పశువు మేత తినువరకు
గురక	24 గంటలు	గురక పెట్టుట	సామాన్యముగా చికిత్సకు లొంగదు
జబ్బవాపు	2 దినములు	జ్వరము తగిలి వాపు కనబడుట	పశువు మేత తినువరకు
కురమ	2 మొదలు 5 దినముల వరకు	అతితీవ్రమైన జ్వరము కలిగి కాళ్ళు పట్టుబట్టుట	పశువు మేత తినువరకు
గాలికుంటు	24 గంటల నుండి 8 దినముల వరకు	తీవ్రమైన జ్వరము పుండ్లు పడుట	పుండ్లు మాని మేత తినువరకు

క్షయ	10 దినముల నుండి కొన్ని వారముల వరకు	దగ్గు, కళ్ళేపడును	దగ్గు కట్టువరకు
మశూచి	3 నుండి 5 దినముల వరకు	తీవ్రమైన జ్వరము రసి కుండలుపోయుట	పొక్కులన్నియు ఊడిపోయిన తరువాత ఒక వారము వరకు
కల్లవాపు	3 నుండి 18 దినముల వరకు	వాపులు వాచును	వాపులు తగ్గి మేత మేయువరకు

పెద్ద రోగము

దీనినే పెద్దరోగము, కింక, చీడపారుడు, సరకు, కలరా, అమ్మవారు, గొట్టాలమ్మ, విషజ్వరమని ఆయా దేశభాషలలో, వాడుక, పేర్లనుబట్టి పేర్కొంటారు.



రక్తసంబంధమగు రోగములలో పెద్దరోగము ప్రస్తుత కాలపరిస్థితులలో చిత్రవిచిత్రముగ సోకుచున్నది. దేశముయొక్క శీతోష్ణస్థితిగతులనుబట్టి కొండ ప్రాంతములందు ఒక విధముగ, నదుల ప్రాంతములందు ఒక మాదిరిగా, అరణ్య ప్రాంతములందు ఒకమాదిరిగి, తదితర ప్రాంతములందు ఒక మాదిరిగను పశువులకు ఈ వ్యాధి సంభవిస్తున్నది. ఈ వ్యాధి రోగనిదానముల మార్పుగూడ ఆయా పశువుల తత్వములనుబట్టి ఆహారమార్పులనుబట్టి మార్పు చెందుటచే రైతులచ్చటచ్చట నిరుత్సాహపడుచున్నారు. పూర్వము ఈ వ్యాధివచ్చిన కొన్ని దినములకే అటో ఇటో తేలిపోయేది. ఇప్పుడు నెలరోజుల వరకు కొన్ని పశువులు బాధపడుచుండుట నా అనుభవముమీద చూస్తున్నాను. ముఖ్యముగా ప్రతి రైతు ఈ దిగువ చూపించిన విషయములను గ్రహించి జాగ్రత్తగా చికిత్స చేసిన ప్రథమములోనే నెమ్మదింపజేయవచ్చును. గ్రామములో ఈ వ్యాధి లేకుండగా నూతనముగా ఏ పశువునకో తరతర జంతువుల వలన సోకినప్పుడు

రోగనిదానమును గ్రహించుట చాలకష్టము. అందువలన వ్యాధి లక్షములు జాగ్రత్తగా పరిశీలించి తగినసేవ చేయవలసియుండును. ఆంగ్లేయ వైద్యసిద్ధాంతమునందు ఈ వ్యాధికి టీకాలుతప్ప వేరు మందులు లేవని తెలిసిరి. వారిదేశములో సరియగు చికిత్సలు లేవేమోకాని మనదేశములో చక్కని మూలికాప్రభావములవలన వ్యాధిని నెమ్మదింపజేయవచ్చునని నా అభిప్రాయము.

స్వభావము – వ్యాపకము

మానవజాతికి కలరా ఎటువంటిదో పశుజాతికి ఈ పెద్దరోగమటువంటిది. పశువులకు సంభవించు వ్యాధులలో నిది ప్రమాదకరమైంది. ఈ వ్యాధి ఒకవిధమగు సూక్ష్మజీవుల వలన కలుగుతున్నది. ఈ సూక్ష్మజీవులు సాధారణముగా గాలిమూలమున పశువు శరీరములో ప్రవేశించుతాయి. దొమ్మ, గురక, జబ్బవావు మున్నగు వ్యాధులను కలిగించు సూక్ష్మజీవులవలెగాక ఇవి మరొక విధముగా వుంటాయి. ఈ వ్యాధికలిగించు సూక్ష్మజీవులను నీడలోనుంచిన రెండుదినములవరకు బ్రతుకుతుంది. ఈ జీవులకు సూర్యోష్ణత సోకినపుడు 12 గంటలలోపుగా చనిపోవును. ఈ సూక్ష్మజీవులు వ్యాధి తగిలిన పశువునుంచి రెండు ఫర్లాంగుల దూరము వరకు వ్యాపించుతాయి. వ్యాధి తగిలిన పశువు రక్తమందు, మాంసకండరములందు పేగులయందు, ఎముకలయందు ఈ జీవులు నివాసమేర్పరచుకొంటాయి. కనుక జబ్బుతోనున్న పశువుల మలమూత్రములు విసర్జించిన ప్రదేశములందెల్లెడలను ఈ వ్యాధి వ్యాపించుతుంది. అందువలన జబ్బుగా నుండు పశువులను మంచి పశువులనుంచి విడదీయాలి. రైతులలో చాలామంది ఈ వ్యాధి ఏరీతి కలుగుచున్నది? తగిన చికిత్స ఏమి? పూర్వమునుంచి ఈ వ్యాధి గ్రామములోనికి రాగానే జాతరలెందుకు చేస్తారు అని పలువిధముల తర్కించుతారు.

18వ శతాబ్దములో ఆసియాలో ఈ వ్యాధిని కలిగించు సూక్ష్మజీవులను కనుగొన్నారు. తరువాత టర్కీ, సైబిరియా, ఆఫ్రికా, ఉగాండ ఈజిప్టు, యూరప్ వరకు వ్యాపించింది. 1711లో ఈ వ్యాధి పరిష్యాలో సోకి కొన్ని కోట్ల పశువులు చచ్చినాయి. 1714లో ఫ్రాన్సు దేశమంతట 1870లో జర్మనీ యుద్ధము జరిగినపుడు ఉత్తర యూరపునకు, 1865 నుంచి 1866 వరకు గ్రేట్ బ్రిటనులోనున్న కసాయి దుకాణముల ద్వారా ఎక్కువగా వ్యాపించింది. ఆ సమయములో నూటికి 90 వరకు మరణించాయి. హిందూదేశమునకు ఆపై ప్రదేశముల నుంచి వచ్చినటుల తెలుస్తున్నది.

ఈ వ్యాధి నెమరువేయు జంతువులకు ఇంకను కోళ్ళకు, కుక్కలకు, పందులకు, దుప్పులకు, పక్షులకు సోకుతుంది. ఈ వ్యాధిని గూర్చి 25 సంవత్సరాల నుండి నాకు మిగుల అనుభవముంది. ఈ వ్యాధిని గూర్చి నేను స్థాపించిన పశువుల ఆస్పత్రి, ఆంధ్రజాతీయ పశువైద్య కళాశాల తరఫున నేను నా శిష్యకోటికి తగిన పరిశోధనలు జరుపుచునేయుంటిమి. కాని పది సంవత్సరములనాటికి ఇప్పటికి వైద్యములో కొన్ని వ్యత్యాసములు వచ్చినవి. పూర్వము చనిపోయినన్ని పశువులు చచ్చుటలేదు. అంతకు ఎక్కువగా చచ్చినవనిన రైతుల అశ్రద్ధయేగాని మరొకటిగాదు. నేను రచించిన పశువైద్య గ్రంథాలమూలాన ఆంధ్రదేశములోనున్న

రైతులలో చాలామంది శాస్త్రసమ్మతముగా చేయుటవలన నా శిష్యులు ఆస్పత్రుల సహాయము వలన ఈ వ్యాధినిగూర్చి ప్రచారము సాగింది. అమ్మవారికి బలులు ఘటపుకుండ, ఊరేగింపులు మా ప్రచారమువలననే తగ్గినవి. ఏ గ్రామములోనోతప్ప ఇప్పటి కాలపరిస్థితులలో బలులు చాలవరకు ఆగిపోయి పూజావిధులతో మ్రొక్కుబడులు చెల్లించుకొనుచున్నారు. ఇంకను యిప్పటి కాలపరిస్థితులలో ఈ వ్యాధికి గ్రామజాతరలు చేసి జంతువులను బలుల నిచ్చుచున్నారనిన అంతకంటే మూర్ఖతలేదు. కాబట్టి రైతు నాయకులంతా ఈ వ్యాధి గ్రామమునకు రాగానే ఈ దిగువ చూపించు విషయములను గ్రహించి తగిన సేవ చేయుదురు గాక.

వ్యాధిసోకే విధానము

ఈ రోగముతోనుండు పశువులను మంచిపశువులు నాకుటచేత రోగపశువుయొక్క మలమూత్రములు, చొంగపడిన మేత వగైరాలు మంచిపశువులు తినుటచేత, తగిలిన పశువులకుపయోగించు తొట్లు, మట్టి పాత్రలు మున్నగునవి మంచిపశువులకు వాడుటచేత, మాదిగవాండ్రు తమ బంధువులకు ఈ వ్యాధి తగిలిన పశువుల మాంసమును పంపించుట చేత, ఈ వ్యాధితగిలిన గ్రామములద్వారా మంచిపశువులను సంతలకు గాని బంధువుల యిండ్లకుగాని తోలుకొని వెళ్ళుట చేత, గ్రద్దలు, కోళ్ళు, కాకులు, కుక్కలు మొదలగు అల్పజంతువులు ఈ వ్యాధిచే చనిపోయిన పశుమాంసము నచ్చటచ్చట తినుచు విడచుటచేత, వ్యాధిగల పశువులను స్టీమర్లలోనుంచి తదితర ప్రాంతాలకు పంపుటచేత, చచ్చిన పశువులను పాతిపెట్టక పోవుటచేత, ఈ వ్యాధిసోకిన ఆవు, గేదె మున్నగు పశువులను మగపశువులు దాటుటచేత ఈ వ్యాధి సోకుతుంది.

ఈ వ్యాధి గేదెలను, దున్నలను ఎక్కువగా బాధించుతుంది. ఒక్కొక సమయములో రైతునకున్న నల్లపశువులన్నియు చనిపోవుటయు గలదు. ఎద్దులకు, ఆవులకు ఈ వ్యాధిసోకిన ఆరంభములో తగిన సలహా తీసుకొని చికిత్స చేసిన నిరభ్యంతరముగ తగ్గుతుంది. ఈ వ్యాధితగిలిన పశువుల చర్మము పైన దద్దురుదద్దురుగా ఒకవిధమగు పూత పూసినట్లుండిన ఆ పశువులకంత ప్రమాదము రాజాలదు. ఈ రోగము వలన ప్రతి సంవత్సరము 3½ లక్షల ఎద్దులు చచ్చుచున్నట్లును, 22 లక్షల మణుగులపాలు తగ్గుచున్నట్లు శాస్త్రజ్ఞుల లెక్కలనుబట్టి తెలుస్తున్నది.

లక్షణాలు

ఈ వ్యాధి సోకినపిమ్మట బయటకు కనపడుటకు 6 నుంచి 8 దినములు వరకు పట్టును. కొన్ని జంతువులకు 10, 16, 30 దినముల వరకు పట్టుతుంది. చాలామంది పారుడు పుట్టిన తరువాత వైద్యులకు చూపించుతారు. ఈ పారుడు పసుపుపచ్చగా నుండి రక్తకండలు పడుచు ముడ్డితీపుగా నుండి పదేపదే విరేచనములగుచు గబ్బిలపు వాసన కొట్టుచున్నపుడు అట్టి పశువు బ్రతుకుట చాల కష్టమని గ్రహించాలి. మిగుల అనుభవం గల వైద్యుడున్న గాని ఇట్టి ప్రమాదస్థితిలో సరియగు చికిత్స చేయజాలడు.

మన రైతులలో అధిక చాదస్తముగలవారున్నారు. ఏ వెంకయ్యో ములగచెక్క రసం ఉప్పు కలిపిపెట్టగా తగ్గినదని చెప్పగానే అదేమాదిరిగా అందరు నమ్మి చేస్తారు. ఇట్లు చేయుట చాలా పొరపాటు.

ప్రథమ అవస్థ

ఈ వ్యాధి సోకినవెంటనే 105, 106 డిగ్రీల జ్వరముంటుంది. మనుష్యులకు పెట్టు ధర్మామీటరునే పశువుల ముడ్డిలో పెట్టిన తెలుస్తుంది. అరమేతమేస్తుంది. ముఖ్యముగా దగ్గుతుంది. కొన్నిటికి యుండదు. చెవుల నుండి రసికారుతుంది. తల నిటునటు కొట్టుకొంటుంది. కనుకొలకులు సూక్ష్మముగ చిట్లి పుసులు



కట్టుతాయి. కొన్నిటికి కండ్లనుండి నీరుగార్చుతాయి. మలము గట్టిగ వేస్తుంది. గుండెతీవ్రముగ కొట్టుకొంటుంది. పాడిపశువులైన వెంటనే పాలు ఎండిపోతాయి. కొన్నిటికి కండ్లు కనురెప్పలు ఎర్రబడుతాయి. ఈ ప్రథమావస్థలోనే రొప్పుపుట్టిన ఆ పశువు బ్రతుకుట కష్టము. కావున జాగ్రత్తగా పరిశీలించి రొప్పును పోగొట్టు సదుపాయాలు చేయాలి.

రెండవ అవస్థ

పశువు నోటిలోపల ఎరువుగా కంది పొక్కులు పొక్కులుగా వుంటాయి. ఈ అవస్థనుంచి మేత నీరుమాని చెవులను వ్రేలాడవేస్తుంది. క్రమేపి జ్వరము తగ్గుతుంది. ముక్కులగుండ చిక్కని చీమిడి నోటిగుండ చొంగపడుతుంది. ముక్కులను శుభ్రముగా కడుగనిచో పురుగులుపడతాయి. నోటిలోపలనుంచి ఒక విధమగు దుర్వాసన వేస్తుంది. ప్రథమావస్థలోనే దుక్కిటెద్దులను బండిపనిగాని నాగలిపనిగాని చేయించిన ఆ పశువులకు కూడ ప్రమాదము కలుగుతుంది. నా అనుభవముమీద ఇట్టి పశువులకు ఎంతో అనుభవచికిత్స చేసినగాని తగ్గవు. శరీరమందేభాగమందైన ఈ రెండవ అవస్థలో ఒక విధమగు వాపులు పుట్టుతాయి. ఈ వాపులు మెత్తగాగాని గట్టిగగానియుంటాయి, క్రమేపి కనుకొలుకులు ఒరిసిపుండ్లు పడుతాయి. ఆడపశువులైన యెడల శరీరముమీద పుండ్లుపడి ఎరుపురంగుగా వుంటుంది. దీనిని మశూచి పూతయందురు. కండనుండి కారునీరు వగరుగా కారముగ వుంటుంది. దాహమెక్కువగును. ఆకలి మందగిస్తుంది. నాడి తీవ్రముగ

కొట్టుకొంటుంది. విరేచనము పులుసు వాసనగ కొద్ది పసుపురంగుగా నుండి దినమునకు రెండుమూడు పర్యాయములు పారుతుంది.

మూడవ అవస్థ

ఈ అవస్థలో పశువు మిక్కిలి శుష్కించి చాలా విచారకరముగా ఉంటుంది. వ్యాధి ముదిరినకొలది విరేచనముల రంగుమారి దుర్వాసనగా వుంటుంది. ముడ్డిలోపల తేంద్రుపుట్టి ముక్కుచుండును. జ్వరము క్రమేపి తగ్గుతుంది. ఈ సమయంలో జ్వరము తగ్గకుండ విరేచనములను కట్టించు సదుపాయముల చేయాలి. ఉచ్ఛ్వాస నిశ్వాసముల నాటంకపరచుచు నీరసింపజేస్తుంది. పసుపురంగు నీరువలె పదేపదేపారుతుంది.

నాలుగవ అవస్థ

పశువు శరీరము కాళ్ళు, ముఖముల రంగుమారి ముడతలు పడతాయి. శరీర వేడితగ్గి శీతలములోనికి వస్తుంది. మూత్రకోశము చెడుతుంది. నాలిక తెలుపు – పసుపు కలిపిన రంగుగావుంటుంది. నోరంతయు ఆరిపోయి, దాహమెక్కువవుతుంది. కొన్ని దాహమునుకోరవు. ప్రేగులు అరుస్తాయి. కాళ్ళనరములు లాగుతాయి. పశువు నిలబడుచు లేచుచు బాధపడుతుంది. దేహమంతయు శీతలములోనికి వస్తుంది. కనుగుంటలు విడుస్తుంది. పెట్టిన మందులు మలముగుండాపోతాయి. కండలు కండలుగా కొద్దిగా పారుచు బరి ఎముకలు బయటపడి నీరసించి మరణిస్తుంది. కొన్ని పశువుల తత్వమునుబట్టి పై లక్షణములలో మార్పులుండుటయు గలదు. కాబట్టి జాగ్రత్తగా చికిత్స చేయుట మంచిది.

సంరక్షణ

ఈ వ్యాధికి ఔషధములకన్న సంరక్షణ చేయుటయే ముఖ్యము. రైతులలో చాలామంది పశువులను చలిగాలిలో నుంచుతారు. మరికొందరు ఎండలో కట్టుతారు. ఇంక కొందరు పెంటకుప్పలందును, గాలి, వెలుతురు లేనిచోటులందు కట్టుతారు. ఈ వ్యాధి వర్షాకాలమం దెక్కువగా వేసవికాలమందు తక్కువగా ప్రబలుతుంది. తడియనీయక ఆయా కాలపరిస్థితులను బట్టి జాగ్రత్తగా కాపాడాలి. ప్రతిగంటకు ముక్కులను నోటిని పటిక నీటితోగాని, తదితర వగరు పదార్థాలతోగాని కడుగుచు ఈగలు వాలకుండ కాపాడుచు దాహము కావలెనని కోరికయున్న అర్ధగా కాచిననీరు పెట్టుచు అప్పుడప్పుడు ముక్కు రంధ్రములకు మంచినూనెను రాయుచు మలమూత్రములను తీసివేయుచు, కండ్లను పరిశుభ్రము చేయుచు, కుక్కలను, కాకులను, మంచిపశువులను దగ్గరకు రానీయకుండ కాపాడుచు, విరేచనములగుచున్నపుడు తీసివేసి నేలను పాటిమట్టితోగాని, సున్నముతోగాని చల్లి శుభ్రము చేయుచు, కాపాడుచున్న యెడల తగ్గిపోతుంది.

రోగపరీక్ష

జబ్బు రాగానే కండ్ల కొలుకులు ఒరిసినవా? పశువు అప్పుడప్పుడు నల్లకప్పు వేస్తున్నదా? పశువు పనిచేసి వచ్చినదా? బాధ వలన పండ్లు కొరుకుచున్నదా? చూడిపశువైనచో లోపల పిండము తిరుగుచున్నదా?

దగ్గు అప్పుడప్పుడు వస్తున్నదా? తీవ్రముగానున్నదా? చెవుల మొదట మనచేతి గుప్పిళతో పట్టుకొనిన వేడిగానున్నదా? సమశీతలముగానున్నదా? చల్లగానున్నదా? అదివరకా పశువునకు యే యే పదార్థములు పెట్టినారు? పాడిపశువులైన పాలన్నియూ ఎండిపోయిననా? దూడయున్న పాలుకుడిపినారా? గ్రామములో ఎన్నిచోట్ల ఈ వ్యాధికలదు? మున్నగు ప్రశ్నలన్నింటికి సమాధానము తెచ్చుకొని చికిత్స చేసుకొనుట మంచిది.

చికిత్స ఆరంభములో చింతపండు పులుసుసేరు, ఉప్పు 6 తులములు కలిపి తగిలిన వెంటనే ఒక్క పర్యాయమే పెట్టుము. లేక శొంఠి 1 తు, వాము అరగుప్పెడు మోదుగపువ్వు 1½ తు, ఉప్పు 3 తు, బియ్యపు నీరు శేరుకలిపి ఒక పర్యాయమే త్రాగించాలి.

లేక ఉదయముపూట 100 న్ను సాయంకాలము 100 న్ను తమలపాకులకు మంచినూనె రాసి తినిపించాలి.

లేక వెల్లుల్లిపాయలు 2, తు. వాము 4 తు, ఉప్పు 4 తు, చింతపండు పులుసు అర్ధసేరుకలిపి నీరు అర్ధసేరు కలిపి ఒక్క మోతాదే ఈయాలి.

లేక వెదురాకు అరగుప్పెడు, నేలనేము 1 తు, నల్లేరు వేళ్ళు 1 తు, తెల్లఆవాలు 1 తు, బియ్యపునీరు సేరు, కలిపి త్రాగించాలి.

లేక నేలవేము 2 తు, మోదుగపువ్వు 6 తు, నువ్వులనూనె అర్ధసేరు కలిపి త్రాగించాలి.

లేక నల్లేరుకాడల రసము 3 తు, వెల్లుల్లిరసము 4 తు, నువ్వులనూనె అర్ధశేరు కలిపి త్రాగించాలి.

లేక ముండ్లను తీసివేసి నాగజెముడు త్రొక్కి దానిలో శొంఠి మిరియాలు, కరక్కాయలు, తాడికాయలు, ఉసిరికపప్పు ఒక్కొక్కటి 2 తులములు తీసికొని చూర్ణముచేసి మెత్తగా త్రొక్కి ఈ మందునే మూడుభాగములు చేసి ఉదయ, మధ్యాహ్న, సాయంకాలములందు అర్ధసేరు నీటితో కలిపి పెట్టాలి. పై మందులన్నియు వ్యాధిసోకిన ప్రథమ, ద్వితీయ అవస్థలలో ఒకటి రెండు మోతాదులకంటె పెట్టరాదు.

ఈ వ్యాధి పశువులకు శీతలము రానీయకుండ కాపాడాలి. చాలామంది సారాయిని వ్యాధి ప్రారంభించినలగాయతు వాడుతారు. ఇది చాలా పొరపాటు. అనవసర ఖర్చుతప్ప అంతమాత్రమునకే తగ్గదు.

పశువు వ్యాధిసోకిన తరువాత పేడ మాదిరిగా పారుచున్నదా? లేక పసుపురంగుగా గాని, రక్తజీరతో గాని, పారుతున్నదా? రోజుకు ఎన్నిమార్లు పారుతున్నది? పారుచున్నపుడు ముక్కుడు, ముడ్డితీపున్నదా? దాహమునకెన్ని పర్యాయములు తాగుతున్నది, మున్నగు విషయములు పరీక్షించాలి.

దినమునకు రెండు మూడు పర్యాయములు పారుచున్న యెడల పచ్చి తుమ్మచెక్క, పచ్చి నేరేడుచెక్కను తెచ్చి నీరుపోసి త్రొక్కి 2 శేర్లు చిక్కనిరసము వచ్చునట్లుగా చేసి కాచి రెండువేళల పెట్టాలి. ఈ చికిత్సకు గూడ పారుడు కట్టనిచో మరొక మోతాదు ఈయవచ్చును.

లేక దానిమ్మచిగుళ్ళను 15 తులములు తెచ్చి మెత్తగా నూరి అర్ధసేరు పెరుగుతో పెట్టాలి. లేక పైడిప్రత్తి ఆకురసము సేరు, మజ్జిగ అర్ధసేరు కలిపి కాచిపెట్టాలి. లేక నేలతంగేడాకును కచ్చకచ్చగా దంచి, సేరు మజ్జిగలో కలిపి త్రాగించాలి. ఈ చికిత్సలన్నియు విరేచనములు తీవ్రముగానగుచు లోపల జ్వరము తగ్గకుండా నున్నపుడు విరేచనములు కట్టువరకు మూడు నాలుగు పర్యాయముల వరకు పెట్టవచ్చును. ఈ మందులు పెట్టునపుడు విరేచనములు కట్టినచో వెంటనే ఆపాలి. లేనిచో మలబద్ధకము కలిగి వగర్పు పుట్టుతుంది. ఇంకను దేహమంతయు మిగుల వేడిగానుండి విరేచనములగుచున్నపుడు అరటిదుంపను మానెడు నీటిలో వేసి దంచి రసముతీసి దానిలో తవ్వెడు జొన్నపిండి కలిపి కాచి చల్లార్చి పెట్టవలెను. లేక తంగేడాకుపసరు సేరు, పెరుగు అర్ధసేరు కలిపి త్రాగించాలి.

ఎన్ని మందులు పెట్టినను పారుడు కట్టనపుడు వరిపిండిసోలెడు, హారతి కర్పూరము ¼ తులము, పాలు సేరు, కవిరి 2తు కలిపి త్రాగించాలి.

లేక సీమసున్నం 4 తు, కవిరి 2 తు, మాచికాయలు 1 తు, నల్లమందు ¼ తు, గంజాయిపత్రి ½ తు, వరినూకలజావ సేరు కలిపి పారుడు తగ్గువరకు ఒకటి రెండు మోతాదులు ఈయాలి.

పారుడుకట్టుటకు ఫార్మసీవారి బేలుపొడరు బాగుగా పని చేస్తుంది.

కల్లవాపులకు, పుండ్లకు చికిత్స

కొన్ని పశువుల శరీరము మీద ఏ భాగమందయినను గట్టిగాగాని, మెత్తగాగాని వాపులు పుట్టుతాయి. ఈ వాపులు నెలరోజుల వరకు కూడ యుండవచ్చును. ఒక్కొక్క సమయములో ఎన్ని మందులు రాసినను తగ్గక రక్తముపట్టిన తరువాత తగ్గుటయుగలదు. ఆ వాపులమీద చవుడు సున్నము కలిపి చుక్కలు పెట్టాలి. లేక చేదుజీలకర్ర అరతులము, ఆవపిండి అర తులము, దుష్టపాకు గాని గాడిదగడపాకు పసరుగాని 10 తులములు కలిపి అప్పుడప్పుడు రాసిన తగ్గును. లేక హారతికర్పూరము పావు తులం, కొబ్బరినూనె 6 తులములు తీసుకొని గోరువెచ్చగా కాచి వాపులకు పట్టించి వేడినీటి కాపులు కాయాలి.

ఫార్మసీవారి స్ప్రెయిన్‌కిల్లరు లేక వెటరినరీ ప్లాస్టరును పై వాపులకు వాడవచ్చును.

చూడిపశువుల గతి

సామాన్యముగా చూడిపశువులకు ఈ వ్యాధి తేలికగ తగిలినతప్ప బాగుగా తగిలిన బ్రతుకుట కష్టము. తేలికగా తగిలిన బ్రతికినను తప్పక ఈచుకొనిపోతాయి. కాబట్టి పైన చెప్పిన చికిత్సలనే చేయుచు జాగ్రత్తగా సంరక్షణ చేయాలి. ఈ వ్యాధిచే మాసములు వచ్చిగాని రాకగాని పిండమునకు పశువునకు అపాయము వచ్చిన ఈ దిగువ లక్షణములుంటాయి. పశువు సొమ్మసిల్లుతుంది. శరీరమంత జిగటవంటి దుర్గంధము పుట్టుతుంది. గర్భము నుండి రక్తమువంటి ద్రవము స్రవిస్తుంది. మూత్రము మైల ఎక్కువగాపడుచూ, ఆయాసపడుతుంది. ఈ సమయములో అనుభవము గలవారిని రప్పించి పిండమును లాగించాలి. తరువాత

వెన్నెముకకు, తొంటిభాగమునకు పుట్టమన్ను వావిలాకు పసరు కలిపి ఉడికించి పట్టువేయాలి. మానమును వగరునీటితో కడుగుచుండాలి. వెంటనే లోపలికి 3 డ్రాముల సారాయినిగాని, శేరుపాలలో 4 తులముల మంచిఇంగువ, అర్ధ సేరు తుమ్మను వుండకలిపి గోరువెచ్చగ కాచిపెట్టాలి. చలిగాలిలోను, వర్షములోను యుంచరాదు. సూతికావాతము రాకుండ కాపాడాలి. ఎక్కువ మైలపడు–చున్నపుడు కరివేపాకు ఉండ నిమ్మకాయంత మోతాదు వంతున రెండుమూడు రోజులు పెట్టాలి. రోగలక్షణములు తగ్గుచుండిన కాచిన నీరు అర్ధగా పెట్టాలి. ఈ వ్యాధి తగిలి నిండు చూలుతోనున్నపుడు పశురక్షామృతమును యిచ్చిన వెంటనే ప్రసవిస్తుంది.

పథ్యము

రైతులలో చాలామంది వ్యాధి కలిగిన పశువులకు నీరు, మేత పెట్టరాదని చెప్పుతారు. మరికొందరు నీరుపెట్టుట బొత్తిగా మానివేయుటవలన ఆహారనాళము ఎండి మరణించుచున్నవి. ఇప్పటి కాలపరిస్థితులలో "పశువుపోతే బ్రతుకుపోవురా" యను సిద్ధాంతముతో ఎట్టి చిన్న పశువునకయినను తగు జాగ్రత్తగా చికిత్సలు చేస్తున్నారు. ఈ పది సంవత్సరములలోపల ఇట్టి శ్రద్ధపశువులకు అంతగా లేదు. ఇప్పుడిప్పుడే ప్రతి రైతు పశుసంబంధమైన విషయాలను గ్రహిస్తున్నాడు. నేను ఈ చింతామణిని 1928లో ప్రకటించినప్పుడు ఈ గ్రంథముచూచి అనుభవముతో చికిత్సలు చేసి రైతుల గౌరవమును పొందినవారెందరో మన ఆంధ్రదేశములోనున్నారు. వారునన్ను అడుగు సలహాలు చికిత్సలు చూచిన నాకు అత్యంతానందము కలిగింది. కొంతమంది రైతులు గ్రంథమున్న పశువైద్యము వచ్చునా అని ప్రశ్నలు వేసేవారున్నారు. వీరికి శాస్త్రజ్ఞానముతోనున్న గ్రంథములో కొన్ని కాకపోయిన మరికొన్ని ప్రాథమిక చికిత్సకైన ఉపయోగపడునని తెలియదు.

పెద్దరోగము గల పశువులకు నూకలజావ పెట్టిన ఆహారకోశము శీతలములోనికి వచ్చునని భయపడతారు. కాని అతిగా విరేచనములగుచు శరీరముతా శుష్కించి నీటికొరకు, ఆహారము కొరకు ఎదురు చూచునప్పుడు సేరుజావలో కొద్ది సారాయి కలిపి అప్పుడప్పుడు యిచ్చుట మంచిది. ఆహార విషయములో మొదటిదశ రెండవదశ సగములో అరమేత మేయునుగాన ఆహారము పెట్టనవసరములేదు. నూకలజావతో తేలికగా జీర్ణమగు గుణముకలదు. ఈ జావ పెట్టుటవలన పశువు నిస్త్రాణజెందదు. లోపలదండిగా వుంటుంది. ఎక్కువగాను పెట్టరాదు. నిలువయున్న జావను త్రాగించరాదు. ఈ వ్యాధిగల పశువులకు ద్రవపదార్థములుతప్ప పిండిపదార్థములను పెట్టరాదు. దీని విషయములో వ్యాధి సోకినది లగాయతు నెమ్మదియగు వరకు తుమ్మచెక్క గాని, రావిచెక్క గాని వేసి సలసలకాగిన తేలిక కషాయమును చల్లార్చి పెట్టుటమంచిది. ఈ కషాయమును పెట్టుటవలన నీరు అర్ధగాత్రాగుతుంది. ప్రేగులు, నోరు గారపట్టుతుంది. పారుడుకూడ గట్టిపడుతుంది. అనుభవము మీద ఈ కషాయమే బాగుగా పని చేయుచున్నదని తెలుపుతున్నాను. ఇంకను వేడిజేసి చల్లార్చిన నీటిలో కొద్దిగా పసుపువేసి పెట్టవచ్చును. వ్యాధి తిరిగిన

తరువాత కూడ జావ, వగరు కషాయములు తేలికగా తయారుచేసి పెట్టాలి. రోగమునుండి తేలిన పశువులను పక్షము దినములవరకు మందలో కలుపరాదు. నూకలు తేలికగ వేయించి కాచి జావ పెట్టుట మంచిది.

వ్యాధిని నివారించు మార్గములు

గ్రామములో ఈ రోగము రాగానే జాడ్యము తగిలినవాటిని తక్షణమే మరొకచోట కట్టివేయాలి. కొంతమంది రైతులు దేవుడుంటే ఎచ్చట కట్టివేసినా ఫరవాలేదని తీగెలు తీయుచు పశువుమీద ప్రేమలేక మాట్లాడతారు. మనిషికీ కలరారాగానే "అమ్మో నాయనో" యని గుండెలు బాదుకొంటారు. దరికి యెవ్వరిని రానీయరు, ఎందువలన? వారికికూడ తగులుతుందని భయం అట్లే మంచిపశువును జబ్బుపశువుతో నుంచండి. అదియెంత బాధపడునో జాగ్రత్తగా చూచిన తెలుస్తుంది. కాబట్టి తప్పక జబ్బుపశువులను విడదీయాలి. జబ్బు పశువులున్న స్థలమునకు సంబంధించిన కొట్టపుగోడలు, నేలనీటితొట్టెలు శుభ్రముగా నుంచాలి. రోగపశువులకు చికిత్స చేయువారుగాని, అంటుసోకియుండు స్థలములలో తిరుగు కుక్కలు, కాకులను గాని మంచి పశువులున్నచోటుకు రానీయరాదు. చచ్చిన పశువులను మాత్రము కోయించక పది పండ్రెండడుగుల లోతున గుంటతీసి దానిలో పూడ్చుటమంచిది.


జంతురక్షణి

సహదేవ పశువైద్య ఫార్మసీవారిచే శాస్త్రోక్తముగా తయారు చేయబడిన జంతురక్షణిని మాత్రము ఈ వ్యాధి గ్రామములోనున్నదనగానే ప్రతివారు వారియొక్క మంచిపశువులన్నిటికీ – ముందుగనే యిచ్చిన సోకదు. ఎన్నో వేలపశువులను రక్షించింది ఈ జంతురక్షణి. పెద్దరోగము తగిలి ప్రథమావస్థలో నున్న పశువులకుకూడ ఒకటి రెండుమోతాదులు జంతురక్షణి యిచ్చిన తగ్గుతుంది. ఇంకను గురక, దొమ్ములు, జెబ్బవాపు మున్నగు అంటురోగాలకుకూడా ఈ జంతురక్షణి అత్యద్భుతంగా పని చేస్తుంది.

దొమ్మ రోగము

స్వభావము – వ్యాపకము

దొమ్మరోగమును గూర్చి అనేకమంది అనేకరీతులుగా పేర్లుపెట్టి పశువులకు వివిధ చికిత్సలు చేస్తారు. పశువులకు సంభవించు రోగములన్నిటిలో దొమ్మ మిగులహానికరమైంది. ఇది ఒక జంతువునుండి మరొక జంతువునకు సోకు రోగమైయుంది. ఎంతో అనుభవమున్ననే గాని ఈ వ్యాధిని వైద్యుడు కనిపెట్టజాలడు. పెద్దరోగము కలిగిన పశువు ఎక్కువకాలముండక గంటల ప్రకారము చచ్చిపోతుంది. అందుచేత రైతులు ఆతురతపడుతుంటారు. పెద్దరోగమంత తీవ్రముగా అన్ని పశువులకు సోకదు. ఈ వ్యాధిని కలిగించు సూక్ష్మజీవులు మట్టితో కలిసి పది సంవత్సరముల వరకు జీవించియుంటాయి. ఈ సూక్ష్మజీవుల గ్రుడ్లను సీలు చేసిన గొట్టములో పెట్టి కాపాడగా 22 సంవత్సరముల వరకు బ్రతికినవని లూయీఫాస్టర్ దొరగారు తెలిపారు. పల్లపునేలలోనుండు గడ్డివేళ్ళను ఈ సూక్ష్మజీవులంటి యుండి పశువు మేయునపుడు ఆగడ్డితోగూడ




శరీరములోనికి ప్రవేశించిన తరువాత ఈ వ్యాధి సోకుతుంది. ఎఱ్ఱలు విశేషముగా నుండు నేలలో ఈ వ్యాధి ఎక్కువగా వుంటుంది. ఈ జాడ్యపు విషాంకురములు మనుష్యులకుండు గాయములగుండ ప్రవేశించిన రాచపుండ్లు, చెడువ్రణములు కలిగిస్తాయి. ఈ వ్యాధిగల పశువును చికిత్సంచు వైద్యుడు చాలా వరి శుభ్రముగా నుండి జాగ్రత్తగా చికిత్స చేయాలి.

చచ్చిన జంతువులను కాల్చక, పాతిపెట్టక పోవుట చేత ప్రవహించు కాలువలలోను, నదులలోను కళేబరములను పారవేయుటచేత, ఈ వ్యాధిచే బాధపడు పశువు దగ్గరనున్న మలమూత్రాదులు మున్నగునవి బాగుచేయక అచ్చటనే యుంచుటచేత, ఈ రోగపశువు నెత్తురుమీద తదితర స్థానములందు ఈగలు వాలి అవి మంచిపశువుల పుండ్లమీద, గాయములమీద వ్రాలుట చేతను యీ వ్యాధి ఎక్కువగును. చూడిపశువులకు ఈ వ్యాధి తగిలిన లోపలి పిండమునకు మాత్రము తగలదనియు, అచ్చట విషజీవులను చంపు పదార్థమొకటి కలదని పశుశాస్త్రజ్ఞులు తెలిపియుండిరి. ఈ వ్యాధి పశువులకు, గుఱ్ఱములకు, గాడిదలకు, మేకలకు, పందులకు సోకుతుంది. దొమ్మరోగముచే చనిపోయిన పశువు చర్మముల ద్వారా, కంబళ్ళద్వారా, ఎరువులద్వారా ఈ వ్యాధి రావచ్చును. ఐరోపా, ఇండియా, సౌత్ ఆఫ్రికా, ఆర్జంటయినా దేశములలో ఈ వ్యాధి తగిలి చాలా పశువులు మరణించాయి. ఈ వ్యాధి తగిలిన పశువులలో నూటికి 90 వరకు చనిపోతాయి. 1845లో అయివెస్టుదొర ఈ వ్యాధిని కనుగొనెను. ఈ సూక్ష్మజీవి 1.5 నుంచి 4.0 పొడవు 1.0 నుంచి 1.5 వెడల్పు గలిగి గొలుసు ఆకారముగా ఉంటుంది.

లక్షణాలు

పశువు ఆరోగ్యముగ నుండినట్లే యుండి అకస్మాత్తుగా చనిపోవుటయు గలదు. అట్లుగాక లక్షణములు కనపడినయెడల జంతువునకు తీవ్రమైన జ్వరము (106, 107 డిగ్రీలవేడిమి) యుంటుంది. పశువు గజగజ వణుకుతుంది. కన్నులనుండి నీరు కార్చును. దీనముగా చూస్తుంది. కన్ను ముక్కు నోరు మున్నగు వానిలోపలి చర్మపుపొరలు ఎక్కువగా కందియుంటాయి. నాడి తీవ్రముగా కొట్టుకొంటుంది. కన్నులు, ముక్కు, కొమ్ములు, పాదములు చల్లగానుండును. నల్లకప్పు వేస్తాయి. కాళ్ళు గుదులుపెట్టి నిలువలేక తూలుతుంది. చెవులను వ్రేలాడవేస్తుంది. ముక్కులయందు చెమటయుండదు. ఆయాసమెక్కువగా

యుంటుంది. నోటినుండి నీరు కొద్దికొద్దిగా పడుతుంది. లోపలికఫము బైటకు తన్నుచుండుట చేత నాలుకను జారవిడుస్తుంది. కడుపుబ్బుతుంది. నెత్తురు విరేచనములు కొద్దికొద్దిగా అవుతాయి. క్రమేపి తూలుచు కండ్లలో నిస్సత్తువ యేర్పడి క్రిందబడి మరణిస్తుంది. ఈ వ్యాధి 24 గంటలనుంచి 48 గంటల వరకు యుండవచ్చును, లేక యీలోపుగనే చచ్చుటయుగలదు. చచ్చినతరువాత మలకోశము ఉబ్బుతుంది.



ఆయుర్వేద చికిత్సలు

ఆరంభములోనే ఈ వ్యాధిని కనుగొనిన మూడుద్రాముల సారాయిని పట్టాలి. లేక సేరునీటిలో రెండుగుప్పెళ్ళు ఎండుమిరపకాయలు వేసి సలసల కాగనిచ్చి పిసికి, వడపోసి కాఫీ త్రాగునంత వేడితో నున్నపుడు త్రాగించాలి.

లేక ముద్దకర్పూరం అరతులము, మంచి బెల్లం 10 తులములు, కొట్టుపసుపు 1 తులము మెత్తగా నూరి ముద్దచేసి ములగచెక్క రసముతో పదునుచేసి పెట్టాలి.

లేక శొంఠి 3 తులములు, పిప్పళ్ళు మిరియములు 6 తులములు, కరక్కాయలు 3 తులములు, ఉసిరికపప్పు 2 తులములు, కొట్టుపసుపు 3 తులములు, కలిపి మెత్తగా నూరి సేరు చింతపండు పులుసుతో కాని, సేరున్నర బియ్యపుకలితో కాని ఒక్క మోతాదే ఈయాలి. లేక వెల్లుల్లిపాయలు 10 తులములు, పసుపు 8 తు, ఉప్పు 10 తు. తెల్లతుమ్మచెక్క రసము సేరు, మేకమూత్రము అర్ధసేరు కలిపి, కాచిపెట్టాలి. ఈరీతిగ 6 గంటల కొకపర్యాయము చేయాలి.

లేక శొంఠి పిప్పళ్ళు, మిరియాలు ఒక్కొక్కటి 4 తులములున్ను, దిరిసెనాకు పసరు సేరు, మేకపంచితము అర్ధసేరు కలిపి రెండుగొట్టముల వంతున మూడుసార్లు ఈయాలి. మంచిపశువులకు సోకకుండ దొమ్మలన్నిటికి జంతురక్షిణి వాడుడు.

లేక నల్ల ఉలవలను వేయించి నరమూత్రముతో పెట్టిన తగ్గుతుంది.

పథ్యము : వ్యాధి తగ్గువరకు నీరు, ఆహారము పెట్టరాదు. వ్యాధి తగ్గిన నాలుగు దినములవరకు కాచిన నీరు, కొర్రజావ వగైరా పెట్టవచ్చును.


మిడిదొమ్మ : స్వభావము - వ్యాపకము

ఈ చింతామణిలో తెలిపిన రోగలక్షణములలోనున్నవేగాక పశువులయొక్క తత్వములను బట్టి ఆయా కాలపరిస్థితులనుబట్టి ఇంకను కొద్దిగా మార్పులు కలుగవచ్చును. గాన వైద్యుడు పశువుయొక్క తత్వమును బట్టి రోగనిదానము గ్రహించి చికిత్స చేయుట మంచిది గాని ఈ చింతామణిలోని లక్షణాలన్నీ లేవేయని అనుమానించరాదు.

జీర్ణకోశము తగినంత పని చేయకపోవుట చేత రక్తహీనత వలన, అజీర్తి వలన, ఎక్కువగా ఎండలో పని చేయుచుండుట వలన, గుండె అదురుటవలన ఈ వ్యాధివస్తుంది. లేదా ఒకటి రెండుదినములకు తరువాత తీక్షణమగు గుణములుపుట్టి మృతినొందుతుంది. చక్కగా కండబట్టి బలిసియుండు గిత్తలకు, కోడెదూడలకు తరచుగా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి తగిలిన పశువు బ్రతుకుట చాలకష్టము. అందువలననే మిడిదొమ్మయని పేరువచ్చింది.

లక్షణాలు

ఆరంభములో మందమతిగానుంటూ అరమేతమేస్తుంది. ముఖ్యముగ నల్లకప్పు వేస్తుంది. జ్వరముకూడ తీవ్రముగా వుంటుంది. గుండె చెడిపోతుంది. ముక్కు రంధ్రముల పై భాగమున వాపుపుట్టి క్రమముగ



మిడిదొమ్మ

పెద్దదవుతుంది. మెదడులోనికి నెత్తురు విశేషించిపోతుంది. వాపు పెద్దదయిన కొలది ఊపిరిపీల్చుట కష్టముగవుంటుంది. చొంగ ముక్కులనుండి నోటినుండి ఎక్కువగాపడుతుంది. ఒకవిధమగు గురక పుట్టుతుంది. కండ్లు వాచి పశువు దీనముగా చూస్తూ కన్నీరు కారుస్తుంది. చనిపోవుముందు వెఱ్ఱిచూపు చూస్తుంది. నడుము మీద నొక్కిన క్రుంగుతుంది. కొన్ని రక్తమూత్రము పోస్తాయి. కొన్ని పారుతాయి. వాపు గురక ఎక్కువై చస్తుంది.

చచ్చిపోయిన తరువాత లక్షణాలు

నోరు దుర్వాసనగా ఉంటుంది. నాలుక లావు బారుతుంది. వాపు బురబురలాడుతుంది. కళ్ళనుండి నీరు కారుస్తుంది. మూతిమీద వాపు కోసిచూడగ పసుపురంగు గల ద్రవము కనబడుతుంది. ఈ ద్రవము విషపురుగులతో కూడుకొని ఉంటుంది. గుండె ఎరుపుగా కందియుంటుంది. ప్రేగులను చీల్చిచూడగ నీలిరంగు ఉంటుంది.

రోగపరీక్ష

ఈ మిడిదొమ్మకు ముఖ్యమగు గుర్తు మూతిమీద వాపేయైయున్నది. తరువాత ఈ వ్యాధి ముసలి పశువునకు వచ్చినదా? లేక యుక్తవయసులోనున్న దానికి వచ్చినదా? ఆ లక్షణము లెట్లున్నవి? ఎంతకాలములో మరణిస్తుంది? ఏయే మందులు ఆ లక్షణములకు వాడాలి? ఏమైనా ఆ వాపుమీద కాని తదితర అవయవముల మీద కాని కాల్చవలెనా? ఈ వ్యాధి ఎంతకాలముంటుంది? దగ్గరలో ఈ వ్యాధికి సంబంధించిన మందులేమియున్నవి? మున్నగు విషయములన్నియు పరీక్షించి చికిత్స చేయాలి. వ్యాధి ముదిరి చివరలక్షణములున్నపుడు కాల్చరాదు. ఏ చికిత్సయు చేయకుండుట మంచిది. ఈ వ్యాధిలో వాతలు వేయుట అవసరమని తోచిన, దొమ్మవ్యాధుల ఫొటోలో చూపించిన రీతిగ కీలెరిగి వాతపెట్టుట మంచిదిగాని అనవసరముగా కాల్చరాదు.

వాపు పుట్టక పూర్వమే నాలుగు డ్రాముల సారాయిలో 1 తులం ముద్దకర్పూరం 2½ తులములు పిప్పళ్ళచూర్ణము కలిపి ఒక్కమోతాదే ఈయాలి.

లేక వెలుల్లిపాయలు 20 తులములు, పసుపు 3 తు, ఉప్పు చేరెడు, కరిధూపము 2 తు, ములగచెక్క రసము అరసేరు మేక పంచితము సేరు కలిపి ఒక్క పర్యాయమే త్రాగించాలి.

లేక సేరు ఆవుపాలలోగాని, సేరు గోమూత్రములోగాని 4 తులముల వసపొడి కలిపి కాచి కాఫీ త్రాగునంత వేడితో నున్నపుడు త్రాగించాలి. గుటక వేయనపుడు లాభములేదని గ్రహించాలి.

లేక శొంఠి 2 తు, మిరియాలు 1 తు, పిప్పళ్లు 1 తు, ఆవాలు 1 తు, వెలుల్లి రసము 3 తు, ములగ చెక్కరసము పావుసేరు, పసుపు 2 తు, ఎండుమిర్చి పొడి 2 తు, తీసుకొని మెత్తగానూరి సేరున్నర గోరువెచ్చని నీటిలో కలిపి ఒక్క మోతాదే ఈయాలి.

లేక మూడు గుప్పెళ్లు ఎండుమిరపకాయలు, గుప్పెడు కురంజీ వాము లేక వాము, తులము శొంఠి మెత్తగా నూరి రెండు సేర్ల నీటిలో కలిపి కాచి గోరువెచ్చగా నున్నపుడు త్రాగించాలి.

వ్యాధి తగ్గిన తరువాత రెండు లేక నాలుగు దినముల వరకు కాచిన నీరు, కొర్రగంజి పెట్టిన తరువాత అనుభవము మీద అనుపానములు వాడాలి. మూతిమీద వాపులకు మాత్రము సూరేకారము 2 తు, ఆముదము 10 తు, కర్పూరం 1 తు, పుగాకుపొడి 1 తు, నూరి పట్టు వేయవచ్చును, లేక ఫార్మశీవారి జంతురక్షణిని వాడుము.

నెరడుదొమ్మ

ఈ వ్యాధి పాటుపడుపశువులకు తరచుగా వస్తుంది. పశువు దేహములో నెరడుగుండె గలదని శరీరశాస్త్రములో తెలుపబడింది. పశువునకు మత్తుపదార్థములను పెట్టుటవలన, ఎండనక వాననక పశువుకు విరామము లేక పని చేయించుటచేత, ప్రతిదినము చలిగాలిలో, వర్షములో కట్టుటచేత, మలపదార్థములు పేగులలో చిక్కుకొనుట చేత, పశువు ఎల్లపుడు దీర్ఘశ్వాసను తీసుకొనుట చేత, చాలాకాలము నుంచి నిలువయున్న గడ్డి, దాణాదినుసులు తినుటచేత ఈ వ్యాధివచ్చును. ఈ వ్యాధి 24 గంటలనుంచి 7, 10, 30 దినములవరకు ఉంటుంది.

లక్షణాలు

పశువు శరీరము ఒక విధమగు మెరుపురంగుగా వుంటుంది. అప్పుడప్పుడు నల్లకప్పు వేస్తుంది. నెరడుగుండెలో చెడునీరు జేరి వాపుగ వుంటుంది. వ్యాధి ముదిరినకొలది అరమేత మేయుచు నీరు తృప్తికరముగా త్రాగదు, దగ్గుకూడ యుంటుంది. నెరడువాపు హెచ్చినకొలది పశువు శుష్కిస్తుంది. బరిఎముకలుబ్బుతాయి. ఎదరములు సరిగా కొట్టుకొనవు. కడుపులో ఒక విధమగు నొప్పియుండి అప్పుడప్పుడు మూల్గుతుంది. ఇంకను వెన్ను విరుస్తుంది. నోటివెంట చొంగపడుతుంది. క్రమముగా పశువు కొమ్మునకడ్డముగ ఈ వాపు విస్తరించి ఊసిరాడక చస్తుంది.

ఈ వ్యాధికి ఆరంభము నుండి చికిత్స చేయాలి. జీర్ణము కలుగచేయు ఆహారమును పెట్టాలి. చురుకుదనము రక్తవృద్ధియగు మందులను వాడాలి. చలిలోను, ఎండలోను పశువును యుంచరాదు. వ్యాధి ప్రారంభము నుంచి మోదుగపువ్వు 2 తు, ఉప్పు 3 తు, జొన్నగడుగు సేరు కలిపి మెత్తగరుబ్బి దినమునకొక మోతాదువంతున పక్షము దినములు పెట్టాలి. లేక దిరిసెన చెక్కరసము సేరు, నేలవేముపొడి 3 తు, తురక వేపాకు గుప్పెడు, బ్రహ్మదండి వేళ్ళ గుప్పెడు కలిపి మెత్తగత్రొక్క మూడుదినములకొక మోతాదు వంతున యిచ్చుచుండాలి.

లేక వెదురాకు 2 గుప్పెళ్లు, నేలవేము 2 తు, శొంఠి 2 తు, పిప్పలిమోడి 2 తు, దిరిసెన వేళ్ళపొడి 2 తు, పిప్పళ్ళ 2 తు, మిరియాలు 2 తు, వాయింటచెట్టు సమూలం తెచ్చి శుభ్రపరచి పొడిచేసి కలిపి ఒక

కుండలోవేసి 6 శేర్లు నీరు కలిపి సలసలకాచి వడపోసి పూటకు మూడు గొట్టముల వంతున వారము దినములు యివ్వాలి.

లేక దిరిసెన చెక్క రసము శేరు, ఆవుపాలు అర్ధసేరు. మోదుగపువ్వు 2 తులములు కలిపి దినమునకొక మోతాదువంతున వారము దినములు త్రాగించాలి.

లేక నల్ల ఉప్పివేరుపొట్టు, సున్నము, ఉడకబెట్టి నిమ్మకాయంత చేసి నాలుగు దినములు పెట్టాలి. నీరుకాచి దాహముగనీయాలి. తెలికపిండిని పెట్టవచ్చును. వాతము చేయు దాణాలను పెట్టరాదు. ఫార్మసివారి పశురక్షామృతమును వాడుడు.

నీటిదొమ్మ

ఈ వ్యాధికూడ ప్రమాదము కలిగించును. చలిగాలి ఎక్కువగా సోకుటవలన రక్తములో జలభాగ మెక్కువగనుండుట వలన, ప్రత్యేకముగా రక్తములోనే ఈ విష సంబంధమైన పురుగులుండుటవలన చాలినంత సూర్యరశ్మి లేకపోవుట వలన, పశువును ఎక్కువగా పని చేయించుటవలన, ఎల్లపుడు పశువును బాధించుటచే కలుగు మనోవిచారమువలన ఈ వ్యాధి కలుగుతుంది.

లక్షణాలు

ఆరంభములో పశువుశరీరము సమశీతోష్ణముగావుంటుంది. మలబద్ధకమేర్పడుతుంది. శరీరకాంతితగ్గి పశువునల్లకప్పువేస్తుంది. మూత్రపురంగు తెలుపుగవుంటుంది. వేడితగ్గుతుంది. ఉచ్ఛ్వాసనిశ్శ్వాసములయందు ఆయాసమేర్పడుతుంది, అన్ని లక్షణములకంటె ముఖ్యముగా ఈవ్యాధి ప్రారంభించినదిలగాయతు నోటినుండి చొంగ ఎక్కువగా పడుతుంది. రక్తమంతయు పాడయి నీటిరూపముగా వెడలుటవలన నీటిదొమ్మయను పేరువచ్చింది. ఈసమయమునందు చెవులు వ్రేలాడవేస్తుంది. కనుగ్రుడ్లు బయటకువచ్చి ముఖకాంతి తగ్గుతుంది. స్మారకముతప్పి వెంటనే చనిపోతుంది.

చికిత్స

ఈవ్యాధి ప్రారంభమైన వెంటనే మూడు లేక నాలుగు గ్రాముల సారాయిలో అర్ధసేరు దుష్టపాకుపసరు కలిపి త్రాగించాలి.

లేక వెల్లుల్లి 8 తులములు, కురంజీవాము 5 తు, కొట్టుపసుపు 2½ తు, వస 1 తు కలిపి సేరు కారపునీటిలో కలిపి త్రాగించాలి.

లేక చేదుజీలకఱ్ఱ 4 తు, వేపాకుగుప్పెడు, మిరియాలు 4 తు, కుప్పింటాకు 4 తులములు, పసుపు 2 తు వస 1 తు కలిపి సేరు ఉండచేసి ములగచెక్కరసముతో తడిపి పెట్టాలి.

లేక ఇంగువ 4 తులములు తీసికొని అర్ధసేరు నీటిలో నానవేసి దానిలో మేకపాలనుగాని, ఆవుపాలను గాని కలిపి కాచి కాఫీత్రాగునంత వేడిమితోనున్నపుడు త్రాగించాలి.

లేక ఉప్పుచేరెడు, వావిలాకుపసరు సేరు, మిరియాలు 2 తు, కలిపి త్రాగించాలి. లేక తమలపాకులు రెండు వందలు, ఇంగువ 2 తు, ముద్దకర్పూరము పావుతులము, తాటిబెల్లం 8 తులములు మొత్తంగా దంచి ఉండచేసి పెట్టాలి.

లేక వాము 10 తు, కరిధూపము 3 తు, ఆముదపువేళ్ళరసం అర్ధసేరు, కారపు పాలు సేరు కలిపి త్రాగించాలి.

వ్యాధి తగ్గినతరువాత కాచిననీరు యివ్వాలి.

చలిదొమ్మ

ఈ వ్యాధి తొలకరివర్షములు కురిసినతరువాత వఱ్ఱనేలలయందు బురదనేలలయందు ప్రబలుతుంది. దోమలు మిక్కుటముగా కరచుటచేత వాసనకొట్టుదాణాలు, మురికి నీటితో కలిసినకుడితి త్రాగుటచేత, విషసంబంధమగు గాలి పీల్చుటచేత, ఏకారణముచేతనైన జవసత్వము తగ్గుట చేత యీవ్యాధిరావచ్చును.

లక్షణాలు

పశువుకు ఆరంభములో 106, 107 డిగ్రీల జ్వరముంటుంది. చలిచే వణకుతూ నల్లకప్పువేస్తుంది. వెన్ను కాళ్ళు అస్వస్థత నొంది నాలుక తెలుపుగావుండి ఎదరాలు త్వరితముగా కొట్టుకొంటాయి. చలివలన పండ్లు కొరుకుతూ మూత్రము బిగబట్టి పోస్తుంది. కడుపుబ్బరముగా వుంటుంది. వ్యాధిముదిరిన కొలది నోటివెంట చొంగపడుతుంది. నాలుక జారవిడుస్తుంది. కఫము పెరిగి పలుచగాపారి క్రమేపి పశువు శుష్కించి చనిపోతుంది.

చికిత్స

మూడుద్రాముల సారాయిలో అర్ధశేరు దుష్టపాకు పసరు కలిపి త్రాగించాలి.

లేక శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు సమాన భాగములు తీసుకొని పేరు కారపు పాలలోకలిపి త్రాగించాలి.

లేక గోమూత్రము అర్ధశేరు, నరమూత్రము అర్ధశేరు కలిపి త్రాగించాలి.

లేక ఇంగువ 3 తులములు, ఆవాలు 2 తు, వెల్లుల్లి 4 తు, పసుపు 2 తు, దుష్టసాకు గుప్పెడు, తాటిబెల్లం 8 తు, కలిపి పెట్టాలి.

లేక కురాసానివాము గుప్పెడు, నల్ల ఉప్పు 3 తులములు, వెల్లుల్లి 8తు, నేలవేము 3 తు, త్రిఫలములు 6 తు, ఎండుమిర్చి గుప్పెడు కలిపి త్రొక్కి 2 సేర్లనీటిలో వేసి కాచి వడపోసి గోరువెచ్చనివి త్రాగించాలి.

లేక కరక్కాయలు, ఉసిరికపప్పు, శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు ఒక్కొక్కటి 4 తులములవంతున పొడిచేసి గేదెపేడరసములో కలిపి కాచి వడపోసి త్రాగించాలి.


ఈ రీతిగా అనుభవముమీద ద్రవ్యజ్ఞానము గ్రహించి తగిన అనుపానములతో వ్యాధులకు మందుల నీయవచ్చును.

నాలిదొమ్మ

ఈవ్యాధికూడ ప్రమాదకరమైంది. పశువు బాగుగా యున్నట్లే యుండి చివరదశలో దుర్గుణములు పుట్టి ప్రమాదము కలిగిస్తుంది. పశువు నాలిగానుండుటవలననే నాలిదొమ్మయని పేరు వచ్చింది. ఇది, పదునైదు రోజులవరకుయుంటుంది. పశువునకు చలిగాలి తరచుగా తగులుటవలన, విపరీతముగా తవుడు కృత్రిమ పదార్థములు మేపి పనిచేయించక పోవుట వలన, మలబద్ధకముండుటవలన ఈ వ్యాధి కలుగుతుంది.

లక్షణాలు

ప్రారంభములో తీవ్రముగా జ్వరముంటుంది. దగ్గు తక్కుగా వుంటుంది. మూత్రము పసుపురంగుగా పోస్తుంది. నల్లకప్పు వేస్తుంది. నోరు వాసనగా వుంటుంది. నోటినుండి ముక్కులనుండి చీమిడివంటి




పదార్థము పడుతుంది. పశువు మందమతిగానుండి వ్యాధి ముదిరినకొలది తలనూపుతుంది. పొట్ట వుబ్బరంగా వుండి క్రమేపి మేత, నీరు తగ్గిస్తుంది. కనుగుంటలు విడుస్తుంది. వ్యాధి ముదిరినకొలది మలము దుర్వాసనగానుండి రంగు మారుతుంది. పండ్లుకొరుకుచు అపానవాయువులు విడుస్తుంది. కన్నులు ఎరుపెక్కి పశువు క్రమేపి శుష్కించి మరణిస్తుంది.

చికిత్స

ఆరంభములోనే తాడికాయలు 3 తు, ఉసిరికపప్పు 2 తు, కరక్కాయలు 1 తు, పిప్పళ్లు 2 తు, శొంఠి 2 తు, మిరియాలు 1 తు, చింతపండు నిమ్మకాయంత మెత్తగనూరి రెండుసేర్ల గేదె పేడరసములో కలిపి కాచి వడపోసి త్రాగించుము.

లేక వెల్లుల్లి 10 తు, మునగ చెక్కరసం అర్ధసేరు, త్రికటకములు 4 తు, ఆవాలు 4 తు, ఎండుమిర్చిపొడి 3తు, మెత్తగానూరి సేరు కారపుపాలతో కలిసి త్రాగించాలి.



లేక మోదుగపువ్వు 4 తు, జొన్నకలిసేరు కలిపి త్రాగించాలి. లేక ధనియాలు సోలెడు కురంజీవాము గుప్పెడు, జీలకర్ర 2 తు, నేలవేము 3 తు, ఉప్పుచేరెడు కలిపినూరి సేరు జొన్నకలితో పెట్టాలి.

లేక మూడు డ్రాములు సారాయిని త్రాగించాలి.


లేక ఫార్మసీవారి జంతురక్షణిని నాలుగైదు పర్యాయములు వాడండి.

గాలికుంటు

దీనినే కాలుకుంటు, గాలిగాళ్ళు, నోటిగాళ్ళు, కాలినోటిగాళ్ళని వివిధరకములుగా పిలుస్తారు.

స్వభావము – వ్యాపకము

ఇది తీవ్రమైన అంటువ్యాధి. ఈరోగమును దేశమునందంతట అప్పుడప్పుడు శీతోష్ణస్థితిగతులనుబట్టి వ్యాపిస్తుంది. రైతులకు మంచి పనులు చేయుకాలములో ఈ వ్యాధి వచ్చినప్పుడు ఆతురత ఇంతింతయని చెప్పనలవికాదు. ఈ వ్యాధి పందులకు గొఱ్ఱెలకు మేకలకు కూడ వస్తుంది. ఇది బహువేగముగా




వ్యాపించెడిరోగము. 1764న సంవత్సరములో నార్వేలోను 1887 నుంచి 1897 వరకు యూరప్‌లోను, అచ్చట నుంచి రష్యాకు 1919లో అన్ని ప్రాంతములందును వ్యాపించింది. మన హిందూదేశమునకంటె విదేశములలో ఈవ్యాధిసోకిన పశువులనుగూర్చి తగిన చికిత్సకొరకు ఆతురతపడుతారు. అచ్చట శీతోష్ణస్థితిగతులననుసరించి చాలా పశువులు మరణిస్తాయి. ఈమధ్య బెంగుళూరు కంటోన్మెంటుకు మిగుల ఖరీదుగల ఆవులను విదేశములనుంచి తెప్పించగా గాలికుంటు తగిలి వెంటనే మరణించినవి. మన శీతోష్ణస్థితిగతులు సరిపడక అతి ఉష్ణమువలన మరణించినవని ఒక వెటరినరీపత్రిక తెలిపినది. అందుచే తన ఇంగ్లీషువారి పశువైద్యమునకు మనదేశములోని పశువైద్యమునకు వ్యత్యాసములు చాలా గలవని నాయభిప్రాయము. మన మూలికలంత పని ఇంగ్లీషుమందులు సరిగా చేయవు. తాత్కాలిక చికిత్సకు మాత్రము పనిచేస్తాయి.

ఈ గాలికుంటును కలిగించు సూక్ష్మజీవులు పశురక్తములోను బొబ్బలయందును ఉంటాయి. ముఖ్యముగా ఒక జంతువునుండి మరొక జంతువుకు సోకుతుంది. ఈ జాడ్య సంబంధమగువిషము, మేత, నీరు, గాలిమూలమున దేహములో ప్రవేశించి నాలుగుదినములు దాగియుండి అయిదు లేక ఆరవనాడు బయటకుబుకుతుంది. ఒకసారి రోగముతగిలిన తరువాత తొమ్మిది నెలలవరకు ఈ వ్యాధి రాజాలదు. ఒకవేళ వచ్చినను తేలికగా తగులుతుంది. ఈ వ్యాధి కొన్నిటికి నోటికిని మరికొన్నిటికి పాదములకును రావచ్చును.




పుండ్లను శుభ్రముచేయుట

లేదా నోటికి ముందుసోకి పాదములకు తరువాత రావచ్చును. ఈ వ్యాధి పశువును చంపకపోయినను రైతుయొక్కపనికి అడ్డువచ్చును. కొండప్రదేశములోనుండు పశువులకు ఎక్కువగాసోకుతుంది. ఇంకను పశువుల కొట్టములు, రైలువాగెనులు గాడితొట్లు మున్నగునవికూడ ఈవ్యాధి వ్యాపింపజేయుటకు ఆధారములైయున్నవి. గొఱ్ఱెపిల్లలకు, కుక్కలకు, పందులకు, దూడలకుకూడ తమతల్లుల పాలనుంచి వస్తుంది. కోళ్లకు, గుఱ్ఱములకు, దుప్పులకు, ఒంటెలకు సోకుతుంది. మేత, నీరు, గాలి మూలమున, రోగపశువుదగ్గర పనిచేయు పరిచారకులమూలమున, పాలు పితికెడువారిమూలమున, కుక్కలు, పిల్లులు, ఎలుకలు, పక్షులు, ఈగలు మున్నగువాని మూలమున, రోగపశువులను సంతలకు, కసాయిదుకాణములకు తోలుకొనివచ్చుట మూలమునను ఈవ్యాధి తరుచుగ వ్యాపిస్తుంది. ఈ వ్యాధిని కలిగించు సూక్ష్మజీవి 15 మైళ్ళ విస్తీర్ణమునకు పోగలదని శాస్త్రజ్ఞులు తెలుపుచున్నారు.



లక్షణాలు

పశువుకు ఆరంభములో 106, 107 డిగ్రీల జ్వరముంటుంది. నల్లకప్పువేస్తుంది. మూతిచెమ్మ-లేకయుండును. నోటినుండి చిక్కని చొంగ పడుతుంది. కాళ్లు చెవులు వేడిగానుండి అరమేతమేస్తుంది. కొద్దిమలబద్ధకముంటుంది. నాలుకమీదను నోటిలోపలను, పేగులలోను, నాలుగవ పొట్టలోను, దవుడల లోపలిభాగమందును గిట్టలనందునను, కండ్లలోను, కొమ్ములలోను, పాడిపశువు పొదుగుమీదను చిన్నచిన్న బొబ్బలు కనబడతాయి. ఇవి కందిగింజలంత పరిమాణము గలవై చితికి రసికారుతుంటాయి. కాళ్ళడెక్కల మధ్య ఈ పుండ్లు రెండు మూడు కలిసి అట్టకట్టుకొంటాయి. వీటిని శుభ్రము చేయనిచో పురుగులుపడి దుర్వాసన వేసి డెక్కలూడిపోతాయి. ఈ వ్యాధి తగిలిన పశువును ఎండలోనుంచిన కసిమిరి తగులుతుంది. కొమ్ములను శుభ్రము చేయనిచో కొమ్ములూడిపోతాయి. పాడిపశువులకు ఈ పుండ్లు లేచుటవలన పాలు



తగ్గుతాయి. కండ్లను నోటిని తదితర అవయవములమీద లేచెడి పుండ్లవిషయమై సరిగాచూడనిచో అచ్చట పురుగులు పడి పశువును బాధిస్తాయి.

చికిత్స

జాడ్యము తగిలిన పశువును ఎండలోనుంచరాదు. ఈ వ్యాధికి కూడ సంరక్షణయే ముఖ్యమగు చికిత్స. ఈ వ్యాధి సోకిన పశువులను, వాని చుట్టుప్రక్కలనుండు ప్రదేశములను శుభ్రపరచాలి. పశువుల కొట్టములు పరిశుభ్రముగానుండుటకు పేడకలిపిన నీటినిగాని సున్నపునీటినిగాని చల్లుచుండాలి. పాలిచ్చు పశువులను, లేగదూడలను బలహీనమగు పశువులను జాగ్రత్తగా చూచి తగిన సంరక్షణ చికిత్సచేయాలి. పాడిపశువులకు తగిలిన తరువాత దూడలను పాలుకుడుపరాదు. అట్లుకుడిపిన అవి మరణమునకు దారితీస్తాయి. ఈ వ్యాధి తగిలిన పశువును బురదలో దింపరాదు. పుండ్లకు మట్టిని, చవుడును కొట్టరాదు. ఇట్లు చేయుటవలన డెక్కలు కాటుకవేసి చాలాకాలము కుంటుగా నేర్పడి పశువును బాధించుతాయి.

ఆరంభములోనే సూరేకారము 2 తులములు, వేడినీరు సేరు కలిపి త్రాగించిన జ్వరముతగ్గి పుండ్లు తేలికపడి బాధతగ్గుతుంది.

లేక ఉప్పు 4 తు, నేలవేము 2½ తు, మంచి బెల్లం సవాసేరు కలిపి నూరి నాకించాలి.

లేక పెసరపప్పు అర్ధసేరు, పేలపిండి సోలెడు, మంచినూనె సవాసేరు కలిపి పెట్టాలి.

లేక తమిదెజావ అర్ధసేరు మంచినూనె సవాసేరు కలిపి త్రాగించాలి.

లేక నీరుల్లిపాయలు 10 తులములు జొన్న అన్నముసేరు, పెసరపప్పు అరసోలెడు, పసుపు 2 తు, కలిపి పెట్టుము. మంచిపశువులకు స్వర్నాసవవాడినసోకదు.

పుండ్లకు చికిత్స

కవిరిగాని మాచికాయగాని పటిక తుమ్మచెక్క లేక వేపచెక్క వేసి కాచిన చిక్కని కషాయముగాని తీసుకొని రెండుమూడు సేర్లు నీరు కలిపి నోటిపుండ్లకు అప్పుడప్పుడు పుక్కిలింపు చేయించిన గారపట్టుతుంది. అంతియేగాకుండ తుమ్మచెక్క, కషాయమును ప్రతిరోజు కాలిపుండ్లు, తదితరపుండ్లు కడుగుట-కుపయోగించుట మంచిది. కాళ్ళకు గాలికుంటు తగిలిన వెంటనే మీగడలో తగినంత పసుపుకలిపి

అప్పుడప్పుడు దెక్కల భాగములకు రాసినచో పుండ్లు అంతగా పడక త్వరగా మానుతాయి. లేక నీలిమందును కొబ్బరినూనెలో కలిపిగాని, నవాసాగరమును నీటిలో కలిపిగాని, గానుగ నూనెనుగాని రాసిన తగ్గుతాయి.


పురుగులుపడి పశువు బాధపడుచున్నప్పుడు మాత్రము ఫినైల్‌ను కొన్ని చుక్కలువేసి కట్టుకట్టిన పురుగులు చస్తాయి. సాధారణముగా రైతులలో చాలామంది పురుగులులేని పుండ్లకుకూడ గాయము మానునని విస్తారముగా దీనిని పోస్తారు. అట్లుపోయుట వలన పశువునకు జ్వరము ఎక్కువై పుండుపెద్దదై పశువు శుష్కించును గాన జాగ్రత్తగా వాడాలి. లేక శీతాఫలపుఆకు, సున్నము, పొగాకుపొడి మెత్తగానూరి పురుగులున్న పుండుకు పట్టించిన పురుగులు చస్తాయి. లేక బారిజపాకుపసరు గుప్పెడు, ఉప్పు 2 తు, మిరియాలు 1 తు, పాలతోనూరి పట్టించుము. లేక పొగాకు, కరిధూపము, పొట్లాకు, రాతిసున్నము, సౌరాకు తగినంత తీసుకొని మెత్తగానూరి పట్టించుము. లేక వసపొడిని పట్టించుము. ఫార్మసీపారి హిలాన్‌గాని కార్సెక్సును గాని వాడుడు.

పథ్యము – హెచ్చరిక

పాలిచ్చెడి పశువులు ఎండిపోతాయి. చూడి పశువులు ఈచుకొని పోతాయి. దుక్కిటెద్దులు దెక్కలు పాడవుతాయి. వగర్పు పుట్టును గాన ఆరంభములోనే జాగ్రత్తగచికిత్స పోషణ చేయాలి. మనుష్యుల శరీరముమీద వుండు గాయములకు ఈ పశువు చొంగతగిలినను, ఈ వ్యాధి తగిలిన పాడిపశువులపాలు త్రాగినను, చంటిపిల్లలకు త్రాగించినను, ఈ వ్యాధి కలుగునుగాన జాగ్రత్తగా వుండాలి. అప్పుడప్పుడు పశువుల శాలలో సాంబ్రాణిపొగ వేయుటమంచిది.

ఆవుమజ్జిగ సేరు, మంచినూననె నవటాకు, ఆరిగ అన్నముగాని వరిబియ్యపు అన్నముగాని అర్ధశేరుకలిపి మంచిపశువులకు త్రాగించిన వ్యాధిసోకదు. జబ్బు నెమ్మదించిన తరువాత జొన్నలను వండి మంచి నూనె కలిపి ప్రతిరోజు పెట్టినయెడల మంచిది. దీనినే మడ్డికూడందురు. ఫార్మసీవారి పశుబలవర్ధనిని వాడుడు.


గురక



దీనినే కంఠమాద, కుత్తుకలవాపు, గురక, గొంతురోగము, ఎఱ్ఱదొమ్మ, దున్నలప్లేగు అందురు.

స్వభావము – వ్యాపకము

పశువులకు సంభవించు రోగములన్నిటిలో నీ వ్యాధి తుపాకి వంటిది. ఈ వ్యాధి తగిలిన కొన్ని గంటలలోనే పశువు మరణిస్తుంది. ఈ వ్యాధి గ్రామములో వ్యాపించినదనగానే రైతులకు గుండెలు దడదడ




అమ్మో! గురకే!

కొట్టుకొంటాయి. గ్రామములోనికి రాకపూర్వమే ఈ వ్యాధికి రైతు పశువు అహారనాళము దగ్గర మూడుగీతలు వాతగా కాల్చుదురు. 1886వ సంవత్సరములో ఇటలీలో ఒరెస్టీ, అను పరిశోధకుడు ఈ వ్యాధిని కనుగొన్నారు. ఈ వ్యాధిచే నూటికి 90వరకు మరణిస్తాయి. ఇదికూడ అంటురోగమై యుంది. ఈ వ్యాధి దుప్పులకు పక్షులకు, దున్నలకు తదితర పశువులకు సోకుతుంది. ఈ వ్యాధిని కలిగించు సూక్ష్మజీవులు వల్లముగను, అనారోగ్యకరముగను తేమగనుయుండునట్టి పల్ఱనేలలలో వుంటాయి. అట్టినేలలలో మొలచు గడ్డిలోగాని త్రాగునీటిలోగాని యుండి తొలకరించగానే వ్యాపించి దున్నలకు గేదెలకు తగులుతుంది. అందుచేతనే దున్నల ప్లేగందురు. ప్రారంభములో గేదె, దున్న దూడలకువచ్చి చచ్చిపోతాయి. క్రమేపివ్యాధి వ్యాపించి గేదె, దున్న, ఎడ్లకుకూడ వస్తుంది. ఈ వ్యాధి లోపల దాగియుండి బయటకు కనబడు అంతర్గతకాలము ఒకటి రెండు దినములని గ్రహించాలి. నూటికి 98 దున్నల వరకు ఈ వ్యాధిచే మరణిస్తాయి.

లక్షణాలు

పశువునకు తీవ్రమగు జ్వరము 106, 108, డిగ్రీలవరకు వస్తుంది. మేతమాని మందమతిగ వుంటుంది. కన్ను, ముక్కు, నోరు మున్నగు శరీరావయవములలోనుండు పొరలు ఎరుపుగ కందియుంటాయి. మూతిపొడవుగ విస్తరిస్తుంది. నోటినుండి చొంగపడుతుంది. గొంతుకు పట్టిచూచిన వాపుగలిగి చల్లదనముగ



లక్షణాలు

వుంటుంది. ఈ వాపు క్రమేపి గొంతుక, దవుడలు, గంగడోలు, మెడ, ముందరి కాళ్ళు మున్నగు భాగములందు పుట్టుతుంది. ఇంకను తలమీద కంటిరెప్పమీద ముక్కురంధ్రము మీద నోటిలోపల ఈ వాపు కనబడతుంది. ఈ వాపులు కనబడిన ఆయా భాగముల చర్ముములోపల ఎరుపుగకంది రక్తమచ్చలు కబడుతాయి. నాలుకవాచి ఎఱ్ఱబడి జిగురువంటిపదార్ధము పడుతూ నరములు లాగుతాయి. నోరునలుపుగావుండి దగ్గుకూడ యుంటుంది. వాపు త్వరలోనే హెచ్చుతుంది. ఈ వాపు ముదిరినకొలది చల్లగా వుంటుంది. పశువు లేచుచు పడుకొనుచు పశువునకు ఊపిరి సలుపక కఫము తున్నతుంది. కన్నుగుంటలువిడచి చూచేమనిషికే విచారముగావుంటుంది. పశువులకు కూడా ఇట్టి జబ్బులు భగవంతుడు సంప్రాప్తించినాడాయని రైతులు పదేపదే విచారపడుతారు. ఈ వాపు గొంతుక వద్ద కనపడుటవలన కంఠమాదయనియు, ఊపిరాడక పోవుటవలన గురకయనియు చెప్పుదురు. ఆ గురక చాలాదూరమువరకు వినబడుతుంది. పశువు తనవీపును బాధవలన ముడుచుకొంటుంది. పశువు పేగులువాచి కందుతాయి. నొప్పిగల దగ్గుంటుంది. శ్వాసకోశములు చిన్నవగుతాయి. క్రమేపి వ్యాధి ముదిరి అకస్మాత్తుగా మరణిస్తుంది.

చికిత్స

ఈ వ్యాధి సామాన్యముగ చికిత్సకు లొంగదు. మంచిపశువులను వీనితో కలుపక ప్రత్యేకముగ వుంచాలి. నాలుక జారవిడిచి గోండ్రుపెట్టుచున్నపుడు ఆపశువు బ్రతుకదని గ్రహించాలి. ఏమందయిన పోసిన గుటకవేయక వెంటనే మరణిస్తుంది.

ఆరంభములోనే నాలుగుగ్రాముల సారాయితో అర్ధసేరు దుష్టపాకు పసరుకలిపి త్రాగించుటమంచిది.


లేక సేరున్నరసాలలో 4 తులముల వసపొడి కలిపి కాచి కాఫీ త్రాగునంత వేడిగానున్నపుడు నాలుగుగంటలకొకపర్యాయము త్రాగించాలి.

లేక పసుపు 2 తు, శొంఠి 2 తు, పిప్పళ్ళు 2 తు, మిరియాలు 2 తు, వెల్లుల్లి 10 తు, ఎండుమిర్చి 6 తు, మెత్తగామారి అర్ధశేరు మునగచెక్కరసముతో పెట్టాలి.

జబ్బవాపు

స్వభావము – వ్యాపకము


ఇదికూడ విచిత్రమైన వ్యాధియే. ఈ వ్యాధి కొండప్రదేశములందు, అరణ్య ప్రాంతములందు, రాతినేల ప్రాంతములందుండు పశువులకు తరచుగా కఠినముగాసోకుతుంది. ఈ వ్యాధిని కలిగించు సూక్ష్మజీవులు గాలి రూపమున, నీటిరూపమున ఆహారమూలమున పశువునందు ప్రవేశించును. లేతవయస్సులోనుండు



పశువులు అనగా 4 నెలలనుండి 5 సంవత్సరముల లోపువానికి విస్తారముగా సోకుతుంది. తక్కినవానికి తక్కువగ సోకుతుంది. ఈ వ్యాధి కొన్ని పశువులకు కనబడక లోపల దాగియుంటుంది. కండబట్టి మిగుల బలిసియున్న గిత్తలకు తరచుగా నీ వ్యాధి సోకుతుంది. వేసవికాలములో సరియగు మేతలేక తొలురించగనే మిక్కిలిఆతురతతో పచ్చికను తినుపశువులకు గూడ ఈ వ్యాధిసోకుతుంది. ఈ వ్యాధి ఒంటెలకు, గుఱ్ఱములకు, గేదెలకు, ఎద్దులకుకూడ తగులుతుంది. భూమిలో పెరుగుచుండెడి ఒకవిధమగు సూక్ష్మజీవులు ఈవ్యాధిని కలుగుజేస్తాయి. ఈ సూక్ష్మజీవులు రోగముతగిలిన పశువుయొక్క రక్తప్రవాహములో సాధారముగా కనిపించవు. వాపు కనిపించినచోట మాంసములో అవి తప్పక కనుపించుతాయి. ఈ సూక్ష్మజీవులు సులభముగా చావవు. ఈ వ్యాధి పశువునకు సోకిన రెండు మూడు దినములకుగాని బయటకు కనపడదు తీవ్రముగా వచ్చిన కొన్ని గంటలలోనే చనిపోతుంది.

లక్షణాలు

ఈ వ్యాధి తగిలిన పశువు మిగిలినవానితో నుండక ప్రత్యేక స్థలములందుంటుంది. పశువు మందమతిగావుంటుంది. కుంటుటగూడ వుంటుంది. జాగ్రత్తగా పరీక్షించినచో ముందుజబ్బమీదనో, వెనుకతొడలమీదనో, లేక మెడ, పిఱ్ఱ, రొమ్ము, వీపు, నడుముమీదనో, వాపు కనబడును ఆ వాపునుపట్టి చూచిన ఎక్కువవేడిగా వుంటుంది. ఆ వాపుచుట్టును వృద్ధిపొంది పశువును కదలకుండునట్లు చేస్తుంది.



లక్షణాలు

మరికొంతసేపటికి ఆ వాపుపైకి పొంగినట్లుంటుంది. అప్పుడు ఆ వాపుమీద చేతితో తట్టినయెడల బురబురలాడుతుంది. వాచిన ప్రదేశముయొక్క చర్మము క్రిందభాగమున చీల్చిన ఆ మాంసము క్రుళ్ళియుంటుంది. పులిసిన నురుగువంటి ద్రవము కారుతుంది. ఈ వాపును నొక్కిన కరకరమను శబ్దముకూడ యుంటుంది ఈవాపునుబట్టియే జబ్బవాపు, గూడవాపు అని పేరువచ్చింది. ఇంక ఈవాపు శీఘ్రముగా పెరిగి 2 నుంచి 24 గంటలలోగాని, రెండు మూడు దినములలోగాని పశువును చంపుతుంది. వ్యాధి ముదిరినకొలది శరీరము శీతలము లోనికివస్తుంది. నాడి బలహీనముగ వుండి వణకుతుంది. ఊపిరి కష్టముగ విడుస్తూ మూలుగుతూ క్రమేపి మత్తువచ్చి చనిపోతుంది. ఈ రీతిగా నూటికి 95 వరకు చనిపోతాయి.

చికిత్స

వాపును కత్తితోకోసి క్రుళ్ళిన మాంసమును తీసి వైచి కర్పూర తైలమునుగాని లేక జిల్లేడాకు దుష్టపాకుపసరు సమాన భాగములును తడి రాతిసున్నం 1 భాగమును కలిపి పట్టించాలి.

లోపలికి మూడుద్రాముల సారాయిని త్రాగించాలి.

లేక నాగజెముడుమట్ట ఉడికించి దానిలో సన్నావాలు కొద్దిగా వేసి త్రొక్కిన జిగురుగావచ్చును. దానిని వాపునకు పట్టించిన మంచిది. అంతకు వాపు ఆగనప్పుడు వాపుచుట్టు రక్షలు వేయుటమంచింది.


లేక బాలింతపోలు 1 తు గండఫెరోజు 2 తు, ముసాంబ్రము 1 తు, మెత్తగానూరి సారాయితో వాపుమీద పట్టించాలి.

రాకుండ జంతురక్షణినివాడుడు, వాపులకు అయోడిన్ రాయుము.

కురమ

స్వభావము – వ్యాపకము

ఈ జాడ్యము వర్షాకాలము లగాయతు శీతాకాలమువరకు వ్యాపిస్తుంది. రైతులలోను నాటువైద్యులలోను కొంతమంది ప్రతిజబ్బునకు కురమయనిపేరు పెడతారు. ఈ వ్యాధి కలిగించు సూక్ష్మజీవులు ఒకతరగతి దోమలయందు నివాస మేర్పచుకొంటాయి. పశువు రక్తములోనుండు ఎఱ్ఱకణములలో నివి జేరియుంటాయి. ఈ సూక్ష్మ జీవులు పల్లపుభూములందును, గొప్పనదులు సముద్రములు కలియుచోటులందును, అడవి ప్రదేశములందును బురదనేలలందును, క్రుళ్ళుచుండు పెంటపోగులందును దాగియుంటాయి. ఎండలు



తీవ్రముగా నున్నపుడు ఈ సూక్ష్మజీవులు పైకి వస్తాయి. పశువును ఎండలో పనిచేయించుటవలన లోపలి నెత్తురు ఉడుకెత్తునపుడు ఈ వ్యాధి రావచ్చును, ఇంకను చక్కని కోడెలకు, ఆవులకు మధ్యవయస్సుగల జంతువులకు పెద్దవయస్సులో నున్న వానికి తక్కువగను ఈ వ్యాధి సోకుతుంది.

లక్షణాలు


ఆరంభములో పశువువణకును, మలబద్ధకము ముఖ్యముగా దగ్గు ఉంటుంది. అన్నిటికంటె ముఖ్యమైన లక్షణము చెవులు వ్రేలాడక నిక్కబొడుచుకొంటాయి. నల్లకప్పువేసి కాళ్ళు ఒకటి రెండుగాని అన్నిగాని పట్లుపట్టుతాయి. వెన్నుచర్మము బిగిసియుంటుంది. మూత్రము పసిమిరంగుగా పోస్తుంది. మేత నెమరు మానుతుంది. మరికొన్ని మంచి బలము మీదవుండి గురకరోగములోవలె గోండ్రుపెట్టుతాయి. మరికొన్నిటికి నోటివెంట చొంగపడుతుంది. 106, 107 డిగ్రీలజ్వరముటుంది. కాళ్ళు, చెవులభాగములు, చల్లగావుండు–నపుడు చలికురుమ యంటారు. కడుపుబ్బసముగా వుండి ముడుచుకొంటుంది. పశువుయొక్క తత్వమును బట్టి పై లక్షణములలో తదితర లక్షణములుకూడ యుండవచ్చును.

చికిత్స

ఈ వ్యాధినిగూర్చి ప్రతిరైతునకు తెలియును. ఈ వ్యాధి వలన ప్రమాదముగాదు. కాని కొన్నిపశువులకు ప్రమాదమువస్తుంది. పశువు బలహీనమై నాలుగుకాళ్ళను కదల్పలేక కనుగ్రుడ్లు బయటకు వచ్చిన ఆ దీర్ఘశ్వాస కలిగినపుడుమాత్రము ప్రమాదము రావచ్చును.

రోగపరీక్ష

పశువు చెవులు నిక్కబొడిచినదాలేదా? దగ్గుఅప్పుడప్పుడు ఉన్నదా లేదా? కాళ్ళలో ఒకకాలు లేక నాలుగుకాళ్ళను కుంటుచున్నదా? డొక్కలభాగము ఉబ్బరముగావుందా? ఈ కురమలో గుఱక పుట్టి చెవులు నిక్కబొడుచుకొని యున్నవా? వాలియున్నవా? మున్నగు విషయములను మనస్సులో ఆలోచించుకొని



తగిన చికిత్స చేయాలి. కొంతమంది వైద్యులు డబ్బునకాసించి పలువిధములుగా చెప్పుతారు. మరికొందరు అమ్మో ఇంత ప్రమాదమైన వ్యాధి ఎచ్చటాచూడలేదని చెప్పుతారు. ఈ వ్యాధి విషయమై గాబరాపడవలసినంత కారణములు కన్పట్టవు. వివిధకరముల తెలిసి తెలియని చికిత్సలు చేసినచో తప్పక ప్రమాదము కలిగించును. మంచిఖరీదుగలిగి బలముగలకోడెలకు వచ్చినప్పుడు ఆ కోడె బాధనుబట్టి ఎంతో ఆతురతపడతారు. ఈ ఆతురతనుబట్టి వైద్యులలో కొంతమంది డబ్బుకొరకు నాటకమాడుతారు. ఈ వ్యాధి తగిలిన నాలుగు, లేక వారముర్రోజులలో తగ్గిపోతుంది. చికిత్సజాగ్రత్తగా చేసిన ఆతురత పడునవసరములేదు. రైతులలో కొంతమంది మా ఎద్దుకు ఇంజెక్షన్ ఇచ్చిన తగ్గుతుంది. ఎంతఖరీదైనాసరే ఇప్పించెదనని ఉవ్విళ్ళూరుతారు. ఇదికూడ పొరపాటే. కొంతమంది వైద్యులు మాట్లాడితే ఇంజెక్షను ఇస్తానని, లేకపోతే తగ్గదని. ఈ వ్యాధివిషయమై మన ఆయుర్వేద చికిత్సయే మంచిదని తెలియజేస్తున్నాను. ఆరంభములోనే ఈ వ్యాధి

సోకిన పశువునకు మూడు గ్రాములసారాయి త్రాగించిన కాళ్ళపట్టులు, నొప్పులు తగ్గును. చురుకుదనము పుట్టును, సారాయికూడ కొనలేని బీదరైతులున్న మేకపాలు అర్ధసేరు, పసుపు 2తు, కలిపి త్రాగించాలి.

లేక తిప్పతీగరసము సేరు మంచినూనె అర్ధసేరు కలిపి ఒకసారి త్రాగించాలి.

లేక దుష్టపాకురసము అర్ధసేరు, సారాయి 2 డ్రాములు త్రాగించాలి.


లేక దుష్టపాకు అరగుప్పెడు, తురకవేపాకు అరగుప్పెడు, వావిలాకు అరగుప్పెడు, వాము 4 తు, వెల్లుల్లి 1 తు, పసుపు 1 తు, నీరు రెండు సేర్లు కలిపి కాచివడపోసి పూటకు రెండుగొట్టముల వంతున తగ్గువరకు పెట్టాలి.

కాళ్ళపట్లకు హారతికర్పూరం ½ తు, కొబ్బరినూనె 10 తు, కలిపి గోరువెచ్చగ కాచి రాసి వేడినీటి కాపులుగాని, చన్నీటిలో గుడ్డనుతడిపి ఆ భాగములకు కొట్టిగాని చికిత్స చేయాలి. ఇంకను కాళ్ళపట్లకు తిప్పతీగరసమునుగాని, దూసరాకు, ఉమ్మెత్తాకుపసరుగాని దుష్టపాకురసమును కలిపి తగినంత వెన్నలో కలిపి మర్దనచేయాలి. లేక పిడక బూడిదనుగాని, విభూతినిగాని కాళ్ళపట్టులకు, మొత్తలకు రుద్దిన మంచిది.

ఈ వ్యాధి తగిలిన ఆరంభములోనే దుష్టపుతీగను గాని దూసర తీగనుగాని, తిప్పతీగనుగాని వలువుల వలెచుట్టి మెడలో వేసిన తాత్కాలిక జ్వరము, నొప్పులు ఆ ఘాటువలన తగ్గును. గాన తప్పక ప్రతిరైతు ఆచరించాలి. కాళ్ళపట్లకు పెయిన్‌కిల్లర్ చక్కగ పనిచేయును.


పథ్యము–జ్వరము తీవ్రముగనున్న ఎండుకర్జూరకాయలు 10 కొట్టి సేరునీటిలో వేసి త్రాగించాలి. నూకలజావను, బియ్యపునీటిని కాచిన వేడినీటిని అప్పుడప్పుడు త్రాగించాలి.

మశూచి



ఈ వ్యాధినే స్ఫోటకమంటారు. పశువులకు, మేకలకు, గుఱ్ఱములకు, గొఱ్ఱెలకు, పందులకు, ఒంటెలకు, కుక్కలకుసోకుతుంది. మానవులకుసోకుతుంది. అంటుసంబంధమైనట్టియు, పొక్కులు లేచునట్టియు,

జీవితమునందు సామాన్యముగ ఒకపర్యాయమే కలుగునట్టి జ్వరమైయుంది. ఈ వ్యాధి ప్రారంభించినది లగాయతు నెమ్మదియగువరకు ఈ స్థితిలో అస్వస్థతయుండినను, మాలిన్యమేర్పడినను, చర్మమునుండి పూర్తిగా పొక్కులుపోవువరకు నిశేష అంటుగుణము వహించియుంటుంది. చీడ, పారుడు మీద వచ్చు



పొక్కులకు కొందరు మశూచియంటారు. అట్లనుట పొరబాటు. ఈ రోగముగల పశువులతో మంచిపశువులు కలియుటవలనను, పశువులకాపరులు, పాలుపితుకువారు, జబ్బుపశువులను తాకి మంచిపశువులను తాకుటచేత ఈ వ్యాధి కలుగుతుంది. పట్టణములలోని వాటికే ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. కొన్ని పశువులు గుఱ్ఱపులద్దెలు ఒంటెలద్దెలు దినుటవలనకూడ రావచ్చును.

లక్షణాలు

ఆరంభములో జ్వరముంటుంది. కండ్లనుండి నోటినుండి నీరు గారుతూ మేతతినదు. పాలిచ్చు పశువుల పొదుగుమీద చన్నులమీద దూడలకు మూతిమీద ఎద్దులకు తొడల మధ్య వెంట్రుకలు లేని చోట్లను బఠాణీగింజలంత పొక్కులై పక్వమై పలుచబారి పగిలి ఒకవిధమగు రసికారను. వీటినే రసికుండలంటారు. మనుష్యులకు వేయు టీకాలరసము ఈ రసికుండలనుండియే తయారుచేస్తారు. ఈ వ్యాధి మనదేశములో చాలాతక్కువ. పాడిపశువుకు ఈవ్యాధితగలగనే పాలు తగ్గుతాయి. రెండు మూడు దినములైన తర్వాత యెర్రని చుక్కలు పశువు శరీరము పైన కనపడును. తర్వాత పొక్కుగా మారును, నాల్గు దినములైన తరువాత పొక్కులు శరీరమునందంతట వ్యాపించి నీరుపట్టి ఎఱువుగానుండి మలినమేర్పడి మసూచి వాసన స్పష్టముగ కనబడుతుంది. ఈవ్యాధి ఉద్రుతగతినివహించినచో ముఖమువాడిపోయి కన్నులు మూసికొనిపోతాయి. పొక్కులు ఎండి గోధుమరంగు మచ్చలుపడి పక్షము లేక అరమండలము రోజులకుగాని నెమ్మదిగాదు.

చికిత్స-పోషణ

జబ్బు పశువును ప్రత్యేకముగా నుంచి జాగ్రత్తగా పోషణ చేయాలి. విరేచనముగావించు పదార్థములను పెట్టుచు పుండ్లకు దగిన చికిత్సలు, సంరక్షణ చేయాలి. చురుకుదనముకలిగించు అహార పానీయముల నిచ్చుచు అప్పుడప్పుడు ధూపములను వేయుచుండాలి.


* * *

పదునేడవభాగము

జీర్ణరోగములు

అజీర్తివ్యాధి

పశువుయొక్క జీర్ణకోశము చెడుటయే అజీర్తియనబడును. నెమరువేయు ప్రతిజంతువుయొక్క పొట్టను నాలుగు భాగములుగ విభజించవచ్చును. కాబట్టి నాలుగుపొట్టలలోను అజీర్తి యేర్పడవచ్చును. వ్యాధిలక్షణములనుబట్టి నాలుగు కోశములలో ఏకోశము చెడినది పరీక్షించవచ్చును. ముఖ్యముగా ఈ వ్యాధి పాడిపశువులకు ఎక్కువగా వస్తుంది. వేసవికాలమునందు మేతతక్కువగను, వర్షాకాలమందు మేత ఎక్కువగా తినుటచేత, మామూలు ఆహారము తినుచు జొన్నపిండి, ఉలవపిండి తదితర దాణాలు గొంతు



వరకు పెట్టుటచేత, పశువును పనిచేయించక సోమరితనముగా నుంచుటచేత, పశువు ఆహారకోశములో పురుగులు, సున్నము మున్నగు జీర్ణముకాని కఠినపదార్థము లుండుటచేత ఈ వ్యాధి కలుగుతుంది. వ్యాధులు కలిగియుండి అజీర్తి కూడ కలుగవచ్చును.

లక్షణాలు

ఆకలితగ్గి, అరమేత మేస్తుంది. చక్కగా లెక్కప్రకారము 36 నెమర్లు వేస్తుంది. మలబద్ధకముంటుంది. అప్పుడప్పుడు అపానవాయువులు వదలుచుండును. పేగులు అరచుచుండును. కడుపు వెన్నునంటియుండి నల్లకప్పువేస్తుంది. అప్పుడప్పుడు కడుపులో గాలికూడ చేరుచుండును, పాడిపశువులైనయెడల పాలరుచి తగ్గుతుంది. వ్యాధిముదిరినకొలది పశువు కృశించి ఆకలితగ్గి రక్తముక్షీణిస్తుంది. అంగిటి ముండ్లుకూడ పెరిగి నోరువాసనగా వుంటుంది. సరియగుబలవర్ధకౌషధమీయనిచో నీరసించి చనిపోవచ్చును.

చికిత్స

సోడాఉప్పు 2తు, కురంజీవాము 4 తు, ఇంగువ 1 తు, నేలవేము 1 తు, ఉప్పు 4 తు, కలిపి సేరుగోరువెచ్చని నీటితో గాని నిమ్మకాయంత తాటిబెల్లంతోగాని దినమున కొక మోతాదువంతువ పక్షము లేక నెలదినములు పెట్టిన తగ్గుతుంది.

లేక శొంఠి 2 తు, మిరియాలు 1 తు, పిప్పళ్లు 1 తు, ఇంగువ 2 తు, వాము గిద్దెడు, ఉప్పు 3 తు, కలిపి పై మాదిరిగానే పెట్టాలి.

లేక ధనియాలు చేరెడు, పిప్పళ్ళు 2 తు, చేదుజీలకర్ర 2 తు, కురంజీ వాము 4 తు, ఉప్పు 4 తు, కలిపి పెట్టాలి.

లేక మిరప ఆకురసము అర్ధసేరు మిరియాలు 1 తు, ఉప్పు 2 తులములు కలిపి పెట్టాలి.

లేక మహిసాక్షి 2 తు, కటకరోహిణి 1 తు, శొంఠి 1 తు, ఉప్పు 4 తు కలిపి పెట్టాలి.

లేక లవంగాలు 1 తు, శొంఠి 2 తు, నేలవేము 1½ తు, సోడాఉప్పు 2 తు, తాటిబెల్లం 8 తు, కలిపి దినమునకొక మోతాదు వంతున పక్షము రోజులు పెట్టాలి.

లేక చింతపండుపులుసు, కారము, ఉప్పు, ఆవపిండి కలిపి రోజుకొక మూడుగొట్టములు పెట్టాలి. పై చికిత్సలను వరుసగా కొంత కాలము వాడండి.

లేక ఫార్మసీవారి పశుబలవర్ధని, వాతారి కలిపి కొన్నిదినములు వాడండి.

మరొక సలహా

వరికుప్పలు అపర ధాన్యములను నూర్చునపుడు పశువులు అతురతతో తినుట వలన జీర్ణముకాక ప్రేగులలో చిక్కుకొని బాధపడును, ఇట్టి సమయములలో కొందరు వంకాయలను, దోసకాయలను ఉప్పును, కొబ్బరినూనెను పోస్తారు. ఇట్టిచికిత్సలను అనుభవపరుల సలహాతీసుకొని చేయుట మిగుల మంచిది. కాని చేరేడు లేక రెండు చేరలు ఉప్పును మెత్తగా నలుగగొట్టి దానిలో 4తులముల, శొంఠిపొడినికలిపి కాఫీత్రాగునంత వేడినీటిలో కలిపి పెట్టిన తగ్గుతుంది.

లేక కొబ్బరిని వేడినీటిలో వేసి తొక్కి 10తులముల ఉప్పును కలిపి పెట్టాలి.

లేక గిద్దెడు పేరినేతిలో సేరు గోరువెచ్చని నీరుకలిపి మోతాదు ఈయాలి.


లేక మూడు గ్రాములు సారాయిని త్రాగించాలి.

లేక మూడుగుప్పెళ్ళు ఎండుమిరపకాయలను రెండుసేర్ల నీటిలో కలిపి కాచి పిసికి వడపోసి త్రాగించాలి.

లేక పశుమిత్ర లేక వాతారి అరుఖును వాడాలి.

కడుపుబ్బు

జీర్ణముకాని పదార్థములు నెమరుపొట్టలో నిలువయుండుటవలన అవి పులియుటవలన, దూరప్రయాణమైన వెంటనే నేదైన మేత తినినతరువాత కుడితి మున్నగుపదార్థములు త్రాగుటవలన తొలకరి వర్షములు కురిసినతరువాత మొలచు గడ్డిని ఎక్కువగా తినుటవలన విషవంతములగు పొదల



మొక్కలు తినుటవలన, పచ్చిజనుము, వరిపిలక మున్నగు వాతపదార్థములు రుచిగానున్నవని ఎక్కువగా తినుటవలన, ఇంకను ఇతరరోగములలో కూడ ఇది కలుగవచ్చును.

లక్షణాలు

కడుపు విస్తారముగా పొంగుటయే ముఖ్యమగు గుర్తు. ఎడమ డొక్క భాగములోనే ఆహారకోశ-ముండును. ఎడమడొక్కయే ఉబ్బుతుంది. ఆ ఉబ్బుమీద వ్రేళ్ళతో తట్టినయెడల గాలితిత్తివలె మ్రోగుతుంది. సకాలములో తగు చికిత్సచేయనిచో నెత్తురు తలకెక్కుతుంది. అప్పుడు ముఖముమీద రక్తనాళములు ఉబ్బుతాయి. కన్నులు కనబడవు. ఊపిరిపీల్చుట కష్టముగావుండి పశువు మూల్గుతుంది. వ్యాధి ముదిరిన-కొలది మరణముకూడ సిద్ధమగును.

చికిత్స

ఆరంభములో అరసోలెడు ఉప్పును మెత్తగానూరి సేరున్నర గోరువెచ్చని నీటిలో కలిపి త్రాగించాలి. లేక నాలుగుగుప్పిళ్ళ ఎండుమిర్చిని మెత్తగా నలుగగొట్టి మూడుసేర్లనీటిలో కలిపి కాచి వడపోసి త్రాగించాలి.

లేక కడుపులో గాలిజేరియున్న గాలితీసే పద్ధతిచేయుము.

లేక మామూలుగా తిండి ఎక్కువై ముక్కుచున్న పశువునకు మూడు గ్రాముల సారాయిలో 2 తులముల ఇంగువ కలిపి పెట్టాలి.

లేక ముఖముమీద రక్తనాళములుబ్బి శ్వాసకష్టముగా పీల్చుచున్న ఉలితో ఆ రక్తనాళములను తెగగొట్టాలి.

లేక కోడిరెట్టను 10 తులములు తీసుకొని పేరున్నర గోరువెచ్చని నీటిలో కలిపి త్రాగించాలి.

లేక జొన్నదంటుగాని, వరిగడ్డిగాని కాల్చి మసిచేసి మూడు గొట్టములు పెట్టాలి.

లేక దిరిసెనపసరు సేరు, కారం 4 తు, ఉప్పు చేరెడు, కలినీరు సేరు, కలిపి త్రాగించాలి.

లేక సోపు 2 తు, ఏలకులు 2 తు, జీలకర్ర 2 తు, శొంఠి 2 తు కలిపి సేరు గోరువెచ్చని నీటితో త్రాగించాలి.

లేక వాతారిఅరఖును ఈయాలి.


ఆకస్మిక కడుపుబ్బు

పశువు కడుపులో విషపదార్థములు చిక్కుకొనుటవలన, తాటిపండ్లు తదితరవస్తువులు గొంతుకకు అడ్డుపడుటవలన, జీర్ణముకాక తినిన పదార్థములు పులిసి ఆహారకోశములో నిలువయుండి ఒక విధమగు గ్యాసుగా ఏర్పడుటవలనగాని, తదితర కారణములవలనగాని ఆకస్మికముగ కడుపుబ్బుతుంది.

ఇట్టి సమయములో పశువు తత్తరపడుతుంది. దేహముముడుచు కొంటుంది. ఎడమడొక్క గ్యాసుతో నున్న బాగుగా వుబ్బుతుంది. వ్రేలితో నొక్కిన గుంటపడక డండం అను ధ్వనికలుగుతుంది. మలబద్ధక-ముంటుంది. వెంటనే తగు చికిత్స చేయనిచో చనిపోతుంది.

చికిత్స

కడుపు విస్తారముగ పొంగి శ్వాస ఆడనపుడు ఎడమప్రక్క నడుము ఎముక, కడపటి ప్రక్కఎముక, తొంటిఎముక ఈ మూడు ఎముకలకు మధ్యగ నుండు భాగములో అనగా రమారమి గుంటగా నుండు ఎడమ ప్రక్కకు మధ్యభాగమున సిరాతోగాని, పేడతోగాని గుర్తుపెట్టిన పశువును పడవేసి ఆ గుర్తుమీద డొక్కలో ఒక చిన్న చాకుతోగాని ట్రోకారు అను పనిముట్టుతోగాని పొడిచి గాయముగుండ గొట్టమును



తగిలించిన లోపలనున్న గ్యాసు అంతాబుస్సుమని దుర్గంధముతో పైకి వచ్చి ఉబ్బరముతగ్గుతుంది, మరునాడుకూడ ఈరీతిగగ్యాసు తీసి ఆముదము సేరున్ను, అల్లము 6 తులములును నూరి కలిపి ఒక మోతాదు ఈయాలి. లేక గ్యాసునుపోగొట్టు వస్తువులను ఈయాలి. గొంతుకలో తాటిపండ్లు, ఎముకలు అడ్డుపడిన ఒక సన్నని తిన్నని కర్రను గొంతుకలోనికి పోనిచ్చి కొద్దిగ ఆముదము పోయుచు బైటకో లోపలికో నెట్టాలి. ఇంకను ఏమైన చిన్న వస్తువులు చిక్కుకొన్న కోడిగుడ్ల తెల్లసొనతో గొంతులోనికి జారవిడువాలి.

ఉదయ సాయంకాలపు ఉబ్బు

కొన్ని పశువులకు అజీర్ణం వలనగాని తదితర కారణముల వలన గాని ఆహారకోశములో గాలి జేరుచు పోవుచుండును. కొన్నిటికి ఉదయపు పూటను, మరి కొన్నిటికి సాయంకాలమునను, ఇంకా కొన్నిటికి అన్ని వేళలందును డొక్కభాగములో ఉబ్బుకనబడుతుంది. ఈ వాపున్నంతసేపు పశువునకు బాధగావుంటుంది. మేత సరిగా తినదు కొన్నిటికి దగ్గుండును చికిత్స చేయకపోయిన దీర్ఘ రోగముగ ఏర్పడి ఆహారకోశము చెడి మలబద్ధక మేర్పడి పశువు మృత్యువున కాసన్నమవుతుంది. కాన ఆరంభంలోనే చికిత్స చేయాలి. ఈ ఉబ్బునే ఎగుబోరవల్లి, దిగుబోరవలి యంటారు. ఈవ్యాధినిబట్టి మందులు వాడాలి. లేనిచో ప్రేగులకు అపాయము కలుగుతుంది.

చికిత్స


ఆరంభములోనే అడ్డసరపాకులు 3 గుప్పెళ్ళును, ఉప్పు చేరేడు, ఇంగువ 2 తు, కలిపి త్రొక్కి దినమునకొక మోతాదువంతున సేరు గోరు వెచ్చని నీటితో గాని, కారపుపాలతో గాని నాలుగుదినములు వరుసగా యిచ్చిన తగ్గుతుంది.

లేక మెడికల్ అవిసెనూనె సవాసేరు, కర్పూర తైలం 2½ తు, నవాసాగరం 1 తు కలిపి ఒక మోతాదు మాత్రమే ఇచ్చిన తగ్గును. అవిసెనూనె మందులషాపులలో దొరకుతుంది. రంగులు వేయునది వాడరాదు. అది విషము.

లేక మసిబొగ్గుపొడి 6 తు, కారపుపొడి 4 తు, సున్నపు తేటసేరు, కలిపి త్రాగించుము.

లేక వావిలాకుపసరు సేరు శొంఠి 2 తు, పిప్పళ్ళు 1 తు, మిరియాలు 1 తు, చేదుజీలకర్ర 2 తు, ముసాంబరము ½ తు, మహిసాక్షి 1 తు, కారపుపాలు నీరు కలిపి త్రాగించుము. లేక పశుమిత్రనుగాని, వాతారి అరఖును గాని వరుసగా వారముర్రోజులువాడిన మంచిది.

కడుపునొప్పి



పశువు ఎండుగడ్డిని, పచ్చిగడ్డిని వెంటవెంటనే మేయుటచేత ఆతురతతో అందినముండ్లచెట్లు, కంపజాతులనుతినుటచేత, ఎల్లప్పుడు చల్లనీటిని త్రాగుటచేత పేగులలో జీర్ణముకాని పదార్థములు నిలువ యుండుటచేత వాయుపూరితముగా కడుపుబ్బరముగా నుండునపుడు పనిచేయుటచేత మత్తుపదార్థములు ప్రేగులలోచిక్కు కొనిపోయి బాధ కలుగుటవలన తవుడు, జొన్నలు, వడ్లు, మున్నగు గట్టి పదార్థములు మిక్కుటముగా తిని జీర్ణము కాకపోవుటవలనను, ఈవ్యాధి కలుగును. ఈ నొప్పి అనేక కారణములవలన పలువిధములుగ రావచ్చును.

లక్షణాలు

పశువు మేత మేయుట మానును. ఏమియుతోచక పరుండును. ముఖ్యముగ పశువు తలను ఎడమ డొక్క దగ్గర ఆనించి మూల్గుచు వెనుక కాళ్ళతో తన్నుకొనుచు వెన్నును విరచుచు, పడుకొనుచు, లేచుచు, తోకనుఎత్తుచు, మాటిమాటికి మూత్రమును పోయుచు, పేడపలుచగ గాని గట్టిగగాని అసలు వేయకుండగ గాని యుంటుంది. అప్పుడప్పుడు పండ్లు కొరుకుట కన్నులు త్రిప్పుట, నురుగు కక్కుట జరుగుతుంది.

ఈ వ్యాధి ఏ కారణమువలన వచ్చినదో, ఏ పరిస్థితిలో నున్నదో వెంటనే తగ్గునా? ఎంతకాలము పట్టును? అప్పుడప్పుడు వచ్చిన ఏ లక్షణములతో నుండును? ఎనిమా అవసరమా? మున్నగు విషయములను పరీక్షించి తగిన చికిత్స చేయాలి.

ఆరంభములో ఉప్పు చేరెడు. వాము అరసోలెడు, ఇంగువ 4 తు సన్నావాలు 4 తు, కలిపి సేరున్నర గోరువెచ్చని నీటిలో కలిపి ఒక మోతాదు ఈయాలి.

పేడవేయక మలబద్ధకమున్నపుడు సబ్బునీటితో ఎనిమా చేయుట మంచిది.

లేక గచ్చాకురసము అర్ధసేరు, ఇంగువ 4 తు, ఉప్పు చేరెడు కలిపి త్రాగించాలి.

లేక దీర్ఘకాలపు నొప్పిగానున్న శొంఠి 1 తు, మిరియాలు 2 తు, కురంజీవాము 2 తు, సోడావుప్పు 1 తు, వాయులవంగాలు 1 తు, నీరు సేరున్నర కలిపి రెండుదినములు కొకమోతాదు ఈయాలి.

లేక నొప్పిచే తన్నుకొనుచుండిన గాడిదగడపాకు పసరుగాని, వాముపాటరుగాని ఈయాలి. లేక ఫార్మసీవారి వాతారి అరఖు అద్భుతముగా పనిచేస్తుంది.

మలబద్ధకము

పశువుయొక్క తత్త్వమునుబట్టి అప్పుడప్పుడుగాని, ప్రతిదినముగాని మలబద్ధక మేర్పడుతుంది. ఈ వ్యాధి కూడ అనేక కారణములవలన రావచ్చును. పేగులు సరిగా పనిచేయక పోవుటవలన అనారోగ్యమగు మన్యప్రదేశములలో నుంచుటవలన మేత, నీరు, సరిగాపెట్టక ఎల్లప్పుడు ఎండలోనుంచి పనిచేయుట వలన పేగులు ఆరిపోవుటవలన మలబద్ధకము కలుగుతుంది. పశువు అనారోగ్యముగా నున్నపుడెల్ల ఈ వ్యాధి కలుగవచ్చు.

లక్షణములు

పశువు నాలుకపై ఒక విధమగు పొరగ్రమ్మి, మలము గట్టిగా వేస్తుంది. ఆకలి తగ్గి మందగతిగ వుంటుంది. నెమరు వేయదు. తోక నప్పుడప్పుడు ఎత్తుచు ముక్కుతుంది. జ్వరముకూడ యుండి, అపాన వాయువులు విడుస్తుంది. కాళ్ళనరములు లాగుతాయి. చిన్నదూడలైన పేగులలో ఎలుకపాములు పుట్టుతాయి.

చికిత్స

ఆరంభములో చింతపండుపులుసు సేరు, ఉప్పు చేరెడు, గోరువెచ్చని నీరు సేరు కలిపి త్రాగించుము.

లేక అర్ధసేరు ఆముదములో 40 చుక్కల నేపాళనూనె కలిపి ఈయవలెను.

లేక నల్లజీడిగింజలు కొట్టినవి 17 న్నూ, పాలు సేరున్నూ కలిపి కాచి వడపోసి త్రాగించాలి.

లేక ముసాంబ్రము 1 తు, నేలవేము 2 తు, ఉప్పు 6 తులములు, శొంఠి 5 తు, కలిపి సేరు వేడినీటిలో కలిపి ఈయుము.

లేక ఆముదము సేరు, ఎండుమిర్చి గుప్పెడు, అల్లము 2 తులములు కలిపి కాచి వడపోసి త్రాగించాలి.

ఈరీతిగా అనుభవచికిత్సలు చేయవలెను. విరేచనములైన తరువాత బలముగల తేలికపదార్థములను పచ్చిగడ్డిని పెట్టాలి.

లేక వాతారి అరఖును వాడుడు.

విరేచనములు

ఈ వ్యాధి మేతలోపమువలనను, ఆహారకోశములోను, పేగులలోను, ఒకవిధమగు పురుగులుండుట వలన పచ్చిక మేయుచు వెంటనే ఎండుగడ్డి మేయుటవలన వర్షము కురిసినతరువాత పచ్చిగడ్డి తినుటవలన ముక్కిపోయినగడ్డి, కాడలు, పురుగులుపడిన తవుడు, నిలువయున్న కుడితి వగైరాలు తినుటవలన కలుగుతుంది. ఇంకను పెద్దరోగము మున్నగు తదితర రోగములలో విషపుసాలీళ్ళను తినుటవలనను ఈ వ్యాధి రావచ్చును.

లక్షణాలు

పలుచగా పేడవేయుటయే దాని ముఖ్యలక్షణము. కడుపునొప్పి, ఆకలిలేకుండుట, వేడిచేసిన పారుడు ముడ్డితీపు వుంటుంది. వాతము చేసి పారుచుండిన ముడ్డితీపుయుండదు. దుర్వాసన బంకతోకూడిన నెత్తురు కూడ యుండును. విరేచనములగుకొలది మలపదార్థము తగ్గుతుంది. చెవులను వ్రేలాడవేసి నల్లకప్పు వేస్తుంది. దినమునకు 10 లేక 15 వరకు విరేచనములుగను. నెమరు మానును; మూల్గుతుంది. డొక్కలు దెంచుకొనిపోవును, అంటురోగములలో వచ్చు విరేచనముల లక్షణములు మరొకవిధముగా వుంటాయి.

చికిత్స

ఆరంభములోనే సేరు ఆముదమును ఇచ్చిన లోపలి మలమంత కదిలి పడిపోయి వ్యాధి తగ్గుతుంది.

లేక పచ్చితుమ్మచెక్కరసము, పచ్చినేరేడుచెక్కరసము, పచ్చివేపచెక్కరసము మూడు అర్ధసేరులు తీసి నిమ్మకాయంత వెన్నకలిపి ఒకటి రెండు మోతాదులు ఇచ్చిన తగ్గుతుంది.

లేక కవిరి 2 తులములు, మాచికాయలు 2 తులములు, సీమ సున్నము 4 తులములు, గంజాయి 1తు, నల్లమందు పావుతులం, కలినీరు సేరున్నర కలిపి పారుడుతగ్గువరకు రెండుమూడు మోతాదులిచ్చిన తగ్గుతుంది.

లేక మారేడుగుజ్జు 10 తులములు, కవిరి 2 తులములు కలిపి నూరి సేరు నీటిలో కలిపి ఈయాలి. లేక కర్పూరము పావుతులము, ఇంగువ 2 తులములు, శొంటి 1 తు, కవిరి 3 తు కలిపి సేరు జొన్నకలితో పెట్టాలి.

లేక కాసినిగింజలను నీటిలో నానవేసి పిసిగి త్రాగించిన ముడ్డితీపుతగ్గి విరేచనములు కట్టుతాయి.

లేక పమిడిప్రత్తి ఆకురసము సేరు మజ్జిగ సేరు కలిపి త్రాగించిన తగ్గుతుంది.

షరా :- పశువు కాకవలన పారుచున్నదీ, లేక వాతమువలన పారుచున్నదీ, లేక తదితర వ్యాధులచే పారుచున్నదీ బాగుగా పరీక్షించి అనుభవముతో చికిత్సచేయాలి. కాకవలనపారిన అంత ప్రమాదము లేదుగాని వాతమువలన పారిన శీతలములోనికివచ్చి ప్రమాదము కలిగించును. విరేచనములగుచోట ఎప్పటికప్పుడు పరిశుభ్రము చేయుచుండాలి. ఎక్కువగానై నీరసించిన, జొన్నజావలో సారాయి, శొంఠిపొడి కలిపి పెట్టాలి. లేక వాతారిఅరఖు చక్కగాపనిచేయును.

రక్తవిరేచనములు

ఈ వ్యాధి శీతోష్ణస్థితిగతులు మారునప్పుడు తరచుగా వచ్చుచుండును. పశవులు క్రొత్తగడ్డి తినుటవలన, కాల్వలలోని క్రొత్తనీరు త్రాగుటవలనను, కొన్ని సమయములలో అతివేడి జేయుటవలనను, జీర్ణముగాని పదార్థములు జీర్ణకోశములో నిలుపయుండుటవలనను, ఒక విధమగు పురుగులు పేగులలో నుండుట వలనను, విషవస్తువులు విషపుమొక్కలు, విషపురుగులను తినుటవలనను తదితర కారణములవలనను ఈ వ్యాధి కలుగుతుంది.

లక్షణాలు

ఈరోగము ఆకస్మికముగా రావచ్చును. పశువునకు చలిసోకును. మలమువెంట చీము నెత్తురు పడుచు గుదస్థానమున బాధయుంటుంది. కడుపునొప్పిచే పండ్లుకొరుకుచు పచ్చిమాంసపుముక్కలవలెనుండు చిన్న చిన్న నెత్తురుకండలు విరేచనములతో పడుచు దుర్వాసనగా వుంటుంది. ప్రేగులపై ఒత్తిన బాధగా వుండును. పగలుకంటె రాత్రులందు వాతంవలన పశువు బాధపడుతుంది. పేగులు అరుచుచుండును.

వ్యాధి ముదిరిన కొలది శుష్కిస్తుంది. దుర్వాసనగల చెమట శరీరముపై కుబుకును. తగిన చికిత్స చేయనిచో చనిపోవును. విషసంబంధమైనచో విషతంత్రము చూడుడు.

చికిత్స

ఈ వ్యాధికి జాగ్రత్తగా సంరక్షణ చేయవలెను. వగరుపదార్థములను, కాచిననీటి నిచ్చుచుండాలి.

ఆరంభములో పెసరుగుగ్గిళ్ళు తవ్వెడు లేక మానెడు, పేరినేయి సోలెడు, ఉప్పు 4 తు, కలిపి పెట్టాలి.

లేక అరటిపువ్వులరసము అరసోలెడు, పెరుగు సేరు, వెన్న 5 తు, కలిపి ఒకటి రెండు మోతాదులు ఉంచాలి.

లేక ఆవుపాలు సేరు, హారతికర్పూరం అర తు, కవిరి 2 తు, వరిపిండి సోలెడు కలిపి పెట్టాలి.

లేక ఎఱ్ఱకలువదుంపలు అరవీసెడుత్రొక్కి సేరు జొన్నకలితో కలిపి కాచి విరేచనములు తగ్గువరకు నాలుగుగంటల కొకమోతాదు ఈయాలి.

లేక నీరుల్లిపాయలు 26 తు, పెరుగు సేరు, మెంతిపొడి 2 తు, వెన్న నిమ్మకాయంత కలిపి పెట్టాలి.

లేక ఉడకబెట్టిన నీరుల్లిపాయలు 20 తు, పిచ్చిబెండాకు 2 గుప్పెళ్ళు, నల్లమందు పావు తు, కలిపి మెత్తగానూరి పెట్టాలి.

హెచ్చరిక

తోకను, ఆసనమును వేడినీటితో కడుగుచుండాలి. ఆహారము జీర్ణముకలుగుచేయునదిగా పెట్టాలి. నీరు కాచిపెట్టాలి. దుర్వాసనయున్న సాంబ్రాణిపొగ శరీరమునకు, ముక్కులకు వేయాలి.

పాండురోగము

పశువునకు తగినంత ఆహారము పెట్టకపోవుటచేత, చీకటికొట్టములో ఎల్లప్పుడు వుంచుటచేత, తగినంత గాలి లేకపోవుటచేత, సోమరితనముగా ఎల్లప్పుడు నీడను పశువులచావడిలో నుండుటచేత, రక్తమునందుండు ఎఱుపుకణములు తగ్గుటచేత, ఈ వ్యాధి కలుగుతుంది. రక్తమునందలి దౌర్బల్యమే దీనికి ముఖ్యకారణము.

లక్షణాలు

పశువు శరీరకాంతి పాలిపోవును. సామాన్యజ్వరముంటుంది. కండ్లరెప్పలు చూచిన రక్తములేక తెలుపురంగుగా వుంటాయి. నాలుక, పెదవులు, కనురెప్పలు, చర్మము మున్నగు భాగములన్నియు పాలిపోతాయి. వ్యాధి ముదిరినకొలది బరువు తగ్గుతుంది. ముఖమువాస్తుంది. రక్తము క్షీణించినకొలది అవయవములు అస్వస్థత నొందుతాయి. క్రమేపి పక్షవాతముగూడ రావచ్చును. క్రమక్రమముగా కృశించి కొన్నాళ్ళకు మరణిస్తుంది.

చికిత్స

బలము, రక్తవృద్ధి కలుగజేయు పదర్థాములను పెట్టుచుండాలి. గాలి ధారాళముగావచ్చు ప్రదేశమందుండాలి.

అన్నభేది 1 తు, విషముష్టిగింజలపొడి 2 తు, సోడాఉప్పు 1 తు, కురంజీవాము 1 తు, ఉప్పు 3 తు, పసుపు అర తు, కలిపి ఉదయసాయంకాలములందు గోరువెచ్చని నీటితోగాని, బెల్లముతోగాని పెట్టాలి.

లేక జిల్లేడుమొగ్గలపొడి 1 తు, వాము 8 తు, మిరియాలు 2 తు, శొంఠి 3 తు, ఇంగువ 1 తు, కలిపి పై మాదిరిగానే పెట్టాలి.

లేక విషముష్టిగింజలపొడి 2 తు, నేలవేము 1 తు, అన్నభేది ఒకటిన్నర తు, పసుపు 1 తు కలిపి పై మాదిరిగానే పెట్టాలి.

లేక మహిసాక్షి 1 తు, కటకరోహిణి 2 తు, శొంఠి 1 తు, ఉప్పు 3 తు, కలిపి దాణాలోగాని, వేడినీటిలోగాని పెట్టాలి. పైమందులను వరుసగా నేదొఒకటి పక్షము లేక నెలరోజులు పెట్టాలి. లేక పశుబలవర్ధని వాతారిపొడరును కలిపి పెట్టాలి.

గుండె నంజు

ఈ రోగము పశువులకు దుర్బలత్వమువలన కలుగుతుంది. ఇంకను వేసవికాలమందు మేత సరిగ దొరకక తొలకరించగనే మిక్కుటముగ తినుటచేతను, వర్షాకాలమందు నూతనముగ చిగిర్చినీటిమయమై యుండెడు పచ్చికతినుటచేత ఎల్లప్పుడు చలిగాలిలో నుంచుటచేత శ్వాసకోశములలో అస్వస్థత ఏర్పడుటచేత రక్తహీనముచేత కలుగును. ఈజాడ్యము పశువు రొమ్మునకు, కడుపునకు మాత్రము ముఖ్యముగసోకుతుంది. దీనినే గుండెకు సోకిన గుండెనంజు యంటారు.

లక్షణాలు

ఆరంభములో పశువు రక్తనాళములో సరిగా రక్తప్రసరణ లేక ఆయాభాగములను వ్రేళ్ళతో నొక్కినయెడల గుంటలు పడును జ్వరము తక్కువగ వుంటుంది. నోటినుండి చొంగ అప్పుడప్పుడు పడుచు, నోరు దుర్వాసనగా నాలుక తెలుపుగవుంటుంది. పశువు పనిచేసినపుడు ఎండలో నున్నపుడు వేడిచేసినపుడు రొప్పుతుంది. వ్యాధి ముదిరినకొలది ఎండలో పనిచేయించిన రొప్పుచు నోటినుండి చిక్కని చొంగవంటి పదార్థము పడుతుంది. చిన్నదూడలకు కడుపుదగ్గరగా నీరుచేరి ఒత్తిన మెత్తగానుండును పశువు అరమేతమేస్తుంది. కాళ్ళుగాని, ముఖముగాని, రొమ్ముగాని, దవుడక్రిందగాని, లేక భాగములన్నియు గాని నీరున్నట్లు కనపడుతుంది. వ్యాధి ముదిరినకొలది పశువు క్షీణిస్తుంది. కనురెప్పలు, చీలమండలు, మూతి మున్నగు భాగములలో వాపుయేర్పడును, ఈ వ్యాధి కొన్ని నెలలవరకు యుండి పశువును బాధిస్తుంది.

చికిత్స

ట్రోకారుతో లోపలి నీటిని తీసివేయవచ్చునుగాని అనుభవముగల వైద్యునిచే చేయించాలి. ఆరంభములో శొంఠి 1 తు, అన్నభేది ½ తు, విషముష్టిగింజలపొడి 1 తు, నేలవేము 1 తు, ఉప్పు 2½ తు, కలిపి చూర్ణముచేసి ప్రతిదినము ఈమోతాదువంతున వారము దినములు పెట్టుచు జీర్ణశక్తిగలుగు పదార్థములు పెట్టుచుండాలి.

లేక ఆరెదొండాకు పసరు అర్ధసేరు, మిరియాలపొడి 1 తు, శొంఠి 1 తు, వెల్లుల్లిపాయలు 4 తు, పసుపు ½ తు కలిపి పై మాదిరిగనే నాలుగుదినములు పెట్టాలి.

లేక ఆవుపాలుగాని, గేదెపాలుగాని సేరు, తెలికపిండి సవాసేరు కలిపి ఒకపూట నాననిచ్చిపెట్టాలి.

లేక కర్పూము ½ తు, యష్టిమధుకము 1 తు, ఇంగువ 1 తు, బెల్లం 6 తు, కలిపి అప్పుడప్పుడు నాకించుచుండాలి.

లేక ఫార్మసీవారి పశుబలవర్ధని, స్ప్రెయిన్‌కిల్లరును వాడవచ్చును.

గర్భశూల

ఈ వ్యాధి చిన్న పశువులకు వస్తుంది. దాణాదినుసులు, కందులు, వులవలు, మినుములు మున్నగునవి ఎక్కువగతిని మరలపచ్చిగడ్డి తదితర పొట్టుధాన్యములు తినుటవలన, క్రొత్తగడ్డి, కాడతినుటవలన, వాతరోగము వలన, అజీర్తివలన జీర్ణముకాకుండగనే ఆహారముమరల తినుటవలన నెమరుసరిగా వేయకపోవుటవలన, చలిగాలిలోను, వర్షములోను వుండుటవలన రావచ్చును. ఈ వ్యాధి కొన్ని రోజులుకాని ఒకటి రెండుమాసములుగాని వుంటుంది.

లక్షణాలు

ముఖముగ ఈ వ్యాధిలో విరేచన మవ్వక జిగురుతో కొద్దిగ పడుచుండును. శూలనొప్పి వచ్చినపుడు కాళ్లనుజాపి తలను పొత్తికడుపునకు ఆనించి మూలుగుచు దీనముగ చూచుచుండును. నెమరుపొట్ట వుబ్బరముగ వుంటుంది. అప్పుడప్పుడు నోటినుండి చొంగపడుతుంది. ఎన్ని పర్యాయములు ఎనీమాచేసినను విరేచనము కాదు. పశువు లేచుట, పండుకొనుట, మూల్గుట, వెన్నువిరుచుకొనుట, అపానవాయువులు విడుచుట, క్రమేపి వ్యాధిముదిరి మరణమునకు సిద్ధమవుతుంది. మూత్రము, మలము ఎరుపు రంగుగ నుండవచ్చును.

చికిత్స

ఈ వ్యాధి గల పశువునకు ముందు విరేచనమయ్యే సూత్రమును చూడాలి. ఈ విరేచనమగుటకు ఆతురతతో రైతులు వివిధచికిత్సలు అనగా కొబ్బరినూనె, వంకాయలు, నల్లేరు, పందిపెంట, జెముడుకాడల రసము మున్నగు వస్తువులు పెట్టుటవలన మలము గట్టిపడి దీర్ఘవ్యాధి గానై మరణమునకు సిద్ధమవుతుంది.

ఆరంభములోనే నల్లజీడివిత్తులు 15 మెత్తగకొట్టి సేరు గేదెపాలలో కలిపి కాచి ఒక్క పర్యాయమే ఈయాలి.

లేక రెండుగిద్దల ఉప్పును కారపుపాలలో కలిపి గోరువెచ్చగ నుండునట్లు ఒక్కపర్యాయమే త్రాగించాలి.

లేక కోడిమలము 6తు, వేడినీరు సేరున్నర కలిపి ఈయాలి.

లేక నేపాలగింజలనూనె 60 చుక్కలున్ను, ఆముదము సేరును, కలిపి ఈయవలనెను. ఈ రీతిగా గాఢవిరేచనమగునట్లు ఒక మోతాదు ఇచ్చిన లోపలనున్న చెడుమలమంత పడిపోయిన తరువాత ఏ వాము రసమో, ఏ శొంఠిరసమో, ఏ ఇంగువపాలో దినమునకొక మోతాదు ఇచ్చుచు జీర్ణమగు తేలిక పదార్థములను పెట్టుచుండాలి. కాచిననీటిని దాహముగా ఈయాలి. లేక పశురక్షామృతమును వాడుడు.

మలమూత్రబంధ రోగము

ఈ వ్యాధి పశువుకు అతివేడిజేసి వాతరోగమువలన తదితర వ్యాధులలో యేవైన సంధిగుణములు పుట్టినపుడుగాని కలుగుతూ వుంటుంది. కడుపు బాగుగా వుబ్బుతుంది. ఊపిరి ధారాళముగా విడువలేదు. మలమూత్రముల రెంటిని బంధిస్తుంది. పశువు ఆసనము వుబ్బి, మూత్రకోశము వాస్తుంది. పశువు చెప్పరాని బాధపడుతుంది. కండ్లను తేలవేసి ముక్కుతుంది. ఈ వ్యాధి సాధారణముగ చికిత్సకులొంగదు. వుచ్చబుడ్డకు కూడ ప్రమాదము రాగలదు.

చికిత్స

వెంటనే విరేచనమునకు మందీయాలి.

శొంఠి అర్ధసేరునవటాకు, ఉప్పు చేరెడు కలిపి పొడిచేసి నీటిలో కలిపి త్రాగించాలి.

లేక మేకనీరుడు పావుసేరుతెచ్చి పశువు ముక్కురంధ్రములలో పోయుము.

లేక ఆవాలు, సబ్బు మెత్తగ నూరి గుడ్డకు పట్టించి మూత్రద్వారములోనికి తోయాలి.

లేక నారింజకాయంత ఆవువెన్న సేరునీటిలో బాగుగకాచి త్రాగించాలి. లేక సాన్‌టాల్‌ను పశురక్షామృతమును వాడవచ్చును.

ఉదా: పై మందులు దినమునకు రెండుమూడుసార్లు ఉపయోగించాలి.

జలగల రోగము

పశువు ఆహారకోశములో జలగ ఆకారముగవుండు పురుగులు పుట్టి గ్రుడ్లుపెట్టి ఒకవిధమగు రోగమును తగిలిస్తాయి. ఈరోగము వల్లపు ప్రదేశములలో నుండు కొల్లేరు ప్రాంతములందును, పర్రనేలలయందుండువానికి తరుచుగ వస్తుంది. ఈ వ్యాధి ఎక్కువైనకొలది పశువు క్షీణించుచు ప్రక్కటెముకలు

కనపడుతాయి. అప్పుడప్పుడు దగ్గుతుంది. రక్తము క్షీణించినకొలది, పురుగులు జలగలు అకారంగా పెరిగినకొలది విరేచనములవుతాయి. క్రమేపి విరేచనములలో జలగఆకారమగు పురుగులుండి బయటపడుచు పశువు దుర్బలమునొంది క్షీణించుతుంది.

చికిత్స

జలగలను ఎండించి చూర్ణముచేసి పూటకు పావుతులం పొడిలో అరతులం పొగాకు పొడిని కలిపి సేరుగోరువెచ్చనినీటితో కలిపి దినమున కొకమోతాదు ఈయాలి.

లేక ఫార్మసీవారి వాతారియను అరఖు అనుపానప్రతిక రీతిగా త్రాగించిన తగ్గుతుంది. అనుభవముగల వైద్యునికి చూపించి తగినచికిత్స చేయించాలి లేనిచో ప్రమాదమునకు గురియగును.

రొమ్ముపట్టు

దీనినే రొమ్ముపట్టు, రొమ్ముగడిశలబడుట యందురు. పశువులను విసుగు విరామములేక ఎక్కువ బరువులు వేసి బండ్లుతోలుట చేత, చలిగాలి సోకుటచేత, సీతగాలి సోకుటవలన, వివాహములకు గుడిసెబండ్లు కట్టి ఎద్దులను సర్దాగా కన్నుమిన్ను గానక తోలుటచేత, ఇనుపనాగళ్ళతో దున్నుటచేత, కిరాయి బండ్లవారు ఎక్కువధాన్యపుబస్తాలు వేసి బురదగానుండు బజారులలోకూడ తోలుటచేతను, మాటిమాటికి బరియెముకలపైన రైతులు తమ చెండుకర్రలతో కొట్టుట చేతను ఈ వ్యాధి కలుగుతుంది

లక్షణాలు

ఈ నొప్పి ప్రారంభమైన వెంటనే జ్వరము సోకి దగ్గుతుంది. దగ్గునపుడు బుసకొట్టుచుండును. పశువు ఎల్లపుడు పండుకొనుటకు ఇష్టపడును గాని, నిలుచుండుటకు ఇష్టమును చూపించదు. శ్వాసోత్పత్తియగు అంగములకు పలువిధములైన వాపులుకూడ పుట్టుతాయి. రొమ్ముభాగము చాల బాధగా వుంటుంది. రొమ్మెముక చాలపచ్చిగావుండి అప్పుడప్పుడు నోటివెంట నురుగుగాని, తెమడగాని పడుతుంది. వ్యాధిని గ్రహించలేక పశువుతో పనిచేయించిన యెడల రక్తప్రసారమున కాటంకము కలిగి ఊపిరాడక పశువు చనిపోతుంది. వ్యాధి ముదిరినకొలది వెన్నువంగుతుంది. ముందరి కాళ్ళు పట్టుతాయి.

చికిత్స

తాటిబెల్లము అరవీసె, జిల్లేడుమ్రానుపొట్టు అర్ధసేరునవటాకు కలిపి త్రొక్కి నెమ్మదియగువరకు పెట్టాలి.

లేకవులవపిండి అరసోలెడు, తాటిబెల్లము అరవీసె, తెలికపిండిసవాసేరు, ఉప్పు చేరెడు, కోడిపెట్టక్రొవ్వు సవాసేరు కలిపి త్రొక్కి ప్రతిదినము ఉదయ సాయంకాలములందు కోడిగ్రుడ్డంత వంతున పైమందు వచ్చువరకు పెట్టాలి.

లేక వుప్పిచెక్క 8 తులములు, పసుపు 1 తులము, వులవపిండి సోలెడు, కలిపిదంచి రెండుదినములు పెట్టాలి.

లేక తక్కెడువేరుపొట్టు 8 తులములు, జిల్లేడిపువ్వులు 2 తులములు, తాటిబెల్లము నవాసేరు కలిపిపెట్టాలి.

లేక లోపలికి పశుబలవర్ధని, పెయిన్‌కిల్లర్‌ను వాపునకు ఉపయోగించాలి.

హెచ్చరిక

రోగముగలపశువును క్రొత్తపాకలోనుంచి వేడికాపులు రొమ్మునకిరుప్రక్కల కాచాలి. పశువు ఎదరాల దగ్గరకూడ బాగుగా కాపులు తీయుట మంచిది. కాపులుతీయునపుడు తడిలేకుండ పొడిగుడ్డలో వేయించిన యిసుకగాని, ఉప్పుగాని వేసితీయాలి.

రక్తశూల

ఈరోగము పశువుమెదడు చెడుటవలన, ఎండలోను, వడగాల్పులలోను పశువును పనిచేయించుట వలన వేడినిగలిగించు దాణాదినుసులను మేపుటవలన కలుగుతుంది.

లక్షణాలు

పశువునకు జ్వరము తగులును, గొంతునాళములు చాల వేడిగా వుంటాయి. దేహము కృశించుతుంది ముక్కులనుండి, నోటినుండి, ఆసనమునుండి నెత్తురుపడుతుంది. పశువుమేతమేయదు. ఒకవిధమైన శూలకలిగి పశువుచాలా బాధపడుతుంది. మూల్గుచు, పండ్లుకొరుకును. రక్తము స్రవించినకొలది పశువు నీరసించును. దవుడలువాచును. నోరు దుర్వాసనవేయును. కాళ్ళు పట్టివేయును. వ్యాధి ముదిరినకొలది పశువు నడువజాలదు. సరియైన చికిత్సచేయనిచో వెంటనే చనిపోతుంది.

చికిత్స

ఈతగుంజు–అరవీసె, పంచదార అర్ధసేరు నవటాకుకలిపి ఒకసారి పెట్టాలి.

లేక నేరేడుచెక్కరసము అర్ధసేరు, ఆవుపాలు అర్ధసేరు, మోతాదువంతున కలిపి రెండుసార్లు త్రాగించాలి.

లేక ఆముదపు వేళ్ళు 2 గుప్పెళ్ళు, పల్లేరు వేళ్ళు 2 గుప్పెళ్ళు, దర్భవేళ్ళు 1½ గుప్పెడు, రెల్లువేళ్ళు 3 గుప్పెళ్ళు, నూరి కషాయము కాచి అరసేరు ఆవుపాలలో కలిపి ఒకసారి త్రాగించాలి.

లేక నేల తంగేడాకు గుప్పెడు, పెరుగు సేరు, కవిరి 2తు, కలిపి నాలుగుగంటలకొక మోతాదువంతున రెండుసార్లు పెట్టాలి.

లేక తుమ్మ, నేరేడు చెక్కల కషాయములో 2 తులముల మాచికాయ చూర్ణము 1తు, కవిరి కలిపి పెట్టాలి. లేక ఫార్మసీవారి బేల్‌పౌడరును వాడండి.

హెచ్చరిక


ఈ వ్యాధిగల పశువును ప్రత్యేక స్థలములందుంచవలెను. రక్తముకారు శరీరభాగములను పటిక లోషన్‌తోగాని, మైలతుత్తపులోషనుతో గాని, కడుగవలెను. ఈగలను మూగనీయరాదు. పశువు నీరసించు-చున్న వరినూకలువేయించి జావకాచి తేలికగా పెట్టవలెను. శూలతీవ్రముగా నున్న వాతారి అరఖును వాడుడు.

వ్యాధి తగ్గినతరువాత పశుబలవర్ధనిని వాడుడు.

* * *

పదునెనిమిదవ భాగము

వాతరోగములు



రైతులలో చాలామంది మా పశువునకు వాతము చేసినది, యేమియూ తినుటలేదని మామూలుగా తదితరులతో చెప్పుతుంటారు.

వాతమనువ్యాధి దేనివలన వచ్చుచున్నదో ఆలక్షణములెట్లుండునో, ఏ ఆహారపదార్థములు తినునందు వలన ఈ వ్యాధి వచ్చినదో మున్నగు విషయములు తెలిసికొనాలి.

పశువులు తిను మామూలు ఆహారముగాక అదనముగా బలము గలిగించు తొండంగి, పిల్లిపెసర, మినుము, కందిపొట్టు, శనగపొట్టు, తవుడు మున్నగునవి మితిలేకుండ మేపుటవలనను, వేసవికాలములో పిల్లి పెసర పొలములలో పశువులనుతోలి మిక్కుటముగా తినుపించుటవలనను, ప్రత్తి గింజలు, మొక్కజొన్న, పాలకండెలు, జొన్నపిండి, పాలు, మినపపిండి ఇంకా ఎన్నెన్నో రకరకాల పదార్థములు అల్లుళ్ళకు పెట్టినట్లుగా ఈ పశువులకు పెట్టుటవలనను తప్పక వాతముకలుగుతుంది. ఈ రీతిగా మేపిన పశువులకు తగినంత వ్యాయామము ఈయకపోవుటవలనను, చలిగాలిలో, ఎండలో నుంచుటవలనను ఈ వాతమువస్తుంది. పశుప్రదర్శనములకు వెళ్ళాలని అన్నము, గుగ్గిళ్లు, గారెలు, బూరెలు, నెయ్యి, మినపపిండి, వగైరా మనిషికివలె పశువునకుకూడ గారాబముగా పెట్టేవారున్నారు. ఇటువంటివన్ని పెట్టి అరే! మాగిత్తకు కాళ్ళు పట్టినవిరా! వాతము చేసినదిరా! అని చెప్పగానే 74 వస్తువులు ఏకొండమీదనో, ఎవరు చెప్పినవో తీసుకొనివచ్చి ముద్దకొట్టి నోటిలో పెడ్తారు. ఇట్లు పెట్టుటవలన వస్తువుల గుణముల ననుసరించి లోపల జీర్ణించుకోలేక నోరులేని ఆ పశువు పడే బాధ భగవంతునకెరుక. కాబట్టి ఇట్టిపశువులకు జాగ్రత్తగా చికిత్స చేయించాలి.

లక్షణాలు

వాతమనునది పశువు దేహములో జీర్ణించిన రెండుమూడు సంవత్సరములకుకూడ కనపడవచ్చును. ఆరంభదశలో నల్లకప్పు వేస్తుంది. ముఖ్యముగా వెన్ను, డొక్కల భాగము ముడుచుకొంటుంది. అరమేత మేస్తుంది. కాళ్ళు పట్టివేస్తుంది. శరీరరంగు మెరుపుగా వుంటుంది. పేడ పలుచగాగాని గట్టిగాగాని యుండి పులుసువాసన కొట్టుతుంది. మలబద్ధకముంటుంది. జ్వరము హెచ్చుచు తగ్గుచుండును. క్రమేపి పశువు క్షీణించుచుండును. కండ్లనుండి కొన్నిటికిపుసినీరుకారుతుంది. అప్పుడప్పుడు పండ్లు కొరుకుతుంది. పశువు తన తలను కడుపుదగ్గర పెట్టుకొని విచారముగా వుంటుంది. కొన్ని వెన్ను విరుస్తాయి. అపానవాయువులుకూడ విడుస్తాయి క్రమేపి పశువు నీరసించి చనిపోతుంది. ఈవ్యాధికి తగిన చికిత్స చేయనస్పటికి, తెలిసితెలియని మందులు పెట్టినప్పటికి మరొక వ్యాధిలోనికి రాగలదు.

చికిత్స

మలబద్ధకముగానున్న ఆరంభములోనే ఎనీమా చేయుట మంచిది. ఏరుపెసరాకు (పెళుసుగా–నుండును. ఇదియొక గుబురుతీగె. సముద్రపు ప్రాంతములందును కొండల ప్రాంతములందుంటుంది) 8 వీశలు, మంచి నూనె 4 వీశలు, శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు 15 తులములు, తాటిబెల్లం 2 వీశలు, ఉప్పు సోలెడు, కురంజీవాము సవాసేరు కలిపి త్రొక్కి ఒకకుండలోవేసి పక్షముదినములు భూమిలో పాతిపెట్టి తీసి ప్రతిరోజు సవాసేరుమందును తినిపించిన చాలా బాగుగా పనిచేయును. నా స్వానుభవము.

లేక తమలపాకులు 50, ఇంగువ 2 తు, వెల్లుల్లి 4 తు, మెత్తగా నూరి ఒక గొట్టము నువ్వులనూనెలో కలిపి రెండుదినముల కొకమోతాదువంతున వారముదినములు యిచ్చిన తగ్గుతుంది.

లేక చేకొణితాకు (సేగుర్తాకు) పసరు సేరు, పసుపు 1 తు, ఇంగువ 2 తు, వెల్లులి 8 తు, కురసానివాము గుప్పెడు కలిపి రెండు దినములకొకసారి వంతున 10 దినములు పెట్టుము. లేక తేలికగా తగిలిన పశువునకు ప్రతిరోజు ఒక కొబ్బరికాయను నీటిలో త్రొక్కి పాలుతీసి ఒక సేరున్ను, శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు, ఇంగువ ఒక్కొక్కటి ఒక్క తులమువంతున కలిపి నాలుగురోజులు పెట్టిన తగ్గుతుంది.

లేక పచ్చిఅల్లము 4 తులములు, ఉప్పు 6 తు, కొబ్బరిపాలు సేరు కలిపిపెట్టాలి.

లేక దుష్టపాకుపసరు అర్ధసేరు, కడుగు సేరు, పప్పు 4 తు, కలిపి పెట్టుము. నాలుగు మోతాదులీయుము, దినమునకొకసారి మాత్రమే.

లేక వెంపలివేళ్ళరసము అర్ధసేరు, కలినీరు సేరువంతున పదిరోజులు పెట్టాలి.

లేక నల్లేరు నిమ్మకాయంత, ఇంగువ 1 తు, వెల్లుల్లి 4 తు ఆముదపుపప్పు నిమ్మకాయంత నూరి సేరుకలితోపెట్టుము.

కాళ్ళు పట్టినయెడల ఒకబిందెనీటిలో తురక వేపాకుగాని, వావిలాకునుగాని వేసి కాచి కాఫీత్రాగునంత వేడినీటిలో గుడ్డముంచి అప్పుడప్పుడు కొట్టుచు కొబ్బరినూనెలో హారతికర్పూరబిళ్ళలువేసి కలిపిమర్దనచేయాలి.

లేక మంచినూనెలో మండపసుపుకొమ్ము అరగదీసి పట్టించుము.

లేక కర్పూరతైలనుగాని, వెన్న, పసుపు కలిపిగాని రాసి మర్దన చేసి వేడికాపులు వేయవచ్చును.

ఈ రీతిగా ఇంకను అనుభవముమీద చికిత్సలెన్నోగలవు గాన చేసికొనవచ్చును.

ఈ రోగముగల పశువులకు తేలికగా జీర్ణమగు పదార్థములను పెట్టవలెను. ఎండలోను చలిలోను యుంచరాదు.

ఫార్మసీవారి వాతారిపొడిని గాని, వాతారిఅరకునుగాని వాడిన అత్యద్భుతముగా పనిచేయును. కాళ్ళపట్లకు పెయిన్ కిల్లర్ వాడుడు.

కీళ్ళవాతము

పశువులు చలిగాలిలో నుండుటవలనను, మురికిగానుండు ప్రదేశములలో కట్టుటవలనను, వాతముజీర్ణించిపోవుటవలనను ఈ వ్యాధివచ్చును.

ఈ వ్యాధిలో జ్వరముతీవ్రముగానుండును. అన్ని అవయవములు వేడిగానుండును. ఆకలి చురుకుదనము తగ్గును. నడచుట కెంతమాత్రము యిష్టపడక పడుకొని మూల్గుచుండును. ఈ వ్యాధికి పశువు కొంకులు దగ్గర వాచును. ఆ వాపు ఒక కాలునకుగాని నాలుగు కాళ్ళకు గాని రావచ్చును. ఇట్టి సమయములో పశువును కదలనీయరాదు. వాపుభాగము వేడిగను గట్టిగను వుండును. ఈ వ్యాధి దీర్ఘకాలమున్నచో పశువునకు జ్వరముండదు. ఈ వ్యాధి ఆవులకు ఆంబోతులకు దూడలకుకూడ రావచ్చును. ఇట్టి పశువులకు చాలా అనుభవముతో వైద్యము చేయాలి.

నల్లవుమ్మెత్తాకు పసరు అర్ధసేరు, నల్లమందు ¼ తు, వస 1 తు, కలిపి వాపులకు పట్టువేయవలెను. లోపలికి చురుకుదనము పుట్టించు ఆహారముగాని, మందునుగాని ఈయాలి.

లేక అన్నభేది 1 తు, విషముష్టిగింజలపొడి 1 తు, వాము 4 తు, నేలవేము 2 తు, కలిపి, సేరు నీటిలోగాని, ముద్దగా వచ్చునంత తాటిబెల్లముతో గాని దినమున కొక మోతాదువంతున పక్షము దినములు పెట్టుచు వాపులకు కీల్లపట్టుకు కోడిగ్రుడ్డు తెల్లసొన, తేనె, గుల్లసున్నము కలిపి పట్టువేయుము.


లేక తాటిబెల్లము 2 వీసెలు, వెల్లుల్లి 6 తు, కొట్టుపసుపు 4 తు, కురంజీవాము 10 తు, ఇంగువ 4 తు, మునగచెక్కపొడి 10 తు, సన్నావాలు 4 తు, కలిపి మెత్తగానూరి దినమున కొకపర్యాయము రెండు నిమ్మకాయలంత వుండను మందు వచ్చువరకు పెట్టవలెను. మలబద్ధకము లేకుండ చూడవలెను. నువ్వులనూనెలో చిత్రమూలమువేరు అరగదీసి కీళ్ళవాపులకు పట్టించుము. లేక జిల్లేడుపాలు 1 భాగము, వెన్న 6 భాగములు, పసుపు అర్ధభాగము కలిపి వాపులకు రుద్దవచ్చును.

లేక వావిలాకు గుప్పెడు, నేలవేము ఆకు అరగుప్పెడు, వేపాకు గుప్పెడుతెచ్చి మెత్తగానూరి దానిలో అరతులము పసుపుకలిపి కాఫీ త్రాగునంత వేడినీటిలో దినమునకొక మోతాదువంతున వ్యాధి తగ్గువరకు పెట్టాలి.

ఈ వ్యాధి దీర్ఘముగా నున్నచో ఎక్కువకాలము పైమందులను వాడవచ్చును. వాత సంబంధమగు ఆహారములు పెట్టరాదు. మందులకు తగ్గనిచో రక్షలు వేయాలి.

ఎండువాతము (అజీర్తివాతము)

ఈ రోగమెల్లప్పుడు శరీరము వేడిగానుండు పశువులకును, అజీర్తివలనను, మూత్రము జారీయగుట వలనను, నరములలో పటుత్వము లేకపోవుటవలనను, దాణాలు, ఇష్టముపచ్చిన మందులు బలము కలుగజేయునను యుద్దేశ్యములో పెట్టుటవలనను, ఎంత మేపినను నిస్సత్తువగా నుండి బరి ఎముకలు



కనబడుటవలనను, మేత, నీరు, పెట్టి వెంటనే బండి కట్టుటవలనను, ఈ వ్యాధి రాగలదు. దీనినే పెంటికకట్లు, అజీర్తివాతమందురు.

లక్షణాలు

పశువుకు లోపల మామూలు వేడికంటె ఎక్కువగా వుంటుంది. పేడను కొన్నిరోజులు గట్టిగను మరికొన్నిరోజులు పలుచగను వేస్తుంది. ఈరోగముగల పశువులను నేను చాల పరీక్షించితినిగాని వ్యాధి ముదిరిన లాభముకన్పట్టదు. కాళ్ళు, శరీరము శుష్కించుచు బండి కట్టినపుడు పారుతుంది. మరికొన్ని వ్యాధిముదిరినకొలది శరీరపటుత్వముతగ్గి ఎడతెగక పారుతాయి. ఈపారుడు వెనుకకాళ్ళ కొంకులకు తోకకు ముడ్డికి అంటియుండును. పారుడులో బుడగలుండి నలుపురంగుగా వుంటుంది. మలము పులుసు వాసన కొడుతుంది. రైతు లెన్నియో చికిత్సలు చేయుదురు. పారుడు పుట్టిన తరువాత లాభముండదు. కృశించి నెమ్మదిగా చనిపోవును, మరికొన్ని పారకుండ క్షీణించుచు, ఆకలి మందగించును. ఇట్టి పశువులకు తగ్గును. దీనినే పెంటికకల్లు అంటారు.

చికిత్స

ఈ వ్యాధికి అనేకమంది అనేక చికిత్సలు చేస్తారు. తాత్కాలికముగా ఏ తుమ్మచెక్కయో ఏనేరేడుచక్కయో నీటిలో త్రొక్కి చిక్కనిరసము నాలుగైదు పర్యాయములిచ్చిన తగ్గునుగాని మరల యధాప్రకారముగా పారుచునేయుండును. రైతులకుకూడ విసుగుపుట్టుతుంది. అందుచేత ఆరంభములోనే జాగ్రత్తగా చికిత్స చేయాలి.

పారుడులేకుండనున్న పశువులకు వేయించిన వులవపిండి కుంచెడు, తాటిబెల్లం 4 వీసెలు, అల్లం 8 తు, ఇంగువ 10 తు, వెల్లుల్లి 8 తు, కలిపిత్రొక్కి ప్రతిరోజు కొబ్బరికాయంత పరిమాణము పెట్టాలి.

లేక సేరు ఆవుపాలలోగాని, మేకపాలలోగాని సవాసేరు తెలిక పిండికలిపి ఒకపూట నాననిచ్చి తులమున్నర పసుపు కలిపి దినమున కొక మోతాదువంతున పక్షము రోజులు పెట్టాలి.

లేక తమలపాకులు 100, ఇంగువ 1 తు, పసుపు 1 తు, మారేడు పండ్లగుజ్జు 2 తు, కలిపినూరి దినమునకొక మోతాదువంతున 10 దినములు పెట్టాలి.

లేక చేకొణితాకురసము అర్ధసేరు, పాలు అర్ధసేరు, పసుపు 1 తు, ఇంగువ 1 తు, కలిపి దినమునకొక మోతాదువంతున వారము దినములు పెట్టాలి.

పారుడున్న పశువులకు వగరు పదార్థములుగాని బేల్‌పొడరుగాని వాడుడు. ఈవ్యాధికి వాతారిపొడిని పశుబలవర్ధనిని కలిపివాడుట మంచిది.

శిరోవాతము

ఈ వ్యాధి జలుబువలన గాని, వర్షాకాలములో మాగాని పొలములలో దమ్ముచేయుటవలనగాని, పచ్చిగడ్డి దొరకనప్పుడు తవుడు, చిట్టు మున్నగు దాణాలు ఎక్కువగా పెట్టుటవలనగాని ఈ వ్యాధి రావచ్చును. లేతపశువుల కెక్కువగా సోకును, ఈవ్యాధి శిరస్సులో పుట్టుటవలవ శిరోవాతమని పేరువచ్చింది.

లక్షణాలు

ఆరంభములో పశువునకు వేడి తక్కువగా వుంటుంది. చెవుల మొదటి భాగమందు వేడిగను, చివర భాగమందు చల్లగను ఉండును. ముక్కులనుండి ద్రవమువంటి పదార్థము జాస్తిగా కారుచుండును. అప్పుడప్పుడు కండ్లనుండి నీరుగార్చును. నల్లకప్పువేయుచు కాళ్లు పట్టి లేస్తుంది. వ్యాధి ముదిరినకొలది శుష్కించి ముక్కులనుండి వచ్చు ద్రవము పలుచగా, చిక్కగా వుంటుంది. అర మేత మేస్తుంది. నాలుకతో ముక్కులనుండి వచ్చు ద్రవమును నాకుతుంది. నీరుకూడ సరిగా త్రాగదు. తొలుత తెలుపుగావుంటుంది. ఈ వ్యాధి నెలరోజుల వరకుకూడ యుండవచ్చును. క్రమేపి కొమ్ము డొల్లలుగగాని కొమ్ముమాదగాని చేరవచ్చును. కాన జాగ్రతగా చికిత్స చేయాలి.

చికిత్స

ఆరంభములో ముక్కులనుండివచ్చు ద్రవమును పరీక్షించాలి. ఏయే ఆహారము పెట్టినది? ఎంతకాలము నుంచియున్నది పరీక్షించాలి. తరువాత ఆవుపాలుగాని, మేకపాలుగాని సేరు, వసపొడి 1 తులము, శొంఠిపొడి 1 తులము కలిసి దినమున కొక మోతాదు వంతున పక్షము దినములవరకు పెట్టిన తప్పక తగ్గుతుంది. వాతవస్తువులను మాత్రము పెట్టరాదు. అప్పుడప్పుడు ముక్కురంధ్రములకు సాంబ్రాణి పొగను పట్టించుట మంచిది, లేక రామాయిల్‌ను వాసన చూపించుము.

లేక వస 1 తులము, వెలుల్లి 1 తులము, కుప్పింటాకుపసరు 2 తులములు కలిపి రెండు చెవులలోపోసి కొమ్ములకు చెవులకు కట్టవలెను. ఈ రీతిగా నాలుగుదినములకొక పర్యాయము చేయుచు బలముగల ఈ ఆహారపదార్థములను పెట్టుచుండాలి.

లేక వామింటాకు పిడికెడు నలిపి నీరుపిండి బిళ్లగా చేసి తలకొమ్ములకు కట్టవలెను. ఈరీతిగా వారమురోజులు చేయాలి.

ఉలవగుగ్గిళ్లు, మడ్డికూడు వగైరా ఎక్కువగా పెట్టవలెను. ఇంకను విపరీతముగా ముక్కులనుండి నీరుకారుచున్నప్పుడు మూతిమీద ముచ్చెనగుంటలో కాల్చుట మంచిది. పశుబలవర్ధని, వాతారిపొడరును కలిపిపెట్టిన చక్కగా పనిచేయును.

గర్భవాతము

పశువును మితిమీరి మేపుటవలనను, కందులు, తవుడు, చిట్టు, శనగలు, వడ్లువగైరా పొట్టుతో–నున్నప్పుడు అతురతతో తినుటవలనను, వరిపిలక, తొండంగి, పిల్లిపెసర ఎక్కువగా తినుటవలనను ఈ రోగమువస్తుంది.

పశువు నల్లకప్పువేస్తుంది. మలబద్ధకముగానుండి పేడగట్టిగా నుండును, జ్వరము కూడా వుంటుంది. దగ్గు కొద్దిగా వుంటుంది. ముఖ్యముగా బొడ్డుపైకిలాగుకొనిపోతుంది. నీరుడుకూడ ధారాళముగాపోయదు. మేత నీరు క్రమేపిమానును, డొక్కల క్రిందిభాగము వెన్నెముక భాగము ఉబ్బరంగా వుంటుంది. కొన్ని పశువులు కాళ్ళను కూడ పట్టివేస్తాయి. ఈ వ్యాధి 10, 20, 30 దినములవరకుండును. తగిన చికిత్సచేసిన వెంటనే తగ్గును. గర్భకోశములో వాతమెక్కువగా నుండుటవలన కడుపులో నొప్పికూడ ఉండును. గర్భకోశమున వాతముండుటచే గర్భవాతమని పేరువచ్చినది.

చికిత్స

ఆరంభములో కటకరోహిణి 1 తు, ఉప్పు 6 తు, శొంఠి 1 తు, మిరియాలు 1 తు, సారాయి 2 గ్రాములు, నూకలజావ సేరు కలిపి త్రాగించిన తగ్గుతుంది.

లేక వెట్టిపుచ్చకాయలు 40 కోసిన తరువాత పసుపు 10 తు, కురంజీవాము 1 తు, నల్లఉప్పు 4 తు, వేసి తొక్కి ఒక కుండలోవేసి నాలుగు దినములుంచి ప్రతిరోజు ఒక వెలగకాయంత ముద్దను పెట్టిన తగ్గుతుంది.

లేక వెలుల్లి 15 తు, ఇంగువ 10 తు, శొంఠి 4 తు, కురాసాని వాము గుప్పెడు, పచ్చిపసుపు 10 తు, ఆముదపుపప్పు సోలెడు కలిపి త్రొక్కి నిమ్మకాయంత ఉండలుచేసి రేపుమాపు పెట్టిన తగ్గుతుంది.

లేక అల్లము 15 తు, వాము 10 తు ఇంగువ 4 తు, ఉప్పు 15 తు, సోడా ఉప్పు 10 తు, కలిపి నూరి దినమునకు 4 తులముల వంతున సేరు వేడినీటిలో కలిపి యిచ్చిన తగ్గుతుంది.

లేక వెల్లులి 15 తు, ఇంగువ 10 తు, శొంఠి 4 తు, కురాసానివాము గుప్పెడు పచ్చిపసుపు 10తు, ఆముదపుపప్పు సోలెడు కలిపి త్రొక్కి నిమ్మకాయంత ఉండలు చేసి రేపుమాపు పెట్టిన తగ్గుతుంది.

లేక అల్లము 15 తు, వాము 10 తు, ఇంగువ 4 తు, ఉప్పు 15 తు, సోడాఉప్పు 10 తు కలిపినూరి దినమునకు 4 తులముల వంతున సేరు వేడినీటిలో కలిపి ఇచ్చిన తగ్గుతుంది.

మలబద్ధకముగావున్న ఆరంభములో విరేచనములకు ఈయాలి. వ్యాధితగ్గువరకు తేలిక ఆహార పదార్థములను ఇచ్చుచుండాలి. ఫార్మసీ వారి వాతారి అరకును గాని పశుమిత్రను గాని వాడాలి.

నక్క వాతము

దీనినే నక్కోరు, జంబుకవాతము, కసిమిరి యంటారు.

గాలికుంటుతగిలి పశువు ఎండలో నుండుటవలనను, రక్తవృద్ధి తగ్గుటవలనను, జబ్బులో నీరసత్వమెక్కువగా నుండుటవలనను, ప్రేగులలో పురుగులుండుటవలనను, ఊపిరితిత్తులలో వేడిగాలి జేరియుండుట వలనను ఈవ్యాధి వస్తుంది.

లక్షణాలు

పశువు శరీరమంతా నలుపురంగుగనో, బూడిదరంగుగనో యుంటుంది. కొన్నిటికి నక్కవెంట్రుకలవలె పొడుగగు రోమములుపుట్టి నిక్కబొడుచుకొని యుందురు. ఎండలో ఎంతమాత్రము నిలువలేక నీడకొరకు ఎదురు చూస్తుంది. వగర్పు ఎక్కువగా వుంటుంది. కొన్ని పశువులు దీనముగా వుండి కృశించును. ఇట్టి పశువులను జాగ్రత్తగా కాపాడాలి. ఈ వ్యాధి తగ్గుటకు చాలా రోజులు పట్టుతుంది.

చికిత్స

తంగేడు చిగుళ్ళు నాలుగు గుప్పెళ్ళు, నీరుల్లిపాయలు 10 తులములు, గోంగూర సవాసేరు, వయిడిపత్తి ఆకు గుప్పెడు త్రొక్కి దినమునకొక మోతాదువంతున పక్షము దినములు పెట్టాలి.

లేక నీరుల్లి పాయలు 25 తులములు, పచ్చిపసుపు 6 తులములు, తాటిబెల్లము 15 తులములు, కలిపి త్రొక్కి రోజువిడచి రోజువంతున పక్షము దినములు పెట్టాలి.

లేక నాగులాకు 2 వీసెలు, తక్కెడాకు 1 వీసె, గోంగూర 2 వీసెలు, మంచినూనె 1 వీసె కలిపి ముద్దచేసి దినమువిడచి దినము పెట్టాలి.

లేక కలబందగుజ్జు 15 తులములు, ఉలవపిండి అరసోలెడు, నీరుల్లిపాయలు సవాసేరు, కలిపి త్రొక్కి దినమునకొక మోతాదువంతున వారము దినములు పెట్టాలి.

లేక పూటకు కోడిగ్రుడ్డంత సున్నము పెట్టాలి.

లేక పసుపు 6 తులములు, తామరదుంపలు 1 వీసె, బెండవేళ్లు 2 గుప్పెళ్ళు, పంచదార అరవీసె, కలిపి 2 సేర్ల పందినేతితో వండి వెలగకాయంత తీసికొని అర్ధసేరు గొర్రెపాలతో కలిపి పెట్టాలి.

లేక పచ్చిగోంగూర 1 మణుగు, శొంఠి 15 తులములు, మిరియాలు 10 తులములు, ఉసిరికపప్పు సవాసేరు, కలిపి ఒక బానలో వేసి భూమిలో 10 దినములు పాతిపెట్టి దినమునకొక కొబ్బరికాయంత పెట్టాలి.

లేక కనకాసవను జమ్మిఆకుపసరుతో పెట్టాలి.

ధనుర్వాతము

దీనినే ఈడుపురోగమనియు, ధనుర్వాతమనియు అంటారు. వ్యాధి చలిగాలి సోకుటవలనగాని, గాయపుసంధివలనగాని, పశువునకేమైన అపాయమైన దెబ్బతగిలినపుడు ఏ అవయవమైన విరిగినపుడు గాని, ఇదివరకు ఏవైన శరీరముమీద పుండ్లు, వ్రణములు, గాయములు, మున్నగునవి యున్నపుడుగాని ఈ వ్యాధి సోకుతుంది. గాయములోనికి ఏమాత్రము దుమ్ము లేక మట్టి చేరినను వెంటనే ఒక విధమగు సూక్ష్మజీవులు అందులో ప్రవేసించి పశువునకు ప్రాణాపాయము కలిగిస్తాయి. కాబట్టి పశువునకేమైన దెబ్బతగులుట, విరుగుట, చలిగాలిలో, వర్షములో నుంచుట మున్నగునవి కలిగినపుడు వెంటనే ఆ గాయమునకు దుమ్ము, మట్టి వగైరాలు కలుగకుండ కాపాడాలి. అట్లు దుమ్ము వగైరాలు దూరినచో వెంటనే విద్యుచ్ఛక్తివలె రక్తములో నున్న నరముల సముదాయముల కేగినవెంటనే ప్రాణాపాయము కలుగుతుంది. పాడిపశువులకు, లేతపశువులకు, దూడలకు తరచుగా వస్తుంది, దూడలకు మిన్నల్లులు పట్టుటవలన కాకులు పొడిచిన పెద్దపుండ్లు బొడ్డుపుండ్లువలన కూడ ఈ వ్యాధి రావచ్చును. మామూలు పశువులకు కూడ ఈ వ్యాధి రావచ్చును.

లక్షణాలు

పశువును కదలించినచో చాలా కష్టముగా కదలుతుంది. లోపల జ్వరముంటుంది. నోటివెంట చొంగపడుచుండును, మనము తలను లేపిన యెడల వెంటనే పశువునకు వణకుబుట్టి ఈడ్పులు (ఉలుకులు) గలుగుతాయి. వ్యాధి ముదిరినకొలది మెడదవుడలు బిగిసికొనిపోతాయి. క్రమేపి వ్యాధి ముదిరినకొలది కాళ్లు వగైరా బిగదీసికొని పోయి పశువు విల్లువలె వంగిపోయి ముఖము ముడుచుకొనిపోయి వికృతాకారముగా అవుతుంది. ఈడ్పులు అన్ని అవయవములకు సోకి అయాసమెక్కువై పశువు మరణించును.

చికిత్స

దవుడలు బిగిసికొనిపోయి గుటకవేయనిచో లాభములేదని గ్రహించాలి.

కర్పూరము 2 తు, వరిగంజిసేరు, ఇంగువ 4 తు, కలిపి త్రాగించి అన్ని అవయవములకు తవుడుతోగాని ఉప్పుతోగాని వేడికాపులు వేయాలి.

లేక మూడు డ్రాముల సారాయిలో అరతులం కర్పూరం కలిపి త్రాగించాలి.

లేక 10 కోడిగ్రుడ్లలోని తెలుపుసొనయు, సేరుసున్నపుతేట కలిపి త్రాగించాలి.


లేక కుంకుడుకాయ నురుగునీరు కలిసినది సేరు త్రాగించాలి.

లేక మీసమీపములో ఇంజెక్షన్సు యిచ్చే డాక్టర్లున్న ధనుర్వాతపు ఇంజెక్షన్సు ఇప్పించండి. లేక ఫార్మసీవారి వాతారి అరఖును పెయిన్‌కిల్లరును వాడండి.

పక్షవాతము

స్వభావము – వ్యాపకము

మెదడుయొక్క అస్వస్థతవలనను, మెదడును నరముల సముదాయమునకు దెబ్బతగిలినపుడు, చెవినరములకు ఒత్తిడి తగిలినపుడు, వెన్నుముకకు హానికలిగినపుడు, విషవస్తువులు తినునపుడు, ఎండలోను



వర్షములోను పనిచేయించినపుడు విపరీతమైన వాతము చేసినపుడు, చలిగాలిలోను, మంచులోను ఎక్కువగా పనిచేయించినపుడు, తదితర కారణముల వలన ఈ రోగమువచ్చును.

లక్షణాలు

పశువు శరీరం సగభాగమునకుగాని, పశువు వెనుక భాగమునకుగాని, ముందు కాళ్ళుగాని, ఒక చెవికిగాని, ఒకకన్నుకు గాని, తలకుగాని, శరీరమంతటికిగాని, నాలుకకుగాని ఈ వ్యాధిరావచ్చును. ఒక రైతు దొడ్డిలో ఈ రోగముచేతనే ఒక్క పర్యాయమే పదిపశువులకు సోకినది. వీనికన్నిటికి వెనుక తొడలు, కాళ్ళు, ముడ్డిపూస క్రిందభాగములకు సోకి నాలుగుదినములుకొన్ని, వారముదినములుకొన్ని, పక్షము దినములుయుండి చికిత్సల వలసతగ్గినవి. కాబట్టి ఈ వ్యాధి తేలికగాతగిలిన పిట్టవాలినదని వాతలు, యంత్రములు వేయుదురు. ఈ యంత్రమువల్లనే తగ్గినదనుకొందురు. మరికొన్నిటికి తాత్కాలిక చికిత్సల వలన, వాటి తత్వములవలన కొన్నిటికి తగ్గును కాబట్టి జాగ్రతగా పశువును పరీక్షించి ఏయేభాగములకు ఏ యే లక్షణములతో సోకి బాధపడుతున్నదో తెలుసుకుని చికిత్సచేయాలి.

చికిత్స-పరీక్ష

ఏ అవయవమునకు ఈ వ్యాధిసోకినదో కనుగొనుటకు ముందుగా ఒకసూదితో ఆ అవయవమును తేలికగా పొడవాలి. అటుపొడిచినపుడు పశువునకు నొప్పియున్నట్లుగా వున్నదా లేక తిమ్మిరి యెక్కినట్లున్నదా? ఆ తిమ్మిరి ఏ అవయవము వరకుయున్నది? ఎంతకాలంనుంచి పశువునిలుచుండుటలేదు? ఏ కారణము వలన సోకినది? తేలికగాతగిలినదా ఎక్కువగా తగిలినదా? మేతతినుచు వెనుకభాగము లేవలేకుండనున్న దామున్నగు లక్షణములు గ్రహించి చికిత్సకు ప్రారంభించాలి.

ఈ వ్యాధితగిలిన వారమురోజులలో పశువు లేవలేకపోయినచో ఆ పశువు బ్రతుకుటేకష్టమని గ్రహించాలి. వారమునుంచి నెలదినముల వరకు బాధపడి, అవయవములు, మూత్రకోశముక్రుళ్ళి బాధపడి చనిపోయినవికూడగలవు గాన జాగ్రత్తగా ఆలోచించి చికిత్స చేయాలి.

ఆరంభములో విరేచనమగుటకు మందీయాలి. తరువాత నేల వేము 1 తు, కురంజీవాము 2 తు, సోడా ఉప్పు 1 తు, మంచిగంధపు పొడి ½ తు, నల్ల ఉప్పు 1 తు కలిపి మెత్తగానూరి ఉదయమున సేరు నీటిలో కలిపి త్రాగించాలి. సాయంకాలము 7 గంటలకు ఆవుపాలుసేరు గాని రావిచెక్క పచ్చిరసము అర్ధసేరు, కస్తూరి పసుపు 1 తు కలిపి త్రాగించాలి. అప్పుడప్పుడు తెలికపిండిని సేరుమజ్జిగలో నానవేసి పెట్టాలి.

లేక గుగ్గిలము 5 పలములు, పొంగించిన వెలిగారము 10 తు, కస్తూరి పసుపు 15 తులములు కలిపిత్రొక్కి సేరున్నరమునగచెక్క రసము పోసి నిమ్మకాయంత ముద్దలుచేసి రేపుమాపు మందువచ్చువరకు పెట్టాలి.

పిట్టవాలినదని అనుమానముతో నున్నపుడు గరుత్మంతుని పాదపు ఆకారముగా వెనుక భాగముమీద పసుపుతో యంత్రము వేయవచ్చును.

స్పర్శలేని అవయవములకు మంచినూనె సవాసేరు, జిల్లేడాకురసము పావుసేరు నల్లేరు వ్రేళ్ళరసము పావుసేరు, జిల్లేడు పువ్వులరసము పావుసేరు కలిపినూరి తడియిగురువరకు కాగబెట్టి దింపిచల్లార్చి ప్రతిరోజు మర్దనచేయుచు, తవుడువేయించిగాని, ఇసుక వేయించిగాని అప్పుడప్పుడు వేడికాపులుకాయాలి.

ఈవ్యాధికి వాతలు చేయుటవలన లాభము లేకపోగా పశువు మరణమునకు సిద్ధమగును. ఇంకను తేనెటీగలమైనము 20 తు, మంచినూనె 20 తు, కలిపి గోరువెచ్చగాకాచి అందులో అరతులము నల్లమందు, 4 తులములహారతికర్పూరంకలిపి చలనములేని భాగములకు మర్దనచేయాలి. ఫార్మశీవారి వాతారి, పశుబలవర్ధని స్ప్రెయిన్ కిల్లరును వాడాలి.

* * *

పందొమిదవ భాగము

పశునేత్ర చికిత్స

జంతుజాలం – వింతనేత్రాలు

వానపాముకు కళ్ళులేవు. కాళ్ళూలేవు; ముక్కూ చెవులూకూడా కనబడవు. ఉంగరాలు పేర్చిన రబ్బరుతాడులాగే ఉంటుందిగదా! గుడ్డిగా నేలలో తముడుకొంటూ పోతుంది. ఇక ఈ పురుగుకు స్పర్శజ్ఞానంతప్ప, ఈగలకు దోమలకు మాత్రంగానైనా, దృష్టిఉండే అవకాశం లేదుగదా! కాని రాత్రివేళ నేలలోనుంచి పైకిపాకుతున్న వానపాముమీద టార్చిలైటు వెలుగువేస్తే, అకస్మాత్తుగా నుళ్లుతిరిగి మళ్ళీ నేలలోకే పాకచూస్తుందే! ఈ వెలుగు చీకటుటలతేడా కళ్ళులేకుండా ఎల్లా తెలిసింది? ఏదో అపాయం వస్తోందన్న భయం ఏయింద్రియం తెల్పింది? వానపాముకు చర్మం పొడుగునా, ఫొటోఎలెక్ట్రిక్ సెల్లులుంటాయి. (అనగా వెల్తురు వల్ల విద్యుత్ప్రసారంలో మార్పు తెప్పించేజీవకణాలు) వీటివల్ల స్పర్శేంద్రియంద్వారానే ఈ భేదం వానపాముకు తెలుస్తుంది. బాహ్యంగా 'కళ్ళు' అంటూ కనబడని ప్రకృతిదృష్టి విశేషం ఇల్లావానపాములో వ్యక్తమవుతుంది. కళ్లులేని దృష్టియిది.

ప్రకృతి–దృగింద్రియాలను, ఒక్క నేత్రాలద్వారానేకాక అనేక విధాలుగా జీవకోటిలో వ్యక్తపరిచింది. వానపాములో చర్మరంధ్రాలే, తేజోవిచక్షణగుణంవల్ల నేత్రాలయాయి. ప్రకృతిలో అనేకరకాల కళ్ళున్నాయి. ఇటు కన్నుకాని కన్ను ఇది, అటు గండుతూనీగ కళ్ళుచూస్తే పలకల వజ్రాలుపొదిగిన ఒంటిరాతి చెవిదిద్దుల్లాగుంటాయి. ఈ వరుసని అనేకరకాలకళ్ళు, అనేక ప్రయోజనాలుకలవి, ప్రకృతిజీవాలను పరిశీలిస్తే మనకు కనబడుతాయి.

జలజంతువులను ముందుచూద్దాం. ఆలిచిప్పలలాంటి గుల్లచేపలకు, చిప్పఅంచుచుట్టూ చర్మాన్నంటి తళతళలాడే కళ్లుంటాయి. చుక్క చేప ఉంది – స్టార్‌ఫిష్ – ఈ చేప దేహమే అయిదు వేళ్ళూ చాచినట్లు, నక్షత్రం లాగుంటుంది. ఈ అయిదువేళ్లకొనలనూ ఐదు కళ్లుంటాయి.

క్రాఫిష్ అని మరోచేప ఉంది. ఈ చేపకళ్లు పగలుచూస్తే తెల్లబారి ఉంటాయి. రాత్రి అయ్యేటప్పటికి ఈ కళ్లునల్లరంగుగ మారిపోతాయి. చీకటిపడటంతోనే, చీకటి చూసేందుకు అనుకూలమైన ద్రవము కంటిపొరలో తయారవుతుంది. మళ్ళీ వెలుగువచ్చేటప్పటికి, ఈ ద్రవము పక్కలకుజారి పగటిచూపుకు అనుకూలంగా కంటిని మారుస్తుంది.

ఇక్కడికి కంటిరంగు మారటమే చూశాము. కాని కంటిజాగాయేమారిపోయే చేప ఉంటుందనైనా అనుకోగలమా! అలాంటిది మామూలు చేప "చందునాయి" చేపలాంటిదొక చేప ఉంది. దీనిని ప్లౌడర్' అంటారు. పుట్టినప్పుడు దీనికి తలకు రెండువైపులా రెండుకళ్లుంటాయి. కాని పెద్దదై శరీరం కొంచెం

వెడల్పుగా సాగటంతో, ఒకకన్ను నెత్తిమీదికి, చివరికి అటుదిగి రెండోవైపుకువచ్చి, రెండోకంటిప్రక్కనే ఆవైపే స్థిరపడిపోతుంది. ఈచేవ పెద్దదయ్యేటప్పటికి రెండుకళ్ళూ తలకుప్రక్కనే ఉండిపోతాయి.

మనం రెండుకళ్ళూ, ఒకేకదలికతో కదుపుకుంటూ, ఒకేచూపుమేళవించుకొంటాం. రెండుకళ్ళూకలిసి ఒకేవిధంగా తప్ప కదపము. కాని మన సాటి జంతువుల్లో చాలాజీవాలు, ఏకంటికాకంటిని విడిగా కదుపుకోగల్గుతాయి. తొండ, ఒకేసారి ఒకకంటితో ఉత్తరదిశను ఒక కంటితో దక్షిణదిశగా, పరిసరాలు రెండుదిక్కులూ పరికించుకోగలదు. పీతకళ్ళు గొట్టాలకతికించినట్లు ఇంకా పైకి ఉంటాయేమో! అని ఇంతకన్న కూడా ఇష్టం వచ్చినట్టు కళ్ళు తిప్పుకోగలవు. అచ్చు సబ్‌మెరిన్ పెరిస్కోపు వాడినట్టు పీత తనకళ్ళు ఇష్టం వచ్చినట్టు వాడుకోగలదు. పీతకళ్ళలో ఇంకో గమ్మత్తు కూడా ఉంది. కన్ను చుట్టూ తిప్పటంలో ఇసుక, దుమ్మూ ధూళి కంటినిండా ఎక్కువ పడవచ్చును. అప్పుడుపీత తనకళ్ళను గొట్టంలోపలికి లాక్కుంటుంది. ఆగొట్టంపొడుగునా కనురెప్పలకున్నట్లు వెంట్రుకలుండి కంటిని శుభ్రంచేస్తాయి.

కళ్ళు ఎప్పటికప్పుడు జాగ్రత్త పెట్టుకొని తుడుచుకోటంలో పీతల వద్ద తేచాలజీవాలు అనుసరిస్తాయి. కప్పలకళ్ళు మరీ ఉబ్బెత్తుగా బైటికి పొడుచుకొని ఉంటాయి. గట్టిబురదలో మునిగికదిలేటప్పుడు కంటిగుడ్డుకు ఏదైనాదెబ్బతగిలేఅపాయం చాలా ఉంటుంది. అందుకనిబోదురుకప్ప బురదలో మునిగేటప్పుడు కళ్ళుకనుబొత్తలలోకి బాగా లోపలికి లాగేసుకుంటుంది. దాదాపు అంగిటికి తగులుతూన్నట్టుంటాయి, ఈకనుగుంటలు.

మొసలి బురదలోకి పోయేటప్పటికి, కంటి రెండురెప్పలూకాక, లోపల అద్దాల కిటికిలాంటి మూడోకంటిరెప్పతో కంటిగుడ్లనుమూస్తుంది. ఈ మూడోరెప్పకనుకొలకుల్లోంచి తెరుచుకొని కంటిగుడ్డును ఆవరించి మూస్తుంది. పక్షులలోకూడా ఇలాంటి మూడవకనురెప్ప ఉంటుంది. పక్షులు ఎగురుతున్నంతసేపూ ఈ రెప్ప కంటిగుడ్డుమీద ఇటునుంచి అటు ఆడుతూ, కంట్లో నీరూ, దుమ్మూ, అంతా ఎప్పటికప్పుడు తుడిచేస్తుంటుంది.

ఎడారి ఎండలో తిరగాల్సిన ఉష్ట్రపక్షులు, జిరాఫీలు మొదలైన వాటికి ఎండకు కన్ను మిరుమిట్లు గొలపకుండా, తెరవేసినట్లుండే కనురెప్పలుంటాయి. రాబందులకు, గద్దలకు, కనుబొమ ఎముకే గడ్డకట్టి ముందుకు పొడుచుకొనివచ్చి కన్ను మిరుమిట్లు కొలపకుండా కాపాడుతుంది.

ఇంక కలుగులు చేసుకొని బ్రతికే జంతువులను పరిశీలిస్తే వీటిల్లో చాలావాట్లకు ముందుకాళ్ళ మెత్తలకు కళ్ళుతుడుచుకునే కుంచెలుంటాయని తెలుస్తుంది, బల్లికళ్లల్లో లాగానే, కనుగ్రుడ్డు గుండ్రంగా కాక అండాకృతిలో ఉండి చీకట్లో కనబడేందుకు సాయకారిగా ఉంటుంది. బల్లి ఎప్పటికప్పుడు నాలికచాచి కళ్ళు శుభ్రంగా తుడుచుకొంటూంది. ఇక్కడ అప్రస్తుతం అయినా బల్లివిషయంలో ఇంకో విశేషం కూడా ఉంది. బల్లికాని వేళ్ళకు గాలిపీల్చుకునే బిళ్ళలుంటాయి. దూలాల క్రిందుగా పాకవలసినా, ఈబిళ్ళలతో దూలాన్ని అంటిపెట్టుకొని క్రిందకు పడకుండా ఉండగలుగుతుంది. బల్లిని దీపంవెల్తురులో పట్టుకుచూస్తే ఈచెవికి ఆచెవికి మధ్య ఏంలేకుండా, గాజు బిళ్లలాగే కనబడుతుంది.

జంతువులకు కళ్ల జాగ్రత్త చాలా అవసరం. చాలా విషయాలకు జంతువులు తమ దృష్టిమీదనే ఆధారపడి ఉండాల్సి ఉంటుంది. ఆ అవసరాలుకూడా మనం ఊహించలేనంత విపరీతంగా ఉంటాయి.

ప్రవాహజలంలో స్థిరంగా నిలవాల్సినప్పుడు చేప కేవలము ప్రవాహస్పర్శవల్లే నీటికదలికవల్లే, ఈతసాగించదు. ప్రక్కను ఒడ్డు కదులుతూందీ లేనిదీ చూచుకుంటూ తననడక తీర్చుకుంటుంది. కొందరు మనస్తత్వవేత్తలు ఈవిషయము గమ్మత్తుగా నిరూపించారు. కదలని నీళ్ళల్లోనే చేపలనుపెట్టి, తొట్టి అందచులను, వేగంగా ముందుకు కదపసాగారు. నీళ్ళు కదలకపోయినా కూడా గట్టు కదులుతూండటం కనిపించటంవల్ల చేప భ్రమపడి వేగంగా ముందుకు ఈది ముందుఅంచులకు ఠపీమని కొట్టుకున్నదట!

సముద్రపు ఒడ్డున తాబేటి గ్రుడ్లు పగిలి పిల్లలు బైటకు వచ్చీ రావటంతోనే సహజంగా సముద్రంలోకి పారిపోతాయి సముద్రపు వాసన పసిగట్టి ఇలా వెళ్తున్నాయనుకొన్నారు ప్రకృతిశాస్త్రజ్ఞులు. కాని అప్పుడుపుట్టిన తాబేలుకూడా సముద్రాన్ని చూడగలదనీ, క్షితిజరేఖలాగా బయలుగా కనపడే సముద్రపు అంచుకేసి చూపువలె సహజంగా బయలుదేరుతుందనీ ఈమధ్యనే కనుగొనగల్గారు.

జంతువులకు చూపుఅంటే కేవలం చూడటమేగాదు వాట్లపరస్పర సంబంధాధికమై విశేషాలనన్నిటినీ చూపువల్లే గ్రహిస్తాయి. చూపువల్ల విచక్షణజ్ఞానం ఎంత ఉంటుందో అని కోడిపిల్లలమీద పరీక్షలు సాగించారు. కోడిపిల్లలకు పాలరాతిమీది తౌడుపెట్టటం అలవాటు చేశారు. పక్కనే అంతకన్నా కొద్దిగా చాయతక్కువగావున్న రాతిమీద తౌడుపోసినా, పాలరాతిమీద తౌడే కోడిపిల్లలు గ్రహించగలిగేవని తేలింది.

గడియారంముళ్ళు కదలటం మన చూపుతో సరిగ్గా గ్రహించాలంటే నిముషంకన్నా ఎక్కువకాలంమే పడుతుంది. కాని పావురం 29 సెకండ్లలోనే ఆ కదలికను గ్రహించగల్గుతుంది. ఆంబోతులు రంగుగుడ్డ చూస్తే బెదురుతాయని సామాన్యంగా వింటాము. మనతోపాటు ఒక్క కోతులను మినహాయిస్తే, తక్కిన నలుగాలి జంతువులకు రంగుల తేడా తెలియని మసకతనం (Colour blindness) ఉంటుంది. రంగుల ప్రాముఖ్యం మనకున్నమాదిరిగా వాటికి వుండదు. వాట్ల జీవితరక్షణలకు పోషణలకు అవసరవిచక్షణలు మాత్రమే తెలుసుకొనే పద్ధతులకు వాటికి చూపు అలవాటు పడుతుంది.

ఈగలను వెనకనుంచి చెయ్యి విసరి పట్టుకొందమని ఎన్నోమాట్లు ప్రయత్నిస్తాము కాని వెనుక చూపు ఉన్నట్లే ఈగ ఎగిరిపోతుంది. కీటకాలన్నిటికీ కంటి అమరిక చాలా సమృష్టంగా ఉంటుంది. ఒక్కొక్కటి ఒక్కొక్క కన్నులాగా పనిచేసే, పదివేలనుంచీ పాతికవేలదాకా సన్నని గొట్టాలు కట్టకట్టినట్టుగా వుండి, కన్నుగా ఏర్పడతాయి ఈ కీటకాలకు. ఈ గొట్టాలలో తలో భాగమూ, చుట్టూ ప్రపంచపు తలొకపక్కకు దృష్టి అందిస్తూ, నలుపక్కలా ఒక్కసారే కీటకం కంటికి కనబడేటట్లు చేస్తాయి.

ఈ కళ్లు కూడా భూతఅద్దాలులాగా పైకి ఉబ్బి ఉండటంతో ప్రక్కలకే కాకుండా ముందు వెనుకలకు కూడా ఒకేసారి చూడగల్గుతాయి. ఇంత సహస్రముఖంగా ఉండే ఈ కంటివల్ల ఈగలకు మనకన్న కూడా

అనేకవిధాల ప్రశస్తమైన దృష్టి ఉంటుంది. మనకు ఇంద్రధనుస్సులోని ఏడువర్ణాలు – నీలమనుంచి ఎరుపు వరకుమాత్రమే – గ్రహించగల దృష్టివుంది. కాని క్రిమికీటకాలు, ఇంకా అనేక వర్ణాలు మనమూహించలేనివి కూడా చూడగల్గుతాయి. తుమ్మెదలు అల్ట్రావైలెట్, అతి నీలవర్ణాన్ని చూడగల్గుతాయి. చీమలు, గుడ్లగూబలు, ఇన్ఫ్రారెడ్ అను శోణవర్ణాన్ని కూడా చూడగల్గుతాయి.

న్యూజీలాండ్‌లో, టుయటారా అనే సరీసృపం ఉంది. పురాణ యుగాలలో ఎప్పుడో భూమిమీద తిరిగిన జీవాలకు ఇది ఏకైక ప్రతినిధి అనవచ్చు. ఆ జంతువుల పూర్వికపువాటికి ఏకాక్షులలాగా నుదురున ఒక్కటే కన్నుండి ఉండేదనేందుకు చిహ్నాలు ఇప్పటి జంతువుల నొసటి చర్మముక్రింద బొమికకట్టు సూచిస్తుంది. ఆనాటి ఏకాక్షి నుంచే, సహస్రాక్షులదాకా, "జీవం" అనేకవిధాల నేత్రాలతో ప్రయోగంచేసి చూస్తూనే ఉంది. అసలు విచిత్రాలకు ఎక్కడో వెదుక నక్కరలేదు. మనచుట్టూ అనేక దృష్టాంతాలు కనపడుతూనే ఉంటాయి.

మన కంటిలో రెటీనా, (ఫోటోగ్రాఫ్ ప్లేటులాగా కంటిలోఉండే నరాల పలక) మధ్య పోలియా అనే చిన్నగుంట ఉంటుంది. ఇక్కడే నరాల కొసలు దట్టంగా ముద్దకట్టి ఉంటాయి. మన మేదన్నా చూస్తున్నప్పుడు ఆవస్తుచిత్రం ఇక్కడికి కేంద్రీకరింపబడి, స్ఫుటమైన దృష్టికలుగుతుంది, కాని నీటిలోమునిగినప్పుడు దృష్టిచెదిరి ఈస్ఫుటత్వంపోతుంది. కాని లకుముకిపిట్టని చూడండి.

లకుముకిపిట్ట గాలిలోనుంచే చేపను చూస్తుంది. అకస్మాత్తుగా నీటిలో సూటిగా మునుగుతుంది. కాని నీటిలో మునగగానే చేప కదిలిపోతే కనబడవద్దా? లకుముకిపిట్ట కన్ను గుండ్రంగా కాక అండవృత్తాకారంగా ఉంటుంది.

కాబట్టి దాని రెటీనాలో మనలాగా ఒక ఫోలియా కేంద్రంగాక రెండు ఫోలియాలుంటాయి. గాలిలో చూస్తున్నప్పుడు మనకులాగానే మధ్యఉన్న ఫోలియాయే దృష్టినిస్తుంది. కాని నీళ్ళలో మునగగానే మధ్య ఫోలియాలను మూసికొని ప్రక్కలనున్న ఫోలియాతో నీటిలో చూడగల్గుతుంది.


ఇంకోవిషయం! మన కంటినరం, కంటిగ్రుడ్డు లోపలి భాగంలో నుంచి తెముల్చుకొని పోయేచోట, "చీకటిచుక్క" (Blind Spot) ఒకటి ఉంటుంది. అంటే మనం చూస్తున్న వస్తువు చిత్రం రెటీనామీద పడ్డప్పుడు ఈ చీకటి చుక్కను ఆక్రమించినమాత్రం వస్తువిశేషాలేవీ మనకు కనబడవు. కాని మనకు రెండు కళ్ళు ఒకే వస్తువును చూస్తూ దృష్టినిస్తాయి. అందుచేత ఒకకంటిలో కనబడని కొద్దివిశేషాలను రెండవది పూరిస్తుంది. కాబట్టి మనకంత ఇబ్బంది ఏమీ ఉండదు. కానీ చాలా జంతువులకు కళ్ళు మనకున్నంత ప్రక్కప్రక్కనే ఉండకుండా, మరీ చెరోప్రక్కకూ ఉంటాయి. ఏకన్ను కాకన్నే విడివిడిగాచూసి మెదడుకు చెప్పాలి. అట్లాంటప్పుడు, కొంతచూపు గుడ్డిఅయిపోతే అపాయం ఎక్కువ కాదా? చెట్టు చిటారికొమ్మల రెమ్మనుంచి రెమ్మకు ఉరికే ఉడతకు, ఈ దృష్టిదోషంవుంటే, దుముకుదుముకుకూ ప్రాణాపాయమేకదా!

ఉడతకంటిలో ఈ నరం కనుగుడ్డును వదిలేచోటు, అప్పచ్చిలాగా పల్చగా గీతలాగా అయిపోతుంది. అందుచేత కనపడనిమేర దాదాపు పూర్తిగా తగ్గిపోతుంది. ప్రకృతి ఉడతల నల్లా రక్షించింది.

మనచుట్టూ పరిసరాల్లో జంతువుల చేష్టలూ చూపులూ పరిశీలించగలిగామంటే ఆనందమేకాదు, కొత్తకొత్త విజ్ఞానాన్ని కూడా అపారంగా సేకరించుకోగల్గుతామని అమెరికన్ మెర్క్యురీ తెలుపూతుంది.

కనుగ్రుడ్డు


పశువు కనుగ్రుడ్డు గుండ్రముగా వుంటుంది. ఇది కనుగుంట యనబడెడు ఎముకగూటిలో నమర్చబడియుంది. అందువలన సాధారణంగా దీనికి దెబ్బతగులనేరదు. దీనిని కాపాడుటకై కనుగుంటల యందు ఒకవిధమైన క్రొవ్వుపదార్థముంటుంది. ఇది దిండువలెనేర్పడి గ్రుడ్డునకు అదురుదెబ్బ తగులకుండ



జేయుటయేగాక ఎముకలతో రాపిడికలుగకుండగను, గ్రుడ్డు నానాగతుల తిరుగుటకును, దానికి వేడిని కలిగించుటకు నుపయోగపడుతున్నది. కొన్ని పశువుల కనుగ్రుడ్లు గుంటయందు లోతుగా నమర్పబడి యుండక మెరకగానుండును. అందువలన కన్నులు పెద్దవిగా కనపబడతాయి. దీనిలో పైభాగము నందుండునది పైపొర; దీనినే తెల్లగ్రుడ్డనియు చెప్పుచున్నాము. దీనికి వెనుకనుండునది మధ్యపొర; నల్లగా నుండుటవలన దీనిని నల్లగ్రుడ్డుయనియు అంటారు. పశువు కనుగ్రుడ్డుయొక్క పైపొర తెలుపురంగుకలిగి మిక్కిలి దృఢమైన నారవంటి పదార్థముతో చేయబడి యుంటుంది. ఇది లోపలనుండు మృదువైన భాగమును కాపాడుతుంది. అన్ని పొరలలోను యిది గట్టిదగుటవలన సాధారణముగా బ్రద్దలు కానేరదు. ముందరభాగము కొంచెము గుండ్రమునేర తప్ప ఈ పొర కనుగ్రుడ్డునంతను కప్పియున్నది. ఇంకను ముందరిభాగమున ఉబ్బెత్తుగా కనపడుతుంది. పశువు కనురెప్పలెప్పుడును ఆడుచుండుట చేత నీ తెల్లగ్రుడ్డుయొక్క నునుపును దానిగుండ వెలుతురు పోనిచ్చు శక్తియు కాపాడబడుతుంది. కనురెప్ప లాడుచుండుటచేత తెల్లగ్రుడ్డు ఎప్పుడును తేమగానుండి శుభ్రము చేస్తుంది.

నల్లగ్రుడ్డు పశువుకంటిలోనుండు పైపొరకును లోపలి పొరకును నడుమనుండును. దీనియందు నల్లని రంగుపదార్థముండుటచేత ఇది నల్లగా ఉంటుంది. దీనినే నల్లగ్రుడ్డు అంటారు. ఈ గ్రుడ్డు కంటికి రంగునిస్తుంది. గవ్వకండ్లు, తేనెకండ్లు మొదలగునవి దీనివలననేక కలుగుతుంది.

కంటి పువ్వులు స్వభావము



కంటిపువ్వులు

పశువు మెదడునుండి కంటిలోపలికి ఒక నరము వుంటుంది. అమితమైన వేడిజేసి ఈనరము చెడుటయు గలదు. అందువలన కంటిలో తెలుపుదనముకూడ ఏర్పడుతుంది. కంటిలో పువ్వువేసినయెడల నల్లగుడ్డు నందు ఒక తెలుపుమచ్చ యుంటుంది. దీనినే పువ్వంటారు. ఇంకను కంటికి దెబ్బతగులుటవలనను, చిన్న చిన్న నలుసులు కంటిలో పడుటవలనను, వాతరోగముండుటవలన అవి వెలుపలికి రాజాలక అక్కడనే యుండుటవలనను, వాతరోగమువలనను ఈ వ్యాధి జనిస్తుంది.

లక్షణాలు

సహజముగ దీర్ఘచతురస్రాకారముగనుండు కన్ను పువ్వేర్పడి నట్లయిన గుండ్రని యాకారమునుపొంది కదలకుండును, ఏవస్తువైనను దాటవలసి వచ్చినచో కంటిలో పువ్వుగల పశువు అక్కడక్కడ ఆగిపోతుంది. నడచునపుడు కాళ్ళను పైకిలేపుతుంది. మిట్టిమిట్టి చూస్తుంది. కొన్ని వేళలలో పువ్వు అద్దమును పోలియుంటుంది. అట్టిచో నేత్రములను మనము సామాన్యముగా గాజుకన్ను అంటాము. వెలుతురుచూచుట కష్టముగావుండి కండ్లవెంబడి నీరు కార్చుతుంది. దీనికి సకాలములో తగిన చికిత్స చేయనియెడల ఈ వ్యాధి వృద్ధియై క్రమముగా చూపు తగ్గిపోయి అంధత్వముకూడ ఏర్పడుతుంది. మూడు లేక ఆరు మాసములవరకు యున్న కంటిపువ్వు తగ్గదని గ్రహించాలి.

చికిత్స

పటికనీటిలో కన్ను శుభ్రముగాకడిగి మిరియాలు ½తు, పిప్పళ్ళు ½తు, తెచ్చి కాటుకవలె చూర్ణంచేసి వ్యాసులైనులోగాని వెన్నలోగాని కలిపి నాలుగైదు దినములు ఉదయపుపూట కందిగింజంత పెట్టుచుండిన తగ్గుతుంది.

లేక మూడునాలుగు ఇందుపుగింజలుకాల్చి పొడిజేసి అందులో సగభాగము పంచదారకలిపి దినమునకు మూడునాలుగుపర్యాయములు కంటిలో పెట్టాలి.

లేక దిరిసెనచెక్కరసము 2 తు, ఉప్పు ¼ తు, మిరియాలు ¼ తు, తెచ్చినూరి రెండుదినములు కుడికంటిలో పువ్వయినయెడల ఎడమ చెవిలోను, ఎడమకంటిలో పువ్వయిన కుడిచెవిలోను పోయాలి.

లేక పండు గారకాయలోని గుజ్జున్ను, పాతచిల్లపెంకున్ను పొడిజేసి చింతవిత్తులు నిమ్మకాయరసము మెత్తగానూరి పైపొడి దీనిలోకలిపి కోడి ఈకతో నేత్రములకు పట్టించాలి.

లేక మూర్కొండాకు పసరు, దొండాకుపసరు కలిపి ఎఱ్ఱగాజు పెంకుమెత్తగానూరి వస్త్రకాళితము పట్టగా వచ్చినపొడి ఆపసరులో కలిపి కన్నులకు పెట్టాలి.

లేక కొద్ది దొండాకుపసరున్ను, రెండు మిరియములు తెచ్చినూరి కండ్లలో పెట్టాలి.

లేక మండవసువుకొమ్ము, ఉప్పుగల్లు, మిరియము తెచ్చి కాకరాకు పసరుతోగాని, అవిసెఆకు పసరుతోగాని కంటిలో పెట్టాలి. లేక పొగాకు ఉప్పు రోటిలో వేసి మెత్తగానూరి తెల్లనిగుడ్డలో వేసి కంటిలో పిండాలి. లేక నేత్రాంజనం నెం. 1 వాడుడు.

లేక సబ్బు, చీనాపంచదార మెత్తగానూరి కంటిలోపెట్టాలి.

కంటిపొరలు – స్వభావము

ఈ వ్యాధి పశువుయొక్క కంటికి ఒకదానికిగాని, రెండుకండ్లకు గాని రావచ్చును. బింబముగుండ వెలుతురుపోదు. కనుక చూపు కనపడదు. అనగా కాంతిహీనమైనపొర బింబమంతయు గప్పియున్నప్పుడు కొన్ని కిరణములు లోపలికి పోవుటచేత కొంచెము చూడగలుగుతుంది. ఈ వ్యాధి పశువులకు మధ్యవయస్సులోగాని, ముదివయస్సులోగాని, వాతమువలనగాని, తదితర వ్యాధులవలనగాని రావచ్చును.

లక్షణాలు

పశువునకు మొదటిదినము కనుగ్రుడ్డుమీద సన్నముగా పొర క్రమ్మియుండి మరుసటిదినమున ఈ పొరమీద మరియొక పొర క్రమ్ముకొని దళసరముగా కన్పించును. ఈ విధముగా వారము దినములవరకు దినమునకొక పొరవంతున క్రమ్ముకొని గ్రుడ్డంతయు తెల్లపడి తరువాత సన్నని పురుగులు ఆగ్రుడ్డు పొరలలో ప్రవేశించి అటునిటు తిరుగుతాయి.

చికిత్స

సబ్బు 1 తు, కలకండ 1 తు, తెచ్చి మెత్తగానూరి కంటిలో వారముదినములు పెట్టాలి.


లేక పాలతుత్తము ½ తు, అమరశిలగంధకము ¼తు, కుంకుడుపప్పు ½ తులము తెచ్చి ఒక్కొక్కటినూరి తరువాత నిమ్మకాయ పులుసు కలిపి శనగగింజంత కంటిలో పెట్టుచుండాలి.

లేక వాకుడాకు పసరులో కలకండ మెత్తనిది కలిపి కంటిలో వారం దినములు పెట్టాలి.

లేక ఉప్పువాకుడాకు పసరు వెన్నలో కలిపి రెండువేళల కంటిలో పెట్టాలి. లేక నేత్రాంజము. నెం 2 వాడుడు.

ఆవిరి – స్వభావము

పశువులకు వాతరోగమువలనను, కాకరోగమువలనను, కండ్లకు అదురు దెబ్బలు తగులుటవలనను, మనుష్యులు రాళ్ళు మొదలగునవి పశువులమీద విసరునపుడు కంటికి తగులుటవలనను, దుమ్ముతోనుండు నలకలు పడుటవలనను, ఎప్పుడు చురుకుగానుండి బొల్లిమచ్చలు గలిగి స్వారిచేయుటవలనను ఎద్దులకు ఈ వ్యాధి రావచ్చును. దీనిలో పుట్ట ఆవిరి, కోడిజుట్టు ఆవిరి, గ్రుడ్డు ఆవిరి అనునవిగలవు. ఏజాతియైనను



ఆరంభములో చికిత్స చేయవలెనుగాని ముదిరిన తరువాత ఏమియు లాభము లేదు. ఆవిరికి సరియైన చికిత్సలుచేయక ఎల్లప్పుడు రోగపశువును పనిచేయించుటవలన మెదడుకరగి కనుగ్రుడ్డు క్రుళ్ళిపోయి మాదగా నవుతుంది. కాబట్టి చాల జాగ్రత్తగా చేయాలి. దీనినే కంటిమాద అందురు.

లక్షణాలు

పశువు ఎండగాని, వెలుతురుగాని చూడజాలదు. కంటినుండి నీరు విస్తారముగా కార్చుతుంది. కన్ను రెపరెపలాడుతుంది. రెప్ప లావెక్కి క్రిందపొర ఒత్తుబారి యుంటుంది. ఇంకను రెప్పలమీద సన్నని పొక్కులు కూడ లేస్తాయి. కంటి గ్రుడ్డుమీద దుర్మాంసము పెరుగుతుంది. ఈ దుర్మాంసము కంటి లోపలినుంచి పుట్టుతుంది. ఇట్లు పుట్టినయెడల గ్రుడ్డు చెడినదని గ్రహించాలి. దీనినే కంటిమాదయంటారు.

చికిత్స

పశువు కంటి లోపలి భాగమందును, రెప్పలలోను నుండు మలిన పదార్థములను తీసివేసి పటిక నీటితో కండ్లను శుభ్రముగా కడగాలి.

తరువాత వాకుడాకు పసరు 1 తు, వెన్న 2 తు, ఉప్పు ½ తు, కలిపి ఉదయం సాయంకాలములందు కంటిలో పెట్టాలి.

లేక పేరినెయ్యి 1 తు, పెంకుపొడి ½ తు, అరటిదుంప రసము ½ తు, కలిపి కంటిలో 5 దినములు పెట్టాలి.

లేక చిల్లగింజను తేనెలో అరగదీసి పచ్చకర్పూరము కలిపి కండ్లయందు పెట్టాలి.

లేక ఉసిరికపప్పు 1 తు, కరక్కాయపప్పు 1 తు, తాటికాయపప్పు 1 తు, తెచ్చి మెత్తగానూరి నిమ్మపండ్లరసముతో మర్దించి కణికలు చేసి నేత్రములలో పెట్టాలి.

లేక కావిరాయి నీటితో అరగదీసి గుడ్డకుపట్టించి కండ్లపైన వేయాలి. గ్రుడ్డుమీద కొయ్యగండలున్న గోరుతోగ్రుచ్చి చిదిపి నేత్రాంజనమును వాడాలి. లేక అనుభవముగల వైద్యునిచే కన్ను తీయించాలి.

స్వభావము – నీరుకారుట

రక్తరోగమువలన, అతివేడివలన, కండ్లలోధూళి మున్నగునవి పడుటవలన, విసుగు విరామములేక రాత్రింబవళ్ళు పనిచేయించుటవలన ఈ వ్యాధిపశువులకు కలుగుతుంది. కొన్ని పశువులకు చిన్ననాటినుండియు విడువక కండ్లనుండి నీరుగారుతాయి. పశువు మెదటిలో పుట్టిన వ్యాధియే దీనికి కారణమైయుంది. ఈ వ్యాధి వంశపరంపరముగ వచ్చుటయు కొన్ని పశువులలో కలదని కొన్ని పశువైద్యశాస్త్రములు తెలుపుచున్నవి. అధికవాతముగల పశువులకుకూడ నీరు గారుతాయి.

చికిత్స


పశువునకు వెలుతురు, ఎండ అంతగా తగులనీయరాదు, కండ్లను ఉదయవేళలయందు వగరునీటితో కడుగుచుండాలి.

లేక కందిగింజల గంధము కండ్లలో రెండువేళల పెట్టాలి.

లేక పశువు మాడుపట్టున ఆముదముకాచి రెండు మూడు దినములు పెట్టాలి.

లేక పొంగించిన పటిక అరతులము తెచ్చి దానిలో సూక్ష్ముగా నల్లమందువేసి చింతాకురసముతో కాపువేసిన వేడిపొరమీద మర్దనచేసి కండ్లకు పెట్టాలి. ఫార్మసీవారి నేత్రాంజనము చక్కగా పనిచేస్తుంది.

కండ్లపుసులు



పశువును విసుగు విరామములేకుండ పనిచేయించుటవలనను, వాతరక్తరోగములవలనను, ఇంకను కంటికిగాని, తలకుగాని అదురుదెబ్బలు తగులుటవలనను, ఎండలో పనిచేయించుటవలనను, అతివేడివలనను, నేత్రగోళములలో జబ్బుండుటవలనను ఈ వ్యాధి కలుగుతుంది.

లక్షణాలు

కన్ను లెఱ్ఱబడుటయుగలదు. నీరు కారుతూ దురదకూడా నుండ వచ్చును. ఆస్థలమునందె గడ్డలుకట్టి కన్నుల మొదటిభాగమందు పుసులు నీరు కారుటయుగలదు. చూచుటకు పశువు చాల అసహ్యకరముగా వుంటుంది. ఈగలుకూడ ఆగడ్డలమీద ముసిరి కండ్లను చెరుపుతాయి.

చికిత్స


ప్రతిదినము పశువుమాడున ఆముదము కాచి పోయిస్తుండాలి. ఇట్లు నాలుగైదు దినములు చేయవలెను. పటికనీటితో కండ్లు కడుగుతూ ఉండాలి.

లేక పసుపుగాని, కుంకుమగాని కండ్లలో పెట్టాలి.

లేక సొరచేప తలలోని రాయి, ఖర్జూరపుగింజ, చనుబాలతో అరగదీసి కంటిలో పెట్టాలి.

రేజీకటి – స్వభావము

కొన్ని పశువులకు రాత్రిపూట కండ్లు ఏమాత్రమును గన్పింపవు. ఈ వ్యాధిని పశువుయొక్క చర్యలను బట్టి కనుగొనవలసిందే గాని సాధారణముగా నేత్రపరీక్షవలన తెలిసికొనుట దుస్తరము. కొన్ని దూడలకు



పుట్టిన వారముదినములలోనే ఈ వ్యాధి జనించుతుంది. ఈ వ్యాధి కూడ వంశ పరంపరముగ వచ్చునని కొందరు డాక్టర్లు చెప్పుతారు. ఇంకను ఫ్యాక్టరీలలోనుండు తవుడు విస్తారముగా మేపుటవలనను, పిల్లి పెసరను నెలలకొలది మేపుటవలనను కండ్లకు అతివేడిజేసి ఈ వ్యాధి రావచ్చును.

పుట్టినవెంటనే దూడలకు కండ్లు కనపడనియెడల కష్టము. కొన్ని దూడల జీవితము కండ్లుకనపడక వృధాయగును. ఇట్టిదూడలను జాగ్రత్తగా కొనాలి.

లక్షణాలు

ఈ వ్యాధిగల పశువులు పగలు బాగుగనే చూడగలవు గాని రాత్రిపూట మాత్రము చూడజాలవు. రాత్రిపూట బుట్టలలో ఆహారపదార్థములుంచి యెదుట నుంచినయెడల రేజీకటిగల పశువు ఇటునటు వెదకుకొనుచుండును. ఒక దొడ్డినుండి మరియొక దొడ్డికి తోలినయెడల పశువునకు త్రోవసరిగా కన్పించక గోడలకు, గోతులకు, చెట్లకు అడ్డుపడిపోతుంటాయి. మంచి వెన్నెల గాయుచున్నపుడు మాత్రము వీనికొక మాదిరిగ కన్పించుతాయి.

చికిత్స

నేత్రములలో ఆవువెన్న పెట్టి చన్నీళ్లు కొట్టాలి.

లేక, మునగాకు రసము తేనెతో కలిపి కండ్లకు పెట్టాలి.

లేక, గానుగవేరు తేనెతో అరగదీసి కండ్లకు పెట్టాలి.

లేక, ఒకటి రెండు చుక్కలు నీరుల్లిపాయరసము కండ్లలో పిండాలి.

లేక, అవిసెపువ్వుల రసము నలకలు లేకుండ శుభ్రమైనది పోయాలి.

షరా :– పుట్టినదూడలకు వరుసగా వారమురోజులు చూపుకనబడనిచో తగ్గుట కష్టము. రేజీకటిగల పశువులకు సజ్జపిండి పెట్టవలెను. పసుపుగుడ్డ కండ్లకు వేయుట మంచిది. పక్షమురోజులు చికిత్స చేయవలెను. ఫార్మసీవారి నేత్రాంజనం, వాతారిని వాడుడు. లోపలికి చేపనూనెను వాడుట మంచిది.

రెప్పలమీద దుర్మాంసము

కంటిరెప్పల నంటుకొని దుర్మాంసము పెరుగుతుంది. వ్యాధి ముదిరినకొలది దుర్మాంసము కంటిని మూసివేస్తుంది. పశువు చూడలేక బాధపడుతుంది. గ్రుడ్డునకు దుర్మాంసముతగిలి బాధగానుండి ఆహారము కూడ మానుతుంది. ఎండను చూడలేదు. రెప్పలు బిరుసెక్కుతాయి.

కన్ను పైకిఉబుకుట

పశువు కంటికి అతివేడి చేయుటవలనగాని, కనుగ్రుడ్డు భాగమంతటికి వాతపునీరు ప్రకోపించుట వలనగాని, గిత్తలు ఆబోతులు పౌరుషముగా పోట్లాడుకొనుటవలన కంటి నరములు సడలుటవలనగాని కన్ను గ్రుడ్డు పైకి ఉబికివచ్చును. కన్నులు బాధగా నుండుట, కండ్లనుండి నీరు విశేషముగా కారుట, కన్నులు తిరుగునట్లుండుట, శిరస్సు బరువుగా నుండుట మున్నగు లక్షణాలుంటాయి. ఇట్టి వ్యాధులుగల పశువులను అనుభవముగల పశువైద్యులకు చూపించి జాగ్రత్తతో చికిత్స చేయించాలి.

పులిపిరికాయలు

దూడలకు, గిత్తలకు కనుకొలుకులదగ్గర వెంట్రుకలతో కూడిన పులిపిరికాయలు చిన్నవిగా గాని, పెద్దవిగా గాని, పెరిగి బాధపెడతాయి. అనుభవముగల వైద్యునిచే శస్త్రము చేయించి తీసివేయించుట మంచిది.

కనురెప్పలు వాచుట

ఇదియొక నేత్రరోగము. రెప్పలు దళసరిగానుండి ఎర్రబడతాయి. రెప్పలువాచి దురదకూడ వుంటుంది. తగిన చికిత్స చేయకపోయిన యెడల రెప్పవెండ్రుకలు రాలిపోతాయి. కన్ను కూడ చెడవచ్చును.

చికిత్స

ఉదయం సాయంకాలములందు కండ్లరెప్పలను పటికలోషన్‌తో గాని, తదితర చల్లని కండ్లలోషనుతో గాని, ఏపూటకాపూట కడుగుచు, రోజు వాటరును, నేత్రాంజనము మొదటిరకమును గాని వాడుచు, ఎండతగులకుండ పసుపుతో తడిపిన గుడ్డనుగాని, కావిరాయితోతడిపిన గుడ్డను గాని కండ్లకువేసి నీడయందుంచాలి.

కంటిరెప్పలందు పేలుజేరుట

పశువు కంటిరెప్పల మీద వెంట్రుకల మొదళ్ళలో గోధుమరంగువంటి పేలుచేరి బాధించుతాయి. ఈపేలు క్రమేపి రెప్పలను గుల్లలను చేసి చివరకు గ్రుడ్డునుకూడ చెడకొట్టుతుంది, కాబట్టి పటికలోషన్‌తోగాని, పసుపునీటితోగాని కడుగుచు కంటికి హానిచేయని మందును వాడుచు పేలను చేతితో తీసివేయాలి.

కనుగ్రుడ్లు పగులుట

రైతులుగాని, కాపరులుగాని చెండుకర్రనుగాని, రాతినిగాని కోపముచ్చి పనిచేయలేదనియో, పొడిచినదనియో పశువు కంటిభాగము పైగాని, కనుగ్రుడ్డునకు కొట్టుతారు. వెంటనే కన్నుగ్రుడ్డు చిట్లుటో, గ్రుడ్డంత కారిపోవుటో జరుగుతుంది. వెంటనే కంటిభాగాన్ని చల్లని నీటిలో రెండు వడ్లగింజలెత్తు పటిక కలిపి నెమ్మదిగా కంటినుండి కారు రక్తము, నీరు వగైరాలను తుడిచి పశువును శాంతపరచి తగిన చికిత్స చేయాలి. కొంతమంది వైద్యులకు ఆపశువును చూపించిన కన్ను తీసి వేయకపోతే రెండవ కంటికి వస్తుందంటారు. అంతమాత్రమునకే కన్ను తీయనక్కరలేదు. ఏజబ్బులేకుండ ఆకస్మికముగా తగిలిన దెబ్బకాబట్టి అప్పుడే తీసి వేయాలంటే ఆశ్చర్యకరంగా వుంటుంది. కాబట్టి రక్తము నాపే మందులు వగైరాలను వేసి, కాపులు తీయుచు, తగిన విశ్రాంతి యిచ్చుచు ప్రమాదము తగ్గిన తరువాత అనుభవముగల పశువైద్యులకు చూపించి తగిన చికిత్స చేయించాలి. ఫార్మసీవారి నేత్రాంజనమును వాడుట మంచిది.

షరా : కంటిరోగాలకు అనుభవముగల వారిచే చికిత్సలు చేయించాలిగాని తెలిసి తెలియని చికిత్సలు చేయించరాదు.

అడుసుకన్నులు

పశువు దేహారోగ్యము సరిగావుంటే నేత్రరోగాలు రావు. అలా వచ్చినప్పటికి కంటిరోగాలు త్వరగా తగ్గుతాయి. ఆరోగ్యం తగ్గిపోయి దేహధాతువులు దుర్బలంగా ఉంటే నేత్రరోగాలు తరుచుగావస్తాయి. నేత్రాలు ఎర్రబడుచు చిక్కని నీరుకారుతూ వుంటే అడుసుకన్నులంటారు. ఇట్టి పశువులకు పచ్చిగడ్డిని ఎక్కువగా మేపుచు అప్పుడప్పుడు అరతులం ఉప్పు అర్ధసేరునీళ్ళు కలిపి కడుగుతూంటే తగ్గగలవు. ఇంకను అప్పుడప్పుడు వేడినీటి కాపులు కండ్లచుట్టు తేలికగా తీయుచుండిన చుట్టువుండే కండరాలు సడలి లోపలనుండే మురికిని పోగొట్టే గుణముంటుంది.

కండ్లలో నలకలుపడుట

కంటిలో మన్నుగాని, నలకలుగాని పడినపుడు సహజంగా కంటిలోనీరు ఎక్కువగా కారుతుంది. ఈకారేనీటిలోనే మాలిన్యాలు కొట్టుకుపోతాయి. అట్లాకాకపోతే ఏకంటిలోనలకపడిందో దానికి అవతల



వైపు ముక్కురంధ్రములోకి నీటినిగాని, గాలినిగాని పీల్చునట్లుచేస్తే, ముక్కులనుంచి పోయేశ్లేష్మంతో కంటిలోనినలుసులు కొట్టుకుపోతాయి. లేక ఫార్మసీవారి నేత్రాంజనం రెండవనెంబరు అన్ని నేత్రవ్యాధులకు పని చేస్తుంది.

కండ్లరోగాలకు వాతలువేయుట

చాలామంది కండ్లరోగాలవిషయమై తెలిసి తెలియని వైద్యాలు చేస్తారు. అంతకు తగ్గనిచో కండ్లచుట్టు కాలుస్తారు. ఇట్లుచేయుట చాలా తప్పు, కంటిభాగాలు సున్నితముగా భగవంతుడు నిర్మించాడు. చక్కని అనుభవముగల చిట్కాలతోనే తగ్గుతాయి. కాల్చినంతమాత్రాన తగ్గవు. కాబట్టి రైతులెవ్వరుకూడ తమవైద్యులచే యిట్టి పనులు చేయించరాదు.

మేకులు, పుల్లలు గ్రుచ్చుకొనుట

పశువుల కంటిరెప్పలకు, కంటికొలుకులకు, నల్లగ్రుడ్డునకు ప్రమాదవశాత్తు పేళ్ళు, పుల్లలు, ఇనుపవస్తువులు గ్రుచ్చుకొనినయెడల అతినిపుణత్వముతో, నొప్పిలేకుండా తీసివేసి ఫార్మసీవారి నేత్రాంజనం నెంబరు రెండవది ఉపయోగించాలి. లోతుగా పుండ్లుపడిన అనుభవముగల వైద్యునితో చికిత్సచేయించాలి.

చికిత్స

ఇట్టి పశువులను అనుభవముగల వైద్యులకు చూపించవలెనుగాని మంటను కలుగజేయు మందులను వాడరాదు. చేపనూనెను ప్రతిరోజు నాలుగైదు చుక్కలు ప్రతి ఆరుగంటలకు కంటి దుర్మాంసములకు రాయుచు పసుపుగుడ్డను కంటికి వెలుతురు తగులకుండ వెయ్యాలి.

దుర్మాంసములను అనుభవమున్న డాక్టర్లతో తీసివేయించాలి. కంటిచుట్టు పైమాదిరిగా దుర్మాంసము పెరిగిన వాతలువేయుటతప్పు. ఫార్మసీవారి నేత్రాంజనమును వాడుడు.

* * *

ఇరువదియవ భాగము

శ్వాస, కోశ రోగములు, క్షయ

స్వభావము – వ్యాపకము

ఇది అంటువ్యాధి. ఈ వ్యాధి అన్ని జంతువులకు రాగలదు. పశువు శ్వాసకోశములలో ఒకవిధమైన పురుగు ప్రవేశించి వానినిక్షీణింపచేయుట వలన ఈ వ్యాధి కలుగుచున్నది. పశువుయొక్క కళ్ళిలోను, చొంగలోను, నాలలోను, రక్తములోను, ఊపిరిలోను, ఈ పురుగు వ్యాపించి యుంటుంది. ఆహారపదార్థముల మూలమును, గాలి మూలమున, ఈ సూక్ష్మజీవి పశుశరీరములో ప్రవేశిస్తుంది. జబ్బుగలపశువులు మంచి పశువులతో కలిసియుండుటచేత ఈ వ్యాధి విచ్చలవిడిగా విజృంభించును. కనుక జబ్బుగల పశువులను ఆరోగ్యపశువులనుండి విడదీసి ప్రత్యేకస్థలము నందుంచాలి. ఈ సూక్ష్మజీవికి పశువుయొక్క శరీరము వెలుపలగూడ జీవించుశక్తిగలదు. పశువుల కొట్టము అనారోగ్యకరముగ, అపరిశుభ్రముగ నుంచుటచేత ఈరోగము పెంపొందుతుంది. ఈ వ్యాధి కొన్ని వారములుగాని, మాసములుగాని యుండును. ఈ వ్యాధి ముదరకమునుపే చికిత్సచేయుట మంచిది. ఈ వ్యాధి అన్నిజాతుల జంతువులకు, మనుష్యులకు, పక్షులకుగూడ సోకుతుంది. ఇది సామాన్యముగ పట్టణములలో నుండు పశువులకు ఎక్కువగా వస్తుంది. అనారోగ్యప్రదేశములలో నుండుటవలన పశువుపేడ, చెత్త, మూత్రము మున్నగువానిని నిలవయుంచుట వలన, గాలి, వెలుతురు లేని కొట్టములలో పశువులను కట్టివేయుట వలన, దోమలు, ఈగలు ఎక్కువగానుండు మురికిప్రదేశములలో పశువుల కట్టివేయుటవలన ఈ వ్యాధి ప్రబలుతుంది. ఈ వ్యాధిని కలిగించు సూక్ష్మజీవి మంచిపశువులకుండు గాయముల మూలమునను, త్రాగెడి నీటిమూలమునను, పీల్చు చెడుగాలివలనను లోపలికి ప్రవేశించి వ్యాధి కలిగిస్తుంది.

లక్షణాలు

ఈ వ్యాధిముఖ్యముగా శ్వాసకోశములలో వృద్ధియవుతుంది. ముఖ్యలక్షణములు. దగ్గు మొదట కొంచెము కొంచెముగానుండి క్రమక్రమముగా హెచ్చుతుంది. దగ్గు ఎక్కువైనకొలది తెమడ ఎక్కువగా పడుతుంది. పనిచేయునపుడు మిగుల ఆయాసముగానుంటుంది. క్రమక్రమముగా శరీరము శుష్కించుతుంది. జీర్ణశక్తి తగ్గుతుంది. అందుచే ఆహార మెంతపెట్టినను నీరసముగానుండి పశువు కృశించును. పశువు బలహీనమైనకొలది దగ్గుహెచ్చుతుంది. జ్వరము అప్పుడప్పుడువస్తుంది. ఈ వ్యాధి తగిలినపశువు చనిపోవుటకు కొంతకాలము పట్టుతుంది. పైన వ్రాసినట్లు శ్వాసకోశములయందేగాక జీర్ణకోశముల యందుగూడ క్షయ అభివృద్ధి నొందుతుంది. అప్పుడు పలుచగా పేడవేస్తుంది. కడుపుబ్బరముంటుంది. కనుగుంటలు విడుచును. పేగులు చెడవచ్చును. జీర్ణము చేసికొనలేకపోతుంది. పాడిపశువైన పొదుగు గట్టిపడి వాస్తుంది. పొదుగుపూర్తిగా చెడనప్పటికి పాలేమీయుండవు. ఈ వ్యాధి ముదిరినకొలది ఎముకలు

కీళ్ళు జబ్బుపడుట, బలహీనత చెందుట, నడచునపుడు కుంటుట, మొదలగు లక్షణములుకనబడి రానురాను జ్వరము ఎక్కువై మరణము సంభవిస్తుంది.

చికిత్స

సాధారణముగా ఈ వ్యాధిని వైద్యులు కనుగొనుట కష్టము. అందుకొరకు ప్రత్యేకముగా తయారుచేయబడిన "ట్యూబర్కులిను" అను ఇంగ్లీషు మందొకటి కలదు. దానిని శరీరములోకి ఇంజెక్షన్ చేసిన యెడల దానివలన శరీరమునందు కలుగు మార్పులనుబట్టి ఈ వ్యాధిని నిర్ణయించవచ్చును. ఈ వ్యాధిగల పశువును అతిజాగ్రత్తతో రక్షించుటచే తప్ప వేరొండు మంచిచికిత్సలేదు. అమెరికా మున్నగు దేశాలలో క్షయవ్యాధిగల పశువులను ప్రతిదినము పరీక్షించిగాని వాటిపాలనమ్మనీయరు.

హెచ్చరిక

ప్రతి పట్టణములోనుండు పశువధశాలలను, పశువైద్యులచే పరిశోధనచేయించుటమంచిది. ఆహారార్థము వధార్హమగు జంతువులు కేవలము వయసువచ్చినవిగాకుండ, చూడివశులు గాకుండను, పసిదూడలు గాకుండను, జాడ్యగ్రస్థములైనవి గాకుండను, కేవలము బక్కచిక్కినవిగాకుండగను ఉండాలి. పశువధశాలలు, వానిసమీప ప్రదేశములు శుచిగానుండు టావశ్యకము. క్షయ, దొమ్మ మొదలగు జాడ్యములవలన మృతినొందిన జంతువుల మాంసమును భక్షించుటచేత భక్షకులకు సయితము ఈజాడ్యము సంభవిస్తుంది. ఈవిషయము చక్కగా మనస్సునందు నాటియుండాలి. ఏలనన ఈదేశమందంతట హీనజాతులవారు తమకెచ్చటనైన చచ్చినపశువు దొరికినయెడల దాని మాంసమును సంకోచములేక తింటారు. అట్టివారు పెక్కురోగముల పాలవుతారు. పాశ్చాత్య దేశాలలో భక్షించు మాంసాదుల విషయమై, పానముచేయు క్షీరముల విషయమై అనేకములైన కట్టుదిట్టములు, శాసనములు ప్రజల క్షేమము కొరకై చేయబడియున్నవి.

పట్టణములలో పాలను పితుకుట, విక్రయించుట, మొదలగు విషయములగురించి శాసనమొకటి అత్యవసరమైయున్నది. అట్టి శాసనము పుట్టువరకు పాలనుకొనెడువారు తాము కొనుచున్నపాలు ఎక్కడ నుండి తమకు చేరుచున్నవో చక్కగా తెలిసికొని జాగరూకులైవుండాలి. రోగముగల పశువులపాలు పానయోగ్యములు కానేరవు. కనుక అట్టి పాలను వాడరాదు. పశువులయొక్క రోగమునివారించుట, పాలయొక్క ఆరోగ్యము కాపాడు మున్నగు కృత్యములు పశువైద్యపు టుద్యోగీయులకు చెందియున్నవి. పశువులలో ఏపశువుకైన క్షయవ్యాధి యున్న యెడల ఒకపశువునుండి మరియొక పశువునకది వ్యాపించుటయేగాక ఈ వ్యాధి తగిలిన పాడిపశువుయొక్క (ఆవు, గేదె) పాల నుపయోగించుట వలన మనుష్యులకును, ముఖ్యముగా చంటిబిడ్డలకును ఈ వ్యాధి తగిలి వారి కపాయము కలిగించును. ఇదియే మనము ముఖ్యముగా గమనించవలసిన విషయము.

ఊర్ధ్వ శ్వాసరోగము

పశువును చలిగాలిలో త్రిప్పుటవలన, అమితముగా బండికట్టి తోలుటవలన, ఆహారము సరిగా పెట్టకపోవుటవలన, రక్తములో ప్రాణవాయువు తక్కువగా నుండుటవలన, శ్వాసనాళమునకేదైన ఆటంకము గలుగుటవలన ఈ వ్యాధి సంభవిస్తుంది.

లక్షణాలు

పశువు వణకుచు చెవులను వ్రేలాడవేస్తుంది. శరీరము వేడిగా నుండి నోటినుండి ఒకవిధమైన తెమడపడుతుంది. ఈ వ్యాధి ముదిరిన కొలది మలమూత్రబంధ రోగముగ పరిణమింపవచ్చును. ముఖము వాడిపోయి నాలుకను జారవిడుస్తుంది. పశువు తూలుచు ఊపిరియాడుట కష్టముగా ఉంటుంది. మనము తగిన చికిత్సచేయనిచో ఉచ్ఛ్వాస నిశ్శ్వాసము లెక్కువై పశువు వెంటనే మరణిస్తుంది.

చికిత్స

కర్పూరము ½ తులము, సూరేకారము ½ తులము, ముసాంబరము 1 తులము, నల్లమందు ½ తులము కలిపి అప్పుడప్పుడు తేనెతో నాకించాలి.

లేక కోడి గ్రుడ్డులోని చందమామ 1 తు, ఫిరంగి సాంబ్రాణి 1 తులము కలిపి నాకించాలి.

లేక శొంఠి 2 తులములు, పిప్పళ్ళు 1 తులము, మిరియాలు 1 తులము, కల్లుబెల్లము 1/8 వీసె, ఉలవపిండి సోలెడు కలిపి ముద్దచేసి లోపలికి పెట్టాలి. లేక కనకాసవయను లేహ్యమును వాడాలి.

న్యూమోనియా

దీనినే ఊపిరితిత్తుల వాపంటారు. ఈ వ్యాధి కూడ ఒకవిధమైన అంటుజ్వరమని జంతుశాస్త్రజ్ఞులు తెలుపుతున్నారు. ఇది పశువుయొక్క శ్వాసకోశములకు తగులుతుంది. చలిగాలి ఎక్కువగా తుగులుటవలనను, ఎల్లప్పుడును పశువును వర్షములో నుంచుటవలనను, ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి పాడిపశువులకంటె పాటుపడు పశువులకుతరుచుగా సోకుతుంది. ఈ వ్యాధిపశువుయొక్క ఒక ఊపిరితిత్తికిగాని, కొన్నిటికి రెండు తిత్తులకుగాని సోకవచ్చును. మలినపుగాలినెక్కువగా పీల్చుటచేత ఈ వ్యాధి రావచ్చునని కొందరు డాక్టర్లు చెప్పుదురు. ఈ వ్యాధియొక్క లక్షణములు, ఋతువులను బట్టియు, స్థలమునుబట్టియు, పశువుయొక్క వయస్సును బట్టియు వ్యాధి తగులకముందు రోగియొక్క ఆరోగ్యమును బట్టియుంటుంది. కనిపెట్టుట కష్టము. పశువుగుండెమీద స్టెతస్కోపు పెట్టి లోపలనుండు శ్వాసకోశములనుండివచ్చు ధ్వనినిబట్టి ఈరోగమును గుర్తించాలి. ఈవ్యాధిసంబంధమగు పురుగు ఒకవిధమైన విషమును తయారుచేసి తదితర పశువులకు ప్రసరింపజేస్తుంది, గాన జాగ్రత్తగా పశువును కాపాడాలి. ఈ వ్యాధి తగిలిన పశువు చొంగపడిన స్థలము పరిశుభ్రముచేయనిచో నా ప్రదేశముమీద ఆరోగ్య సంబంధమైన విషమొక సంవత్సరము వరకుండునని శాస్త్రజ్ఞులు తెలుపుతున్నారు.

లక్షణాలు

ఈ వ్యాధికి ఆరంభములోనే పశువు ప్రక్కభాగములందు ఉధృతమగు బాధప్రారంభమైపోటు పొడిచినట్లుండును. ఊపిరితిత్తులు కందియుండుటవలన శ్వాస మిక్కిలి ఆయాసముగా వుంటుంది. కొన్నిటికి జ్వరముంటుంది. మేత, నీరు మానుతాయి. పశువు పని జేయజాలదు. అంటుసంబంధమైన జ్వరమైనయెడల దీర్ఘకాలము వుంటుంది. ప్రారంభములో ఎక్కువ లక్షణములు కన్పడవు. పనిచేయించునపుడు పశువు అలసిపోతుంది. తదితర పశువులతో నుండకవిడిగా వుంటుంది. శ్వాసకోశములు క్రుళ్ళినయెడల ఊపిరి వాసనకొట్టుతుంది. నాడి తొందరగా కొట్టుకొంటుంది. మూత్రము తీవ్రవర్ణము కలిగియుంటుంది. ఈ వ్యాధియందు దగ్గుకూడ వుంటుంది. వ్యాధి ముదిరినకొలది రక్తము క్షీణించుతుంది. క్రమక్రమముగ గుండె అస్వస్థతజెంది శ్వాసకోశములలో విషపదార్థములు పేరుకొని ఉచ్ఛ్వాస నిశ్శ్వాసల నాడనీయక పోవుటచే పశువు మరణిస్తుంది.

చికిత్స

ఈ వ్యాధికి చికిత్సచేయుట బహుకష్టము. కొన్ని మందులను ఇంజక్షన్ చేయవలసియుండును. అందుచేత ఇట్టిలక్షణములు కలిగిన పశువులను వెంటనే పశువైద్యశాలలకు తీసికొనిపోవుట చాలామంచిపని. అట్లు చేయుటకు వీలులేనిచో నీరు ఒక పాత్రలో మరగించి కర్పూర తైలముగాని, యూకలిప్టస్ ఆయిల్ గాని వేసి దానినుండి వచ్చు ఆవిరిని ముక్కురంధ్రములలోనికి పట్టించాలి. పశువు ఎదురురొమ్ము నొప్పికి కూడా ఉపశాంతి చేయవలసియుంటుంది. ఈ నొప్పిని తగ్గించుటవలన రోగపశువుయొక్క సామాన్యస్థితి అభివృద్ధిపొందుతుంది. ఇందుకొరకై కొందరు ఆవాలు నూరి పట్టువేయిస్తారు. ఇది ఎక్కువగా వేసిన యెడల అపకారము చేస్తుంది. కాన అమితముగా వేయరాదు. ఇంకను పిండికట్టు కట్టవచ్చును. కర్పూర తైలము రాచి వేడికాపడములు కాయవచ్చును. వేడికాపడములు కాయుగుడ్డలో నీరెంతమాత్రము ఉంచక పిండివేసి కాపులు కాయాలి. అప్పుడప్పుడు సారాయిని త్రాగించవచ్చును, లేక స్ప్రెయిన్ కిల్లరును మర్దనచేయుచు కనకాసవను వాడుడు.

హెచ్చరిక

వ్యాధితగిలిన పశువును శుచియైన స్థలములోనుంచి పరిశుభ్రమైన గాలి తగులునట్లు చేయాలి. రొమ్మునకు చలిగాలి తగులకుండ వెచ్చని ఉన్ని బట్టలు, గొంగడి, కంబళి మొదలగువానిని కప్పాలి. మేత మేయని యెడల బలవంతముగా పెట్టరాదు. ద్రవసంబంధమైన పదార్థములేవియు త్రాగింపరాదు. ఏమందైనను లేహ్యముగాచేసి నాలుకకు రాయాలి. బార్లిగంజిగాని నూకలజావగాని పెట్టాలి. పశువునకు బలముకలిగించు పదార్థములుకూడ పెట్టవచ్చును. పశువునోటినుండి కఫము పడుచుండిన యెడల ఆ కఫమును శుభ్రముగా తీసివేసి ఫీనైల్ గాని, కార్బాలిక్ ఆసిడ్‌లోషన్‌గాని పెప్పరమెంటు ఆయిల్‌గాని ఆ కఫము పడినచోట చల్లాలి.

దగ్గు

పశువునకు చలిగాలి, మంచు తుగులుటవలన మిక్కిలి అలసిపోవునటుల పని చేయించుటవలన అలసియున్నప్పుడు వర్షమునకు మంచునకు తడిసియుండుటవలన, ఊపిరితిత్తులలో నుండుపొరలు కందుటవలన, లేక ఊపిరిగొట్టములలో నున్న పొరలు కందుటవలన ఈ వ్యాధి రావచ్చును. ఇది కూడా రెండు విధములుగా నుండును. అందు మొదటిది ఊపిరిగొట్టములోని పొర కందుటవలన రెండవది ఊపిరితిత్తులలోని పొర కందుటవలన కలుగుతుంది. రెండువిధములుగాక ఊపిరిగొట్టములో ఒకవిధమైన పురుగులు పుట్టును. లేక తదితర రోగములలోకూడ రావచ్చును. కాన జాగ్రత్తగా ఆలోచించి చికిత్స చేయాలి.

లక్షణాలు

దేనిచే వచ్చినను ప్రారంభములో లక్షణము లన్నియు ఒకేమాదిరిగా వుంటాయి. అందుచే జాగ్రత్తగా కారణమును కనిపెట్టాలి. పశువు దగ్గుట, మేతమేయలేక పోవుట, పనిచేయలేక అలసిపోవుట, మొదలగు లక్షణము లన్నియు కనపడవచ్చును. ఊపిరి గొట్టములోని వ్యాధికన్న ఊపిరితిత్తులలో కలిగిన వ్యాధి ఎక్కువ భయంకరముగా వుంటుంది. దానికంటె పురుగులవలన కలిగిన వ్యాధి కఠినతరముగా వుంటుంది. మొదట చెప్పిన కారణమేగాక మిగిలిన రెండు కారణములవలనను జ్వరముకూడ నుండవచ్చును. ముక్కుల వెంబడి ద్రవపదార్థము వెలువడుతుంది. కండ్లనుండి కార్చుతుంది. దగ్గు రాత్రులయందు విశేషముగా వుంటుంది. ఈ వ్యాధి ముదిరినకొలది పశువు క్షీణించుతుంది. పడుకొని లేవజాలదు. చాల విచారముగా వుంటుంది. జ్వరము హెచ్చుచు తగ్గుచు వుంటుంది. పశువు క్షీణించిన కొలది బరియెముకలు స్పష్టముగా కనపడుతాయి. నోటినుండి జిగటవంటి ద్రవపదార్థము ఎక్కువగా వెలువడుతుంది. కఫమెక్కువైన పశువునకు మరణము సంభవిస్తుంది. కొన్ని పశువులకు వ్యాధి దీర్ఘముగానుండి కంగుకంగుమని దగ్గువుండును. కనకాసవ మంచిపని చేస్తుంది.

చికిత్స

రావిచెక్క 2 తులములు, మిరియాలు 2 తులములు, పచ్చిపాలు అర్ధసేరు కలిపి ఉదయము వారము దినములు త్రాగించాలి.

లేక పెన్నేరుదుంపల పొట్టు పావుసేరు, పులిచల్ల అర్ధసేరు, కలిపి ఒకపూట మాత్రమే వారము దినములు త్రాగించాలి.

లేక నీరుల్లిపాయరసము అర్ధసేరు, పూటకొకసారి వంతున 15 దినములు త్రాగించాలి.

లేక అడ్డసరపాకు పసరు పావుసేరు, అల్లపురసము పావుసేరు, కలిపి సాయంకాలము పూట 4 దినములు త్రాగించాలి. లేక ఫార్మసీ వారి కనకాసవను వాడాలి.

హెచ్చరిక

ఈ వ్యాధికి కూడ రొంపకుచేయు చికిత్సయే చేయాలి. కాని పురుగులవలన కలిగిన వ్యాధిని మాత్రము పశువైద్యునకు చూపించాలి. ఒక పశువునుండి మరియొక పశువునకు ఈవ్యాధి వ్యాపించి కొన్ని పశువులు చెడిపోవచ్చును. వైద్యుని దగ్గరకు వెళ్ళుట తటస్థించని యెడల జబ్బుతగిలిన పశువులను ఒక గదిలోనుంచి గంధపుపొగ పీల్చునట్లు చేయాలి.

రొంప

పశువు నతిశీతలమైన గాలిలో నుంచుటవలన శీతోష్ణస్థితిలో వింతయగు మార్పులు కలుగుటవలన గాలి వెలుతురు లేని ఇరుకుగానుండు కొట్టములలో పెక్కింటిని కట్టుటవలన వానికి మంచు, చలిగాలి తగులుట వలన అధిక శ్రమ కలుగునట్లు పని చేయించుటవలన ఈ వ్యాధి కలుగుతుంది.

లక్షణాలు

ఈ వ్యాధి సంభవించుటకు రెండుమూడు దినములకు ముందే పశువు నిరుత్సాహముగ వుంటుంది. అప్పుడప్పుడు దగ్గుతుంది. పశువునకు జ్వరమునుండి నోటిలో ఒకవిధమైన కఫ మేర్పడుతుంది. జంతువు పరుండుటకు ఇచ్చగింపదు. వ్యాధి పెంపొందిన కొలది ఊపిరితిత్తులలో ఒకవిధమైన ధ్వని పుట్టుతుంది. ముక్కురంధ్రములలోని పలుచని పొరకు నెత్తురు ఎక్కువగా చేరుటవలన ఆ పొర ఎఱ్ఱబడుతుంది. ఆ ముక్కురంధ్రములనుండి వచ్చు ద్రవపదార్థము చిక్కపడి ముద్దకుట్టుతుంది. ఈ స్థితిలో పశువు మేత సరిగా మేయదు. వ్యాధిముదిరినకొలది పొడిదగ్గు ఏర్పడుతుంది. ముక్కునందు తడియుండదు. ఇంకను అశ్రద్ధ చేసినయెడల శ్వాసకోశములోనికి వ్యాధి వ్యాపించి జ్వరము ఎక్కువై పశువుచాలా బాధపడుతుంది. శ్వాసకోశములుచెడి వ్యాధి హెచ్చినయెడల పశువునకు ఆరోగ్యము కుదురుటకష్టము. కనుక మొదటనే జాగ్రత్తపడాలి.

చికిత్స

ఉప్పు 10 తు, నూరేకారము 2 తు, నవాసాగరము 1 తు, అర్ధసేరు చన్నీటిలోకలిపి త్రాగించాలి.

లేక నల్లమందు పావు తు, కర్పూరము ముప్పావు తు, కర్పూర తైలము 2½ తు, అర్ధసేరు నీటిలో కలిపి త్రాగించాలి.

లేక శొంఠి 2 తు, పిప్పళ్ళు 2 తు, మిరియాలు 2 తు, అర్ధసేరునీటిలో కలిపి త్రాగించాలి.

లేక నీరుల్లిపాయల రసము 4 తులములు ముక్కురంధ్రములలో పోయాలి.

లేక మంచిబెల్లం సవాసేరు, పసుపు 4 తు కలిపి నిమ్మకాయంత ఉండలు చేసి పెట్టాలి.

పైనచెప్పిన చికిత్సలలో రెండుమూడు దినములు మీ యిష్టము వచ్చినది చేయవచ్చును. లేక రామాయిల్‌ను వాసన పీల్పించుచు కనకాసవను వాడాలి.

హెచ్చరిక

మన రైతులలో చాలామంది పశువు ముక్కురంధ్రములనుండి, నీరుగాని, చీమిడిగాని, కారుచుండిన యెడల కొమ్ముడొల్లలని, శిరోవాతమని ఇంక నేదోయొక పైత్యరోగమని పేర్లుపెట్టి తెలిసితెలియని వైద్యములు చేసి పశువును చేతులారా చంపుతారు. కాబట్టి రోగముయొక్క నడక, గుణములు గుర్తించి తగిన చికిత్సలు చేయాలి.

ఈ వ్యాధి పశువునకెక్కువగా నున్నప్పుడు తవుడు, లేక నూకల జావ పెట్టుటమంచిది. పశువును చలిగాలిలో, ఎండలో నుంచరాదు. మలబద్ధకమున్న యెడల విరేచనమునకు మందీయాలి. ఈ రొంప పశువు శ్వాసనాళములను చెడగొట్టవచ్చును. పశువువిడుచు ఊపిరిలో మెత్తదనము లేకపోవచ్చును. జంతువును తగినంత పరిశ్రమ చేయించుచుండాలి. పశువునకు బలవంతముగా మందును లోపలికి పోయరాదు. కొంచెము యూకలిప్టస్ ఆయిలుగాని, కర్పూరతైలముగాని బుడగలు వచ్చునట్లుగా నీటిలో వేసి ఆ నీటినుండి వచ్చు ఆవిరిని పశువుయొక్క ముక్కు రంధ్రములలోనికి వెళ్ళునట్లుగా మూతియొద్దపెట్టి తలమీద నొకగుడ్డనుకప్పాలి.

ఉబ్బసము–స్వభావము

ఈ వ్యాధి బండిఎద్దులకు తరుచుగావస్తుంది. పశువుయొక్క శ్వాసకోశములోనున్న చిన్నవిత్తులు పెద్దవియగుటవలన కలుగుతుంది. పశువులకు సారములేని పిప్పివంటి ఆహారవస్తువులు మేపుటవలన, కొన్ని పనిలేక సోమరితనముగా నుండుటవలన, మరికొన్ని విస్తారముగా మేతమేయు స్వభావముగలవిగా నుండుటవలన ఈ రోగముత్పత్తి యవుతుంది. నోటిగాళ్ళు తగిలి నెమ్మదించిన పశువులకీవ్యాధి తరచుగా వస్తుంది. ఈ వ్యాధియందు కఫమెక్కువగా పడుతుంది. కొన్నిటికి కఫముండదు. పశువు నరములు యధాస్థితిలో నుండకపోవుటచేత, ఊపిరితిత్తులకు ఒత్తిడిగలుగుటవలన, దీర్ఘమైన దగ్గులేక శ్వాసకోశములకు వేడితగులుటవలన ఈ వ్యాధి రావచ్చును. ఈ వ్యాధి తగిలినపశువు చాలాకృశించి మిగుల విచారముగా నుండును. ఇది ముసలిపశువుల కెక్కువగా వచ్చును.

లక్షణాలు

ఆరంభములో కొద్దిగ జ్వరము స్థిరమైనదగ్గు వుంటుంది. ముక్కురంధ్రములనుండి తెల్లనిజిగురువంటి పదార్థము వెలువడుతుంది. ముక్కురంధ్రములను పరీక్షించినయెడల ఎఱ్ఱని కురుపులుగా కనబడును. వ్యాధి ముదిరినకొలది బుసఎక్కువై చాలాదూరమువరకు వినబడుతుంది. ఈ వ్యాధి గలపశువు అపానవాయువులు తరచుగా విడుస్తుంది. క్రమముగ జంతువుయొక్క కళ మారిపోతుంది. ఈవ్యాధిగల పశువుతో కొందరు రైతులు పనిచేయించుతారు. అందువలన ఆ పశువునకు ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములు సరిగా ఆడక డొక్కలనెరగవేస్తుంది. పశువుకొట్టములో ఈ పశువును కట్టి వేసి దానిబుస పరీక్షించినయెడల పిల్లికూతవలె నుండును. స్టెతస్కోపుపెట్టి పరీక్షించినయెడల చక్కగా తెలుస్తుంది. వ్యాధి ముదిరినకొలది

పశువు ముఖపురంగు మారుతుంది. దగ్గుచున్నపుడు తెల్లని తెమడ ఎక్కువగా పడుతుంది. బుస ఎక్కువై మూలుగుచుండుటవలన, క్రమముగా పశువునీరసముజెంది నెలనుంచి ఆరుమాసములవరకు వుంటుంది.

చికిత్స

కర్పూరతైలముగాని, యూకలిప్టస్ ఆయిలుగాని వేడినీటిలో వేసి సలసలకాగనిచ్చి ఆయావిరి ముక్కురంధ్రములకు పట్టించాలి.

వెంటనే అడ్డసరపాకు రసము అర్ధసేరు, శొంఠి 1 తు, పిప్పళ్ళు 1 తు, మిరియాలు 1 తు, పసుపు 2 తు, ఒకసారిమాత్రమే కలిపి త్రాగించాలి.

లేక సారాయి 2 గ్రాములు, నిమ్మ ఉప్పు 1 తు, శొంఠి, మిరియాలు 1 తు, పసుపు 2 తు, ఒకసారిమాత్రమే కలిపి త్రాగించాలి.

లేక మంచిబెల్లము 2 సేర్లు, అల్లము 2 సేర్లు, వాము అరసోలెడు తెచ్చి త్రొక్కి వెలగకాయంత ముద్దలుచేసి వారముదినములు తినిపించాలి.

లేక వెల్లుల్లిపాయలు 8 తు, మిరియాలు 2 తు, వేపచెక్కపొడి 3 తు, మేకపాలు అర్ధసేరు కలిపినూరి త్రాగించవలెను. ఈ రీతిగా వారము దినములు చేయాలి.

హెచ్చరిక

ఈ వ్యాధి కలిగిన పశువు పూర్తిగా ఆరోగ్యము చెందుట కష్టము. అందుచేత పశువునకు పెట్టుమేత శుభ్రమైనదిగను బలము కలుగజేయునదిగను, సులభముగా జీర్ణమగునదిగ నుండవలెను. ఆహారము తగ్గించి పని చేయించుటకు ముందు కొన్నిగంటల వ్యవధియందునట్లుగా జేసి మేత తగినంత మేపి పనిచేయించాలి. పశువును పరుగెత్తించరాదు.

కసిమిరి

ఎద్దులకు తక్కువమేతమేయు పశువులకు గాలికుంటు తగిలి ఎండలో తిరిగు పశువులకు ఇంకను నరముల యథాస్థితిని తప్పుటవలన, ఊపిరితిత్తులకు ఒత్తిడి కలుగుటవలన, దీర్ఘమైన దగ్గుండుటవలన ఊపిరితిత్తులకు వేడి తగులుటవలన ఈవ్యాధి కలుగు వచ్చును.

లక్షణాలు

దగ్గుచాల తక్కువగనుండును. ఆ దగ్గు ధ్వనిని కలుగజేయునదిగనుండినను కొద్దిదూరము మాత్రమే వినబుడుతుంది. అప్పుడు గాలి ఆసనము గుండా వెడలుతుంది. ఈ వ్యాధితోపాటు అజీర్తికూడ వుంటుంది. అజీర్తిగా వున్నయెడల జంతువు రూపము మారిపోయి, ఎల్లప్పుడు నీడకొరకు ఎదురుచూస్తుంది. వెండ్రుకలు నిక్కబొడుచుకొనును. బండికట్టినయెడల డొక్కలు ఎగురవేయును. నక్క వెంట్రుకలవలె పెరుగుట వలన నక్కోరు నక్కవాతమంటారు. ఆవుల, గిత్తల శరీరరంగు మారుతుంది.

చికిత్స

నీరుల్లిపాయల అర్ధసేరునవటాకు, మజ్జిగ అర్ధసేరు, కలిపి దినమున కొకపూట, పక్షముదినములు త్రాగించాలి.

లేక మోదుగాకుపసరు పావుసేరు, కలినీరు అర్ధసేరు, కలిపి దినమున కొకసారిచొప్పున వారము దినములు త్రాగించాలి.

లేక మంచిబెల్లము 2 సేర్లు, అల్లము 2 సేర్లు, తెచ్చి వెలగకాయంత ముద్దలుచేసి వారమురోజులు పెట్టాలి.

లేక గంటెలు తెచ్చి మడ్డికూడుగా వండి అందులో మంచినూనె కలిపి తవ్వెడు మానెడు వంతున 40 దినములు పెట్టినచో తగ్గుతుంది. ఫార్మసివారి కనకాసవను వాడాలి.

హెచ్చరిక

గాలికుంటుతగిలిన పశువుచే పనిచేయించరాదు. ఎండలో త్రిప్పరాదు. లేనిచో ఇటువంటి వ్యాధుల పాలగును. తగిన ఆహారము వేళకు పెట్టుచుండాలి.

ముకుబంతి

దీనినే ముకుబంతి లేక మొగబంతి అందురు. ఇది రెండు విధములుగా వుంటుంది.

1) ముక్కురంధ్రముల లోపలి పైభాగమున నొక విధమైన మాంసపుకండ గుండ్రని కోలగా నుండు కాయలవలె పెరుగుతుంది. అది ముక్కురంధ్రములలో నుండు శ్లేష్మపు పొరలకు ఒక సన్నని కాడవంటి దాని నంటుకొనియుంటుంది. ఈ వ్యాధి చలిగాలివలనగాని, తదితర వ్యాధులవలనగాని లేత పశువులకు తరచుగా వస్తుంది.

2) ముక్కురంధ్రముల పొడుగున అనగా పై నుండి క్రిందవరకు చిన్న గుండ్రని బిళ్ళలువలెగాని, ఉండలవలెగాని దుర్మాంసము పెరుగుతుంది.

మొదటివిధమైన వ్యాధిగల పశువునకు దగ్గుంటుంది. కాయగాని, ఉండగాని, గొంతువద్ద అడ్డుపడుటవలన శ్వాస ఆడక తన్నుకొంటుంది. కొద్దిజ్వరముండి కండ్లు ఎర్రగా వుంటాయి. ముక్కులగుండా ద్రవము వస్తూ ముదిరినకొలది ద్రవము చిక్కబడుతుంది.

రెండవవిధమైనదానిలో దుర్మాంసము పెరిగి బిళ్ళలుగాని, ఉండలుగాని చితికియుండుట, నల్లగా క్రుళ్లుట, ముక్కురంధ్రములవెంబడి చీమిడివంటి పదార్థము కారుట, శ్వాస తీనుకొను సమయములో విస్తారముగా శబ్దము కలుగుట మొదలగు లక్షణములు కనపడుతాయి. వ్యాధి ముదిరినకొలది పశువు అటు నిటు తిరుగుతుంది. మూర్ఛకూడ రావచ్చును.

చికిత్స

మొదటివిధమైన రోగమునకు ఒకదారము జారుముడివేసి ఒక సన్నని చివర మొద్దుగానుండెడి పుల్లతోగాని లేక సన్నని తీగెతోగాని, ఆ ముడిని లోపలికి తీసుకొనివెళ్ళి జాగ్రత్తగా సన్ననికాడవలె నుండు చోటను తగిలించి ముడిని లాగినయెడల ఆ కాడ తెగిపోయి ఉండబైటికి వచ్చును. దీనినే ముకుబంతియని చెప్పుదురు. ఈ ప్రకారము సాధ్యము కానిచో పశువైద్యశాలకు తీసికొనిపోయిన వారు ఒకవిధమైన పనిముట్టుతో తీసివేస్తారు.

పశువు శరీరము నాకికొనుటచే ఆ బొచ్చు దేహములోనికి ప్రవేశించి పెద్దపొట్టలో జేరి ఉండకట్టుతుంది. దగ్గినపుడు ఆ కాయ నేల బడుతుంది. దీనినే మొగబంతికాయ యందురు. ఈ కాయను ఆవుపంచితములో కొంతసేపు ఊరవేసి సాంబ్రాణి పొగవేసి జబ్బుపశువుయొక్క ముక్కురంధ్రములదగ్గర కొంచెముసేపు ఉంచి తరువాత పశువునకు ముమ్మారు దిగదుడిచివేస్తారు.

హారతి కర్పూరము ¼ తు, జీలకర్ర 1 తు, దానిమ్మ మొగ్గలు గుప్పెడు చనుబాలతో నూరి గుడ్డలోవేసి పిండి 5, 8 చుక్కలు 2, 3 దినములు ముక్కులలో పోయాలి.

లేక పిల్లిపీచరగడ్డరసము ముక్కురంధ్రములలో పోసిన మంచిది.

లేక కామంచిచెట్టు కాడలను ముక్కలుగ కోసి రోటిలో వేసి దంచి ఆ పొడిని ముక్కురంధ్రములలో నస్యము చేయించాలి.

లేక పాలతీగాకు రసములో రసగంధము కొద్దిగా కలిపి 10 చుక్కలు ముక్కులలో పోయాలి. లేక ఫార్మసీవారి రామాయిల్‌ను వాడాలి.

ముఖ్యముగా ఈ వ్యాధి ముక్కురంధ్రములలో వచ్చుటచే దీనికి ముక్కుపీసన యని పేరు వచ్చింది. ఇదికూడ అంటురోగము. ముక్కులందు రక్తము చీము కారుచు నూకలగూడువలె మాంసము పెరిగి ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములకు ఆటంకము కలుగుచు ఘర్ఘాంగువరకు ధ్వని వినబడుతుంది. ఈ వ్యాధి ముఖ్యముగా ఎద్దులకు సోకి ఆరంభములో తుమ్ముతాయి. క్రమేపి లోపల గుడ్లు కంటికి కనబడని పురుగులు పెద్దవై తినుచు ఎముకను కూడ పాడుచేస్తుంది. సంవత్సరము వరకు కూడ యుంటుంది.

ఈ వ్యాధిగల పశువులు చెరువులలోను, గుంటలలోను నీళ్ళుత్రాగుటకు పోయినపుడు ఆ పురుగులు కొన్ని నీటిలోజేరగనే నత్తలు, చిరుకప్పలు తినుటవలన వాటిలోనుండి మరల మంచిపశువులు త్రాగుటకు వచ్చినప్పుడు ఈ వ్యాధి సోకుటయు గలదు. కొన్ని మామూలుగా ఇంటివద్దనుండు తొట్లలో త్రాగుటవలన కూడ మంచిపశువులకు రావచ్చును. ఈ వ్యాధి వచ్చిన తరువాత మూడుమాసములకుగాని పక్వమునకు రాదు.

చికిత్స

రైతులలో చాలమంది ముక్కు రంధ్రముల మీద వాతలు వేస్తారు. అంతమాత్రముననే తగ్గదు.

ఆరంభమునుంచి వ్యాధి తగ్గువరకు తులసిఆకురసము 10 తు, మైలతుత్తము ½ వడ్లగింజంత కలిపి ముక్కులలో పోయుచు లోపలికి బలముగలిగించు వస్తువులను పెట్టుచు అప్పుడప్పుడు పటికనీటితో కడుగుచుండాలి.

లేక ఫార్మసీవారి రామాయిల్‌ను ముక్కులకు వాసన చూపించుచు కార్నెక్సును లోపలిపుండ్లకు రాయవలెను. లోపలికి వాతారి అరఖును వాడాలి. తేలిక మైలతుత్తపు నీటితో ముక్కులను కడగాలి.

మందమతి

ఈ వ్యాధి యౌవనము దాటినపశువులలో మాత్రమే సామాన్యముగ కన్పిస్తుంది. సామాన్యముగా మేపబడినను, ఎక్కువగా మేపబడినను, సరియగు శరీర పరిశ్రమలేకున్నను, ఎండలో ఎక్కువగా పనిజేసినను, పశువుకంఠమునకు తగిలించు పలుపుగాని, త్రాడుగాని బిగిసికొని పోయినను ఈ వ్యాధి పశువులకు సోకుతుంది.

లక్షణాలు

పశువు వెంటనే క్రిందపడిపోవును. లేక అంతకుముందే బద్ధకముగా నుండి చుట్టుప్రక్కలయేమి జరుగుచున్నది. చూడకుండ రెప్పలు మూతలు పడిపోవును. చాలకష్టముతో ఊపిరివిడుస్తుంది. తూలుతుంది. గాలిసరిగా పీల్చలేదు. దేహమునిండ చెమటపట్టుతుంది. శరీరములోని రక్తస్రావమునకు ఆటంకము కలుగును. మనస్సుకు తెలియకుండగనే ఊపిరి విడువబడుతుంది. కొన్ని సమయములలో కడుపులో త్రిప్పుటచే తూలుచు పక్షవాతముకలుగవచ్చును. సరియైన చికిత్స చేయనిచో పశువు మరణిస్తుంది.

హెచ్చరిక

శరీరభాగములు కదుపలేనంత దుస్థితిలోనున్నపుడు విరేచనము కానియెడల మందీయవలెను. గాలి ధారాళముగావచ్చు స్థలమందు పశువునుంచాలి. జంతువు శరీరభాగములను మాలీసుచేయాలి. ముఖ్య అవయవములదగ్గర, వీపుమీదను జాగ్రత్తతోచూచి శిరస్సుమీద అప్పుడప్పుడు చన్నీటిని పోయుచుండాలి. నూకలజావ పెట్టాలి. రామాయిల్‌ను వాసన చూపించుచు పశురక్షామృతమునువాడాలి.

చికిత్స

కర్పూరతైలము శరీరభాగములకు రాయాలి.

లోపలికి శొంఠి–2 తు, నిమ్మఉప్పు–అరతులము, వేడినీరు అర్ధసేరు కలిపి దినమునకొకసారివంతున వారము దినములు త్రాగించాలి.

లేక నీరుల్లిపాయల రసము పావుసేరు త్రాగించాలి.

లేక ముసాంబ్రము 1 తు, ఇంగువ 1 తు, నీరు అర్ధసేరు కలిపి త్రాగించాలి.

ఇరువదిఒకటవ భాగము

శిరోరోగాలు

పిచ్చి

ఈ వ్యాధి పాలిచ్చు ప్రతిజంతువునకు రావచ్చును. ఇది సహజముగా జంతువులకు మనుష్యులకుగూడ అకస్మాత్తుగా కలుగుతుంది. ఈ వెఱ్ఱికి కారణభూతమైన దేదియో ఇంకను కనుగొనబడలేదు. కాని అదియొక జీవపదార్థమనుటకు సందియములేదు. ఈ వ్యాధిగల జంతువు దేహమందు విషమను పదార్థము నరములుగల భాగముండును ఉమ్మిని కూర్చునట్టి గవదలవంటి కొన్ని భాగములందును ఉంటుంది. గవదలనుండి విషము ఉమ్మి మూలముగ వెలుపలికి వస్తుంది, గాన వెఱ్ఱిపట్టిన జంతువులు కఱచుట వలన ఆ వ్యాధి తదితరపశువులకు మనుష్యులకు సోకుతుంది. అయినను వెఱ్ఱిపట్టిన జంతువుయొక్క విషము కాటు ఏర్పడిన చర్మమునకు తగిలిననేకాని, అది సోకుడును కలుగజేయనేరదు. అట్టికాటు సామాన్యముగా ఆ వెఱ్ఱిజంతువుయొక్క పండ్లచే ఏర్పడుతుంది. కాని మంగలికత్తిగాయములును, దోమకాట్లు మున్నగు చిన్నగాయములను ఆ పశువు నాకిన యెడల ఈ వ్యాధి కలుగుతుంది. ఈ వ్యాధి తగిలిన పశువునకు మూడు లేక అయిదుదినముల వరకు రోగచిహ్నము లగుపడవు. ఇదియును గాక తనంతట తాను వ్యాధికలిగిన జంతువులకు సాధారణముగ వ్యాధి ప్రారంభించినది మొదలు కొన్ని దినములలోనే మరణమును కలుగజేస్తుంది. విషము వెన్నెముకకు, మెదడునకు చేరువరకు ఈ వ్యాధి బయల్పడదు. ఈతావున చేరుటకై ఆ విషము నరములగుండా వ్యాపించుతుంది. కాబట్టి కాటుమెదడునకు ఎంత సమీపమునందుండునో అంత త్వరగా విషము మెదడునకెక్కి రోగలక్షణములు కన్పించుతాయి. ఈ వ్యాధి కొన్నిటికి ఆరుమాసముల వరకుండును. కుక్కలకు పిచ్చి ఎత్తి తదితర జంతువులను కఱచుటవలన ఎక్కువగా ఈ వ్యాధి రాగలదు. ఇట్టి కుక్కలను వెంటనే చంపాలి.

లక్షణాలు

జంతువు మొదట వ్యాకులతతో నుండి మూతి విరచుచుండును. మనుష్యుల యొద్దకుగాని, తదితర పశువులయొద్దకుగాని చేరుట కిష్టముండదు. గృహోపకరణముల క్రిందగాని, నిశ్శబ్దమైన స్థలములందుగాని దాగియుండును. రోగము ముదిరినకొలది కోపోద్రేకము కలిగి చిరాకుగా నుండును. కంటికికనబడినదానినెల్ల కఱవబోవును. ఈగలను పట్టుకొనుటకు ప్రయత్నించుదానివలె అరచుచు తిరుగులాడుచుండును. ఒక విధమైన చొంగ నోటినుండి కారుతుంది. ఆ చొంగ జిగటగాను, నురుగు నురుగు గానుఉండును. ఆ చొంగ పశువుల పెదవులనుండి తీగవలె వ్రేలాడుతుంది. కండ్లు ఎఱ్ఱగానుండి ఆ జంతువునోరు కొంచెము తెరచుకొని సరిగా ముందునకు పరుగెత్తుచు మార్గమున దానికి కనబడు ప్రతిదానిని పొడుచుచు కఱచుచు పోవుచుండును. ఆకలి మందగించును. దానికి దొరకునట్టి యేవస్తువునైనను తినబోవును. అది అరచునపుడు

దానిఅరపు ఒక విధమైన లోహపు ధ్వనిగలకూతగా మారిపోవునట్లు కనుగొనవచ్చును. ఇట్టి స్థితిలో మరణము సంభవించును. పక్షవాతము కలుగును. ఆహారము తినదు. క్రిందిదవడలు సన్నముగా నుండును, మ్రింగునపుడు విశేషముగా కష్టపడునట్లు విశదమగును. చిట్టచివరకు కాళ్లు చచ్చుపడి విరేచనములై శుష్కించి చనిపోవును. కొంతకాలము కదలకుండ పడియుండిన తరువాత కొన్ని పశువులకు మరణము సంభవించును.

చచ్చిన తరువాత కనబడు లక్షణాలు

ఈ వ్యాధిగల పశువుకడుపు కోసి చూచినయెడల మట్టి, రాళ్ళు, పుల్లలు, గడ్డి, చింపిరిబట్టలు మున్నగు వస్తువులతో నిండియుండును. క్రిందిదవడ వ్రేలాడును. చిక్కనిద్రవము కారుచుండును.

చికిత్స

మగపశువునకు పిచ్చియెత్తిన ఆడపశువు మూత్రమును, ఆడ పశువునకు పిచ్చియెత్తిన మగపశువు మూత్రమును పూటకు అర్ధసేరు త్రాగించాలి.

లేక ఈ వ్యాధిగల పశువు గాయముమీద గరిటెతోగాని, ఇనుప కడ్డీతో గాని కాల్చవలెను. లేక ఫార్మసివారి విషఘ్నిని వాడాలి.

చనుకుదురు

దీనినే పొదుగువాపు, పాలసేర్లు – చనుకుదురు అంటారు. ఇది పాడిపశువులకే సోకును. చలిగాలిలో ఎల్లప్పుడు నుంచుటచేతను, పాలు పితుకునపుడు చేతికి పదునైన గోరులుండి అవి గ్రుచ్చుకొనుటచేతను, దూడ పాలు త్రాగునపుడు కరచుటచేత గలిగెడి గాయములచేతను, లేక పాలద్వారమువలనను, ఏచన్నులో ప్రవేశించునో ఆ ప్రక్కనంతటను కలుగుతుంది. కొన్ని జంతువులకు పాలునిలువకట్టుట వలనకూడ ఈ వ్యాధి రావచ్చును. ఈనిన జంతువుల పొదుగునుండి పాలు తీయనియెడల ఈ వ్యాధి తటస్థించుతుంది. అందు ముఖ్యముగా క్షయరోగమువలన తగులును. ఈపాలసేర్లు దృష్టి దోషమువలనకూడ కలుగునని ఒక నమ్మకముగలదు. ఇంకను కొందరు బేరగాండ్రు వేళకు పాలు పిండక పాలు నిలవరము చేయుటచేతగూడ ఈ వ్యాధి రావచ్చును. ఇట్లు పాలు నిలవర ముంచుట వలన పొదుగు బాగుగానున్నదని తదితరులు ఎక్కువ ధరకు కొందురను యుద్దేశ్యముతో పాలు పిండరు.

లక్షణాలు

జంతువునకు తీవ్రముగా వ్యాధి తగిలినయెడల శరీరమునకు ఎక్కువ జ్వరముకలిగి మేత నెమరు మానుతుంది. పొదుగు నాలుగు భాగములుగా వుంటుంది. ఒక్కొక్క భాగమునకు ఒక్కొక్క చన్ను ఉంటుంది. చన్నులలో ఒకదానికిగాని రెంటికిగాని ఈ వ్యాధి రావచ్చును. పొదుగు ఎఱ్ఱగా కందియుండును. వాచిన చన్ను గట్టిగా నుండి, పాలువచ్చుట కష్టముగానుండును. క్రమముగా పాలు తగ్గును. పాలు పితుకునప్పుడు

మొదట కొంచెము పసుపువర్ణముగానుండి తరువాత రక్తపుజీరకలిగియుండును. ఇంకను రోగము హెచ్చినకొలది పాలు చీముగా మారవచ్చును. ఈ స్థితిలో పొదుగు క్రుళ్ళి కురుపు ఏర్పడినదని తెలుసుకోవాలి. ఈ స్థితిలో పొదుగుయొక్క వేడిమి తగ్గి చల్లగానుండి ఆకుపచ్చ రంగుగా వుంటుంది. ఇంకను ఈ వ్యాధి ముదిరినకొలది పశువు క్షీణించిచనిపోతుంది.

కొన్ని పశువులలో ఈ వ్యాధి అతితీవ్రముగా నుండక పశువు మేత మేయుచు ఆరోగ్యముగానే యుండినట్లుండును. కాని పొదుగు మాత్రము కొంచెము గట్టిగానుండి మామూలుకన్న కొంచెము పాలు తగ్గుచుండును. కొన్ని దినములకు తిరిగి మనవారు చేయు ఏవైద్యము వల్లనైనను మామూలు స్థితికి వచ్చుటయు గలదు. ఈ వ్యాధి దీర్ఘముగా నున్న యెడల పొదుగంతయు చెడిపోయి ఒకటి రెండు లేక నాలుగు చన్నుల నుండియు పాలురాక ఒకవిధమైన పసుపుపచ్చగా పేరిన ఉండవలె నుండు పదార్థము రావచ్చును. కొద్దికాలమున ఆ చన్నుల వెంబడి ద్రవము కారును. పొదుగు ఎండిపోయి గట్టిగానుండును.

చికిత్స

జ్వరము తీవ్రముగానుండి పేడవేయనిచో ఉప్పు చేరెడు, ముసాంబ్రము 2తు, వేడినీరు అర్ధసేరు కలిపి త్రాగించాలి.

పశువు మేత మేయక నీరసముగానున్ననో సారాయి 10 తు, మిరియాలపొడి ఒకటిన్నర తు, నూకలజావ అర్ధసేరు కలిపి త్రాగించాలి.

లేక చవుడు 2 తు, సున్నము 1 తు, కలిపి పశువు ఆసనముక్రింద మూడుగీతలుగా పెట్టాలి. లేక ఫార్మసీవారి క్షీరోజన్, వెటరినరీ ప్లాస్టర్‌ను వాడాలి.

హెచ్చరిక

ఈ రోగము తగిలిన పశువును, దూరముగానుండు ప్రత్యేకస్థలములందుంచాలి. పొదుగునకు దెబ్బలు తగులకుండ కాపాడాలి. రోగము తగిలిన పాడిపశువుల పాలు పితికి వెంటనే ముందుద్రావకములతో చేతులను శుభ్రముగ కడుగుకొనాలి. అట్లుచేయక ఆ చేతులతోనే ఆరోగ్యము గానుండు పశువుల పాలు పితికిన యెడల వానికి నిష్కారణముగ ఈ వ్యాధి సంభవిస్తుంది. ఈ విషయమునందెన్నడును ఏమఱి యుండగూడదు.

నీటిని ఆవిరి వచ్చువరకు మఱుగ కాగనిచ్చి ఒక కంబళిగుడ్డ అందు ముంచి నీరుపోవునట్లుగా పిండి ఆగుడ్డతో పొదుగునకును, చన్నులకును, ఒక అరగంటసేపు కాపుతీయాలి. పాలురాక చన్నులు గట్టిపడినపుడు పాలగొట్టము పెట్టి చన్నులలోనుండు మలిన పదార్థములను తీయవచ్చును. పొదుగు చీముపట్టినయెడల మందు వేయవలసియుండును. ఇట్టి ప్రమాదకరమగు వ్యాధులు వచ్చినప్పుడు పశువులను అనుభవంగల వైద్యులకు చూపించుట మంచిది. సూదివేసి పాలుతీస్తారు.

ముఖ్యముగా పుండ్లను కాకులు పొడువగూడదు. పుండ్లమీద ఈగలను ముసరనీయరాదు. ఆ పశువును నాకనీయరాదు. ఇట్లు జరుగుచో పుండ్లు శీఘ్రముగా మానిపోవును.

కొమ్ముడొల్లలు

పశువులకు జీర్ణశక్తి తగ్గుటచేత ఆహారము సరిగా పెట్టకపోవుట చేత శిరోవాతము వలన ఈ వ్యాధి ఉత్పత్తియగుతుంది. రక్తము క్షీణించుటవలన విషసంబంధమైన గాలిని పీల్చుటవలన పశువుయొక్క మెదడు కరిగిపోయి ముక్కులగుండ చిక్కని ద్రవముగాని చీమిడివంటి పదార్థము గాని కారుచుండును. కొమ్ము కొట్టిచూచినచో ఓటిమ్రోత మోగుతుంది. ఈ వ్యాధి పుట్టిన వారముదినములకే పశువు క్షీణించుచుండును. వ్యాధి ముదిరినయెడల కొమ్ముమాదగగాని, పార్శ్వపు మాదగగాని పరిణమించును. కొమ్ములయందు రక్తమేమాత్రముండదు. రాతితడిసున్నము తెచ్చి కొమ్ములమొదళ్ళచుట్టు రాచి ఒక దినముంచినయెడల ముక్కులనుండి కారు ద్రవములో రక్తజీరకనబడును. ఈ రక్తపుజీర యున్నయెడల కొమ్ముడొల్లలని గ్రహించాలి. ఈ వ్యాధిగల పశువును నీళ్ళు త్రాగించునపుడు మూతిని సగమువరకు నీటిలోముంచి గుటకులు వేస్తుంది.

చికిత్స

ఈ వ్యాధికి అనేకమంది అనేకరకములుగా చికిత్స చేస్తారు. శొంఠి 2 తు, ఆవుపాలు అర్ధసేరు వంతున దినమునకొకసారి చింతగింజంత వసగంధము దానిలో కలిపి త్రాగించాలి.

లేక కారుఇంగువ ఒకటిన్నర తు, వస అర తు, మూర్కొండాకు పసరు 3 తు, చెవులలో పోసి, చెవులు కొమ్ములకు కట్టవలెను. మంటగానుండునుగాన పావుగంటవరకు కట్టతీసివేయాలి.

లేక దిరిసెనాకు పసరుఆవుపాలతో త్రొక్కి రసముతీసి అందులో వసగంధము చింతగింజంతజేర్చి చెవిలో పోయాలి.

లేక వస 2 తు, రసకర్పూరము 2 తు, మంచిగంధము 4 తు, పొగాకు 6 తు, పావుసేరు సున్నపుతేటలో కలిపి చెవిలో పోయాలి.

లేక మిరియాలు 1 తు, చేదుజీలకర్ర 1 తు, ఆవాలు 2 తు, వెల్లుల్లిపాయలు 2 తు, కలిపినూరి చెవిలో పిండవలెను.

లేక పొగాకురసముతో నీరుసున్నము కలిపిగాని లేక అరతులము పాదరసముగాని, పశువుకొమ్ములకు బెజ్జములువేసి బెజ్జములయందు పైమందువేసి గుడ్డపీలికలు పెట్టవలెను. తరువాత నీలిరంగు గుడ్డ కాల్చినపొగ ముక్కులకు పట్టించవలెను.

లేక ఫార్మసీవారి వాతారిపొడిని వాడాలి. బలముగల ఆహారమియ్యాలి.

ఎండదెబ్బ

ఇది పశువు మెదడునందు గలిగెడు అస్వస్థతవలన కలుగుతుంది. బహుతీక్ష్ణమైన ఎండలో పని చేయించుట వలనగాని, అఱ్ఱువాపుగల పశువులను ఎండలో పనిచేయించుట వలనగాని, పొలములో నుండు చెట్లనీడదగ్గరనుండు పశువులకు వడగాడ్పులు వలనగాని ఈ వ్యాధి కలుగుతుంది.

లక్షణాలు

ఆరంభములో తీవ్రమైనజ్వర ముంటుంది. కన్నులు ఎర్రగానుండి దేహముమీద చెమట పట్టుతుంది. పశువు పలుమారు బుసపెట్టుచు మూతి తడిలేక ఎండిపోయి ఆకలి మందగించుతుంది. తలను అటునిటు ఊపును. ఈ వ్యాధి ముదిరినకొలది నిస్త్రాణజెంది శరీరము చల్లబడుతుంది. మూత్రము ఎక్కువగా విడుచుచుండును. ముఖము పాలిపోయి ఊపిరి ఆయాసముగా విడుస్తుంది. కనుగ్రుడ్లు లోతునకుపోయి క్రమముగా స్మారకముతప్పి నాలుక జారవిడిచి చనిపోతుంది.

చికిత్స

మాటిమాటికి పశువులమీద చన్నీళ్ళు పోయుచుండాలి.

నీరుల్లిపాయల రసము 2 సేర్లు దేహమునకు తలకు రుద్దాలి.

తరువాత నూనెలో చనుబాలు పోసి రంగరించి చెవులలో పోయాలి.


లేక సాన్‌టాల్‌నుగాని పశురక్షామృతమునుగాని వాడాలి.

హెచ్చరిక

రైతులలో చాలమంది బండియెద్దులను వడగాడ్పులలో బండ్లు గట్టి తోలుదురు. ప్రతిరైతు సాయంకాలము నాలుగుగంటలకు ఒక బిందెడు చన్నీళ్ళు పశువు మెదడుమీద పోసినయెడల ఆరోగము పోవును. నూకలజావ పెట్టవలెను.

కుందేటి వెట్టి

దీనినే తిక్క తెవులు, రిమ్మ అందురు. ఇదియును నాడికా సంబంధమైన వ్యాధియైయుంది. నరములకు సంబంధించిన కొన్ని దుర్గుణములు ముందు ప్రారంభమవుతాయి. ఈ వ్యాధి ఎల్లప్పుడు విసుగు విరామములేక



పని చేయుచుండుట వలన సోమరితనముగా నుండుటవలన కపాల సంబంధమగు నరములశాఖ అస్వస్థత నొందుటవలన రాగలదు.

లక్షణాలు

ఈ వ్యాధి మంచి బలముగల పశువునకు వస్తుంది. పశువుతలలో నేదోయొక భాగము మేకు గ్రుచ్చుకొనునట్లుండును జ్వరము సమశీతోష్ణముగా నుంటుంది. పశువు దవడలకు చాలాబాధగా వుంటుంది. నాలుక జారవిడుచుచు ముడుచుకొంటుంది. తన తలను కొట్టపుగోడలకుగాని, తదితర వస్తువులకుగాని ఆనించి త్రోస్తుంది. వెఱ్ఱిచూపులు చూచుచు పైకెగురుతుంది. ఈ వ్యాధిముదిరినకొలది పశువు గిరగిర తిరుగుచూ నేలమీదపడుచు లేచుచుండును. ఈ విధముగా ప్రతి అరగంటకు వస్తుంది. మనుష్యులను కరవపోతుంది. కొమ్ములతో పొడుచుచు బజారులవెంట పరుగిడుతుంది. ఆయాసముచే చొంగవేయుచు క్రింద పండుకొనుచు కాళ్లునిగడదన్నుచు నడువలేదు. క్రమేణ నీరసము జెంది పశువు చనిపోతుంది. కండ్లు ఎరుపుగానుండి వ్యాధిముదిరినకొలది వెర్రి చూపులు చూచుచు స్మాకరముతప్పి ప్రమాదమునకు వస్తుంది.

చికిత్స

కరిధూపము – చేరెడు, శొంఠి – నవటాకు, మిరియాలు 2 తు, పిప్పళ్ళు 1 తు కలిపి కషాయముకాచి దానిలో బీరాకుపసరు – తవ్వెడు, నెయ్యి–తవ్వెడు కలిపి త్రాగించవచవలెను.

లేక పశువు కొమ్ములకు నూనెగుడ్డలుచుట్టి వెలిగించవలెను. ఈ వేడిచే రోగముఆగును. లేక జనపనారకొన కొమ్ములకుచుట్టి బిగించవలెను. ఇట్లు ఒక గంటసేపుంచి ఊడదీయవలెను. కొన్నిటికి తగ్గినట్లేతగ్గుచు మరల వెంటనేవస్తుంది.

పశువు కొమ్ములచుట్టు చుక్కలు పెట్టవలెను. ముచ్చిలిగుంటలో ఒక చుక్క పెట్టవలెను. మూతిమీద మూడు అడ్డగీతలుగీయాలి. వెలుతురు ఎండ తగలకుండ కండ్లకు పసుపుకలిపినగుడ్డను మూతగా వేయాలి. ఫార్మసీవారి పశురక్షామృతం రామాయిల్‌ను వాడాలి.

హెచ్చరిక

ఈ వ్యాధిగల పశువును చాలా జాగ్రత్తగా కాపాడాలి. బండిమోకులుగాని, చొప్ప తాళ్ళుగాని, దుక్కిమోకులుగాని తెచ్చి ఆ పశువు మెడకువేసి చెట్టుకుగాని బండికిగాని కట్టాలి. లేనియెడల పశువునకు ఉద్రేకము వచ్చినప్పుడు నిలువక గోడలకుగాని చెట్లకుగాని తనతలను వేసికొట్టుకొంటుంది. అప్పుడు పశువునకు ప్రాణాపాయము రాగలదు. ఈ పశువులు చికిత్సకు లొంగుట చాల కష్టము.

మూర్ఛ

ఇది మెదడు సంబంధమగు రోగమైయున్నది. ఇది పనిచేయించక సోమరిగానుండు పశువులకు వాతరోగమువలనకూడ కలుగుతుంది. ఈ వ్యాధిగల పశువును ఎక్కువగా కష్టపెట్టరాదు. దీనినే మూర్ఛ హిస్టీరియా అందురు.

లక్షణాలు

ఆరంభములో శరీరముపైని చెమటలుపట్టి వణకుతుంది. శరీరము కృశించును. కన్నులు అటునిటు త్రిప్పును. నోటినుండి నురుగు వచ్చుచుండును. దవడలు బిగిసికొనిపోవును. ఈ వ్యాధి వచ్చుటకు పూర్వము మేత తినదు. ఉచ్ఛ్వాస నిశ్శ్వాసము లెక్కువగును. అప్పుడప్పుడు పశువు అరుచును. ఈ విధముగా ఒక గంట లేక రెండు గంటలుండి తగ్గుతుంది. లేక వ్యాధి ముదిరినయెడల ఒకపూటవరకుండి తగ్గుతుంది. దినమునకు ఆరు లేక పది పర్యాయములు ఉద్రేకమునుబట్టి వస్తుంది.

చికిత్స

ఈ వ్యాధి రాగానే చన్నీళ్ళు ఒక బిందెడు తలమీద పోయాలి. లేక స్మెల్లింగుసాల్టు వాసన చూపించాలి. ఒక తులము ఇంగువ, అర్ధసేరు వేడినీటితో కలిపి వ్యాధి రాకమునుపే త్రాగించాలి.

ఈ వ్యాధి ఆరంభించిన వెంటనే గంజాయిపత్రి 1 తు, నూకలగంజి అర్ధసేరు, ఇంగువ 1 తు, కలిపి త్రాగించవలెను.

లేక 6 నిమ్మకాయలరసము త్రాగించాలి.

లేక ఫార్మసీవారి రామాయిల్ వాతారి అరకును వాడాలి.

లేక రావిచెక్కరసము – అర్ధసేరు, ఆవుపాలు – అర్ధసేరు కలిపి వారము దినములు త్రాగించుము.

నాలుకసేర్లు

ఈ వ్యాధి కూడ పాడిపశులకు తరుచుగా వస్తుంది. నాలుకకు దెబ్బ తగులుటచేత ముండ్లగడ్డి తినుటచేత నాలుక కోసికొని పోవుటచేత పొదుగునకు జబ్బుచేయుటచేత పొదుగు తగ్గి పాలు తక్కువ నిచ్చుటచేత ఎల్లప్పుడు తవుడు జనపకట్టలు ఎక్కువగా మేపుటచేత, చలిగాలి సోకుట చేత, గొప్పవర్షములకు తడియుటచేత ఈ వ్యాధి కలుగుతుంది. ఈ వ్యాధికి కూడ అనేక చికిత్సలు చేయుదురుగాని వెంటనే తగ్గదు.

లక్షణాలు

ఆరంభములో జ్వరముంటుంది. వెనుకకాళ్ళు కొన్ని పశువులు పట్టివేస్తాయి. పొదుగును ఒత్తినయెడల తన్నుతుంది. పాలు తక్కువగా ఇస్తుంది. అప్పుడప్పుడు నోటివెంట చొంగ పడుతుంది. వ్యాధి ముదిరిన కొలది పశువు మేత తినజాలదు. దాహమెక్కువగుతుంది. ఆహార నాళము కూడ నొప్పిగా నుండవచ్చును. దెబ్బ తగిలినభాగము ఎఱ్ఱగా కందియుండవచ్చును. వ్యాధి ముదిరినకొలది పాలెండిపోయి పశువు క్షీణించి మరొక వ్యాధికిలోనై పశువు మరణించును. నాలుక లావై మొద్దుబారి యుండును. దాని నటునిటు కదల్చలేదు. నాలుక ఎక్కువగా వాచినయెడల వ్యాధి కుదురుట కష్టము. ఈ వ్యాధి తగిలిన పశువునకు తవుడు, చిట్టు జనపకట్టలు వేయరాదు. తదితర దాణా దినుసులు వాతముచేయునవి పెట్టరాదు.

చికిత్స

పశువు నాలుకయెత్తి పరీక్షించినయెడల నాలుక క్రిందిభాగమున రెండు నెత్తురు నరములు పైకి తేలి నలుపురంగుగా వుంటాయి. వానిలో చెడునెత్తురుంటుంది. ఆనెత్తురుండుటచే సరిగా పశువు పాలీయదు. కాబట్టి పశువును పడగొట్టి నాలుక క్రిందనుండు చెడు రక్తనాళములను సూదితో గ్రుచ్చివేయగనే నలుపు రంగుగల నెత్తురు కారును. ఆ నెత్తురు కారిన తరువాత పటికపొడి అద్దాలి.

లేక తిప్పతీగె 4 తు, పిప్పళ్లు 2 తు, వేపచెక్క 4 తు, కటక రోహిణి 2 తు, రెండుసేర్ల నీటిలోవేసి కాచి అప్పుడప్పుడు పుక్కిలింపు చేయుచుండాలి.

ఈ వ్యాధికి కూడ అప్పుడప్పుడు ఈ దిగువ మందు లీయాలి.

చేదుజీలకఱ్ఱ 2 తు, మిరపకాయలపొడి 6 తు, వేడినీరు అర్ధశేరు కలిపి త్రాగించాలి. ఫార్మసివారి క్షీరోజన్‌ను వాడాలి.

ఆర్లు పెరుగుట

పశువు గొంతుకద్వారము మొదలు దవడలవరకు ఒక విధమైన మెత్తని ముండ్లుంటాయి. వీటినే అంగిటి ముండ్లందురు. అంగిటిలో ఒక విధమైన పొరయుండును. జీర్ణకోశము తగినంత పనిచేయక గాని, జలుబు వలనగాని, లేక ఆపొరలు ఏకారణము చేతనైన విస్తరిల్లుట వలనగాని ఒకవిధమైన ముండ్లేర్పడును. ఈముండ్లు తెలుపురంగుగను, మరికొన్ని నలుపురంగుగను ఉండి నిక్కబొడుచుకొని సూదులవలె నుండును. ఈ ముండ్లకు సరియైన చికిత్స చేయనిచో, పశువుయొక్క గొంతుభాగము వాచి ఎక్కువచేయును.

లక్షణాలు

పశువు మేతమేయునపుడు చాల భాధపడుతుంది. మేత నెమరు కూడ మానుతుంది. నాలుక లావుబారియుంటుంది. మేత తినలేక అప్పుడప్పుడు కక్కుతుంది. ఒకవిధమైన జిగురు నోటినుండి వెలువడుతుంది. పశువుమూతి విరుస్తుంది. వ్యాధి ముదిరినకొలది పశువు విచారముగా నీరసముగా వుంటుంది.

చికిత్స

అంగిటిలో నున్న ముండ్లను కత్తెరతో కత్తిరించాలి. సామాన్యమైన కత్తెరలుపనికిరావు. పశుచికిత్సాలయములో నుండు కత్తెరలు చాల మంచివి. కత్తిరించుటకు పూర్వము పటికపొడి ఆ ముండ్లకు రాచి కత్తిరించాలి. నెత్తురు కారినను భయపడ నవసరములేదు. కత్తిరించునపుడు చాలా జాగ్రత్తగా కత్తిరించాలి. తెలిసి తెలియని వైద్యులు కత్తిరించిన యెడల నాలుకగాని, దవడల భాగపు మాంసముగాని

తెగిపోవును. కాబట్టి చాల జాగ్రత్తగా కత్తరించాలి. ఎక్కువ పొడుగునా పెరిగిన ముండ్లుగాని, మొద్దుబారియుండు ముండ్లుగాని కత్తిరించాలి. చిన్నవి కత్తిరించక పోయినను నష్టములేదు. కత్తిరించిన ముండ్లను లోపలికి ప్రింగనీయరాదు.

మన స్వదేశీయ వైద్యులు వడ్లుదంపి చేటలోవేసి చెరగకుండ కొంచెము ఉప్పు కలిపి రెండు మూడు పూటలు ఆ ముండ్లమీద వేసి తోముదురు. కాని కత్తిరించినంత దృఢముగా ఈ చికిత్సకు లొంగవు.

నోటిపూత

పశువునకు జలుబు వలనగాని, అతి వేడివలనగాని, జ్వరమువలనగాని, ఒక విధమైన పురుగువలన గాని, పాదరసము మొదలగు విషపదార్థములు పశువులు ప్రింగుటవలనగాని ఈ వ్యాధి రావచ్చును.

లక్షణాలు

అప్పుడప్పుడు జ్వరముండును. నోటిలోపల నాలుకమీదను చిన్న చిన్న పొక్కులు బయలుదేరును. ఈ పొక్కులు ముదిరినకొలది పుండ్లగును. ఈపుండ్లు పగిలి నోరంతయు వ్యాపింపవచ్చును. పశువు చొంగ కార్చుతుంది. నాలుక నొప్పిగా ఎరుపురంగుగా వుంటుంది. ఈ వ్యాధి ఎక్కువగా దూడలకు కలుగుతుంది.

చికిత్స

నోటిపూత సామాన్యముగా నున్నను, నోటియందంతటను పెద్ద పెద్ద పుండ్లుపడినను వెలిగారముగాని, లేక మాచికాయ పొడినిగాని కవిరి పొడిగాని, తేనెలోకలిపి నోటికి పూయాలి.

పురుగు సంబంధమైన నోటిపూత యైనయెడల వెలిగారము తేనెతో కలిపి లేహ్యముగా నుండునట్లు నోటికి పూయాలి.

పాదరస సంబంధమైన నోటిపూత విస్తారముగా పాదరసము మున్నగు విషసంబంధమగు పదార్థముల మూలమున కలుగును. దీనిని తుమ్మచెక్క కషాయముతో కడగాలి.

లేక వగరుగానుండు తుమ్మచెక్క, రావిచెక్క, తంగేడుచెక్క, మున్నగుచెక్కలతో కాచిననీటితోగాని, పటిక, మైలుతుత్తం మున్నగునవి పొడిజేసి వేడినీటిలో కలిపిగాని కడగాలి.

హెచ్చరిక

ఈ వ్యాధిలో ముఖ్యముగా ఆహారవిషయములో కడు జాగ్రత్త తీసికొనాలి. బార్లిధాన్యము దొరకనియెడల నూకలజావతో కోడిగ్రుడ్లరసము కలిపి పెట్టాలి.

* * *

ఇరువది రెండవ భాగము

మూత్రరోగాలు

పశువు తినే ఆహారము, త్రాగిననీరు కలిసి జీర్ణకోశములోనికి పోయిన తరువాత ఆ రెండుపదార్థములు పచనమై, కార్జమునందుకూడ పక్వమై మూత్రపిండములచే వడకట్టబడును. ఆ రీతిగా వడకట్టబడిన తరువాత మిగిలిన ద్రవపదార్థము మూత్రకోశములో పడుతుంది. దీనినే మూత్రమందురు. ఆ రీతిగా తిన్న పదార్థాలు పలుచనై కార్జమందు ప్రవేశించునపుడు ఆ కార్జములో మిగిలిన ద్రవము రక్తనాళములో ప్రవేశించి చెమట రూపముతో చెమటరంధ్రములనుండి బైటికిపోతుంది. చెమట బైటికి పోవునపుడు మూత్రమధికంగా వుంటుంది.

శిలామేహం ఎందుకు వస్తుంది?

పశువు మలకోశంలోను, మూత్రకోశంలోను సహజంగా వేడి పుట్టుతుంది. మలము గట్టిపడిపోతుంది. మూత్రకోశం వేడియెక్కి మూత్రం కొంత ఆవిరిగా యెగిరిపోతుంది. అందులోవుండే లవణాలుమాత్రం చివరకు మిగులుతాయి. తరువాత మూత్రపిండాలనుంచి మూత్రకోశములోనికి రావలసిన మూత్రానికి ఆటంకము కలుగుతుంది. సకాలంలో పశువు మూత్రంపోయకుండా నిలవయుంచిన మలమూత్రాదులు తరువాత రమ్మంటే సరిగా రాజాలవు. మలమూత్రాదులలో కొంతభాగం వాయురూపాన్ని పొంది రక్తములో చేరిపోతుంది. అంతట అది పశువు దేహమంతటా వ్యాపిస్తుంది. ఈరీతిగా మూత్రము వాయురూపాన్ని పొందేటప్పటికి అందులో వుండే లవణాలు, రేణువులుగానై మిగిలిన మూత్రము వెంట బయటకుపోతాయి. ఒకప్పుడు పోకుండా నుండవచ్చు. ఈ రేణువులు ఒకదానితో నొకటి కలసికొని ఎర్రబడుతుంది. ఈ రేణువులు లావుగావుంటే శిలామేహమంటారు.

పశువు దేహములో రోగపదార్థము ఎక్కువగావుంటే ఈ వ్యాధి వస్తుంది. ఈ రేణువులు తగినంత పెద్దవైనతోడనే మూత్రనాళములగుండా పోవునపుడు వాటియొక్క ఆవరణపుగోడలకు వరిపిడిగలిగిస్తూ, బాధతో గూడి ఈ శిలామేహరోగముగా నగుతున్నది. అదివరకే జీర్ణావయవాలలో జీర్ణకోశములో మాలిన్యము జేరియుండి మూతి యిరుకుగానున్న మూత్రకోశంలో నుండే శిలలు, మూత్రము వెంట బయటికిపోక అక్కడే ఉండి క్రమక్రమముగా పెద్దవై పశువును బాధపెడతాయి.

జంతువుల మూత్రలక్షణాలు

పశువుల మూత్రానికి మనుష్యుల మూత్రానికి చాలా వ్యత్యాసముంది. ఆవుమూత్రము నూనెరంగుగలిగి పలుచగను గేదె మూత్రము తెలుపు, పసుపురంగు కలిగి చిక్కగ, క్షారముగ మేకమూత్రము పసుపు రంగుగను కారవువాసనగ, ఒంటె మూత్రము మనుష్యుని మూత్రంతో సమానముగా, గుఱ్ఱము మూత్రము పలుచగను తెలుపుగ అనగా పై భాగము తెలుపుగ అధోభాగము చిక్కగను, గాడిద మూత్రము తెలుపు చిక్కగను ఉంటుంది.

మేతలనుబట్టి మూత్రనిదానము

పశువులు వాసనగల పదార్థాలు తిన్నను, విషపు మొక్కలను తిన్నను, చిరుకల్పగ్రుద్లు, విషపు సాలీళ్లను మేతతోకలసి తిన్నప్పుడు పశువులు త్రాగేనీటిలో విషపదార్థాలనుగాని, తదితరరంగుకలిసిన దాణాలను కలిపి త్రాగించినపుడుగాని మూత్రపురంగు మారుతుంది. రంగు మారుటయేగాక మూత్రవాసన కూడా యుంటుంది.

రక్తమూత్రము

ఈ రోగము, అతివేడివలనగాని, విసుగు విరామములేక పనిచేయించుటవలనగాని, విషసంబంధమగు గోమారులు పశువు శరీరములో ప్రవేశించుటవలనగాని, గలుగవచ్చును. ఈ వ్యాధి విషయములో ముఖ్యముగా రోగనిదానము కనిపెట్టాలి. గోమారులవలన వచ్చినచో చాలా ప్రమాదమని గ్రహించాలి.

లక్షణాలు

ఆరంభములో జ్వరము తీవ్రముగా వుంటుంది. చలికూడ నుండవచ్చును. శరీరము బొడ్డుస్థానము ముడుచుకొంటుంది. ముఖ్యముగా మూత్రము ఆరంభములో తుమ్మచెక్క కషాయపురంగువలె పలుచగా నుండి వ్యాధిముదిరినకొలది రక్తమువలె పోస్తుంది. పశువు మూత్రము ఎక్కువగా పోయుకొలది శుష్మించును. మలబద్ధకముంటుంది. ఆకలి మందగిస్తుంది. దగ్గుకూడాయుంటుంది. నాలుగునుంచి వారము రోజులలో మరణిస్తాయి. అతివేడిజేసి రక్తమూత్రము పోసిన తగిన చికిత్సచేసిన క్రమేపి తగ్గుతుంది.

చికిత్స

ఆరంభములో వ్యాధి లక్షణములు కనుగొని జ్వరము తీవ్రముగా నున్నపుడు సూరేకారము 4 తు, మంచిగంధపుపొడి 6 తు, చల్లటి నీరు సేరుకలిపి ఒక్క పర్యాయమే త్రాగించాలి. పచ్చిగడ్డి తింటే పెట్టాలి.

అప్పుడప్పుడు ఉప్పు 2 తు, పటిక 1 తు కలిపినూరి సేరునీటిలో కలిపి దినమునకు రెండుమూడు మోతాదులు ఇచ్చిన తగ్గును.

తుమ్మచెక్క రంగుగా మూత్రంనుండి తెలుపుగా, జిగటగల కండలుకూడ పడుచూ ఈగలువాలుచున్న యెడల ప్రమాదమని గ్రహించాలి.


ఇట్టి సమయములో మెంతిపిండి 15 తు, దూసరాకుపసరు సేరు, నీలిమందు 1 తు, కలిపి ఒకేమోతాదు ఈయాలి. లేక కావిరాయి అరగదీసి సేరు నీటిలో కలిపి పెట్టాలి. అప్పుడప్పుడు నూకల జావగాని బార్లి జావగాని పెట్టవలెను. వేడిజేసి రక్తమూత్రము నడుచున్నపుడు కొబ్బరి బోండములోనీటిని రెండుసార్లు త్రాగించి, పేరింనెయ్యి 15 తు, పెసర గుగిళ్లు సోలెడు, పంచదార చేరెడు కలిపి పెట్టాలి. వేడినీటిని త్రాగించవలెను.

లేక ఫార్మసీవారి సాన్‌టాల్‌ను, పశురక్షామృతమును వాడవచ్చును.

శిలామేహము


దీనినే శిలామేహవాతము, ఉచ్చబుడ్డకందుట, వాచుట వీర్యము గట్టిపడుట అని పలువిధములుగా చెప్పుదురు.

ఈ వ్యాధి అతివేడివలనను, మలబద్ధకమువలనను, కారిజపుఅస్వస్థవలనను, ఎక్కువగా పని చేయించుటవలనను కలుగును. ఇదిబహుచిత్రమైన వ్యాధి.



లక్షణాలు


జ్వరము బాగుగా ఉంటుంది. పశువుతోకనెత్తుచుండును. పేడవేయవలెనని తిరుగుచుండును. గాని బయటకురాదు అర్ధమేత మేస్తుంది. మరికొన్ని మేయక బాధపడతాయి. మూత్రము రక్తములోనికి జీర్ణించి



కనుగుంటలు విడుస్తుంది. వ్యాధి ముదిరినకొలది దాహమెక్కువగా ఉంటుంది. నీరు త్రాగినకొలది పొట్టయుబ్బుతుంది. మూత్రకోశము ఉబ్బి పేడవచ్చు మార్గమునుకూడ బంధించుతుంది. క్రమేపి పశువు శుష్కించి రక్తము తలకెక్కి చనిపోతుంది. మరికొన్ని పశువులుమూత్రము ఎరుపుగా గాని, పసుపు పచ్చగాగాని చుక్కలుచుక్కలుగా పడుచుండును. ఇట్లు పోయుటవలన కొంత ఆశగలుగునుగాని వారము లేక పక్షము, నెల, దినములవరకు యుండిన ప్రమాదము రాగలదు. లేదా తగ్గవచ్చును. మరికొన్ని మూడు నాలుగు రోజులలోనే చనిపోతాయి. కాబట్టి ఈ వ్యాధి వచ్చిన తరువాత అయిదారు రోజులలో మూత్రము పోయనిచో ఆ పశువునకు వైద్యముచేయుట వృధాయని గ్రహించాలి.

చికిత్స

ఆరంభములో గోరువెచ్చనినీటితో ఎనిమా చేయవలెను. మనిషివలె పశువునకు మూత్రకోశములో కడ్డీఎక్కించి తీయుటకు వీలులేదు. పశువు మూత్రకోశము ఏరీతిగా వంకరగావుంటుంది. రైతులు ఆతురత



పడుచుందురు. మూత్రకోశములో నునుపువంటి చక్కని రాళ్ళుపుట్టుతాయి. ఇవే అడ్డుపడి పశువును బాధించుతాయి. శస్త్రచికిత్స చేసినప్పటికి చాలా పశువులు చనిపోతాయి.

ఆరంభములోనే మూత్రమును జారీచేయు సూరేకారము రేవల్చిన్ని, కొబ్బరినీరు మున్నగునవి అనుభవముమీద వాడవలెను. వారం, పదిరోజులవరకు నీరుడు పోయనపుడు అనవసరముగ డబ్బు ఖర్చుపెట్టి చికిత్స చేయించినను లాభముండదు. ఫార్మసీవారి వాతారి అరఖును ఆవుపాలలోకలిపి ఆరంభములో త్రాగించుట మంచిది.

నాడీయంత్రం

శిలామేహవాతము, తదితర రోగములలో నీరుడు బంధించుటచే నిలువయుండి బాధపడుచున్నపుడు మూత్రపు తిత్తిలోనికి దీనిని దూర్చి నీరుడుతీయుట కుపయోగపడును, గాని దీనివలన కూడ ప్రయోజన–ముండదు.

అతిమూత్రము

పశువును ఎక్కువగా పనిచేయించుట వలనను, న్యూమోనియా వ్యాధి సంభవించుటవలనను, కారిజము సరిగా పనిచేయకపోవుటవలనను, విషపదార్థముల తినుటవలనను, నీటితుంగ మొదలగు గడ్డిదినుసులు తినుటవలన ఈ వ్యాధి కలుగుతుంది. ఇది తరచుగా సంభవించెడి వ్యాధిగాదు. ఇంకను పశువు శరీరములోనుండు చక్కెర పదార్థము లెక్కువగాకలియుటవలన కూడా ఈ వ్యాధి కలుగును. అందుచే దేహములోని జలభాగము లన్నియు పొంగి ప్రవహించుతాయి.

లక్షణాలు

ఈ వ్యాధిచే బాధపడుపశువు మూత్రము హెచ్చుగావదలుతుంది. వ్యాధి ముదిరినకొలది దినమునకు 400 ఔన్సులు వరకుకూడ పోస్తుంది. పశువు శుష్కించుతుంది. ఈ మూత్రముపై ఈగలు విశేషముగా మూగుతాయి. ఈ మూత్రము పడిన భాగము ఎండిపోయి పిమ్మట తెల్లగా ఉంటుంది. ఈ తెలుపురంగునుబట్టియే ఈ రోగనిదానమును గ్రహించాలి. మేత సరిగా మేయదు. పశువుకాళ్ళు వాచును. కండ్లు పొరలు గ్రమ్మును. వేడి సమానముగా నుండదు. వర్షము కురియునపుడు మబ్బుగా నుండునపుడు, నీరు డెక్కువగా పోస్తాయి. ఈ వ్యాధిగల పాడిపశువులు సరిగా ఎదగవు.

చికిత్స

పచ్చి వెల్లుల్లిపాయలు – అర్ధసేరు నవటాకు, కల్లుబెల్లము – అర్ధసేరునవటాకు కలిపిత్రొక్కి పెట్టవలెను. ఇట్లు వారముదినములు పెట్టాలి.

లేక కలబందరసము 4 తు, ఆవుపాలు – అర్ధసేరు కలిపి అప్పుడప్పుడు పెట్టాలి.

లేక పటికపొడి – అరతులము, వేడినీరు అర్ధశేరు కలిపిత్రాగించాలి.

లేక పచ్చితంగేడు చిగుళ్ళ రసము 3తు, దినమున కొకసారి త్రాగించాలి.

లేక పశురక్షామృతమునుగాని, వాతారి పౌడరునుగాని వాడవచ్చును.

హెచ్చరిక

గోధుమ పొట్టునుగాని, కందిపొట్టునుగాని, నువ్వుల పొట్టునుగాని తెలకపిండిగాని, ఉలవ గుగ్గిళ్ళుగాని, నువ్వులు, బెల్లము కలిపి త్రొక్కి గాని పెట్టుచుండాలి. ఈ వ్యాధిగల పశువులకు అప్పుడప్పుడు విశ్రాంతి నిచ్చుచుండాలి. పశువు ఎంత ఆహారము తినినను, ఎంతనీరు త్రాగినను తృప్తికాదు.

వీర్యనష్టము

ఈ వ్యాధి వాతమువలనగాని, మిగుల కాకవలనగాని అజీర్తివలన గాని, మత్తుపదార్థములు పెట్టుటవలనగాని మలబంధమువలనగాని, వేడిపదార్థము పెట్టుటవలనగాని, ఆసనభాగములకు దెబ్బ తగులుటవలనగాని, గనేరియా వ్యాధివలనగాని రావచ్చును.

లక్షణాలు

ఆరంభములో మూత్రము ధారాళముగాపోయుచు చివరకు సున్నపుతేటవంటి మూత్రమును విడుస్తుంది. ఈ వ్యాధి ముదిరినకొలది మలబద్ధకమేర్పడుతుంది. మూత్రమువెంట అప్పుడప్పుడు వీర్యము పడుతుంది. మూత్రకోశముచెడి మూత్రాంగపటుత్వముపోయి వీర్యమెక్కువగా పడుచుండును. అప్పుడప్పుడు వీర్యము చుక్కలు చుక్కలుగా గాని, కుతపలుకుతపలుగా గాని, పడుచుండును. ముల్లు గ్రుచ్చుకొనినట్లుగా మంటను గలిగియుంటుంది. సొమ్మసిల్లుతుంది. కడుపునొప్పి గలిగి దుర్బలత్వమెక్కువై పశువునీరసించి చావునకు సిద్ధమవుతుంది.

చికిత్స

నీరుల్లిపాయలు అరవీసె, ఆవుపాలు సేరు, జిల్లేడు పువ్వులు 6 గుప్పెళ్ళు, నల్లమందు అరతులము కలిపి ఉడకబెట్టి వెలగకాయంత ముద్ద చేసి రెండుపూటల రెండుముద్దలు పెట్టాలి.

లేక జాజికాయ 4 తు, పోకచెక్కలు 2 తు, కలిపి పొడిచేసి తేనెతో కలిపి తగ్గువరకు ప్రతిపూట తినిపించాలి.

లేక అరటిపండు సగముముక్కలో నిలువునవ్రేలితో రంధ్రముచేసి దానిగుండ మఱ్ఱిపాలుపోసి ఒక గంటసేపుంచి పశువునోటిలో పెట్టాలి.

లేక మామిడిపిందెల చూర్ణము 2 తు, వేడినీరు అర్ధసేరు, కలిపి త్రాగించాలి. లేక విబ్రొ, వాతారిపొడిని కలిపివాడాలి.

ఈ వ్యాధిగల పశువుతో పనిచేయించరాదు. విరేచనములకు అప్పుడప్పుడు మందిచ్చుచుండాలి. అజీర్తియున్నచో తగినచికిత్స చేయాలి. సరియైనవేళకు ఆహారము పెట్టాలి.

నీరుచురుకు

పశువుయొక్క ఉచ్చబుడ్డ వాచుటచేతను, దానిలోరాయి ఉండుటచేతను, చిరుకప్పలు కరుచుటచేతను, చలిగాలికిలోనగుట చేతను, మిగుల వేడిజేయుటచేతను, మూత్రము పోయనీయకుండ బండికట్టి సవారిచేయించుట చేతను, అలసటను కలుగజేయు వ్యాధులు కలుగుటచేతను, మూత్రకోశము ముడుచుకొనుటచేతను, అజీర్తి చేతను, మితముదప్పి పనిచేయించుటచేతను ఈ వ్యాధి కలుగుతుంది.

లక్షణాలు

ఈ వ్యాధికి కూడ కడుపునొప్పి వ్యాధిలక్షణాలుంటాయి. మూత్రము బొట్లుబొట్లుగా పడుతుంది. మూత్రము పోయినపుడు చురుకుగా వుండి కడుపు బిగబట్టుతుంది. పశువు వెన్నుయొక్క క్రిందిభాగమునందొక విధమైన నొప్పియుంటుంది. నీరుడు వెంట వెంటనే విడువవలెనను కోరిక యుండునుగాని విడుచునపుడు

బాధపడుతుంది. పండ్లు కొరుకుతుంది. వ్యాధి అభివృద్ధినొందినకొలది పశువు పాలిపోతుంది. రాత్రులయం-దెక్కువగా మూత్రముపిడువ వలెనని యిచ్చయుంటుంది. అజీర్తి కలుగవచ్చును. ఊపిరిపీల్చునపుడు ఆయాసమెక్కువగా వుంటుంది. క్రమేణ పశువు క్షీణించి చనిపోవచ్చు.

చికిత్స

సూరేకారము 2 తు, వేడినీరు అర్ధసేరుకలిపి త్రాగించాలి.

లేక దూసరాకు 2 పిడికెళ్ళు, తాటిబెల్లము – అర్ధసేరు నవటాకు, మంచిబెల్లము అర్ధసేరునవటాకు కలిపి ముద్దలుచేసి పెట్టాలి.

లేక రేవల్చిన్నిరసము గిద్దెడు, మజ్జిగ అర్ధసేరు కలిపి త్రాగించాలి. నీరుల్లిపాయలరసము – పావుసేరు త్రాగించాలి. సాన్‌టాల్ చక్కగా పనిచేస్తుంది.

హెచ్చరిక

పశువులకు చలిగాలి తగులనీయరాదు. నూకలజావ పెట్టాలి. ఈ వ్యాధివిషయమై ఆరంభములోనే తగుచికిత్సచేసినయెడల నెమ్మదించును. పశువు మూత్రకోశములో వ్రేలుపెట్టి చూడవలెను. రాయియున్న యెడల తీసివేయాలి.

* * *

ఇరువది మూడవ భాగము

విషతంత్రము

త్రాచుపాములు

భారతదేశంలో సాలీనా ఒకటిన్నర లక్షలమందికి పైగా పాము కరచినట్లు వార్తలు వస్తుంటాయి. వీరిలో అధికసంఖ్యాకులు విషపు పాము కాటుకి ప్రాణాలను అర్పిస్తుంటారు. పాముకాటుకి సరియైన శక్తివంతమైన ఔషధం ఇంతవరకూ ఎవరూ కనిపెట్టలేదు. సర్పం ఇంతటి ఘోరప్రమాదాన్ని కలిగిస్తున్నప్పటికి దానిని చంపరు సరికదా మనమంతా పూజిస్తాము. ఇండియాలో చాలమంది నాగపూజ చేస్తారు. కొంతమంది పాములను పట్టుకొని, వాటి కోరలను పెరికివేస్తారు. ఈ పని చాల సామర్థ్యముతో కూడుకొన్నది.

ఒక త్రాచుపామును చంపడం అంత సులభమైన పనికాదు. దాని పడగపై తప్ప మిగిలిన శరీరభాగంలో ఎక్కడకొట్టినా అదిచావదు. పడగమీద దెబ్బతీయడం కూడ అంత తేలికైనపనికాదు. అందుచేతనే దానిని చంపడంకంటె పట్టుకోవడమే చాల తేలిక.

త్రాచుపామును పట్టుకోవడం చాలతేలిక. ఐతే ధైర్యం, జాగ్రత్త చాల అవసరం. త్రాచుపామును గురించి కొంత తెలుసుకుంటేనే గాని దానిని పట్టుకోవడం తేలికగాదు. దాని బలాన్ని బలహీనతనుకూడా తెలుసుకోవాలి. త్రాచుపాములు వర్షాకాలంలో అంతగా కనుపించవు. వేసవికాలపు ఎండలలో మాత్రం అవి గాలికి, ఆహారానికి బైటకు విహారానికి వస్తాయి. అప్పుడుమాత్రం ప్రమాదాలు అధికంగా సంభవిస్తాయి.

త్రాచులలో రకాలున్నాయి. నల్లత్రాచు, గోధుమవర్ణపు త్రాచు మొదలైనరకాలు. కృష్ణసర్పాన్నే కాలనాగు అంటారు. అది త్రాచులలోకల్లా అతి ప్రమాదకరమైంది.

త్రాచుల పొడవులలోకూడా భేదాలున్నాయి. ఇండియాలో 18 అడుగుల పొడవుగల త్రాచులుకూడా కనిపిస్తాయి. త్రాచుపాముల పై దవడలలో సాధారణంగా నాలుగు కోరలుంటాయి. వాడియైన కోరలు గుల్లగా ఉంటాయి. వాటిలోనుంచే విషం ప్రవహిస్తుంది.


తనకు ప్రమాదం వచ్చినప్పుడల్లా త్రాచుపాముకూడా దాగుకోడానికే ప్రయత్నిస్తుంది. తన సమాధికి భంగం కలిగినప్పుడే త్రాచు తన ఆత్మరక్షణకు నడుంకడుతుంది. త్రాచుపాము 'ముక్కోపి'. తనకోపాన్ని పగడవిప్పి బుసకొట్టడంద్వారా ప్రదర్శిస్తుంది. పడగ సాధారణంగా నాలుగునుంచి ఆరు అంగుళాల వెడల్పు ఉంటుంది. పడగ విప్పడం, బుసకొట్టడం, ఇవి కాటుకు నాందిగీతాలు. పడగ విప్పుకోగానే పాముతల నేలనుంచి ఒక అడుగువరకు పైకిలేస్తుంది.

త్రాచుపాముకు ఏదైతే బలమైన అంగమో అదే దానికిగల బలహీనతకూడా. అదే పాముపడగ. ఇందులోనే పాముయొక్క చిన్ని మేధస్సు ఉంది. పడగపై ఒక దెబ్బ తగిలితేచాలు; త్రాచు చనిపోతుంది.

త్రాచుపాముకి తనఅశక్తత తెలుసు. అందుచేతనే తనపడగకు ప్రమాదం సంభవించకుండా దానిని రక్షించుకుంటూ ఉంటుంది.

ఇండియాలో చాలమందికి త్రాచుపామును పట్టుకోవడం ఒక జీవనోపాధి. చాలమందికి అదొకవృత్తి. అరచేతిని చూడగానే ప్రశాంతంగా త్రాచుపాము తనతలను వంచుతూండడం చూసిన అమాయక ప్రజలంతా పాములవాడి అరచేతిలో 'డేగ' బొమ్మ ఉందని నమ్ముతారు.

కాని, అసలుకారణం అదికాదు. త్రాచుపాము పట్టుకోవడం ఒక ప్రత్యేకమైనకళ, ధైర్యము, జాగరూకత తప్ప, మరే ప్రత్యేకశక్తి ఇందుకు అవసరంలేదు.



త్రాచుపామును పట్టుకోవడం కొంతమందికి సరదా. మైసూరు రైల్వేలో పనిచేస్తున్న ఒక ఆసామికి ఈసరదావుంది. మైసూరులో ఎవరికైనా ఏ ఇంట్లోనైనా త్రాచు కనిపిస్తే, వెంటనే అతనికి కబురు చేస్తారు. అతను అనుసరించే విధానము ఈదిగువ వర్ణించబడింది.

అతను ఒక చిన్నకర్రపుచ్చుకొని త్రాచును బహిరంగప్రదేశానికి వచ్చేటట్లు చేస్తాడు. ఆ తరువాత మెల్లగా అతను పామును సమీపిస్తాడు తనను పట్టుకునేవానిని చూడగానే త్రాచు అతనిమీదకు ఉరకదు. కాని, పడగవిప్పి బుసలుకొడుతూ అతన్ని పరిశీలిస్తూ ఉంటుంది.

ఎడంచేత కర్రపట్టుకొని అతను పాముదగ్గరకు వెడుతూంటాడు. కాని, అది కాటువేయడానికి వీలయ్యే దూరంలోకిమాత్రం రాడు. ఎంతవరకు త్రాచు భూమిపైన లేచిందో సరిగా అంతదూరంలో వున్న వానిని పాము కాటువేయగలుగుతుంది. కాటువేయడానికి పాము ప్రయత్నిస్తే దానిని ఎడంచేతిలోని కర్ర ప్రతిఘటిస్తుంది.

సాధారణంగా త్రాచుపాము బుసకొడుతూ పట్టుకునేవానిన జాగ్రత్తగా పరిశీలిస్తూంటుంది. అప్పుడు పాములవాడు ఖాళీగా ఉన్న తన కుడిచేతిని ఉపయోగిస్తూ ఉంటాడు. కుడిచేతిని త్రాచుపాముకు దగ్గరగా దానిదెబ్బ తగలనంతదూరంగా పెట్టి పడగ పైభాగంలో ఇటు అటు ఆడిస్తూంటాడు. పగడపై ఉన్న ఈ చేతిని మెల్లగా క్రిందకు దించుతూంటాడు. తన పడగకు ప్రమాదం జరగకుండా రక్షించుకోడానికై త్రాచు తనపడగను మూసివేసి నేలమీదకు వంచుతుంది. తక్షణమే పాములవాడు త్రాచుతలను కుడిచేతితో నొక్కిపెడుతూ, ఎడమచేతిలోని కర్రతో కూడ గట్టిగా నొక్కి పెడుతూంటాడు. ఈ పనిచాల జాగ్రత్తగా జరగాలి. ఏమాత్రం పట్టుసడలినా పాములవానికి ప్రమాదం తప్పదు. ఇంక ఇప్పుడు పాము పట్టుబడింది. త్రాచును ఎత్తిపట్టుకొని దానికోరలను పెరకడమే తరువాత చేయవలసిన పని. ఒక చిన్న పట్టుకారుతో పాములవాడు కోరలను పెరుకుతాడు. పాము దవడలను నొక్కితే నోరు దాని అంతట అదే తెరుచుకుంటుంది. కోరలు స్పష్టంగా కనిపిస్తుంటాయి. కోరలను పెరికిన వెంటనే దానిని విడిచిపెడితే ఆ త్రాచు ఇంక ఎటువంటి ప్రాణనష్టాన్ని కలిగించలేదు.

విషములు

వేళ్ళు, పత్రములు, పుష్పములు, పట్ట, సాలు, చేవ, బంక, ధాతువులు, దుంపలు, ననువాటియందు స్థావర విషాలుంటాయి.

తెల్లగన్నేరు, గురివింద, నలుపురంగుగల అతిమధురము, ప్రుంగ, విజయం, విద్యుచ్ఛి, గర్గర, సుగంధక యీచెట్ల వేళ్ళు విషమును గలిగి యుంటాయి.

విషవత్రి, లంబ, వరకరదాము, కరంబము మహాకరంబము, లేతజొన్న, ఈ చెట్లఆకులు విషమును కలిగియుంటాయి.

కుముదఘ్ని, జెముడు, జాలక్షీరియను చెట్లపాలయందు విషముంటుంది. కాలకూటము, వత్సనాభము, సర్షపము, కర్ధముకము, వైరాటము, ముంతకము, శృంగివిషము, మూలకము, కర్కటము, హాలాహలము, ప్రవుండరీకము, పాలకము, మహావిషము – ఈ దుంపలు విషమును గలిగియుంటాయి.

పై విషములుచేయు వికారములు

చెట్లవేళ్ళ విషములు తినినపశువు మెలికలుతిరిగి చొంగను కారుస్తూ ఉంటాయి. మందమతిగానుండి నల్లకప్పువేసి వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయి.

చెట్లఆకుల విషములుతినిన పశువునకు నోరుచేదుగనుండి తిక్కపుట్టి బుసయెక్కువై చొంగపడుచు నల్లకప్పువేస్తుంది.

చెట్లఫలములు తినినవిమేత తగ్గించి మందమతిగానుంటాయి. మలమును బంధించును.

చెట్ల పుష్పములుతినిన కడుపుబ్బును. మందమతిగా వుండి వెంట్రుకలు నిక్కబొడుస్తాయి.

చెట్ల బెరడు బంక, చేవతినిన పశువులకు నోటివెంట నురుగు దుర్వాసన యుంటుంది.

చెట్లపాల విషములు తగిలిన నోరుపొక్కుతుంది. నాలుకపొక్కుతుంది. బుసయుండి నల్లకప్పు వేసి మూల్గుచు బాధపడుతుంది.

ధాతువిషములు తగిలిన దవడలు నొక్కుకొనిపోయి నోరు పొక్కి బాధగావుంటుంది. కొంచెము దగ్గుండును. నాలుక బండబారుతుంది.

దుంపలవిషములు చాల ప్రమాదములు. ఆరంభములోగాని కొంతకాలమునకుగాని బాధగలిగిస్తుంది. రక్తములోపల జీర్ణించిగాని ప్రమాదమునకు రాదు.

శత్రువులుచేయు విషప్రయోగాలు

విషముకలిపిన నీరు జిగటలుసాగి ఘాటైనవాసనగలిగి ఉంటుంది. నురుగుచారలు గలిగియుండును. ఈ లక్షణము లుండుటవలన జలచరములు చనిపోవును. పక్షులు వీర్యసమృద్ధిగలవై నీటియొడ్డున సంచరించుతాయి. ఈ నీటియందు స్నానముచేసిన మనుష్యులకు, పశువులకు మందమతి, జ్వరము, శరీరతాపము, వాపులు మొదలగు లక్షణములుంటాయి.

భూమిగాని కూర్చుండుటకు తగు రాతికట్టడముగాని, నీటిరేవుగాని, విషపూరితమైనప్పుడు వానిని ముట్టుకొనిన ఆవులు, గుఱ్ఱములు, ఎద్దులు, ఏనుగులు, లొట్టిపిట్టలు, గాడిదలు, మనుష్యులు గూడా చాల బాధనొందుదురు. వీని శరీరమందే భాగములందు విషయుత పదార్థములు తగులునో ఆ యాభాగములకు వాపుజనించును. మంటగానుండును. అచ్చటగల వెంట్రుకలు ఊడిపోతాయి.

ఆహారపదార్థములు

గడ్డి ఆహారపదార్థములు విషముచే చెరువబడినచో దానిని సేవించు జంతువులకు అంగశైథిల్యము, మూర్ఛ, వాంతులు గలుగుతాయి. మలము పలుచగనుంటుంది. వెంట్రుకలు నిక్కబొడుచుకొని నల్లకప్పువేసి తూలుచుండును. కడుపుకూడవుబ్బుతుంది. క్రమేపి చనిపోతుంది.

పొగ, గాలి

పొగ, గాలి విషయుతములైనచో పక్షులు భ్రమనొందినవై భూమియందుపడును. దగ్గు, పీనస, శిరోబాధ కలుగును. భయంకరమైన నేత్రవ్యాధులు కలుగుతాయి.

ఆహారములలో విషము కలుపుట


ఆహారమునందు విషమున్న దానిని భక్షించిన ఈగలు, కాకులు మున్నగునవి వెంటనే మడియును. దానిని అగ్నియందువైచిన చిటచిటయను ధ్వనులెగయును. నెమలి కంఠమునందలి రంగువంటిరంగుగల పొగలెగయును ఈ పొగను భరించుటచాలకష్టము. మంటలు కలిసియుండక విడివిడిగ నుండును. ఈ యగ్నినుండి వెలువడు గంధపుపొగ చాలసేపటివరకు వుంటుంది.

విషముగలిగిన ఆహారమునుండి వెడలు ఆవిరితగులుటచే హృదయమునందు బాధకలుగును. కన్నులుతిరుగుతాయి. కాళ్ళకు అంటిన మంటలు పుట్టును.

ప్రమాదముచేగాని, అజ్ఞానముచేగాని, విషాహారము సేవించిన నాలుక బండబారుతుంది. రుచిని గ్రహించుశక్తి నశించుతుంది. మండుచున్నట్లుగనుండును.

విషముజీర్ణమైనపుడు అతిసారము, మంటలు, కడుపులో గడిబిడ, శరీర కాంతికూడ తగ్గుతుంది. సారాయి, కల్లు మున్నగుద్రవపదార్థములయందు విషమును కలిపినయెడల గీతలు నురుగులు, బుడగలు కలుగుతాయి. విరేచనములగుతాయి.


దాణాదినుసులు పచ్చిగడ్డిజాతులలో విషమును గలిపిన చిటచిటలాడుచు రుచినశించుతుంది. దుర్గంధము కలుగుతుంది. పచ్చికాయలకు విషముతగిలిన వెంటనేపండుతాయి. పండినవానికి తగిలిన వెంటనే క్రుళ్ళిపోతాయి.




ఇంగ్లండులో పశువైద్యులు పల్లెటూళ్లలో విద్యార్థులకు పశువైద్య విషయాల నోట్సు చెప్పుట



విదేశీ పాలగోవు



పచ్చిగడ్డినిఁయెండుగడ్డి చేసేయంత్రము



మొక్కలను పాడుచేసే విషకీటకాలను చంపే మందు
అను చల్లుట

దంతములయందు విషమున్నయెడల మొనలు విరిగిపోతాయి. నాలుక, పండ్లు, చిగుళ్ళు వాచుతాయి. పువ్వులకు విషముతగిలిన వాని సువాసన తగ్గుతుంది. రంగుమారి వాడిపోతుంది. వానిని వాసన జూచిన శిరోబాధకలిగి నేత్రములందు నీరుజేరుతుంది.

అంజనమునందు విషమున్నచో కన్నీటియందు జిగురు అంధత్వము గలిగి బాధయు ఎక్కువగా వుంటుంది.

పట్టెళ్ళయందు, గంటలయందు, గొలుసులయందు విషముకలిపినవి మామూలుగ ప్రకాశించవు. ధరించిన నాయాశరీరభాగముల హింసించుతూ, ఒడలు మండుతూ పుండై దురదకలిగి జిలగా వుంటుంది.

విషవంతములగు ఆకులు తినునపుడు కలుగు ప్రమాదములు

మేత దొరకని కాలములందు పశువులు పొదలమీదనుండు విషవంతములగు ఆకులు తినుటవలనను, విషపుపుట్టలు పట్టియుండెడు చొప్ప, రెల్లు మొదలగు గడ్డిదినుసులు తినుటవలనను, ఆకస్మికముగ మేతతో ఉమ్మెత్తాకులు, జిల్లేడాకులు, పొగాకు, లేతజొన్న మొదలగు విషవస్తువులు తినుటవలనను, పశువుల-కపాయములు తటస్థించుతాయి.

విషవస్తువులు ఆకులలోను, తవుడులోను కలిపిపెట్టుట.

ఇంకను పశువులకు మాలమాదిగలు దుర్బుద్ధిచేతనో, తోళ్ళకొరకో విషముపెట్టి చంపుతారు. చచ్చిన పశువులను గ్రామమాదిగలకిచ్చు నాచారమునుబట్టి తోళ్ళు గిరాకిగానుండు కాలమందు గ్రామమాదిగలు పశువులకు విషముపెట్టిచంపుతారు.

విషవస్తువులు తెచ్చి పిండితోగాని, తవుడుతోగాని, పిసికి ముద్దచేసి అరటిఆకులోగాని ఇతర ఆకులలోగాని మడచి పెట్టుతారు. లేదా పశువులముందర పడవేస్తారు.


అంతట పశువు తింటుంది. క్రమేపి బాధకలుగుతుంది.

గడ్డిజాతులలో కలిపి పెట్టుట.

కొన్ని సమయములందు పశువులుతిను గడ్డిలో కలుపుతారు. కొందరు పశువులుమేయు బీడు భూములలో పాషాణపొడి చల్లుతారు. నోరుపొక్కుతుంది.

పలువిధ విషప్రయోగములు

మరికొందరు చర్మమునుచీల్చి ఆ గాయమునందు విషమును పూస్తారు. లేదా ఆసనమునందుగాని, యోనియందుగాని విషపదార్థమును ఎక్కిస్తారు. అంతటయోని పుండవుతుంది.



మశూచిపడినతలను క్రుళ్లించుట

మశూచిపడి చనిపోయిన పశువుయొక్క తలను భూమిలో పాతిపెట్టి అది క్రుళ్ళినతరువాత దానిలో ఒక యింజక్షన్ సూదినిదించి క్రుళ్లునీరు సూదికి పట్టించినతరువాత ఆ సూదితో ఇతర జంతువులను కొంచెము రక్తముకారునట్లు చేయగా వెంటనే ఆ విషమెక్కి పశువు చనిపోతుంది.

జిల్లేడుపాలను ప్రేగులలోనికి ఎక్కించుట

జిల్లేడుపాలను ఒక చిప్పలోనికివొడిచి మూరెడు పొడుగును ఒక అంగుళము వెడల్పునుగల కర్రపుల్ల కొనను, ఆ గుడ్డనుచుట్టి మూత్రము విడుచు ప్రేగులలోనికి గ్రుచ్చి లోపల ఆ గుడ్డనుంచి పుల్లను నెమ్మదిగా బయటకులాగుతారు. ఈమందు బహువేడియగు వస్తువగుటవలన వెంటనే ప్రేగులువాచి బాధపడి చచ్చిపోతుంది.

అంటువ్యాధుల మలములుపయోగించుట

పెద్దరోగము, దొమ్మ మొదలగువ్యాధులు సంభవించిన పశువుల పేడనుతీసి దాచియుంచుతారు. తోళ్లగిరాకీగా నుండునపుడు మాత్రము ఆపేడ పచ్చికమీద జల్లుతారు. ఆ పచ్చిక పశువులుతిని పలువిధసంకటముల పాలవుతాయి.

గన్నేరుగింజలను, చెక్కల ఉపయోగించుట

కొందరు మాదిగవాండ్రు పచ్చగన్నేరుగింజలను దారమునకు దండవలె గ్రుచ్చి పశువుల మందలపై విసరుతారు. లేదా ఎండుగడ్డితో గన్నేరుచెక్కకలిపి పెడతారు.

గురుగింజలను పెట్టుట

మరికొందరు గురిగింజలను పొడిజేసి నీటిలో కలిపి ముద్దజేసి ఒక అంగుళముపొడవుగల కర్రచివర వాడిగాచెక్కి ఆ ముద్దను కర్రకు అంటించి జంతువు శరీరములోనికి జొనుపుతారు. పొడి ఎచ్చట ప్రవేశించునో ఆ భాగము విశేషముగావాచి రెండుమూడు దినములలో పశువు చనిపోతుంది.

విషము నోటిగుండ పెట్టినతరువాత కనబడు లక్షణాలు

పశువునోటినుండి విషము లోనికిచ్చినయెడల దంతములు, చిగుళ్ళు, నోరు, నాలుకపూచి బాధ కలుగుతుంది, చొంగయధికముగా కార్చుతుంది. వాంతిచేయుటకు ప్రయత్నించుతుంది. కడుపునొప్పి కలిగి తరచుగా లేచుచు పండుకొంటుంది. కడుపుబ్బుతుంది. పిమ్మట దుర్గంధములతోగూడ విరేచనము-లవుతాయి. ఆ విరేచనములలో రక్తజీరకూడ వుండవచ్చును. నల్లకప్పువేసి వెంట్రుకలు నిక్కబొడుస్తాయి. నాలుక చిగుళ్ళు నల్లపడతాయి. వ్యాధి ముదిరినకొలది కండ్లు నీలవర్ణముగా వుంటాయి.

ఆసనములో పెట్టినతరువాత కనపడు లక్షణాలు

ఆసనములో పెట్టినయెడల ఆసనము ఎర్రబడి చాల బాధపడుతుంది, కడపటి యవస్థలో దైన్యముతో చూచుచు కంటిపాపలు పెద్దవై చాల ఆయాసముకలిగి పక్షవాతముచే నిలువక క్రిందపడి చనిపోతుంది.

చికిత్స

10, 20 కోడిగ్రుడ్లను ఒక సేరున్నర చిక్కనిజావలోగాని, పాలలోగాని కలిపి 3, 4 గంటల కొకసారి త్రాగించాలి. లేక వెలగబంకనీరుగాని, అన్నభేది నీరుగాని త్రాగించాలి. లేక పుగాకురసముగాని,

నున్నపునీరుగాని, ఘాటు సారాయిగాని త్రాగించాలి. లేక సారాయి 10తు, శొంఠి 2తు, నల్లమిరియాలపొడి 1తు, జావ అర్ధసేరు కలిపి త్రాగించాలి. లేక ఫార్మసీవారి పశురక్షామృతమును గాని విషఘ్నినిగాని వాడాలి.

పథ్యము

నీటిని యేమాత్రము తాగనీయరాదు. సీమఅవిసెగింజల జావగానీ, బియ్యపుజావగాని, ఎక్కువగా త్రాగించాలి. ఉడకబెట్టిన తవుడు, చిట్టు పథ్యముగా పెట్టాలి.

ఉంగిడి

లేతజొన్న లేక ఆముదపు ఆకులు తినుపశువులు సాధారణముగా విషమెక్కిచచ్చుట మనకందరకు తెలియును. ఒక పొలములోని లేతజొన్ననుమేసిన పశువులు విషమెక్కి చావగా మరియొక పొలములో నట్టిరీతి లేతజొన్ననే మేసినపశువులారోగ్యవంతములై యుండుటగూడ మనమెరుగుదుము, 1903-వ సంవత్సరములో క్వీన్సులాండు దేశమునందు లేతజొన్ననుమేపుటవలన అనేక పశువులు మరణించాయి. అందువలన ఆ ద్వీపవాసులు శోధనలు బెక్కింటినిజేసి వాని పర్యవసానములను తెలియపర్చారు. సారవంతములైన భూములలో పెరిగిన జొన్నలయందు ఘోర విషములైన ప్రుస్సిక్ ఆసిడ్ (Prussic Acid) మున్నగు పదార్థములుంటాయి. భూమియందలి సారము తగినకొలది అందుండుజొన్నలలో విషములంతగా నుండవు. కాబట్టినిస్సారములగు పొలమునందలి లేతజొన్నను పశువులు మేసినప్పుడు నష్టము కలుగకున్నను భూమిలో సారము హెచ్చినకొలది అందలి లేతజొన్నను మేసిన పశువునకు విషచిహ్నము లేక్కువగా కానవచ్చుట ఈ దేశమువారి శోధనవలన గానవచ్చింది. నైట్రోజను విస్తారముగాగల భూములలో మాత్రమే ఇట్టి విషము లేతజొన్న యందు కనబడుతుంది. ఇందుకొరకై బ్రెన్నిక్ (Brennic) అనుదొర ఒకపొలములోని కొంతభాగములో ఎరువును దేనిని వేయకుండగనె జొన్నలను చల్లి మరి కొంతభాగమునకు నైట్రోజను ఎరువు విస్తారముగా వేసి జొన్నలను విత్తాడు. నైట్రోజన్ వేయబడిన భాగమందలి లేతజొన్నలో విషము విస్తారముగా గానవచ్చింది. నైట్రోజను ఎంత ఎక్కువగా వేయబడినదో అంతవరకే సరిగా నందలి లేతజొన్నలో ఈ విషములు హెచ్చినని. ఎన్ని పర్యాయములు ఇట్లు శోధించిచూచినను ఈ రీతిగనే ఫలితము తేలింది. కాబట్టి భూమిలోని నైట్రోజను ననుసరించి లేతజొన్నయందు విషముండునని నిర్ధారణ అవుతోంది.

ఏపుగా పెరుగు మొక్కలలో నీవిషముతక్కువయును, ఎండాకాలపు మొక్కలలోను, పీలగా నెదుగు మొక్కలలోను ఈ విషము విస్తారముగా వుంటుంది. విస్తారము నైట్రోజనుగల భూములలో పెరుగు మొక్కలు ఓక వీసమెత్తు పెరిగిన మొక్కలు తినిన ఎట్టి పసరమైనను చనిపోతుంది. కాబట్టి లేత మొక్కలును, పీల మొక్కలను అంతగా నారోగ్యకరములైనవికావు. లేతగా కోసినను ఎండుచొప్పయగునేని దీనియందీ విషముండదు. నైట్రోజను విస్తారముగాగల భూములలోని జొన్నను కంకివేయువరకు పశువునకు మేపరాదు. మొక్క మొలచిన మూడు వారములనుంచి ఏడువారములవరకు నందువిశేషముగా విషముండును. అటుతరువాత నీ విషమందలి నైట్రోజను విరిగిపోయి హానిజేయని యితర పదార్థముల క్రిందకు

మారిపోతుంది. మొక్క పూతబట్టిన తరువాత నందలి విషము నామమాత్రావశిష్టమై యుంటుంది. కాని కొన్నిచోట్ల కొద్దికాలమునకు పూతకువచ్చు మొక్క మరికొన్నిచోట్ల ఏపుగాపెరిగి చాలకాలమునకుగాని పూతకు రాకుండుటచే పైనచెప్పిన మూడు, ఏడువారములు అనుగడువు సర్వత్రసమముగా వర్తించదు. కాబట్టి యేదియెట్లున్నను పూతపూయకముందు పచ్చజొన్నను పశువులకు మేతగా పెట్టరాదు. మాక్స్‌వెల్ (Makswell) అను ఒక దొర లేతజొన్నను ఎండుగడ్డినికలిపి పశువునకు మేతగా వేయవచ్చుననియు అందు ఎండుగడ్డిపాలు హెచ్చుగానున్న యెడల లోపలికిపోవు లేతజొన్న యందలి విషము చాల తక్కువగుటచేత అంతగా హాని కలిగించదనియు తెలియజేశాడు. ఏదియెట్లున్నను పూతపూయని పచ్చజొన్నను పశువులకు వేయకుండుటయే మంచిది. పెరుగుచున్న జొన్న మొదలగు పైరులను పశువులు చొరబడి మేయకుండ కాపుదల చేసికొనాలి. కోసినవెంటనే పచ్చిజొన్న మొక్కజొన్న వీనిని పశువులకు వేయరాదు. రెండుమూడు దినములు వీనిని ఎండబెట్టిన తరువాతనే పశువులకు వేయాలి. పూతపూయకమునుపు పచ్చిచొప్పను పశువులకు వేయుటయేతప్పు. తేమ నేలను ఏపుగా పెరిగిన దానిని వేయవచ్చును. విశేషముగా ఈ మేతను ఇతర ఆహారములతో ఇచ్చుటమంచిది.

లేతజొన్న తిన్న పశువు లక్షణాలు

పశువు అడుగువేయలేదు. తడబడి నల్లకప్పు వేస్తుంది. వెంట్రుకలు నిక్కబొడుచును. స్పృహదప్పుతుంది. నాలుక జారవిడుచును. నోటి వెంట చొంగపడుతుంది. నాలుక విరగ లాగుతుంది. వ్యాధి ముదిరిన కొలది పొట్ట భేరీవలె పొంగుతుంది. స్పృహదప్పి గురక పుట్టుతుంది. దవడలు బిగిసికొనిపోతాయి. ఊపిరియాడక వెంటనే మృతినొందుతుంది.

చికిత్స

ఆరంభములోనే చికిత్స చేయవలెనుగాని తరువాత నేమియు లాభము లేదు.

1. శేరున్నర పులుసుకలిలో ఉప్పు చేరెడు, నల్లేరుముద్ద చిన్న నారింజకాయంత కలిపి పెట్టాలి.
2. కొమ్ములకు నూనెవత్తులుచుట్టి కాల్చి జాముపరకు యుంచిన తగ్గుతుంది.
3. కుంకుడు కాయల గంధము కంటిలో కలికెము వేయాలి.
4. నిమ్మపండ్లరసము, నల్లేరురసము కలిపి మూడుగొట్టములు పెట్టిన తగ్గుతుంది.
5. చిర్రిచెట్టు దంచి రసముతీసి పులికలితో మూడు గొట్టములు పెట్టాలి.
6. దోసకాయలు పది పెట్టాలి.
7. దీపపు కొడిచే జిల్లేడుఆకులు పొట్లముగాకట్టి చమురును కాచి మాడున పెట్టాలి.
8. పులికలిలో దుష్టపువేళ్ళనూరి సారముతీసి ముక్కురంధ్రములలో పోసి కన్నులకు ఇంగువ కలికెము వేయాలి.

9. చింతపండు పులుసు మూడు గొట్టములు పెట్టాలి.

10. నల్లేరుకొనలు దవడలకు పెట్టి కొరికించిన తిక్క పోతుంది.

పశువుల కుపయోగించు పనిముట్లు

పలుపులు, నీరుపెట్టు తొట్టెలు, మందులనిచ్చు గొట్టములు, పాత్రలు ఎప్పటికప్పుడే పరిశుభ్రము చేయాలి. శత్రువులెవరైన యున్నప్పుడు విషపుమందులు కలుపుదురేమో తనిఖీ చేయుచుండాలి.

పశువులశాలలు, పాకలుగూడ పరిశుభ్రముగా వుండాలి. చెత్త వగైరాలున్నచో విషపురుగులు చేరుతాయి. క్రిమికీటకాదులు జనించి పలువిధ రోగములు కలిగించుతాయి. గడ్డివాములు, పుట్టలు, విషముగల తీగెలు, లేక జొన్న వగైరా లుండుచోట్ల పశువులను కట్టరాదు.

మంచి పశువులకు ఓర్పులేనివారు నోటిలో దబ్బనము, ఇనుప సూదులు మున్నగునవి వేస్తారు. ఇట్లు వేయుటవలన పశువు ప్రేగులలో గాని, తదితర అవయవములలో గాని నిలువయుండి పశువును బాధించుచు కొన్నాళ్ళకు ఆ వస్తువుత్రుప్పుపట్టి, శరీరభాగములను చెరచుతుంది. ఆకలి తగ్గుతుంది. ప్రేగులలో చిక్కుకొనియున్న యెడల తూట్లుపడి కడుపునొప్పి, నోటివెంట చొంగ, ముక్కులవెంట చీమిడి మున్నగునవి పడుచు క్రమేపి పశువు మరణిస్తుంది. కండరములలో చిక్కుకొనియున్నయెడల ఆ భాగమంతయు చెడి కణుతులు లేస్తాయి. కణతులు పక్వమునకు రాక శరీరమంతయు పుట్టి కొన్నాళ్ళకు ఆ విషమంతయు జీర్ణమై చనిపోతుంది. విరేచనములగునపుడు ముడ్డితీపు శూలకలిగి మలముతో త్రుప్పురంగు కూడ కనపడుతుంది. కండరములో నిలువయున్న చీముపట్టి కొన్నాళ్ళకు పగిలి ఆ పనిముట్టుకనపడుతుంది. పేగులలో చిక్కుకొన్న లాభములేదు.


ఇటువంటి వస్తువులు మ్రింగిన పశువుల చరిత్ర తెలిసికొనుట చాల కష్టము. అనేకమంది పశువైద్యులను తీసికొనివచ్చి చూపించుతారు. కొందరు పనిముట్లు పేగులో చిక్కుకొన్నపుడు కడుపునొప్పి యంటారు. ఇంక అనేక విధములుగా రోగనిర్ణయములు చేయుదురుగాని అసలు వ్యాధి కనుగొనరు. పశువు మరణించిన తరువాత మాదిగవాండ్రు కోయునప్పుడు ఆ వస్తువులు బయటపడతాయి.

ఇటువంటి ప్రమాదములు జరిగినపుడు వెంటనే మూడు నాలుగుసార్లు సబ్బునీటితో ఎనిమా చేయవలెను. తరువాత వెన్నను తినిపించాలి. కంతులు పుట్టినయెడల శస్త్రవైద్యములోనున్న ప్రకారము శస్త్రచికిత్సలు చేయాలి. లేదా పశురక్షామృతమునుగాని విషఘ్నినిగాని వాడాలి.


కప్పలు

ఎనిమిదిజాతులు గలవు. వీటిలో కొన్ని కరచినచోట దురదకలుగును. నోటివెంట నురుగువచ్చును. ఇంక కొన్ని రకములు కరచిన మంటలు గలుగుతాయి; మూర్ఛవస్తుంది. ఈరీతిగా కందిరీగలు, తేనెటీగలు, దోమలు కరచినప్పుడు జాగ్రత్తగ ఆలోచించి చికిత్స చేయాలి.

సాలెపురుగులను తినుట



మనము మనయిండ్లయందును, రెల్లుదుబ్బులందును, జనుపగడ్డి వాములందును సాలెపురుగులను లూతలను చూచుచుందుము. వీటిని గురించియే ఇదివరకు చెప్పబడియుంది. సాలీడు శరీరమందు గ్రంధులనబడు సంచులుంటాయి, కొన్ని భూములలో కన్నములు చేసికొని వానిపై కప్పులను దారముతో



నమర్చును. లోపలిభాగమున పగలంతయు నుండి రాత్రులయందాహారముకొరకై వెలుపలికి బయలు– దేరుతుంది. మరికొన్ని చెట్లకొమ్మలకు ఛత్రమువంటి గూటిని నిర్మించి మధ్యను తన పిల్లలను రక్షించుకొంటాయి. ఇంకకొన్ని నీటియడుగుననేయుండి యచ్చటనే గూండ్లుకట్టుకొని తమపిల్లలను పెంచుకొంటాయి. పశువులు రెల్లుదుబ్బులను తినునపుడుగాని, జనుపకట్టలు, జొన్న, వరిగడ్డి, బటిమేత, తదితర దాణాదినుసులు, తినునపుడు వానితోపాటు ఈ సాలీళ్ళను వాటిగూళ్ళనుతినినయెడల ఒకవిధమైనవ్యాధి కలుగుతుంది. కొన్ని ప్రమాదమును కలిగించుతాయి.

లక్షణాలు

ఆరంభములో పశువు నల్లకప్పువేస్తుంది. కడుపుబ్బుతుంది. నోటినుండి చొంగపడుతుంది. మలబద్ధకముంటుంది. వెన్ను విరుస్తుంది. కరిచినచోట మంటలు పుట్టుతాయి. బుడగలు బుడగలుగా పారుతుంటుంది. వెంట్రుకలు నిక్కబొడుచుకొంటాయి.

చికిత్స

ఫార్మసీవారి 'బేల్'పొడరును, పశురక్షామృతమునువాడాలి. లేక దిరిసెనాకు పసరు అర్ధసేరు, పసుపు 1 తులం కలిపి త్రాగించాలి.

లేక శొంఠి 1 తు, పిప్పళ్ళు 1 తు, మిరియాలు 1 తు, మజ్జిగ 1 సేరు కలిపి త్రాగించాలి. లేక ఎక్కువ తీవ్రలక్షణము లున్నచో శొంఠి గంధముగాని మిరియాలగంధముగాని కండ్లలో వేయాలి.

పాముకట్టు

ఏసర్పము కరచినను కాళ్ళయందైనచో మొట్టమొదట గుడ్డపీలికలచేగాని, తోలువారులచేగాని, చెట్టుపట్టలచేగాని మరి ఇతర మృదువైన వస్తువులచేగాని కరిచినచోటునకు నాలుగు అంగుళములపైన కట్టుకట్టాలి. ఇట్లుకట్టుటచే విషము శరీరమునందు వ్యాపింపక నిలచిపోతుంది. కట్టును అరిష్టమందురు. కట్టు కట్టుటకు వీలులేనిస్థలములైనచో విషము వెలుపలికి పీల్చుట, కరిచినచోటు కోయుట, కాల్చుట యనునవి అన్ని విషములందును ముఖ్యములైనవి. వెంటనే మూర్కొండాకు పసరును ముక్కులలోను, చెవులలోను కొన్ని చుక్కలు పిండిన వెంటనే కొన్నిటికి తగ్గుతుంది.

సర్పవిషము

మనుజునకు శరీరమంతను శుక్రము వ్యాపించియున్న రీతిగి సర్పమునకు శరీరమందంతటను విషము వ్యాపించి వుంటుంది. కోపము కలిగినపుడు బయల్పడుతుంది. సర్పముయొక్క కోరలు చేపలనుపట్టు గాలములవలె వంకరగా వుంటాయి. విషము శరీరమునుండి బయలుదేరి దానియందు చిక్కుకొనును. కనుక సర్పములు కాటువేసిన తరువాత వెల్లికిలబడినగాని (పడగవరకు) విషమును వదలజాలవు. విషమంతయుగూడ మిక్కిలి ఉష్ణముగ తీక్ష్ణముగ వుంటుంది.

చివర నక్షత్రములు వారములను బట్టి విషమువుంటుంది

గోధుమత్రాచునకు శనివారమునాడును; నల్లత్రాచునకు మంగళవారమునాడును; ఆరికెవన్నె త్రాచునకు, కందిపొడలత్రాచునకు బుధవారమునాడును; నాగజెర్రిత్రాచునకు సెనగపువ్వు త్రాచునకు సోమవారమునాడును; మొగిలిపువ్వు త్రాచునకు, తెల్లత్రాచునకు, గురువారమునాడును; కోడెత్రాచునకు, నీరు త్రాచునకు, గిరినాగునకు శుక్రవారమునాడును; చింతపువ్వుపన్నె త్రాచునకు భానువారమునాడును


విషోద్రేకముండునని తెలిసికోవలెను. ఆశ్లేష, విశాఖ, భరణి, కృత్తిక, ఆరుద్ర, మూల, మఖ నక్షత్రములలో పశువును కరచిన బ్రతుకవని శాస్త్రజ్ఞుల మతము.

ముంగిసలు

ఇవి సాధారణముగా పాములతో పోట్లాడదలచినపుడు ప్రథమమున తాము కుక్కపాలచెట్లున్న చోటును చూచివచ్చి తదుపరి సర్పము పైకి కలహించుట కైబోయి సర్పమును తిన్నగా నా చెట్టుదగ్గరకు రానిచ్చి కలియబడి అవి కాటువేసినపుడెల్ల కుక్కపాలాకు కొరికి నమలి తినుచు విషముపోగొట్టుకొనుచు పామును చీల్చివేస్తుంది. ఇది మహాజాగ్రత్తగల జంతువు.

పాములు ఊదుట

పాములు ఊదుట



కొన్ని విషసర్పములు నోటినుంచి పాడిపశువుల పొదుగులకు, తదితర పశువుల శరీరమునకు విషముగల గాలి విడుస్తాయి. అట్టి సమయములందు శరీరముమీద పొడ గజ్జిపుండ్లు, పుండ్లగుండ రక్తద్రవము, దద్దుర్లు కలుగుతాయి. ఇట్టివాటికి నరమూత్రం, పచ్చిపసుపు కలిపినూరి త్రాగించాలి.

మంత్రగాడిచే దురాయి కట్టించుటమంచిది.

లేక విషఘ్నిని వాడాలి.

లేక గాడిదగడపాకుపసరు, పచ్చికుసుమాకు పసరు కలిపి 2½ తులములు త్రాగించాలి.

కాటుభేదములు

వెలికిలబడినచో మిక్కిలి బలముగా కరచినదనియు, ఒక్క కోరమాత్రమే దిగబడినయెడల ఆక్రాంతమై కరచినదనియు, ఒక్క కోరమాత్రమే కొంచెము దిగబడినయెడల భీతిల్లి కరచినదనియు, రెండు కోరలు లోతుగా దిగబడిన యెడల క్షుద్బాధ మిక్కుటముగానుండి కరచినదనియు, మూడుకోరలుగ దిగబడినచో మహానాగము కాటువేసినదనియు, మిక్కిలిలోతుగా గాయముపడునటుల గరచినయెడల ఇదివరకు పగబట్టి కరచినదనియు గ్రహించాలి.

విషాది వివరణ పట్టిక

	విషగ్రంధిలో నుండువిషము	కరచినపుడు వెలువడునది	మనుజుని, పశువును చంపుటకువలయునది	మరణము తటస్థించు కాలము
త్రాచుపాము	½ -185	6 గ్రెయినులు	1½ గ్రెయినులు	10ని॥ మొ॥ 30 గంటలు
కృష్ణసర్పము	2-16 గ్రెయినులు	4 గ్రెయినులు	½ గ్రెయినులు	10ని॥ మొ॥ 24 గంటలు
వైపరు	1-4 గ్రెయినులు	2 గ్రెయినులు	1/8 గ్రెయినులు	6గం॥ మొ॥ 8 రోజులు
కట్లపాము	1 50-2 గ్రెయినులు	1 గ్రెయిను	1100 గ్రెయినులు	12గం॥ మొ॥ 8 రోజులు


పొగాకు తోటలవైపునకు పాములు రావు. కావున పొగాకును ఔషధముగా వాడుచుందురు. ఇదియును కొంతపనిచేయును. శీతాకాలములో విషమెక్కువగా యుంటుంది. చీకటిలో వెలుతురుకన్న విషమెక్కువగా యుంటుంది. పాముచాలదూరమునుండివచ్చి కరచినపుడుగాని, రెండు దవుడలు సరిగా కలువకపోయినగాని విషము చాలకొద్దిగా ఎక్కుతుంది. మంచినీళ్ళలోనుండు పాములకు విషముండదు. సముద్రములోనుండు సర్పములలో కృష్ణసర్పముకన్న పదిరెట్లెక్కువ విషముంటుంది. ఉష్ణప్రదేశములవాటికి ఎక్కువ విషముంటుంది. సర్పముయొక్క వయస్సును బట్టిగూడ విషముమారుతుంది. సర్పము కోపముగానున్న విషమెక్కువగా వుంటుంది. ఆహారము తినిన తరువాతను, కూసము విడిచిన తరువాతను విషముండదు. ఈ సర్పము-లన్నియు చెట్లెక్కగలవు. నదుల దాటగలవు. త్రాచుపాములజాతి చాల జ్ఞాపకశక్తిగలవి. వాటిని బాధించినవారిని చాల కాలమైనను జ్ఞాపకముంచుకొని, వీలైన తిరిగి శిక్షించగలవు.

పాముకాటు లక్షణాలు

పాముకాటునకు వెంటనే అనగా విషము దేహమునందు వ్యాపించక మునుపే చికిత్సచేయుట కారంభింపవలయునుగాని, "ఆలస్యం అమృతంవిషం" అనునట్లు విషముదేహము నందంతటనుండు రక్తములో ప్రవేశించిరక్తము నల్లబడిన తరువాత నేమియు లాభము లేదు. పాముకరచిన పశువునకు బాగుగా లక్షణములు కనబడుతాయి. కరిచినచోట భరింపరాని మంటయుంటుంది. శీఘ్రముగా మత్తును కలుగజేస్తుంది. తటాలున క్రిందనుండిపైకి పక్షవాతముక్రమ్మునట్టవుతుంది. కాళ్ళలో సత్తువబోవును, నేలగూలబడును. గుండెలు వత్తుకొని పోవునట్లుండి దడగానుండును. క్రమేపి తలవాలిపోవును. ఊపిరియాడుట కష్టముగానుండును. కునుకుపాట్లు పడుచుండును. దీనినే సర్పనిద్రయందురు.

మొదటి అవస్థ: పశువుకండ్లు తెలుపురంగానుండి నీరుకారుచుండును. జ్వరముంటుంది. ఈ అవస్థలో జిల్లేడుకొనలు, ఉప్పు, ఆవుపాలతో నూరి కండ్లలో కలికెమువేయుము. లేక దిరిసెన పువ్వులరసము కండ్లలో పెట్టుము. లోపలికి నాగమల్లి వేరు 2 తులములు, సన్నావాలు అరతులం నూరి మూడు గొట్టముల గంజిలోకలిపి పెట్టాలి.

రెండవ అవస్థ: పశువు శరీరమంతయు నలుపురంగుగా మారి చొంగను కార్చుచుండును. ఈ అవస్థలో మణుగు తామర 3 తులములు, తెల్లగలిజేరు 3 తు, ఈశ్వరీవేరు 3 తు, నూరి ముద్దచేసి నీటిలో కలిపి త్రాగించాలి. రేలవేరు గంధముతీసి కండ్లలో పెట్టాలి.



మూడవ అవస్థ: శిరస్సు బరువుగా వుంటుంది. మెడ నిలువజాలదు. ఈ అవస్థయందు తెల్ల ఉలిమిరివేరు 2 తులములు, ఈశ్వరీ వేరు 3 తు, దిరిసెనచెక్కరసం 3 తు నూరి నీటిలోకలిపి త్రాగించాలి. కలినీటితో దిరిసెన విత్తులునూరి కండ్లలో వేయాలి.

నాలుగవ అవస్థ: పండ్లు కొరుకుతుంది. భూమిమీదపడును. శరీరము నల్లబడుతుంది. ఈ అవస్థలో చికిత్సచేయుటవలన లాభములేదు. కండ్లలో నీలిరంగు ఏర్పడును. ఎండను చూడగనే మరణిస్తుంది.

చికిత్స

ఏ పాముగరచి అలస్యమైనను, పశువు గుటక వేసినచో గాడిన గడప, పిచ్చికుసుమ, మిరియాలు, అత్యద్భుతముగా పనిచేస్తుంది.

నాగదుండదుంప నీటితో అరగదీసి అయిదుతులములు లోపలికి త్రాగించి కొంత కరచినచోట పూసిన విషము తగ్గుతుంది.

తెల్ల ఈశ్వరీవేరు గంధముతీసి నాలుగుతులములు లోపలికిచ్చి కరచినచోట పూసిన విషము హరించుతుంది.

ఉత్తరేణి ఆకులు నూరి పాము కరిచినచోట మందముగ పట్టించిన విషము హరించుతుంది. దీని ఆకురసము లోపలికి త్రాగించాలి.

గాడిదగడపాకు పసరు పిచ్చికుసుమాకు పసరు పది మిరియాలగింజలపొడి కలిపి త్రాగించిన విషము విరుగుతుంది.

ముషిణివేరు చెక్కరసము 5 తులములు త్రాగించాలి.

పచ్చినేలవేము రసముతో మిరియాలపొడి కలిపి ఇచ్చిన సమస్తవిషములు హరించుతుంది. తెల్లజిల్లేడు పువ్వులవాసన ముక్కులకు చూపించాలి. లేక మూర్కొండాకుపసరు కొన్నిటికి ముక్కులలోను పోయుటవలన చాలవరకు తగ్గుతుంది.

లేక కరచిన పశువు మూత్రము మరల దానికే త్రాగించిన తగ్గుతుంది.

* * *

ఇరువదినాల్గవ భాగము

మంత్ర తంత్రాలు

స్వభావము – వ్యాపకము

ఈ కాలంలో మంత్రాలంటే నమ్మికపోయింది. కాని మంత్రాలలో ఉండేశక్తిని అర్థం చేసుకుంటే మంత్రాలు కూడా చాలా అవసరమంటారు. మంత్రాలంటే నమ్మకముండాలి. పశువులకు, మానవులకు పూర్వము నుంచి నేటివరకు అన్ని ప్రాంతాలలో మంత్రాల తంతులు జరుగుతూనే ఉన్నాయి. తగిన కారణాలు, నిదర్శనాలు, చూపించితే ఎవరైన నమ్ముతారు. పాముల నరసయ్య, సత్యన్నారాయణ మున్నగు మంత్రవేత్తలు ఈమధ్యకాలంనుంచి చూపించుతున్న వారిశక్తి ప్రభావాలవల్ల చాలామందికి నమ్మకం కలిగింది. తేలుమంత్రం, పాముమంత్రం, గ్రహణ రోజులలో మూలికలు తీయుట కుపయోగపడు మంత్రాలు ఇంకా ఎన్నోరకాల మంత్రాలు కొంతమంది మహానుభావులు ఆచరణలోపెట్టి నమ్మించిన తరువాతనే మంత్రాలంటే నమ్మకం కలిగింది. ఈరీతిగా పశువులకు వచ్చేదొమ్మలకు, ఉపిరివాపులకు, చరుకుదురు మున్నగు రోగాలకు మంత్రాలు కొందరు పెట్టుకుంటారు. మంచి గేదెగాని, మంచి గోవునుగాని ఏకదృష్టితో పరిశీలించిన మెస్మరిజంవలె ఆ పశువు చన్నో పొదుగో, ఏ అవయవమో చెడిపోతుంది. ఇది నా ప్రత్యక్ష్యానుభవము. దీనినే దృష్టిదోషమంటారు. ఏమైన మంచి మంచి మందులుంటే ఉండవచ్చునుగాని అవి మనకు అందుబాటులో లేనప్పుడు ఈ మంత్రాలవసరమని తెలుసుకోవాలి. మంత్రాలు ఈ కాలంలో అందరం పెడతామంటే నమ్మవద్దు. భూతవైద్యమని, పశువులకు, మనుష్యులకు దయ్యాలు పడతాయని మేము నెమ్మదిచేస్తామని డాంబికవైద్యులు బయలుదేరుతారు. అట్టివారిని నమ్మరాదు. దైవతాసంభూతులైన మంత్రశక్తిగల మహాత్ములున్నారనుటలో సందియము లేదు.

పశువులకు మళయాళ మంత్రాలు

మనదేశంలో మంత్ర తంత్రాలకు మలబారుజిల్లా ప్రసిద్ధి. అందుకనే మళయాళ మంత్రాలు మహత్తరమైన వంటారు. మలబారులోని ప్రతివ్యక్తికి దయ్యాలన్నా, భూతాలన్నా, మంత్రాలన్నా తగని నమ్మకం వుంది. అచ్చట భూతాలలో ఒక తెగవుందట. ఆ తెగ భూతాలను "కుట్టిచాదను"లంటారు. కుట్టిచాదనులంటే భూతాలని అచ్చటనుండే చిన్నపిల్లలకు కూడా తెలుసు. ఈ భూతాలను వశపరచుకోటానికి ఒక విచిత్ర ముందట, 'కుట్టిచాదను'లకు కొన్ని పదార్థాలంటే మిక్కిలి ప్రీతియట. అట్టి పదార్థాలలో గేదెపాలు ముఖ్యమట. పశువు ఈనగానే ముందుగా ఆ పశువును పొదుగునుంచి పాలు త్రాగడానికి ఒక చేపాటి కర్రను చేతబూని ఈ భూతం వస్తుందట. ఇది స్థూలనేత్రాలకు మాత్రము కనపడదట. కుక్క కన్నుతో తయారుచేసిన ఒక అంజనాన్ని కాటుకగా పెట్టుకుంటే కనిపిస్తుందట. పశువు ఈనగానే దాని పాలుత్రాగడానికి ఈ దయ్యం రాగానే, దానిని వశపరచుకో దలచినవారు ఆ కర్రను లాక్కొని దగ్గరలోనున్న

ఏ చెరువుకైనా, కాలవకైనా పారిపోయి మెడలోతు నీటిలో నిలబడాలట. అప్పుడు భూతాలు నీటిలో ప్రవేశించవుగాన ఏలాటి ప్రమాదం వాటినుంచి రాదట. తన కర్రతిరిగి యిచ్చి వేయమని ఆ భూతం ఎన్ని విధాల బ్రతిమాలిన సనేమిరా అనాలట. నేను చెప్పినట్లు వింటానంటే నాకు వశమై వుంటానంటే ఇస్తానని చెప్పాలట. అప్పుడు విధిలేక ఆ భూతం మనం చెప్పినరీతిగా చేస్తానని చెప్పిన తరువాత ఆ భూతం మాట తిరిగిపోదట, తిరస్కృతలైన ప్రేమికులు రాజకీయాలలో కక్షగల వారు ఈ భూతాన్ని తమ ప్రయోజనాల సాధనాలకొరకు వినియోగించు కొంటారట, మన పశువులు ఈనగానే గృహాంగనలు గంగానమ్మ, పోలేరమ్మకు చల్ది అన్నం పెట్టి పూజిస్తారు. దృష్టితాళ్ళు వేయించుతారు. విభూతితో జపం చేయించుతారు.

సింహళదేశ మంత్రాలు

సింహళద్వీపములో మంత్రగాళ్ళు ఒకవిధమగు ప్రయోగం చేస్తారట. దానికి "పిల్లి" అని పేరట. ఈమాంత్రికులు శ్మశానవాటికలలోని పిల్లల మృతకళేబరాలను పైకితీసి వాటినిగాని గద్ద, గుడ్లగూబ మున్నగు వాటిని మృతకళేబరాలనుగాని మంత్రించడంతోనే ఆ భూతం దానిలో ప్రవేశించి ఎవరిపై ప్రయోగిస్తే వారినివెళ్ళి చంపడం జరుగుతుందట. అయితే దీనిలో ఒక మహాప్రమాదం కూడా వుందట. ప్రయోగం ఎవరిపై చేయబడిందో వారికి చూచాయగా తెలిసి, ఏతాయిత్తును ధరించినా ప్రతీకార మంత్రంతో జాగ్రత్తపడినా భూతం తిరిగి వచ్చి మంత్రవేత్తను ప్రయోగప్రోత్సాహకునికూడా చంపుతుందట.

సింహళద్వీపంలో జరిగిన ఒక సంఘటన ఈ రీతిగా జరిగినదట : ఒక రెవిన్యూ ఇన్స్పెక్టరు లంకలోని ఒకగ్రామానికి వెళ్ళాడట. అచ్చట కరణం, మునసబు మొదలైనవారు అందరు ఎంతో మర్యాద చేసి ఊరేగిస్తూ తీసుకువెళ్ళారు. ఒక వీధిలోనుంచి ఊరేగింపు వెడుతూ ఉండగా ఒక వర్తకునిభార్య వీధిలోకివచ్చి చూచిందట. ఆమె అందచందంచూచి, ఉద్యోగి ముగ్ధుడై తన నౌకరులచే బంగాళాకువచ్చి అనుగ్రహింపమని కబురు పంపించాడట. ఆమె నిరాకరించిందిట. ఆమె భర్తను చంపిస్తే సులభంగా వశపరచుకోవచ్చునని ఇన్స్పెక్టరు భ్రమపడి మాంత్రికుల సహాయం కోరాడట. ఒక మాంత్రికుడు దీనికి సమ్మతించి, ఉద్యోగిని అర్ధరాత్రివేళ శ్మశానవాటికకి తీసికొనివచ్చి ఒక మృతకళేబరానికి మంత్రోచ్చారణతో జీవంపొసి చేతికి కత్తినిచ్చి వర్తకుని చంపి రమ్మని పంపాడట. ఆ వర్తకుడుకూడా అదృష్టవశాత్తు కొంచెం మంత్రతంత్రాలు తెలిసినవాడేమో ఎప్పుడైతే తన మీదకు శక్తివస్తున్నదని గ్రహించాడో వెంటనే జపం ప్రారంభించాడట. వర్తకుని ఆరాధ్యదైవం ఆంజనేయస్వామి భూతాన్ని తరిమివేయగా అది తిరిగివచ్చి ఆ కత్తితోనే ఇన్స్పెక్టరును, మాంత్రికునికూడా చంపివేసిందట.

అంటే ఈ కథను బట్టి చూడగా పశువులశాలలోగాని రైతుల ఇండ్లలోగాని ఒక విధమగు గ్రహాలుంటాయని ఇప్పటి కాలంలో గూడా మంత్రప్రభావం, జపప్రభావంగల వారితో జపాలు చేయించు-తుంటారు.

ఆఫ్రికాదేశపు మంత్రాలు

ఈ మంత్రతంత్రాలతంతులు ఆఫ్రికాఖండంలో విపరీతంగా వుంటాయట. ఆఫ్రికాలో మాంత్రికులు ఒక చిన్న గొలుసును తమ మంత్ర శక్తిచే పాముగా చేయడమేగాక దానిచేత మాట్లాడించుతారట. ఎవరిపైనైనా కక్షతీర్చుకోవాలంటే ఈ మాయసర్పాన్ని పంపిస్తారట. యువకులు తాము ప్రేమించిన వారిని వివాహమాడగోరే పక్షాన వారు తన యందు ఇష్టం చూపకపోతే మంత్రాన్ని ఉపయోగిస్తారట, దీనికి "ఉకుపొసా" అంటారట. అర్ధరాత్రివేళ ఈ ప్రేమికులు తమ ప్రియురాండ్ర ఇళ్లకు వెళ్ళి ఈ మంత్రోచ్చారణ చేయడంతో ఆ యువతులకు నిత్యం వీరే కలలలోనికి వచ్చి చివరకు వివాహానికి అంగీకరిస్తారట. కొన్ని ప్రాంతాలలో మాంత్రికులు తమశక్తివల్ల పులి, సింహం, తోడేలు మున్నగు జంతువుల రూపంకూడా ధరిస్తారట.

దక్కన్‌లో మంత్రాలు

నైజాంలో "భవభూతి" అనే మంత్రం విశేషంగా ఆచరణలో ఉందట. ఈ మంత్రానికి మూలపురుషుడు గోరక్‌నాథ్. గోరక్‌నాథ్ ప్రతిష్ఠకు లక్ష్యాదులకు భిన్నంగా గ్రామస్థులను ఓడించి భయపెట్టి, బెదరించి, పైకంవసూలు చేసుకొంటూ వుంటారట. ఈ సంస్థానంలో మంత్రాలలో లంబాడీలకున్న అనుభవం ఎచ్చటా లేదట.

దక్షిణ ఇండియా మంత్రాలు

దక్షిణ ఇండియాలో బాబాబదీయాలో దుష్టగ్రహాలను మంత్ర శక్తివల్ల తరిమి వేస్తారట. పశువులకు పీడపట్టినపుడు గ్రామస్థులు వీరిని పిలిచి మంత్రాలు వేయిస్తారని కథాంజలి తెలుపుతున్నది.

అరణ్యాలలోనుండే ఆటవికుల చట్కాలు

మనదేశంలో వివిధప్రాంతాలలో ఆటవికులగు ఆదిమజాతులు అరణ్యాలలో నివసిస్తూఉంటారు. ఈ జాతిలో మగవాణ్ణి 'దొర' అని, ఆడదాన్ని 'దొరసాని' అని పిలుస్తారు. వీరు అనాగరికులు, అడవులలో చిన్న గూడెములు కట్టుకొని నివసిస్తారు. పశుపాలన, వ్యవసాయం, వారి ముఖ్యవృత్తులు. అడవిని నరికి చెట్లను కాల్చి భూమినిదున్ని వ్యవసాయం చేస్తారు. భూమిని కాల్చుటవలన సారవంతమై చక్కగా పండుతుందని వారి అభిప్రాయం. ఈ వ్యవసాయాన్ని 'పోడు' అంటారు. మామూలుగా ఈపోడు గ్రామానికి దూరంగా వుంటుంది. ఒక సంవత్సరం చేసిన వ్యవసాయపుభూమిని రెండవసంవత్సరం సాగుచేస్తే దానిని 'మనుం' అంటారు. పశువులమందలున్న దొర ఈ పొలంలో పశువులదొడ్డికట్టి త్రిప్పి పెంటకడతాడు. ఇంటిచుట్టూయున్న భూమిని 'పెరడు' అంటారు. దీనికి కూడ పెంటకట్టి బలంజేరుస్తారు. ఇందులో మొక్కజొన్న, చేమపైరు వేస్తారు. పోడులోను, మనుంలోను కొండజొన్న పండిస్తారు. ఇది వారి ముఖ్యమైనపంట.

ఆహారపానీయాలు

కొందరు చిన్న చిన్న మడులుకట్టుకొని వరిజల్లి పండించుకుంటారు. మొత్తంమీద ఈకొండజాతులన్నీ ఎక్కువ దారిద్ర్యంతో అలమటిస్తున్నా మొత్తంమీద ఉత్సాహంగా ఉంటారు. జొన్నలు విసరి పలుచగాకాచిన

దానిని జావఅనియు, గట్టిగా వండిన దానిని "గటక" అని అంటారు, జొన్నలను నానబెట్టి వెడల్పాటి రాయిమీద మెత్తగానూరుకొని పులకబెట్టి కాచినదానిని అంబలి అంటారు. అడవిలో దొరికే అన్నిరకాల కందమూలాలు చాలారకాల ఆకుకూరలను తింటారు. కరువు రోజులలో దీనినే ఆహారంగా ఉపయోగిస్తారు.

బాణాలతో జంతువులను వేటాడుట

అడవి జంతువులను, పశువులను వేటాడి చంపి తింటారు. వీరికి చేపలంటే మహాప్రీతి. ఎంత అవసరమైనదైనా, ఎంతలాభించేదైనా విడచిపెట్టి చేపలకోసం ఆడవాళ్ళు, మగవాళ్ళు వెళ్లిపోతారు. ఊతలు, వలలు ఎట్లా ఉపయోగించాలో బాగా తెలుసు. వాగునీటిలో వెళ్ళే చేపలను బాణాలతోకొట్టే నిపుణులు ఉన్నారు.

అదినుంచీ వీరు ఉపయోగించే ఆయుధం విల్లు లేక అంబు అంటారు. క్రూరజంతువులగు 'పెద్దపులి, అడవి దున్నలు, ఎలుగుబంట్లు, పెరం అనేజాతి అడవిఎద్దు' మున్నగువాటిని బాణాలతో పడవేస్తారు.

చట్కా చికిత్సలుచేసే వైద్యులు

గ్రామానికొక వైద్యుడుంటాడు. ఈ వైద్యుణ్ణి "వెజ్జు" లేక "వడ్డి" అంటారు. భూతవైద్యం, మూలికా వైద్యం అంటే వీళ్ళకు మహాయిష్టం. ఈ మూలికలు పశువులకు మనుష్యులకు అత్యద్భుతంగా పనిచేస్తాయి. శుద్ధులు, మర్దనలు చేయనక్కరలేదు. పుతాలు వేయనక్కరలేదు. ఆకో, వేరో ఇంత చితగొట్టియిస్తే చాలు. రోగం కుదిరపోతుంది. జ్వరం, దగ్గు, కఫం, ఊపిరితిత్తుల నొప్పితో ఎంత బాధపడుతున్నా న్యూమోనియా రోగికి ఒక వేరునూరి మూడుపూటలుయిస్తే తక్షణం కుదురుతుంది. ఈ జబ్బుకు వాళ్ళభాషలో "కురిం" అంటారు. గొంతుకలో టాన్సిల్సు (గ్రంథులు) పెరిగితే ఆపరేషన్ అవసరం లేకుండానే ఒక చిన్న వేరుముక్క నోటిలోవేసి ఆపూట మ్రింగేటట్లు చేస్తే వెంటనే తగ్గిపోతుంది. ఈ జబ్బును వాళ్ళు "కుతిక" అంటారు. మనిషికిగాని, పశువుకిగాని ఎముక విరిగితే కట్టుగట్టి మందువేస్తే అతుక్కొనిపోయే చెట్లుతీగెలు ఉన్నాయి. ఇలా ఎన్నోరోగాలకు పనికివచ్చే మహౌషధాలెన్నో ఉన్నాయి. కాని ఇంత చక్కని వైద్యం క్రమేణ నశించి పోతూవుంది. ఈ వైద్యులు తమకు తెలిసిన విషయం తమ జాతివాడికే చెప్పడు. తన అవసరాలుతీర్చి డబ్బును ఆశపెట్టి, స్నేహంచేసి, ఎంత ప్రయత్నంచేసినా లాభించని సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ రీతిగా ఎన్నో అమూల్యమైన విషయాలు వారితోనే నశించిపోతాయి.

దయ్యాలు, చేతబడులు

దయ్యాలు చేతబడులు అంటే వారికి అత్యంత నమ్మకం. వీరిలో పూర్వంనుంచి తంత్రవిద్యలు చేసేవారున్నట్టు చెప్పుకుంటారు. వీరికి పాండవులంటే అమితమైన భక్తి. సంవత్సరాని కొకసారి "భీముడు పండుగ" తప్పకుండా చేసుకుంటారట. వీరు భీమహిడింబుల కుమారుడైన ఘటోత్కచుని సంతతివారని చెప్పుకుంటారు. ప్రతివాడు జుట్టు విధిగా వుంచుతాడు. జుట్టులేనివాడిని అగౌరవంగా చూస్తారు. వీరు పాండవులనేకాక కొండదేవతలనుకూడా పూజిస్తారు. ఇంటి స్వంతదేవతలు కూడా ఉంటాయి. ఆ దేవతలన్నీ సాధారణంగా గుట్టలు మీదనే యుంటాయి. అచ్చట వీటితాలూకు పూజారులు పూజచేస్తూ వుంటారు. ఈ

పూజారులు చాలా నియమాలను పాటిస్తారు. ఒకరిచేతి అన్నం తినరు. మంచంమీద పడుకోరు, ప్రతిదినం వాగులో శిరస్నానం చేసి శుచిగానుండి తన వేల్పును పూజిస్తారు. ఈ వేల్పు ఒకగ్రామం మీదుగా వెళ్లటం తటిస్థిస్తే ఈ దేవతను పూజించే ఇళ్లవాళ్ళు ఆగ్రామంలో లేకపోయినా ఆగ్రామస్థులు నిండుకుండలతో నీళ్ళుతీసికొని వెళ్లి ఆ వేల్పుకు ధారగాపోసి ఒకకోడిపిల్లనిచ్చి గౌరవిస్తారు. దారిలో ప్రయాణీకులు ఎదురైతే ప్రక్కకు తప్పుకొని నెత్తిమీది తలగుడ్డలు తీసి నమస్కరించి గౌరవిస్తారు, వేల్పుకు అపచారం జరిగినట్లయితే ఆ దేవతకు ఆగ్రహంవచ్చి పెద్దపులిరూపంగావచ్చి తన పశువులను పడుతుందేమో లేక తనకుగాని, తనకుటుంబమునకుగాని ఏదో వ్యాధిరూపంలో హానికలిగిస్తుందనో వాళ్ళు భయపడుతూవుంటారు. వేల్పుకు మామూలుగా జరిపే లాంఛనాలప్రకారం పశువునుగాని, మేకనుగాని బలియిచ్చి కట్నంగా కొన్ని రూపాయలు సమర్పించుకొని, ఆ పూజారిద్వారా వారి వారి సందేహాలను తీర్చుకుంటారు.

మంత్రాలు, యంత్రాలు

దొమ్మలకు మంత్రము

కాళ్ళ వంకరకాళ్ళ, ఆకాశభాణి, పశుతాడవిప్పి కాళ్లాని గురుకువేళ్లాని, గురువుదోలుము, చకనిరు భుగుతం ॥

నవకోటిసిద్ధులాన, నాగ భైరవులాన, నాగురువు పాదములాన,

నెరడిదొమ్మకు మంత్రము

ముక్కినగుండిలు మున్నూరు, నల్లగుండెలు నన్నూరు, ఇరుగురుదొబ్బలు యిన్నూరు, తమలపాకువంటి నెరడి, తగిలి తగిలి, గొట్టుదు, కాళ్ళసిద్ధులాన, నవజారి చిప్పిన దిగకుంటినైన నవకోటిసిద్ధులాన దిగు...దిగు...నాగురువు పాదమాన.

ఆవిరి మంత్రము

ఊరికి ఉత్తరాన, వల్లకాడు, వల్లకాట్లో యర్రరాయి యర్రరాతిలో నల్లరాయి, కరిగితే కరిగినావు కరగకుంటునైన నవకోటి సిద్ధులాన, నాగభైరవులాన, కరగమంటే కరగవలెనా... గురువు...పాదమాన.

చెవిమాదకుమంత్రము

మూతలంత సాలి కక్కట బోపాతళీజవారు జీజి ఆకరుపాణి పొందుకీఁ. విజితారి, ఓంమారి ఓంమారి.

ఈరీతిగా తొమ్మిదిపర్యాయములు మంత్రించిన కరగిపోవును.

దూడను మరుగుటకు మంత్రము

సూర్యుడాన, చంద్రుడాన, ప్రొద్దుపొడిచిన, యేడుఘడియలకు నా పిలుపు రాకుంటివైన నవనాటి సిద్ధులాన, నాగభైరవులాన, అంత ప్రొద్దుకాడె అరఝాము పొద్దుకాడె, ఆవు, లేగ, కలుచును, జాలి

మాలిగొన్నట్లు పడుకుంటే ప్రక్కకు దిగను, నడిస్తే జానకు దిగను, ప్రొద్దుపొడిచిన యేడుఘడియలకు, పిలుపుకు రాకుంటె వైన నవనాది సిద్ధులాన, నాగ భైరవలాన.

గుగ్గిలము ధూపము వేసి ఆవునకు పట్టించవలెను. ఉప్పునూరి మంత్రించియోనిలో పెట్టిన చేపి మరుగును.

ఈనలేని పశువునకు మంత్రము

ముత్రలు, వుయరు, వరవుయల్, వలయు, దర్వం, నెవరేత్తాం వుయిరి, ర్వర, మమార, రభళ్లు, ఆ, అపతి, యవనిద్దిం బుయరు, వీసు, దారు, భీగు, లాయి– కామా, మరరగరగళ్ళు, వాయిన నాటి సిద్ధులాన, నాగభైరవలాన, దిగుదిగు నా గురువు... పాదమాన.

పాడిపశువులకు పాలుపడుటకు మంత్రము – ఇంద్రజాల యోగము


"ఓం హ్రీం క్రాలీపురుషం ముఖం హం శ్రీం ఠం ఠ"

రెల్లు దర్భలు తెచ్చి మంత్రము చదువుచు, ఉఫ్, ఉఫ్, యని పలుకుచు 108 పర్యాయములు ఈ మంత్రమునే సాయంసమయములందు జపించుచు, పశువుమీద దిగదుడిచి వేయవలెను.

చికిత్స

శతావరివేళ్ళు తెప్పించి నలగగొట్టి అర్ధసేరు లేక పావుసేరు రసము తీసి ఒక నెలవరకు విడువకుండ త్రాగించి ఈదిగున రక్షరేకు పశువు మెడలో కట్టవలెను. మాఘమాసం, సంక్రాంతి ఈపనికి మంచిది కాదు, పచారుకొట్లలో దొరకు భూర్జరమ్రాను పట్టమీద ఈ మంత్రమునువ్రాసి చుట్టి అష్టగంధములు అనగా గోరోచనము, కేసరి, గుగ్గిలము మొదలైనవాటిని ధూపమువేసి పశువుమెడకు కట్టవలెను.


పాలుపడేయంత్రము



పశువులు సుఖముగా నుండుటకు శాలగోడకు ఈ యంత్రమును అంటించవలెను.

వావిలాకు వేరును శాలలోనుంచిన విషపురుగులు అపాయములు కలుగనేరవు. కాన ప్రతిశాలలోను వావిలిచెట్టు యుంచుట చాల మంచిది.


గోశాల యంత్రము



గొడ్డుబోతు ఆవులు చూలుకట్టుటకు యంత్రము.

వంధ్యపశువుల మెడలో భూర్జరపత్రముమీద గోరోజనముతో ఈ యంత్రము వేసి కట్టవలెను.

చూడినిలిచే యంత్రము




పశువులు ఈనినపుడు కలుగు దోషములకు యంత్రము

ఈదిగువ యంత్రమును భూర్జరపట్ట (అనగా భూర్జర చెక్క పొరలు మెత్తగా నునుపుగజేగురురంగుగా నుండును. ఇవి బజారు పచారీ కొట్లలో దొరకను) మీదకేసరి, గోరోజనము కలిపివ్రాసి ధూపము వేసి మెడకు కట్టవలెను.


దోషాల నివారించేయంత్రము

నేను పైన చెప్పిన మంత్రములు, తాయత్తులు, రక్షరేకులు, పలువిధవిషయములను ప్రాచీన పశువైద్య గ్రంథములలోనుండగా తెలుపుచున్నాను. కాన వీటియందు సమ్మకమున్నవారే ఆచరణలో పెట్టాలి. లేనివారు



అనవసర విమర్శనలు చేయకుందురుగాక. వాటివిషయమై నా కెంత మాత్రము నమ్మకములేదు. మిత్రుల కోర్కెమీద ప్రకటింప వలసి వచ్చింది.


పాములు యింటిలోనికి పశుశాలలోనికి రాకుండ యిసుక మంత్రించి చల్లుట



గుబగుబపోకులు కలవరించి పెరిగిపడ వీరహనుమంతా; విశ్రహనుమంత; పాటెపాటె రుద్రమహాదేవీ కొంగువిభూతి నొష్టపెట్టుకుంటే అష్టనాగేంద్రులు కరువరాదు; బ్రహ్మరుద్రా దులు భేదింపరాదు; గురుభార్గవుణ్ణి తలిస్తే మున్నూట అరవై నాగేంద్రులకు ఉచ్చాటన; యెక్కడవుండినా యీ మంత్రాన యిసుకచల్లితే సర్పము రారాదు.

కోయమంత్రం

ఢిల్లిల్లి వాలపురుడిడిల్లి, సిగరి, తాండారి, రాజపొండారి, ఓం ఉత్తరదేశానికి సర్పగుమడి, సర్పనాకు చెప్పినకోయ



కట్టుమంత్రం

భూవతిపాదమాన, కోయ, బోయమ్మ పాదమాన, భాదిగు
ఛీదిగు, ఛా దిగు, ఛీ దిగు, ఛీ దిగు।

కట్టుమంత్రం

హరి, హరి. చప్పా, తులారి, జాంబులె, యిపాటి, జావురె, భాగుంజాంరె, బిల్లి, వల్లి, చిత్ర క్వద్వారెవుటో.

విడుపుమంత్రం

పూసలంబిందు బిరాచారీ.

* * *

ఇరువది అయిదవ భాగము

ప్రసవతంత్రము

పశువుపొర్లి ఈనేవరకు రైతులు జాగ్రత్తగా పోషించాలి. అనారోగ్యకరమగు స్థలములలోనుంచరాదు. చూడిలోనున్నపుడుగాని ఈనిన తరువాతగాని రోగాలు, ప్రమాదాలువస్తూవుంటాయిగాన మానవులకు వలె పశువులనుకూడా కాపాడాలి. మానవులకువలె పశువులను గూడ చాలాగారాబముతో పెంచితే పశువులుకూడా అతికష్టముగా ప్రసవించుతాయి. కొన్ని పశువులు సునాయాసముగా ఈనుతాయి.

గర్భకోశము

గర్భకోశమనునది ఒక కండరములసంచి. దీనిలో యోనిభాగము, పై పెదవులభాగముకూడా ఉంటాయి. గర్భకోశము మూత్రకోశమునకు, మలప్రేగులకుమధ్య అమర్పబడివుంది. ఇది రబ్బరువంటి కండరముచే కల్పింపబడింది.

ఇది రబ్బరువలె వెడల్పగుటకు చిన్నదగుటకు అనుగుణముగానుండుట వలన గర్భమును ధరించి దినదినముగా గర్భము పెరుగు సమయమున గర్భపుసంచి వెడల్పవుతుంది. పిమ్మట పక్వమైదూడ బయటపడిన తరువాత పూర్వమునుండిన స్వభావమునకు వచ్చుటకొరకే రబ్బరువంటి పువ్వుచే అమర్పబడి యుంది. గర్భాశయము వెడల్పయిన చోటికి శిఖరమనియు, మధ్యభాగమునకు దేహమనియు, చివరనుండు భాగమునకు గొందు అనియు, ద్వారమునకు నోరు అనియు పేరు. ఈనని పశువు గర్భాశయపు నోరనునది నిడుపుగాను, ఈనినపశువుకు గుండ్రముగాను ఉంటుంది. ఈ శుక్లమండలము ప్రతిచివరనుండి అండాశయమునకు దారి యుంటుంది. ఈదారులే గర్భాశయ నాళములనబడతాయి. ఈ ప్రతి నాళము చివర పుష్పమువలె విచ్చియుంటుంది. వీనికి అండాశయమునకును దగ్గర సంబంధముంది.

ఈ అవయవములలో వృషణములు, అంగము (చేరు) ముఖ్యమైన అవయవాలు. ఈ అంగము మూలముననే ఆడపశువు అండాశయములోనికి ద్రవపదార్థము స్రవించుతుంది. ఎదయగు కాలములో తప్ప యితరసమయములలో కత్తి ఒరవంటి ఒక భాగములో మూసియుంచబడుతాయి. ఈ ద్రవము కొన్ని నాళములద్వారా పోవునప్పుడు మాంస గ్రంధులనుంచి కొంతద్రవము బయలుదేరుతుంది. ఈ ద్రవములన్నియు కలిసిన యెడల వీర్యమనబడుతుంది.

మగపశువు బీజములు

ఇవి మూత్రపిండములో తయారగును. వీటికిని ఆడపశువు బీజమునకును చాల భేదముంది. మగపశువు బీజము 1/8400 వంతు అంగుళములు పొడవుగవుంటుంది. ఈ బీజములకు ముఖ్యముగా తల తోక అనుభాగము రెండేయుంటాయి. ఇది యింత సన్నముగా నుండుటవలననే ద్రవముతో నుంచిన యెడల చేప ఈదునట్లు ఈదుతుంది. దీనికిశక్తియుండుటవలననే ఆడపశువు బీజములలో ప్రవేశించుతుంది.

ఈ ద్రవములో బీజములు లక్షలకొలదియుంటాయి. ఈ ద్రవమునే ఇంద్రియమంటారు. ఆబోతు యొక్క ఇంద్రియమును పరీక్షించినయెడల బీజములను కనుగొన వచ్చు. ఈ వీర్యములో బీజములేనిచో నపుంసక బీజమంటారు.

ఆడపశువు బీజములు

ఈ పశువుయొక్క బీజము 1/1800 వంతు అంగుళము డయా మీటరు గలిగియుంటుంది. ఇవి గర్భకోశములో వుంటాయి. ఆడపశువు గర్భకోశములో వుత్పత్తి అవయవాలు చాల వుంటాయి.

ఆడపశువు ఎద

ఆవు ఎదయినపుడు దానిని కట్టివేసి దానిదగ్గర ఆబోతును విడువాలి, ఎదయైన పశువును రైతున కెన్నిపనులున్నను వెంటనే పశువుకు చూపించాలి. కాలువలోగాని, బురదలోగాని పశువును దిగనీయరాదు. అట్లు దిగినచో ఎదయను శక్తినిలిచిపోతుంది. తదుపరి మరల రావచ్చును. మంచిజాతిలోపుట్టిన ఆబోతు లేక దున్న వద్దకుతీసికొని వెళ్లాలి. మగపశువు దాటుచున్నది లేనిది జాగ్రత్తగా పరీక్షించాలి.

కలయిక

ఆబోతును ప్రతిదినము ఆవులతో కలుపుటకు వీలులేదు. వారమునకు రెండు ఆవులకంటే నెక్కువగా కలియనీయరాదు. ఆబోతును నియమితములేకుండ విడచుట వలన శీఘ్రముగా నపుంసకమవుతుంది. లేదా చచ్చియు చావక కునుకుచు బ్రతుకుతుంది. ఆవును అనేకసారులు దాటించుటచేత దాని చూలుకూడ పాడవుతుంది. ఆబోతు ఆవును ఒక సారి దాటినయెడల చూలుకలుగుతుంది. రెండవసారి దాటినయెడల చూడికి భంగము కలుగుతుంది. చూడి కట్టినతరువాత ఆవును మరల ఆబోతుతో కలియనీయరాదు. ఇట్లుకలిపిన గర్భస్రావము కలిగి ఆవు ఈచుకొనిపోతుంది. ఒక సారి చూడికట్టిన ఆవు మరల ఆబోతును కాంక్షించదని అనేకమంది అభిప్రాయపడుతారు. కాని ఈ సంగతి నమ్మదగింది కాదు. నాలు గైదు నెలలచూడితోనున్న ఆవులనుగూడ ఆబోతులు కలుస్తాయి.

ఆవును దాటించుకాలము

ఆవు ఈనిన 4 మాసముల వరకు ఆబోతుదరికి జేరనీయరాదు. అప్పుడు కరిపచ్చిగా దించుకొని యుంటుంది. గర్భము ధరించుటకు తగిన స్థితిలోనుండదు. ఒక వేళ ఆబోతు కలసినను చూలునిలువదు. ఆవు ఈ సమయములో అరచినను దాటించరాదు. ఎదై అరచినచో చన్నీళ్ళతో కడుగుట మంచిది. లేక సూరేకారము అరతులం చన్నీటితో కలిపి త్రాగించిన ఆతాప మణుగుతుంది.

యుక్తవయస్సు

పశువుయొక్క యుక్తవయస్సునుగూర్చి పశువైద్యశాస్త్రజ్ఞులలో కొందరికి భేదాభిప్రాయాలు గలవు. సామాన్యముగా ఆవుపెయ్య ఆరు మాసములకు యుక్తవయస్సు వచ్చుసరికి ఈనుతుంది; కాని అంతచిన్న

వయసులో గర్భము ధరించి ఈనిన పశువునకు పుట్టుదూడ బలిహీనంగ వుంటుంది. పాలనమ్మువారు ఆవుపెయ్యను ఆరుమాసములకే గర్భము ధరించునట్లు చేస్తారు. దానికి కారణమేమన– అంత త్వరలో ఈనిన యెడల వారు దానిపాలు మొదలగు వానిని అమ్ముకొని లాభము పొందుటకు ప్రయత్నించుతారు. జనసామాన్యమంతయు ఆవుపెయ్యకు రెండు సంవత్సరముల వయస్సు వచ్చునప్పటికి ఈనునట్లుగా చేస్తారు. ఈ సంవత్సరమునందు ఈనుపెయ్యను మనము జాగ్రత్తగా పోషించిన యెడల అది యెట్టికష్టములను పొందక దూడను పెడుతుంది.

ప్రసవకాల పట్టిక

పశువులను పెంచువారు పశువు పొర్లిన తేదీని జ్ఞాపకముంచుకొనిన యెడల అది ఈను సరియైనదినము ఆ యజమాని తెలిసికొన గలడు. ఈదిగువ పట్టికలోని మొదటివరుసలో తెలుపబడినవి పశువులు పొర్లిన తేదీలని, వానికి వ్యతిరేకముగ నున్న రెండవ వరుసలో నున్న తేదీలు అవి ఈను కాలమును తెలుపు తేదీలని గ్రహించాలి.

దీనికి ఉదాహరణము:– ఒక ఆవు జనవరి 10 తేదీని పొర్లిన యెడల అక్టోబరు 21వ తేదీన ఈనును. జూన్ 16వ తేదీన పొర్లినయెడల ఏప్రియల్ 6వ తేదీన ఈనుతుంది.

ఈ పట్టికలో వేసిన తేదీలు సుమారుగ వేయబడినాయి. ఈ చెప్పిన తేదీలకు కొద్దిదినములు ముందువెనుకలుగ ఈనుతుంది.

పశువులను కలుపుట

పశువుల అవయవాలు వృద్ధిచెందకముందు వాటిని కలుపరాదు. అలాకలిపిన వాటికి పుట్టేదూడలు మరుగుజ్జువి పుడతాయి. పెయ్యలకంటె ఆబోతులు ఒకటి లేక ఒకటిన్నర సంవత్సరాల వయస్సుగలవే పెయ్యలతో పొర్లగలవు. మామూలుగా పాలిచ్చేగోవులు సంవత్సరములో అన్నిఋతువులలోను దూడల్నికంటాయి. మామూలుగా గోవులు దూడల్నికనేనాటికి 1 ½ సం॥లు లేక 3 సం॥లు వయస్సు వుంటుంది. వాటివాటిజాతులనుబట్టి సాంప్రదాయాలనుబట్టి ఆవుపెయ్యలు చూడివి కానివి కట్టినతరువాత 21 రోజుల అనంతరము పనిచేయడానికి పనికి వస్తాయి. శీతాకాలములో ఎండవేడిమి పగలుకొద్ది గంటలుమాత్రమే యుంటుంది. కాని వేసవిలో పన్నెండుగంటలవరకుంటుంది.

వేసవి అనంతరము పొర్లించాలి

వేసవికాలములో పశువులు అశాంతితోనుండి ఉష్ణాధిక్యతవల్ల వుద్రేకంతో ఒకదానిమీద ఒకటి ఎక్కుతూవుంటాయి. వేసవి వేడిమికి గురియై పెయ్యలు వేసవి అనంతరము రక్తస్రావంకూడ కలదు. అందుచేత ఆవులను పెయ్యల్ని వేసవి అనంతరం పొర్లనియ్యడం, చాలామంచిది. కాని ఇది అన్ని పశువులవిషయంలో సాధ్యముకాదు. చూడి కాలము మామూలుగా తొమ్మిదిమాసాలు, కాని కొన్ని

సందర్భాలలో ఈకాలంకొంచెం ఎక్కువ. పశువు చూలుతోనున్నపుడు పాలిచ్చే ఆవులకు పాలుతగ్గుతాయి. అసలు చూడిదాల్చడం వేసవికాలం వెళ్ళిపోవుటస్ఫురింపచేస్తుంది.

చూడి నిలిచిందీ లేనిదీ కనుగొనుట

పెయ్యలకు అంటే మొదటియీతవాటికి స్తనాలుపొదుగు పెద్దవిగా వుంటాయి. అయిదుమాసాల తరువాత చూడితోనున్న పెయ్యెలకు తేనెవంటి తీగెలు మర్మావయవంనుండి వెలువడుతాయి ఆడపశువులు స్రవించే నీరువంటి పల్చని తీగెలవలన అవికట్టలేదని తెలిసి కోవాలి. శాస్త్ర ప్రవీణులు పశువుల మర్మావయవాలు పరీక్షించి చూడిని నిర్ణయించ గలరు. అనుభవం లేనివారు పరీక్షలు చేసి ప్రకృతిసిద్ధముగా వుండేపశువుల ఆరోగ్యమునకు భంగముకలుగ చేయరాదు. ఆరవమాసానంతరం అనుభవంగల రైతులు పశువుశరీరంమీద చన్నీళ్లు పోస్తారు. అప్పుడు పశువువణకినప్పుడు దాని శరీరంమీద కుడివైపున చేతితోతాకి, చూడిని కనుగొన గలరు.

పశువు ఈనేముందు లక్షణాలు

దూడ పుట్టబోయేముందు పొదుగు మరీపెద్దదైయుంటుంది. పొదుగు అకస్మాత్తుగా పగులునన్నంత ఉబ్బరంగా నిండుగా మెత్తదనంలేక యుంటుంది. పొదుగు తరచుగా ఆవుకు బాధకలిగించే టట్లుంటే పొదుగునుసున్నితంగా రుద్దాలి. కాపులు తీయాలి. ఆవుయీనే ముందు యోని సడలుతుంది. ఇందువలన అశాంతి యేర్పడుతుంది. పశువు ఆందోళనతో తరచుగా లేచి నిలబడడం, పరుండటం, కట్టుగొయ్య చుట్టూ బాధచే తిరగటం సాగిస్తుంది. మేత మేయదు. ఈ గుణాలు ఏర్పడినప్పుడు ఆవు ఈనుతుందని తెలుసుకోవాలి.

పశువులు ఎచ్చట యీనితే మంచిది

పశువు ఎచ్చట యీనితే మంచిదో అనే విషయం మీద భిన్న భిన్నాభి ప్రాయాలున్నవి. వేసవిలో ఎండలేని సమయంలో ఆరు బయట ఈనడం మంచిది. ఈనడం జరుగుట కష్టసాధ్యమైతే పశువును కొట్టంలోనుంచాలి. తగిన సహాయం వెంటనే చేయాలి. మామూలుగా విలువగల పశువులు కొట్టాలలోనే ఈనుతూ వుంటాయి. వాటిని జాగ్రత్తగా పశు పోషకులు కనిపెట్టి యుంటారు. తక్కువ రకం పశువులు స్వభావ సిద్ధంగా యీనుతాయి.

ఈనిన పశువును ఎన్నాళ్లకు పొర్లనీయ రాదు

కొన్ని పశువులు యీనిన పది రోజులకే ఎదకావడం కలదు. కాని మామూలుగా రైతులు యీనిన మూడు, లేక ఆరు మాసాల పిమ్మట గాని పొర్లనీయరు. రైతులు సంవత్సరానికొక కోడెదూడ పుట్టితే చాలు ననుకుంటారు.

ప్రసవకాలపట్టిక

పశువు పొర్లిన తేది	ఈనిన తేది	పశువు పొర్లిన తేది	ఈనిన తేది	పశువు పొర్లిన తేది	ఈనిన తేది
జనవరి 1	అక్టో॥ 12	ఫిబ్రవరి 1	నవం॥ 12	మార్చి 1	డిశెం॥ 10
2	13	2	13	2	11
3	14	3	14	3	12
4	15	4	15	4	13
5	16	5	16	5	14
6	17	6	17	6	15
7	18	7	18	7	16
8	19	8	19	8	17
9	20	9	20	9	18
10	21	10	21	10	19
11	22	11	22	11	20
12	23	12	23	12	21
13	24	13	24	13	22
14	25	14	25	14	23
15	26	15	26	15	24
16	27	16	27	16	25
17	28	17	28	17	26
18	29	18	29	18	27
19	30	19	30	19	28
20	31	20	డిశెం॥ 1	20	29
21	నవం॥ 1	21	2	21	30
22	2	22	3	22	31
23	3	23	4	23	జనవరి॥ 1
24	4	24	5	24	2
25	5	25	6	25	3
26	6	26	7	26	4
27	7	27	8	27	5
28	8	28	9	28	6
29	9			29	7
30	10			30	8
31	11			31	9

ప్రసవకాలపట్టిక

పశువు పొర్లిన తేది	ఈనిన తేది	పశువు పొర్లిన తేది	ఈనిన తేది	పశువు పొర్లిన తేది	ఈనిన తేది
ఏప్రియల్ 1	జనవరి 10	మే 1	ఫిబ్రవరి 9	జూన్ 1	మార్చి 12
2	11	2	10	2	13
3	12	3	11	3	14
4	13	4	12	4	15
5	14	5	13	5	16
6	15	6	14	6	17
7	16	7	15	7	18
8	17	8	16	8	19
9	18	9	17	9	20
10	19	10	18	10	21
11	20	11	19	11	22
12	21	12	20	12	23
13	22	13	21	13	24
14	23	14	22	14	25
15	24	15	23	15	26
16	25	16	24	16	27
17	26	17	25	17	28
18	27	18	26	18	29
19	28	19	27	19	30
20	29	20	28	20	31
21	ఫిబ్రవరి 30	21	మార్చి 1	21	1
22	31	22	2	22	2
23	1	23	3	23	ఏప్రిల్ 3
24	2	24	4	24	4
25	3	25	5	25	5
26	4	26	6	26	6
27	5	27	7	27	7
28	6	28	8	28	8
29	7	29	9	29	9
30	8	30	10	30	10
		31	11		

ప్రసవకాలపట్టిక

పశువు పొర్లిన తేది	ఈనిన తేది	పశువు పొర్లిన తేది	ఈనిన తేది	పశువు పొర్లిన తేది	ఈనిన తేది
జూలై 1	ఏప్రి॥ 11	ఆగష్టు 1	మే 12	సెప్టెంబరు1	జూన్ 12
2	12	2	13	2	13
3	13	3	14	3	14
4	14	4	15	4	15
5	15	5	16	5	16
6	16	6	17	6	17
7	17	7	18	7	18
8	18	8	19	8	19
9	19	9	20	9	20
10	20	10	21	10	21
11	21	11	22	11	22
12	22	12	23	12	23
13	23	13	24	13	24
14	24	14	25	14	25
15	25	15	26	15	26
16	26	16	27	16	27
17	27	17	28	17	28
18	28	18	29	18	29
19	29	19	30	19	30
20	30	20	31	20	జూన్ 1
21	మే 1	21	జూన్ 1	21	2
22	2	22	2	22	3
23	3	23	3	23	4
24	4	24	4	24	5
25	5	25	5	25	6
26	6	26	6	26	7
27	7	27	7	27	8
28	8	28	8	28	9
29	9	29	9	29	10
30	10	30	10	30	11
31	11	31	11		

ప్రసవకాలపట్టిక

పశువు పొర్లిన తేది	ఈనిన తేది	పశువు పొర్లిన తేది	ఈనిన తేది	పశువు పొర్లిన తేది	ఈనిన తేది
అక్టోబరు 1	జూలై 12	నవంబరు1	ఆగష్టు 12	డిశంబరు 1	సెప్టెం॥11
2	13	2	13	2	12
3	14	3	14	3	13
4	15	4	15	4	14
5	16	5	16	5	15
6	17	6	17	6	16
7	18	7	18	7	17
8	19	8	19	8	18
9	20	9	20	9	19
10	21	10	21	10	20
11	22	11	22	11	21
12	23	12	23	12	22
13	24	13	24	13	23
14	25	14	25	14	24
15	26	15	26	15	25
16	27	16	27	16	26
17	28	17	28	17	27
18	29	18	29	18	28
19	30	19	30	19	29
20	31	20	31	20	30
21	ఆగషు 1	21	సెప్టెం॥ 1	21	అక్టో॥ 1
22	2	22	2	22	2
23	3	23	3	23	3
24	4	24	4	24	4
25	5	25	5	25	5
26	6	26	6	26	6
27	7	27	7	27	7
28	8	28	8	28	8
29	9		9	29	9
30	10		10	30	10
31	11			31	11

పిండోత్పత్తిదశలు

పశువు గర్భములో పిండోత్పత్తికి కావలసిన అవయములు ఆరోగ్య వంతములుగా నుండి మార్గములన్ని అడ్డగింపులేక, మగ పశువుయొక్క ఇంద్రియము చెడకుండ నుండి మగ ఆడ పశువుల సంయోగము ఋతుకాలానుసరణమై సంభవించు నెడల వాని ఇంద్రియ మిశ్రమముచే పిండోత్పత్తి కలుగునని ఇదివరకే చెప్పియున్నాము. పశువు గర్భము ధరించినప్పటినుండి ఈనుకాలము వరకు 7 దశలుగా విభజింప వచ్చు.

మొదటిదశ

పశువు గర్భము ధరించిన తరువాత రెండవ వారమునకు పిండము పొట్టలోనుండి గర్భాశయములోనికి వస్తుంది. అప్పుడది ఒక అంగుళములో పన్నెండవ వంతునడిమి కొలత గలిగి యుంటుంది.

రెండవదశ

గర్భము ధరించిన మూడవ వారములో పిండముయొక్క మొదటి లక్షణములు కనబడుతాయి. శరీరము తల మొదలగు అవయవములు కొంచెము కొంచెముగా గుర్తుపట్టుటకు వీలవుతుంది. పిండము మూడవవంతు పరిమాణము గలదిగ ఉంటుంది.

మూడవదశ

అయిదు మొదలు ఎనిమిది వారముల వరకు 1 ¾ అంగుళముగల పిండము పెరుగుతుంది. ఈ కాలములో కాళ్ళదెక్కెలయొక్క చిహ్నాలు కనబడుతాయి.

నాలుగవదశ

తొమ్మిది మొదలు పన్నెండవ వారము వరకు 5 ¼ అంగుళము పిండము పెరుగుతుంది. నాలుగు గిట్టలు స్పష్టంగాకనబడుతాయి.

అయిదవదశ

13 మొదలు 20వ వారము వరకు 12 అంగుళముల పిండము పెరుగుతుంది. ఈ కాలములో స్పర్శశక్తిగల వెంట్రుకలు పెదవులమీదను, పై కనురెప్పలమీదను కనుబొమ్మలమీదను మొలచుతాయి, ఆడపిండమునకు చనుమొనలు వస్తాయి.

పిండమును పోషించుట

గర్భము ధరించినది మొదలు ఎక్కువగా తవుడు, తొండంగి, పిల్లిపెసరమున్నగు వాత పదార్థములు తినుచుండు పశువు శరీరమునందు వాతము కూడుకొని యుంటుంది. ఆ వాతము శరీరమునవుండి గర్భాశయమునకు పోతుంది. అట్లు వాతము పెంపొందుట వలన అంగ హీనము, గూని, తక్కువ నెలదూడలు,

మ్నుగునవి గలుగుతాయి. ఇంకను తల్లి యొక్క వాతము దూడకుకూడ సంభవించి దానిజీవిత పర్యంతము బాధించుతుంది.

గర్భస్థమగు దూడకు స్వాతంత్ర్యములేదు. తల్లి నిదురపోయిన పిండముకూడ నిదురపోతుంది. మేలుకొనిన మేలుకొంటుంది. కానపిండము తల్లికీ ఆధీనమై యుంటుంది. గర్భాశయమునందు సంయోగము గలిగినది మొదలు ఆ గర్భపిండమునకు అవయవములు సరిగా వచ్చువరకు గర్భాశయములోనుండు పదార్థముల మూలమున పిండము వృద్ధిబొందుతుంది. అవయవములు సరిగా వచ్చుచున్నప్పుడు పిండము వృద్ధిబొందుతుంది. అవయవములు సరిగా వచ్చుచున్నప్పుడు గర్భముయొక్క నాభియందు ఒక సన్నని రంధ్రముగల నాడికట్టబడి యుంటుంది. ఆ నాడితో మావి చేర్చబడుతుంది. ఆమావి తల్లి యొక్క రసాశ్రయమగు హృదయమందు జేర్చబడుతుంది. ఇట్లు జేయబడుట వలన తల్లి యొక్క ఆహారరసము ధమనుల వలన శరీరమున ప్రవహించుచు మావినిజేరుతుంది. ఆ మావి వలన దూడయొక్క నాభినాడిని పొందుతుంది. ఆ నాభి వలన ఆరసము దూడయొక్క పక్వాశయమందుజేరి అచట, దూడయొక్క కాయాగ్నిచే పక్వముగాబడి రక్తాది ధాతువులను పోషిస్తుంది. ఇట్లు గర్భమందున్న సమయములో తల్లి ఆహారరసము చేతనే గర్భము పోషింపబడుచుండును. పుట్టిన తరువాత గూడ ఆ తల్లి యొక్క ఆహార రసమే చన్నులయందు స్తన్యరూపమున పరిణమించి పుట్టిన దూడనుపోషిస్తుంది. ఆ తల్లి యొక్కరసవహనాడితో పిండముయొక్క నాభిగూడ గూర్చబడుతుంది. ఆ నాభినాడి రసవహ నాడియందు గూర్చబడిన దగుటచే ఆ తల్లి యొక్క ఆహారసారమును గ్రహించి దాని వలన పిండమును పోషిస్తుంది. గర్భమందున్న పిండము ప్రత్యేకముగ ఆహారపానీయముల సేవించక స్వచ్ఛమగు ఆహారసారమైన శరీర పోషణము జరుగబడు చుండుటచే గర్భస్థపిండమునకు స్థూలమలము గలుగదని గ్రహించాలి.

ఆరవదశ

21 మొదలు 22 వ వారము వరకు 2 అడుగుల పరిమాణము వరకు పిండము పెరుగుతుంది. ఈ కాలములో కనురెప్పలు, వెంట్రుకలు బాగుగా మొలచును. పిండము గర్భములో తిరుగుట తల్లి గుర్తించును.

అంత్యదశ

నిండుపిండము సంపూర్ణదశ నొందిపక్వమునకు ఎదురుచూస్తూ వుంటుంది.

చివరమాసములలో జాగ్రతగా చూడాలి

గర్భమున పెరుగుచున్న దూడ మాతృశరీరమునుండియే పోషక పదార్థము నాకర్షించుతుంది. అట్టిపోషకపదార్థములను ఆహార రూపమున చూడిపశువులు ఎక్కువగా తీసికొనవలసి యుంటుంది. ఎముకలు, కండరములును నిర్మించుటకు లవణములు కావలసి యుంటాయి. ఈ లవణములు లేని లోపముల వలన ఎన్నియో వ్యాధులు పుట్టుతాయి. గర్భము క్రమముగా విస్తరించుచున్నకొలదిని నాడీమండలమున కెక్కువ శ్రమ గలుగుతుంది. నరములు బలహీనమవుతాయి. చూడి పశువులు కొన్ని

ఆఖరుమాసమున చాల బాధబడుతాయి. ఈనుట ఆసన్నమగుచున్నపుడు గర్భము క్రిందికి జారుతుంది. ఇట్టిసమయములందు తగిన చికిత్సలు చేయాలి. గర్భముధరించి ఈను వరకు ఫార్మసి వారి విబ్రోనువాడిన ఏజబ్బుచేయదు. పిండము పెరుగుతుంది. ఆరోగ్యంగా వుంటుంది.

చూడిలో వచ్చేరోగాలు

కడుపులో వాయువు చేరుట

చూడిపశువు కడుపులో వాయువు చేరి డొక్క లుబ్బుతాయి. జీర్ణముకాని పదార్థములు తినుట వలన పిండమునకు ఏదైన అపాయము గలుగుట వలన ఈ వ్యాధిరావచ్చు. ఇంకను ప్రేగులయందు జీర్ణ శక్తి క్షీణించుటచేత కూడ వాయువు ప్రసరించి కడుపునొప్పి, శూలనొప్పి, కడుపుబ్బరము కలుగుతాయి, కాని విష సంబంధమైన మందు లేవియు పోయక అపాయము లేనిమందులనే వాడాలి.

మలబద్ధకము

ఈ వ్యాధి చూడి పశువులకు పలుమార్లు వస్తుంది. తినిన ఆహారము సరిగా జీర్ణమై పేడసరిగా వేయనిచో అనేక వ్యాధులు పుట్టుతాయి. లోపల పేడలోని మురికి పదార్ధములు పేరుకొని తదితర వ్యాధులు పుట్టిస్తాయి. ఇంకను అవయవముల యందలి బలమును కూడ తగ్గిస్తాయి. మల బద్ధకము వలననే చూడి పశువులకు కడుపునొప్పి, రక్తశూల గర్భశూల మున్నగువ్యాధులు జనిస్తాయి. కాబట్టి దీనికి చెప్పిన చికిత్సలు చేసిన మంచిది.

చికిత్స

వారమునకు రెండు పర్యాయములు అర్ధసేరు ఆముదమునిచ్చుట మంచిది.

లేక వాము అరసోలెడు, ఉప్పు 2 తు వేడినీరు అర్ధసేరు కలిపి త్రాగించుట మంచిది. లేక పార్మసీ వారివాతారిని వాడాలి.

విరేచనములు

చూలు కట్టినది లగాయతు ఈను వరకు కొన్ని పశువులకు పలుచని విరేచనము లవుతాయి. ఈ విరేచనములు దుర్వాసనగా వుంటాయి. ఇట్లు ఎల్లప్పుడు అవుతూయుంటే పశువునకు గర్భపాతము కలుగుతుంది. కాబట్టి ఆరంభములోనే తగినచికిత్స చేయుట మంచిది. ఈ విరేచనములతో కడుపునొప్పి కూడ యుండవచ్చును.

చికిత్స

మాచికాయలపొడి 1 తు, పోక పచ్చినేరేడు చెక్కరసము 15 తు, కలిపి దినమున కొకసారివంతున నాలుగైదు దినములు త్రాగించాలి.

లేక దానిమ్మ చిగుళ్లు 2 గుప్పెళ్లు పెరుగు అర్ధసేరు కలిపి త్రొక్కిపెట్టాలి.

పై మోతాడు దినము నకు రెండు పర్యాయముల వంతున నీయవచ్చును.

లేక ఫార్మసీవారి బేల్ పౌడరును వాడాలి.

వాతము

ఈ వ్యాధి వాతశరీరముగల పశువులకు సోకుతుంది. విశేషముగా ఎండలో తిరుగుట వలన యెల్లప్పుడు తేమనేలలో పడుకొనుట వలన లేక మలబద్ధకము వలన చూలుకాక మునుపు ఎక్కువగా తవుడు మేపుట వలన ఈ వ్యాధిరావచ్చును, నోటివెంట చొంగ పడుచు దుర్వాసనగా వుంటుంది. చెవును వ్రేలాడవేస్తుంది. శరీరము అంత వేడిగా నుండదు. పేడ వేయజాలదు.

చికిత్స

వాము అరసోలెడు, ఉప్పు చేరెడు, కలిపి త్రొక్కి అర్ధసేరు వేడినీటిలో కలిపి త్రాగించాలి.

లేక శొంఠిపొడి తులము, మిరియాలుపొడి 1/2 తులము, వేడి నీరు అర్ధసేరు కలిపి త్రాగించాలి.

షరా:- పశువులకు మంచి ఆముదము కాచి గోరువెచ్చనిది రాయాలి.

లేక ఫార్మసీవారి వాతారిని వాడాలి.

రొమ్మునొప్పి

వాతశరీరముగల పశువులకు, బలహీనముగానున్న పశువులకును గర్భకాలమున రొమ్మునొప్పి కనబడుతుంది. ఈ నొప్పిచే పశువు చన్నులలో యేదో ఒక దానిమీద గడ్డలేచి ఆగడ్డ పొదుగు వరకు వ్యాపించి చాల బాధచేస్తుంది.

చికిత్స

వెన్నపూస 6 తులములు, వెలిగారము 2 తులములు కలిపి చంటిగడ్డకు రాయాలి.

తరువాత ప్రతిదినము ఇసుకగాని, ఉప్పుగాని వేయించి గుడ్డలో వేసి ఆ గడ్డకు కాపులు కాచిన తగ్గును. ఈ ప్రకారము ప్రతిదినము తగ్గు వరకు చేయాలి.

లేక లోపలికి విబ్రోయిచ్చి గడ్డకు ప్లాస్టరును రాయాలి.

తీగెలు వేయుట

పశువు కఱినుండి చీమిడివంటి పదుతూంటుంది. ఆస్థానము మిక్కిలి వేడిగావుంటుంది. పశువునకు వేడి చేసినప్పుడెల్ల యీతీగెలు పడుతాయి. వాతరోగమున్న పశువులకు ఈ తీగెలు తరుచుగా పడుతూంటయి.

చికిత్స

పటిక లోషన్‌తో పశువు కఱిని కడుగుటమంచిది. వాతారినిగాని విబ్రోనుగాని వాడాలి.

ప్రసవించుటకుముందు సూచనలు

ఈనుటకు ముందు నొప్పులు వస్తాయి. పశువు శాంతముగా నుండలేదు. బాధపడుచున్నట్లు కదులుతుంది. పిండము తరచుగా మార్గము తప్పుటకు కారణమేమన:-సకాలమునకు ముందు ప్రసవించుటయేగాక, ప్రసవించు నొప్పులవలననే గాక, దూడ ఉన్నటువంటి స్థానమును బట్టిగూడ యుంటుంది. పశువు ఈనుటకు సరియైన కారణములు బాగుగా తెలియవు. పిండము బయటకు వచ్చుటకు వీలుపడునట్లు వృద్ధి పొందుతుంది.

పిండము వృద్ధియగుకొలది తల్లికడుపునుండి దూడకడుపునకు రక్తము మొదలగునవి స్రవించుట తగ్గిపోతుంది. ఇంకను వృద్ధి పొందిన కొలది తల్లి శరీరముతో సంబంధముండక దూడవిడిగా వుంటుంది. పశువులమలుగులు క్రుంగుతాయి. కొన్ని కనుగుంటలు విడుస్తాయి.

ప్రసవించుట


ప్రసవించునపుడు పట్టుకాలము వాలుగు భాగములుగా విభజించాలి.

(1) ప్రారంభదశ


(2) యోనిభాగముబ్బుట

(3) పిండము బయటపడుట

(4) పొరలు (మావి) బయటపడుట



పశువు ఈనుటకుముందు విశాలమైన స్థలములోగాని గాలివచ్చు పశుశాల గదిలోగాని యుంచాలి. ఆగది విశాలముగ తేమ లేనిదిగసున్నము కొట్టిన గోడలుగలదిగ ఉండాలి. పశువు ఆరోగ్యముగానున్నచో



నొప్పులు ఆరంభించగనే యోనిమార్గమునుండి తీగెలు, ద్రవము వెలువడుతుంది. గర్భాశయద్వారమునందలి గోళములలో ఊరిన కొంత ద్రవములో యోని ద్వారమునందు రక్షక సూక్ష్మజీవులు విస్తారముగా వుంటాయి. కాన హానికరములగు వ్యాధులను కలిగించు క్రిములు గర్భాశయమునందు ప్రవేశింపకుండ నీరక్షక సూక్ష్మజీవులు వానిని నిరోధిస్తాయి.

ఈ సమయములో పశువు గర్భాశయము చాల ప్రమాదములకు గురియవుతుంది. కాన అట్టి అపాయస్థితిలో విషమక్రిములు దానిలో ప్రవేశించకుండ చేయుటకు తగిన యేర్పాటులు సృష్టికర్తయే అమర్చాడు.

దూడ తనంతట అదేరాదు

దూడబయటికి వచ్చేటప్పుడు తనంతట అదేరాదు. తల్లికండరాలకు శక్తిలేనిదే దూడబయటికి రాదు. గర్భకోశంలోవుండే కండరం, కడుపులోని యితరకండరాలు, ఆసనము, యోని వీటిమధ్య భాగంలో వుండే కండరాల శక్తివలననే దూడబయటికి వస్తుంది. ఇంకను కడుపులోనున్న యితర కండరాలు కూడా కొద్దిగా

సహాయము చేస్తాయి. కండరాల శక్తి యెక్కువగానున్న పశువు సుఖముగా ఈనుతుంది. ఈ శక్తులు సరియైన స్థితిలో లేనిచో చిక్కు ఏర్పడుతుంది.

ఈనుట ఎప్పుడు పూర్తవుతుంది

కండరాలన్నీ తమతమ శక్తిననుసరించి పనిచేస్తాయి. సాధ్యమైనంత వరకు తమశక్తిని వృధాచేయక అవసరమైనపుడు విశ్రాంతి తీసుకుంటూ మరల మరల నొప్పులు వస్తాయి. కాబట్టి యిట్టి సమయంలో ఆలోచించి చికిత్సచేయాలి. ఒక్కొక్కప్పుడు మొదట నొప్పులు వచ్చిదూడ కదులుతుంది. కొంతసేపైన తరువాత మరల నొప్పులు రాకుండా ఆగిపోతాయి. గర్భకోశం కొంత విశ్రాంతితీసుకున్న తరువాత మరల నొప్పులు ప్రారంభమవుతాయి అప్పుడు ప్రసవించుట ప్రారంభం అవుతుంది కాని దూడ కొంత దూరం వచ్చిన తరువాత నొప్పులు ఆగిపోతే వైద్యుని సలహాతీసుకోవాలి

నొప్పులు రానప్పుడు ఏమిచేయాలి

నొప్పులు బాగారాక ఈనుట ఆలస్యమైతే దాని కండరాలు బలహీనముగా వున్న వన్నమాట అట్టి సమయంలో ప్రసవించే మధ్యలోనో, దూడ నేలమీద పడ్డ తర్వాతనో రక్తం ఎక్కువగా పోతుంది ఒక్కొక్కప్పుడు ఈనిన తర్వాత కొన్ని గంటల సేపటికి రక్తస్రావం కలుగ వచ్చు ఎందు చేతనంటే గర్భకోశకండరములు బలముగా వుంటేనే గాని దాని గోడల్లో అమర్చబడియున్న పెద్దరక్తనాళాన్ని అది గట్టిగా కట్టి వేయలేదు ఈ కండరము శక్తి వల్లనే ఈనిన వెంటనే రక్త స్రావం ఆగిపోతుంది. ఎందు చేతనన, గర్భకోశపు గోడలలోనున్న మావిజారి పోవుట వలన పుండు యేర్పడుతుంది. ఆపుండులోని రక్తనాళాన్ని గర్భకోశపు కండరములు గట్టిగా బిగించి రక్తస్రావాన్ని కట్టివేస్తాయి. కండరానికి ఈ శక్తి లేనప్పుడు ప్రాణాపాయంకూడా కలుగవచ్చు. ఎక్కువ కాన్పుల వల్ల బలహీన పశువులకు ఈ పరిస్థితి ఏర్పడుతుంది.

ఈనలేక వచ్చే ప్రమాదాలు

దూడ బయటకు వచ్చే మార్గం మూడు విషయాలమీద ఆధారపడియుంటుంది. ఒకటి దూడ, రెండు తల్లి గర్భములోనికి ద్వారము వరకు అవయవాలు, మూడు దూడను ఈదారిగుండానెట్టి బయటకు తీసుకొని వచ్చే శక్తులు. ఈమూడింటిలో ఏదిలోటున్నను ఈనుట సరిగా జరుగదు. అప్పుడు ప్రమాదము వస్తుందని గ్రహించాలి.

వస్తికపు ఇరుకువల్ల వచ్చేనష్టాలు

ఒక్కొక్కపుడు పశువుమలుగులు చిన్నవిగాను, వంకరగాను, ఇరుకుగాను ఉండవచ్చును. అప్పుడు గర్భ సంచిలోగాని, గర్భసంచి చుట్టు ప్రక్కలగాని పెరిగే గడ్డల వల్ల దూడ తలముందుకు రావడం వల్ల ఆటంకము ఏర్పడుతుంది. కొన్ని పరిస్థితులలో గర్భద్వారం పెళుసుబారి విచ్చకుండా పోతుంది. ఇట్టి

పరిస్థితులలో దూడ బయటికి రావడానికి వీలులేక పోతుంది. శస్త్రచికిత్సచేసి తీయవలసివస్తుంది. దూడ ఆకారంవల్ల గాని, గర్భ సంచిలోవున్న స్థానంవల్ల గాని, ఈనుట సరిగా జరుగజాలదు. కాబట్టి తగిన శ్రద్ధతీసికొనకపోతే తల్లికి ప్రమాదం కలుగుతుంది.

దూడ సరియైనస్థానంలో వుండాలి

దూడ సరియైనస్థానంలో ఉండవలసిన విధంగా వుండాలి. అనగాతల క్రిందవైపునకువుంటే సుఖంగా ఈనుతుంది. నొసలుగాని, ముఖం గాని ముందుకువస్తే ప్రసవం కష్టంగా వుంటుంది. మామూలుగా ముందు కాళ్ళు తల కలిపి రావాలి.

దూడ ఎదురు కాళ్ళతో ముందుకువస్తే, తలతరువాత రావడము చాలా కష్టము. ఇట్లు వచ్చుట దూడకు కూడా ప్రమాదం. అప్పుడు తెలివిగల పశువైద్యునిగాని, గ్రామంలో అనుభవంగా దూడలను తీసే వారినిగాని రప్పించాలి. అంతే గాని ఎవరు బడితే వారు లాగి చివరకు చేతగాదని పోరాదు. అనుభవంలేకపోతే ముందుగానే ఆలోచించుకోవాలి. యోనిలో చేతులు పెట్టి దూడ యొక్క పాటు దొరకక అనేక రకాలుగా బాధలు పెడతారు. 24 గంటలలో అట్టిదూడను లాగకపోతే పెద్ద పశువునకు అపాయం కలుగుతుంది.

దూడ అడ్డంగా తిరిగి నట్లుతోస్తే అప్పుడు గర్భసంచి యొక్క ఒత్తిడి ఎంత యెక్కువగాఉన్నా దూడబయటకు రాజాలదు. అప్పుడు వైద్యుడు చేయిచేసుకొని దూడను పాటుక త్రిప్పటమో లేక తదితర పనిముట్ల సహాయంతో లాగడమో చేయాలి. ఇట్టి సమయంలో అనుభవముగల వైద్యుడులేనిచో ప్రమాదమని గ్రహించాలి. లోపల కవల దూడలుండి అవిరెండూ లంకెవడియుంటే అప్పుడు కూడా ఆదూడలు బయటకు రావటం కష్టము.

కవల దూడలు

ఒక్కొకప్పుడు ఒక ఆడపశువుబీజంలో రెండు మగపశువు బీజాలు ప్రవేశించవచ్చు. అప్పుడు ఒక గర్భసంచి, రెండు బొడ్డుత్రాళ్లు, రెండు పిండాలు ఏర్పడతాయి. కాని ఒక్కొకప్పుడు రెండు ప్రక్కలనున్న బీజ గ్రంథులనుండి రెండు బీజాలు పుట్టవచ్చు. వీటిని రెండు వేరే వేరే మగ పశువుబీజాలు కలుసుకొన్నప్పుడు ప్రత్యేక పిండాలు యేర్పడతాయి. ఈరీతిగా యేర్పడ్డపిండాలకు, వేరు వేరు మాయలు, వేరు వేరు ఉమ్మి నీటి సంచులు ఉంటాయి. ఈ రెండు మాయలు కూడా ప్రత్యేకంగా గర్భ సంచిగోడలో అతుకుకొని పోతాయి.

కవల దూడలు నిండు నెలల వరకు ఉండుట అరుదు

కవల దూడల బరువు ఎక్కువగా విచ్చవలసియుంటుంది. అందుచేతనెలలు రాక పూర్వమే గర్భంపడిపోతుంది. నెలలునిండి సజీవంగా పుట్టినప్పటికి ఆదూడలు చాలా బలహీనంగా వుండి పుట్టిన వెంటనే గాని, కొన్ని రోజులలోగా చనిపోతాయి.

కవలలుండుట తల్లికి ప్రమాదం

కవల దూడలు కడుపులోవుండుట తల్లికి కూడా ఎక్కువప్రమాదం. ఉమ్మి నీరు అట్టి సమయంలో ఎక్కువగావుంటుంది. మూత్రపిండాల మీద గుండెమీద ఎక్కువ ఒత్తిడి కలుగుతుంది. ఒకేవేళ నెలలునిండే వరకు గర్భమునిలిచినా చివరమాసంలో తల్లి బాధపడుతుంది. ఎంతజాగ్రత్త తీసికున్నా మూత్రంలో జబ్బు వుంటుంది. ఈ జబ్బు పశువు ఈనే సమయంలో రెట్టింపుప్రమాదమును గలిగిస్తుంది. రెండు దూడలు ఒకే ఉమ్మినీరుసంచితోవుంటే చాలా కోనులలో ఆదూడలు రెండూ కూడా వంకరటింకరగా తిరిగి, ఏదీ సరిగాబయటపడదు. రెండు పిండాలు మెలికలుతిరిగితే అసలే బయటపడవు, ఒకేసారి మూడు, నాలుగు, ఆరుదూడలు పుట్టట కూడా కలదు. కాని ఇట్టివి చాలా అరుదుగా లక్షలో ఒకటి రెండు పశువులకు కలుగుతాయి.


గర్భకోశము బ్రద్దలగుట

దూడ పశువు గర్భకోశములోనుంచి బయటికి తోయడం గర్భ కోశకండరము యొక్కపని. ఈ కండరం చాలా బలంగా వుంటుంది. ప్రారంభంలో దూడను బయటకు తోయడానికి గట్టిగా ప్రయత్నించు-తుంది. కాని పైనచెప్పిన పరిస్థితుల వలన దూడ తన స్థానమునుండి కదలదు. కదలించడానికి గర్భకోశకండరము మరింత పట్టుదలతో, శక్తితో ప్రయత్నిస్తుంది. కాని అప్పటికి కూడా దూడకదలదు. ఈ రీతిగా రాను రాను గర్భకండరము యొక్క పట్టుదల తీవ్రమవుతుంది. ఫలితం ఒక నొప్పికి మరొక నొప్పికి మధ్య వ్యవధి తగ్గిపోతుంది. విడువకుండా నొప్పి ప్రారంభమవుతుంది. కడుపంతా ఒక పచ్చి పుండులాగా అవుతుంది. బొడ్డుక్రింద భాగం బిర్రబిగిసి వుంటుంది. నాడి చాలా తొందరగా కొట్టుకొంటుంది. భయంకరమైన బాధతో పశువు అటు ఇటు కొట్టుకుంటుంది. దూడ మాత్రం కదలదు. ఎట్టి సహాయమూ ఉండదు. అప్పుడు జరిగేదేమిటి? కొంతసేపటికి గర్భకోశం పటేలుమని పెంకువలె పగిలి పోతుంది. ఇట్టి సమయంలో దాని బాధను చూడలేము.

గర్భకోశం ఈ రీతిగా పగులగానే దూడ, ఉమ్మినీరు, సంచితో గర్భంనుండి బయటికి వచ్చి, రక్తనాళాలనుంచి రక్తము ఆగకుండా కారిపోతుంది. ఇట్టి సమయములో అనుభవ వైద్యులకు చూపించాలి. బలముగల నొప్పులు వెంటవెంటనే వస్తున్నప్పటికి దూడక్రిందకు జరుగక, బయటకువచ్చుటకు ఆలస్యం అవుతూవుంటే వెంటనే వైద్యసహాయం కావాలి

రెండుతలల దూడ

వికృతాకారము గలవి నెమరువేయు జంతువులలోనే కలుగుతు వుంటాయి. రెండు తలలుగలదూడ పుట్టినప్పుడు అది బ్రతుకుట చాల కష్టము. లేక కొన్నిదినములుండి చనిపోవచ్చును. అనేకగ్రామములలో



యిట్టిదూడలు పుట్టినవుడు ఆయాగ్రామస్థులు వినోదముగా చూచుచుందురు. మరికొందరు ఆదూడ అట్లు పుట్టుట వలన ఆ దూడ చచ్చిన తరువాత గ్రామములో ఉత్సవము చేసి దానిని పాతిపెట్టుదురు.

ఈ దూడ సామాన్యముగా 50 దినముల వరకు బ్రతికియుండుటయు కలదు. ఈ దూడ పుట్టుక చాలా కష్టప్రసవముగనే యుంటుంది. కాని కొన్ని దూడలు బయటకు రాలేక పశువులు చాలా విపరీతముగా బాధపడతాయి. ఎందు చేతననగా ఆ రెండు తలలయొక్క అతుకు మెడ యొద్దగాని, పుట్టెయొద్ద గాని నుండుట చేతను, ఒక తలముందునకు, మరియొక తల వెనుకకు వుండుట చేతను కష్టముగా ఈనుతుంది. ఈనునపుడు ముఖభాగమే ముందర వచ్చుట విధియై యుంది. అట్టి ప్రసవసమయము నందు యోనిని పరీక్షించినయెడల కారణము తెలిసికొనగలము.

చికిత్స

ఇటువంటి కష్టప్రసవము కలిగినపుడు దూడనుకోసి తీయుటగాని, లేక డొక్కను కోసిగాని దూడను తీయాలి. ఒక్కొక్కప్పుడు ఒక తలను గాని, రెండు తలలను గాని నరికివెయాలి. రెండు శిరస్సులు కపాలముపద్ద కలిసికొనియున్నపుడు శస్త్రచికిత్స చేసి ఆ రెంటిని విడదీయాలి. ఒక తలను ఒక మెడను వీలైనంత వరకు, క్రిందకు వచ్చునట్లు నరకాలి. కొన్ని కొన్ని సమయములయందు అతి జాగ్రత్తగా నేర్పుతో, సమయానుకూలముగా పిండమును లాగుట వలన సుఖప్రసవము కలుగుతుంది.


రెండుగా వికృతాకారముగలవి రెండు పిండములచేకూడియుంటాయి. అవి ముఖ్యముగా ఆవుల యందు కలుగును. సామాన్యముగా గొఱ్ఱెలయందు పందులయందు గుఱ్ఱములయందు మిక్కిలి అరుదుగ కలుగును. చూడిని గుర్తించుటకు;– పశువు శరీరము పెద్దదిగానుండుటయు, రొమ్ముముకభాగము, తొంటి భాగము ఇవి రెంట్టింపు లావుగను, పెద్దవిగను కనబడును. సామాన్యముగా అవి ప్రసవించు కాలమందు మిక్కిలి కష్టము సంభవించును. అరుదుగా సుఖప్రసవము కలిగిన దూడలు జీవించుటగూడ కలదని కొందరు శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు.

దూడ అడ్డము తిరుగుట

తల ముందు భాగము నుండి గాని, వెనుక భాగము నుండా గాని క్రమముతప్పుట, డెక్కల భాగము తల్లి యొక్క వెన్నెముక వైపునకు తిరుగుట మొదలగునవి సాధారణముగా జరుగుతాయి. ఈ పరిస్థితులు సంభవించునపుడు పశువునకు ముఖ్యముగా గుండెబరువు అను వ్యాధి తటస్థించి మలాశయము గర్భాశయము పగలిన తరువాత మలాశయమునుండి పిండము వస్తుంది. ఇట్లు పగులుటకు కారణమేమన, ఈ భాగములోనే పిండము సామాన్యముగా అడ్డము తిరుగుట వలన మలాశయమునుంచి వచ్చుటచే గాని వేరొకటిగాదని భావించవలెను.

కారణాలు

పిండము వెన్ను భాగములో నున్నయెడల ముందు బరియెముకలు యోనిలోనికి వచ్చుటయు, పిమ్మట మన చేతికి రొమ్మెముక తగులును రొమ్మముక పైభాగము మెడయొక్క ముందు భాగము శ్వాసనాళముతో




అంశాస్థులకు మెడకు నడుమనున్న భాగమునకు పోవును. లేక పక్క్రవైపునకు జారవచ్చును. డెక్కయొక్క ముందు భాగము తల్లి యొక్క వెన్నెముక (యోని) వైపునకుండును. లేక వంకరగా తిరిగి యుండును.

పిండము యొక్క వెన్నెముక మీద చేతితో సరిచేసి ఉపయోగించిన యెడల దూడ సరియైన స్థానమునకు వస్తుంది. దూడ యొక్కతల యోనిలోనికి రానియెడల మరక చేతితో జాగ్రత్తగా తట్టవలెను. మనము యేవిధమైన ఆటంకములు లేకుండ చేయి పెట్టి ముందు పాదముల భాగము పట్టుకొని గాని లేక గట్టిగాగాని నెమ్మది నెమ్మదిగా త్రిప్పుచు యోని వద్దకు తీసుకొని రావాలి. ఇట్టి సమయములో దూడను కోసి తీయుటకు ఎక్కువ అవసరముండదు. చివరకు కష్టప్రసవ సమయమందు మాత్రము ఆపరేషన్ చేయవచ్చును. ఆపరేషన్ చేసినప్పటికి ఈనక పోయినయెడల సాధ్యమైనంత త్వరలో మత్తుమందిచ్చి మూర్ఛపోవునట్లు చేయాలి.

గర్భమునందు దూడ చనిపోవుట

దూడ గర్భమున మరణించినచో పశువునకు జ్వరము కలుగుతుంది. వణకుతుంది. కడుపులొ ఆరాటము కలుగుతుంది. పశువు విడుచు ఊపిరి దుర్వాసనగానుండును. శరీరము వేడిమి తగ్గి. కడుపు



సళ్ళువదలుతుంది. గర్భనొప్పులు ఆరంభమైన యెడల యోనిలోనుండి రక్తము మిశ్రమమగు దుర్గంధద్రవము కారుతూ పశువు డొక్కలుబ్బుతాయి. ఈ గుర్తులన్నియు పరీక్షించి లోపలిదూడను తీసివేయాలి. ఈసమయములో వాతారి ఆరఖును యిచ్చిన దూడ పడిపోతుంది.

అకాలప్రసవము

దీనినే ఈచుకొనిపోవుట లేక అకాల ప్రసవమందురు. పశువులలో అకాల ప్రసవము చాల ఎక్కువగా తటస్థించుచున్నది. అకాల ప్రసవమనగా పశువు గర్భతిత్తిలో దూడ కదలుట ఆరంభించినది లగాయతు 5 లేక 8 నెలల మధ్య ఈనుట, మొదట కాన్పు ఈచుకొని పోయిన తరువాత తదితర కాన్పులకు ఈచుకొని పోవుటకూడ కొన్ని పశువులలో గలదు. సామాన్యముకన్న ఎక్కువగా మేపిన పశువునకు ఈ అపాయము తప్పక వాటిల్లుతుంది.

కడుపుమీద దెబ్బతగిలిన చెడిపోయిన మేత తినిన గర్భము దాల్చినపిమ్మట మగజంతువులతో సంపర్కము కలిగిన చుట్టుప్రక్కల జంతువులేవైన ఈచుకొనిపోయిన యెడల ఇది పసిపట్టుట వలన పెద్దపులి

మొదలగు భయంకరమైన మృగములను అకస్మాత్తుగా చూచుట వలన మరియు బలహీనత వలన ప్రేగులలో ఆటంకము కలుగుట వలన ఈచుకొని పోతుంది.

లక్షణాలు

మేత మేయదు, మందగించును. విచారముగానుండును. పాలు ప్రసవించవు, స్తనములు జారును. జంతువు తరుచుగా అరచుచుండును. కఱినుండి తీగెలు వేయుచుండును. కడుపు ముడుచుకొని పోతుంది. తల్లి కడుపులో దూడ అటునిటు తిరుగ జాలక ఆగిపోతుంది. ఒక్కొక్క సమయములో దూడ కూడ లోపల చనిపోవుటయు కలదు. ఇంకను దూడ లోపల నుండవలసిన స్వస్థానముననుండక తప్పి పోవుటయు కూడ కలుగును. ఎరుపురంగుగల ద్రవము మర్మస్థానమునుండి కారుతుంది. పిండము బయట పడునంత వరకు ఆవు బాధపడుతుంది. అకాల ప్రసవములో దూడతల చిన్న దగుటచే త్వరగా ఈనుట పూర్తి-యగుతుంది.

సారాయి 10 తులములు, ఆవుపాలు అర్ధసేరు, ఇంగువ 2 తులములు, తుమ్మాకు పసరు పావుసేరు కలిపి త్రాగించాలి.

ఈచుకొని పోయిన వెంటనే వేడి గంజిలో ఉప్పు కలిపి నడుమునకు, తొడలకు రుద్దవలెను. వాతారి అరకును అరపౌను వాడాలి.

దూడకాళ్ళు ముందుకు వచ్చుట

పశువు ఈనుటకు ముందుగా కాళ్ళు, దెక్కలు బయటకు వచ్చును. తలతప్పి పోయి ప్రత్యేకముగా ముందు కాళ్ళు వచ్చును. అప్పుడు వైద్యుని పిలిపించి సరియైన స్థానములో నుండునట్లు చేయించాలి.

దూడపిఱ్ఱలు ముందుకు వచ్చుట

కొన్ని సమయములలో దూడ పిఱ్ఱలు ముందుగా బయటికి వచ్చును. ఇట్టి సమయములలో గూడ వైద్యుని రప్పించి తగిన చికిత్స చేయించాలి.

ఇటువంటి అవస్థలు అప్పుడ్పుడు అరుదుగా కొన్ని పశువులకు తటస్థించును. పశువు ఆసనముయొక్క మధ్యపల్లమును బట్టి చూచిన యెడల ముందుగా తెలియును. ఇట్టి సమయములో జాగ్రత్తగా వైద్యుడు లాగవలెను. లేనిచో లోపల దూడతల బెణక వచ్చును.

ప్రసవించిన వెంటనే పశువుచేయుపని

అన్ని పశువులు నొకేవిధమగు స్థితిలో ఈనజాలవు. గుఱ్ఱము, ఆవు, గొఱ్ఱె మొదలగునవి సామాన్యముగా నిలబడియే ఈనుతాయి. ఒక్కొక్కప్పుడు ఆవు పరుండి ఈను సమయములో నిలబడుటకు ప్రయత్నించుతుంది. పశువు అట్లు నిలుచున్నపుడు వెన్నెముకపై ఆధారపడుచు శరీరమంతయు ప్రక్కకు

వంచి శరీరపు మందు భాగపు అవయవములను రొమ్ము క్రింది ప్రక్కకు లాగుకొనుచు వెనుక కాళ్ళను పొట్ట క్రిందకు లాగుకొనుచు నుంటుంది. అట్లు చేయుచు చాల కష్టపడుచు మిక్కిలి శ్రమనొందిన తరువాత చాల నెమ్మదిగానిలబడుతుంది. దూడ క్రింద పడగనే, తల్లి దూడ మీదనుండు పొరలను దీసి వేసి బొడ్డుత్రాటిని నాకి తీసివేస్తుంది. దాని నాలుకతో దూడ యొక్క శరీరమును శుభ్రపరస్తుంది. దూడను సరియైన స్థితిలోనుంచి తన చన్నులయొద్దకు దానిని మూతితో నెట్టుతుంది. తరువాత దూడకు పాలు కుడుపుకొంటుంది.

ప్రసవకాలము – బొడ్డుత్రాడు

దూడ బొడ్డుత్రాడు మిగుల కురచగవుంటుంది. ఒక్కొక్కప్పుడు ఆ బొడ్డుత్రాడుదూడ క్రిందపడకమునుపే పశువు యొక్క యోని భాగములోనే తెగిపోతుంది. ఒక్కొక్కప్పుడు ఆ బొడ్డుత్రాడు గట్టిగను బలముగనున్నప్పుడు అట్లు తెగిపోక పొరలచేత చుట్టబడి దూడ క్రిందపడువరకు వుంటుంది. అప్పుడు ఆవు అశ్చర్యయుతమగు సహజజ్ఞానముచే దూడను పరిశుభ్రముగ తుడుస్తుంది. ఆ బొడ్డుత్రాటిని తీసివేస్తుంది బొడ్డునుండి రెండంగుళముల తరువాత త్రాడు తెగిపోతుంది. ఒక్కొక్కప్పుడు 5, 6 అంగుళముల వరకు తెగిపోతుంది. మనము కత్తితో గాని లేక కత్తెరతో గాని, దానిని కత్తిరించినపుడు యెట్టి ఆపదయురాజాలదు మిగిలియున్న భాగము బొడ్డునంటియుండి క్రమక్రమముగా ఎండిపోయి చివర కూడిపోవును. ముందుదారముతో కట్టి కత్తిరించాలి. జంట బొడ్డులతో కొన్ని పుట్టుతాయి. ఇట్టివి అరుదుగా వుంటాయి.

మావిపడుట


పిండ సంబంధమగు పొరలులేక మావియనునది ఊడిపడిన తరువాత బయటకు పడును. కొన్ని కొన్ని కేసులు మాత్రము వాని యొక్క బలమునుబట్టి దృఢత్వమునుబట్టి బలహీనతనుబట్టి ముందు వెనుకలుగా పడతాయి. దూడ క్రింద పడిన వెంటనే గర్భాశయము అతిత్వరితముగా శక్తివంతముగ ముడుచుకొనుచు విడిపోతుంది. ఈసమయమందు యోని యొక్క లోపలి భాగపు ఘనపరిమాణము క్రమక్రమముగతగ్గుతుంది. యోని భాగములోనికి అచటనుండు వదులైన ఎముకలద్వారా నెమ్మదిగ వచ్చుచుండును. ఆ పిండపు పొరలను లేక మావిని బయటకు స్వేచ్ఛగ రానీయక నొక్కి పట్టాలి. అదేసమయములో పొట్ట వెన్ను భాగముల యందుండు కండరములు అప్పుడప్పుడు పిండము క్రిందపడునపుడుండు బరువుచేతను, దూడయొక్క బొడ్డుతాడుచుట్టుకొని పోవుట చేతను, ఆ మావి గర్భాశయములోనుండి యోని భాగములోనికి ఈడ్వబడుతుంది. అప్పుడప్పుడా మావితో గూడ పశువుల గుండెప్రక్కనుండు రక్తము కొంచెము కొంచెముగా వస్తుంది. ఇట్టిరక్తమునాపుటకు అప్పుడప్పుడు సంభవించుగర్భాశయపు ముడుచుకొనుటలు కొంత వరకు ఆపుతుంది. 24 గంటలలో మావి పడని యెడల వెంటనే తగు చికిత్స చేయాలి. ఒకేసారి పశువులు కవలదూడలను కనునపుడు మొదట దూడ వెంటనే మావి బయటకు వచ్చును. అవి సరియైనత్రోవలో లేకపోవుట చేతనే అట్టి చిక్కులు తటస్థించుతాయి.

మావిని తిననీయరాదు

మావిని పశువు తిననీయకుండ కాపాడాలి. మావితిన్న పశువునకు ఊపిరి తిరగకుండ నుండు చిహ్నములు కనబడుతాయి. ఆవు ఈనగనే సాధ్యమైనంత వరకు దూడ పడిన తరువాత మావి పడుట మిక్కిలి అవసరము. అట్లు మావి వేయక యోని భాగమందే నిలవయున్నయెడల ఒక విధమైన జ్వరము కలుగుతుంది. మావి పడగనే యోని భాగము తనంతటదియే ముడుచుకొనిపోతుంది. యోని యొక్క ఘనపరిమాణము వెంట వెంటనే తగ్గి మరల వెనుకటిదశకు ఎన్నడును రాదు. యోని భాగములో నుండు బంక పదార్థములతో గూడిన పొర దాని సహజస్థితిలోనికి వస్తుంది. యోని యొక్క లోపలి భాగము వెంటనే ముడుచు కొంటుంది. ఇంక నా భాగములో నుండు ఎముకలు కొన్ని దినములలో ముడుచు కొని పోతాయి.

మేయిదిగుట

చూడి పశువును సరిగా మేపకుండుటవలనను, దుర్బలత్వమువలనను, వాతరోగమువలనను, అతికాక వలనను ఈ మేయి కనబడుతుంది. ఇది చాల ప్రమాదకరమైనది. ఈ మేయిలో అనేక రకములు గలవు.



చూడి పశువులకు ఈ మేయి కనబడగనే చాల ఆందోళన పడుతారు. ఈ మేయి దిగిన చూడి పశువునకు చికిత్స లెంతమాత్రము చేయరాదు. చికిత్సలు చేయవలెనని కోరికయున్నచో అనుభవముగల వైద్యుని

పిలిపించాలి. కాని తెలిసి తెలియని వైద్యము చేయరాదు. అట్లు చేసిన పిండమునకు అపాయము కలుగుతుంది. ఈ మేయి ఈనిన తరువాత కొన్ని పశువులకు కనబడుతుంది. మరి కొన్నిటికి చూలులోనే తటస్థించుతుంది. కాని పశువు ఈనుటకు ముందు ఈ మేయి ఆటంకము కలగించి పశువునకపాయము సంభవించుతుంది. ముక్కుచుండును. ఇంకను భరింప రాని నొప్పులు కూడ నుండును. కాబట్టి అది యేజాతిలో చేరినదో తెలిసికొని తగిన చికిత్స చేయాలి.

గరిమేయి

మనము గడ్డికోయు కొడవలికక్కు (గరకు) యేమాదిరిగనుండునో ఆమాదిరిగనే ఈ గరిమేయి యుంటుంది. జాగ్రత్తగా నెట్టాలి.

సొరమేయి

ఇది సొరకాయ ఆకారముగ వుంటుంది. ఈ మేయిక మధ్యగా గాని, ఒక ప్రక్కనుంచి గాని ఒక యెర్రని జీరయుంటుంది. ఈ జీరగల భాగము పశువు వెన్నెముకకు తిన్నగానుంచి లోపలికి తోయాలి. లేనిచో మరల వెంటనే జారుతుంది.

గుండ్రమేయి

ఇది కొబ్బరికాయ ఆకారముగ వుంటుంది. దీనికిని సొరమేయివలె జీరయుండును. పైవిధముగనే చికిత్స చేయాలి.

బల్లి ఆకారపు మేయి

ఇది బల్లి ఆకారముగా వుంటుంది. ఇంకను పనసమేయి, మిడిమేయి మొదలగునవి గలవని ఆయుర్వేద పశువైద్యులు చెప్పుతారు. ఇటువంటివి తటస్థించినపుడు అనుభవముగల వైద్యునితో జాగ్రత్తగా తగిన చికిత్సలు చేయించవలెను.

చికిత్స

మేయిని స్వస్థానమునకు త్రోసి సీసాదూర్చి కట్టుకట్టాలి. మూడు నాలుగు దినములుంచి తీసి వేయాలి. లోపలికి వేడిచేయువస్తువులు పెట్టరాదు.

లేక ఏటవాలుగా నేల త్రవ్వి ఆగోతి పైభాగమున పశువుమేయి దిగిన భాగమున్ను, తలక్రింద భాగమునకు వుండాలి. ముందు మేయి స్వస్థానములో త్రోసి ఆపశువునట్లే కొన్నిదినములు వుంచాలి.

లేక ముందు నందివర్ధనపువ్వులు తెచ్చి గిద్దెడు రసము తీసి ఆ మేయికి రాచి సరియైన స్థానములో నుంచవలెను. నందివర్ధన రసములో నీరులాగివేయు శక్తియున్నది. ఆమేయి మరి కొన్ని గంటలలో గాని, కొన్ని దినములలో గాని మరల కనుపడవచ్చును. అప్పుడు మేయిని త్రోసి వేసి బద్దలు చెక్కి మానమునకు కట్టిన మరలరాదు. తరువాత ఒకటి రెండు దినములకు బద్దలు తీయవచ్చును. కొందరు మేయిని త్రోసి

వేసి మానమును కుట్టుదురు. ఇది చాలా మూర్ఖత్వపుపని మంచి పద్ధతి కాదు. ఫార్మసీ వారి అభితను వాడుడు. అప్పుడప్పుడు ముక్కుకుండ విబ్రోతో పంచదార కలిపి వాడాలి.

మేయిని త్రోసిన తరువాత

నల్లతుమ్మాకు పసరు అరసోలెడు, పాలు అర్ధసేరు, ఇంగువ 1 తులము కలిపి దానిలో ఎర్రగా కాల్చిన ఒక కంకరరాయి వేసి మరల త్రీసిత్రాగించాలి. అంతకు నొప్పులు తగ్గనిచో 3 డ్రాములు సారాయి తాగించాలి.

లేక పంచదారను త్రోసిన తరువాత లోపలి మేయికి అప్పుడప్పుడు పట్టించాలి.

మావిపడకుండుట

పశువు ఈచుకొని పోవునప్పుడు చాలసేపు నొప్పులుపడి యీనినప్పుడు నీరసస్థితిలో నుండి చాలినంత బలము లేకుండుట వలన బలము లేని ముసలి పశువులకును గర్భతిత్తి ముడుచుకొని పోవుట వలన గర్భతిత్తి నరములలో బలహీనత వలన మావి క్రిందపడక నిలిచిపోతుంది. పశువు మానమునుండి మావి కొద్దిగా వ్రేలాడుతుంది. కాళ్ళు నేలమీద కొట్టుకొనుచుండును. తోక ఆడించుచు ముక్కుతుంది. మావి నిలువయున్నయెడల క్రుళ్లి దుర్వాసన వేస్తుంది. వెనుక భాగము పైకి లేవలేదు. సరిగా పశువు నిలుచుండలేదు. కనుగుంటలు విడుస్తుంది. ఈగలు మానముచుట్టు ముసురును. మానమువెంబడి మష్టు పడుతుంది. మావి కుళ్ళుట వలన శరీరమున కమిత బాధ కలుగుతుంది. ఈ చెడిపోయినదియు, క్రుళ్లినదియునగు మావి యొక్క సారము శరీరమందు ప్రవేశించి నెత్తురును చెరుస్తుంది. అందువలన జ్వరము. గడ్డలు లేచుట మున్నగు వ్యాధులు సంభవించుతాయి. జ్వరము తగిలిన తరువాత నాలుకయందు తేమయుండదు. పాలుండవు. కల్మషము నిలిచిపోయి మిగుల బలహీనముగా నుండును.

చికిత్స

ఆవు ఈనిన తరువాత

1 ½ దినముంటె మావి నిలువయున్న యెడల నువ్వులు అర్ధసేరు, వేడి నీరు సేరు కలిపి త్రొక్కి త్రాగించిననే అది క్రిందపడుతుంది.

లేక తాడికాయలు 8 తు. మంచి బెల్లం 10 తులములు కలిపి పెట్చాలి.

లేక పులిసిన చల్లలో కందనూరి కలిపి పెట్టాలి.

లేక ఉడక బెట్టిన సజ్జపిండి 1 ½ సేరు. మంచి బెల్లము అరవీశె, కలిపి త్రొక్కి పెట్టాలి.

లేక బెండకాయలు 15 లేక 25, నువ్వులు 10 తులములు, వరిగంజి సేరు కలిపి త్రాగించాలి. ఫార్మసీ వారి వాతారి అరఖు, ఉల్బంను వాడాలి.

మావిని తీసివేయుట

పశువు యోనిద్వారమున చేయి జొనిపి మెల్లగా గర్భతిత్తులలోనికి పోనిచ్చి మావిని పట్టుకొని బయటకు తీసికొని రావాలి. చెయ్యి లోపలికి పోయినందున గర్భ తిత్తికి ముడుచుకొను శక్తిగల్గుతుంది. అందు వలన మావి వెలుపలికి వచ్చి రక్తమునిలిచి పోతుంది. ఈ మాత్రము కూడ మీకు తెలియని యెడల ఒక అడుగు పొడవుగల సన్నని బద్దలు రెంటిని తీసుకొని వ్రేలాడుచున్న మావి యొక్క చివరను, ఆ రెండు బద్దల మధ్యనుంచి ఆ బద్దల యొక్క చివరలను రెండు చేతులతో గట్టిగా పట్టుకొని ఆ మావిని ఆ బద్దలకు చుట్టాలి. ఇట్లు చేయగా ఆ బద్దలు కరివద్దకు వచ్చును. అంతట మెల్లగా లాగుచు ఆవిధముగా చుట్టాలి. కఠినముగా లాగరాదు. ఎంత తేలికగా లాగిన అంత మేలు కలుగుతుంది. నెమ్మదిగా లాగినమొడల మావిరాక బద్దలకు చుట్టుటకు వీలులేని యెడల అంతటితో ఆదినము లాగి వేయుట మాని వేసి మరుసటి దినమున తిరిగి ప్రయత్నించాలి. మావిని తీసి వేసిన తరువాత పశువునకు సత్తువ కలుగుటకు గంజిపోయ వచ్చును. మావిని తీసిన తరువాత పశు రక్షామృతమును వాడుడు.

ఈనినతరువాత కలిగే మార్పులు

పశువు ఈనినతరువాత పక్షమురోజల వరకు ఎంతో జాగ్రత్తగా చూస్తూవుండాలి. పశువు తన దూడను నవమాసాలు పెంచడంవల్ల తన శరీరంలో అనేక మార్పులు కలుగుతాయి. ముఖ్యంగా గర్భకోశం పెద్ద దవడం, దానితో కడుపులోని కండరాలు పెద్దవవడం, శరీరంలోనుండే అవయవాలన్ని యేదో విధంగా మార్పురావడం జరుగుతుంది. ఈనిన తరువాత యివన్నీ యథాస్థానంలోకి యథాప్రకారంగా రావాలి.

గర్భకోశం ఎన్నాళ్లకు ముడుచుకుంటుంది

గర్భకోశం పశువు ఈనిన తరువాత రెండు వంతులు ముడుచుకొని పోతుంది. నాలుగైదురోజులలో వొంటి నొప్పులు తగ్గుతాయి. బొడ్డుక్రిందనరము అప్పుడప్పుడు తేలుతూ వుంటుంది. గర్భ కోశం పదిహేను రోజులలో రోజురోజుకు తగ్గుతూమలుగుల్లోకి చేరుకుంటుంది. నెల రోజులలో యధా స్థితి వస్తుంది. ఇట్టి పశువు కండరాలు బాగాగట్టిపడి యధాస్థితికి రావాలంటే అప్పుడప్పుడు పొలములో త్రిప్పుటమంచిది.

బాలింతరోగాలు – మైలపడుట

పశువు ఈనిన తరువాత వాతము చేతగాని తదితర కారణాల వలన గాని మష్టువంటి తెలుపుపదార్థము అప్పుడప్పుడు పడుతూ వుంటుంది. ఈనిన వెంటనే తవుడు, జొన్న పిండి, పచ్చివులవ పిండి మున్నగునవి పెట్టిన సూతికావాతము వచ్చిన పశువుకు ప్రమాదము రాగలదు. పశువు లోపలనున్న మైలపడాలంటే ప్రతిరోజు నిమ్మకాయంత కరివేపాకు ఉండ చేసి నోటిలో వేయాలి. ఈ రీతిగా వారం రోజులు పెట్టిన మైలపడుట తగ్గుతుంది. ఒక వేళ గర్భకోశం ఎక్కువ ముడుచుకొన్నట్లుయితే మైల అంతగాపడదు. మైలలోవాసన, జ్వరంలేకపోతే పరవాలేదు. దూడకు పాలిస్తూ ఉన్నప్పటికి మైలతక్కువగనే పడుతుంది.

సూతికా వాతము

మావిలో యేదైనా కొంత భాగంనిలచిపోయినా, లేక గర్భకోశంలోకి క్రిములు ప్రవేశించినా సూతికావాతం ప్రారంభమవుతుంది. మైలతగ్గి, రంగు మారి, దుర్వాసనవేస్తుంది. దీనితో పాటు జ్వరం, నొప్పులు, మల బద్ధకంకలుగుతుంది. ఇంకను సూతి కావాతంరావడానికి కారణం అశుభ్రత వల్ల యేర్పడిన క్రిములు. ఈనిన వెంటనే ఒక పెద్దపుండు మాదిరిగా గర్భకోశంలో అవుతుంది. బయట క్రిములుగాని, ఇతర అవయవాలలోనున్న క్రిములుగాని అతి సులభంగా గర్భకోశంలో ప్రవేశించుతాయి. అచ్చట తెరచుకొనియుండె రక్తనాళాలద్వారా పశువు రక్తంలోకి జొరబడతాయి. ఇదేసూతికావాతానికి కారణం. యింకను ఈనిన వేంటనే పిండి పదార్థాలు, తవుడు చిట్టు మున్నగునవి పెట్టుటవలన, చలిగాలిలో తేమలోను ఉంచుట వల్ల ఈ వ్యాధిరాగలదు. ఈనిన ఆరుమాసాలలోపుగా కూడ ఈ వాతంరావచ్చును.

లక్షణాలు

పశువు శరీరమంతా భారముగా వుంటుంది. త్వరలో ఉచ్ఛ్వాస నిశ్శ్వాసాలు, ఆయాసము, దవడలు నొక్కుకొనిపోవుట, మూతిని, తలను నేలమీద ఆనించి కన్నులు మూసికొని నోటినుండి చొంగపడుట, ముఖ్యముగా మలబద్ధకముండి మలకోశములో దుర్వాసనగానుండు పేడ చాలా నిలువయుండిన వెంటనే తగిన చికిత్స చేయక పోతే మరణమునకు సిద్ధమవుతుంది.

చికిత్స

వెంటనే జ్వరమెంతయున్నదో, చెవులగుప్పిళ్లతో పరీక్షించాలి. జ్వరములేక శీతలముగానున్నచో చేతికి ఆముదము రాచుకొని పేడను తీసి వేయాలి. లోపలికి ఫార్మసీ వారి వాతారి అరఖు ఒకపౌను ప్రత్యేకంగా యిచ్చిన తగ్గుతుంది. లేక కారపు పాలలో గిద్దెడు అల్లపురసము కలిపి ఒకటి రెండు మోతాదులీయాలి. మచ్చిలి గుంటలో ఒక రక్ష పెట్టితే నరాలు సడలుతాయి. శరీరమంతా వేడికాపులు తీయాలి. ముద్ద కర్పూరం 1 తు, తాటిబెల్లం 15 తులాలు కలిపి నాలుకకు రాయాలి. రెండు మూడు రోజులకు గాని తగ్గదు. వ్యాధి తగ్గినప్పటికి పాలుత్వరగా పడవు. అందుచేత ఫార్మసీ వారి క్షీరోజన్ వాడిన పాలుపడతాయి. కాచిన నీరు త్రాగించాలి.

దూడలకు మురుగుపాలు

పాలు సాధారణంగా తెల్లగా వుంటాయి. ఒక్కొక్కపుడు కొద్దిగా లేత పసుపురంగులో ఉండడంకూడకద్దు. పశువు ఈనిన వెంటనే ఇచ్చే పాలుమాత్రం తెల్లగా ఉండవు. దీని గుణ లక్షణాలు గూడా వేరు విధంగానే వుంటాయి. ఈ పాలను మరుగుపాలు అంటాము. ఇవి చిక్కగా బంకగా వుంటాయి. లేతగోధుమ రంగులోగాని లేదా పసుపు రంగు కలిసిన గోధుమ రంగులోగాని వుంటాయి. పుట్టిన వెంటనే దూడకు ఈమురుగుపాలు పుష్టిగా పెరగడానికి చాల అవసరం. పుట్టిన దూడ తొలిసారిగా పాలు త్రాగేముందు పొదుగును బాగా

పరిశుభ్రమైన గోరువెచ్చని నీటితో కడిగి ఆరనివ్వడం అవసరం. ఇందు వల్ల పొదుగుపైని ఏవైనా జాడ్యపు సూక్ష్మజీవులుంటే అవి దూడకు సంక్రమించవు.

మురుగు పాలలో A విటమిను సమృద్ధిగా వున్నది. ఇంతే కాక, వీనిలో, మామూలు పాలలోవున్న వాటికంటె ఆరు రెట్లు ప్రోటీన్లు ఎముకలకు బలంవచ్చేందుకు ఉపయోగపడే ఖనిజపదార్థాలు రెండు రెట్లు ఉన్నాయి. ఈ మురుగు పాలు పుట్టిన దూడ, ప్రారంభదశలో బాగా ఎదగడానికి, ప్రకృతి సిద్ధంగా తయారయిన దివ్యాహారమని చెప్పవచ్చు.

ఆవు పాలలో ఈక్రిందకనుపరుపబడిన ప్రమాణంలో ఆహారపదార్థాలున్నాయి.

నీరు (నూటికి)	ప్రొటీన్లు (నూటికి)	చక్కెర (నూటికి)	బూడిదసంబంధమగు పదార్థాలు (నూటికి)	కొవ్వు (నూటికి)
87.07	3.50	4.90	0.73	12.63

ఈనిన తరువాత పాలుపితకడం ప్రారంభించిన తర్వాత అయిదు రోజులకు గాని, పాలకు మామూలు లక్షణాలు పట్టవు. మురుగు పాలలో, రోగాలు సంభవించకుండా కాపాడగల పదార్థాలు సమృద్ధిగావున్నాయి. మామూలు పాలకూ, మురుగు పాలకూ ఉన్న భేదాలలో ఇది ముఖ్యమైనది. క్రొత్తగా పుట్టిన దూడకు ఏవిధమైన రోగాలు సంక్రమించకుండా ఈ రక్షక పదార్థాలు బాగా ఉపయోగపడతాయి. లేగదూడ రక్తంలో రక్షకపదార్థాలు చాల తక్కువ. పశువు ఈనినప్పటినుండి, మురుగుపాల రక్షణలు రోజురోజుకూ అయిదు రోజులదాకా మారుతూవస్తాయి.

ఆవు మురుగు పాలలో, ఈక్రింది ప్రమాణంలో ఆహార పదార్థాలున్నాయి –

కాలం	ప్రొటీన్లు (నూటికి)	చక్కెర (నూటికి)	క్రొవ్వుపదార్థాలు (నూటికి)	బూడిదసంబంధమగు పదార్థాలు (నూటికి)	నెయ్యి (నూటికి)
మొదట పితికే సందర్భంలో	13.97	3.63	3.45	1.37	27.42
6 ఘం	9.34	4.04	13.02	1.07	26.47
24 "	3.99	4.25	4.88	0.87	13.98

44 "	3.57	4.85	4.25	0.85	13.52
68 "	3.79	4.35	4.19	0.84	14.17
84 "	3.58	3.52	6.79	0.81	14.70

పాడి పశువుల శాలలో, ఆవు ఈనిన తర్వాత మూడు రోజుల వరకూ పాలు అమ్మరు. ముురుగు పాలు మనకు త్రాగేందుకు ఉపయోగపడవు. ముురుగు పాలలో పొటాసియం చాల తక్కువ. ఈ పాలు మామూలుగా మారేకొద్దీ, ఇది వృద్ధి అవుతూ వస్తుంది. ఇనుము సంబంధమైన పదార్థాలు తక్కువ కాబట్టే ముురుగుపాలలో మామూలు పాలలో కంటె 10 నుండి 17 రెట్ల వరకు వుంటాయి. మామూలు పాలలో ఇనుము సంబంధమైన పదార్థాలు. దూడలు ముురుగు పాలద్వారా సమృద్ధిగా లభించే ఇనుము పదార్థాలను, దూడలు, అవసరమైన సందర్భాలలో వినియోగపడేందుకు గాను ఈ పదార్థాలను నిలువజేసుకోవడం జరుగుతుంది. ఎ విటమిను, ముురుగుపాలలో మామూలు పాలలో కంటే, 10 రెట్లు అధికంగా వున్నది. డి విటమిను మూడు రెట్లు అధికం. ముురుగుపాలకు ప్రేవులను మెత్తపరిచి, విరేచనం సక్రమస్థితిలో నుండేటట్లు చేసే గుణం కలదు.

దూడల ఆరోగ్యానికీ బాగా ఎదగడానికీ, ముురుగుపాలు తప్పని సరిగా వుండాలని పెక్కుమంది అభిప్రాయం. ఈ విషయంలో ఏకాభిప్రాయం లేకపోయినా, వీలైనంత వరకు, దూడలకు ముురుగుపాలు త్రాపడం, మంచిదేనని చెప్పవచ్చు. తల్లి పశువు చనిపోయినప్పుడు గాని లేదా జబ్బు పడిన, సందర్భంలో గాని, ముురుగుపాలు లభించని పక్షంలో, దూడలకు ఒక చంచా ఆముదం త్రాపడం యుక్తం.

* * *

ఇరువది ఆరవ భాగము

పసిదూడలకు పాలనుకుడిపే పద్ధతులు - మేపులు

దేశంలో పాడితక్కు వగుట, దున్నుటకు మంచి ఎద్దులు లేక పోవడము వలన ప్రజల దృష్టి ఈ వైపుమళ్లింది. ప్రభుత్వం దృష్టి కూడ మళ్లింది. అయితే ప్రాచీన సిద్ధాంతములను పాటించకుండా వుంటే లాభమునకు బదులు నష్టము వాటిల్లుతుంది. సిద్ధాంతములకుతోడు ప్రారంభములో లాభమును ఆశించక కొంత నష్టపడాలి. ఏలననగా దేశంలో మంచిజాతి ఆవులు, కోడెలు చాలా తక్కువగా నున్నాయి.

పాలుపితుకుట మంచిదా, పాలుతీసి త్రాగించుటమంచిదా?

పాశ్చాత్య పశుపోషణ విధానమున దూడ పుట్టగనే తల్లి పాలను కుడువనీయక దానిని విడదీసి మొదట పోతపాలవలనను, తదుపరి ఇతర ఆహారములను పెట్టి పెంచుతారు. సామాన్యముగ దూడ కుడిచినగాని ఆవుచేపదు. కాని, పాశ్చాత్యులు పాలను పితుకుట కెట్టి యిబ్బందిలేకుండా పాలనుపితుకు యంత్రమును కనిపెట్టి పాలు తీయుచున్నారు. ఈ రెండు పద్ధతులు మన సాంప్రదాయమునకు వ్యతిరేకముగా వుంటుంది. యంత్రముతో పాలు పితుకుట సామాన్య కర్షకుల కుపయోగపడదు. పెద్ద పెద్ద క్షీరోత్పత్తి శాలలందైన ఈయంత్రముల ఉపయోగముల వలన కొన్ని అనర్థములుగలవనియు, తెప్పించిన యంత్రములే కొన్ని మూల పడినవనియు అనుభవజ్ఞులు తెలుపుచున్నారు. ఇంతే గాక దూడను తల్లినుండి ఆరు నెలల వరకు విడదీయనవసరము లేకుండానే, అట్లు విడదీసి పెంచినపుడు వాటికి పోయబడే పాలకంటే మొత్తంమీద హెచ్చుపాలను వదలకుండగనే పోషింప వీలగునని శ్రీసతీశచంద్ర బోసుగారు తెలుపుచున్నారు.

దూడల్ని పెంచడంలో ముఖ్యముగా తీసికొనవలసిన శ్రద్ధ వాటిని కొట్టాలలోనుంచి మేపడమే మంచిదని రైతులంతా గుర్తించాలి. ఇలా ఎంతకాలము మేపాలన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నా, రెండు సంవత్సరాలుంటే చాలు. దూడల్ని కొట్టాలలోనుంచి సరిగా మేపక వాటిని ఎండకడితే అందువల్ల చాలాచెడువుంది. దేశంమొత్తంమీద కొట్టములలో పశువుల ఆరోగ్యం కాలమాన పరిస్థితులమీద ఆధారపడియుంది. చిన్న వాటిని మంచు బాగాపడుతున్న పచ్చికబీళ్ళలోకి తోలిన, వాటి ఆరోగ్యం చెడుతుంది. వాటిని గృహావరణములలోగల పచ్చిక స్థలాలలో మేపుతూ, శీతోష్ణస్థితి సరిగానున్నపుడు మాత్రమే బైటికి తోలాలి.

దూడల్ని బీళ్లకు ఎప్పుడుతోలాలి

కొట్టములలో నున్న పశువుల్ని పచ్చిక బీళ్ళలోకి దట్టంగా గడ్డి పెరిగియున్న చోట్లకు ముందరగాతోలితే, వాటికి రోగాలు వస్తాయి. కాబట్టి బీళ్లలోగడ్డి ఎండి పోయినప్పుడు గాని లేక గడ్డి చాలభాగం కోయబడి నప్పుడుగాని పశువుల్ని దూడల్లి బీళ్లకుతోలడం మంచిది. రెండు సంవత్సరాల వయస్సుదాటిన పశువుల్ని శీతాకాలం వచ్చే వరకు బీళ్లలో మేయనీయవచ్చును. శీతాకాలంలో వాటిని ఎక్కువకాలం కొట్టాలలోనేయుంచి

ఎండ వేళలప్పుడు మాత్రం బైటకుతోలుట మంచిది. కొందరు వాటినెప్పుడూ కొట్టాలలోనేయుంచటం కలదు. శీతాకాలంలో వీటికి ఎండుగడ్డి, బలంగల దాణా ఆహారం సరిపోతుంది. దూడలకు ఏగోంగూరో ఏపచ్చి ఆకులో పెడతారు. అటువంటి దూడలు ఆరోగ్యంగా వుండవు. కొట్టములలో పశువులకు నీరు, ఉప్పు ఎల్లప్పుడూ అందు బాటులోనుంచాలి.

పుశువులనుంచే చావడులు, కాంతి, గాలి బాగుగా వచ్చేవిగానుండాలి. సూర్య కాంతిమాత్రం పశువులకు చాలా ముఖ్యం. పశువులలో చిన్న వాటికి సూర్య కాంతి తగలడం అత్యవసరం. శీతాకాలంలో ఎండలోపలికి వచ్చే కొట్టాలలో దూడలు బాగా ఎదుగుతాయి. దూడలుండేచోటు శుభ్రంగానుండి, పరుండే చోటుమాత్రం చెమ్మలేకుండా వుండాలి. వాటిమూత్రం, పేడవగైరాలు కొట్టములలోలేకుండా శుభ్రంగా నుంచాలి. లేనిచో మిన్నల్లులు గోమారులు చేరి దూడలను బాధిస్తాయి. వేయబడిన గడ్డివగైరాలుపరచి వాటికి మెత్తగానుండేటట్లు చేయుట మంచిది. ఇంకను కొట్టాలు మాత్రము నిరపాయకరంగా వుండాలి. ఈ దాణా వగైరాలు మేపునప్పుడు మాత్రము వాటికి బాగా నీరుపెట్టాలి. అందువలన వాటికాహారం జీర్ణమై అతిత్వరగా పెరుగుతాయి.

దూడల్ని తెగమేపరాదు

పశువుల్ని, దూడల్ని కొట్టాలలోనుంచి వాటిని పనిచేయించకుండా తెగమేపుతూయుంటే క్రొవ్వెక్కి రొప్పుతాయి. అందుచేత పలువిధ రోగాల పాలవుతాయి. కొట్టములలో కంటే దొడ్లలో ఖాళీస్థలాలలో కట్టివేయుట మంచిది.

దూడల్ని పెంచడంలో రెండు విధాలుగా చేయవచ్చును. వాటిని పాలకొరకు తల్లి దగ్గరకు విడిచి పెట్టడం బొక్కెనలో పాలుంచి వాటిచేత త్రాగించడం. మొదటి పద్ధతే మంచిదని అందరు అంగీకరిస్తారు. ఇందు వల్ల దూడలు ఆరోగ్యంగా ఉత్సాహంగా వుండి త్వరగా ఎదుగుతాయి. కొన్ని దూడలు తల్లిపాలు ఎండి పోయే వరకు త్రాగుతూనే యుంటాయి. కోడె దూడలుగల రైతులు ఈ పద్ధతి చేస్తారు. ప్రత్యేకముగా దూడల కోసం తల్లి పాలన్నీ ఖర్చయితే తల్లున్ని మేపడం వల్ల ఖర్చులు చాలా పెరుగుతాయి. ఫలితమంతా ఒక దూడకే సరిపోతుంది. కొన్ని ఆవులు తమ దూడలకీయ వలసిన పాలు లేక పోతే వాటికితర గోవుల పాలుపితికి పోయవలసి యుంటుంది. ఈ పద్ధతి సామాన్యముగా పెయ్య దూడల విషయంలో చేయక కోడెల విషయంలో చేస్తూ ఉంటారు.

మామూలు అమ్మ కానికి తయారయ్యే కోడె దూడలు పుట్టినతరువాత మూడుమాసాలు తల్లి వద్ద పాలుత్రాగి, తరువాత తొమ్మిది మాసాలు ఇతర గోవుల పాలు త్రాగుతాయి. ప్రత్యేకముగా కోడెలకు పాలివ్వడానికి ఒక్కొక్కప్పుడు ఒక గోవు పాలు చాలకపోయినా, మరొక గోవును కూడా ప్రత్యేకంగా నుంచాలి. దూడలు చచ్చిన ఆవులు, ప్రతి ఈతకు అయిదారు యితర దూడలకు కూడ పాలీయగలవు. కాని, ప్రతిదూడను మూడుమాసాలు మాత్రమే ఒక ఆవు దగ్గర త్రాగించి, తరువాత దూడల్ని మరొక ఆవు వద్దకు మారుస్తారు.

పాలను బక్కెట్లలోపోసి త్రాగించుట

దూడలకు పాలను బక్కెట్లలోపోసి త్రాగించడం, దాని ఉపయోగాన్ని గూర్చి భిన్నాభిప్రాయాలు గలవు. దూడ పుట్టిన తరువాత కొన్ని వారాలైనా తల్లి వద్ద పాలుత్రాగడం అవసరమా అనవసరమా అనే ప్రశ్న కొందరికి కలిగింది. తల్లి వద్ద పాలుత్రాగడానికి అలవాటు పడిన దూడకు ప్రత్యేకముగా బొక్కెనలో పాలు పోసి త్రాగించడంచాలా కష్టం. తల్లి పొదుగులో తల పెట్టి పాలుత్రాగే దూడను బొక్కెనలో తల పెట్టించడం కూడా కష్ట సాధ్యమైపని. అట్టి దూడలకు ఆయారైతులు తమ వేళ్ళను పాలలోముంచి దూడనోటిలో పెడితే ఆవేళ్లను చప్పరించి, పాల రుచిని గ్రహించి తదుపరి క్రమేపి బొక్కెనలో పాలుత్రాగుటకు అలవాటుపడుతుంది. ఒక వేళ తల్లి మరణించిన వాటికిమాత్రం ఈ పద్ధతి మంచిది.

మామూలుపాలలో కాస్త ఆముదము కలిపి దూడలకు పోయడం మామూలు అరటిపండును ఆముదంలో ముంచి దూడ అంగిటిలో వారం రోజులకొక సారి వేయుట మంచిది. బలహీనముగానుండే దూడలకు పాలలో ఒకకోడి గ్రుడ్డు సొన కలిపి ఈయవచ్చును. దూడలు పుట్టిన మూడు వారాల వరకు పాలే ఆధారం. బొక్కెనతో పాలు పట్టునపుడు వాటిలో కొంచెము నీరు కూడా కలపటం మంచిది. ఖర్చు తగ్గించుకోవడం కోసం వాటికి పాలతో తయారయ్యే పదార్థాలు పెట్టవచ్చును.

పాలదూడలకు మాత్రమే రోజునకు మూడు పర్యాయములు తాగ్రించాలి. కాని, మన ప్రాంతాలలో ఉదయ సాయంకాలములందే పాలు తీయునపుడు మాత్రమే దూడలకు పాలుకుడుపుతారు. పాలను వాడే బొక్కెనలను ఏపూటకాపూట పరిశుభ్రంగా నుంచాలి. లేని యెడల అంటువ్యాధులు దూడలకు సంక్రమించ గలవు. పాలలో పెరిగిన దూడలకు వెంటనే మేత నలవాటు చేయాలి. దూడలుపుట్టిన మూడు వారాలు గడచిన తరువాత, రోజుకు పావుపౌను ఆహారం తినగలవు. ఒక్కొక్క వారానికి అరపౌను వంతున పెంచవచ్చును. మూడు మాసాల దూడకు రెండున్నర పౌనుల వంతున, ఆరుమాసాల దూడకు నాలుగైదు పౌనుల వంతునను ఆహారము పెట్టవచ్చును. మీగడ తీయబడిన పాలను దూడలకు పోయునప్పుడు వాటికి పప్పుగింజలు పెట్టాలి. లేనిచో వాటిశరీరాలకు కావలసిన పోషకపదార్థము తక్కువగుతుంది.

దూడలు పెరగడానికి తగినశ్రద్ధ

దూడలను మట్టితినకుండా కాపాడాలి. పెద్దవైన తరువాత కూడ జాగ్రత్తగా పోషించాలి. బలమునిచ్చే పదార్థాలలో ఖనిజములుంటే మంచిదని కొందరభిప్రాయం. ఫారాలలోనుండే దూడలకు ఉప్పు పెట్టుతు-యుంటారు. పాలపదార్థాలు కొట్టములలోనుండే దూడలకు ఈయాలి. ఈ దూడలు ఎండుగడ్డి కూడా తింటాయి. పచ్చి గడ్డి కూడా పెట్టుతూ యుండాలి. లేక పోతే ఆరోగ్యకరంగా నుండవు. దూడలకు నీళ్లు త్రాగించడం కొందరు రైతుల కిష్టముండదు. నీళ్ళు త్రాగితే వాటికి కడుపుబ్బుతుందని కొందరిభయం. మరికొందరు నీళ్ళు పెట్టడం మంచిదంటారు. కాని, వాటికి తగినన్ని నీళ్లు పెట్టుట మంచిది. దూడలు పెరగాలంటే వాటిని శ్రద్ధతో మేపుతుండాలి. వాటిని ఎంత అశ్రద్ధతో మేపిన అంతనష్టమే గాకుండా అవి

ఎన్నడూ పుష్టిగా పెరుగజాలవు. ఆరంభంలో కొంత కాలం వాటిని అశ్రద్ధగా మేపుట వలన వాటికి తిండితక్కువై జీర్ణశక్తి తగ్గిపోతుంది. అట్టి సమయములో వాటికి బలమైన మేతలు పెట్టితే రోగముపాలౌతాయి. కాన ఎక్కువ తక్కువలుగా మేపరాదు.

పశువులకు దూడలకు పెట్టే ఉప్పుఉత్పత్తి – ఉపయోగాలు

ఆఫ్రికాదేశపు కొన్ని ప్రాంతాలలో ప్రజలు మామూలుగా తమ వెంట ఉప్పుబిళ్లలు పట్టుకుపోతారు. వారు ఎవరిపైనైనా తమస్నేహ భావంచూపదలచినపుడు తమ ఉప్పు బిళ్లలను వారిని నాకనిస్తారు. ఎచ్చటనో తప్ప అన్ని ప్రాంతాలలోను ఉప్పు దొరుకుతుంది. ఉప్పు సముద్రపునీటి పుట్టిల్లు. ఆనీటిలోనే ఉప్పున్నది. ఆనీటిని ఎండ బెడితే ఉప్పు మిగులుతుంది. సముద్రంనుంచే కాకుండా భూగర్భంలోనుంచి కూడ ఉప్పును తీస్తారు. దీన్నేసైంధవలవణమంటారు. ఉత్తరహిందూస్థాన ప్రాంతాలలో ఈ ఉప్పును జాస్తిగావాడుతారు. భూగర్భంలో ఉప్పే కాకుండా ఉప్పు నీరు కూడా దొరుకుతుంది. ఈ నీటిని కూడా ఉప్పుగాతయారు చేస్తారు.

భూగర్భంలోని ఉప్పు పాతరలు

భూగర్భంలో అనేక లక్షల సంవత్సరాలక్రితం దేశం మధ్యనే సముద్రముండేది. చిలక సరస్సు మున్నగునవి ఇటువంటి సముద్రాలే. అనేక వాగులద్వారా నీరు వచ్చి ఈ సముద్రంలో పడేది. కాని ఇందులో పడ్డ నీరు తిరిగి ప్రవహించేది కాదు. చిన్న చిన్న వాగుల నీటితో పాటు ఉప్పునిచ్చి ఇందులో చేరేది. ఇది నీరు గాలికీ ఎండకూ ఇగిరినప్పుడు ఉప్పుమిగిలిపోతూ వుండేది; రానురాను ఈసముద్రంలోని నీరు సముద్రపు వాటికంటె కూడా ఉప్పగా తయారౌతుంది.

భూగర్భంలోని ఉప్పు పాతరలను త్రవ్వి అందులోనుంచి పెద్ద పెద్ద అచ్చులుగా ఉప్పును తీస్తారు. మరొకరీతిగా ఉప్పును తీయవచ్చు. ఉప్పు పాతరలోనికి గొట్టాలుదించి వాటిద్వారా నీరునింపి ఉప్పు కరిగిన నీటిపైకిలాగుతారు. అమెరికాలో ఒకప్పుడు ఉప్పుకొరకు నూతులను త్రవ్వగా పెట్రోలు వచ్చిందట. దాని విలువ దెలియక ప్రజలు నిస్పృహ జెందిరట. ఇప్పుడు అందరికి ఆపెట్రోలే కావలసి బావులు త్రవ్వుతారు. నూనెకు బదులు ఉప్పుదొరికితే ఇప్పుడు ప్రజలు నిస్పృహ జెందుతుంటారు.

ఈ ఉప్పునే వంటకాలలో వేసుకుంటారు. పరిశ్రమలలో కూడా ఉప్పు చాలా అవసరము. ఉప్పునుంచి తయారు చేసిన రసాయనాలను గాజుపరిశ్రమలలోను, రంగు పరిశ్రమలలోను వాడుతారు. మందులలో ఉపయోగించే రసాయనాలు కొన్ని ఉప్పునుంచి తయారుచేస్తారు.

ఉప్పు పరిమాణము

పలువిధములగు ఆహారములకు ఉప్పు రుచిని కలుగజేస్తుంది. మితిమీరి తిన్నచో రుచిని మరుగు పరచుటయే గాక మన రసగ్రహణ శక్తిని క్షీణింపజేస్తుంది. మితముగానుపయోగించిన, ఆరోగ్యముగా నుంటుంది.

కాని, మనకు వలయు పరిమాణము కంటె కొంచెముగ నుపయోగిస్తున్నాము. ఉప్పు పోషక పదార్థ మగుటయే గాక అది తిరుగమోతదినుసు కూడ. ఆ తరగతికే చెందిన పలురకములగు దినుసులకు వలెనే, ఇది కూడ పరిమాణం మించినచో అనర్థకమవుతుంది. ఉప్పు కేవలము ఆహారములో చేర్చదగు వొక పదార్థ విశేషము మాత్రమే కాదు. అత్యంతావసర మగు వస్తువు. స్వాభావికాహారమున మనకు తగినంత ఉప్పు లభింపదు. ఉప్పును అసలే వాడని ఆహారము దౌర్బల్యమునకు హేతువు. ఉప్పురుచి చూచుటకై అడవిమృగములు యెంతోదూరము తిరుగుతాయట. ఆదిమనివాసులు ఉప్పునకై యుద్ధములు చేశారు. కనీసము మానవునకు నెలకు తవ్వెడు ఉప్పు కావాలి. భోజనమునకును చేతిమీదకును వాడుకొను మొత్తము మాత్రమేయిది. వ్యవసాయమునకు ఉపయోగపడు జంతువుల ఆహారములో ఉప్పును ఉపయోగించుట అవసరముగా నెంచబడినను కావలసిన పరిమాణం ఎంత? అను విషయమున సరియగు నిర్ణయం కానరాదు. దక్షిణాఫ్రికాలోని పని వాండ్లు పశువునకు దినమునకు ఆరున్నర గ్రాములు (ఒకటిన్నర తులము) ఉప్పు కావలెనని నిర్ణయించారు. అనగా ఉప్పును యథేచ్ఛంగా తిననిచ్చినచో అపాయమేమంత లేకున్నను కొన్ని జంతువులకు హానికలుగవచ్చును. పనిచేయు గుర్రమునకు ఉప్పును విశేషంగా వాడుట అవసరం. యథేచ్ఛంగా వాడవచ్చును. చెమట మిక్కుటంగా పట్టు సందర్భములయందు ఉప్పును మరింత మిక్కుటముగ వాడవచ్చును. ఏలనన చెమటయందు ఎంతయో ఉప్పు పదార్థం నష్టమై పోతోంది.

ఉప్పు వేయనిచో ఆవులు ఉప్పుకైతహతహలాడుతాయి. దుష్ఫలితములు కనబడుటలో దీర్ఘకాలం పట్టినను, తుదకు మేతయందు అనిష్టము, తూకముతగ్గుట, పాలుతరుగుట సంభవించును. ఈ స్థితి ఈనుకాలము నందు గాని, పాలు బాగుగా నిచ్చు కాలమందు గాని సంభవించును. అట్టి సమయములందు ఉప్పును ఉపయోగింపగా అల్ప కాలంలోనే అభివృద్ధి కాననయ్యెను. పాలు ఎండిపోయిన ఆవులకును, ఎద్దు, గిత్తమున్నగు వానికిని పాడి ఆవులకును అవసరమైనంత ఉప్పు అక్కరలేక పోవచ్చును. ఒక గ్రాము మొదలు నలుబది గ్రాముల వరకును సగటున మానవుడు మూత్రముద్వారా ఉప్పును విసర్జిస్తాడు. ఆరోగ్యముగా ఉండి మితంగా నీరు వాడుచుండినచో అపాయం లేకనే ఎక్కువ పరిమాణమును విసర్జిస్తాడు. మితి మీరి పానీయమును సేవించుటచే దేహమునందు నీరు నిలిచిపోయి జలోదరము కలుగవచ్చును. కృషిక జంతువులలోని కెల్ల ఎక్కువగా ఉప్పును భరింపలేనివి కోళ్లు.

అనేక పరిశోధనల వలన ఉప్పును తగ్గించినచో ఆవుపాలు తగ్గునని తెలిసికొనబడింది. కాని పాడియావునకు అవసర మగు ఉప్పు పరిమాణ మెంతయో తేలలేదు. పాలు పెరుగుటకు ఆవులకు వేయు మేతలో నూటికి ఒకటిన్నరవంతులు ఉప్పుండాలని కొందరి నమ్మకం. పాడియావులకు దినముకు ఒకటి లేక రెండు ఔన్సుల అనగా 5 తులాలు. ఉప్పు చాలును. యథేచ్ఛంగా తిననిచ్చుట కూడ కలదు.

ఎన్ని పాలను విడచి పెట్టాలి

పశువు యీనగనే పాలు ఎన్నియున్నవి లేనివి గ్రహించాలి. పాలెక్కువగా నున్నయెడల తక్కువగానున్న యెడల ఎక్కువగా వదలి పెట్టుటయు చేయాలి. మామూలుగా దూడకు పొదుగునకు ఉండు ఒక వైపు



రెండుచన్నులలోని పాలే కుడుపాలి. పాలు చిక్కగానుండి ఎక్కువగా నిచ్చునపుడు తక్కువగా వదలి పెట్టాలి. దూడకు పాలుతక్కువగా కుడుపిన రక్తము పారుతుంది. ఎక్కువగా కుడిపిన తెలుపు రంగుగా పారుతుంది. నెలదినములు గడచు వరకు ప్రక్క పాలు దూడలకు కుడుపుతుండాలి. ముందరివైపు ఒక సారి రెండవవైపు మరియొకసారి వదలి పెట్టుచుండాలి. ఒకప్రక్కనే వదలి పెట్టుచుండినయెడల పొదుగు ఒరుగుగా దిగుతుంది. పాలు తక్కువగా నున్నయెడల మూడుచన్నులు వదలి పెట్టుచుండాలి. నెలదినములు రాగానే మేతమేస్తుంది. కాన ఒక చన్నులోని పాలు వదలి పెట్టుతుండాలి. దూడ నెప్పుడు ఆకలితోనుంచాలి గాని కడుపునిండుగా త్రాగించ రాదు. ఈ రీతిగా మూడు మాసముల వరకు చేయాలి తరువాత మీయిష్టప్రకారము వదలి పెట్టవచ్చును. పాలు చిక్కగానున్న దూడలు బ్రతుకవు గానతగ్గించుచు త్రాగించాలి. వెన్న తక్కువగానున్న పాలు ఎన్ని త్రాగినను వ్యాధులు రాజాలవు. పశువు ఎండి పోవు వరకు దూడకు ఒకచన్ను వదలి పెట్టినట్లయిన పెయ్యదూడయిన రెండు సంవత్సరములు వెళ్ళగనే పొర్లి మూడవ సంవత్సరములోనే ఈని పాలిచ్చును.

దూడలకు మన్నుతిను స్వభావము గాన చాల జాగ్రత్తగా కాపాడుచుండాలి. సామాన్యముగా ఈనిన పదిదినములు లగాయతు పచ్చి మేత కొరకు ఎదురుచూచుచుంటాయి. మరి కొన్ని తినుచుంటాయి. పక్షముదినములైన కడనుంచి అరుదుగా ఒక్కొక్క గడ్డి పరకయే కొరికి తింటాయి. పాలు త్రాగుట వలన మేత తినుట వలన సరిగా జీర్ణముగాక నెల జబ్బువస్తుంది. కాని బలత్కారముగా మాత్రము మేత పెట్ట

రాదు. లేనిచో పాలు మేత కలిసి చాల జబ్బుచేస్తుంది. కొందరు పాలెక్కువ తీసికొనవలెనని గరిక, గోంగూర మేపుదురు. ఇట్లు మేపుట వలన దూడ కడుపు లావుగా పెరుగుతుంది.

తత్వాలను బట్టి పాలుపడుట

కొన్ని పశువులకు ఈనిన వెంటనే పాలు రావు. అంత మాత్రమునకే వట్టి పోయినదని రైతు నిరుత్సాహపడరాదు. మొదట చన్నులనుండి పలుచగానుండు ద్రవము వెలువరించును. తరువాత ఒకటి రెండుదినములకు సాధారణపు పాలకంటె గట్టిగానుండు ద్రవము వచ్చును. తరువాత మంచి పాలు వచ్చును. కొన్ని పశువులకు దూడ పుట్టకముందును మరికొన్నిటికి దూడ పుట్టిన తరువాతను పాలు పడుట అక్క డక్కడ గలదు. గాబట్టి పాలు త్వరితముగా రానందులకు ఆతురత పడనవసరంలేదు. దూడకు పేగులలోనుండు మలిన పదార్థమును తొలగించుటకు తల్లి పాలనుండి వచ్చు నీటివంటి ద్రవమే మిక్కిలి ఉపయోగము. దూడలు పుట్టగనే పాలు త్రాగకపోయినచో అంతగా దిగులుపడ నవసరంలేదు.

పాలను నిడిచి పెట్టుట ఆహారములో మార్పుచేయుటకు సూచనలు

పాలు త్రాగిన వెంటనే కక్కినచో దూడత్వరగా త్రాగెననిగాని, అధికముగా త్రాగెననిగాని, ఏదైన జబ్బు చేసిన దనిగాని గ్రహించాలి.

ఒక సారి పాలుత్రాగి రెండవసారి త్రాగుటకు గాని, మధ్యకక్కినచో క్రొవ్వు పదర్థాము లెక్కువగుట చేత అజీర్తి చేసినదని గ్రహించాలి.

పాలు త్రాగిన తరువాత అర గంటకు పెరుగు బిళ్ళలవలె క్రక్కినచో క్రొవ్వుపదార్థము లెక్కువగుటచే అజీర్తి చేసినదని గ్రహించాలి.

మలబద్ధకమున్నచో క్రొవ్వు పదార్థము తక్కువైన దనిగాని, కావలసిన దానికి కంటె అధికముగా నున్నదని గాని గ్రహించాలి.

కడుపు నొప్పి యున్నయెడల మాంసకృత్తులధికముగా నున్నవని గాని, పాలు వేగముగా పట్టువడినవని గాని, అధికముగ నివ్వబడినవని గాని గ్రహించాలి.


ఫార్మశీ వారి వాతారి అరఖు దూడలకు అప్పుడప్పుడు యిచ్చుటమంచిది.

గాళ్ళు

ఈ వ్యాధి ఎక్కువగా తుక్కువ గడ్డి తినితిరుగుట చేతను, దూడ అనారోగ్యముగా నుండుట వలనను, చలిగాడ్పులలో నుంచుట వలనను, సరియైన పోషణ లేకపోవుట వలనను అంటు సంబంధమగు పశువులను సోకుట వలనను కలుగును ఈ వ్యాధి తగిలిన పశువుల పాలను దూడలకు త్రాగించరాదు. ఈ పాలు త్రాగిన దూడ నిముషముల ప్రకారము చనిపోతుంది.

లక్షణాలు

ఆరంభములో దూడ మందమతిగనుండును. జ్వరము తీవ్రముగానుండును. కండ్లు ఎరుపురంగుగా నుండును. దగ్గు ఉండును. తల ఆడించుచుండును. నోటికి సోకిన యెడల చప్పరించుచుండును. పండ్లు



దూడల జబ్బులు

కొరుకుచుండును. చిక్కిన దూడలు బలము కలవాని కన్న ఎక్కువ బాధపడుచుండును. నోటిలోను, కాళ్ళమీదనుండు వుండ్లు చితికి పుండ్లుగానగును. గిట్టలు పగిలి ద్రవము కారుచుండును. పురుగులుపడి ప్రాణాపాయము కూడ కలుగుతుంది.

ఆయుర్వేద చికిత్స

నాలుకకు అప్పుడప్పుడు ముద్దకర్పూరము తేనెతో కలిపి రాయుచుండాలి.

ధనియాలు 2తు, మిరియాలు అరతులం, ముద్ద కర్పూరము పరక తులము కలిపి బెల్లపు పానకముతో గాని బియ్యపు నీటితో గాని త్రాగించాలి.

నోటిపుండ్లకు

మాచికాయపొడి, పటికపొడి సమాన భాగములు కలిపి అప్పడప్పుడు అద్దుచుండాలి. పటికనీటితో నోరు కడుగుచుండాలి. ఇంకను తుమ్మచెక్క, రావిచెక్క వేసి కాచిన నీటిని కాళ్ళను నోటిని గడుగుచండాలి. కాలి పుండ్లకు అప్పుడప్పుడు నెయ్యిరాచుచున్న వచ్చిన జిలతగ్గి మానును. వేపచెక్క బూడిద పుండ్లకు పట్టించవచ్చును.

ఆహారము – సలహాలు

దూడను విశ్రాంతియైన పరిశుభ్రమైన శాలలో నుంచాలి. మెత్తని ఆహార పదార్థములు, యితర జావలు పెట్టుచుండాలి. పెసరపప్పు పేరినెయ్యి కలిపి పెట్టుట మంచిది. కాని తగిలిన దూడలను ఎండలో నెంతమాత్రము తిరుగనీయరాదు. అట్లు తిరుగనిచ్చినయెడల రొప్పుపుట్టును. దూడలు చెడిపోవును.

పాలదొమ్మ

దూడలు పాలు ఎక్కువతక్కువలుగా కుడుచుట వలన, పాలు పితుకునప్పుడు ఎక్కువగా విడిచి పెట్టుట వలన, చిక్కని పాలు కడుపులో చేరుట వలన, ఈ వ్యాధి కలుగుతుంది. నోటినుండి జిగురు వంటి పదార్థము వెలువడుతుంది. పాలు కడుపులో పేరుకొనును. కునికి పాట్లు పడుతూ దగ్గుతుంటుంది. మందమతిగానుండి నల్లకప్పువేయును. శరీరము ముడుచు కొనును. వ్యాధిముదిరిన కొలది గురక యుంటుంది. కడుపుబ్బును. కండ్ల నుండి నీరు గార్చును. ముక్కులగుండ ఒకవిధమైన ద్రవము కారుతుంది. క్రమేపి ఊపిరి ఆడక చనిపోతుంది.

చికిత్స

అప్పుడప్పుడు దూడలకు మలబద్ధకములేకుండ చూచుచుండాలి.

పసుపు 1 తులము, కొఱ్ఱపిండి 4 తులములు, వెన్న నిమ్మకాయంత కలిపి పెట్టాలి.

లేక పెన్నేరుదుంప 2 తు, గల్జేరు వేళ్లు అరగుప్పెడు, కలినీటిలో కలిపి త్రాగించాలి. లేక వాతారి అరఖును వాడాలి.

లేక మోదుగపువ్వు 1 తులము, బియ్యపునీరు అర్ధశేరు కలిపి త్రాగించాలి.

నెలజబ్బు

కొన్ని పశువుల పాలు చిక్కగనుండుట చేతను, పెచ్చుగనుండుట చేతను ఆకలి లేనప్పుడు తానంతటది పాలుత్రాగుట చేతను ఈవ్యాధికలుగుతుంది. దూడనాలుక మీద తెలుపు వర్ణముగల పొరయేర్పడును. ఊపిరి పులుసువాసనగా వుంటుంది. పాలు అప్పుడప్పుడు కక్కుతుంది. కక్కినపదార్థములలో పాల సంబంధ మైన విరుగుడు నీరుగాక జిగటగనుండు తెమడ యుంటుంది. వాంతితో పాటు అధికముగ మలబద్ధక– ముంటుంది. దూడ చిక్కిపోతుంది. ఆరోగ్యము క్షీణించుతుంది. ఎముకలు పైకి కనబడుచుండును. శరీరము శీతలముగావుంటుంది. కొన్నిటికి కడుపు నొప్పి కూడ యుంటుంది. సరియగు చికిత్స చేయనిచో దూడ చనిపోవును. దీనినే నెలజబ్బు అని యందురు.

ఆయుర్వేద చికిత్స

వాముర‌సం పావుసేరు, శొంఠిరసము పావుసేరు, ఉప్పు తులము కలిపి త్రాగించాలి. తమలపాకులు 10, ఇంగువ అరతులము, గురివిందాకు 1 తులము కలితోనూరి పెట్టిన తగ్గుతుంది. పాలలో మిరియాల పొడి కలిపి దానిలో కంకరరాయి ఎఱ్ఱగా కాల్చి పడసేసి రాయితీసి త్రాగించాలి. వెల్లుల్లి పాయలు, 1 తు, దుష్టపుచిగుళ్ళు అరగుప్పెడు, పెరుగు పావుసేరు కలిపి పెట్టుము. కంఠముదగ్గర మూడు గీతలుగా రక్షలు వేసిన తగ్గును. ఫార్మసీ వారి పశురక్షామృతం చక్కగా పనిచేస్తుంది.

విరేచనములు

కొన్ని సూక్ష్మజీవులు పశువుల పాలతిత్తులలోజేరి ఆపాలను దూడకుడుచు నప్పుడు దానికి సోకుట చేతను, పాలలోనుండు వస్తువులు తగ్గుట చేతను ఈ వ్యాధి దూడలకు రావచ్చును. సాధారణముగా నీవ్యాధి చాల సందర్భములలో అయుక్తాహార పానీయముల వలన కలుగుచున్నది. ఇంకను దూడలు చెడిపోయిన పదార్థములను తినుట వలన, చెడు నీరు త్రాగుట వలన రావచ్చును.

లక్షణాలు

కొన్ని దూడలకు మెల్ల మెల్లగ పారుట ప్రారంభించి క్రమముగ ఎక్కువ కావచ్చును. మరికొన్నిటికి ఆకస్మికముగ అధికముగనే ప్రారంభించును. విరేచనపురంగు కొంచెము వసుపుపచ్చగనుండి తరువాత నలుపురంగు గలదిగా నుండును. వానితో పాటు కొంచెము జిగురు కూడ నుండవచ్చును. ఇంకను దుర్వాసనతో గూడిన నీళ్ళవిరేచనములగును. పెరుగుతునకలవలె గుండ్రముగ ఉండ లుండలుగ నలుసులు విరేచనములతో కలిసియుండును. ఇవి జీర్ణముగాని పాలు అని తెలిసి కొనవలెను. విరేచనము లెక్కువైన కొలది దూడ నీరసించి చనిపోవును.

ఆయుర్వేద చికిత్స

నూనెలో ఏకుముంచి దూడ కంటించవలెను.

పమిడిప్రత్తియాకు మెత్తగానూరి కలితో కలిపి పెట్టాలి.

దానిమ్మయిగుళ్ళు గుప్పెడు తీసుకొని పెరుగుతో నూరి పెట్టాలి.

ఈ చికిత్సలు విరేచనములు కట్టువరకు రెండుమూడు సార్లు ఈయాలి.

ఫార్మసీ వారి బేల్ పౌడరును వాడాలి.

క్యాస్టర్ ఆయిల్ 2 ఔన్సులు యిచ్చిన ప్రేగులను శుభ్రము చేయును.

ఓపియం 1/3 తులములు అర్ధ సేరు గంజిలో కలిపి పెట్టాలి.

ఆహారము – సలహాలు

దూడకు పాలుకుడుపరాదు. వేడి నీటితో ఆరంభములో ఎనిమా చేయుట మంచిది. విరేచనములు పలుచగనుండి మిక్కిలి దుర్వాసనగానున్న యెడల వగరుపదార్థములిచ్చుట మంచిది. దూడకు వెట్టదనము నీయాలి. పొడి ఆహారము పెట్టాలి.

మలబద్ధకము

దూడకు మలబద్ధకము తరుచుగా సంభవించుచుండును. శీతా కాలములో మలబద్ధకము వలన అనేక దూడలు చనిపోవుచుండును. చిక్కని పాలు త్రాగుదూడలకు తగుచికిత్స చేయని యెడల దాని

యావజ్జీవమును బాధించును. ఇది పాలుతక్కువగుట వలన తగినంత క్రొవ్వుపదార్థము లేకపోవుట వలన ప్రేగులలో సరియైన గమనము లేకపోవుట వలన చలిగాలి ఎక్కువ సోకుట వలన రావచ్చును.

లక్షణాలు

మలబద్ధకముగల దూడలకు కడుపు నొప్పి కూడ నుండును. దూడ చిక్కును. పెద్దప్రేగు దినదినము తిత్తివలె పెద్దదై అందు మలము నిలువయుండి నానాటికి ప్రేగు బలహీనము చెందుచు ఆయాసపడు-చుండును. వ్యాధి ముదిరిన కొలది ప్రేగుచివరి భాగము బైటికి రావచ్చును. మలము గట్టిగా రాయివలె ఉండలుండలుగా ఆసనము వద్దనుండి బయటకు రాకపోవుటచేతినుకుచుండును. సరియైన చికిత్స చేయని యెడల మలము శరీరములో జీర్ణించి దుర్గుణములు పుట్టి చనిపోవును.

అయుర్వేద చికిత్స

4 అరటి పండ్లను తోలుతీసి ఆముదములోముంచి నోటిలో వేయాలి.

సున్నపు తేటగాని కారపు పాలుగాని అరగొట్టము పెట్టాలి.

గొలిమిడాకులను నూరి రెండు నిమ్మకాయలంత తీసికొని ఆముదముతో కలిపి పెట్టాలి.

2 తులముల ఉప్పును అర్ధసేరు గోరు వెచ్చని నీటిలో కలిపి త్రాగించాలి.

లేక వాతారి అరఖు వాడాలి.

ఆహారము - సలహాలు

చాలమందిరైతులు అతివేడి జేసి మలబద్ధకముగానున్న దూడకు బలుసాకు ఆముదము, శొంఠి, మున్నగువస్తువులు పెట్టుదురు. ఇట్లు పెట్టుట వలన ఇంకను వేడి జేసి మలము గట్టిపడి బయటకు రాక పోవుట చేత దూడ బాధపడుచుండును. కాబట్టి వ్యాధి నిదానముగా కనుగొని చేయాలి. దూడ యొక్క తత్వమును గ్రహించి ఎనిమాచేయాలి. వేడి బాగుగానున్నపుడు ఎనిమాచేయాలి. శీతలముగానున్నపుడు చేయరాదు.

కడుపునొప్పి

దూడ కడుపులో పాలు పులిసి పోవుట వలన కొన్నిరకముల పదార్ధములు పుట్టి ప్రేగులలో రెచ్చకొట్టుట వలన ప్రేగులలో పాలబిళ్ళలుండుట వలన పాలు సరిగా జీర్ణము కాకపోవుట చేతను ప్రేగులలో గాలి చేరుట వలన యింకను తదితర వ్యాధులవలనను ప్రేగులలో క్రిములుండుట వలనను కూడ ఈ వ్యాధిరావచ్చును.

లక్షణాలు

కడుపు గట్టిగానుండును. తనతలను పొట్ట నానించుకొని నాలుగు కాళ్ళను తనదగ్గర జేర్చుకొని ముడుచుకొని పడుకొనును. దూడకు బాధ ఎక్కువైన కొలది కాళ్ళతో నటునిటు తన్నుకొనుచుండును.

దూడ మూత్రద్వార సమీపమున నుండు చర్మము ముడుచు కొనిపోవును. మల బద్ధకము కొన్నిటికియుండును. అపానవాయువులు విడచుచుండును. తలను మెడ భాగమును విరచుకొనుచుండును.

ఆయుర్వేద చికిత్స

వామురసము పావుసేరు, జీలకర్ర 1/2 తులము, అర్ధసేరు కారపు పాలలో కలిపి రెండు పర్యాయములు త్రాగించాలి.

అరతులము ఇంగువను పావుసేరు గచ్చాకురసములో కలిపి త్రాగించాలి.

ఆరుదొండాకు పసరు 6 తులములు ఆముదము 4 తులములు కలిపి త్రాగించాలి.

ఇంగువ 2 తులములు, వామురసము అర్ధసేరు, కలినీరు అర్ధసేరు, కలిపి పెట్టాలి.

లేక ఫార్మశీ వారి వాతారి అరఖును గాని, పశుమిత్రను గాని వాడాలి.

ఆహారపు సలహాలు

జీర్ణముకాని పదార్ధముల పెట్టరాదు. వేడినీటిని దాహముగా నిచ్చుటమంచిది. చలిగాలి సోకనీయ–రాదు. మలబద్ధకముగానున్నచో సబ్బునీటితో ఎనిమా చేయుట డొక్క భాగములకు వేడి కాపులు తీయుట మంచిది.

కడుపుబ్బు

పాలు జీర్ణముకాక పొట్టలో నిలువయుండుట వలన తటాలున కుడితి తొట్టిని జేరి నీరు త్రాగుట వలన ఏపదార్థమైనను గొంతుకలో అడ్డము పడుట వలన పొట్టలోపల గాలి ప్రవేశించుట వలన దాణాదినుసులు ధాన్యము మున్నగునవి తినుట వలన కూడ ఈ వ్యాధి రావచ్చును.

లక్షణాలు

కడుపు విస్తారముగా పొంగును. వ్యాధి ముదిరిన యెడల బాధపడుచుండును. దీర్ఘమైన శ్వాస విడుచును. పొట్టయుబ్బి రాయికంటె కఠినముగా నుండి మూల్గుచుండును. గాలి జేరిన యెడల ఒత్తిన పైకి ఉబుకుచుండును. అటునిటు దొర్లుచు దూడకు ప్రాణాపాయము కలుగవచ్చును.

ఆయుర్వేద చికిత్స

సారాయి 2 డ్రాములు త్రాగించాలి.

లేక వామురసము పావుసేరు, ఉప్పు 2 ½ తులములు కలిపి త్రాగించాలి.

తులము ఇంగువలో 2 ½ తులముల ఉప్పు కలిపి అర్ధసేరు గోరు వెచ్చని నీటిలో కలిపి త్రాగించాలి.

గచ్చాకురసము వేడి జేసి దానిలో కలినీరు కలిపి పెట్టించాలి.

లేక పశుమిత్రనుగాని పశురక్షామృతమునుగాని త్రాగించాలి.

ఆహారము – సలహాలు

కడుపుబ్బు తగ్గువరకు తేలికయైన ఆహార మీయాలి. గాలియున్నచో డాక్టరు గారితో కడుపులోని గాలిని ట్రోకారు అను పనిముట్టుతో తీయించాలి. మలబద్ధకమున్నదని అనుమానముండిన వేడి నీటితో ఎనిమాచేయుట మంచిది.

వాతము

దూడలకీరోగము వచ్చుట అనేక కారణములుండును. అజీర్తి, ప్రేగులలో నులిపురుగులు, పెద్ద రోగము, గాళ్ళు మున్నగు వ్యాధుల వలన, వాత సంబంధమగు పదార్థములు తల్లికి మేపుటచే ఆపాలు దూడ త్రాగుట వలన ఈ వ్యాధి రావచ్చును.

లక్షణాలు

కాళ్ళు పట్టివేయును. ఎల్లప్పుడు కాకులతో తన శరీరమును పొడిపించు కొనుచుండును. ముఖము పాలి పోవును. పాలు సరిగా త్రాగదు. అవయవములలో కొన్ని యెండి పోవుటయో, పైకి లాగుటయో కొన్నిటికి జరుగును. నోరు దుర్వాసనగానుండును. కన్నులు పుసులు కట్టును. క్రమముగా దూడ శుష్కించును.

ఆయుర్వేద చికిత్స

ఆరంభములో ఆముదము 10 తులములు ఈయవలెను.

వాము 8 తులములు, సొంఠి 1 తులము, మిరియాలు 1 తులము, ఉప్పు 5 తులములు. ఆముదపుపప్పు 1 తులము కలిపి నూరి ఉండలు చేసి ప్రతిదినము ఉదయము 2 తులములు తీసికొని పావుసేరు బియ్యపు నీటిలో కలిపి త్రాగించవలెను.

ముద్ద కర్పూరము తాటి బెల్లముతో నూరి అప్పుడప్పుడు నాలుకకు నాకించ వలెను.

ఉమ్మెత్తాకుపసరుగాని, అవిసె ఆకుపసరు గాని శరీరమునకంతటికి పూత పెట్టవలెను.

వావిలాకు పసరు మంచినూనెలో కలిపి కాళ్ళ నొప్పులకు రాసిన తగ్గును.

లేక వాతారిని, స్ప్రెయిను కిల్లరును వాడుము.

ఆహారము – సలహా

దూడలకు శుభ్రమైన ఆహారమును యిచ్చుచు జాగ్రత్తగా పోషించ వలెను. ద్రవపదార్థముల నంతగా ఈయ రాదు. వాతము చేయు పదార్థములు పెట్ట రాదు. మలబద్ధకము లేకుండ చేయ వలెను.

జంటబొడ్డు

దూడ పుట్టినపుడు బొడ్డునుండి రెండు దారములుగా కలిపి ఒక మాంసపుత్రాడు వ్రేలాడుచుండును. ఈత్రాడు తెగిపోవుట చేత, ఆవు బొడ్డును నాకుటచేత కాకులు మొదలగునవి పొడుచుటచేత పుండుపడును.

అశ్రద్ధ చేసిన యెడల చీముపట్టును. సామాన్యముగా ఈ పుండు రెండు మాసముల వరకు కూడ యుండును. ఆరంభమున వ్యాధియందు బొడ్డుచుట్టు కొంచెము వాపుండి ఎరుపుగానుండును. వాపు బాగుగా పక్వమైన తరువాత దానంతటదే చితికి చీమంతయు కారి పోవును. ఈ చీము పోక మరల గడ్డ కట్టిన యెడల బొడ్డునుంచి రక్త నాళములోనికి వ్యాపించి అక్కడనుంచి ఆవిషము శరీరమంతయు కలిసి పోయి క్రమక్రమముగా బాధ ఎక్కువై దూడ చని పోవును. మరి కొన్ని, పుండ్లు మానక ప్రతిదినము నాకుటచే పురుగులుపడి ఆ భాగమంతయు తిని వేయుట వలన చనిపోవుటయు గలదు. కొందరు ఆరంభములోనే బొడ్డుపైన రక్ష వేయుదురు. ఇట్లు చేయుట చాల తప్పు. ఆ భాగమంతయు మాడి పోయి దూడకు అపాయము కలుగును. అనుభవ వైద్యులతో చికిత్స చేయించాలి.

చికిత్స

పుండునకు ఆరంభములోనే ములగాకు ఆముదముతో వేయించి నాలుగైదు కట్లు కట్టవలెను. దూడనుమాత్రము పుండును నాకనీయకుండ ముఖ్యముగా కాపాడాలి. అప్పుడప్పుడు వెన్నలో తగినంత పసుపు, గుగ్గిలము కలిపి మెత్తగానూరి ఆ వాపునకు పట్టించాలి. లేక ఫార్మసీ వారి హీలాన్‌నుగాని కార్నెక్సునుగాని వాడాలి.

రక్తవిరేచనములు

ప్రేగులలోని మాలిన్యము వలన అతిసారము వలన అతి వేడి వలన చలిగాలి సోకుట వలన, చెడు ఆహారములు యిచ్చుట వలన అపరిశుభ్రముగా నుండు నీటిని త్రాగుట వలన గాలిలో ఆకస్మికముగా మార్పు గలుగుట వలన ఈ వ్యాధి కలుగును.

లక్షణాలు

దూడ మందమతిగను, అసౌఖ్యముగను కొంత కాలముండి ఈ వ్యాధి అకస్మాత్తుగా వచ్చును. మలము ఉండ లుండలుగానుండి బంకతోడను బాధతోడను కలుగును. సడుము వంగి పోవును. తోకను లేపుచుండును. తరచుగా పేడ వేయుటకు ప్రయత్నము చేయుచుండును. మూలుగుచు పండ్లు కొరకు కొనుచుండును. విరేచనములు నెత్తురు వాసన కలిగియుండును. క్రమేపి నీరసించి చనిపోవును.

ఆయుర్వేద చికిత్స

పెన్నేరుదుంపను పేరి నెయ్యితో కలిపి రెండు మూడు పర్యాయములు పెట్టాలి

10 తులముల ఆముదములో 1/8 తులము నల్లమందు కలిపి పెట్టాలి.


వాము 1 తులం, జీలకర్ర ½ తులం, శొంఠి 1 తులం కలిపి బెల్లములో కలిపి నాలుకకు నాకించాలి. లేక బేల్‌పొడరును వాడాలి.

ఆహారము – సలహాలు

ఆహారము ద్రవ రూపముగ బల మొసగునదిగ చులకనగ జీర్ణమగు నదిగ నుండవలెను. ఘన పదార్థములు ఈ రోగము సాంతముగ కుదిరిన వారముదినముల పర్యంతమును దూడకు తినుట కీయరాదు. చన్నీటిని ఈయక కాచిన నీటినే త్రాగించాలి.

క్రిములు

దూడ ప్రేగులలోను, మలకోశములోను అనేక రకములైన క్రిములు చేరుచుండును. (Round Worms) అనగా గుండ్రని పురుగు అనునది తెలుపుగా పొడుగుగా నుండును. ఇవి 6 లేక 12 అంగుళముల పొడవు గలిగి చిన్ని ప్రేగులలో నుండును.



త్రెడ్ వరం అనునది 5, 6 అంగుళముల పొడవుగల పెద్ద ప్రేగులలోను, ఆసనములోను యుండును. ఇది చిన్నదిగానుండి సన్నని సూది వలె నుండును. టేపు వరం ఇది పెద్ద ప్రేగులలోను, చిన్న ప్రేగులలోను యుండును. ఈ క్రిములు అశుభ్రత వలననే ఎక్కువగా శరీరములో ప్రవేశించును.

లక్షణాలు

దూడశుష్కించును. ఆకలి హెచ్చుతగ్గులు కలిగియుండును. తోకను దేనికైన వేసి రుద్దుకొనుటకు ప్రయత్నించుచుండును. మట్టితినుటకు ప్రయత్నించును. మలము జిగటగానుండును. కడుపు నొప్పి కూడ నుండును.

ఆయుర్వేద చికిత్స

గాడిదగడపాకు పసరు పావుసేరు త్రాగించుము. అర చేరడు ఉప్పు, అర్ధ సేరు చింతపండు పులుసుతో కలిపి త్రాగించుము. పచ్చినేల వేముర‌సము పావు సేరు, కలినీరు అర్ధ సేరు కలిపి త్రాగించుము. యింగువను పెట్టాలి. లేక ఫార్మసీ వారి వాతారి బాగుగా పనిచేయును.

ఆహారము – సలహాలు

ఆహారము త్వరగా జీర్ణ మగునదిగా నుండ వలెను. ఉప్పు కలిపిన నీటిని పెట్టుట మంచిది. దూడను అటునిటు తిరుగ నిచ్చుచుండాలి.

రక్తచెల్ది


దూడలకు ఈ వ్యాధి తరచుగా వచ్చుచుండును. శరీరముమీద మూతిమీద తదితర భాగములందును చిన్న చిన్న కురుపులు లేచి బాధను కలుగచేయును. ఈ కురుపులు నలుపురంగుగా నుండును. వీటిని చిదిపిన రసి కారి ఎరుపురంగుగా నుండును. ఇంకను వీటిని తాకి చూచిన యెడల వేడిగను నొప్పిగను యుండును. అశుభ్రమైన గాలిని పీల్చుట వలన ఈ వ్యాధి కలుగును. ఇది 15 దినముల వరకు నుండును. సరియైన చికిత్సచేయనిచో కురు పులన్నియు కలిపి పెద్దవాపుగా నగును.

ఆయుర్వేద చికిత్స

సబ్బు నీటితో గాని, కుంకుడు కాయనురుగుతో గాని శరీర భాగములు కడిగి మైలతుత్తం పావుతులం, వెన్న 6 తు, గంధకము తులము, ముద్ద కర్పూరము అరతులం కలిపి మెత్తగానూరి రెండు మూడు పర్యాయములు రాసిన తగ్గి పోవును. లేక బ్రహ్మదండి ఆకు పసరులో ముద్ద కర్పూరము కలిపి రాసిన తగ్గును. ఫార్మసీ వారి కార్నెక్సు వాడాలి.

మిన్నల్ముల వలన కలుగుపుండ్లు

దూడలకు మిన్నల్ములు పట్టి చాల బాధించును. వీటి వలన అనేక దూడలు చని పోవుచుండును. వెంట్రుకలు రాలి పోవును. శరీరము మీద అంగుళము రెండంగుళముల లోతు పుండ్లు పడుచుండును. మిన్నల్ములు చర్మమునందు రంధ్రము చేసి గ్రుడ్లు పెట్టు చుండును, ఆగ్రుడ్లు పిల్లలై చర్మముపైదురద



పుట్టించుచుండును. ఇవి రోగములుగల పశువురక్తమును పీల్చి యితర దేహములో దీనిని విడుచుట వలన అంటు వ్యాధులు కలుగుచుండును.


చికిత్సలు

వేపాకుపసరుతో మంచినూనె కలిపి రెండు సార్లు పూత పెట్టుము. ఫినైల్ 1 భాగము, నీరు 2 భాగములు కలిపి శరీరమునకు పట్టించిన మిన్నల్లులు చచ్చిపోవును. వేపనూనె 1 భాగము, కిరోసినాయిల్ 2 భాగములు కలిపి పట్టించిన తగ్గును. లేక ఎండు చేపలు కడిగిన నీటిని పట్టించిన పోవును. లేక ఫార్మసీ వారి కండూత్రు అను అరఖును వాడాలి.

* * *




పంటలకు మందులు జల్లుట



ఎదేశీయు ఆబోతు



విదేశీ పశుప్రదర్శనము




అమృతమహల్ జాతి

ఇరువది ఏడవ భాగము

విదేశాలలో పశుసంపద - పాడిపరిశ్రమ


బ్రిటిష్ పశుసంపద



బ్రిటన్ వంటి కొద్దివిస్తీర్ణంగల దేశంలో యిప్పుడు ప్రపంచంలోనే యితర దేశాలలోలేనన్ని పశు జాతులున్నాయి. దీనికి కారణము ఈ దేశపు భూమి, ఇచ్చటి పరిస్థితులే కారణము. ఈ దేశములో పెంచ బడిన పశుజాతుల చరిత్ర ప్రారంభము నుంచి గమనించిన ఈ విషయము చదువరుల కర్థమవుతుంది. ఇచ్చట పశు జాతులకు నివాసములు చక్కనివి గలవు. వివిధ రకాల జాతులు ఇచట నివసించుచున్నవి. దీనికి కారణము ఈ దేశములో పశు పోషణను గురించి తీసుకొనబడుచున్న శ్రద్ధ. క్రీస్తు పూర్వము 6000 నాడు మన ఐరోపాలో పశువుల పెంపకము ప్రారంభమైనది. బ్రిటిషు దీవులలో ఆతరువాత ప్రారంభమైనది. చరిత్రకారుల పరిశీలన ప్రకారము ఈ దేశములోనికి పది వేల సంవత్సరములకు పూర్వమే రెండు జాతుల పశువులు వచ్చినట్లు ఆధారములున్నాయి.

1 బాగ్‌ప్రోమిజనియను 2 బాన్‌లాంగు ప్రొన్సు. ఇప్పటి వారు కొందరు ఇప్పటి పశువులు పై రెండు జాతుల సంతతియని గుర్తించుచుండుట వలన పై రెండు జాతుల వివరముల గురించి తెలిసి కొనుటమంచిది. బ్రాన్ ఇంబ్రెజినియన్ పశువు చాలా పెద్దది. దాని అస్థిపంజర మిప్పుడు బ్రిటిష్ మ్యూజియంలో వుంది. దాని తలకాయ, పుర్రె గజము పొడవుంది. కొమ్ములు నేటి హైలాండు పశువుల కొమ్ముల కంటె పెద్దవి. ఇప్పటి పశు జాతులేవియు పై జాతికి పోల్చదగిన పరిమాణములు గలవి లేవు. రాతియుగంలో పశువులను వేటాడేవారు. మచ్చిక చేయబడిన పశువులలో బాస్‌లాంగిప్రస్స్ జాతియే మొదటిది. రోమనులు దండయాత్ర జరిపిన కాలంలో బ్రిటన్‌లో ఈ జాతి పశువులున్నాయి. చాలా మంది చరిత్రకారులు సూచించినట్లు బాస్ లాంగుప్రస్సు జాతి పశువులు రంగు నలుపుగా వుండేదట, ఈ జాతికి చెందినవిగా లోనేజువీ, ఎబర్టీన్, ఆంగస్‌వీ, కెర్రిసువీ, డెక్సటర్సువీ, మొదలగునవి నేడు బ్రిటనులో కాన్పించుచున్నవి.

మానవుల గాయాలకు వెన్ననే ఉపయోగించుట



రోమనుల దండయాత్ర ఫలితంగా ప్రజలు, పశువులు సెల్టిక్ జాతులుగా రూపొందినవి. చాలామంది చరిత్రకారులు రోమన్ దండయాత్ర ఫలితంగా బ్రిటన్‌లో ఏర్పడిన పశు జాతుల గురించి వ్రాసియున్నారు. ఈ పశు జాతులు ఆనాడు ఫ్రాంసులో లేవని చెప్పవచ్చు. జాగ్రత్తగా పరిశీలిస్తే బ్రిటన్‌లో పూర్వముండే ఎర్ర పశువులకు ఇటలీలో నేడున్న పశువులకు పోలికలున్నాయి. అవన్నియు తెల్ల పశువులు. రోమను చరిత్ర కారుల రచనలను బట్టి ఆనాడు బ్రిటనులో పశువుల పాలు మాంసము ప్రజల కుపయోగపడుతుండేవి. రోమనులు గ్రీకులు పాడి చేయుటలో నేర్పుగల వారగుటచే, వారేబ్రిటనులో పశువుల పాలు మాంసము ప్రజలకుపయోగముగా వుండేవి. పాలనుండి మీగడ వెన్న పెరుగు మజ్జిగ తయారు చేయుట ఆంగ్లేయులకు రోమనులు గీక్రులే నేర్పిరట. ఆనాడు ఇటలీలో వెన్నతీసే అలవాటులేదు. వారు ఆలివ్ ఆయిల్‌నే వంట పనులకుపయోగించేవారు. రోమనులు జర్మనులను, గాలులను జయించినపుడు వారు వెన్నను ఆహార పదార్థముగా ఉపయోగింపక యుద్ధరంగమున దెబ్బలుతిన్న వీరుల పుండ్లను మాన్పే ఔషధంగా వాడేవారు.

గ్రేట్ బ్రిటన్ – ఆంగ్లో సాగ్జనులు

అంటే జట్లాండులోని జ్యూట్లు, అంగిలులు, సాగ్జనులు దాడి చేసిన కాలంలో బ్రిటన్‌కు తీసికొని రాబడిన పశువులు ఎరుపురంగుగా నుండేవని చరిత్ర కారుల రచనల వల్ల తెలియుచున్నవి. ఇటువంటివి పశ్చిమజర్మనీలో డెన్మార్కులో నేడున్నవి. బ్రిటనులో కొమ్ములులేని పశువుల్ని తీసుకు వచ్చిన వారు "నార్సెమెన్" అని చరిత్రకారుల రచనల వలన తెలియుచున్నది. ఈ జాతి పోలికలు గలవి నేడు సిఫోకుడన్సు, యార్క్‌షైర్ పోల్స్ మొదలైనవి. ఈ జాతులన్నియు స్కాండినేవియాలో పశువుల జాతులను పోలియున్నవి. దీనికి కారణం, నార్సెమెను, అనువారు మంచి నావికులు కావడం వలన వారన్ని దేశాల దూరదూర తీరాలకూ పశుజాతుల తీసికొనిపోయి అచ్చటి ప్రజలకు విక్రయించేవారు.

నార్మనులు వీరులు, రాజ్యాంగ నిపుణులు అందువలన వారు జయించిన దేశాలలోనికి పశుజాతులు గొనిరాలేదు. వారు ఉన్నవాటితోనే పనిగడుపుకొనే వారు. తరువాత బ్రిటన్ లోనికి హాలెండు పశువులు గొనిరాబడినవి. కాని నాటి దిగుమతి గురించిన వివరాలు లభ్యం కాలేదు. ఒక చరిత్రకారుని రచనల వల్ల 1716 ప్రాంతాన ఇంగ్లండులో లింకలన్ షైరులో కెంటులో పొడుగాటి కాళ్ళు పొట్టి కొమ్ములు గల డచ్చిదేశపు గోవులున్నట్లు తెలయుచున్నది. ఆ తరువాత అవి స్కాట్లండులో దక్షిణ భాగాన కూడా నివసింపసాగాయి. ఇంకొక రచయిత రెండు దూడలను పెట్టేదనీ, ప్రతిదినం రెండుగాలనుల పాలుయిచ్చేదని వ్రాసియున్నాడు.

మధ్యయుగములో పశుపోషణ

మధ్యయుగంలో పశువుల వివరాలు సంపూర్ణంగా లభించలేదు.

ఆ కాలంలో ఏకొద్ది భూవసతి గలవాడైన వ్యవసాయానికి ఎద్దులు, గుర్రాలు కలిగియుండే వాడు. ఎరువుల నిమిత్తం గొఱ్ఱెలుండేవి. ఇవి జమీందారుల వద్ద మాత్రమే యుండేవి. పెద్ద పచ్చిక బయళ్ళలో పలువురు పశువులను కలిపి మేపుట వలన పశుజాతుల యభివృద్ధి కాక అనేక వ్యాధులొకదానినుండి మరొక దానికి సంక్రమించేవి. ఆహారం కోసం కొన్నిటిని వధించి, మరికొన్నిటిని పాలకోసం యుంచేవారు. అవి ప్రతి సంవత్సరం దూడలను పెడుతుండేవి. అందువలన వధింపబడిన వాటివలన పశు సంఖ్య తగ్గుట ఎన్నడులేదు. పశువులను ఆరుబయట పచ్చిక బీళ్లలో మేపుట శ్రేష్ఠమని ఆంగ్లేయులు 18వ శతాబ్దంలో గ్రహించారు.

పేరుపొందిన పశుపోషకులు

18వ శతాబ్దంలో బాక్‌వెల్ అనునతడు పశుజాతుల అభివృద్ధి విషయంలో మిక్కిలి ప్రఖ్యాతి గడించెను. అతడు లాంగుహారన్సు అను పశువుల అభివృద్ధికి కృషి చేశాడు. అవి ఇంగ్లండులో అన్ని భాగములలో విస్తరించినాయి, అంతేకాకుండా అవి ఐర్లండు మధ్యకు కూడ పోయినవి. బాక్ వెల్‌తండ్రి ఆదర్శకర్షకుడు. అతడు తన కుమారునికి 47 సంవత్సరాల వయస్సునున్నపుడు తనతండ్రి 88వ సంవత్సరములో మరణించినాడు. బాల్‌వెల్ తండ్రి వ్యవసాయంలో తర్ఫీదు పొందిన వాడు కావడం వలన అతను వెస్టుమోర్‌లాండు, లాంక్‌షైరు, మొదలైన తావుల పశువుల్ని కొని పెంచేవాడు. వీటన్నిటినీ జేర్చి కొత్త జాతులను తయారు చేయించడం, గొఱ్ఱెల్ని కుడా పెంచి వాటిలో కలిపి పరిశోధించినాడు. ఇంగ్లండు నందు పశువులు పాలకోసమే గాక మాంసభక్షకులకు మాంసము సరఫరా చేయుటలో ఈతను పేరొందెను. అతడు ఆబోతులను గూడ పెంచి వాటిని ఇతర గోవుల అవసరాలకు సప్లయి చేసేవాడు. తన ఆబోతుల వీర్యంతో ఇతరుల పశువులకు పుట్టిన దూడలు చూచి ఆతరువాత తన ఆబోతులను తన పశువుల మీద నెక్కనిచ్చేవాడు.

కొట్టములలో పశువుల నుంచి మేపడం వలన కలిగిన సత్ఫలితాలను 1591లో వివరించారు. అందుచేత పశువులు ఎక్కువ వెన్నను మీగడను యిచ్చేవి. వాటి చర్మాలు, కొమ్ములతో వస్తువులు తయారు

చేసేవారు. వాటి మాంసము యితర దేశాల కాహారముగా విక్రయించుట కవకాశము కలిగెను. ఈ పద్ధతులన్నియు 18వ శతాబ్దములో బాగుగా అభివృద్ధి గాంచినవి. ఇందుకు కారణం ఆష్లెకి సమీపంలో 1729లో జన్మించిన బాక్‌వెల్ అను మహాపురుషుడి కృషి.

వ్యవసాయ ప్రదర్శనలు

ఇంగ్లండు రైతులేగాక విదేశాలనుండి కూడా రైతులు వ్యవసాయ ప్రదర్శనలు చూచుటకు వచ్చేవారు. అక్కడ పశువులు చాల ప్రదర్శింపబడేవి. ప్రశాంత పరిస్థితులలో జిల్లా తాలూకా కేంద్రాలలో కూడా ప్రదర్శనాలుండేవి. వాటిలో పశువులు వ్యవసాయ పరికరాలు ప్రదర్శింపబడేవి. ఈ ప్రదర్శనాలలో గుఱ్ఱాలు పశువులు ప్రజానీకం యెదుట త్రిప్పబడేవి. మొదటి ప్రదర్శనం ఇంగ్లండులో 1777లో జరిగింది. ఆ ప్రదర్శనకి రాజకుటుంబీకులు. ప్రభువులు రెండు వందలమంది రైతులు వచ్చినారు. ఇటీవల ప్రదర్శనలలో పశువులలో, గొఱ్ఱెలలో మంచి వాటికి బహుమతులు లభించినాయి. 1798లోనే గొఱ్ఱెలకు సస్సెక్సు వ్యవసాయ ప్రదర్శనంలో చచ్చిన వాటికి బ్రతికిన వాటికి బహుమతులిచ్చేవాడు. వాటి చర్మాలకు కూడా బహుమతులిచ్చారు. 1937 లోస్మిత్‌ఫీల్డు ప్రదర్శనంలో పశుపోషణలో ప్రముఖులు కొన్ని పశువుల పందాలు కూడా జరిగాయి. ఈ ప్రదర్శనల వల్ల పశువుల పెంపకం, పశు జాతులు అభివృద్ధి చెందాయి.

ఇంగ్లండులో పశువులసంఖ్య

1938 జూన్ 4 తేదీకి ఇంగ్లండు వేల్సులో 6314261 పశువులు. వుండేవి. వీటిలో 46% గోవులు పెయ్యేలు 1882లో 4726245 పశువులు వుండేవి. వాటిలో 40% మాత్రమే ఆవులు దూడలు వుండేవి. పశువుల అభివృద్ధి కావడానికి కారణం దేశంలో గొఱ్ఱెల సంఖ్య తగ్గడం వల్లకాదు. దేశంలో గొఱ్ఱెల సంఖ్య మామూలుగానే యుంది. గొఱ్ఱెలను సాగుకున్న పొలాలనుంచి పచ్చికబీళ్ళకుతోల సాగారు. దేశంలో గుఱ్ఱాల సంఖ్య కూడా తగ్గలేదు. దేశంలో పశువుల యభివృద్ధి కావడానికి ముఖ్య కారణం పచ్చికబీళ్లు అభివృద్ధి కావడమే. 1882-1938లో పశువుల సంఖ్య పెరిగింది. ఈ కాలంలో పశువుల సంఖ్య పాలవుత్పత్తి చేసే గోవుల సంఖ్య పెరిగింది. ఇందు వల్ల డైరీఫారముల సంఖ్య పెరిగింది. గ్రామాల అభివృద్ధిని పట్టిలెక్కలు పరీక్షిస్తే ఇంకా ఆశ్చర్యంగా ఫలితాలు కనిపించాయి.

ఇంగ్లండు వేల్సులో పచ్చికబీళ్ళు విస్తీర్ణం 1882లో 1,36,37,885 ఎకరాలైతే 1938లో 1,58,38,862 ఎకరాల అభివృద్ధిగాంచింది. పశు సంఖ్యాభివృద్ధి కేవలం పచ్చిక బీళ్ళమీదనే ఆధారపడి యుంది. 1938 లెక్కల ప్రకారం పశువుల సంఖ్యలో 40% అభివృద్ధి కలిగితే పచ్చికబీళ్ళు 16% మాత్రం అభివృద్ధి గాంచింది. దీనికి కారణం గొఱ్ఱెలు కూడా పచ్చికబీళ్ళకు తోలేయడం. ఈ నాటికి ఇంగ్లండు వేల్సులలో పచ్చిక అభివృద్ధి చేయడానికి చాలా అవకాశాలు వున్నవి.

పాల సప్లయి

పశువులు దేశానికి అమిత ప్రాముఖ్యమైనవి. దేశంలో ప్రజాహారానికి అవే ఆధారమైనవి. ఇతర రకముల జంతువుల కంటె ఎద్దులు ఆవులు పాలను మాంసాన్ని యిచ్చుతాయి. పాలుమాత్రం ఈ దేశం

దిగుమతి చేసుకొనడం లేదు. 1939 సంవత్సరం లెక్కలనుబట్టి చూస్తే పాలసప్లయిలొమిగులు కనిపిస్తుంది. పాలు అధికంగా వుండటం వల్ల పాలు ఎక్కువగా త్రాగవలసిందని ప్రజలకు బోధించుచున్నారు. 1938లో ఒక్కొకనికి 0.5 పింటుపాలు మాత్రం లభించాయి. అమెరికాలో ఒక్కొక్కనికి 0.9 పాలు, స్విట్‌జెర్లాండులో 1.3 పింటు పాలు లభించాయి. గడచినకొద్ది సంవత్సరాలు నుంచీ పాలకోపాలు సప్లయిచేయబడి అవి ప్రజలలో ఎక్కువ ఉపయోగయోగానికి వచ్చేవి. ఈ పాలను ప్రజలనేక విధాల వాడుకోసాగారు. బీదలకు స్కూలు విద్యార్థులకు పాలుతక్కువ ధరలకు లభిస్తున్నాయి. పాలకు ప్రజలిచ్చే ఖర్చు ఎక్కువైనా ఉత్పత్తిదారులు తక్కువ ధరలని విమర్శించేవారు. తయారైన పాలపదార్థాలు దేశంలో వాడుతున్నారు.

10. 0% వెన్న 3.2% మీగడ 94.4% గడ్డపాలు. 42.4% మీగడ తీసిన గడ్డపాలు. 54.6% ఎండబెట్టిన గడ్డపాలు. దేశంలో జనాభా నానాటికి పెరిగిపోతున్నప్పటికీ గడచిన పది సంవత్సరాలలో దిగుమతి అభివృద్ధి కాలేదు. 1933-34లో 87,56,00,000 గాలన్ల పాలు 1938-39లో 108,02,00,000 గాలన్ల పాలు ఇంగ్లండు మార్కెట్టులో విక్రయించబడినాయి.

పశువుల కాపరులు

పశువుల కాపరి దూడ పుట్టింది మొదలు పెద్దదయ్యే వరకు సాకినందుకు దూడ 1 కి 2 షిల్లింగుల ఆరు పెన్నులిస్తారు. పాలు శుభ్రంగా పితక కలిగితే వారానికి 2 షిల్లింగులు యిస్తారు. ఇది బోనసుగా ఈయబడుతుంది. పండుగలకు కానుకలు గూడ యిస్తారు. పశువులు సరిగా పోషింపబడాలంటే పశువుల దగ్గరవుండి కాపాడే కాపరుల పట్ల యజమానులు ఉదారంగా వుంటారు.

బ్రిటిష్ పాలజాతులు

ఈ దేశంలో పాల ఉత్పత్తి సంవత్సరం పొడుగునా ఒక విధంగా లేక, వేసవిలో అధికంగాను, శీతాకాలంలో తక్కువగాను వుంటుంది. వేసవిలో శీతాకాలంలో కంటే 50% జాస్తి. శీతాకాలంలో లభించే పాలు కూడా దేశములో అవసరానికి సరిపోయేవి. కాని వేసవిలో పాలు అధికం గావటం వలన బాగా మిగిలేవి. వేసవిలో పాలు అభివృద్ధి కావడానికి కారణ మీ దేశం శీతల దేశం కావడం. శీతాకాలంలో పశువులు నివసించడానికి తగిన సౌకర్యాలు తక్కువ. వేసవిలో పశువులు బాగా గడ్డిని మేసి పాలిస్తాయి.

డైరీ గోవులకు మాంసాన్నిచ్చే గోవులకు రూపంలో భేదం కలదు. పాలిచ్చే గోవుకు పొదుగు పెద్దదిగా కన్పిస్తుంది. ఇది బక్కగా వుంటుంది. పాలిచ్చే గోవులు ఆహారాన్ని ఎక్కువగా తింటాయి. అందువల్లనే సమృద్ధిగా పాలిస్తాయి.

డైరీగోవుల తలలు సన్నగా కనిపిస్తాయి. జర్సి గోవుల తలలు పొట్టివి. ఫ్రిషియన్ జాతి వాటికి పొడుగాటి తలలుంటాయి. డైరీ గోవుల మెడలు కూడా సన్నగానుంటాయి. వాటి పొట్టల మీద ఎముకలు కూడా ఒకప్పుడు కన్పిస్తాయి. వాటి చర్మం శరీరమంతా చక్కగా మెరుస్తుంటుంది. ముఖం పొదుగు మీద చర్మం నుంచి రక్తనాళాలు పొంగి కన్పిస్తాయి. కొమ్ములు తీర్చినట్టుండును. శరీరంమీద వెంట్రుకలు మెత్తదనాన్ని కలిగియుండును. ఇలా వుంటానికి కారణం, వీటికి మేపే మేతలు, తరుచు కడుగుట. చర్మం

వెంట్రుకలు చూచినంతమాత్రాన పశువు ఆరోగ్యమైనదో, అనారోగ్యమైనదో తెలుసుకొనుట కష్టము. ఇంగ్లండులో పుట్టి పెరిగిన గోవులు జెర్సీద్వీపంలోని పశువుల కంటె పెద్దవి; నాసివి.

డైరీ ఆబోతులు, దూడలు, దూడల్ని పెంచటం అధిక ధనవ్యయంతో కూడినపని కావడంవల్ల, రైతులు దూడలు పుట్టిన కొద్ది రోజులకు, వాటిని సాకటంవల్ల ఉపయోగముంటుందా లేదా అని ఆలోచిస్తారు. చిన్న దూడలుగా నున్నప్పుడుండే చెడులక్షణాలు వాటికి వయస్సు వచ్చిన కొలది అధికమౌతాయి. దూడలుగా నున్నప్పుడే వాటి భవిష్యత్తు గూర్చి నిర్ణయించడానికి వీలవుతుంది. అందుచే పెంచబడే దూడల్ని ఆరుమాసాల వయను వచ్చే వరకు పరీక్ష చేసి, తరువాత వాటి సుగుణాలను బట్టి మందలోకి తోలుతారు. తక్కిన వాటిని కోత కమ్మేస్తారు.

ఆబోతుల్ని నిర్ణయించటం మరీ కష్టం. వాటి రూపంబట్టి అవి ఎక్కువ దూడల్ని పుట్టించగలవని నిర్ణయించ డానికి సాధ్యంకాదు. డైరీ ఆబోతు మంచిలక్షణాలు కలిగివుండాలి. వాటిని పరీక్ష చేసినందువల్ల ఫలితం ఉండదు. ఆబోతులకు కలిగిన పెయ్యదూడల లక్షణాలు బట్టి ఆబోతుల మంచి చెడుగులు నిర్ణయించడం జరుగుతుంది. ఇదే విధంగా డైరీ గోవుల్ని గూడా వాటి రూపాన్ని బట్టిగాక, అవి యిచ్చే పాలను బట్టి నిర్ణయించాలి.

డైరీ గోవులలో 5 రకములు గలవు. ఇంగ్లండులో ఐరిష్‌జాతి పశువులు పెద్ద పొదుగులు గలిగి పాలు సమృద్ధిగా యిస్తాయి. పశుపోషకులు పాలిచ్చే గోవుల్ని కొనేటప్పుడు వారు ముఖ్యంగా పొదుగుల్ని పరీక్షచేస్తారు. చన్నులు కూడా సరియగు ఎడంగా వున్నవో లేవో, పాలుపిండడాన్కి పట్టుకోవడాన్కి పొదుగున్నవో లేవో చూస్తారు.

ఈ జాతి పశువులకు క్షయవ్యాధి యుండదు. ఇట్టి పశువులమ్మకమునకు విశేషంగా లభిస్తాయి. ఇవి పాలు బాగా యిస్తాయి. ఈ జాతి గోవులు తెలుపు, ఎరుపు, బ్రౌన్ రంగులలో వుంటాయి. ఇంగ్లండులో, దక్షిణస్కాట్లండులో వీటిని షార్ట్‌హారన్ జాతితో కలుపుతారు. ఇలా కలపడంవల్ల పుట్టేదూడలు బాగా పాలిస్తాయని ప్రవీణుల అభిప్రాయం.

బ్రిటిష్ ఫ్రిషియన్ జాతి

ఈ జాతి పశువులు హాలండ్ నుంచి వచ్చినవి. ఇవి పూర్తిగా తెల్లగా, లేక నల్లగా నుంటాయి. ఈ గోవుల శరీరాలు పెద్దవి. ఇవి పాల ఉత్పత్తికి ప్రసిద్ధి చెందినవి. వీటి పాలు శ్రేష్ఠగుణము కలవి. ఈ జాతి గోవులు కొన్ని సంవత్సరానికి 3 వేల గాలన్ల పాలిస్తాయి. ఇన్ని పాలనీయగల గోవులు ఇంకో జాతిలో లేవనే చెప్పాలి. ఈ పాలలో వెన్న లభించే గుణం తక్కువగా నున్నప్పటికీ, దీనినభివృద్ధి పరచడానికి వీలవుతుంది. ఈ పాలలో కొవ్వుపదార్థం తక్కువగా నుంటంవల్ల, వీటిని పసిపిల్లలు తాగి సులభంగా జీర్ణించుకో గలరు. ఈ జాతి దూడలు పుట్టినప్పుడు చాలా పెద్దవిగా కన్పిస్తాయి. ఇవి మాంసానికి ఉపయోగిస్తాయి. ఈ జాతి గోవులు పాలు నీయాలంటే వీటికి బలమైన మంచి మేతలు జాగ్రత్తతో మేపాలి. హాలండులో ఈ జాతి పశువులు పాల ఉత్పత్తికి, మాంసోత్పత్తికి గూడా పనికి వచ్చేవిగా వున్నవి.

జెర్సీ జాతి

ఈ జాతి పశువుల ఎముకలు, చర్మం, కొమ్ములు, పాలకు ప్రసిద్ధి చెందినవి. వీటి పాలలో వెన్న అధికంగా లభిస్తుంది. ఇందువల్ల పాలను సీసాలలో పోసి విక్రయిస్తారు. ఇలా సీపాలలో పోసిన పాలకు చలామణి జాస్తిగా నుంటుంది. ఈ జాతి గోవుల పాల మూలకంగా ఇతర జాతుల్ని కూడా అభివృద్ధిపరచడానికి ప్రవీణులు ప్రయత్నిస్తున్నారు. ఇవి మొదట ఇంగ్లండు దిగుమతి చేసుకున్నప్పుడివి అతిసుకుమార పశువులుగా కన్పించినవి. కాని క్రమంగా అవి బలిష్ఠములైనవి. ఇవి దక్షిణ ఇంగ్లండులో మాత్రం కలవు. ఇవి ఇప్పటికీ ఆరుబైట, శీతల ప్రదేశములలో బ్రతుకలేవు.

గరెన్సీ జాతి

ఈ జాతి పశువులు జెర్సీజాతి పశువుల తరవాత తరగతికి చెందినవి. ఈ పశువులు ఏదో ఒకటే రంగులో నుంటాయి గాని కలగలుపు రంగుల్లో నుండవు. ఈ జాతి గోక్షీరంలో కొవ్వుజాస్తి. వెన్నబాగా లభిస్తుంది. పాలుగా అమ్మితే అందువల్ల పోషకులకు నష్టం కలదు. ఈ పాలు దూర ప్రదేశాలకు పంపబడినపుడు వెన్న పాలపైకి తేరుకుంటుంది. అందువల్ల పాలు పోయించుకునే వారి కన్యాయం జరుగుతుంది. కొందరికి వెన్న లభించని పాలు, కొందరికి బాగా వెన్న ఉన్న పాలు లభిస్తాయి. వీటి చర్మం నూనె ఓడుతూంటుంది. జెర్సీగోవులకంటే ఇవి బలమైనవి. అందుచే ఇవి ఆరుబైటనుండ గలవు. తక్కువ రకం ఆహారాన్ని తినగలవు. ఈ పశువులు సిగ్గుపడుతున్నట్లు కనిపిస్తాయి. వీటికి తోకలు చాలా పొడుగ్గానుంటాయి.

కెర్రీ జాతి

ఈ జాతి పశువు లీ దేశంలో ఎక్కువగా లేవు. ఇవి ఐర్లండులో ఎక్కువగలవు. ఇవి ఆరుబైట నుండగలవు. ఇవి నల్లగానుండి, డైరీగోవులకుండే లక్షణాలన్నీ కల్గియుంటాయి. వీటికాళ్ళు పొడుగాటివి ఐర్లండులో వీటిపాలు (cheese) చీజ్‌గాను, వెన్నగాను, తయారు చేస్తారు.

ఇంగ్లండులో, వేల్సులో డైరిగోవుల ప్రాముఖ్యం హెచ్చింది. వీటి పెంపకం, పాల ఉత్పత్తి రికార్డు చేయబడింది. బ్రిటిష్ ఫ్రిషియన్ జాతి గోవులు పాలకు ప్రసిద్ధి చెందినవి. ఈ పాలలో కొవ్వుపదార్థం తక్కువ. ప్రదర్శనాలలో జెర్సీగోవుల్ని ప్రదర్శించడంలో పోషకులు శ్రద్ధవహిస్తారు. ఫ్రీషియన్ జాతి గోవులు ఇచ్చిన పాలను 1938 డైరీ గోప్రదర్శనంలో రికార్డు చేయబడింది. వెయ్యి పౌన్లుబరువు. ఈ విధంగా జెర్సీగోవులు రెండవతరగతివి. ఒక్కొకప్పుడు ఫ్రిషియన్ గోవులకంటే జెర్సీగోవులు పాల ఉత్పత్తిలో మించుట కలదు. జెర్సీజాతి వెన్న నీయడంలో ప్రసిద్ధమైనవి.

విదేశీయులు పాలుపితికే పద్ధతులు

గోవుల్నీ దేశంలో రెండు విధాలుగా పాలుపిండుతారు. కొన్ని డైరీ ఫారములలో గోవులను చేతితో, కొన్నింటిని యంత్రములతో పాలు తీస్తారు. చిన్న ఫారములలో 30 గోవులకుపైన వుండవు. ఈ చిన్న ఫారములలో గోవుల్ని యంత్రసహాయంతో పాలు తీస్తే ఖర్చు అధికమవుతుంది. అందుచే చిన్న ఫారములలో

గోవుల పాలు చేతితో పిండుతారు. పెద్ద ఫారములలో మాత్రము యంత్రముల నుపయోగిస్తారు. చేతితో పాలు పితకడమైతే, ఆ పనికి ఎక్కువమంది మనుష్యులు కావలెను. ఇదే యంత్ర సహాయంతో కొద్దిమందే, కొద్ది కాలంలో చేస్తారు. యంత్రములతో పాలు పితికేవారు–వాటిని పెద్ద కొట్టములలో అమర్చి వుంచి, అక్కడికి గోవుల్ని తోలుక పోతారు. కొందరు తేలికరకం యంత్రాలను గోవుల మందలున్న ప్రాంతాలకే తీసుకపోతారు.

యంత్రములతో పాలు పిండడం గూర్చి ఈ దేశంలో భిన్నాభిప్రాయాలున్నవి. 1914–18 మధ్య కాలంలోనే యంత్రములుపయోగించ సాగారు. కాని ఆనాడు యంత్రములు చక్కనివికావు. అందుచే పశుపోషకులు యంత్రముల మీద మోజు తగ్గించుకున్నారు. మంచి యంత్రములు లభించిన పిమ్మట గూడా వాటిని వాడుటకు కొందరు నిరాకరించారు. యంత్రములతో పాలుపితికే సందర్భంలో ముఖ్యంగా గమనించ వలసింది–ఆ యంత్రం వెనకటి వాటికంటే మంచిదవునా, కాదా అని. ఆ యంత్రాన్ని నడిపేవాడు సమర్థుడై యుండాలి. వత్సరాల నుంచీ చేతితో పాలుతీయడానికి అలవాటు పడిన ముసలి వారికంటే–యువకులు యంత్రముల నుపయోగించి పాలు తీయడంలో సమర్థులవ్వాలి. గోవుల్ని పాలుపితకడమునకు యంత్రమును సతిగా ఉపయోగించగలిగితే, అది మనుష్యుడు చేతితో పాలు పితికిన దాని కంటే చక్కగా పాలు పిండగలదు. చేతితో పాలు పిండ బడిన గోవులు ఈ యంత్రాల కలవాటుపడటం కష్టం. యంత్ర సహాయంతో పాలు పిండటం వల్ల పాలు శుభ్రంగా నుండాలంటే, అందులో పాలుతీసేవాడి బాధ్యత ఎక్కువగా నుంటుంది. యంత్రాన్ని పాలుతీసేముందు వేడి నీళ్ళతో స్టెరిలైజేషన్ చేయడం మంచిది. కొందరు కర్షకులు యంత్రాని కుండే రబ్బరుట్యూబ్‌ను శుభ్రం చేయనందున, అపరిశుభ్రంగా నుండే పాలు లభిస్తాయి. యంత్రం లోపలి భాగాలు శుభ్రం చేయబడకపోతే. పాలు యంత్రంలోని దుమ్మును కలుపుకుని బొక్కెనలో పడతాయి. యంత్రాలను చక్కగా ముందుగా స్టెరిలైజ్ చేసి ఆ తర్వాత వాటినుపయోగిస్తే శుభ్రమగు పాలు త్వరలో లభించగలవు. యంత్రముల మూలంగా వ్యాధులు ప్రాకడంవల్ల, వాటిని రైతులు ద్వేషిస్తారు.

పాలు యంత్రంతో పిండేటప్పుడు ముందు ఒకచన్నులో పాలు కొంచెంతీసి, అవి శుభ్రంగానున్నట్లు నమ్మకం కల్గితే మిగతా పాలు దీయాలి, అలాచేయక పోతే పశువులకు వ్యాధులు ప్రాకేమాట యదార్థమే.

సమర్థులైన వారు 30 గోవులకు పైనవున్న మంద పశువుల పాలు పిండడానికి యంత్రములుపయో–గించుటే శ్రేయస్కరము.

అమెరికాలో పశువుల పెంపకం

మానవుడు పశువుల్ని పెంచడంవల్ల అవి అంతకుముందుకంటే ఎక్కువగా ఉపయోగించసాగినవి. ఇందువల్ల మానవునికి బాధ్యత కూడా పెరిగింది. పశువుల్ని పోషింపవలసిన అవసరం వల్ల ఫారములలోని నేటి వివిధ రకముల పశువులు చాల శతాబ్దాల నుంచి పెంచబడుచున్నవి గాని వాటివిషయంలో ఆనాడు తగు జాగ్రత్త తీసికొనబడలేదు. మానవుల సంఖ్య పెరిగిన కొలదీ, పశువుల అవసరం మానవుల కెక్కువైంది. భూమియొక్క విలువ పెరిగింది. అందువల్ల పశువులను జాగ్రతతో పోషించే ప్రయత్నం అభివృద్ధి చెందినది. 200 సంవత్సరాల నుంచి పశువుల అభివృద్ధి గురించిన వివరాలు నేటికి లభ్యమగుచున్నవి. భూమిమీద ముఖ్యమైన పెంపుడు పశువులు ఏయే ప్రదేశాలలో ఉత్పన్నమైనదీ కనుగొనుట కష్టసాధ్యము. గుర్రం

ప్రాచీన కాలంలో మధ్యాసియాలో, ఉత్తర యూరప్‌లో, ఉత్తరాఫ్రికాలో కనుగొనబడింది. పశువులు ఉత్తర, మధ్యయూరపులలోను, ఆసియాలోను; బాతులు ఆసియా, మధ్య యూరపులోను; గొర్రెలు ఆసియాలోను కనుగొన్నారు.

పశువుల్ని పెంచడం తెలుసుకోనప్పుడు మానవులు తమ ఆహారం కోసం పశువులు విశేషంగా నుండే ప్రదేశాలలో నుండేవారు. పశువుల్ని పెంచడం మానవుడు తెలుసుకున్న తరువాత అతడు పశువుల్ని తన యిష్టం వచ్చినచోటుకు తీసుకుపోసాగాడు. ప్రపంచంలో భూమి ప్రతి అంగుళంమేరా మానవులతో క్రిక్కిరిసి యుంది. వారితో బాటు పశువులు కూడా యున్నవి.

కొలంబస్ 1492 లో అమెరికా ఖండాన్ని కనుగొన్నాడు. అప్పుడక్కడ నేడు పెంచబడు జాతుల తాలూకు పశువులేవీ కన్పించలేదు. అప్పుడు అమెరికాలో ప్రపంచంలోని వివిధ జాతుల పశువులు కలవు. అన్ని దేశాలలో కంటే అమెరికాలో పశు సంఖ్య ఎక్కువ. కొలంబస్ తన రెండవ నావికా ప్రయాణంలో తన వెంటగుర్రాలు, పశువుల్ని తీసుకవచ్చి నట్లాధారములు కలవు. ఈ దేశానికి గొర్రెలు ఎప్పుడు ఎవరు తీసుకవచ్చిందీ తెలియటంలేదు. 17వ శతాబ్దములో అమెరికాలో నివాసం కోసం వచ్చిన మొదటి జట్టువారు తమతో కొన్నిరకాల పెంపుడు జంతువులను తీసుకవచ్చి యుంటారు.

అమెరికాకు మొదట వచ్చిన పెంపుడు జంతువులు చాలా తక్కువ రకమువి. 18వ శతాబ్దం వరకూ అమెరికా ప్రజల మాతృదేశాలైన బ్రిటన్, ఫ్రాంసు, స్పెయిన్ ఇతర పడమట యూరపు దేశాలలో మంచి పశువులు లేవనే చెప్పవచ్చు. 19వ శతాబ్దంలో పై దేశాల నుంచి మేలు రకం జాతులు అమెరికా పశుసంపదాభివృద్ధి కోసం కొనిరాబడినవి.

అమెరికా సారవంతమైన భూమిగల పెద్దదేశం. అక్కడ శీతోష్ణస్థితి కూడా పశువుల కనుకూలం. ఈ మంచి ప్రకృతి సహాయాన అక్కడ పశుసంపదాభివృద్ధికి త్వరగా అవకాశాలు ఏర్పడినాయి. అమెరికా చరిత్ర పరికిస్తే, ప్రజలు తమకు కావలసిన ఆహార పదార్థాలు ఇతర దేశాల నుంచి కొనగల సంపద కలవారు. కాని, చాలా కాలం నుండి అమెరికాయే ఇతర దేశాల కాయా పశువుల తాలూకు పదార్థాలు విక్రయించి లాభాలు పొందుతున్నది. అక్కడి ప్రకృతి సిద్ధమైన పరిస్థితులు పశు సంపదాభివృద్ధికి తోడ్పడినాయి. దేశ సంపదకీనాడు పశువులు ముఖ్య పాత్ర వహిస్తున్నాయి.

దేశంలో పశువుల ద్వారా లభించే పదార్థాలకు ప్రజలు ఎగబడుతున్నప్పటికీ, పశుపోషకులు పశువుల్ని స్వలాభం కోసమే పెంచుతారు. పశువులు ఫారములలో లభించే ఆదాయాన్ని పెంపొందించగలవి. అందుచే వ్యవసాయదారులు భూముల్లో పశువుల కవసరమగు ధాన్యాల పంటలు పండించుట, వ్యవసాయమునకురాని బంజరు భూముల్ని సాగుచేయుట, కూలీలకు సక్రమంగా పని లభించే విధానా లవలంబించుట, ఫారములలో వస్తువులు మార్కెట్లకు చవుకగా పంపుట, ఆహార సమస్యకు తోడ్పడుట, భూసారమును అభివృద్ధి పరచుట చేస్తారు.

ప్రపంచంలో కొన్ని దేశాలలో ఫారములలో నుండే పశువుల సంఖ్య లీ క్రిందనీయబడినవి.

దేశం	పశువులు వేల సంఖ్యలో	హాగ్‌లు వేల సంఖ్యలో	గొఱ్ఱెలు వేల సంఖ్యలో
అమెరికా	71,766	52,983	55,880
కెనడా	10,083	4,072	3,492
మెక్సికో	8,860	3,698	4,848
బ్రెజిలు	44,178	23,436	11,876
అర్జెంటీనా	31,540	3,769	40,566
బ్రిటన్	8,459	3,739	26,046
ఫ్రాంసు	15,616	6,606	9,812
జర్మనీ	19,134	23,434	3,456
రష్యా	43,740	15,615	52,960
ఇండియా	1,54,211	250	24,968
చైనా	23,000	84,000	24,000
ఆస్ట్రేలియా	12,865	1,121	1,11,417
ప్రపంచ మొత్తం	**6,97,900**	**2,94,700**	**6,84,500**

పంట ధాన్యాలు

గోధుమ, రై, ఓట్సు, బార్లీ మొదలైనవి మానవులకేగాక పశువులకూ ఉపయోగిస్తవి. ఈ పై పంటలలో కొద్దిగా మాత్రమే పశువులకు మేపితే, పశువులు ఎక్కువ ఆదాయం లభించే పదార్థాల నీయగలవు.

బంజరుభూముల్లో మేతలు

ప్రపంచంలో అనేక దేశాలలో వ్యవసాయాని కసాధ్యమైన కొండ ప్రాంతాలు పచ్చికతో నిండినవి కలవు. కొన్ని ప్రాంతాలలో వర్షం లేనందున అచ్చటి భూమి వ్యవసాయానికి వీలుపడదు. సేద్య భూమి సమీపంలోనే వ్యవసాయానికి వీలు కాని రాతి భూములు, చెమ్మ భూములు కలవు, ప్రకృతి ఇటువంటి భూముల్లో పశువులకు గొఱ్ఱెలకు ఉపయోగపడే మేతలు పెరగడానికి సాయపడుతుంది. అమెరికాలో గ్రేట్‌ప్లెయిన్స్ అనుచోటు కేవలం బీడువంటిది. అమెరికాలో మాంసాన్నిచ్చే పశువులలో 1/4 వంతునూ, గొఱ్ఱెలలో 2/3 వంతునూ ఇక్కడి మేతల వలన జీవిస్తున్నవి. మిలియన్ల కొద్దీ దేశమంతటా చెదురు గానున్న బీళ్లు దేశంలో పశువులకు మేత కెంతో ఉపయోగపడుచున్నాయి.

తెలుగు దేశంలోని పాడి పశువులు

మనం ఆంధ్రులం. ముక్కోటిమందిమి మన దేశం వ్యవసాయ దేశం. వ్యవసాయ దేశంలో జీవనం పుష్టినిచ్చేవి కూడా పాడిపంటలే. 'కదు రాడినా కవ్వమాడినా కరువులే' దనే సామెత అందువల్లనే యేర్పడి వుంటుంది. ప్రపంచ ప్రథమ యుద్ధానంతరం కదురు రాజకీయాలలోకి పచ్చినా, రెండవయుద్ధంతో పెరిమిట్ల జననంతో మిల్లుగుడ్డలకే ప్రాధాన్యత యేర్పడటం, కదురు నిర్మాణ కార్యక్రమాల్లో మిగిలి పోవడం సంభవించింది. గుడ్డలలో మార్పులు వచ్చినా కవ్వం ఆడందే ప్రజానీకపు ఆరోగ్యం కోలుకోబోదు. కవ్వం అంటే పాడి అన్నమాట.

ఇతర దేశస్థులలో మనం పాడిలో పోల్చుకుంటానికే వీలులేదు. 20 నుండి 10 ఔన్సుల వరకు త్రాగే సగటు జనాభాలతో ఇతర దేశాలున్నవి. మన దేశంలో సగటు పాడి వాడుక 8 ఔన్సులుగా పరిగణింపబడింది. మన దేశంలో పంజాబులో తలకు 16 ఔన్సులు త్రాగుతారని పంజాబులో 6 ఔన్సులు త్రాగుతారని ఇండియాలో ఆవు 5 నుండి 10 పౌనులు ఇస్తే ఇంగ్లాడులో 50 పౌనులు ఇస్తుందని మద్రాసు గవర్నరు ది 13-8-49 న అన్నాడు.

ఇక మన ఆంధ్ర దేశపు సంగతి ఆలోచించుదాం. ఆంధ్ర దేశం అంటే కొంత మద్రాసు రాష్ట్రంలోను, మరి కొంత హైదరాబాదు సంస్థానంలోను ఉన్నది. మద్రాసులోని వివరాలు పౌనులు లెక్కయినా కొంతగా లభించినా హైదరాబాదులోని అంకెలు లభించడం కష్టంగా వుంది. 1945 అంకెల ప్రకారం తెలంగాణాలో 6,52,344 ఆవులు, 644693 గేదెలు వున్నట్లు తేలుతున్నది. మరాట్వాడాలో సగటున ఆవు 1.47 శేర్లు. గేదె 3.5 శేర్లు పాలు ఇస్తే, తెలంగాణాలో 2.2 శేర్లు పాలు యిస్తున్నవి. ఆవు, గేదె పాలు కలిసి మరాట్వాడాలో 7.2 ఔన్సులుంటే తెలంగాణాలో 3. ఔన్సులు ఉంటున్నది. ఇది సగటు సంఖ్య అన్నప్పుడు అక్కడి భూసంబంధాలు గుర్తుంచుకోవాలె. అచట జాగిరుదారులు, దేశముఖులు, పెద్దరైతుల కొక్కొక్కరికి వందలు వేలు ఆవులుండి సామాన్యప్రజానీకానికి, వానిని చూచే భాగ్యమే గాని, వాటి పాలు అనుభవించే యోగ్యత లేకుండా పోతున్నదని అందరికీ తెలిసిందే. ఈ విధంగా అంచనా వేస్తే సగటున తలకు 1 ఔన్సు లభించుతుందా అనేది అనుమానమే. అంటే ఇండియాలో సగటు పాలవాడుకలో ఎనిమిదో వంతు వుంటే ఇండియా ఆయుర్దాయంలో కూడా సగటు 8 వంతేగా ఉండేది. ఇది తెలంగాణా పశుసంపదస్థితి. పాని బట్టి పంటలు. ఇచట గోసేవ అంటే పాలు త్రాగడం కాకుండా పూజించడమే అవుతున్నది.

ఇక మద్రాసు రాజధానిలోని ఆంధ్రజిల్లాల స్థితి. ఈ జిల్లాలో కొంత అధిక వివరాలే లభించవచ్చు. తెలంగాణా కన్నా, మద్రాసు రాజధానిలో ఆఖరుగా పశువుల సంఖ్య తీసింది 1944లో. ఆ సంవత్సరపు అంచనాల ప్రకారమే మనం కూడా పరికించవలసి వుంటుంది. ఆ లెక్కల ప్రకారం జిల్లాల వారిగా ఆవులు, గేదెలు పాలిచ్చేవి. అసలు మొత్తంగా ఉన్న పశువుల వివరాలు పరికించుదాం.

ఆవులు – గేదెలు

జిల్లా	పాడి ఆవులు	మొత్తం ఆవులు	పాడి గేదెలు	మొత్తం గేదెలు
విశాఖపట్నం	125388	278166	89905	177794
తూ.గోదావరి	120905	243618	92404	143647
ప. గోదావరి	60407	165429	44099	155338
కృష్ణా	48922	137564	74332	261184
గుంటూరు	47438	118214	229295	364500
కర్నూలు	31618	91486	86172	169130
బళ్ళారి	39576	94515	41092	80974
అనంతపురం	52504	144390	43894	87694
కడప	29445	68640	76215	147311
నెల్లూరు	72657	237354	140270	255850
చిత్తూరు	89348	288835	398935	91251

ఆవులలో విశాఖపట్నంజిల్లాయును, గేదెలలో గుంటూరు జిల్లాయును ప్రథమస్థానం వహించినవి. అటులే తెలంగాణాలో ఆవులకు వరంగలు జిల్లా ప్రథమస్థానం వహించింది. పాలిచ్చు ఆవులు, గేదెలకన్నా యివ్వనివే అధికంగా వున్నట్టు, తేలిపోతున్నది. ఇక పంటలకు పనికివచ్చే వాటిని వదిలేసి చూచినా గోజాతి, గేదె జాతి లెక్కలు యిట్లావున్నవి. ఇన్ని గేదెలు ఆవులు వుంటేనే నగటున మద్రాసు రాజధానిలో మనిషికి 3 ఔన్సుల పాలు త్రాగుతున్నారని మద్రాసులో గవర్నరు అంచనా చెపుతున్నది. ఇందులో పెద్ద రైతుల వద్ద వుండి ఉపయోగపడని ఆవులు, గేదెల పాలు, అటులే బస్తీలలో కాఫీహోటళ్లు, కోవాలు, వగైరా వాడకాల కుపయోగించే పాలు అంచనాకట్టి తీసివేసి సామాన్యంగా జనానికి వచ్చే సగటు పాలు 1 ఔన్సుకన్నా వస్తుందా అని.

అసలు పాల ఆదాయము యిటులుంటే ఈ పశువులకు సంభవించే చీడలు, రోగాలతో నివారణో–పాయాలు తగుమైన విధంగా లేకపోవడంవల్ల నోటివద్దకు వచ్చినవన్నీ చనిపోతున్నవి. 1945 లో రాయల సీమలో సంభవించిన గడ్డికరువుకు అనేక వందల పశువులు కటి కోప వాసాలు చేసి ప్రాణాలు విడిచిన సంగతి చరిత్రప్రసిద్ధమే. చనిపోయినవి పోగా ఉన్న వాటికి అనువగు మేతలేదు. అందువల్లనే ఆంధ్ర

జిల్లాలలో అధిక అడవులు గలిగిన కడప, కర్నూలు చిత్తూరు జిల్లాలలోని పశువుల సంఖ్య చాల శోచనీయంగా కనుపించుచున్నది. పశువులకు మేత సౌకర్యాలు యేర్పరచకపోతే పశుసంపద పెరగడం అసంభవం. బస్తీలలో గేదెలు పాకీపనికి, ఆవులు విస్తరాకులను తింటుంటే వాటికేం పుష్టి కలుగుతుంది? ఆ పాలు త్రాగిన వారెంత పుష్టిగా వుంటారు? అందువలన ఫారెస్టులోని గడ్డి కోయించి కట్టలుగా కట్టి బస్తీలలో ఆరోగ్యశాఖ, మ్యునిసిపాలిటీలు అమ్మకం చేయాలి.

పశువుల రోగాలకు తగిన మందులు బస్తీలలోనే లభించడం కష్టం అయినపుడు పల్లెల సంగతి అరణ్యరోదనమేకదా. ఇప్పుడున్న పశువైద్యులు వారి ఉద్యోగ భోధనలు పని తప్పించుకోవడానికి చాలా అనుకూలంగా వున్నవి. ఎవరైనా పశువులపై ప్రేమ కలిగి, వ్యక్తి గౌరవంతో చేసేవారికా తగిన ప్రోత్సాహం కలగడంలేదు. ప్రతి తాలూకా కొకటైనా పశువుల ఆసుపత్రి వుండాలి. అంటువ్యాధులు వచ్చినపుడు రైతాంగం కూడా శ్రద్ధవహించి శాస్త్రీయ ఔషధాలు వాడుకొనే అలవాటు చేసుకోవాలి.

పశువులమేతకై పచ్చికబయళ్ళన్నీ ఖాళీ అయినవి. అందువలన పంటలలోనే ప్రత్యేకంగా కొంత భూమిని పశుగ్రాసానికి సంబంధించిన పైర్లకు ప్రత్యేకించాలి. పాత పద్ధతి పశుపొల్లింతలు మానివేయాలి. ఉన్న ఆబోతే చాలునని సంతృప్తిపడడం, దానితో ఎన్ని పశువులనైనా పొల్లించడం వల్ల బలహీన దూడలు పుట్టుతున్నవి. అందువలన నూతన పద్ధతులలో, సింధీదున్నలు ఒంగోలు, సింధు, ఇంగ్లీషు ఆబోతులను విరివిగా గ్రామాలలోకి తీసికొనివచ్చి పొర్లించాలి. పశువృద్ధికి కనీసం 10 సం.ల ప్లానుతో ప్రభుత్వం రావలెననే కుతూహలం లేకపోయినా ప్రజలు చర్యతీసుకొని పశువులను, పాడి పశువులను పెంచాలి.

బీదవాని ఆవులనితలంచే గొర్రెలు, మేకలస్థితి ఇట్లులేదుగాని మేకలు కొంతనయం కాని, గొర్రెలు ఒక గాలికి వేలకు వేలు అసువులు బాయుచున్నవి. వాటికి అసలు వైద్యసహాయం అనేది పరలోకంలోనే కనిపిస్తున్నది. మనజిల్లాలలో పాడికి పనికిరావని తలంచబడుచున్న మేకలు గొర్రెలు ఈ విధంగా వున్నవి.

మేకలు-గొర్రెలు

జిల్లా	మేకలు	గొర్రెలు
విశాఖపట్నం	173945	349234
తూర్పుగోదావరి	34121	73798
పశ్చిమగోదావరి	60806	69876
కృష్ణ	101778	124165
గుంటూరు	102130	354942
కర్నూలు	128808	417092
బళ్ళారి	100420	185927

అనంతపురం	150466	440098
కడప	105444	262201
నెల్లూరు	173035	536290
చిత్తూరు	229539	385738

ఇటులే తెలంగాణాలో మేకలు గొర్రెలు, కలసి 60 లక్షలున్నట్లు తేల్చారు., మరాట్వాడాలోని ఉస్మానాబాద్ తాలూకా నాందేడ్ గ్రామాలలో మంచిరకం మేకలు గొర్రెలు రోజుకు 3 పౌనులు పాలిస్తువని వినికిడి. వీటి జాతిని పెంపొందించితే ముందు ముందు ఉపయోగపడవచ్చు.

జాతి సంపద వాటి పుష్టినిబట్టి వుంటుంది. మన గురజాడ ప్రబోధించాడు 'కండగలవాడేను మనిషోయ్ అని'. పశువుల పాలను, పాల పదార్థములను మాత్రమే గాక పశువుల మాంసాన్ని కూడా ఆహారముగా ఉపయోగించటం అలవాటయింది. కాని తగినన్ని పశువులు లేనందున అది చాలా ప్రియం అయిపోయి అలభ్యం అవుతున్నది. అందువలన ప్రజాక్షేమదృష్ట్యా పశువుల క్షేమలాభాలను ఆశించే వారు ఆంధ్ర జాతి భవిష్యత్తును పుష్టికరంగా విజ్ఞానప్రదంగా మహోన్నతంగా ముందుకు పోవలెనని ఆంశిచేవారు పశువుల ఉనికికి మన్నికకు పుష్టికి తగు యోచనలు చేసి ఆంధ్ర దేశం పాడిపంటల మహాలక్ష్మి అనే పేరును పూజలకు మాత్రమేకాక అనుభవంలో కూడా యదార్థం చేయాలని "శ్రీవావిలాల" తెలుపుతున్నారు.

దేశవాళీ జాతులు – పాలిచ్చు ప్రసిద్ధజాతులు

ఆవులు, గేదెలను ఏరు కొనుట:– పాడి పరిశ్రమను స్థాపించుటకు నిశ్చయించుకున్న తరువాత మొట్టమొదట పని పశువులను మంచి వాటిని ఏరి కొనుక్కొనుట, పాలు ఇచ్చు పశువులను ఏరుకొనుట చాలా పెద్దపని. ఏలనన దుగ్ధాలయము యొక్క బాగోగులన్నియు దీనిపైననే ఆధారపడి యున్నవి. పశువులను ఏరికొనునప్పుడు, కొనునప్పుడును ఆపశువులు మంచి జంతువులు అవునో కాదో తెలుసుకోవాలి. కొన్ని కొన్ని ఆవులు చూపులకు అందముగా వుండి నికృష్టజాతి రక్తము కలిగి యుండుటచే కష్టమును కలిగించుచుండును. ఎక్కువగా కష్టించి పనిచేయు జాతికి చెందిన ఆబోతుతో సంభోగము చేసిన ఆవు యినిన తరువాత ఎక్కువగా పాలు యివ్వదు. పాలు ఇచ్చు పశువుల నరములు కఠిన పరిశ్రమచేయు పశువు నరములు ఒక దానికొకటి భిన్నముగా నుండును. అందుచే పాడి గేదెను, ఆవును కొనునప్పుడు దాని జాతి దాని పూర్వ చరిత్రలను తెలిసి కొనవలెను. అదిగాక ఆ పశువును కొనువాని పరిస్థితులు (అచ్చటినీరు ఆహారాదులు) మొదలగునవి దీనికి అనుకూలముగ నుండవలెను. పంజాబులో 8.9 శేర్లు పాలు ఇచ్చు గేదె సంయుక్త ప్రాంతములో కూడ అటులే యిచ్చునని తలచరాదు. ఏలనన పంజాబు నందలి జల వాయువులు అచ్చటి మేత మొదలగునవి సంయుక్త ప్రాంతమునందలి జల వాయువులకు భిన్నముగానున్నవి. మెత్తని మేత తిను పశువుకు గట్టిగానుండు మేత వేసినచో పాలుతగ్గిపోవును. పాడి ఆవునుగాని గేదెనుగాని కొనునప్పుడు దాని వయస్సెంతో తెలుసుకొనవలెను. ముసలి వాటికంటే పడుచువి ఎక్కువ లాభకరము. ఏ పశువు యొక్క స్వభావము ఎటువంటిదో కూడ తెలుసుకొనవలెను. ఆవు ఉత్తమ

జాతికి చెందినదయి ఎక్కువ పాలిచ్చునదయి వున్నప్పటికి కుమ్మునది, పొడుచునది చంచలమైనదీ అయినచో అది లాభదాయకమైనది కాదు. ఏలనన కొద్ది కారణము చేతనే అది పాలు ఇచ్చుట మానును లేక తక్కువ ఇచ్చును.

ఆవు గేదెలను కొనునప్పుడు ఆలోచించ వలసిన విషయములు

1. పశువు శాంతస్వభావము గలది బీదదిగా,
2. మందగమనముగలదిగా,
3. ముఖములో మాతృప్రేమ వ్యక్తమగునదిగా,
4. చిన్న శరీరము గలదిగ,
5. వెంట్రుకలు మృదువుగను, చర్మము పచ్చగను గలదిగ,
6. మెడ పలచన పొడుగుగా గలదిగ,
7. మొండెమునకు ముందు భాగము సాధారణముగా సన్నమైనదిగ,
8. పిరుదులు వెడల్పయినవి పెద్దవిగా గలదిగ,
9. కండ్లు శాంతమైనవి గౌరవము గలవిగ,
10. విశాలమైన చెవులు లోపలితోలు పసుపువన్నె గాని లేత నారింజరంగు గలదిగ.
11. పొదుగు పెద్దది, పాలు భరించుశక్తి గలది పాలధార తీసిన పైకి పీక్కు పోకుండా వుండెడిదిగ.
12. స్తనములు సమానముగాను సమానము గాగల దూరము గలవిగ ఎక్కువ పొడుగు ఎక్కువ పొట్టిది గాక వుండాలి. మంచి జాతిగల పశువునకు 4 కంటె ఎక్కువస్తనములు వుండవు.
13. పాలధార పెద్దతి నీలిరంగు గలదిగా వుండరాదు.
14. పొదుగునందలి రక్తవాహిని విశాలం గలదిగా వుండాలి.
15. ఏ విధమైన దురలవాట్లు వ్యాధి గలదిగా వుండరాదు. ఆవును కొనుటకు ముందుగా మూడు రోజులు ఉదయం సాయంత్రం మీరు గాని మీ నమ్మకమైన మనిషి గాని పాలు పితికి చూడాలి. దీనివలన ఆవు ఎన్ని పాలు ఇచ్చుచున్నది సరిగా తెలియును.

ఇటుల చేసిన మోసపోవలసిన అవసరముండదు. దీని వలన యిదే కాకుండ దానికి ఏవైన దుర్గుణములు గల వేమో కూడ తెలియును. చూడి ఆవును కొనుటచే మోసపోవుటకు ఎక్కువ అవకాశము గలదు. ఇందుచే యీనిన తరువాత కొనవలెను. హిందూస్తానమందలి పాలిచ్చు ఆవులు, గేదెలు, సంక్షిప్త వృత్తాంతము ముందు వివరించుతున్నాము.

హరియాన లేక హిసార్ జాతి

ఈ జాతి ఆవులు పంజాబు నందలి రోహతిక్, హిస్సార్ జిల్లాలో దొరకును. ఇది సాంప్‌లా, గోహనా పరగణాలలో చాలా బాగా వుండును. వీటిరంగు తెలుపుగా నుండును. అందముగా నుండును. ముఖము

పొడవుగాను కోణముగాను ఉండును. నుదురు విశాలముగాను ఉబ్బియుండును. కన్నులు పెద్దవి కాంతిగలవిగాను వుండును. చెవులు విశాలముగాను వ్రేలాడుచు ఉండును. వీపు భుజములవద్ద పల్లముగా ఉండును. తోక మొదలలో విశాలముగాను, చివర సన్నముగాను ఉండును. వెంట్రుకలు మెత్తగాను నునుపుగను ఉండును. పొదుగు పెద్దదిగాను, స్తనములు సమానమగు దూరముగ నుండును. ఎక్కువ పెద్దవి ఎక్కువ చిన్నవిగా ఉండును. సిరారంగుగా గల ఆవుల యొక్క మెడ, భుజము, వీపుమీద ఎక్కువ సిరారంగుగా నుండును. చర్మము యొక్క రంగు ఎల్లప్పుడు నలుపుగాను లేక పుగాకు రంగుగాను ఉండును. ఈ జాతి ఆవులు ప్రతి రోజు 6 నుండి 12 శేర్ల వరకు పాలు ఇచ్చును. ఈ జాతికి చెందిన మంచి ఆవు సమయానుసారము 50 నుండి 80 వరకు ఖరీదు చేయును. అప్పుడప్పుడు మంచి ఆవు 100 నుంచి 125 వరకు కూడ చేయును. యీ అవు యొక్క సాధారణమగు కొలత యీ దిగువ యిచ్చున్నాము.

ఎత్తు	---	52 అం
చెవిపొడవు	---	8 "
ముఖముపొడవు	---	20 "
నుదురు యొక్క వెడల్పు	---	6 "
వక్షస్థలము యొక్క చుట్టు	---	80 "
వెనుక కాలుయొక్క క్రిందిభాగము	---	7 "

ఈ జాతి ఆవుధర 40 నుండి 60 వరకు ఉండును.

మధురా లేక కోశీజాతి

ఈ జాతి మేవాత్ దేశపువియై ఉన్నవి. ఈ దేశము కోశీతహశీల్ యందలి కొన్ని భాగములు పంజాబు నందలి గుడ్ గాంల్ జిల్లాలోను, కొన్ని భాగములు భర్నతపూర్ మరియు అల్వార్ రాజ్యమందలి కొన్ని భాగములు కలిసియున్నది. ఈ ప్రాంతమందలి చాలా పశువుల కోసీయా అందలి సంతకు తీసికొని రాబడి అమ్మబడును. ఇందుచే వీటిని కోశీ జాతి పశువులని పిలుతురు. యీ జాతి ఆవులు తెలుపుగా గాని, సిరారంగు గాని ఉండును. ముఖము పొడవుగా నుండును. కాని హిసాల్ జాతి ఆవుకు వున్నంత పొడుగుగా ఉండదు కండ్లు పెద్దవిగాను, కాంతి వంతముగాను, వుండును. చెవులు పెద్దవిగాను వ్రేలాడుతూ ఉండును. తోక మొదటిలో లావుగాను. వుండును యీ జాతి ఆవు 5 నుండి 8 శేర్ల వరకు పాలు ఇచ్చును. యీ జాతి ఆవు 40 నుండి 60 రూపాయలు వరకు ఖరీదుచేయును. మధుర జిల్లాయందలి కోసీ సంతలో యివి అమ్మబడును. వీటి కొలత పరిమాణము ఎత్తు 49 అం, వక్షస్థలపు ఆవరణ 62 అం, ముఖము పొడవు 19 అం.

గిరిజాతి

జాతి యొక్క నిపాసస్థానము కథియవాడ్ నందలి గిర్ నార్ పర్వతపు చుట్టుప్రక్కలందలి భూమియై ఉన్నది. యీ జాతి ఆవులు చూచుటకు ఆకారములో చాలా ఆడంబరముగా నుండును. పొడువుకంటె

ఎత్తు ఎక్కువగా నుండును. దీనిరంగు ఎఱుపులేక తెలుపురంగు మీద ఎఱుపు నలుపు మచ్చలు గలదిగా వుండును. నుదురు వెడల్పుగాను ఉబ్బియు ఉండును. కొమ్ములు వెనుకకు వంగియుండును. స్తనములు చాలా పెద్దవి గాను పొడవుగాను నుండును. కథియవాడ్‌లో యీ జాతి ఆవు యొక్క కొలత యీక్రింది విధముగా నుండును.

ఎత్తు	48 అం.	నుదుటి వెడల్పు	16 "
వక్షస్తలపు ఆవరణ	94 "	ముఖపుపొడవు	12 "
చెవి	12 "	వెనుకకాలుయొక్క మోకాలుక్రింద భాగము	8 "

ఈ జాతి ఆవులు ఒక్కొక్క యీతకు 30 నుండి 40 మణుగుల పాలవరకు యిచ్చును. ఈ ఆవులు సాధారణముగ 8, 10 నెలల వరకు పాలు ఇచ్చును.

ఈ జాతి ఆవులు సింధు దేశపు దక్షిణ భాగమందు విశేషించి కరాచీకి చుట్టు ప్రక్కల 40–50 మైళ్ళదూరములోను దొరకును. కరాచీలో వీటి వ్యాపారము జరుగును.

శరీరము చిన్నదిగాను అందముగాను ఉండును. రంగు ఎరుపు సిరా రంగుగా నుండును, శరీరము నిండుగా యుబ్బి యుండును. ముఖము పొదుగు పాదములపైన అచ్చటచ్చట తెల్లమచ్చలుండును. కంఠము లావుగాను చిన్నదిగాను ఉండును. ముఖము చిన్నదిగా అనాకారముగా నుండును. కంటికి చుట్టూ నలుపు రంగువుండును. కొమ్ములు సూదికొన వలె వుండవు. యీ జాతి ఆవులు 8 నుండి 12 శేర్ల వరకు పాలు ఇచ్చును. కరాచీలో యీ జాతి ఆవులు 40 నుండి 60 రూపాయల ఖరీదులో దొరకును. ఒక్కొక్క యీతకు 35 నుండి 40 మణుగుల వరకు పాలు ఇచ్చును. ఆవు కొలత యీ దిగువ విధముగా నుండును. ఎత్తు 51 అం. వక్షస్థలపు అవరణ 62 అం. చెవి పొడవు 9 అం, నుదుటి వెడల్పు 9 అం. ముఖము పొడవు 19 అం. వెనుకకాలు మోకాటి క్రిందిభాగము 6 అంగుళములు.

ఖుందీ లేక ఢిల్లీ జాతి గేదెలు

ఈ జాతి గేదెలు పంజాబు నందలి కౌవాతక్ జిల్లాలో దొరుకును. ఢిల్లీ నుండియే ఇవి ఇతర ప్రాంతములకు పోవును గాన వీటిని ఢిల్లీ జాతివని పిలుతురు. ఈ జాతి గేదెల కొమ్ములు వెనుకలై ప్రక్కచుట్లు తిరిగి యుండును. ఇందుచే పంజాబులో వీటిని ఖుందీ జాతివని పిలుతురు. ఈ జాతి గేదెలు చాలా ఆడంబరముగా నుండును. రంగు నలుపుగా నుండును. కొన్ని కొన్ని తెలుపురంగులో కూడా వుండును. వాటి యొక్క అనాకార శరీరము బరువు మోయుటకు బలము గలదిగా నుండును. ఈ జాతి గేదెలు 8 నుండి 16 శేర్ల వరకు పాలిచ్చును. దీనిధర రు 60 నుండి రు 115 వరకు వుండును. ఈ జాతి గేదెలు ఆకృతిలో సాధారణముగా యీ దిగువ కొలతలు గలవిగా నుండును.

ఎత్తు	58	అం
ముఖముపొడవు	23	"
చెవి పొడవు	8	"
వక్షస్థలము ఆవరణ	84	"
నుదురు	8	"
వెనుక కాలు మోకాటిక్రింది భా।	5	"

సూరతుగేదెలు

సూరతుగేదెలు మన దేశపు గేదెల వలె నుండును. వాటి కొమ్ములు చిన్నవిగాను, ఒక దానివైపు ఒకటి యుండును. దేశ వాళి గేదెల కొమ్ములు చాలా పొడవుగా నుండును. కొమ్ములు ఒక దాని కొకటి దూరముగా వంగి యుండును. సూరతు గేదెలు చిన్న దెక్కలు కలిగి ఎక్కువ పాలు ఇచ్చునవిగా యుండును. ఈ గేదె 14 నుండి 15 శేర్ల వరకు ప్రతి రోజు పాలు యిచ్చును. మంచి గేదె రు. 100ల నుండి రు. 125 ల వరకు ఖరీదు చేయును. ఈ జాతి గేదెలు ఒక్కొక్క ఈతకు 40 నుండి 59 మణుగల పాల వరకు ఇచ్చును. ఈ గేదె కొలత సాధారణముగా నీ విధముగ నుండును.

ఎత్తు	53	అం
ఆవరణ (వక్షస్థలము)	74	"
చెవి	10	"
నుదుటి వెడల్పు	12	"
ముఖము పొడవు	19	"
వెనుక కాలు మోకాటి క్రిందిభాగము	5	"

జాప్‌రాబాదీ గేదెలు

ఈ జాతి గేదెల నివాసస్థానము కధియవాడు నందలి గిర్‌నార్ పర్వతపు చుట్టు ప్రక్కల ప్రదేశమై యున్నది. ఇది చూచుటకు రూపముగా నుండును. కాని మంచి బలము గలిగియుండును. వాటి నుదుటి యందలి ఎముక బాగా పెరిగియుండును. కొమ్ములు కండ్ల వెనుక నుండి వచ్చినవా యన్నట్లు వుండును. వాటి కొమ్ముల మొదట క్రిందికి వంగి మరల వెనుకవైపుకు పోవును. ఈ గేదె యొక్క ముందు భాగము వెనుక భాగము కంటె బలిష్ఠముగా నుండును. పొదుగు స్తనములు చాల పెద్దవిగా నుండును. స్తనములు పొదుగు వద్ద కొంచెము సన్నగాను క్రిందివైపు లావుగానుండును. ఈ గేదెలు 15 శేర్ల వరకు పాలు యిచ్చును. దీని ధర రు 150 వుండును. దాని కొలత ఈ విధముగా నుండును. ఎత్తు 57 అం. ఆవరణ

(ఛాతి) 88 అం. చెవి 12 అం. నుదురు 22 అం. ముఖము, 24 అం. వెనుక కాలు క్రింది భాగము 7 అం.

పాలు ఇచ్చు జంతువుల సంఖ్య

జంతువుల సంఖ్య కనీసము ఎన్ని ఉండాలో ముందు నిశ్చయించాలి. ఏలనన దీని మీదనే శాల కట్టుట మేతకు, నీటికి ఏర్పాటు చేయుట మేతకు బీడు నౌకర్లు మొదలగు విషయములు ఆధార పడియుండును. ఈ విషయము తన ఆర్థికస్థితి అచ్చట కావలసిన పాలు వీటిపై ఆధార పడియుండును. ఎన్ని పాలు కావలెనో దాని ననుసరించి అన్ని ఎక్కువ పశువులు కొనవలెను. కావలసిన పాల ననుసరించి ఎప్పుడు చూడితో వుండు పశువులు, పాలుయిచ్చు పశువులు వుండవలెను. సాధారణముగా 100 పశువులలో 60 పాలు ఇచ్చునవి వుండును. తక్కినవి పాలు యివ్వవు. ఈ విషయములను జ్ఞప్తియందుంచుకొని కావలసిన పశువులను వుంచు కొనవలెను. ఆవులు, గేదెల సంఖ్యమీద ఆబోతులు దున్నల సంఖ్య ఆధారపడి యుండును. సాధారణముగా 40, 50 పశువులకు వక మగది చాలును. ఈ ప్రకారము వుంచిన సుళువుగా ఉండును. ఏ ఆవు, గేదె కూడ యెల్లప్పుడు పాలు యివ్వదు. యెప్పుడూ యెండిపోయి కూడా యుండదు. ఏడాదిలో కొద్ది కాలము మాత్రమే పాలను యివ్వకుండా వుండు పశువు ఎక్కువ లాభకారి. ఏ పశువు ఎన్నాళ్ళు పాలు యిచ్చునో యెన్నాళ్ళు యివ్వదో ఈ దిగువ వివరించుచున్నాము.

ఈ కోష్టక మందలి కొంత భాగము పూనా యందలి సివిల్ డైరీనుండి గైకొనబడినది.

ప్రక్కపుటలోని మొదటి కోష్టకములో ఏడాదికి ఎన్ని పాలుయుచ్చునో ఎన్ని రోజులు ఎండి పోవునో యెన్ని రోజులు పాలుయిచ్చునో, రోజుకు ఎన్ని పౌనులు పాలు యిచ్చునో వివరించినాము. రెండవ కోష్టకములో ఆవు యెంత వరకు పాలుయిచ్చునో రెండు యీతలలో ఎంత భేదము ఉండునో ఒక యీతలో సాధారణముగా ఎన్ని పాలు ఇచ్చునో యీ లెక్క వలన ప్రతి రోజు ఎన్ని పాలు యిచ్చునో తెలియును.

పరుపు వేయు విధానము

పశువులకు పరుపు వేయుటకు ఆకులను ప్రోగుచేయుటలో అందులో ఏ విధమగు ముండ్లు మొదలగునవి లేకుండునట్లు చూడవలెను. పరుపు వేయునప్పుడు శాలవద్ద ఏమాత్రం చెత్త పడకుండు నట్లు చూడవలెను. పశువు యొక్క పేడమూత్రముతో ఆకులు కూడు కొని యున్నప్పుడు వాటిని తీసి వేసి వేరొక మెత్త వేయవలెను. శాలకు రెండువైపు ప్రతి రోజు కడిగి శుభ్రంగా వుంచాలి. వారం పదిరోజులైన తర్వాత మెత్తయందలి చెడిపోయిన భాగమును తీసివేయాలి ఇట్టి చెడిపోయిన మెత్తలో మరీపాడు కాని ఆకుల నన్నిటిని ఏరి వేరొకచోట కుప్పగా పెట్టాలి. తదుపరి శాలనంతను శుభ్రముగా కడగాలి. అడుగు భాగము ఆరిన తర్వాత పూర్తిగా చెడిపోని ఆకులు క్రొత్త ఆకులు కలిపి మెత్తగా వేసి పశువులను కట్టివేయవలెను. ఇది చాలమంచిది. అచ్చటచ్చట గుర్రములకు యీ విధముగ మెత్త నేర్పరతురు గాని గొడ్లకు ఏర్పరచరు. ఏదైన పశువునకు అంటువ్యాధి వచ్చినదని తెలిసిన వెంటనే అడుగు మెత్తను కాల్చివేసి శాలను పరిశుభ్రంగా కడుగుట ఆరోగ్యకరము.

జాతి	పాలు యిచ్చు కాలము	పాలు యివ్వని కాలము	సాధారణముగా ప్రతి రోజు యిచ్చు పాలు	సాధారణముగా సీడాడిలో యిచ్చు పాలు
గిర్ జాతి ఆవు	220	145	5 – 8	1947
సింధీ జాతి ఆవు	290	75	7–14	2717
కోసి జాతి ఆవు	213	1525	4 – 8	1654
జాఫరా జాతి గేదె	223	133	9 – 2	3110
ఖుందా లేకఢిల్లి గేదె	21	150	8 – 4	2539
సూరత్ గేదె	235	130	7 – 9	2567
దేశీయ గేదె	225	140	5 – 2	1825

జాతి	ఎన్నాళ్ళు పాలిచ్చును	రెండు యీతల మధ్య రోజులు	ఒక యీత పాల యొక్క సాధారణ పరిమాణము	యీతరోజుల లెక్క ప్రకారం (ప్రతిరోజు ఇచ్చు పాల పరిమాణము
గీర్ ఆవు	312	462	3240	10
సింధీ ఆవు	356	442	3412	9
కోసీ ఆవు	277	395	2000	7
జాఫరా జాతి గేదె	384	486	4429	10
ఢిల్లీ గేదె	401	477	6707	16
సూరత్ గేదె	384	516	4096	11
దేశీయ గేదె	389	614	3708	9

మేత నీరు పెట్టుటకు సమయము

మేత నీరు యొక నియమిత సమయమునకే ఇచ్చుచుండాలి ముందుగా ఇచ్చుటచే తిన్నది జీర్ణముగాక జబ్బు చేయును. ఆలస్యముగా మేత పెట్టిన ఆకలి వేళ తప్పిపోవుటచే మేతకంటె నీరు ఎక్కువ త్రాగును. తిన్న మేత (ఈ విధంగా) జీర్ణమగుటకు తగు సహాయము వుండక పోవుటచే యిందువలన కూడా జబ్బు చేయును. నీరు మేత పశువుకు నియమిత సమయమున ఇచ్చుట అవుసరం. బీడులేక అడవిలో మేయవలసిన అవశ్యకత గల పశువులకు అడవికి మేతకు తప్పక తీసుకొని కాని పొలములో పనిచేయు పశువులను అడవికి తీసికొని పోనక్కరలేదు ఏ మాత్రము పనిచేయని పశువులను తప్పక అడవికి తోలు కొని పోవలెను. అచ్చట పశువులకు మంచి మేతయును దొరకును. డబ్బు ఖర్చు ఎక్కువ కూడ వుండదు. పని చేయని పశువులకు ఇది యొక పరిశ్రమయగును. ఒక విధమగు అనందముగ కూడ వుండును. చక్కని ఆరోగ్యము బలిష్ఠమగు శరీరము కలిగియుండును.

పశువుల అవయవములు శుభ్రముగా ఉంచుట

పశువులను ప్రతిరోజు కడిగి దాని శరీరమును శుభ్రముగా తోమవలెను. ఇందువలన శరీరము శుభ్రపడి ఆరోగ్యము బాగుగ నుండును. ఎడ్లు-ఆవులకన్న గేదెలు, దున్నలకు మరీ ఆవశ్యకము ఇవి అతిమురికిగా వుండును. ఆ విధంగా కడగనిచో శరీరముపై మురికి ఏర్పడి దోమలు, మొదలగు వాని వలన అనారోగ్యము వల్ల బాధపడును. ఎడ్లను అధమ పక్షం 15 రోజులు కొకసారి గేదె. దున్నలను రెండు రోజుల కొకమారు తప్పక కడుగవలెను. కాల్వగాని మొదలైనవి ఏవైన సమీపంలో యున్నచో వాటిలోకి తోలుట మంచిది.

శాలయందు శుభ్రత

ప్రతి రోజూ పశుశాల, తొట్టి మొదలగు వానిని కాలువ నీటితో, శుభ్రముగా కడుగవలెను. నెలకొక సారి శాలయందలి అన్ని భాగములను పొటాషియం పర్మాంగనేట్ సున్నములతో శుభ్రముగా కడుగుచూ వున్నచో ఏ విధమగు రోగాణువులు అందులో చేరవు. పశువులు త్రాగిన నీటి తొట్లయందలి ఉమ్మివేయుట గుడ్డలుతుకుట పాత్రలుతోముట మొదలగునవి చేయరాదు.

లేగదూడల రక్షణ

దూడలను చాలా జాగ్రత్తగా వుంచాలి. పాలు ఎక్కువ త్రాగుట గట్టిగా వుండు గడ్డి తినుట మొదలగు వాటి వలన అవి జీర్ణముకాక జబ్బుచేయును. అట్టి వాటికి ఎప్పుడును పచ్చగడ్డి వేయవలెను. పాలుపడు సమయంలో గోధుమ పిండిలో ఉప్పు ఎక్కువగా చేర్చి రొట్టెలు చేసి పెట్టిన చాలా శక్తిగలది అవును. వాటిని ఎక్కువగా వదలి యుంచ వలెను. వాటికి ఎప్పుడు గంతులు వేయుట యందాసక్తి. అటుల ఎగురుచూ దుముకుచూయున్న జీర్ణమగుట స్నాయువులకు బలము గలుగుట మొదలగు గుణములు కలుగును. ఎప్పుడు కట్టివేసినచో బలహీనమై పెద్దవికావు. పెద్దవి అయిన తర్వాత దూడను అడవికి తోలు కొని

పోవుట మంచిది. పశువులకు జీర్ణమగుటకు ముందు పదిహేను లేక 20 రోజుల కొకమారు పశువుల మేతలో కొంచెం మార్పుచేయవలెను.

శాలకు కప్పురేకు వేయరాదు. అటుల వేసినచో రేకు వేడికి గాలి వెచ్చబడుటచే, ఆ గాలి తగిలి పాలు చెడిపోవును. పాలు చల్లగా వున్న చోటున కంటె వేడి గావున్న చోటునందు త్వరగా చెడిపోవును. అదే కాకుండా వెన్న పల్చపడి రుచిలేనిది యగును. ఒక వేళ రేకుయే వెయ్యవలసివచ్చుచో దానిపైన పెంకు రెండువరుసలు వేసినచో ఎక్కువ వేడి ఎక్కదు. అన్నిటికంటె సున్నము, ఇటుకలతో కట్టిన యిల్లు మంచిది. అది ఎల్లప్పుడు శుభ్రముగాను, శీతలముగా నుండును. కాని దీనికి ఎక్కువ డబ్బు ఖర్చు అగును. ఇందుచే ఒక వేళ మామూలు ఇల్లు కట్టవలసి వచ్చినచో పైన పెంకు వేసి, లోపలవైపు బల్ల కూర్పు చేసినచో బాగావుండును. పాలయింటిలో ఒక్కొక్కదానికి ఒక్కొక్క గదిచొప్పున వుండవలెను. ఎటులన అమ్ముటకు ఒకగది, వుండుటకు ఒక గది, వెన్న, నెయ్యి, క్రీములు తయారు చేయుటకు ప్రత్యేకము ఒక్కొక్క గది చొప్పున వుండాలి. ఒక కొట్టు వేడి నీరుతో పాత్రలు శుభ్రము చేయుటకు వుండాలి. ఒక గది వెనుక వ్రాయుటకు వుండాలి. ఇవే కాకుండా పాత్రలు, వస్త్రములు ఆరవేయుటకు గాలి బాగా వచ్చెడి ఒక స్థలము వుండాలి. ఈ విధముగా సాదా రూపాయిగా 4, 5 గదులు వుండాలి. పాలయింటిలో అతిస్వచ్ఛమైన నీరు వుంచాలి. కాల్వ వీలైతె కాల్వ, కాల్వలేనిచో నుయ్యి త్రవ్వించుకొని పరిశుభ్రముగా వుండు విధంగా చూచు కోవాలి. నుయ్యి త్రవ్వించుకొని పరిశుభ్రముగా వుండు విధంగా చూచుకోవాలి. నుయ్యి బహిరంగంగా వుండు చోట త్రవ్వించాలి. చుట్టుప్రక్కల చెట్లుండ రాదు. అటుల వున్నచో చెట్ల ఆకులు నూతిలో రాలి నూతి లోగల నీటిని చెరచును. నూతిచుట్టు రాతి గోడకట్టించి అచ్చట పడు నీరు దూరముగా పోవుటకు వీలగునట్లు చక్కని కాల్వను ఏర్పాటు చేయాలి. ఇటుల చేయుటచే నూతి చుట్టు మురికి నీరు చేరి అనారోగ్యమును కలిగించదు. నూతిపైన ఎల్లప్పుడు ఎదైన కొయ్య లేక రేకు మూత వేసి యుంచాలి. అటుల చేసినచో ఆకులు మొదలైనవి రాలి నీటిని పాడుచేయవు. వీలైన నూతిలో నుంచి నీరుతోడుటకు పంపును ఏర్పాటు చేసిన మంచిది. అటుల చేసినచో తోడునప్పుడు పాత్రలకు ఆకులు, మన్ను అంటుకొని నీటిలో కలియును.

పాలు పితుకుట

ఇష్టము వచ్చినప్పుడల్లా పాలు పితుక రాదు. అటుల చేసిన పాలు ఎక్కువగుట, తక్కువ అగుట, వానియందుండు ఘటకముల పరిమాణములో తేడావచ్చుట తటస్థించును. అందుచే ఒక నియమిత సమయముననే పితుక వలెను. ఇంటియందలి ఉపయోగమునకు గాను వుపయోగించు కొనువారు సూర్యోదయ సూర్యాస్తమయములందు పాలుపితుకుట మంచిది. అమ్ముకొనువారు సూర్యోదయ, సూర్యాస్త-మయములకు పూర్వమే పితుకవలెను. ఏలనన కొను వారికి వేళకు అందించుటకు వీలగును. పాలు పితుకునప్పుడు శుభ్రతను గురించి, ఎక్కువ ధ్యాస నుంచ వలెను. పొదుగు శుభ్రముగా కడిగి పాలు పితుక వలెను. గోశాలకు సమీపములో బహిరంగ స్థలము వున్నచో అచ్చట కట్టి వేసి పాలు పితుకుట మంచిది. అటుల చేయుట వలన ఎవ్విధమైన దుర్గంధాలు పాలలో కలియవు. పితుకుటకు ముందు

తోకను కూడా శుభ్రము చేసినచో తోక ఊపినప్పుడు తోకయందున్న మురికి పాలలో చేరదు. తోకను ఊపకుండునట్లు వెనుక గిట్టలకు త్రాడుతో కట్టుట మంచిది.

పొదుగు స్థనము లేక త్రాగుట కాకుండా పితుకు వాడు కూడా తన చేతులను శుభ్రముగా కడుగు కొనవలెను. పితుకుటకు ముందుగా యితర వస్తువులను తాకరాదు. పాలు పితుకుటకు ముందు పితుకు పాత్రను శుభ్రముగా కడిగి ఎండబెట్టి, పితుక బోవునప్పుడు ఏమైన మలినమున్నదేమో చూచి శుభ్రముగా వుండుటను చూచి పితుక వలెను. అంటువ్యాధి వున్న వానిచేత పాలు ఎన్నడును పితికించ రాదు.

పాలు తీయుటకు ముందు దూడను బాలుత్రాగుటకు వదలాలి. దాని వయస్సు ననుసరించి ఎక్కువ తక్కువలుగ త్రాగనియ్యాలి. పాలు పితుకునప్పుడు చన్నుకు గోళ్ళుతగుల నివ్వరాదు. గోళ్ళు తగిలినందు వల్ల బాధకలుగును చంటినుండి కిందికి పాలు పితుకునప్పుడు. చన్నును పిటికిటితో పట్టినొక్కి త్వరగా పాలుతీయవలెను. రెండు చేతులతోను పాలు తీసిన చాలా త్వరగా పూర్తియగును. అట్టి సమయంలో చోటు నందలి రెండుస్తనముల నుండి ఒకే మారు పాలు పితుక రాదు. ఈ చివర స్తనమునుండి వేరొక సారి పాలు పితుక వలెను. ఇటుల చేసి ఒకే దుగ్ధ పిండము నుండి కాకుండా రెండు దుగ్ధపిండముల నుంచియూ పాలు వచ్చును. పాలు పొదుగులో ఏమాత్రము నిలువయుండరాదు. ఏలనన చివరి భాగపు పాలలో ఘృత భాగము ఎక్కువగా వుండును అని వదలినచో నెయ్యి, వెన్న, తక్కువగును. ఈ కారణము చేతనూ, మొట్ట మొదటి పాలలో పౌష్టిక పదార్థములు తక్కువ వుండుట చేతను, మనకు నష్టము కలుగుననెడి వుద్దేశ్యంతోనే దూడలను మొట్ట మొదట కుడువనిచ్చెదరు. ఇదె కాకుండా పాలు చివరకు పొదుగులో వదలి పెట్టబడినచో మిగిలియున్న పాలు శరీరములో ఎండిపోయి, కొన్ని రోజులైన తరువాత పాలు తగ్గసాగును.

పాలు పితుకు విషయంలో అనేక విషయములు దృష్టియందుంచుకొనవలెనని అనుభవము వలన తెలియుచున్నది. పొదుగులో ఏ విధమైన వ్యాధిగాని, దెబ్బగాని, వున్నచో పాలు దూష్యమగును.

ఇట్టి పాల రంగు ప్రతి రోజు వుండు పాల రంగువలె వుండదు. రక్తపు రంగు కొద్దిగా కనిపించును. అందుచే ఎన్నడైన పాల రంగు మారిపోయినచో ఏ విధమగు ఆలోచనయు చేయకుండ పార బోయుట మంచిది. పాలు పితికిన తరువాత పరిశుభ్రమగు పాత్రములో వడ పోసి మూతపెట్టి యుంచవలెను. అందుచే ఏ విధమగు క్రిములు అందులో వుండుటకు అవకాశము వుండదు. తదుపరి పాలను చూచి పాల లెక్క పుస్తకములో వ్రాయవలెను. ప్రతి పశువుకు విడి విడిగా తూచిన లెక్క వ్రాయుట మంచిది.


గోశాల నుండి పాలు వచ్చిన పిదవ వాటిని వుంచుటకు ప్రత్యేకముగా ఒక కొట్టు కావాలి.

ఈ కొట్టు అడుగున గచ్చు చేయించాలి, గోడలను కూడా గట్టిగా గచ్చు చేయించాలి లోపలకు బాగుగా గాలి, వెలుతురు వచ్చునట్టు విశాలమగు కిటికీలు గోడలకు వుండాలి. కిటికీలకు జాలరు తలుపులున్న యెడల లోపలకు దోమలు రావు. ఈ జాలరు (జల్లెడగాగల) తలుపును ఎల్లప్పుడుగా మూసి వుంచాలి ఏడాదికి రెండు సార్లయినా గది యంతటికి సున్నము కొట్టించాలి. గదిలో ఏ విధమగు దుర్వాసన వచ్చు

పదార్థములైన వుంచిన వాటి వాసన పాలకు వచ్చును. కాన యివేవియు వుంచ రాదు. లోపలకు వచ్చు ఆవును పాలు పితికిన తరువాత దూడను పాలు త్రాగనివ్వాలి. మొట్ట మొదట వచ్చు పాలు విరోచన కారిగా వుండాలి. అందుచేత దూడ జీర్ణకోశము బాగుపడును. కావున బాగా త్రాగించాలి. ఈనిన తరువాత కొంచెంసేపు అయిన తరువాత ఆవుకు వేడి పాలు పలుచగా కాచి త్రాగించాలి. తదుపరి జొన్నలు, వడ్లు దంచి పెట్టవలెను. ఇట్లు పెట్టిన బలమునిచ్చును. ఉచ్చబుడ్డ పూర్తిగా బయటకు వచ్చును. మావిపడ్డ తరువాత దానిని దూరముగా తీసికొని వెళ్లి పారవెయ్యాలి. ఏలనన కొన్ని ఆవులు వాటిమావి నవితినును. కావున తిననియ్యరాదు. తిన్నచో పాలునియ్యవు. యీనిన తరువాత ఆవును దూడను, వాన, చలినుండి కాపాడాలి. ఇటువంటి సమయములో పైన గుడ్డకప్పాలి. లేనిచో ఏదైన వ్యాధి వచ్చును. ఈనిన తరువాత ఒక్క సారిగా ఆవు దగ్గరకు పోరాదు. అక్కడ గల్లంతు చేసిన ఎవరినీ రానియ్యదు పొడుచును. పాలు పితుకనీయదు. బెదురుటవల్లనే యీ పనులన్నియు చేయును. మొట్టమొదట కొన్నాళ్ళ వరకు దూడను తల్లి వద్దనే కట్టాలి. ఇటుల కట్టుటచే అది దాని శరీరము నాకి శుభ్రముగా వుంచును.

పాడి పశువులను కడుగుట – తుడుచుట

ఈ పశువులను పరిశుభ్రమైన స్థితియందుంచుట వలన మంచి యారోగ్యము కలుగును. ఆవులకంటె గేదెలు మిగుల మడ్డి జంతువులు గాన చాల జాగ్రత్తగా వీనిని కాపాడుతుండాలి. ఆ గేదెలకు బురదయనిన మిగుల ప్రీతి. కాక శరీరముగల పశువు లెప్పుడును నీటితోనే యుండవలెనని కోరిక గలిగి యుంటాయి.



కొన్ని గేదెలు శరీరమునిండ మట్టి నింపుకొని యింటికి వచ్చును. యజమానులలో కొందరు వానిని శుభ్రముగా నీటితో కడగక యట్లే యుంచుతారు. అట్లుండుట వలన పశువు నంటుకొని యున్నబురద యెండి బెరడు కట్టుతుంది. తరువాత పశువు శరీరము బిగదీయును. అందు వలన పాలు కూడా తగ్గి యేదైన వ్యాధి కూడ కలుగ వచ్చును. కాబట్టి పాడి గేదెల నెప్పుడును నియమించిన వేళకు శుభ్రముగా నీటితో కడిగిన యెడల వాని శరీరము ఆరోగ్యకరముగ నుంటుంది. పొలము నుండి గేదెలు రాగానే జాగ్రత్తగా పరీక్షించి వానికి తగిన సదుపాయములు చేయాలి. పశువుల కంటు కొనిన బురదలో ఒక విధమైన రోగమును కలిగించు సూక్ష్మ జీవులుండవచ్చును. లేదా ఆ బురద దుర్వాసనగా నుండవచ్చును.

కావున వెంటనే నీటితో కడుగవలెను. ముఖ్యముగా పశువులతోకల కంటు కొనియుండు బురదను పొదుగులోనుండు బురదను శుభ్రముగా కడుగవలెను. లేనిచో తోకనుసిమిరి పొదుగు వాపు మున్నగు వ్యాధులు కలుగుతాయి.

ఫూకాపద్ధతితో గొడ్డు పోవునట్లు చేయుట

పాడి పశువు ఘోరక్యత్యములలో ఫూకాపద్ధతి ఒకటి, పాల వాండ్రు దురాశాపరులై లేగ దూడలకు తగినన్ని పాలు వదలక చంపుటయే గాక, పాడి పశువుల వలన వీలగునంత వరకు ఎక్కువ పాలు తీయుటకు "ఫూకా" యను పద్ధతితో గొడ్డు పోవునట్లు చేస్తున్నారు. ఈ పద్ధతి చాలా మందికి తెలియక పోవచ్చును. ఆవు యొక్క మానములోనికి గాలిని ఎక్కించుతారు. లేదా వెదురు గొట్టముతో ఉప్పునీటినైనా ఎక్కించుతారు. మరికొందరు గేదెమర్మస్థానము లోపలికి దాని తోకనే మడిచి దోపుతారు. లేకమానము రంధ్రమునకు సరిపోవునంతలావును, మూరెడు పొడవును గలగడ్డి వెంటిని తయారు చేసి బలవంతముగా ఎక్కించుతారు, ఒక్కొకపుడు మోచేతి వరకు తమ చేతులనే దోపుతారు. దీనినే ఫూకా యంటారు. ఇట్లు చేయుట వలన దోపే సమయంలో పాపమా పశువు గ్రుడ్లు తేలవేస్తుంది. దాని వెనుక చట్ట భాగం ముడుచు కొనిపోతుంది. భయాతిశయంతో పశువు గజ గజ వణకుతుంది. తోక చెంతకు ఎవరైన వచ్చిన త్రుళ్ళి పడుతుంది. లేగలనోరుకట్టి ఇట్టిదుర్మార్గ పద్ధతులను నిర్మూలము చేయుదురుగాక,

పాడి పశువులకు యిచ్చే ద్రవపదార్థములు

పశువు యొక్క పరిమాణమునుబట్టి రాతి తొట్టిలోగాని, మట్టి తొట్టిలోగాని, మానెడు లేక అడ్డెడు తవుడు పోసి అందులో ఆరుతులముల ఉప్పు కలిపి తగినన్ని నీళ్ళు పోసి కొంతసేపు నాననిచ్చి త్రాగించాలి. కుక్కలను తదితర జంతువులను ఆ తొట్లలోనికి పోనీయకుండ పైన మూతలు వేయాలి. నాననిచ్చి కుడితిని త్రాగి కడుపు నింపుకొని పాలనిస్తాయి. కొందరు రెండు కుంచముల వరకు నీటిలో కలిపి పెట్టుతారు. ఇట్లు పెట్టుట వలన పొట్ట బరువెక్కువై ముక్కుచుండును. అట్లు పెట్టిన యెడల గర్భవాతము అజీర్తి మున్నగు రోగములు కలుగును. ఈ కుడితి వెన్న నెక్కువగా కలుగజేయును. ఈ దిగువ పదార్థములను పెట్టుచు క్షీరోజను వాడిన వాతము చేయక పాలు రుచిగా వెన్నగట్టిగా వుంటుంది.

కలగలుపు కుడితి

పులిమజ్జిగ, కుక్క త్రాగిన పాలు, ఎంగిలి అన్నము, వార్చినగంజి, బియ్యపునీళ్ళు, తవుడు మున్నగువన్నియు ఒకతొట్టిలో పోయుదురు. దీనినే కలగలుపుకుడితి యందురు. కాని ఈ కుడితి అన్ని పశువులు మాత్రము త్రాగవు. నిత్యము అలవాటయిన పుశువులు మాత్రమే త్రాగును. ఈ కుడితి పశువులకంత శ్రేష్ఠమైనదిగాదు. తర్వగా జీర్ణము కాదు. ఇది త్రాగిన పశువులు బలహీనముగా నుండును. ఈ కుడితి త్రాగిన పశువుల మజ్జిగ త్వరగా పులుపెక్కి దుర్వాసన వేయును.

జొన్న కుడితి

పచ్చిజొన్నలు కడిగిన నీటిని, జొన్నపిండి కలిపిన నీటిని, వార్చిన గంజినీటిని ఒక తొట్టిలోపోసి యుంచి గిద్దెడువుప్పు కలిపిపెట్టాలి. ఈ కుడితి బలము కలిగించును. మలమును గట్టిపరచును. పాలెక్కువగా నిచ్చును. వెన్న గట్టిగా నుంటుంది. బక్కచిక్కిన పశువులు శీఘ్రముగా జీర్ణము చేసికొనును. బలము గలిగిస్తుంది.

సజ్జ కుడితి

మెట్టరైతులు సజ్జకుడితి నెక్కువగా తమ పశువులకు పెట్టుతారు. తక్కిన కుడుతుల కంటె ఇది మిగుల బలమును, దేహపుష్టిని కలిగించుటలో మిగుల ప్రసిద్ధికెక్కినది. మెట్ట సజ్జలు మిగుల బలము కలిగించును. వాతరోగముల చేతను, నేత్ర రోగముల చేతను, బాధపడుచున్న పశువులకు ఈ కుడితి మరింత శ్రేష్ఠము. ఈ కుడితిలో చలువచేయు గుణము గలదు. వెన్న గట్టిగా నుంటుంది. పాల నెక్కువగా నిచ్చును. ఈనిన తరువాత ఈ కుడితి పెట్టుట మంచిది.

కొఱ్ఱ కుడితి

ఈ కుడితిలో మజ్జిగ, గంజి విస్తారముగా కలుపుతారు. బలము కలిగించును. మల బద్ధక మెక్కువ. ఎక్కువగా పెట్టిన వాతము గలిగించును. పశువులు ఆవయవములు విరిగినపుడు ఈ కుడితిని పెట్టిన మంచిది. దీనిలో రక్త వృద్ధి ఎక్కువగా నుండుట వలన పాల నెక్కువగా నిచ్చును.

రేగు పొట్టు కుడితి

జొన్న కుడితిలోను, సజ్జ కుడితిలోను, రేగు పొట్టు కలిపి పెట్టుదురు. ప్రత్యేకముగా ఈ పొట్టును నీటిలో నానవేసి పెట్టుదురు. ఇది మిగుల జిగురుగా నుండును. ఇది పుల్లగా రుచికరముగా నుండుటచే పాడి పశువులు ప్రేమతో త్రాగును. వాత రోగముగల పశువులకు నిది శ్రేష్ఠము. ఆకలి యెక్కువగా నగును, వెన్న గట్టిగా నుండును.

ప్రత్తివిత్తులకుడితి

ప్రత్తివిత్తులను రుబ్బి నీటిలో కలిపి పశువులకు పెట్టుదురు. ఈ కుడితిని ప్రతిదినము పరిమాణముగా పోయవలెను గాని యెక్కువ తక్కువలుగా పోయరాదు. అట్లు పోసినయెడల ఆరోగ్యము చెడును. ఈ కుడితి అలవాటయిన పశువులే త్రాగును. ఈ కుడితి త్రాగిన పశువులు పాల నెక్కువగా నిచ్చును. వెన్న చాల గట్టిగా నుండును.

ఉలవకుడితి

ఉలవలను నాన బెట్టి రోటిలో వేసి మెత్తగా రుబ్బి తొట్టెలో పోయుదురు. ఈ కుడితిని వాతతత్వముగల పశువులకు పెట్టరాదు. కాక పశువులకు మిగుల శ్రేష్ఠము. ఏ పూట రుబ్బినకుడితి నాపూటనే పెట్టవలెను. పాలు, వెన్న నెక్కువ చేయును.

శనగకుడితి

శనగలను నాన వేసి రుబ్బి నీటిలో కలిపి త్రాగించుదురు. వాత పశువులకు పెట్టరాదు. మారుబేరగాండ్రు ఈ కుడితిని ఎక్కువగా బెట్టుచుందురు. పాలు తక్కువగా నిచ్చి వెన్న నెక్కువగా నిచ్చును. వెన్న కూడ గట్టిగా నుండును. పాలు, వెన్న నమ్ముకొను నారీమణులు ఈ కుడితిని జాస్తిగా వాడుచుందురు. పాడి పశువుల కంతశ్రేష్ఠమైనది గాదని నా అభిప్రాయము. దీని వలన వాత రోగము లెక్కువగా కలుగును.

తాటిపండ్లకుడితి

బాగుగా పండిన తాడి పండ్లనుండి గుంజు తీసి అచ్చులుగా పోసి నిలువయుంచుదురు. అవసరమైనప్పుడు దానిని నీటిలో కలిపి పాడి పశువులకు కుడితిగా పోయుదురు. ఈ కుడితి త్రాగిన పశువుల పాలు చిక్కగా నుండి వెన్న నెక్కువగా కలుగ జేయును. వాత శరీరము గల పశువులకు పెట్ట రాదు. ఎక్కువగా పెట్టుచుండిన యెడల నేత్రరోగములు కలుగుచుండును.

పిండి పదార్థములు

పాడి పశువులు ఈనిన పక్షము దినములకు జొన్న పిండి, ఉలవ పిండి, ప్రత్తిపిండి, వేరుశనగ పిండి వగైరా పెట్టరాదు. పచ్చి పేగుల మీద ఈ పదార్థములు పెట్టేసరికి సూతికా వాతమునకు లోనై విరేచనముకాక చాలా బాధపడి మరణించును, గాన ఇట్టిది పెట్టరాదు.

పాడి పశువులకు పచ్చిగడ్డి, కాడ జాతులు, తాటి పండ్ల గుజ్జువగైరా పెట్టునపుడు తెలికపిండి ప్రతి రోజు పరిమాణముగా పెట్టుట మంచిది. వేసవి కాలములో ఉలవలు రుబ్బిన కుడితి, మజ్జిగలో నానవేసిన తెలికపిండి చాలా శ్రేష్ఠము.

వేరుశనగపిండిని నీటిలోవేసి కాచిన తెలుపుగా పాలగానగును ఈ పాలను వారమునకొక పర్యాయము పాడి పశువులకు త్రాగించ వచ్చును. చూడి పశువులకు తెలిక పిండి పెట్టరాదు. అట్లు పెట్టిన పిండము వృద్ధికాదు.

ఉలవగుగ్గిళ్ళు చిట్టు కలిపి గోవులకు పెట్టిన దివ్యమగు ఆహారము పాలు రుచిగా నుండును. జొన్న పిండి అంత మంచిదికాదు. కొబ్బరి పిండి పాడి పశువులకు అలవాటు చేయుట మంచిది. వాతము చేరదు. పాలు వృద్ధియగును. పశువు కూడ దండిగా నుండును. ప్రత్తి విత్తులు ఆయా శీతోష్ణస్థితిగతుల ననుసరించి పశువులకు పెట్టవలెను. అన్ని పశువులకు సరిపడవు.

గోధుమకుడితి

ఇది పశువు శరీరములోని చెడు నీరు తీసి వేయును. శీతాకాలములో దీని నెక్కుగా వాడవచ్చును. పాలెక్కువగానవును. ఎక్కువగా పెట్టరాదు. ఎక్కువ పెట్టిన అతి వేడి జేసి గర్భమునకు హాని కలిగించును. వెన్న జిడ్డుగా నుండును.

చోడికుడితి

చలువచేయును. వేసవికాలములో ఎక్కువగా నుపయోగించ వచ్చును. బలముకలుగ జేయును. పాలు రుచిగావుండును. వెన్న అంత గట్టిగానుండదు.


మినప కుడితి

ఈ కుడితి వలన వెన్న అద్భుతముగా వచ్చును. దీనిని తరుచుగా వాడ రాదు. వాత రోగము లెక్కువగా కలుగును. కండ్లకు జబ్బుచేయును.

జావలు

జబ్బుగల పశువులకు పైన చెప్పిన కుడుతుల కుపయోగించు దాణాలనే జావలుగా కాచి ఆయా రోగ పశువులను బట్టి జాగ్రత్తగా పెట్టుట మంచిది. సజ్జ జావ, గోధుమ జావల వలన పాలెక్కువగా పడును. వాత రోగములు హరించును. పథ్యములుగా నుపయోగించును. ప్రతి జావలోను తగినంత ఉప్పు కలిపి పెట్టుట మంచిది. తైదు జావ కాక పశువులకు మంచిది రోగ పశువులకు ఆరోగ్యముగా నుండి తృప్తిని గలిగించును. మొక్క జొన్న జావ పాల నెక్కువ జేయును గాని వాతము గలిగించును. వరినూకల జావ పశువు లేయాహారము తిననప్పుడు పెట్టుట మంచిది. ఎక్కువగా పెట్టిన శీతలము గావించును.

పొదుగు – క్షీరనాళాలు



పాడి పశువులకు పొదుగను అంగ ముండును. ఈ పొదుగు నందు నాలుగు పాల గ్రంధులుండును. ఈ గ్రంధులు పశువు యొక్క వెనుక కాళ్ళ సందున యుండును. ఒక ప్రక్కనున్న రెండు గ్రంధులను ఒక తంతు సంయుతమైన తొడుగుచే పరివేష్టింప బడియుండును. రెండవ ప్రక్కనున్నవి మరియొక తొడుగుచే పరివేష్టింపబడియుండును. ప్రతి గ్రంధికి ఒక్కొక చన్ను యుండును. ఈ చన్నులు పాడి పశువులకు 3, 4 న్ను, ఆడ గుఱ్ఱము, ఆడు గొఱ్ఱెలకు 2 ను, ఆడు పందికి 10 లేక 14 ను, యుండును. అప్పుడప్పుడీ నాలుగు గ్రంధులు గాక మరియొక రెండు మాంసగ్రంధులు కలిగియుండును. ప్రతి దానికి ప్రత్యేక ద్వారములుండును. చంటిపైని ప్రతి గ్రంధిలోను పాలతిత్తి యొకటి యుండును.


ఇందులోనికి పాల కాలువ లన్నియు ప్రవహించును. ఈ పాలతిత్తి నుండి చంటి గుండ పై భాగమున నొక కాలువ ప్రవహించుచుండును. పాల గ్రంధికి రబ్బరు వంటి తొడుగు గలదు. ఈ గ్రంధికి క్షీర వాహికలచుట్టు సమర్సబడియుండు కణముల గుంపులచే నేర్పడిన యంగము క్షీరవాహిక లనేకములు చేరి పెద్ద వాహికలుగ నేర్పడును. ఇవి యన్నియు చంటి పైనుండు పాలతిత్తులలోనికి ప్రవహించును. ప్రతి పాలతిత్తి నుండియు నొక కాలువ చంటిపైనుండు పాలతిత్తులలోనికి ప్రవహించును. ప్రతి పాలతిత్తి నుండియు నొక కాలువ చంటి గుండపైకి వెలువడుచుండును. చంటి చివరనుండు మాంస కండరములు పాలు తమంతట తాము కారి పోకుండ నీ కాలువలను మూసికొని యుండునట్లు జేయును.

పాల గ్రంధికి కొన్ని రక్త నాళములగుండ రక్తము వచ్చును. ఆ రక్తము నుండి గ్రంధికణములు పాలకు పనికివచ్చు ద్రవ్యములు తీసి కొనిన తఱువాత తక్కిన భాగము దుష్టరక్త నాళములగుండ మరలి పోవును. ఈ దుష్టరక్త నాళములలో కొన్ని లోపల నున్నను మరి కొన్ని పై భాగమున నుండును. పై భాగమునందుండు వానినే పాల నాళములని చెప్పుదురు. పశువుల లోపలి భాగమునందు రక్త నాళము లెంత పెద్దవిగ, స్ఫుటముగనున్న అవి యంత బాగుగా పాలిచ్చును. పాల గ్రంధులలో తమ దూడల పోషణకై పాలు చుట్టుచుండును. చంటి మొనల గుండ పోయిన మార్గముల గుండ పాలు ప్రవహించును. ఆ మార్గమునకు పై భాగమున క్రింద భాగమున ద్వారమును మూయగల కండరము లేర్పడియున్నవి. చను మొనకు పైని పాల తొట్టి సుమారు 1 ½ పైంటు పాలు పట్టగలదిగా నుండును. దాని నుంచి చంటి ద్వారము గుండ పాలు లాగబడును. శరీరములో మాంస కండరములున్న భాగములకు పొదుగు భాగమునకు మధ్యగా పాల గ్రంధులు యేర్పడి ఏకముగా జేరి పాలను నిలువ చేయుచున్నవి. ఈ గ్రంధులు ఒక్కొక్కటి అంగుళములో 30 వ వంతు వెడల్పు గలిగియుండును. పొదుగు సంచి కంటె దానిలో నుండు పాల యొక్క బరువు యెక్కువగా నుండును. ప్రాయము వచ్చినపుడు పొదుగు వికసించి యీనుటకు ముందు నది పెద్దదగును. ఈనిన నది చురుకుదనము గలిగి యుండును. పాలిచ్చు కాల మంతమగునప్పటికి మరల సంకోచము నొంది తమ వ్యాపారమును మానును. క్షీరగ్రంధుల వలన పుట్టెడు పాలు దూడలకు సంపూర్ణాహారము.

పాడి పశువుల పరీక్ష

ఒక్కొక్క మందలో చాల పశువులు ఉండును. వాటిలో మంచివి, చెడువి కలసియుండును. అపుడు మంచి వాటిని గ్రహించుటకు పరీక్ష అవసరము. మరియు పాడి పశువులను కొనదలచినపుడు పరీక్ష ఉపయోగపడును. సాధారణముగా పశు పరీక్ష చేయుట అనగా ఒక పశువును రెండవ పశువుతో పోల్చుట, లేక ఒక పశువును మనసుతో చూచు లోపరహితమైన పశువు (Ideal animal) తో పోల్చుట, పాలు పిండి చూచుట చేతను, పశువు యొక్క ఉపరి భాగపు దృశ్యము చేతను నిజమైన విలువను పరీక్షచేయ వచ్చును. పశువు యొక్క ఉపరి భాగపు దృశ్యము చేత పరీక్షించుట పాలు పిండి చూచుటంత విశ్వసనీయ మైనది కాక పోయినను అనుభవశాలి అయిన పరీక్షించు వానికి ఎక్కువ ఉపయోగపడును. పశువులను పరీక్షించుట యందు మంచి అనుభవము సంపాదించుటకు అతనికి పరీక్షించుట యందు శ్రద్ధ, పశువు

యందు ప్రీతి, సరియైన లోపరహితమైన పశువును మనసునందు స్థిరముగా నుంచుకొనుట, మనసులోనున్న లోపరహితమైన పశువుతో పరీక్షించు పశువు యొక్క చెడు విషయముల నుండి మంచి విషయములను గ్రహించుటకు కన్ననకు తగిన శిక్షనిచ్చుటకు తీవ్రమైన అభ్యాసము అవసరము. మరియు పశువు యొక్క వేరు వేరు భాగములు వాటి పేరులు తెలిసియుండవలయును. ఈ అవయవములు పశువునందు చాల గుణములను నిర్ధారణ చేయును. ఆ గుణములు పాల నిచ్చు స్వభావముగల గుణములతో సంబంధించి యుండును. కాన —



1. పాడినిచ్చు స్వరూపముగల గుణములు.
2. ఆహారము తిను స్వభావముగల గుణములు.
3. నిర్మాణము, స్థితి, శక్తిగల గుణములు.
4. పాలనిచ్చు అవయవముల గుణములు.
5. శైలి ఆకారగుణములతో పశువును పరీక్షించవచ్చును.


పై అంశము లన్నియు ఒకే విలువను గలిగి ఉండవు.

పశువు యొక్క సరియైన భావము (Impression) ను తెలిసి కొనుటకు పశువును 25 అడుగుల దూరమునకు తక్కువ గాకుండా ఉండి చూడవలయును. పశువును ప్రక్కగాను, ముందుగాను వెనుకగాను చూచి పై నుదహరించిన 5 అంశములను మనసులోనున్న లోపరహితమైన పశువుతో పోల్చవలయును. దూరమున నుండి చూచిన తరువాత పశువును దగ్గరకు వెళ్ళి చూడవలయును. అపుడు చర్మమును తాకి చర్మగుణమును, ఎముకలు ఇతర ఎముకలు కనబడుచోట్ల చేతితో పరిశీలించి మాంసముతో నున్నది లేనిది తెలిసి కొనుట, పొదుగును తాకి దాని గుణము, పాల నరములను చూచి సంఖ్య పరిమాణమును తెలిసికొన వలయును.

పశువును సమీపించి ముందు దాని యొక్క స్వభావమును, తెలిసికొనవలయును. చూచునపుడు పరిచయము లేని వానివలె దానిని చూడుము. సమీపించునపుడు నెమ్మదిగా జాగ్రత్తగా నమ్మకముతో


ముందు ఎడమకాలి వైపుగుండా సమీపించవలయును. చమత్కార శక్తితో పశువునకు నమ్మకము గలుగునట్లు చేయవలయును. ఇందులకు పశువును సమీపించినతోడనే పశువు వీపుమీద నెమ్మదిగా తట్టుట, దువ్వుట చేయవలయును.

పాడి నిచ్చు స్వరూపమును పశువును చూచుటచే తిన్న ఆహారము మాంసముగా మారునా లేక పాలుగా మారునా యని గ్రహించవచ్చును, పాలనిచ్చు పశువునకు ఎక్కువ మాంసము, క్రొవ్వునుండును. పశువు ప్రత్యేకమైన మూడు త్రిభుజాకారములను గలిగి యుండవలయును. అవి పశువును ముందు, పక్క



పై భాగములనుండి చూచిన కనపడగలవు — ముందు నిలబడి చూచునపుడు రెండు భుజముల ప్రక్కలనుండి రెండు తిన్నని గీతలను పైకిగీచిన అవి మూపురముయొక్క పైభాగములేక అంతకన్న తక్కువ యెత్తులో కలసి మొదటి త్రిభుజము ఏర్పడును. ఈ భుజములు మూపురముపైన కలిసి పశువునకు భాతిలేదని గ్రహింపవచ్చును. ప్రక్కను నిలబడి చూచునపుడు పశువువెన్ను ఎముకగుండా ఒకగీతను, పొట్టక్రింద భాగముగుండా మరొక గీతను గీచిన అవి పశువు ముందర కలసి రెండు త్రిభుజములు ఏర్చడును. పశువు వెనుక భాగము పెద్దదిగానున్న ఆ త్రిభుజము పశువు ముందర దగ్గరలో కలియును. లేని యెడల దూరముగా కలియును. పశువులు వెనుక నుండి చూచునపుడు రెండు కొంకి బొమికలు (Hook Bones) నుండి రెండు గీతలను గీచిన మూపురము వెనుక భాగము వద్ద కలియును. ఈ త్రిభుజము గూడ పశువు వెనుక భాగపు వైశాల్యమును తెలుపును. ఈ మూడు త్రిభుజముల వలన పాడి స్వభావమును గ్రహించ వచ్చును.

పశువు యొక్క అన్ని భాగములు సహజమైన ఆడ ఆకారము, మృదుత్వము కలిగియుండవలయును. మెడ సన్నముగాను, పొడవుగా నుండి భుజములతో కలిపియుండవలయును. గంగడోలు పలుచగాను, మృదుత్వము గలిగి గంగెడు స్వభావము గలిగియుండవలయును. కంఠము పరిశుద్ధముగా నుండవలెను. లావుగా నుండకూడదు. భుజములు లావుగా నుండక శరీరముతో కలసియుండవలయును. కాళ్ళు తిన్నగా



మంచి ఎముకలు కలిగి యుండవలయును, శరీరము క్రింద కాళ్ళు అందముగా అమర్చబడి శుద్ధముగా యుండవలయును. కండరములు వృద్ధిపొంది కనబడుతూ గరకుగా నుండకూడదు. వెన్ను ఎముక, ముడ్డి ఎముక, మలుగు ఎముకలు తగినంతగా వంకర తిరిగి తగుమాత్రము మాంసముతో నుండి కోమలముగా నుండునట్లు కనబడవలయును.

పశువు ఉత్సాహమైన స్వభావము గలిగియుండవలెను. అనగా గమనమునందు చురుకుగాను, అలవాట్ల యందు జాగరూకతగాను, ఉత్సాహముగాను ఉండవలయును. స్పష్టముగా కనిపించెడు చూపు కన్ను పరిమాణమునుబట్టి పశువు యొక్క చురుకుదనమును నిర్ణయించవచ్చును. అలవాట్లయందు సునాయాసముగాను, నడకయందు కష్టము లేకుండాను ఉండవలయును. జాగ్రత్త! బాగుగ మేపని మాంసముండు పశువును చూచి పాడినిచ్చు స్వరూపముగలదని మోసపడగూడదు. ఆ భేదమును పాల నరములు చూచుట వలన తేట తెల్ల మగును. మంచి పాడినిచ్చు పశువు చూలుతో నున్నపుడు కొలదిగా కొవ్వుపట్టి మాంసము నిచ్చు పశువులాగ కనబడును.

ఆహారముతిను స్వభావము

భుజించిన ఆహారము పరిణామము పొంది పాలుగా మారుచున్నవి. కాన పాడి పశువు ఎక్కువ ఆహారము తినగలిగి దానినంతను జీర్ణము చేసికొను శక్తి కలిగి యుండవలయును. బాగుగా తిన గలిగిన పశువుకు పొడుగైన, లోతైన, వ్యాపించిన పొట్ట గలిగి యుండవలయును. వ్యాపించిన పొట్ట యుండుటకు పైన సమముగా నుండి తరువాత వంకరగల్గిన ప్రక్క ఎముకలు ఉండవలెను. బాగుగ తినిన పశువు చర్మము పలుచగాను, మృదువుగాను ఉండి పట్టువంటి మెత్తని వెంట్రుకలు గలిగియుండును. మంచి రకముగల చర్మము గలిగి యుండుటకు ఎక్కువ రక్తము అవసరము. రక్తము తయారు అగుటకు ఆహారము

అవశ్యకము. ఎక్కువ ఆహారము తిని జీర్ణము చేసి కొనలేని పశువు యొక్క చర్మము గట్టిగాను, గరుకుగాను, బిరుసు వెండ్రుకలతో నుండును. బాగుగ తినుటకు బలముగల దవడలు అవసరము. కుండ ఆకారముగల పొట్టను చూచి మోస పోకూడదు.

నిర్మాణము శక్తి, స్థితి అనగా శరీరము బలిష్ఠముగాను చూచుటకు చురుకుగా నుండుట పాడి పశువు లాభకరముగా నుండవలయునన్న అది ఎక్కువ పాలు మరియు శీతకాలము పూర్తియగు వరకును పాలు ఇవ్వవలయును. ప్రతిసంవత్సరము దూడలను. కనుచు పెక్కు సంవత్సరములు జీవించి ఉండవలయును. అందులకు పశువు బలిష్ఠముగాను చురుకుగాను ఉండుట అవసరము. ఆరోగ్యములేని పశువు ఎక్కువ పాలు, బహు దూడలను ఇవ్వలేవు పశువు అతిచలి వేడి కాలమందును, అంటు వ్యాధులు కలిగినపుడును ఉపయోగపడుటకు ఎక్కువ శక్తిని గలిగియుండవలయును. అనగా పశువులకు ఎక్కువ రక్తము గలుగుటకు అవకాశము గలిగియుండవలయును. రక్తము బాగుపడుటకు ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఎక్కువ అవసరము. ఇందులకు పెద్ద ముక్కు గోళ్లు, బలమైన ఊపిరితిత్తులు ఉండుట అవసరము. ఈ రక్తము పశువునకు శక్తి గలిగించును. ఈ శక్తి పశువు తినుటకు, నెమరువేయుటకు, జీర్ణము అయిన ఆహారము పాలుగా మారుటకు ఉపయోగపడును.

పాలనిచ్చు అవయవములు

పొదుగు, చళ్లు, పాలనరములు, పాలబుగ్గల యందు పాలను తయారు చేసి మనకు పశువు ఇచ్చుచుండును. వీటి అన్నింటి యందు పొదుగు ముఖ్యమైన అవయవము. ఇచట పాలు తయారు అగును. పొదుగు ముఖ్యముగా గ్రంధి సంబంధమైన పొరుదలతో చేయబడియుండును. ఆ టిస్యూల ఆధారముతో కొన్ని రక్త భాగములను పాల రూపముగా మార్చును. పొదుగునందు తయారు అగును గాన ఎక్కువ విశాలము గలిగియుండవలయును. పాలను పిండిన తరువాత పొదుగు తగ్గి వెనుకనుండి చూచిన పొదుగు చర్మము ముడతలుపడి ఉండవలయును. పొదుగు అందమైన ఆకారము గలిగియుండుట పశువునకు అందము నిచ్చుటయే గాక చాల అపాయముల నుండి తప్పించును. అంద వికారమైన పొదుగు నుండి పాలను పితుకుట కష్టము. మంచి ఆకారము గల పొదుగు పొడుగు వెడల్పులు గలిగియుండి ముందునకు బాగా వ్యాపించి వెనుక ప్రక్కయందు వ్రేలాడియుండును. ముందు భాగము వెనుక భాగము సమముగా నుండ వలయును. పొదుగు భాగములు నలిగియున్నట్లు ఉండకూడదు. చళ్ళు సమమైన పొదుగు గలిగి సమానమైన స్థానములందు ఉండి పాలు పిండుటకు సుఖముగా నుండ వలెను. పాల నరములు తీర్చి, చిక్కురు బొక్కురుగా నుండ వలయును. ఈ పాల నరములు అనేక చోట్లయందు శరీరమందు చొచ్చి ఉండవలెను. వాటిని పాల బుగ్గ లందురు. పొదుగు మీదను తొడల లోపలను రక్తనాళములు ఎక్కువగా ఉండుట వలన అచటకు ఎక్కువ రక్తము ప్రసరించగలదు. పశువును పరీక్షించినపుడు పాలనిచ్చు అవయవములకు ఎక్కువ ప్రాముఖ్య మీయవలెను.

శైలి, ఆకారము

పశువు క్రమ ప్రకారమైన శైలి అందము, జాతి కుండ వలసిన లక్షణములు గలిగియుండ వలయును. ఒక్క పాలనిచ్చు గుణము కలదిగా మాత్రముగానే నుండకూడదు. పశువునకు క్రమమైన శైలి, అందమైన ఆకారము ఉండుట వలన ఎక్కువ ఖరీదునకు అమ్ముడు పోవును. నడక యందు తల ఎత్తుకొని చురుకుగా నడవవలెను. పశువునకు అన్ని అవయవములు తగినట్లుగా అమర్చి కలసి ఉండవలెను. నిడుపైన మెడ, తిన్నని పొడుగైన వెన్ను ఎముక, పెద్ద పిరుదులు, కుచ్చు గలిగిన నేలకు నంటుతోక గలిగి యుండవలయును. గట్టి ఎముకలతోటి తిన్నని కాళ్ళు గలిగి జాతికి తగిన పరిణామము గలిగి యుండవలయును.

మంచిరకపు పొదుగు

పొదుగులలో అనేక రకములు గలవు. కొన్నిటికి యుండవలసిన ఆకారములుండవు. ముసలి పశువుల పొదుగులు సరిగా నుండవు. పడుచు వాటిని, ముడుచు వాటిని, ముదుసలి వాటిని పొదుగును బట్టి నిర్ణయింపవచ్చును. కొన్ని పొదుగులు సీసా ఆకారముగ పొడుగుగా నుండును. ఇవి అంత శ్రేష్ఠమైనవి గావు. మంచిరకపు పొదుగు తగినంత లోతు వెడల్పు క్రింది భాగము చదరముగా నుండుట మంచిది. ఇంకను చదరముగా కుండ అడుగు భాగము వెడల్పుగా నుండవలెను. వెనుకటి కాళ్ళ దగ్గర పొదుగు పెద్దదిగాను, ముందువైపు చాల తక్కువగా నుండిన చెడ్డదని గ్రహించ వలెను.

చన్నుల పరీక్ష

చన్నులను బట్టి కూడ నిర్ణయింపవచ్చును. కొన్నిటి చన్నులు వ్రేళ్ళు ముడుచుకొనినట్లుండును. ఇట్టివి చెడువని తలంచవలెను. సామాన్యముగా విడిగను, వెనుకచన్నులు పెద్దవిగను యుండుట మంచిది. కొన్నిటికి పెద్దవి చిన్నవి యుండును. కాని సైజును బట్టి పాలుండవు. కొన్ని చిన్న సైజుగలవి బాగుగా పాలిచ్చును. పెద్దచన్నులు గలవి పితుకుటకు వీలుగా నుండును, గాని పాలీయవు. కండ పొదుగుగలవి అంత శ్రేష్ఠమైనవి గావు. మొదటి ఈతకు చన్నులు చిన్నవైనప్పటికి ఈనిన కొలది పెద్దవగుచుండును. పాలు సరిగా పితుకకపోయినను చన్నులు తగ్గును. కాబట్టి వేళలకు పితుకుచుండవలెను. చన్నుల విషయమై పరీక్షించుట మంచిది.

చన్నులలోని రకాలు

ముఖ్యముగా చూడవలసిన విషయమేమన కొన్ని చన్నులు గ్రుడ్డిగా తప్పగా నుండి పాలురావు. కొన్ని ఈతలలో కొరివిచన్నులైయుండును. అట్టి వానిని మోసపుచ్చి చక్కగా అమ్ముదురు. అట్టి వానిని బాగుగా పరీక్షించి కొనవలెను. తప్పగా నుండి పాలు రాకపోవుటకు కారణము వేళకు పిండక అశ్రద్ధచేయుటయే. మూడుచున్నులుగలవి ఆక్షేపణయందురు. పాలు కూడ తక్కువగా ఇచ్చును. రెండు చన్నులు గలవానిని అసలేకొనరాదు. కాబట్టి నాలుగు చన్నులను జాగ్రత్తగా చూచి కొనవలెను.

పొదుగును నొక్కిచూచుట

ఈనకముందుగాని ఎండిపోయినపుడుగాని, ఆవును కొనినచో నాలుగుచన్నులలోని పాలు వచ్చునా రావాయని తెలిసికొనవలెను. పొదుగు మెత్తగానుండిన పాలెక్కువగా నుండును. పొదుగు గట్టిగనుండిన పాలు తక్కువగ నుండును. కాబట్టి పొదుగును చేతులతో నొక్కి పరీక్షించవలెను. గట్టిగానుండి కండపొదుగుగా నుండుటవలన రైతులు మోసపోవుదురు. మెత్తగా నున్నవానినే చూచికొనవలెను.

సంతలలో మోసపుచ్చు బేరగాండ్రు

మంచి పాడి పశువులను కొనునప్పుడు వాని గుణములన్నిటిని యజమాని పొగడుచుండును. కొందరు బేరగాండ్రు మాటలనే అమ్మి మోసపుచ్చుదురు. మీరు పాడి పశువులను కొనదలచుకొనునపుడు అనుభవముగల వారగు మీ ప్రాణమిత్రులను సంప్రదించి బాగుగావిచారించి కొనవలెను. ముఖ్యముగా సంతలలో జరుగు బేరము చాలదగాగాయుండును. సంతలకు దొంద పశువులు, లోపల జబ్బున్న పశువులు, తాత్కాలిక బలుపు మీదనున్న పశువులు వచ్చుచుండును. కాబట్టి బాగుగా వాటి సాంప్రదాయము కనుగొని కొనవలెను. చెడ్డపశువు పరిస్థితులు వేరుగానే యుండును. అప్పుడు యజమాని కంటికగపడడు. అక్కడనుండే ప్రేక్షకులలోకలసియుండి ఈ పశువుదగ్గరకువచ్చు మనుష్యులను చూచుచుండును. సామాన్యముగా సంతకు బేరగాండ్రు ఎక్కువగ వచ్చుదురు. ఇటువంటి బేరగాండ్రందరు ఖరీదెక్కువగువరకు ఆ పశువును అక్కడనే ఉంచెదరు. సంతకువచ్చు పాడి పశువులు రెండవరకములోనివే వచ్చునుగాని సరియైన సాంప్రదాయము గలవిరావు. అటువంటి సాంప్రదాయముగలవియున్నచో ఆ పశువులు ఉన్న గ్రామములో గాని అమ్ముడుపోవు. చాలా కాలమునుండి గొడ్డుతనము గలిగి తటాలున చూలునిలచిన ఆవులను కూడ సంతలకు తోలుకొని వచ్చుదురు. ఇట్టి ఆవులకొమ్ములు పొట్టివిగా నుండును. చిన్న పొదుగు గలిగియుండునని గ్రహించవలెను.

సంగీతమంటే గోవులకు ప్రీతి

ఈశ్వర సృష్టిలో మానవుడే తెలివిగలవాడైయున్నాడు. మానవుని ధీశక్తివలననే అతడు ప్రకృతితత్వములను, స్వభావాదిలక్షణములను గుర్తెరిగి వానిని తనకుపయోగించుకొనునట్లు చేసికొనుచున్నాడు. మరియు పదార్థముయొక్కయు, ఖనిజములయొక్కయు, తైలముల యొక్కయు, వృక్షాదిజంతుకోటియొక్కయు, నైజలక్షణముల గ్రహించి వానిని స్వాధీనపరచుకొనగలిగి వానిని తన యిచ్చవచ్చినట్లుగా ఉపయోగ-పరచుచున్నాడు. క్రమక్రమముగ మానవుడు సృష్టిలో అన్నిటియందును ఈశ్వర చైతన్యమును, మహిమయు, ఒకదానికంటె మరొకదానియందు భిన్నముగను, వివిధములుగను యున్నటుల తెలిసికొనగలిగి వానిని సాధ్యమైనంతవరకు మార్చి అనేకవిధములుగ తారుమారు చేసి నూతనమైన భిన్న సృష్టిని చేయుచున్నాడు. ఇవ్విధమున శాస్త్రమభివృద్ధి గాంచుచున్నది.

మానవుని శాస్త్రజ్ఞానమెంతవరకు పరిణమించినదనగా సంగీతముచే ఆవులు రంజింపబడి క్షీరములను విశేషముగా నిచ్చుచున్నవి. సంగీతముచే ఆవులు పరవశత్వము పొందుచున్నవి. మనము, పాములు

పాములవాని నాగస్వరమునకు పడగలెత్తి ఆడుచుండుటను జూచుచున్నాము. ఆలాగుననే ఇంగ్లాండులో కొన్ని ప్రదేశములందు ఆవులకారోగ్యప్రదముగ నుండుటకై రెండువరుసలుగా (ఒకవరస కొకటి ఎదురుగ) కట్టబడియుండును. ఉదయసాయంకాలములందును, రాత్రియందును పాలుపితుకు వారు కొట్టములలోని ఆవులను పాలు పితుకు సమయమున కొక హృదయరంజకమగు శ్రావ్యగానమును పాడునట్టి ప్లేటొకటి వేయబడును. గ్రామఫోను రెండు కొట్టముల వరుసల మధ్యయుంచబడును. అట్టి సమయములందు ఆవులు చెవులు నిక్కబొడుచుకొని వినుచు నెమరువేయుచు విశేషముగా క్షీరముల నిచ్చుచుండును. అట్టి సమయములందు చేపని పశువులు కూడ చేపునకు వచ్చి లెస్సగా పాలిచ్చును.

పాలుతీయునపుడు కలిగేమార్పులు

నిత్యము ఒకేకాలమందు పాలు తీయుచున్నపుడు ఒక విధముగానుండును. కొంచెమాలస్యముగా పాలను తీసినచో క్రొవ్వు ఎక్కువగానుండును. ఉదయము తీసిన పాలకంటె సాయంకాలము తీసిన పాలు శ్రేష్ఠముగా నుండును.

వరుస	క్రొవ్వు	క్రొవ్వు కాని ఇతర పదార్థములు
మొదటి పర్యాయము	1.70	8.77
రెండవ పర్యాయము	1.76	8.99
మూడవ పర్యాయము	2.10	8.75
నాల్గవ పర్యాయము	2.55	8.69
అయిదవ పర్యాయము	3.15	8.49
ఆరవ పర్యాయము	4.06	8.59

మొదటి పర్యాయము తీయబడిన పాలలో క్రొవ్వు తక్కువగను, క్రమేపి ఎక్కువగను అగుచుండును. మొదటి పర్యాయము తీయబడిన పాలలోని క్రొవ్వు తక్కువగా నుండుటకును ఆరవ పర్యాయము తీయబడిన పాలలో క్రొవ్వు ఎక్కువగానుండుటకును కారణమేమన పొదుగు క్రింద భాగమున నుండు పాలలోని క్రొవ్వును తిరిగి లోపలకు లాగుకొనుట వలన పోగొట్టుకొనబడునని తెలియుచున్నది. కాని ఇది సరియైన సిద్ధాంతము గాదని నాయభిప్రాయము. జంతువును బాగుగా మేపిన కొలది క్రొవ్వు ఎక్కువగును. పచ్చిమేత, ఎండుమేత వేయుటలో ఈ మార్పు కలుగుచుండును. పచ్చిగడ్డి వేసినచో క్రొవ్వు యొక్క, పాల యొక్క రంగు పసుపు వర్ణముగా నుండును. ఆహారమునుబట్టి పాలయొక్క రుచి మారుచుండును. కొన్ని దుంపదినుసులు తినుటవలన పాలయొక్క రుచితగ్గును.

పాలలోని వాసనలు

పాలు, మీగడ, వెన్న, మజ్జిగ మొదలగునవి దగ్గరనుంచి వాని యొక్క వాసనలను సులభముగా గ్రహింపవచ్చును. కొన్ని పాలు మేకవాసన కొట్టుచున్నవనియు, గొఱ్ఱెవాసన కొట్టుచున్నవనియు, బూజుకంపు

కొట్టుచున్నవనియు చెప్పుదురు. పశువులనుండి బయలుదేరు కొన్ని విధములగు వాయువులు పాలు పిండు వేళలయందు పాలతో గూడ కలిసి వచ్చుటచే ఈ వాసనలు బయలుదేరును. ఇంకనిట్టి వాసనలు మనము పాలకుపయోగించు పాత్రలు శుచిగా లేకుండుట వలనను, పాత్ర అడుగు భాగమున నుండు మలినము కడుగకపోవుటవలనను; పాలు సరిగా కాగనీయకుండ తోడుపెట్టుటవలనను, పాలు చల్లారిన తరువాత చుంచులు మొదలగు జంతువులు నాకుటవలనను గలుగుచుండును. కొన్ని పశువులు మనుష్యుల మలము, నీరుల్లి, వెల్లుల్లి మొదలగు వస్తువులు తినుటవలన అవి ఇచ్చు పాలు కూడ ఆ మాదిరిగనే వాసన వేయుచుండును.

పాలగుణములు

పశు జాతిని బట్టియు, ఆహారమును బట్టియు, అవి ఈనిన ఋతువులను బట్టియు పాల గుణములు మారుచుండును. పసుపురంగుగల పాలలో వెన్నను కలుగజేయు పదార్థమెక్కువగా నుండును. నీలిరంగుగల పాలు రుచికి తీపిగనుండును. కాని అందులో మీగడ, పెరుగు, వెన్న ఎక్కువగా రావు. చిక్కని పాలకంటె పలుచనిపాలే శిశువునకు, రోగులకు ప్రశస్తము. సేరు మంచి పాలలో ఒక నవటాకు వెన్నయుండును. పశువు వయస్సు ముదిరిన కొలది పాలు చిక్కబడును. చూడి పశువుల పాలు శిశువులకు మంచివిగావు. ఇంకను పాలలోనుండు ద్రవ్యములలో కొన్ని ఎక్కువగా నుండుటవలనను, మరికొన్ని తక్కువగా నుండుటవలనను పాలగుణములు మార్పు చెందును.

నీరసముగానుండు పశువులపాలు

నీరసముగానుండు పశువుల యొక్క పాలు ఒక్కొక్కప్పుడు నీలి వర్ణముగానుండి పలుచగనుండును. పాలొక్కొక్కప్పుడు తీసిన వెంటనే కరుడు గట్టును. ఇందుకు కొన్ని సూక్ష్మజీవులే కారణము. ఒక్కొక్కప్పుడు పాలు తీసిన కొంతసేపటికి అవి చిక్కగను జిగురుగను యుండును. ఈ రంగు పొదుగులోనుండు పాలలో రక్తము కలియుట వలన కలుగును. ఈ పాలను కలుపకుండ నుంచినచో రక్తసంబంధమగు పదార్థములు క్రిందికి దిగుట, ఈ రీతిగనే పాలు తీసిన కొంతసేపటికి ఎర్రబడుటయు, మిగుల పల్చబడుటయు, చేదగుటయు వివిధములగు సూక్ష్మజీవుల చేతనేయని కొందరి యభిప్రాయము. పూర్వీకులు అమ్మవార్ల మహత్తువలన ఈ రీతిగా రంగులువచ్చునని చెప్పుదురు. ఈ విషయము నమ్మదగినది కాదు.

పాలస్వభావము – మేత మార్చుట

పొదుగు కొంత వరకు మూత్రపిండమువలె శరీరమునందుండు కొన్ని విషముల దీసివేయుటకు గూడ నుపయోగపడును. మేతయందుండు కొన్ని ద్రవ్యములిట్లు తొలగింపబడును కావున పాలస్వభావము మేత మార్చగలదు. కొన్ని ద్రవ్యములతో గూడిన మేత పాడి పశువు పాలు మనుష్యులకు జబ్బుచేయును. పాల వలన క్షయ మొదలగు వ్యాధులు రాగలవు. పశువుల వయస్సులను బట్టియు, అవి తినెడి మేతను బట్టియు, పాలను పితుకునట్టి వేళలను బట్టియు, పాల యొక్క గుణములు మారుచుండును. పాలలో

నీటిని కలుపవలసి వచ్చినప్పుడు పరిశుభ్రమైన నీటిని జేర్పవలయును. లేనియెడల చెడు నీటిలోనుండు సూక్ష్మ జీవులు పాలలో జేరి అనేక వ్యాధులు కల్పించును. కొన్ని పశువు లొక్కొక్కప్పుడు ఈను సమయము వచ్చినను పాలిచ్చుచుండును. ఇది ఒక వ్యాధిగా పరిగణింప అవసరములేకున్నను జంతువుల యొక్క బలమిందు వలన క్షీణించును. కావున ఈనుటకు కొన్ని నెలల ముందు పాలిచ్చుట మాన్పవలయును. ఇంకను పాల గ్రంధులకు విశ్రాంతి గలుగజేయని ఎడల ఈనిన వెనుక పాలు తగ్గవచ్చును.

పాలద్వారావచ్చే రోగములు

పాలను చిరకాలమునుండి బిడ్డలకు, రోగులకు ముఖ్యమైన ఆహార పదార్థముగా వాడుచున్నారు. ఏలనన దేహపోషణకు కావలసినవి పిల్లలు, రోగులు తేలికగా జీర్ణించుకో గలిగినవి పదార్థములు పాలయందు గలవు. దేహపోషణకు కావసిన పదార్థములన్నియుండుటచే దీనితో సమానమైన మరి ఏ ఇతర పదార్థము కానరాదు. పాలయందుండెడి పదార్థములు: –

(1) నీరు నూటికి 87.20 (2) క్రొవ్వు నూటికి 3.90 (3) పంచదార నూటికి 4.75 (4) నత్రజని నూటికి 3.40 (5) లవణములు నూటికి 0.75 పాళ్ళు.

ఇవికాక కొన్ని విటమినులు యన్‌జైములు మొదలైనవి పాలయందు కలసియున్నవి. పాలుమంచి ఆహారముగా నుండవలెనన్న పై చెప్పిన పదార్థములన్నియు కలిసి శుభ్రముగా నుండవలెను.

పాలు దేహారోగ్యమును గలుగజేయు మంచి పదార్థమైనను, జాగ్రత్తగా ఉంచని యెడల పాడయి అనేక వ్యాధులను కలుగజేయును.

పాలను పిండినది మొదలు దానినువయోగించువరకు తగిన శ్రద్ధ తీసికొని జాగ్రత్తపరచవలయును.

ఈ క్రింది పరిస్థితులలో పాలయందు సూక్ష్మజీవులు వృద్ధి పొంది అంటువ్యాధులు, ఇతర రోగములు కలుగజేయుచున్నవి: –

(1) పశువు అంటువ్యాధిచే బాధపడుచున్నప్పుడు దాని పాలవలనను (2) పశువుల కాపరి అంటువ్యాధిచే బాధపడుచున్నప్పుడు అతడు పాలను ముట్టుకొనుటచేతను (3) పాల పాత్రలు శుభ్రముగా నుంచక పోవుటచేతను (4) మురికి నీళ్ళతో ఆవు పొదుగు, పాల పాత్రలు కడుగుటచేతను (5) పితికిన పాలను తగువిధముగా జ్రాగత్త పరచకపోవుటచేతను పాలయందు సూక్ష్మజీవులు జనించి, వాని నుపయోగించు వారికి అనేకమైన వ్యాధులు కలుగుచున్నవి.

అట్టి పాలద్వారా ఈ క్రింది వ్యాధులు ఒక జంతువునుండి మరియొక జంతువునకు, మనుష్యులకు సోకును: –

(1) గోక్షయ (2) గో మశూచికము (3) అంటు గర్భస్రావము (ఈచుకొనిపోవుట) (4) పిచ్చి (5) దొమ్మ (6) కాలికుంటు, నోటి గాళ్లు (7) ఆక్టినోమైకోసిస్ (8) జీర్ణకోశమునకు సంబంధించిన అంటు వ్యాధులు (9) పొదుగువాపు.

క్షయ:–ఇది మనుష్యులకు, పశువులకు వచ్చు అంటువ్యాధి. జ్వరము, దగ్గు, విరోచనములు, క్రమముగా క్షీణించుట దీని లక్షణములు.

ఈ వ్యాధిగల పశువుల పాలు ఉపయోగించుటచే మనుష్యులకు ఈ వ్యాధి తగులును. ఆవు పొదుగు మంచిదిగా కనబడినను, పాలలో ఈ జబ్బు యొక్క సూక్ష్మజీవులుండవచ్చును. వ్యాధితోనున్న పశువుల పాలను ఇతర పాలతో కలపరాదు. పాలను బాగుగా కాచి త్రాగవలయును. పశువులను తరుచు డాక్టర్లచే పరీక్ష చేయించవలయును.

గో మశూచికము:– ఇది మనుష్యులకు వచ్చు మశూచికము వంటిది. ఇది జంతువులనుండి మనుష్యులకు కూడా వచ్చును. జ్వరము, బొబ్బలు పుట్టుట దీని లక్షణములు. ఈ బొబ్బలు మొదట బటానీ గింజలంత పొదుగు మీద బయలుదేరి క్రమముగా దేహమంతట వ్యాపించును. అవి క్రమముగా చీముతోనిండి పెద్ద పొక్కులుగా మారును. ఈ వ్యాధి ఆవు, గొర్రె, మేక, గుఱ్ఱము మొదలగు జంతువులలో కనబడును. ఈ వ్యాధిచే బాధపడు జంతువుల పాలు త్రాగిన మనుష్యులకు కూడా వచ్చును. టీకాలు వేయని పిల్లలకు ఈ వ్యాధిగల ఆవుపాలు ఇచ్చిన ఎక్కువ అపాయకరము. ఈ పాలు జీర్ణకోశమును పాడుచేయును.

పిచ్చి:– ఇది సమస్త జంతువులకు మనుష్యులకు ప్రాణాపాయమైనది. ఇది చొంగద్వారా కరచిన గాయములలో ప్రవేశించును. ఈ వ్యాధి గల పశువుల పాలను త్రాగిన ఈ వ్యాధి వచ్చును.

దొమ్మ:– ఈ వ్యాధిగల పశువుల పాలద్వారా మనుష్యులకు ఇతర జంతువులకు ఈ వ్యాధి రావచ్చును. మనుష్యులలో ఈ వ్యాధి అపాయకరమైన కురుపు రూపమున కనబడును.

కాలి కుంటు, నోటి గాళ్ళు:– నెమరువేయు జంతువలకు ఈ వ్యాధి వచ్చును. జ్వరము, నోటిలోను, గిట్టలమధ్యను పుండ్లు రావడం ఈ వ్యాధి లక్షణములు. ఈ వ్యాధిచే బాధపడుచున్న పశువుల పాలు త్రాగిన మనుష్యులకు 'నోటిపూత' అను వ్యాధి కలుగును.

ఆక్టినోమైకోసిస్ (Actinomycosis):– ఈ వ్యాధిగల పశువు పాలలో ఈ వ్యాధి సూక్ష్మ జీవులుండును. మనుష్యుల నోటిలోను, ప్రేగులలోను కురుపులున్నచో ఈ సూక్ష్మజీవులు వాటిద్వారా శరీరములోనికి ప్రవేశించి ఈ వ్యాధిని మనుష్యులకు కలుగచేయుచున్నవి.

పొదుగు వాపు:– ఇది పాడి పశువులకు సాధారణముగా వచ్చు జబ్బు. వీటి సూక్ష్మజీవులు మనుష్యులకు హానిచేయలేకపోయినను ఇతర జీవులతో కలసి గొంతు బాధను కలిగించును. జంతువు పొదుగు మీద

చనుకట్ల మీదను పుండ్లుయున్న వాటిలోని సూక్ష్మజీవులు పాలలో కలవకుండా ఎక్కువ శ్రద్ధ తీసుకొనవలయును. లేనియెడల సూక్ష్మజీవులు పాలలోకలసి వాటిని త్రాగిన వారికి వ్యాధి కలిగించును.

విషజ్వరము, గ్రహణి, గొంతు వ్యాధి, జ్వరము, కలరా, క్షయ మొదలగు అంటువ్యాధులచే బాధపడు మనుష్యులు పాలను ముట్టుకొనుట చేతను, ఈగలు మొదలయిన కీటకములు వ్యాధిగ్రస్తుల మలమూత్రముల మీద వ్రాలి తిరిగి పాలమీద వ్రాలిన అట్టి పాలనుపయోగించుటద్వారా ఆ రోగములుత్పత్తియగుచున్నవి.

పాలద్వారా అనేకమైన వ్యాధులు, పశువులనుండి మనుష్యులకు, మనుష్యులనుండి పశువులకు గలుగుచున్నవి.

ప్రతి జీవికి పాలు ముఖ్యావసరమగుటచే, పశువుల యొక్క ఆరోగ్యమును ఎక్కువగా గమనించ వలయును. పశువు కొట్టములో పాల పాత్రలు అతి శుభ్రముగా నుంచవలెను. పశువుల కాపరులు ఆరోగ్యముగను పరిశుభ్రముగ యుండవలయును. కాచని పాలనుపయోగింపరాదు. పై చెప్పిన సలహాలను గమనించుటచేతను, సర్కారు పశువైద్యుల సహాయము పొందుటచేతను పాలద్వారా కలిగే నష్టములు చాలవరకు తగ్గిపోవును.


ఆధునిక యూరోపియను పద్ధతి

పాలుపితుకుట:- నాగరిక దేశములలో రెండు విధములుగ పాలు పితుకుదురు. 1. చేతితో 2. యంత్ర సహాయముతో.

చేతితో పాలు పితుకుట:- విదేశాలలో మన దేశములో వలెనే చేతితో పితుకుదురు. కాని కొద్ది భేదముగలదు. ఈ దేశములో పాలు పితుకు వారు కాలి వ్రేళ్ళపై కూర్చొని, పాత్రను రెండు మోకాళ్ళ మధ్య నొక్కిపెట్టి, రెండు చేతులతోను పాలు పితుకుదురు. కాని ఆ దేశములలో ఒక పీటపైన కూర్చొని పాత్రను క్రింద పెట్టి పాలు పితుకుదురు. ఇది సులువైనది. మన దేశములో పాలు పితుకుటకు ముందు దూడను పాలు కుడుచుటకు వదలుదురు. కాని ఆ దేశములలో మొదటి నెలలోనే పాలు మాన్పింతురు. ఇదేకాకుండా పాలుపితుకువాడు తాను రోజు కట్టుకొనే గుడ్డలపైన ఒక తొడుగు శుభ్రమైనది వేసుకొని పాలు పితుకును. అందుచే రెండు విధములగు లాభములు కలుగును. 1. కట్టుకొన్న గుడ్డల మురికి పాలకు సోకదు 2. పాలు చింది గుడ్డలపైన పడవు.

పాలుపితుకు యంత్రము

పాలు పితుకు యంత్రము కనిపెట్టిన తరువాత అచ్చటి జనులు చేతితో పాలను పితుకుటకు అసహ్యించుకొందురు. దీనికి ముఖ్యకారణములు రెండు 1. పరిశుభ్రత 2. కొద్ది కాలములో ఎక్కువ పనియగుట.



చేతితో పాలు పితుకుటకు పట్టు సమయములో సగము సమయములోనే యంత్రముతో పాలు పితుకవచ్చును. అదియును గాక పరిశుభ్రత కూడా ఎక్కువగా వుండును. ఇందువలన దీని ప్రచారము ఇంగ్లండు, అమెరికా మొదలగు దేశములలో త్వరగా అయింది. ఈ యంత్రము ముఖ్యముగా రెండు విధములుగా వుండును. ఒకటి యంత్రముతో పొదుగునువత్తి పాలుతీయుదురు. కాని ఈ యంత్రము మంచిది కాదు. పొదుగును ఎక్కువగాగాని, తక్కువగా కాని, వత్తినచో పొదుగుపైన గాయము అగును. రెండవ యంత్రము చంటి కొనను పట్టుకొని పాలను లాగును. (పితికిన విధముగా) ఇట్టి యంత్రముతో పాలు పితుకునప్పుడు, దాని దూడ పాలు త్రాగునప్పుడు ఏ విధముగా వుండునో ఆ విధముగా అనిపించును. ఈ రెండవ మాదిరి యంత్రముతో దూడ పాలు త్రాగుటకు గాను కుదుచుచున్నప్పుడు ఏ విధముగా పాలు త్రాగుచూ పొదుగును ఏ విధముగా కుమ్మునో ఆ విధముగా క్రియలన్ని చేయవచ్చును. దీనిని నడపుటకు ఆవిరి గాని గుఱ్ఱము లేక ఎద్దును గాని ఉపయోగించుదురు. ఈ యంత్రములో నాల్గుస్తనములలో నుండి వచ్చు పాలు క్రిందకు పోవుటకు అనువుగా ఒక టోపియూ, దానికి ఒక గొట్టము వుండును. ఈ గొట్టము పాల పాత్రపైన పెట్టుదురు. దానిలోనుండి పాలులోపలికి వచ్చును. ఈ పాల పాత్రలో వుండు గాలి పంపు ద్వారా నెమ్మదిగా బయటకు నెట్టబడును. అందువలన పాత్రలో గాలి ఒత్తిడి తగ్గుటచే స్తనములనుండి పాలు తమంతట తామే క్రిందికి జారి వచ్చును. గొట్టము చివర పాలు వచ్చుట అయి పోవుటను చూచి యంత్రమును ఇవతలకు లాగుదురు. యంత్రము అతి సులువుగా శుభ్రపరచవచ్చును. అందుచే పాలు అతి స్వచ్ఛముగను నిర్మలముగను వుండును. ఈ యంత్రము ఇంతవరకు మన దేశమునకు రాలేదు.

పాల సీసాలు

పాలు వడబోయు సీసాలో మూడు భాగముల వరకు పాలు పోసి మిగత భాగమును ఖాళీగా వదలి దానికి డాట్ స్ప్రింగ్ నొక్కకుండా తగిలించి, సీసాలపైన బిగుతుగా వుండుటకు టోపీ మూత వేసెదరు. ఈవిధంగా చేసిన తరువాత ఆ సీసాలను స్పెరిలైజరిలో పెట్టి దాని మూతను బిగించి ఆవిరి వదలుదురు. ఈవిధంగా అరగంటసేపు వుంచిన తరువాత స్పెరిలైజర్ యొక్క మూతను తీసివేసి సీసాలయందలి

బిరడా యొక్క స్ప్రింగును నొక్కెదరు. అందువలన బిరడా గట్టిగా బిగియును. బిరడా గట్టిగా బిగిసిన తరువాత సీసాలను పైకి తీసి వేడినీటిలో పెట్టుదురు. ఒక్కసారిగా సీసాలను తీసిన వెంటనే చన్నీళ్ళలో పెట్టినచో బ్రద్దలగును.

సీసాలు చల్లబడిన తరువాత వాటిని చల్లగా వుండుచోటున ఒకటి రెండు రోజులు పెట్టియుంచుదురు. తదుపరి సీసాలను ఊపుదురు. అందువలన మీగడ పాలనుండి వేరైపోవును. ఈ విధముగా చేసిన పాలు చాలా రోజుల వరకు చక్కగా వుంచవచ్చును. ఈవిధంగా చేయుటవలన వచ్చు లాభము ఇది ఒక్కటియే. ఈ విధముగా జంతువులు లేకుండా వుండు పాలు శరీర పోషణకు ఎక్కువ లాభకరము అని తలచరాదు. శరీర పోషణ విషయమై చూచిన వ్యాధిలేని పరిశుద్ధమగు మేతను తిను ఆవుయొక్క, అప్పుడే తీసిన పాలతో సమానమైనవి ఏవిలేవు.

విద్యుత్ కిరణములతో పాలను శుద్ధపరచుట

ఆధునిక వైజ్ఞానవేత్తలు సూర్యకిరణములలో ఆల్ట్రావైలెట్ కిరణములు గలవని అవి సూక్ష్మ క్రిములను చంపివేయునని అభిప్రాయపడుచున్నారు. ఈ కిరణములు పాలను శుభ్రపరచుటకు ఉపయోగించును. ఎలెక్ట్రిసిటి దీపములు గోళములలో పాదరసపు బిందువులలో వెలిగించుట వలన ఈకిరణములు ఆ దీపములనుండి వెలువడును.

వీటికి పాలను శుభ్రపరచుటకు రెండు అడుగుల వెడల్పు, మూడు అడుగుల పొడవు, ఆరు అడుగుల ఎత్తుగల పెట్టెవంటి ఆకారముగల ఒక యంత్రము వుండును. వాని మధ్య భాగమందు మూడు విద్యుద్దీపము లుండును. ఒక్కొక్క దీపము యొక్క ప్రకాశము 9000 మైనపు వత్తుల ప్రకాశమునకు సరిపోవునంతటిదిగా నుండును. ఈ యంత్రమునకు రెండు వైపుల పాలు పలచగా పారుచుండును. ఈ యంత్రమును విద్యుత్తుతో నడిపి పాలను ప్రవహించునటుల చేసినచో వాటినుండి వచ్చు వైలెట్ ఉరుముల వలన పాలు పరిశుద్ధపడి బయటకు వచ్చును. ఈవిధంగా చేయుటకు వ్యయము చాల తక్కువయగును. ఒక గంటలో సుమారు 25 మణుగుల పాలను పరిశుద్ధ పరచవచ్చును. ఈవిధముగా చేసినచో పాలయందలి లాభకరములగు క్రిములు మొదలగునవి ఏమీ నష్టము కావు. దీనిని నడుపుటకు రెండు యూనిట్ల విద్యుత్తు ఖర్చు అగును. ఇట్టి మిషన్ మన దేశములలో ఇప్పటివరకు లేదు.

పాలు పంచి ఇచ్చుట

పాలు పంచిఇచ్చుటకు మంచి పాత్రలో తీసికొని పోవుదురు. దూర స్థలమునకు పంపవలసి వచ్చిన రైలు లేక గుఱ్ఱపుబండిమీద పుంపుదురు. ఇటువంటి పాత్రలో పాలు మూతవేసి పంపినందువలన చెడిపోవు. పాలు వంచుటకు పాత్ర యొక్క అడుగు భాగమున సన్నని గొట్టము ఒకటి వుండును. ఇందు వలన పాలు పోయుట సులువు. ఇదేకాకుండ పాలు చెడిపోకుండుటకు గాను ఆ పాత్రలో ఒక ప్రక్కన చిన్న పాత్ర మంచు గడ్డ వేసి పెట్టియుంచుటకు కూడ వుండును. ఇదిరైలుద్వారా పంపించు వారికే

అవశ్యము. దగ్గరున్న వారికి కళాయి చేసిన పాత్రలతో పంపుదురు. అప్పుడప్పుడు గాజు పాత్రలలో కూడ పంపుదురు. వీటిలో బిరడాలు పెట్టుచోట గుండ్రటి కాగితపుబిళ్ళలు అంటింతురు. ఇందువలన దుమ్ము ఏమాత్రము లోపలికి పడదు. వానిని కొనువారి వద్దకు పంపుదురు.

ఇందులో చన్నీటిని వుంచుదురు. ఈ యంత్రపు బయట భాగమందు పైనుండి క్రిందకు పాలు జారి పోవుటకు స్రూపైన పట్టుకొనుటకు గాను వుండు పిడిలాంటి ఒక గుండ్రని పిడి వుండును. పాలను చల్ల పరచుటకు చల్లని నీరు కావలెను. ఈ నీటిని మంచు బాగావున్న చోటునకు పోయి ఉప్పును మంచును కలిపి ఎంతవరకు కావలెనో అంత చల్లదనము వచ్చువరకు పాళ్లు చూచి ఆ నీటిని రెఫ్రిజిరేటరులో పోస్తారు. పాల వ్యాపారము ఎక్కువగా వున్న ప్రతిచోటా మంచుగడ్డ తయారుచేయు యంత్రము తప్పక వుండాలి. రెఫ్రిజిరేటరు పై వైపుగల భాగంలో పాలు పోయుదురు. అప్పుడు పాలు బయటగల చక్రములుగా గుండ్రంగా వుండి పిడిపై గుండా మెల్ల మెల్లగా క్రిందివైపుకు పోవును. ఈ యంత్రమునకు క్రిందివైపునుండు గొట్టమునుండి చన్నీరు లోపలకు వచ్చును. అటుల వచ్చి దానికి పైనుండి వచ్చే గొట్టముగుండా బయటకు పోవును. ఇందు వల్ల పాలు క్రిందకు వచ్చుచునే చల్లదనము పొందుటయే గాక, యంత్రమునుండి బయట పడినప్పుడు దాని వేడి దీని వేడితో సమానమగును. రెఫ్రిజిరేటరునుండి పాలు బయటకు వచ్చునప్పుడు వాటి ఉష్ణం 55 నుండి 60 డిగ్రీలు ఫా. వుండును. పితికిన తరువాత 15, 20 నిమిషములు ఆగి అటుపిమ్మట పై ప్రకారము చేసిన పాలు త్వరగా చెడిపోకుండుటయే గాక చాల దూరము వరకు కూడా పంపవచ్చును.

పాడి పశువుల రోగములు – పాలు చేపకుండుట

పాడి పశువుల చన్నుల గొట్టములలో అనేకమైన సూక్ష్మగు నాళములుండును. ఈ పాలగొట్టముల కన్నిటికి తుది మొదళ్లలో మాంసముతో చేయబడిన ద్వారములుండును. ఈ ద్వారములు తెరచికొని యున్నయెడల పాలతిత్తులలోని పాలు వీనిగుండ ప్రవహించగలవు. పశువునకు భయము కలిగినప్పుడు గాని, జ్వరము వచ్చినప్పుడు గాని, సకాలమునకు పాలు పిండనప్పుడు గాని, పశువు దూడకు పాలు దాచుకొనవలెనను ఉద్దేశ్యమున్నప్పుడు గాని, మనోవ్యాకులము కలిగినప్పుడు గాని ఈ ద్వారములు ముడుచుకొనును: అప్పుడు పశువు చేపుట లేదందురు. పశువు దూడను దగ్గరకు రానీయదు. చన్నులపైన నీరు పోసి పితికినప్పుడు పాలు రావు. బెదరి బెదరి చూస్తూ వుంటుంది. సరిగా నిలబడక అటు నిటు తిరుగును. కొన్ని పశువుల కిట్టిసమయములో దాణాదినుసులు పెట్టిన పాలు చేపుట కూడ గలదు. ఇట్లు చేపకుండుట వలన రైతు విసుగుకొనుచుండును.

చికిత్స

ఆవు మజ్జిగ అర్ధసేరు, తాడికాయలు 1 తు, కాచలవణము 1/2 తు. సుగంధ పాలరసము 2 తు, కలిపి రెండు పర్యాయములీయవచ్చును.

లేక గోధుమ గంజి అర్ధసేరు, నెయ్యి 5 తు కలిపి మూడు పూటలు త్రాగించాలి.

లేక సాగనారమట్టలు తెచ్చి ఉడికించి దానిలోనున్న తెలుపు పలుకులు తీసి మజ్జిగలో కలిపి త్రాగించాలి.


లేక పుల్ల తీగనుంచి రసము తీసి చన్నున పైభాగమున మర్దించి చేతులతో కొంచెముగా గొట్టిన పశువు చేపును.

లేక కొండగోగు ఆకురసము తీసి పాలు పిండబోవు ముందు పశువు శరీరమునకు రాసిన తప్పక చేపును. ఫార్మసీ వారి వాతారి పొడి, క్షీరోజన్ కలిపి వాడిన చక్కగా చేపును.

చన్నుల ద్వారములు ముడుచుకొనుట

పశువుయొక్క చన్నులు పాలతిత్తులలోనికి వ్యాపించును. పాల తిత్తులలోనీ గొట్టములు ప్రవేశించు చోట నొకద్వారముండును. ఈ ద్వారము తనంతట అదియే ముడుచుకొనగలదు. అట్లు ముడుచుకొనినపుడు చన్నులనుండి పాలు రావు. పాడి పశువు పొదుగులో రెండుతిత్తులుండును. రెండు గొట్టములొక తిత్తిలోనికి, తక్కిన రెండు గొట్టములు మరియొక పాలతిత్తిలోనికి ప్రవేశించునుకొన్ని పశువుల పాలు ఈ గొట్టము నుండి పితుకకుండగనే వానియంతటవియె కారిపోవును. కొన్ని పశువులకు బాగుగా పిండినప్పటికి పాలు రాజాలవు. కారణమేమన పశువుచన్నులలో ఒకటి గాని, అంతకెక్కువగాని పూడిపోయిన రంధ్రములుగలవైయుండును.


ఈనిన వెంటనే కొన్ని పుశువులు గ్రంథులలో పాలు పుట్టి చన్నులు లావుగా కనబడినను పాలు మాత్రము పైకిరాజాలవు. పాలు పైకివచ్చు ద్వారమున కడ్డముగా చంటి చివర నొకవిధమగు పొర పెరుగుటయే ఇందుకు కారణము. రైతులిట్టి పశువులను గూర్చి చాల విచారపడుచుందురు. కొన్ని పశువులు ఈనిన వెంటనే చన్నుల ద్వారములు మూసికొని పోయి వట్టిపోవును. కొన్ని పశువుల నాలుగు చన్నులకు గాని, రెండు చన్నులకు గాని ఇది రావచ్చును. ద్వారములు గట్టిగా ముడుచుకొని పోయిన పశువుల కెన్ని చికిత్సలు చేసినను లాభములేదు. ఆ ఈతకంతేయని గ్రహించవలెను. మరల రెండవ కాన్పునకు కూడ రావచ్చును.




చంటి రంధ్రములు పొరలతో ముడుచుకొనిపోయినపుడు సలాకతో గాని, కెతీటరు అను పనిముట్టుతో గాని పొడిచి పాలుపైకి వచ్చునట్లు చేయవచ్చును. లేక పొడుగుగల సన్నని సూదితో నెమ్మదిగా ఆ పాల రంధ్రములోనికి పొడిచి పాలను రప్పించవచ్చును. కాని తెలిసి తెలియని వారు రంధ్ర భాగమునకు పొడిచిన ఎడల పశువునకపాయము సంభవించును. అంతకు తెలియనిచో వెటర్నరీ చికిత్సాలయమునకు తీసికొని వెళ్లి చికిత్స చేయించాలి. వెటర్నరీ ప్లాస్టరును పొదుగునకు చన్నులకు రాయుచు లోపలికి క్షీరోజన్‌ను వాడాలి.

కండర సంకోచము


ఒక్కొక్కప్పుడు చంటి చివరనుండి పాలు తమంతటవి కారిపోకుండ కాపాడుకండరము సంకోచము చెందుటచే రంధ్రము మిగుల చిన్నదయి పాలు తీయుటకు దుర్లభముగా నుండును. దీనికి చికిత్స చేయుట




మంచి పాడిపశువు



డెక్‌స్టర్ జాతి



డెవాన్ జాతి



పాలను సరాసరిసీసాలలో నింపే యంత్రము

దుర్లభము. శస్త్ర మవసరముగ నుండునుగాని ఈపని మిగుల నేర్పరియైన వైద్యుడు చేయవలసియుండును. అందువలననైనను తప్పక లాభముండును. ఇటువంటి శస్త్ర సంబంధమైన వ్యాధులు కలిగినపుడు వెటర్నరీ డాక్టరుగారికి చూపించుటమంచిది. ఆయుర్వేద పశువైద్యుల వలన ఏమియు లాభముండదు. లేక ప్రతిదినము ఒక సన్నని సూదిని లోనికి జొనిపి పాలను దీయుచు వచ్చినయెడల రంధ్రము పెద్దది కావచ్చును.

చన్నుల మీద కాయలు

పశువు చన్నులమీద చిటిపొటి కాయలు మొదలగునవి యుండుటచే పాలు పితుకుట కాటంకము గలిగించును. ఒక్కొక్కప్పుడవి రేగిన ఎడల పుండు పడి పశువు బాధపడును. పాలు కూడ తగ్గవచ్చును. కాబట్టి అటువంటి కాయలను కోసివేయుట వలన వెంట్రుకలతో బిగించి కట్టుటవలన అవి పోవచ్చును. ఫార్మసీ వారి హిలాన్‌ను వాడాలి.

చన్నులకాటంకము గలుగుట

పాలలో చమురు గాక కొన్ని ఘనపదార్థములుండును. ఈ పదార్థములు విస్తారముగానున్నయెడల పాలు బరువుగానుండును. ఈ ఘనపదార్థములు పాలు పితుకునప్పుడు చేతికి చిన్న చిన్న ముద్దలవలె తరచుగా తగులుచుండును. ఇవి పేరుకొనిన పాలముద్దలు గాని, లోపల చర్మములపైబయలుదేరిన కంతులు గాని లేక ఒక విధమైన శీలలు గాని అయియుండవచ్చును. ఇవి పాలు తీయుట కవరోధము కలిగించుటయే గాక ఒక్కొక్కప్పుడు పొదుగునందు కూడ వాపుపుట్టించును. కావున ఈ అవరోధమును దీసివేయుట ఆవశ్యకము. తీసివేయుటకు వీలులేని ఎడల పైనుండు పాలతిత్తిలోనికి త్రోసివేయుట మంచిది. ఫార్మసీ వారి స్ప్రెయిన్ కిల్లరును మర్దన చేయాలి.

చంటికి రంధ్రముపడుట

ఏదైన ఆవయవము వలన గాని, పుండు పుట్టుట వలన గాని, చంటిలో సామాన్యముగ పాలు తీయు మార్గముగా పాలతిత్తిలో నుండి చంటి ప్రక్కకు కన్నముపడవచ్చును. అచటనుండి పాలు కారిపోవును. ఇందువలన పొదుగంతటికిని గూడ వాపు రావచ్చును. పాలిచ్చుచున్నంత కాలమును ఈ రంధ్రమును పూడునట్లు చేయుట మిగుల కష్టము. పాలిచ్చుట మానిన తరువాత శీఘ్రముగనే కుదురవచ్చును. అయినను పాలతిత్తిలో పాలెప్పుడును లేకుండ కారునట్లు మామూలు మార్గములో ఒకగొట్టముంచి ఆ పుండును మాన్పవచ్చును. కాని ఇది కష్టసాధ్యము. పొదుగు బాగమందు కలిగిన గాయములు త్వరగా మానక బాధించును. హిలాన్‌ను గాని వెటర్నరీ ప్లాస్టరును గాని వాడాలి.

కొరివి చన్ను

పాడి పశువులలో ఏదైన కొరివిచన్ను కావచ్చును. అనగా ఆ చన్నుతిత్తివలెనై పాలు స్రవించకుండ నుండును. పశువునకతి వేడిజేసినపుడు గాని, విషసంబంధమైన పదార్థమును తినుటవలన గాని ఈ వ్యాధి ఏర్పడవచ్చును. పశువు నవమాసములు వచ్చిన తరువాత ఏదైన విషపు మొక్కలు తినిన యెడల ఈనిన తరువాత ఈ వ్యాధి కనపడవచ్చును. కొన్ని పశువుల చన్నులనుండి నెత్తురు పడుచుండును. మరికొన్నిటికి చీము, నెత్తురు కలిసి పడుచుండును. అప్పుడు దృష్టి దోషము తగిలినదని అనేక చికిత్సలు చేయుదురు. కొరివి చన్నుగల పశువు ప్రతి ఈతకు పాలు సరిగా ఇవ్వదు. తక్కిన మూడు చన్నులనుండి పాలు వచ్చును గాని, ఈ చన్నునుండి మాత్రము రావు. ఒక్కొక్కప్పుడు అన్ని చన్నులకు ఈవ్యాధి రావచ్చును. దీనినే కొరివిచన్ను అందురు.

పాలు తగ్గిపోవుట

పశువుయొక్క తత్వమునుబట్టియు, ఆరోగ్యమునుబట్టియు, సాంప్రదాయమును బట్టియు పాలెక్కువ తక్కువగా పట్టుచుండును. పశువులకు ప్రతిదినము పెట్టుదాణా దినుసులు తగ్గించి పెట్టుటవలన బొత్తిగా పెట్టక పోవుట వలనను కూడ పాలు తగ్గవచ్చును. ఇంకను పశువు శరీరములో తగినంత రక్త వృద్ధి లేక పోవుట వలన క్రొత్తమనుష్యులు పితుకుట వలన, ఎండలో నెక్కువగా నుంచుట వలన, పొదుగులోనున్న పాలను పూర్తిగా పిండక పోవుట వలన, విషసంబధమైన మొక్కలు తినుటవలన, దూడ చచ్చినపుడు గాని, పాలన్నియు దూడ త్రాగునను ఉద్దేశ్యముతో కుడువనీయక పోవుటవలనను కూడ పాలు తగ్గుచుండును. ఇట్టి తాత్కాలిక కారణమువలన పాలు తగ్గినయెడల ఆహారము మార్చవలెను.

చికిత్స

వాతము గల పశువునకు ప్రతిదినము సాయంకాలమందు సవాశేరు తెలికపిండి పెట్టుట వలన పాల వృద్ధి గలుగును. లేక ఆ పిండిని నీటిలో నానవేసి సాయంకాలము పెట్టుటవలన పాల వృద్ధి గలుగును. లేక ఆ పిండిని నీటిలో నాన వేసి సాయంకాలము పెట్టు కుడితితో కలిపి పెట్టవచ్చును.

లేక కాక శరీరముగల పశువునకు ఉలవలు నాన వేసి రుబ్బి కుడితిగా పోయ వచ్చును. లేక శనగలు నాన వేసి రుబ్బి కుడితిగా పోయవచ్చును. పశువు యొక్క శరీరతత్వముల గ్రహించి తగిన ఆహార పదార్థములు పెట్టుచుండిన యెడల పాలు వృద్ధియగుచుండును. తప్పకుండ క్షిరోజన్‌ను కొంత కాలము వాడుడు.

వాంతులు

పశువులకు జీర్ణము కాని ఆహారము పెట్టుటవలన, మిక్కుటముగా నానా జాతుల గడ్డి తినుట వలన, తవుడు, పిల్లి పెసర, కందిపొట్టులు తినుట వలన విషపురుగులు, క్రిములు ప్రేగులలో జేరి జీర్ణము కాకుండ చేయుటవలన వాంతులు వచ్చుచుండును.

ప్రేగులు అరచుచుండును. నోటి గుండ, ముక్కుల గుండ పేడ రంగు వలె వదరు పడుచుండును. లేచుచు పడుకొనుచు నుండును. శ్వాస నెమ్మదిగా విడచుచుండును. సరియగు చికిత్స చేయనిచో ప్రమాదము రాగలదు.

చికిత్స

నోటిని ముక్కు రంధ్రములను వగరు నీటితో కడిగి సేరున్నర మంచి బెల్లపు నీటిలో అరతులము కర్పూరము కలిపి ప్రతి ఆరు గంటలకు ఈయవలెను. లేక రావి చెక్కరసము చిక్కనిది సేరు, కర్పూరం 4 వడ్ల గింజలెత్తు కలిపి ఒక మోతాదు ఈయవలెను.

లేక మాదిగవాడు తోలు ఊరవేయుటకు తయారుచేసిన తంగేడు చెక్క నీటిని మూడు గొట్టములు పెట్టుము:

అప్పుడప్పుడు ముక్కురంధ్రములకు సాంబ్రాణి పొగపట్టించుము.

దూడకు పాలు మరపించుట

కొన్ని పశువుల దూడలు పెద్దవైనపుడు కూడ పాలిచ్చుచుండును. ఇట్లు దూడకు వయస్సు వచ్చిన తరువాత కూడ తల్లి పాలు కుడుచుటవలన యజమానికి కొంత నష్టముకలుగును. కాబట్టి దూడకు ప్రత్యేకముగా ద్రవపదార్థములు అనగా నూకల జావ, లేతపచ్చి గడ్డి మున్నగునవి వేసి పాలు మరపింపవలెను.

అధిక పాలప్రవాహము

కొన్ని పశువు లొక్కొక్కప్పుడు ఈ సమయము వచ్చినను పాలిచ్చుచుండును. ఇది ఒక రోగముగా పరిగణింపకపోయినను జంతువు యొక్క బలమందువలన క్షీణించును. కావున ఈనుటకు కొన్ని నెలలకు ముందు పాలిచ్చుట మాన్పవలెను. పాల గ్రంధులకు విశ్రాంతి గలుగని యెడల ఈనిన వెనుక పాలు తగ్గవచ్చును.

పాడి పశువులను పాలు పితుకక తరచుగా మరకట్టుట వలన గాని మేత మిక్కుటముగా మేసి పాలు పొదుగులో నిలువయుండుట వలన గాని, ఒక్కొక్కప్పుడు చంటి చివరనుండు కండరము యొక్క పటుత్వము తగ్గిపోయి పాలు కారుచుండును.

మదము పొదుగు

సాధారణముగా పొర్లని, ఆలస్యముగా పొర్లే ఆవు పెయ్యలకు, గేదె పడ్డలకు, కొన్నిటికి పొదుగు కనపడుతుంది. దీనిని గురించి పశుపోషకులు విచారించరు. మదము పొదుగని మాత్రము వాడెదరు. అట్టి పశువులను బంధము వగైరాలతో బంధించి అలవరచువరకు కుడితి పెట్టి పాలు పితుకుట అలవరచిన ఎడల మొదటి పదిదినములు ముర్రు పాలు వచ్చును. పితుకుట అలవాటై తన్నుటవగైరా దుర్వ్యసనములు మాని పోవచ్చును. పాలలో దోషముండదు. అవి మనము ఉపయోగించ వచ్చును. ఇట్టి పశువులను మన పూర్వులు కామధేనువులు అని వ్రాసియుండుట చూచితిమి. కాని ఆ కాలములో గేదెలు మానవునిచే పెంచబడనందున కామధేనువంటే ఆవు అని అనుకొనుచున్నాము. నేను ఒక 4 నం.ముల గేదె పడ్డను అలవరచితిని. ఒక నెల శ్రమపడిన మీదట సామాన్యమైన మేతతో ఉపయోగించుకొనుచున్నాము.

పశు పోషకులు మదము పొదుగు నిర్లక్ష్యము చేయక పైవిధముగా పనిచేసినయెడల పాల కొరతకు కొంత ఉపయోగించునని మిత్రులు పర్వతనేని వెంకటరత్నంగారు తెలుపుతున్నారు.

* * *

ఇరువది ఎనిమిదవ భాగము

శస్త్రవైద్యం

శస్త్రవైద్యము వైద్యములన్నిటిలో ప్రధానమైనది. ఎంతో అనుభవము ధైర్యముగల వైద్యుడే శస్త్ర చికిత్స చేయగలడు. ఏ వైద్యుడు శస్త్ర శాస్త్రము నేర్చుకొనకుండ నోరులేని పశువులపై కత్తివేసి వాటిని బాధపరుస్తాడో అట్టి వైద్యుడు ఎట్టి శిక్షకైన అర్హుడగుతాడు. నేటి కాలములో వైద్యమంటే చులకనయి పోయింది. శాస్త్రము తెలియని వారు కూడ శస్త్రపనిముట్లు, ఇంజెక్షన్లు వాడుచున్నారు. గురువిద్య పోయింది. ఇట్టి వైద్యులు రోగ పశువుల దగ్గరకు పోయినప్పటికి పిరికివాడు యుద్ధమందు వలె చికిత్సయందు అసమర్థుడగుచున్నాడు. ఏ పశువైద్యుడు కేవలము కర్మ అభ్యాసమునే పొంది ధార్ష్ట్యముచే శాస్త్రమును చదువడో అట్టి వైద్యుడు పెద్దలచే గౌరవింపబడక శిక్షార్హుడుగా కూడ అవుతాడు. ఏ వైద్యుడు శాస్త్రమును, కర్మ పధమును చక్కగా తెలిసి యూహ పోహలు కలిగియుండునో అట్టి పశువైద్యుడు రెండు చక్రములు గల రధము యుద్ధమునందు పనికివచ్చునట్లు చికిత్సాకర్మయందు సమర్థతగలవాడగును. కాబట్టి పలు గ్రామములో ప్రాధమిక శస్త్రచికిత్సకైన పాటుపడే వైద్యులు ఎంతోమందికావాలి. అయినదానికి కాని దానికి బస్తీలకు పోక ఫిర్కాకొక పశువైద్యశాలనైన గవర్నమెంటు ఏర్పాటు చేసి పెద్ద పెద్ద శస్త్రచికిత్సలను బస్తీలకు పంపి చిన్న చిన్న శస్త్రచికిత్సలను ఫిర్కావైద్యశాలలో ఏర్పాటు చేయుదురుగాక.

గాజుతో వైద్యశాలలకు పనికివచ్చే శాస్త్రపనిముట్లు తదితర వస్తువులు తయారుచేయుట

ఇదివరకు ఒకరకమగు గాజు వుండేది. ఇది బహు పెళుసుగా ఆకుపచ్చురంగుగా వుండేది. ఈ అద్దాలను చీకటిగా నుండే ఇండ్లపైన వెలుతురు కోసం వేసేవారు. ఈ కాలంలో ఒక లక్షరకాలగాజును పరిశోధించారు. స్వచ్ఛంగా వుండే పటికిబెల్లం, పంచదారనుంచి తయారుచేయబడిన ఒకరకంగాజు కనుగొనబడింది. అయితే అది వర్షపు తాకిడికి కరిగిపోతుందికనుక అంతగా వాడుటలేదు. కాని ఈ గాజు పొడి పశువుల కంటి రోగాలకు బాగా పనిచేస్తుంది. ఎండకి వానకి కరగిపోకుండా ఉండే గాజుని ఇసుక, సున్నం, సోడా మూడింటిని బాగా కలిపి ఎంతో వేడిమిగల కొలిమిలో చక్కగా కలిసిపోయేవరకు కరిగిస్తారు. దీన్ని చల్లారిస్తే ఇది రాయి కంటె గట్టిగా వుంటుంది.

రంగురంగుల సీసాలు, కూజాలు, ఎనీమాడబ్బాలు, ధర్మామీటర్లు, తూనిక త్రాసులు, పౌను, అరపౌను, ఔన్సు, డ్రాము గ్లాసులను ఈ గాజుతోనే తయారుచేస్తారు. ఇంకను గాజుగరాటులు, గాజు కల్వాలు, మందులు కలుపుకునే గాజు పుల్లలు శస్త్రపనిముట్లు వగైరా ఇంకా ఎన్నెన్నో తయారగుతున్నాయి. ధర్మా మీటర్లు, రంగురంగుల ఎలెక్ట్రికల్ బల్బులు ఇంజెక్షను యాంపిల్సు వగైరాలు తయారు చేయాలంటే గాజు గొట్టాలు కావాలి. ఈరీతి గాజుగొట్టాలు చేయడం సులభం. గాజుబుడగను పట్టుకొని అదిగట్టి పడకుండానే చాలా దూరం సాగదియ్యడం, దీన్ని ఎంతపొడవు కావాలంటే అంత పొడవు సాగదీసి చిన్న చిన్న గొట్టాలుగా

కత్తిరించి మనయిష్టంవచ్చిన ఆకారంలోకి మళ్ళించవచ్చు. ఈ గాజు పనిముట్లను యంత్రసహాయంతో అతితేలికగా తయారుచేయవచ్చు. కడుసన్న గాజు ఆరంభంలో చూడడానికి ఎర్రగా మరుగుతున్న చెరకు పానకంలాగా కనబడుతుంది. పనివారలు ఈ కరుగుతున్న గాజు తొట్టిని గిర్రునత్రిప్పి ఒక గొట్టము చివరకి తీగవలె లాగుతారు. ఆ తరువాత దానిని ఊదుకొంటూ వస్తారు. ఇది గట్టిపడే సమయంలో ఇంకా జన్నులాగా మెత్తగా ఉన్నప్పుడే అంచులు నునుపుగా చేయుటకు కత్తిరించి వేస్తారు. అది అప్పటికి గట్టిపడిపోగా దానిని మరల వెచ్చచేసి మెత్తనైన తరువాత తనయిష్టము వచ్చిన ఆకారంగా మెల్లగా అదుముతూ తీసుకువస్తారు.

ఈరీతిగా ఎలెక్ట్రిక్ బల్బులు కూడ తయారుచేస్తారు. కరుగుతున్న గాజులో బంగారం వేస్తే అది ఎరుపురంగుగా మారిపోతుంది. రకరకాల రసాయనిక పదార్థాలను కలిపితే రకరకాల రంగులు వస్తాయి. ఈ రీతిగా గాజుకివేసిన రంగులు కలకాలం వుంటాయి. ఇంకా వార్నీషు పెయింటులు మాదిరిగా వేయవచ్చును గాని ఎక్కువ కాలము నిలవవు.

ద్రవరూపంలో ఉన్న గాజును అచ్చులో పోసి ఆ అచ్చులను ఆవంలో కాలిస్తే అవి రాతికంటె గట్టిగా ఉండే ఇటుకలు లభ్యమవుతాయి. ఈ గాజు ఇటుకలతో ఇళ్ళను పశువుల శాలలను తయారు చేసికోవచ్చు. లోపల ఉండేవారు బయటకు, బయట వారు లోపలికి కనబడకుండా ఈ గాజు ఇటుకలకు ముదురు ఎరుపురంగో, ముదురు ఆకు పచ్చరంగో వేసికోవచ్చు మామూలు ఇటుకలతో కట్టిన ఇళ్ళ కంటె గాజు ఇటుకలతో కట్టినయిళ్ళు ఎంతో సుఖముగా వుంటాయి. ఎందుచేతనన మామూలు ఇటుక గోడల కంటె గాజు ఇటుకలలోనుంచి వేడి చప్పున అటు ఇటూ ప్రసరింపదు. అందుకనే గాజు ఇళ్ళు వేసవి కాలంలో చల్లగాను, శీతాకాలంలో వెచ్చగాను ఉంటాయి.

ఇంకను గాజు అట్లపెనాలు, మంచినీళ్ళ కూజాలు, వడ్డించే సామానులు, పశువులకు, గుఱ్ఱాలకు నీరు త్రాగించే తొట్లు, బొక్కెనలు ఎన్నోరకాల పనిముట్లు నేటి విజ్ఞానయుగంలో చక్కగా తయారగుతున్నవి.

ఇంకను గాజును బట్టలుగా తయారుచేయవచ్చును. సన్నని దారంగా తీయవచ్చును. కరుగుతున్న గాజులో ఒక ఉక్కు పుడకను పడవేసి దానిని వెంటనే లాగితే అది సన్నని దారంగా ఇంకను చిన్న పీచుగా తయారవుతుంది. ఈపీచుకొనని ఒక రాట్నానికి తగిలించి గిర్రునత్రిప్పితే పురిపడి ఒక దారంగా తయారవుతుంది. రాట్నం ఎంతత్వరగా తిరిగిన దారం అంతసన్నగా వస్తుంది. మన వెంట్రుకలో పదో వంతుకంటె సన్నంగా ఉండే గాజు తయారుచేయవచ్చును. ఈ గాజు పీచులను కలిపి సన్నగా, సున్నితంగా ఉండే దారంగా పేనవచ్చును. చూడడానికి ఎంతో అందంగా తళతళలాడుతూ వుండే గాజు వస్త్రాలను తయారుచేయవచ్చు. ఈ గాజు బట్టలను అగ్ని ప్రమాదం ఎక్కువగా వుండే ప్రాంతాలలో సురక్షితంగా వాడుకోవచ్చు.

ఒక అంగుళం దళసరిగా ఉండే గాజు పలకతో కిటికీతలువు చేయిస్తే దానిలో నుంచి మెషిన్ తుపాకి గుండు కూడా లోపలికి జొరబడలేదు. ఇంకను పగలని గాజు రకాలను కనిపెట్టడం కొరకు విజ్ఞాన వేత్తలు

పరిశోధిస్తున్నారు. సుమారు నాలుగు వందలరకాల గాజును తయారుచేసారని శాస్త్రవిజ్ఞానము తెలుపుతున్నది.

పోటుగాయములు

కత్తి, ముండ్లు మొదలగు గఱుకుగానుండు పనిముట్లతో పశువులను పొడుచుటవలన ఈ గాయము లేర్పడుతాయి.

శస్త్రగాయములు

మిక్కిలి పదునుగల పేనాకత్తితో గాని, తదితర పదునుగల ఆయుధములతో గాని చెదరనీయక చీల్చుట (గీచుట, నరకుట) వలనను ఈ గాయములేర్పడుతాయి.

వ్రేటుగాయములు

బుడుపులుగల కఱ్ఱతో కొట్టుట వలనను, పెద్దపులి మొదలగు ఘోర జంతువులు గోళ్ళతో రక్కుట (గ్రుచ్చుట, కొరుకుట) వలనను ఈ గాయము లేర్పడుతాయి.

నలుగుడు గాయములు

పశువులు లోతుగల గోతులలో ఆకస్మికముగా పడుట, దుముకుట, రైళ్ళక్రింద, మోటారు కారులక్రింద పడుటవలన చర్మము క్రింది భాగములు నలుగునట్లు దెబ్బలు తగులుటవలన ఈ గాయములేర్పడుతాయి.

కుంటు గాయములు

తుపాకి, పిస్తోలు మున్నగు ఆయుధములలో గుండు వేసి పశువులను కొట్టుటచే ఈ గాయము లేర్పడుతాయి.

గాయములనుండి రక్తము పోనీయరాదు

గాయము తగిలిన వెంటనే రక్తమును పోనీయకుండ ముఖ్యముగా వైద్యుడు గాని, పశువు యజమాని గాని చూచుచుండాలి. ఈ గాయమునకు వెంటనే తగు చికిత్స ఆలస్యములేకుండ చేయాలి. ఇటువంటి చికిత్సలు నేర్చుకొనుటకు రైతు అతురతపడుటత్యవసరము. రైతు గాని, వైద్యుడు గాని అట్టి చికిత్స చేయక ఆలస్యము చేసినచో రక్తమంతయు స్రవించి గాయము తగిలిన పశువునకు ప్రాణాపాయము గూడ కలుగుతుంది.

రక్తనాళములు

పశువు దేహమునందు శుద్ధరక్తనాళములు, మలిన రక్తనాళములు, సూక్ష్మ రక్త నాళములు మున్నగునవి ఉంటాయి. వీటికి ప్రమాదము వచ్చినపుడు రక్తము స్రవించును. రక్తము యొక్క రంగును అదిస్రవించు విధమును చూచి, అది యెక్కడనుండి కారురక్తమో తెలిసికొనవచ్చు. రక్తమెక్కువగా పోవుచున్నయెడల బలహీనత, ధనుర్వాతము కలిగి మరణం సంభవిస్తుంది. గాయములలో రక్తము పేరుకొని గడ్డకడుతుంది.

నెత్తురు కారకుండ ఆపుటకు ప్రకృతి సిద్ధమైన ఉపాయములలో ఇది ఒకటి. కనుక అట్లు పేరుకొనియుండు రక్తమును ఏ కారణముచేతనైన కదుపరాదు.

శుద్ధరక్తనాళములనుండి రక్తముకారుట

ఈ రక్తనాళములనుండి స్రవించు రక్తము కాంతి గలిగి ఎఱుపురంగుగా వుంటుంది. లోపల నాడులు కొట్టుకొనుట వలన రక్తము కొంచెముఱవడిగా వచ్చుచుండును. ఇట్లు పశువు రక్తనాళములనుండి రక్తము కారుచున్నట్లు తెలిసికొనిన తరువాత వెంటనే చికిత్స చేయుట ప్రారంభించాలి. ఈ నాళములు (ధమనులు) పశువు దేహమునందంతట నుంటాయి. కనుక వాటి స్థలములను బట్టి చికిత్సలు ప్రత్యేకముగానుంటాయి. ధమనులకపాయము గలిగినపుడు మొదట రక్తము ఆపుజేయుటకు బొటన వ్రేలితో నొక్కాలి. ధమనులను ఎక్కడ నొక్కిన రక్తమాగునో తెలిసికోవాలి. ముఖ్యముగా ఈ రక్తనాళములు పశువు దేహములో ఎట్లు వ్యాపించియున్నవో తెలిసికొనుట అత్యవసరము.

రక్తము ప్రవహించు భాగములను పరీక్షించుటకు ముందు వైద్యుడు చేతులను శుభ్రముగా నుండునట్లు చూచుకోవాలి. ఎముకలు విరిగినప్పుడు, వేళ్లు గాజుముక్కలు గాయములతో నున్నప్పుడు మాత్రము పెద్ద శుద్ధరక్తనాళమును పట్కారుతో నొక్కాలి. తల, నొసలు. కంఠము జెబ్బ, పొదుగు, తొడ, నాలుక, చెవి మున్నగు భాగములకు దెబ్బలు తగిలి ఆకస్మికముగా రక్తము స్రవించునపుడు చాల జాగ్రత్తగా చికిత్సలు చేయించాలి. పైన చెప్పిన భాగములకు గాయములు తగలిన యెడల పైకియెత్తి ఉంచాలి. ఇట్లు చేసిన యెడల, ఆ భాగమందలి రక్తం కొంతవరకు తగ్గును. రక్తము స్రవించు భాగమందు వ్రేళ్ళను మోపిగాని, తడిలేకుండ పరిశుభ్రముగానుండు పీచు, దూది, పొడిగుడ్డ మున్నగునవి గాయముపైనుంచి గాని నొక్కాలి. ఇట్లు చేయుటవలన రక్తము ఆగును. అంతకు తగ్గనిచో గాయము ప్రమాదముగా నున్నదని సందేహము వచ్చినయెడల డాక్టరుగారిచే చికిత్సచేయించాలి.

మలిన రక్తనాళముల నుండి రక్తముకారుట

గాయములనుండి రక్తము మలినముగా ప్రవహించుచున్న యెడల సిరలకు గాయము తగిలినదని తెలుసుకోవాలి. వీటిగుండ చెడునెత్తురు తిన్నగా ప్రవహిస్తూ వుంటుంది. ఈ రక్తనాళములు తెగిన భాగములు వాపుజెంది ఉంటాయి. వీటిని గట్టిగా బిగించి కట్లు కట్టాలి.

గాయపు సంధి

ప్రత్యేకముగా సిరలు తెగిన ఆ గాయమునుండి ఆర్ద్రపురుగుతో సమానమగు కాంతిగల రక్తమెక్కువగా కారుచుండును. అట్లు తెగుటవలన వాతము ప్రకోపించి శిరోరోగములు కలుగుతాయి.

స్నాయువులు తెగినయెడల కుంటితనము గలిగి అవయవములు పనిచేయజాలవు. పనులు చేయుటయందు శక్తి కూడ తగ్గును. బాధ ఎక్కువగానుండి చాలా కాలమునకు గాని గాయము మానదు.

కదులునవి, కదలకుండునట్టి సంధులు తెగినచో వాపు తీవ్రముగా నుండి ఎక్కువ బాధ కలిగి బలము క్షీణిస్తుంది. కణుపులు గలిగి వాచును. సంధులు పనిచేయవు.

ఆస్థులు తెగిన ఎడల రాత్రింబవళ్ళు విడువకుండ విపరీతమగు బాధకలుగుట, శాంతి లేకుండుట, అవయవములు కృశించుట, పోటు, వాపు కలుగుతాయి.

సూక్ష్మనాడులనుండి రక్తము కారుట

ఇవి పశుదేహమునందంతటను వలయల్లికలవలె వుంటాయి. ఇవి రేగుదలనొందినప్పుడు రక్తము చిమురుచుంటాయి. వీటిని చేతి బొటన వ్రేలితో నొక్కిన రక్తము కారుట ఆగిపోతుంది.

ముక్కునుండి రక్తము కారుట

పశువు ముక్కు రంధ్రములనుండి అనేక కారణముల వలన రక్తము స్రవించవచ్చు. అట్టి సమయములందు జాగ్రత్తగా పశువును పరీక్షించి వేడిజేయుటవలన వచ్చుచున్నదో లేక దెబ్బ తగిలి వచ్చుచున్నదో విచారించాలి. తదుపరి చికిత్స చేయాలి.

గాయములను గూర్చి ముఖ్యవిషయాలు

1 గాయములు తగిలిన వెంటనే తగు చికిత్స చేయనిచో ఈగల వలన గాయము పెద్దదై చాల ప్రమాదము కలిగిస్తుంది.

2 గాయములందుండు ఇతర పదార్థములను ముఖ్యముగా తొలగించి శుభ్రము చేయాలి.

3. ఈ శస్త్రవైద్యమను గ్రంథములో చెప్పిన లోషన్సు, ఆంగ్ల, ఆయుర్వేద, హోమియోపతి చికిత్సలు చెయాలి.

4. శుద్ధజలముతో గాయములను కడిగి శుభ్రము చేయవలెను.

5. గాయములో బొగ్గుపొడుముగాని, ఆ పొడిలో తదితర చూర్ణములుగాని కలిపి వాడినవెంటనే గారపడుతుంది.

6. గాయములు తగిలినప్పుడు పశువునకు విశ్రాంతినీయవలెను. పనిపాటలు చేయించరాదు.

7. గాయములు చిన్నవైన ఎడల అనగా లోతులేనప్పుడు వాటి అంచులను దగ్గరగా పట్టుకొనజాలిన బంకవంటి పదార్థములను గుడ్డకు పట్టించి గాయముమీద వేయాలి.

8. గాయము లోతుగా తెగియున్నప్పుడు ధనుర్వాతము రాకుండ కాపాడాలి.

పోటుగాయములు

పశువును కత్తితోగాని, తదితరపనిముట్టుతోగాని, చర్మమునందుగాని, కండరములనుగాని, పొడుచుటచే ఆ భాగమంతయు ఆరంభములో రక్తమిళితమైయుండును. అట్టి సమయమునందు ఇదివరకు చెప్పిన

లోషన్సుతో ప్రతిదినము కడుగుచు, గాయములకు వేసే ఔషధములు వేయుచు, కట్లుకట్టాలి. లోతుగా తెగినయెడల అంచులు కుట్టవలసినయెడల మీతాలూకా వెటర్నరీ ఆస్పత్రికి తీసికొనిపోవుటమంచిది. లేక మీఫిర్కా ఆయుర్వేద పశువుల డాక్టరును పిలిపించి చికిత్సచేయించాలి. గాయము చేసిన కత్తి త్రుప్పు పట్టినదో లేక దాని ఆకారమెట్లున్నదో చూడాలి, లేనిచో గాయమును మాన్పుట చాలాకష్టం.

శస్త్రగాయములు

ఈ గాయములు చాల ప్రమాదము గలిగించును. ఎందుచేతనన, చర్మమును కండరములను చీల్చుకొని లోపలికిపోవుటవలన రక్తనాళములు తెగి పశువులకు ప్రాణాపాయము గలుగును కాన ఈగాయములు తగిలిన వెంటనే దుమ్ములేకుండ చూడవలెను. లేనిచో ధనుర్వాతము సోకి చనిపోవును. కాబట్టి జాగ్రత్తగా చూడుము. గాయములోతుగానుండి విస్తరించి చర్మపు కండలు వ్రేలాడుచున్నపుడు అంచులనుకుట్టి ప్రతిదినము చిక్సిత చేయవలెను. మీ తాలూకా పశువుల ఆస్పత్రికి తీసుకొని వెళ్ళుట మంచిది. పశువును తీసుకొని వెళ్ళుటకు వీలులేనియెడల ఈ గ్రంథములోని చికిత్సలు చేయాలి.

వ్రేటుగాయములు


చేతికఱ్ఱలతో కొట్టినపుడు చర్మము పగిలి రక్తముకారును. ఇట్టి సమయములందు అంతగా ప్రమాద–ముండదు. పెద్దపులి మున్నగు జంతువులు కరిచినప్పుడు లోతుగాయములైనయెడల చాల అపాయము కలుగును, గాన ఇట్టి సమయములందు ఏ భాగముపైన కాటువేసినది, ఎంత వరకు ఆ భాగము చెడినది వెంటనే కనుగొని చికిత్స చేయవలెను. అట్లు చేయనియెడల వాతముగ్రమ్మి చనిపోతాయి.

కుంటు గాయములు

ఇదివరకు చెప్పిన గాయములకంటె ఈ కుంటుగాయములు చాల ప్రమాదము కలిగిస్తాయి. ఎందుచేతనన, విషసంబధమైన వస్తువులు శరీరములో ప్రవేసించుటవలన ఆ భాగమంతయు చెడిపోయి క్రుళ్ళుడు పుడుతుంది. కాబట్టి జాగ్రత్తగా పరిశీలించి చికిత్స చేయుట మంచిది. గాయములకు హిలాన్ గాని, కార్నెక్సును గాని వాడాలి.

కట్లు కట్టుట

పశువులకు ఆపత్సమయమున సమీపమందు దొరికిన వస్తువుల నుపయోగములోనికి తెచ్చి కట్లుకట్టవలయును. అట్టి సమయములందు గాయములకు గుడ్డపీలికలు, నూలుబట్టపీలికలు, చేతిరుమాళ్ళు, ఫ్లాల్‌న గుడ్డపీలికలు, నారగుడ్డపీలికలు మొదలగునవి పనికివస్తాయి. కట్లు కట్టుటలో పలురకములుగలవు. ఆయుర్వేద పశువులడాక్టరు కత్తెర, పట్కారు, గుడ్డపీలికలు, తదితర పనిముట్లు మున్నగునవి దగ్గర నుంచుకొనవలెను వీనిని వాడుటకు ముందు పనిముట్లను శుభ్రం చేయాలి. ఇంకను పీచు, దూది, చేతులు తుడుచుకొనుటకు ఒక తుండుగుడ్డ ఉండుటవసరం.



ముఖ్యముగా చేతులు కడుగుకొనకుండ కట్లను విప్పరాదు. గాయములలో గాలి, దుమ్ము, పురుగులు మున్నగునవి దూరి బాధ కలిగింపకుండ కట్లు గాయములను సంరక్షిస్తాయి. గాయములలో నుండి రక్తము కారునప్పుడు దానిని నొక్కి అదిమిపట్టినగాని రక్తప్రవాహమాగదు. అట్టి సమయములో గాయము చుట్టును గుడ్డను చుట్టి గాయమును నొక్కిరక్తము ఆపుజేయవచ్చును. కట్లు కండరములకు శ్రమనీయకుండ ఉంటాయి. గాయముపైన కట్టుకట్టి అంతటను వ్యాపించునట్లును, గాలి గాయములకు సోకకుండునట్లును సమానముగా కట్టాలి. కట్లకు చలువగుడ్డగాని, కోరాగుడ్డను గాని ఉపయోగించుట మంచిది. ఆ గుడ్డలను మందునీటిలో నానవేసి ఆరబెట్టి అంచులు చించాలి. ఈ కట్టుగుడ్డలయొక్క పొడవు వెడల్పు గాయములకు తగినంతగా చింపి వాడుకోవాలి. కట్టుమడతలు ముడతలు పడకుండ చక్కగా కట్టాలి. అపాయ అవయవములు కదలినయెడల బద్దలుచేర్చి కట్టాలి. అందువలన అపాయపు అవయవములను కదలనీయవు. ఆ గాయములు సంభవించినప్పుడు అన్ని భాగములకు కట్లు కట్టుటకు వీలుండదు. కాబట్టి ఉపాయముతో కట్టాలి.

గాయముపైనున్న కట్లు అంటుకొని ఉన్నచో రావిచెక్క, తుమ్మచెక్క మున్నగు వగరు వేడినీటితో గాని, తదితర లోషన్సుతో కాని తడిపి, నెమ్మదిగా తీసి దూరముగా పారవేయాలి. లేనిచో పశువు ఆ కసిగుడ్డలను తింటుంది. తరువాత చీము నెత్తురు రసియున్న ఎడల శుభ్రముచేసి తరువాత మందువేయాలి. దుర్మాంసము పెరిగిన ఎడల మైలతుత్తపు ముక్కతో ఆ దుర్మాంసమంతయు పోవువరకు తాకుతూవుండాలి. ముఖ్యముగా గాయములకు గాలి నెంతమాత్రము సోకనీయరాదు. ఎంతచిన్న గాయమైనను నిర్లక్ష్యముచేసినదో ధనుర్వాతము వచ్చుటకు సూచనలేమైన నున్నవో, ఏ ఏ గాయమునకు ఏ ఏ సూదితోకుట్టిన సరిపోవునో మున్నగు విషయములన్నియు పరిశీలించి తదుపరి కుట్టాలి. గాయము చాలవెడల్పుగ లోతుగ పొడవుగా నుండినయెడల దూదినిగాని పీచుగాని లోపలదూర్చి అంచులను కుట్టాలి. కుట్టుదారమునకు నరములు సిల్కుదారములు, గట్టి నూలుదారములు ఉపయోగించాలి. లేనిచో తెగిపోతుంది. దారములు వస్త్రపనిముట్లు కావలసిన ఇంగ్లీషు మందుల షాపులలో దొరకుతాయి. కుట్లు కుట్టవలసినపుడు వెటర్నరీ డాక్టర్లకుగాని, ఆయుర్వేద పశువైద్యాచ్యారులకుగాని చూపించుట మంచిది.

కుట్టుసూదుల పరిమాణము

కుట్టుటలో జడలుఅల్లి నట్లుగాగాని, పైకి క్రిందకు కట్లు దింపునట్లుగాగాని చినిగినగుడ్డను నేతగాండ్రు కుట్టినట్లుగా గాని, తిన్నని ముడికలుగునట్లుగాగాని ఏరీతిగాకుట్టిన బాగుండునో ఆ రీతిగాచేయాలి.

స్వల్పమాంసముగల ప్రదేశము, సంధులు వీటియందు కుట్టునట్టి సూది గుండ్రముగా నుండి పొడవుగానుండాలి. పొడవుగాను ముక్కోణముగానుండు సూదిని ఎక్కువమాంసముగల ప్రదేశమునందు కుట్టుటకు పనికివస్తుంది.

మర్మస్థానములు, అండకోశములు, కడుపు వీని భాగములందు కట్టుటకు విల్లువలె వంగియుండుసూదుల నుపయోగించాలి. ఈ మూడు రకముల సూదులయొక్క కొనలు పదునుగలవిగా, పట్టుకొనుటకు వీలుగనుండునట్లుండి మాలతీపుష్పముల తొడిమకొనలవలె గుండ్రముగా వుండాలి.

గాయములను కుట్టునపుడు సూదులను మిక్కిలి దూరముగగాని, దగ్గరగాగాని గ్రుచ్చరాదు. దూరముగాకుట్టిన ఎక్కువబాధగలిగి కుట్లు కూడ తెగిపోతాయి.

నలుగుడు గాయములు

ఈ గాయములు కలిగినప్పుడు చర్మము పైభాగమునకు భంగము కలుగును కాని లోపలనుండు రక్తనాళములు చితికి బాగుగా నలిగిన ప్రదేశము నల్లబడుతుంది. రెండు మూడు దినములైన తరువాత చుట్టు నుండు చర్మము పసుపురంగుగా ఎరుపురంగుగా నలుపురంగుగా మారుతుంది. నలిగినచోటనుండు రక్తము అటునిటూ చెదురుతుంది, అందువలన వాచుట, నల్లబడుట తటస్థించుతుంది. అవయవములు ఎక్కువగా నలిగినయెడల ఆ యా భాగములను వేడినీటిలో గుడ్డముంచి పిడిచి కాచుటమంచిది. దెబ్బలు తగిలిన గాయములు, శస్త్రచికిత్స చేసిన గాయములు కొంతకాలమువరకు మానవు. ఈ గాయములు కొంచెముగనో, ఎక్కువగనో వాపుగలిగియుంటాయి. ఈ వాపులకు వేడినీటి కాపులు వేయాలి, లేదా అవిసెగింజల పిండియైన కట్టవలెను.

గాయములకు చికిత్స

సామాన్యముగా అన్ని గాయములకు గట్టిగా కట్టుకట్టినయెడల రక్తముస్రవించుట ఆగుతుంది. గాయములవద్ద వెంట్రుకలు కత్తిరించిన ఎడల త్వరగామానును. గాయములకు వెంటనే చికిత్స చేయనియెడల ఈగలు మొదలగునవి వ్రాలును. అందువలన ఈపి పట్టును. ఈ ఈపి వెంటనే పురుగులగును. గాయములందు పురుగులు పడినచో అచ్చటి మాంసము నివి తినుటచే గాయములు త్వరగామానవు. కాబట్టి పురుగులు పడినయెడల ఈ చింతామణిలో చూపించిన పట్కారుతో గాని శ్రావణముతోగాని తీసివేయాలి. లేక చేతి చూపుడువ్రేలును గాయములలోపలకు పోనిచ్చి పురుగులన్నిటిని తీసి తదుపరి పుండ్లకు వాడు మందులను వాడవలెను.

ఆయుర్వేద చికిత్స

మంచినూనె 15 తులములు, వేపనూనె 8 తులములు, గాడిద గడపాకు పసరు అర్ధసేరునవటాకు, సీమగుగ్గిలము 4 తులములు, ముర్దారు సింగు 2 తులములు, ఏకవుల్లిపాయలు అర్ధశేరునవటాకు తెచ్చి ఈ మూడువస్తువులునూరి పైవానిలోకలిపి కాచి గాయములకు పట్టించాలి. ముందు గాయమును తుమ్మచెక్క, రావిచెక్క లేక చింతాకు వేపాకు వేసి కాచిననీటితో కడిగి తరువాత మందులనుపయోగించాలి.

లేక కుప్పింట చెట్టు సమూల చూర్ణముతో తగినంత విభూతి కలిపివేసిన గాయములు మానును.

లేక నలిగిన గాయములకు నరమూత్రము వాడిన పనిచేస్తుంది.

లేక మునగాకు, వస నూరి ఉడికించి వేసిన తగ్గుతుంది.

హిలాన్ లేక కార్నెక్సునుగాని వాడాలి.

గాయములు కడుగు లోషన్సు

ఫినాయిల్ 1 భాగము, నీరు 100 భాగములు.

లేక కార్బాలిక్ ఆసిడ్ 2 గ్రాములు, వేడినీరు సేరు.

లేక పొటాషియం పర్మాంగనేట్ 10 గ్రెయిన్సు, నీరు 2 సేర్లు.

లేక అల్లం 1 తులం, నీరు 2 సేర్లు.

పైన చెప్పిన లోషన్సు తయారుచేసి సీసాలోనుంచి బిరడాలు పెట్టి అవసరమున్నప్పుడు ఉపయోగించాలి. రావిచెక్క, తుమ్మచెక్క నీటిలో నానవేసి కాచి ఉపయోగించవచ్చు. అవుసరమున్నపుడు మాత్రమే తయారుచేసుకోవాలి, నిలువయున్న చెడుతుంది.

తైలములు, మలాములు, చూర్ణములు

పుండ్లకు, గాయములకు అప్పుడప్పుడు టింక్చర్ అయోడీన్ వాడిన తగ్గుతాయి.

కార్బాలిక్ ఆసిడ్ 1/8 అవున్సు, వ్యాసులైను 8 అవున్సులు కలిపి అన్ని గాయములకు పట్టించాలి.

లేక బోరిక్‌ఆసిడ్ 1 భాగము, జింకు ఆక్సైడు 1/4 భాగము, ఓలియంపేసెస్ 1/8 భాగము, క్రియోసోట్ 1/8 భాగము, కొబ్బరి నూనె 8 భాగములు కలిపి తయారుచేసిన అన్నిగాయములకు పుండ్లకు పనిచేస్తుంది.

లేక టర్పెంటైన్ 1 భాగము, మంచినూనె 4 భాగములు కలిపి వాడవచ్చు.


పుండ్లను, గాయములను శుభ్రముచేయుటకు హైడ్రొజన్ పెరాక్సైడ్‌ను ఉపయోగించిన మురికిని తీసివేస్తుంది. పుండ్లకు చెర్చారి, వెటర్నరీ ప్లాష్టరును వాడాలి.

శస్త్రపనిముట్లు


ఈ చింతామణిలో చెప్పిన రోగములకు సమర్థతగల అనుభవ పశువైద్యులు ఈ దిగువ శస్త్రపనిముట్లను జాగ్రత్తగా ఉపయోగించుదురుగాక.

కరర్తీ యంత్రము

వ్రణములలోని మాంసమును తీయుటకు, పురుగులను తీయుటకు, తెగిన సిరలను నొక్కుటకు, శస్త్రముచేసినపుడు రక్తము నాపుటకు, చర్మపుపొరలను ఒత్తిగించుటకు ఈ యంత్రము నుపయోగించాలి.




వ్రణశస్త్ర పరికరముల తోలుపెట్టె




పశువైద్యాచార్యులు, అనుభవ పశువైద్యులు ఈ పెట్టెలోని పనిముట్లను వాడాలి.

ఛేదన శస్త్రములు




గిట్టల అడుగుభాగమున మట్టి, రాళ్లు, వేళ్లు వగైరాలు జేరి పశువు బాధపడునపుడు వాడాలి.




కంతులను, వ్రణములను తదితరభాగములను కోయుటకు, చీల్చుటకు వీటిని వాడాలి.

కరపత్ర శస్త్రము




దీనితో కొమ్ములు విరిగి పేడులు లేచినపుడు ఎముకలు, తదితర గట్టిభాగములను ఛేదించుటకు వాడాలి.

దంతాకర్షణ యంత్రములు



దంతములు, పండ్లు కదలునపుడు, విరిగినపుడు పీకుటకు ఉపయోగించాలి.

దంతలేఖన శస్త్రములు



దంతములు పెరిగినపుడు అరగదీయుటకు, పండ్లపైనుండు పాచి వగైరా తీయుటకు వాడాలి.

* * *

ఇరువదితొమ్మిదవ భాగము

వ్రణములు - కణుతులు

వ్రణములు, పుండ్లు, కంతులు పలురకములుగా వివిధములైన పరిమాణములు కలవిగా వుంటాయి. కాని అన్నిటి చికిత్సయందు గమనింపవలసిన విషయముమాత్రము ఒకటే. అదేదన వ్రణమునుగాని, పుండునుగాని, కంతినిగాని ఈగలు వగైరా వ్రాలకుండ శుభ్రముగా నుంచుటయే. పుండ్లను, గాయములను లోషనునీటితో కడిగి తీసివేయవలసిన విషపదార్థములను చూచి తీసివేయాలి. వ్రణముగాని, కంతిగాని గర్భప్రదేశమునందుగాని, శరీరభాగమునందెచ్చటనైనాగాని లేచిన పక్వమునకువచ్చు ఏ పిండికట్టులో, ఏ పొక్కుమందులో వేసినతరువాత మెత్తబడిన నెమ్మదిగా దానిని చీల్చుటవసరము. సగంరక్తము, సగంచీముతో నున్నపుడుగాని, వ్రణమంతామెత్తబడి రక్తముతో నున్నపుడు గాని శస్త్రముచేయరాదు. అట్లుచేసిన వ్రణము ఎడకట్టి పుండుమానదుగాన జాగ్రత్తగా వ్రణముగాని, కంతిగాని ఎంతమాత్రము కఠినత్వములేక మెత్తగా నున్నపుడు ఒక సూదిని కంతిలోనికి గ్రుచ్చి చూచిన చీమున్నదీ, రక్తమున్నదీ, రసియున్నది తెలిసికొనాలి. తరువాత తగిన చికిత్స చేయాలి. ఇటువంటి చికిత్సలు చేయవలసినపుడు శస్త్రచికిత్సలో ప్రాథమిక పశువైద్యులతో చేయుంచుటమంచిది.

దుర్గంధగాయాలు

ఇదివరకు చెప్పిన గాయములకు తగిన చికిత్సలు చేయకపోవుటచే సూక్ష్మజీవులు ప్రవేశించును. పుండ్లుపడును. ఈ పుండ్లను జాగ్రత్తగా కాపాడవలయును. ఇంకను ఈగలు దోమలు మొదలగునవి పుండ్లమీద వ్రాలి గ్రుడ్లుపెట్టును. గాలి సోకుటవలన ఆ గ్రుడ్లునుండి తెల్లని దారములవంటి పురుగులు బయలుదేరును. గాయములో పురుగులు పడిన పశువు పనిచేయుటకు పనికిరాదు. కాబట్టి ప్రతిరైతు తగిన శ్రద్ధతీసుకోవలయును. అచ్చట మాంసము క్రుళ్ళి ఆ భాగమంతయు వాచి అపాయము కలుగును. దుర్వాయువులు చేరుటచే చెడు ఆహారములను మేపుటచే, అతివేడి యుండుటచే, ధాతుశక్తి తగినంత లేకపోవుటచే కురుపులు, గడ్డలు మొదలగునవి ఏర్పడును. ఇంకను దేహమునందెచ్చటనైనను కలుగవచ్చును. ఎఱుపువర్ణముగలవి త్వరగా మానును. ఇవి పశువు శరీరముమీద వ్యాపించినతోడనే తగిన శ్రద్ధ తీసికొనకపోయినచో శరీరమంతయు వ్యాపించును. దేహసౌఖ్యము చెడిపోవును. ఆ ప్రదేశమందలి మాంసము క్రుళ్ళిపోవనారంభించును. మరికొన్ని కురుపులు క్రమముగా పెద్దవిగా ఏర్పడి మిక్కిలి ఎఱ్ఱగానుండి రసికారుచుండును. ఈ రసి కొన్నిటికి దుర్వాసన గలిగియుండుటయు, మరికొన్నిటికి లేకుండుటయు గలదు. బలహీనములగు పశువులకివి తరచుగా లేచి బాధపెట్టుచుండును. సామాన్యముగా కురుపులన్నియు ఒంటరిగాగాని అనేకములుగాగాని లేచుటయు కలదు. ఇవి బటానిగింజంత పరిమాణము మొదలు కోడిగ్రుడ్డు ఆకారమువరకును అంతకంటె అధికముగాగూడ నుండవచ్చును. కొన్ని చీము, రక్తము చేరకయే అంతరించి పోవును.

వ్రణములు – గాయములు నిర్ధారణ

పలువిధములగు తృణములు, కట్టెలు, రాళ్ళు, ధూళి, ఇనుపమేకులు మట్టిగడ్డలు, ఎముకలు, రాళ్ళు, గోళ్ళు, ఎముకలు చీము వగైరా వ్రణములునుండి తీయుటయు, గర్భమనెడి శల్యమును బయటికితీయుటయు, యంత్ర, శస్త్ర, క్షార, అగ్నులనుపయోగించుటయు, వ్రణముల నిర్ధారణ జేయుటయు ప్రయోజనముగానుండు దానికి శల్యతంత్ర లక్షణమందురు.

శరీరభాగమునందు ఏ ఆవములో పోటు, స్పర్శతెలియకుండుట, భారముగా నుండుట, మాటిమాటికి కదలించుట, స్రవించుట, పోటు ఎక్కువగానుండుట, లక్షణములున్న అచ్చటచ్చట శల్యములు (పైవస్తువులు)–న్నవని గ్రహించాలి.

ఎముక సంబంధమగు వస్తువులు శరీరములోనున్న వెలుపలికితీసిన రెండుమూడు ముక్కలగును. ఇంకను అవి జీర్ణంచును. కొమ్ము, ఇనుము సంబంధమగు శల్యములున్న జీర్ణించక వంకరతిరిగి చీముపట్టి కంతిగానగును. ఇత్తడిసీసము మున్నగునవి తీసివేయక శరీరములోనున్న పిత్తాగ్నులచే కరగిపోవును. కర్ర, వెదురు, తృణములు మున్నగునవి శరీరములో నున్న చీముపట్టి పగిలి బయటకువచ్చును.

గాయములో చీమున్నపుడు త్వరగా మాన్పరాదు

కంతినిగాని, వ్రణమునుగాని శస్త్రముచేసిన తరువాత గాయములో చీమున్నపుడు తొందరపడి గాయమును మాన్పక ఆ గాయము స్వల్పమగు అపచారమువలన లోపల గడ్డగకట్టి మరలబాధించును. గాయమును చీల్చినతరువాత చీముసరిగా కారనిచో తన స్వంతబుద్ధితో విశాలమనస్సుతో ఆలోచించాలి. ఏ భాగమునందు చీముకారుచున్నదో, ఎచ్చటెచ్చటనొక్కిన గుంటలుపడునో అచ్చటనుంచి చీమును తీయుటకు మరియొకరంధ్రము చేయాలి.

పిండికట్లు

పశువులకు కలుగు అనేక రోగములకు పిండికట్లు కట్టుదురు. ఇవి కట్టుటవలన మెత్తబడు స్వభావముండును. పశువులకు కలుగువాపులు నెత్తురుగడ్డలు, గూటిగడ్డలు మొదలగువానికి పిండికట్లు కట్టినచో నొప్పి తగ్గి త్వరలో కురుపుతేలును. జొన్నపిండి, వరిపిండి, అవిసెగింజలపిండి గోధుమతవుడు మున్నగువానితో వేడినీళ్ళుజేర్చి పిసికి ముద్దగాచేర్చి పలుచనిగుడ్డలోవేసి కట్టుటమంచిది. దుర్వాసన వేయుకురుపులకు గాయములకు మసిబొగ్గుపొడి పిండి కలిపి కట్టుటమంచిది. పశువు సహించగలిగినంత వేడిగానుండు పిండిని వాపులమీద వేసి పైన ఆకుగాని, దళసరియగు కాగితమును గాని పెట్టి కంబళిగుడ్డతో కదలకుండునట్లు గట్టిగా కట్టాలి. ప్రతిమూడు నాలుగు గంటలకు తీసివేసి క్రొత్తకట్టు సిద్ధమగువరకు పాతకట్టు విప్పరాదు. పశువుయొక్క బాధనుబట్టి కట్టుబిగించాలి. అవిసెగింజలు నూరి ఉడికించి కట్టాలి. వాపు హరించును, గడ్డను మెత్తపరచును. గట్టిగానుండు వ్రణములకు రసోత్తమను వాడాలి.

వత్తులెక్కించుట

పశువులకు గలుగు వ్రణములు, గడ్డలు, కంతులు మొదలగునవి పగిలి నెమ్మదించకపోయినచో ఈ వత్తులను ఎక్కించుదురు. ఇటువంటి పనులు అనుభవముగలవారిచే చేయించుట మంచిది. బద్దపాటుగల సూదితో పశువుల గాయములలో దూర్చబడెడి నునుపైన గుడ్డపీలికలు దారములు మొదలగువానిని వత్తులందురు. ఈ వత్తులెక్కించుట సులభమైనపని సూదిరంధ్రముగాని గుడ్డపీలిక దారమువలె చేసిగాని యుపయోగించుకొనవలయును. తరువాత చర్మమును కత్తితోచీల్చి ఆ గాయము ద్వారా ఎంతదూరము వత్తి పోవలయునో అంతవరకు సూదిని ఎక్కించి ఆ కొనయందుగూడ చర్మమును చీల్చి సూదినిలాగ దారమును అచ్చట నెమ్మదిగా నిలపాలి. ఆ దారపుకొనలకు జీలుగబెండు కట్టాలి. లేదా ప్రత్యేకముగా ముడులు వేయాలి. వత్తులు ఎక్కించుటకు ముందు కోతమందును రాచుట మంచిది. ఆ కోతమందులు పొక్కుమందులు, ఎంతపనిచేయునో ఈ వత్తులెక్కించుటవలనకూడ అంత ప్రయోజనముంటుంది. ప్రతిదినము వత్తి నెమ్మదిగా క్రిందికి జారదీసి పుండును శుభ్రముగా పై చెప్పిన లోషన్సుతో కడిగి మరల ఆ వత్తి నెక్కించుచుండాలి. అగత్యమైన యెడల క్రొత్తవత్తి నెక్కింపవచ్చు. ఇటువంటిపనులు వ్రణచికిత్సయందు అనుభవముగల వారిచే చేయించాలి. గాజుగుడ్డను గాడిదగడపాకు పసరులో తడిపి ఎండించి వత్తులెక్కించుట మంచిది.

కణుతులు

పశువు శరీరమున ఏ భాగమందైనను వాపు కలుగుతుంది. ఈ వాపుపొంగి మెత్తగాగాని, గట్టిగ రాయివలె గాని ఉంటుంది దీనినే కంతియంటారు. ఇది పశువులకు దెబ్బతగులుట వలనగాని, గాలిసోకుట వలనగాని, బలహీనము వలనగాని, పిల్లి పెసర మున్నగు వాతవస్తువులు మేపుటవలనగాని, చిరుకప్పలు ఎక్కువగానుండు చెరువులలోని, గుంటలలోని నీరు ఎక్కువగా త్రాగుటవలనగాని పుడుతుంది.

కంతియొక్క అడుగుభాగపు చర్మముక్రింద మాంసము మందగించి క్రమముగా వాచియుంటుంది. ఈ కాయలు పొట్టలువడి బురబురలాడుచు నీరుండునట్లు కనబడినయెడల మెత్తని కంతియనియు, వ్రేలితో ఆ కాయపై నొక్కినయెడల అణగక బిరుసుగా నున్నపుడు గట్టికంతి యనియు తెలిసికోవాలి.

ఈ కణుతులు ముఖ్యముగా పశువుల మెడమీదను, ప్రక్కలను, అఱ్ఱుమీదను, జెబ్బమీదను మూత్రకోశ భాగములందును లేస్తాయి. జెబ్బలమీదను, గూళ్ళమీదనులేచు కంతులు త్వరగా మానవు, పశువును చాల బాధిస్తాయి. కంతి పుట్టగనే రైతులు దానిమీద కాలుస్తారు. ఇది చాల పొరపాటు. ఎందుచేతనన అచ్చటి మాంసమంతయు వేడివలన గడ్డకట్టి ఎన్ని మందులు వేసినను మానదు. ఇంకను అచ్చటి రక్తనాళములుకూడ చెడిపోతాయి. మెత్తని కంతులను శస్త్రము జేసినయెడల త్వరగా నెమ్మదిస్తాయి.


పరీక్ష

ఏ కణితి ఏ కారణమువలన పుట్టినదో, కాలుటవలన తగ్గునా? లేక ఏమైనా పొక్కుమందులువేసిన తగ్గునా? లేక శస్త్రముచేసిన తగ్గునా? లేక ఏమయిన పసరులు పట్టీలు వేసిన తగ్గునా మున్నగునవి

విచారించి చికిత్సచేయాలి. కొన్ని పశువుల దొడ్లలో అన్ని పశువులకు ఒకేసారి శరీరముపైన కణుతులు పుట్టుచుండును. ఇట్టి సమయములందు జాగ్రత్తగా పరీక్షించాలి. చెడునీటిని త్రాగుటవలననా? లేక వరుసగా ఆ దొడ్డిలోనున్న పశువులన్నియు పిల్లిపెసర మున్నగునవి మిక్కుటముగా తినుటవలన రక్తము చెడివచ్చినవా అని తెలుసుకోవాలి. తరువాత చికిత్సలు చేసికొనవచ్చు. నొసటిమీద పుట్టిన కంతి వలన పశువు మరణిస్తుంది.

అఱ్ఱు కణుతులు

కణతికి ఆరంభములో పశువు మెడమీద గీచుకొనినట్లుగా వుంటుంది. కాడిరాపిడివలన దుమ్ము చర్మములోనికిపోయి కంతిపుడుతుంది. కనుక పశువుల మూపుమీద గాయమునకు తాకకుండునట్లు



కాడిని రెండు ప్రక్కల సమానముగా నుండునట్లు కట్టాలి. ఒకవైపున బరువు తక్కువగ మరియొకవైపున బరువు ఎక్కువగ నుంచరాదు. కాడికి మన్ను మొదలగు పదార్థములేమియు లేకుండ శుభ్రముగానుంచాలి. ఎద్దుమూపురము మీదకూడ మలినముండరాదు. ఇట్లుంచినయెడల కంతులు పుడుతుంటాయి. కంతిపుట్టిన పశువుచే ఎట్టిపనిని చేయించక వానికి పూర్తిగ విశ్రాంతినీయాలి. గాయము పూర్తిగా మానువరకు పనిచేయింపరాదు. లేదా కాడికట్టవలసిన అవుసరము లేని పని ఏదయిన అనగా కుప్పనూర్పులు మొదలగు పనులలో పెట్టాలి. కాడి మెడమీద వున్నంతకాలము పుండ్లు పుడుతుంటాయి. ఈ కణతులు ముదిరిన ఎడల చాలప్రమాదము కలిగిస్తాయి. తుదకు కంతియంతయుమాదగా నవుతుంది. అప్పుడు శస్త్రముచేసినను లాభములేదు కాబట్టి అఱ్ఱుకణుతులను జాగ్రత్తగా చూస్తూ ఉండాలి.

గంటిఅఱ్ఱు

గిత్తలకు కొత్తగా కాడివేసి పనిచేయించునపుడు దిగువపటములో నున్నరీతిగా అర్రుమీద కణతిపుట్టి రేగుతూవుంటుంది. వెంటనే శస్త్రము చేయించుటమంచిది.

మెడమీద కాడినిల్పు ప్రదేశమున మంట, నొప్పితో గూడిన దద్దుర్లవలన అక్కడనుండు వెంట్రుకలు రాలిపోవుటవలన ఈ జబ్బు ప్రారంభమైనదని తెలిసికోవాలి. అప్పుడు జంతువుతో పనిచేయింపరాదు.



పుండుపడిన పిమ్మట పశువుతో పనిచేయించినయెడల ఆపుండువాచి ఎక్కువ బాధపడుతుంది. క్రొత్తగా పుట్టిన దూడలకు ఈ కణుతు లెక్కువగా పుడుతుంటాయి. కొన్నిటికి కణతిపుట్టకుండానే అర్రుభాగము చర్మమువాచి చిట్లి మంటపుడుతు ఉంటుంది. మరికొన్నిటికి చిన్న చిన్న కాయలవలెపుట్టి కాడితగిలినపుడల్ల పశువు బాధపడుతుంది. సామాన్యముగా గంటిఅఱ్ఱు మానుట కష్టము. శస్త్రము చేయవలసియుంటుంది.

కణుతులకు దారపుకట్టు

చిన్న చిన్న కణుతులు పుట్టినపుడు అనగా వెలగకాయంత, నారింజకాయంత పరిమాణముగా నున్నప్పుడు పట్టు, పురికొస, నూలు మున్నగువానితో చేయబడిన దారములతో ఆ కణతుల మొదటిభాగమునకు గట్టిగా చుట్టిన సునాయాసముగా తగ్గుతుంది. ఇట్లు కట్టినయెడల కణతిలోనుండు రక్తపునాడులుబంధిస్తాయి. అందువలన కణితిపరిమాణము తగ్గి క్రమేపి నెమ్మదిస్తుంది. ఇంకను రక్తనాడులను బంధించుటకును విషపు పురుగులు కఱచిన భాగములచుట్టు కట్టివేయుటకును ఈ దారములు మిగుల లాభకరములు.

చికిత్స

గట్టిగానుండి చాలాకాలము వరకున్న కణుతులను తప్పక తీసివేయవలెను. అట్లుచేయుటకు వీలుకానిచో పొక్కు (కోత) మందులు గాని, పగులురాళ్ళు అంటించిగాని, కారవు (మంట) మందులు రుద్దించుటచేతగాని నెమ్మదికావచ్చు. మరికొందరు కణుతిచుట్టు గట్టిదారము చుట్టి ముడివేసి వదలిపెడతారు. కొన్నాళ్ళకు ఆ కణతితెగిపోవుట కలదు. ఈ కంతులను శస్త్రము చేయవలసినపుడు దాని సమీపముననున్న రక్తనాళముల దగ్గర శస్త్రచికిత్స చేయుటకంటె మరియొకవిధముగా చికిత్స చేయుటమంచిది. కొందరు పశువైద్యులు కణతులను చీల్చి ఎఱ్ఱ కడ్డినికాల్చి లోపలికి జొనుపుతారు. ఇది చాల అపాయము. వెంటనే పశువు చనిపోతుంది. అనుభవముగల వైద్యునిచే శస్త్రముచేయించండి.

కొట్టుపసుపు 1 తు, కస్తూరిపసుపు 2 తు, సబ్బు 1 తు, గంధకము 1 తు, మణిశిల 1 తు, మిరపకాయలు 1 తు, ఆవునెయ్యి పావుశేరు, ఆముదము పావుశేరు, ఆవనూనె పావుశేరు ఈ వస్తువులన్నియు కలిపి మెత్తగానూరి నలగద్రొక్కి ఒక పాతకుండలోబెట్టి వారము దినములవరకు ఎండలోనుంచి తీసి

పశువుల కణుతులకు మూడుదినములు రాసి నాల్గవనాడు వేడినీటితో కడగాలి. ఇట్లుచేసిన కణుతులు కరగిపోతాయి.

లేక కటకరోహిణి 4 తు, కోష్టు 4 తు, వెలిగారము 4 తు, ఆవాలు 16 తు, కొంచెము వెచ్చచేసి మెత్తగా పొడిచేసి జొన్నపిండితో కలిపి నాలుగు దినములు కట్టిన ఎడల పక్వమునకు రాగలవు.

లేక గంగసింధూరము 1 తు, రససింధూరము 1 తు, ఇంగిలీకము 1 తు, రసకర్పూరము 1 తు, చిత్రమూలం 1 తు, మైనము 1 తు తెచ్చి పైన వస్తువులకు మైనము కలిపి వుడికించి పాకమునకు రానిచ్చి దింపాలి. పాలస్తీని కణతికి సరిపడు బిళ్ళచేసి వెచ్చబెట్టి తరువాత కణతిమీద వేయాలి. దానిపైన ఒక ఇత్తడిబిళ్ళగాని, తగరపు బిళ్ళగాని వేసి పది దినములవరకు వరుసగా కట్టినయెడల కణతిచక్కగా కరుగుతుంది. లేక ఫార్మసీవారి రసోత్తమనుగాని, వెటర్నరీప్లాష్టరును గాని వాడండి.

రక్తనాళాల మీద కణుతులు

జాడ్యము సాధారణముగా పశుజాతికే కలుగుతుంది. కొన్ని ప్రదేశములందు ఒకేపర్యాయము అనేక పశువులకు కలుగవచ్చు.

ఈ వ్యాధి పశువులందు ఎక్కువ మరణములు కలుగజేయక పోయినప్పటికీ, భీతి నొందవలసి యుంటుంది. ఏలననగా, ఇది అంటుజాడ్యమగుటచేత, మరియు వ్యాధిగ్రస్తమైన పశువులు త్వరలో చిక్కి పనిచేయుటకు పూర్తిగా అశక్తత నొందుటచేత రైతులకును, పశువులను పెంచువారికిని ధననష్టము కలుగజేస్తుంది.

శరీరమందుండు శోషవాహికల (మేధస్సు పారెడు నాళములు) మాంసగ్రంధులు, అందులో ముఖ్యముగా చర్మమునందుండు గ్రంధులే వ్యాధిగతమగునని ఈవ్యాధి పేరువినగనే అర్థమవుతోంది. ఒకప్పుడు ఊపిరితిత్తులుకూడా వ్యాధిగతమవుతాయి. పశువులయందు ఈ వ్యాధి సన్నని పుల్లలవలెనుండు సూక్ష్మజీవులవలన కలుగుతుంది. ఈ సూక్ష్మజీవి భూతఅద్దము క్రింద పరీక్షించుటకు పూర్వము తయారుచేయు అద్దముమీద రెండు కొనలయందు స్పష్టముగా రంగు అంటినట్లు కనపడుతుంది. ఈ సూక్ష్మజీవిని మనుష్యకృతమైన పదార్థమందు సులువుగా వృద్ధిపరచవచ్చు మరియు ద్రవపదార్థమందు ఉంచిన కొద్దిరోజులలో మృదువైన తీగెలు పైభాగమునుండి అడుగునకు పెరుగుచున్నట్లు కనుపిస్తాయి.

ఈ జాడ్య స్వాభావికమైన కణుతులందు మొదటి దశలో చీమునందును, తరువాత అంచులందును ఈ సూక్ష్మజీవి ఉంటుంది. మొట్టమొదట ఈ వ్యాధియందు కనపడు లక్షణమేమనగా పైగా కనపడు ఒకటి లేక అనేక శోషవాహికల గ్రంధులందు బుడుపులు కనబడుట, ముఖ్యముగ డొక్కదగ్గరను భుజమునకు ముందుగాని లేక దేహమునందు తదితర భాగములందుగాని ఈ బుడుపులు కానవస్తాయి. ఈ వ్యాధి గ్రస్తమైన పశువులు అట్టి కాయలున్నను మామూలుగా పనిచేయుటలో ఏవిధమైన బాధగాని, ఇబ్బంది యున్నట్లుగాని కనపరచవు. రెండు మూడు వారములలో ఈ బుడుపులు చాలా పెద్దవై కొన్ని జంతువులలో

బిరుసెక్కి గట్టిపడతాయి. మనము అట్టి గ్రంథులయందుండు కణుతులను ఏమియు చేయకుండ వదిలిన, వాటినినొక్కిన సొట్టపడుటచే వాటియందుండు స్వాభావికమైన పదార్థము చెడి చీముపట్టినదని తెలుస్తుంది. ఈ గ్రంథులుండు స్థలములందు తీవ్రమైన నొప్పితోగూడిన వాపుగాని, శరీరమందు ఏవిధమైన కలతగాని యున్నట్లు కనపడదు. ఐతే భుజముల ముందున్న గ్రంధి మిక్కుటముగా వాచినయెడల వెనుక కాలును, కొద్దిగా కుంటినట్లు కనపడుతుంది. కొన్ని పశువులు దెక్కలు పెరిగి పలుచబడి కుంటుతాయి. వ్యాధి ముదిరినకొలది పశువు క్షీణించి దుర్బలత్వము ఎక్కువగుతుంది. మరికొన్నిటియందు, ఊపిరితిత్తుల యందు కణుతులున్నట్లు ఉచ్ఛ్వాస నిశ్వాసముల మార్పులవలన కనబడుతుంది. మరీ వ్యాధిముదిరినకొలది దగ్గు తెరలుతెరలుగా వచ్చి ఊపిరిపీల్చుట కిబ్బందిగలిగి తుదకు మరణిస్తుంది.

బహు జాగ్రత్తతో ఈ వ్యాధికి కారణము, తదితర సంబంధవిషయములను గురించి చర్చింపగా ఈ వ్యాధి అంటువ్యాపకము. పశువుల మీద ప్రాకి, కుట్టి, రక్తము పీల్చునట్టి పేలద్వారా కలుగునని కనిపెట్టబడింది.

చికిత్స విషయములో చీముపట్టి మెత్తబడి పగులనున్న గ్రంథులను శస్త్రము చేయవలసిన అవసర-ముంటుంది. చీమును తీసివేసి, క్రిమిసంహారముచేయు "క్రిసాల్" లేక "ఫినైల్" కలిపిన మందునీళ్ళతో పుండును శుభ్రపరచి తగిన మందులు వేయాలి.

ఫార్మసివారి పశురక్షామృతము, ప్లాస్టర్‌ను వాడాలి.

* * *

ముప్పదవ భాగము

ఎముకలు విరుగుట - తొలగుట

పశువుయొక్క ఎముకలు దృఢముగానున్నప్పటికి పెళుసుగానున్నప్పటికి అవిబలమైన దెబ్బలు తగులుటచేతను, వాతపుదాణాలు ఎక్కువగా పెట్టుటవలన, క్రింద పడుటచేత, దూకుటచేత, ఎముకలు పింగాణివలె విరుగుతాయి. ఇంకను బయటబలమైన దెబ్బలు తగులుటవలన కండరముల వలన ఎముకలు విరుగుతాయి. ప్రత్యేకంగా ఎముకవిరుగుట తటస్థించినచో విరగినభాగము రెండు ముక్కలుగా నగును. తదితర అవయవాలకు హానియైన గాయమేమైన అయినచో, ఎముకపైకి పొడుచుకొని వచ్చినచోకనుగొనాలి. ఎముక విరుగుటతో గూడా ప్రత్యేకంగా గాయాలుకలసియున్న చర్మమునకు, చర్మము క్రిందఎముక మీదనుండు అవయవములకు గాయముతగిలి బయటనుండి ఎముక విరిగినస్థలమునకు రంధ్రము పడినదేమోచూడాలి. ఎముక విరుగుటయెగాక గాయముకూడ పడిన ఎడల ఎక్కువ అపాయము కలుగును. ఈ రంధ్రముగుండ గాలి, విషమక్రిములు, దుమ్ముచేరి ధనుర్వాతములోనికి గాని, విషజ్వరములోనికిగాని రావచ్చును.

ఎముక విరుగుటతో కూడ పశువు దేహమందలి కొన్ని అవయవములకు హానికలుగును. తలపుర్రె ఎముకలు విరుగునప్పుడు కొన్ని సమయములందు మెదడునకు కొమ్ములకు హానికలుగవచ్చును. ప్రక్కటెముకలు విరుగునపుడు కొన్ని సమయములలో ఊపిరితిత్తులకు హాని కలుగవచ్చును.

కొన్నిటికి ఎముక చిన్న చిన్న తునకలుగా నలిగిపోవుటగాని, విరిగిపోవుటగాని తటస్థించును.

లేతవయస్సుగల దూడలఎముకలు విరుగక చిట్లిగాని, వంగిగాని ఉంటాయి.

ఎముక విరిగినట్లు కనిపెట్టుట

ఎముక విరిగినభాగము బాధ, పోటుగలిగి హానిపొందిన అవయవములు వంకరగనుంటాయి.

దెబ్బతగిలిన భాగము ఉపయోగించుటకు శక్తిలేక ఉంటాయి. ఒకప్పుడు వాచివుంటాయి.

విరిగినభాగము కదల్చుటకుగాని, ఏపనికైన ఉపయోగించుటకుగాని స్వేచ్ఛగా వదలివేయుటకుగాని వీలుండాలి.

ఎముకవిరిగిన భాగమునకున్ను, దేహము ఆవలివైపుననుండు అదేవిధమైన భాగమునకున్ను ఆకారమందు వ్యత్యాసముండును.

ఏ అవయవము విరుగునో దాని ఆకారము కోమలత్వము, అందము మొదలగునవి చెడిపోయి వికృతరూపము కలుగును. అది కుడి భాగమైన ఎడమ భాగముతో ఎడమభాగమైన కుడిభాగముతో సరిపోల్చి చూచి పొట్టి, పొడుగు, లావు, సన్నము మొదలగు భేదములు కనిపెట్టాలి.


సామాన్యముగా చేతితో తట్టవచ్చును. అప్పుడు పశువు చాల బాధపడుచు ముట్టునీయదు.

విరిగిన ఎముకయొక్క గరుకైన మొనలురెండు ఒకటి నొకటి రాచుకొనుటచేత కరకరమను శబ్దము కలుగును. అయితే ప్రథమ చికిత్స చేయువారు ఇట్టి శబ్దమున్నదోలేదో తెలిసికొనుటకై ఎముకలు రాపిడకలిగింప ఎప్పుడు ప్రయత్నించరాదు.

ఎముక విరిగినది లేనిది వాస్తవముగా తెలిసికొనవలసి వున్నయెడల విరిగిన ఎముకయొక్క వాడిమొనలు దానిచుట్టునుండు కండరము లందును, చర్మమందును గ్రుచ్చుకొనకుండునట్లు మిగుల జాగ్రత్తతోను, మెలకువతోను పరీక్షించవలెను. అట్లు గ్రుచ్చుకొనినయెడల ఎముక విరిగియుండు కారణముచేతగూడ ప్రత్యేక గాయములు లేదా దేహమందలి కొన్ని అవయవములకు హానికలుగవచ్చును. ఎముకలను సరిచేసి కట్టుకట్టుటలో నాటువైద్యులలో కొందరు తెలివిగలవారున్నారు.

విరిగిన ఎముకల గాయములకు చికిత్స

విరిగిన ఎముక ఏ ప్రకారము అతుకుకొనునో దానిని ఆరంభములో తెలిసుకోవాలి. విరిగిన కొనలయందు ఎముకతో సంబంధించి ఒక క్రొత్తపదార్థము మొదట మృదువుగా నుండి ఒక నెల లేక రెండు నెలల లోపుగా క్రమక్రమముగా గట్టిపడి ఎముకగా మారిపోవును. ఈ కాలమందు విరిగిన ఎముకయొక్క



మొనలను అవి ఉండవలసినచోట ఉంచి ఏ మాత్రము కదలకుండ కట్టుకట్టినయెడల ఎముక అతుకుకొని పోవును. కాబట్టి ఎముక విరిగిన గాయములకు చికిత్సచేయునపుడు గాయము తగిలినభాగమునకు కొంచెము లాగి విరిగిన కొనలను అవి ఉండవలసిన విధమున ఒకటిగా జేర్చి అవి అతుకుకొనువరకు అవి ఏ మాత్రము విడిపోకుండ చూడవలయును. అవయవములు విరిగిన పశువులను మంచములలో వేసి కట్టి వ్రేలాడదీయరాదు.

పుట్టెఎముక విరుగుట

తలపుట్టె ఎముకలు విరిగినపుడు ఒకచోట విరిగినదీ, ఎక్కువ చోట్ల విరిగినదీ, ఎముకమాత్రమే విరిగినదీ, లేక రక్తనాళములకు భంగము కలిగినదీ మొదలగు సంగతులను చేతితో తాకికనుగొనవచ్చు.

ఈ ఎముక విరిగిన పశువుతో పనిచేయించరాదు. డాక్టరుగారిని పిలిపించి తగిన చికిత్స చేయాలి. డాక్టరుగారు వచ్చులోపల గాయమునుండి వచ్చు రక్తమును ఆపుచేయుటకు ప్రయత్నించాలి. చల్లనినీటిని గాయము మీద పోయాలి.

క్రిందిదౌడ విరుగుట

క్రిందిదౌడ విరిగినప్పుడు పశువునోరు తెరువలేదు. అరవలేదు. రక్తముగాని, చొంగగాని రెండును కలిసిగాని నోటినుండి బయలువెడలుచుండును. పశువు చాల బాధపడును. దీనముగా మనుష్యునివంక చూచుచుండును. పైపుఱ్ఱె ఎముక విరిగిన మాదిరిగనే దీనికికూడా చికిత్స చేయాలి. డాక్టరుగారిని రప్పించి దౌడను యధాస్థానమునకు తెచ్చుటకు ప్రయత్నించాలి. అటు తరువాత కట్టుకట్టి ముడివేయాలి. పశువు గడ్డముయొక్క అడుగునుండి కొమ్ములపైగా ముడివేయాలి. కట్టుగుడ్డపొడవుగానున్న యెడల మరల తలకుకట్టి ముడివేయాలి.

ప్రక్క ఎముకలు విరుగుట

పశువు రొమ్మునకు వెన్నెముకకు మధ్య సాధారణముగా ప్రక్క ఎముకలు విరుగును. పశువులను ఈ ఎముకలమీద దెబ్బలు కొట్టెదరు. అందుచే ఇవి ఎక్కువగా విరుగుచుండును. అట్టివేళలయందు పశువు ఊపిరి పీల్చునపుడు హృదయభాగము బాధగా నుంటుంది. అట్టిసమయమున బాధగా నున్నచో తగుచికిత్స చేయాలి. ఇంకను ఈ ఎముకలు విరుగుటవలన కార్జమునకు ఊపిరితిత్తులకు బాధ కలుగును.

ఎముకలను స్వస్థానములోనికి చేర్చి కట్టాలి. ఇక్కడ కట్టు ఆగుట చాలాకష్టము. కనుక ఎముకలచుట్టు కట్టాలి.

కాలు విరుగుట

పశువు మోకాలు క్రిందిభాగములో ఏదైన విరిగినయెడల మొదట వాపు వస్తుంది. ఎక్కువగా విరిగినయెడల ఎముకలు చర్మమును చీల్చుకొని వెలుపలకు వస్తాయి. ఇటువంటి సమయంలో ఎముకలను స్వస్థానమునకు చేర్చి కట్టుకట్టాలి. పశువులకు తొడయెముకలు విరిగినయెడల కట్టుకట్టుట చాల కష్టము. అచ్చట కట్టునిలువదు. కాన ఇదివరకు చెప్పిన బద్దలు వేసి కట్టుకట్టవలెను.

ఆయుర్వేద చికిత్స

పశువు శరీరములో ఏ భాగము విరిగినను ఈదిగువ చికిత్సలు చేయవచ్చు. విరిగిన వెంటనే చింతగింజల బెరడు రుబ్బి జిగురువచ్చునట్లు వుడకబెట్టి ముతకగుడ్డను పట్టిగా చింపి జిగురు బాగుగా రాచి ముందు విరిగినభాగమును స్వస్థానములో చేర్చి పైన ఆ పట్టిగుడ్డను వేసి నున్నగా చెక్కిన బద్దలనుగాని ఇదివరకు చెప్పిన అట్టముక్కలనుగాని పైనవేసి కట్టినచో త్వరగా ఎముకలు కట్టుబడును. బాధ వాపు తగ్గుతుంది. కట్టు కట్టునప్పుడు బాధనొందు భాగమునకు ఆధారముగను దానిని కదలకుండునట్లు చేయుటకు ఈ కట్టు లుపయోగపడతాయి. ఈ కట్టు 15, 25 దినములవరకు ఉంచాలి. తరువాత కట్టుపైనున్న

బద్దలు తీసివేసినయెడల నొప్పి క్రమముగా తగ్గును. ప్రతివైద్యునితో వెంటవెంటనే కట్టునూడదీయించరాదు. అట్టు తీసిన ఎముక కూడుకొనదు.

విరిగిన ఎముకలను స్వస్థానమునచేర్చి నాలుగైదంగుళముల వెడల్పుగల ముతకగుడ్డకు కుమ్మరిమట్టినిపూసి విరిగినంతవరకు చుట్టవలయును. కట్టు 30 దినములవరకుగాని, అంతకుపైగాగాని ఈ విధముగనేయుంచాలి. పశువునకు మేత ఎక్కువగా వేయరాదు. మఱ్ఱియూడలకొనలు పిడికెడునూరి అర్ధశేరు ఆవుపాలలో కలిపిదినముకు రెండు సారులవంతున వారముదినములు త్రాగించాలి. ఇట్లు చేసినచో ఎముకలు త్వరగా అతుక్కొంటాయి.

కొందరు వైద్యులు పేడ, వెన్నపూస గుడ్డకురాసి కట్టుకట్టెదరు. కాని దీనివలన ఎంతమాత్రము ప్రయోజనములేదు. ఉత్తరేణి ఆకునూరి కట్టుకట్టి పక్షము దినములు వుంచాలి. ఇంకను వెటర్నరీ ప్లాష్టరును గుడ్డకు రాచికట్టాలి.

విరిగిన ఎముకభాగములకు సాధారణచికిత్సలు

ఎముకలు విరిగినప్పుడు గాయమునుండి రక్తము కారుచున్నదీ లేనిది పరీక్షించాలి. ఆ గాయము శుభ్రముగా నున్నదీ, మురికిగానున్నదీ పరీక్షించాలి. రక్తముకారుచుండినయెడల గాయములో వాయువు అందుండు సూక్ష్మజీవులు ప్రవేశింపకుండుటకు గాయములను దూదితోగాని, పీచుతోగాని, కట్టుకట్టాలి. రక్తమునాపుట అవసరమైన ఎడల కట్టును బిగించుటకు టార్నిక్వే నుపయోగించాలి. టార్నిక్వే అనగా జానెడు పొడవుగల చేతికఱ్ఱముక్కలు ఒకదానిని దెచ్చి కట్టునకును చర్మమునకును మధ్య దానికొనలలో నొకదానిని దూర్చి గిరగిర మెలికలు త్రిప్పాలి. అట్టు త్రిప్పినందువలన కట్టుబిగిసి ధమనులకు తగిలిన గాయములుగుండ పారునట్టిరక్తము ఆగిపోవును. ఎముకలు చర్మముక్రిందనుండి కంటికనడపవు. అవి విరిగినట్లు కంటితో చూడలేము కాని కొన్ని గుర్తులవలన ఎముకలు విరిగినట్లు తెలిసికొనవచ్చు. గాయము మురికిగా నున్నయెడల లోషనుతో కడిగి శుభ్రముచేయుట మంచిది. ఇట్లుచేయుటచే సూక్ష్మజీవులు చేరజాలవు. తొడ, మోకాలు, జెబ్బ భాగములందు విరిగిన ఎముకలు కట్టుకొనుట చాలాకష్టముగాన చివరకు రాక్షసవైద్యము చేసినను తగ్గును.

కట్టు బద్దలు

కట్టుకట్టినపుడు బాధనొందిన భాగమునకు ఆధారము కలిగించుటకు దానిని కదలకుండునట్లు చేయుటకు కట్టుబద్దలు ఉపయోగించుచున్నవి. కఱ్ఱబద్దలు లేక సన్ననివి వెదురుచువ్వలు మొదలగువానిని కట్టుబద్దలందురు. ఒకప్పుడివి దొరకనిచో కాగితపు అట్టలు వెదురుబద్దలు తదితర చెట్లయొక్క బద్దలు ఉపయోగించాలి. వీటిని కట్టుతో చేర్చినపుడు ఒత్తుడు విస్తారముగా నుండరాదు. అపాయము కలిగిన భాగము యొక్క కీలు దాటియుండునట్లు వీటినిచేర్చి కట్టుకట్టవలెను. లేనియెడల జాయింటుకీలు తప్పి గాయమునకు కదలికలు గలిగించి బాధను కలుగుజేస్తాయి.

పశువును కదలనీయరాదు. అట్లుకదలుటవలన ఎముకలకు ప్రమాదము సంభవించును. కట్టుబద్దలు రెండంగుళముల వెడల్పుగల ముక్కలుగా చేసి జంతువు అవయవమునకు తగినవిగా నుండాలి. ఎముక విరిగినచోట అరంగుళములనుంచి అంగుళము క్రిందికివచ్చునట్టి పొడుగుగల బద్దలు నునుపుగా చెక్కి చీల్చాలి. బద్దలువేసి కట్టుటకుపూర్వము విరిగిన భాగమునకు గుడ్డలు చుట్టాలి. లేనిచో చర్మముకు చెరుపుగలుగును లేదా బద్దలు చర్మమును చీల్చును. ఒకసారి బద్దలువేసి కట్టిన తరువాత అయిదు ఆరు వారములవరకు కట్టువిప్పరాదు. ఎముక విరిగి పొడుచుకొనివచ్చినపుడు కట్టును ప్రతివారము తీసి మరల క్రొత్తకట్టు కట్టుచుండాలి. లేనిచో అచ్చట చీముపట్టినఎడల కత్తితోచీల్చి ఎముకముక్కలను చీము తీసివేసి దానిని గాయముగానెంచి అందుకు తగిన చికిత్స చేయాలి. పెద్దజంతువుకాళ్ళు విరిగినచో చికిత్సవలన ఎంతమాత్రము ప్రయోజనముండదు.

ఎముకలు సాధారణముగా తొలగుట

కీలువద్ద ఎముకలు అమర్చబడియుండి గూటినుండి అది బయటకు త్రోయబడుటయే ఎముక తొలగుట అంటారు. ఎముక తొలిగిపోయిన భాగము వాచి నొప్పికలుగచేయును. తొలిగిపోయిన భాగము అంద వికారముగ నుంటుంది. కీలువద్ద ఎముకతొలగిపోవునేగాని రెండు కీళ్ళ నడుమనుండు ఎముక తొలగిపోయినచో పశువు నడువజాలక డెక్క చివరనే నేలమీద జారలాగుచు తిరుగుచుండును. ఎముక విరుగుటయు, విరిగిన మొనలు గరుకుగానుండి ఒరసికొనుటయు జరుగుతుంది. కరకరమను శబ్దముండదు. కీళ్లయందు తప్ప తదితరచోటుల చలనముండదు. ఎముక తొలగిపోయిన కీలుకదలక స్థిరముగావుంటుంది.

చికిత్స

స్థానభ్రంశమునొందిన ఎముకను త్రోయాలి. తరువాత దానిపైన మంటమందువేసి పశువును ఒకచోటకదలనీయక ఉంచాలి. తొలగిన ఎముకనులాగి వడగట్టిన పెరుగుసుద్ద, మినపసున్ని, ఆముదపు పప్పు, గుంటకరాకు సమభాగములుగా కలిపి తొలగిన భాగమునకు పూయాలి. పశువును అంతగా మేపరాదు. ఎక్కువగా మేసినచో పశువు జీర్ణకోశములు చెడిపోతాయి. ఇట్టి పశువు నెలనుంచి మూడు మాసములవరకు బాధపడాలి. కొన్ని కుంటివియగును.

అవుసరమున్నపుడు రక్షకూడ వేయాలి. నొప్పితగ్గుటకు తంటెపాకు నూరికట్టాలి. కోడిగ్రుడ్డు తెలుపుసొన 6 తు, తేనె 10 తు, గుల్ల సున్నం 6 తులములు కలిపి తొలిగిన భాగమునకు పట్టువేయాలి.

ఎముకలు గూళ్లనుండి జారుట

ఎముకలు గూళ్ళనుండి తొలగినప్పుడు గూళ్ళయందు బాధయుండి వాపుగనిపిస్తుంది. ఆ భాగమును కదల్చుటకు వీలుండదు. ఆ భాగముమీద బరువు ఆనుటకు వీలుండదు. ఆ భాగముతో ఏవిధమైన పనులను పశువు చేయజాలదు. అట్టి భాగమును మనము చేతితో ఎంత మెల్లగాతాకినను నొప్పికలుగుతుంది. ఆ భాగముయొక్క ఆకారము చెడియుంటుంది. అనగా వంకర తిరుగుటయో, పొట్టిపారుటయో


తటస్థించుతుంది. ఒకప్పుడు ఒళ్ళు బిళ్ళబిగిసి కదలుటకువీలుండదు. ఎముకలు గూళ్ళ నుండి తొలగునని గ్రహించాలి. సాధారణముగా పశువుమోకాలు చీలమండతొడ మలుగులు జబ్బ మొదలగు భాగములయందలి ఎముకలు గూటినుండి తొలగుతుంటాయి. వీటిలో భుజాస్థియొక్క తలపెద్దదిగాను అది ప్రవేశించు గూడు చిన్నదిగా నుండుటనుబట్టి తరచుగా గూటినుండి తొలగుతుంటుంది. ఇట్టి బాధలు పై వాటికి తరచుగా కలుగుతుంటాయి. ఎముకలు గూటినుండి తొలగినవో లేక అసలే విరిగినవో తెలిసికొనుట కష్టము. కాబట్టి డాక్టరుగారికి గాని మిక్కిలి అనుభవముగల మీ గ్రామ పశువైద్యునకు గాని చూపించాలి.

జెబ్బ కుడక జారుట

దీనినే ఇండె జారుటంటారు. పల్లెలయందుండు పశువులకీ ప్రమాదము సామాన్యముగా తటస్థిస్తుంది. ఎత్తుస్థలములనుండి పల్లమునకు దూకుటవలన తప్పుటడుగు వేయుటవలన, కాలుజారుటవలన ఇవి తటస్థించుతాయి. కుడకజారిన కాలుపైన భారమేమియు మోపజాలదు. కనుక మూడుకాళ్ళతో నడుస్తుంది. జారినట్టికీలును పట్టిచూచిన ఎడల ఎముకయొక్క చివరభాగము మామూలు స్థలమునుంచి వెలుపలికి వచ్చి చేతికి గట్టిగా తగిలిగుంటపడుతుంది. ఈస్థితి వెంటనే తెలుసుకొని కీలు సరిచేసినచో నట్టియవయవము బాగుపడుటకెక్కువ అవకాశము కలదు. లేనియెడల మంచి ప్రక్కను పడద్రోసి జబ్బుకాలునకు చినమలుగునకును మీదుగా త్రాడుగట్టి ఒకడు దానిని ముందుకు నెమ్మదిగా బలముతో లాగుచుండగా పైకివచ్చిన ఎముక కొనను సాధకుడు తన అరచేతితో మామూలుస్థలములోనికి త్రోయుటకు ప్రయత్నించాలి. ఇట్లు త్రోసినటక్కుమని ఎముక లోనికిపోతుంది. పిమ్మట కుంటుచిహ్నములు పోయేవరకు జంతువును నెమ్మదిగనుంచాలి. ఈ మాదిరిగనే పశువుల కాలు విరిగినప్పుడుకూడ స్వస్థానమునకు చేర్చి కట్టుకట్టాలి. జెబ్బ ఎముక జారినపుడు 24 గంటలలో త్రోసికట్టనిచో రక్తముగడ్డకట్టి కాలురాదుగాన వెంటనే చక్రాకారముగా రక్షవేయాలి.

కాలు రెల్లపోవుట

బండి ఎద్దులను సవారి బండ్లనుకట్టి వివాహములకు తదితర గ్రామాదులకు వెళ్లునప్పుడు స్వారి చేయించునపుడు రాతిరోడ్లమీద ఎక్కువగా స్వారి చేయంచునపుడు కాలిగుత్తి మెలిక పడినప్పుడు ఈ ప్రమాదము సంభవిస్తుంది. పశువుపరుగెత్తునప్పుడు నాలుగు పాదములను ఒకేసారి భూమిని విడుచును. ప్రతిఅడుగునందును, కాలు డెక్కలు మాత్రమే భూమిని తాకుచున్నవి. మరియు ప్రతి అడుగునకు పిమ్మట మోకాళ్ళుతిన్నగా నుండవు. పరుగెత్తుటలో వెనుకపాదములు భూమిని విడచునపుడు అకస్మాత్తుగా మోకాళ్ళు తిన్ననగుచున్నవి. చీలమండల కీలు సాగి బలముతో కాలిడెక్కలగుండా త్రోపుడునిచ్చి దేహమును పైకి ముందుకు తోయుచున్నది.పాదములయొక్క గిట్టలు భూమిమీదపడతాయి. అట్లుపడకముందే తిన్నగానున్న ఆ వెనుకటి మోకాళ్ళు బాగుగావంగి దాని పాదములు భూమిని విడచి కొంతదూరము వస్తాయి. పైకెత్తబడిన వెనుక కాళ్లు నడకలో నున్నట్లు దానంతటదియె ఆగక అందలి కండరములచేత బలముతో ముందునకు లాగబడుతుంది. అడుగుల త్వరితమునుబట్టి ఈ చలనము జరుగుతుంది. భూమిని విడువబోవునప్పుడు



వెనుకటి మోకాలు తిన్ననై అతితొందరగా లాగుకొనుటవలన ఒకవిధమైన జంటకాళ్ళతో దుముకుటయె జరుగుచుంది. దీనినే పరుగెత్తుట అందురు. ఇటువంటి సమయములో పశువుకాళ్లు రెల్లపోతాయి. అనగా పశువు డెక్కెనుండి జబ్బకుపోవు నరము చెదురుతుంది. పశువు రెల్లపోయినకాలును భూమిమీద ఆనించలేదు. చాల బాధపడును, పశువు మిగుల దీనముగా నుంటుంది. రెల్ల పోయినపాదమందు వాచి వేడిగా వుంటుంది.మనము చేతితో తాకిన ఎడల గిలగిల తన్నుకొంటుంది. బాధచే పండ్లు కొరుకుతుంది. పశువులకు జ్వరముకూడా ఉంటుంది.

ఆయుర్వేద చికిత్స

రెల్లపోయిన భాగమునకు రెండు బిందెల చన్నీళ్ళు ధారగా పోయుట మంచిది. రెండు కుండపెంకులు తీసికొని పశువు డెక్కను నొక్కి నొప్పిగల భాగమందు పెంకులువేసి గుత్తికిరుప్రక్కల ఒకకొనతో బిగించి ఒక బిందెడు చన్నీళ్లు తీసికొని ధారగా పోయాలి. ఇట్లు నొప్పి తగ్గువరకు పోయుచుండిన నెమ్మదిస్తుంది. రెల్లపోయిన భాగమునకు తవుడు వేయించి కాపులు వేయుట మంచిది. ఇట్టి పశువులకు 15 నుంచి 60 దినములవరకు చికిత్స చేయాలి. ఫార్మసీవారి స్ప్రెయిన్ కిల్లరు, వాతారి అరఖు చక్కగా పనిచేస్తాయి.

లేక వస 1 తు, వాము 2 తు, పసుపు 1 తు, కలిపి నూరి నూనెతో ఉడికించి రెల్లపోయిన భాగమందు మర్దన చేయాలి.

లేక సున్నములో చింతపండు కలిపి పట్టువేయాలి.

లేక సారాయిలో కోడిగ్రుడ్డు తెల్లసొనకలిపి పట్టువేయాలి.

లేక మునగాకు 2 గుప్పెళ్ళు, వస 1 తు, వాము 6 తు, నూనెలో కలిపి ఉడికించి రెండు కట్లు కట్టాలి.

చెమటగుల్ల

పశువులు తిరుగునప్పుడు వాని గొరిజలచుట్టు అప్పుడప్పుడు మన్ను పేరుకొంటుంది. దానిని పరిశుభ్రముగా చేయనియెడల అచ్చట వాచి వేడిగా నుంటుంది. ఊటభూములందు, రాతినేలలందు, అరణ్యముల యందు, బీడుభూములందు తిరుగు పశువులకు తరచుగా ఈ గుల్లలు లేస్తాయి. ముఖ్యముగా ఇవి వెనుక కాళ్ళకువస్తాయి. కాలు కుంటిన వెంటనే తగు చికిత్స చేయనిచో ఆ భాగము చీముపట్టి బాధపెడుతుంది. కాలు భూమిమీద ఆనించలేదు. మేత నీరు మాని విచారముగా నుంటుంది. ఇంకను అశ్రద్ధచేసినయెడల పశువు కృశించి మరణమునకు సిద్ధమౌతుంది.

ఆయుర్వేద చికిత్స

గుల్ల పెద్దదిగానుండి మెత్తబడనియెడల శస్త్రముచేసి లోషను నీటితో కడిగి మందులు వాడాలి. తరువాత ఆ గాయముపైన ఒకదట్టమైన గుడ్డవేసి జెముడు చెక్క, ఆవాలు, వాము సమభాగములుగా చేర్చి నలగద్రొక్కి వెచ్చజేసి కాయాలి. ఈరీతిగా నాలుగుదినములు చేయాలి.

లేక ఆముదపువత్తి వేసి పొడిసున్నము అద్ది కట్టాలి.

లేక ముండ్లతోటకూర వెచ్చనిది ఉదయ సాయంకాలములందు పెట్టాలి.

లేక ఫార్మసీవారి హిలాన్‌ను వాడాలి.

* * *

ముప్పది ఒకటవ భాగము

కుంటుట - బెణుకుట

కుంటుట

ఆరోగ్యమైన స్థితిలో ఉండే పశువును నడిపిస్తే అది స్తిమితముగా నడుస్తుంది అన్ని కాళ్ళమీదను బరువు వేస్తుంది.

నొప్పికలిగినప్పుడు నొప్పికలిగిన కాలిమీదనో కాళ్ళమీదనో తక్కువ బరువు వేస్తుంది. నిలిచినప్పుడు అంతే, పరుగెత్తినప్పుడు అంతే అప్పుడు పశువు కుంటడము మనకు కనిపిస్తుంది.

అప్పుడు ముఖ్యముగా మనము చేయవలసినదేమంటె, పశువుకు పూర్తిగా విశ్రాంతి ఇవ్వాలి. అంటే వాటిని కట్టివేసి వాని ఇష్టము చొప్పున పూర్తిగా పడుకోనిచ్చి దానికి ఆహారం పెడుతూ ఉండాలి.

కుంటు కనిపెట్టిడానికి చికిత్స చేయడానికి ముందు పశువునిలిచి ఉండగాచూచి స్థితి కనుక్కోవలెను. ఏ కాలిలో నొప్పియుంటే ఆ కాలిని ముందుకుచాపుతుంది. నొప్పిచాల తీక్షణముగా ఉంటే అసలు ఆ కాలిని భూమిమీద మోపకుండా పైకి ఎత్తుకొనే ఉంటుంది.

పశువు నిలబడియున్నప్పుడు కుంటుతనమును గనిపెట్టుటకు వీలు లేనియెడల గట్టి పమ ప్రదేశమందు పశువును పైకి క్రిందికి పరిగెత్తించి గాని నడపించిగాని పరీక్షించాలి. పరీక్షచేయునతడు తనవైపునుండి పశువు వెడలిపోవునప్పుడు వెనుక కాళ్ళను తన వైపుకు వచ్చునప్పుడు ముందరి కాళ్ళను పరీక్షించాలి.

కాని పరీక్షకారుడు పశువునకు ముందువైపునగాని లేక వెనుక వైపునగాని నిలబడి, పశువు ఏ పాదమునందు బరువు బాగుగా మోపుచున్నదో కనిపెట్టాలి. ఇట్లు కనిపెట్టిన తర్వాత ప్రక్క పాదము మాత్రము కుంటిదని గ్రహించాలి. ఎట్లనగా పశువుయొక్క వెనుక కుడికాలు కుంటిదని తెలుసుకొననగును. ఇదేవిధముగా ముందరి కాళ్ళ యందలి కుంటును కనిపెట్టుటలో కుంటులేని కాలు భూమిమీద ఆనునప్పుడే తలకూడ వ్రాల్చుట కుంటుతనమును సులభముగా గ్రహించుటకు సహాయకారి అవుతుంది.

పశువుకు ముందరి రెండుకాళ్ళ యందుగాని, వెనుక రెండు కాళ్ళ యందుగాని ఒకే పర్యాయము కుంటు ఉన్నయెడల సదరుకాళ్ళ రెండింటియందును బరువు సమానముగా మోపుతుంది. ఐతే అది అట్టి కుంటు కాళ్ళతో అస్పుటమైన నడకను గలిగి దగ్గరగా అడుగులను వేస్తూ నడుస్తుంది. ఏ కాలు కుంటిదో తేలిన తర్వాత కుంటుకు కారణము కనుగొనుటకు కాలిపై నుండి క్రిందికి పరీక్షచేయుటవసరము.

పాదాలను పరీక్షించుట

కృషిచేయు పశువులలో కుంటునకు ముఖ్యస్థానము గనుక పాదమును ముందు పరీక్షించాలి.

గిట్టల మధ్యన రాయిగాని ఇతరగట్టి పదార్థమేమైనాగాని చిక్కుకొనినదేమో చూడాలి. దానిని తీసివేసిన ఎడల కుంటుపోవును.

గిట్టలలో ఏమియు కనబడకపోయినచో గిట్టమీద అక్కడక్కడ సుత్తెతో తట్టవలెను. లేక పటకారుతో నెమ్మదిగా నొక్కాలి. పాదమునందు నొప్పియున్నచో పశువు పాదము వెనుకకు లాగుతుంది.

పాదమునందు నొప్పియున్నదని తీర్మానించితే లాడమున్న ఎడల తీసివేసి కుంటుతగ్గిపోవువరకు గోధుమపొట్టు వేడినీళ్ళలో ఉడికించి తయారుచేసి పట్టుపూసిన గోనెపట్టతో గిట్టకు కట్టాలి.

నాడముకట్టిన ఒకటి రెండు రోజులలో పశువు కుంటినయెడల సాధారణముగా నాడముకొట్టువాడు గిట్టయొక్క అడుగు భాగమున ఎక్కువగా కోసియైనను ఉండాలి. లేక మేకులను లోపలికి దిగునట్లుగా లోతుగానైనను కొట్టి ఉండాలి.

నాళములు వేయనప్పుడు కంకర రోడ్డుమీద పనిచేయుటవల్ల గిట్టలు అరిగిపోవుటచే జంతువులకు బాధకలుగును. ఇట్టి సందర్భములలో పశువుయొక్క గిట్ట గట్టిపడి తిరిగి పనిచేయుటకు వీలగునంత వరకు పశువునకు విశ్రాంతి నివ్వాలి.

బెణకుట

పశువుయొక్క అవయవములందు కీళ్లు గలవు. రెండు లేక అంతకన్న ఎక్కువ ఎముకలను బంధించుటకు నరములు పీచులాటివి ఏర్పడుచున్నవి. అతి త్వరితముగా పరుగెత్తుటలో తప్పటడుగులు వేసినప్పుడును, పాదము జారినప్పుడును, ఎక్కువ బరువులాగినప్పుడును కీలు నందలి ఈ సంధి బంధనములు (నరములు) ఒక్కొక్కప్పుడు ఎక్కువ సాగుటవల్లగాని తెగుటవల్లగాని బెణుకు కలుగుటకు కారణమగును. అప్పుడు కీలు బెణికినదని చెపుతారు. పశువులలో సర్వసాధారణముగా విరిగినకీలుగాని తొంటికీలుగాని భుజముకీలుగాని బెణుకుతాయి. ఆ కీలు వాచియుండి తాకిన వెచ్చగానుండి బాధయున్నట్లు కనబడుతుంది. ఆ కీలు బెణికినదని నిరూపించాలి. ఈ బెణికిన కీలునకు ప్రతిదినము ప్రొద్దున సాయంత్రము 1/2 గంట వరకు వేడినీటితో కాపడము పెట్టి తడియారిన తర్వాత హారతికర్పూరము కలిసిన నూనెను పూయాలి. కర్పూరము కలిసిన నూనెనుచేయుట ఎట్లనగా 1 తు, కర్పూరమును 1 అణాకు (పావుశేరు) కొబ్బరినూనె లేక నువ్వులనూనెలో కలిపి తయారుచేయాలి. దొరికినయెడల 1/8 అణాకు కర్పూర తైలమునుగూడా కలపాలి. బెణికిన కీలును చింతాకు కషాయముతోకూడ వెచ్చగా కాచాలి. వాపు కలిగిన కీళ్లకు ముసాంబ్రమును నీటితో మెత్తగానూరి కొంచెం వెచ్చచేసి పూయాలి.

ఆయుర్వేద చికిత్స

బెణికిన అవయవమును స్థిరముగా నుంచాలి. కదలనీయరాదు. బెణికిన భాగమునకు తడిగుడ్డచుట్టి తడపాలి. ఇట్లు తడిపినచో ఆ భాగము బిగుస్తుంది. కొందరు వేడినీటికాపులు బెణికిన భాగములకు

తీస్తారు. వేడినీటి కాపులకంటె ఇసుకకాపులు చాల శ్రేష్ఠము. బెణికిన భాగమును చాలకాలము వాడుకచేయని యెడల ఆ అవయవములు బిగిసిపోతాయి.

ముద్దకర్పూరము 1 తులము, కొబ్బరినూనె పావుసేరు, కలిపి బెణికినచోట రుద్దాలి.

లేక పచ్చిజెముడు చెక్కనుత్రొక్కి బెణికినచోట కట్టాలి.

లేక రావిచెక్క మెత్తగా నలగద్రొక్కి ఎండబెట్టి చూర్ణము చేసి నీటిలో కలిపి బిళ్ళచేసి బెణికినచోట కట్టుకట్టి ఆ కట్టుపైన చన్నీళ్లు ధారగా పోయాలి.

లేక కోడిగ్రుడ్డు సొనతో మంచినూనె కలిపి పట్టువేయాలి.


లేక మంచిఘాటయిన సారాయి ఆరగా ఆరగా రుద్దాలి. బెణికిన అవయవమునకు ఎన్ని చికిత్సలు చేసినను లొంగనియెడలబొత్తులు పెట్టవచ్చును. లేక స్ప్రెయిన్ కిల్లరునుగాని, అయోడిన్‌గాని వాడాలి.

దబ్బరికము

పశువు మోకాళ్లకుగాని, తొడభాగమునకుగాని ముందు వాపుగా పుట్టి క్రమేపి వృద్ధిజెందును. జ్వరము కొన్నిటికి తీవ్రముగానుంటుంది. వ్యాధిముదిరినకొలది పశువు బాధజెందును. వాపు వేడిగానుంటుంది. కాబట్టి అనుభవముగల వైద్యునికి చూపించాలి. లేదా బెణుకులు చేయు చికిత్సలు వాడాలి.

మోర్లుదిగుట

పశువును మితముతప్పి మేపుటవలన చర్మములోవుండు బలహీనతవలన దుమ్ము తేమ వగైరాల కొట్టములో నుంచుటవలన, తదితర వాతరోగములవలన ఈ వ్యాధికలుగుతుంది. వెనుక మోకాళ్ళుగాని ముందు మోకాళ్ళుగాని వాపుండును. ఈ వాపును తాకినయెడల గట్టిగ నుంటుంది. మరికొన్నిటికి మెత్తగ నుంటాయి. నడచునపుడు కాళ్ళు వంగనీయవు. ఆ వాపు దగ్గర దురదవుంటుంది. ఆరంభములో పశువు



మోకాలి చిప్పలచుట్టు గుండ్రని వాపుంటుంది. ఈ వాపు వృద్ధిజెంది కాలిక్రింద భాగమునకుకూడ సోకుతుంది. ఈ వాపులలో ఒక విధమగు కోడిగ్రుడ్డు సొనవంటి జిగురు పదార్థముంటుంది. ఇట్టివి తగ్గుట కష్టము.

మోకాళ్ళలోగాని, గుత్తులలోగాని వాతమువలనగాని, తదితర కారణమవలనగాని వాపులుపుట్టి మెత్తగాగాని, గట్టిగాగాని యున్నపుడు తగినచికిత్స చేయాలి. పై పటములోని వాపులను చూడండి.

ఆయుర్వేద చికిత్స

జిల్లేడుపువ్వు, ఇప్పపిండి ఉల్లిపాయలు సమభాగములుగాచేర్చి మెత్తగానూరి బిళ్ళవలెచేసి పశువు మోకాళ్ళమీద కట్టాలి.

ఉప్పు, వెల్లుల్లిపాయలు, పెద్దజెముడు సమభాగములుగా చేర్చి మెత్తగా నూరి బిళ్ళచేసి పై మాదిరిగా కట్టాలి. వారము దినములకొకసారి విరేచనమునకు మందీయాలి. లేక కోడిపెంటలో జిల్లేడుపాల చుక్కలను వేసి రాచి ఒక పావుగంటవుంచి కడగాలి. లేనిచో ఆ భాగమువాచును.

లేక ఫార్మసీవారి రసోత్తమను రాచిలోపలికి పశురక్షామృతము త్రాగించాలి.

మలిమిడి

దీనినే గుడ్లమలిమిడి అంటారు. ఇది ఒక విధమైన బెణుకు. పశువులకు అప్పుడప్పుడు వస్తుంటుంది. పశువు మోకాలిగుత్తిలో నున్న నరములు సాగుతాయి. మనమచ్చట తాకినయెడల పశువుచాల బాధపడుతుంటుంది. అక్కడ వాపుగావుంటుంది. మూడు కాళ్ళమీదనే నడుస్తుంది. తేలికగా బెణికినయెడల కాలు భూమిమీద నిలబెట్టాలి. ఆ వాపు వేడిగా నుంటుంది. ఈ నొప్పి వారము లేక పక్షముదినముల వరకు ఉంటుంది. ఇక్కడ చెడురక్తము కూడుకొని ఉంటుంది. క్రమముగా ఆ వాపు పొక్కి పుండుబడి కుంటుతుంది. ఇంక ఆవాపు పుండుపడకుండా తగ్గవచ్చు.

ఆయుర్వేద చిక్కిత్స

పశువు కాలిగుత్తిలో గుడ్డ కడియముగా చుట్టి మంచినూనెకాచి గోరువెచ్చనిది పోయాలి. ఇట్లుపోయుచుండిన యెడల గోరువెచ్చని వేడి నరములకు తగిలి నెమ్మదిస్తుంది. ఇట్లుచేయక మనరైతులు నూనెలో గుడ్డముంచి కడియముగా చూడతారు. బెణికిన స్థలమును కదలనీయరాదు.

ఆముదముతో చిత్రమూలమునూరి వండి ఆ వాపునకు రెండు కట్లు కట్టిన తగ్గుతుంది.

లేక చిత్రమూలము, సన్నావాలు నూరి ఆ వాపునకు మూడు కట్లుకట్టిన వెంటనే తగ్గుతుంది. ఇట్లు చేయనియెడల ఆ భాగము పొక్కుతుంది. తరువాత వెన్నపూస రాసిన తగ్గుతుంది.

లేక గొలిమిడాకు గుప్పెడు, మిరియాలు 2 తు, మెత్తగానూరి ఆముదములో కలిపి వండిపెట్టాలి. లేక రసోత్తమనుగాని, అయోడిన్‌గాని మర్దనచేయాలి.

గిట్టల క్రుళ్ళుడు

పశువునకు కాలిగొఱ్ఱుపడుటవలన తదితర వ్రణములవలన మోటారుకారు, బండి మొదలగునవి గిట్టలమీదుగా పోవుటవలన రేకులుపడి గిట్టలు తెగిపోవుటవలన గాయములకు చేతగాని చికిత్సలు చేయుటవలన ఈక్రుళ్ళు పుడుతుంది.

ఆయుర్వేద చికిత్స

ఈ వ్యాధికి చికిత్సలుచేయుట చాలకష్టము. ప్రతిదినము కట్టుకట్టాలి. క్రుళ్ళకుండ నుండు పదార్థములు వేసి చికిత్స చేయాలి.

ముద్దకర్పూరము– 2 తు, వస 1 తు, వ్యాసులైను 2 తు, కలిపి అచ్చట రాయాలి.

లేక జీడివిత్తులు సేరుతెచ్చి త్రొక్కి చమురుతీయాలి. తరువాత సేరు గొర్రెకొవ్వు, అర్ధసేరు మైనము, అర్ధసేరు ఆవునెయ్యి, అర్ధసేరు నువ్వులనూనె, అర్ధసేరు ఆముదము తీసికొనివచ్చి పైచమురు కలిపి కాచాలి.

తరువాత పశువు గిట్టను రక్తమువచ్చునట్లు క్రుళ్లు తీసివేసి దానిపై చురుక్కుమనునట్లు కాచినతైలము పోయాలి. తరువాత మైనము బిళ్ళగాచేసి దానిపైన వేసి మర్రియాకు వేసి కట్టుకట్టాలి. ఆ కట్టు మూడు దినములుంచి నాల్గవనాడు ఇదివరకు చెప్పిన లోషనుతో కడిగి మరల మైనపుబిళ్లవేసి కట్టుకట్టాలి. పుండు మానువరకు నిట్లేచేయాలి. కార్నేక్సు వాడాలి.

కాలిగొఱ్ఱు



పశువును నాగలికికట్టి దున్నునపుడు జీతగాడు నాగలిమేడి సరిగా కట్టుకొనకపోవుటచేతగాని ఏమరుపాటున దున్నుటచేతగాని కాలిచెక్కలకు నాగలికఱ్ఱు గ్రుచ్చుకొనిన యెడల పశువునకు ప్రాణాపాయము కూడ రాగలదు. పశువు చాల విచారముగా వుంటుంది. తగినచికిత్స చేయనిచో కాలు చెడిపోతుంది.

నీరుపట్టి వాస్తుంది. పోటుండును. పశువు నడువజాలదు. లోతుగాయమునకు వెంటనే చికిత్స చేయనిచో ధనుర్వాతముసోకి మరణిస్తుంది. కఱ్ఱుత్రుప్పు రక్తములో జీర్ణించి క్రిందినుండి పైవరకు రక్తగడ్డలు లేస్తాయి. పటమును చూడు. సరియగు చికిత్స చేయనిచో మాదగానగును.

చికిత్స

గాయమునకు ఈగలను ముసరనీయరాదు చాల జాగ్రత్తగా నుంచవలెను. గాలి ప్రవేశించకుండ కట్టు కట్టాలి.

నల్ల జీడిగింజ కాల్చి ఆ భాగమునకు అంటించాలి.

లేక గాయపాకువేసి నాలుగు కట్లు కట్టాలి.


పశువు కాలిడెక్కలకు మేకు గ్రుచ్చుకున్న ఎడల జాగ్రత్తగా తీసివేసి నీరుపట్టకుండ చేయాలి.

కాల్చిన ఇటుకరాతిమీద గుడ్డమడతలుగా పెట్టి దానపైన చన్నీళ్ళు ధారగా పోయుచుండాలి. ఈ ప్రకారము మూడు నాలుగుదినములు చేయాలి.

ఇసుకతో వేసి కాపులు తీయుటమంచిది. వాము, వెల్లుల్లి పాయలు నూరినాలుగు కట్లు కట్టుము. ఫార్మసివారి కార్నెక్సును, వాతారి అరఖునువాడాలి.

మంద గుది

పశువునకు ఈ వ్యాధి వాతమువలన వచ్చును. కాళ్ళు ఈడ్చుచుండును. కొన్నిటికి తేలికగా తగులుటవలన కొద్దిగా కుంటుచుండును. వ్యాధి ముదిరినకొలది కాలుపైకి లాగుకొని నడువకపోవును. ఇట్టి పశువును చూచిన జాలిగానుండును. కొన్ని పశువులకు సాంప్రదాయముగా వచ్చును.



ఆయుర్వేద చికిత్స

వాము 15 తులములు, దిరిసెనచెక్క 15 తులములు, శొంఠి 12 తులములు, చేదుపొట్లకాయలు, పొగబంతిచెక్క 13 తులములు, చేదుబీరకాయలు 12 తులములు పెన్నేరువేరు 10 తులములు ఇవన్నియు

కలిపినూరి నిమ్మకాయంత ఉండలుచేసి రెండుపూటలు తినిపించాలి. వ్యాధి ముదిరినయెడల ఈ చికిత్సకూడ లాభములేదు. నాటు వైద్యులు నరమును చీల్చుతారు. తాత్కాలికముగా తగ్గినను మరల తప్పక వస్తుంది.

రెక్టిఫైడ్ స్పిరిట్ టింక్చర్ అయోడిన్ రక్తనాళమునకు ఇంజెక్షను ఇచ్చిన తగ్గును. అంతకంటె మంచి వైద్యములేదు. ఆయుర్వేదములో ఇంకను ఈ విషయమై ఆలోచించుచున్నారము.

గిట్టల పగుళ్ళు

పశువులను బండ్లుకట్టి రాతినేలలందు కంకరరోడ్ల మీద తోలుట చేత, దీర్ఘ ప్రయాణములు చేయుచుండుటచేత, సరియయిన నాడములు డెక్కెల అడుగు భాగమున కట్టించకపోవుటచేత పశువులగిట్టలు అరిగిపోవుటచేత ఈ వ్యాధి కలుగుచుండును. ఈ వ్యాధి ముందరి కాళ్ళకు వెనుకకాళ్ళకు అప్పుడప్పుడు వచ్చుచుండును. గొరిజలు పగిలి వాపుపుట్టును. ఆ భాధచేత పశువు అడుగు వేయజాలదు. ఆజాగ్రత్తగాను న్నచో ఆ వాపు పుండుగామారి గిట్టలూడిపోవును.

ఆయుర్వేద చికిత్స

1. వేడినీటిలో ఉప్పుకలిపి డెక్కెలమీద పోయాలి.

2. గుగ్గిలము, మైనము లక్క సింధూరము ఒక్కొక్కటి పావుతులము వంతునతెచ్చి మెత్తగానూరి పొడిచేసి నూనెలో కలిపి కాచి డెక్కెలలో పోసి దానిపై కాచిన వేడి ఇటుకరాతి పొడుముతో కాచాలి.

3. ముండ్ల తోటకూర ఆకు తెచ్చి ఉడికించి వెచ్చనిది కట్టాలి.

4. కరక్కాయపొడి, క్రొత్తసున్నము పటిక బెల్లము సమానముగా తెచ్చిమెత్తగానూరి నొప్పిగల గొరిజలకు పట్టించి ఉప్పునీటితో కాయాలి.

5. తవుడు నీరు చిక్కగాకలిపి వుడికించి దినమునకు ఒకసారి కట్టాలి.

6. గుగ్గిలము బెల్లము నెయ్యి మైనము కలిపి రాయాలి.

7. నిమ్మరసము, సైంధలవణము, మేకపాలు, జిల్లేడుపాలు, గుగ్గిలము, ఆవువెన్నతో కలిపి రాయాలి.

వెటరినరీ ప్లాస్టరు, అయోడిన్ చక్కగా పనిచేస్తుంది.

గిట్టలసందున దుర్మాంసము పెరుగుట

గిట్టలకు దెబ్బతగిలినపుడు తగుచికిత్స చేయనపుడు కాలిగొఱ్ఱుపడి గిట్ట చీలినపుడు ఏ దెబ్బయిన తగిలినపుడు శస్త్రముచేసి సరిగా చికిత్స చేయనపుడు ఈదుర్మాంసము పెరుగుతుంది. పశువు పనిచేసి నపుడు గిట్టలనందునున్న ఈ దుర్మాంసమునకు పుల్లలు, గడ్డలు గ్రుచ్చుకొని బాధపడుతుంది. దుర్మాంసము పెరిగి బాగుగా ముదిరిన యెడల శస్త్రముచేయాలి.

చికిత్స

అనుభవముగలిగిన వైద్యునితో చికిత్స చేయించాలి. తాత్కాలికముగ తగ్గి మరల రావచ్చును. మరల మరల వచ్చిన గిట్టమాదగా నగుతుంది. ఇట్టి పుండ్లకు ఫార్మసివారి కార్నెక్సును వాడాలి కాల్చవలసి వస్తుంది.

జంతువులకు కరెంటుద్వారా నొప్పులు తగ్గించుట

పందొమ్మిదవ శతాబ్దం మధ్యభాగంనుంచి విజ్ఞానులు, జీవశాస్త్ర వేత్తలు కనుగొన్న అనేకనూతన విషయాలను మానవకోటిని పట్టి పీడిస్తున్న వ్యాధులకు చికిత్సకోసం ఉపయోగించవచ్చునని వారు కనుగొన్నారు. ఫలితంగా వ్యాధులను గూర్చి మానవుల అజ్ఞానం పటాపంచలైపోయి వైద్యవిజ్ఞానంలో ఒకగొప్ప విప్లవమే తెచ్చింది.

1840 సంవత్సర ప్రాంతాలలో కాస్త జ్వరంవచ్చి మంచమెక్కితే మరి ఆశలు వదలుకోవలసి వచ్చేది. ఈ రోజుల్లో చిన్నచిన్న వ్యాధులని మనం అలక్ష్యంచేసేవాటికే అనేకమంది స్త్రీలు, పురుషులు, పిల్లలు అసువులు బాసేవారు. కోట్లకొలది మానవులను, జంతువులను మృత్యు ముఖానికి చేర్చే ఈ మృత్యుదూతలను జయించటములో ఆధునిక వైద్య విజ్ఞానవేత్తలు ఎంతోకృషి జరుపవలసివచ్చింది. ప్రాణాలకు సయితం లెక్కచేయకుండా వ్యాధి మూలకారణములైన సూక్ష్మజీవులతో పోరాడవలసి వస్తుంది. వీరి అనవరత కృషిఫలితంగా కొత్త కొత్త పద్ధతులు, కొత్త కొత్త మందులు అమలులోకి వచ్చాయి. రోగమువచ్చిన తరువాత మందుయిచ్చుటకంటె రాకుండా నివారించుకోవడమే ఉత్తమమనే ఆలోచన అందరికి తట్టింది.

అసలు వైద్యవిజ్ఞానంలో చికిత్సాపద్ధతులతో విద్యుచ్ఛక్తిని అన్నిటితోపాటుకూడా వాడడం ప్రారంభించారు. మత్తుమందులు కనిపెట్టకపూర్వము శస్త్రచికిత్స చేయించుకోవడమంటే రోగులకు బ్రహ్మ ప్రళయంగా వుండేది. ఇంతెందుకు? శస్త్రచికిత్స చేయించుకోవడమంటే సరాసరి స్వర్గానికే ప్రయాణం కట్టడమని ప్రతివారు గ్రహించేవారు. అయితే ఆధునిక విజ్ఞానపుణ్యమాయని ఈబాధ మనుష్యులకు, పశువులకు వదలిపోయింది. మొండికత్తులపీడ విరగడైపోయింది. ఈ కత్తికి బదులుగా సన్నని ఎలెక్ట్రోడ్‌తీగెతో శస్త్రము చేస్తున్నారు. ఈ తీగెద్వారా వైర్లెస్ హైఫ్రీకన్స్వీకరెంటును శస్త్రంచేయవలసిన చోటికి పంపిస్తారు. దానితో ఒకచుక్క రక్తమైన క్రిందపడకుండా శస్త్రచికిత్స జరిగిపోతుంది. ఈ పద్ధతినే ఎలక్ట్రోసర్జరీ అంటారు. విజ్ఞానంలో అత్యంతాధునికమైన చికిత్సాపద్ధతి ఇది. ప్రస్తుతం రేడియోచికిత్సవల్ల పశువుల వాతనొప్పులు, పాతనొప్పులు, తదితరనొప్పులు కుదురుతున్నాయి. ఎలెక్ట్రిక్‌బల్బుతో తయారైన పెట్టెలను అనుభవముగల వైద్యులు పశువులకు వాడవచ్చును.

యక్స్‌రే

పశువుల్ని, గుఱ్ఱాల్ని, కుక్కల్ని పెంచటంలో ఇంగ్లండు ప్రసిద్ధికెక్కింది. పశువుల, గుఱ్ఱాల కాలినొప్పి కనిపెట్టుటకు యక్స్‌రే తీస్తున్నారు. ఈ పరికరం సరిక్రొత్తది. ఇది అపూర్వపశువైద్య విధానపరికరము. ఎచ్చటనైనా వాడవచ్చు. ఏ అవయవమైన పరీక్షించి బొమ్మతీయవచ్చును. ఇంకను జంతువులకు అతివేడిజేసి తాపముగానున్నపుడు విద్యుత్‌తో ఆ యా భాగాలకు ప్రసారించి వైద్యం చేస్తారు. ఇంక ఎన్నో రకాల విద్యుత్ వైద్యాలు చేస్తున్నారు. మనభారతదేశానికి ఇంకను అట్టి యంత్రాలుగాని, పరికరాలుగాని రాలేదని తెలుస్తోంది.

* * *

ముప్పది రెండవ భాగము

మాదలు

పశువునకు పుట్టిన పుండుగాని, శస్త్రము చేసిన గాయముగాని, తోక, చెవి, అర్రు, కొమ్ము, కాలుగొఱ్ఱు మున్నగు బాగాలలో కలిగిన వానికి ఎన్ని చికిత్సలు చేసినను తగ్గక రైతునకు విసుగుపుట్టి చికిత్స చేయించనపుడు ఆ పుండ్లు పెద్దవై మానవు. వీటినే మాదలంటారు. కొమ్ముభాగాలకు మాత్రము తలలో ఒకవిధమగు పదార్థముజేరి వ్యాధి ముదిరి కొమ్ములాలుతుంది. దీనిని కొమ్ముమాద అంటారు. మాద అంటే మానదని తెలిసికోవాలి. కాబట్టి ఇట్టిమాదలకు అనుభవముగల వైద్యులతో చికిత్సలు చేయించాలి.

తోక మాద

దీనినే తోకగురుజు అందురు. పశువుతోకయొక్క కుచ్చుండు స్థానమునందు ఈ వ్యాధి పుడుతుంది. కుచ్చుపై భాగమంతయు నల్లబడి వెంట్రుకలూడిపోతాయి. చివరభాగమున ఉంగరమువలె మెలికలు తిరిగి బిరుసుగావుంటుంది. క్రమముగా తోకకుచ్చు వెంట్రుకలూడిపోయి మొండితోకగావుంటుంది. పశువు సరిగా మేతమేయక వెట్టిచూపులు చూస్తూ తిరుగుతుంది.

చికిత్స


పశువుతోక చివరభాగము కత్తితో తెగగొట్టి గోరువెచ్చని నేతిలో ముంచాలి. తరువాత కలబందమట్టలు, సైంధవలవణము, ఆవాలు, అల్లము సమభాగములుగా తెచ్చి నూరి పులికలిలో మూడు దినములు నానవేసి పూటకు గొట్టము త్రాగించాలి. వెంట్రుకలు మొలచుటకు ఉమ్మితో నీలిమందును నూరి 4,5 దినములు రెండు పూటలు పట్టించుచుండాలి.

లేక తోక తెగగొట్టినప్పటికి కూడ, మరల తోక చెడిపోతుంది. కాన ఎక్కడకు తోక కుళ్ళి ఎండిపోవునో అంతవరకు అనుమానము లేకుండ తెగగొట్టి నూనెలో ముంచాలి. ఈగల ముసరనీయరాదు. తోక ఎముక ఉంగరముమాదిరిగా ఊడినపుడు తోకమాదయని గ్రహించి అనుమానములేకుండ నరకాలి. కార్బొక్సును వాడాలి.

కొమ్ము మాద

పశువుయొక్క కొమ్ములు మనచేతివ్రేళ్ళకును, కాలివ్రేళ్ళకు నుండు గోళ్ళలోని పదార్థముతో నిర్మింపబడినవి. ఇట్టి కొమ్ములు జంతువులయొక్క యావజ్జీవమును పెరుగుతుంటాయి. ఆకస్మికముగా ఊడవలయునేగాని తమంతటవి ఊడవు. ఒకానొకప్పుడేదైన దెబ్బతగిలినపుడు ఇట్టికొమ్ములూడిపోతాయి. కొమ్ములిరిగి క్రిందపడినపుడు నిజమైన కొమ్ము అమర్చబడియుంటుంది. ఆ గాయం చుట్టూ స్పర్శగ్రహణ శక్తిగల చర్మమమర్చబడి ఉంటుంది. దానియందసంఖ్యాకములగు నాడులును, రక్తవాహకములు వుంటాయి.

నిజమైన కొమ్ములు నఱికినను బాధకలుగ నేరదు. ఈ కాయభాగము ఎంతస్వల్పముగ గ్రుచ్చినను ఎక్కువ బాధకలుగుతుంది. కాయచుట్టు నుండు చర్మములో నాడులు రక్త వాహికలు మండుటచేతనే ఈ బాధకలుగుతుంది. ఈ కాయ అడుగుభాగమున మెదడను పదార్థముంటుంది. క్రింది పటమును చూచిన మీకే అర్థమవుతుంది.



ఈ మెదడుభాగమునకు చీము సంబంధమైన సూక్ష్మజీవులు ప్రవేశించి కొమ్ము మాదయను వ్యాధిని కలిగిస్తాయి. ఈ మాద ఒక కొమ్మునకుగాని, రెంటికిగాని రావచ్చును. తలకు కొంచెము దురద ప్రారంభమయి, ఏ ఎఱ్ఱని వర్ణముగల బొబ్బలు కనపడతాయి. ఇవి క్రమముగా పసుపువర్ణముగా మారుతాయి. ఇవి చితికి తేనెతుట్టె ఆకారము వహించి పొక్కులుకడతాయి. ఈ పొక్కుల అడుగున పుండ్లు ఏర్పడుతాయి. ఈ వ్యాధిని అశ్రద్ధ చేసినయెడల పశువునకపాయముకలుగును. ఇది బహుమొండివ్యాధి. పశువు తలలోనున్న మెదడున ప్రవేశించి క్రమముగా కొమ్ములోపలి భాగముకూడ తింటుంది. ముక్కులనుండి చీముగాని, చీమునెత్తురులుగాని పడుచుండుటవలన పశువుకొమ్ము వాలిపోతుంది.

విరిగిన కొమ్ము మాదయైన పశువు చాల శుష్కించి పోతుంది. ప్రత్యేకముగా ఈ వ్యాధికలిగిన పశువు ఎక్కువగా బలుస్తుంది. పశువునకు కాంతి తగ్గుతుంది. ఈ స్థితిలో పశువు చనిపోతుంది. నెత్తురు చిగిర్చి మాద నెమ్మదికాదు.

కొమ్ములు విరిగిన మాద

ఏ ప్రమాదమువలననైన కొమ్ములు విరిగినపుడు జాగ్రత్తగా చికిత్స చేయాలి. విరిగిన భాగము వ్రేలాడుచున్నచో రంపముతో కోసి తీసివేయాలి. రక్తమెక్కువగా కారుచున్న తడిగుడ్డతో గట్టిగా నీరుపిండి ఆ రక్తము నాపాలి. తరువాత మంటపెట్టుమందులుగాక చల్లదనముగానుండు మందులను ఈ గ్రంథములో చెప్పినవి వాడాలి. పుర్రెవరకు కొమ్మువిరిగిన అనుభవముగల వైద్యునితో చికిత్స చేయించాలి. విరిగిన 15 రోజులలోగా చికిత్స చేయకున్నను తాత్కాలిక చికిత్సలు చేసిన తగ్గకున్నను విరిగిపోయి మాదగానై రక్తము కారుతుంటుంది. కాబట్టి విరిగిన వెంటనే చికిత్సచేయాలి. ఆకుపసరులకంటె చూర్ణములుగాని, తైలములుగాని వాడాలి.

హెచ్చరిక

ఈ వ్యాధి సామాన్యముగా చికిత్సకు లొంగదు. కాబట్టి ఆరంభములో తగుచికిత్స చేయవలయునుగాని కొమ్మువాలిన తరువాత ఏమియు లాభములేదు.

అనేకమంది పశువైద్యులు మేము నెమ్మది చేసెదమని కొంతడబ్బు మందుఖర్చునకని తీసికొని తరువాత మావల్లకాదంటారు. ఇది నా స్వానుభవము.

మనరైతులలో చాలమంది నయమగునేమోయని ఆతురతతో అనేక చికిత్సలు చేయిస్తారు. కొన్ని మంచి బండిగిత్తలకు వచ్చినపుడు రైతు విచారము, ఆతురతచెప్పనలవికాదు. మా పశుచికిత్సాలయము దగ్గరకు కూడ అపుడపుడు చక్కని గిత్తలు వస్తాయి. వాటిని చూచిన చాల విచారముగవుంటుంది. ఈ మాదలో పుర్రెకు పుట్టిన తగ్గదు. కండకు పుట్టిన తగ్గుటయుకలదు.

చికిత్స

కాని ఇటువంటి వ్యాధిగల పశువు కొమ్ముకోసి ఈ దిగువ చికిత్సలు చేయాలి.

కొమ్ముకోసి వెంటనే కల్లుబెల్లము వెంట్రుకలుతెచ్చి పైనవేసి ఇనుపకడ్డీతో కాల్చాలి. ఇట్లు కాల్చినచో కొమ్ములోపలనుండు పురుగులకు వేడితగిలి చనిపోతాయి. తరువాత కాల్చినభాగములో మానువరకు మర్రిపాలు పోయాలి. లేక ఇంగిలకము, ఇటుకరాతిపొడుము, దంతి చెక్కచూర్ణము కలిపి కొమ్ముగాయములో పోసి కట్టుకట్టాలి. తరువాత సారాయి చటాకు కాజ ఆకురసము చటాకు కొమ్ము కోసినవైపు చెవిలో పోసి కట్టుకట్టాలి.

అప్పుడప్పుడు ఫినాయిల్ ద్రావకముతో కడుగుతుండాలి.

లేక వావింటాకు మూడుగుప్పెళ్ళు, నీరుల్లిపాయలు తు, వస 1 తు, తీసికొనివచ్చి నూరి రసముతీసి ఏ ప్రక్కకొమ్ము వ్రాలినదో ఆ ప్రక్క ముక్కురంధ్రములలో పోయాలి. ఫార్మసీవారి కార్నెక్సు చెర్చారిని వాడాలి.

పార్శ్వపు మాద

పశువు మెదడులో ఒక విధమైన సూక్ష్మజీవులు పుట్టిన ఈ రోగము కలుగుతుంది. దీనినే అర్థాంగవాత–మనియు, పార్శ్వపు వాతమనియు చెప్పవచ్చు. ఈ రోగము శీతల ప్రదేశములో నున్న పశువులకు కలుగుతుంటుంది. పశువుమెదడు సగభాగమునకే సోకుతుంది. కొన్ని పశువులకు చెవులమొదట త్రాడుకట్టుట వలన బలవంతముగా లాగుకొని నరములు సాగి ఈ రీతిగనే వచ్చుటయుగలదు. మరికొన్నిటికి దీర్ఘవాతము వలన రావచ్చును. కాబట్టి జాగ్రత్తగా చికిత్సచేయాలి.

పశువు తన తలను ఆరంభములో అటునిటు ఆడించుతుంది. ఒక ముక్కునుండి మాత్రమే చీమిడివంటి పదార్థము కారుతుంటుంది. చెవిలోనుండి కూడ ఒక విధమగుద్రవము స్రవించుచు వాపుంటుంది. కొమ్మువైపునను చెవుకి ముక్కురంధ్రములకు వ్యాధిసోకుతుంది. ఒక కన్ను లోపలికిపోతుంది. నోటినుండి చొంగపడుతుంది. ఈ వ్యాధిని ఆరంభములో గుర్తించలేక కొమ్ముడొల్లలంటారు. కాబట్టి జాగ్రత్తగ పరీక్షించాలి.



పసుపు పచ్చని, చిక్కనిచీమిడి చెవులనుండి ముక్కులనుండి పడుతుంది. చాల దుర్వాసనవేస్తుంది. వ్యాధి ముదిరిన కొలది తుట్టెలుతుట్టెలుగ చీమిడిపడుతుంది. ఈ చీమిడి కోడుగ్రుడ్డులోనుండు పచ్చని ద్రవపురంగుగ వుంటుంది. పశువు శుష్కించిపోతుంది. చెవిలోపురుగులు పడతాయి పశువు చూచుటకు చాల అసహ్యముగా వుంటుంది.


చికిత్స

ఇది మొండివ్యాధి ఈ వ్యాధి తగిలినపశువు 5,6 మానముల వరకు జీవిస్తుంది. తరువాత చనిపోతుంది. కాబట్టి ఈ వ్యాధిగల పశువును ప్రత్యేక స్థలమందుంచాలి. చెవికిదెబ్బ తగులుటవలన వచ్చినచో చికిత్సలకు తగ్గుతుంది. వాతమువలన వచ్చిన చాలాకాలము పడుతుంది. అవుసరమున్న పశువుకొమ్మునుండి మూతివరకు చుక్కలు పెట్టాలి. చెవిచుట్టు మూడు చుక్కలు పెట్టాలి. ముచ్చిలిగుంటయొద్ద ఒక చుక్క పెట్టాలి. ఈ వ్యాధి నెల రెండునెలలవరకు యుండునుగాని, త్వరగా తగ్గదు.

వాతారి ఆరఖు, ఐయోడిన్, అనోడైన్ పనిచేస్తుంది.

చెవిమాద

చెవిగూబలో వాతసంబంధమైన పురుగులుపట్టి కురుపులు లేచుటగాని, నర సంబంధమగు అస్వస్థతవలనగాని ఈ వ్యాధి కలుగుతుంది. ఇవి లేచుటచే చెవి మధ్యభాగము లోపలిభాగము



వెలుపలిభాగముకూడ వాపుపుడుతుంది. ఆ వాపువలన పోటు అధికమై బాధకలుగుతుంది. పశువునకు చలిగాలి తగిలినపుడు, అటునిటు తిరుగునపుడు, మేతతినునపుడు నొప్పికలుగుతుంది. ఈ వ్యాధికి తగిన చికిత్సచేయనిచో కురుపులు పెద్దవై చెవిని వ్రేలాడుతుంది. చెవిమొదటచాల వాపుదలనొందియుంటుంది. చెవి బయట భాగమునందుకూడ కురుపులుంటాయి. ఈ కురుపులు ఎఱ్ఱగావుంటాయి. కురుపులు చితికి దుర్వాసన వేస్తాయి. ఈగలు ఆ రసిపైనవ్రాలి పురుగులుపడతాయి. క్రమముగా చెవిభాగమునంతను పురుగులు తింటాయి. పశువు క్షీణించును. చాల విచారముగా వుంటుంది. ఈ దుర్వాసనను తక్కిన పశువులు పసికడతాయి. పైపటము నందు చూచిన మీకే తెలుస్తుంది.

ఆయుర్వేద చికిత్స

ఈ వ్యాధి ముదిరినయెడల నెమ్మదియగుట చాల కష్టము. పెద్ద జంతువునకు, విరేచనమునకు మందీయాలి. చెవిచుట్టు వాపున్న ఎడల వేడికాపులు కాయాలి.

చెవిలో బొక్కెనాకువసరు పోసి దూది పెట్టాలి.

లేక వామింటాకు ఉప్పుతోనూరి రసముతీసి చెవిలో పోయాలి.

లేక మూర్కొండాకుపసరు 2 తు, చిగురుప్పు 1/2 తు, కరిధూపము 1/2 తు, తెచ్చి గోమూత్రముతో కలిపి చెవిలో పోయాలి.

లేక సీమకసిందాకు, రాతినున్నమునూరి చెవిలో పిండాలి.

లేక వేపనూనె 1/4 తులము, గోరింతాకుపసరు 1/2 తులము, వేపాకుపరసరు 1/2 తులము, మిరియాలపొడి 1/2 తులము కలిపి పోయాలి.

చెవి మొదటిభాగమునందు 5,6 చుక్కలు పెట్టాలి. కార్నెక్సు గాని అనోడైనుగాని వాడాలి.

తలమాద

వాతము వలన, తల శుభ్రముగా లేకపోవుటవలన, మెదడులో ఏవ్యాధియైన కలుగుటవలన, పశువులకి ఈ వ్యాధి కలుగుతుంది. మొదటి భాగమందు పురుగులుచేరి ఈ వ్యాధి కలుగుతుంది.

తలలో చీముసంబంధమైన కురుపులులేస్తాయి. ఆరంభములో దురదవుంటుంది. ఈ కురుపులు ఎరుపురంగుగా వుంటాయి. ఈ కురుపులు తామరవలె గుండ్రముగ నుండక వంకరగావుంటాయి.కొంచెము పసుపు వర్ణముగల చీముంటుంది. ఈ చీమువలన పశువు భూమిమీద తన తలను ఆనిస్తూ విచారముగా వుంటుంది. వ్యాధి ముదిరినకొలది ముక్కులవెంట చీముపడుతుంది. మెదడు క్రమేణ తేనెతుట్టె ఆకారము వహించి తలమెత్తబడి పశువునకు బాధ ఎక్కువై చనిపోతుంది.

చికిత్స

ఆవుపాలు అర్ధశేరు, శొంఠి 1 1/2 తు, వస అరతులము కలిపి ప్రతిదినము ఈ మోతాదు వంతున పక్షముదినములు త్రాగించాలి. పైన కార్నెక్సును రాయాలి.

తలపైన పురుగులను చంపు మందుతో మర్దనచేయుచుండాలి.

లేక సూరేకారము 1/2తు, నీరు అర్ధసేరు కలిపి మెదడుపైన పోయాలి.

గుఱ్ఱపుమూత్రము, నిమ్మకాయరసము, హారతికర్పూరము కలిపి రాయాలి.

గంధకపుపొడి 2 తులములు, మైలతుత్తముపొడి 1/4 తు, పటిక పొడి 1 తు, వ్యాసులైను 16 తు, కలిపి పూయాలి.

అఱ్ఱుమాద

ఎద్దులను దున్నలను అతిగా బరువువేసి మోయించుటవలన మెడకండర భాగమంతయు కంది వాచి నల్లబడి రక్తము గడ్డకట్టి బాధవుంటుంది. అట్టి పశువులతో పనిచేయించరాదు. దీనినే అఱ్ఱుమాద అంటారు. శస్త్రము చేయవలసినపుడు అనుభవముగల వైద్యులకు చూపించవలెనుగాని ఇష్టం వచ్చినట్లు శస్త్రముచేయరాదు. ఎందుచేతనంటే రక్తనాళములు ఆ గడ్డచుట్టు చేరియుంటాయి.

గిట్టమాద

పశువుడెక్కల లోపలిభాగమున రక్తనాళములతోను, తదితరనరములతోను కూడియుండును. ఏదైన ఇనుపముక్క గ్రుచ్చుకొనుటవలనగాని, తెగుటవలనగాని, రాయిగ్రుచ్చుకొని తెగుటవలనగాని పుండ్లు పడతాయి. ఈ పుండ్లను అజాగ్రత్తగా చూచుట వలన లోపలపుండంతయు క్రుళ్ళి నరములకూడ పాడయి ఎన్ని చికిత్సలు చేసినను తగ్గక రక్తముతో కూడుకొనుటను గిట్టమాదయంటారు. అనుభవముగల వైద్యునికి చూపించాలిగాని ఈ గ్రంథములో వ్రాసిన చికిత్సలకు లొంగవు.

కాలుగొఱ్ఱు మాద

పశువులను దున్ననపుడు ఆకస్మికముగా మోకాలుక్రిందగాని గొరిసెలోగాని గిట్టపైగాని నాగటికఱ్ఱు గ్రుచ్చుకొని లోపలిభాగమంతయు కమిలి రక్తముకారి బాధపడుతుంది. ఈ సమయములో ఏ చికిత్స చేయకుండ నుండిన ఆ కఱ్ఱువిషము రక్తనాళములలో జీర్ణించి మోకాలు, తొడవరకుకూడ రక్తముగడ్డకట్టి పుండుమానక పశువు బాధపడుతుంది.

చేరుమాద

పశువు చేరులోపలిభాగపు అవయవముపైన ఒకవిధమగు ఉల్లిపొరవంటి గడ్డలేస్తుంది. మరికొన్నిటికి చేరుచివర చర్మమునకు అంటి ఒక విధమగు కురుపు లేవగనే పరీక్షించి తగినచికిత్సచేసిన తగ్గతుంది.

చికిత్స చేయకుండనుంచిన క్రుళ్ళి లోపలిభాగమంతయు చెడి మాదగావుంటుంది. చేరువంపుగానుండు భాగములోగాని కొంచెము క్రిందగాగాని ఉల్లిపొరలవంటి గడ్డలేచి గట్టిగా వుంటుంది. శస్త్రము చేసినప్పటికి కొన్ని తగ్గవు. ఇదికూడ మాదగానగును గాని ఆరంభములోనే ఇట్టివాటికి చికిత్సలు చేయించాలి.

కంటిమాద

కన్నులోపలి నరమునకు తదితర కారణములవలన దోషముతగిలి తెల్లగ్రుడ్డుపైగా శనగగింజంత కురుపుగానై చికిత్సలు చేసినపుడు తగ్గుచు లోలోపల కంటిభాగము పాడగుచు క్రమేపి కన్ను గుల్లపారిపోయి పాడవుతుంది. ఇట్టి సమయములో ఆవిరని చికిత్సచేస్తారు. ఇంత మాత్రమునకే లొంగదు. దీనినే మాదయంటారు. వెంటనే అనుభవముగల వైద్యునితో కన్నుతీయించాలి. లేనిచో రెండవ కంటికికూడ రావచ్చు.

స్తనమాద

పశువులు ఈనిన తరువాత పొదుగు, చన్నులలో పాలులేకుండ పోతాయి. కండరాలలో పటుత్వము తప్పుతుంది. చన్నులునుంచి పాలు వచ్చునేమోయని పాలుపిండితే రాజాలవు. కొన్ని చన్నులు కొరివి చన్నులుగా అవుతాయి. కొన్ని పశువుల పొదుగులు మెత్తగానుండి చన్నుల కాటంకముగా కొన్ని నాళాలు బంధించుతాయి. ఎన్ని చికిత్సలు చేసినప్పటికి ప్రయోజనముండజాలదు. ఏ మాత్రము ఒకటి రెండుధారలైన చన్నులనుంచి వస్తూవుంటే మాత్రము పాలుపడుటకు ప్రయత్నము చేయవచ్చును, లేనిచో ఏమి లాభంవుండదు.

పేగు మాద

పశువు బొడ్డునకు వెనుకకాళ్ళకు దూరముగానుండు భాగమందు ఒక గాలికణితివలెపుడుతుంది. ఈ కణితిక్రమక్రమేపి పెద్దదై కొన్ని రోజులకి ఆ కణితి చితికి పెద్దగాయముగానై, ఆ పుండు విస్తరించి లోపలనున్న పేగుల చుట్ట అంతా బయటపడుతుంది. దీనినే మనవాళ్ళు పేగుమాద అంటారు. ఈ మాదకు ఆరంభంలో తగినచికిత్సచేయాలిగాని, చివరదశలో ఏ చికిత్సకు లొంగకపోగా ఆ పశువు చచ్చిపోవుటయు గలదు. ఇట్టి పశువులను అనుభవముగల వైద్యులకు చూపించిన పేగులనులోపలికి నెట్టి కుట్టుదురు. పేగులన్నీ బయటకు వచ్చి ఆ భాగపు చర్మమంతాక్రుళ్ళిపోతే ఏ చికిత్సకు లొంగదు. మరికొందరు కణితియని దానిపైన కాల్చుతారు. అట్లు కాల్చగానే పుండు పెద్దదై పగిలి ప్రమాదము కలుగుతుంది.

* * *

ముప్పది మూడవ భాగము

వాపులు

రైతులు ఈ వాపుల విషయంలో చాలా జాగ్రత్తగా పరిశీలించాలి. కొన్ని వాపులు అంటురోగాలవల్ల గొంతుకక్రింద, మూతిమీద, జెబ్బలమీద తదితరభాగాలయందు రావచ్చును. ఇట్టి వాపులు ప్రమాదాలు కలిగించుతాయి. కాబట్టి వెంటనే కనుగొని చికిత్సచేయాలి.

విషజంతువులు కరచినగాని, కుట్టిగాని, ఊదిగాని వాపులు కలుతాయి. ఈ వాపులనుగూడ జాగ్రత్తగా పరిశీలించాలి.

మరికొన్ని వాపులు శరీర అవయవాలమీద కణుతులుగా, గడ్డులుగా, పుడతాయి. ఇట్టి వాపులు చెడు నీటితోగాని, చెడు రక్తంతోగాని చెడుగాలితోగాని కలిగియుంటాయి. కాబట్టి మీకు తెలిసినంతవరకు వీటికి చికిత్సలు చేయాలిగాని తెలియకపోయిన అనుభవం వున్న పశువైద్యులకు చూపించాలి.

పంపర వాపులు

రైతులలో కొందరు ప్రతివాపును పంపరవాపు అంటారు. ఈ పంపరవాపులో రెండుమూడు రకాలుగలవు. గంగడోలు నుంచి మెడకుత్తుక వరకు, గంగడోలునుంచి ముందుకాళ్ళు, బొడ్డు, వెనుకకాళ్ళు, పిర్రలవరకు కొన్నిగంటలలో మెత్తనివాపుపుట్టి పశువును భాదించును. దానినే గుండెనుంచి పుట్టిందంటారు. రక్తముచెడి ఆకస్మాత్తుగా చెడునీరుజేరిన చికిత్స చేయనిచో మరణమునకు కూడా సిద్ధమగుతుంది.

మరికొన్నిటిని ఉపిరివాపులంటారు. ఈ వాపులు శరీరమందెచ్చటనైన పుట్టి గట్టిగనో, మెత్తగనోవుండి పశువులను కొన్నాళ్ళు బాధించుతాయి. మరికొన్నిటికి చెవిక్రిందుగా మెడవరకును, దవడ క్రిందగాను ఈ వాపులుపుట్టును, ఇట్టివాపులు తరచుగా చలిగాలి తగులుటవలన కంఠమువరకు పుడతాయి. గడ్డులుగడ్డులుగా లేచి వాస్తాయి.

చికిత్స

గంగడోలునుంచి, కుత్తుక, వెనుకభాగము వాచి బాధపడే పశువును ఆలసించక త్వరగా వైద్యునికి చూపించుట అవసరము. తాత్కాలికంగా ఫార్మసీవారి పశురక్షామృతమును ఇచ్చి వాపులకు పెయిన్ కిల్లరును, మర్దన వేడికాపులు పెట్టాలి.

తక్కిన వాపులకు చవుడు సున్నం కలిపి చుక్కలు పెట్టవచ్చును.

లేక చింతపండు పులుసు, సున్నిపిండి తగినంత కలిపి ఉడికించి వాపులకు అప్పుడప్పుడు పెట్టాలి.

లేక బండిగురిందాకు పసరులో తగినంత సున్నము కలిపిరాయాలి.

అన్ని రకముల వాపులకు ఫార్మసివారి వాతారి అరఖు, పెయిన్ కిల్లరును వాడాలి.

చేరువాపు

పశువు అంగము మీదనుండు తిత్తిమీదగాని, లోపలగాని పుండుపడి క్రమంగా పెద్దదికాగానే తగిన చికిత్స చేయనిచో చేరుమాదగానగుతుంది. అపడప్పుడు కండ్లనుండి నీరుగార్చును. నొప్పి ఎక్కువైన కొలది పశువు నడవజాలదు. మూత్రకోశము వాచును. మూత్రము పోయలేక బాధపడుచుండును. ఈ వ్యాధి పేగులకుకూడ వ్యాపించును. ఇట్టి సమయములలో పశువునకు అపాయము కలుగును. చేరుచివర అంచులో పుండు ఏర్పడును. వాపుగలిగి బాధగానుండును. పుండును శస్త్రముచేసి హిలాన్‌నుగాని, కార్నెక్సునుగాని వాడాలి. చేరులోపల ఉల్లిపొరవంటి కణితి పుట్టిన ఎడల డాక్టరునకు చూపించవలెను. లేనిచో ప్రమాదం అవుతుంది.

చికిత్స

ఆరంభములోనే ఈ వాపునకు వేడికాపులు పెట్టుట మంచిది. తేలికయగు ఆహారపదార్థములు పెట్టుచుండాలి.

నల్లజీలకర్ర 4 తులములు, ఉప్పు 1 తులము, నల్లఉమ్మెత్తాకు రసము మెత్తగానూరి కుండలోపోసి ఉడికించి ఆ తైలము వాపునకు రాయాలి. తరువాత పిడక నిప్పుచే కాచాలి.

లేక చిన్నపిల్లలనీరుడు 2 భాగములు, ఉప్పు 1 భాగము, కలిపి ఆ నీరుడు బాగుగా ఇగురనిచ్చి అందులో ఉప్పు 2 తు, ఉత్తరేణిభస్మం 1 తు, కలిపి పశువునకు దాణాగా పెట్టుచుండాలి.

లేక గచ్చాకు 5 పిడికెళ్ళు, ఆవాలు 1 తు, నల్లజీలకర్ర 1 తు, వెల్లుల్లిపాయలు 1 తు, త్రొక్కి వుండలు చేసి దినమునకొకటి వంతున తినిపించుచుండాలి. పుండును శస్త్రముచేసి మాన్పవలెను.

అబ్బువాపు

ఎద్దులెక్కువగా బరువులుమోయుటవలన బురుదనేలలో బండ్లులాగుట విసువువిరామములేక రాత్రింబవళ్ళు బండిపని చేయుటవలన మెడమీద ఆనెడి కాడిగరుకుగా నుండుటవలన, పగ్గపు రాపిడివలన బండి ముందు వెనక బరువులు సమానముగ లేకపోవుటవలన అచ్చటి చర్మము ఒరసికొని పోవుటవలన, క్రొత్తదూడలను కలుపునపుడు మెడమీద కాడి ఆనెడి ప్రదేశమందు, చెమటఎక్కువగా పట్టుటవలన, పశువు చర్మము ఎక్కువగా బిరుసుగా నుండుటవలన ఈవాపు కలుగుతుంది. కొన్నివాపులు మెత్తగావుంటాయి. మరికొన్ని గట్టిగా వుంటాయి.

ఆ స్థలములలో ఆరంభమందు దురదగానుండి క్రమముగా అది గట్టిపడి వాపుగా పైకి కొంచెము తేలును. ఈవాపు నానాటికి పెద్దదై పెద్దగుమ్మడికాయంత పరిమాణము కలదగును. ఈ వాపులో చెడునీరుండును. మరికొన్ని వాపులు గట్టిగా నుండి పశువు పనిచేయలేక మెడనటునిటు త్రిప్పుచుండును. బలవంతంమీద పనిచేయించిన మెడనటునిటు త్రిప్పలేక మిక్కిలి బాధపడుతుంది. మిగుల విచారముగా

నుండును. గట్టిగానుండి వాపుకొన్ని దినములవరకువుండి పగిలి రసికారుతుంది. గుమ్మడికాయవలె నుండు వాపును శస్త్రము చేసిన దానినుండి మురికినీరు కారుతుంది. ఈ నీరు తగ్గిన తరువాత పశువులకు బాధతగ్గును. కాని అర్రువాపువలన పశువుకంత ప్రాణాపాయము లేదుగాని మిగుల బాధపడుతుంది. అఱ్ఱు భాగమంత వాపుయుండి నెత్తురున్న కొంతకాలములో అర్రుమాదగానై పశువు మరణిస్తుంది.

చికిత్స

అర్రువాపులను జాగ్రత్తగా పరిశీలించి చికిత్స చేయాలి.

గట్టిగానుండు వాపులకు వెంటనే ఇసుక వేయించి కాపులు పెట్టిన వెంటనే తగ్గుతుంది. అర్రుమాదయైన వాపు రక్తముతోనుండి ప్రాణాపాయము కలిగిస్తుంది.

వాపు కురుపుగా తేలి పుండయి పగిలినయెడల పటికనీటిచే కడగాలి.

అర్రులయందు ఎరుపు, నలుపు, తెలుపు రంగులుగల కొయ్య గండలు పెరిగిన ఎడల శస్త్రము చేయించాలి.

ఫార్మసీవారి వెటరినరీ ప్లాస్టర్‌నుగాని రసోత్తమనుగాని వాడాలి.

బండిగురివిందాకు పసరు 6తు, తడిరాతిసున్నము 2 తు, కలిపి రాయాలి.

లేక బిళ్ళమసి 2 తు, నిమ్మకాయంత వెన్నపూస కలిపి ప్రతిదినము వాపునకు రాయాలి.

లేక వరిపొలములందుండు నత్తలలో తెల్లనివి తెచ్చి కాల్చి సున్నముచేసి ఆముదములో కలిపి రాయాలి.

లేక బొంతజెముడుపాలు గిద్దెడు, ఆవు పేడరసము 3 గిద్దలు కలిపి వాపునకు పట్టించాలి.

గంగడోలు క్రిందవాపు

ఈ వాపు ముఖ్యముగా పశువుముందురెండు కాళ్ళమధ్య పైభాగమున వాచును. దీనినే మనవారు పేడపురుగు కుట్టుటవలన కలుగునని తలంచెదరు. ఈ వాపు వలన పశువునకు అపాయము లేదుగాని వ్యాధి ముదిరి వాపు తగిలినయెడల క్రమేణ పుండుపడును. అవుసరమున్న కొద్దిగా శస్త్రముచేయాలి.

ఆరంభములో కొంచెము వాపుండును. తరువాతపగిలి పుండగును. ఎల్లపుడు మురికిలో పశువు-నుంచుటవలన రాగలదు. ముఖ్యముగా గేదెలకు దున్నలకు ఈ వాపువస్తుంది.

చికిత్స

ఒక పదునైన చాకుతో గాని, సొరముల్లుతో గాని ఆ వాపుపైన నెత్తురువచ్చునట్లుగా పొడవాలి. తరువాత ఉడికించిన పేడరసమును, ఆ వాపుమీద చీపురుకట్టచే కొట్టాలి. కాని కొందరు వైద్యులు ఆ

వాపును కత్తిచే చీల్చుదురు. వెంటనే రక్తము ఎక్కువకారి గాయము పెద్దదగును. మరల వెంటనే చెడునీరుచేరి పశువును బాధించును. ఇటువంటి సమయములలో వేడికాపులు పెట్టాలి.

బండిగురివిందాకు నీరుసున్నముతో నూరి పశువువాపునకు పట్టించచాలి.

లేక అవిసె ఆకు నీరుసున్నముతో నూరి వాపునకు రాయాలి.

లేక జిల్లేడాకుపసరు, దుష్టపాకుపసరు, వెన్నపూస, పసుపు కలిపి ఆ వాపుభాగములకు పూయాలి.

లేక కార్నేక్సునుగాని, వెటర్నరీ ప్లాష్టరునుగాని మర్దనచేయాలి.

కాళ్ల వాపులు, పాతనొప్పులు

కాళ్ల సంబంధమగు వాతనొప్పులుగాని, దబ్బరికపు నొప్పులుగాని,జెబ్బవాపులుగాని తాత్కాలిక చికిత్సలు చేసినప్పటికి ఆ యా భాగములయందుండే వాపులుగాని, కలకలుగాని వుంటాయి. ఈ వాపులుగల భాగాలలో కొంతమంది రక్షలు వారి ఇష్టప్రకారం వేస్తారు. ఈ రక్షలు వేసినతరువాత ఏ చికిత్సచేసినను ప్రయోజనముండదు. ఎన్ని చికిత్సలకు తగ్గనప్పుడు మాత్రము అవి పాతనొప్పులు అనగా ఎప్పుడువుండే నొప్పులు అంటారు. ఈ వాపునొప్పులుగల భాగము క్రమేపి కండరభాగము క్షీణించిపోయి కాలుసమానముగా భూమిమీద ఆనించలేక బాధపడుతూ వుంటుంది. అట్టి సమయంలో వాతవేయకుండన్న అనుభవముగల వైద్యులకు చూపించాలి. ఆ వైద్యునకు కూడ సాధ్యపడకపోతే వాతవేయుట మంచిది. ఆ భాగపునొప్పి తగ్గుతుంది.

* * *

ముప్పది నాల్గవ భాగము

బుడ్డ కొట్టుట - వత్తుట

రైతులలో చాలమంది సుతారులు ఆదికాలమునుంచి మంచి వయసులోనుండు కోడెలకు సుతారంగా బుడ్డకొట్టేవారు. రాను రాను నాగరికత ప్రబలినకొలది బుడ్డకొట్టేవారే కనిపించుట లేదు. మొత్తంమీద ఇప్పుడైన సరియగు సుతారి, అనుభవశాలివుంటే జాగ్రత్తగా బుడ్డ కొట్టించమనే నా సలహా.

ఈ మధ్యకాలంనుంచి పట్కారువంటి పనిముట్టుతో వృషణాలపై నుండే నరాలను వత్తుట కొందరు మొదలుపెట్టారు. ఈ పద్ధతి మంచిదేకాని సముద్రప్రాంతాల, గరువుప్రాంతాల, కొండ ప్రాంతాలనుండే టంగణములవంటి పశువలకు ఈ పనిముట్టుతో వత్తుటమంచిదే. ఎక్కువబారీగా పెరిగే ఎద్దులకు కొట్టటమే మంచిది. ప్రతిరైతు ఈ పట్కారువంటి పనిముట్టుతో నొక్కవచ్చును. లేదా అనుభవంగలవారితో నొక్కించవచ్చు. ఒక్కొక్కప్పుడు అనుభవంగలవారు నొక్కినను ప్రమాదం కావచ్చును. శేరునరాలను సరిగా గ్రహించి పట్టుకొని జాగ్రత్తగా నొక్కాలి. పట్కారు వూపివూపి నొక్కక బాలెన్సుసరిగా చూచుకొని అనుభవంతో నొక్కాలి.

బుడ్డగొట్టుట

సాధారణముగా మనదేశములో గిత్తలకు రెండు సంవత్సరములు మొదలు అయిదు సంవత్సరములలోపుగా, అనగా 2 పండ్లు మొదలు 6 పండ్లువచ్చునప్పటికి గాని బుడ్డకొట్టరు. గిత్తకు బుడ్డకొట్టునప్పుడు త్రాడుగట్టి క్రిందకు పడద్రోసి వృషణములను గట్టిగా పట్టుకొని దాని పైనున్న నరమును చేతితో మెల్లగా క్రిందికి జారతీస్తారు. తర్వాత వృషణముల పైభాగమున నొకరోకలియు, క్రిందభాగమున నొక రోకలియు పెట్టి వృషణముల పైభాగమును గట్టిగా నొక్కి రెండవనరమును కడుపులోనికి త్రోస్తారు. తరువాత పైనున్న నరమును రోకలిమధ్య నుంచి వృషణముల లోనికి జారతీసి క్రింద కొడతారు అంతట వృషణములలోని మూలపదార్ధము పిండివలె అవుతుంది. తరువాత రోకళ్ళుతీసి వృషణములకు ఆవుపేడ, పసుపు కలిపి రాస్తారు. వెంటనే కోడిగ్రుడ్లు, పాలు పెడతారు. పొగరుబోతు గిత్తలకు రెండుముక్కుల మధ్యనున్న కండను లావుగాకుట్టి దానిగుండ ఒక అంగుళము త్రాడు ముక్కులో దూర్చి కొమ్ములకు కడతారు. ఇందుచే గిత్తపొగరు తగ్గుతుంది. 10, 15 దినములకెల్ల పశువు ఆరోగ్యముగా నుంటుంది.


కాని ఇప్పుటిపరిస్థితుల ననుసరించి పశువులకు బుడ్డలు సరిగా కొట్టకపోవుటవలన ఆ భాగమువాచి పుండై మరల వెటరినరీ ఆసుపత్రులకు తీసికొనిపోతారు. కాబట్టి లోపలి పలుకంతయు పూర్తిగా నలుగునట్లు కొట్నిచో ఆవులమీదికి పోజాలదు. వృషణముల పైభాగముబ్బి 10,15 దినములలో దానిలోపలి పలుకంతయు జీర్ణమై తిత్తిమాత్రమే వ్రేలాడుతుంది. బుడ్డకొట్టుట అరగంటపట్టును. కొట్టినతరువాత వెటరినరీ ప్లాస్టరును వేయాలి. చెడిపోయిన శస్త్రమే చేయాలి.

బర్డోజీ మాస్కు లెటరు

ఇది ఒక పెద్ద పట్కారువలెనుంటుంది. ఇది ఆస్పత్రులలో నుంటుంది. దీనిపిడివద్ద కొద్ది బలము-నుపయోగించిన ఎక్కువ బలముగా నొక్కునట్లు ఏర్పాటు చేయునదిగ ఉంటుంది. ఇది మూసినపుడు నొక్కుటకు ఏర్పాటైన భాగములు ఒకదానికి ఒకటి సందులేకుండా కలిసికొనియుంటుంది. అందువలన వీటిసందున ఏమి ఉంచినప్పటికి అదియంతయు నలిగిపోతుంది. దీనివల్ల ఒక్కొక్క నరమును నిమిష-మాత్రము నొక్కుటచేత గుల్లలు హరించుకొనిపోయి జంతువులు నపుంసకత్వమును పొందుతాయి. ఈ ఆపరేషను అయినతరువాత ఏవిధమైన చికిత్సయు అవుసరములేదు. పశువులలో ఈ ఆపరేషన్ విత్తులుతీయకుండ, నెత్తురురాకుండ చేయవచ్చును. ఈ పనిముట్టుచే వృషణములదగ్గర నున్న నరములు నొక్కినపుడు టప్‌మను శబ్దము వినబడుతుంది. తరువాత బోరిక్ ఆయింటుమెంటు గాని సల్ఫర్ ఆయింట్‌మెంటు గాని రాసి విడిచిపెడతారు. తరువాత ఒకటిరెండు దినములు వాచి క్రమేణ తగ్గుతుంది. పశువులకు జ్వరముగాని మరియొక బాధకాని కలుగదు. కనుక వెంటనే మందలో కలుపవచ్చును. కాని ఈ పనిచేయించుట వలన పశువు బుడ్డకొట్టినంత బలముగలదిగా నుండదని అనేకమంది రైతులుచెప్పిరి.

కాని బుడ్డకొట్టుట ఒక అరగంటపట్టును. ఈ పనిముట్టుచే నొక్కినచో రెండు నిముషములు పట్టును. బుడ్డకొట్టిన జంతువు కొన్ని వారములు వాపువల్ల బాధపడుతుంది. చాలకాలమువరకు వాపు తగ్గక గడ్డ కట్టి మానుటకు ఎక్కువకాలము పట్టును. ఈ పనిముట్టుచేత చేసిన, వాపు కొద్దిగా నుండును. ఆ వాపు ఒకటిరెండు దినములలో తగ్గును. బుడ్డకొట్టినపుడు జంతువుపడు బాధ చూడలేము కాని యీ పనిముట్టు





వలన కలుగుబాధ చాలతక్కువ. ఈ పద్ధతిలోకూడ అచ్చటచ్చట బుడ్డలు చెడిపోవును. నొక్కించునపుడు చివరకాలములో నెమ్మదిగా నొక్కించాలి. కొన్నిటికి ఒకేవృషణముంటుంది. దీనిని కూడ వత్త వచ్చును. ఆరంభములో వత్తినపుడు నలగనిచో మరల కొంతకాలమాగి నొక్కాలి. కొన్నిటికి ఎంతజాగ్రత్తగా నొక్కినప్పటికి తత్వమునుబట్టి బుడ్డపాడగును. వాపులకుమాత్రము పెయిన్‌కిల్లరును వెటరినరీ ప్లాస్టర్‌ను వాడాలి.

పెంపుడు పక్షులు విత్తులు తీయుట

ఇట్లు విత్తులు తీయుటకు కారణమేమనగా పక్షియొక్క పరిమాణము పెద్దది అగుటకును, దాని మాంసము తినుటకు మృదవై రుచికరముగా నుండుటకును మరియు చిన్న కోళ్ళకు విత్తనములు తీయుటచే

జగడమాడుటయందు ఇచ్చపోయి ఒక దానితో నొకటి పోరాడుట మానుటకు చేయుదురు. మూడునాలుగు మాసములు వయస్సు గల కోడిపిల్లలకు విత్తులు తీయవచ్చును.

విత్తులు తీయుటకు శస్త్రముచేయు పద్ధతి విత్తులతీయు పక్షులను బాగా పస్తుపెట్టాలి. ముప్పది గంటలవరకు పస్తుయుంచిన ఎడల పేగులు ఖాళియై ముడుచుకొని విత్తులు బాగా కనబడుతాయి.

అట్లుచేయు పక్షిని బల్లమీద ఒక ప్రక్కకు పడుకోపెట్టి ఒక నౌకరు పట్టుకోవాలి. ఇంకొక మనిషి సహాయము లేనప్పుడు ఒక ఇటుక ముక్కగాని సీసాగాని రెక్కలకొకటి, కాళ్ళకొకటి కట్టి పక్షి కదలకుండా వ్రేలాడగట్టాలి. తరువాత చివర రెండు బర్రె ఎముకలకు తుంటికి మధ్యనుండు దూది ఈకలు పీకాలి. అట్లు చేసిన చివర రెండు బర్రె ఎముకల మధ్యశస్త్రము చేయుస్థలము కనపడుతుంది. ఒకటి ఒకటిన్నర అంగుళము కత్తితో గంటుపెట్టిన చర్మము, బర్రె ఎముకల మధ్యనున్న కండరము తెగుతుంది. ఈ కోత తగినంత పైకినెట్టిన "V"అను ఇంగ్లీషు అక్షరము మాదిరి కన్నముపడి గర్భకుహరమున అంటుకొనియుండు ఆ పొరను చర్మమునందుబడిన కోత ఎంతపొడుగో అంతకోయాలి. అప్పుడు విత్తనములు కనబడువరకు పొరను కోసి బర్రె ఎముకలు ఎడముగా వుండేలా చేయు పనిముట్టును పెట్టాలి. మంచి వెలుతురు వేళలో సూర్యరశ్మితగిలి లోపల భాగమంతయు వెలుతురుగా నుండెడి సమయములో ఈ ఆపరేషన్ చేయాలి. ఎలెక్ట్రిక్ టార్చి యున్నయెడల చాలా బాగుంటుంది. నడుము అడుగుభాగము వులవకాయకు ముందు ఆకుపచ్చ రంగుకలిగిన చిక్కుడుగింజ ఆకృతిగల విత్తనము అగపడుతుంది. చెంచామాదిరియున్న పట్కారు జొనిపి విత్తనమును పట్టి మెలిపెట్టి తీయాలి. తరువాత పక్షిని మళ్ళించి అదేప్రకారము రెండవ విత్తును తీయుట చేయాలి. ఒకవైపునుంచి రెండు విత్తనములు తీయుటకు ప్రయత్నించుటకన్న ఏవైపుకావైపు కోసి తీయుటచేత ఎక్కువ కష్టములేక లాభకరముగా ఉంటుంది.

తరువాత చేయువలసిన చికిత్స ఫలితము – పుండుకు ఏమియు చేయనవసరము లేదు. అక్కడకట్టిన రక్తపుగడ్డచే మూతపడిపోతుంది. కొన్నిటికి డొక్కక్రింద వాయువు చేరుటచే విపత్తు కలుగుతుంది. అప్పుడు చర్మమును పొడిచి ఆ గాలి పోవునట్లు చేయాలి.

బుడ్డచెడుట

బుడ్డకొట్టుటవలనగాని, వత్తుటవలనగాని లోపలనరాలు లేక వృషణములు కమిలి నలిగిపోయి రక్తము చీము కలసి పడుతుంది. అట్టి సమయంలో ఏ కాకియో ఆ పుండుపైన తన ముక్కుతో పొడిస్తే వెంటనే జ్వరము వస్తుంది. పుండుకూడా పెద్దది అవుతుంది. కాబట్టి ఇట్టి పుండ్లను జాగ్రత్తగా అనుభవంగల వైద్యునితో శస్త్రచికిత్స చేయించాలి. తెలిసితెలియని త్రుప్పుపట్టిన బండకత్తులను ఉపయోగించే పరమానందయ్య వైద్యులకుమాత్రము చూపించరాదు. ఇంకను బుడ్డకు పుండుపడకుండ గట్టివాపున్నను, మెత్తటివాపున్నను జాగ్రత్తగా పరీక్షించి వైద్యునకు చూపించాలి. గట్టివాపుంటే చాలా జాగ్రత్తగా చికిత్స చేయించాలి.

* * *

ముప్పది అయిదవ భాగము

గొంతు, నాలుక, చెవి, దంతరోగాలు

పశువు గొంతుకలోపల నుండే నాలుక, దంతాలు, తదితర భాగాలకు పుండ్లుగాని, వాపులుగాని, దంతములు పుచ్చుటగాని కలిగినపుడు ఆ యా భాగలను పరీక్షించాలి. పరీక్షించిన తరువాత రైతు తాను చేయగలిగిన చికిత్సయుంటే చెయ్యాలి. తెలియకపోతే మరొక అనుభవంగల వైద్యునకు చూపించాలి. అంతేగాని తెలిసి తెలియని చికిత్సలు చేయరాదు. దంతరోగాలను అనుభవంగల వైద్యులకు చూపించాలి.

నాలుక క్రింద గుల్ల

నాలుక క్రింద నిమ్మకాయంత, దబ్బకాయంత పరిమాణముగల కురుపులేస్తుంది. ఈ కురుపులోపల తెల్లని జిగటవంటి పదార్థంతో కూడి కొన్ని మేతమ్రింగనీయక బాధపెడతాయి. నోరు తెరచిచూస్తే స్పష్టంగా గుల్లవంటి కురుపుగాని, వాపుగాని కనబడుతుంది. నోరు తెరువలేదు. అట్టి సమయములో అనుభవంగల వైద్యునికి చూపించాలి. ఆ వైద్యుడు అవసరమంటే శస్త్రము చేస్తాడు, లేకపోతే మందులతో మాన్పుతాడు.

గొంతులో కురుపులు

పశువుయొక్క గొంతుక శుచిగా లేకపోవుట వలనగాని గొంతుకలో ఒక విధమైన సూక్ష్మజీవులు ప్రవేశించి నిలుకడగా నుండుటవలన గాని, గాలికుంటు, మశూచి మున్నగు వ్యాధులు సోకుటవలనగాని ఈ కురుపులు పుడతాయి.

గొంతు వాపుదల నొందవచ్చును. నోటినుండి ఒక విధమైన చొంగ పడుతుంది. నోటినుండి దుర్వాసన వస్తుంది. కురుపులు ఎరుపురంగుగా వుంటాయి. పశువు అపరిమితముగా బాధపడుచుండును. గొంతులో పోట్లు పొడుచుచున్నట్లుండును. ఊపిరిపీల్చుటకు కష్టముగా వుంటుంది. మేత మున్నగువానిని తినదు. జావమొదలగు ద్రవ పదార్థములను త్రాగుతుంది.

చికిత్స

వెదురుగొట్టముగాని, పేముచువ్వగాని, పశువు నోటియందుంచాలి. తరువాత ఆ గొట్టముగుండా మన చేతిని పోనిచ్చి ఆ కురుపులను తాకి కనుగొనాలి. పక్వమునకు వచ్చినచో ఆ కురుపులను చిదుపాలి. ఆ పైన పటికనీటితో కడిగి తగినమందు వేయాలి.

ఉప్పు 3 తు, వేడినీరు అర్ధసేరు కలిపి త్రాగించాలి.

లేక పాతచింతపండు రసము అర్ధసేరు త్రాగించాలి.

లేక వాకుడాకు రసము 10 తులములు లోపలికియ్యాలి.

లేక వెల్లుల్లిపాయ రసము 5 తులములు త్రాగించాలి.

వాతారి అరఖును వాడాలి.

గొంతులో వస్తువులడ్డము పడుట

ఆహారవాహిక పశువుయొక్క గొంతునకు ఎడమభాగమందుంటుంది. దీనికి స్పర్శజ్ఞాన మధికము. ఆహారపదార్థములు దీనిని తాకిన వెంటనే దానిని లోపలికి పోనిచ్చి వెనుక భాగమందు ముడుచుకొనుచు దానిని ముందుకు జరుపుతుంది. ఇట్లు మేత నీరు కొంత పోయినతరువాత తిరిగి వెనుకభాగము ముడుచుకొనుటవలన ఇది క్రమముగా జరుగుతుంది. జీర్ణాశయములోనికిబోతుంది. ఇది జాలరు సంచివలె నుంటుంది. మరియు పశువునోటికి నెమరు తెచ్చుకొనుట కూడ ఈ మార్గముననే. ఈ గొట్టము యొక్క లోపలిభాగము ఎల్లప్పుడు తడిగావుంటుంది. అందువలన ఆహారము ఈ గొట్టముగుండా జారిపోతుంది.

పశువులు నమలకుండగనే చెరుకుగడలు, దుంపలు, తాటిపండ్లు, నారదినుసులు, గుడ్డపీలికలు మొదలగువానిని అతురతతో తినునప్పుడు గొంతుక్రోవిలో అనగా పైన చెప్పిన ఆహారనాళములో చిక్కుకొని అడ్డుతగులుతాయి. వానికి వాడిగల అంచులుగాని, మొనలుగాని యున్న యెడల గొంతునకు గాయము లేర్పడతాయి.

లక్షణములు

జంతువుయొక్క గొంతు నొప్పిగా వుంటుంటుంది. తగ్గుతుంది. చొంగ కారుస్తుంది. కడుపుబ్బుతుంది. కడుపుబ్బినయెడల పశువు చనిపోతుంది. ఆహారనాళము కొన్నిటికి వాస్తుంది. ముక్కులగుండ నీరు కారుస్తుంది. కడుపుబ్బకుండ నుండిన ఎడల కొంతకాలము జీవిస్తుంది.

చికిత్స

వెటరినరీ వైద్యశాలలో ఒకవిధమైన పనిముట్టును గొంతులోనికి దూర్చి అడ్డును తొలగిస్తారు. పశువు గొంతును ఒత్తరాదు. ఒక ఇనుపకడ్డీని పశువు నోటిలోకి పోనిచ్చి జాగ్రత్తగా లోపలిగాలి బయటికి లాగాలి. లాగిన తరువాత మెత్తని మేత, నూకలజావ పెట్టాలి.

సర్పి

ఈ వ్యాధి వాతరోగములో, పాండురోగములో, రక్తప్రసరణమునకు ఆటంకము గలుగుటవలన, వేడిగల పదార్థములు మేపుటవలన సర్పము ఏమాదిరిగా త్వరగా అటునిటు ప్రాకుచుండునో అదేమాదిరిగా నీ సర్పి పశువు శరీరమంతటను వ్యాపిస్తుంది.

లక్షణములు

ఆరంభములో పశువునకు జ్వరము కలుగును. పశువు కంఠములోపలనో, తదితర భాగములందో ఒక విధమైన కురుపులు లేస్తాయి. ఇవి లేచినవెంటనే త్వరత్వరగా ఆ యా ప్రదేశములకు ప్రాకుతాయి.

నోరు తెరువజాలదు. నోటివెంట ఒక విధమైన చొంగకారుతుంది దాహమెక్కువగా వుంటుంది. వ్యాధి ముదిరినకొలది నోరు తెరువజాలక ఒక విధమైన దుర్వాసనకొడుతుంది. నాలుక నటునిటు త్రిప్పజాలక రెండు దవడల మధ్యగా కరచుకొనివుంటుంది. మూతిభాగమందైనచో ఆ భాగమంతయు వాస్తుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసములకాటంకపరుస్తుంది. క్రమేణ కంఠముదగ్గరగాని, మూతిమీదగాని, యున్న వాపు గంగడోలునకు దిగును. ఈ విధముగా 3,4 దినములుండి ఉచ్ఛ్వాస నిశ్వాసము లాడక మృతినొందుతుంది.

చికిత్స

చేదుజీలకర్ర 1 తులము తీసికొని తేనెతో కలిపి ఆ సర్పిభాగములకు రాయాలి. లేక నల్ల ఉమ్మెత్తాకురసము రాయవచ్చును.

తప్పకుండ విరేచనమునకు మందీయాలి. పటికనీటితో నోటిని కడుగుచుండాలి. లోపలికి వాతారి అరఖును, పైవాపునకు వెటర్నరీ ప్లాస్టరును వాడాలి.

హెచ్చరిక

ఈ వ్యాధి తగిలిన పశువును ప్రత్యేకస్థలమందుంచుటత్యవసరము. అనుభవముగల వైద్యునకు చూపించి తగిన చికిత్సచేయాలి. కొందరు మంత్రములను పెట్టించెదరు. ఎన్ని మంత్రములు పెట్టినప్పటికి ఆరంభములోనే తగినచికిత్స చేయనియెడల లాభములేదు. ఈ వ్యాధి మనుష్యులకు సోకుటకంటె పశువులకు నాలుగురెట్లు విస్తరించును.

నాలుక రోగములు

1. నాలుకపగిలి మొద్దుబారి రుచితెలియక, గరగరలాడుచు అప్పుడప్పుడు నీరుపడుచుండిన మాచికాయపొడి లేక కవిరిపొడి తగినంత తేనెలోకలిపి రాయుచుండిన తగ్గుతుంది.

2. నాలుక ఎర్రబారి, పొడుగై, ముండ్లు ముండ్లుగానుండి, వాచి బాధపడుచున్నపుడు ఏదైన చికిత్స చేయాలి.

3. నాలుక మిక్కుటముగావాచి పుండ్లుగాని చిన్నచిన్న రంధ్రములుపడి బాధపడుచున్నపుడు విషవస్తువులు మ్రింగినదా? సర్పియను జబ్బువలన వచ్చినదా? నాలుక తెగినదా? మున్నగు విషయములు తెలిసికొని చికిత్సచేయాలి.

4. నాలుక చివర లోపల అచ్చటచ్చట పొక్కి నల్లబడిన విషసంబంధమని గ్రహించాలి.

చెవిలో చీము

చెవిగూబలోగాని, మధ్యగూబలోగాని, వాపు గలుగుతుంది. ఇది వాతమువలన, లోపల వ్యాధి అంకురించి పైకి వాపుగా తేలుతుంది. చలిగాలి తగులుటవలన ఈ వాపు ఎక్కువై లోపల ఒకవిధమైన

పురుగు సంభవించుతుంది. ఒకటి రెండు దినములైన తరువాత దురదపుట్టి పసుపు పచ్చని చిక్కనిద్రవము కారుతుంది. దీనినే చీము అంటారు. ఈ చీము వచ్చిన తరువాత కొన్ని పశువులకు చెవిలో వ్రణముగా తేలుతుంది. ఈ వ్యాధి త్వరగా నెమ్మదిగాదు.

చికిత్స

ఈ వ్యాధిగల పశువుతో పనిచేయించరాదు. చెవిలో మందు పోసినతర్వాత చెవిని కొమ్మునకు కట్టాలి. వగరునీటితో పిచికారీ చేయాలి. వాతమువలన చెవులోనుంచి రసి కారుచున్న చాలకాలమునకుగాని తగ్గదు.

కలబందమట్టను కాచి రసముతీసి చీములేని చెవిలో రెండు మూడు పూటలు పోయాలి.

లేక గవ్వసున్నము కాల్చి పొడిచేసి ముందుగా చెవిలోవేసి, తరువాత నిమ్మపులుసు అరతులము పోయాలి.

లేక వేపనూనె 10, 15 చుక్కలు పోయాలి.

లేక పటికి 1/2 తులము, పసుపు 1 తులము కలిపి బాగా ఊదాలి.

లేక గంజాయి ఆకురసము చెవిలో పోయాలి.

లేక నిమ్మపండురసము 1/2 తు, వేపచెక్కరసము 1/2 తు, రసకర్పూరము 1/4 తు, కలిపి చెవిలో పోయాలి.

లేక సారాయి 5, 6 చుక్కలు పోయాలి.

లేక పసుపు, తురక వేపాకురసము కలిపి పోయాలి.

లేక ఫార్మసివారి ఆనోడైన్‌ను వాడుచు పశురక్షామృతమును లోపలికి వాడాలి.


దంతరోగాలు

పంటినొప్పి

ఆకస్మికముగా పశువుదంతములనుండి రక్తముకారుట, దుర్గంధముగానుండు నల్లనినెత్తురు దంతముల నుండి కారుట, ఒక దంతముప్రక్కన్న, లోపలనుండు మాంసము క్రుళ్ళి మరొకదంతమును చెడగొట్టుట మున్నగునవి దంతరోగముల లక్షణములు. ఇవి రక్తదోషమువలన కలుగుతాయి.

రెండుమూడు దంతముల మొదళ్ళలో వాపుజనించి విపరీతమగు బాధజనించును. ఇది కఫదోషమువలన వస్తుంది.

దంతములందలి రక్తము చెడిపోయి అందుండి చీముకారుట, దంతములు కదలిన ప్రమాదమని గ్రహించాలి.



దంతములనుండి రక్తముకారుచు చిగుళ్ళు వాపుగానున్న వెంటనే చికిత్స చేయాలి.

వాతదోషమువలన కొన్ని పశువులకు పంటిపై పన్ను, దంతముపై దంతముపెరిగి బాధగానుండుట, పన్ను పెరిగినకొలది బాధతగ్గి మేత ఊచుట, తినవలెను కోరికతో తిని క్రక్కుట కలుగుచుండును. ఇట్టి సమయములలో తగిన చికిత్సలేదు.

వాతాది దోషమువలన దంతముచుట్టు ప్రక్కల, నాలుక దవడ భాగమందుండు ఉమ్మిగోళములు ముడుచుకొనిపోవుటవలన పశువు ఆహారము తినలేక బాధపడుచు, కొద్దికొద్దిగా తినుచు క్రక్కుచు, విచారపడుచుండును. ఈ వ్యాధి ఒక వైపునకుగాని రెండు భాగములందుగాని రావచ్చును. ఇట్టిసమయములో అనుభవ పశువైద్యులకు చూపించాలి.

దవడచివర పంటికుదుళ్ళలో ఎక్కువగా వాపుకలిగి పోట్లు ఎక్కువగా ఉండి చొంగకారుట, అంగటి ముండ్లవలన వాతమువలన రావచ్చును.

వాతమువలన దంతములమీద; లోపల ఒక విధమగు క్రిమిజనించి తినుచు బాధ పోటు, చొల్లుకారుట, మేతతినలేకుండుట, పిప్పిపన్నగుట, దంతములు లేతపొగాకు రంగుగానుండుట కలుగును. ఇట్టి సమయములో ఈ పన్నును తీసివేయాలి. లేదా ఏదైనా చికిత్స చేయాలి.

నాలుగైదు దంతములు పిప్పిగానై మేతమేయక బాధపడుచున్నపుడు చచ్చు దవడయందురు. దవడపై భాగమున కాల్చవలసివచ్చును. దంతరోగములకు ఫార్మసీవారి "గవారి" పనిచేయును.

పంటియొక్క నరము రేగుదల నొందుటవలన దెబ్బతగులుట వలన ఈ నొప్పి కలుగుతుంది. పండ్లమధ్య నుండెడి ఆహారము క్రుళ్ళుటవలన నోటియందుండెడి పుట్టకొక్కుజాతి సంబంధమగు ఒక పురుగు పన్నులనావరించి పంటిని తినును. ముందు ఆర్లు పెరిగినవేమో చూడాలి.

చికిత్స

చిత్రమూలము వేరు రసము నొప్పిగల భాగమునకు పట్టించిన తగ్గుతుంది.

లేక పొగాకుపొడి అంటించినయెడల తగ్గుతుంది.

లేక పెప్పరమెంటు ఆయిల్ 4,5 చుక్కలు దూదిలో ముంచి పండ్లసందున పెట్టాలి. ఫార్మసీవారి గవారి వాడాలి.

ప్రక్క దంతములు

పశువు పండ్లు సమానముగలేక హెచ్చుతగ్గులుగా పెరుగుటచే మేత సరిగా తినజాలదు. దవడలకు నొప్పికలుగును. వాతరోగమువలన కూడ దంతములు హెచ్చుతగ్గులుగా కలుగవచ్చును. లేక దంతము ప్రక్కన మరొక దంతము పెరుగవచ్చును. దంతము పెరిగిన చికిత్సకు లొంగదు.

షరా :– ఇటువంటి దంతములను తీసివేయుటగాని, లేక ఆకురాతితో అరగతీయుటగాని మంచిది. పశువులను కొనువారు పండ్లుగాని, దంతములుగాని కదలుచున్న, అలాంటి పశువులను కొనుట తగదనియు చాల జ్రాగత్తగా ఆలోచించుకొనుట మంచిదనియు నా అభిప్రాయము.

దంతముల రంగు మారుట

కొన్ని పశువుల దంతముల రంగుమారి నలుపుగా ఉంటాయి. దంతములందలి రక్తముచెడి రంగుమారును. ఈ రంగు ముదిరినకొలది దంతములు గుల్లయై ఒక విధమైన ద్రవము గలుగుతుంది. క్రమక్రమముగా ఆ గుల్లలో పురుగులుపడి పశువు బాధపడుతుంది.

చికిత్స

ఇంగువను నూరి ఆ దంతములో పెట్టాలి.

లేక పురుగులుపడిన ఎడల జాగ్రత్తగా వగరునీటితో కడిగి ఇదివరకు పురుగులకు వాడినమందులు ఉపయోగించాలి.

దంతములు కదలుట

వాతరోగమువలన, నిక్కాకవలన, ఏదైన దెబ్బతగుటవలన, గట్టి పదార్థములు తినుటవలన, వృద్ధాప్యము వచ్చిన పశువులకు దంతములు కదలును. దవడ భాగమునకు గవారిని వాడి తరువాత రక్షలు వేయాలి.

* * *

ముప్పది ఆరవ భాగము

చర్మరోగాలు

పశువునకు ఆరోగ్యవంతమైన చర్మమే అందానికి మూలకారణము. ఆరోగ్యానికి చర్మముతీరు కొలతబద్దవంటిది. చర్మపు స్థితినిబట్టి పశువునకు ఉండే కొన్నికొన్ని రుగ్మతలనూ, రోగాలనూ పోల్చవచ్చు. చర్మాన్ని జాగ్రతగా పరిశీలస్తే అది రెండురకాల పొరలవలన ఏర్పడినదని, ఆ రెండుపొరలకూ ప్రత్యేక విధులున్నాయనీ తెలియవస్తుంది. ఈ రెండుపొరలలో పైపొర లేకున్న చర్మానికి నష్టమే. పైపొరభాగం నిత్యం అరిగిపోతూ, పొట్టుక్రింద, మట్టిక్రింద నలుగుతూ ఉంటుంది. అందుకనే ప్రతిరోజు పాడిగేదెలను కడిగి శుభ్రముచేయుట, దుక్కిటెద్దులు వగైరాలను మాలీషుచేయుట జరుపుతూ ఉండాలి. లేనిచో చర్మములో పేలు, ఈగలు, గోమారులు వగైరాపుట్టి పశువులను పలువిధరోగాలుపాలు చేస్తాయి.

కాలిన బొబ్బలు

పశువుశరీరము మీద వేడినీరు, వేడిగంజి, ఎర్రగాకాలిన ఇనుప వస్తువులు మున్నగునవి ఆకస్మికంగా పడినపుడు, గంధకపు ద్రావకము మొదలగు ద్రావాకాలు తగిలినపుడు పశువు శరీరము కాలుతుంది. శరీరముమీద తేలికగా కాలినయెడల శరీరము ఎఱ్ఱబడుతుంది. దేహము కూడ కాలినచో బొబ్బలవుతాయి. శరీరము ఎక్కువగా కాలినయెడల అపాయము కలుగుతుంది. శరీరముమీద పుండ్లుపడితె ఈగలు ముసిరి పురుగులను కలుగచేస్తాయి. కాబట్టి జాగ్రత్తగా కాపాడాలి.

చికిత్స

నవనీతమును వాడాలి. నవనీతమంటే సున్నపునీరు కొబ్బరినూనె సమానముగా కలిపి చేతితోగిలకొట్టగా వచ్చిన వెన్నవంటి పదార్థమునే నవనీతమంటారు. శరీరము కాలగనే వెంటనే ఆరగఆరగా ఈ నవనీతాన్ని రాయాలి.

లేక మజ్జిగతో పిడకబూడిదను కలిపి రాయాలి.

లేక వంట ఆముదము సవాసేరు, రాతితడిసున్నం పదితులాలు, నీరు మానెడు కలిపి చేతితోగిలకొట్టగా వచ్చిన వెన్నవంటి పదార్థాన్ని కూడ నవనీతమంటారు. దీనినికూడా వాడవచ్చును.

లేక ఫార్మసీవారి గ్లయిమాల్‌ను రాయాలి.

గజ్జి

ఇది పశువులకు ఒకవిధమగు సూక్ష్మజీవులవలన రాగలదు. ఈ పురుగులను "పారసైట్" జీవులంటారు. ఇవి చర్మభాగములోనుండే రోగపదార్థాన్ని తినుచు లోపల గ్రుడ్లుపెట్టి పొదుగుతాయి. ఇదివేడి రోగపదార్థముగా

నుండి దురద, గులహెచ్చుగావుంటుంది. ఈ గజ్జి మెత్తనిభాగానికి ఎక్కువగా సోకుతుంది. ఈ రోగము పెద్దపశువులకు, బలహీనంగావుండే మగపశువులకు ఎక్కువగా వుంటుంది. ఈ గజ్జినే చర్మనుసిమిరి అంటారు. మూపురంమీద, మెడభాగమందు, వెన్ను భాగమందు, ప్రక్కటెముకల చర్మముమీద నలుపురంగుగా గాని, పసిమి రంగుగాగాని యుండి దురద కలిగినపుడెల్ల గోడలకు, చెట్లకు వేసి రుద్దుకుంటుంది. వ్యాధి ముదిరిన తగ్గుట కష్టము.

చికిత్స

గంధకము 1 తు, మైలతుత్తం 1/4 తు, వ్యాసులైను 8 తులాలు కలిపి అప్పుడప్పుడు రాయాలి.

లేక సన్నని గోనెపట్టాతునకును మాడ్చి ఆముదంతోకలిపి రాయాలి. లేక ఫార్మసీవారి కీటారి అత్యద్భుతంగా పనిచేస్తుంది.

గజచర్మ రోగము

ఈ వ్యాధి పేనుసంబంధమైనట్టి, బూజుసంబంధమైనట్టి, సూక్ష్మజీవులవలన పశువులకు కలుగుచున్నది. ఇది ఉష్ణరోగపదార్థ మండలమువలన ఉత్పత్తియగును. మొదట పశువుశరీరమునందక్కడక్కడ ఈ నుసిమిరి పుట్టి క్రమేపి వృద్ధియగుచుండును. పశువునకు ఎక్కువగా దురద, మంట పుట్టి అప్పుడప్పుడు తన పండ్లతో గీచుకొనుచుండును. బొబ్బలుకూడ పుట్టవచ్చును. క్రమముగ నల్లమచ్చలుగ మారి అవి గ్రుడ్లుపోసి పలుచని ద్రవము స్రవింపజేయును. వెంట్రుకలు రాలిపోవును. ఈ వ్యాధిగిత్తలకు తరుచుగా వచ్చుచుండును. పశువు అప్పుడప్పుడు నుసిమిరియున్నచోట గోడలకు, గుంజలకు, కట్టుగొయ్యకు వేసి రుద్దుకొనుచుండును. పశువు ఆకారముచెడి క్షీణించును, కాంతి తగ్గును. ఈ వ్యాధి ముదిరినచో తగ్గుట చాలకష్టం.

చికిత్స

సైంధవలవణము కలబందమట్టరసముతో కలిపి రాయాలి.

మేకవదరు వేడియైనది తీసికొనివచ్చి శరీరమునకు మూడునాలుగు పూతలు పెట్టి తరువాత వేడినీటితో కడగాలి.

2 తులముల పసుపు, అర్ధసేరు ఆవుపాలతో కలిపి ఒకపూట త్రాగించిన తరువాత అడ్డనరపువిత్తులు, నువ్వులు, ఉప్పు, కొట్టుపసుపు, వెట్టిపుచ్చ వేళ్ళు, బావంచాలు, జిల్లేడుమొగ్గలు ఒక్కొక్కటి తులము వంతున తీసికొనివచ్చి మెత్తగానూరి వేపనూనెతో కలిపి నుసిమిరియున్నచోట రాయవలెను. మూడవనాడు మేకపొట్టలో నుండు వెచ్చని వదరు రుద్ది నాల్గవనాడు వేడినీటితో శరీరమంతయు కడుగవలెను. శరీరమంతా వ్యాపించి మచ్చలుపడి బాధజెందు నుసిమిరి తగ్గుట చాలకష్టము. కీటారిని వాడాలి. లేక పాలతో ఇంజెక్షను చేయించాలి.

పశువు దేహము ఉడుకెత్తుట

పశువును అతితీవ్రమైన ఎండలో పనిచేయించుచుండుటవలన ఆ సమయములోనే దాహమెక్కువై శరీరము ఉడుకెత్తియుండునపుడు చన్నీళ్ళతో దేహము కడుగుటచేత, జ్వరము కలిగి యుండునపుడు ఎండలో పనిచేయించుటచేత వ్యాధి కలుగును. పశువు ఎండలో నుండజాలదు. వగర్చుచుండును. నీడకు పోవుచుండును. ఒకానొకప్పుడు నీటిలో కూడ పడుతుంది. దేహమంతయు మంటలెక్కుతుంది.

చికిత్స

నూరేకారము 2 తులములు నీటిలోకలిపి త్రాగించాలి.

చన్నీటిలో గుడ్డముంచి తలకు కొట్టాలి.

శరీరముపైన కూడ చన్నీటికాపులు పెట్టాలి. లేక పాన్‌టాల్ వాడాలి.

వెంట్రుకలు ఊడిపోవుట

పశువునకు పెద్దరోగము, జ్వరము, గాలికుంటు మొదలగు రోగములు తగిలి నెమ్మదించిన తరువాత పశువు ఈనినతరువాతను లేతదూడలకు దర్భలత్వముచేత వెంట్రుకలూడిపోవుట తటస్థించును. పొట్టి వెంట్రుకలను కత్తిరించాలి.

తరువాత పోకచెక్క నీటితో కడిగి నీలిమందుతో ఉమ్మిచేర్చి రాయాలి.

లేక వ్యాసులైనులో నీలిమందు తగినంత కలిపి రాయాలి.

లేక ముసాంబ్రము ఘాటుసారాయిలో కలిపి రాయాలి.

లేక వెల్లుల్లిపాయలపొట్టు కాల్చి సీమనూనెలో కలిపి రాయాలి.

గోమారులు బుడ్డపుంజులు

ఈ గోమారులు కాలబుతువులనుబట్టి పుట్టుచుండును. మరల వాటంతటవి పోవుచుండును. కాని ఇవి పశువును పట్టుకొని నెత్తురును పీల్చుటచేత పశువు దుర్బలత్వముచెంది పలువిధ సంకటముల పాలగుతుంది. కాబట్టి వెంటనే వీటికి తగు చికిత్సచేయాలి. గోమారులు బహు మొండిజాతి వీటికి పశువు శరీరమును తొలుచుకొని పోవునంతటి శక్తి గలదు. ఈ గోమారులున్న పశువును చూచిన మనకు చాల అసహ్యకరముగ నుంటుంది. ఈ గోమారులవల్ల రక్తమూత్రమను వ్యాధి సోకునని ఇదివరకె ఈ గ్రంథములో చెప్పియుంటిని. పశువు పొదుగుమీదను, కాళ్ళమీదను, కండ్ల రెప్పలమీదను వీలులేని స్థలములమీదను పట్టి బాధించుతాయి.

చికిత్స

ఫినాయిల్ అర్ధసేరు, ఫ్రెంచి వార్నిషు పావుసేరు, కార్బాలిక్ 2 తు గంధకపుపొడి 4 తు, వేడినీరు సేరు కలిపి దీనిని గుడ్డతోముంచి రాయాలి.

లేక మంచినూనె దేహమంతటికి రాసి ఎండలో నుంచినయెడల చావవుగాని ఊడిపోతాయి. కాబట్టి ఈ చికిత్స చేయు పశువును దూరముగానుండు ప్రత్యేకస్థలమందుంచి చికిత్సచేయాలి. లేక ఫార్మసీవారి కండూత్రును వాడాలి.

హెచ్చరిక

గోమారులున్న కొట్టములలో పశువునుంచి చిన్న మంటవేయుదురు. ఇదిచాల ప్రమాదకరమైన విషయం. నేను ఈ గోమారులవలన తగులబడిన కొట్టములు ప్రత్యేకముగా చూచియున్నానను. కాబట్టి ఇటువంటి ప్రమాదకరమైన పనులు చేయుటచేత కొన్ని పశువులుకూడ మరణిస్తాయి.

తోక నుసిమిరి

పేడ, మన్ను మొదలగు కల్మషపదార్థములు పశువుతోకకు అంటుకొని ఉండుటచేతను రైతులు వానిని పరిశుభ్రముగా కడుగకపోవుటచేతను ఈ వ్యాధి కలుగుతుంది. ఒక విధమైన బూజు సంబంధమైన సూక్ష్మజీవులు తోకలోపలి భాగమున ప్రవేశించి దురద పుడుతుంది. తోక నల్లబడి వెంట్రుకలూడిపోవును. ఈ వ్యాధి పశువుతోక ఉకుచ్చుకు పై భాగముననే ఉంటుంది. ఇది ఎక్కువగా వ్యాపించినకొలది పశువుతోక సరిగా ఎత్తలేక కుచ్చుతో నటునిటు విసరుకొంటుంది.

చికిత్స

మైలతుత్తము పావుతులము, గంధకము 1 తు, వస 1తు, వ్యాసులైను 2 తు కలిపి నుసిమిరికి రుద్దాలి.

లేక ఒక వంటపిడకతెచ్చి తోకపైన్ను నుసిమిరిపై ఎఱ్ఱబడునట్టు రుద్దాలి. తరువాత దానిపైన పసుపు మీగడ కలిపి రాయాలి. ఇట్లు రెండుమూడు దినములు చేసిన నెమ్మదియగుతుంది.

పసుపు నల్లేరుతో కలిపి బాగుగా రుద్దాలి.

విషబొద్ది కొబ్బరినూనెలో కలిపి రుద్దాలి.

వెన్నతో మూర్దారుసింగు కలిపి రుద్దాలి.

ఆముదపు పలుకులు, సూరేకారము, ఉప్పు మెత్తగానూరి పెరుగుతో కలిపి రాయాలి. ఫార్మసీవారి కీటారి చక్కగా పనిచేస్తుంది.

పొడలు – మచ్చలు


పశువు శరీరముమీద గుబురు గుబురుగ ఒక విధముగ మచ్చలేర్పడుతాయి. కాని వీనివలన ప్రమాదముండదు. పశువు ఆకారము చెడుతుంది. వాటంతటవి పుడుతుంటాయి. ఇవి చలిగాలి సోకగనే పోతాయి.

చికిత్స

విభూతి, పుల్లమజ్జిగ కలిపి నాలుగైదు దినములు రాయాలి. మజ్జిగలో పిడక బూడిదకలిపి రాయాలి. ఆవనూనెలో వెల్లుల్లిపాయలు వేసి కాచి రాయాలి. వేపాకు కాల్చిన బూడిదలో నెయ్యికలిపి రాయాలి. రావిచెక్కబూడిద క్రొత్త తడిసున్నముతో కలిపి రాయాలి. లేక హిలాన్‌ను వాడాలి.

జోరీగలు

జోరీగలు పశువుకడుపు అడుగు భాగమున, తదితర భాగములందును వందలకొలదిగా, వేసవికాలపు చివరదినములలో ఎక్కువగా కన్పించును. జోరీగపిల్లలను పశువు మ్రింగినపుడు గుండుసూది పరిమాణము గలిగియుండును. కాని రెండు నెలలపిమ్మట యవి జూన్, జూలై వరకు లోపలనేయుండి తరువాత



మలముతోపాటు బైటికివచ్చును. ఈ పురుగులు కడుపు లోపలిభాగమునుండి ఏమైన హానిచేయునదియు, లేనిదియు పశువైద్యు లేమియు చెప్పజాలరు. పశువుశరీరము వెలుపల నివసించు జోరీగలు చర్మముపైన గ్రుడ్లుపెట్టి సంతానవృద్ధిని పెంపొందించును. పశువురక్తమును పీల్చుచుండును. ఇవి ఎక్కువగానున్న పశుపు క్రమేపి క్షీణిస్తుంది. పశువునకు దురదపుడుతుంది. ఇవి అంటువ్యాధులను వ్యాపింపజేస్తాయి.

చికిత్స

వీటి కింతవరకు సరియైన చికిత్స కుదురలేదు.

ఫినాయిల్ 1 భాగము, నీరు 2 భాగములు కలిపి దేహమంతయు రాయాలి.

లేక కర్పూరతైలమునుగాని, తారుగాని ఆ యా భాగములందు రాయాలి.

లేక కండ్రూతును వాడాలి.

దోమలు

పల్లపుప్రదేశములలోను, మురికిగుంటలలోను ఇవి ఎక్కువగా నుండును. వీటివలననే పశువులకు అనేక విధములైన వ్యాధులు ప్రబలుచుండును. కాబట్టి నీటినిర్మూలమునకు తగిన చికిత్స చేయాలి. దోమలు పశువులకు మిక్కిలి హానిని కలిగించు శత్రువులు. కొన్ని దోమలువిషకరమైన కాటుగలవి. ఏనుగుకాలు అనువ్యాధి వీటివలననే కలుగుచున్నది. కాని వానిని పరీక్షచేయుట కష్టము. కనుక అన్ని దోమలును విషము గలవని తలంచి జాగ్రత్త తీసికొనుట మంచిది. ఈగలవలెనే దోమలకు జన్మపారంపర్యమున్నది. మురుగుకాలువలు, బురదనేలను దోమలకు మిగులనిష్టము. కుడితితొట్లలోను, పగిలిపోయిన డబ్బాలలోను నీరు నిలిచి యుండకుండ జూడాలి.

చికిత్స


ఆవుపేడతో కలిపిన చెత్తను తెచ్చి దానిలో గవ్వసాంబ్రాణి అమరశిల గంధకము కలిపి పొగవేసిన మరల అవి రాజాలవు. లేక దాల్చిన అరఖు లవంగాల అరఖు నీటిలో కలిపి చల్లిన దోమలు రావు.

లేక భూతులసిచెట్లను కొట్టములలో కట్టిన రాజాలవు.

పేలు

ఇవి మనుష్యుల తలలలోనుండు పేలకంటె కొంచెమెక్కువ పరిమాణము కలిగియుండును. ఇవి కుట్టినచోట దద్దురుపుట్టిచర్మము వాచును. వాటిని తేలికగా చంపవచ్చును కాని ఈపి తీసివేయుట కష్టము. కొబ్బరిచిప్పలు కాల్చినచమురును పేలున్నచోట రాయాలి. లేక వెల్లుల్లిపాయలరసమును రాయాలి.

మిన్నల్లులు



కొన్ని దూడలకు మిన్నల్లులు పట్టిబాధించును. వెంట్రుకలు రాలిపోవును. పుండ్లు పడి దూడ నాకుకొనుచుండును. ఈ బాధ ఎక్కువైన కొలది దూడ చనిపోవును. ఇవి పాలదూడలకు తరచుగా పట్టుచుండును. మిన్నల్లులు చర్మమునందు రంధ్రములుజేసి గ్రుడ్లుపెట్టును. ఆ గ్రుడ్లు పిల్లలై చర్మముపై దురదను వచ్చును. ఇవి రోగములుగల పశువు రక్తమును పీల్చి ఇతర పశువుల దేహములలో దీనిని విడుచుటవలన అంటువ్యాధులు కలుగుచుండును. ముందు దూడలబొచ్చు కత్తిరించాలి.

చికిత్స

ఫినాయిల్ 1 భాగము, నీరు 2 భాగములు కలిపి శరీరమునకు పట్టించాలి.

లేక వేపనూనె 1 భాగము, కిరసనాయిల్ 2 భాగములు కలిపి పట్టించిన వెంటనే తగ్గును.

లేక వేపాకు నీటిలో వేసి మరగకాచి ఆ నీటితో దూడను కడుగవలెను. లేక కండ్రూతును వాడాలి.

* * *

ముప్పది ఏడవ భాగము

ప్రకృతిజంతు చికిత్స

ఈ చికిత్సలుకావాలని రైతులుకోరగా ముఖ్యవిషయాలు మాత్రమే తెలుపుచున్నాము. మానవునికివలె పశువులకు బీరకాయలు, సొరకాయలు, వివిధరకాల పండ్లువగైరా ఈయడమంటే రైతులకెంతో నష్టం. అందుచేత ఈ జంతుచికిత్సలో అంటురోగాలకు, తదితర రోగాలకు లోపలికి అపక్వాహారాలు ఈయమనిగాని, తొట్టిస్నానాలు చేయమని గాని తెలుపలేదు. ఎంతసేపూ చర్మముపైన కలిగే రోగాలకే చికిత్సలు తెలిపితిమి. ఈ పశువైద్య చింతామణి ఇంకను అన్ని భాగాలవిషయాలను గూర్చి వ్రాయాలంటే ఇంతకంటె రెండు రెట్లు గ్రంథమవుతుంది. అప్పుడు పశువిజ్ఞాన సర్వస్వమని పేరున పిలువవలసివస్తుంది. గ్రంథకర్తకు సరియగు ఆదరణలేక ఆపవలసివచ్చింది.

జంతువులకు, పశువులకు మందులు అవసరము లేకుండానే ఆహారమును మార్చుటచేత, పంచభూతాలను చికిత్స సాధనాలుగా ప్రయోగించుటచేత ఎట్టిరోగాన్నైనా కుదర్చవచ్చును. ఈ చికిత్స సాధనాలకు వ్యయప్రయాసలు చాలాతక్కువ. ప్రకృతిలో ఏ జంతువులయందైనను వైద్యుల తెగ అనేదిలేదు. ఏ జంతువు అవుసరమైనపుడు తమవ్యాధులను నిర్మూలించుకునే శక్తి భగవంతుడే సృష్టించాడు. ఇది ప్రకృతిరహస్యము. కుక్కకురోగము వచ్చినపుడు ఆహారముమాని గరికమున్నగు వాటినితినుట మనకందరకు తెలిసినవిషయమేకదా? ప్రకృతి మనకు ఇచ్చిన ఆహారం కృత్రిమంగామార్పుజేసి భుజించిన, జీర్ణముకలుగ జేయుటకు మనజీర్ణావయవాలు సృష్టింపబడలేదు. ప్రకృత సంజనితమైన ఆహారాలు అవి ఏ జంతువునకు నిర్ణయింపబడినవో ఆ జంతువునకే రుచి తెలుస్తుంది. పశువుమేయు గడ్డియందురుచిలేనిచో అది మేయగలదా? ఇంకను ప్రకృతిలో ఏ జంతువుతినవలసిన ఆహారము ఆ జంతువునకు హితమగు వాసనయిచ్చును. మాంసాహారులగు కుక్క, పిల్లి మున్నగు జంతువుల పండ్లయందు వాటికట్టి అసహ్యకరమగు వాసనయుండుట వలన పండిన పండ్లను వేసిన అవితినక పారిపోతాయి. బలిష్టమగు ఏనుగునకు ఆకులు కొమ్మలేకదా అంతబలము శక్తిని యిచ్చేవి. తోకలేనికోతి సింహము, పులి మున్నగు క్రూరజంతువులతో పోరాడిజయింపగలదు. ఇది మాంసముతినదు. కాని ఆహారము పండ్లు, గింజలేకదా? ఆవచనము కాని గింజలవలననేగదా దాని కంతబలంచేకూరింది?

తప్పించగల పశువులతో రోగాలు

పశువులరోగాలు మూడు రకాలు. ఒకటి కుదర్చగలిగేవి రెండు కుదర్చబడనివి. మూడు రాకుండా ఆపగలిగేవి. రాకుండా ఆపలిగే వ్యాధులక్రింద అంటువ్యాధులును అనగా పెద్దరోగము, గురక, జెబ్బవాపు, దొమ్మ, గాలికుంటుమున్నగునవి పేర్కొనాలి. గాలి, నీరు మేత, శరీరములోని గాయము, పురుగులు మున్నగు వాటిద్వారా కొన్ని రోగాలు ఒక పశువునుండి మరియొక పశువునకు సంక్రమిస్తాయి. ఎంత జాగ్రత్తగా,

ఎంతతెలివితో చికిత్సగావించినను, నియమిత కాలమున గాని ఉధృతమునుగాని తగ్గింపజాలని వ్యాధులు కొన్ని గలవు. వీటినే చికిత్స జేసినను, చేయకపోయినను కొన్ని రోజులు రోగపశువును విడువజాలవు. ఇతర పశువులకు ఏ రీతిగా సోకునో మనకు బాగుగా తెలిసన తరువాత గాని వీటిని తప్పించుటకు తగిన ప్రయత్నము చేయజాలము.

గాలిద్వారా వ్యాపించెడిరోగాలు, మశూచి, క్షయ మొదలగునవి. ఇట్టి వ్యాధులకు సంబంధించిన అణువులు పశువుశరీరములో ప్రవేశించి, వ్యాధిలక్షణాలు బహిరంగముగ గుర్తెరిగినప్పటికి కొంతకాలము పడుతుంది. ఈ వ్యవధియొక్క పరిమితి రోగముననుసరించి హెచ్చుతగ్గులుగనండును, కాబట్టి సాంక్రామిక రోగాలచే పీడింపబడిన పశువులనుండి కొంతకాలము మంచిపశువులను దూరముగా నుంచగలిగితిమా ఈ రోగాలనుంచి తప్పించవచ్చును. ఊపిరితిత్తులకు సంబంధించిన రోగాలలో క్షయఅంతగా స్పర్శవలన వ్యాప్తిచెందదు. పెద్దరోగము, గాలికుంటుమున్నగు రోగాలు తినుమేత, త్రాగునీటిద్వారా సంక్రమించగలవు. గాన ఇట్టి రోగపశువులను ప్రత్యేకముగా నుంచినను ఒక్కొక సమయములో ఆపలేము. కాని ఇట్టిరోగ పశువులను నీటిని పరిశుభ్రంగానుంచి రోగపశువు సంపర్క మెంతమాత్రము లేకుండచేయాలి.

ఈ చికిత్స వలన రోగాలురావు

ప్రకృతిలో సంచరించు జంతువులకు సాధారణంగా వ్యాధులు రాజాలవు. ఒకప్పుడు జాగ్రతావస్థకుంటు పడుట వలననో సరియైన ఆహారము దొరకక పోవుటవలననో వాటికిరోగాలు రావచ్చును. వాటిని నెమ్మదిచేసి కొనుటకు వాటికి సహజమైన విజ్ఞానము గలదు. ప్రకృతిని అవిసహాయము చేసుకొని నెమ్మదిచేసుకొను చున్నవి. తీవ్రమైన రోగముగలిగిన జంతువు ఆహారముతినదు. ఆపదలు వెనుకాడినపుడే అవి మేతతింటాయి. అంతమాత్రమునకే రోగములు పోజాలవు. జీర్ణయంత్రమునకు ఆ సమయమందు విశ్రాంతి కావాలి. చికిత్సకూడా అవసరము. సహజజ్ఞానమువలన వాటికి చికిత్సలు కుదురుతున్నాయి. కుక్కకు దెబ్బ తగిలినప్పుడు గాయమును అది నాకుకుంటుంది. నాకజాలని చోటునందు దానికిగాయము తగిలిన అది చాలాకాలమువరకు మానదు. ఒక్కొక్కపుడు ఆది మృత్యువాతబడుతుంది.

అడవులందలి జంతువులు నదులయందు నరస్సులయందు తమ శరీరములను తడుపుకొని పరుగెత్తుట వలన రోగాలను పోగొట్టుకొంటాయి. ఏనుగు తనతొండముతో నీటినిలాగుకొని చెవులయందును శరీరమునందంతటను జల్లుకొనుచు అన్య పదార్థాలనుండి విముక్తి నొందుచున్నది. పక్షులుజలకమాడి శరీరమంతటిని తమముక్కులతో తడుపుకొని రెక్కలను విప్పి ఆర్చుకొని గర్భాశయమునందు కలిగిన అసహజమైన ఉష్ణమును బాపుకొనుచున్నవి. పిచ్చుకలు పొడిమట్టిలో పొర్లాడి రెక్కలను విదల్చుకొని ఆరోగ్యమును బడయుచున్నవి. నీటిలో నానునట్టియు, బురదలో పొర్లాడునట్టి గేదెలు నిర్విర్యత నొందుతాయి. పులి, సింహము మున్నగు క్రూరజంతువులు నీటిలోదిగవు స్నానము చేయవు. వాటిపౌరుషమునశించదు. ఇతర జంతువులను చంపడానికి వాటినరాలలో బలము వుంటుంది.

ప్రకృతిలో ఏ జంతువుకూడా పండ్లుతోముకోదు. నాలుకైన గీచుకొనదు. అట్టి పనులు వాటికి అవసరముగకన్పట్టవు. సక్రమంగా జీర్ణమయ్యే ప్రకృతి సంబంధమగు ఆహారపదార్థాలు తింటున్నపుడు పండ్లకు నోటికిపాచి పట్టదు. మానవుని నోటిలోగాని జంతువులనోటిలోగాని దుర్గంధముంటే అజీర్ణరోగం ఉన్నదని గ్రహించాలి.

ప్రకృతి తల్లిపాలే ఆహారంగా సృష్టించింది

ఆవుదూడ పండ్లుపూర్తిగా రాకపోయినను తల్లి పాలను విడచును. అనగా కొన్ని పండ్లువచ్చినను మేతతినుటకవి చాలును. నెమరువేయుటకు రెండుమూడు దంతాలుకూడా వచ్చును. మరల దూడపుడితె ఈ తల్లిపాలు ఎంతమాత్రము త్రాగదు. త్రాగినను బలముచేకూరదు. ఇట్లే ప్రకృతిలో పండ్లుగల జంతువులకు పండ్లువచ్చువరకు తల్లిపాలు ఆహారంగా ప్రకృతి సృష్టించింది.

తెలుపురంగుగల ఆవుపాలు వేడిచేస్తాయి. ఇందుకు కారణం పాలలోవుండే తెలుపురంగును సూర్యరశ్మి ఎక్కువగా గ్రహించుటవలననే వేడిచేస్తాయి. కపిల ఆవులపాలు చలువచేస్తాయి ఇందుకు రంగే కారణము. బఱ్ఱెపాలుమంచివి, కాని వాతముచేయునంటారు. సహజమైన కుడితి, తెలికపిండి, పక్వాహారము, ఉప్పు, వేడిజేసేమేతలు పెడితే ఎక్కువపాలిస్తాయి. ఇటువంటి కృత్రిమమేపుడు పాలు దూడలకు కూడా అపకారమే.

జంతువుల జీర్ణాశయాలు

మాంసభక్షక జంతువులు, తృణభక్షక జంతువులు, ఫలభక్షక జంతువులు, సర్వభక్షక జంతువులు అని నాలుగురకాలుగా వుంటాయి. వీటికి పండ్లవరుసలలోను, ప్రేగులు జీర్ణాశయము, జ్ఞానేంద్రియాల నిర్మాణములలోను రకరకాలుగా వుంటాయి.

మాంసభక్షక జంతువులు అనగా పెద్దపులి, సింహము, కుక్క, పిల్లి వగైరా జంతువుల పండ్లుపై వరసమధ్య క్రిందివరుస ఆనుకొనియుండక ఎలుకబోనువలె పైపండ్లవరుసమధ్య క్రిందిపండ్లను, క్రిందివరుస పండ్లమధ్య పైపండ్లను ఇమిడినట్లుంటాయి. ఇవి మొనలుదేరి చీల్చుటకు ఉపయోగిస్తాయి. ఆవులు, మేకలు, గొఱ్ఱెల పండ్లను తృణభక్షక పండ్లంటారు. ఈ జంతువుల పండ్లు మొద్దుబారి గడ్డికొరికి నమలుటకు మాత్రము ఉపయోగపడతాయి. ఎలుగుగొడ్డు మున్నగుజంతువుల పండ్లను సర్వభక్షక పండ్లంటారు. ఈ పండ్లతో అన్ని రకముల ఆహారాలు సులువుగా తీసుకొంటాయి. కోతిమున్నగు ఫలభక్షక జంతువులకు ముని పండ్లు కొఱుకుటకును, దంతములు నమలుటకును అనుకూలంగావుంటాయి. కాని వీటికి మాంసము చీల్చుటకు వీలగు పెద్దకోరలుగాని, గడ్డి నమలుటకు అనుకూలమగు వెడల్పుగల పండ్లుగాని ఉండవు.

మాంసభక్షక జంతువులయొక్క ఆంత్రము తలనుండి తోక మొదటి వరకు కొలిస్తే నాలుగైదు రెట్లుంటుంది. ఫలభక్షక జంతువుల తలనుంచి దిగువ వెన్ను పాముచివరవరకు కొలిచిన కొలతకు వాని ఆంత్రము 10 లేక 18 రెట్లుంటుంది.

ఫలభక్షక జంతువుల జీర్ణాశయము చిన్నదిగ గుండ్రముగ ఉంటుంది. తృణజంతువుల జీర్ణాశయము కోశరూపముగా ఉంటుంది. అందులో ఒకటి అపక్వపదార్థములకు, రెండవది పక్వమైనపదార్థాలకు స్థానమై విశాలమైన ముఖ్య జీర్ణాశయము కలిగియుంటుంది. ఫలభక్షక జంతువుల జీర్ణాశయము మధ్య పరిమాణంగా ఉంటుంది.

మాంసభక్షక జంతువులు ఆహారమును తమముక్కు, నేత్రము, నాలుకతో పసివట్టుతుంది. మానవుడు తప్ప ఇతరజంతువులన్నియు పరిశుభ్రమగు తీయని ప్రవాహ ఉదకమును త్రాగుటచేత రోగములంతగా వాటికి రాజాలవు.

జంతువుల మలవిసర్జన

సూర్యోదయమగుతుండగా జీవకోటియంతా చైతన్యమునొందుచున్నది. పక్షుల కిలకిలలు, జింతువుల అరపులు, పుష్పచయము విప్పి తమ సౌందర్యమును వెదజల్లుట, నాగరికత అంతగా అలవడని మానవులుకూడ మేల్కాంచుట ఇందుకు తార్కాణములు. ఆ సమయంలోనే ప్రాణికోటికెల్ల జవసత్వములు ఎక్కువగా వుంటాయి. ప్రకృతిలోనుండే జంతువులన్నియు మలవిసర్జన చేస్తాయి. ఉదయమే మేల్కొని మలవిసర్జన చేయని ప్రాణికోటికి మలబద్ధకమేర్పడుతుంది, మలముగట్టిపడినట్లుండరాదు. ఏ జంతువునకైన మలవిసర్జన అగునపుడు ఆసనమునకు ఒరిపిడిగాని బాధగాని కలుగరాదు. పలుచగాను వుండరాదు. నీటివలెను వుండరాదు. ఆసనమునకు మలము అంటుకొనరాదు. అంటే మలముగట్టిగానుండి ద్రవముతో పొదగబడి జారాలి. ప్రకృతిసిద్ధమైన ఆహారవిహారాలు చేయు ప్రతిజంతువునింతే.

జంతువులకు సూర్యకిరణాల రంగుల ఉపయోగాలు

సూర్యలోకంలోవున్న సప్తగ్రహాలలో ఒక్కొకటి ఒక్కొక్క రంగును ఇస్తున్నది. అవి సకలజీవులకు అవసరము. సూర్యుడు ప్రకాశించు ప్రదేశము నందంతట వివిధరోగ నివారణలకవకాశము గలదు. సూర్యునివలన లభించు ఉష్ణము, వెలుతురు, శీతలముల వల్లనే అన్ని జంతువుల శరీరములు ఆరోగ్యముగా ఉంటున్నాయి. సనాతనఋషీశ్వరులు సూర్యకిరణమందలి సప్తవర్ణములును గ్రహించిరి. ఎరుపు, నారింజ పండు, పసుపు, నీలము, ధూమ్రము, ఆకుపచ్చవర్ణములుగ కిరణములకు రంగుంటుంది. ఈ రంగులు ప్రతిరోజు రెండు మూడుగంటలకాలం జంతువుల శరీరములమీద పడుచుండుటవల్లనే ఎట్టిరోగములకు గురికాక ఆరోగ్యవంతములుగా నుండుచున్నవి. సూర్యకిరణములు వల్లనే ఉచ్ఛ్వాస నిశ్వాసములు కలుగుచున్నవి. వాటివల్లనే శరీరమందలి క్రొవ్వు పదార్థాలు తగ్గిపోయి ఉత్సాహము, శక్తి వృద్ధియగు చున్నవి. సూర్యకిరణములను ఉపయోగించుట వలననే వాత, పిత్త, శ్లేష్మముల వలన వచ్చే అన్నిరోగాలు నశించుతున్నాయి. ఎండలో మనమెంత కాలము నిలుచున్నను రక్తముయొక్క ఉష్ణతహెచ్చదనికూడ మనము తెలిసికొనవచ్చును. అన్నిజంతువలు ప్రాణశక్తి సూర్యకిరణముల నుండియే పొందుతున్నవి.

గాలి, నీరు, మట్టి వీటియందలి సూక్ష్మజీవులు సూర్యకాంతివలన మరణించుచున్నవి. మనముపీల్చుగాలి, త్రాగునీటిని సూర్యుడు ఎప్పటికప్పుడు శుభ్రము చేస్తున్నాడు. సూర్యరశ్మి ధారాళముగా తగలని పశువులకొట్టములలో రోగాలెక్కువగా ఉంటాయి. సూర్యరశ్మితగులగానే రోగాలన్ని నశించిపోతాయి. నీలిరంగు చల్లదనాన్ని, ఆకుపచ్చరంగు కొంచెము చురుకుదనంతో కూడిన చల్లదనాన్ని, పసుపుపచ్చరంగు శరీర కాంతి జీర్ణశక్తిని, ఎరుపురంగు ఉష్ణధాతువులను, ఊదారంగు నాడీ మండలాన్ని పోషిస్తుంది.

జంతువులకు ప్రకృతివేడిమి

జంతువులుగాని పక్షులుగాని తమపాలను త్రాగునంతకాలము వాటికి తెలివివచ్చేవరకు తల్లి పక్కలోనే నిద్రించుతాయి. అప్పుడే వాటికి తగినవేడిమి లభించుతుంది. కంగారూఅనే జంతువు తనబిడ్డకు శక్తి కలుగునంతవరకు తల్లిపొట్టయందుండే సంచిలోనే ఉంటుంది. కోతి తనబిడ్డను తనపొట్టను పట్టుకొని దానికి అతుకుకొని పోయినట్లుగా వుంటుంది. పశువులు తమలేగలను నాకుటవలన దూడలకు ఉష్ణముకలుగుతుంది. పక్షులు తమసంతానమునకు రెక్కలువచ్చి ఎగిరి మేతను సంపాదించి తినగలిగేవరకు వాటిని తమరెక్కల క్రిందనుంచికొని నిద్రించుతాయి. సింహము, పులి, పిల్లి, కుక్క మున్నగు జంతువులు తమ సంతానమును వాటి పొట్టలకు దగ్గరగా నుంచుకొని వలయాకాగరముగా వాటిచుట్టు పరుంటాయి.

జంతువుల ఉపవాసాలు

ప్రకృతిలో సంచరించు జంతువులకు ఆకలియగునపుడు తగిన ఆహారందొరకనపుడు అవి సోమ్మసిల్లవు. కొన్ని జంతువులకు పదునైదు దినాలవరకు ఆహారము దొరకదు. అయినప్పటికి అవి అలసటచెందవు. నిరుత్సాహపడవు. ఎందుచేతనన ప్రకృతి ఆహారాలలోనే తగినంత బలవర్ధకములు వుండుటవలన అవి చాలాకాలమువరకు ఉపవాసము ఉంటాయి. కృత్రిమ ఆహారాలు, దాణాలు ఎక్కువగాతిని అజీర్తి వగైరా రోగాలువచ్చే పశువులకు ఒకటిరెండు రోజులు ఉపవాసమిచ్చుట మంచిది. చిక్కనిపాలుత్రాగి ఎక్కువై అజీర్తికలిగినపుడు రోజుకొక్క పూట ఉపవాసముంచుట మంచిది. పందెపుగిత్తలకు, ఎడ్లకు మారుబేరానికి అమ్మే పాడిపశువులకు దాణాలువగైరా పెట్టినపుడు జీర్ణమునకు రాక బాధపడుతూవుంటే ఒకటిరెండు రోజులు ఉపవాసముంచుట మంచిది. ఈ రీతిగా రైతులయొక్క అనుభవంమీద చేస్తూవుండాలి. జబ్బు చేసి తగ్గిన పశువులకు, చూడిపశువులకు ఏమైన జీర్ణరోగాలు వచ్చిన అట్టివాటికి ఉపవాసాలు ఈయవలసివస్తాయి.

పశువులకు బలముగలిగించే అపక్వాహారాలు

తృణధాన్యాలు గడ్డిజాతులు పశువులకు మంచిఆహారం. పండ్లు చమురు గల కాయలుమనకు వాటికికూడ ఆహారాలే. కాని కాయధాన్యములు జీర్ణానికి రాజాలవు. పొట్టుతోపెట్టిన దాణాలువగైరా పశువులకు మంచివి. కందులు, శనగలు ఎరుపురంగుగలవగుటచేత వేడిజేస్తాయి. మినుములు, పెసలు కొంచెము ఆకుపచ్చరంగువగుటవల్ల చలువ, వాతము చేస్తాయి. ఎరుపుతవుడు వేడిచేస్తుంది.

ఉలవలుగాని, శనగలుగాని ఉదయాన నానబెట్టిసాయంకాలము వడపోసి పదితులముల ఉప్పుకలిపి బుట్టలోపెట్టి మరునాటి సాయంకాలమువరకు వుంచిన మొలకలు మొలచును. ఈ మొలకలతో వరుసగా పక్షముిరోజులు పెట్టుచూ అప్పుడప్పుడు వాతారి అరకును ఇస్తూ వుండిన పశువులకు మంచిబలవర్ధకముగా పనిచేస్తుంది.

ఎన్ని పెట్టిననుబలియక ఎండిపోతూ వుండే పశువునకు మానెడు నానబెట్టిన శనగలలో పది తులాల ఉప్పుకలిపి సాయంకాలపుపూట దాణాగాపెట్టిన బలుస్తుంది.

వాతశరీరము గలిగి నునుపుగ బలముగనుండి డొక్కలు దించుకొని ఎల్లపుడు కనులువెంట నీరుగార్చుతూ కాళ్ళుపట్టివేయుచుండే దుక్కిటి పశువులకు తాటిబెల్లం ఒక వీసె నువ్వులనూనె అరవీసె మెత్తగా కలిపి ఒకజత ఎద్దులకు దినమున కొకమోతాదు వంతున శీతాకాలంలో అయిదారు వారాలు వరుసగా పెట్టిన మంచి ఉత్సాహము చురుకుదనముతో నుంటాయి. అంతనిక్కాక అంతవాతము లేకుండాయుండే పశువులకు మాత్రము కళాయివేసిన ఇత్తడికాగులో మెట్టతమిదెలు ఆరుకుంచాలు ఉప్పు రెండుపౌనులు కల్లుబెల్లం రెండుమణుగులు, మంచి నూనె ఒకమణుగు కలిపి ఒకవారంరోజులు నిలువయుంచి ప్రతిదినము అరవీసె మోతాదువంతున దినమున కొక పూటవంతున ఇచ్చిన చక్కని పుష్టినిస్తుంది.

కొబ్బరిపిండి, శనగపిండి, తెలకపిండి, వేరుశనగపిండి, ఒక్కొక్కటి అరవీసె మోతాదువంతున తెచ్చి మెత్తగా చూర్ణముచేసి దానిలో సవాశేరు వేయించిన మెంతిపిండి ఒక అరసోలెడు ఉప్పుకలిపి ప్రతిరోజు పాడిపశువులు త్రాగే కుడితిలో పూటకు గుప్పెడు పొడిని పాలుతక్కువగా ఇచ్చే పశువులకు త్రాగించిన పాలుచక్కగా పడును. ఈ పొడిలో ఫార్మసీవారి క్షీరోజనును ఒకపౌను పొడికలిపి వాడితే ఏరోగము రానీయకుండా పాలు ఎక్కువగా వృద్ధియగుతాయి.

ఒండుమట్టితో పశువు చికిత్స

చాలామంది మిత్రులు మానవులకు కలిగేరోగాలకు ప్రకృతి చికిత్స చేయుచున్నారుకదా! పశువులకు మాత్రము ఈ వైద్యము ఎందుకు అనుభవము సంపాదించి చికిత్స చేయకూడదని నన్ను ప్రోత్సహించు-చున్నారు. మానవులకు, పశువులకు ఈ ప్రకృతి చికిత్సలో కొద్దితేడా మాత్రమే వుందని తేటతెల్లమైనది. కాని నాకు ఈ ప్రకృతివైద్యంలో ఎంతవరకు అనుభవమున్నదో అంతవరకే ఈ చింతామణిలో తెలుపుతున్నాను.

ఒండుమట్టిని మా పశువైద్యశాలకు వచ్చేపశువులపై ప్రయోగించి కొన్ని ఫలితాలను కనుగొన్నారు. ఈ మట్టిలోకూడా చాలారకాలున్నాయి. ఈ ఒండుమట్టి ఎరుపుగాగాని, నలుపుగానివుంటే నాడులను చల్లబరచినప్పటికి, ఉష్ణఉద్రేకత కలుగుతుంది. ప్రవహించేకాలువలలో వుండే ఒండుమట్టేమంచిది. ఎండినమట్టిని నీటితోపిసికి వాడవచ్చుగాని అంతమంచిది కాదు. శరీరంలోవుండే వేడినిలాగేగుణము ఈ మట్టిలో లేదు. కాబట్టి ఎప్పుడునీటియందే నానుతూ మెత్తగావుండేమట్టినే ఉపయోగించాలి. ఎప్పటికప్పుడే

కాలువనుంచి తీసికొనివచ్చి ఉపయోగించనవసరములేదు. ఒండునుతీసికొని ఒక కుండలోనుంచి, ఆ కుండను నీడయందుంచి అందలిమట్టిని తడిగానుంచుతూ ఉపయోగించవచ్చును. ఈ రీతిగా చేస్తే అందలి మట్టి మంచిగుణము ఈయగలదు.

అర్రువాపులకు ఒండుపట్లు

పెద్ద ఎద్దులకు, దున్నలకు అర్రుమీద గట్టివాపులుగాని, మెత్తనివాపులుగాని నిమ్మకాయంత, వెలగకాయంత, గుమ్మడికాయంత పరిమాణంలో పుడతాయి. ఎక్కువగా పనిచేయించుటవలన, ఎక్కువ బరువులు వేసి లాగించుటవలన మెడనరములు వేడెక్కి రకరకాలవాపులుగా, గడ్డలుగా పుట్టి పశువులను బాధించుతాయి. మరికొన్ని వాపులు ఎన్ని చికిత్సలు చేసినను తగ్గక గడ్డలుగా కట్టి అందులో రక్తముగాని రక్తము, చీముగానిజేరి బాధించుతాయి. మరికొన్ని పెద్ద పులిపురికాయలంత పరిమాణముగలవై అర్రుభాగముపైన, ప్రక్కలను పుట్టి బాధించుతాయి. వీటిలోనుంచి రక్తము, చీము తీసినప్పటికి తగ్గక పశువులను బాధపెడతాయి.

చికిత్స

అర్రుమీద పుట్టేకంతులుగాని, వాపులుగాని గడ్డలుగాని అన్నీ తగ్గగలవు. ముందు అర్రునంతను శుభ్రమైన గోరువెచ్చనినీటితో ఏ పూటకాపూటకడిగి ఎచ్చటనైతె గడ్డలుగాని కంతులుగాని, గట్టివాపులుగాని, మెత్తనివాపులుగాని ఉంటాయో ఆ భాగమందే స్వచ్ఛమైన ఒండుతడిమట్టిని తీసికొని చిక్కగా పట్టించి నీడయందుంచాలి. నాలుగుగంటల కొకసారిగాని, ఆరుగంటలకొకసారిగాని రోజునకునాలుగు పట్లు వంతున నాలుగు లేక వారంరోజులు వేసిన ఆ గడ్డలువగైరా తడిసి అణగిపోవుటయో, మెత్తబడుటయో జరుగును. కాబట్టి మెత్తబడి పక్వమునకు వస్తే ఆ కణితిలో చీముంటే ఒకలావుగల దబ్బనము వంటిపనిముట్టును దానిలో గ్రుచ్చి చీమును తీసివేయాలి. రక్తము వస్తూఉంటేమాత్రం సూదిని వేసి గాయముచేయరాదు.

కాబట్టి తాత్కాలిక అర్రువాపులకు గడ్డలపైన ఒండు మట్టిని వేసి మాన్పించవచ్చును. మానిన తరువాత నిమ్మకాయంత వెన్నలో పావుతులం నీలిమందును కలిపి అప్పుడప్పుడు రాయుచుండిన బాధ లేకుండ పోవును. ఈ రీతిగనే గూటిమీదగాని, జెబ్బలమీదగాని, తదితర శరీరావయవముల మీదగాని ఈ ఒండుమట్టిని వేసి గడ్డలను మాన్పవచ్చును. అంతకు తగ్గనిచో అనుభవముగల వైద్యునకు చూపించాలి.

బెణుకులకు నొప్పులకు ఒండుపట్లు

జెబ్బలుగాని, గూడలుగాని, మోకాళ్ళ భాగంలోగాని, గిట్టలలో గాని పిల్లగిట్టలదగ్గరగాని దెబ్బలు తగిలిగాని, తదితర ప్రమాదాలు సంభవించిగాని బెణికిన, నొప్పిపట్టిన ఒండు మట్టి తగినంత పట్టించితే తగ్గగలవు. ఎంతవరకైతే నొప్పిగాని, వాపుగాని ఉంటుందో అంతవరకు నాలుగైదు పట్లు వేసి పరీక్షించాలి.

అంతకు తగ్గనిచో అనుభవముగల వైద్యునిసలహాతో తైలము మర్దనలు చేయించాలి. అవసరముంటే వేడి కాపులు పెట్టాలి. ఎముకలుతొలిగి బాధపడే పశువును పరీక్షించి ఎంతవరకు ఆ బాధయున్నదో తెలిసికొని ఒండుపట్టీలను వేసినతరువాత గుడ్డతో గాని, పచ్చని ఆకులువేసి కట్టుకట్టాలి. గంట, రెండుగంటలవరకు ఈ పట్లను వేయాలి.

మాదలు-పొదుగు వాపులు ఒండుపట్టీలు

కొమ్ముమాదగాని, తదితరమాదలుగాని అనగా గిట్టమాద, తలమాద, మున్నగువాటిపైన కూడ ఒండుపట్టీలువేసి కట్లుకట్టిన తగ్గుటకూడ కలదు. పొదుగువాచి లోపలగడ్డగావుండిన ఆ వాచిన భాగానికి ఒండు పట్టీని దినముకు మూడునాలుగు పర్యాయములవంతున నాలుగైదు రోజులువేసిన గడ్డలు, వాపులు తగ్గిపోతాయి. కాని మాదలకు, పొదుగు సంబంధమైన వాపులకు వేసే ఒండుపట్లను ఎప్పటికప్పుడే గోరు వెచ్చనినీటితో కడిగి పరిశుభ్రంచేసి మరల పట్లువేయాలి.

మూత్ర రోగాలకు ఒండుపట్లు

శిలామేహవాతములో ఉచ్చబుడ్డ సేరుభాగమువాచి గట్టిగా నుండి బాధపడుచున్నపుడు ఒండు పట్టీలు వేయవచ్చును. పశువు కనుగుంటలు విడచి ఉచ్చబుడ్డ బ్రద్దలై బాధపడునపుడు మాత్రంపట్లు వేయరాదు. ఇటువంటి భాగాలలో ఒండుపట్టీలు వేయాలంటేచాలా అనుభవంతో వేయాలి. ఒండుపట్లు వేసిన తరువాత తడిలేకుండ పట్లను ఎండబెట్టక ఆరనీయకుండ ఎంతకాలం ఆ పట్లువేయాలో గ్రహించి పట్లువేయాలి.

గొంతువాపులకు ఒండుపట్లు

మామూలుగా ఏ విషపురుగో కుట్టినగాని, ఏ ముండ్ల చెట్లో మ్రింగినతరువాత దానినితీసి వేసిన తరువాత గొంతుకభాగములో వాపుయుంటేగాని, మామూలుగా కళ్ళవాపులు పంపరవాపులు తలిగితేగాని జాగ్రత్తగా ఏకారణమువలన వచ్చినవో పరిశీలించి ఒండు పట్టీలు వేసిన తగ్గగలవు. గురక, దొమ్మలలో కలిగే వాపులకు మాత్రము ఈ పట్టీలు వేయరాదు.

ప్రసవరోగాలలో ఒండుపట్లు

సామాన్యముగా చూడిపశువులకు ఏ ప్రమాదమైనవచ్చి అకాల ప్రసములేక గర్భస్రావము కలిగినపుడు లోపలపిండము పడిపోయిన తరువాత యోనిపై భాగమును శుభ్రముగా కడిగి పుట్టమన్నునుగాని, ఒండు మట్టినిగాని నీటితోకలిపి పట్టువేయుట మంచిది. ఇంకను దూడ అడ్డము తిరిగి ఎన్నిచికిత్సలు చేసినను రానప్పుడు బలవంతముగా దూడకు త్రాళ్లు వేసిలాగగానే దూడ బయటికి వచ్చును. అట్టి సమయములో కూడా ఈపట్టులనే వరుసగా నాలుగురోజులువేసి తరువాత ప్రత్యేక ఒండుపట్లనే వేసిన యోనిభాగములో నుండే నరాలబాధతగ్గుతుంది. యోని భాగము కూడ త్వరలో ముడుచుకొనిపోతుంది. ఈ రీతిగా అనుభవంతో ఒండుపట్లతో చికిత్సలు చేసికోవచ్చును.

జంటబొడ్డు దూడలకు ఒండుపట్టీలు

కొన్ని దూడలు జములు బొడ్డుతోగాని, నాలుగు, ఏడుత్రాళ్ళు గల బొడ్డు త్రాడుతోగాని పుడతాయి. అట్టి సమయములో బొడ్డుత్రాసు పై భాగమున నాలుగు అంగుళములు దూరము విడచిపెట్టి ముందు గట్టిదారముతో బిగించి త్రుప్పులేని కత్తితోగాని, కత్తెరతోగాని కత్తిరించుటమంచిది. ఇట్లు చేయకపోయిన బొడ్డుభాగమంతా వాపుజేరి క్రమేపి పుండుగానై ఆరు మాసములవరకు తగ్గని దూడలెన్నో గలవు. ఎంతతొందరగా చికిత్సచేయాలన్నా కండలు లావుగావుండేబొడ్డునరముల సముదాయమువలన వాపుగాని పుండుగానిమానదు. కాబట్టి పుండులేకుండా బొడ్డుచుట్టువున్న వాపునకు ఒండుపట్టీలు రోజుకు రెండుమూడు పర్యాయములవంతున ఒక వారంరోజులు వేసిన తగ్గగలవు. పట్టీలనుమాత్రం ఎండనీయరాదు. దూడలను నాకనీయరాదు. కొన్ని దూడలు అతిచల్లదనము వలనగాని, వేడిజేసి చలువకు వచ్చినపుడు దురదకలిగి నాకును గాన జాగ్రత్తగా పట్టీలను కాపాడాలి. పుండ్లకుమాత్రం పట్టీలువేయక అనుభవంగల వైద్యులకు చూపించాలి.

కుందేటివెర్రికి ఒండుపట్టీలు

ఈ చింతామణిలో చెప్పిన తలతిరుగుడు రోగము, కుందేటివెఱ్ఱి, తిక్కతెవులు అని పిలువబడే రోగముగల పశువు తల భాగమునంతటికి కండ్లు, చెవులు ముక్కులుమినహా ఒండుపట్టీలు ఆరగాఆరగావేసి లోపలికి తగిన మందు ఇస్తూవుంటే తగ్గుతాయి. ఈ రీతిగా ఎన్నోరోగాలలో కలిగే వాపులుకు, మెదడుజబ్బులకు వేయునంత సుకుమారంగా పశువులకు వేయనవసరంలేదు. ఒండుపట్లు కొద్దోగొప్పో హెచ్చుతగ్గులుగా పట్టించాలి. అనుభవముగల వైద్యులుగాని, రైతులుగాని ఆ యా రోగాలకు తగిన మందులుకూడ లోపలికి ఇస్తూ అవసరమనుకుంటే ఈ ఒండుపట్టీలు వేయాలి.

దూడల మోకాళ్ళ వంపులకు ఒండుపట్టీలు

దూడలు పుట్టినవెంటనే వంకరకాళ్ళతోను, మోకాలిచిప్పలు వాపులు కలిగి వంగక అతుకుకొని పోయినపుడు, ఎముకలమీద గట్టివాపులు పుట్టి వంగనప్పుడు జాగ్రత్తగా అట్టిదూడల అవయవములను పరీక్షించి వాపులపైన ఒండుపట్టీలు వేసి తగ్గించవచ్చును. ఈ రీతిగా ప్రకృతిలో ఎన్నో చికిత్సలుగలవు.

* * *

ముప్పది ఎనిమిదవ భాగము

ఆంగ్లేయ పశు చికిత్సలు

ఆంగ్లేయ పశుచికిత్సలు తదితర చికిత్సలలాగా సులభంగా చేసుకొనేవిగావు. ఈ చికిత్సలు చేయాలను కొనే రైతులుగాని, తదితరు లు గాని ముందు ఏ మందు పొక్కుతుందో, కాలుతుందో, అపాయం చేస్తుందో ఎంతెంత మోతాదు వేస్తే రోగం తగ్గుతుందో, మున్నగు విషయాలు తెలిసికొనకుండా మాత్రము ఈవైద్య– మాచరించరాదు. వైద్యములన్నిటిలో ఈ వైద్యములోవుండే బెట్లుగుట్లు తదితరవైద్యాలలో లేవనియే చెప్పవచ్చును. కాబట్టి రైతనే వ్యక్తి తమ ఇంటిలో దొరకే ఓషధులనే వాడాలిగాని, తనకుమించిన పనిచేయ– రాదు. ఈ ఆంగ్లేయ వైద్యంలో శస్త్రచికిత్సలో, ఇంజెక్షన్‌వైద్యంలో తగినంత నిపుణత యున్నదని ఒప్పుకొన– వచ్చును. మీకు తెలియని రోగాలకు శస్త్రచికిత్సలు చేయించాలనుకుంటే ఆంగ్లేయ పశువైద్యులకు, ఆయుర్వేద పశువైద్యాచార్యులకు జూపించవచ్చును. కొంతమంది రైతుల బాధపడలేక ఈ చికిత్సలు తెలుపవలసి వచ్చినవి. ఈ అనుభవ పశువైద్య చింతామణిలోనున్న రోగన్వభావలక్షణాలు గ్రహించినతరువాత మీకు ఇష్టముంటే ఈ దిగువ ఆంగ్లేయ చికిత్సలను ఎవరంతట వారే చేసికొవాలి.

పెద్దరోగము

ఈ రోగము తగిలినవెంటనే క్రిసాల్ అను అరఖును ఒక అరతులం లేక ఒకతులం పశువు వయస్సును బట్టి సేరు నూకలజావతో కలిపి ఒకే మోతాదు ఇవ్వాలి.

లేక కార్బాలిక్ ఆసిడ్‌ను 60 లేక 100 చుక్కలు సేరునూకల జావలో కలిపి తగిలిన వెంటనే ఒక మోతాదు ఇవ్వాలి.

లేక పొటాషియం పర్మాంగనేట్ అను పొడిని రెండువడ్ల గింజలెత్తు సేరున్నరనీటిలో కలిపి దినమునకొక మోతాదువంతున రెండురోజులు ఇవ్వాలి.

పారుడెక్కువగా నుంటే క్యాంఫర్‌డైనుగాని క్లోరీడైన్‌గాని పారుడు ఉద్రేకతను బట్టి అరఔన్సు మందును సేరునీటిలో కలిపి పారుడుతగ్గువరకు రెండుమూడు పర్యాయములు ఇవ్వాలి. ఒక్క మోతాదుకే పారుడు తగ్గితే మందును ఆపివేయాలి.

లేక కవిరి 2 1/2 తులాలు, ఛాక్‌ప్రిపరేటా 2 1/2 తు, సినమన్ 4 గ్రాములు, జింజర్ 2 తులాలు కలిపి సేరుగంజితో ఇవ్వాలి. పారుడు తగ్గువరకు రెండుమూడు మోతాదులు ఇవ్వాలి.

లేక గాల్స్‌పౌడర్ 1 1/2 తులం, ఓపియం 1/8 తు, అనిసీపౌడ్ 10 తులములు కలిపి సేరు వరిగంజితో ఇవ్వాలి.

నోటివుండ్లకు మాతమ్రు పొటాషియం ఫర్మాంగనేట్ లోషన్‌తో గాని, ఆలం లోషన్‌తోగాని అప్పుడప్పుడు కడుగుచు పొటాష్ క్లొరన్ అరఔన్సును తేనెతోగాని బెల్లంతోగాని కలిపి పుండ్లు పెద్దవిగానుంటే నోటికి నాలుకకు నాకించుచుండాలి.

దొమ్మలు

అన్నిరకముల దొమ్మలకు ప్రారంభములోనే కార్బాలిక్ ఆసిడ్ పావుతులం, నూకలజావగాని బియ్యపుగంజిగాని సేరుకలిపి ఒకే మోతాదు ఇవ్వాలి. తగ్గదనుకుంటే మరొక మోతాదు ఇవ్వాలి.

లేక క్రియోసోట్ అరతులం, నూకలజావకలిపి ఓకే మోతాదు ఇవ్వాలి.

లేక ఫినాయిల్ అరతులం, నూకలజావ సేరు కలిపి ఒకేమోతాదీయాలి. యాసిడ్సునుగాని క్రిసాల్, క్రియోసోట్ వగైరా అరఖులను గాని చేతితో తాకక ఏ గరిటెనో ఉపయోగించాలి. లేనిచో పొక్కి పుండయ్యే గుణాలున్నాయి.

గాలికుంటు

పొటాన్ నైట్రెన్ 2 1/2 తులాలు, కామన్‌సాల్టు 4 తులాలు క్లైరేటా 1/2 తులం కలిపి నూకలగంజితోగాని, బెల్లపు నీటితోగాని ప్రారంభించిన వెంటనే ఒకటి రెండు మోతాదులు ఇచ్చిన జ్వరము తగ్గి తేలికగా పుండ్లుపడతాయి.

లేక పొటాష్ నైట్రస్ 2 1/2 తులాలు, వరిగింజ సేరుకలిపి రోజుకొక మోతాదువంతున రెండురోజు-లిచ్చిన పుండ్లు తేలికగా పడ్తాయి.

పుండ్లను ప్రతిరోజు తేలిక ఆలంలోషన్‌తోగాని పర్మాంగనేట్ లోషన్‌తోగాని కడుగుచుండాలి.

ఇంకను ఈ లోషన్సు పనిచేయనిచో కాపర్ సల్ఫేట్ తేలికలోషన్‌తోగాని, జింకుక్లోరీడ్‌లోషన్‌గాని, తేలిక ఫినాయిల్‌లోషన్‌తోగాని దుర్గంధపుపుండ్లను, పుండ్ల మీద ఈగలువ్రాలేటప్పుడు వాడాలి.

రసిలేనిపుండ్ల జింకు ఆక్సైడ్ 2 భాగాలు, బోరిక్ ఆసిడ్ ఒక భాగము అయిడోఫారం ఒక భాగము, ఆరుభాగాల కొబ్బరినూనెలో గాని ఎనిమిది భాగాలవ్యాసులైనులోగాని కలిపివాడాలి.

ఇంకను పుండ్లకు కార్బాలిక్ ఆయిల్‌నుగాని, టింక్చర్ బెంజాయిన్ కోనుగాని టింక్చర్ అయోడినుగాని వాడాలి.

గురక జెబ్బవాపులు

కార్బాలిక్ ఆసిడ్ అరతులం వరిగంజి సేరుకలిపి గుటకవేస్తే ఒకటి రెండు మోతాదులు ఇవ్వాలి. రోగప్రారంభంలో కూడ ఈమోతాదులనే వాడాలి.

లేక పొటాషియం పర్మాంగనేట్ చిక్కని లోషన్‌ను సేరు, అర్ధసేరువరకు లోపలకు ఇవ్వాలి.

కడుపునొప్పి

సోడాబైకార్బనేట్ 4 తులాలు, పిప్పిర్‌మెంటు వాటరు 2 ఔన్సులు, టింక్చర్ జింజిబ్రెస్ ఒక ఔన్సున్నర, టింక్చర్ అసఫటేడా ఒక ఔన్సుకలిపి ప్రతినాలుగు గంటలకు ఒక మోతాదువంతున తగ్గేవరకు ఇవ్వాలి.

లేక సోడాబైకార్బనేట్ 5 తులాలు, టర్పెంటైన్ అరఔన్సు, వామువాటరు 2 ఔన్సులు టింక్చర్ ఓపియం ఒక ఔన్సు కలిపి అన్నిరకాల కడుపునొప్పులకు, శూలలకు ఇవ్వాలి.

అజీర్తి

టింక్చర్ జింజిబ్రస్ ఒక ఔన్సు, టింక్చర్ కార్డమన్ ఒక ఔన్సు సోడాబైకార్బనేట్ 4 తులాలు గోరువెచ్చని నీరుసేరు కలిపి దినము విడచి దినమువంతున వారం లేక పదిరోజులు ఇవ్వాలి.

కురమ

సోడాసాలిసైలస్ వక ఔన్సు పొడిని సేరున్నర నీటిలో కలిపి రెండు మోతాదులుగా ఉదయం సాయంకాలం ఇవ్వాలి. లేక క్యాంఫర్ పావుతులం, మంచిబెల్లం 10 తు. కలిపి ఇవ్వాలి.

విరేచనములు – రక్త విరేచనములు

క్లోరోడైన్‌నుగాని, క్యాంఫర్ డైన్‌నుగాని పెద్ద రోగంలో పారుడుకు చెప్పిన చికిత్సలలో తెలిపిన రీతిగా వాడాలి.

వాతము

సోడాసాలిసైలస్ 2 తులాలు, పల్విస్‌జింజర్ 1 తు, మంచిబెల్లం 15 తులాలు కలిపి దినమునకొక మోతాదువంతున వరుసగా నాలుగైదు రోజులిచ్చిన తగ్గుతుంది.

లేక నక్సువామిక 2 తులాలు సల్ఫేటు ఆఫ్ అయిరన్ 4 తులాలు, సోడాబై కార్బనేట్ 3 తులాలు, పల్విన్ అసఫటేడా 2 తులాలు కలిపి తగినంత బెల్లంతో కలిపి ఇవ్వాలి.

కంటి పువ్వులు

ఏ, బి, సి, లోషన్సు అనగా ఆలంలోషనుగాని, బోరిక్ లోషనుగాని, సిల్వర్ నైట్రేట్ లోషన్ గాని కంటి పువ్వులకు, కంటిపొరలకు వాడవచ్చును. ఈ లోషన్ వివరాలు ముందు తెలుపబడును.

ఆవిరి

హైడ్రో క్రోరైట్ ఆఫ్ కొకైన్ 2½ గ్రెయినులు, మోర్ఫియా 1½ గ్రెయినులు, డిస్టిల్డు వాటరు ఒక ఔన్సు కలిపి ప్రతిరోజు ఈ మందును నాలుగైదు చుక్కలు వేయాలి.

లోపలికి మాగ్సల్ఫు 1 పౌను, సేరు గోరువెచ్చని నీటితో వ్యాధి ప్రారంభములోనే ఇవ్వాలి.

నేత్రాల బలహీనత

సిల్వర్ నైట్రేట్ 2 గ్రెయిన్లు, డిస్టిల్డు వాటరు ఒక అవున్సును గాని, జింకు సల్ఫేటు 3 గ్రెయిన్లు డిస్టిల్డు వాటరు ఒక ఔన్సుగాని, లేక ఆలం 4 గ్రెయిన్లు, నీరు ఒక ఔన్సు కలిపిగాని అప్పుడప్పుడు కండ్లలో వేయుచుండాలి.

లేక అప్పుడప్పుడు మంచిరకపు కాడ్‌లివర్ ఆయిల్‌ను లోపలికి కండ్లకు వాడవచ్చును.

ఇంజెక్షన్లు

పశువులకిచ్చు మందులు జీర్ణకోశము గుండాపోయి అచ్చట జీర్ణించి క్రమముగా ఆహారసారములో కలిసి రక్తములోనికి పోయి గుణమిచ్చుట అందరకు తెలిసిన విషయమే ఈ ఇంజెక్షన్లు జాగ్రత్తగా రోగనిదానాదుల గ్రహించి శరీర శాస్త్రభాగములను తెలిసికొని చేయాలి. ఇప్పటి కాలపరిస్థితిలో ప్రతివైద్యుడు ఇంజెక్షన్ వైద్యము చేయుచున్నాడు. నోరులేని పశువులుగాన శాస్త్రపండితులు తప్ప తదితరులెవ్వరు చేయుట తగదని నాయభిప్రాయము. రైతులు కూడ దగావైద్యులను ఒక కంటితో చూడాలి. డిస్టిల్డు వాటరు ట్యూబ్సు తీసికొని నాటకమాడే పశువైద్యులున్నారు. కాని జాగ్రత్తగా ఆలోచించి చికిత్స చేయించుకోవాలి. ఇంగ్లీషు వైద్యములోని కొన్ని ముఖ్యవిషయములను గుర్తించుటకు ఈ గ్రంథములో చెప్పితినిగాని తెలిసి తెలియని ఇంజెక్షన్లు ఈయమని చెప్పుటలేదు. పశువైద్యాచార్యులుగవర్నమెంటు పశువైద్యులు గాని ఇచ్చు ఇంజెక్షన్లునే సమ్మతించుదురు గాక.

ఇప్పటి నవనాగరికత పరిస్థితులను బట్టి లోపలకు మందులను ఇచ్చినను, ఇవ్వకపోయినను డాక్టరు గారు ఇంజెక్షన్ ఇచ్చారంటే వ్యాధితగ్గునని రైతుల మూఢనమ్మకం. అంటువ్యాధులకు గవర్నమెంటు పశువైద్య డిపార్టుమెంటు వారు కనిపెట్టిన మందులు బాగుగా పనిచేస్తాయి. అయినదానికి కానిదానికి ఇంజెక్షను చేయుట అనవసరము.

సిరంజిని శుభ్రముచేయుట

ఇంజెక్షను ఇచ్చుటకు పూర్వము సిరంజి శుభ్రముగా నున్నదో లేదో, అదివరకేమైన మందులు దానితో వాడిరో లేదో, సూదుల మొనలు సరిగానున్నవో లేవో, త్రుప్పుపట్టినవో సరిగాజూచి వాడాలి. వాడుటకు పూర్వము సూదులను లోషన్సుతో శుభ్రపరచాలి. ఈ సిరంజిలు 20 సి.సి. లేక 10 సి.సి. 40 సి.సి. వరకు వుంటాయి. సి.సి. అనగా క్యూబికు సెంటిమీటర్సు అంటారు. పశువులకు గ్లాసు సిరంజీలకంటె రికార్కు సిరంజీలనే వాడుట మంచిది.

చర్మము క్రిందికి ఇంజెక్షన్

దీనినే హైపొడర్ మిక్కు ఇంజెక్షన్ అంటారు. మందును పశువు చర్మము క్రిందికి ఆ యా వ్యాధులకు తగిన మందునిచ్చి శాంతింపజేయుదానిని హైపొడర్ మిక్కు ఇంజెక్షను అంటారు. కొంతమంది వైద్యులు

తమ స్వంత ఊహలతో ఇంజెక్షన్లు నోరులేని పశువులకు ఇస్తారు. ఇట్లు చేయుట పొరపాటు. తర్ఫీదు పొంది, అనుభవము గల వైద్యులే వీటిని ఆచరణలో పెట్టాలి.

కండరము క్రిందకు ఇచ్చు ఇంజెక్షన్

దీనినే ఇంట్రామస్క్యులర్ ఇంజెక్షను అంటారు.

రక్తనాళములోనికి ఇచ్చు ఇంజెక్షన్

దీనినే ఇంట్రవీనస్ ఇంజెక్షన్ అంటారు. ఈ ఇంజెక్షన్ చాలా జాగ్రత్తగా నేర్పుతో సూత్రముతో ఇవ్వాలి.

అల్లోపతి ఇంజెక్షన్లు

ఈ దిగువ ఇంజెక్షన్లును గవర్నమెంటు వెటరినరీ డాక్టరు ఆంధ్రజాతీయ పశువైద్య కళాశాలలలో పశువైద్యాచార్య ట్రెయినింగయిన వారు వాడుదురుగాన తెలియజేయడమైనది. శస్త్రవైద్యము, సూచికావైద్యము, శాస్త్రసమ్మతముగా నేర్చుకొనిన గవర్నమెంటు వెటర్నరీ వైద్యులే తగినవారు. కాని రైతులు కూడా ఫలాని ఇంజెక్షన్ మందు అని తెలిసికొనుటకు ఈ దిగువ తెలుపుచున్నాను. కాని ప్రతివ్యక్తి ఈ ఇంజెక్షన్లు ఈయమని సలహా ఇచ్చుటలేదు. ఇప్పటి కాలపరిస్థితులలో ప్రతి వైద్యుడు పశువుల డాక్టరునని ఒక ఇంజెక్షను పెట్టె ఒక యాంపిల్ తీసుకొని నోరులేని పశువులమీద అచ్చటచ్చట నాటకమాడుచున్నట్లు తెలియచున్నది. ఈ పద్ధతి చాలతప్పు. ఇట్టివారిని దేశద్రోహులంటారు. ఇట్టివారిపై రైతులు, గవర్నమెంటు తగినచర్య దీసికోమని కూడ నా ప్రార్థన.

1. ఇంజెక్షన్లు రకాలు

1. లూగాల్ ఇంజెక్షన్ : అంటువ్యాధులన్నిటికి రాకుండ వచ్చిన తరువాత కూడ 5 సి.సి. నుంచి 20 సి.సి. వరకు వాడాలి.

2. సోడా సాలిసైలస్ ఇంజెక్షన్ : వాతములకు, వాతనొప్పులకు, దెబ్బనొప్పులకు, రొప్పువాతమునకు పనిచేస్తుంది.

సోడా సాలిసైలన్ అయోడైడ్ ఇంజెక్షన్ : వాతములకు, నొప్పులకు పనిచేస్తుంది.

ట్రిపిన్బ్లు ఇంజెక్షన్ : రక్త మూత్రమునకు, అంటురోగములకు పనిచేస్తుంది.

యాంటిమోనియం టాట్టారం ఇంజెక్షన్ : ముక్కుపీనసకు సర్రాకు, కుందేటి వెర్రికి రక్తములోనికి ఇవ్వాలి.

టెట్నస్ ఇంజెక్షన్ : ధనుర్వాతమునకు పనిచేస్తుంది.

మిల్కు ఇంజెక్షన్ : నుసిమిరి' తామర, చర్మవ్యాధులకు పనిచేస్తుంది.

యాంటిమోసా ఇంజెక్షన్ : ముక్కుపీనస, వగర్పులకు పనిచేస్తుంది.

కాంఫర్ ఇన్ ఆయిల్ ఇంజెక్షన్ : ఉష్ణత తగ్గినపుడు వేడిమి వచ్చుటకు వాడాలి.

కాంఫర్ ఇస్ ఈథర్ ఇంజెక్షన్ : కాంఫర్ ఇన్ ఆయిల్‌కు బదులు వాడాలి.

కాల్షియమ్ క్లోరీడ్ ఇంజెక్షన్ : మేయిదిగినపుడు, రక్తస్రావము కలిగినపుడు వాడాలి.

కోలోయిడు అయోడిన్ ఇంజక్షన్ : జ్వరములు అంటువ్యాధులు రాకుండ పనిచేస్తుంది.

స్ట్రికనైన్ హైడ్రోక్లోరీడ్ ఇంజెక్షన్ : నరముల సంబంధమగు రోగములకు పనిచేస్తుంది.

కొకైన్ ఇంజెక్షన్ : శస్త్రచికిత్స చేయుటకుముందు నొప్పి లేకుండ ఇచ్చుటకు పనిచేస్తుంది.

కాలికమ్‌గ్లోకానేట్ ఇంజెక్షన్ : రక్తము నావుటకు పనిచేస్తుంది.

సోడియం యాంటిమోనియం టాక్టరేట్ ఇంజెక్షన్ : నులిపురుగులు, ఎలుకపాములు, తదితర పురుగులకు పనిచేస్తుంది.

షరా : అనేకరకముల ఇంజెక్షన్సు గలవు.

లోషన్సు

కార్బాలిక్ లోషన్సు

కార్బాలిక్ ఆసిడు 2 డ్రాములు, డిస్టిల్డు వాటరు 12 లేక 30 అవున్సులు కలిపి గాలికుంటు పుండ్లకు, వ్రణములకు పుండ్లను కడుగుటకు వాడాలి.

అమ్మోనియా అసిటేట్ లోషన్

సొల్యూషన్ ఆఫ్ అసిటేట్ అమ్మోనియా 2 అవున్సులు రెక్టిఫైడు స్పిరిట్ 2 అవున్సులు నీరు 10 ఔన్సులు కలిపి బెణుకులకు, వావులకు వాడిన తగ్గును.

పర్మాంగనేట్ లోషన్

పొపర్మాంగనేట్ 10 గ్రెయినులు నీరు 2 శేర్లు కలిపి అన్నిరకముల పుండ్లను కడుగవచ్చును.

ఫినాయిల్ లోషన్

ఫినాయిల్ 1 భాగము నీరు 100 భాగములు కలిపి అన్నిరకముల పుండ్లను కడుగవచ్చును.

ఫార్మలిన్ లోషన్

ఫార్మలిన్ 1 డ్రాము నీరు 2 పౌనులు కలిపి దుర్గంధపుండ్లను కడగాలి.

కాపర్ సల్ఫేట్ లోషన్

కాపర్ సల్ఫేటు 12 గ్రెయినులు నీరు 2½ పౌనులు కలిపి కొయ్యగండలు పెరుగు పుండ్లను కడగాలి.

సిల్వర్ నైట్రేట్ లోషన్

సిల్వర్ నైట్రేటు 2 గ్రెయినులు డిస్టిల్డు వాటరు 1 ఔన్సు కలిపి కంటి తెలుపునకు వాడాలి.

జింకు సల్ఫేట్ లోషను

జింకుసల్ఫేటు 3 గ్రెయినులు డిస్టిల్డు వాటరు ఔన్సు కలిపి కంటి తెలుపునకు, పొరలకు వాడాలి.

ఆలం లోషను

ఆలం 6 గ్రెయిన్సు నీరు 2 ఔన్సులు కలిపి ఆవిరికి. పొరలకు, పువ్వులకు వాడాలి.

ఆయింటుమెంట్సు

కార్బాలికు ఆయింటుమెంటు

కార్బాలిక్ ఆసిడు 1 ఔన్సు వ్యానులైను 3 ఔన్సులు కలిపి గాయములకు, పుండ్లకు వ్రాసిన పని చేస్తుంది.

అకోనిటం ఆయింటుమెంటు

ఆకోనిట్ 8 గ్రెయిన్సు స్పిరిట్ 80 చుక్కలు వ్యాసులైను 1 ఔన్సు కలిపి వాతనొప్పులకు, నొప్పిని తగ్గించుటకు, వాపులకు రుద్దిన పనిచేస్తుంది.

ఆలం ఆయంటుమెంటు

ఆలం 2 ఔన్సులు స్పిరిట్ టర్పెంటైన్ 2 ఔన్సులు వ్యాసులైను 6 ఔన్సులు కలిపి పుండ్లు గారపట్టుటకు వాడాలి.

టార్టారం ఆయంటుమెంటు

యాంటిమోనియంటార్టారమ్ ¼ ఔన్సు వ్యాసులైను 1 ఔన్సు కలిపి విషపురుగులు కుట్టిన వాపులకు, కాళ్ళవాపులకు, రొమ్ముదెబ్బలకు మర్దన చేసిన తగ్గుతుంది.

సిల్వర్ నైట్రేట్ 10 గ్రెయినులు వ్యాసులైను 1 కౌన్సు కలిపి కండ్లవాపులకు, రెప్పలపుండ్లకు వాడాలి.

బెల్డోనా ఆయింటుమెంటు

ఎక్ట్రాక్టు బెల్లోనా 80 గ్రెయినులు వ్యాసులైను 1 ఔన్సు వాతనొప్పులకు, కల్లవాపులకు మర్దన చేయాలి.

కాపర్ సల్ఫేటు ఆయింటుమెంటు

కాపర్ సల్ఫేట్ 4 డ్రాములు వ్యాసులైన్ 6 ఔన్సులు టర్పెంటైన్ 5 డ్రాములు కలిపి తీట, ఏనుగుగజ్జి, నుసిమిరికి వాడాలి.

రెడ్ ఆయింటుమెంటు

హైడ్రాజరీ అయొడైడురుబ్రం 16 గ్రెయినులు వ్యాసులైను 1 ఔన్సు కలిపి గట్టికణతులకు, నొప్పులకు తగినంత పట్టించిన పనిచేస్తుంది.

అయోడిన్ ఆయింటుమెంటు

అయోడిన్ 32 గ్రెయినులు స్పిరిటు 1 డ్రాము పొటాషియం అయోడైడు 32 గ్రెయినులు వ్యాసులైను 21½ ఔన్సులు కలిపి కంతులకు గట్టివాపులకు జలుబుగడ్డలకు రుద్దిన చక్కగా పనిచేస్తుంది.

సింపిల్ ఆయింటుమెంటు

తెల్లమైనము 2 ఔన్సులు వ్యాసులైను 3 ఔన్సులు ఆల్‌మండు ఆయిల్ 3 ఔన్సులు కలిపి మంటపుట్టు పుండ్లకు, వావులకు, బెణుకులలో మంటలకు రుద్దిన పనిచేస్తుంది.

సల్ఫర్ ఆయింటుమెంటు

సబ్లిమెడు సల్ఫర్ 16 ఔన్సులు కామన్ టర్పెంటైను 4 ఔన్సులు లిన్‌సీడు ఆయిల్ 20 ఔన్సులు వ్యాసులైన్ 2 ఔన్సులు అన్ని చర్మవ్యాధులకు పనిచేస్తుంది.

జింకు ఆక్సైడు ఆయింటుమెంటు

జింకు ఆక్సైడు 8 గ్రెయినులు వ్యాసులైను 1 ఔన్సు కలిపి చర్మము పగిలినను, దెక్కలు పగిలినను, అర్రునొప్పులకు పనిచేస్తుంది.

బోరిక్ ఆసిడ్ ఆయింటుమెంటు

బోరిక్ ఆసిడు 12 గ్రెయినులు వ్యాసులైను 1 ఔన్సు కలిపి చర్మవ్యాధులకు వాడాలి.

ఐడోఫారం ఆయింటుమెంటు

ఐడోఫారం 10 గ్రెయినులు వ్యాసులైను 1 ఔన్సు కలిపి దుర్గంధపు వాపులకు, చెల్దికి వాడవచ్చును. పంపర వాపులకు గంఅకేషియా, యాస్టిక్ ఆసిడు, నీరు కలిపివాడిన తగ్గును.

షరా : ఆంగ్లేయ పశుచికిత్సలు ముఖ్యమైన వాటినే తెలిపితిమి.

* * *

ముప్పది తొమ్మిదవ భాగము

పశువ్యాధులకు హోమియోపతి చికిత్సలు

ఈ చింతామణిలో ప్రతిరైతు అన్నిరకాల వైద్యాలు తెలుసుకోవాలని, తెలిసినంతవరకే తమ పశువులకు వైద్యము చేయాలని, ఎంతో అవసరముంటే రైతనే వ్యక్తి పశువైద్యుల సలహా కోరాలనీ, అనవసరముగా డబ్బు ఖర్చు పెట్టవద్దనీ నా ముఖ్యసలహా.

నేను ఈ హోమియో, ఆంగ్లేయ, ప్రకృతి చికిత్సలను ఇదివరకు మా గ్రంథాలలో తెలుపలేదు. కాని అనేకమంది మిత్రులు మా విద్యార్థులు ఆ వైద్యాల ముఖ్యవిషయాలన్నీ తెలిపితే వాటిమీద ఇష్టముంటే ఆచరణలో పెటతాము. లేదా విషయాలు తెలిసికొని మనస్సులో వుంచుకుంటాము అంతేగాని, తెలిసీ తెలియని వైద్యాలు ఆచరణలో పెట్టబోమని తెలిపారు.

అందుచేత, ఈ దిగువ చూపించే హోమియో పశుచికిత్సలను మాత్రము నేను రచించిన "అనుభవ పశువైద్య చింతామణి"లో ఎన్నో రోగస్వభావ లక్షణాలున్నవి. కాబట్టి వేరే ప్రత్యేక గ్రంథాలు అవసరము లేకుండానే ఈ లక్షణాలనుబట్టే అన్నిరకాల మందులను మీ అనుభవంలో పెట్టి సేవ చేయుదురుగాక. ఈ హోమియో పశుచికిత్సను ఎంతో వృద్ధిలోనికి తీసికొనువచ్చుటకు ప్రయత్నములు చేయుచున్నాము. మా ఆంధ్రజాతీయ పశువైద్య కళాశాల విద్యార్థులకు కూడ త్వరలో అనుభవముతో అమలులో పెట్టుచున్నాము. మంచి అనుభవము గల హోమియో పశు వైద్యపండితుని రప్పించమన్నాము. ద్వాదశ లవణాలను గురించి దీనిలో తెలుపలేదు. ఈ గ్రంథములోనున్న చికిత్సలన్నీ జర్మన్ పండితుడు వ్రాసిన గ్రంథాల నుంచి స్వీకరింపబడినవి.

హోమియో ముఖ్యవిషయాలు

మానవులకు హోమియో మందులు ఎట్లు వాడుచున్నారో, నోరులేని పశువులకు గూడ వీటిని అట్లు వాడవచ్చును. పశువులకు ప్రమాదకరమగు వ్యాధులు వచ్చినపుడు చిన్న చిన్న మోతాదులుగా ఇచ్చిన శరీరము సరియగుదారికి రాగలదు. వ్యాధి ముదిరిన తరువాత కొన్ని లక్షణాలు పెంపొందినచో వాటిని హోమియోపతి సిద్ధాంతముగా వ్యాధిగా పరిగణించరాదు. వాటియొక్క తత్త్వమునుబట్టి గుణములు కలుగుతాయి. ప్రతిరోగము గుణములు మార్పు చెందుతాయి. వాటినిబట్టి వైద్యులు వ్యాధిని నెమ్మదిచేసి సుఖస్థితికి వచ్చునట్లు చేయాలి. తదుపరి గుణములను కనుగొని వాటికి అనుగురీతిని వ్యాధి నిర్ణయముచేసి తగిన మందులను వాడాలి.

వ్యాధిగల పశువునకు ఒకేమందు ఇచ్చినచో కుదరగలదు. ఆతురతవలన ఒకే మందును అనేక మందులతో కలిపి ఇచ్చినయెడల దానిగుణము కూడ తగ్గిపోవును. ఏకమూలికలోనే ప్రభావముంటుంది. అందుచేత రోగనిదానం గ్రహించి ఒకేమందును వాడాలి. కాని ఒకే మందుతో అనేకమందులు కలిపి ఇచ్చినచో వాటివాటి గుణములనుబట్టి వ్యాధి తగ్గుటయు గలదు. లేక వ్యాధిని పెంపొందించుటయు

గలదు. ముఖ్యముగా హోమియో మందులలోనున్న గుణమేమన ఒకేముందు ఇచ్చిన మంచిగుణము నీయగలదు. ఒకవేళ అట్లు ఈయకపోయినప్పటికి తదితర గుణములను కలుగజేస్తుంది.

శాస్త్రసమ్మతముగా ఇచ్చినయెడల రోగమును పోగొడుతుంది. శాస్త్రసమ్మతముగా మోతాదు కనుగొనిన తరువాత రోగ విజ్ఞానమును బట్టి రోగము నిర్ణయింపబడుతుంది. హానిమేన్ అను శాస్త్రజ్ఞుడు పరిశోధించిన తరువాత మోతాదులు నిర్ణయించబడ్డాయి. అనుభవమునుబట్టి చిన్నమోతాదులు ఇచ్చినను పెద్ద మోతాదుకంటె ఎక్కువగా పనిచేయునని శాస్త్రజ్ఞులు తెలుపుచున్నారు. వ్యాధి సోకినవెంటనే త్వరగా కనుగొని తగు చికిత్స చేసినచో పశువు యొక్క బలముతగ్గదు. ఊపిరితిత్తులకు వ్యాధి సోకునపుడు "డాక్టర్ మూరన్" హోమియో వైద్యము చేసి తగ్గించాడు. మాన్‌చెష్టర్ కాపురస్థుడు "వాల్టర్ క్యార్టర్" అను రైతు తన ఖరీదుగల గుఱ్ఱమునకు వైద్యము చేసి కాపాడుకొన్నాడు.

మందుల వాడుక

మామూలుగా ఈ మందులను ఏ వేళయందైనను వాడవచ్చును. సామాన్యముగ ఉదయం ఇచ్చుటే మంచిది. కాని ఉధృతరోగాలలో ఎప్పుడైనా వాడవచ్చును. మోతాదుల యొక్క ఉధృతమునుబట్టి ఉంటుంది. ఒక మోతాదు వాడిన తరువాత దానిగుణములు కనపడే వరకు అవకాశమీయాలి. వ్యాధియొక్క నిదానమునుబట్టి ప్రతిరోజు మూడునాలుగు మోతాదు లీయవచ్చును. వ్యాధియొక్క ఆతురతను బట్టి 10, 15, 30 నిమిషములకొక మోతాదు ఇవ్వాలి. వ్యాధినిలబడియున్న 2, 3 లేక 4 గంటలకొక మోతాదు ఇవ్వాలి. వ్యాధి నెమ్మదించిన తరువాత దినము విడచి దినముగాని, మూడు దినాలకుగాని మందు ఇచ్చుచు శరీరతత్వమును పరీక్షించుచుండాలి.

ఎక్కువ తక్కువ పొటెన్సీలు

హోమియో మందులు మదర్ టింక్చర్లు మాత్రము పౌడర్లు, అరఖులుగా తయారు చేయబడతాయి. మూలికనుండి తీయబడిన రసముగాని, లోహపుపొడి గాని ఎక్కువ గుణములు గలవాటిని మదర్ టింక్చర్ అంటారు. ఈ టింక్చర్లనే రకరకాలుగా సారాయితో, చక్కెరతో, తదితర పదార్థాలతో పొటెన్సీలుగా తయారుచేస్తారు. ఈ పొటెన్సీల హెచ్చుతగ్గు, మధ్యరకములుగా తయారు చేయబడతాయి. 1 నుంచి 5 వరకు తక్కువ పొటెన్సీలనియు 6 నుంచి 12వరకు మధ్య పొటెన్సీలనియు 12 నుంచి పై గావుండేవి హెచ్చుపొటెన్సీలయు పిలువబడుతాయి.

ఎక్కువ పొటెన్సీలు నిదానముగా పనిచేస్తాయి. తీవ్రరోగాలలో మధ్యమ, తక్కువ పొటెన్సీలు పనిచేస్తాయి. ఎక్కువ పొటెన్సీలు ముఖ్యముగా ముఖము, మెదడు, చక్షువు మున్నగు సున్నితమగు తత్వములపై పనిచేస్తాయి. తక్కువ పొటెన్సీలు జీర్ణకోశము కండరములు మున్నగు వాటిపై పనిచేస్తాయి. 1 నుంచి 30 పొటెన్సీల వరకు దినమునకు ఒకసారి గాని ఎక్కువ పర్యాయములు గాని, 200 పొటెన్సీలు దినమున కొకసారో రెండుదినాల కొకసారో, అనుభవాన్ని బట్టి వారమునకొకసారో వాడాలి. మదరు టింక్చర్సును

పశువు యొక్క పరిమాణమును బట్టి 10 నుంచి 20 చుక్కలవరకు, అయిదుచుక్కల మందుతో తయారైన బిళ్ళలను నాలుగు ఆరుమాత్రలు వంతున ఇవ్వవచ్చును. చిన్నపశువులకు పైమోతాదులలో సగభాగంమాత్రము ఇవ్వాలి. పై మందులను జంతువులకు ఇచ్చేటప్పుడు మాత్రము 4 లేక 6 ఔన్సుల చన్నీటితో కలిపి ఇవ్వాలి.

పెద్దరోగము

ఈ చింతామణిలో చెప్పిన పెద్దరోగమునకు హోమియోద్వారా ఈ రోగమునకు కొంతవరకు మాన్పడానికి అవకాశాలున్నవి. మన హిందూదేశంలో "ఇసాట్వీడ్" అను ఆయన పశువులకుపయోగించు హోమియో ఔషధములు కనుగొనగా డా॥ డి.ఎన్. కొప్పికర్ అను ఆయన వందలకొలది పశువులకు హోమిమో విధానంతో విజయవంతంగా చికిత్స చేయగలిగాడు. ఆయన చికిత్సలో ఏ పశువు కూడ మరణించలేదు.

హోమియో వైద్య చికిత్సలు – గుణగతములు

మోర్కురియన్; కరోసియన్ : 200 × విరేచనాలలో నెత్తురు ఎక్కువగా పడుతు ముక్కుతూవుంటే ఈ రెండుమందులు పెద్దరోగము తగిలిన చాలా పశువులకు పనిచేయగలవు. కాని కొన్ని పరిస్థితులలో ఈ క్రింది ఔషధాలు కూడా ఇవ్వవలసి ఉంటాయి.

ఆర్సెనికం ఆల్బం : 30×వ్యాధితగిలిన పశువునకు అయిదవనాడు ఆరవనాడు సంభవించే మగతకు నీరసమునకు, విరేచనాలలో దుర్వాసనకు వాడాలి.

అమ్మోనియా కాష్టికం : 30 లేక 200×పశువునకు పెద్ద రోగంలో కడుపుబ్బినపుడు వాడాలి.

రన్‌టాక్సు : 30×లేక 200×ను కండలు కండలుగా విరేచనములైనపుడు వాడాలి.

టెరి బెంధీనా : 30×200 పశువు రక్తమూత్రము పోయుచున్న వాడాలి.

అకొనైట్ : 30×జ్వరము తీవ్రముగానున్నపుడు, ఎక్కువ దాహముగానున్నపుడు వాడాలి.

బెల్డోనా : 30×పశువు ఆరాటపడుట, గిట్టలను నేలకుకొట్టుకొనుట, వ్యాధితీవ్రతలో కండ్లు చింతనిప్పుల వలెనున్నపుడు ప్రతి రెండుగంటలకు అయిదారు మాత్రలు బెల్లంతో వాడాలి.

క్యాంఫర్ : 30×ను వేడివచ్చుటకు వాడాలి.

సల్ఫర్ : 200×వ్యాధి తగ్గిన తరువాత పశువు కోలుకోవడానికి ఈ పొటెన్సీని ఒక్క మోతాదే ఇవ్వాలి.

వెరాట్రంఆల్బం : 6×ను వదేపదే విరేచనములగునపుడు శరీరము శీతలములోనికి వచ్చినపుడు వాడాలి. క్యాంఫర్‌ను కూడా వాడాలి.

దొమ్మ

బెల్డోనా : 30×200×తీవ్రజ్వరము నోటి వెంట చొంగపడుటకు.

ఆర్సెనికం ఆల్బం : 30×200× దీర్ఘశ్వాస, నీరసము, వణుకునకు పనిచేస్తుంది.

గాలి కుంటు

మెర్క్యూరియస్ : 200×వ్యాధిముదిరి నోటిలోను, గిట్టలందును పొక్కులు చితికి నోటినుండి ముక్కులనుండి నీరుకారుచున్నపుడు ఈమందు నాలుగు గంటల కొకసారి ఇవ్వాలి.

ఆర్సెనికం :30×పశువు మందమతిగా నున్నపుడు, చర్మము ముడుచుకొనినపుడు మూడుగంటలకొక పర్యాయము ఇవ్వాలి.

బెల్డోనా : 30×కన్నులు మసకగానుండి నీరు కారునపుడు, పొదుగువాచి వేడిగా గట్టిగానున్నపుడు గిట్టలుపగిలి మంటగానున్నపుడు వాడాలి.

పుండ్లను ఆర్నికాలోషన్‌నుగాని, క్యాలెండులా అపిసినాలన్ లోషన్‌గాని, అరపాయింటు నీటిలో ఒక గరిటెడు మందును కలిపితయారు చేసికోవచ్చును.

పథ్యాలు, అనుపానాలన్ని చింతామణిలో చెప్పిన రోగస్వభావలక్షణాలలో అన్ని రోగాలకు చూచివాడాలి.

కురము

చైనా: 40×మిక్కిలి తూలుతూ జ్వరముతీవ్రముగానుండి కాళ్లు పట్లుపట్టినపుడు ఇవ్వాలి.

అకొనైట్ : 30×ఆరంభములో వాడాలి.

ధనుర్వాతము

క్యాంఫర్ : ఆరంభములో ప్రతి ఇరువది నిముషములకు వేడి వచ్చువరకు పదిచుక్కలను తగినంత పంచదారతో కలిపి ఇవ్వాలి.

బెల్డోనా : 200×ను శరీరమంతటా వాతము క్రమ్మినపుడు ఇవ్వాలి.

నక్సువామిక : 200×ఆహారకోశములో మార్పు కలిగినపుడు వాడాలి.

అకొనైట్ : 30×ను శరీరముపైన వాపున్న వాడాలి.

ఆర్నికా : గాయమువలన ధనుర్వాతమువచ్చిన బలమైన ఆర్నికాలోషను వాడాలి.

వాతము

అకొనైట్ : 30×వ్యాధి ప్రారంభములో వాడాలి.

బ్రయోనియాఆల్బ : 30×జ్వరముండి శరీరభాగములు కాళ్ళు నొప్పులతో నున్నపుడువాడాలి.

రస్టాక్సికోడెండ్రన్ : 30×పశువు కాళ్ళు కీళ్ళు పట్లుపట్టినపుడు ఇవ్వాలి.

సల్ఫర్ : 200×పై మందునువాడిన తరువాత అర్ధఫలితమే కలిగినపుడు వాడాలి.

ఈవ్యాధి ఆకస్మికంగా వచ్చినపుడు ఔషధాలను ప్రతిమూడుగంటలకు తీవ్రముగానున్నపుడు ఆరుగంటల కొకసారి ఇవ్వాలి.

దగ్గు

బెల్లోనా : 30×దగ్గు పొడిగను ఒక విధమగు శబ్దము, సాయంకాలం తక్కువ, గుండెలలో కఫమెక్కువ, దీర్ఘకాలముయున్న వాడాలి.

అపిన్ మెలిఫిక : 200×ఊపిరి తిత్తులలో ఒక విధమగుశబ్దముగా నున్నపుడు, ఒక విధమగుదగ్గు తెరగా వచ్చినపుడు వాడాలి.

ఆర్సెనికంఆల్బం : 30×సాయంకాలముగాని రాత్రులయందు గాని, ఆహారము తినినతరువాతగాని, నీరు త్రాగిన తరువాతగాని, చలి గాలితగులుటవలనగాని, శ్వాసపీల్చుట కష్టముగా నున్నపుడుగాని పలుచని నీరు ముక్కులనుండి కారుచువున్నపుడుగాని, బలముతగ్గి నిస్సత్తువగా నున్నపుడుగాని వాడాలి.

నక్సునామిక : 200×పొడిదగ్గు, బొంగురుగొంతుక, ఈడ్పు, నోరు పొడిగనున్నపుడు వాడాలి.

ఇపీకాక్ : 30×దగ్గుతో కఫము అడ్డముపడుట, కడుపు మోతగానుండుట ఎగశ్వాస ఉన్నపుడువాడాలి.

బ్రయోనియాఆల్బ : 200×దగ్గు ఎక్కువగానుండి వుక్కిరి బిక్కిరి అయినపుడు, దగ్గు పొడిగానున్నపుడు, మేతతినినతరువాత దగ్గు వచ్చునపుడు వాడాలి.

డ్రీసెర : 30×దీర్ఘముగానున్న దగ్గు, ఆగి ఆగివచ్చు దగ్గు, దగ్గులో కఫం ముక్కులనుండి చీమిడివచ్చునపుడు వాడాలి.

అయోడిన్ : 30×శ్వాసనాళమునుండి వచ్చుదగ్గు, ఆగివచ్చు దగ్గు, దగ్గులో కఫమునకు వాడాలి.

ఆంటిమోనియంటార్టారికం : 200×శ్వాసలోదగ్గు, దగ్గు తేలికగా నుండి ఊపిరాడనపుడు, దగ్గులో ధ్వనికలిగినపుడు వాడాలి.

సల్ఫర్ : 30×దగ్గు దీర్ఘముగానున్నపుడు వాడాలి.

పై మందులను దినమునకొక మోతాదువంతున రెండుమూడు పర్యాయములు ఇవ్వవచ్చును. వ్యాధి గుణముకనిపించిన ఎడల 12 లేక 24 గంటలకొకసారి ఇవ్వాలి.

అజీర్తి

ఆర్సెనికం: 30×జీర్ణముకానప్పుడు, మందమతిగ నిస్సత్తువుగనున్నపుడు ఆహారంతినే అరగంటకు ముందే ఈ మందును ఉదయం సాయంకాలములందు ఇవ్వాలి.

నక్సువామిక : 30×శరీరము చల్లగానున్నపుడు, లోపల అవయవములు సరిగా పనిచేయనపుడు దీనిని రోజునకు నాలుగుసార్లు వాడాలి.

పల్సటిల్లా : 200×గుండె బలహీనముగానున్నపుడు, కాళ్ళు శీతలముగానున్నపుడు వాడాలి.

కడుపుబ్బు

కొలొసింతిస్ : 30×కడుపుబ్బిన ఆరంభములో ప్రతి పదునైదు నిమిషములకు తరువాత ప్రతి రెండు మూడుగంటలకు 10 చుక్కలు అరఖును కొంచెం నీటిలో కలిపి ఇవ్వాలి.

ఆకోనైటు : 30×ను ప్రారంభములో వాడాలి.

నక్సువామికా : 6×ను ఆరంభములో ఇచ్చిన తగ్గుతుంది.

అమ్మోనియాకాస్టికం : కడుపుబ్బుకు పనిచేస్తుంది.

కడుపు నొప్పి

అకొనైట్ : 30×కడుపునొప్పి, శూలనొప్పి వచ్చి బాధపడుచున్నపుడు ప్రతి 15 నిమిషాలకు ఇవ్వాలి.

ఆర్సెనికం : 30×పైమందు ఇచ్చినను తగ్గనపుడు ప్రతి 20 నిమిషాలకు వాడాలి.

నక్సువామిక : 30×నొప్పి ఆహారమువల్ల గాక తదితర కారణాలవల్ల వచ్చి మూత్రము కొద్దికొద్దిగా పోయుచున్నయెడల ప్రతి 20 లేక 30 నిమిషాలకు ఈ మందును వాడాలి.

కొలొసింధిస్ :200×పచ్చిగడ్డి తినుటవలన, శీతోష్ణస్థితిగతులు మారుటవలన, త్రాగునీటివలన వచ్చిన నొప్పికి వాడాలి.

కోకులస్ ఇండీకన్ : 30×తీవ్రమైననొప్పి, మిక్కుటముగా తిని దొర్లుచు బాధపడుచున్నపుడు వాడాలి.

విరేచనాలు

అకొనైట్ : 30×చలి, పేగులవాపున్న రోజునకు రెండు మూడుపర్యాయములు ఇవ్వాలి.

నక్సువామిక : 30×ఎక్కువ విరేచనములు పేగులలో అరుపు అజీర్తి వున్నయెడల గంటకొక సారివంతున నాలుగుసార్లు ఇవ్వాలి.

ఆర్సెనికంఆల్బం : 30×ఆకలిలేక విరేచనములు పలుచగ నున్నపుడు మాత్రము వాడాలి.

వెరాట్రం : 200×శీతలము శరీరమంత క్రమ్మితే ప్రతిపావుగంటకు ఇవ్వాలి.

రక్తవిరేచనాలు

అకోనైట్ : 30×వ్యాధి ఆరంభములో దీనిని వాడాలి.

నక్సువామిక : 200×మలబద్ధకమున్న వాడాలి.

మోర్ఫ్కారియస్ : 30×ఆసనము ఎరుపుగా వాచి ముడ్డితీపు యుండి విరేచనములెక్కువగా నున్నపుడు వాడాలి.

కాలోసిండిస్ : 200×పేగులలో నొప్పి ఎక్కువగానున్నపుడు ప్రతి 3 గంటలకు ఇవ్వాలి.

సల్ఫర్ : 30×దీర్ఘవ్యాధిగా మారితే వాడాలి.

ఆర్సెనికం : 200×విరేచనములు నెత్తురుతో కలిసి పసుపులేక నలుపురంగుగనుండి శరీరము చల్లబడినపుడు వాడాలి.

మలబద్ధకము

నక్సువామిక : 200×మలము గట్టిగా వాసనగా ఉండలుండలుగానుండి కడుపు బిర్రుగానున్నపుడు రాత్రిపూట వాడాలి.

సల్ఫర్ : 200×ను ఉదయం పూటయిచ్చిన బాగుగా పనిచేయును. కొన్నిటికి నక్సువామికను రెండు గ్రైనుల ఆహారంతో ఉదయం సాయంకాలములందు ఇచ్చినను తగ్గును.

బ్రయోనియా : 30×చల్లదనముగా, మలబద్ధకంగా నున్నపుడు దినమునకు మూడుపర్యాయములు ఇవ్వాలి.

కుందేటి వెట్టి

బెల్డోనా : 200×ఆరంభములో వెర్రిచూపులు చూచుచు అటు ఇటు గంతులు వేయునపుడు వాడాలి.

సల్ఫర్ : 30×కండ్లు ఎరుపుగానుండి తలను స్తంభములకు గోడలకు కొట్టునపుడు రెండుసార్లు వాడాలి.

నక్సువామిక : 200×కడుపునొప్పి ఉన్న వాడాలి.

రక్తమూత్రము

అకానైటు : 30×మూత్రకోశము వాపుగానున్న వావుతగ్గువరకు ప్రతిరెండు మూడు గంటలకు ఇవ్వాలి.

ఆర్నికా : 20 చుక్కల ఆర్నికాను 4 ఔన్సుల నీటిలో కలిపి మూత్రకోశముపైన దెబ్బతగిలిన దూదితో ముంచికట్టాలి.

కాంతారిన్ : 200×మూత్రము ఎక్కువ ఎరుపుగానుండి చుక్కలు చుక్కలు పడుచుండిన ప్రతి రెండుమూడు గంటలకు ఇవ్వాలి.

టెరిబెంతిన : 30×మూత్రాశయమునుండి నెత్తురుపడుతున్న దీనిని వాడాలి. నడుమునకు చన్నీటి గుడ్డను కట్టాలి.

నీరుచురుకు

క్యాంఫర్ : ఆరంభములో 10 చుక్కల క్యాంఫర్‌ను చక్కెరతో కలిపి 5 లేక 10 నిమిషాలకొకసారి నాలుగు మోతాదులు ఇవ్వాలి.

కాంతారిన్ : 30×అప్పటికి తగ్గనిచో ప్రతి అరగంటకొకసారి ఈ మందును కొన్ని పర్యాయములు వాడాలి.

నక్సువామిక : 200×కొంచెము తగ్గినతరువాత ఈమందును ప్రతి అరగంటకు ఒక మోతాదువంతున ఇవ్వాలి.

నోటిపూత

మెర్క్యూరియస్ : 30×ను నాలుకమీదను నోటిలోను పొక్కులు, పూతయున్న ప్రతినాలుగు గంటలకు వాడాలి.

ఆర్సెనికం : 30×ను సగము తగ్గిన తరువాత రోజునకు రెండు మూడుసార్లు ఇవ్వాలి.

సల్ఫర్ : 200×ను వ్యాధి తగ్గినతరువాత ఉదయం సాయంకాలములందు ఇవ్వాలి.

మందగుది

నక్సువామిక : 30×200×ను గాని రెండుకాళ్లకు తీవ్రముగా నున్నపుడు వాడాలి.

రస్టాక్సికాడెండ్రస్ : 30×200×పశువు లేచునపుడు కాళ్లను కొంచెం దూరము ఈడ్చునపుడు వాడాలి.

పొదుగువాపు

అకొనైట్ : 30×ప్రారంభములో ఇచ్చి తరువాత

బ్రయోనియా : 30×ను రెండు మూడుసార్లు కొద్దికొద్దిగా లోషను వాడాలి. ఈ వాపు గాయమువలనగాని, దెబ్బతగిలినగాని వచ్చినచో ఆర్ని కాలోషనును వాడాలి. దెబ్బతగిలిన గాయము పెద్దదిగానున్న ఆర్నికాతోపాటు అకొనైట్ 30×ను లోపలికి ఇవ్వాలి. పొదుగు భాగము వ్రణముగా తేలితే మాత్రము హెపార్ సల్ఫ్యూరిస్ 6×ను లోపలికి ఇచ్చిన తగ్గుతుంది. వ్రణముపగిలి పుండుగా ఏర్పడిన సైలీషియ 30×ను ఇచ్చిన పుండు మానుతుంది. అవసరమంటే వేడికాపులు పెట్టాలి.

పాలవృద్ధి

చైనా : 30×ను పాలుపడుటకు రోజునకు మూడుసార్లువంతున వారము లేక పదిరోజులు ఇవ్వాలి.

సల్ఫర్ : 30×ను తరువాత మరొక వారమురోజులు ఉదయం సాయంకాలములందు ఇవ్వాలి.

చన్నులు పగులుట

చన్నులు పగిలినపుడు, వాచినపుడు ఆర్నికాలోషన్ రోజునకు రెండుమూడుసార్లు వాడాలి.

హెపార్ సల్ఫ్యూరిన్ : ×ను పొదుగుమీద పొక్కులు లేచినపుడు వాడాలి.

సైలీషియ : 30×ను పొక్కులు చితికిన వాడాలి.

ఆవిరి

ఆర్నికా : కంటిదెబ్బ తగిలిన ఆవిరికలిగినపుడు 10 చుక్కల మందును మూడు ఔన్సుల నీటిలో కలిపి ప్రతిమూడు గంటలకు కంటికి వాడాలి.

అకోనైట్ : 30×ఆర్నికాపని చేయనపుడు చలికూడయుంటే దీనిని వాడాలి.

బెల్డోనా : 30×వ్యాధి తీవ్రతతగ్గి కళ్ళు బాగా ఎర్రబడి పుసులు తగ్గక కనురెప్పలు వాచినపుడు వాడాలి.

యుఫ్రేషియా : ముక్కులనుంచి, కండ్లనుంచి నీరుకారుతూ వెలుతురు చూడలేనపుడు 12 చుక్కలు 2 ఔన్సుల నీటిలో కలిపి కడగాలి.

మెర్కురియన్ సాబ్యుబిలిన్ : 30×పసుపుపచ్చని ద్రవముకారుచు కనురెప్పలువాచి కనురెప్పపొర మబ్బురంగుతోనున్న వాడాలి.

ఆర్సెనికం ఆల్బం : 30×వ్యాధి దీర్ఘకాలముండి కంటినుండి వేడినీరు కారుతున్నపుడు వాడాలి.

సల్ఫర్ : 30×దీర్ఘకాలపు ఆవిరికి వాడాలి.

కంటి తెలుపు

పశువు కొంచెము చూచుచు, కొద్ది వాపుకూడాయున్న బెల్డోనా 30×నుగాని, సల్ఫర్ 200×నుగాని, పల్సటిల్లా200×నుగాని, యుఫ్రేషియాను 12 చుక్కలు రెండు ఔన్సులనీటిలో కలిపి కన్నును కడగాలి.

విరుగుటతొలగుట

ఆ యా విరిగిన, తొలగిన భాగాలకు వేడికాపులుగాని, చన్నీటి గుడ్డనుగాని చుట్టాలి.

రస్టాక్సికొడెండ్రస్ : 6×ను ఉదయం సాయంకాలములందు లోపలికి ఇవ్వాలి. అప్పటికీ తగ్గనిచో విరిగిన ఎముకలకు కట్టుకట్టాలి.

బెణుకులకు

బెణికిన పశువునకు విశ్రాంతి ఇవ్వాలి. ఆర్నికాలోషన్‌లో గుడ్డ ముంచి పైనప్లానలు గుడ్డవేసి ఒకమాదిరిగా కట్టుకట్టాలి.

ఆర్సికమాంటన : 6×ను ప్రతిమూడుగంటలకు లోపలికి ఇవ్వాలి.

అకోనైట్ : 30×వాపుబాధ ఎక్కువగానున్న ఆర్నికాలోషనుతో కట్టుకట్టి అకోనైట్‌ను ఇవ్వాలి. అవసరమున్న వేడికాపులు పెట్టాలి.

గజ్జి

సల్ఫర్ : 30×ను లోపలికి ఇచ్చుచూ పైకి సల్ఫర్ ఆయింటుమెంటును రెండుమూడుసార్లు రాసిన తగ్గుతుంది.

ఆర్సెనికం ఆల్బం : 30×ను ప్రతిరోజు ఉదయం సాయంకాలములందు వాడాలి.

గాయాలు

ఆర్నికా : లోతుగాయములకు ఆర్నికా లోషమను బాగుగా పట్టించాలి. ప్రమాదకరమైన గాయాలున్న ఆర్నికాలోషనును గుడ్డతో తడిపి ప్రతిమూడు నాలుగు గంటలకు ఒకసారి పట్టించాలి.

అకోనైట్ : 30×ను జ్వరమున్న ప్రతిమూడు నాలుగు గంటలకు ఒకసారి ఇవ్వాలి.

నలిగిన గాయాలకు కూడా పైమాదిరిగా చేయవచ్చును. ఈ ఆర్నికాను అన్నిరకాల జంతువులకు దెబ్బలుతగిలిన, పడిన, శస్త్రము చేసిన అరపాయింటు నీటిలో ఒకగరిటెడు మందును కలిపి లోషనుగాచేసి గుడ్డతో తడిపి కట్టుకట్టాలి. ఇంకను చర్మరోగాలకు కూడా పనిచేస్తుంది.

క్యాలండులా : అపిసినాలస్ : ఈ మందులనుకూడా నొప్పులకు, బెణుకులకు, గాయములకు, గాయములనుండి రక్తము కారునపుడు పైమాదిరిగానే నీటిలోకలిపి వాడాలి.

వ్రణములు

అకోనైట్ : 30×వ్రణములలో వాపు నొప్పి వేడియున్న వాడాలి.

హెపార్ సల్ఫూరిన్ : 30×వ్రణముపుట్టిన తరువాత మూడు నాలుగు రోజులు లోపలికి ఇవ్వాలి.

సైలీషియ : 30×వ్రణము నెమ్మదిగా పక్వమగుచున్నపుడు త్వరగా పగిలి రసికారుచున్నపుడు రోజుకు నాలుగు పర్యాయములు వాడాలి.

వ్రణభాగము గట్టిపడి నొప్పిగానున్న రోజుకు రెండు మూడు పర్యాయములు ఆర్సెనికంను లోషనుగాచేసి పైన వాడాలి. దెబ్బతగిలినపుడు; చీముపట్టినపుడు, గడ్డకట్టకుండ వేడికాపులు కాయాలి.

షరా : ఇంకను హోమియో పశువైద్యవిషయాలు కావాలన్న నూతనముగా ప్రింటగుచున్న, "హోమియో పశుచికిత్స"ను చూడండి.

* * *

నలుబదవ భాగము

పశువైద్య చిట్కాలు

ఈ చింతామణిలో రోగాలకు చెప్పబడిన చికిత్సలుగాక తమ అనుభవం మీద ఈ దిగువ చికిత్సలు వాడుటకుగాను తెలియపరచడమైనది. కొన్నిచోట్ల మోతాదులు తెలుపలేదు. మోతాదులు తెలుపనిచోట్ల మీ అనుభవంమీద ఏమందు, ఎంతమోతాదు కలపాలో తెలిసికోవాలి. తెలియకపోతే అనుభవంగల వైద్యులను సంప్రదించండి.

పెద్ద రోగము

దిరిసెనచెక్కరసము అర్ధశేరు, నరమూత్రము అర్ధశేరు కలిపి ఆరంభదశలో పెట్టాలి.

మోదుగపువ్వు 2తు జొన్నకలి అర్ధసేరు ఉప్పు 1తు కలిపి ఆరంభదశలో పెట్టాలి.

వెల్లుల్లిపాయలు 2తు వాము 2తు ఉప్పు 3తు చింతపండు పులుసు ఒకటిన్నర సేరు కలిపి త్రాగించాలి.

జిల్లేడాకురసము 1 తు వెల్లుల్లిపాయలు 2 తు ధనియాలు 2 తు ఆరుదొండ వ్రేళ్ళు 3తు ఉప్పు 2తు జొన్నకలి సేరు కలిపి త్రాగించాలి.

బ్రహ్మజెముడు కాల్చి మసిచేసిన పొడి 2తు ఆవపిండి 1 తు మిరపకాయలపొడి 1 తు పిప్పళ్ళు 1 తు పసుపు ఒకటిన్నర తు మోదుగపువ్వు 1 తు కలిపి శేరున్నర గోరువెచ్చని నీటితో త్రాగించాలి.

ఆవపిండి 1 తు ఉప్పు చారెడు చింతపండుపులుసు ఒకటిన్నర శేరు వాముర‌సము ఒకటిన్నర శేరు కలిపి త్రాగించాలి.

వేపాకు 2 గుప్పెళ్ళు, సైంధవలవణము 1 తు వ్రూని పసుపు 1 తు నిమ్మకాయరసము 2 తు కలిపి త్రాగించాలి

పందికొక్కు రక్తము క్రొవ్వు మాంసము త్రొక్కి కాచి దినమునకు మూడుపర్యాయములు పెట్టాలి.

నాగజెముడును ముండ్లుతీసి ముక్కలుగా కోసినవి మూడు గుప్పెళ్ళు, శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు, తాడికాయలు, కరక్కాయలు, ఉసిరికపప్పు ఒక్కొక్కటి ఒకటిన్నర శేరు వంతునను, జొన్నకలి ఒకటిన్నర శేరు, చింతపండుపులుసు ఒకటిన్నర శేరు, వాముర‌సము ఒకటిన్నర శేరు కలిపి త్రాగించాలి.

నువ్వులనూనె ఒకటిన్నర శేరు, ఇప్పపువ్వు 2తు కలిపి త్రాగించాలి.

తవాక్షరి 2 తు వెదురాకు 3 గుప్పెళ్ళు, శొంఠి 2 తు దానిమ్మ చిగుళ్ళు గుప్పెడు, పెరుగు శేరు కలిపి త్రాగించాలి.

వెదురాకు, నేలవేము, అడ్డసరపువేళ్లు, నల్లేరువేళ్ళు, తెల్లావాలు, ఉప్పు సమానభాగములుగా జేర్చి కలితో మూడుగొట్టములు పెట్టాలి.

అడవిగుమ్మడిచెక్క, మిరియాలు, ఉప్పు, కలినీరు కలిపి పూటకు మూడుగొట్టములవంతున పెట్టాలి.

శొంఠి, వాము, నానువారిపాలు, మోదుగపువ్వు సమాన భాగములుగా తీసికొని కలితో పెట్టాలి.

దొమ్మలు

కరక్కాయలు, ఉసిరికపప్పు, శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు, ఒక్కొక్కటి 2 తులములపొడిని తీసికొని శేరుచింతపండు రసములోగాని, గేదె పేడరసములోగాని కలిపి కాచి వడపోసి త్రాగించాలి.

ఎలుగుబంటిరక్తము ఒకటిన్నర తు ఉప్పు 2తు శొంఠి 2తు కరిధూపము ఒకటిన్నర తు అర్ధశేరు మేక పంచితములో కలిపి పెట్టాలి.

శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు 4 తు వంతునను, పసుపు 1తు దిరిసెనాకు పసరు అర్ధశేరు, మేకపంచితము అర్ధశేరు కలిపి రెండు గొట్టములవంతున మూడు పర్యాయము లిచ్చిన దొమ్మలు తగ్గుతాయి.

వెల్లుల్లిపాయలు 3తు పసుపు 2 తు ఉప్పు 8 తు తెల్లతుమ్మ చెక్కరసము శేరు కలిపి కాచి అర్ధశేరు మేకమూత్రములో కలిపి రెండు పర్యాయములిచ్చిన దొమ్మలు తగ్గుతాయి.

ఇంగువ 6 తు మ్రానుపసుపు 4 తు ఉప్పు చారెడు, తమల పాకులునూరు నిమ్మకాయంత ఉండలుచేసి జామునకొకటివంతున ఇచ్చిన దొమ్మలు తగ్గుతాయి.

కరక్కాయలు, తాడికాయలు, ఉసిరికపప్పు సమాన భాగములును, చేకొణితాకుపసరు అర్ధశేరు, మేకపంచితము అర్ధశేరు కలిపి రెండు పర్యాయములు ఇచ్చిన దొమ్మలు తగ్గుతాయి.

మూడుద్రాముల సారాయిలో 2 తు గజపిప్పళ్ళు కలిపి త్రాగించిన దొమ్మలు తగ్గుతాయి.

ఆవుపంచితము మానెడు, వ్యాధియొక్క ఎక్కువతక్కువలను బట్టి సోలెడుపోసిన దొమ్మలు తగ్గుతాయి.

కరిధూపము, రాతిసున్నము కలితో కలిపి మూడుగొట్టములు పెట్టిన నెరెడిదొమ్మలు తగ్గుతాయి.

కొర్రపిండి మెత్తగానూరి కరిధూపము నువ్వులనూనె కలిపి ముక్కులలో పిండి తరువాత వెదురాకు పసరు దినమునకు మూడు గొట్టములు పెట్టిన నెరిడిదొమ్మలు తగ్గుతాయి.

కరిధూపము 1 తు రాతి సున్నం 1 1/2 తు శేరున్నర కలితో కలిపి పెట్టిన నెరిడి దొమ్మలు తగ్గిపోతాయి.

దిరిశెనచెక్క రసము ఆవుపాలు, జొన్న కలి సమానభాగములుగా కలిపి ఉదయం సాయంకాలములందు పెట్టిన నెరిడి నెమ్మదించుతుంది.

వాము 10 తు, కరిధూపము 1 తు, ఆముదపువేళ్ళ చెక్కరసం అర్ధశేరు కలి శేరు కలిపి క్రాగించిన నెరిడి తగ్గిపోతుంది.

పులు కలి శేరు. పాలు అర్ధశేరు, ఉప్పు గిద్దెడు, కరిధూపము అరతులం కలిపి పూటకు మూడుగొట్టములు పెట్టిన నెరిడి తగ్గుతుంది.

బ్రహ్మజెముడు కాల్చినమసి గుప్పెడు కొర్రపిండి 3 గుప్పెళ్ళు పాలు అర్ధశేరు కలిపి పూటకు మూడుగొట్టములు పెట్టిన నెరిడి తగ్గుతుంది.

ఆముదపు పప్పు, వాము, వావింట వేళ్ళు, జిల్లేడు పువ్వులు, సున్నము, కరిధూపము, గుంటకలగలర ఆకు, వెల్లుల్లిపాయలు, ఆవాలు, వేపవిత్తులు, తక్కేడు వేళ్ళు, మోడి, పిప్పళ్ళు మిరియాలు, శొంఠి, ఇంగువ సమానభాగములుగా రోటమర్దించి కోడిగ్రుడ్డంత మాత్రలు చేసి పూటకొకటి వంతున ముప్పది పూటలుపెట్టిన నెరిడి తగ్గిపోతుంది.

దిరిసెనచెక్కపొడి, నేలవేము, తురకవేప, బ్రహ్మదండివ్రేళ్ళ నూరిగాని, కషాయము కాచిగాని క్రాగించిన నెరిడి తగ్గిపోతుంది.

వాతములు

దుష్టపాకు పసరు సోలెడు, కలినీరు శేరు కలిపి పెట్టిన తగ్గిపోతుంది.

వెంపలివేళ్ళ రసము కలినీరు కలిపి పదిదినములు పెట్టిన తగ్గుతుంది.

వాతముచే కాళ్లు వాచియున్నయెడల వావిలి, తంగేడు, బారిజ దిరిశెన నింబ ఆకులపసర్లును, నేయిమానెడు ఆముదమునూనె మానెడు కలిపి కాచి సగము శరీరమునకు రుద్ది తక్కినది లోపలికిక్రాగించిన ఎడల వాతముతగ్గి వాపులు పోతాయి.

నల్లేరు, ఇంగువ, వెల్లుల్లిపాయలు, ఆముదపు వేళ్ళచెక్క కలిపి కలితో పెట్టిన ఎటువంటి వాతములైనను హరించిపోతాయి.

వావిలి, తక్కేడు, దుష్టపాకు, దిరిసెనవేళ్లు, బారిజచెక్క, తమలపాకులు, మోడి, ఇంగువ, తంగేడు, జిల్లేడుపువ్వులు, గన్నేరువేళ్లు నల్లేరు, వాము, చేకొణితివేళ్లు, కాకరాకు సమానభాగములు రోటిలోవేసి దంచి ముద్దలుచేసి ఆముదముతో కలిపి పెట్టిన వాతము తగ్గుతుంది.

ప్రత్తి ఆకురసము, పుచ్చాకురసము, వావిలాకురసము, అడ్డసరపాకురసము, సంపెంగాకురసము, తక్కెడాకురసము, చింతాకురసము నల్లేరురసము, తురకవేపాకురసము, దిరిసెనాకురసము, మారేడుపండ్ల ఊట, మేడిచెక్కరసము, నూనె, ఆముదము సమానముగ తీసికొని మిరియాలపొడి కలిపి పాకముగాచేసి పూటకు పావుసేరు పెట్టిన ఎటువంటి వాతములైనను తగ్గిపోతాయి.

పసుపు 6 తు తామరదుంప 1 వీసె, బెండవేళ్ళు 2 గుప్పెళ్ళు, పంచదార అరవీసె కలిపి 2 సేర్లు పందినేతితో పాకముగావండి వెలగకాయంత తీసికొని అర్ధశేరు గొఱ్ఱె పాలతోకలిపి 15 దినములుపెట్టిన నక్కవాతము తగ్గుతుంది.

నిమ్మకాయంత రాతిసున్నము, పిప్పళ్ళు 1 తు కలిపి ఉదయం సాయంకాలములయందు 10 దినములు పెట్టిన నక్కవాతము నివారించుతుంది.

పసుపు 1 తు శొంఠి 2 తు నీరుల్లిపాయలు 5, పులిమజ్జిగ అర్ధశేరు కలిపి త్రాగించిన పైవాతమును నివారించుతుంది.

నాగులాకు 4 వీసెలు, తక్కేడాకు 2 వీసెలు, గోంగూర 3 వీసెలు, మంచినూనె 1 వీసెడు కలిపి ముద్దజేసి రేపూమాపూ మందువచ్చువరకు పెట్టిన నక్కవాతమును నివారించుతుంది.

పచ్చిగోంగూర మణుగు, శొంఠి 10 తు మిరియాలు 6 తు ఉసిరికపప్పు 7 తు కలిపి త్రొక్కి ఒక బానలోవేసి పెంటపోగు గోతిలో వేసి కప్పియుంచి వారముదినములైన తర్వాత తీసి దినమునకొక వెలగ కాయంత ముద్దచేసిపెట్టిన పై వాతము నివారించుతుంది.

కలబంద గుజ్జు అర్ధశేరునవటాకు, ఉలవపిండి అరసోలెడు, నీరుల్లిపాయలు సవాశేరు, కలిపి త్రొక్కి వారము దినములు పెట్టిన పై వాతము నివారణ అవుతుంది.

తంగేడు చిగుళ్ళు 3 గుప్పెళ్ళు సేగుర్తాకు గుప్పెడు నీరుల్లిపాయలు 6, గోంగూర మూడు గుప్పెళ్ళు పందినెత్తురు అర్ధశేరు కలిపి పెట్టిన నక్కవాతమును నివారించుతుంది.

నేలతంగేడు ఆకుపసరు అర్ధశేరు, పసుపు 1 తులము, పులికలి అర్ధశేరు కలిపి త్రాగించిన జంబుకవాతము లేక నక్కవాతము తగ్గిపోతుంది.

కలినీరు అర్ధశేరు బూరుగబంక 4 తులములు నువ్వుపువ్వులు నాలుగు గుప్పెళ్ళు కలిపి పెట్టిన తీటవాతము తగ్గిపోతుంది.

రాతిసున్నము 4 తులములు అరటిఆకుల మసి 2 తులములు మోదుగాకు మసి రెండున్నర తులములు మైలుతుత్తము 1 తులము కాజాకుపసరు పావుసేరు ఆముదము పావుశేరు కలిపి నాలుగైదు పూటలు పెట్టిన తీటవాతము నివారించుతుంది.

గాడిదగడపాకుపసరు అర్ధశేరు రాతిసున్నము గుప్పెడు నువ్వులనూనె పావుశేరు కలిపి తీటకు పట్టించాలి.

మూర్కొండాకు పసరు పావుశేరు గంధకము 1 తు కలిపిరాసిన తగ్గుతుంది.

గోరింటాకుపసరు పావుశేరు పటిక పొడి 1 తులము పొగాకు రసము పావుశేరు కలిపి రాసిన నివారించుతుంది.

కొబ్బరిచిప్పలు కాల్చి మసిజేసి ఆముదములో కలిపిరాసిన తీటవాతము నివారించుతుంది.

ఆవాలు ఒకటిన్నర తులము శొంఠి ఒకటిన్నర తులము హారతికర్పూరము ఒకటిన్నర తులము గొలిమిడాకు పసరులో కలిపి చెవిలోపోయుము.

షరా: వాతరోగములు వాని రోగనిదానములు చికిత్సలు వాతలు విపులముగా తెలిసికొనవలెననిన నాచే రచింపబడిన అనుభవ పశువైద్య చింతామణి చూడగలరు.

వాతములకు ఫార్మసీవారి వాతారిని వాడాలి.

దుష్టపుతీగె పలుపువలెచుట్టి మెడలో వేసి సారాయి 2 డ్రాముల దుష్టపాకుపసరు పావుశేరుకలిపి త్రాగించిన కురమరోగమును నివారించుతుంది.

అర్ధశేరు మేకపాలలో పసుపు 1 తులము కలిపి త్రాగించిన కురమను నివారించును.

అర్ధశేరు తిప్పతీగెరసములో పావుశేరు వాముర‌సము కలిపి త్రాగించిన కురమను నివారించును.

నువ్వలనూనె తిప్పతీగెరసము సమానభాగములుగా కలిపి శరీరమునకు రుద్దిన నొప్పులను నివారించును.

ఖర్జూరకాయలు నీటిలోనానవేసి అప్పుడప్పుడుత్రాగించిన కురమలో వగర్పును నివారించును.

తిప్పతీగెరసము లోపలికి త్రాగించి తీగెను పలుపుగాచుట్టి మెడలోవేసి, ఆకురసము నూనెలోకలిపి కాళ్ళకురాసిన కురమను నివారించును.

దుష్టపాకు మిరియాలు కలిపి రసముతీసి ముక్కురంధ్రములలో పోసిన కురమను నివారించును.

దుష్టపాకుపసరు పూట కొకగొట్టముపెట్టి బూడిదగాని వీబూదిగాని రుద్దిన నొప్పులను నివారించును.

గాలికుంటు తగిలినపశువు ముక్కురంధ్రములో జిల్లేడు చిగుళ్ళ నూరిపెట్టిన గాళ్ళు తగ్గును.

సూరేకారము 1 తు, మజ్జిగ అర్ధశేరు, కలిపి రెండుదినములు త్రాగించుము.

వండిన పెసరపప్పు అర్ధశేరు, పేలాపిండి రెండుగుప్పెళ్ళు, నెయ్యి పావుసేరు కలిపి త్రాగించిన జ్వరము తగ్గిపోవును.

చోడిజావ అర్ధశేరు మజ్జిగ అర్ధశేరు కలిపి త్రాగించిన గాళ్ళలోని జ్వరము తగ్గిపోతుంది.

రావిచెక్క, తుమ్మచెక్క కషాయము నోటిపుండ్లకు పట్టించుచుండాలి.

నీరుల్లిపాయలు 5, పసుపు 1 తులం, పెసరపప్పు వుడికించినది అర్ధశేరు కలిపి తినిపించిన గాళ్ళుతగ్గిపోతాయి.

జిల్లేడుకొనలు ముక్కురంధ్రములలో అప్పుడప్పుడు పెట్టిన గాళ్లు తగ్గిపోతాయి.

జొన్నలు పెసలు పులగముగావండి నూనెలోకలిపిపెట్టుము. పురుగులు పడిన పుండ్లకు నేయ్యి రాసిన తగ్గుతాయి.

పెసరపప్పు పేలాపిండి నూనె కలిపి పూట కొకముద్ద పెట్టాలి.

పెసరకట్టు గానుగపిండి కలిపి పెట్టాలి.

తమిదెజావలో నూనెకలిపి పెట్టుచు పుండ్లకు నీరుల్లిరసము రాయాలి.

నీరుల్లిపాయలు, జొన్నఅన్నము పెసరపప్పు పసుపు కలిపి పెట్టాలి.

వాముర‌సము అర్ధసేరు ఉప్పు చారెడు కలిపి త్రాగించిన కడుపు నొప్పి నివారించుతుంది.

చారెడు ఉప్పు శేరు గోరువెచ్చనినీటిలో కలిపి పెట్టిన కడుపునొప్పి నివారించుతుంది.

గచ్చాకురసము అర్ధశేరు, బియ్యపుకలి 1/2 శేరు కలిపి త్రాగించిన నొప్పి నివారించుతుంది.

నొప్పిచే బాగుగా తన్నుకొను పశువునకు చిరినెల్లి చెట్టు వేరురసముగాని, గాడిదగడపాకు పసరుగాని 1/2 శేరు, సారాయి 2 డ్రాములు కలిపి త్రాగించిన నివారించుతుంది.

కురాసానివాము 3 తు కలినీరు ఒకటిన్నర శేరు కలిపి త్రాగించిన కడుపునొప్పి నివారించుతుంది.

ఇంగువ 2 తు, గచ్చాకురసము అర్ధశేరు ఉప్పు 3 తు కలిపి త్రాగించాలి.

వెల్లుల్లిపాయలు 4 తు గచ్చాకురసము పావుశేరు వాము 6 తు కలినీరు అర్ధశేరు కలిపి త్రాగించాలి.

ధనియాలరసము అర్ధశేరు ఆముదము అర్ధశేరు కలిపి త్రాగించాలి.

పొట్టపైన మూడుపర్యాయములు రోకలితో తోమిన తగ్గుతుంది. పైచికిత్సలన్నియు కడుపు నొప్పికి పనిచేస్తాయి.

కాల్చినమసి 12 తు, శేరు కలినీటిలో కలిపి త్రాగించిన కడుపుబ్బు తగ్గుతుంది.

వేకువజామున వేసిన పక్షులరెట్ట 6 తు శేరునీటిలో కలిపి త్రాగించాలి.

వాముర‌సము శేరు, ఉప్పుచారెడు కలిపిత్రాగించుము.

దిరిసెనాకుపసరు అర్ధశేరు ఉప్పుచారెడు, బియ్యపుకలి అర్ధశేరు కలిపి త్రాగించాలి.

సైంధవలవణము 4 తు వస 2 తు కోస్టు 4 తు వెల్తివుచ్చ చెక్కరసము 6 తు కలిపి త్రొక్కి ఆముదముతో తడిచేసి తినిపించాలి.

పచ్చినేలవేము ఆకుపసరు పావుశేరు, ఉప్పుచారెడు కలినీరు అర్ధశేరు కలిపి త్రాగించాలి.

కారింగువ 2 తు కరిధూపము 1 తు గచ్చాకురసము పావుశేరు, ఉప్పు 4 తు కలినీరు అర్ధశేరు కలిపి త్రాగించాలి.

ఇంగువ 3 తు వెల్లుల్లిపాయలు 4 తు మంచిబెల్లము అర్ధశేరు కలిపి త్రాగించాలి. పై చికిత్సలన్నియు కడుపుబ్బులకు మంచిపనిచేస్తాయి.

కర్పూరము ఒకటిన్నర తు, ఇంగువ 1 తు శొంఠి ఒకటిన్నర తు బెల్లము తగినంత కలిపి నూకలజావతో రెండు పర్యాయములిచ్చిన రక్తవిరేచనములు కట్టుకొంటాయి.

కవిరి 1 తు సీమసున్నము ఒకటిన్నర తు, దాల్చిన చెక్కపొడి ఒకటిన్నర తు, శొంఠి ఒకటిన్నర తు, కలిపి తిను ఆహారములో రెండువేళల పెట్టిన విరేచనములు కట్టుకొంటాయి.

కవిరి 1 తు, మాచికాయపొడి 1 1/2 తు నల్లమందు 1/4 తు, సోంపు 2 1/2 తు రెండువేళల గంజిలోకలిపి పెట్టాలి.

దాల్చినచెక్కపొడి 1 తు, కవిరి 1 తు, మాచికాయ పొడి 1 తు కలిపిపెట్టాలి.

అన్నభేది అర తు, నల్లమందు 1/4 తు, కవిరి 1 తు, దాల్చిన చెక్కపొడి 1 తు, కలిపి శేరుగంజితో కలిపి ఇవ్వాలి.

ఉడకబెట్టిన నీరుల్లిపాయలు 10 తు, కవిరి 1 తు, నల్లమందు 1/2 తు కలిపి గంజితో ఇవ్వాలి.

నల్లమందు పావుతులం కవిరి 1 తు, సీమసున్నము 2 1/2 తు, శొంఠి 1 తు, కలిపి గంజిలో రెండువేళల ఇవ్వాలి.

అవిసెనూనె అర్ధశేరు నల్లమందు ఒకటిన్నర తు, కలిపి ఇవ్వాలి.

మారేడు గుజ్జుతో కవిరి రెండుమూడుపర్యాయములీయాలి. పై చికిత్సలన్నియు విరేచనములు కట్టించుతాయి.

ముసాంబ్రము ఒకటిన్నర తు, నేలవేము 1 తు, ఉప్పు, రెండున్నర తు, శొంఠి ఒకటిన్నర తు, బెల్లము తగినంత కలిపి ఇచ్చిన మలబద్ధకము నివారణవుతుంది.

కటకరోహిణి ముప్పావు తు, ఉప్పు రెండున్నర తు, శొంఠి పావు తులం మిరియాలు ఒకటిన్నర తు, సారాయి 10 తు, నూకలజావ శేరు కలిపి త్రాగించాలి.

మోదుగవిత్తులు 1 తు, అన్నభేది 1 తు, విషముష్టిగింజలపొడి పావుతులం కలిపి తినునాహారములో పెట్టాలి.

కారపుపాలు శేరువంతున రెండుపర్యాయములు త్రాగించాలి.

ఉప్పు చారెడు, మోదుగవిత్తులు 1 తు, గోరువెచ్చని నీరు శేరు కలిపి త్రాగించాలి. పై చికిత్సలన్నియు మలబద్ధకమును పోగొడతాయి.

వెల్లుల్లి, ఆవపిండి, ఉప్పు మజ్జిగలో కలిపి పెట్టాలి.

కారపుపాలు మూడుగొట్టములు పెట్టాలి.

కారము, ఆవపిండి, ఉప్పు కలితో కలిపి మూడుగొట్టములు పెట్టిన అజీర్తి, శూలనొప్పి నివారిస్తుంది.

బ్రహ్మజెముడు కాల్చి మసిజేసి కారము, ఆవపిండి కలిపి పెట్టాలి.

వెల్లుల్లిపాయలు, ఆవాలు, కారము కలిలో కలిపి పెట్టాలి.

పసుపు, వేపాకు, కారము సైంధవలవణము కలి కలిపి త్రాగించాలి.

చింతపండుపులుసు, కారము, ఉప్పు, ఆవపిండి కలిపి పూటకు మూడుగొట్టములు పెట్టాలి.

కరిధూపము, వాము, ఉప్పు, గచ్చపప్పు, ఆవాలు, కలిలో కలిపి పెట్టాలి.

కాకరాకుపసరు, ఉప్పు, కారము, కలితో మూడుగొట్టములు కలిపి పెట్టాలి.

మిరపాకురసము మిరియాలపొడి ఉప్పునూరి కలితో పెట్టాలి.

వాము, ఆవాలు, కరిధూపము, ఉప్పు, పంచలవణములు, ఇంగువ కలిలో కలిపి పెట్టిన శూలలన్నియు పోతాయి.

నరమూత్రము, తురక వేపవిత్తులు, ఉప్పు పులికలితో పెట్టాలి.

మిరపవిత్తులు, వేడినీటిలో కలిపి పెట్టాలి.

వాకుడుచెట్టు సమూలరసములో పంచలవణములు, వెల్లుల్లి కలిలో కలిపి పెట్టుము. పై చికిత్సలన్నియు అజీర్తి శూలలు నివారించుతాయి.

వాతశరీరము కలిగి నునుపుగను బలిసినదిగను, డొక్కలుదించుకొని ఎల్లపుడు కన్నులవెంట నీరుగార్చుచు కాళ్ళుపట్టివేయు ఎద్దులకు కల్లుబెల్లం వీసెడు, మంచినువ్వులనూనె అరవీసెడు కలిపి జత ఎద్దులకు వుదయం 10 గంటలకు పెట్టాలి. ఈ రీతిగా అయిదు వారములు పెట్టుచు పిల్లిపెసర తొండంగి మినపకాడ ప్రత్తివిత్తులు మొదలగునవి నిరాటంకముగా పెట్టవచ్చు.

అంతనిక్కాక అంతవాతము లేకుండనుండు పశువునకు నిక్కాకు వస్తువులుపయోగించినప్పుడు నీరు మేత ఎక్కువగా సేవించుచు, తెల్లవారునప్పటికి నిర్జీవముగలదిగానుండి నిస్సత్తువతో ఉంటుంది. అప్పుడు ఇత్తడికాగునకు కళాయి వేయించి అందులో మెట్టతమిదలు వేయించి ఒక ఇరస, కలుబెల్లం ఒకటిన్నర మణుగు మంచినూనె ఒకటిన్నర మణుగు వేసికలిపి ఒక వారము నిలువయుంచి ప్రతిదినము అరవీసె పరిమాణము వంతున పైన చెప్పిన లక్షణములుగల ఎద్దునకు పెట్టినయెడల బాగుగా బలియును.

రత్నాపురిగుగ్గిలము వీసెడు, మంచినూనె వీసెడు, తాటిబెల్లం వీసెడు, గవ్వసాంబ్రాణి వీసెడు తెచ్చి ముందు నూనెలో గుగ్గిలపుపొడి కొద్దికొద్దిగా కలుపుచుండాలి. లేనియెడల గడ్డకట్టును. అందులో తాటి బెల్లము కలిపి తరువాత సాంబ్రాణి కలిపి డబ్బాలో వారముదినములుంచి తదుపరి వారము దినములు ఈ మందును జత ఎద్దులకు పెట్టాలి. పైమందులో శేరుగాని అడ్డెడుగాని మినపపిండి కలిపి పెట్టిన మిగుల మంచిది.

కడుపులోని వాయువును పోగొట్టునవి

సోంపు 2తు, ఏలకులు 2తు, జీలకర్ర తులమున్నర శొంఠి తులమున్నర కలిపి తిను ఆహారములో కలిపి పెట్టాలి.

ఇంగువ 2 తు, కర్పూరతైలము 5 తు, అవిశనూనె అర్ధశేరు కలిపి త్రాగించాలి.

సారాయి 10 తు, ఉప్పు 10తు, ఇంగున 1తు, గోరు వెచ్చనినీరు శేరున్నర కలిపి త్రాగించాలి.

ఏలకులు 2తు, లవంగాలు అరతులం, శొంఠి తులమున్నర సోంపు 1తు జీలకర్ర తులమున్నర కలిపి దాణాలో పెట్టాలి.

దాల్చిన చక్కపొడి 1తు శొంఠి తులమున్నర మిరియాలు 1తు సోంపు 1తు తిను దాణాలో పెట్టాలి

శేరు కొబ్బరినూనె త్రాగించాలి.

ధనియాలు నాలుగున్నర తు సోంపు ఒకటిన్నర తు జీలకర్ర 1 తు శొంఠి 1 తు వాము గిద్దెడు కలిపి తిను ఆహారములో కలిపిపెట్టాలి.

మెంతులు 3తు మిరియాలు తులమున్నర ఆవాలు 1తు 1తు ఉప్పు గిద్దెడు కలిపి పెట్టాలి.

వెల్లుల్లి 4తు, ఇంగువ తులమున్నర ఉప్పు తులమున్నర శొంఠి 1తు, బెల్లపునీటితో కలిపి పెట్టాలి.

పిప్పళ్ళు 1తు, శొంఠి 1తు పసుపు తులమున్నర లవంగాలు తులమున్నర ఉప్పు రెండున్నర తులములు కలిపి పెట్టుము.

ఉద్దీప నౌషధములు

నాటుసారాయి 10 తు, శొంఠిపొడి 1తు, నలమిరియాలు పొడి 1తు ఒక శేరు జావలో కలిపి త్రాగించాలి.

అన్నభేది 1 తు, ఉప్పు 2½తు, పొడిగా చేసి ప్రతిపూట తినిపించాలి.

ఉపశాంతికరములు

గంజాయిపత్రి 1తు, ఇంగువ 1తు, నాటుసారాయి 10తు, శేరున్నర నీటిలో కలిపి త్రాగించాలి.

కర్పూర తైలము రెండున్నర తులము సీమ అవిసెనూనె 10 చటాకులు కలిపి త్రాగించాలి,

మూత్రరోగములు

నీరుల్లిపాయల రసమును నీరు చురుకునకు ఇచ్చినతగ్గుతుంది.

సూర్యక్షారమును నీటిలో కలిపి ఇచ్చిన నీరుచురుకు తగ్గుతుంది.

పెద్దనల్లేరు సమూలరసమును ఇచ్చిన మూత్రకోశములోని నొప్పి, మంట, వేడి, శుక్లనష్టము తగ్గుతుంది.

శిలాజిత్తు భస్మమును తేనెతో కలిపి ఇచ్చిన శిలామేహవాతము తగ్గుతుంది.

ధనియాల చూర్ణమునుగాని పచ్చి కొత్తిమీర ఆకునుగాని ఇచ్చిన మూత్రము వెంట ఇంద్రియము పడుటను కట్టించుతుంది.

గోరింతాకురసములో నీరుకలిపి ఇచ్చిన శుక్లనష్టము తగ్గుతుంది.

మంచిగంధమును లోపలికిచ్చిన వీర్యనష్టము తగ్గుతుంది.

గల్జేరాకుల రసమును పాలతోకలిపి త్రాగించాలి.

దగ్గు

నేల వేము కలినీటిలో కలిపి ఉదయం సాయంకాలములందు పెట్టాలి.

వెంపలి వేళ్ళరసము కలినీటితో కలిపి ముక్కు రంధ్రములలో పోయాలి.

తెలికపిండిని మోదుగనీరు కలితోకలిపి పెట్టాలి.

నేలవేము ఆకులు, దుష్టపాకులు, వెంపలి, చిట్టిగారవేళ్ళు సమాన భాగములు చూర్ణముచేసి నూనెతో వండిపెట్టాలి.

శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు సమానభాగములుగా తీసికొని కలితో పెట్టిన దగ్గు వగర్పు కట్టును.

దిరిసెనాకుపసరు, తెల్లవావిలాకు పసరు కలిపి ప్రతిదినము పెట్టుచుండినయెడల తగ్గును.

దిరిసెనాకుపసరు, నరమూత్రము, పసుపు, నల్లేరురసము కలిపి పెట్టాలి.

వెలిగారము కల్లు పందిరక్తము మిరియాలు కామంచాకుపసరు పసుపు సమానభాగములుగా కలిపి వారము దినములు పెట్టిన తగ్గును.

జొన్నపిండి, కల్లు నరమూత్రము, పసుపు, పిప్పలి, మిరియాలు కలిపి పూటకొక గొట్టమువంతున పెట్టిన తగ్గును.

వెలగాకురసము నూనె పసుపు కలిపి పూటకొక గొట్టము పెట్టాలి.

నేలవేము కటకరోహిణి నీలి వెంపలివేళ్ళు జిల్లేడుపువ్వులు పిప్పళ్లు ఉమ్మెత్తవేళ్ళు తాటి బెల్లపు సారములో కలిపి పెట్టాలి.

ఉలవపులగము తాటిబెల్లము ఊరపంది రక్తముకలిపి పెట్టాలి.

పల్లేరుకాయల రసములో పందిరక్తము కలిపి పెట్టాలి.

నీరుల్లి పాయలరసము అర్ధశేరు, మజ్జిగ అర్ధశేరు కలిపి త్రాగించాలి.

రావిచెక్కరసము అర్ధశేరు, పచ్చిపాలు అర్ధశేరు కలిపి నాలుగు దినములు త్రాగించాలి.

తెలికపిండి అరవీసె, ఆవుపాలు అర్ధశేరు, గంజి అర్ధశేరు, కలిపి త్రాగించాలి.

ప్రత్తికాయలు గుప్పెడు ఆవుపాలతో నూరి త్రాగించాలి, మూర్కొండాకు పసరు ఒక్కొక్క ముక్కురంధ్రములో 10 చుక్కలు వెయ్యాలి.

దగ్గు, జలుబు

ఇంగువ 6తు, అల్లము 2తు, కలిపి నూరి తినిపించాలి.

నీరుల్లిపాయలు దాహము పెట్టినట్టుగా తినిపించాలి.

అడ్డసరపాకు రసముతో తేనెకలిపి నాకించాలి.

ఇంగువ ఒకటిన్నర, నవాసాగరము ఒకటిన్నర తు, కర్పూరము ఒకటిన్నర తు, యష్టిమధుకము 3/4తు, బెల్లము తగినంత కలిపి నాకించాలి.

కర్పూరము, యష్టిమధుకము ఒకటిన్నర తు, ఇంగువ 1 తు, తేనె తగినంత కలిపి అప్పుడప్పుడు నాలుకకు నాకించాలి.

కృష్ణతులసి ఆకులు అరగుప్పెడు, మిరియాలు అర తు, శొంఠి అరతులం, తమలపాకులు 6 కలిపి నూరి తేనెతో నాకించాలి.

పిప్పళ్లు, యష్టిమధుకము, దాల్చినచెక్కపొడి తగినంత తేనెతో కలిపి త్రాగించాలి.

నీరుల్లిపాయలరసము మజ్జిగలోకలిపి త్రాగించాలి.

కస్తూరి, పిప్పళ్ళు, నవాసాగరము తీసికొని తగినంత తేనెతో కలిపి నాకించాలి.

ముద్దకర్పూరమును మంచిబెల్లముతో కలిపి నాకించాలి.

వగర్పు

వస, శొంఠి, పిప్పళ్ళు, పసుపు, మిరియాలు ఒక్కొక్కటి పావుతులమువంతున నూరి ముక్కురంధ్రముల లోనికి నశ్యము చేయించాలి.

అడ్డసరాకుపసరు మానెడు, శొంఠి 8తు, పసుపు 3 తు, మిరియాలు 4తు, కలిపినూరి నాలుగుదినములు త్రాగించాలి.

కలినీరు పావుశేరు, వెంపలిఆకురసము 3తు, కలిపి ముక్కురంధ్రములలో పోయాలి.

మోదుగాకుపసరు అర్ధశేరు, తెలికపిండి సవాశేరు కలిపి త్రాగించాలి.

పచ్చి నేలవేము ఆకు పసరు పావుశేరు, వెదురాకు గుప్పెడు, కలినీరు అర్ధశేరు కలిపి త్రాగించాలి.

మోదుగపువ్వు 2 తు, నీరుల్లిపాయలరసము పావుశేరు, మజ్జిగ అర్ధశేరు కలిపి త్రాగించాలి.

తెలికపిండి సవాశేరు, జొన్నకలి అర్ధశేరు, మోదుగపువ్వు 1 తు కలిపి త్రాగించాలి.

దిరిసెనాకుపసరు పావుశేరు కల్లుబెల్లం 8 తు కలినీరు అర్ధశేరు కలిపి త్రాగించాలి.

సేగుర్తాకుపసరు అర్ధశేరు, పందిరక్తము పావుశేరు కలిపి త్రాగించాలి.

కామంచి ఆకుపసరు పావుశేరు, పందిరక్తము పావుశేరు కల్లు అర్ధశేరు వెలిగారము 1తు, కలిపి వారము దినములు పెట్టవలెను,

గచ్చపప్పు పొడిని చెవులలో వేసిన తగ్గును.

దుష్టపాకు పసుపు ఆముదము కలిపి వండిపెట్టిన తగ్గును.

అడ్డసరపాకు శొంఠి కషాయముగా కాచి పూటకొక గొట్టము వంతున పెట్టిన తగ్గును.

పెద్దమ్రానుచెక్కరసము తగినంత మిరియాలపొడి కలిపి పెట్టిన తగ్గును.

జ్వరమును తగ్గించునవి

వసపొడి రెండున్నర తు, నేలవేము కషాయము రెండున్నర తు, వేడినీరు శేరున్నర కలిపి త్రాగించాలి.

నవాసాగరము ఒకటిన్నర తు, ఉప్పు 10 తులములు నీరుశేరు కలిపి త్రాగించాలి.

గచ్చపప్పు 1 తు, మిరియాలు 1 తు, లవంగాలు ఒకటిన్నర తు, కలిపి తిను ఆహారములో పెట్టాలి.

నేలవేము 1 తు, సూర్యక్షారము ఒకటిన్నర తు, గచ్చపప్పు 1 తు, మిరియాలు 1 తు, తిను ఆహారములో కలిపిపెట్టాలి.

తిప్పతీగెరసము రెండున్నర తు, శొంఠి 1 తు, వేడినీరు శేరు కలిపి త్రాగించాలి.

వేపచెక్కరసము రెండున్నర తు, దాల్చిన చెక్క 1 తు, లవంగాలు ఒకటిన్నర తు, నీరు శేరు కలిపి త్రాగించాలి.

సూరేకారము 3/4 తు, కర్పూరము పావుతులం నవాసాగరము ఒకటిన్నర తు, సారాయి 10 తు, వేడినీరు శేరు కలిపి త్రాగించాలి.

చింతపండుపులుసు అర్ధశేరు నీరు శేరు కలిపి త్రాగించాలి.

కర్పూరము 1 తు, నవాసాగరము 1 తు, నేలవేము 1 తు, వేము 2 తు, శొంఠి 2 తు, సోంపు 2 తు, శేరునీటిలో కలిపి త్రాగించాలి.

ఆకలిని కలుగజేయునవి

అల్లము మంచిబెల్లము కలిపిత్రొక్కి పెట్టించాలి.

వాముర‌సము అర్ధశేరు శొంఠి 1 తు, మిరియాలు ఒకటిన్నర తు, కలినీరు శేరు కలిపి త్రాగించాలి.

జిల్లేడు మొగ్గలపొడి పావుతులం వాముపొడి 1 తు, మిరియాలపొడి ఒకటిన్నర తు, కలిపి తిను ఆహారములో పెట్టించాలి.

విషముష్టిపొడి పావుతులం తు, ఇంగువ ఒకటిన్నర తు, నేలవేము 1 తు, అన్నభేది 1 తు, తినుఆహారములో కలిపి పెట్టించాలి.

నీరుల్లిపాయలరసము మజ్జిగలో కలిపి పెట్టించాలి.

వాము ఉప్పును గుంటకలగరాకురసములో కలిపి ఇచ్చిన ఆకలిని కలిగిస్తుంది.

నులిపురుగులను చంపునవి

దుష్టపాకురసము పావుశేరు త్రాగించాలి.

గాడిదగడపాకురసము పావుశేరు త్రాగించాలి.

కుప్పింటాకులో ఉప్పుకలిపి పెట్టించాలి.

అరటివేళ్ళరసము లోపలికి త్రాగించాలి.

వేపాకురసములో కొద్దిగా ఉప్పుకలిపి పెట్టించాలి.

తెలియని రోగములకు చికిత్సలు

నరమూత్రము అర్ధశేరు, మోదుగపువ్వు 2 తు, కలినీరు అర్ధశేరు కలిపి మూడుదినములు త్రాగించాలి.

ఎలుగుబంటి రక్తము ఒకటిన్నర తు, కలినీరు అర్ధశేరు కలిపి త్రాగించాలి.

నీరుల్లిపాయలు సవాశేరు, కోడిపెంట 2 తు, ఉప్పుచేరెడు నువ్వులనూనె అర్ధశేరు కలిపి త్రాగించాలి.

కొత్త కుంకుడు కాయలు 3, గొఱ్ఱెచర్మం 3 తు, నేలవాము 4 తు, శేరునీటిలో కలిపి త్రాగించాలి.

చేకొణితాకుపసరు అర్ధశేరు, పసుపు 1తు, నువ్వులనూనె అర్ధశేరు కలిపి త్రాగించాలి

తెలకపిండి అరవీసె, మోదుగపువ్వు 3 తు, కలినీరు అర్ధశేరు కలిపి పెట్టుము.

మేకమూత్రము ఒకటిన్నర సేరు, పసుపు 1 తు దిరిసెనాకు పసరు ఒకటిన్నర సేరు, శొంఠి 1 తు, కలిపి త్రాగించాలి.

నల్లఉప్పువేరు 3 తు, మోదుగపువ్వు 3 తు, పసుపు 3 తు, కొర్రగంజి శేరు కలిపి త్రాగించాలి.

సైంధవలవణము 1 తు, వాముర‌సము పావుసేరు, మోదుగ పువ్వు 2 తు, నరమూత్రము అర్ధసేరు కలిపి త్రాగించాలి.

నువ్వుపిండి సేరు, మోదుగ పువ్వు సేరు, కొర్రగంజిలోగాని, కలితోగాని కలిపిపెట్టవలెను.

కారుమునగవేరు; కామంచి, జొన్నకలి, కలిపిపెట్టిన తగ్గుతుంది.

రొమ్ము నొప్పి (పట్టు)

తెలికపిండి సవాశేరు పాలు అర్ధశేరు కలిపి పది దినములు త్రాగించాలి.

వరిపిండి సవాసేరు ఉలవపిండి అర్ధశేరు తాటిబెల్లము 1 వీ కలిపి త్రొక్కి నిమ్మకాయంత ఉండలు చేసి దినమునకు నాలుగు పెట్టుము.

మంచి నడివయస్సులోనున్న అనగా మొదటిసారి గ్రుడ్లుకొరకు వచ్చిన పెట్ట ఒకటి, దాల్చినచెక్క 5తు, ఏలక్కాయలు 2 తు, లవంగాలు 2 తు దుంపపసుపుకొమ్ములు 5 తు, ధనియాలు పావుసేరు, అల్లము 5 తు, వాము సోలెడు, నువ్వులనూనె అరవీసెతెచ్చి సదరు వస్తువులన్నియు మెత్తగా కొట్టవలెను. కోడిబొచ్చుతీసి కాల్చి కాళ్లభాగములు తీసివేసి మిగిలినది రోటిలోవేసి మెత్తగా త్రొక్కి ఎముకలు తీసి అందులో పైచూర్ణమును నూనెలో కలిపి మెత్తగా దంచి ముద్దలు చేసి సాయంకాలము పెట్టవలెను. ఈ మందు పెట్టిన రాత్రి నీరు పెట్టరాదు. ఇట్లు చేసిన సమస్త వాతరోగములు హరించుతాయి. (అనుభవము)

ఉడుమును తెచ్చి రోటిలోవేసిదంచి తెలికపిండి సవాసేరు శొంఠి 3 తు, పిప్పలి 4 తు, మిరియాలు 3 తు, కలిపి దంచి కోడిగ్రుడ్డంత ఉండలుచేసి పెట్టుము.

కోడిగ్రుడ్లు, చేకొణితాకు, వాము, తాటిబెల్లము, మిరియాలు ఆముదము కలిపి మూడుపూటల నిమ్మకాయంత పెట్టుము.

కొర్రపిండి, ఉలవపిండి బెల్లము కలిపి పెట్టిన తగ్గును.

నువ్వుపిండి, తాటిబెల్లము, ఉలవ కలిపి, కోడిపెట్టకొవ్వు సమాన భాగములు రోటవేసిదంచి కోడిగ్రుడ్డంత రెండువేళల పెట్టుము.

ఉప్పిచెక్క, పసుపు, ఉలవపిండి కలిపిపెట్టిన తగ్గును.

తాటిబెల్లము, జిల్లేడుపట్ట కలిపి దంచిపెట్టిన తగ్గును.

పందినెత్తురు అప్పుడప్పుడు రుద్దుచుండుము.

తాటిబెల్లము, పిప్పలిమోడి మిరియాలు, చిత్రమూలము కొర్రలు కలిపి దంచి ఉండలుచేసి పెట్టవలెను.

గలిజేరువేళ్ళు, తాటిబెల్లము, పావురము రోటనువేసిత్రొక్కి కోడిగ్రుడ్డంత పెట్టవలెను.

మేకవెన్నను గురివిందాకుపసరుతో కలిపి రొమ్మునకు మర్దన చేయుము.

గేదెపేడ, పసుపు, బ్రహ్మజెముడుపాలతో కలిపి రొమ్మునకు పట్టించవలెను.

అర్రుపట్టు

పశువుముక్కు కొననుండి తోకచివరవరకు త్రాడుతో కొలిచి ఆ త్రాడును చెరిసగము చేసి ఆ సగముతో దాని ముక్కుకొననుండి కొలువగా నది ముగిసెడిచోటునకు వాతవేసిన తగ్గును.

దొండాకుపసరు వెన్నతో కలిపి అర్రుభాగమునకు మర్దనచేసి తవుడు వేయించి కాపులు కాయాలి.

పందిచమురు అప్పుడప్పుడు రుద్దుచుండాలి.

ఆముదముతో దుష్టపాకుపసరు కలిపి రుద్దాలి.

చేకొణితాకు రసముతో ఆముదము కలిపి వెన్నుభాగమునకు రుద్దవలెను.

ఆరంభములో వెన్నుభాగమును వెన్నతో రుద్ది చిన్న ఉల్లిపాయలు, జిల్లేడాకులు పొట్లములు కట్టి ఆముదములో ముంచి కాకవేసి వెన్నుభాగమునకు కాపులు పెట్టాలి.

ఒక చెట్టునకుగట్టి మెడనులాగి కాలితో వెన్ను రుద్దుచు. ఆముదము పూయుము.

చెవిరోగములు

నిమ్మకాయరసము 2 తు, గవ్వసున్నము అర తులము కలిపి చెవిలో పోయుము.

ఉత్తరేణి సమూలపు భస్మము కాల్చినపొడి 2 తులములు నూనె 4 తులములు కలిపి పోయుము.

కుప్పింటాకు పసరు పదిచుక్కలు పిండుము.

ముసాంబరము అరతులము పసుపు అరతులము కలిపి చెవిలో అప్పుడప్పుడు వేయుచుండుము.

వావింటాకు ఉప్పుతో దంచి రసముతీసి చెవిలో పోయుము.

గవ్వను కాల్చి భస్మము చేసి నిమ్మరసముతో కలిపివేసిన తగ్గును.

ఆముదములో నీరుల్లిపాయలరసం కలిపివేసిన తగ్గును.

కుక్క వావింటాకు పసరు నూనెలో కలిపి పోసిన చెవిలో చీము, కురుపులు, పోటు తగ్గును.

గంజాయి ఆకురసము చెవిలో పోయము.

పండు జిల్లేడాకురసము పోసిన చెవిలో నొప్పి, చీము తగ్గును.

కాకిదొండాకు పసరు చెవిలో పిండుము.

రసకర్పూరమును మంచినూనెలో కలిపి పోయుము.

తెల్లబాడితాకురసము చెవిలో పిండుము.

రుద్రజడాకు పిండి రసముతీసి గోరువెచ్చగా నున్నపుడు చెవిలో వేయుము.

నీరుల్లిపాయరసములో కోడిగ్రుడ్డు తెల్లసొన కలిపి చెవిలోపోయాలి.

ఉండె తొలుగుట

ఆముదపుపప్పు సోలెడు, రాతిసున్నము 16 తులములు తెచ్చి మెత్తగా నూరి ఉండెను సరిగా లాగి పట్టువేసి నాలుగు దినములుంచిన తగ్గును.

వాపున్న ఎడల తుంటెపాకు త్రొక్కి ఆ భాగమునకు కట్టుము.

ఉండెనులాగి జారిన భాగముచుట్టు రక్షలు పెట్టుము.

శొంఠి 4 తులములు పిప్పళ్లు 1 తులము మిరియాలు 1 తులము ఉమ్మెత్తాకు పసరు అర్థసేరు తేనె 4 తులములు కలిపి మర్దించుము.

కుందేటి నెత్తురు ఉమ్మెత్తాకు పసరు, తేనె కలిపి మర్దన చేయుము.

కాలిన బొబ్బలు

గాడిద గడపాకురసము రాసి పిడకబూడిద చల్లుము.

నవనీతము ఆరగా ఆరగా రాయుచుండుము.

తిప్పతీగెరసము పూయుము.

గానుగ వేరు గంధమును చల్లతో కలిపి రాయుము.

వేపవేళ్ళ రసము పూయుము.

కొబ్బరినూనెలో సున్నపునీరుపోసి తరచిన వెన్నవలెనగును. దీనిని ఆరగా ఆరగా పూయుచుండుము.

త్రిఫలచూర్ణము సమానభాగములు తీసికొని నూనె కలిపి రాయము.

పాతసున్నమును పెరుగుమీద తేటకలిపి రాయుము.

గోరింతచెక్క కషాయము రాయుము.

నీలిమందును నీటిలో కలిపి రాయుము.

పురుగులు పడిన పుండ్లు

బోరిజపాకురసము గుప్పెడు, ఉప్పు 2 తులములు మిరియాలు 1 తులము తెచ్చి గుమ్మపాలతో నూరి పురుగులు పడిన పుండ్లకు పట్టించుము.

మిరియాలు 1 తులము సైంధవలవణము 1 తులము గాడిదగడపాకుతోనూరి పుండ్లకు పట్టించుము.

ఆముదములో క్రొత్త రాతిసున్నము నూరి పుండ్లకు పట్టించుము.

పొగాకు, కరిధూపము, పొట్లాకునూగు, రాతిసున్నము, ఆనపాకు సమాన భాగములుగా నూరి గాయములకు పట్టించుము.

సీతాఫల ఆకు గుప్పెడు, రాతిసున్నము 1 తు, చేర్చి నూరి పుండ్లకు పట్టించుము.

కుందేటినెత్తురు 6 తులములు, ఉమ్మెత్తాకు పసరు అర్ధశేరు తేనె 4 తులములు చేర్చి మర్దించుము.

కరిధూపము సున్నము చేర్చి వేయుము.

హారతికర్పూరము కరిధూపము చేర్చి పెట్టుము.

వస, కరిధూపము సున్నము నూరి వేయవలెను.

గాడిదగడపాకు పసరు, రాతిసున్నము, కరిధూపము చేర్చి కట్లు కట్టుము.

పొట్లాకు కరిధూపము సున్నము కలిపి వేయుడు.

జెముడుపాలు ఆముదము పసుపు కలిపికట్టుము.

సొరాకు, రాతిసున్నము, కరిధూపము, వెన్న కలిపికట్టుము.

కుక్క పొగాకు, వస, కరిధూపము కలిపి కట్టుము.

చేపుటకు

అడ్డసరపాకు 2 గుప్పెళ్ళు ఉప్పు చారెడు జీలకర్ర 1 తులము సుగంధపాలు 4 తులములు నూరి అడ్డెడు మజ్జిగలో కలిపి త్రాగించుము.

చేకొణితాకు 2 గుప్పెళ్ళు తెల్లఆవాలు 1 తులము ఉప్పుచారెడు పులిచల్ల అర్ధశేరు కలిపి త్రాగించుము.

బంధము వేయనీయక పొడుచుచూ దూడను దగ్గరకు చేరనీయక గంతులు వేయుచుండు పశువు పొదుగునకు పుల్లతీగె రసము రాసిన చేపువచ్చి పాలను పిండుకొనవచ్చును.

పాలు ఇవ్వక తిప్పలు పెట్టు పశువునకు నెయ్యి పావుశేరు గోధుమగంజి అర్ధశేరు గంజిశేరు కలిపి 4 దినములు పెట్టుము.

నేగుర్తాకు 3 తులములు పచ్చి పసుపు ఒకటిన్నర తులము మిరియాలు 4 తులములు ఆవు పంచితము పావుసేరు కలిపి ముక్కులలోనికి నస్యము చేయుము.

కనెరకోమలి తీగరసము పావుశేరు తెలికపిండి సవాశేరుకలిపి శరీరమునకు రాయుము.

పటికబెల్లం 6 తులములు ఆవాలు 1 తులము నేలతాడి 2 తులములు ఆవునెయ్యి శేరు కలిపి త్రాగించుము.

తెల్లవారుజామున పశువుకరిలో చెయిపెట్టి ఆ చేతిని దూడ శరీరమునకు పూసి పశువుచే నాకించిన పాలు ఇచ్చును.

పుల్లతీగెను తొక్కి లోపలికి పెట్టుము. దీనినే చేపాకు అందురు.

దురదగొండి ఆకును కొద్దిగా తీసికొని వెన్నుభాగములకు రాయుము.

మలిమిడి

ఆముదములో చిత్రమూలపు పొడి కలిపి కట్టినతగ్గును.

శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు, చిత్రమూలము కలిపి నూరి ఆముదముతో వండి గోరువెచ్చనిది కట్టవలెను.

దుష్టపు వేళ్ళు మిరియాలు నూరి రసముతీసి ముక్కులలో పిండుము.

చిర్రికూర దుష్టపు వేళ్ళునూరి నీటితో వండి కట్టలెను. ఇది కట్టిన నొప్పి తగ్గును.

గొలిమిడి ఆకు, మిరియాలు మెత్తగానూరి నీరుడుతో వండి కట్టిన తగ్గును.

ఆముదములో వామింటాకు త్రొక్కి పాకము చేసికట్టివలెను.

చిత్రమూలము, గల్జేరు, త్రికటములు నూరి కట్టవలెను.

నేలవేము మిరియాలు నూరి ఆముదముతో కలిపి కట్టుము.

తిప్పతీగె ఆకులు ఆవు నెయ్యి, చిత్రమూలము, ఆవాలు ఆముదము మెత్తగానూరి కట్టిన బాగుగా పనిచేయును.

తులసి, దుష్టపాకు, కరిధూపము, మిరియాలు, ఆముదము కలిపికట్టిన తగ్గును.

గుంటకలగర, చిత్రమూలము, అముదము కలిపికట్టిన తగ్గును.

బర్రెపేడ చెంచలి ఆకు వండి కట్టిన తగ్గును.

వేయియిగుళ్ళు చిత్రమూలము వెంపలి ఆకు చిర్రికూర చేపపెంట పాకము చేసికట్టుము.

తుత్తురాకు కరిధూపము కలిపి కట్టుము.

నేలవేము, కరిధూపము, చిర్రికూర ఆముదముతో వండి కలిపి కట్టుము.

ఉంగిడి

పులుకలిలో దుష్టపువేళ్లనూరి సారముతీసి ముక్కు రంధ్రములలో పోసి కన్నులకు ఇంగువ పెట్టిన తగ్గును.

నల్లేరు చిగుళ్లు దవడలలో పెట్టి కొరికించవలెను.

పులికలిలో ఉప్పు నల్లేరు కలిపి త్రొక్కి పెట్టవలెను.

కొమ్ములకు నూనెవత్తులు చుట్టి కాల్చి జాముసేపుంచిన తగ్గును.

కుంకుడుకాయ గంధము కనులకు పెట్టవలెను.

నిమ్మపండ్లరసము కలిపి మూడుగొట్టములు పెట్టవలెను.

చిర్రి చెట్టుదంచి రసముతీసి పులుకలితో మూడుగొట్టములు త్రాగించాలి.

గోగువరుగు గాని, దోసకాయలు గాని పెట్టిన తగ్గును.

చింతపండుపులుసు మూడుగొట్టములు పెట్టిన తగ్గును.

దీపపుకొడిచే జిల్లేడు పత్రి పొట్లములుగా కట్టి చమురుని కాచి మాడున పెట్టిన తగ్గును.

తేనె సుమారు అరసోలెడు పోసిన ఉంగిడి తగ్గును.

కృష్ణతామర దుంపను ముక్కలుగగొట్టి కలిచే నూరి మిరియాల పొడివేసి కలిపి కాచి త్రాగించిన ఉంగిడి తగ్గును.

కుంకుడు కాయల రసము త్రాగించుము.

మూవి పడుటకు

తవ్వెడు నువ్వులు త్రొక్కి సేరునీటిలో కలిపి పెట్టుము.

పులిచల్లలో కందదుంపనూరి కలిపి పెట్టుము.

ఆముదము సవాసేరు త్రాగించుము.

సెనగలు నానబెట్టి పెట్టుము.

మూవి తినినచో

అనుములు పావుశేరు, పచ్చిపుచ్చాకు పసరు అర్ధశేరు, మజ్జిగ శేరు కలిపి త్రాగించాలి.

వామురసము అర్ధశేరు, ఉప్పు చారెడు, ఆముదపు పప్పు గిద్దెడు శేరు బియ్యపునీటిలో కలిపి త్రాగించవలెను.

చూలు నిల్చుటకు

కరివేపాకు గుప్పెడు వరిబియ్యము గుప్పెడు కొర్రలు 2 గుప్పెళ్ళు కలిపి నూరి 15 దినములు పెట్టుము.

వెలిగారము 4 తులములు మజ్జిగ శేరు కలిపి 2 దినములు త్రాగించుము.

దుష్టపువేళ్ళు అరగుప్పెడు ఆవునెయ్యి అర్ధశేరు కలిపి 15 దినములు పెట్టుము.

లవంగాలు ½తు నిమ్మకాయంత వెన్న చేర్చి 15 దినములు పెట్టుము.

పచ్చివంకాయ, కస్తూరి పసుపు నూరి వుండలు చేసి మూడుదినములు తినుపించుము.

కాచిన మజ్జిగ ప్రతిదినము త్రాగించిన చూలుకట్టును.

తోకనుసిమిరి

ఉప్పు 2 తులములు ఆవాలు అరతులము అల్లము 1 తులము కలబంద పసరు పావుశేరు పులుకలి శేరు చేర్చి మూడుదినములు పెట్టుము.

పిచ్చికుసుమాకు పసరు 10 తులములు నీలిమందు 1 తులము చేర్చి నుసిమిరికి అప్పుడప్పుడు రాయుచుండుము.

గేదెపేడ రసము పావుశేరు బ్రహ్మజెముడు పాలు అరతులము ఆముదము 3 తులములు చేర్చి రాయుము.

తోకగురుజు

తోకచివర నరికి నెయ్యి కాచి వేడిగానున్నపుడు ముంచవలెను.

కుసుమఆకు నూరి తోకచివర రాసిన వెంట్రుకలు వచ్చును.

అల్లము, ఉప్పు పులిచల్లలో చేర్చి రాయుము.

అల్లము కలబందగుజ్జు ఆవపిండి మెత్తగానూరి పులిచల్లలో మరగనిచ్చి దినమునకు మూడుగొట్టములు పెట్టవలెను.

మోకాళ్లు కాళ్ల వాపులు – నొప్పులు

కలబందమట్టను రెండు తునకలుగా విడిపోకుండా ఉండునట్లు చేసి ఆ చెక్కలనడుమ నల్లజీలకర్ర మెత్తగానూరి పెట్టి మూసి గాలిలో ఆ రాత్రియుంచి మరునాడు తినుపించుము.

గచ్చాకు, మిరపకాయ పొడుము సమభాగములు కలిపి నీటిలో వుడికించి వెలగకాయంత ముద్దజేసి మూడుదినములు పెట్టుము.

గానుగ వేరురసము మర్దన చేయుము.

నూనెలో నల్లమందు వేసి కాచి ఆ వేడినూనెలో నిమ్మకాయబద్ద ముంచి దానిచే కాపుతీసిన తగ్గుతుంది.

బాలింత పాలు నిమ్మరసములో కలిపి పట్టువేయాలి.

దృష్టిదోషము

పశువునకు దృష్టిదోషము తగిలిన వెంటనే జొన్నలు వేపాకు ప్రత్తిగింజలు ఉప్పు తెచ్చి పశువులకు దిగతుడిచి నిప్పులో పోయుము.

దృష్టిదోషము పోవుటకు త్రాళ్ళు వేయుటకూడ మంచిది.

చర్మరోగములు

తుమ్మచెక్క పొడి 10 తు, వేపచెక్క పొడి 10 తు, కర్పూరము తు, కలిపి పుండ్లకు, గాయములకు పట్టించాలి.

కుప్పింటాకు రసము 5 తు, సున్నము 1 తు నిమ్మరసము ఒకటిన్నర తు, కలిపి నుసిమిరి, తామర, గజ్జకి రుద్దాలి.

పటికపొడి 1 తు, కవిరి ఒకటిన్నర తు, కొవ్వుగాని వ్యాసులైనుగాని కలిపి వ్రణములకు, పుండ్లకు రాయాలి.

ఇంగువ 1 భాగము స్పిరిటు ఒకటిన్నర భాగము వ్యాసులైను 6 భాగములు కలిపి చర్మముపై కలుగు పుండ్లకు అప్పుడప్పుడు రాయాలి.

గంధకము ఒకటిన్నర తు బోరికు ఆసిడ్ 1 తు, వ్యాసులైను 4 తు, మైలతుత్తము ఒకటిన్నర తు, కార్బాలిక్ ఆసిడ్ 10 చుక్కలు కలిపి నుసిమిరి మొదలగు మొండి చర్మవ్యాధులకు ఉపయోగించాలి.

కర్పూరము వెలిగారము జింకు ఆక్సైడు కలిపి పుండ్లకు అద్దాలి.

కాల్చిన మసిబొగ్గు 4 తు, కర్పూరము ఒకటిన్నర తు, గంధకము 1 తు బోరికు ఆసిడు 1 తు కలిపి రసికారుపుండ్లకు అద్దుచుండాలి.

కవిరిని తేనెతో కలిపి పుండ్లకు రాయాలి.

పొగాకుపొడి ఒకటిన్నర సీతాఫల ఆకు పొడి 10 తు కర్పూరము ఒకటిన్నర తు, కలిపి దుర్వాసన వేయు పుండ్లకు పట్టించుము.

నీలినందు 1 తు, గంధకము 1 తు, వ్యాసులైను 4 తు, చర్మరోగములకు వాడాలి.

కుంకుమపొడి, గంధకము, బోరాక్సు సమానభాగములు కలిపి చర్మరోగములకు వాడాలి.

కర్పూర తైలము వేపనూనె కలిపి గాయములకు, నుసిమిరికి రాయాలి.

పనుపు రెండున్నర తు పొగాకు రెండున్నర తు, కర్పూరము 1 తు, కలిపి అన్ని పుండ్లకు వాడిన బాగుగా పనిచేస్తుంది.

రావిచెక్క బూడిద సున్నము సమానభాగములు తీసికొని వెన్నతోకలిపి రాసిన దురదలు, మచ్చలు తగ్గుతాయి.

నువ్వులనూనె, కిరోసినాయిల్ కలిపి రాయాలి.

గాడిదగడపాకుపొడి ఆముదముతో కలిపి రాయాలి.

కృష్ణతులసి ఆకురసములో నిమ్మరసము కలిపి రాయాలి.

కుప్పింటాకురసములో సున్నము కలిపి రాయాలి.

అవిసె ఆకుపసరు ఉప్పు కలిపి రాయాలి.

దీర్ఘవాత నొప్పులు

కర్పూర తైలమును కొబ్బరినూనెలో గాని, నువ్వుల నూనెలో గాని కలిపి మర్దనచేయాలి.

నీరుల్లిపాయల రసములో ఆవనూనె కలిపి మర్దన చేయాలి.

వసపొడిని సారాయితో కలిపి రాయాలి.

వెల్లుల్లిరసము ఆముదముతో కలిపి రాయాలి.

సన్నావాల నూనెలో హారతికర్పూరము కలిపి రాయాలి.

వావిలాకు పసరులో తగినంత కర్పూరము కలిపి పట్టించాలి. కొర్నాసిచమురును గాని, అడవిపంది చమురును గాని రుద్దాలి.

చిత్రమూలమును కొబ్బరినూనెలో కలిపి కాచి మర్దనచేయాలి.

నరమామిడి చెక్కను పాలతోనూరి పట్టీ వేయుము.

రశి, నెత్తురు కారునపుడు కడుగునవి

పటిక 2½ తు, నీరు సేరున్నర కలిపి కడగాలి.

అన్నభేది రెండున్నర తు, నీరుశేరు కలిపి కడగాలి.

మైలతుత్తము పావుతులం నీరు కలపాలి.

తుమ్మచెక్క పొడి రెండున్నర తు, నీరు 2 సేర్లు కలపాలి.

కవిరి రెండు తులములు నీరు సేరున్నర కలపాలి.

నవాసాగరము ఒకటిన్నర తు, సూరేకారము ఒకటిన్నర తు, ఉప్పు 1 తు, నీరు రెండు శేర్లు కలిపి చల్లదనమునకు వాడాలి.

ఇంగువ 2 తు, నీరు 2 సేర్లు కలపాలి.

పొటాషియం పర్మాంగనేట్ లోషను వాడాలి.

మాచికాయపొడి 1 తు, నీరు సేరు కలపాలి.

నేరేడు చెక్క పొడి రెండున్నర తు, నీరు సేరున్నర కలపాలి.

కరక్కాయపొడి 1 తు, నీరు సేరున్నర కలపాలి.

వేపచెక్క పొడి రెండున్నర తు, నీరు సేరున్నర కలపాలి.

ఫినాయిల్ లోషన్‌ను వాడాలి.

* * *